Hadees Hithoktulu (Hadeeth Pearals- Telugu)

# హదీస్ హితోక్తులు

అనువాదం
అబుల్ ఇర్ఫాన్

ఇస్లామిక్ రిసోర్స్ సెంటర్, సహారా కాంప్లెక్స్,
ఫ్లాట్ నెం,106, పత్తర్‌గట్టి, హైదరాబాద్-2
✆ 040-66710795, 91-9441515414

వెల..........................................................రూ. 240/-లు




| | |
|---|---|
| Name of the Title : | Hadees Hithoktulu (Telugu) (Hadeeth Pearals) |
| Compilation : | **ABUL IRFAN** Hyderabad-2 |
| All Rights Reserved with : | Islamic Resource Centre |
| First Edition : | February, 2008 |
| Copies : | 1000 |
| Published by: | Islamic Resource Centre Sahara Complex-106, Pathargatti, Hyderabad-2, Ph: 9441515414 |
| Type set by: | Alifain, I.R.C. Graphics Sahara Complex-106, Pathargatti, Hyderabad-2, Ph: 9441515414 |
| Printed at : | H.S. Offset Printers 714, Chandni Mahal, Daryaganj New Delhi-2, Ph: 23244240 |
| Price : | Rs. 240/- |

**IRC ప్రచురణల ప్రత్యేకత**

1) తేట తెలుగులో భావ స్పష్టీకరణ
2) సులభ శైలిలో సాహిత్య మాధుర్యం
3) సంక్షిప్త వాక్యాల్లో సమగ్ర సమాచారం
4) 12 గ్రంథాల్లోనే ఇస్లాం పూర్తిస్వరూపం

కరుణామయుడు, కృపాసాగరుడయిన అల్లాహ్ పేరుతో ప్రారంభం



## దారితప్పించని మణిద్వయం

"విశ్వాసులారా! దేవునిపట్ల, ఆయన ప్రవక్త పట్ల విధేయత కలిగిఉండండి. మీలో వ్యవహారకర్తలైన అధికారుల పట్ల కూడా. అయితే ఏదైనా వ్యవహారంలో మీ మధ్య వివాదం తలెత్తితే దాన్ని తిరిగి దేవుని (ఖుర్‌ఆన్) వైపునకు, ఆయనప్రవక్త (హదీస్) వైపునకు మరల్చండి. మీరు నిజంగా దేవుణ్ణి, అంతిమదినాన్ని విశ్వసిస్తున్నట్లయితే ఇదే మీకోసం సరయిన పద్ధతి. పర్యవసానం రీత్యా కూడా ఇదే శ్రేష్ఠమైన విధానం." (ఖుర్‌ఆన్-4:59)



# విషయసూచిక


| నెం. | విషయం | పేజి |
|---|---|---|
| I. | ధర్మానికి పునాదులు విశ్వాసాలే | 18 |
| 1. | విశ్వాసాలే ఆచరణకు ఆధారాలు | 18 |
| ✦ | కీడు, మేలు అంతా దైవాధీనమే | 20 |
| ✦ | కాపట్యంలేని విశ్వాసమే పనికొస్తుంది | 21 |
| 2. | దైవదౌత్యం (రిసాలత్) వివరాలు | 23 |
| 3. | శ్రేష్ఠమైన పుణ్యకార్యాలు | 27 |
| 4. | ఘోరమైన పాపాకార్యాలు | 29 |
| ✦ | అంధానుకరణ | 30 |
| ✦ | మతగురువుల ఆరాధన | 30 |
| ✦ | సమాధులు-స్మారకచిహ్నాలు | 31 |
| ✦ | బొమ్మలు, ఫోటోలు | 33 |
| ✦ | పెద్ద పాపాలు | 34 |
| ✦ | పాపాల వల్ల విశ్వాసం క్షీణిస్తుందా? | 36 |
| ✦ | చిన్నపాపాలు, చిరుపుణ్యాలు | 37 |
| 5. | పశ్చాత్తాపం, క్షమాభిక్ష | 40 |
| 6. | సంకల్పం, దాని క్రియాత్మక రూపం | 45 |
| ✦ | చిత్తశుద్ధితో చేసిన సత్కర్మలే వారిని కాపాడాయి | 46 |
| ✦ | అజ్ఞానంకాలంలో ఆచరించిన కర్మల పర్యవసానం | 48 |
| 7. | జ్ఞానార్జన ఆవశ్యకత | 48 |
| ✦ | విద్యలేనివాడు వింతపశువు | 49 |
| ✦ | పుస్తకాలు మోసే గాడిద | 52 |
| 8. | ఖుర్‌ఆన్ ఔన్నత్యం | 54 |
| ✦ | పాఠ్యగ్రంథం | 57 |
| ✦ | మీరు నారింజపండా, ఖర్జూరపండా? | 58 |
| ✦ | హద్దులను అతిక్రమించకండి | 59 |
| ✦ | ఖుర్‌ఆన్ పారాయణ మహత్తు | 60 |
| ✦ | కొన్ని ప్రత్యేక సూరాల ఘనత | 61 |
| ✦ | నిజం పలికిన షైతాన్ | 63 |
| ✦ | హృదయానికి పట్టే తుప్పు పోవాలంటే... | 64 |
| ✦ | ముస్లిం ఉత్థాన-పతనాలు | 65 |
| 9. | విశ్వాస పరీక్ష | 66 |

**10.** ప్రపంచంలో విశ్వాసి స్థానం 68
- ✦ శ్రేష్ఠుడైన విశ్వాసి 70
- ✦ కోర్కెల గుర్రానికి కళ్ళెం వేయండి 71

**11.** విధివ్రాత (అదృష్టం) 73
- ✦ జ్యోతిష్యం, జాతకం, అస్పృశ్యత, శకునాలు 76
- ✦ మొక్కుబడులు 77
- ✦ అంటువ్యాధి ప్రబలినపుడు 78

**12.** మధ్యేమార్గమే మనకు మంచిది 79

**II. ఆరాధనల రూపురేఖలు** 84

**13.** నమాజ్ ప్రాముఖ్యం 84
- ✦ విశ్వాసానికి గీటురాయి 86
- ✦ మన ప్రార్థనే మన పాపవినాశిని 87
- ✦ చెడుల నుండి నిరోధించని నమాజ్? 88
- ✦ సామూహిక నమాజ్ ప్రాముఖ్యం 89
- ✦ కపట విశ్వాసుల నమాజ్ 91

**14.** శుచి శుభ్రతలు 92
- ✦ ఉజూ 92
- ✦ ఉజూ భంగమయ్యే విషయాలు 94
- ✦ తయమ్ముమ్ 95
- ✦ మలమూత్ర విసర్జన జాగ్రత్తలు 96
- ✦ గుసుల్ (స్నానం) 97

**15.** స్త్రీల పరిశుభ్రత 99
- ✦ నిరంతరాయ రక్తస్రావం అయితే? 99
- ✦ రుతుమతి ఆంక్షలు 100

**16.** అజాన్, నమాజ్ వేళలు, రకాతులు 101
- ✦ అజాన్ (నమాజ్ పిలుపు) 102
- ✦ నమాజ్ వేళలు 105
- ✦ విభేదాలు పక్కన బెట్టండి 106
- ✦ నమాజ్ నిషిద్ధ వేళలు 108
- ✦ అయిదువేళల నమాజుల్లోని రకాతులు 109

**17.** నమాజ్‌కు ముందు జాగ్రత్తలు 111
- ✦ వస్త్రధారణ 111
- ✦ ఖిబ్లా (ఆరాధనా దిశ) 113



- ✦ పంక్తులు ఎలా ఉండాలి? 113
- ✦ ప్రజలకు భారం అన్పించని నమాజ్ 115
- ✦ నమాజ్ స్థితిలో ఇతర విషయాలు 116
- ✦ ఇమాం ఎలా చేస్తే అలా చేయాలి 117
- ✦ సుత్రా (నమాజీ ముందునుంచి నడవరాదు) 118

**18.** ఆరాధనాలయాల ఆవశ్యకత 119

**19.** నమాజ్ విధానం 121
- ✦ చేతులు చెవులదాకా, భుజాలదాకా? 123
- ✦ చేతులు రొమ్ముపైనా, నాభిపైనా? 124
- ✦ రఫెయదైన్ ఎన్ని సార్లు చేయాలి? 126
- ✦ స్త్రీలు చేసే నమాజ్ పద్ధతి 128
- ✦ తషహ్హుద్, దరూద్ 130
- ✦ ఒక్క చూపులో పూర్తి విధానం 132
- ✦ వితర్, దుఆయె ఖునూత్ 133
- ✦ నిదానమే ప్రధానం 135
- ✦ నమాజ్‌లో ఫరజ్‌లు, సున్నత్‌లు 136

**20.** సహూ సజ్దా, తిలావత్ సజ్దా 138

**21.** ఖజా, ఖసర్ నమాజులు 143

**22.** సామూహిక నమాజ్ విధానం 146
- ✦ సామూహిక నమాజ్ నుండి మినహాయింపులు 147
- ✦ ఇమామత్ అర్హతలు 148
- ✦ సామూహిక నమాజ్-మహిళా సమస్యలు 149
- ✦ ఇమామ్ బాధ్యతలు 151
- ✦ ముఖ్తదీల బాధ్యతలు 152
- ✦ ఇమాం వెనుక ఫాతిహా సూరా పఠనం 154
- ✦ ఆమీన్ పలకాలి బిగ్గరగానా, నిశ్శబ్దంగానా? 156
- ✦ జుమా ప్రాముఖ్యం 157
- ✦ జుమా ప్రసంగం 161
- ✦ జుమా నమాజ్ 163
- ✦ ఈద్ నమాజ్ 164
- ✦ ఈద్ ప్రసంగం 166
- ✦ ఖౌఫ్, కుసూఫ్, ఇస్తిస్ఖా నమాజులు 167
- ✦ జనాజా నమాజ్ 170

**23.** సున్నత్, నఫిల్ నమాజులు 172
✦ ఫజర్ వేళ సున్నత్ నమాజ్ 172
✦ తహజ్జుద్ నమాజ్ 173
✦ చాష్త్, ఇష్రాఖ్, అవ్వాబీన్ నమాజ్ 175
✦ సలాతుత్తస్బీహ్ 176
**24.** జికిర్ (ధ్యానం), దుఆ (వేడుకోలు) 177
✦ జికిర్ (ధ్యానం) 178
✦ దుఆ (వేడుకోలు) 180
**25.** జకాత్ ప్రాముఖ్యం 187
✦ జకాత్ చెల్లించనివారి పర్యవసానం 188
✦ ఆర్థిక నేరస్థులు 189
**26.** జకాత్ విధింపుకు షరతులు 190
**27.** జకాత్ స్వీకార అర్హులు, అనర్హులు 192
**28.** భూఉత్పత్తులపై జకాత్ 195
**29.** ఉపవాసవ్రతాల ప్రాముఖ్యం 197
✦ పరలోకంలో ఉపవాస పుణ్యఫలం 200
✦ ఉపవాసవ్రత సన్నాహాలు 202
**30.** ఆరు విధాల ఉపవాసాలు 202
**31.** రోజా నుండి మినహాయించబడినవారు 208
**32.** 'సహ్రీ'తో రోజా ఆరంభం 212
**33.** ఉపవాసంలో ఆంక్షలు, రాయితీలు 214
**34.** ఇఫ్తార్ (ఉపవాస విరమణ) 217
✦ పరిహారం, ప్రాయశ్చిత్తం 219
**35.** తరావీ నమాజ్, ఏతికాఫ్ 220
**36.** లైలతుల్ ఖదర్ (మహాశుభరాత్రి) 223
**37.** పేదల హక్కు ఫిత్రా దానం 225
**38.** హజ్, ఉమ్రాల ప్రాముఖ్యం 227
**39.** ఇహ్రాం నిషేధితాలు, తల్బియా పఠనం 230
**40.** కాబాలయం, దాని ప్రత్యేక విభాగాలు 232
✦ హజ్రె అస్వద్ (నల్లరాయి) 234
✦ ముల్తజం, రుకునె యమాని 235
✦ హతీం (ఖాళీగా వదలిన కాబా స్థలం) 236
✦ మఖామె ఇబ్రాహీం 236





**41.** హజ్ చేసే విధానం 237
✦ ఖుర్బానీ (బలిదానం) 239
**42.** కప్ఫారా (పాపపరిహారం) 241
✦ హజ్ సీజన్‌లో జీవనోపాధి 242
✦ బదులు హజ్ 243
**43.** హాజీ ఎలా ఉండాలి? 244
**III. ఆర్థిక వ్యవస్థ** 245
**44.** ధన వ్యామోహం 245
✦ పేరాశ, పిసినారితనం 247
✦ యాజమాన్య హక్కులు 250
✦ కలిమిలేముల పరీక్ష 252
✦ పరలోకంలో పేదలు, ధనికుల పరిస్థితి 254
**45.** దానం, ధనత్యాగం 255
✦ క్రింది చేయికంటే పైచేయి శ్రేష్ఠమైనది 256
✦ ధనత్యాగం 258
**46.** ఆర్థిక ఒనరుల వినియోగం 260
✦ దుబారా ఖర్చులు 261
✦ పొదుపు ద్వారా సత్కార్యాలు 262
**47.** అక్రమ సంపాదనా మార్గాలు 263
✦ అన్యాయం, దౌర్జన్యం 263
✦ దోపిడీ దొంగతనాలు 265
✦ మద్యం, మత్తుపదార్థాలు 266
✦ జూదం, మట్కా, లాటరీలు 268
✦ కానుకల రూపంలో లంచం 269
✦ మరికొన్ని అధర్మ సంపాదనలు 270
**48.** వడ్డీ వ్యవస్థ 273
**49.** రుణానుబంధం 275
✦ రుణగ్రస్తుని పట్ల మృదువైఖరి 277
✦ అప్పు తీర్చనివాడి పర్యవసానం 278
✦ వాణిజ్య రుణాలు 279
**50.** కష్టార్జితం, శ్రమజీవులు 280
✦ కృషితో నాస్తి దుర్భిక్షం 280
✦ శ్రామికుని పట్ల యజమాని ప్రవర్తన 281

**51.** వ్యాపార లావాదేవీలు 282
- ✦ సరకుల కల్తీ, నాణ్యతలు 284
- ✦ బ్లాక్‌మార్కెట్ 285
- ✦ తూనికలు, కొలతలు 286
- ✦ తప్పుడు వ్యాపార పద్ధతులు 286
- ✦ దళారీ వ్యవస్థ 287
- ✦ వస్తుమార్పిడీ విధానం 288
- ✦ వ్యాపార ఒప్పందాలు 289
- ✦ పండ్లు, పంటల వ్యాపారం 290
- ✦ సేద్య భూములు కౌలుకు ఇవ్వడం 291
- ✦ ఇస్లామిక్ మార్కెట్ 292

**52.** వారసత్వపు ఆస్తి పంపకం 294
- ✦ వీలునామా (మరణశాసనం) 295
- ✦ ఆస్తి పంపకం 297
- ✦ దత్త స్వీకారం నిషిద్ధం 300

**53.** సమరసొత్తు (అన్ఫాల్, ఫై) 301

**54.** మహర్ (స్త్రీ ఆస్తిహక్కు) 303

**IV. సామాజిక వ్యవస్థ** 304

**55.** బంధుప్రేమ 305

**56.** తల్లిదండ్రుల హక్కులు 308
- ✦ తండ్రి కంటే తల్లి స్థానమే ఉన్నతమైనది 310
- ✦ తల్లి పాదాల క్రిందే తనయుల స్వర్గం 311

**57.** సంతాన శిక్షణ 312
- ✦ బిడ్డజన్మ తరువాత తీసుకునే జాగ్రత్తలు 313
- ✦ స్త్రీసంతానం-తల్లిదండ్రుల బాధ్యతలు 314
- ✦ నరకానికి అడ్డుగోడలు ఆడపిల్లలే 316
- ✦ పాలుతాగే పసివాడి పసిడి పలుకులు 318

**58.** వివాహ బంధం 320
- ✦ వివాహనిషిద్ధ స్త్రీలు 321
- ✦ స్తన్యసంబంధాన్ని గుర్తుంచుకోవాలి 322
- ✦ ముస్లిమేతర స్త్రీలతో వివాహం ధర్మసమ్మతమేనా? 323
- ✦ పెళ్ళిచూపులు, వధూవరుల ఎంపిక 326
- ✦ నాలుగు ప్రాతిపదికలపై స్త్రీ వివాహం 327





- ✦ నికాహ్ (పెళ్ళి) పద్ధతి 328
- ✦ పెళ్ళి ప్రసంగం 329
- ✦ వలిమా విందు 329
- ✦ మహర్‌కంటే కట్నకానుకలే ముఖ్యమా? 331

**59.** బహుభార్యత్వం 333

**60.** దాంపత్య జీవితం 334
- ✦ వివాహ లక్ష్యాలు 335
- ✦ లైంగిక భావోద్రేకాల వినియోగం 337

**61.** భర్త బాధ్యతలు 339

**62.** భార్య బాధ్యతలు 343

**63.** పరదా వ్యవస్థ 347
- ✦ దుష్టవీక్షణలు-షైతాన్ విషబాణాలు 349
- ✦ భార్య సతర్ భర్తకే పరిమితం 350
- ✦ మహిళలకు మేలుచేసే మేలిముసుగు 352

**64.** పరదా నుండి మినహాయింపులు 353
- ✦ సతర్ (కనీస ఆచ్ఛాదన) పరిమితులు 354
- ✦ దగ్గరి బంధువుల ముందు పరదా పరిమితులు 355

**65.** వస్త్రధారణ, అలంకరణలు 355

**66.** తలాఖ్ (విడాకులు) 357
- ✦ ఈలా (ఒట్టు, పాపపరిహారం) 358
- ✦ జిహార్ (తల్లికాని తల్లి) 359
- ✦ ఒకేసారి మూడు తలాఖులు శాస్త్రవ్యతిరేకం 360
- ✦ రుతుకాలంలో విడాకులివ్వరాదు 361
- ✦ తలాఖ్-విభిన్న విధానాలు 363
- ✦ తలాఖ్ ఇవ్వడానికి నాలుగు పద్ధతులు 365

**67.** ఖులా (స్త్రీలిచ్చే విడాకులు) 366
- ✦ భార్య విడాకుల్ని భర్త ఆమోదించాలా? 367
- ✦ వేధించే భర్త నుండి విముక్తి మార్గమే ఖులా 368
- ✦ అపనిందలు, ఆరోపణలను గురించి ప్రవక్త తీర్పులు 369

**68.** జీవన భృతి, మనోవర్తి 375

**69.** సాధారణ మానవ సంబంధాలు 377
- ✦ హజ్జతుల్ విదా (వీడ్కోలు హజ్) ప్రసంగం 379
- ✦ వృద్ధులు, మహనీయులు, స్నేహితులు 381

✦ పేదలు, అనాథలు 383
✦ పొరుగువారి హక్కులు 384
**70.** సమైక్యతా సోదరభావాలు 385
✦ ముస్లింల పరస్పర సంబంధాలు 386
✦ అంతర్గత కలహాలు అంతం చేయండి 387
✦ అన్నదమ్ముల మధ్య ఈ ఎడబాటేమిటీ? 388
✦ మీరు సైద్ధాంతిక సమాజం సభ్యులా? 390
✦ శిరస్సుకు, శరీరానికున్న సంబంధం 391
**V. రాజకీయ వ్యవస్థ** 392
**71.** సంఘ వ్యవస్థీకరణ 392
✦ నాయకానుచరుల సంబంధాలు 394
✦ అనుచరుల పట్ల దైవప్రవక్త (స) ప్రవర్తన 396
**72.** ధర్మప్రచారం, సమాజ సంస్కరణ 398
✦ బంధువుల్లో ధర్మప్రచారం 400
✦ సమాజ సంస్కరణ 401
**73.** జిహాద్ (పోరాటం) 403
✦ దైవమార్గంలో ఎదురైన కష్టాలు 408
✦ పోరాటం అంటే సంఘర్షణ 409
**74.** జిజ్యా (రక్షణ రుసుం) 409
**75.** ముస్లిమేతరులతో శాంతి ఒప్పందం 411
**76.** ఇస్లామీయ పాలనా విధానం 414
✦ దైవప్రాతినిధ్య విధానం 414
✦ తొలిఖలీఫాతో ప్రవక్త వారసుల విభేదం 416
✦ ప్రభుత్వ సలహామండలి 418
✦ అవినీతికి ఆమడ దూరంలో 419
✦ అత్యంత బాధ్యతాభావం, నిరాడంబరతలు 421
✦ పాలకుల పట్ల ప్రజల వైఖరి 424
**77.** ఇస్లాంలో న్యాయవ్యవస్థ 425
✦ సాక్ష్యం 429
✦ విచిత్రమైన తీర్పులు 431
**78.** ఇస్లామీయ శిక్షాస్మృతి 432
✦ హత్యానేరం, రక్తపరిహారం 433
✦ తిరుగుబాటు, అరాచకాలు 434





✦ మద్య సేవన శిక్ష 435
✦ దొంగతనం, హస్తఖండన శిక్ష 435
✦ వ్యభిచార శిక్షలు 436
✦ మానభంగం శిక్షలు 438
✦ నేరనిరూపణ సాక్ష్యం 439
✦ నేరవిచారణ విధానం 442
✦ శిక్ష అమలుజరిపే పద్ధతులు 444
✦ నష్ట పరిహారం 446
**VI. నైతిక వ్యవస్థ** 447
**71.** సత్యం-అసత్యం 448
✦ వాగ్దానం, ప్రమాణం 449
**80.** దౌర్జన్యం, దురభిమానాలు 450
**81.** సహనం, సాహసం 451
**82.** తన కోపమే తన శత్రువు 454
**83.** దయాదాక్షిణ్యాలు 455
✦ భూతదయ 457
**84.** అనుమానాలు, అపనిందలు 459
✦ చాడీలు, రంధ్రాన్వేషణ 461
**85.** నోటిదురుసు, దుర్భాష 461
✦ రెండు నాల్కల ధోరణి 463
✦ దూషణలు, శాపనార్థాలు 464
**86.** గర్వం, హేళన, చులకన భావం 465
✦ అసూయ, అసంతృప్తి 466
**87.** మద్యం, జూదం 467
**88.** అశ్లీలం, వ్యభిచారం 468
**89.** సభ్యతా సంస్కారాలు 469
✦ వస్త్రధారణ, అలంకరణలు 469
✦ విలాసవస్తువులు వాడకూడదు 471
✦ ఆహార పానీయాలు 472
✦ అనుమతి లేనిదే లోనికి రాకూడదు 475
✦ నామకరణం 476
✦ అస్సలాము అలైకుం 477
✦ మాటల గారడి నరకానికి దారి 478

- ✦ ముఖస్తుతి 478
- ✦ చేతబడి, దిష్టి 479
- ✦ ప్రతి వ్యాధికీ మందుంది 480
- ✦ స్వప్నలోకం 482
- ✦ ప్రమాణం ఎలా చేయాలి? 484
- ✦ సృష్టితాలను, ప్రకృతిశక్తులను దూషించరాదు 485
- ✦ అతిథి సత్కారం 486
- ✦ దొరికిన వస్తువులు ఏం చేయాలి? 486
- ✦ అనుమానాలు, వదంతుల్లో నిజమెంత? 488

**VII.** పరలోక వ్యవస్థ 489

- ✦ స్వర్గ, నరకాల మార్గాలు 489

**90.** ఆత్మ అంటే ఏమిటీ? 490

**91.** ప్రాణాంతక పరిస్థితి 492

- ✦ రోగుల పరామర్శ 493
- ✦ మృత్యుముఖంలో మనిషి 494
- ✦ మలకల్ మౌత్ నిజరూపం 496
- ✦ మరణం ఎవరికి మంచిది? 496
- ✦ ఆత్మహత్య మహాపాతకం 498
- ✦ చరమ ఘడియల్లో చేయవలసిన పనులు 499

**92.** సదనం నుండి శ్మశానం వరకు 499

- ✦ చచ్చిన బతికినవారు 503

**93.** పితృలోకంలో ప్రారంభ స్థితి 505

- ✦ సమాధిలో ఖుర్ఆన్ పాత్ర 510

**94.** పితృలోకంలో పాపపుణ్యాల పర్యవసానం 512

- ✦ ప్రవక్త స్వప్నంలో బర్జఖ్ యాతనలు 514
- ✦ మేరాజ్ సందర్భంలో బర్జఖ్ విశేషాలు 516

**95.** ప్రళయ సూచనలు 518

- ✦ సత్యపథగాములు సదా ఉంటారు 521

**96.** మహ్‌దీ (అలైహిస్సలాం) 524

**97.** ఒంటికన్ను దజ్జాల్ 527

**98.** ఈసా (అలైహి) పునరాగమనం 534

- ✦ యాజూజ్, మాజూజ్‌ల దాడులు 535

**99.** పతనపుటంచుల్లో ప్రపంచం 537





- ✦ మాట్లాడే జంతువు 538
- ✦ ప్రపంచం అంత్యదశ 539

**100.** ప్రళయ బీభత్సం 541

**101.** పునరుత్థాన దినం 544

**102.** మానవుల విభిన్న పరిస్థితులు 546

**103.** కర్మవిచారణ, ధర్మకాటా 550

**104.** సాధారణ సిఫారసు 553

- ✦ కౌసర్ సరోవరం 556

**105.** సాక్ష్యాధారాలు 558

**106.** ముస్లింల విచారణ 561

- ✦ దైవన్యాయస్థానంలో మొట్టమొదటి తీర్పు 562

**107.** మానవేతరుల విచారణ 566

**108.** ఐహిక భాగ్యాలను గురించి విచారణ 567

**109.** విశ్వాసులు-సిఫారసు 568

**110.** దైవజ్యోతి- దివ్యదర్శనం 571

**111.** నరకం మీదుగానే స్వర్గానికి దారి 575

**112.** మరణానికి మరణం 579

**113.** నరక కూపం 580

**114.** నరక యాతనలు 585

**115.** నరకవాసుల రూపురేఖలు 588

**116.** నరకశిక్షలకు కారణాలు 589

**117.** నూటికి 99.9 మంది నరకవాసులే 592

**118.** ఆరాఫ్ వాసులకు అటూఇటూ 593

**119.** స్వర్గ సీమ 594

**120.** స్వర్గ ప్రవేశం 599

**121.** అధమశ్రేణి స్వర్గనివాసి 602

**122.** స్వర్గవాసుల రూపురేఖలు 605

**123.** స్వర్గ భాగ్యాలు 606

- ✦ ఆహార పానీయాలు 607
- ✦ అలంకరణలు 611
- ✦ స్వర్గ మహిళలు 612
- ✦ సూపర్‌మార్కెట్‌లో సూపర్‌విజన్ 616

**124.** మనసును కరిగించే మాటలు 619

# పరిచయ పలుకులు

ఇస్లాం జ్ఞాననిధికి మొట్టమొదటి మూలాధారమైన ఖుర్ఆన్ తర్వాత హదీస్ రెండవ స్థానం ఆక్రమించుకుంటుంది. ఖుర్ఆన్ సృష్టికర్త నుండి దివ్యావిష్కృతి (Revelation) ద్వారా అంతిమదైవప్రవక్త ముహమ్మద్ (స) హృదయఫలకంపై అవతరించిన సైద్ధాంతిక వాణి. హదీస్ ఆ సైద్ధాంతిక వాణికి క్రియాత్మక అన్వయింపుగా సృష్టికర్త మార్గదర్శనంలో దైవప్రవక్త (స) నోట వెలువడిన సుభాషితాలు, ఆయన చేసిన పనుల సముదాయం. ఈవిధంగా ఖురాన్ సిద్ధాంతం (Theory) అయితే, హదీస్ దాని ఆచరణ (Practice) అవుతుంది. ఇస్లాం ధర్మానికి సంబంధించిన ఇతర సమాచారమంతా ఈ రెండు మూలాల (Resources) వెలుగు ద్వారానే ఉనికిలోకి వస్తుంది.

హదీస్ అంటే మాట, పలుకు, ప్రస్తావన అని శాబ్దిక అర్థాలున్నాయి. ఇస్లాం పరిభాషలో హదీస్ అంటే దైవప్రవక్త (స) ప్రవచించిన హితోక్తులు, ఆయన జారీచేసిన ఆజ్ఞలు, ఆయన చేసిచూపిన పనులు మొదలైనవని అర్థం. ప్రవక్త అనుచరుల (సహాబీల) మాటలు, చేతలలో దైవప్రవక్త (స) ఆమోదించిన విషయాలు కూడా హదీస్ పరిధిలోకే వస్తాయి. హదీస్‌కు మరో రూపం 'సున్నత్'. సున్నత్ అంటే విధానం లేక సంప్రదాయం అని శాబ్దిక భావం. సున్నత్‌లో కూడా దైవప్రవక్త (స) సంప్రదాయాలతో పాటు ఆయన అనుచరుల విధానాలు ఉంటాయి. కనుక హదీస్‌కు, సున్నత్‌కు పెద్దగా తేడా లేదని తెలుస్తోంది.

హదీస్ సేకరణ ఉద్యమం ప్రవక్త ప్రత్యక్ష అనుచరు (సహాబీ)ల కాలంలో ప్రారంభమై నాలుగొందల సంవత్సరాల దాకా కొనసాగింది. ప్రవక్త ప్రత్యక్షఅనుచరుల్లో హజ్రత్ అబూ హురైరా, అబ్దుల్లా బిన్ అబ్బాస్, ఆయిషా సిద్దీఖా, అబ్దుల్లా బిన్ ఉమర్, జాబిర్ బిన్ అబ్దుల్లా, అనస్ బిన్ మాలిక్, అబూసయీద్ ఖుద్రీ (రజి)లు 1000కి పైగా హదీసులు ఉల్లేఖించారు. హజ్రత్ అబ్దుల్లా బిన్ అమ్ర్ బిన్ ఆస్, అలీ బిన్ అబూతాలిబ్, ఉమర్ ఫారూఖ్ (రజి)లు 500 నుండి 1000 వరకు హదీసులు ఉల్లేఖించారు. అలాగే హజ్రత్ అబూబకర్, ఉస్మాన్, ఉమ్మెసల్మా, అబూమూసా అష్అరి, అబూజర్ గిఫ్ఫారి, అబూ అయ్యూబ్ అన్సారి, ఉబయి బిన్ కాబ్, ముఆజ్ బిన్ జబల్ (రజి)లు 100 నుండి దాదాపు 500 వరకు హదీసులు ఉల్లేఖించారు.

హదీసు సేకరణ తొలిదశలో ప్రవక్త ప్రత్యక్ష అనుచరులు 15 వ్రాతప్రతులు తయారు చేశారు. వాటిలో సహీఫా సాదిఖా, సహీఫా సహీహ్, బషీర్ బిన్ సహీఖ్, ముస్నద్ అబూ హురైరా, సహీఫా హజ్రత్ అలి, సహీఫా హజ్రత్ జాబిర్, సహీఫా అనస్ బిన్ మాలిక్, హజ్రత్ ఆయిషా ఉల్లేఖనాలు, హజ్రత్ ఇబ్నెఅబ్బాస్ ఉల్లేఖనాలు సుప్రసిద్ధమైనవి. హదీసు సేకరణ రెండవదశలో (హిజ్రీశకం 120 నుండి 190 వరకు) 1-ముహమ్మద్ బిన్ షిహాబ్ జుహ్రీ, 2-అబ్దుల్‌మలిక్ బిన్ జరీ, 3-ఇమామ్ ఔజాయి, 4-ముహమ్మద్ బిన్ రాషిద్, 5-ఇమామ్ సుఫియాన్ సౌరి, 6-ఇమామ్ హమ్మాద్ బిన్ సల్లమ, 7-ఇమామ్ అబ్దుల్లా బిన్ ముబారక్, 8-ఇమామ్ మాలిక్ బిన్ అనస్ (రహ్మలై)లు ప్రముఖ పాత్ర వహించారు. వారిలో ఇమామ్ మాలిక్ (రహ్మలై) సంకలనం చేసిన 'ముఅత్తా' గ్రంథం ప్రత్యేక స్థానం



సంతరించుకుంది. ఇందులో మొత్తం 1700 హదీసులు ఉన్నాయి. ఈ దశలో తయారైన ఇతర గ్రంథాలలో 1-జామె సుఫియాన్ సౌరి, 2-జామె ఇబ్నెముబారక్, 3-జామె ఇమామ్ ఔజాయి, 4-జామె ఇబ్నెజరీర్, 5- కితాబుల్ ఖరాజ్ (ఖాజీ అబూ యూసుఫ్), 5-కితాబుల్ ఆసార్, ముఅత్తా (ఇమామ్ ముహమ్మద్)లు ఖ్యాతి చెందాయి.

ఆ తరువాత కాలంలో అనేకమంది హదీసువేత్తలు ఉల్లేఖకుల పరంపర ద్వారా లక్షలాది హదీసుల్ని సేకరించి, ఏరికూర్చి వందలాది గ్రంథాలు రాశారు. వాటిలో ఈనాడు బుఖారి (ఇమామ్ ముహమ్మద్ బిన్ ఇస్మాయీల్ బుఖారి), ముస్లిం (ఇమామ్ ముస్లిం బిన్ హజ్జాజ్ కషీరి), తిర్మిజి (ఇమామ్ అబూఈసా తిర్మిజి), అబూదావూద్ (అబూదావూద్ అష్అస్ బిన్ సులైమాన్), నసాయి (ఇమామ్ అహ్మద్ బిన్ షుఐబ్ నసాయి), ఇబ్నెమాజ (ఇమామ్ ముహమ్మద్ బిన్ యజీద్ బిన్ మాజ)- (ఈ ఆరింటిని 'సిహాసిత్తా' అంటారు.), ముస్నద్అహ్మద్ (ఇమామ్ అహ్మద్ బిన్ హంబల్), దారిమి, దారుఖ్తని, తబ్రాని, తహావీ, బైహఖీ, ముస్తద్రక్ హాకిమ్, ముస్నద్ షాఫయి, ఇబ్నెజరీర్ తబ్రీ, కుతుబ్ ఖతీబ్ బగ్దాది, అబూనయీమ్, ఇబ్నెఅసాకర్, వైలమి, ఫిర్దౌస్, కామిల్ ఇబ్నెఅది, ఇబ్నెమర్దూయ, వాఖిది గ్రంథాలు ప్రఖ్యాతి గాంచాయి.

ఆ తర్వాత ఈ మూలగ్రంథాల నుండి ఎంపిక చేసి కూర్చబడిన గ్రంథాలు కూడా వెలువడ్డాయి. వాటిలో 1-ముస్తఖబ్ అఖ్బార్ (నైలల్అవ్‌తార్), 2-మిష్కాతుల్ మసాబి, 3-రియాజుస్సాలిహీన్, 4-బులూగుల్‌మరామ్, 5-అల్లూలువల్‌మర్జాన్ గ్రంథాలు ముఖ్యమైనవి. వీటిలో చివరి నాలుగు గ్రంథాలు తెలుగులో కూడా అనువదించబడ్డాయి. 3వ, 4వ నెంబర్ గ్రంథాల్లో మూలభాష అరబీతో పాటు సుదీర్ఘ వ్యాఖ్యానాలు కూడా ఉన్నాయి. పోతే హదీసువెలుగు, ప్రవక్త ప్రవచనం, మాటల ముత్యాలు, హదీసు పరిమళం వగైరా పేర్లతో మరికొన్ని చిన్నచిన్న పుస్తకాలు కూడా వెలువడ్డాయి.

నేనిప్పుడు తెలుగు ప్రజల ఆసక్తి, అభిరుచులను దృష్టిలో పెట్టుకొని వివిధ ఉర్దూ గ్రంథాల నుండి ఎంపిక చేసి ముఖ్యమైన హదీసులన్నీ తెలుగులోకి అనువదించాను. కాకపోతే హదీసు మూలభాష, పునరావృత ఉల్లేఖనాలు, ప్రాముఖ్యంలేని వ్యాఖ్యానాలు తీసేసి, అవసరమైన చోట ఖుర్ఆన్ సూక్తులు చేర్చి, అత్యాధునిక విషయసూచికతో ఈ గ్రంథం ప్రచురించబడింది. లోగడ తెలుగులో వెలువడిన గ్రంథాలలోని దాదాపు హదీసులన్నీ ఈ గ్రంథంలో చూడవచ్చు. అంటే విషయపరిజ్ఞానం రీత్యా సంక్షిప్తంలో సమగ్రం అన్నట్లు వేలాది పేజీలలోని సమాచారమంతా దాదాపు 2125 హదీసులతో కేవలం 624 పేజీలలో, కాంప్యాక్ట్ డిస్కులా ఈ గ్రంథంలో ఇమిడిపోయిందన్న మాట. ఈ గ్రంథంలో చోటుచేసుకోని అతిముఖ్యమైన హదీసులు ఏవైనా (ఉర్దూలో నైనాసరే) పాఠకుల దగ్గర ఉండి రచయిత దృష్టికి తీసుకురావడం జరిగితే వాటిని ఇన్షాఅల్లాహ్ మలిముద్రణలో చేర్చుతాను. విశ్వప్రభువు నా ఈ చిరుకృషిని దయతో స్వీకరిస్తాడని ఆశిస్తున్నాను.

**హైదరాబాద్-2**
**తేది: 16-1-08**

అబుల్ ఇర్ఫాన్
రచయిత

కరుణామయుడు, కృపాసాగరుడయిన దేవుని పేరుతో ప్రారంభం

# హదీస్ హితోక్తులు

"నేను మానవుల్ని, జిన్నుల్ని (భూతాలను) నన్ను ఆరాధించడానికి (మాత్రమే) తప్ప మరే లక్ష్యంతో సృష్టించ లేదు." (ఖుర్ఆన్-51:56)

ఇస్లాం ఏకేశ్వరవాదానికి సంబంధించి విశ్వాసానికి, ఆచరణకు మధ్య ఉన్న వైరుధ్యాన్ని ఖండించింది. యావత్ సృష్టిరాసులకు ఆరాధ్యుడు ఒక్కడేనని, ఆయన తప్ప వేరేఆరాధ్యుడు పూజనీయుడు లేడని, ఆయనే 'అల్లాహ్' అని నమ్మడంతో పాటు ఆచరణరీత్యా కూడా ఆ ఒక్కడినే ఆరాధించాలని, ఆయన్నే వేడుకోవాలని, జీవితంలోని ప్రతి రంగంలోనూ ఆయన ఆజ్ఞల్ని మాత్రమే శిరసావహించాలని చెబుతోంది.

మహాప్రవక్త ముహమ్మద్ (స) దేవుని మాటల్ని ఈవిధంగా పేర్కొన్నారు:

"నా దాసులారా! నేను మార్గం చూపినవాడు తప్ప మీలో ప్రతిఒక్కడూ మార్గవిహీనుడే. అందువల్ల సన్మార్గం చూపమని నన్ను వేడుకోండి, నేను మీకు సన్మార్గావలంబన బుద్ధి ప్రసాదిస్తాను. నా దాసులారా! నేను ఉపాధి ప్రసాదించినవాడు తప్ప మీలో ప్రతి ఒక్కడూ క్షుత్బాధితుడే. కనుక ఉపాధి ప్రసాదించమని నన్ను మొరపెట్టుకోండి, నేను మీకు ఉపాధినిస్తాను. నా దాసులారా! నేను వస్త్రాలు ప్రసాదించినవాడు తప్ప మీలో ప్రతి ఒక్కడూ వస్త్రవిహీనుడే. కావున వస్త్రాలు ప్రసాదించమని నన్ను అర్థించండి, నేను మీకు వస్త్రాలు ప్రసాదిస్తాను. నా దాసులారా! మీలో ప్రతి ఒక్కడూ రేయింబవళ్ళు పాపాలు చేస్తున్నవాడే. నేను మీ పాపాలన్నీ క్షమిస్తాను. కనుక మీరు పాపక్షమాపణ కోసం నన్ను ప్రార్థించండి, నేను మీ పాపాలు క్షమిస్తాను." (ముస్లిం)

"కనుక (విశ్వాసులారా!) మీరు ఏకాగ్రచిత్తులై (దేవుడు చూపిన) ఈ ధర్మాన్నే అంటిపెట్టుకొని ఉండండి. దేవుడు మానవుల్ని ఏ ప్రకృతి(ధర్మం) ఆధారంగా పుట్టించాడో ఆ ప్రకృతి (ధర్మం)లోనే స్థిరంగా ఉండండి. ఆయన రూపొందించిన ప్రకృతికి మార్పులేదు. ఇదే సరైనమార్గం, (సహజ) ధర్మం." (ఖుర్ఆన్-30:30)

ఆ ప్రకృతి ధర్మమే ఇస్లాం. విశ్వంలోని సమస్తం, చివరికి మానవుని అవయవాలు సైతం దైవనియమావళి ప్రకారమే పని చేస్తున్నాయి. అయితే మానవుల్లో కొందరు తమకు దేవుడు ఇచ్చిన స్వేచ్ఛను దుర్వినియోగం చేస్తూ విశృంఖల జీవితం గడుపుతున్నారు. అలాగే పిల్లల్ని సైతం తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. దీనిపై ప్రవక్త ప్రవచనం చూడండి:

"మాతృగర్భం నుండి పుట్టే ప్రతిపిల్లవాడూ ప్రకృతిధర్మం ఆధారంగానే పుడుతున్నాడు. కాని తల్లిదండ్రులు ఆ తర్వాత ఆ పిల్లవాడ్ని క్రైస్తవునిగానో, యూదునిగానో, మజూసీగానో లేదా మరోరకంగానో మార్చివేస్తున్నారు. దీన్ని ఈ విధంగా పోల్చవచ్చు- పశువుల కడుపుల్లో నుంచి పశువులు ఎలాంటి లోపంలేకుండా పుడ్తాయి. ఏ జంతుపిల్ల కూడా తెగిన చెవులతో పుట్టదు. ఆ తరువాత బహుదైవారాధకులు తమ మూఢనమ్మకాలతో దాని చెవులు కోసివేస్తారు." (బుఖారి)



# I. ధర్మానికి పునాదులు విశ్వాసాలే

"నీ ప్రభువు ఆదంసంతతి వీపుల నుండి వారి భావితరాల్ని తీసి ప్రమాణం చేయించిన సందర్భం. అప్పుడు మేము వారిని సాక్షులుగా పెడుతూ 'నేను మీ ప్రభువుని కానా' అని అడిగాం. దానికి వారు 'మీరే మాప్రభువు. అందుకు మేమే సాక్షులం' అన్నారు."

"మేమిలా చేయడానికికారణం, ప్రళయదినాన మీరు 'మాకీ విషయం తెలియద'ని చెప్పవచ్చు. లేదా 'బహుదైవారాధన మాకు పూర్వం మా తాతముత్తాతలు ప్రారంభించారు. మేము ఆతర్వాత వారిసంతతి నుండి పుట్టాం. అలాంటప్పుడు దుర్జనులు చేసిన ఈ తప్పుకు మమ్మల్ని పట్టుకుంటారా?' అని చెప్పవచ్చు. వారు సన్మార్గంవైపు మరలుతారన్న ఉద్దేశ్యంతో మేమిలా మాసూక్తులు విడమరచి తెలుపుతున్నాం." (ఖుర్ఆన్:7:172-174)

చెట్టు మొలకెత్తి పెరగడానికి విత్తనం ఎంత ముఖ్యమో ఆచరణకు విశ్వాసం కూడా అంతే ముఖ్యం. విద్యుచ్ఛక్తి గురించి ఏమీ తెలియని బాలుడు ఇనుపకడ్డీతో హైటెన్షన్ వైర్ల మీదపడిన గాలిపటం తీసుకోడానికి ప్రయత్నిస్తే కరెంట్ షాక్‌కొడ్తుంది. నిప్పుసంగతి తెలియని పసిపిల్లవాడు వెలుగుతున్న కొవ్వొత్తిని పట్టుకోవడానికి ప్రయత్నిస్తే చెయ్యి కాలుతుంది. కాని కరెంటుకు షాక్‌కొట్టే గుణం, నిప్పుకు కాల్చే గుణం ఉన్నాయని పెద్దవాళ్ళు నమ్ముతారు. అంచేత వారు పసిపిల్లల్లా, పిచ్చివాళ్ళులా, మూర్ఖుల్లా ప్రవర్తించి ప్రమాదం కొనితెచ్చుకోరు.

అదేవిధంగా దేవుడు, దివ్యావిష్కృతి, మరణానంతర జీవితం గురించిన విషయాల్ని కూడా మంచీ-చెడూ, విజ్ఞతా-వివేచనలు కలిగిన మానవుడు విశ్వసించి తదనుగుణంగా నడచుకుంటే, అతను ఇటు ఇహలోకంలోనూ సుఖవంతమైన జీవితం గడుపుతాడు, అటు పరలోకంలోనూ శాశ్వత సౌఖ్యాలు అనుభవించగలడు.

## 1. విశ్వాసాలే ఆచరణకు ఆధారాలు

దైవప్రవక్త (స) ప్రవచనం: "దేవుడు విశ్వాసంలేని సదాచరణను, సదాచరణలేని విశ్వాసాన్ని (ఎన్నటికీ) స్వీకరించడు." (ఇస్లామీ నజర్య-ప్రొఫెసర్ ఖుర్షీద్ అహ్మద్)

హజ్రత్ ఉమర్ బిన్ ఖత్తాబ్ (రజి) కథనం: మేము ఓరోజు దైవప్రవక్త (సల్లం) దగ్గర కూర్చొని ఉన్నప్పుడు హఠాత్తుగా ఒకతను వచ్చి దైవప్రవక్త (స) ముందు కూర్చున్నాడు. అతని బట్టలు ఎంతో తెల్లగా, శిరోజాలు నల్లగా ఉన్నాయి. అతను ప్రయాణం చేసివచ్చినట్లుగాని, మాతో పరిచయమున్నట్లుగాని మాకు అన్పించలేదు. అతను ప్రవక్త మోకాళ్ళకు తన మోకాళ్ళు ఆనించి, ప్రవక్త తొడలపై చేతులు పెట్టి "ముహమ్మద్! ఇస్లాం అంటే ఏమిటో నాకు తెలియజెయ్యి" అని అడిగాడు.

దానికి దైవప్రవక్త (స) ఇలా సమాధానమిచ్చారు:- "ఇస్లాం అంటే- అల్లాహ్ తప్ప మరే ఆరాధ్యుడు లేడని, ముహమ్మద్ ఆ దేవుని ప్రవక్త (సందేశహరుడు) అని నీవు సాక్ష్యం చెప్పడం, నమాజ్ చేయడం, (పేదల ఆర్థిక హక్కయిన) జకాత్ చెల్లించడం, రమజాన్ నెల ఉపవాసాలు పాటించడం, ఇంకా శక్తి ఉంటే హజ్‌యాత్ర జరపడం." ఆ వ్యక్తి ఈమాటలు విని "మీరు చెప్పింది నిజం"అన్నాడు. అది విని 'ఏమిటీ, అతనే ప్రశ్నిస్తున్నాడు, అతనే మళ్ళీ ధృవీకరిస్తున్నాడ'ని భావించి మేము ఆశ్చర్యపోయాం.

తర్వాత ఆ వ్యక్తి "సరే నాకు ఈమాన్ (విశ్వాసం) అంటే ఏమిటో వివరించండి" అన్నాడు. "ఈమాన్ అంటే నీవు 1-దేవుణ్ణి, 2-ఆయన దూతల్ని, 3-ఆయన ప్రవక్తల్ని, 4-అంతిమదినాన్ని (మరణానంతర విషయాల్ని), 5-మంచిదైనా చెడుదైనా అదృష్టాన్ని విశ్వసించడం" అని చెప్పారు దైవప్రవక్త (స). ఆ వ్యక్తి మళ్ళీ "మీరు నిజం చెప్పారు" అన్నాడు. తరువాత "ఇహ్సాన్ అంటే ఏమిటో చెప్పండి" అన్నాడు అతను. "ఇహ్సాన్ అంటే నీవు దేవుణ్ణి ప్రత్యక్షంగా చూస్తున్నట్లు (భయభక్తులతో) ఆయన్ని(మాత్రమే) ఆరాధించాలి. నీవు ఆయన్ని చూడకపోయినా ఆయన మాత్రం నిన్ను తప్పకుండా చూస్తున్నాడు" (అన్న యదార్థం గుర్తుంచుకోవాలి)" అని సమాధానం ఇచ్చారు దైవప్రవక్త (స).

"సరే, ప్రళయం ఎప్పుడొస్తుందో చెప్పండి నాకు" అని అడిగాడతను మళ్ళీ. "ప్రళయం గురించి ప్రశ్నించేవాడి కంటే సమాధానమిచ్చేవాడికి ఎక్కువేమీ తెలియదు" అన్నారు దైవప్రవక్త (స). ఆ వ్యక్తి "దాని సూచనలైనా తెలియజేయండి" అన్నాడు. దానికి దైవప్రవక్త (స) ఇలా సమాధానమిచ్చారు- "అప్పుడు దాసి తన యజమానురాలిని కంటుంది. వంటిమీద బట్టలేకుండా నగ్నపాదాలతో తిరిగే అనాగరికులు, గొడ్లకాపర్లు పెద్దపెద్ద భవంతులు కట్టుకొని గొప్పలు చెప్పుకోవడం నీవు చూస్తావు."

ఆ తరువాత ఆ వ్యక్తి వెళ్ళిపోయాడు. నేను అక్కడే కాస్సేపు ఉన్నాను. తరువాత దైవప్రవక్త (స) నన్ను ఉద్దేశించి "ఉమర్! ఈ ప్రశ్నలు అడిగిన ఆ మనిషి ఎవరో నీకు తెలుసా?" అని ప్రశ్నించారు. నేను "దేవునికి, దైవప్రవక్తకే బాగా తెలుసు" అన్నాను. అప్పుడు దైవప్రవక్త (స) మాట్లాడుతూ "ఆ మనిషి (ఎవరో కాదు,) జిబ్రీల్ (దైవదూత). మీకు మీ ధర్మం నేర్పడానికి వచ్చాడాయన" అని చెప్పారు. (ముస్లిం)

దైవప్రవక్త (స) ప్రవచనం: "అల్లాహ్‌ను తన ప్రభువుగా, ఇస్లాంను తన జీవన ధర్మంగా, ముహమ్మద్‌ను తన దైవప్రవక్తగా అంగీకరించి దానిపట్ల పూర్తిగా సంతృప్తి చెందినవాడే విశ్వాసమాధుర్యాన్ని చవిచూసిన వాడవుతాడు." (బుఖారి, ముస్లిం)

హజ్రత్ ఇబ్నెఉమర్ (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "ఇస్లాం ఐదు మౌలిక అంశాలపై ఆధారపడి ఉంది. 1-అల్లాహ్ తప్ప మరే ఆరాధ్యుడు లేడని; ముహమ్మద్ ఆ దేవుని దాసుడు, ప్రవక్త అని సాక్ష్యమివ్వాలి. 2-నమాజ్ వ్యవస్థ నెలగొల్పాలి. 3-(పేదల ఆర్థిక హక్కయిన) జకాత్ నెరవేర్చాలి. 4-కాబా సందర్శించి దాని ప్రదక్షిణ చేయాలి. 5-రమజాన్ నెల ఉపవాసాలు పాటించాలి." (బుఖారి, ముస్లిం)

హజ్రత్ ముఆజ్ (రజి) కథనం: నేనొక సారి దైవప్రవక్త (స) వెనుక అఫీర్ అనే గాడిదపై ప్రయాణం చేస్తున్నాను. (దారిలో) ఆయన "ముఆజ్! దాసులపై దేవుని హక్కేమిటో, దేవునిపై దాసుల హక్కేమిటో నీకు తెలుసా?" అనడిగారు. నేను "దేవునికి, దైవ ప్రవక్తకే బాగా తెలుసు" అన్నాను. అప్పుడాయన "దాసులపై దేవునికున్న హక్కు- వారు దేవుణ్ణి మాత్రమే ఆరాధించాలి. ఆయనకు మరెవరినీ సాటి కల్పించకూడదు. దేవునిపై దాసులకున్న హక్కు- ఆయన తనకు సాటి కల్పించనివారిని శిక్షించకపోవడమే" అని అన్నారు. "అయితే దైవప్రవక్తా! నేనీ శుభవార్తను ప్రజలకు తెలియజేయనా?" అని అడిగాను. దానికి ఆయన "వద్దు. (అప్పుడే) ఈ శుభవార్తను ప్రజలకు తెలియజేయకు.



అలా చెబితే వారు దీనిమీదే ఆధారపడతారు" అని హెచ్చరించారు. (బుఖారి, ముస్లిం)

"దేవునికి సాటి కల్పించేవారికి దేవుడు స్వర్గప్రవేశం నిషేధించాడు. వారి నివాసం నరకమవుతుంది. అలాంటి దుర్మార్గులకు ఎవరూ సహాయం చేయలేరు." (ఖుర్‌ఆన్-5:72)

దైవప్రవక్త (స) ప్రవచనం: "దేవునికి సాటి కల్పించని (అంటే షిర్క్ చేయని) స్థితిలో (చనిపోయి) ఆయన్ని కలుసుకునేవాడు స్వర్గంలో ప్రవేశిస్తాడు. దానికి భిన్నంగా దేవునికి సాటికల్పిస్తున్న స్థితిలో చనిపోయేవాడు నరకానికి పోతాడు." (ముస్లిం)

దైవప్రవక్త (స) హితోక్తి: "విశ్వాసానికి 70కి పైగా శాఖలున్నాయి. వాటిలో అన్నిటి కంటే ఉన్నతమైనది 'లాఇలాహ ఇల్లల్లాహ్' అని పలకడం, అత్యల్పమైనది దారిలో బాధ కల్గించే వస్తువుని తీసేయడం. బిడియం కూడ విశ్వాసంలో ఓ ముఖ్యభాగం."(ముస్లిం)

దైవప్రవక్త (స) ఇలా ఉపదేశించారు: "దేవునికి బలహీన విశ్వాసి కంటే దృఢమైన విశ్వాసి ఎంతో ప్రియమైనవాడు. ప్రతి విషయంలోనూ మంచి ఉంది. అయితే మీకు ఏ విషయం లాభదాయకమో దాన్ని ఆశించండి. దేవుణ్ణి సహాయం అర్థిస్తూ ఉండండి. (ఆపద సమయాల్లో) అధైర్యం చెందకండి. ఏదైనా కష్టం వచ్చినప్పుడు 'ఒకవేళ నేనిలా చేసివుంటే ఈవిధంగా జరిగేది కాద'ని అనకండి. దానికి బదులు 'దేవుడు ఈవిధంగా నిర్ణయించాడు (గనక ఇలా జరిగింది). ఆయన తలచుకున్నది జరిగింద'ని చెప్పండి. ఒకవేళ అనేమాట పైశాచిక ద్వారాలను తెరుస్తుంది." (మిష్కాత్)

హజ్రత్ ఉమర్(రజి) ప్రకారం దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: మీరు దేవునిపై ఏవిధంగా నమ్మకం కలిగివుండాలో ఆవిధంగా నమ్మకం కలిగివుంటే ఆయన పక్షులకు ఆహారం ప్రసాదించినట్లే మీక్కూడా ఉపాధి ప్రసాదిస్తాడు. పక్షులు ఉదయం ఆకలితో బయలుదేరి సాయంత్రానికి కడుపు నింపుకొని వస్తాయి. (తిర్మిజీ)

దైవప్రవక్త (స) హితోక్తి: "ప్రజలందరిలో శక్తిమంతుడు కాదలచుకున్నవాడు దేవుణ్ణే నమ్ముకొని ఆయన మీద భారం వేయాలి. అందరికంటే గొప్ప స్థితిపరుడు కాదలచు కున్నవాడు తన దగ్గరున్న దానికంటే దేవుని దగ్గర (స్వర్గంలో) ఉన్నదానిపై ఎక్కువ నమ్మకం పెట్టుకోవాలి. అందరికంటే ఎక్కువ గౌరవనీయుడు కాదలచు కున్నవాడు అత్యంత గౌరవనీయుడు, మహోన్నతుడైన దేవునికి భయపడుతుండాలి." (ఇబ్నెఅబ్బాస్)

## కీడు-మేలు అంతా దైవాధీనమే

"భూమిపైగాని మీపైగాని వచ్చిపడే ఏఆపదైనా దాన్ని సృష్టించడానికి పూర్వమే మేము దాన్ని గురించి గ్రంథంలో వ్రాసిపెట్టాము. ఇలా చేయడం దేవునికి చాలా తేలిక. మీమీద ఏఆపద వచ్చినా మీరు బాధపడకుండా ఉండాలని, దేవుడు మీకు ఏభాగ్యం ప్రసాదించినా దాన్ని చూసుకొని మిడిసిపడరాదని (ఆయన ఈ ఏర్పాటు చేశాడు)." (ఖుర్‌ఆన్-57:22,23)

"దేవుని అనుజ్ఞ లేనిదే నిర్ణీత సమయానికి ముందు ఏ ప్రాణికీ చావు రాదు. ప్రతి ప్రాణికీ మరణకాలం వ్రాయబడి ఉంది. కేవలం ప్రాపంచిక ప్రతిఫలాపేక్షతో పనిచేసేవారికి మేము ప్రపంచంలోనే వారిప్రతిఫలం ఇచ్చివేస్తాం. పరలోక ప్రతిఫలాపేక్షతో పనిచేసేవారికి పరలోకంలో వారికి రావలసిన ప్రతిఫలం అనుగ్రహిస్తాం." (ఖుర్‌ఆన్-3:144,145)

హ॥జత్ అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి) కథనం: నేనొక రోజు వాహనంపై దైవప్రవక్త (స) వెనుక కూర్చున్నాను. ఆయన నాతో మాట్లాడుతూ "అబ్బాయ్! నేను నీకు కొన్ని విషయాలు ఉపదేశిస్తున్నాను. నీవు దేవుని ధర్మాన్ని కాపాడుతూవుండు, దేవుడు నిన్ను కాపాడుతుంటాడు. దేవుని ధర్మాన్ని రక్షించు, అప్పుడు నీవు ఆయన్ని నీముందు చూస్తావు. నీవు వేడుకోవాలనుకుంటే దేవుడ్ని మాత్రమే వేడుకో. సహాయం అర్థిస్తే దేవుడ్నే సహాయం అర్థించు. ఒక విషయం బాగా గుర్తుంచుకో. ఒక జాతి ప్రజలంతా కలసి నీకేదైనా మేలు చేయాలని నిర్ణయించుకున్నా దేవుడు నీకు రాసిపెట్టింది తప్ప ఎలాంటి మేలు చేయలేరు. అలాగే ప్రజలందరూ కలసి నీకేదైనా కీడు తలపెట్టదలచుకుంటే, నీకోసం దేవుడు నిర్ణయించింది తప్ప ఎలాంటి కీడు తలపెట్టలేరు." (మిష్కాత్)

హ॥జత్ అబూహురైరా కథనం: ఒక పల్లెవాసి దైవప్రవక్త (స) సన్నిధికి వచ్చి "దైవ ప్రవక్తా! నన్ను స్వర్గానికి గొనిపోగల సత్కర్మలేమిటో తెలియజేయండ"ని అడిగాడు. అప్పుడు దైవప్రవక్త ఈవిధంగా చెప్పారు:- నీవు 1-ఒక్క దేవుడ్ని మాత్రమే ఆరాధించు. ఆయనకు మరెవరినీ సాటి కల్పించకు. 2-విధిగా చేయబడిన (ఫర్జ్) నమాజులు ఆచ రించు. 3-(పేదల ఆర్థిక హక్కయిన) జకాత్ చెల్లిస్తూ ఉండు. 4-రమజాన్ ఉపవాసాలు పాటించు." పల్లెవాసి ఈ మాటలు విని "నాప్రాణం ఏ శక్తిస్వరూపుని అధీనంలో ఉందో ఆ దేవుని సాక్షి! నేనీ ఆజ్ఞల్ని తు.చ. తప్పకుండా పాటిస్తాను" అన్నాడు. ఆతర్వాత అతను వెళ్ళిపోవడానికి వెనుతిరగ్గానే దైవప్రవక్త (స) అనుచరుల వైపు తిరిగి "మీలో ఎవరైనా స్వర్గవాసిని చూడదలిస్తే ఈ మనిషిని చూడవచ్చు" అన్నారు. (బుఖారి)

హ॥జత్ అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి) కథనం: దైవప్రవక్త (సల్లం) హ॥జత్ ముఆజ్ (రజి)ని యమన్ రాష్ట్రానికి గవర్నర్‌గా నియమించి పంపుతూ "పీడితుని ఆర్తనాదాలకు భయపడుతూ ఉండాలి. పీడితుని ఆర్తనాదానికి, దేవునికి మధ్య ఎలాంటి అడ్డుతెర ఉండద"ని హితోపదేశం చేశారు. (బుఖారి, ముస్లిం)

దైవప్రవక్త (స) ప్రవచనం: "మీలో ప్రతి ఒక్కరూ దేవుని పట్ల సదభిప్రాయం కలిగివున్న స్థితిలోనే చనిపోవాలి సుమా!" (ముస్లిం)

దైవప్రవక్త (స) ప్రవచనం: "దేవుని వద్ద ఎలాంటి శిక్ష వుందో తెలిస్తే విశ్వాసి తనకు స్వర్గం లభిస్తుందని ఎన్నటికీ అనుకోడు. అలాగే దేవునికున్న కారుణ్యం గురించి తెలుసుకుంటే అవిశ్వాసి ఎన్నటికీ స్వర్గం పట్ల నిరాశచెందడు. (ముస్లిం)

దైవప్రవక్త (స) ఇలా తెలియజేశారు: "ఈమాన్ (విశ్వాసం)కు చెందిన శాఖలు డెబ్భయికి పైగా ఉన్నాయి. బిడియం కూడా ఈమాన్‌కు చెందిన శాఖే." (ముస్లిం)

## కాపట్యంలేని విశ్వాసమే పనికొస్తుంది

హ॥జత్ అబూహురైరా (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ఇలా తెలిపారు: "వ్యభిచారి వ్యభిచారం చేస్తున్నప్పుడు విశ్వాసిగా ఉండడు. తాగుబోతు మద్యం సేవిస్తున్నప్పుడు విశ్వాసిగా ఉండడు. దొంగ దొంగతనం చేస్తున్నప్పుడు విశ్వాసిగా ఉండడు. ఆ తర్వాత పశ్చాత్తాపంతో దేవుడ్ని క్షమాపణ చెప్పుకుంటే అది స్వీకరించబడుతుంది." (ముస్లిం)



హ॥జత్ అబూజర్ (రజి) కథనం: దైవప్రవక్త (స) ఇలా అన్నారు- "ఒకరోజు జిబ్రీల్ నా దగ్గరకొచ్చి 'మీ అనుచరసమాజంలో దేవునికి సాటి కల్పించని స్థితిలో చనిపోయేవారు స్వర్గంలో ప్రవేశిస్తార'ని శుభవార్త చెప్పారు." నేనప్పుడు "వ్యభిచారం చేసినా, దొంగతనం చేసినా స్వర్గంలో ప్రవేశిస్తారా?" అని అడిగాను. దానికి దైవప్రవక్త (స) "ఆ...వ్యభిచారం చేసినా, దొంగతనం చేసినా సరే (స్వర్గంలో ప్రవేశిస్తారు)" అని అన్నారు. (ముస్లిం)

ఈ హదీసులో వ్యభిచారం, దొంగతనం వంటి ఘోరపాపాలు చేసినవారు సైతం స్వర్గం లో ప్రవేశిస్తారంటే వారికి నరకశిక్షలు అసలు ఉండవని అర్థంకాదు. ఆ పాపాలకు నరకశిక్షలు అనుభవించిన తరువాతే వారు స్వర్గానికి పోతారని అర్థంచేసుకోవాలి. ఒకవేళ అలాంటివారు ఇహలోకంలోనే పశ్చాత్తాపం చెంది తమను సంస్కరించుకుంటే దేవుడు వారిని క్షమిస్తాడు.

దైవప్రవక్త (స) ప్రవచనం: "కపట విశ్వాసిని మూడు విషయాల ద్వారా గుర్తించ వచ్చు. 1-అతను నోరు విప్పితే అబద్ధం పలుకుతాడు. 2-వాగ్దానం చేస్తే దాన్ని భంగం చేస్తాడు. 3-భద్రపరచమని ఏదైనా వస్తువు (లేక నిర్వహించమని ఏదైనా బాధ్యత) అప్పగిస్తే దాని పట్ల నమ్మకద్రోహానికి పాల్పడతాడు." (బుఖారి, ముస్లిం)

దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "దేవుడ్ని, అంతిమ దినాన్ని విశ్వసించేవాడు తన పొరుగువాడ్ని గౌరవించాలి. దేవుడ్ని, అంతిమదినాన్ని విశ్వసించేవాడు తన అతిథిని సత్కరించాలి." అప్పుడు కొందరు అనుచరులు "దైవప్రవక్తా! ఈ సత్కారం ఎన్ని రోజులు జరగాలి?" అనడిగారు. దానికి దైవప్రవక్త (స) "ఒక రోజు బాగా సత్కరించాలి. మూడు రోజులు సాధారణ ఆతిథ్యమివ్వాలి. అంతేకంటే ఎక్కువ రోజులు ఆతిథ్యమిస్తే అది సదఖా (దానం)గా పరిగణించబడుతుంది. పోతే దేవుడ్ని, అంతిమదినాన్ని విశ్వసించేవాడు పలికితే మంచిమాటనే పలకాలి లేదా మౌనం వహించాలి." (బుఖారి, ముస్లిం)

విశ్వాసాలే ఆచరణలకు ఆధారాలు. ఆచరణలేని విశ్వాసం నిరర్థకం. దేవుని ఆజ్ఞల్ని, ఆయన ప్రవక్త (స) బోధనలను ఆచరించకుండా వారుభయుల్ని విశ్వసించానని చెప్పుకోవడం 'తోటలో ఒక్క చెట్టు కూడా మొలకెత్తకపోయినా యజమాని ఇచ్చిన విత్తనాలన్నీ నాటానని వాదించడం లాంటిదే. ఇస్లాం స్వీకరించిన మనిషి ఇస్లాంకు అనుగుణమైన జీవితం గడపడం వల్లనే పరలోకంలో మోక్షం పొందగలుగుతాడు. విశ్వాసికి ఒక్కోసారి శత్రువులు పెట్టే హింసా దౌర్జన్యాలకు తట్టుకోలేక వారు పలకమన్న పలుకులు, చేయమన్న పనులు చేయవలసిన పరిస్థితి వస్తుంది. అప్పుడు చిత్తశుద్ధి కలిగిన విశ్వాసి అలా చేస్తే దేవుడు క్షమిస్తాడు.

"ఎవరైనా దైవాన్ని విశ్వసించాక వత్తిడి బలప్రయోగాల వల్ల అవిశ్వాస ధోరణి వ్యక్తం చేస్తే, అప్పుడతని హృదయం మాత్రం విశ్వాసస్థితిలోనే ఉంటే అలాంటి వ్యక్తిపై దోషంలేదు." (ఖుర్ఆన్–16:106)

హ॥జత్ అమ్మార్ బిన్ యాసిర్ (రజి) కళ్ళెదుటే ఆయన తల్లిదండ్రుల్ని అవిశ్వా సులు చిత్రహింసలు పెట్టి చంపేశారు. తర్వాత ఆయన్ని కూడా వారు నానాయాతనలు పెడ్తూ, తాము చెప్పినట్లు ముహమ్మద్ (స)ని దూషించి, తమ దేవతల్ని పొగడవల సిందిగా బలవంతం చేశారు. చివరికి హ॥జత్ అమ్మార్ (రజి) ఈ బాధలకు తాళలేక వారు పలకమన్న మాటలన్నీ పలికారు. ఆ తరువాత ఆయన రోదిస్తూ దైవప్రవక్త (స)

సన్నిధికి వచ్చి "దైవప్రవక్తా! నేను మిమ్మల్ని గురించి చెడుగా, వారి దేవతల్ని గురించి మంచిగా పలకనంతవరకు వారు నన్ను వదలిపెట్ట లేదు" అని అన్నారు. దైవప్రవక్త (స) ఈ మాట విని "అప్పుడు నీ హృదయస్థితి ఎలా ఉండింది?" అని అడిగారు. దానికి ఆయన "నేనప్పుడు పూర్తి విశ్వాస(ఈమాన్) స్థితిలోనే ఉన్నాను" అని సమాధాన మిచ్చారు. "అయితే వారు మరెప్పుడైనా ఇలా దౌర్జన్యం చేస్తే, నీవు మళ్ళీ అలాంటి మాటలే పలుకు" అన్నారు దైవప్రవక్త (స)- (ఇబ్నెకసీర్)

హజ్రత్ అనస్ (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ప్రవచనం: "అవిశ్వాసి ఏదయినా సత్కార్యం చేస్తే ఇహలోకంలోనే అతనికి ఏదో ఒకవిధంగా దాని ప్రతిఫలం ఇవ్వబడు తుంది. అయితే (పరలోకంలో దానికి ఎలాంటి ప్రతిఫలం లభించదు). దేవుడు అతని సత్కార్యాలను పరలోకం కోసం భద్రపరచి పెడతాడు. (అంతేకాదు) అతని విధేయత మూలంగా ఇహలోకంలోనూ అతనికి ఉపాధి ప్రసాదిస్తాడు." (ముస్లిం)

వేరొక ఉల్లేఖనం: "దేవుడు ఏ విశ్వాసికీ అతని సత్కార్యాల విషయంలో ఎలాంటి అన్యాయం చెయ్యడు. ఇహలోకంలోనూ, పరలోకంలోనూ అతనికి అతను చేసిన సత్కా ర్యానికి ప్రతిఫలం తప్పక లభిస్తుంది. అవిశ్వాసి మాత్రం దేవుని కోసం చేసే సత్కార్యాల ప్రతిఫలాన్ని ఇహలోకంలోనే పొందుతాడు. చివరికి పరలోకానికి వచ్చినప్పుడు ప్రతిఫలం పొందగలిగే సత్కార్యమేదీ అతని దగ్గర మిగిలివుండదు." (ముస్లిం)

## 2. దైవదౌత్యం వివరాలు

"మేము ముహమ్మద్ (స)ని యావత్తు మానవాళికోసం దైవప్రవక్తగా నియమించాం. దీనికి దేవుని సాక్ష్యమే చాలు. కనుక ఎవరు దైవప్రవక్తకు విధేయులై నడచుకుంటారో, వారు దేవునికి విధేయులై నడచుకున్నట్లే. ఒకవేళ ముఖం తిప్పుకుంటే తిప్పుకోని. అలాంటివారి కోసం మేము నిన్ను పర్యవేక్షకునిగా నియమించి పంపలేదు." (ఖుర్ఆన్-4:79,80)

వారికిలా చెప్పు: "మీరు నిజంగా దేవుడ్ని అభిమానిస్తుంటే నన్ను అనుసరించండి; దేవుడు మిమ్మల్ని అభిమానిస్తాడు; మీ పాపాలు క్షమిస్తాడు. దేవుడు ఎంతో క్షమించే వాడు, కరుణించేవాడు." (ఖుర్ఆన్-3:31)

"దైవప్రవక్త మీకు దేన్నిస్తాడో దాన్ని తీసుకొని, దేన్నుండి మిమ్మల్ని నిరోధిస్తాడో దాని జోలికి పోకండి. దేవునికి భయపడండి. దేవుని శిక్ష చాలా కఠినంగా ఉంటుంది." (59:7)

"విశ్వాసులారా! దేవుని పట్ల, ఆయన ప్రవక్త పట్ల విధేయత కలిగిఉండండి. మీలో వ్యవహారకర్తలైన అధికారుల పట్ల కూడా. అయితే ఏదయినా వ్యవహారంలో మీ మధ్య వివాదం తలెత్తితే దాన్ని తిరిగి దేవుని వైపునకు, ఆయన ప్రవక్త వైపునకు మరల్చండి. మీరు నిజంగా దేవుడ్ని, అంతిమదినాన్ని విశ్వసిస్తున్నట్లయితే ఇదే మీకోసం సరైన పద్ధతి. పర్యవసానం రీత్యా కూడా ఇదే మంచి విధానం." (ఖుర్ఆన్-4:59)

దైవప్రవక్త (స) హితోక్తి: "మీలో ఎవరూ తన కోరికలు, ఆకాంక్షలన్నీ నేను తెచ్చిన ధర్మశాస్త్రానికి అనుగుణంగా మారనంతవరకూ (నిజమైన)విశ్వాసి కాలేడు." (మిష్కాత్)



హజ్రత్ అనస్ (రజి) ప్రకారం దైవప్రవక్త ఇలా ప్రవచించారు: "తన తల్లిదండ్రులు, భార్యాపిల్లలు, ప్రపంచంలోని ఇతర మానవులందరికన్నా ఎక్కువగా నన్ను అభిమానించ నంతవరకు మీలో ఏఒక్కడూ నిజమైన విశ్వాసి కాజాలడు." (బుఖారి, ముస్లిం)

దైవప్రవక్త (స) మహితోక్తి: "నన్ను, మిమ్మల్ని ఇలా పోల్చవచ్చు. ఒక వ్యక్తి అగ్నిని రాజేయగా, అందులోకి దీపపు పురుగులు, కీటకాలు వచ్చి పడిపోసాగాయి. ఆవ్యక్తి (అవి అగ్నిలో పడిపోకుండా) ఆపడానికి ప్రయత్నిస్తున్నాడు. అలాగే నేను కూడా మిమ్మల్ని మీ నడుం పట్టి మరీ నరకాగ్నిలో పడిపోకుండా కాపాడుతున్నాను. కాని మీరు నా చేతుల్లో నుంచి జారి (విడిపించుకొని నరకాగ్నిలో పడి)పోతున్నారు." (ముస్లిం)

హజ్రత్ అనస్ (రజి) కథనం: దైవప్రవక్త (స) నాతో ఇలా అన్నారు- "నా ప్రియ కుమారా! నీ హృదయంలో ఎవరి పట్ల కూడా ఎలాంటి దురుద్దేశం లేకుండా నీవు జీవితం గడపగలిగితే అలా జీవితం గడుపు. నా విధానం ఇదే. నా విధానాన్ని (సంప్రదా యాన్ని) అభిమానించేవాడు నిస్సందేహంగా నన్ను అభిమానించిన వాడవుతాడు. నన్ను అభిమానించినవాడు స్వర్గంలో నాతో పాటుంటాడు." (ముస్లిం)

హజ్రత్ కాబ్ బిన్ ఉజ్రా (రజి) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (స) ఓసారి జుమా ప్రసంగం చేయడానికి వేదిక మొదటి మెట్టుపై కాలు పెట్టినప్పుడు 'ఆమీన్' అన్నారు. అలాగే రెండవ, మూడవ మెట్టుపై కాలు పెట్టినప్పుడు కూడా 'ఆమీన్' అన్నారు. ప్రసం గం ముగించి వేదిక నుంచి దిగిన తర్వాత అనుచరులు కారణం అడిగితే ఆయనిలా చెప్పారు: "నేను మొదటి మెట్టు ఎక్కేటపుడు దైవదూత జిబ్రీల్ (అలై) వచ్చి 'రమజాన్ నెలలో ఉపవాసాలు పాటించి పాపక్షమాపణ చేయించుకోనివాడు నాశనమవుగాక' అని అన్నారు. దానికి నేను ఆమీన్ (తథాస్తు) అన్నాను. నేను రెండవ మెట్టు ఎక్కేటపుడు జిబ్రీల్ మళ్ళీ 'మీపేరు ప్రస్తావించబడినపుడు విని కూడా మీకోసం దరూద్ పఠించని వాడు దైవకారుణ్యానికి దూరమవుగాక' అన్నారు. దానికీ నేను ఆమీన్ అన్నాను. నేను మూడో మెట్టు ఎక్కేటపుడు జిబ్రీల్ మళ్ళీ 'తల్లిదండ్రుల్లో ఇద్దరికీ లేక ఒకరికి వృద్ధాప్యం వచ్చినప్పుడు వారికి సేవచేసి స్వర్గానికి పోనివాడు దైవకారుణ్యానికి దూరమవుగాక' అన్నారు. దానికీ నేను ఆమీన్ అన్నాను." (హాకిమ్, ఇబ్నెమాజ)

హజ్రత్ అబూహురైరా (రజి) కథనం: "స్వర్గం వద్దనుకున్నవారు తప్ప నా అనుచర సముదాయంలోని ప్రతిఒక్కరూ స్వర్గంలో ప్రవేశిస్తారు" అన్నారు దైవప్రవక్త (స). ఒకతను ఈమాట విని "దైవప్రవక్తా! స్వర్గం వద్దనేవాడు కూడా ఉంటాడా?" అని అడిగాడు. దానికి దైవప్రవక్త (స) "నాకు విధేయత చూపినవాడు స్వర్గానికి పోతాడు. నన్ను ధిక్కరించినవాడే స్వర్గంలో ప్రవేశించడానికి నిరాకరించినవాడు" అని చెప్పారు. (బుఖారీ)

ఒక రోజు దైవప్రవక్త (స) ఉజూ చేస్తుంటే ఆయన అనుచరులు కొందరు ఆయన ఉజూ చేసిన నీళ్ళతో తమ ముఖాలను తడుపుకోసాగారు. అప్పుడు దైవప్రవక్త (స) "ఈ పనికి మిమ్మల్ని ఏ విషయం ప్రేరేపించింది?" అనడిగారు. దానికి వారు "దేవుని పట్ల, ఆయన ప్రవక్తపట్ల అభిమానం" అన్నారు. ఆయన ఈమాట విని "దేవుడ్ని, దైవప్రవక్తను అభిమానిస్తున్నామని సంతోషించేవారు మాట్లాడితే నిజం మాట్లాడాలి; భద్రపరచమని

ఏదైనా వస్తువు తమకు అప్పగిస్తే దాన్నివారు నిజాయితీగా దాని యజమానికి తిరిగిఅప్పగించాలి; ఇరుగుపొరుగువారి పట్ల మంచిగా ప్రవర్తించాలి" అని అన్నారు. (బుఖారి)

ఒకతను "దైవప్రవక్తా, దైవసాక్షి! నేను మిమ్మల్ని అభిమానిస్తున్నాను" అన్నాడు. దానికాయన "నువ్వేం మాట్లాడుతున్నావో ఆలోచించుకో" అన్నారు. అతను మళ్ళీ "దైవ సాక్షి! నేను మిమ్మల్ని నిజంగానే అభిమానిస్తున్నాను" అన్నాడు. మూడుసార్లు ఇదేమాట అన్నాడు. అప్పుడు దైవప్రవక్త(స) "అయితే పేదరికం కోసం చాపను సిద్ధంగా ఉంచుకో, నన్ను అభిమానించేవాడి వైపు పేదరికం వరదలా ముంచుకొస్తుంది" అన్నారు. (తిర్మిజీ)

దైవప్రవక్త (స) హితోక్తి: "నాకు పూర్వం ఏ ప్రవక్తకూ ఇవ్వని అయిదు ప్రత్యేకతలు నాకివ్వబడ్డాయి. 1-ఇతర ప్రవక్తలందరూ తమతమ జాతుల కోసం ప్రత్యేకించబడగా, నేను యావత్తు మానవాళి కోసం ప్రవక్తగా పంపబడ్డాను. 2-నాకోసం సమరసొత్తు (మాలె గనీమత్)ను వాడుకోవడం ధర్మసమ్మతం చేయబడింది. నాకు పూర్వం ఏ పవక్తకూ ధర్మ సమ్మతం చేయబడలేదు. 3-నాకోసం యావత్తు భూమండలం ప్రార్థనా స్థలంగా, పరిశుద్ధ పరిచే వస్తువుగా చేయబడింది. 4-నా గాంభీర్యానికి శత్రువులు ఒక నెల ప్రయాణపు దూరంనుండే భయపడిపోయేలా దేవుడు నాకు సహాయంచేస్తున్నాడు. 5-నాకు (పరలోక తీర్పుదినాన సాధారణ) సిఫారసు చేసే అధికారం ఇవ్వబడింది." (ముస్లిం, బుఖారి)

## చిట్టచివరి దైవప్రవక్త

ముహమ్మద్(స) మీ పురుషుల్లో ఎవరికీ తండ్రి కాదు. ఆయన దేవుని సందేశహరుడు. దైవదౌత్య పరంపరను అంతమొందించిన అంతిమ దైవప్రవక్త. (ఖుర్ఆన్–33:40)

ఆదిమానవుడు ఆదం (అలై) నుండి ముహమ్మద్ (స) వరకు లక్షా ఇరవై నాలుగు వేల మంది దైవప్రవక్తలు వచ్చినట్లు హదీసులు చెబుతున్నాయి. వారిలో ముహమ్మద్ (స) చిట్టచివరి ప్రవక్త. ఈ విషయాన్ని ఆయన పలుసందర్భాలలో తెలియజేశారు:

" "దైవదౌత్య పరంపర ముగిసిపోయింది. నా తరువాత ఇక ఏ దైవప్రవక్తగాని, సందేశహరుడుగాని రాడు." (తిర్మిజి, ముస్నద్ అహ్మద్)

" "ఇంతకు పూర్వం దైవప్రవక్తలు ఏదోఒక ప్రత్యేకజాతి కోసం పంపబడేవారు. అయితే నేనిప్పుడు యావత్తు మానవాళి కోసం పంపబడ్డాను." (బుఖారి)

" "నేను అంతిమ దైవప్రవక్తను. నా తరువాత మరే ప్రవక్తా లేడు. అయితే నా అనుచర సముదాయం (ఉమ్మత్)లో ముప్ఫయి మంది అసత్యవాదులు పుడ్తారు. వారిలో ప్రతిఒక్కడూ తాను దైవప్రవక్తనని ప్రకటించుకుంటాడు." (అబూదావూద్)

" "ఇస్రాయీల్ సంతతివారికి దైవప్రవక్తలు నాయకత్వం వహించేవారు. ఒక ప్రవక్త చనిపోగానే రెండవప్రవక్త అతనికి వారసుడవుతాడు. కాని నా తరువాత మరెవరూ దైవప్రవక్తలు ఉండరు. ఖలీఫాలు మాత్రమే ఉంటారు." (బుఖారి)

" "నాకు, గత ప్రవక్తలకు సంబంధించిన ఉదాహరణ ఇలా ఉంది: ఒకతను ఓ అందమైన భవనం నిర్మించాడు. అయితే దాని ఓమూలలో ఒకఇటుక పట్టేంత ఖాళీ



చోటు వదలిపెట్టాడు. ప్రజలు ఆ భవనం చుట్టూ తిరిగిచూస్తూ దాని (నిర్మాణం), అంద చందాల పట్ల ఆశ్చర్యపోయారు. కాని (ఖాళీచోటు చూసి) 'ఇక్కడ ఇటుక పెట్టలేదు, ఎందుకో!' అన్నారు. వినండి, ఆ ఇటుకను నేనే. నేనే అంతిమ దైవప్రక్తను." (బుఖారి)

" "ఎవరి చేతిలో ముహమ్మద్ ప్రాణముందో ఆ శక్తిస్వరూపుని సాక్షి! ఈ యుగం ప్రజల్లో యూదుడైనా, క్రైస్తవుడైనా, మరెవడైనా సరే నాగురించి విని, నేను తెచ్చినదాన్ని (ఇస్లాంను) విశ్వసించకుండా మరణిస్తే అతను నరకవాసుల్లో చేరిపోతాడు." (ముస్లిం)

" "నాకు, ఆయన(ఈసా)కు మధ్య ఏప్రవక్తా లేడు. ఆయన (నింగి నుండి నేల మీదికి నేరుగా) అవతరిస్తారు. కనుక మీరు ఆయన్ని చూస్తే గుర్తించాలి. ఆయన మధ్య రకం ఎత్తు మనిషి. ఎరుపు తెలుపు కలసిన రంగు ఆయనది. రెండు పసుపుపచ్చ వస్త్రాలు ధరించిఉంటారు. ఆయన శిరోజాలు తడవకపోయినా నీటి బిందువులు రాలు తున్నట్లుంటాయి. ఆయన ఇస్లాంకోసం జనంతో యుద్ధం చేస్తారు. సిలువను ముక్కలు ముక్కలుగా విరగ్గొడ్తారు. సూకరసంహారం చేస్తారు. జిజియా (రక్షణరుసుం) వసూలును అంతమొందిస్తారు. ఆయన కాలంలో దేవుడు ఇస్లామీయ సమాజం తప్ప మిగిలిన సమాజాలన్నిటిని నిర్మూలిస్తాడు. ఆయన మసీహ్ దజ్జాల్ (యూదుల హీరో)ను హత మారుస్తారు. ప్రపంచంలో నలభై యేళ్ళు జీవిస్తారు. ఆ తర్వాత చనిపోతారు. ముస్లింలు ఆయన కోసం జనాజానమాజ్ చేస్తారు." (అహ్మద్, అబూదావూద్)

దైవప్రవక్తల విషయంలో కొందరు హద్దుమీరిన అభిమానానికి పోయి, అందరికంటే తమప్రవక్త గొప్ప, తమప్రవక్త గొప్పని చెప్పుకుంటారు. మహాప్రవక్త(స) దీన్ని ఖండించారు. పునరుత్థాన దినాన ఆయన నేల (సమాధి) నుండి బయటికి వచ్చి చూస్తే మూసా ప్రవక్త (అలై) దైవసింహాసనం కాలు పట్టుకొని ఉండటం కన్పిస్తుంది. దాన్ని ప్రస్తావిస్తూ "మీరు ప్రవక్తలలో ఒకరిపై మరొకరికి ప్రాధాన్యం ఇవ్వకండి" అన్నారు సహచరులతో. (బుఖారి)

దైవప్రవక్తలను, మహనీయుల్ని వారి నిష్క్రమణ తర్వాత ప్రజలు హద్దుమీరిన ప్రశంస లతో ఆకాశానికి ఎత్తడం, వారికి లేనిపోని శక్తులు ఆపాదించడం, చివరికి వారిని దేవుని స్థాయికి చేర్చడం అనాది నుంచి వస్తున్న అజ్ఞానచర్యలు. ఈనాడు కొందరు ముస్లింలక్కూడా ఈవ్యాధి అంటుకుంది. వారు ముహమ్మద్ ప్రవక్త (స)ను దాదాపు దేవుని స్థాయికి చేర్చారు. దేవునికి లాగే ఆయనకూ అగోచర జ్ఞానం ఉందని, ఆయనసలు మానవ జాతికి చెందినవారే కాదని వాదిస్తున్నారు. అలాంటివారు ఖుర్ఆన్‌లోని ఈ సూక్తుల్ని గురించి ఆలోచించాలి:

"యావత్తు భూమ్యాకాశాల్లో దేవుడు తప్ప మరెవరూ అగోచర జ్ఞానం (అతీంద్రియ జ్ఞానం) కలవారు లేరు." (27:65)

"ముహమ్మద్ (స) వారితో ఇలా అను:– నా దగ్గర దేవుని నిక్షేపాలు ఉన్నాయని గాని, నేను అగోచరజ్ఞానం కలవాడిననిగాని నేను మీతో అనడం లేదు. నేను దైవదూత నని కూడా చెప్పుకోవడం లేదు." (6:50)

"ప్రవక్తా! చెప్పు:– నేను మీలాంటి మానవుడ్నే. కాకపోతే మీ ఆరాధ్య దేవుడు ఒక్కడే అని నాకు దివ్యావిష్కృతి (వహీ) ద్వారా తెలియజేయబడుతోంది." (18:110)

ప్రవక్త సతీమణి హజ్రత్ ఆయిషా (రజి) ఇలా ఉల్లేఖిస్తున్నారు: "దైవప్రవక్త (స)కు రేపటి రోజు సంభవించే విషయాలు తెలుసని ఎవరైనా భావిస్తే, అతను దేవుని మీద పెద్ద అభాండం వేస్తున్నాడన్నమాట. యావత్తు భూమ్యాకాశాల్లో అతీంద్రియ జ్ఞానం దేవునికి మాత్రమే ఉందని దేవుడే తెలియజేస్తున్నాడు." (సహీముస్లిం)

దైవప్రవక్త (స) ఓసారి రైతులతో "మీరు తోటలో అంటుకట్టడం వదిలేస్తే మంచి దేమో చూడండి" అన్నారు. దాంతో వారు అంటుకట్టడం మానేశారు. దానివల్ల ఆయేడు ఫలసాయం తగ్గిపోయింది. అప్పుడు దైవప్రవక్త (స) "నేను మానవుడ్ని మాత్రమే. అంచేత నేను ధర్మవ్యవహారాలలో ఏదైనా ఆజ్ఞాపిస్తే దాన్ని పాటించండి. (ఇతర వ్యవహారాల్లో) నా సొంత అభిప్రాయంతో ఏదైనా చెబితే, (అందులో పొరపాటుండవచ్చు) నేను మానవుడ్ని మాత్రమే" అన్నారు. (ముస్లిం)

ఖుర్ఆన్ అవగాహనకు, దాని స్పిరిట్‌కు వ్యతిరేకంగా ఉండే ఏ విషయమైనా, హదీస్ అని చెప్పబడే విషయమైనా సరే ఆచరణ కోసం దాన్ని స్వీకరించడం సరైన పద్ధతి కాదు.

దైవప్రవక్త (స) ప్రవచనం: "ఎవరైనా ఒక చెడ్డ సంప్రదాయం ప్రవేశపెడితే అతనికి దాని పాపంతో పాటు, ఆ సంప్రదాయాన్ని ప్రళయం దాకా ఎవరెవరు అవలంబిస్తారో వారందరి పాపాలు కూడా ఆ వ్యక్తికి చుట్టుకుంటాయి." (ముస్లిం)

దైవప్రవక్త (స) ప్రవచనం: "నామీద అబద్ధాలు ఆపాదించడం సాధారణ మానవుల మీద అబద్ధాలు ఆపాదించడం లాంటిది కాదు. ఎవరైనా నామీద అబద్ధం ఆపాదిస్తే అతనిక తన నివాసం నరకంలో నిర్మించుకున్నట్లే." (బుఖారి, ముస్లిం)

## 3. శ్రేష్ఠమైన పుణ్యకార్యాలు

"మీ ముఖాలు తూర్పు లేక పడమరకు తిప్పుకోవడమే పుణ్యకార్యంకాదు. దేవుడ్ని, అంతిమదినాన్ని, దైవదూతలను, దేవుడు పంపిన (అంతిమ)గ్రంథాన్ని, ఆయన ప్రవక్తలను హృదయపూర్వకంగా విశ్వసించి, దేవుని మీది ప్రేమాభిమానాలతో మీకత్యంత ప్రియమైన ధనాన్ని బంధువుల కోసం, అనాథల కోసం, నిరుపేదల కోసం, బాటసారుల కోసం, సహాయార్థుల కోసం, బానిసల విముక్తి కోసం ఖర్చుచేయాలి; ప్రార్థనావ్యవస్థ నెలకొల్పాలి; జకాత్ చెల్లించాలి; ఇచ్చినమాట నిలబెట్టుకోవాలి; కష్టకాలంలో, (సత్యాసత్యాల మధ్య జరిగే) పోరాటంలో సహనం వహించాలి. ఇలాంటి సత్కార్యాలు చేసేవారే సన్మార్గగాములు. వారే (దేవుని పట్ల) భయభక్తులు కలిగినవారు." (ఖుర్ఆన్-2:177)

హదీసుల్లో పేర్కొన్న శ్రేష్ఠమైన పుణ్యకార్యాల్లో మానవ సంబంధాలకు ఎక్కువ ప్రాముఖ్య మిచ్చినట్లు గోచరిస్తోంది. మనిషిలో మానవత్వాన్ని సృష్టించడానికి ఇవెంతో అవసరం కూడా.

హజ్రత్ అబ్దుల్లా బిన్ అమ్ర్ (రజి) కథనం: ఒక వ్యక్తి దైవప్రవక్త (స) సన్నిధికి వచ్చి "ఇస్లాంకు సంబంధించిన ఆచరణలలో అన్నిటికన్నా శ్రేష్ఠమైన ఆచరణ ఏది?" అని అడిగాడు. దానికి దైవప్రవక్త (స) "నీవు అతిథికి, ఆకలిగొన్నవాడికి అన్నం పెట్టు. అలాగే పరిచయం ఉన్నా లేకపోయినా ప్రతి మనిషికీ సలాం చెయ్యి. ఇవే అన్నిటికన్నా శ్రేష్ఠమైన ఆచరణలు (కర్మలు)" అని బోధించారు. (ముస్లిం)



ఓసారి ప్రవక్త అనుచరులు "దైవప్రవక్తా! అందరిలో ఎవరి ఇస్లాం శ్రేష్ఠమైనద"ని అడిగారు. దానికి దైవప్రవక్త(స) "మాటల ద్వారాగాని, చేతల ద్వారాగాని తోటిముస్లింకు బాధ కలిగించనివాడి (ధర్మం ఎక్కువ శ్రేష్ఠమైన)ది" అన్నారు. (బుఖారి, ముస్లిం)

హజ్రత్ అబూహురైరా (రజి) కథనం: ఒకతను దైవప్రవక్త (స) సన్నిధికి వచ్చి "అన్నిటికంటే శ్రేష్ఠమైన ఆచరణ ఏది?" అని అడిగాడు. దానికి దైవప్రవక్త (స) "దేవుడ్ని, ఆయన ప్రవక్తను విశ్వసించడం" అని చెప్పారు. "ఆ తర్వాత శ్రేష్ఠమైన ఆచరణ ఏది?" అని అడిగాడతను. "దైవమార్గంలో పోరాడటం" అన్నారు దైవప్రవక్త (స). "ఆ తరువాత శ్రేష్ఠమైన ఆచరణ ఏదీ?" మళ్ళీ అడిగాడతను. "చిత్తశుద్ధితో చేసే హజ్ (కాబాయాత్ర)" అని సమాధానమిచ్చారు దైవప్రవక్త (స). (బుఖారి, ముస్లిం)

హజ్రత్ అబూజర్ (రజి) కథనం: నేను దైవప్రవక్త (స)ను "అన్నిటికంటే శ్రేష్ఠమైన ఆచరణ ఏది?" అని అడిగాను. దానికి దైవప్రవక్త (స) "దేవుడ్ని విశ్వసించి, ఆయన మార్గంలో పోరాడటం" అన్నారు. "బానిసకు స్వేచ్ఛనివ్వడం కూడా శ్రేష్ఠమైన ఆచరణేనా" అని అడిగాను నేను. "విలువను బట్టి ఎక్కువ ధరకు అమ్ముడు పోవడంతో పాటు, యజమానికి అందరికన్నా ఇష్టమైన బానిసకు స్వేచ్ఛ ప్రసాదించాలి" అన్నారు దైవప్రవక్త (స). "ఒకవేళ నేనీ పని చేయలేని పరిస్థితిలో ఉంటే?" అనడిగాను. "అప్పుడు ఏదైనా పని చేసేవాడికి ఆ పనిలో సహాయపడు లేదా పనిచేయడం రానివాడికి పని చేసిపెట్టు" అని చెప్పారు దైవప్రవక్త (స). "మరి ఈపని కూడా చేయలేని పరిస్థితిలో ఉంటే మరేం చేయాలి?" అనడిగాను మళ్ళీ. "అయితే ప్రజల్ని ఎలాంటి కష్టనష్టాలకు గురిచేయకు. ఇది కూడా నీ పాలిట ఒక విధమైన దానమే" అన్నారు ఆయన. (బుఖారి)

హజ్రత్ అబూహురైరా (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ఇలా తెలిపారు: "నీతినడవడి కల్లో శ్రేష్ఠుడైన వాడే విశ్వాసుల్లో పరిపూర్ణ విశ్వాసి అవుతాడు." (మిష్కాత్)

హజ్రత్ అబూఉమామా (రజి) కథనం: ఒకతను దైవప్రవక్త(స)ను "విశ్వాసం అంటే ఏమిట"ని అడిగాడు. దానికి దైవప్రవక్త (స) "నీకు సత్కార్యంవల్ల సంతోషం, దుష్కార్యం వల్ల దుఃఖం కలిగితే నీవు (నిజమైన) విశ్వాసి అవుతావు" అని అన్నారు. ఆ వ్యక్తి మళ్ళీ "దైవప్రవక్తా! పాపం అని దేన్నంటారు?" అని ప్రశ్నించాడు. దానికి ఆయన "ఏ పని విష యంలో నీ మనసుకు బాధ కలుగుతుందో దాన్ని మానెయ్యి" అన్నారు. (మిష్కాత్)

హజ్రత్ అబ్దుల్లా బిన్ మస్వూద్ (రజి) కథనం: నేను దైవప్రవక్త (స)ను "దేవునికి అన్నిటికంటే ఎక్కువ ప్రియమైన ఆచరణ ఏదీ?" అని అడిగాను. దానికి దైవప్రవక్త (స) "వేళకు నమాజ్ చేయడం" అని చెప్పారు. ఆతర్వాత ఏది?" అనడిగాను. "తల్లిదండ్రుల పట్ల సత్ప్రవర్తనతో మసలుకోవడం" అన్నారాయన. "ఆ తర్వాత ఏదీ?" అని అడిగాను. "దైవమార్గంలో పోరాడటం" అన్నారాయన. ఆ తర్వాత నేను, దైవప్రవక్త (స)ను విసిగించడం భావ్యం కాదని తలచి మరిన్ని ప్రశ్నలు అడగటం మానేశాను. (ముస్లిం)

ఈ హదీసులో నమాజ్‌కు ప్రప్రథమ స్థానం ఇవ్వబడింది. దానికి కారణం నమాజ్ మనిషిని చెడ్డపనుల నుండి అడ్డుకుంటుందని ఖుర్ఆన్ పేర్కొనడమే.

"నిస్సందేహంగా నమాజ్ (మనిషిని) చెడులు, అశ్లీల చేష్టల జోలికి పోకుండా నిరోధిస్తుంది." (ఖుర్ఆన్-29:45)

నమాజ్‌లో మనం ఖుర్ఆన్ పఠిస్తాం. ఖుర్ఆన్‌లో నీతినియామాలు, సఖ్యతాసమైక్యతలు, దయాదాక్షిణ్యాలు, దానధర్మాలు, మానవహక్కులు మొదలైన సత్కార్యాలతో పాటు, వాటిని ఆచరించడం వల్ల లభించే ప్రయోజనాలు, ఆచరించకపోవడం వల్ల కలిగే నష్టాలను గురించి అనేక విషయాలు ఉన్నాయి. వాటిని మాటిమాటికి పఠించడం వల్ల మనిషి దుష్కార్యాలకు దూరంగా సదా సత్కార్యాలు చేస్తుంటాడు. ప్రతి విషయంలోనూ దేవునికి భయపడుతూ ఆయన ఆజ్ఞల్ని, దైవప్రవక్త (స) బోధనలను మాత్రమే పాటిస్తూ సాత్విక జీవితం గడుపుతాడు.

అయితే నమాజులో పఠించే ఖుర్ఆన్ సూక్తులు అర్థం చేసుకున్నప్పుడే నమాజ్ మనల్ని చెడుల జోలికి పోకుండా నిరోధిస్తుంది. ఖుర్ఆన్‌భాష అర్థంకానప్పుడు వేరే సమయంలో దాని అనువాదాన్ని మనకు తెలిసిన భాషలోనైనా చదువుకోవాలి. ఇలా ఒక విషయాన్ని మాటిమాటికి చదవడంవల్ల అది మనల్ని ఆచరణ వైపు ప్రేరేపిస్తుందని ఆశించగలం.

# 4. ఘోరమైన పాపకార్యాలు

అన్నిటికంటే ఘోరమైన పాపకార్యం ఏదైనా ఉందంటే అది దేవునికి సాటి కల్పించడమే. దీన్నే "షిర్క్" అంటారు. ఖుర్ఆన్, హదీసుల్లో విధిగా చేయబడిన ఏ ఆజ్ఞకు వ్యతిరేకంగా నడచుకున్నా అది షిర్క్ కిందికే వస్తుంది. ఒక ముస్లిం దైవాజ్ఞకు వ్యతిరేకంగా నడచుకున్నాడంటే అతను ఏదోఒక మిథ్యాదైవం ఇచ్చిన ఆజ్ఞను పాటించాడని అర్థం. మిథ్యాదైవాల ఆజ్ఞల్ని పాటించడం మిథ్యాదైవాలఆరాధన కిందికి వస్తుంది.

ఖుర్ఆన్ ప్రకారం మిథ్యాదైవాల్లో మొట్టమొదటి మిథ్యాదైవం షైతానే (36:60-62, 2:208-209, 36:59-64 సూక్తులు చూడండి). ఆ తర్వాత మానవులు, జిన్నులు, ఇతర ప్రాణులు, ప్రకృతిశక్తులు, విగ్రహాలు, చిత్రాలు మిథ్యాదైవాల కిందికి వస్తాయి. (25:17-19 సూక్తులు చూడండి). ఇలా ఏ దైవేతర శక్తుల్ని ఆరాధించినా అది "షిర్క్" కిందికి వస్తుంది. చివరకు మనిషి తన మనోవాంఛలకు బానిసై నడచుకోవడం కూడా షిర్క్ కిందికే వస్తుంది. షిర్క్ చేస్తున్న స్థితిలో చనిపోయే మనిషిని దేవుడు క్షమించడు.

"దేవుడు తనకు సాటి కల్పించడాన్ని (షిర్క్‌ను) ఎట్టి పరిస్థితిలోనూ క్షమించడు. అది తప్ప ఇతర పాపాలను ఆయన తలచుకుంటే క్షమిస్తాడు. దేవునికి సాటి కల్పించడమంటే ఘోరమైన పాపం మూట కట్టుకున్నట్లే." (ఖుర్ఆన్-4:48)

హజ్రత్ అబ్దుల్లా బిన్ మస్వూద్ (రజి) కథనం: "దేవునికి సాటి కల్పించే (బహుదైవారాధన చేసే) స్థితిలో చనిపోయే మనిషి నరకానికి పోతాడ"ని దైవప్రవక్త (స) తెలియజేశారు. నేను "దేవునికి సాటికల్పించని (ఏకదైవారాధన చేసే) స్థితిలో మరణించే మనిషి స్వర్గానికి పోతాడ"ని అంటాను. (బుఖారి)

దైవప్రవక్త (స) దేవుడు చెప్పిన మాటలను ఇలా పేర్కొన్నారు: "మానవుడు కాలాన్ని తెగుడుతూ (నిజానికి) నన్ను వేధిస్తున్నాడు. ఆ కాలానికి యజమానిని నేనే. కాలం తనంతటతాను ఏం చేయగలదు? ప్రతిపనీ నా చేతిలోనే ఉంది. నేనే రేయింబవళ్ళను ఒక దాని తరువాత ఒకటి మాటిమాటికి తీసుకొస్తున్నాను." (బుఖారి)



## అంధానుకరణ

పాపాలకు దూరంగా ఉండాలంటే ఇస్లాంకు మూలాధారాలయిన ఖుర్ఆన్, హదీసుల్ని తరచుగా అధ్యయనం చేస్తుండాలి. ఖుర్ఆన్, హదీసుల్లో ఏమున్నాయో తెలుసుకోకుండా ధర్మం విషయంలో స్వార్థపరులు, ప్రాపంచిక వ్యామోహపరులు చెప్పే మాటలు వింటే, లేదా కళ్ళుమూసుకొని తాతముత్తాతల ఆచారాలనే పట్టుకు వేలాడితే 'షిర్క్'రొచ్చులో పడే ప్రమాదం ఉంటుంది. ఇలాంటి అంధానుకరణ గురించి ఖుర్ఆన్ ఇలా పేర్కొంటున్నది:

"దేవుడు అవతరింపజేసినదాని వైపుకు, దైవప్రవక్త వైపుకు రండని చెబితే, "మా తాత ముత్తాతల నుండి వస్తున్న ఆచారాలే మాకు చాలు" అంటారు వారు. మరి వీరి తాత ముత్తాతలు ఏమీ ఎరగకపోయినా, వారికి సన్మార్గం ఏమిటో తెలియకపోయినా వీరు తమ తాతముత్తాతలనే గుడ్డిగా అనుసరిస్తారా?" (ఖుర్ఆన్-5:104)

"దేవుడు అవతరింపజేసినదాన్ని అనుసరించండని అంటే 'కాదు, మా తాత ముత్తాతలు అనుసరించినదాన్నే అనుసరిస్తాం' అంటారు వారు. వారి తాత ముత్తాతలు తెలివిహీనులయినా, సన్మార్గంలో లేకపోయినా (వారినే వీరు గుడ్డిగా అనుసరిస్తారా)? కాపరి పిలుపు తప్ప మరే పిలుపూ వినలేని పశువుల్లా వుంది (ఈ) తిరస్కారుల ధోరణి. వారు (సత్యం వినలేని) బధిరులు, (సత్యం పలకలేని) మూగలు, (సత్యం కానలేని) అంధులు. అందువల్ల వారికిక ఏ విషయమూ తలకెక్కదు." (ఖుర్ఆన్-2:170,171)

అనుకరణ సహజ విషయమే. కాని అంధానుకరణ మానవునిలోని ఓ పెద్ద బలహీనత. తాతముత్తాతల ఆచారాలు, సంప్రదాయాలు సమంజసమైనంత వరకు వాటిని పాటించవచ్చు. కాని సమంజసం కాకపోతేనే చిక్కు. వాటిని పాటించడంవల్ల ప్రపంచంలోనేగాక, పరలోకంలోనూ నష్టదాయకమే. ఈనాటి ముస్లింలలో అనేకమంది అమాయకులు, అజ్ఞానులు ధర్మశాస్త్రంలో లేని ఆచారాలు ఎన్నెన్నో కల్పించుకున్నారు. తాము కల్పించుకున్న ఈ ఆచారలకు ఖుర్ఆన్, హదీసుల్లో ఏమైనా ఆధారాలున్నాయా అని ఆలోచించరు. సరైన దైవ జ్ఞానం కలవారు ఎవరైనా "ఇలాంటి ఆధారంలేని ఆచారాలు పాటించడం మీకు తగదు, దైవక్రోధానికి గురికావలసివస్తుంద"ని అంటే..."ఓ యబ్బో! మీరేదో ఈరోజు కొత్తగా చెబుతున్నారుగాని, ఇవి మా పూర్వీకుల నుండి వస్తున్న ఆచారాలే. వీటిలో తప్పులేదు. వీటినే మేము అంటిపెట్టుకొని ఉంటాం" అంటారు.

## మతగురువుల ఆరాధన

మనిషి ఆరాధించే మిథ్యాదైవాలలో మతగురువులు, బాబాల పాత్ర కూడా తక్కువేమీ కాదు. వీరు తమ భక్తులకు స్వర్గానికి చేరుకునేందుకు దగ్గరి దారి చూపుతారు. ధర్మజ్ఞానంలేని అజ్ఞానులు, అమాయకులు, తాంత్రికవిద్యలకు ప్రభావితులయ్యేవారు, మతం ద్వారా ప్రాపంచిక ప్రయోజనాలు ఆశించేవారు, ధర్మశాస్త్రం ఆజ్ఞల్ని పాటించడానికి బద్ధకించేవారు ఎల్లప్పుడూ 'షార్ట్‌కట్' మార్గాలనే వెతుకుతారు. అలాంటి దగ్గరి దారులను వారికి స్వార్థపరులైన మత గురువులు, బాబాలు చూపిస్తారు. దైవాజ్ఞలకు వ్యతిరేకంగా అలాంటి మత గురువుల్ని, స్వాముల్ని, బాబాలను విధేయించడం కూడా "షిర్క్" (బహుదైవారాధన) క్రిందికే వస్తుంది.

మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) ఇలా తెలిపారు: "మీలో ఎవరూ (కర్మవిచారణ విషయమై) దేవునితో ప్రత్యక్షంగా మాట్లాడని వారుండరు. దాసునికి, అతని ప్రభువుకు

మధ్య ఎలాంటి మాధ్యమంగాని, తెరగాని ఉండదు. అప్పుడు దాసుడు తన కుడివైపు చూస్తాడు. అక్కడ అతనికి తనకర్మలు తప్ప మరేమీ కన్పించదు. అతను తన ఎడమవైపు చూస్తాడు. అక్కడ ఇంతకుముందు చేసుకొని పంపుకున్న కర్మలు కన్పిస్తాయి. దాసుడు తన ముందు చూసుకుంటాడు. ఎదురుగా నరకం కన్పిస్తుంది. కనుక మీ దగ్గర ఒక ఖర్జూరపు ముక్క ఉన్నా సరే, దాన్ని (దైవప్రసన్నత కోసం) దానంచేసి నరకం నుండి మిమ్మల్ని మీరు కాపాడుకోండి." (బుఖారి, ముస్లిం)

"వారు నిజదేవుడ్ని వదలి తమ ధర్మవేత్తలు, సాధువులను దేవుళ్ళుగా, ప్రభువులుగా చేసుకున్నారు. అలాగే మర్యం కుమారుడు మసీహ్‌ని కూడా. కాని ఏకైక దేవుడ్ని తప్ప మరెవరినీ ఆరాధించకూడదని వారికాజ్ఞ ఇవ్వబడింది. ఆయన తప్ప మరెవరూ ఆరాధనకు, దాస్యానికి అర్హులు కారు. వారు కల్పించుకున్న బహుదైవారాధనా భావాలకు, పలుకులకు ఆయన ఎంతో అతీతుడు, పవిత్రుడు." (ఖుర్‌ఆన్-9:31)

పూర్వం క్రైస్తవమతంలో ఉండి ఆ తరువాత ఇస్లాం స్వీకరించిన హజ్రత్ అదీ బిన్ హాతిం (రజి) దైవప్రవక్త (సల్లం) ముందు ఈ సూక్తిని ప్రస్తావిస్తూ "ఈ సూక్తిలో మేము మా ధర్మవేత్తలను, సాధువులను దేవుళ్ళుగా చేసుకున్నామనే అభియోగం మా మీద మోపబడింది. (కాని మేము మా ధర్మవేత్తల్ని, సాధువుల్ని ఆరాధించడం లేదే! మరి దీని గూఢార్థం ఏమిటీ?)" అని అడిగారు. దానికి దైవప్రవక్త (స) ఇలా అన్నారు. "వారు నిషేధించిన వాటిని మీరు నిషేధితాలుగా, వారు ధర్మసమ్మతం (హలాల్) చేసినవాటిని మీరు ధర్మసమ్మతమైనవిగా ఒప్పుకోవడం లేదా?" అది విని హజ్రత్ అదీ (రజి) "నిజమే, మేము అలాగే చేస్తున్నాం" అన్నారు. అప్పుడు దైవప్రవక్త (స) "వారిని దేవుళ్ళుగా, ప్రభువులుగా ఆరాధించడమంటే ఇదే" అన్నారు. (ఇబ్నెకసీర్)

దీన్నిబట్టి ఎవరైనా దైవగ్రంథంలో ఎలాంటి ప్రమాణం లేకపోయినా" ఇది ధర్మం, అది అధర్మం" అని హద్దులు నిర్ణయిస్తే వారు దేవుని స్థానంలో దేవుళ్ళయి కూర్చున్నారన్న మాట. వారి ఆజ్ఞల్ని ధర్మశాస్త్రం ఆజ్ఞలుగా పరిగణించి పాటించేవారు నిజానికి వారిని దేవుళ్ళుగా ఆరాధిస్తున్నారన్నమాట. చనిపోయిన మహనీయుల్ని, దైవప్రియుల్ని ఆరాధించడం, వారిని కష్టాలు కడతేర్చేవారిగా భావించి వేడుకోవడం కూడా మిథ్యాదైవాల ఆరాధన కిందికే వస్తుంది.

## సమాధులు, స్మారకచిహ్నాలు

సమాధులు, విగ్రహాల ఆరాధన గురించి ఖుర్‌ఆన్‌లో 7:191-193 సూక్తులు చూడండి. బహుదైవారాధకులు చనిపోయిన మహనీయుల సమాధులను, స్మారకచిహ్నాలను ఆరాధించడం, అక్కడ మొక్కుబడులు చెల్లించుకోవడం అందరికీ తెలిసిందే. కాని మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) దివంగతులైన కొన్నేళ్ళకు ఈవ్యాధి ముస్లింలకు కూడా సోకింది. కనుక ఈ సందర్భంగా ఆ మహనీయుని మహితోక్తులు కాస్త మననం చేసుకుందాం.

"సమాధుల్ని సందర్శించే స్త్రీలను, సమాధులపై ఆరాధనాలయాలు నిర్మించే వారిని, అక్కడ దీపాలంకరణ చేసేవారిని దేవుడు శపించాడు." (తిర్మిజి, అబూదావూద్)

"జాగ్రత్త! మీకుపూర్వం గతించిన ప్రజలు తమ ప్రవక్తల సమాధుల్ని ఆరాధనాలయాలుగా చేసుకునేవారు. ఈచర్య నుండి నేను మిమ్మల్ని వారిస్తున్నాను." (ముస్లిం)



"యూదులు, క్రైస్తవులు తమ ప్రవక్తల సమాధుల్ని ఆరాధనాలయాలుగా చేసుకున్నారు. అందువల్ల దేవుడు వారిని శపించాడు." (ముస్లిం, నసాయి)

"నా సమాధి దగ్గర జనం మాటిమాటికి సమావేశమయి దాన్ని పండుగ జరుపుకునే కేంద్రంగా చేయకండి. కాకపోతే నా శ్రేయస్సు కోసం దుఆ చేయండి. మీరు ఎక్కడున్నా మీ దుఆ నాకు చేరుతుంది." (అబూదావూద్)

"సమాధిని సున్నంతో (సిమెంటుతో) పటిష్ఠంగా చేయడాన్ని, దాని మీద కూర్చోవడాన్ని, దానిపై భవనం నిర్మించడాన్ని దైవప్రవక్త (స) నిషేధించారు." (ముస్లిం)

హజ్రత్ అయాజ్‌అసదీ, తనకు హజ్రత్ అలి (రజి) ఇలా తెలిపినట్లు ఉల్లేఖించారు: "దైవప్రవక్త (స) నన్ను పంపిన పని కోసం నేను నిన్ను పంపనా? ముస్లింల మధ్య విగ్రహం ఉంటే దాన్ని విరగ్గొట్టకుండా, ఎత్తయిన సమాధి ఉంటే దాన్ని నేలమట్టం చేయకుండా వదలకూడదు." (ముస్లిం)

'రెండవ శ్రేష్ఠ ఖలీఫా హజ్రత్ ఉమర్ (రజి) ఓసారి కాబా గోడలోని నల్లరాయిని సంబోధిస్తూ ఇలా అన్నారు: 'నీవు ఎలాంటి లాభంగాని, నష్టంగాని కలిగించలేని ఒక రాయివి మాత్రమే. దైవప్రవక్త (స) గనక నిన్ను ముద్దడటాన్ని చూసి ఉండకపోతే నేను నిన్ను ఎన్నిటికీ ముద్దాడను." (బుఖారి)

హజ్రత్ ఉమర్ (రజి) షిర్క్ ఛాయను కూడా సహించేవారు కాదు. దైవప్రవక్త (స) ఓసారి మక్కా పట్నం శివార్లలోని హుదైబియా ప్రాంతంలో ఒక చెట్టు క్రింద నిలబడి అనుచరుల్ని ధర్మపోరాటానికి (జిహాద్‌కు) ప్రేరేపిస్తూ వారి చేత శపథం చేయించారు. దైవప్రవక్త (స) కాలంలో ఆ చెట్టుకు అంతకుమించి మరెలాంటి ప్రాముఖ్యం లేదు. కాని ఆ తరువాత హజ్రత్ ఉమర్ (రజి) పాలనాకాలంలో ప్రజలు దాన్ని ఎంతో పవిత్రమైన శుభవృక్షంగా భావించి సందర్శనం కోసం దూరదూర ప్రాంతాల నుంచి కూడా రావడం ప్రారంభించారు.

హజ్రత్ ఉమర్ (రజి) ఈసంగతి విని ఆందోళన వెలిబుచ్చారు. భవిష్యత్తులో ఈ వ్యాధి ముదిరి 'షిర్క్'కు దారితీయవచ్చని భావించి వెంటనే ఆయన కొందరు మనుషుల్ని పంపి ఆ చెట్టును కూకటివేళ్ళతో సహా నరికివేయించారు.

మరొకసారి హజ్రత్ ఉమర్ (రజి) కాబాయాత్ర నుండి తోటి యాత్రికులతో కలసి మదీనా తిరిగివస్తుంటే దారిలో ఒకచోట ఓ మసీదు వచ్చింది. దాన్ని చూడగానే జనం ఎంతో ఉత్సాహంతో అక్కడ నమాజ్ చేయడానికి అటువైపు పరుగెత్తారు. ఆ మసీదులో దైవప్రవక్త (స) ఓసారి నమాజ్ చేశారు. అందువల్ల ప్రజలు దానికి ఎంతో ప్రాముఖ్యం ఇవ్వసాగారు. అయితే హజ్రత్ ఉమర్ (రజి)కు ఈ వైఖరి కూడా నచ్చలేదు. ఆయన వారి దగ్గరకెళ్ళి అన్నారు: "గ్రంథప్రజలు తమ ప్రవక్తల సమాధుల్ని, వారి స్మారకచిహ్నాలను ఆరాధనాలయాలుగా చేసుకున్నారు. కేవలం ఈ కారణంగానే వారు నాశనమయ్యారు. మీరు కూడా ఇలాంటి అవాంఛనీయ పనులకు పాల్పడి చేజేతులా నాశనం కొనితెచ్చుకోకండి." (హదీస్)

## బొమ్మలు, ఫొటోలు

“అతని కోసం ఆ భూతాలు కోరిన వస్తువు తయారుచేసేవి, ఆకాశహర్మ్యాలు, రకరకాల బొమ్మలు, కోనేరుల్లాంటి విశాలమైన కంచాలు, ఒకచోట స్థిరంగా ఉండే పెద్దపెద్ద వంటపాత్రలు వగైరా తయారు చేసేవి.” (ఖుర్ఆన్-34:13)

ఈ సూక్తిలో ‘తమాసీల్’ అనే పదం వచ్చింది. ఇది అన్ని రకాల చిత్రాలకు, విగ్రహాలకు వర్తిస్తుంది. అయితే ఇక్కడ ప్రాణంలేని వస్తువులకు సంబంధించిన చిత్రాలు, విగ్రహాలని అర్థం. ప్రాణుల చిత్రాలు, విగ్రహాలను మాత్రమే ఇస్లాం నిషేధించింది.

హజ్రత్ ఉమ్మెహబీబా, ఉమ్మెసలమా (రజి)లు అబిసీనియాలోని ఒక చర్చిని చూసి, అందులో బొమ్మలున్న విషయాన్ని దైవప్రవక్త (స) ముందు ప్రస్తావించారు. అప్పుడు దైవప్రవక్త (స) ఇలా అన్నారు: “వారిలో ఎవరైనా ఒక మహనీయుడు చని పోయిన తర్వాత వారు అతని సమాధిపై ప్రార్థనా మందిరం నిర్మిస్తారు. అందులో ఇలాంటి బొమ్మలు వేస్తారు. వీరు ప్రళయదినాన దేవుని దృష్టిలో అతి నీచమైన సృష్టితాలుగా పరిగణించబడతారు.” (బుఖారి, ముస్లిం)

హజ్రత్ ఆయిషా (రజి) కథనం: ఒకసారి దైవప్రవక్త (స) నా ఇంటికి వచ్చినప్పుడు. నేను చిత్రాలున్న ఒక తెర వ్రేలాడదీసి ఉంచాను. దాన్ని చూడగానే ఆయన ముఖంలో రంగుమారింది. వెంటనే ఆయన దాన్ని చించి “ప్రళయదినాన అతి కఠినశిక్ష విధించ బడేవారిలో దేవుని సృష్టికి ప్రతిసృష్టి చేసేవారూ ఉంటారు” అన్నారు. (బుఖారి, ముస్లిం)

హజ్రత్ ఇబ్నెఉమర్ (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: “ఈ బొమ్మలు తయారు చేసేవారు ప్రళయదినాన శిక్షించబడతారు. మీరు సృష్టించిన వాటిలో ప్రాణం పోయండని వారిని గద్దించటం జరుగుతుంది. (బుఖారీ, ముస్లిం)

హజ్రత్ ఇబ్నెఅబ్బాస్ (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ప్రవచనం: “ప్రతి చిత్రకారుడు నరకవాసియే. అతను గీసిన ప్రతి బొమ్మకు బదులు ఒక మనిషిని పుట్టించడం జరుగు తుంది. అతను నరకంలో ఆ చిత్రకారుణ్ణి శిక్షిస్తాడు.” (బుఖారీ, ముస్లిం)

హజ్రత్ అబూహురైరా (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ఇలా అన్నారు: “నేను సృష్టించినట్లు సృష్టించడానికి ప్రయత్నించేవారికంటే దుర్మార్గులు మరెవరుంటారు? వారికి (దమ్మంటే) ఒక అణువుని (లేక చీమను) సృష్టించాలి లేదా ఒక విత్తనం సృష్టిం చాలి లేదా ఒక బార్లీ (గింజ)ను సృష్టించాలి.” (బుఖారీ, ముస్లిం)

హజ్రత్ అబూతల్హా (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ప్రవచనం: “కుక్కలుగాని, బొమ్మలుగాని ఉండే ఇంట్లోకి దైవదూతలు ప్రవేశించరు.” (బుఖారీ, ముస్లిం)

హజ్రత్ ఇబ్నెఉమర్ (రజి) కథనం: “(ఒకసారి) జిబ్రయీల్ దూత దైవప్రవక్త (స)కు వస్తానని వాగ్దానం చేసి ఆలస్యం చేశారు. దైవప్రవక్త (స) ఆయన కోసం (ఎదురుచూస్తూ) చాలా ఇబ్బందిపడ్డారు. చివరికి తనే బయటికి వచ్చారు. అప్పుడాయనకు జిబ్రయీల్ కన్పించారు. ఆలస్యం ఎందుకయిందని అడిగితే ‘కుక్కలు, చిత్రాలు ఉండే ఇండ్లలోకి మేము రాము’ అని చెప్పారు జిబ్రయీల్ (అలైహి).” (బుఖారీ)



సయీద్ బిన్ హసన్ కథనం: నేను ఇబ్నెఅబ్బాస్ (రజి) దగ్గర కూర్చొని ఉంటే ఒకతను వచ్చి “అబూఅబ్బాస్! నేను నా స్వహస్తాలతో కష్టపడి సంపాదించే వృత్తిపరుడ్ని. బొమ్మలు తయారుచేయడం నా వృత్తి” అని అన్నాడు. అప్పుడు ఇబ్నెఅబ్బాస్ (రజి) ఇలా సమాధానమిచ్చారు: “నేను నీకు దైవప్రవక్త (స) నోట విన్న మాటనే చెబుతాను. నేను దైవప్రవక్త నోట ఈమాట విన్నాను- ‘బొమ్మలు తయారుచేసేవాడ్ని దేవుడు శిక్షిస్తాడు. అందులో ప్రాణం పోయనంతవరకు అతడ్ని వదలిపెట్టడు. కాని అతను ఎన్నటికీ అందులో ప్రాణం పోయలేడు.” ఈమాట విని ఆ వ్యక్తి తీవ్ర ఆందోళనచెందాడు. అతని ముఖం వాడి పాలిపోయింది. ఇబ్నెఅబ్బాస్ (రజి) అది చూసి “దైవదాసుడా! బొమ్మలు తయారుచేయడం తప్పనిసరయితే చెట్లబొమ్మలో లేదా ప్రాణంలేని మరే వస్తువుల బొమ్మలో తయారుచెయ్యి” అని చెప్పారు. (బుఖారి, ముస్లిం)

అయితే మరికొన్ని హదీసుల ద్వారా గోడలకు, ద్వారాలకు, ఇంకా ఇతరచోట్ల వ్రేలాడ దీసే బొమ్మలను మాత్రమే దైవప్రవక్త (సల్లం) నిషేధించినట్లు తెలుస్తోంది. దైవధర్మం నుండి దృష్టి మళ్ళించి ఏమరుపాటుకు గురిచేసే బొమ్మలన్నీ నిషేధించబడ్డాయి. అలాగే అశ్లీలతకు దారితీసే చిత్రాలు కూడా నిషేధించబడ్డాయి. అవి తప్ప భక్తి, గౌరవభావాలు కలిగించని బొమ్మలు, చిన్న పిల్లల ఆటబొమ్మలు, ధర్మోన్నతికి, ధర్మప్రచారానికి దోహదపడే బొమ్మలు, ఛాయాచిత్రాలు ధర్మసమ్మతమేనని కొందరు ధర్మవేత్తలు అభిప్రాయపడ్డారు.

## పెద్ద పాపాలు

హజ్రత్ అనస్ (రజి) కథనం: ఒకతను ఘోరపాపాలను గురించి అడిగితే దైవప్రవక్త (స) ఇలా చెప్పారు- “1-దేవునికి సాటి కల్పించడం, 2-తల్లిదండ్రుల మాట వినకపోవడం, 3-నరహత్యకు పాల్పడటం, 4-అబద్ధపు సాక్ష్యం చెప్పడం ఘోరమైన పాపాలు.” (బుఖారి)

హజ్రత్ అబ్దుల్లా బిన్ మస్వూద్ (రజి) కథనం: నేను దైవప్రవక్త (స)ను “అన్నిటి కంటే ఘోరమైన పాపం ఏద”ని అడిగాను. దానికి ఆయన “నిన్ను సృష్టించినవాడు దేవుడు అయినప్పటికీ అలాంటి దేవునికి దైవేతర శక్తుల్ని సాటికల్పించడం అన్నిటికంటే ఘోరమైన పాపం” అన్నారు. నేను “ఆ తర్వాత ఘోరమైన పాపం ఏది?” అని అడిగాను. “ఆహారంలో నీతో పాలుపంచుకుంటారన్న ఉద్దేశ్యంతో నీవు నీ సంతానాన్ని చంపడం” అని చెప్పారాయన. “ఆ తరువాత ఘోరమైన పాపం ఏది?” అని మళ్ళీ అడిగాను నేను. “నీవు నీ పొరుగింటివాని భార్యతో వ్యభిచరించడం” అన్నారు ఆయన. (బుఖారి)

అబ్దుర్రహ్మాన్ బిన్ అబూబకర్ (రజి) కథనం: దైవప్రవక్త (స) మమ్మల్ని ఉద్దేశించి “నేను మీకు అన్నిటికంటే ఘోరమైన పాపాలను గురించి తెలుపనా?” అని అడిగారు. ఈమాట ఆయన మూడుసార్లు అన్నారు. దానికి మేము “తప్పక తెలపండి దైవప్రవక్తా!” అన్నాం. అప్పుడాయన “దేవునికి ఇతరుల్ని సాటికల్పించడం, తల్లిదండ్రుల మాట వినక పోవడం” అని చెప్పారు. తర్వాత ఆయన (గోడకు)ఆనుకొని కూర్చున్న వారల్లా ఒక్క సారిగా లేచి నిటారుగా కూర్చొని “జాగ్రత్త! అబద్ధమాడటం (అన్నిటికంటే ఘోరపాపం)” అన్నారు. ఇలా మాటిమాటికి చెబుతూపోయారు. చివరికి మేము మనసులో “అయ్యో! ఈయానీ మాటలు ఇకచాలిస్తే బాగుండు” అనుకున్నాం. (బుఖారి, ముస్లిం)

హజ్రత్ అబూహురైరా (రజి) కథనం: దైవప్రవక్త (స) తమ అనుచరుల్ని "మిమ్మల్ని సర్వనాశనంచేసే పనులకు దూరంగాఉండండ"ని హెచ్చరించారు. దానికి అనుచరులు "ఆ పనులేమిటి దైవప్రవక్తా!" అనడిగారు. ఆయన ఇలా సెలవిచ్చారు: "(1) దేవునికి సాటికల్పించడం (షిర్క్), (2) చేతబడి చేయడం, (3) ధర్మయుక్తంగా తప్ప దేవుడు హతమార్చకూడదని నిషేధించిన ప్రాణిని హతమార్చడం, (4) వడ్డీ సొమ్ము తినడం, (5) అనాథసొమ్ము హరించివేయడం (6) ధర్మయుద్ధంలో వెన్నుజూపి పారిపోవడం, (7) ఏ పాపం ఎరగని అమాయక ముస్లింమహిళపై అపనింద వేయడం." (బుఖారి, ముస్లిం)

"మిమ్మల్ని వారిస్తున్న ఘోరమైన పాపాలను మీరు మానుకుంటే మేము మీ చిన్నచిన్న పాపాల్ని మీ కర్మలచిట్టా నుండి తొలగిస్తాం. పైగా మిమ్మల్ని ప్రతిష్ఠాకరమయిన (స్వర్గ) ధామంలో ప్రవేశింపజేస్తాము." (ఖుర్ఆన్–4:31)

ఈ సూక్తిలో పెద్దపాపాలను మానుకుంటే చిన్నపాపాలను మీ కర్మలచిట్టా నుండి తొలగిస్తాం అంటే, మీరు యధేచ్ఛంగా చిన్నపాపాలు ఎన్ని చేసినా మిమ్మల్ని పట్టుకోమని అర్థం ఎంతమాత్రం కాదు. పెద్ద పాపాలు మానుకోవడానికి ఇది ప్రజలకు ప్రేరణనిచ్చే హితబోధ మాత్రమే. చిన్న పాపాలను గురించి ఈక్రింది హదీస్ చూడండి:

ఇబ్నె అబ్బాస్ (రజి) కథనం: దైవప్రవక్త (స) ఓరోజు రెండు సమాధుల మధ్య నడుస్తూ "ఈ సమాధుల్లో ఉన్నవారు శిక్ష అనుభవిస్తున్నారు. ఈ శిక్షకు పెద్ద కారణం ఏదీ లేదు. వారిద్దరిలో ఒకడు మూత్రం వంటిపై పడకుండా జాగ్రత్త వహించేవాడు కాదు. రెండోవాడు చాడీలు చెబుతూ తిరుగుతుండేవాడు, అంతే" అన్నారు. (బుఖారి)

దైవప్రవక్త (స) ప్రవచనం: "పవిత్రురాలైన స్త్రీపై అపనింద వేయడం అంటే వందేళ్ళ సత్కర్మలను చేజేతులా నాశనం చేసుకోవడమే." (తబ్రాని)

## ఆత్మహత్య కూడా మహాపాతకమే

ఆత్మ దేవుని సొత్తు. మానవుని సమస్తకర్మల నిర్వహణకోసం అతని దేహానికి ఇవ్వబడిన "పవర్‌హౌస్." దేవుడు ఏ మానవుడిపై కూడా అతను మోయలేని భారం వేయడని ఖుర్ఆన్ పేర్కొన్నది. కనుక మనిషి ఏఆపద వచ్చినా దాన్ని సహనంతో ఎదుర్కోవాలేగాని తొందరపడి ఆత్మహత్యకు పాల్పడకూడదు. ఆత్మహత్య పరిస్థితుల్ని ఎదిరించలేని పిరికిచర్య. అందుకే ఇస్లాం ఆత్మహత్యను నిషేధించింది. దీన్ని గురించి దైవప్రవక్త (స) ఇలా తెలిపారు:

"కొండపై నుంచి పడిపోయి ఆత్మహత్య చేసుకున్నవాడు నరకానికి పోతాడు. కొండపైనుంచి పడుతూలేస్తూ) అక్కడే శాశ్వతంగా ఉంటాడు. విషం తిని ఆత్మహత్య చేసుకున్నవాడు నరకాగ్నిలో పడి చేతిలో విషం పట్టుకొని ఎల్లప్పుడూ తింటూఉంటాడు. లోహపు వస్తువుతో ఆత్మహత్య చేసుకున్నవాడు చేతిలో ఆ లోహపు వస్తువు పట్టుకొని మాటిమాటికి కడుపులో పొడుచుకుంటూ శాశ్వతంగా నరకాగ్నిలో కాలిపోతూ ఉంటాడు." (బుఖారి)

హజ్రత్ అనస్ బిన్ మాలిక్ (రజి) కథనం: దైవప్రవక్త (స) ఒక యుద్ధంలో అవిశ్వాసుల్ని ఎదుర్కోవలసి వచ్చింది. ఇరువర్గాలు పరస్పరం ఢీకొన్నాయి. చివరికి దైవప్రవక్త (స) తన గుడారానికి తిరిగొచ్చారు. అవిశ్వాసులు కూడా తమతమ గుడారాలకు వెళ్ళిపోయారు. ప్రవక్త అనుచరులలో ఒకతను యుద్ధమైదానంలో ఒంటరిగా కన్పించే ప్రతి శత్రువుని



సమయస్ఫూర్తితో వెంటాడి మట్టుపెట్టేవాడు. కొందరు యోధులు అతను చేసిన ఈ సాహసకార్యాలు చూసి "ఈరోజు జరిగిన యుద్ధంలో ఆ వ్యక్తి సాధించిన ఘనకార్యాలు మరెవరూ సాధించ లేదు" అని అన్నారు. దైవప్రవక్త (స) ఈమాటలు విని "నిజమే కాని, అతను నరకవాసి అవుతాడు" అని అన్నారు.

ఇది విని ఒక సహచరుడు తానా వ్యక్తి వెంట (నీడలా) ఉంటానని నిర్ణయించుకున్నాడు. ఆ తరువాత అతనా వ్యక్తిని వెన్నంటి తిరుగుతూ అతను నిల్చుంటే నిల్చోవడం, అతను పరుగెత్తితే అతని వెనకాల పరుగెత్తడం చేయసాగాడు. కాస్సేపటికి ఆ వ్యక్తి తీవ్రంగా గాయపడి (బాధకు తట్టుకోలేక) తొందరపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతను ఖడ్గం పిడిని నేల మీద నిలబెట్టి దాని మొనను తన వక్షస్థలం మధ్య ఆనిచ్చి, తన శరీర బరువంతా దానిపై మోపి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ దృశ్యం చూడగానే అతడ్ని వెంబడించిన సహచరుడు దైవప్రవక్త (స) సన్నిధికి వచ్చి "(మహానుభావా!) మీరు (ముమ్మాటికీ) దైవప్రవక్తేనని నేను సాక్ష్యమిస్తున్నాను" అని అన్నాడు.

దైవప్రవక్త (స) ఇది విని "ఏమిటీ విశేషం?" అని అడిగారు. అప్పుడా సహచరుడు ఇలా అన్నాడు: "ఇంతకు ముందే మీరు ఒకతడ్ని గురించి అతను నరకవాసి అవుతాడని చెప్పారు. జనం ఈమాట నమ్మలేక పోయారు. నేను వెంటనే ఆ వ్యక్తి సంగతేమిటో ఆరా తీద్దామని మనసులో అనుకున్నాను. ఆ తరువాత నేనతడ్ని వెంబడించాను. చివరికి అతను తీవ్రంగా గాయపడి తొందరపాటుతో మృత్యువుని ఆహ్వానించాడు. అతను కత్తి పిడిని నేల మీద నిలబెట్టి, దాని మొనను తన వక్షస్థలం మధ్య ఆనిచ్చి దానిమీద పడి ఆత్మహత్య చేసుకున్నాడు." దైవప్రవక్త (స) ఈసంగతి విని "ఒక్కోసారి ఒక మనిషి స్వర్గవాసుల కర్మల మాదిరిగానే సత్కర్మలు ఆచరిస్తాడు. అయితే అసలతను నరకవాసి అవుతాడు. అలాగే మరొకతను పైకి నరకవాసుల కర్మల మాదిరిగానే దుష్కర్మలు ఆచరిస్తాడు. కాని నిజానికి అతను స్వర్గవాసి అవుతాడు" అని అన్నారు. (బుఖారి)

## పాపాలవల్ల విశ్వాసం క్షీణిస్తుందా?

దేవుడ్ని, అంతిమ దైవప్రవక్త (స)ను విశ్వసించిన మనిషి పాపాలు ఎందుకు చేస్తాడు? ఈ ప్రశ్నకు అనేక సమాధానాలు ఉంటాయి. 1-అజ్ఞానం, 2-ఏమరుపాటు, 3-ధర్మావగాహన లోపం, 4-ప్రాపంచికవ్యామోహం, 5-స్వార్థం, 6-చిత్తచాపల్యం, 7-పరిస్థితుల ప్రభావం వగైరా. వీటిలో ఏదైనా లేక ఏవైనా కావచ్చు. పోతే మరొక ప్రశ్న. మనిషి పాపాలు చేయడం వల్ల అతని విశ్వాసం క్షీణిస్తుందా లేక విశ్వాసం క్షీణించడం వల్ల పాపాలు చేస్తాడా? ఈ ప్రశ్నకు సమాధానం ఈ క్రింది హదీసులు, వాటి వివరణలు చూడండి-

హజ్రత్ అబూహురైరా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "వ్యభిచారి వ్యభిచారం చేస్తున్నప్పుడు విశ్వాసిగా ఉండడు. తాగుబోతు మద్యం తాగుతున్నప్పుడు విశ్వాసిగా ఉండడు. దొంగ దొంగతనం చేస్తున్నప్పుడు విశ్వాసిగా ఉండడు. ఆ తరువాత తౌబా చేస్తే అతని తౌబా స్వీకరించబడుతుంది." (ముస్లిం)

బుఖారీలోని ఒక ఉల్లేఖనంలో అదనంగా "ప్రజలు కళ్ళారా చూస్తుండగా దోపిడీ దొంగ పెద్దఎత్తున లూటీ చేస్తున్నప్పుడు అతను విశ్వాసిగా ఉండడ"ని ఉంది. (బుఖారి)

దైవప్రవక్త (స) ప్రవచనం: ఒకరోజు (దైవదూత) జిబ్రీల్ (అలై) నా దగ్గరకు వచ్చి "మీ అనుచర సముదాయంలో దేవునికి సాటికల్పించని స్థితిలో చనిపోయినవారు స్వర్గంలో ప్రవేశిస్తారు" అని శుభవార్త అందజేశారు. అప్పుడు నేను "వ్యభిచారం చేసినా, దొంగతనం చేసినా స్వర్గంలో ప్రవేశిస్తారా" అనడిగాను. దానికి ఆయన "ఆ... వ్యభిచారం చేసినా, దొంగతనం చేసినాసరే (స్వర్గంలో ప్రవేశిస్తారు)" అని అన్నారు. (ముస్లిం)

హ(జత్ అబూజర్ (రజి)ఉల్లేఖించిన పైహదీసుతో పాటు దివ్యఖుర్ఆన్‌లో "దేవుడు బహుదైవారాధనా పాపం తప్ప ఇతర పాపాలను తాను తలచుకుంటే క్షమిస్తాడ"ని ఉంది. అందువల్ల ధర్మవేత్తలు మద్యసేవనం, వ్యభిచారం, దొంగతనం లాంటి పాపాలు చేస్తున్నప్పుడు మనిషిలో పరిపూర్ణ విశ్వాసం ఉండదని అభిప్రాయపడ్డారు.

దైవప్రవక్త (స) ఇలా ఉపదేశించారు: "నీవు ఎక్కడున్నా దేవునికి భయపడుతూ ఉండు. పాపకార్యం (జరిగిన) తరువాత వెంటనే పుణ్యకార్యం చెయ్యి. పుణ్యం పాపాన్ని తుడిచిపెడ్తుంది. ప్రజల పట్ల మంచిగా మెలుగుతూఉండు." (తిర్మిజీ)

దైవప్రవక్త (స) హితోక్తి: దాసుడు తప్పుచేసిన తర్వాత "ప్రభూ! నాపాపం క్షమించు" అని వేడుకుంటే దానికి సమాధానంగా దేవుడు "నా దాసుడు తప్పు చేసినప్పటికీ తనను క్షమించే ప్రభువు ఒకడున్నాడనీ, ఆయన తనను ఆ పాపం విషయమై నిలదీయగలడన్న విషయాన్ని మాత్రం మరచిపోలేదు" అని అంటాడు. తర్వాత ఆ దాసుడు మళ్ళీ తప్పు చేసి, "ప్రభూ! నాపాపం క్షమించు" అని వేడుకున్నప్పుడు దానికి జవాబుగా దేవుడు "నా దాసుడు తప్పయితే చేశాడుగాని తనను క్షమించే ప్రభువు ఉన్నాడనీ, ఆయన తనను దాన్ని గురించి నిలదీయగలడన్న విషయాన్ని మాత్రం మర్చిపోలేదు" అని అంటాడు. దాసుడు మళ్ళీ ఏదో ఒక పాపానికి పాల్పడిన తరువాత "ప్రభూ! నా పాపం క్షమించు" అని వేడుకుంటే దానికి సమాధానంగా దేవుడు "నా దాసుడు పాపమయితే చేశాడుగాని తనను క్షమించే దేవుడున్నాడని, ఆ పాపం విషయమై ఆయన తనను పట్టుకుంటాడన్న విషయాన్ని మాత్రం మరచిపోలేదు. కనుక నేను నా దాసుడ్ని క్షమించేశాను. అతనిక తన యిష్టం వచ్చినట్లు చేసుకోవచ్చు" అని అంటాడు. (బుఖారీ, ముస్లిం)

దైవప్రవక్త (స) హితోక్తి: "ఎవరిచేతిలో నా ప్రాణముందో ఆయన సాక్షి! మీరు గనక పాపాలు చేయకుంటే దేవుడు మిమ్మల్ని తొలగించి ఇతరుల్ని తెచ్చిపెడతాడు. వారు పాపాలుచేసి క్షమించమని దైవాన్ని ప్రార్థిస్తారు. దేవుడు వారిని క్షమిస్తాడు." (ముస్లిం)

## చిన్నపాపాలు, చిరుపుణ్యాలు

దైవభీతిపరాయణుడైన విశ్వాసికి తేలికపాటి విచారణ జరుగుతుంది. దేవుడు అతని పొరపాట్లు క్షమించి అతని పుణ్యాకార్యాలకు అత్యున్నత ప్రతిఫలం ప్రసాదిస్తాడని ఖుర్ఆన్ చెబుతోంది. అతను చేసిన అణుమాత్రపు పాపకార్యానికి సైతం ఫలితం అతను ప్రపంచంలో అనుభవిస్తాడు; అణుమాత్రపు పుణ్యకార్యానికి సైతం ప్రతిఫలం పరలోకంలో పొందుతాడు.

"ఆరోజు మానవులు విభిన్నవర్గాలుగా విడిపోయి (న్యాయస్థానం నుండి) తిరిగొస్తారు. అప్పుడు వారికి వారికర్మలు చూపించబడతాయి. ఆతర్వాత ఎవరైనా అణుమాత్రం సత్కార్యం చేసివున్నా అతను దాన్ని (కళ్ళారా)చూసుకుంటాడు. అలాగే ఎవరైనా అణుమాత్రం దుష్కార్యం



చేసివున్నా అతనూ దాన్ని (కళ్ళారా) చూసుకుంటాడు." (ఖుర్ఆన్:-99:6-8)

హ(జత్ అబూబకర్ (రజి) భోజనం చేస్తున్నప్పుడు ఈసూక్తి దైవప్రవక్త (స) నోట వినగానే భోజనం ఆపి "దైవప్రవక్తా! నేను చేసిన అణుమాత్రపు పాపానికి కూడా పర్యవసానం పరలోకంలో చూసుకుంటానా?" అని అడిగారు. దానికి ఆయన ఇలా అన్నారు: "అబూబకర్! ఇహలోకంలో నీకు బాధకలిగించే ఏ విషయమైనా అది నీవల్ల జరిగిన అణుమాత్రపు పాపానికి పర్యవసానం. నీవు అణుమాత్రపు పుణ్యకార్యాలు చేసిఉంటే, వాటిని దేవుడు పరలోకంలో నీకోసం భద్రపరచి ఉంచుతాడు." (త్రబాని, బైహఖి)

మరోసారి దైవప్రవక్త (స) ఇలా తెలిపారు: "మీలో పుణ్యకార్యాలు చేసేవారికి వాటి ప్రతిఫలం పరలోకంలో లభిస్తుంది. అయితే పాపకార్యాలకు మాత్రం ఇహలోకంలోనే ఆపదలు, వ్యాధుల రూపంలో శిక్ష అనుభవిస్తారు." (ఇబ్నె మర్దూయా)

హ(జత్ అనస్(రజి) అన్నారు: "మీరు చేసే అనేకపనులు మీకంటికి వెంట్రుకకన్నా సూక్ష్మమైనవిగా కన్పిస్తున్నాయేమో! (మీరు వాటిని కొట్టిపారేస్తున్నారు) కాని దైవప్రవక్త (స) కాలంలో వాటినే మేము వినాశకరమైన పనులుగా భావించేవాళ్ళం. (బుఖారీ)

దైవప్రవక్త (స) ప్రవచనం: "దేవునికి (కూడా) రోషం వస్తుంది. మనిషి తనకోసం నిషేధించిన పనికి పాల్పడినప్పుడు దేవునికి ఈ రోషం వస్తుంది." (బుఖారీ, ముస్లిం)

దైవప్రవక్త (స) హితోక్తి: "(మనిషి) ఘోర పాపాలకు దూరంగా ఉంటే (రోజా చేసే) ఐదుపూటల నమాజులు ఒకజుమా నుండి మరొకజుమా, ఒక రమజాన్ నుండి మరొక రమజాన్ వరకు మధ్య జరిగిన (చిరు)పాపాలకు పరిహారమవుతాయి." (ముస్లిం)

దైవప్రవక్త (స) హితోక్తి: "దాసుడు జబ్బు పడినప్పుడు లేదా ప్రయాణంలో ఉన్నప్పుడు అతను స్థానికుడై ఆరోగ్యంగా ఉన్నప్పుడు చేసే కర్మలే అతని పేర రాయబడతాయి." (బుఖారీ)

అవిశ్వాసులకు పుణ్యకార్యాల ప్రతిఫలం ప్రపంచంలోనే లభిస్తుంది. పాపకార్యాలకు పరలోకంలో నరకశిక్ష చవిచూడవలసి వస్తుంది. కొన్ని హదీసుల్ని బట్టి అవిశ్వాసులు చేసిన పుణ్యకార్యాల వల్ల పరలోకంలో వారికి శిక్ష తీవ్రత కొంతవరకు తగ్గించబడుతుందని తెలుస్తోంది. ఉదాహరణకు, హాతింతాయికి అతను చేసిన విశేష దానధర్మాలకు పరలోకంలో తేలికపాటి శిక్ష విధించబడుతుందని తెలుస్తోంది. (రూహుల్ మాని)

## సత్కార్యం సమగ్రభావం

దైవప్రవక్త(స) హితోక్తి: "నా అనుచరసముదాయం ప్రజల సత్కర్మలు, దుష్కర్మలు అన్నీ నాకు చూపించబడ్డాయి. వారి సత్కర్మలలో దారి నుంచి (రాళ్ళు, ముళ్ళు వగైరా) బాధాకరమైన వస్తువుల్ని తొలగించడం కూడా ఉంది. వారి దుష్కర్మల్లో మస్జిద్‌లో ఉమ్మి వేసి దానిపై మట్టిపోయకుండా వదిలేసే అసహ్యకరమైన చేష్ట కూడా ఉంది. (ముస్లిం)

హ(జత్ అబూజర్ (రజి) కథనం: కొంతమంది దైవప్రవక్త (స) దగ్గరికి వచ్చి "దైవప్రవక్తా! ధనవంతులు పుణ్యార్జనలో మమ్మల్ని మించిపోయారు. వాళ్లూ మాలాగే నమాజ్ చేస్తారు, మాలాగే ఉపవాసాలూ పాటిస్తారు. అయితే వాళ్ళు (మాకంటే ఎక్కువగా) తమ

మిగులుధనం నుంచి పుణ్యకార్యాలు చేస్తారు. (అలా వారు మాకంటే ఎక్కువ పుణ్యం సంపాదించగలుగుతున్నారు. మాకా అవకాశం లేదు)" అని విన్నవించుకున్నారు. దానికి దైవప్రవక్త (స) ఇలా చెప్పారు: "పుణ్యకార్యాలు (సదఖాలు) చేయడానికి దేవుడు మీకు వేరే మార్గాలు సూచించలేదా? సుబ్‌హానల్లాహ్ (దేవుడు పవిత్రుడు) అనడం కూడా పుణ్యకార్యమే. అల్లాహుఅక్బర్ (దేవుడు అందరికంటే గొప్పవాడు) అనడం కూడా పుణ్యకార్యమే. అల్‌హమ్దులిల్లాహ్ (ప్రశంసలన్నీ దేవునికే) అనడం కూడా పుణ్యకార్యమే. లాఇలాహ ఇల్లల్లాహ్ (అల్లాహ్ తప్ప వేరే దేవుడు లేడ)ని చెప్పడం కూడా పుణ్యకార్యమే. మంచిని ఆదేశించటమూ పుణ్యకార్యమే. చెడును నిరోధించడమూ పుణ్యకార్యమే. చివరికి మీరు (మీభార్యతో) సంభోగించడం కూడా పుణ్యకార్యమే." అనుచరులు ఈ మాట విని (ఆశ్చర్యంతో) "ఏమిటి, మాలో ఎవరైనా తన లైంగిక కోరికను తీర్చుకుంటే దానిపై కూడా అతనికి పుణ్యం లభిస్తుందా!" అని అడిగారు. దానికి దైవప్రవక్త (స) "ఆ... అతను తన కోరికను అక్రమంగా తీర్చుకుంటే అది అతని పాలిట పాపం కాదా? మీరే చెప్పండి. (పాపమే). అలాగే అతను తనవాంఛను ధర్మసమ్మతమైన రీతిలో తీర్చుకుంటే అతనికి పుణ్యం లభిస్తుంది" అని విడమరచి చెప్పారు. (ముస్లిం)

దైవప్రవక్త (స) ఇలా తెలియజేశారు: "నీవు ఏ మంచి పనినీ చులకనగా చూడకు. చివరికి నీవు నీ సోదరుణ్ణి నగుమోముతో కలవడాన్ని అయినా సరే." (ముస్లిం)

హజ్రత్ జాబిర్ (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ఇలా చెప్పారు: "ఎవరైనా ముస్లిం ఓ చెట్టు నాటితే (దాని పండ్లు పక్షులు, పందికొక్కులు వగైరా జంతువులు, కీటకాల వల్ల) తినేయబడినా అది అతని తరఫున 'సదఖా' (పుణ్యకార్యం) అవుతుంది. అలాగే అందులోనుంచి దొంగిలించబడినా అదీ అతని వైపున 'సదఖా'గానే భావించబడుతుంది. ఎవరైనా దాన్ని నష్టపరిస్తే, అది కూడా సదఖాగానే భావించబడుతుంది." (ముస్లిం)

దైవప్రవక్త (స) హితోక్తి: "సూర్యుడు ఉదయించే ప్రతిరోజూ ప్రజల (దేహంలోని) ప్రతి కీలు తరఫున తప్పకుండా ఒక సదఖా (సత్కార్యం) చేయాలి. (సదఖా అంటే దానం చేయటమనే కాదు). ఇద్దరి వ్యక్తుల మధ్య న్యాయం చేస్తే, అది కూడా (పుణ్యకార్యమే) అవుతుంది. ఎవరినైనా అతని వాహనంపై కూర్చోబెట్టడంలో లేదా అతని సామాను ఎత్తి దానిపై ఉంచడంలో అతనికి సహాయపడితే అది కూడా పుణ్యకార్యమే అవుతుంది. ఒక మంచిమాట చెప్పటం కూడా పుణ్యకార్యమే. నువ్వు నమాజు కోసం నడిచివెళ్ళే ప్రతి అడుగులోనూ నీకు పుణ్యం ఉంది. జనం నడిచే దారి నుంచి బాధాకరమైన వస్తువులు తొలగించడం కూడా పుణ్యకార్యమే. (బుఖారీ, ముస్లిం)

దైవప్రవక్త (స) ప్రవచనం: "నేను స్వర్గంలో ఒకతను సంచరిస్తుండటం చూశాను. దారికి అడ్డంగా ఉండి, ముస్లింలకు ఇబ్బందికరంగా మారిన ఒక చెట్టు(కొమ్మ)ను నరికివేశాడతను (దానికి దేవుడు ప్రసన్నుడై అతనికి స్వర్గం ప్రసాదించాడు)." (ముస్లిం)

వేరొక ఉల్లేఖనంలో ఇలా ఉంది: "ఒక వ్యక్తి దారిలో నడుస్తున్నప్పుడు అతనికి ఓ ముండ్లకంప కనబడింది. అతడు దాన్ని తీసిపారేశాడు. అతను చేసిన ఈ పనిని దేవుడు స్వీకరించి అతడ్ని క్షమించాడు. (బుఖారీ)



దైవప్రవక్త (స) ప్రవచనం: "విశ్వాసి చనిపోయిన తరువాత కూడా అతని సత్కార్యాలలో కొన్నిటికి పుణ్యం లభిస్తూ ఉంటుంది. అవి: 1-ఎవరికైనా ధర్మవిద్య నేర్పి దాన్ని విస్తరింపజేస్తాడు. 2-(తన కోసం దైవాన్ని ప్రార్థించే) మంచి కొడుకునో కూతురినో కని వెళ్తాడు. 3-ఎవరికైనా ఖుర్‌ఆన్ ఇస్తాడు. 4-మసీదు కట్టిస్తాడు. 5-బాటసారుల ఆశ్రయం నిర్మిస్తాడు. 6-బావి తవ్విస్తాడు. 7-మరేదైనా సత్కార్యం చేసి అందులో తన ధనం ఖర్చు పెడ్తాడు. అలాంటి విశ్వాసి కర్మపత్రంలో వాటి ద్వారా ప్రజలు ప్రయోజనం పొందుతున్నంత కాలం పుణ్యం రాయబడుతుంటుంది." (సహీ ఇబ్నెఖుజైమా)

# 5. పశ్చాత్తాపం, క్షమాభిక్ష

"పశ్చాత్తాపంతో క్షమాపణ కోరుకొని, సత్యాన్ని విశ్వసించి సదాచారసంపన్నుడయి, సన్మార్గంలోనే (జీవితాంతం) నడిచేవాడ్ని నేను తప్పక క్షమిస్తాను" (ఖుర్‌ఆన్–20:82)

దైవప్రవక్త (స) ప్రవచనం: "ప్రజలారా! మీ పాపాల పట్ల పశ్చాత్తాప హృదయంతో దేవుని వైపుకు మరలండి. పాపమన్నింపు కోసం ఆయన్ని వేడుకోండి. నేను దైవసన్నిధిలో రోజుకు వంద సార్లు పశ్చాత్తాప హృదయంలో క్రుంగిపోతుంటాను." (ముస్లిం)

దైవప్రవక్త (స) దేవుడు చెప్పిన మాటలు ఇలా వ్యక్తపరిచారు: "ఆదం కుమారా! నువ్వు నన్ను అర్థిస్తూ, నానుండి మంచిని ఆశించినంత కాలం నేను నిన్ను క్షమిస్తుంటాను. నీ ఆచరణలు ఎలా వున్నా నేను వాటిని పట్టించుకోను. ఆదం కుమారా! నీ పాపాలు అంబరాలను చుంబిస్తున్నా సరే నన్ను పాపమన్నింపు కోసం అర్థిస్తే నేను నిన్ను మన్నిస్తాను. ఆదం కుమారా! నాకు ఇతరుల్ని సాటికల్పించే (షిర్క్) పాపం చేయకుండా ఇతర పాపాలు నువ్వు భూమండలం నిండా తీసుకొని నా దగ్గరకు వచ్చినా నేను భూమండలమంత మన్నింపుతో వచ్చి నిన్ను కలుసుకుంటాను." (తిర్మిజీ)

హజ్రత్ అనస్ బిన్ మాలిక్ (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ఇలా తెలిపారు: "తన దాసుడు పాపాలపట్ల పశ్చాత్తాపం పడినందుకు దేవుడు, ఎడారిప్రదేశంలో ఒంటెను పోగొట్టుకొని తిరిగిపొందిన మనిషికంటే ఎక్కువ సంతోషిస్తాడు." (బుఖారి, ముస్లిం)

వేరొక ఉల్లేఖనంలో ఇలా ఉంది: "ఒక వ్యక్తి ఎడారి ప్రాంతంలో తన ఒంటెపై ప్రయాణిస్తున్నాడు. దానిపైనే అతని ఆహారసామగ్రి, నీరు ఉన్నాయి. (దారిలో) ఆ ఒంటె తప్పిపోయింది. అతను ఇక ఆ ఒంటె దొరకదని భావించాడు. (వెతికి వేసారి) నిరాశతో తిరిగి వచ్చి ఓ చెట్టునీడలో మేనువాల్చాడు. అంతలో ఆ ఒంటె వచ్చి అతని ముందు నిలబడింది. వెంటనే అతను దాని ముకుతాడు పట్టుకొని పట్టరాని సంతోషంతో పొంగిపోయి 'దేవా! నీవే నా దాసుడివి, నేనే నీ ప్రభువును' అన్నాడు. సంతోషం పట్టలేక ఆవ్యక్తి మాటలు అలా తడబడ్డాయనుకుంటే నిస్సందేహంగా దేవుడు తన దాసుని పశ్చాత్తాపం పట్ల అంతకన్నా ఎక్కువగానే సంతోషిస్తాడు." (ముస్లిం)

హజ్రత్ అబూమూసా అబ్దుల్లా బిన్ ఖైస్ అష్‌అరీ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (స) ఇలా అన్నారు: "పగలు పాపం చేసినవాడు రాత్రికి పశ్చాత్తాపం చెందాలని దేవుడు రాత్రివేళ తన చేతిని (భూలోకం వైపుకు) చాపుతాడు. అలాగే రాత్రి పాపం చేసినవాడు

పగలు పశ్చాత్తాపం చెందాలని పగలు తన చేతిని జాపుతాడు. సూర్యుడు పడమటి దిక్కు నుండి ఉదయించే వరకూ ఇలా కొనసాగుతూనే ఉంటుంది.” (ముస్లిం)

“పశ్చాత్తాపంతో క్షమాపణ కోరుకొని సదాచార వైఖరి అవలంబించినవాడు నిజానికి మనస్ఫూర్తిగా పశ్చాత్తాపం చెంది దేవుని వైపుకు మరలివచ్చిన వాడవుతాడు.” (ఖు: 25:71)

హజ్రత్ అబూహురైరా (రజి) కథనం: ఒకరోజు నేను నబవీమస్జిద్‌లో ఇషానమాజ్ చేసి ఇంటికొస్తే ఓ స్త్రీ మాఇంటి ముందు నిల్చున్నది. నేనామెకు సలాంచేసి నా గదిలోకి వెళ్ళి తలుపులేసుకొని నమాజులో లీనమైపోయాను. కాస్సేపటికి ఆమె తలుపు తట్టింది. నేను తలుపు తీసి ఏం కావాలని అడిగాను. ఆమె విషయం చెబుతూ “నావల్ల వ్యభిచారం జరిగింది. అక్రమగర్భం దాల్చాను. పిల్లవాడు పుడ్తే అతడ్ని చంపేశాను. మరిప్పుడు నా పాపక్షమాపణకు ఏదైనా దారి ఉందంటారా?” అని అడిగింది. నేను ఏమాత్రం లేదని చెప్పాను. నా మాటలు విని ఆమె “అయ్యో! నాయీ సౌందర్యం అగ్నికి ఆహుతి కావడానికే సృజించబడిందా!!” అంటూ రోదిస్తూ వెళ్ళిపోయింది.

మరునాడుదయం నేను దైవప్రవక్త (స) వెనుక నమాజ్ చేశాక ఆయనకు రాత్రి జరిగిన సంఘటన వివరించాను. దానికి ఆయన “అబూహురైరా! నీవు చాలా తప్పుడు సమాధానమిచ్చావు. నీవీ సూక్తి చదవలేదా?” అంటూ ఈ ఖుర్‌ఆన్ సూక్తి విన్పించారు- “పశ్చాత్తాపహృదయంతో క్షమాపణ కోరుకొని, దాంతోపాటు సత్యాన్ని విశ్వసించి సత్కార్యాలు చేయడం మొదలెడితే అలాంటి మనిషికి శిక్ష ఉండదు. పైగా దేవుడు అలాంటివారి (గత)దుష్కర్మల్ని సత్కర్మలుగా మారుస్తాడు. ఆయన గొప్ప అనుగ్రహశీలి, పరమదయాళువు. (25:70).” ఈమాట విని నేను వెంటనే ఆ స్త్రీని వెతకడానికి బయలుదేరాను. రాత్రి ఇషావేళలోనే ఆమెను కలుసుకోగలిగాను. నేనామెకు నీ ప్రశ్నకు దైవప్రవక్త (స) ఇలా సమాధానమిచ్చారని శుభవార్త చెప్పాను. ఇది విని వెంటనే ఆమె దేవునికి సాష్టాంగపడి “నాకోసం పాపమన్నింపు ద్వారం తెరచిపెట్టిన పరిశుద్ధ దేవునికి నేనెంతో కృతజ్ఞురాలిని” అన్నది. ఆ తర్వాత ఆమె పశ్చాత్తాప హృదయంతో క్షమాపణ కోరుకొని తన దగ్గరున్న ఒక బానిసకు స్వేచ్ఛనిచ్చింది. (తబ్రాని).

హజ్రత్ అబూనుజైద్ ఇమ్రాన్ బిన్ హుసైన్ ఖుజాయి (రజి) కథనం: జుహైనా తెగకు చెందిన ఒక స్త్రీ దైవప్రవక్త (స) సన్నిధికి వచ్చింది. ఆ సమయంలో ఆమె (ఏదో బలహీన కారణంగా) కాలుజారిన పాపానికి గర్భం దాల్చిఉంది. ఆమె దైవప్రవక్త (స)తో, “దైవప్రవక్తా! నేను శిక్షార్హమైన తప్పుచేశాను. నాకు శిక్ష విధించండి” అన్నది. దైవప్రవక్త (స) ఆమె సంరక్షకుణ్ణి పిలిపించి “ఈమె పట్ల మంచిగా మెలగు. ప్రసవానంతరం ఈమెను నా వద్దకు తీసుకురా” అని ఆదేశించారు. (ప్రవక్త ఆదేశానుసారం) ఆ వ్యక్తి అలాగే చేశాడు. (ఆమె ప్రసవించిన తరువాత) దైవప్రవక్త (స) ఆమెను ఆమె బట్టలతోనే గట్టిగా బంధించమని ఆజ్ఞాపించారు. ఆ తరువాత ఆయన ఆజ్ఞానుసారమే ఆమెమీద రాళ్ళురువ్వి (హతమార్చడం జరిగింది.) తరువాత దైవప్రవక్త (స) ఆ స్త్రీ జనాజానమాజ్ చేశారు. దీనిపై హజ్రత్ ఉమర్ (రజి) అభ్యంతరం వ్యక్తంచేస్తూ “దైవప్రవక్తా! మీరు ఈ జారిణి కోసం జనాజానమాజ్ చేస్తారా?” అన్నారు. దానికి దైవప్రవక్త (స) ఇలా అన్నారు-



(ఉమర్!) ఈమె పడిన పశ్చాత్తాపం ఎంత గొప్పదో నీకు తెలియదు. ఈమె పశ్చాత్తాపాన్ని మదీనాలోని డెభ్భై మందికి పంచినా అది వారి (పాపాల మన్నింపు)కి సరిపోతుంది. దైవప్రసన్నత కోసం ఈమె తన ప్రాణాన్ని సైతం (లెక్క చేయకుండా) త్యాగం చేసిందంటే ఇంతకన్నా ఘనకార్యం ఇంకేముంటుంది?” అన్నారు. (ముస్లిం)

ప్రముఖ సహాబీల (ప్రవక్త అనుచరుల)లో కాబ్ బిన్ మాలిక్ (రజి), హిలాల్ బిన్ ఉమయ్య (రజి), మురారా బిన్ రుబయి (రజి)లు చిత్తశుద్ధిగల విశ్వాసులయినప్పటికీ తబూక్ దండయాత్ర సమయంలో బద్ధకం వారిని గడప దాటనివ్వలేదు. దైవప్రవక్త (స) విచారణ జరిపినప్పుడు కపటవిశ్వాసుల్లా అబద్ధాలు చెప్పి తప్పించుకోవడానికి బదులు వారు నిజం చెప్పేశారు. అప్పుడు దైవప్రవక్త (స) అందుకు శిక్షగా వారితో ఎవరూ మాట్లాడకూడదని ముస్లింలందరికీ తాకీదు చేశారు.

ప్రవక్త ఆజ్ఞతో ముస్లింలందరూ ఆ ముగ్గురితో మాట్లాడకుండా సంఘబహిష్కరణ చేశారు. వారిలో ఇద్దరు బయటికి పోకుండా ఇంట్లోనే గడపసాగారు. హజ్రత్ కాబ్ బిన్ మాలిక్ (రజి) మటుకు బయట వీధుల్లో తిరిగేవారు. మస్జిద్‌కు కూడా వెళ్ళి వస్తుండే వారు. కాని ఆయనతో ఏ ఒక్కరూ మాట్లాడేవారు కాదు. సలాం చేసినా సమాధానమిచ్చే వారు కూడా కాదు. మస్జిద్‌లో ఆయన నమాజ్ చేస్తున్నప్పుడు దైవప్రవక్త (స) ఆయన వైపు ఓరగా చూసేవారు. కాని నమాజ్ ముగించగానే వేరే వైపు ముఖం తిప్పుకునేవారు. దాంతో హజ్రత్ కాబ్ (రజి) మరింత దిగాలుపడేవారు.

ఒకరోజు ఆయన తన చిన్ననాటి స్నేహితుడు అబూ ఖతాదా (రజి) దగ్గరికెళ్ళి అతని తోట ప్రహరీగోడ ఎక్కి సలాం చేశారు. కాని అతను సమాధానమైనా ఇవ్వలేదు. అప్పుడు కాబ్ (రజి) దేవుడ్ని సాక్షిగా చేస్తూ, “అబూఖతాదా! నాకు దైవం పట్ల, దైవప్రవక్త పట్ల ప్రేమాభిమానాలు లేవా?” అని అడిగారు. దానికీ అతను సమాధానమివ్వలేదు. హజ్రత్ కాబ్ (రజి) అలా రెండుసార్లు అడిగారు. మూడోసారి అడిగిన మీదట “ఆ సంగతి దేవునికి, దైవప్రవక్త (స)కు మాత్రమే తెలుస”ని ముక్తసరిగా జవాబిచ్చాడు. ఈ మాటలు విని కాబ్ (రజి)కు దుఃఖం పొర్లుకు వచ్చింది.

ఆరోజుల్లోనే కాబ్ బిన్ మాలిక్ (రజి) బజారున పోతుంటే సిరియా నుండి ఒకతను వచ్చి గస్సాన్ రాజు రాసిన ఓ లేఖను ఆయనకు అందించాడు. అందులో ఆ రాజు కాబ్ (రజి)ని సంబోధిస్తూ “మీ మనిషి మీమీద దుర్భర దౌర్జన్యం చేస్తున్నాడని మేము విన్నాం. మీరు ఆ అవమానం సహించేటంత అధములు కారు. అప్రయోజకునిగా భావించి వదిలెయ్యాల్సిన మనిషి కూడా కాదు. కనుక మీరు మా దగ్గరకు వచ్చేయండి. మేము మిమ్మల్ని గౌరవిస్తాం” అని రాశాడు. హజ్రత్ కాబ్ (రజి) దాన్ని చదివి మరోవిపత్తు వచ్చి పడిందనుకుంటూ అప్పటికప్పుడు దాన్ని పొయ్యిలోకి విసిరి కాల్చివేశారు.

ఇలా నలభై రోజులు గడచిన తరువాత భార్యకు కూడా దూరంగా ఉండాలని దైవప్రవక్త (సల్లం) ఆదేశించారు.. అప్పుడు కాబ్ భార్యను పుట్టింటికి పంపివేశారు. అలా మరో పదిరోజులు గడచిపోయాయి. చివరికి ఓరోజు ఫజ్ర్‌నమాజ్ తరువాత ఇంటికప్పు మీద విచారంతో కూర్చొని ఉంటే ఒకతను వచ్చి “కాబ్! నీకు శుభం కలుగుగాక!”

అన్నాడు. ఈమాట వినగానే హజ్రత్ కాబ్ (రజి) అప్రయత్నంగా సాష్టాంగపడ్డారు.

ఆ తర్వాత ఒకరి తర్వాత మరొకరు అనేకమంది 'నీ క్షమాపణ స్వీకరించబడింది' అంటూ అభినందనలు తెలియజేయసాగారు. హజ్రత్ కాబ్ (రజి) వెంటనే మస్జిద్‌కు వెళ్ళి చిరునవ్వుతో కన్పిస్తున్న దైవప్రవక్త (స)కు సలాం చేశారు. దైవప్రవక్త (స) ప్రతిసలాం చేసి ఆయన్ని అభినందించారు. అప్పుడు కాబ్ (రజి) దేవునికి కృతజ్ఞతగా తన వాటాకు వచ్చిన ఖైబర్‌భూమి ఉంచుకొని మిగిలిన ఆస్తినంతా దైవమార్గంలో దానంచేశారు.

(బుఖారి, ముస్లిం గ్రంథాల ఆధారంగా స్థలాభావంతో సంక్షిప్తరూపం)

గామిద్ తెగకు చెందిన ఓస్త్రీ వచ్చి తాను వ్యభిచారం చేసినట్లు నాలుగుసార్లు అంగీకరించింది. ఆమెకు అక్రమ గర్భధారణ కూడా జరిగింది. ఆమె తన నేరాన్ని మొదటిసారి అంగీకరించినప్పుడే దైవప్రవక్త (స) "సరేలే, వెళ్ళిపో. పశ్చాత్తాపం చెంది దైవాన్ని క్షమించమని ప్రార్థించు" అన్నారు. కాని ఆ స్త్రీ "దైవప్రవక్తా! మీరు నావ్యవహారం మాయిజ్ వ్యవహారంలా దాటవేయజూస్తున్నారా? నేను వ్యభిచారం వల్లనే గర్భం దాల్చాను" అని అన్నది. "అయితే నువ్వు ప్రసవించిన తరువాత రా, చెబుతాను" అన్నారు దైవప్రవక్త (స). కొంతకాలానికి ఆమె ప్రసవించింది. ప్రసవించిన తర్వాత చంటి పిల్లవాడ్ని తీసుకొని మళ్ళీ దైవప్రవక్త (స) సన్నిధికి వచ్చి "ఇప్పుడు నన్ను పరిశుద్ధపర చండి" అన్నది. దైవప్రవక్త (స) ఆ పిల్లవాడి వైపు చూస్తూ "పిల్లవాడికి పాలుపట్టు. పాలు తాగడం మానేసిన తరువాత రా" అని ఆదేశించారు ఆమెను.

దాంతో ఆ స్త్రీ వెళ్ళిపోయి పిల్లవాడికి పాలు పట్టనారంభించింది. కొంతకాలనికి (బహుశా రెండేళ్ళ తర్వాత) పాలుమాన్పించి చేతిలో ఓ రొట్టెముక్క తీసుకొని దైవప్రవక్త (స) సన్నిధికి వచ్చింది. పిల్లవాడికి రొట్టెముక్క తినిపించిచూపుతూ "దైవప్రవక్తా! చూడండి, ఇప్పుడీ పిల్లవాడు పాలు తాగడం మానేసి రొట్టె తినడం మొదలెట్టాడు" అని అన్నది. అప్పుడు దైవప్రవక్త (స) పిల్లవాడ్ని సంరక్షణ కోసం ఒక వ్యక్తికి అప్పగించి ఆ స్త్రీకి శిలా శిక్ష విధించారు. దైవప్రవక్త (స) ఆమె భౌతికకాయానికి జనాజానమాజ్ చేయించారు.

అప్పుడు హజ్రత్ ఉమర్ (రజి) అభ్యంతరం చెబుతూ "దైవప్రవక్తా! మీరీ జారిణికి జనాజా నమాజ్ చేయిస్తారా?" అని అన్నారు. దానికి దైవప్రవక్త (స) "ఉమర్! (నీకీమె సంగతి తెలియదు.) ఈమె పడిన పశ్చాత్తాపాన్ని మదీనాలోని డెబ్భయి మంది విశ్వాసు లకు పంచినా అది వారందరి (పాపాల మన్నింపు) కోసం సరిపోతుంది. దైవప్రసన్నత కోసం ఈమె తన ప్రాణాన్ని సైతం త్యాగం చేసిందంటే ఇంతకంటే గొప్ప సత్కార్యం ఇంకేముంటుంది?" అని అన్నారు. (బుఖారి, ముస్లిం ఆధారంగా)

హజ్రత్ అబూహురైరా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "దేవుడు ఇద్దరు మనుషుల్ని చూసి నవ్వుతాడు. వారిద్దరిలో ఒకడు మరొకడ్ని చంపి ఉంటాడు. అయితే వారిద్దరూ స్వర్గానికి వెళ్తారు. మొదటివ్యక్తి దైవమార్గంలో పోరాడుతూ (అవిశ్వాసిగా ఉండిన రెండవ వ్యక్తి చేత) చంపబడతాడు. ఆ తరువాత దేవుడు అతనికి పశ్చాత్తాపం చెందే సద్బుద్ధి ప్రసాదిస్తే, దాంతో అతను ముస్లింగా మారి దైవమార్గంలో పోరాడుతూ అమరగతి పొందుతాడు." (బుఖారి, ముస్లిం)



హజ్రత్ అబూసయీద్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (స) ఇలా తెలిపారు: పూర్వకాలంలో ఒకతను తొంభై తొమ్మిది హత్యలు చేశాడు. ఆ తరువాత (పాపనిష్కృతి అన్వేషణలో) ప్రపంచంలో అందరికంటే గొప్పజ్ఞాని ఎవరని ప్రజల్ని అడుగుతూ తిరగ సాగాడు. చివరికి ఒక సాధువు గురించి తెలిసింది. అతనా సాధువు దగ్గరకు వెళ్ళి "నేను తొంభై తొమ్మిది హత్యలు చేశాను, మరి నాఈ పాపానికి నిష్కృతి ఏదయినా ఉందా?" అని అడిగాడు. దానికి సాధువు ఏమాత్రం లేదన్నాడు. దాంతో అతను కోపం వచ్చి ఆ సాధువుని కూడా హతమార్చాడు. ఈవిధంగా అతను వందమందిని చంపాడు.

ఆ తరువాత అతను అందరికంటే గొప్ప పండితుడెవరో చెప్పమంటూ మళ్ళీ ప్రజలను అడుగుతూ తిరగసాగాడు. చివరికి ఒక పండితుని గురించి తెలిసి అతని దగ్గరకు చేరుకున్నాడు. అతనితో కూడా "నేను వంద మందిని చంపాను. మరిప్పుడు నా పాపానికి ప్రాయశ్చిత్తం ఏమైనా ఉందా?" అనడిగాడు. దానికా పండితుడు 'ఉంద'ని చెప్పి- ఇతనికి, ఇతని పశ్చాత్తాపానికి మధ్య ఎవరు అడ్డువస్తారు? అంటూ "నీవు ఫలానా ఊరికి వెళ్ళు. అక్కడ కొందరు దైవారాధనలో నిమగ్నులైఉన్నారు. నీవు కూడా వారితో కలసి దైవాన్ని ఆరాధించు. ఇంకెప్పుడూ నీ ఊరికి తిరిగిరాకు. అది పాపిష్టి నేల" అని చెప్పి పంపాడు.

ఆ వ్యక్తి అక్కడ్నుంచి బయలుదేరాడు. సగం దూరం ప్రయాణం చేసిన తరువాత అతనికి మృత్యువు కాటేసింది. (అతని ఆత్మను తీసికెళ్ళడానికి) కారుణ్య దైవదూతలు, యాతన దైవదూతలు ఒకేసారి వచ్చారు. ఉభయవార్గాల మధ్య తగాదా వచ్చింది. "ఇతను పాపాల నుండి మరలి మనస్ఫూర్తిగా దేవుని వైపుకు రాసాగాడు (గనక ఇతని ఆత్మను మేము స్వాధీనం చేసుకోవాలి)" అని కారుణ్య దూతలు వాదించారు. "కాదు, ఇతను జీవితంలో ఒక్క సత్కార్యమైనా చేయలేదు (గనక మేమే ఇతని ఆత్మను స్వాధీనం చేసుకోవాలి)" అంటూ యాతన దూతలు పట్టుబట్టారు.

అంతలో మానవరూపంలో మరో దైవదూత వచ్చాడు. ఇరుపక్షాలవారు అతడ్ని మధ్యవర్తిగా ఉండి సమస్యను పరిష్కరించమన్నారు. అప్పుడతను "ఈ రెండు ఊళ్ళ మధ్య ఉన్న దూరం ఎంతుందో కొలవండి. (ఇతను బయలుదేరిన ఊరికి) ఏ ఊరు దగ్గరుందో చూసి దాని ప్రకారం నడచుకోండి" అని తీర్పిచ్చాడు. కొలచి చూస్తే ఆ వ్యక్తి (పాపనిష్కృతి కోసం) పోదలచుకున్న ఊరే దగ్గరగా ఉన్నట్లు తేలింది. అప్పుడు కారుణ్య దైవదూతలే అతని ఆత్మను స్వాధీనం చేసుకొని వెళ్ళిపోయారు." (బుఖారి, ముస్లిం)

ఏమైనప్పటికీ మనిషి దాసుల హక్కుల విషయంలో జాగ్రత్తగా ఉండాలి. నమాజ్, రోజా, హజ్ లాంటి దైవహక్కుల విషయంలో తప్పు జరిగితే దేవుడు క్షమిస్తాడని ఆశించగలం. కాని దాసులహక్కుల విషయంలో తప్పు జరిగినపుడు సంబంధిత వ్యక్తికి క్షమాపణ చెప్పుకోవాలి.

దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "ఒక ముస్లిం దగ్గరకు తోటిముస్లిం సోదరుడు క్షమాపణ చెప్పుకోవడానికి వచ్చినపుడు అతను చెప్పిన కారణం నిజమైనా, అబద్ధమైనా అతని తప్పు క్షమించాలి. ఒకవేళ అతను క్షమించకపోతే అలాంటి వ్యక్తి (ప్రళయదినాన) కౌసర్ కోనేటిపై నా దగ్గరకు చేరుకోలేడు." (హాకిమ్)

# 6. సంకల్పం, దాని క్రియాత్మకరూపం

మనిషి ఏ పుణ్యకార్యం చేసినా చిత్తశుద్ధితో చేయాలి. మన తెలుగునాట "చిత్తశుద్ధిలేని శివపూజలేల" అనే నానుడి చాలామంది వినేఉంటారు. చిత్తశుద్ధిలేని పుణ్యకార్యాలు నెయ్యి లేని నేతిబీరకాయల వంటివే. నేతిబీరకాయలతో మనం కూరయినా వండుకొని తినవచ్చు. కాని చిత్తశుద్ధి లోపించిన పుణ్యకార్యాల వల్ల ఆమాత్రం ప్రయోజనం కూడా లేకపోగా పర లోకంలో ఘోరనష్టం వాటిల్లుతుంది. కనుక ప్రతి పనీ కేవలం దేవుని ప్రసన్నత కోసమే చేయాలి. ప్రజల మెప్పు కోసం, కీర్తిప్రతిష్ఠల కోసం ప్రదర్శనాబుద్ధితో చేసే సత్కర్మలు ప్రళయ దినాన వ్యర్థమయి మనిషి నరకశిక్షలు అనుభవించవలసి వస్తుంది.

దైవప్రవక్త (స) ప్రవచనం: "దేవుడు మీ రూపురేఖలను, సిరిసంపదలను చూడడు. ఆయన మీ అంతర్యాలను, ఆచరణలను మాత్రమే చూస్తాడు." (ముస్లిం)

దైవప్రవక్త (స) హితోక్తి: "కర్మల పర్యవసానం సంకల్పం మీద ఆధారపడి ఉంటుంది. మనిషికి తాను సంకల్పించుకున్నదే లభిస్తుంది. ప్రాపంచిక ప్రయోజనాలు పొందే ఉద్దేశ్యంతో లేక స్త్రీని వివాహమాడే ఉద్దేశ్యంతో హిజ్రత్ చేస్తే ఆ హిజ్రత్ ప్రాపంచిక ప్రయోజనాలు పొందడానికి లేదా స్త్రీని వివాహమాడటాని మాత్రమే అవుతుంది."(బుఖారి, ముస్లిం)

అబూఉమామా (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "ఎవరైతే కేవలం దేవుని కోసం స్నేహం చేస్తాడో, దేవుని కోసం విరోధిస్తాడో, దేవుని కోసం ఇస్తాడో, దేవుని కోసం నిరోధిస్తాడో అతను పరిపూర్ణ విశ్వాసం పొందినవాడవుతాడు." (బుఖారి)

దైవప్రవక్త (స) హితోక్తి: "మక్కావిజయం తర్వాత హిజ్రత్ (వలస) లేదు. అయితే జిహాద్ (దైవమార్గంలో పోరాటం), సంకల్పం మాత్రం కొనసాగుతాయి. జిహాద్ కోసం మిమ్మల్ని పిలవడం జరిగితే, మీరు (తక్షణమే) బయలుదేరండి." (బుఖారీ, ముస్లిం)

హజ్రత్ ముఆజ్ బిన్ జబల్ (రజి) కథనం: దైవప్రవక్త (స) నన్ను యమన్ (రాష్ట్ర) గవర్నర్‌గా నియమించి పంపేటప్పుడు నాకేదైనా ఉపదేశించండని మనవి చేశాను. అప్పుడు దైవప్రవక్త (స) ఇలా ఉపదేశించారు- "ఎలాంటి దురుద్దేశాలు లేకుండా చిత్తశుద్ధి కలిగివుండు. నీవు ఏ సత్కార్యం చేసినా దైవప్రసన్నత కోసమే చెయ్యి. ఇలా చేస్తే కొన్ని సత్కర్మలు కూడా నీ మోక్షానికి సరిపోతాయి." (ముస్తద్‌రక్, తర్గీబ్ వ తర్హీబ్)

హజ్రత్ జాబిర్ బిన్ అబ్దుల్లా (రజి) కథనం: మేము ఒక యుద్ధంలో దైవప్రవక్త (స) వెంటఉన్నాము. అప్పుడాయన ఇలా అన్నారు: "మదీనాలో కొంతమంది (యుద్ధానికి) రాలేకపోయారు. అయితే మీరు ప్రయాణించిన ప్రతిచోటా, మీరు నడిచిన ప్రతి లోయలో వారు మీతోపాటే ఉన్నారు. అనారోగ్యం వారిని ఆపిఉంచింది." వేరొక ఉల్లేఖనం ప్రకారం "పుణ్యంలో వారు కూడా మీతోపాటు భాగస్వాములయ్యార"ని అన్నారు ఆయన. (ముస్లిం)

దైవప్రవక్త (స) హితోక్తి: "దేవుడు సత్కార్యాలను, దుష్కార్యాలను వ్రాసిన తరువాత వాటిని గురించి వివరించాడు. ఎవడైనా మంచిపని చేయాలని సంకల్పించుకొని, (ఏదైనా కారణంచేత) దానిని చేయలేకపోయినప్పటికీ దేవుడు తన వద్ద అతను ఒక సత్కార్యం చేసినట్లు వ్రాసుకుంటాడు. ఆ మనిషి మంచిపని చేయాలని ఉద్దేశించుకున్న పిదప ఆ



పనిని క్రియాత్మకంగా నెరవేరిస్తే దానికి దేవుడు పది నుండి ఏడువందల రెట్ల యూనిట్ల దాకా, (ఒక్కోసారి) అంతకంటే ఎన్నో రెట్లు అధికంగా సత్కర్మలు చేసినట్లు అతని ఖాతాలో రాస్తాడు. (దీనికి భిన్నంగా) ఎవడైనా ఒక చెడుపని చేయాలనుకుని ఏదైనా కారణంచేత చేయకుండా వుంటే దేవుడు తన వద్ద, అతను పూర్తిగా ఒక మంచిపని చేసినట్లు వ్రాసుకుంటాడు. అయితే అతనా చెడ్డపని చేయాలని సంకల్పించుకున్న పిదప దాన్ని చేసేస్తే ఒక్క చెడ్డపని మాత్రమే చేశాడని అతని (ఖాతాలో) వ్రాస్తాడు. (బుఖారీ, ముస్లిం)

దైవప్రవక్త(స) హితోక్తి: "ఎవరైనా తహజ్జుద్ నమాజ్‌కై మేల్కొంటానని సంకల్పించుకొని పడుకున్న తర్వాత గాఢనిద్ర పట్టి ఉషోదయం తర్వాతే మేల్కొంటే, అలాంటి మనిషి కర్మపత్రంలో ఆ రాత్రి అతను తహజ్జుద్ నమాజ్ చేసినట్లు వ్రాయడం జరుగుతుంది. ఆ నిద్ర అతనికి అతని ప్రభువు తరపున బహుమతి అవుతుంది." (నసాయి, ఇబ్నెమాజ)

దైవప్రవక్త (స) హితోక్తి: "తప్పకుండా వచ్చితీరే ప్రళయదినాన దేవుడు మానవులందర్నీ సమీకరించిన తర్వాత పిలిచేవాడు మానవులందర్నీ బిగ్గరగా పిలుస్తూ ఇలా అంటాడు- 'ఎవరైనా ఏదైనా పని దేవుని కోసం చేస్తూ ఆ పనిలో ప్రదర్శనబుద్ధితో మరొకరిని చేర్చితే ఆ మనిషి తన కర్మఫలాన్ని దేవుని నుండి గాక ఇతరుల నుండే పొందాలి." (మిష్కాత్)

మరొకసారి దైవప్రవక్త (స) ఇలా అన్నారు: "దేవుడు తన దాసులకు కర్మఫలాలు ఇచ్చేరోజు లోకులమెప్పు కోసం కర్మలు ఆచరించినవారిని ఉద్దేశించి 'ప్రపంచానికి వెళ్ళండి. మీరు ఎవరి మెప్పుకోసం కర్మలు ఆచరించారో వారి దగ్గరికే వెళ్ళిపోండి. వెళ్ళి వారిదగ్గర మీ కర్మలకు ప్రతిఫలం లభిస్తుందో లేదో చూసుకోండి' అని అంటాడు." (మిష్కాత్)

హజ్రత్ అనస్ (రజి) ప్రకారం దైవప్రవక్త (స) హితోక్తి: "మనిషి హృదయం సరిగా లేనంతవరకూ అతని విశ్వాసం సరిగా ఉండదు. అతని నోరు సరిగా లేనంతవరకూ అతని హృదయం సరిగా ఉండదు. ఏ మనిషీ తన దుష్ప్రవర్తన నుండి అతని పొరుగువాడు సురక్షితంగా లేనంతవరకూ స్వర్గంలో ప్రవేశించ లేడు." (అహ్మద్)

## చిత్తశుద్ధితో చేసిన సత్కర్మలే వారిని కాపాడాయి

దైవప్రవక్త (స) ప్రవచనం: "మీ పూర్వీకుల్లో ముగ్గురు వ్యక్తులు ఎక్కడికో బయలు దేరారు. దారిలో రాత్రివేళ ఆ ముగ్గురూ ఒక గుహలోకి వెళ్ళి ఆశ్రయం పొందారు. అంతలో కొండ పైనుంచి ఒక పెద్ద బండరాయి దొర్లి పడింది. దాంతో గుహ ముఖద్వారం మూసుకుపోయింది. వారా ఆపద నుంచి బయటపడే మార్గం గురించి మాట్లాడుకున్నారు. చివరికి తాము గతంలో చేసుకున్న సత్కార్యాల ఆధారంగా దైవాన్ని ప్రార్థించడం తప్ప ఈ విపత్తు నుండి బయటపడే మార్గం లేదన్న నిర్ణయానికి వచ్చారు.

అప్పుడు వారిలోని ఒకడు ఇలా ప్రార్థించాడు: "దేవా! నాకు చాలా ముసలివారై పోయిన తల్లిదండ్రులు ఉండేవారు. సాయంత్రం పూట అందరికంటే ముందు నేను నా తల్లిదండ్రులకే పాలు త్రాగించేవాడిని. వారికి ముందు నా భార్యాబిడ్డలకుగానీ, నౌకర్లకు గాని త్రాగించేవాణ్ణి కాను. ఓరోజు నేను (పశువుల) మేత కోసం చాలాదూరం వెళ్ళిపోయాను. నేను ఇంటికి తిరిగి వచ్చేసరికి నా తల్లిదండ్రులు నిద్రపోయారు. నేనా పూట పాలు

పితికి తీసుకువచ్చేటప్పటికే వారు గాఢ నిద్రలో ఉండడం చూశాను. వారికి నిద్రాభంగం కలగజేయడానికి నాకు మనసొప్పలేదు. వారికి ముందు నా భార్యాబిడ్డలకు, నౌకర్లకు పాలు త్రాగించడం కూడా నాకిష్టం లేదు. నా పిల్లలు (ఆకలి బాధతో) నాకాళ్ళ మీద పడి విలవిల్లాడినా (నేను వారికి పాలివ్వకుండా) పాలపాత్ర చేతిలో పట్టుకొని తెల్లవారేదాకా నా తల్లిదండ్రుల దగ్గరే నిలబడి, ఏ సమయంలోనైనా వారు మేల్కొంటారేమోనని ఎదురుచూడసాగాను. తెల్లవారిన తరువాత గాని వారు నిద్ర లేవలేదు. నిద్రమేల్కొని రాత్రి వారికోసం ఉంచబడిన పాలు తాగారు. దేవా! కేవలం నీ ప్రసన్నత కోసమే నేనీ సత్కార్యం చేసివుంటే మేము చిక్కుకున్న ఈ గుహ ముఖద్వారం నుండి బండరాయి తొలగించి మమ్మల్ని కాపాడు.''

అతని ప్రార్థన ఫలితంగా ఆ బండరాయి కొద్దిగా పక్కకు జరిగింది. అయితే (అప్పటికీ) ఆ సందుగుండా వారు బయటికి రాలేకపోయారు.

తరువాత రెండో వ్యక్తి దైవాన్ని ఇలా ప్రార్థించాడు: ''దేవా! నా బాబాయి కూతురు ఒకామె ఉండేది. నేనామెను అమితంగా ప్రేమించేవాడ్ని. ఒకసారి నేను ఆమె పొందు కోసం పరితపించాను. కాని అందుకామె ఒప్పుకోలేదు. చివరికి దుర్భిక్షం ఆమెను గత్యంతరం లేక నా వద్దకు వచ్చేలా చేసింది. అప్పుడు ఆమె నాతో ఏకాంతంలో గడిపే షరతుపై నేనామెకు నూట ఇరవై దీనార్లు ఇచ్చాను (గత్యంతరంలేక) ఆమె నా కోరిక తీర్చేందుకు సిద్ధమయింది. నేనామెను ఆక్రమించుకున్నప్పుడు, (వేరొక ఉల్లేఖనం ప్రకారం) నేనామె రెండుతొడల మధ్య కూర్చున్నప్పుడు ఆమె నాతో 'దేవునికి భయపడు! అక్రమంగా కన్నెపొర చించకు'' అంది. ఆమాట వినగానే నేనామె దగ్గర్నుండి లేచి నిల బడ్డాను. నిజానికి ఆమె నాకు ప్రజల్లో అత్యంత ప్రియమైనది. నేనామె కిచ్చిన బంగారు దీనార్లు కూడా వదులుకున్నాను. దేవా! నేను కేవలం నీ ప్రసన్నత కోసమే ఇలా చేసి ఉన్నట్లయితే మాపై వచ్చిపడిన ఈ ఆపద నుండి మమ్మల్ని రక్షించు.''

రెండో వ్యక్తి చేసిన ప్రార్థన తర్వాత ఆ బండరాయి ఇంకొంచెం పక్కకు జరిగింది. అయినా వారు బయటపడేందుకు మార్గం పూర్తిగా సుగమం కాలేదు.

ఆ తరువాత మూడో వ్యక్తి దైవాన్ని ఇలా ప్రార్థించాడు: ''ప్రభూ! నేను కొంతమంది పని మనుషులను జీతానికి పెట్టుకున్నాను. నేను వారందరికీ జీతాలిచ్చేశాను. కాని వారిలో ఒకడు మాత్రం తన జీతం తీసుకోకుండా వెళ్ళిపోయాడు. నేనతని జీతాన్ని నా వ్యాపారంలో పెట్టుబడిగా పెట్టాను. దాంతో చాలా ధనం పోగయ్యింది. కొంత కాలానికి ఆ వ్యక్తి వచ్చి, ''దైవదాసుడా! నాజీతం ఇచ్చెయ్యి'' అనడిగాడు. దానికి నేను ''నువ్వు చూస్తున్న ఈ ఒంటెలు, ఆవులు, మేకలు, బానిసలు అన్నీ నీ జీతం ఫలాలే (వాటిని తీసేసుకో)'' అన్నాను. అందుకతను ''దైవదాసుడా! నాతో పరాచికాలాడకు'' అంటూ ముఖం చిన్నబుచ్చుకున్నాడు. నేను ''ఇది పరాచికం కాదు (నిజమే చెబుతున్నాను)'' అన్నాను. అప్పుడతను ఏమీ వదలకుండా ఆ సంపదనంతా తరలించుకొని వెళ్ళి పోయాడు. దేవా! నేనీ పని కేవలం నీ ప్రసన్నతను దృష్టిలో పెట్టుకొని చేసినట్లయితే మేము చిక్కుకున్న ఈ ఆపద నుంచి మమ్మల్ని కాపాడు.''



దాంతో ఆ బండరాయి పూర్తిగా తొలగిపోయి గుహద్వారం తెరుచుకుంది. అప్పుడు వారు ముగ్గురూ క్షేమంగా బయటపడ్డారు. (బుఖారీ, ముస్లిం)

## అజ్ఞానకాలంలో ఆచరించిన కర్మల పర్యవసానం

మనిషి ఇస్లాం స్వీకరించకుండా ఎన్ని సత్కార్యాలు చేసినా అదే స్థితిలో చనిపోతే పర లోకంలో అతనికి ఆ సత్కార్యాలు ఎలాంటి ప్రయోజనం చేకూర్చలేవు. మహాఅయితే ఆ సత్కార్యాల వల్ల అతనికి విధించే నరకయాతనల తీవ్రత కొంచెం తగ్గించబడుతుంది. అంతేకాని స్వర్గం లభించే ప్రసక్తే లేదు. అతను ఇస్లాం స్వీకరించి అదే స్థితిలో చనిపోవడం జరిగితే (పరలోకంలో) గతజీవితంలోని పుణ్యకార్యాలకు పుణ్యఫలం లభిస్తుంది.

హజ్రత్ అబ్దుల్లా బిన్ మస్ఊద్ (రజి) ఉల్లేఖనం: ఒకతను దైవప్రవక్త (స) సన్నిధికి వచ్చి ''దైవప్రవక్తా! అజ్ఞానకాలంలో ఆచరించిన కర్మలను గురించి కూడా (దేవుని ముందు) విచారణ జరుగుతుందా?'' అని ప్రశ్నించాడు. దానికి దైవప్రవక్త (స) ఇలా సమాధాన మిచ్చారు- ''ఇస్లాం స్వీకరించిన తరువాత సత్కర్మలు ఆచరిస్తుంటే అజ్ఞానకాలంలో చేసిన దుష్కర్మలను గురించి నిలదీయడం జరగదు. అయితే ఇస్లాం స్వీకరించిన తరువాత కూడా దుష్కార్యాలు చేస్తుంటే, అతను గతంలో చేసినవాటితో పాటు మొత్తం పాపకార్యాల విషయంలో పట్టుబడిపోతాడు.'' (బుఖారి)

హకీం బిన్ హిజామ్ (రజి) కథనం: నేనొకసారి ''దైవప్రవక్తా! నేను అవిశ్వాస జీవితంలో చేసిన సత్కర్మలకు ఎలాంటిప్రతిఫలం లభిస్తుంది? నేను గతంలో దానధర్మాలు, బానిసల విముక్తి, బంధువుల పట్ల దయాదాక్షిణ్యాలు మొదలైన సత్కార్యాలు చేశాను. మరినాకు వాటి పుణ్యఫలం లభిస్తుందా?'' అని అడిగాను. దానికి దైవప్రవక్త (స) ''నీవు నీ గత సత్కర్మల కారణంగానే ముస్లిం అయ్యావు. (ఇస్లాం స్వీకరించిన కారణంగా నీ గత సత్కర్మలక్కూడా ఇప్పుడు పుణ్యఫలం లభిస్తుంది)'' అని చెప్పారు. (బుఖారి)

# 7. జ్ఞానార్జన ఆవశ్యకత

మనిషి ఇవన్నీ తెలుసుకొని తననుతాను సంస్కరించుకోవడానికి ఖుర్ఆన్, హదీసులకు సంబంధించిన జ్ఞానం ఆర్జించడం ఎంతో అవసరం. ఇస్లాంలో జ్ఞానార్జన ఆవశ్యకత గురించిన విషయాలు వింటే మన తెలుగునాట ప్రసిద్ధిచెందిన ''విద్య లేనివాడు వింత పశువు'' అన్న సామెత గుర్తుకొస్తుంది. దైవధర్మం పట్ల సరైన అవగాహనతో కూడిన జ్ఞానం ఉన్నప్పుడే మనిషి దైవానికి భయపడి తదనుగుణంగా జీవితం గడుపుతాడు.

"దేవుని దాసులలో జ్ఞానులు మాత్రమే దేవునికి భయపడతారు." (ఖుర్ఆన్–35:28)

దేవునికి భయపడేందు జ్ఞానార్జన కావాలి. జ్ఞానార్జన అంటే 1-చదవడం, వ్రాయడం నేర్చు కోవడంతో పాటు, 2-సాత్వికజీవితం గడపడానికి ఇస్లామీయ జ్ఞానం ఆర్జించడమని అర్థం.

దైవప్రవక్త కాలంలో జరిగిన కొన్నియుద్ధాలలో శత్రువులు ఖైదీలుగా పట్టుబడి నప్పుడు వారిలో కొందరిని వారి బంధువులు వచ్చి నష్టపరిహారం చెల్లించి విడిపించుకు పోయారు. నష్టపరిహారం చెల్లించుకోలేని ఖైదీలు చదువురాని ముస్లింలకు చదువు నేర్పితే విడుదల చేస్తామని దైవప్రవక్త (స) ప్రకటించారు. ఆవిధంగా ఆనాడు కొందరు

ముస్లింలు చదువు నేర్చుకున్నారు. చదువుసంధ్యలకు ఖుర్ఆన్ ఎంతో ప్రాముఖ్యమిచ్చింది. అసలు ఖుర్ఆన్ అవతరణే 'చదువు' అనే మాటతో ప్రారంభమయింది.

"(ముహమ్మద్!) సర్వసృష్టికర్త అయిన నీ ప్రభువు పేరు స్మరించి పఠించు. ఆయనే మానవుడ్ని గడ్డకట్టిన రక్తంతో సృజించాడు. చదువు. నీ ప్రభువు మహోన్నతుడు. ఎంతో ఉదారుడు. ఆయన మానవునికి కలం ద్వారా అతను ఎరగని జ్ఞానం నేర్పాడు. (కనుక మానవుడు అజ్ఞానిగా ప్రవర్తిస్తూ అపమార్గం పట్టడానికి) ఎంతమాత్రం వీల్లేదు. మానవుడు తనను తాను గొప్పవాణ్ణని, నిరపేక్షాపరుణ్ణని భావించి విర్రవీగుతున్నాడు. (కాని) అతను చివరికి నీ ప్రభువు సన్నిధికే మరలిపోవలసి ఉంది." (ఖుర్ఆన్. 96:1-8)

ఇస్లామీయజ్ఞానం లేకపోతే మనిషికి ధర్మంఏదో- అధర్మంఏదో, పాపమేదో- పుణ్యమేదో, మంచేదో-చెడేదో ఎలా తెలుస్తుంది? షిర్క్-తౌహీద్‌ల సమగ్రరూపం, వాటి తేడా ఎలా తెలుస్తుంది? దేవుని హక్కులేమిటో, దాసుల హక్కులేమిటో ఎలా తెలుస్తాయి? ఆస్తి పంపకంలో, ఉపాధి సముపార్జనలో, ఇతర ఆర్థిక వ్యవహారాలలోని దైవాజ్ఞలు ఎలా తెలుస్తాయి? వైవాహిక విలువలు, విడాకుల పద్ధతులు ఎలా తెలుస్తాయి? ఖుర్ఆన్ మనిషిని ఎలా తీర్చిదిద్దదలచిందో ఎలా తెలుస్తుంది? ఇస్లాం గురించి సరయిన అవగాహన లేకపోతే ఇస్లాంవ్యతిరేక శక్తుల పట్ల ఎలా వ్యవహరించగలం? అందుకే ఇస్లాం జ్ఞానార్జనకు పెద్ద పీట వేసింది.

## విద్య లేనివాడు వింతపశువు

"(సత్య)జ్ఞానం ఉన్నవాళ్లు, జ్ఞానం లేనివాళ్లు ఒకటేనా అని అడుగు వారిని. (మా) హితబోధను బుద్ధిమంతులే స్వీకరిస్తారు." (ఖుర్ఆన్-39:9)

దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "సాధారణ నక్షత్రాలపై పౌర్ణమి చంద్రుడికి ఎలాంటి ఘనతా ఔన్నత్యాలున్నాయో, సాధారణ భక్తులపై పండితులకు అలాంటి ఘనతా ఔన్నత్యాలే ఉన్నాయి. పండితులు దైవప్రవక్తల వారసులు. దైవప్రవక్తలు తమ వారసత్వంలో ధనకనక వస్తువులకు బదులు విద్యను వదలిపెట్టారు. కనుక ఎవరైతే (ధర్మ)జ్ఞానం సంపాదించాడో అతను పెద్దఎత్తున ధనాన్ని సంపాదించినట్లే." (అహ్మద్, తిర్మిజి)

దైవప్రవక్త (స) హితోక్తి: "(ధర్మ)జ్ఞానాన్ని అన్వేషిస్తూ బయలుదేరేవారి కోసం దేవుడు వారు నడిచే మార్గంగుండా స్వర్గమార్గాన్ని సుగమం చేస్తాడు. దైవదూతలు విద్యార్థి చేసే పనులపట్ల ప్రసన్నులై అతని గౌరవార్థం (అతని దారిలో) రెక్కలు పరుస్తారు. భూమ్యాకాశాలలో ఉన్నవారు, నీటిలో ఉండే చేపలు కూడా జ్ఞానుల మన్నింపు కోసం ప్రార్థిస్తాయి. చంద్రునికి ఇతర నక్షత్రాల మీద ఎంత విశిష్ఠత ఉందో జ్ఞానులకు (సాధారణ) ఆరాధకుల మీద అంతే విశిష్ఠత ఉంది. జ్ఞానులు దైవప్రవక్తల వారసులు. దైవప్రవక్తలు తమ వారసుల కోసం దిర్హంలు, దీనార్లు వదలివెళ్ళరు. వారు జ్ఞానం మాత్రమే వదలి వెళ్తారు. కనుక ఆ జ్ఞానం నేర్చుకున్నవారు మహాభాగ్యం పొందినట్లే." (అబూదావూద్, తిర్మిజీ)

దైవప్రవక్త (స) జ్ఞానార్జన ఆవశ్యకతను గురించి మరింత వివరంగా ఇలా చెప్పారు:

"ఎవరైనా చదువు నేర్చుకునే ఉద్దేశ్యంతో ఏదైనామార్గాన నడుస్తుంటే అతను స్వర్గ మార్గాన నడుస్తున్నట్లే. విద్యార్థి సంతోషం కోసం దైవదూతలు (అతని దారిలో) రెక్కలు పరుస్తారు. అతని శ్రేయస్సు కోసం దైవాన్ని ప్రార్థిస్తారు. పండితుల కోసం భూమ్యాకాశాల్లోని



సృష్టిరాసులన్నీ పాపమన్నింపు ప్రార్థన చేస్తాయి. చివరికి సముద్రాలు, సముద్రాలలోని చేపలు, పుట్టలలోని చీమలు సైతం వారి శ్రేయస్సు కోసం దైవాన్ని ప్రార్థిస్తాయి." (తిర్మిజి)

"దేవుడు ఎవరికైనా మేలు చేయదలచుకుంటే అతనికి ఆయన ధర్మజ్ఞానం, ధర్మావగాహనా భాగ్యం ప్రసాదిస్తాడు." (బుఖారి, ముస్లిం)

"విజ్ఞతావివేచనలుగల పండితుడు (ధర్మవేత్త) వేయిమంది (సాధారణ) భక్తులకంటే ఎక్కువ షైతాన్‌కు భారమవుతాడు." (తిర్మిజి, మిష్కాత్)

"ఇద్దరు వ్యక్తుల్ని గురించి మాత్రమే అసూయ పడటం ధర్మసమ్మతం అవుతుంది. ఒకడు, దేవుడు ప్రసాదించిన సంపదను దైవమార్గంలో వినియోగించే సత్బుద్ధి ప్రసాదించబడినవాడు. రెండోవాడు, దేవుడు ప్రసాదించిన విద్యావివేకాల ప్రకారం నిర్ణయాలు చేసే, వాటిని ఇతరులకు నేర్పేవాడు." (బుఖారి, ముస్లిం)

"ఎవరైనా ధర్మవిద్య నేర్చుకోవడానికి ఎక్కడికైనా ప్రయణమై వెళ్తుంటే దేవుడు అతని కోసం స్వర్గమార్గం సుగమం చేస్తాడు. ఎవరైనా దేవుని ఆలయాలలోని ఏదైనా ఆలయం (మసీదు)లో సమావేశమయి దైవగ్రంథాన్ని చదువుతూ దాన్ని గురించి చర్చిస్తూ ఉంటే, వారిపై దేవుని తరపున విశ్వాసపరమైన స్థిమితం అవతరిస్తుంది; వారిని దైవ కారుణ్యం కమ్ముకుంటుంది. దేవుడు తన దూతల సమావేశంలో వారిని గురించి ప్రస్తావిస్తాడు. (అంటే వారిని ప్రశంసిస్తాడు.)..." (ముస్లిం)

హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) కథనం: "రాత్రివేళ కొంతసేపు (ధర్మ)విద్య నేర్చుకోవడం, నేర్పడం (దైవధ్యానంలో) రాత్రిజాగరణ చేయడం కంటే ఎంతో శ్రేష్ఠమైనది." (మిష్కాత్)

దైవప్రవక్త (స) ఓరోజు మస్జిదె నబవీలో ప్రవేశించినపుడు అక్కడ రెండు బృందాలు (కూర్చొని)ఉన్నాయి. (ఒక బృందం దైవనామస్మరణలో లీనమైవుంది. రెండవ బృందం ధర్మవిద్య నేర్చుకోవడం, నేర్పడంలో నిమగ్నమైఉంది). దైవప్రవక్త (స) ఆ రెండు బృందాలను చూసి "రెండు బృందాలూ పుణ్యకార్యాల్లో నిమగ్నమైఉన్నాయి. అయితే ఈ రెండిటిలో ఒకటి రెండవ దానికంటే శ్రేష్ఠమైనది. వీరు దైవనామ స్మరణ, వేడుకోలు, పాపమన్నింపు ప్రార్థనలు చేస్తున్నారు. దేవుడు తలచుకుంటే వీరికి దీని (ప్రతిఫలం) ఇవ్వచ్చు, ఇవ్వక పోవచ్చు. ఇక రెండవబృందంవారు ధర్మవిద్య నేర్చుకోవడం, నేర్పడం చేస్తున్నారు. నేను అధ్యాపకుడిగా, విద్యాబోధకుడిగా చేసి పంపబడ్డాను" అని అన్నారు. ఆ తరువాత ఆయన ధర్మవిద్య నేర్చుకునే, నేర్పే బృందం దగ్గరకు వెళ్ళి కూర్చున్నారు. (మిష్కాత్)

దైవప్రవక్త (స) తన అనుచరులకు విద్యావశ్యకతను తెలుపుతూ "జ్ఞానార్జన ప్రతి ముస్లిం విధి" అన్నారు. (జామె బయానుల్ ఇల్మ్)- ఆయన మరో సందర్భంలో "మీరు కూడా విద్య నేర్చుకోండి, మీ స్త్రీలకు కూడా నేర్పండి" అని చెప్పారు. (దార్మి)

దైవప్రవక్త (స) వేరొక సందర్భంలో ఇలా అన్నారు: "చదువు నేర్చుకోండి. చదువు ధర్మాధర్మాల విచక్షణ నేర్పుతుంది, స్వర్గవాసుల దారి చూపుతుంది; భయాందోళనల సమయంలో ప్రేమాభిమానాలు జనింపజేస్తుంది; ఒంటరితనంలో సహచరిగా ఉంటుంది; పేదరికంలో మార్గదర్శిని అవుతుంది; శత్రువుల్ని ఎదుర్కోవడానికి మంచి ఆయుధంగా

ఉపయోగ పడుతుంది. విద్య స్నేహితులకు ప్రాణమిత్రుడు; విద్య వల్లనే దేవుడు జాతులకు ప్రగతి వికాసాలు ప్రసాదిస్తాడు; విద్య మూలంగానే ప్రజలు సజ్జనుల్ని తమ నాయకులుగా, మార్గదర్శులుగా చేసుకుంటారు; ఆ సజ్జనుల ఆచరణలు ప్రజలు అనుసరించేవిగా ఉంటాయి; వారి అభిప్రాయాలకు విలువనిస్తారు." (జామె బయానుల్ ఇల్మ్)

ఈ హదీసులో 'విద్య' అంటే ఇస్లామీయజ్ఞానమని అర్థం. ఇస్లాంకు మారుపేరు జ్ఞానమే. మనం జ్ఞానానికి వ్యతిరేకంగా అజ్ఞానం అనే పదం వాడుతాం. ఇస్లాంకు వ్యతిరేక పదం కూడా అజ్ఞానమే. ఇస్లాంకు వ్యతిరేకమైన ప్రతిపనీ అజ్ఞానంతో కూడుకున్న చేష్టే అవుతుంది. ఖుర్ఆన్‌లోని 3:154 సూక్తిలో, దైవమార్గంలో పోరాడకుండా తప్పించుకునేవారిని గురించి "వారు దేవుని విషయంలో అజ్ఞానంతో కూడిన అనుమానానికి గురయ్యార"ని ఉంది. 5:50 సూక్తిలో దైవచట్టాలకు బదులు ఇతర చట్టాల ప్రకారం తమ వ్యవహారాలను పరిష్కరించుకునే వారిని గురించి "వీరు అజ్ఞానకాలంనాటి అనాగరిక పద్ధతులు కోరుతున్నారా?" అని పేర్కొనబడింది.

హజ్రత్ అబూదర్దా (రజి) ఓసారి ఎవరితోనో జగడమాడుతూ నీయమ్మ అంటూ తిట్టారు. దైవప్రవక్త (స) ఈమాట విని "నీలో అజ్ఞానం ఇంకా పోలేదు" అన్నారు. మరొక హదీసు ప్రకారం దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "అజ్ఞానానికి సంబంధించి మూడు విషయాలున్నాయి. అవి- ఇతరుల కులగోత్రాలను కించపరిచే విధంగా మాట్లాడటం, గ్రహబలం ద్వారా జాతకం చెప్పించుకోవడం, చనిపోయినవారిని తలచుకొని గుండెలు బాదుకుంటూ ఏడ్పులు, పెడబొబ్బలు పెట్టడం." (హదీస్)

"ప్రవక్తా! నీ దగ్గరకు ఖుర్ఆన్ పూర్తిగా అవతరించనంత వరకు నీవు దాన్ని పఠించడానికి తొందరపడకు. 'ప్రభూ! నాకు మరింత జ్ఞానం ప్రసాదించు' అని వేడుకో." (20:114)

పై సూక్తిలో 'జ్ఞానం' అంటే మెడికల్, ఇంజినీరింగ్, కంప్యూటర్ జ్ఞానం కాదు. ఇస్లామీయ జ్ఞానం అనే అర్థం. ఇస్లాంకు వ్యతిరేకంకాని వృత్తిపరమైన విద్యయినా, సాంకేతిక విద్యయినా, నేర్చుకోవడం, దాని ప్రకారం ఆచరించడం తప్పేమీ కాదు. పైగా శ్రద్ధా సామర్థ్యాలు ఉన్నవారు అలాంటి విద్యలు నేర్చుకొని ధర్మసమ్మతమైన సంపాదన కోసం శ్రమించడం కూడా సత్కార్యాల పరిధిలోకే వస్తుంది. అయితే ఇస్లామీయ జ్ఞానం లోపించిన ఏ విద్యయినా అది అందమైన శవం లాంటిదే అవుతుంది. దానివల్ల మనిషికి పరలోకంలో ఎలాంటి సత్ఫలం లభించదు. దైవప్రవక్త (స) ఈవిధంగా తెలియజేశారు:

"వివేకవంతమైన మాట విజ్ఞుడు కోల్పోయిన సంపద. ఆ మాట ఎక్కడున్నా దాన్ని తీసుకునే హక్కు అతనికే ఎక్కువగా ఉంటుంది" అన్నారు దైవప్రవక్త (స). (తిర్మిజి)

దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "మూడు విషయాలను గురించిన జ్ఞానార్జనే విద్య అనబడుతుంది. ఒకటి, మనిషి ఖుర్ఆన్‌లోని స్పష్టమైన సూక్తులు నేర్చుకోవాలి; రెండు, లేదా నిరూపిత సంప్రయాలను(హదీసుల్ని) నేర్చుకోవాలి; మూడు, లేదా న్యాయవంతమైన ధనవిభజనకు సంబంధించిన విద్య నేర్చుకోవాలి." (అబూదావూద్)

హజ్రత్ అనస్ (రజి) ఉల్లేఖనం: దైవప్రవక్త (స) కాలంలో ఇద్దరు అన్నదమ్ములు ఉండేవారు. వారిలోఒకడు తరచూ దైవప్రవక్త (స) సన్నిధికి వచ్చేవాడు. (ఆయన వద్ద ధర్మజ్ఞానం ఆర్జించేవాడు). రెండోవాడు పనిచేసి డబ్బు సంపాదించేవాడు. ఒకసారి



రెండోవాడు తన సోదరుడు పనిచేయకుండా ఖాళీగా కూర్చుంటున్నాడని దైవప్రవక్త (స)కు ఫిర్యాదు చేశాడు. దానికి దైవప్రవక్త (స) "బహుశా అతని మూలంగానే నీకు ఉపాధి లభిస్తుందేమో!" అని అన్నారు. (తిర్మిజీ)

## పుస్తకాలు మోసే గాడిద

"మనోవాంఛల్ని దైవంగా చేసుకున్నవాడ్ని గురించి నీవెప్పుడైనా ఆలోచించావా? అతను విద్యాజ్ఞానాలు కలిగివున్నా దేవుడు అతడ్ని దారి తప్పించాడు. అతని హృదయ కవాటాలు మూసివేశాడు; చెవులకు సీలువేశాడు; కళ్ళకు గంతలుకట్టాడు. దేవుడే అలా చేశాక ఇక అతనికి ఎవరు దారిచూపగలరు? మీరు గుణపాఠం నేర్చుకోరా?" (ఖుర్ఆన్-45:23)

పూర్వం మన తెలుగునాట విద్యాబుద్ధులు, చదువుసంస్కారాలు అనే మాటలు విరివిగా వాడబడుతుండేవి. ఈమాటల వెనుక విద్యార్జనా ఉద్దేశ్యం మనిషిని నీతిమంతుడుగా చేయాలన్నదే. ఇవిప్పుడు పాతబడి పోయాయి. ఇస్లాంలో దైవప్రసన్నత పొందే ఉద్దేశ్యంతో జ్ఞానార్జన చేసేవాడే దాన్ని సద్వినియోగం చేయగలుగుతాడు. దైవప్రసన్నత పొందే ఉద్దేశ్యం కాకుండా మరో ఉద్దేశ్యంతో ధర్మవిద్యార్జన చేసేవారికి ఆ విద్య పరలోకంలో నష్టాన్నే తెచ్చిపెడ్తుంది.

ఈ విషయం గురించి దైవప్రవక్త (సల్లం) ప్రవచించిన హితోక్తులు చూడండి:

"పండితులతో పోటీకి దిగే ఉద్దేశ్యంతోనో, తక్కువగా చదువుకున్నవాళ్ళతో వాదించే ఉద్దేశ్యంతోనో లేదా ప్రజలను తన వైపుకు ఆకట్టుకునే ఉద్దేశ్యంతోనో విద్య నేర్చుకున్నవాడ్ని దేవుడు నరకంలో పడవేస్తాడు." (తిర్మిజి, ఇబ్నెమాజ)

"దైవప్రసన్నత పొందడానికి ఆర్జించవలసిన విద్యను ఎవరైనా ప్రాపంచికప్రయోజనాలు పొందే ఉద్దేశ్యంతో ఆర్జిస్తే అలాంటి మనిషి ప్రళయ దినాన స్వర్గ సువాసనను కూడా ఆఘ్రాణించలేడు." (అహ్మద్, అబూదావూద్, ఇబ్నెమాజ)

దైవప్రసన్నత కోసం విద్య నేర్చుకున్నప్పటికీ దాని ప్రకారం ఆచరించకపోయినా ప్రయోజనం లేదు. ప్రయోజనం సంగతి అలా ఉంచితే పరలోకంలో ఆ విద్యే ఘోరనష్టం కలిగిస్తుంది. మాటలకు, చేతలకు పొంతనలేని ధర్మవిద్య వల్ల మనిషి ప్రపంచంలో ప్రజలను మోసగించి సిరిసంపదలు, పేరుప్రతిష్ఠలు సంపాదించవచ్చు. కాని పరలోకంలో అలాంటి విద్య నరకయాతనలు తెచ్చిపెడ్తుంది. ఈ విషయంలో ఖుర్ఆన్ బోధనలు చూడండి:

"విశ్వాసులారా! మీరు చేయనిదాన్ని గురించి ఎందుకు మాట్లాడుతున్నారు? చేయనిదాన్ని గురించి చెప్పుకోవడం దేవునికి చాలా అప్రియమైన విషయం." (61:2,3)

"తౌరాత్ (ఆజ్ఞలు పాటించే) బాధ్యత మోపబడినవారు ఆ బాధ్యత నిర్వహించలేదు. వారిని పుస్తకాలు మోసే గాడిదతో పోల్చవచ్చు. (తౌరాత్‌జ్ఞానం తెలిసి కూడా అంధులయి) దైవసూక్తుల్ని నిరాకరించినవారు అంతకంటే దిగజారిపోయారు." (62:5)

హజ్రత్ అబూమూసా (రజి) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (స) ఇలా అన్నారు: "దేవుడు నాకిచ్చి పంపిన మార్గదర్శకత్వం, విద్యాజ్ఞానాలు నేలపైకురిసే వర్షం లాంటివి. ఆ నేలలో కొంత భాగం సారవంతమైనది. అది (వర్షపు) నీటిని పీల్చుకొని పచ్చిక, చెట్లు చేమలను మొలకెత్తించింది. ఆ నేలలోని మరికొంతభాగం బంజరుభూమి. అది (నీటిని

పీల్చుకోలేకపోయినా) నిల్వచేసి ఉంచింది. ఆ నీటితో దేవుడు ప్రజలకు ప్రయోజనం చేకూర్చుతాడు. వారా నీటిని త్రాగుతారు (తమ పశువులకు) త్రాగిస్తారు, పంటపొలాల కోసం కూడా వినియోగిస్తారు. ఆ వర్షమే మెట్టపల్లాలు లేని చదునైన నేలపై కూడా కురిసింది. కాని ఆ నేల వర్షపు నీటిని నిలిపి ఉంచడంగాని, పచ్చికను మొలకెత్తించటం గాని చేయజాలదు. ఈ ఉదాహరణలు దైవధర్మాన్ని అర్థం చేసుకున్న వ్యక్తికి వర్తిస్తాయి. దేవుడు నాకిచ్చి పంపిన జ్ఞానం, సన్మార్గాలతో అతనికి ప్రయోజనం చేకూర్చాడు. అతను (ధర్మ)జ్ఞానం ఆర్జించి (ఇతరులకు కూడా) బోధించాడు. ఇక (మూడవ) ఉదాహరణ (ధర్మం) వైపు తలెత్తి అయినా చూడకుండా దేవుడు నాకిచ్చిన సన్మార్గాన్ని తృణీకరించిన వానికి వర్తిస్తుంది." (బుఖారీ, ముస్లిం)

హసన్ బస్రి (రహ్మాలై) విద్యను గురించి ఇలా వివరించారు: "విద్య రెండు రకాలు. ఒకరకం విద్య అంతరంగంలోకి దిగుతుంది. ఈ విద్యే ప్రళయదినాన పనికొస్తుంది. రెండోరకం విద్య నాలుక పైనే ఉండిపోతుంది; అంతరంగంలోకి దిగదు. ఈ విద్య దేవుని న్యాయస్థానంలో మనిషికి వ్యతిరేకంగా ప్రమాణం అవుతుంది. (అంటే మనిషికి వ్యతిరేకంగా సాక్ష్యం ఇస్తుందన్నమాట.)- (ముస్నద్‌దార్మి)

దైవప్రవక్త (స) ఈవిధంగా దుఆ(ప్రార్థన) చేశారు: "దేవా! నీవు ప్రసాదించిన జ్ఞానం నాకు ప్రయోజనకరమైనదిగా చెయ్యి. నాకు ప్రయోజనం చేకూర్చే విద్యే ప్రసాదించు. నా జ్ఞానం అధికం చెయ్యి." (తిర్మిజి)

మరో సందర్భంలో ఇలా దుఆ చేశారు: "దేవా! నిష్ప్రయోజనమైన విద్య (తెచ్చే కీడు) నుండి నేను నీ శరణుకోరుతున్నాను." (ముస్లిం)

వేరొక సందర్భంలో ఈవిధంగా దుఆ చేశారు: "దేవా! మాకు సత్యాన్ని సత్యంగా భావించే, దాని ప్రకారం ఆచరించే సద్బుద్ధి ప్రసాదించు. అలాగే అసత్యాన్ని అసత్యంగా భావించే, దాని (కీడు)నుండి కాపాడుకునే సద్బుద్ధి కూడా ప్రసాదించు." (ఇబ్నెమాజ)

## అందరికంటే గొప్ప పండితుడు

హజ్రత్ మూసా (అలైహి) ఓసారి ఇస్రాయీలీల ముందు ప్రసంగిస్తుంటే ఒకతను లేచి "అందరికంటే గొప్పపండితుడు ఎవర"ని అడిగాడు. దానికి మూసా (అలైహి) నేనే అన్నారు. ఈ మాటకు దేవుడు ఆగ్రహించి "మజ్మయిల్ బహ్రైన్ (నదీ సంగమం) వద్ద నా దాసుడొకడున్నాడు. అతను నీకంటే గొప్పపండితుడు" అన్నాడు. "అయితే ప్రభూ! నేనాయన వద్దకు ఎలా చేరుకోవాలి?" అనడిగారు మూసా. "నీవొక చేపను తోలుతిత్తిలో పెట్టుకొని తీసికెళ్ళు. ఎక్కడైతే నీకా చేప కన్పించదో ఆ ప్రదేశంలోనే నీవా మనిషిని కలుసుకోగలవు" అని అన్నాడు దేవుడు. అప్పుడు మూసా (అలైహి) సేవకుడు యూషె బిన్ నూన్‌ని తీసుకొని బయలుదేరారు.... కాస్సేపటికి ఒక పిట్ట వచ్చి పడవ అంచుమీద కూర్చున్నది. అది నదిలోని నీటిని ఒకటి లేక రెండు చుక్కలు ముక్కుతో పీల్చుకున్నది. అప్పుడు ఖిజర్ (అలైహి) మాట్లాడుతూ "నీకు, నాకు లభించిన జ్ఞానాన్ని దేవునికున్న జ్ఞానంతో పోల్చితే అది ఈ పిట్ట నదిలో నుంచి నీటిని తన ముక్కుతో పీల్చుకున్నంత కూడా లేదు" అన్నారు. (బుఖారి, ముస్లిం)



# 8. ఖుర్‌ఆన్ ఔన్నత్యం

"మానవులారా! మీ ప్రభువు నుండి మీ దగ్గరికి స్పష్టమైన ప్రమాణం వచ్చింది. మేము (మీ అజ్ఞానం దూరంచేసి రుజుమార్గం చూపడానికి) మీదగ్గరకు స్పష్టమైన జ్యోతి పంపాము. కనుక దేవుని సూక్తులు విశ్వసించి ఆయన చూపిన ధర్మాన్ని గట్టిగా ఆశ్రయించినవారిని ఆయన తన కారుణ్యానుగ్రహాల (స్వర్గం)లోకి ప్రవేశింపజేస్తాడు." (ఖుర్‌ఆన్-4:174,175)

"ఈ గ్రంథం మానవాళికి మార్గదర్శిని. ఇందులో రుజుమార్గం తెలిపే, సత్యాసత్యాలను, మంచీచెడులను వేరుచేసిచూపే స్పష్టమైన బోధనలు ఉన్నాయి," (ఖుర్‌ఆన్-2:185)

"వారు ఖుర్‌ఆన్ గురించి ఆలోచించరా? ఇది అల్లాహ్ నుండి గాకుండా మరెవరి నుండో వచ్చివుంటే ఇందులో ఎంతో భావవైరుధ్యం ఉండేది కదా!" (ఖుర్‌ఆన్-4:82)

"మేమీ ఖుర్‌ఆన్‌ని ఏదైనా పర్వతంపై దించితే, దాని పరిస్థితి ఏమవుతుందో నీవు చూస్తావు. అది దైవభీతితో కంపించి క్రుంగిపోతూ పగిలిపోతుంది. మానవులు (తమని గురించి) ఆలోచిస్తారని వారి ముందు మేమీ దృష్టాంతాలు పేర్కొంటున్నాం." (ఖు-59:21)

విశ్వాసుల మాతృమూర్తి హజ్రత్ ఆయిషా (రజి) కథనం: హారిస్ బిన్ హిష్షామ్ (రజి) వచ్చి "దైవప్రవక్తా! మీకు దైవవాణి ఏవిధంగా అందుతుంది?" అని అడిగారు. దానికి దైవప్రవక్త (స) ఇలా సమాధానమిచ్చారు- "ఒక్కోసారి అది గంట మోగుతున్నట్లు నా దగ్గరకు వస్తుంది. ఆ సమయం నాకు చాలా కఠినంగా ఉంటుంది. ఆ పరిస్థితి పోగానే దివ్యావిష్కృతి సూక్తుల్ని నేను నా (మెదడులో) భద్రపరచుకుంటాను. ఒక్కోసారి దైవదూత మానవరూపంలో నా ముందు ప్రత్యక్షమయి నాతో మాట్లాడుతాడు. అతను చెప్పినదాన్ని నేను భద్రపరచుకుంటాను." హజ్రత్ ఆయిషా (రజి) కథనం: "నేను ఆయన్ని దైవవాణి అవతరించే స్థితిలో చూశాను. రక్తం గడ్డకట్టుకుపోయే తీవ్రమైన చలిలో సైతం దైవవాణి అవతరించిన తరువాత ఆయన నుదురు చెమటతో తడిసిపోయేది." (బుఖారి)

హజ్రత్ జాబిర్ (రజి) ప్రకారం దైవప్రవక్త (స) తరచుగా తన ప్రసంగాలలో ఇలా చెప్పేవారు: "అన్నిటికంటే అత్యంత శ్రేష్ఠమైన వాణి దేవునివాణి. అత్యంత శ్రేష్ఠమైన విధానం ముహమ్మద్ (స) విధానం. అత్యంత దుష్ట విషయాలు 'బిద్‌అత్'లు. ( దైవ ధర్మంలో మానవులు చేర్చే కొత్తపోకడలు). ప్రతి బిద్‌అత్ మార్గవిహీనమైనది." (ముస్లిం)

జ్ఞానార్జనలో మొట్టమొదటిది, అత్యంత ముఖ్యమైనది ఖుర్‌ఆన్ జ్ఞానార్జనే. ఖుర్‌ఆన్ తరువాత హదీస్ జ్ఞానం ఎంతో ముఖ్యమైనది. ఈ రెండిటి జ్ఞానం ప్రతిముస్లింకూ అవసరమే. కనుక దైవభీతిపరాయణులుగా జీవితం గడపదలచుకునే ముస్లింలు ముందుగా ఖుర్‌ఆన్‌లో ఏముందో తెలుసుకోవాలి. దైవప్రవక్త (స) ఖుర్‌ఆన్ పఠనం గురించి అనుచరుల్ని ఎంతో ప్రోత్సహించారు. ఆయన తన అనుచరులకు ఇలా హితోపదేశం చేశారు:

"ఖుర్‌ఆన్‌ని అధ్యయనం చేసి, దాన్ని ప్రతిరోజూ పఠిస్తుండేవాడు కస్తూరీ నిండిన (మూతలేని) జాడీ లాంటివాడు. దాని పరిమళం నలువైపులా గుబాళిస్తుంది. అయితే ఖుర్‌ఆన్‌ని అధ్యయనం మాత్రమే చేసి, దాన్ని (రోజూ) పఠించని మనిషి కస్తూరీ నింపి బిరడా బిగించిన సీసా లాంటివాడు." (తిర్మిజి)

“ప్రళయదినాన (హషర్ మైదానంలో) ఖుర్ఆన్ పఠించే మనిషితో (దైవదూతలు) ఇలా అంటారు- “నీవు భూలోకంలో ఉన్నప్పుడు ఖుర్ఆన్‌ని ఏవిధంగా వినమ్రతతో, సౌమ్యంగా పఠిస్తుండేవాడవో అదేవిధంగా ఇప్పుడు పఠించు. తద్వారా ప్రతి ఆయత్ (సూక్తి)కి ప్రతిఫలంగా ఒక్కొక్క అంతస్తు ఎక్కుతూ పైకెళ్ళు. నీ గమ్యస్థానం నీవు పఠించే చివరి సూక్తి దగ్గర ఉంది.” (తిర్మిజి)

హజ్రత్ అబ్దుల్లా బిన్ మస్వూద్ (రజి) ఖుర్ఆన్ అధ్యయనం గురించి ఇలా వివరించారు: “ఖుర్ఆన్ దేవుడు దించిన విస్తరి. కనుక దేవుని విస్తరి దగ్గరకు మీరు ఎన్ని సార్లు వెళ్ళగలిగితే అన్నిసార్లు వెళ్ళి అందులోనివి ఆస్వాదించండి. ఈ ఖుర్ఆన్ దేవుని సామీప్యానికి చేర్చే (అత్భుత) సాధనం; కారుచీకట్లను పటాపంచలు చేసే కాంతి పుంజం; స్వస్థత, ప్రయోజనం చేకూర్చే దివ్యౌషధం. దీన్ని గట్టిగా పొదివి పట్టుకునేవారికి ఇది రక్షణ కవచం; దీన్ని అనుసరించేవారి కోసం ముక్తిమార్గం, మోక్షప్రదాయని. ఇది పాతకుల్ని అమితంగా ఆకట్టుకునే పాఠ్యగ్రంథం. ఇందులో ఎలాంటి వక్రత లేదు, కనుక దీన్ని సరిచేయవలసిన అవసరమే రాదు. అత్భుతమైన దీని భావసంపద ఎన్నటికీ తరగదు. ఇది ఎంత వాడినా పాతబడని (పట్టు)వస్త్రం లాంటిది.” (ముస్తద్రక్)

## ఇది హ్యూమన్‌రోబో మ్యాన్యుల్

హజ్రత్ అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి) కథనం: “అల్‌బఖరా, ఆలిఇమ్రాన్ వంటి పెద్ద పెద్ద సూరాలు అర్థం చేసుకోకుండా వడివడిగా పఠించడం కంటే అల్‌ఖారిఅ, అల్‌ఖద్ర్ వంటి చిన్న చిన్న సూరాలు యోచిస్తూ, అర్థం చేసుకుంటూ పఠించడమే మంచిదని నేను భావిస్తున్నాను.” (ఆసాన్ ఫిఖ్హా, రెండవ భాగం)

ప్రఖ్యాత తత్వవేత్త, దైవప్రియుడయిన హజ్రత్ హసన్ బస్రీ (రహ్మలై) కథనం: “ఖుర్ఆన్ దేవుని ఆదేశం (దైవగ్రంథం) అని, ఆయన తరఫు నుండే అవతరించిందని మన పూర్వీకులు దృఢంగా నమ్మేవారు. అందువల్ల వారు రాత్రివేళల్లో యోచన, పరిశీలనా దృష్టితో దాన్ని లోతుగా అధ్యయనం చేసేవారు; పగలు దాని ఆదేశాల ప్రకారం ఆచరించేవారు. కాని ఇప్పుడు మీ పరిస్థితి చాలా శోచనీయం. మీరు ఖుర్ఆన్ లోని పదాలను (చిలుక పలుకుల్లా పఠిస్తూ, వాటి అక్షరాల కొమ్ములు, గుడింతాలు సరిచేయడమే ధ్యేయంగా పెట్టుకున్నారు. కాని ఆచరణ విషయంలో మాత్రం మీరు చాలా బద్ధకస్తులయి పోయారు.” (కీమియాయె సాదత్)

బైబిల్ పాత నిబంధనంలో దేవుడు తన దాసుడ్ని ఇలా హెచ్చరిస్తున్నాడు: “నా దాసుడా! నీకు సిగ్గు లేదా? నీవు ప్రయాణంలో ఉన్నప్పుడు నీ సోదరుని దగ్గర్నుంచి దారిలో ఏదైనా ఉత్తరం నీ వద్దకు వస్తే నీవు వెంటనే ఆగిపోయి, దారి నుండి పక్కకు తొలగి ఆ ఉత్తరంలోని ఒక్కొక్క పదాన్ని అర్థం చేసుకుంటూ, ఆలోచిస్తూ పఠిస్తావు. ఈ గ్రంథం(తౌరాత్) నాఆదేశం. అందులోని విషయాలను పరిశీలిస్తూ, యోచిస్తూ ఉండాలని, దాని ఆజ్ఞలను ఆచరించాలని నేను నీకు రాశాను. కాని నీవు మాత్రం దీన్ని నిరాకరిస్తూ ఆచరించడానికి బద్ధకిస్తున్నావు. ఒకవేళ ఎప్పుడైనా కాస్త పఠించినా దాన్ని యోచనా, పరిశీలనా దృష్టితో పఠించవు.” (కీమియాయె సాదత్)



## గొప్ప ఆరాధన

“ఖుర్ఆన్ పఠనానికి మించిన గొప్ప ధ్యానం, సంస్మరణలు లేవు. అలాగే ఆధ్యాత్మిక వికాసం, నైతిక సంస్కరణల కోసం ఖుర్ఆన్ పఠనం కంటే గొప్ప సాధనం కూడా మరేమీ లేదు. అంతేకాదు, ఖుర్ఆన్ పఠనం కన్నా గొప్ప ఆరాధన కూడా ఏదీ లేదు. ఖుర్ఆన్ పఠనం సమక్షంలో ఎవరైనా ధ్యానం, సంస్మరణలకు (జికిర్‌కు) ప్రాధాన్యం ఇస్తున్నాడంటే అతనికి దైవధర్మం పట్ల సరైన అవగాహన లేదన్న మాట. ఖుర్ఆన్ పఠనం ద్వారానే దాసుడు అందరికంటే ఎక్కువ దైవసాన్నిధ్యం పొంద గలుగుతాడని దైవప్రవక్త (స) అన్నారు.” (కీమియాయె సాదత్)

దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: “నా అనుచర సముదాయం కోసం అన్నిటి కంటే గొప్పఆరాధన ఏదైనా ఉందంటే అది ఖుర్ఆన్ పఠనమే.” (కీమియాయె సాదత్)

ఖుర్ఆన్ పఠనం తర్వాత దైవప్రవక్త (స) ఇలా ‘దుఆ’ చేసేవారు: “దేవా! ఖుర్ఆన్ ద్వారా నన్ను కరుణించు. ఖుర్ఆన్‌ని నాకు మార్గదర్శినిగా చేసి నాకోసం హితబోధినిగా, కారుణ్యప్రదాయినిగా రూపొందించు. దేవా! ఇందులో నేనేదయినా మరచిపోతే దాన్ని నాకు గుర్తుచేయి, నేనెరగని విషయాలు నాకు నేర్పు. నేను రాత్రివేళ కొంతసమయం, ఉదయం, సాయంత్రం దీన్ని పఠించేలా నాకు సద్బుద్ధి ప్రసాదించు. సర్వలోకప్రభూ! ఈ గ్రంథాన్ని నాకు అనుకూలంగా మాట్లాడే సాక్షినిగా చెయ్యి.” (కీమియాయె సాదత్)

ఖుర్ఆన్‌లో దేవుని ఆజ్ఞలేమిటీ, ఆయన మనకు ఏఏ విషయాలు విధిగా పాటించాలని ఆదేశించాడు, ఏఏ విషయాల జోలికిపోకూడదని వారించాడు, మన జీవిత వ్యవహారాలు ఎలా ఉండాలి, తోటిమానవులతో ఎలా మసలుకోవాలి, మన విధులేమిటీ, బాధ్యతలేమిటీ, పాపంఏమిటీ, పుణ్యం ఏమిటీ వగైరా విషయాలు తెలుసుకోకపోతే మనం నిజమైన విశ్వాసులుగా, పరిపూర్ణ ముస్లింలుగా, స్వచ్ఛమైన దైవదాసులుగా ఇస్లామీయ జీవితాన్ని గడపలేము. సరైన ఇస్లామీయ జీవితం గడపకుండా మనకు తెలియని, మనం నిర్లక్ష్యంచేసిన అనేక దుష్కర్మలతో ఇహలోకం వీడిపోతే ప్రళయదినాన మనం తీవ్రంగా పశ్చాత్తాపం పడవలసి వస్తుంది. అంచేత ముస్లింలు ఖుర్ఆన్‌జ్ఞానం నేర్చుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది.

మనకేదయినా అకస్మాత్తుగా గొప్ప నిధి లభిస్తే, లేదా వ్యాపారంలో అనుకోని విధంగా లక్షలాది రూపాయల లాభం వస్తే, లేదా లేకలేక సంతానం కలిగితే, లేదా ప్రాణాంతకమైన వ్యాధి నుండో, భయంకరమైన ప్రమాదం నుండో మహిమాన్వితంగా బయటపడితే మనం ఆనందోత్సవాలు జరుపుకుంటాం. అయితే వీటన్నిటి కంటే మనకు ఎక్కువ లాభం చేకూర్చే, సుఖసంతోషాలు కలిగించే, మనల్ని దుర్భరయాతనల నుండి తప్పించే విషయం ఒకటుంది. అదే దివి నుండి దిగిన దివ్యౌషధి, ఇహపరాల సాఫల్యకు ఏకైక సాధనమైన ఖుర్ఆన్.

“మానవులారా! మీ ప్రభువు నుండి మీ దగ్గరకు హితోపదేశం వచ్చింది. ఇది మీ హృదయరుగ్మతలకు నివారిణి. దీన్ని స్వీకరించేవారికి ఇది మార్గదర్శిని, కారుణ్య ప్రదాయిని. ప్రవక్తా! వారికిలా చెప్పు: “ఈ మహాభాగ్యాన్ని దేవుడు మీ కోసం పంపాడంటే ఇది ఆయన అనుగ్రహం, దాతృత్వాలే. దానిపై వారు ఆనందోత్సవాలు జరుపుకోవాలి. ఇది ప్రజలు కూడబెడ్తున్న దానికంటే ఎంతో శ్రేష్ఠమైనది.” (ఖుర్ఆన్-10:57,58)

“ఇది మానవులందరి కోసం వచ్చిన విశ్వజనీన సందేశం. (పరలోక) పరిణామాల్ని గురించి ప్రజలను హెచ్చరించడానికి, వారు దేవుడు ఒక్కడేనని తెలుసుకోవడానికి, బుద్ధీ జ్ఞానంకలవారు స్పృహలోకి రావడానికి ఈ సందేశం పంపబడింది.” (ఖుర్‌ఆన్–14:52)

“మేము దీన్ని పఠన గ్రంథంగా చేసి, విషయాన్ని అర్థం చేసుకోవడానికి వీలుగా అరబీ భాషలో అవతరింపజేశాము.” (ఖుర్‌ఆన్–12:2)

## పాఠ్యగ్రంథం

ఖుర్‌ఆన్ అంటే పఠించబడేదని శాబ్దికభావం. అంటే నిత్యపఠనానికి ఉపయోగించబడే పాఠ్యగ్రంథం. అరబ్బులు అర్థం చేసుకోడానికి దాన్ని అరబీభాషలో అవతరింపజేశామని పైసూక్తి తెలియజేస్తోంది. అయితే ఖుర్‌ఆన్ అరబ్బుల కోసమే గాకుండా యావత్తు మానవుల కోసం వచ్చిందని 14:52 సూక్తి చెబుతోంది. కనుక అరబీభాష రానివారు దాని అనువాదం చదివి అర్థం చేసుకోవాలని పైసూక్తులు చెప్పకనే చెబుతున్నాయి. మరి ఖుర్‌ఆన్‌ని విశ్వసించామని చెప్పుకునే అరబ్బేతర ముస్లింలు అటు అరబీభాష నేర్చుకోకుండా, ఇటు దాని అనువాదం కూడా చదవకుండా చనిపోయే వరకూ దాని ఆజ్ఞలకు వ్యతిరేకంగా జీవితం గడిపితే ఆ తరువాత వారి పరిస్థితి ఏమిటీ?

“మేమీ ఖుర్‌ఆన్‌ని ప్రజలు అర్థం చేసుకోవడానికి సులభతరం చేశాం; మరి (దీన్నుండి) హితబోధ గ్రహించే వారెవరైనా ఉన్నారా?” (ఖుర్‌ఆన్–54:17)

“ఈగ్రంథం నీకు, నీజాతి ప్రజలకు గొప్ప హితకారిణి. త్వరలోనే మీరంతా దీని విషయమై (దేవుని ముందు) సమాధానం చెప్పుకోవలసి ఉంటుంది.” (ఖుర్‌ఆన్–43:44)

ఖుర్‌ఆన్ విషయంలో దేవుని ముందు సమాధానం చెప్పుకోవలసి ఉంటుందని పైసూక్తి ముస్లింలను హెచ్చరిస్తోంది. మరి నేటిముస్లింలు దేవునికి ఏం సమాధానం చెప్పుకుంటారు? “మేము ఖుర్‌ఆన్ పఠిస్తూనేఉండేవాళ్ళం కదా!” అని చెబుతారా? “అయితే దానిప్రకారం మీ రెందుకు ఆచరించలేదు?” అనే మరోప్రశ్న ఎదురవుతుంది. దానికి ఏమని సమాధానమిస్తారు? “ఖుర్‌ఆన్‌భాష మాకు తెలియదు. అంచేత మేము దానిప్రకారం ఆచరించలేక పోయాం” అని సమాధానమిస్తారా? “ఖుర్‌ఆన్‌భాష ఎందుకు నేర్చుకోలేదు లేదా మీకు తెలిసినభాషలో దాని అనువాదం ఎందుకు చదవలేదు?” అనే వేరొకప్రశ్న కూడా ఎదురుకావచ్చు.

ఈనాడు అనేకమంది ముస్లింలు ఖుర్‌ఆన్ ఔన్నత్యం గురించిన ఎన్నో హదీసులు చదువుతారు, వింటారు. కాని దాని అనువాదం మాత్రం ససేమిరా చదవరు. ఖుర్‌ఆన్‌ని అనువదించడం, దాని అనువాదం చదవడం తప్పుగా భావిస్తున్నారు. పైగా అవి అరబీ పండితులు మాత్రమే చేయవలసిన పనులని చెబుతున్నారు. అంతేకాదు, వారు స్వయంగా ఖుర్‌ఆన్ అనువాదం చదవకపోవడమే గాకుండా దాన్ని ముస్లిమేతరులకు ఇవ్వడాన్ని కూడా తప్పుగా భావిస్తున్నారు. నేనొకసారి మా ఊరికి పోయినపుడు ఒక హిందూసోదరుడు నా ముందు ఖుర్‌ఆన్‌ని గురించి ప్రస్తావిస్తూ, “నేను ఖుర్‌ఆన్ చదవాలను కుంటున్నానండీ! కాని ఇక్కడి ముస్లింలు నాకు ఖుర్‌ఆన్ ఇవ్వడం లేదు, ‘మీరు ముస్లిమేతరులు మా ఖుర్‌ఆన్‌ని తాకకూడదు, అంచేత మేము మీకు ఖుర్‌ఆన్ ఇవ్వలేమండీ’ అన్నార”ని ఫిర్యాదు చేశాడు. ఈ విషయం గురించే ఆ హిందూసోదరుడు ప్రళయదినాన దేవుని ముందు ఫిర్యాదుచేస్తే ఆ ముస్లింలు దేవునికి ఏం సమాధానమిస్తారు? అప్పుడు వారి గతి ఏమవుతుంది?



ముస్లింలు ఖుర్‌ఆన్‌ని విశ్వసించామని చెప్పుకుంటారు. ఖుర్‌ఆన్‌ని విశ్వసించడం అంటే దాని బోధనలు ఆచరించాలి; అది ఆదేశించిన విషయాలు పాటించాలి; అది నిషేధించిన విషయాలు మానెయ్యాలి. అలా చేయకపోతే అది బూటకపు విశ్వాసం కిందికి వస్తుంది.

దైవప్రవక్త (స) హితోక్తి: “ఎవరు ఖుర్‌ఆన్ నిషేధించిన విషయాలను ధర్మసమ్మతం చేసుకున్నాడో అతను నిజానికి ఖుర్‌ఆన్‌ని విశ్వసించనే లేదు.” (తిర్మిజి)

## మీరు నారింజపండా, ఖర్జూరపండా?

“మీలో ఖుర్‌ఆన్ నేర్చుకొని ఇతరులకు నేర్పినవాడే అందరిలో ఉత్తముడు.” (బుఖారీ)

“ఖుర్‌ఆన్‌ని అధ్యయనం చేస్తూ దానిప్రకారం ఆచరించే విశ్వాసి (ఒక విధమైన) నారింజపండు లాంటివాడు. ఖుర్‌ఆన్ చదవకుండా కేవలం దాని ప్రకారం ఆచరించే విశ్వాసి ఖర్జూరపండు లాంటివాడు.” (ముత్తఫకున్‌అలై)

“ఖుర్‌ఆన్ పఠించే వ్యక్తి (విశ్వాసి) రుచిలోనూ, సువాసనలోనూ మేలుజాతికి చెందిన నారింజపండు లాంటివాడు. ఖుర్‌ఆన్ పఠించని విశ్వాసి రుచి ఉన్నా సువాసన లేని ఖర్జూరపండు లాంటివాడు. ఖుర్‌ఆన్ పఠించే కపట విశ్వాసి పరిమళం ఉన్న చేదుపండు లాంటివాడు. ఖుర్‌ఆన్ పఠించని కపట విశ్వాసి సువాసనలేని, చేదుగా ఉండే అడవి దోసకాయ లాంటివాడు.” (బుఖారి)

“ఖుర్‌ఆన్ పఠించే విశ్వాసి నారింజపండు లాంటివాడు. నారింజ పండులో సువాసన ఉంటుంది, రుచి కూడా బాగుంటుంది. ఖుర్‌ఆన్ పఠించే విశ్వాసి ఖర్జూర పండు లాంటివాడు. అందులో సువాసన లేకపోయినా, దాని రుచి మాత్రం తియ్యగా ఉంటుంది. ఖుర్‌ఆన్ పఠించే కపటవిశ్వాసి (గులాబి, యాస్మీన్‌లాంటి) సుగంధ మొక్క ల్లాంటివాడు. దాని వాసన బాగున్నా రుచి మాత్రం చేదుగా ఉంటుంది. ఇక ఖుర్‌ఆన్ పఠించని కపటవిశ్వాసి ఉమ్మెత్తకాయ లాంటివాడు. అందులో ఎలాగూ సువాసన ఉండదు. పైగా దాని రుచి చేదుగా ఉంటుంది.” (బుఖారీ, ముస్లిం)

“ఖుర్‌ఆన్ జ్ఞానంలేని హృదయం పాడుబడ్డ ఇంటితో సమానం.” (తిర్మిజీ)

“ఖుర్‌ఆన్‌ను కంఠపాఠం చేసుకున్న వ్యక్తితో “(ప్రళయదినాన) ఇలా అనబడు తుంది- ‘నువ్వు ప్రపంచంలో నెమ్మదిగా ఖుర్‌ఆన్ పఠించినట్లు, ఇప్పుడు కూడా అలాగే పఠిస్తూ పైకెళ్ళు. అలా పఠిస్తూ వెళ్తూ, ఎక్కడ పఠనం ఆపుతావో ఆ చివరి వాక్యం దగ్గరే నీ అంతస్తు ఉంటుంది.” (అబూదావూద్, తిర్మిజీ)

“ఎవరు ఖుర్‌ఆన్‌ని అధ్యయనం చేస్తూ దాని ప్రకారం ఆచరిస్తాడో ప్రళయ దినాన అతని తల్లిదండ్రులకు ధగధగ మెరిసిపోయే ఒక కిరీటం ధరింపజేయడం జరుగుతుంది. సూర్యుడు సైతం మీ ఇండ్లలోకి దిగివచ్చినా దాని కాంతి ముందు సూర్యుని కాంతి వెలవెల పోతుంది. ఖుర్‌ఆన్ ప్రకారం నడచుకునే మనిషికి దేవుడు ఏమేమి వరాలు ప్రసాదిస్తాడో మీకేమైనా తెలుసా?” (అహ్మద్, అబూదావూద్)

“మీలో ఎవరైనా ఖుర్‌ఆన్ చదివి దాన్ని జ్ఞాపకం పెట్టుకొని, అది ధర్మసమ్మతం చేసిన విషయాలను ధర్మసమ్మతం చేసుకొని, అది నిషేధించిన విషయాలను నిషిద్ధ

విషయాలుగా భావిస్తాడో అలాంటి వ్యక్తి తన సిఫారసుతో తన కుటుంబంలో నరకానికి పోవలసిన పదిమంది వ్యక్తులను స్వర్గానికి పంపిస్తాడు." (తిర్మిజి, ఇబ్నెమాజ)

ఖుర్‌ఆన్‌ని అర్థం చేసుకుంటూ పఠిస్తున్నప్పుడే అందులోని బోధనలను ఆచరించడానికి వీలవుతుంది. నమాజ్ గురించిన దైవాజ్ఞ వెనుక 'నమాజులో మనం పఠించే సూక్తులను ఆచరణలో పెట్టాలన్న' లక్ష్యమే ఉంది. అందుకే "నిస్సందేహంగా నమాజ్ (మనిషిని) చెడులు, అశ్లీలచేష్టల జోలికిపోకుండా నిరోధిస్తుంది."(29:45) అని తెలియజేసింది ఖుర్‌ఆన్.

మహాప్రవక్త (సల్లం) ఉపదేశించిన ఈ క్రింది మహితోక్తులు కూడా చూడండి:

"ఖుర్‌ఆన్ జ్ఞానం కలిగిన ప్రజలారా! దాన్ని అగౌరపరచకండి. దానిపట్ల ఏమరుపాటు వహించకండి. దాన్ని పఠించవలసిన విధంగా పఠిస్తూ ఉండండి. రేయింబవళ్ళూ పఠిస్తూ ఉండండి. అందులోని పదాలను, భావాలను, ఆదేశాలను వ్యాపింపజేయండి. మంచి స్వరంతో పఠించండి. అందులోని విషయాలను ఆలోచించండి, పరిశీలించండి, పరిశోధించండి, తద్వారా మీరు సాఫల్యభాగ్యం పొందగలరని ఆశించగలుగుతారు. దాని ప్రతిఫలం మీకు పరలోకంలో తప్పకుండా లభిస్తుంది. అందువల్ల ప్రపంచంలో దాని ప్రతిఫలం పొందడానికి ప్రయత్నించకండి." (బైహఖి-మిష్కాత్)

"నమాజ్ బయట చేసే ఖుర్‌ఆన్ పఠనం కంటే నమాజ్‌లో చేసే ఖుర్‌ఆన్ పఠనం ఎంతో శ్రేష్ఠమైనది. అలాగే దైవనామ స్మరణల (తస్బీబీహ్ వ తక్బీర్) కంటే నమాజ్ బయట చేసే ఖుర్‌ఆన్ పఠనం ఎంతో శ్రేష్ఠమైనది." (మిష్కాత్)

"దేవుడు స్వయంగా ఇలా సెలవిస్తున్నాడు: ఏ వ్యక్తిని ఖుర్‌ఆన్ నన్ను స్మరించలేనంతగా, వేడుకొనలేనంతగా ధార్మిక కార్యకలాపాల్లో నిమగ్నం చేస్తుందో నేనతనికి దుఆ చేసేవారికిచ్చేటటువంటి అత్యంత శ్రేష్ఠమైన వస్తువు ప్రసాదిస్తాను." (తిర్మిజి)

"ప్రళయదినాన ఖుర్‌ఆన్‌ని, ఖుర్‌ఆన్ని విశ్వసించి దానిప్రకారం ఆచరించేవారిని దేవుని ముందు ప్రవేశపెడతారు. అప్పుడు బఖరా, ఆలిఇమ్రాన్ సూరాలు ఖుర్‌ఆన్‌కు ప్రాతినిధ్యం వహించి 'ఈమనిషి మీ క్షమాకారుణ్యాలకు అర్హుడు. ఇతడ్ని కరుణించండి' అంటూ తమను అనుసరించిన మనిషి కోసం దేవునికి సిఫారసు చేస్తాయి." (ముస్లిం)

## హద్దులను అతిక్రమించకండి

దైవప్రవక్త (స) హితోక్తి: "ఇద్దరు తప్ప మరెవరిపట్లా అసూయచెందడం ధర్మసమ్మతం కాదు. ఒకరు, దేవుడు ఖుర్‌ఆన్‌విద్య ప్రసాదించగా దాన్ని రేయింబవళ్ళు చదవడంలో, చదివించడంలో నిమగ్నుడైఉండేవాడు. రెండోవాడు, దేవుడు సిరిసంపదలు అనుగ్రహించగా వాటిని రేయింబవళ్ళు (సత్కార్యాలలో) వినియోగించేవాడు." (బుఖారి)

దైవప్రవక్త (స) ఈవిధంగా ప్రవచించారు: "ఖుర్‌ఆన్‌లో ఐదు విషయాలున్నాయి. 1-హలాల్ (ధర్మసమ్మతమైన) విషయాలు, 2-హరామ్ (నిషేధిత విషయాలు), 3-మహ్‌కుమాత్ (స్పష్టమైన విషయాలు), 4-ముతషాబిహాత్ (అస్పష్టమైన విషయాలు), 5-ఇమ్సాల్ (ఉపమానాలు). కనుక హరామ్‌ని హరామ్‌గా, హలాల్‌ని హలాల్‌గా భావించండి. మహ్కుమాత్ (విశ్వాసం, చట్టం మొదలైన విషయాలకు సంబంధించిన



బోధనలు) ఆచరించండి. ముతషాబిహాత్ (స్వర్గం, నరకం, దైవదూతలు వంటి అతీంద్రియ) విషయాలను విశ్వసించాలి. ఇమ్సాల్ (జాతుల భయంకర వినాశగాథల) ద్వారా గుణపాఠం నేర్చుకోండి." (మిష్కాత్)

"దేవుడు కొన్ని విధులను నిర్ణయించాడు, వాటిని మీరు నిర్లక్ష్యం చేయకండి. కొన్ని విషయాలను నిషేధించాడు, వాటి జోలికి పోకండి. కొన్ని హద్దులు ఏర్పరచాడు, వాటిని అతిక్రమించకూడదు. కొన్నిటి విషయంలో కావాలని మౌనం వహించాడు, వాటి లోతులకు పోయి తరచిచూడటానికి ప్రయత్నించకండి." (జాబిర్-మిష్కాత్)

"దైవగ్రంథం ప్రకారం ఆచరించేవాడు ఇహలోకంలోనూ మార్గభ్రష్టుడు కాలేడు, పరలోకంలోనూ తన ప్రతిఫలాన్ని కోల్పోలేడు." ఇలా చెప్పి ఆయన "నా హితబోధను అనుసరించేవాడు ప్రపంచంలోనూ దారితప్పడు, పరలోకంలోనూ దౌర్భాగ్యానికి గురికాలేడు" అన్న ఖుర్‌ఆన్ సూక్తి పఠించారు. (ఇబ్నెఅబ్బాస్-మిష్కాత్)

## మరుపుకు కారణం నిర్లక్ష్యమా?

హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి) కథనంప్రకారం దైవప్రవక్త (స) ఇలా అన్నారు: "ఖుర్‌ఆన్ కంఠస్తం చేసిన మనిషి పోలిక తన ఒంటెను తాడుతో కట్టి ఉంచిన వ్యక్తిలా ఉంది. అతనా ఒంటెను కాపలాకాస్తూ ఉంటే అది ఎక్కడికీ పోకుండా ఆగి ఉంటుంది. ఒకవేళ (తాడు విప్పి వదలిపెడితే) అది ఎక్కడికైనా వెళ్ళిపోతుంది." (బుఖారి)

హజ్రత్ అబ్దుల్లా బిన్ మస్‌వూద్ (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ప్రవచనం: "మీలో ఎవరూ ఖుర్‌ఆన్‌లోని ఫలానా సూక్తి మరచిపోయానని అనకూడదు. దానికి బదులు నన్ను మరపింపజేయడం జరిగిందని చెప్పాలి. ఖుర్‌ఆన్ (ఏమరుపాటు వహించే) ప్రజల హృదయాల నుండి పొగరుబోతు ఒంటెలకంటే కూడా వేగంగా బయటికి వెళ్ళిపోతుంది. అంచేత ఖుర్‌ఆన్‌ని ఎల్లప్పుడూ పఠిస్తూ జ్ఞాపకం పెట్టుకోండి." (బుఖారి, ముస్లిం)

హజ్రత్ అబూమూసా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (స) ఇలా అన్నారు: "ఎవరి అధీనంలో నా ప్రాణం ఉందో ఆ శక్తిస్వరూపుని సాక్షి! ఖుర్‌ఆన్ కాళ్ళు కట్టివేసిన ఒంటెల కంటే కూడా వేగంగా విడిపించుకొని పారిపోతుంది. కనుక మీరు ఖుర్‌ఆన్‌ని పరిరక్షిస్తూ ఉండండి. (అంటే నిరంతరం పఠిస్తూ జ్ఞాపకం పెట్టుకోండి)." (బుఖారి)

## ఖుర్‌ఆన్ పారాయణ మహత్తు

హజ్రత్ ఉసైద్ బిన్ హుజైర్ (రజి) కథనం: ఓరోజు రాత్రివేళ నేను బఖరా సూరా పఠిస్తుంటే సమీపంలోనే కట్టివేయబడిన నా గుర్రం బెదరసాగింది. నేను ఖుర్‌ఆన్ పఠనం ఆపేయగానే గుర్రం బెదిరిపోవడం కూడా ఆగిపోయింది. నేను మళ్ళీ ఖుర్‌ఆన్ పఠనం ప్రారంభించగానే గుర్రం మళ్ళీ బెదిరిపోసాగింది. నేను పఠనం ఆపేయగానే అది కూడా ఆగిపోయింది. నేను తిరిగి పఠించగానే అది మళ్ళీ బెదిరిపోసాగింది.

ఆ తరువాత హజ్రత్ ఉసైద్ బిన్ హుజైర్ (రజి) ఖుర్‌ఆన్ పఠనం ఆపేశారు. ఆయన (చిన్నారి) కొడుకు యహ్యా గుర్రానికి సమీపంలోనే ఉన్నాడు. గుర్రం ఇలా బెదిరిపోతూ తన కొడుక్కి నష్టం కలిగిస్తుందేమోనని ఆయన భయపడ్డారు. అందువల్ల

అతడ్ని అక్కడ్నుంచి తప్పించి తన వైపుకు పిలిపించుకున్నాడు. అయితే ఆయన అటు వైపు తల పైకెత్తి చూస్తే అక్కడ ఆకాశం లేదు. (దానికి బదులు గొడుగు ఆకారంలో వెలుగుతున్న దీపికలేవో కన్పించాయి.)

మరునాడు ఉదయం హజ్రత్ ఉసైద్ బిన్ హుజైర్ (రజి) దైవప్రవక్త (స) సన్నిధికి వెళ్ళి జరిగిన వృత్తాంతం వివరించారు. దైవప్రవక్త (స) ఆ సంఘటన విని "ఇబ్నెహుజైర్! నీవు ఖుర్ఆన్ పఠనం అలాగే కొనసాగిస్తే ఎంత బాగుండేది!! ఇబ్నెహుజైర్! నీవు ఖుర్ఆన్ పఠనం అలాగే కొనసాగిస్తే ఎంతబాగుండేది!!" అని (రెండుసార్లు) అన్నారు. "దైవప్రవక్తా! నా కొడుకు గుర్రానికి చాలా దగ్గర్లో ఉన్నాడు. అది (బెదిరిపోతూ) వాడ్ని ఎక్కడ తొక్కి వేస్తుందోనని భయపడ్డాను. అంచేత నాదృష్టి వాడి మీదికి పోయింది. ఆ తర్వాత నేను తల పైకెత్తి ఆకాశం వైపు చూశాను. అక్కడ నాకు గొడుగు ఆకారంలో ఒక వింత వస్తువు కన్పించింది. అందులో (అనేక) దీపాలు వెలుగుతూ కన్పించాయి. ఆ తర్వాత నేనా దృశ్యం చూడలేక అక్కడ్నుంచి బయటికి వెళ్ళాను" అన్నారు హజ్రత్ ఉసైద్ (రజి).

ఆ తరువాత దైవప్రవక్త (స) "ఇంతకూ అదేమిటో నీకు తెలుసా?" అని అడిగారు. "తెలియదు" అన్నారు ఉసైద్ (రజి). అప్పుడు దైవప్రవక్త (స) విషయం తెలియజేస్తూ "ఆ దృశ్యం దైవదూతలు. నీ కంఠస్వరం (ఖుర్ఆన్) వినడానికి వచ్చారు. నీవు అలాగే తెల్లవారేదాకా ఖుర్ఆన్ పఠనం కొనసాగించి ఉంటే ఉదయం ప్రజలు ఆ దైవదూతల్ని చూసేవారు. వారు ప్రజలకు కనుమరుగయ్యేవారు కాదు" అని అన్నారు. (బుఖారి)

దైవప్రవక్త (స) ఈవిధంగా ప్రవచించారు: "ఖుర్ఆన్ కంఠపాఠి (హాఫిజ్) కర్మలు నమోదు చేసే గౌరవనీయులైన దైవదూతల్లాంటి వాడు. ఖుర్ఆన్ పఠించడం తనకు ఎంతో ప్రయాసతో కూడిన పని అయినప్పటికీ అభిమానంతో దాన్ని పఠించి కంఠస్తం చేసే వ్యక్తి రెట్టింపు పుణ్యఫలానికి అర్హుడవుతాడు." (ముస్లిం)

## కొన్ని ప్రత్యేక సూరాల ఘనత

దైవప్రవక్త (స) 'ఖుల్హువల్లాహు' సూరాపై వ్యాఖ్యానిస్తూ, "ఎవరి చేతుల్లో నా ప్రాణముందో ఆ దేవుని సాక్షి! "ఈసూరా మూడోవంతు ఖుర్ఆన్‌కు సమానం" అన్నారు.

వేరొక ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (స) "మీలో ఎవరైనా ఒకేరాత్రి మూడోవంతు ఖుర్ఆన్ పఠించలేకపోతున్నారా?" అనడిగారు అనుచరుల్ని. "మాకు అంతశక్తి ఎక్కడుంది దైవప్రవక్తా!" అన్నారు అనుచరులు. అప్పుడాయన, "ఖుల్హు వల్లాహు అహద్ అల్లాహు స్సమద్" సూరా మూడోవంతు ఖుర్ఆన్‌కు సమానం" అన్నారు. (బుఖారీ)

హజ్రత్ అనస్ (రజి) కథనం: ఒక వ్యక్తి దైవప్రవక్త (స)తో "దైవప్రవక్తా! నేను ఈ ఖుల్హువల్లాహు అహద్ సూరాను ప్రేమిస్తున్నాను" అన్నాడు. అది విని దైవప్రవక్త (స) "దాని పట్ల ఉన్న నీప్రేమ నిన్ను స్వర్గానికి తీసుకెళ్తుంది" అని చెప్పారు. (తిర్మిజీ)

దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "మీకీ విషయం తెలుసా? నిన్న రాత్రి కొన్ని సూక్తులు అవతరించాయి. అలాంటి సూక్తులు ఇంతకు ముందెన్నడూ అవతరించలేదు. (అవే) ఖుల్అవూజు బిరబ్బిల్ ఫలఖ్, ఖుల్అవూజు బిరబ్బిన్నాస్." (ముస్లిం)



హజ్రత్ అబూసయీద్ ఖుద్రీ (రజి) కథనం: "(ముఅవ్వజతైన్ సూరాలు అవత రించక మునుపు దైవప్రవక్త (స) తన సొంతమాటల్లోనే) జిన్నాతుల (కీడు) నుండి, మానవుల దిష్టి నుండి శరణు వేడుకునేవారు. కొంతకాలానికి 'ముఅవ్వజతైన్' సూరాలు అవతరించాయి. అప్పట్నుంచి దైవప్రవక్త (స) ఇతర సూక్తులన్నిటినీ వదలి వాటితోనే శరణు వేడుకోవటం మొదలుపెట్టారు." (తిర్మిజీ, హసన్)

హజ్రత్ అబూహురైరా (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ఇలా అన్నారు: "ఖుర్ఆన్‌లో ముప్ఫై సూక్తులు గల ఒక అధ్యాయం ఉంది. అది (దైవసన్నిధిలో) ఒక వ్యక్తి గురించి సిఫారసు చేసి అతనికి క్షమాభిక్ష లభించేలా చేసింది. అదే 'తబారకల్లజీ బియదిహిల్ ముల్క్' అధ్యాయం." (అబూదావూద్, తిర్మిజీ)

హజ్రత్ అబూమస్వూద్ బద్రీ (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "ఎవరయినా రాత్రిపూట 'బఖరా' సూరాలోని చివరి రెండు సూక్తులు పఠిస్తే వారికి ఆ రాత్రంతా ఆ రెండు సూక్తులే చాలు!" (బుఖారీ, ముస్లిం)

'చాలు' అంటే ఆరాత్రి జరగబోయే అవాంఛనీయ సంఘటనల నుండి రక్షణ పొందటా నికి ఆ రెండు సూక్తులు చాలని అర్థం" అని కొంతమంది పండితులు అన్నారు. మరికొంత మంది, "ఆ రాత్రంతా నమాజ్ చేసినంత పుణ్యం లభించడానికి ఆ రెండు సూక్తులు పఠిస్తే చాల"ని అభిప్రాయపడ్డారు.

హజ్రత్ అబూహురైరా (రజి) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఇలా ఉపదేశించారు: "మీరు మీఇండ్లను శ్మశానాలుగా మార్చుకోకండి. నిస్సందేహంగా 'బఖరా' సూరా (2వ అధ్యాయం) పఠించబడే ఇంట్లో నుంచి షైతాన్ పారిపోతాడు." (ముస్లిం)

హజ్రత్ ఉబై బిన్‌కాబ్ (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ఆయన్ని "అబుల్ ముంజిర్! నీ దగ్గరున్న ఖుర్ఆన్ సూక్తుల్లో అన్నిటికన్నా గొప్పదేదో నీకు తెలుసా?" అని అడిగారు. "అల్లాహు లా ఇలాహ ఇల్లాహువల్ హయ్యుల్ ఖయ్యూమ్' అనే సూక్తి (కావచ్చు)" అన్నాను నేను. అప్పుడాయన నా రొమ్ము తట్టి, "అబుల్ ముంజిర్! నీకు జ్ఞానం వల్ల శుభం కలుగుగాక!" అని అభినందించారు. (ముస్లిం)

హజ్రత్ ఇబ్నెఅబ్బాస్ (రజి) కథనం: ఒకరోజు జిబ్రీల్ దూత (అలై) దైవప్రవక్త (స) దగ్గర కూర్చొనిఉన్నప్పుడు పైనుంచి ఒక శబ్దం విన్పించింది. జిబ్రీల్ తలపైకెత్తి, "ఆకాశం లోని ఒక ద్వారం తెరువబడింది. దాని శబ్దమే ఇది. గతంలో ఆ ద్వారం ఎన్నడూ తెరవ బడలేదు. ఆ ద్వారం గుండా ఒక దైవదూత దిగాడు" అని అన్నారు. ఆ దైవదూతను చూపిస్తూ, "భూమి మీదకు దిగిన ఈ దైవదూత, ఇంతకు ముందెన్నడూ దిగలేదు" అని చెప్పారు. ఆ దైవదూత దైవప్రవక్త (స)కు సలాం చేసి "మీకు రెండు వెలుగులు ఇవ్వ బడ్డాయనే శుభవార్త అందజేస్తున్నాను. మీకు పూర్వం ఆ వెలుగులు ఎవరికీ ఇవ్వబడ లేదు. అవి 1-ఫాతిహా సూరా, 2-బఖరా సూరాలోని చివరి సూక్తులు. మీరు వీటిలోని ఏ అక్షరాన్ని పఠించినా అది మీకు ఇవ్వబడుతుంది" (ముస్లిం)

## నిజం పలికిన షైతాన్

హజ్రత్ అబూహురైరా (రజి) కథనం: దైవప్రవక్త (స) నన్ను రమజాన్ నెల జకాత్ (అంటే ఫిత్రా) సొమ్ముకు కాపలా ఉంచారు. (ఓరోజు రాత్రి) ఎవరో ఒకతను వచ్చి దోసిళ్ళతో ఆ ధాన్యాన్ని దొంగిలించసాగాడు. వెంటనే నేనతడ్ని పట్టుకొని, "(ఎవర్నువ్వు?) పద దైవప్రవక్త (స) దగ్గరికి" అని గద్దించాను. అప్పుడతను (భయపడి) అవసరాల్లో ఉన్నానయ్యా! భార్యాబిడ్డలు కలవాడ్ని. ఇప్పుడు నాకు చాలా అవసరం వచ్చిపడింది" అన్నాడు. నేనతడ్ని (దయతలచి) వదలిపెట్టాను. మరునాడు ఉదయం (నేను దైవప్రవక్త సన్నిధికి వెళ్ళాను). దైవప్రవక్త నన్ను పిలిచి "అబూహురైరా! నిన్న రాత్రి నువ్వు పట్టుకున్న వ్యక్తిని ఏం చేశావ్?" అని అడిగారు. దానికి నేను, "దైవప్రవక్తా! అతను తన అవసరం గురించి, తన మీద ఆధారపడివున్నవారి గురించి మొరపెట్టుకున్నాడు. అంచేత నేనతని మీద దయతలచి అతడ్ని వదలిపెట్టాను" అని చెప్పాను. దానికి దైవప్రవక్త (స) "అతను నీతో అబద్ధం చెప్పాడు. అతను మళ్ళీ వస్తాడు, చూస్తుండు" అన్నారు.

దైవప్రవక్త (స) చెప్పారు కాబట్టి అతను మళ్ళీ తప్పకుండా వస్తాడని నమ్మి అతని కోసం మాటేసి కూర్చున్నాను. అతను వచ్చి దోసిళ్ళతో ధాన్యాన్ని నింపుకోసాగాడు. (నేను మెల్లిగా వెళ్ళి అతడ్ని పట్టుకొని), "ఇప్పుడు మాత్రం నేను నిన్ను తప్పకుండా దైవప్రవక్త దగ్గరికి తీసుకువెళ్తాను" అన్నాను. దానికతను, "నన్ను వదలిపెట్టండి, అవసరాల్లో ఉన్నాను. భార్యాబిడ్డలు కలవాడ్ని. ఇంకెప్పుడూ రాను. (ఈఒక్క సారి వదలిపెట్టండి)" అని బతిమాలాడు. నాకు అతని మీద జాలేసింది. అంచేత అతడ్ని వదిలేశాను.

మరునాడుదయం (దైవప్రవక్త దగ్గరికి వెళ్ళాను.) దైవప్రవక్త (స) నన్ను పిలిచి, "అబూహురైరా! నిన్నరాత్రి నువ్వు పట్టుకున్న వాడ్ని ఏంచేశావ్?" అనడిగారు. "దైవప్రవక్తా! అతను తన అవసరం గురించి, తనమీద ఆధారపడివున్నవారి గురించి మొరపెట్టుకున్నాడు. అంచేత నేనతడ్ని దయతలచి వదిలేశాను" అని చెప్పాను. అది విని దైవప్రవక్త (స) "అతను అబద్ధం చెప్పాడు. అతను మళ్ళీ వస్తాడు" అని చెప్పారు.

మూడోసారి కూడా నేనతని కోసం మాటేసి కూర్చున్నాను. అతను వచ్చి దోసిళ్లతో ధాన్యం నింపుకోసాగాడు. నేనతన్ని పట్టుకొని "ఇప్పుడు నేను నిన్ను తప్పకుండా దైవప్రవక్త (స) దగ్గరికి తీసుకువెళ్తాను. నువ్వు ఇలా రావటం ఇది మూడోసారి. ప్రతిసారీ నువ్వు ఇంకెప్పుడూ రానని వాగ్దానం చేసి మళ్ళీ వస్తున్నావు" అని గద్దిస్తూ అన్నాను. దానికతను, "నన్ను వదలిపెట్టండి. నేను మీకు కొన్ని వచనాలు నేర్పిస్తాను. వాటి మూలంగా దేవుడు మీకు ప్రయోజనం చేకూరుస్తాడు" అని అన్నాడు. నేను, "ఏమిటా వచనాలు?" అని అడిగాను. అందుకతను, "మీరు (నిద్రపోవటానికి) పడక మీదకు వెళ్ళినప్పుడు 'ఆయతుల్ కుర్సీ' పఠించండి. అలా చేస్తే తెల్లవారే వరకు, మీ కొరకు అల్లాహ్ తరఫు నుండి ఒక పర్యవేక్షకుడు నియమించబడతాడు. షైతాన్ మీ దరిదాపులకు కూడా రాడు" అని చెప్పాడు. అప్పుడు కూడా నేనతడ్ని వదిలేశాను.

తెల్లవారిన తర్వాత దైవప్రవక్త (స) నన్ను "రాత్రి నువ్వు పట్టుకున్న వాణ్ణి ఏం చేశావ్?"అనడిగారు. దానికి నేను "దైవప్రవక్తా! అతను నాకు కొన్ని వచనాలు నేర్పిస్తానని



వాగ్దానం చేశాడు. ఆ వచనాల మూలంగా దేవుడు నాకు ప్రయోజనం చేకూరుస్తాడట. అందుకని నేనతడ్ని వదిలేశాను" అని చెప్పాను. "ఏమిటా వచనాలు?" అడిగారు దైవ ప్రవక్త (స). అప్పుడు నేను "ఆ వచ్చినవ్యక్తి నాతో 'మీరు (నిద్రించడానికి) పడక మీదకు వెళ్ళినప్పుడు మొదటి నుంచి చివరి వరకు ఆయతుల్‌కుర్సీ చదవండి' అన్నాడు. 'అలా చేస్తే మీకోసం అల్లాహ్ తరఫున ఒక పర్యవేక్షకుడు నియమించబడతాడు. తెల్లవారే వరకు షైతాన్ మీ దరిదాపులకు రాడు' అని అన్నాడ"ని చెప్పాను.

అప్పుడు దైవప్రవక్త (స) నాతో, "విను అతను పచ్చి అబద్ధాలకోరు. అయినప్పటికీ అతను నీతో నిజం చెప్పాడు. అబూహురైరా! మూడు రాత్రుల నుంచి నువ్వు ఎవరితో మాట్లాడుతున్నావో తెలుసా?" అన్నారు. నేను తెలీదన్నాను. "అతను షైతాన్" అని చెప్పారు దైవప్రవక్త (స). (బుఖారీ)

## హృదయానికి పట్టే తుప్పు పోవాలంటే...

"మేమీ ఖుర్ఆన్‌లో విశ్వాసులకు స్వస్థత, (దైవ)కారుణ్యాలు చేకూర్చే విషయాలు అందజేస్తున్నాము. కాని దుర్మార్గులకు మాత్రం ఇది మరింత నష్టాన్నే కలిగిస్తుంది." (ఖుర్ఆన్-17:82)

దైవప్రవక్త (స) (తన అనుచరులకు హితోపదేశం చేస్తూ) "ఇనుముకు నీటి వల్ల తుప్పు పట్టినట్లే హృదయానికి కూడా తుప్పు పట్టుతుంది" అని అన్నారు. (అనుచరులు ఈమాట విని) "అయితే హృదయానికి పట్టే తుప్పు ఎలా వదలుతుంది?" అనడిగారు. దానికి దైవప్రవక్త (స) సమాధానమిస్తూ "హృదయానికి పట్టిన తుప్పు పోవాలంటే మృత్యువును అత్యధికంగా జ్ఞాపకం చేసుకుంటూ ఉండాలి; దాంతోపాటు (తరచుగా) ఖుర్ఆన్‌ని పఠిస్తూ ఉండాలి" అని అన్నారు. (ఇబ్నెఉమర్-మిష్కాత్)

హజ్రత్ జియాద్ బిన్ లబీద్ (రజి) కథనం: దైవప్రవక్త (స) ఓ భయంకరమైన సంగతి చెప్పి "ఇది ధర్మజ్ఞానం తుడిచిపెట్టుకు పోయినప్పుడు వస్తుంది" అన్నారు. నేనీ మాట విని "దైవప్రవక్తా! ధర్మజ్ఞానం ఎలా తుడిచిపెట్టుకు పోతుంది, మేము ఖుర్ఆన్ చదువుతున్నాం, మా పిల్లలకు నేర్పుతున్నాం, మా పిల్లలు తమ సంతానానికి కూడా నేర్పుతారు కదా?" అని అడిగాను. దానికి దైవప్రవక్త (స) ఇలా అన్నారు- "జియాద్! మదీనాలో నువ్వెంతో తెలివిగలవాడనుకున్నానే నేను! యూదులు, క్రైస్తవులు తౌరాత్‌ని, ఇంజీల్‌ని ఎంత బాగా చదువుతున్నారో నువ్వు చూస్తున్నవుగా. కాని వాటి బోధనలు ఆచరిస్తున్నారా? (భావికాలం ముస్లింల సంగతి కూడా అంతే.)- (ఇబ్నెమాజ)

దైవప్రవక్త (స) ప్రవచనం: "వారు ఖుర్ఆన్‌ని అధికంగానే పఠిస్తారు. కాని అది వారి కంఠాల నుండి క్రిందికి దిగదు. నాలుక మీదనే ఉండిపోతుంది. దాని జ్ఞానం, భావం వారి హృదయాల్లో లేశమైనా ఉండదు." (హదీస్)

బహుదైవారాధకులు దేవుడు ఒక్కడేనని అంగీకరించినప్పటికీ సృష్టితాలను ఆరాధిస్తారు. అదేవిధంగా ముస్లింలలో అత్యధికమంది ఖుర్ఆన్ పఠిస్తున్నామని చెబుతున్నా దాని భావాన్ని తమకు తెలిసిన భాషలో అధ్యయనం చేయరు. వారిలో ఒకవర్గం ఖుర్ఆన్‌ని ఇతర భాషలలో

అనువదించడం, అనువాదాన్ని అధ్యయనం చేయడమే తప్పుగా భావిస్తోంది. మరొక వర్గం ఖుర్‌ఆన్‌ని అధ్యయనం చేస్తే ఆచరించవలసి వస్తుందని తలచి దాని జోలికే పోదు. ఈ వర్గం వారు ఇలా ఖుర్‌ఆన్‌ని అధ్యయనం చేయకుండా ఏవో కొన్ని ఆచారాలు పాటిస్తే చాలు, ఇతర వ్యవహారాలో దేవుడు తమను క్షమించి మోక్షం ప్రసాదిస్తాడని భ్రమిస్తున్నారు.

ఇటీవల నా మిత్రుడొకడు తెలుగులో అనువదించబడిన "ఖుర్‌ఆన్ భావామృతం" ప్రతులు కొన్నిటిని ఖతర్ పంపడానికి వైమానిక రవాణా (కార్గో) కార్యాలయానికి తీసికెళ్ళాడు. అక్కడి ఉద్యోగులు కొందరు తాము ఖుర్‌ఆన్ చదవాలనుకుంటున్నామని, తమకు ఖుర్‌ఆన్ భావామృతం కావాలని అడిగారు. ఆ ఉద్యోగులలో ముగ్గురు హిందువులు, ఇద్దరు క్రైస్తవులు, ఒక ముస్లిం ఉన్నారు. మా మిత్రుడు వారందరికీ తలా ఒక ఖుర్‌ఆన్ ప్రతి ఇచ్చాడు. ముస్లిమేతర సోదరులు సంతోషంగా ఖుర్‌ఆన్ తీసుకుంటూ తాము చదువుతామని చెప్పారు. కాని మన ముస్లిం సోదరుడు మాత్రం 'ఖుర్‌ఆన్ భావామృతం' తీసుకోవడానికి నిరాకరిస్తూ తనకు తెలుగు లిపిలో ఉండే అరబీ ఖుర్‌ఆన్ కావాలని అన్నాడు.

ఇదీ మన ముస్లింల పరిస్థితి! ఇలాంటి ముస్లింలకు పరలోకంలో ఖుర్‌ఆన్ సిఫారసు చేస్తుందని ఆశించగలమా? ఈనాటి ముస్లింలలో ఐకమత్యం లేకపోవడానికి, ఇతర జాతుల దౌర్జన్యాలకు గురికావడానికి మూలకారణం వారు ఖుర్‌ఆన్ భావానికి దూరమైపోవడమే.

## ముస్లింల ఉత్థాన పతనాలకు కారణం

దైవప్రవక్త (సల్లం) హజ్రత్ అలి (రజి)తో మాట్లాడుతూ "జాగ్రత్త! త్వరలో ఓ పెద్ద సంక్షోభం చెలరేగే కాలం రానున్నది" అన్నారు. హజ్రత్ అలి(రజి) ఈమాట విని "అయితే దైవప్రవక్తా! ఈ సంక్షోభం నుండి బయటపడే మార్గం ఏమిటీ?" అని అడిగారు. అప్పుడు దైవప్రవక్త (స) ఈవిధంగా చెప్పారు:

"దైవగ్రంథం. (దైవగ్రంథం ద్వారానే మీరీ సంక్షోభం నుంచి బయట పడగలుగు తారు.) ఈ గ్రంథంలో మీకు పూర్వముండిన జాతులపై ఏఏ పరిణామాలు సంభ వించాయో అవన్నీ ఉన్నాయి. మీ తరువాత వచ్చే జాతులకు ఎలాంటి పరిణామాలు ఎదురవుతాయో కూడా ఇందులో ఉన్నాయి. మీ (దైనందిన) వ్యవహారాలను గురించి నిర్ణయాలు ఎలా తీసుకోవాలో అవి కూడా ఇందులో ఉన్నాయి.

ఇది ఓ గంభీరమైన, నిర్ణయాత్మకమైన గ్రంథం. ఇదేదో ఆషామాషీ గ్రంథం కాదు. ఎవరైనా దుర్మార్గుడు, చండశాసనుడు ఈ గ్రంథాన్ని వదిలేస్తే దేవుడు అతడ్ని అణగ ద్రొక్కుతాడు. మరెవరైనా దీన్ని వదిలేసి మరెక్కడ్నుంచయినా మార్గదర్శనం పొందడానికి ప్రయత్నిస్తే దేవుడు అతడ్ని మార్గభ్రష్టుడిగా చేస్తాడు.

ఈ ఖుర్‌ఆన్ దేవునికి చెందిన దృఢమైన త్రాడు. ఇది ఎంతో వివేకవంతమైన ఉపదేశం. ఇదే రుజుమార్గం. ఈ ఖుర్‌ఆన్‌లోని ఎలాంటి భావంకూడా మనిషిని తప్పుడు మార్గాలపైకి తీసుకుపోజాలదు. ఇందులో ఏ మానవవాక్కుతోనైనా కల్తీచేయడం సాధ్యం కాదు. పండితులు దీన్ని ఎంత పరిశోధించినా ఎన్నటికీ తృప్తి చెందలేరు. (పరిశోధించిన కొద్దీ మరికొన్ని కొత్తకోణాలు వెలుగు చూస్తూనే ఉంటాయి.) ఎంత చదివినా ఇది పాత పడిపోదు. దీని వింతలు, మహిమలు ఎన్నటికీ అంతం కావు. అందుకే జిన్నులు



ఈగ్రంథం (సూక్తులు) విన్న తర్వాత 'మేము రుజుమార్గంచూపే ఓ విచిత్రమైన ఖుర్‌ఆన్ విన్నాం. అంచేత మేము దీన్ని విశ్వసించాం' అని అనకుండా ఉండలేకపోయారు.

ఎవరు ఖుర్‌ఆన్ ప్రకారం మాట్లాడుతాడో అతను సత్యం మాట్లాడిన వాడవుతాడు. మరెవరు ఖుర్‌ఆన్ ప్రకారం నడుచుకుంటాడో అతను తప్పకుండా తగిన ప్రతిఫలం పొందుతాడు. ఎవరు ఖుర్‌ఆన్ ప్రకారం నిర్ణయం తీసుకుంటాడో అతను న్యాయమైన నిర్ణయం తీసుకున్నవాడవుతాడు. మరెవరు దీన్ని అనుసరించమని ప్రజలకు పిలుపు నిస్తాడో అతను వారికి రుజుమార్గం చూపినవాడవుతాడు." (తిర్మిజి)

దైవప్రవక్త (స) ప్రవచనం: "దేవుడు ఈ గ్రంథం ద్వారా ఎన్నో జాతులను ప్రగతి శిఖరాలకు చేరుస్తాడు; మరెన్నో జాతులను పతానాగాధం లోకి నెట్టివేస్తాడు." (మిష్కాత్)

# 9. విశ్వాస పరీక్ష

"ప్రజల్లో ఎవరు సత్కార్యాలు చేస్తూ సదాచార సంపన్నులవుతారో పరీక్షించడానికే, మేము సకల వస్తుసామగ్రితో భూమిని శోభాయమానంగా తీర్చిదిద్దాము. చివరికి మేము దాన్నంతటినీ (తుడిచిపెట్టి) బంజరుభూమిగా మార్చివేస్తాము." (ఖుర్‌ఆన్-18:7)

"మేము మిమ్మల్ని మంచీ-చెడు స్థితులు కలిగించి పరీక్షిస్తున్నాము. చివరికి మీరంతా మా దగ్గరికే తిరిగి రావలసి ఉంది." (ఖుర్‌ఆన్-21:35)

దేవుడ్ని, దైవప్రవక్త (స)ను విశ్వాసించామని చెప్పుకున్నంత మాత్రాన ఏ ముస్లిం కూడా పరలోక సాఫల్యానికి అర్హుడు కాలేడు. దేవుని ప్రసన్నత, ఆయన దివ్యదర్శనం, స్వర్గసుఖాలు అంత తేలిగ్గా లభించే వస్తువులు కావు. వాటికోసం అతను అనేక పరీక్షలు ఎదుర్కోవలసి ఉంటుంది. కష్టనష్టాలు భరించవలసి వస్తుంది. ధనప్రాణాల త్యాగానికి సైతం సిద్ధపడవలసి ఉంటుంది. భయప్రలోభాల ద్వారా కూడా విశ్వాసులు పరీక్షించబడతారు. ఈ పరీక్షలన్నిటికీ తట్టుకొని దైవధర్మంలో స్థిరంగా నిలబడగలిగిన వాడే దేవుని దృష్టిలో నిజమైన ముస్లిం.

"మేము విశ్వసించామని అన్నంతమాత్రాన తమను పరీక్షించకుండా వదలి పెట్టడం జరుగుతుందని వారు భావిస్తున్నారా? వారికి పూర్వం గతించిన వారందర్నీ మేము పరీక్షించాము. (వారిలో) సత్యవాదులెవరో, అసత్యవాదులెవరో తప్పనిసరిగా పరీక్షించి తెలుసుకోవలసిన బాధ్యత దేవునిపై ఉంది." (ఖుర్‌ఆన్- 29:2,3)

"మీలో స్థిరచిత్తులెవరో, సాహసవీరులెవరో బహిరంగపరచి మీ పరిస్థితుల నిగ్గు తేల్చడానికి దేవుడు మిమ్మల్ని తప్పకుండా పరీక్షిస్తాడు." (ఖుర్‌ఆన్-47:31)

హజ్రత్ అబూసయీద్ ఖుద్రీ (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ఇలాఅన్నారు: "నిజంగా ఇహలోకం (ప్రజలకు) ఎంతో రమణీయంగా, మనోహరంగా కనబడుతుంది. దేవుడు మిమ్మల్ని ఈ ప్రపంచానికి నాయకులుగా చేసి మీరు మీ బాధ్యతల్ని ఎలా నెరవేరుస్తారో పరీక్షిస్తాడు. కాబట్టి (మీరు ఈ పరీక్షలో నెగ్గాలనుకుంటే) ప్రపంచ పట్ల అప్రమత్తంగా ఉండండి. స్త్రీల(వల్ల ఉత్పన్నమయ్యే ఉపద్రవాల)కు దూరంగా ఉండండి. ఇస్రాయీల్ సంతతి ప్రజలు మొట్టమొదటి సారిగా స్త్రీల విషయంలోనే (విశ్వాస)పరీక్షకు గురయ్యారు. (ముస్లిం)

"స్వర్గప్రవేశం ఊరికే లభిస్తుందని మీరు భావిస్తున్నారా? నిజానికి మీకు పూర్వం విశ్వాసులకు సంభవించిన (కష్టనష్టాలు) వన్నీ ఇంకా మీకు సంభవించలేదే! వారిపై అనేక కష్టాలు, కడగండ్లు విరుచుకుపడ్డాయి." (ఖుర్ఆన్–2:214)

దైవప్రవక్త (స) ప్రవచనం: "నరకం మనోవాంఛలతో కప్పివేయబడింది. స్వర్గం కష్టాలు, కడగండ్లతో కప్పివేయబడింది." (బుఖారి, ముస్లిం)

"ముస్లిములారా! మీరు ధన ప్రాణాలు రెండిటి విషయంలోనూ అనేక కఠినపరీక్షలకు గురికావలసివస్తుంది.....కనుక అలాంటిస్థితిలో మీరు సహనం వహించి, భయభక్తులతో కూడిన జీవితం గడుపుతూ ధర్మమార్గంలో స్థిరంగా ఉండాలి." (ఖుర్ఆన్–3:186)

హజ్రత్ ఖబ్బాబ్ బిన్ అరత్ (రజి) కథనం: మేము బహుదైవారాధకుల వేధింపులతో విసిగిపోయాం. ఆ కాలంలో ఓరోజు నేను దైవప్రవక్త (స)ను కాబాగోడ నీడన కూర్చొని ఉండటం చూసి, దగ్గరికెళ్ళి "దైవప్రవక్తా! మాకోసం దైవాన్ని ప్రార్థించరూ?" అన్నాను. ఈమాట వినగానే ఆయన ముఖం కోపంతో జేవురించింది. ఆయన ఇలా అన్నారు: "మీకు పూర్వముండిన విశ్వాసులపై మీకంటే ఘోరమైన కష్టాలు వచ్చిపడ్డాయి. వారిలో ఒకడ్ని నేలపై గుంటత్రవ్వి అందులో కూర్చోబెట్టి అతని తలమీద రంపంపెట్టి చీల్చేయడం జరిగింది. మరొకడ్ని ఇస్లాం నుండి మరల్చడానికి అతని కీళ్ళలోకి ఇనుప దువ్వెనలు గుచ్చి లాగారు. దైవసాక్షి! ఈపని ఎట్టి పరిస్థితిలోనూ నెరవేరుతుంది. చివరికి ఒక మనిషి ఒంటరిగా 'సనా' నుండి 'హజ్రెమౌత్' వరకు నిర్భయంగా ప్రయాణం చేస్తాడు. అప్పుడతనికి దైవభయం తప్ప మరేభయమూ ఉండదు." (బుఖారి)

ఒక విశ్వాసిపై కష్టాలు వచ్చిపడ్డాయంటే దేవుడు అతనికి ఏదో ఒక మేలు చేయదలిచాడని తెలుసుకోవాలి. దీన్ని గురించి దైవప్రవక్త (స) ఇలా తెలియజేశారు:

"దేవుడు ఎవరికైనా మేలు చేయదలచుకుంటే అతడ్ని కష్టాలకు గురిచేస్తాడు." (బుఖారి); "దేవుడు తన దాసునికి మేలు చేయదలచినప్పుడు అతని పాపాలకు త్వరలో ప్రపంచంలోనే అతనికి (ఆపదల రూపంలో) శిక్ష విధిస్తాడు. ఒకవేళ దేవుడు ఎవరికైనా కీడు చేయదలిస్తే అతని పాపాలకు శిక్ష విధించకుండా ఆపిఉంచుతాడు. ఇలా ప్రళయ దినందాకా ఆపివుంచి ఆరోజు అతనికి పూర్తి శిక్ష విధిస్తాడు." (తిర్మిజి, మిష్కాత్)

"విశ్వసించిన స్త్రీలు, పురుషులు తమ ధన ప్రాణాలు, సంతానం విషయంలో నిరంతరం పరీక్షించబడుతుంటారు. ఈవిధంగా పరీక్షించబడుతూ చివరికి వారు అంతిమ దినాన (పరలోకంలో) తమ పాపాలలో ఏఒక్కటీ మిగిలి ఉండని (పవిత్ర) స్థితిలో దేవుడ్ని కలుసుకుంటారు." (తిర్మిజి)

"విశ్వాసి అయిన దాసుడు (అంటే నిజమైన విశ్వాసి) జబ్బు పడితే లేదా అతనికేదైనా ఎలాంటిదైనా ఆపద వస్తే- ఉదాహరణకు అతని జేబునుంచి డబ్బేమైనా పోతే- ఇవన్నీ విశ్వాసిపాలిట పుణ్యఫలానికి కారణమవుతాయి. బంగారం స్వర్ణకారుడి కొలిమిలో కాలి స్వచ్ఛమయి బయటికి వచ్చినట్లు కష్టాలు విశ్వాసి పాపాలు హరించి అతడ్ని పునీతుడ్ని చేస్తాయి." (మిష్కాత్)



"ముస్లింకు ఎప్పుడైనా ఏదైనా వ్యాధిగాని, కష్టంగాని వస్తే దేవుడు దాని ద్వారా చెట్టు నుండి ఆకులు రాలినట్లు అతని పాపాలను అంతమొందిస్తాడు." (ముస్లిం)

"కష్టాలకు గురైన కారణంగా విశ్వాసి ఎప్పుడైనా లోగడ చేస్తూ వస్తున్న ఏదైనా సత్కార్యాన్ని గత్యంతరంలేని పరిస్థితిలో చేయలేకపోతే, ఆ పుణ్యఫలాన్ని కూడా (అతని కర్మపత్రంలో) రాయండని దేవుడు తన దూతలను ఆదేశిస్తాడు." (మిష్కాత్)

"విశ్వాసి వ్యవహారం చాలా వింతగా ఉంది. అతని విషయంలో దైవం ఎలాంటి నిర్ణయం తీసుకున్నా అతని కోసం అది మంచివిషయమే. కష్టాలు వచ్చినప్పుడు సహనం వహిస్తాడు. ఈ సహనం అతనికోసం మంచి విషయమే. సౌఖ్యాలు కలిగినప్పుడు కృతజ్ఞత చూపుతాడు. ఈ కృతజ్ఞతాభావం కూడా అతని పాలిట మంచి విషయమే. ఈ మహాభాగ్యం విశ్వాసికి తప్ప మరెవరికీ ప్రాప్తం కాదు." (బుఖారి, ముస్లిం)

"కష్టాల పరీక్ష ఎదురైనప్పుడు విశ్వాసి సహనం వహించి దైవస్తోత్రం చేస్తుంటే అతను తల్లిగర్భం నుంచి ఈరోజే పుట్టిన బిడ్డలా పరమ పవిత్రుడైపోతాడు. అప్పుడు దేవుడు తన దూతలను ఉద్దేశించి 'నేనే నా దాసుడ్ని (పరీక్షకు గురికాకుండా) ఆపాను. నేనే అతడ్ని పరీక్షకు గురిచేశాను. కనుక అతనికోసం మీరు అతను ఆరోగ్యంగా ఉన్నప్పుడు రాస్తుండిన పుణ్యమే (ఇప్పుడూ) రాయండి' అని ఆజ్ఞాపిస్తాడు." (మిష్కాత్)

విశ్వాసానికి, పరీక్షకు అవినాభావ సంబంధం ఉంది. విశ్వాసం ఉన్నచోట పరీక్ష తప్పక ఉంటుంది. పరీక్షకు లోనుకాని విశ్వాసం గీటురాయి తాకని కల్తీబంగారం లాంటిది. పరీక్షకు గురైనప్పుడే విశ్వాసి నిజరూపం బయటపడుతుంది. ప్రతికష్టం, ప్రతినష్టం విశ్వాసికి ప్రయోజనకరమైనదే. అలాఅని కష్టాలు రావాలని కోరుకోకూడదు. ఎల్లప్పుడూ శాంతిశ్రేయాలు ప్రసాదించమనే దైవాన్ని వేడుకోవాలి. కష్టాలు ఎదురైతే మాత్రం సహనం పాటించాలి.

# 10. ప్రపంచంలో విశ్వాసి స్థానం

ఈ ప్రపంచం తాత్కాలికమైనది. మానవుని అసలుజీవితం మరణానంతరమే మొదలవుతుంది. అదే పరలోకజీవితం. పరలోకజీవిత సాఫల్య, వైఫల్యాలు ఇహలోక జీవితంలో అతను ఆచరించే కర్మలను బట్టే ఉంటాయి. పరలోక జీవితంలో సాఫల్యం పొందడానికి ఇహలోకంలోనే పాటుపడటం బుద్ధిమంతుని లక్షణం. అశాశ్వతమైన ఇహలోక జీవితంలోని సౌఖ్యాల కోసం శాశ్వతమైన పరలోకజీవితాన్ని మూర్ఖుడు మాత్రమే నాశనం చేసుకుంటాడు.

ఐహిక జీవితం, (దాని సౌఖ్యాలు) వట్టి మోసపూరితమైన పైపై మెరుగులు మాత్రమే. (3:185); స్త్రీలు–సంతానం, వెండి–బంగారం రాశులు, మేలుజాతి గుర్రాలు, పశుసంపద, సేద్యభూములు (వగైరా) వ్యామోహవస్తువులు మానవులకు మనోహరమైనవిగా చేయబడ్డాయి కాని ఇదంతా ఇహలోకంలో మూన్నాళ్ళ ముచ్చటగా ఇవ్వబడిన జీవనసామగ్రి మాత్రమే. (శాశ్వత సౌఖ్యాలతో కూడిన) శ్రేష్ఠమైన నివాసం దేవుని దగ్గరే లభిస్తుంది. (ఖుర్ఆన్–3:14)

మీకు ఇవ్వబడినదంతా ప్రాపంచిక జీవనసంపద, క్షణికమైన దాని తళుకుబెళుకులు మాత్రమే. దేవుని దగ్గర ఉన్నది ఇంతకంటే ఎంతో శ్రేష్ఠమైనది, శాశ్వతమైనది. మీరు బుద్ధినుపయోగించి ఆలోచించరా? (ఖుర్ఆన్–28:60)

ఇహలోకంలో మీకివ్వబడిన జీవనసామగ్రి మూన్నాళ్ళముచ్చట మాత్రమే. దేవుని దగ్గర ఉన్నదే శ్రేష్ఠమైనది, శాశ్వతమైనది. అయితే సత్యాన్ని విశ్వసించి తమ ప్రభువును నమ్ముకున్నవారికే ఇది లభిస్తుంది. (ఖుర్ఆన్–42:36)

హజ్రత్ అమ్ర్ బిన్ ఔఫ్ అన్సారీ (రజి) కథనం: .....దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు- "దైవసాక్షిగా చెబుతున్నాను. మీరు ఆర్థిక ఇబ్బందులకు గురవుతారన్న భయం నాకు లేదు. కాని గత సమాజాల్లో మాదిరిగా మీక్కూడా పుష్కలంగా ప్రాపంచిక సిరిసంపదలు లభిస్తే మీరూ వారిలాగే ప్రాపంచిక వ్యామోహంలో పోటీ పడతారేమోనని నాకు భయంగా ఉంది. అలా చేస్తే ఈ ప్రాపంచిక వ్యామోహం గత సమాజాలను నాశనం చేసినట్లు మిమ్మల్ని కూడా నాశనం చేయవచ్చు." (బుఖారి, ముస్లిం)

దైవప్రవక్త (స) ప్రవచనం: "విశ్వాసి మృదువైన లేతమొక్క లాంటివాడు. ఆ మొక్క గాలివీస్తే వంగిపోతుంది. అలాగే విశ్వాసి కాస్త నిలదొక్కుకున్నాడనుకుంటే అంతలో ఏదో ఒక ఆపద వచ్చిపడి అతడ్ని వంచివేస్తుంది. దీనికి భిన్నంగా అవిశ్వాసి తాటిచెట్టు లాంటి వాడు. తాటిచెట్టు దృఢంగా, నిటారుగా ఉంటుంది. అయితే దేవుడు తలచుకుంటే దాన్ని ఒక్కసారిగా కూకటివేళ్ళతో సహా పెకలించి పారేస్తాడు." (బుఖారీ, ముస్లిం)

దైవప్రవక్త (స) హితోక్తి: "ఈ ప్రపంచం మధురమైనది, సస్యశ్యామలమయినది. నిజానికి దేవుడు మిమ్మల్ని ఈ ప్రపంచంలో తన ప్రతినిధులుగా పుట్టించి, మీరు ఎలా పని చేస్తారోనని పరీక్షిస్తున్నాడు. కనుక మీరు ప్రాపంచిక (మాయల) విషయంలో, స్త్రీల (ద్వారా ఎదురయ్యే పరీక్షల) విషయంలో అప్రమత్తంగా ఉండండి." (ముస్లిం)

దైవప్రవక్త (స) హితోక్తి: "మీరు సముద్రంలో వ్రేలు ముంచితీస్తే దానికి ఎంత నీరు అంటుకుంటుందో పరలోకజీవితం ముందు ఇహలోకజీవితం కూడా అంతే!" (ముస్లిం)

హజ్రత్ సహల్ బిన్ సాద్ సాయిదీ (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ప్రవచనం: "దేవుని దృష్టిలో ఈ లోకానికి దోమరెక్కంత విలువ ఉన్నా ఆయన అవిశ్వాసులకు గ్రుక్కెడు మంచినీళ్ళు కూడా త్రాగించేవాడు కాడు." (తిర్మిజీ)

హజ్రత్ జాబిర్ (రజి) కథనం: ఒకసారి దైవప్రవక్త (స) ఓ బజారున వెళుతున్నారు. ఆయన ఇరుప్రక్కలా జనం ఉన్నారు. అలా వెళుతూ ఆయన పొట్టి చెవులుగల ఒక చచ్చిన మేకపిల్లను చూశారు. దాని చెవి పట్టుకొని అక్కడున్నవారితో, "మీలో ఎవరైనా దీన్ని ఒక్క దిర్హంకైనా కొనటానికి యిష్టపడతారా?" అని అడిగారు. అక్కడున్నవారు "(ఒక్క దిర్హం కాదుకదా) దానికన్నా తక్కువ ఖరీదుకు కూడా మేము దాన్ని తీసుకోము. ఒకవేళ తీసుకున్నా దాన్ని మేమేం చేసుకుంటాం?" అని అన్నారు. "ఒకవేళ ఉచితంగా లభిస్తే తీసుకోవటానికి యిష్టపడతారా?" అని మళ్ళీ అడిగారు దైవప్రవక్త (స). దానికి వారు "దైవసాక్షి! ఇది బ్రతికున్నా దీనిలో లోపం ఉంది. దీని చెవులు పొట్టిగా ఉన్నాయి. అయినా చచ్చిపోయినదాన్ని మేము ఏం చేసుకుంటాం?" అని అన్నారు. అప్పుడు ఆయన "దైవసాక్షి! మీరీ మేకపిల్లను ఎంత తుచ్ఛమైనదిగా భావిస్తున్నారో దేవుని దృష్టిలో ఈ లోకం అంతకన్నా తుచ్ఛమైనది" అని చెప్పారు. (ముస్లిం)



హజ్రత్ అబూహురైరా (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ఇలా చెప్పారు: "విశ్వాసికి ప్రపంచం చెరసాల వంటిది. అవిశ్వాసికి స్వర్గం లాంటిది." (ముస్లిం)

హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి) ఉల్లేఖనం: దైవప్రవక్త (స) ఒకసారి నా భుజాలు పట్టుకొని, "ప్రపంచంలో ఓ అపరిచిత వ్యక్తిలా, బాటసారిలా జీవితం గడుపు" అని హితోపదేశం చేశారు. (హదీస్)

దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "ప్రపంచాన్ని ప్రేమించేవాడు తన పరలోకాన్ని నాశనం చేసుకుంటాడు; పరలోకాన్ని ప్రేమించేవాడు తన ప్రపంచాన్ని నష్టపరచుకుంటాడు. కనుక ప్రజలారా! మీరు అంతమయిపోయే (ఐహిక) జీవితం కంటే శాశ్వతంగా ఉండే (పరలోక) జీవితానికి అత్యధిక ప్రాధాన్యం ఇవ్వండి." (మిష్కాత్)

## శ్రేష్ఠుడయిన విశ్వాసి

హజ్రత్ అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (స) ఈవిధంగా తెలియజేశారు:- "ఎవరికైతే నాలుగు వస్తువులు లభిస్తాయో అతనికి ఇహపరలోకాల సౌభాగ్యాలు లభించినట్లే. ఆ నాలుగు ఇవి: 1-కృతజ్ఞత చెల్లించే హృదయం, 2-దేవుడ్ని (సదా) స్మరించే నోరు, 3-ఆపద సమయంలో సహనం వహించే శరీరం, 4-తన మాన ప్రాణాలలో, తన భర్త సంపదలో నమ్మకద్రోహానికి పాల్పడని భార్య." (మిష్కాత్)

దైవప్రవక్త (స) ఈ విధంగా తెలియ జేశారు: "తన నోటితో, చేతులతో ముస్లింలకు బాధించనివాడే (నిజమైన) ముస్లిం. ప్రజల ధనప్రాణాలకు ఎలాంటి నష్టం కలిగించకుండా వారిని ప్రశాంతంగా ఉండనిచ్చేవాడే (నిజమైన) విశ్వాసి. దేవుని విధేయతలో ఉండి తన మనోవాంఛలతో పోరాటం (జిహాద్) జరిపేవాడే యోధుడు (ముజాహిద్). అవిధేయతా మార్గం వదలిపెట్టినవాడే కాందిశీకుడు (ముహాజిర్)"- (మిష్కాత్)

హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (స) ఇలా తెలిపారు: "ప్రజలతో కలసిమెలసి ఉండకుండా, వారు కలిగించే బాధలకు (అసహనంతో) మనస్సు నొచ్చుకుంటూ ఉండే ముస్లిం కంటే ప్రజలతో కలసిమెలసి ఉంటూ, వారు కలిగించే బాధల పట్ల సహనం వహించే ముస్లిం ఎంతో శ్రేష్ఠుడు." (తిర్మిజి)

దైవప్రవక్త (స) హితోక్తి: "మనిషి నిష్ప్రయోజనకరమైన విషయాల్ని మానేయడం, అతని మంచి విధేయతకు నిదర్శనం." (మంచిముస్లిం అనడానికి తార్కాణం). (తిర్మిజీ)

దైవప్రవక్త (సల్లం) హితోక్తి: "తన నోటితోగాని, చేత్తోగాని ఇతర ముస్లింలకు బాధ కలగకుండా మసలుకునేవాడే (నిజమైన) ముస్లిం. దేవుడు వారించిన విషయాలకు దూరంగా ఉండేవాడే (వాస్తవానికి) 'ముహాజిర్' (కాందిశీకుడు). (బుఖారీ, ముస్లిం)

దైవప్రవక్త (స) ఇలా అన్నారు: "వితంతువులు, నిరుపేదల బాగోగుల కోసం కృషి చేసేవాడు దైవమార్గంలో పోరాడే యోధుడితో సమానం." (బుఖారీ, ముస్లిం)

హజ్రత్ అబూహురైరా (రజి) కథనం: ఒకసారి దైవప్రవక్తను "ప్రజల్లో అందరి కన్నా ఆదరణీయుడు ఎవర"ని ప్రశ్నించడం జరిగింది. దానికి ఆయన "వారిలో అందరికన్నా

ఎక్కువగా దైవానికి భయపడుతుండేవాడు'' అని సమాధానమిచ్చారు. అప్పుడు అనుచరులు ''దైవప్రవక్తా! మేమడుగు తున్నది దాన్ని గురించి కాదు'' అని అన్నారు. ''అలాగైతే యూసుఫ్ (అలైహి) (అందరికన్నా శ్రేష్ఠులు). ఆయన దైవప్రవక్త. ఆయన తండ్రి, తాత, ముత్తాతలు కూడా దైవప్రవక్తలే. అంతేకాదు ఆయన దేవుని స్నేహితుడు కూడాను'' అన్నారు మహాప్రవక్త ముహమ్మద్ (స). ''మేమడుగుతున్నది దీన్ని గురించి కూడా కాదు'' అన్నారు అనుచరులు మళ్ళీ. ''మరి మీరు నన్ను అరబ్బు వంశాల గురించి అడుగుతున్నారా?'' (అలాగయితే) అజ్ఞానకాలంలో శ్రేష్ఠులుగా భావించబడిన వారే ఇస్లాంలోకి వచ్చిన తరువాత కూడా శ్రేష్ఠులుగా ఉంటారు. (కాకపోతే వారు ధర్మాన్ని అర్థం చేసుకునేవారై ఉండాలి'' అన్నారు దైవప్రవక్త (స) (బుఖారీ, ముస్లిం)

## కోర్కెల గుర్రాలకు కళ్ళెం వేయండి

దైవప్రవక్త (స) ప్రవచనం: ''మనస్సును అధీనంలో పెట్టుకొని (కోర్కెల గుర్రాలకు కళ్ళెం వేసి) మరణానంతర జీవితాన్ని తీర్చిదిద్దుకోవడంలో నిమగ్నమై ఉండేవాడే తెలివిగల వాడు. దీనికి భిన్నంగా అధర్మమైన మనోవాంఛలకు బానిసగా మారి, దేవుని (కారుణ్యానుగ్రహాల)పై లేనిపోని ఆశలు పెట్టుకున్నవాడు పరమ మూర్ఖుడు.'' (తిర్మిజి)

నౌక సాగర జలాలలోనే నడుస్తుంది. దాని ప్రయాణీకులకు కూడా తాగడానికి, ఇతరత్రా అవసరాలకు నీరు కావాల్సిందే. వారు తమ అవసరాల మేరకే సాగరం నుంచి నీరు తీసుకోవాలి. అంతేగాని అవసరాలకు మించి నీరు తోడుకొని నౌకలో పోసుకుంటే ఏమవుతుంది? బరువు ఎక్కువయి నౌక మునిగిపోతుంది. అలాగే సాగరం అనే ఈప్రపంచం నుండి జీవితనౌక సవ్యంగా సాగడానికి కావలసిన మేరకే సంపద అనే నీటిని సమకూర్చుకోవాలి. అవసరానికి మించిన సంపదను సమకూర్చుకుంటే మన జీవితనౌక ప్రాపంచిక వ్యామోహ సాగరంలో మునిగిపోయి, పరలోక నరకయాతనల్లో తేలుతుంది.

మహాప్రవక్త ముహమ్మద్ (స) ఒక మనిషికి హితోపదేశం చేస్తూ ఇలా అన్నారు: ''నీవు అయిదు విషయాల కంటే మరో అయిదు విషయాలు శ్రేష్ఠమైనవిగా భావించు. 1-వృద్ధాప్యం రావడానికి ముందే నీ యౌవనాన్ని, 2-జబ్బు పడకముందే నీ ఆరోగ్యాన్ని, 3-లేమి కలగక ముందే నీ కలిమిని, 4-ఎడతెగని పనులు వచ్చి పడక ముందే తీరిక సమయాన్ని, 5-మృత్యువు దాపురించక ముందే నీ జీవితాన్ని శ్రేష్ఠమైన భాగ్యాలుగా భావించు.'' (మిష్కాత్)

దైవప్రవక్త (స) హజ్రత్ ముఆజ్ బిన్ జబల్ (రజి)ని యమన్‌కు గవర్నగా నియమించి పంపుతూ ఇలా ఉపదేశించారు: ''ముఆజ్! నీవు భాగలాలస, విలాసాలకు దూరంగా మసలుకో. దేవుని భక్తులు భోగలాలసులు కాలేరు.'' (మిష్కాత్)

హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి) కథనం: దైవప్రవక్త (స) నా భుజం పట్టుకొని ''నీవు ప్రపంచంలో ఒక ప్రయాణీకుడిలా, ఒక బాటసారిలా జీవితం గడుపు'' అని అన్నారు. ఇబ్నె ఉమర్ (రజి) ప్రజలతో ఇలా అంటుండేవారు: ''సాయంత్రం అయినప్పుడు ఉదయం కోసం వేచిచూడకు; ఉదయం ఐనప్పుడు సాయంత్రం కోసం ఎదురుచూడకు; ఆరోగ్యంగా ఉన్నప్పుడు వ్యాధిగ్రస్త రోజుల కోసం (పుణ్యసామగ్రి) సేకరించుకో.'' (బుఖారి)



దైవప్రవక్త (స) ఇలా బోధించారు: ''నిర్ణీత సమయానికి తన గమ్యస్థానానికి చేరుకుంటానో లేదోనని భయపడే బాటసారి రాత్రిపూట పడుకోకుండా రాత్రి మొదటిజాములోనే ప్రయాణం సాగిస్తాడు. ఈవిధంగా చేసే ప్రయాణీకుడే క్షేమంగా నిర్ణీత సమయానికి గమ్యస్థానం చేరుకుంటాడు. వినండి! దేవుని సొత్తు అత్యధిక మూల్యం చెల్లించేవారికే లభిస్తుంది. వినండి! దేవుని (విలువైన) సొత్తు స్వర్గమే.'' (తిర్మిజి)

హజ్రత్ అబ్దుల్లా బిన్ మస్వూద్ (రజి) కథనం: ఓసారి దైవప్రవక్త (స) చాప మీద పడుకున్నారు. మేల్కొని లేచినప్పుడు ఆయన శరీరం మీద చాప గుర్తులు పడివున్నాయి. అది చూసి మేము ''దైవప్రవక్తా! మేము మీ కోసం ఓ పరుపు ఏర్పాటుచేస్తే మీకేమైనా అభ్యంతరమా?'' అన్నాము. దానికి దైవప్రవక్త (స) ఇలా అన్నారు- ''(క్షణభంగురమైన) ఈ లోకంతో నాకేం పని! ప్రపంచంతో నాకున్న సంబంధం ఓ బాటసారి లాంటిది మాత్రమే. బాటసారి ఓ చెట్టు కింద కాస్సేపు విశ్రాంతి తీసుకుంటాడు. ఆ తరువాత దాన్ని వదిలేసి వెళ్ళిపోతాడు. (నా విషయం కూడా) అంతే.'' (తిర్మిజి)

హజ్రత్ ఉఖ్బా బిన్ ఆమిర్ (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ప్రవచనం: ''ప్రజలు దుర్మార్గాలు అవిధేయతా పనులకు పాల్పడుతున్నప్పటికీ దేవుడు వారికి వారి కోరికలకు అనుగుణంగా ఎన్నో భాగ్యాలు ప్రసాదిస్తూ ఉండటం మీరు చూస్తున్నారు. అయితే ఇది (దేవుని తరఫున) సడలింపు మాత్రమే.'' ఆ తరువాత దైవప్రవక్త (స) ఈసూక్తులు పఠించారు- '(మాప్రవక్తలు) చేసిన ఉపదేశాలు వారు పూర్తిగా విస్మరించారు. అప్పుడు మేము వారికోసం సుఖసంతోషాలు అవతరించే ద్వారాలన్నీ తెరచిపెట్టాము. వారు మేము ప్రసాదించిన అనుగ్రహాలు ఆస్వాదిస్తూ అందులో నిండా మునిగిపోయారు. అలాంటి స్థితిలో మేము హఠాత్తుగా వారిని పట్టుకున్నాం. దాంతో వారు చేసేదిలేక పూర్తిగా నిరాశచెందారు. ఆవిధంగా మేము దుర్మార్గానికి పాల్పడినవారిని సమూలంగా తుడిచిపెట్టాం.'' (6:44-45)- (అహ్మద్)

దైవప్రవక్త (స) తన అనుచరులతో మాట్లాడుతూ ఇలా అన్నారు: ''నా అనుచర సముదాయం గురించి అన్నిటికంటే ఒక విషయంలో నేనెంతో భయపడుతున్నాను. నా అనుచర సముదాయం ప్రజలు మనోవాంఛలకు బానిసలైపోయి ప్రాపంచిక ప్రయోజనాల కోసం పెద్దపెద్ద పథకాలు తయారుచేసుకుంటారు. ఇలా (తుచ్ఛమైన) కోరికల వెంట పడటం వల్ల వారి ప్రాపంచిక పథకాలు వారిని పరలోకాన్ని విస్మరింపజేస్తాయి. దాంతో వారు సత్యానికి, ధర్మానికి దూరమైపోతారు. (ప్రజలారా! వినండి,) ప్రపంచం (వినాశం వైపు) బయలుదేరి వెళ్ళిపోతోంది. పరలోకం (సుస్థిరం వైపు) బయలుదేరి వస్తోంది....కనుక మీరు ప్రపంచ పూజారులుగా మారకుంటే బాగుంటుంది. మీరిప్పుడు కర్మలోకంలో ఉన్నారు. కర్మవిచారణ సమయం ఇంకారాలేదు. రేపు మీరు విచారణలోకంలో ఉంటారు. అక్కడ కర్మలు ఆచరించడానికి ఎలాంటి అవకాశం ఉండదు.'' (మిష్కాత్)

## పిరికితనం, ప్రాపంచిక వ్యామోహం

దైవప్రవక్త (స) మాట్లాడుతూ ''ఆకలిగొన్నవారు భోజన కంచాలపై విరుచుకుపడినట్లు నా అనుచర సముదాయంపై ఇతర జాతులు విరుచుకుపడతాయి. ఆ కాలం త్వరలో రానున్నది'' అని అన్నారు. ఒక అనుచరుడు ఈమాట విని ''ఆ కాలంలో ఇతర జాతులు

సమైక్యమయి మమ్మల్ని అంతమొందించే ఉద్దేశంతో మాపై విరుచుకుపడేందుకు మా ముస్లింల జనాభా మరీఅంత తక్కువగా ఉంటుందా?” అని అడిగాడు.

దానికి దైవప్రవక్త (స) ఇలా అన్నారు: “తక్కువేమీ ఉండదు. ఆ కాలంలో మీరు అత్యధిక సంఖ్యలో ఉంటారు. కాని మీరప్పుడు వరదనీటి నురుగులా ఉంటారు. మీ శత్రువుల హృదయాల్లో మీపట్ల ఉండే భయం పోతుంది. మీ హృదయాల్లో పిరికితనం గూడుకట్టుకొని ఉంటుంది.” ఒకతను ఈమాట విని “దైవప్రవక్తా! ఆ పిరికితనానికి కారణం ఏమిటీ?” అని అడిగాడు. దానికి దైవప్రవక్త (స) “మీరు ప్రాపంచిక వ్యామోహపరులై పోతారు. (ధర్మసంస్థాపన కోసం ప్రాణత్యాగం చేయడానికి బదులు) మీరు చావును అసహ్యించుకొని దాన్నుండి పారిపోతారు” అని చెప్పారు. (అబూదావూద్)

ప్రాపంచిక వ్యామోహం, పరలోకపు జవాబుదారి భావనల పట్ల ఏమరుపాటులే ఈనాడు ముస్లింలను పిరికిపందలుగా చేసింది. ఈ రెండు విషయాలు వారిని ఖుర్‌ఆన్ బోధనలక్కూడా దూరంచేసింది. నమాజ్, రోజాలు పాటించేవారిలో సైతం సమైక్యతా సోదరభావాలు సన్నగిల్లి పోయాయి. ఒక ముస్లింపై దౌర్జన్యం జరుగుతుంటే తోటి ముస్లిం తనకేమీ పట్టనట్లు చూస్తుండి పోతున్నాడు. ఒకవర్గానికి అన్యాయం జరుగుతుంటే మరొక వర్గం సంబరపడిపోతోంది. చివరికి ఒక ముస్లింకు మరొకముస్లిం ఎదురైనప్పుడు వారిలో ప్రతిఒక్కడూ మరొకడికి సలాం చేయడంలో ముందంజవేయడం తన వ్యక్తిత్వానికి నామోషిగా భావిస్తున్నాడు. మణిహారం తెగిన తరువాత దారం పట్టుకొని పరుల ముందు దేబిరించినట్లయింది ఈనాటి ముస్లింల పరిస్థితి.

## 11. విధివ్రాత (అదృష్టం)

“ఆయన ప్రతి వస్తువునూ, (ప్రతిప్రాణిని) సృష్టించి, దానికొక జాతకం నిర్ణయించాడు.” (25:2); “దేవుడు మానవుల్ని ఏ ప్రకృతి(ధర్మం) ఆధారంగా పుట్టించాడో ఆ ప్రకృతి (ధర్మం) లోనే స్థిరంగా ఉండండి. ఆయన రూపొందించిన ప్రకృతికి మార్పులేదు. ఇదే సరైన మార్గం, (సహజ) ధర్మం.” (ఖుర్‌ఆన్-30:30)

ఆ ప్రకృతి ధర్మమే ఇస్లాం. విశ్వంలోని సమస్తం, చివరికి మానవుని అవయవాలు సైతం దైవనియమావళి ప్రకారమే పనిచేస్తున్నాయి. అయితే మానవుల్లో కొందరు తమకు దేవుడు ప్రసాదించిన స్వేచ్ఛను దుర్వినియోగంచేస్తూ విశృంఖలజీవితం గడుపుతున్నారు. అలాగే పిల్లల్ని సైతం తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. దీనిపై ప్రవక్త ప్రవచనం చూడండి:

“మాతృగర్భం నుండి పుట్టే ప్రతిపిల్లవాడూ ప్రకృతిధర్మం ఆధారంగానే పుడుతున్నాడు. కాని తల్లిదండ్రులు ఆతర్వాత ఆ పిల్లవాడ్ని క్రైస్తవునిగానో, యూదునిగానో, మజూసీగానో లేక మరోరకంగానో మార్చుతున్నారు. దీన్నిలా పోల్చవచ్చు- పశువుల కడుపుల్లో నుంచి పశువులు ఏలోపం లేకుండా పుడ్తాయి. ఏ జంతుపిల్ల కూడా తెగినచెవులతో పుట్టదు. ఆతర్వాత బహుదైవారాధకులు మూఢనమ్మకాలతో దాని చెవులు కోసివేస్తారు.” (బుఖారి)

దైవప్రవక్త (స) హితోక్తి: “మీలో ప్రతిమనిషీ మాతృగర్భంలో ఇలా రూపొందుతాడు- మొదట నలభై రోజులదాకా (వీర్యబిందువు రూపంలో) ఉంటాడు. తరువాత అన్ని రోజులే ద్రవరక్తం రూపంలో ఉంటాడు. ఆ తరువాత అన్నే రోజులు మాంసపు ముద్ద (పిండం) రూపంలో ఉంటాడు. ఆ తరువాత దేవుడు ఒక దైవదూతను నాలుగు ఆజ్ఞలు



ఇచ్చి పంపుతాడు. అతని కర్మలు, ఉపాధి, ఆయుష్షులను గురించి వ్రాయమని ఆదేశిస్తాడు. అతను సౌభాగ్యుడవుతాడా లేక దౌర్భాగ్యుడవుతాడా అనే విషయాన్ని కూడా వ్రాయమని ఆదేశిస్తాడు. ఆ తరువాత అతనిలో ప్రాణం పోయబడుతుంది.

పోతే మీలో ఒకడు (సత్)కర్మలు చేస్తుంటాడు. ఈవిధంగా చివరికి (ఆ సత్కర్మల కారణంగా) అతనికి, స్వర్గానికి మధ్య ఒక గజం మాత్రమే దూరం ఉండిపోతుంది. ఆ తరువాత అతని జాతకం మారిపోయి అతను నరకవాసులు చేసే పనులు చేస్తాడు. అలా చివరికి (ఆ దుష్కర్మల కారణంగా) అతనికి, నరకానికి మధ్య ఒకగజం మాత్రమే దూరం ఉండిపోతుంది. అంతలో అతని జాతకం మారిపోయి అతను స్వర్గవాసులు చేసే పనులు చేస్తాడు. (ఫలితంగా అతను స్వర్గానికి పోతాడు.)- (బుఖారి)

హజ్రత్ ఇమ్రాన్ బిన్ హుసైన్ (రజి) కథనం: ఒకతను లేచి “దైవప్రవక్తా! స్వర్గ వాసులెవరో, నరకవాసులెవరో (ముందుగానే) గుర్తించబడ్డారా?” అని అడిగాడు. దానికి దైవప్రవక్త (స) ఔనన్నారు. అప్పుడా వ్యక్తి “అలాంటప్పుడు మానవులు కర్మలు ఆచరించడం దేనికీ?” అని ప్రశ్నించాడు. దానికి దైవప్రవక్త (స) సమాధానమిస్తూ “ప్రతి మనిషీ తాను దేని కోసం పుట్టించబడ్డాడో ఆ పనులే చేస్తాడు” అని అన్నారు. లేక “ఎలాంటి బుద్ధి ఇవ్వబడిందో అలాంటి పనులే చేస్తాడు” అని చెప్పారు. (బుఖారి)

“భూమిపైగాని లేదా మీపైగాని వచ్చిపడే ఏఆపదైనా దాన్ని సృష్టించడానికి పూర్వమే మేము దాన్ని గురించి గ్రంథంలో వ్రాసిపెట్టాము. ఇలా చేయడం దేవునికి చాలా తేలిక. మీమీద ఏఆపద వచ్చినా మీరు బాధపడకుండా (సహనంతో) ఉండాలని, దేవుడు మీకు ఏభాగ్యం అనుగ్రహించినా దాన్ని చూసుకొని మీరు మిడిసిపడకూడదని (ఆయన ఈ ఏర్పాటు చేశాడు).” (ఖుర్‌ఆన్-57:22)

“దేవుని అనుజ్ఞ లేనిదే నిర్ణీత సమయానికి ముందు ఏ ప్రాణికీ చావు రాదు. ప్రతి ప్రాణికీ మరణకాలం వ్రాయబడి ఉంది.” (ఖుర్‌ఆన్-3:145)

హజ్రత్ అలి (రజి) కథనం: దైవప్రవక్త (స) (తమ అనుచరులతో మాట్లాడుతూ) “మీలో ప్రతి ఒక్కరికి లభించే స్వర్గ నరకాలు (ముందే వారి అదృష్టంలో) వ్రాయబడ్డాయి” అని చెప్పారు. అనుచరులు ఈమాట విని “అయితే దైవప్రవక్తా! మేము విధివ్రాతపై భారం వేసి కర్మలు ఆచరించడం మానేయవచ్చా?” అని అడిగారు. దానికి దైవప్రవక్త (స) ఇలా సమాధానమిచ్చారు- “మానేయకూడదు. కర్మలు ఆచరిస్తూనే ఉండాలి. మనిషి ఏ పని కోసం పుట్టించబడ్డాడో అతనికి ఆ పనిచేసే బుద్ధే లభిస్తుంది. అదృష్ట జాతకుడికి స్వర్గానికి గొనిపోయే (సత్) కర్మలు ఆచరించే బుద్ధి లభిస్తుంది. దురదృష్టవంతుడికి నరకానికి దారితీసే (దుష్) కర్మలు ఆచరించే బుద్ధి లభిస్తుంది.”

ఆ తర్వాత ఆయన ఈ సూక్తులు పఠించారు-“ధనాన్ని దానంచేసి, దైవభీతిపరుడై, మంచిని సమర్థించేవాడికి మేము సులువైన మార్గాన నడిచేందుకు సౌలభ్యం కలగజేస్తాం. పిసినారితనం వహించి, (దేవుడ్ని) ఖాతరుచేయకుండా, మంచిని ధిక్కరించే వాడికి మేము కష్టతర మార్గాన నడిచేందుకు సౌలభ్యం కలగజేస్తాం.” (92:5-10)- (బుఖారి, ముస్లిం)

## ఆదం, మూసా (అలై)ల సంభాషణ

దైవప్రవక్త (స) ఇలా తెలియజేశారు: మూసా, ఆదం (అలైహి)ల మధ్య సంభాషణ జరిగింది. మూసా (అలైహి) ఆదం (అలైహి)తో మాట్లాడుతూ "ఆదం! మీరు మా పితామహులు. కాని మీరు మమ్మల్ని (మానవుల్ని) నిరర్థకం చేశారు. మమ్మల్ని స్వర్గం నుంచి తీసివేయించారు" అన్నారు. దానికి ఆదం ఇలా జవాబిచ్చారు: "మూసా! దేవుడు నిన్ను ప్రత్యక్షసంభాషణ కోసం ఎన్నుకున్నాడు. ఆయన నీకు తన స్వహస్తాలతో (తౌరాత్) రాసిచ్చాడు. అలాంటి (ఉన్నతస్థానం పొందిన) నీవు, నన్ను సృష్టించడానికి నలభై యేళ్ళకు పూర్వమే దేవుడు నాఅదృష్టంలో రాసిన విధివ్రాత పట్ల నన్ను నిందిస్తున్నావా?" ఈవిధంగా ఆదం ఈ ప్రమాణం ద్వారా మూసాపై విజయం సాధించారు. దైవప్రవక్త (స) ఈ చివరి వాక్యం మూడుసార్లు అన్నారు. (బుఖారి, ముస్లిం)

హజ్రత్ ఆదం (అలై) ఇక్కడ కర్మలు ఆచరించి పరలోకానికి వెళ్ళిన తరువాతే మూసా (అలై)తో ఇలా అన్నారు. దేవుడు ఆయన పొరపాట్లు క్షమించాడు. ఇక ఆయనపై ఎలాంటి నిందలేదు. కనుక పాపం చేసిన ఏమనిషీ హజ్రత్ ఆదం (అలై)లా జవాబిచ్చి శిక్ష నుండి తప్పించుకోలేడు. ఒకవేళ ఎవరైనా పిడివాదం చేస్తూ "నాఅదృష్టంలో పాపాలు చేయాలని రాసి పెట్టిఉంది గనక నేను పాపాలు చేస్తున్నా; నన్ను నిందించకూడద"ని అంటే, "నీ అదృష్టంలో ఆ పాపాలకు నరకశిక్ష అనుభవిస్తావని కూడ రాసిపెట్టి ఉంది గనక, నరకశిక్ష అనుభవించు" అని సమాధానం వస్తుంది. ఎవరి అదృష్టంలో ఏముందో మానవులకు తెలియదు. అందువల్ల పైశాచిక ఆలోచనలకు పోకుండా శక్తిమేరకు సత్కర్మలు ఆచరించడమే బుద్ధిమంతుల పని.

హజ్రత్ అబీఖిజామా (రజి) గారి తండ్రి కథనం: నేనొక సారి దైవప్రవక్త (స)ను "మేము మా వ్యాధుల నివారణ కోసం చేసే ప్రార్థనలు, కట్టుకునే తాయత్తులు, వాడే మందులు; కష్టాల నుండి కాపాడుకోవడానికి మేము తీసుకునే ముందు జాగ్రత్తలు (మొదలైనవి) విధివ్రాతను మార్చగలవా?" అని అడిగాను. దానికి దైవప్రవక్త (స) "ఇవి కూడా విధివ్రాతలోనే ఉంటాయి" అని చెప్పారు. (తిర్మిజి)

హజ్రత్ అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి) కథనం: ఒకరోజు నేను దైవప్రవక్త (స) వెనుక వాహనం మీద కూర్చున్నాను. అప్పుడాయన నాకిలా ఉదేశించారు- "అబ్బాయ్! నేను నీకు కొన్నిమాటలు చెబుతాను జాగ్రత్తగా విను. నువ్వు దేవుడ్ని జ్ఞాపకం పెట్టుకో, దేవుడు నిన్ను జ్ఞాపకం పెట్టుకుంటాడు. నువ్వు దేవుడ్ని జ్ఞాపకం చేసుకుంటే దేవుడ్ని నీ ముందు పొందుతావు. నువ్వేదైనా అర్థించాలనుకుంటే దేవుడ్ని (మాత్రమే) అర్థించు. ఏదైనా ఆపదలో ఉండి సహాయం కోరదలచుకుంటే దేవుని సహాయం కోరుకో. దేవుడ్ని నీ సహాయకుడిగా చేసుకో. ఒక విషయం గుర్చుంచుకో. ప్రజలంతా కలసి నీకేదైనా ప్రయోజనం చేకూర్చ దలిస్తే, దేవుడు నీ అదృష్టంలో రాసిపెట్టింది తప్ప మరెలాంటి ప్రయోజనం చేకూర్చలేరు. అలాగే ప్రజలంతా కలిసి నీకేదైనా నష్టం కలగజేయదలచుకుంటే, దేవుడు నీ అదృష్టంలో రాసిపెట్టింది తప్ప మరెలాంటి నష్టం కలగజేయలేరు." (మిష్కాత్ షరీఫ్)

హజ్రత్ అబూహురైరా (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ఇలా అన్నారు: "బలహీనుడైన విశ్వాసి కంటే బలవంతుడైన విశ్వాసియే శ్రేష్ఠుడు, దేవునికి ఎక్కువ ప్రియమైనవాడు.



అయితే ఇద్దరిలో శ్రేయస్సు ఉంది. నీవు (పరలోకంలో) ప్రయోజనం చేకూర్చే విషయాల్ని కోరుకో. కష్టాలు ఎదురైనప్పుడు దేవుని సహాయం వేడుకో, అధైర్యం చెందకు. ఏదైనా ఆపద వచ్చిపడితే, ఒకవేళ నేనిలా చేసివుంటే ఇలా అయ్యేది కాదని అనకు. దానికి బదులు 'నా అదృష్టంలో ఉన్నట్లు దేవుడు తలచింది జరిగింది' అని భావించు. 'ఒకవేళ' అనే మాట పైశాచిక చేష్టలకు తలుపులు తెరుస్తుంది." (మిష్కాత్ షరీఫ్)

## జ్యోతిష్యం, జాతకం, అస్పృశ్యత, దుశ్శకునాలు

"మానవులారా! పిశాచశక్తులు ఎవరిని ఆవహిస్తాయో మీకు తెలుపనా? వంచకుడు, అబద్ధాలకోరు అయిన ప్రతి పాపాత్ముడ్ని అవి ఆవహిస్తాయి. వినీ వినని కొన్ని మాటలు మోసుకెళ్ళి వారి చెవులలో ఊదేయడం జరుగుతుంది. వాటిలో అనేక విషయాలు అసత్యాలే అయివుంటాయి. (ఖుర్ఆన్:26:221-223)

ఈ విషయం గురించి హజ్రత్ ఆయిషా (రజి) ప్రస్తావిస్తూ, కొందరు వ్యక్తులు దైవప్రవక్త (సల్లం) ముందు జ్యోతిష్కుల ప్రస్తావన తెచ్చినప్పుడు ఆయన "అదంతా బూటకం" అన్నారు. దానికామె "దైవప్రవక్తా! కొన్ని సందర్భాల్లో వారు సరైన మాటే చెబుతారు కదా?" అన్నారు. అప్పుడు దైవప్రవక్త (సల్లం) "సరైన మాటంటే ఒక్కొక్కప్పుడు భూతాలు (జిన్నులు) సరైన మాటను తీసుకొని ఎగురుతూపోయి తమ సహచరుల చెవుల్లో ఊదేస్తాయి. ఆ సహచరులు ఆ మాటకు తమ వైపు నుంచి అనేక అసత్యాలు కలిపి ఒక కట్టుకథ అల్లుతారు" అని చెప్పారు. (బుఖారి)

ప్రవక్త సతీమణి హజ్రత్ ఆయిషా (రజి) ఇలా ఉల్లేఖిస్తున్నారు: "దైవప్రవక్త (స)కు రేపటి రోజు సంభవించే విషయాలు తెలుసని ఎవరైనా అంటే, అతను దేవుని మీద పెద్ద అభాండం వేస్తున్నాడన్నమాట. యావత్తు భూమ్యాకాశాల్లో అతీంద్రియజ్ఞానం దేవునికి మాత్రమే ఉందని దేవుడే తెలియజేస్తున్నాడు." (సహీముస్లిం)

దైవప్రవక్త (స) ప్రవచనం:"మీలో ఎవరైనా జోతిష్యుని దగ్గరకు వెళ్ళి ఏదైనా అడిగి అతను చెప్పేదాన్ని నిజమని భావిస్తే అలాంటి మనిషి చేసే నమాజ్ నలభై రోజుల వరకు స్వీకరించబడదు." (ముస్లిం)

దైవప్రవక్త (స) ప్రవచనం: "నక్షత్రవిద్య నేర్చుకున్నవాడు చేతబడి విద్య నేర్చు కున్నట్లే. ఆ విధంగా అతను ఎంత నక్షత్రవిద్య నేర్చుకుంటే అంత చేతబడి విద్య నేర్చు కున్నట్లవుతుంది." (అబూదావూద్)

హజ్రత్ అబూహురైరా (రజి) ఇలా తెలిపారు: "అస్పృశ్యతా (అంటు) పాటింపు సరైనది కాదు. 'సఫర్', హామా'లలో నిజం లేదు" అన్నారు దైవప్రవక్త (స). ఓ పల్లెవాసి ఈమాట విని "దైవప్రవక్తా! నా ఒంటెలు జింకల మాదిరిగా ఎడారిలో శుభ్రంగా (ఎంతో ఆరోగ్యంగా) ఉంటాయి కాని చిడుముతో ఉండే ఒక ఒంటె వచ్చి వాటిలో కలసిపోగానే ఒంటెలన్నిటికీ ఆ గజ్జి తగులుతుంది. ఇలా ఎందుకు జరుగుతుంది?" అని అడిగాడు. దానికి దైవప్రవక్త (స) "ఇది (నువ్వనుకుంటున్నట్లు) అంటు వల్లనే వచ్చివుంటే ఆ మొదటి ఒంటెకు దేని అంటు తగిలింది?" అని అన్నారు. (బుఖారి, ముస్లిం)

అజ్ఞానులు ఒకరి అంటు మరొకరికి తగులుతుందని భావిస్తారు. కాని అంటు ప్రభావానికి మూలకారకుడు దేవుడని భావించరు. పైత్యం అనేది ఒక విధమైన ఉదరవ్యాధి. కాని అరబ్ బహుదైవారాధకుల నమ్మకం ప్రకారం రోగి కడుపులోకి ఓ జంతువు దూరి ఆకలిగా ఉన్నప్పుడు తీవ్రమైన క్షోభ కల్గిస్తుంది. దీనివల్ల ఒక్కోసారి రోగి మృత్యువాతన కూడా పడతాడు. వారీ వ్యాధిని చిడుముకన్నా ప్రమాదకరమైన అంటువ్యాధి అని నమ్మేవారు. ఈ నమ్మకాన్ని 'సఫర్' అంటారు. 'హామా' గురించి కూడా పూర్వం అరబ్ బహుదైవారాధకుల్లో మూఢనమ్మకం ఉండేది. చనిపోయిన మనిషి ఆత్మ గుడ్లగూబ శరీరంలోకి ప్రవేశిస్తుందని నమ్మేవారు. అందువల్ల గుడ్లగూబను వారు దుశ్శకునంగా భావించేవారు. అది ఎవరి ఇంటిపై వాలితే ఆ ఇంటి యజమాని చనిపోతాడని వారు నమ్మేవారు. దైవప్రవక్త (హ) ఈ రెండు మూఢనమ్మకాలను ఖండించారు.

హజ్రత్ అనస్ (రజి) కథనం: దైవప్రవక్త (స) "అంటు (అస్పృశ్యత), దుశ్శకునం అనేవి బూటకం. అయితే మంచి శకునం అంటే నాకిష్టం." అన్నారు. అనుచరులు ఈమాట విని "శకునం అంటే ఏమిట"ని అడిగారు. అందుకాయన "మంచిమాట (వినటం, మంచి జరుగుతుందని ఆశించటం)" అని చెప్పారు. (ముస్లిం)

అకస్మాత్తుగా ఏదైనా మంచిమాట లేదా సందర్భోచితమైన మాట విన్నప్పుడు దాన్నుండి సకారాత్మక ఫలితం తీయడాన్నే మంచి శకునం(ఫాల్) అంటారు. ఇది ధర్మసమ్మతమే.

హజ్రత్ ఉర్వా బిన్ ఆమిర్ (రజి) కథనం: దైవప్రవక్త (స) దగ్గర శకునం గురించిన ప్రస్తావన వచ్చింది. అప్పుడాయన ఇలా అన్నారు: శకునాలన్నిటిలో మంచి శకునం శ్రేష్ఠమైనది. అపశకునం చూసి ముస్లిం తన పని మానేయరాదు. మీలో ఎవరికయినా తమకు నచ్చని విషయం ఎదురైతే ఈవిధంగా ప్రార్థించాలి- 'దేవా! మేలు చేసేవాడివి నీవే. కీడును తొలగించేవాడివి కూడా నీవే. చెడుల నుండి కాపాడుకోవాలన్నా మంచి పనులు చేయాలన్నా నీ శక్తితోనే సాధ్యమవుతుంది." (అబూదావూద్.)

## మొక్కుబడులు

"వారు తమ మొక్కుబడులు నెరవేరుస్తారు." (ఖుర్ఆన్–76:7)

ఈ సూక్తి మూలభాషలోని "నజ్ర్" అంటే మనిషిపై విధించబడిన పని లేదా తనకుతాను విధించుకున్న పని అని భావం. మరోమాటలో మనిషి విధిగా ఏదైనా పనిచేస్తానని మొక్కుబడి చేసుకోవడం లేదా ప్రతినబూనడం అని అర్థం. వీటిని తప్పక నెరవేర్చాలి. అయితే అవి తనకు శక్తికి మించినవైనప్పుడు లేదా ధర్మవ్యతిరేక విషయాలైనప్పుడు నెరవేర్చకూడదు. మొక్కుబడి మన అదృష్టాన్ని మార్చివేస్తుందన్న భావంతో మొక్కుబడి చేసుకోకూడదు. అలాగే దేవుడు తన పని నెరవేరిస్తేనే ఫలానా సత్కార్యం చేస్తానని కూడా మొక్కుబడి చేసుకోకూడదు.

దైవప్రవక్త (సల్లం) ఓసారి మొక్కుబడిని గురించి చెబుతూ "జరగవలసిఉన్న ఏ పనిని కూడా మొక్కుబడి అడ్డుకోలేదు. కాకపోతే ఆ మొక్కుబడి ద్వారా పిసినారి (జేబు) నుండి కొంత డబ్బు తీయబడుతుంది" అన్నారు. (ముస్లిం, అబూదావూద్).

మరోసందర్భంలో ఇలా అన్నారు: "మొక్కుబడి జరగవలసిన పనిని దాని నిర్ణీత సమయానికి ముందుగాగాని లేదా ఆలస్యంగాగాని జరిపించలేదు. కాకపోతే పిసినారి



(జేబు) నుండి కొంతడబ్బు తీయబడుతుంది." (బుఖారి, ముస్లిం)

"దేవుని అవిధేయత విషయంలో మొక్కుబడి నెరవేర్చే ప్రశ్నే రాదు. అలాగే తన అధీనంలోలేని విషయంలో కూడా మొక్కుబడి నెరవేర్చే ప్రశ్న లేదు"అన్నారు దైవప్రవక్త (స). ఒకవ్యక్తి వచ్చి "నాసోదరి కాలినడకన హజ్‌యాత్ర చేస్తానని మొక్కుబడి చేసుకున్నది" అన్నాడు. దానికి దైవప్రవక్త (స) "నీ సోదరి (అలా) పడే శ్రమ, కష్టం దేవునికి అవసరంలేదు. ఆమె వాహనమెక్కి హజ్‌కు వెళ్ళాలి" అని చెప్పారు. (అబూదావూద్)

## అంటువ్యాధి ప్రబలినప్పుడు

హజ్రత్ ఇబ్నెఅబ్బాస్ (రజి) కథనం: హజ్రత్ ఉమర్ (రజి) సిరియాకు బయలుదేరి వెళ్ళారు. ఆయన సర్గ్ ప్రాంతంలో ఉన్నప్పుడు సిరియా పాలకుడు అబూఉబైదా బిన్ జర్రాహ్, తన సహచరులతో వచ్చి ఆయన్ని కలుసుకొని, 'సిరియాలో అంటువ్యాధి ప్రబలిఉందని" అన్నారు. అప్పుడు ఉమర్ (రజి) తనవద్దకు తొలి ముహాజిర్లను పిలుచుకురమ్మని నన్ను పురమాయించారు. నేనెళ్ళి వారిని పిలుచుకొచ్చాను. ఆయన వారికి సిరియాలో అంటువ్యాధి వ్యాపించిఉందన్న సంగతి చెప్పి వారి సలహా అడిగారు.

వారు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేశారు. కొందరు "మీరు ఒకపని మీద వచ్చారు. అది పూర్తికాకుండా వెళ్ళిపోవడం బాగుండదని మా అభిప్రాయం" అన్నారు. మరికొందరు "మీ వెంట మిగతా జనం దైవప్రవక్త సహచరులు తక్కువ మంది ఉన్నారు. కనుక వారిని కూడా అంటువ్యాధి ప్రాంతానికి తీసుకెళ్ళడం సరికాదు" అన్నారు. వారి అభిప్రాయాలు విన్న తరువాత వారితో "ఇక మీరు వెళ్ళిపోండి" అన్నారు ఉమర్ (రజి)

ఆ తరువాత ఆయన అన్సార్ ముస్లింలను పిలవమన్నారు. నేను వారిని పిలుచుకొచ్చాను. వచ్చిన తరువాత ఆయన వారి సలహా అడిగారు. వారు కూడా ముహాజిర్ల విధానాన్నే అనుసరించారు. వారి అభిప్రాయాలు విన్న తరువాత ఆయన వారితో "ఇక మీరు వెళ్ళిపోండి" అన్నారు ఉమర్ (రజి). ఆ తర్వాత ఆయన మక్కా విజయం సందర్భంగా (మదీనాకు) వలస వెళ్ళిన ఖురైష్‌పెద్దల్లో ఇక్కడున్న వారిని పిలవండి అన్నారు. నేను వారిని పిలుచు కొచ్చాను. వారిలో ఏఇద్దరూ భిన్నాభిప్రాయాలు వ్యక్తపరచలేదు. "ప్రజలను అంటువ్యాధి వ్యాపిస్తున్న ప్రాంతానికి తీసుకువెళ్ళటం మంచిదికాదు. వారిని తీసుకొని తిరిగివెళ్ళి పోవటం మంచిదని మా అభిప్రాయం" అన్నారు వారు. అంతావిన్న తరువాత ఉమర్ (రజి) ప్రజల ముందు "నేను రేపుదయం (మదీనాకు) తిరిగి వెళ్తున్నాను. కనుక మీరు కూడా రేపు ఉదయం బయలుదేరటానికి సిద్ధంగా ఉండండి" అని ప్రకటన చేయించారు.

అప్పుడు ఉబైదా (రజి) "దేవుడు రాసిపెట్టిన అదృష్టం నుంచి పారిపోతున్నారా!" అన్నారు. దానికి ఉమర్ (రజి) ఇలా చెప్పారు: "ఈమాట మరొకరి నోట వెలువడివుంటే బాగుండు (మీతో విభేదించటం నాకిష్టం లేదు) అవును మేము దేవుని అదృష్టం నుండి దేవుని అదృష్టం వైపుకే పారిపోతున్నాం. మీదగ్గర కొన్ని ఒంటెలుండి మీరు వాటిని ఒక వైపు పచ్చటి చెట్లు చేమలు, మరోవైపు బంజరునేల ఉన్న లోయకు తోలుకెళ్ళారను

కొండి. అప్పుడు మీరు మీ ఒంటెల్ని (బీడు వదలి) పచ్చికఉన్న ప్రదేశంలో మేపినా లేక బీడులో మేపినా అది దేవుని నిర్ణీత అదృష్టం ప్రకారం మేపినట్లు కాదా?"

అంతలో అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ అక్కడికి వచ్చారు. ఆయన ఏదోపని మీద వెళ్ళి వచ్చారు. విషయం తెలుసుకొని ఆయన ఇలా అన్నారు- "నాదగ్గర ఈ సమస్యకు సంబంధించిన జ్ఞానముంది. దైవప్రవక్త 'ఒక ప్రాంతంలో అంటువ్యాధి ప్రబలి ఉందని వింటే అక్కడికి వెళ్ళకండి. ఒకవేళ మీరున్న ప్రాంతంలోనే అంటువ్యాధి ప్రబలితే దాన్నుంచి తప్పించుకోవాలని అక్కడి నుండి (వేరేచోటికి) వెళ్ళకండి' అని చెప్పారు.

ఈ హదీసు విని ఉమర్ (రజి) దైవానికి కృతజ్ఞతలు తెలిపారు. అక్కణ్ణుంచి (మదీనాకు) తిరుగు ప్రయాణమయ్యారు. (బుఖారీ, ముస్లిం)

హజ్రత్ ఉసామా బిన్ జైద్ (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ఇలా ఉపదేశించారు: "ఏదయినా ప్రాంతంలో ప్లేగు వ్యాధి ఉందని తెలిస్తే మీరు అక్కడికి వెళ్ళకండి. మీరు ఏదయినా ప్రాంతంలో ఉన్నప్పుడు అక్కడ ప్లేగు వ్యాధి వ్యాపిస్తుంటే మీరు అక్కడి నుంచి (వేరేచోటుకు) వెళ్ళకండి." (బుఖారీ, ముస్లిం)

## 12. మధ్యేమార్గమే మనకు మంచిది

"ఈవిధంగా మేము మిమ్మల్ని మధ్యస్థ సమాజంగా చేశాము, మీరు ప్రపంచప్రజలకు సాక్షులుగా ఉండాలని, ప్రవక్త మీకు సాక్షిగా ఉండాలని." (ఖుర్ఆన్-2:143)

ఏ విధమైన అతిశయానికి, అతివాదాలకు పోకుండా జీవితంలోని ప్రతి రంగంలోనూ మధ్యేమార్గాన్ని అవలంబించి న్యాయంగా, నిష్పక్షపాతంగా, ధర్మయుక్తంగా వ్యవహరించే సమాజాన్ని "ఉమ్మతె వసత్" లేక మధ్యస్థ సమాజం అంటారు. ఏ విషయంలోనైనా అతిచర్య, అతివాదాలు ఎల్లప్పుడూ అనర్థదాయకమే. ఖుర్ఆన్‌లోని ఈ సూక్తులు చూడండి:

"దైవప్రవక్త మీకు దేన్నిస్తాడో దాన్ని తీసుకొని, దేన్నుండి మిమ్మల్ని నిరోధిస్తాడో దాని జోలికి పోకండి. దేవునికి భయపడండి. దేవుని శిక్ష చాలా కఠినంగా ఉంటుంది." (59:7)

"విశ్వాసులారా! దేవుడు మీకోసం ధర్మసమ్మతం చేసినవాటిని నిషేధించుకోకండి. హద్దుమీరి వ్యహరించకండి. హద్దుమీరేవారిని దేవుడు ఎన్నటికీ ప్రేమించడు. దేవుడు మీకు ధర్మసమ్మతం చేసిచ్చిన పరిశుద్ధ వస్తువుల్ని నిస్సంకోచంగా తినండి, త్రాగండి. దాంతోపాటు మీరు విశ్వసిస్తున్న దేవునిపట్ల భయభక్తులు కలిగివుండండి." (5:87,88)

హజ్రత్ అనస్ బిన్ మాలిక్ (రజి) ఇలా ఉల్లేఖిస్తున్నారు: ముగ్గురు వ్యక్తులు ప్రవక్త భార్యల ఇండ్లకు వచ్చి, దైవప్రవక్త (స) ఆరాధనను గురించి అడిగారు. వారికి ప్రవక్త ఆరాధన గురించి వివరించబడింది. వారు దాన్ని తక్కువగా భావించి, "ఆయనెక్కడా? మనమెక్కడా? ఆయన వల్ల గతంలో జరిగిన పాపాలు, జరగబోయే పాపాలన్నీ క్షమించ బడ్డాయి. (కనుక మనం ఆయన కంటే ఎక్కువ ఆరాధన చేయాలి)" అని అనుకున్నారు. వారిలో ఒకడు "ఇకనుంచి నేను ఎల్లప్పుడూ రాత్రంతా నమాజుల్లో గడుపుతాను" అన్నాడు. రెండవవాడు "నేనిక ముందు ఎల్లప్పుడూ నిర్విరామంగా ఉపవాసం



పాటిస్తుంటాను" అన్నాడు. మూడో వ్యక్తి, "నేనైతే స్త్రీలకు దూరంగా ఉంటాను, ఎన్నటికీ వివాహం చేసుకోను" అని ప్రతిన బూనాడు.

దైవప్రవక్త (స) ఈ మాటలు విని "ఇలాంటి పనులు చేయమని నాకు ఆజ్ఞ లేదు. మీ మీద మీ ఆత్మల హక్కు కూడా ఉంది. కనుక ఉపవాసాలు పాటించండి, తినడం, త్రాగడం కూడా చేయండి. రాత్రుళ్ళలో ఆరాధన కూడా చేయండి, నిద్ర కూడా పోతూ ఉండండి. నన్ను చూడండి, నేను నిద్రపోతాను, జాగరణ చేస్తాను, ఉపవాసాలు పాటిస్తాను, వాటిని విరమిస్తాను కూడా. మాంసం తింటాను, నెయ్యి కూడా తింటాను. నా విధానం, నా సంప్రదాయాలను ఇష్టపడని (పాటించని)వాడు నావాడు కాదు."

ఆ తర్వాత ఆయనిలా అన్నారు: "వీరికేమైంది స్త్రీలను, మంచి ఆహార పదార్థాలు, సువాసనలు, నిద్ర, (ఇతర) ప్రాపంచిక సౌఖ్యాలను నిషేధించుకున్నారు? నేను మీకు విరాగులుగా, సన్యాసులుగా మారమని బోధించలేదే! నా ధర్మంలో స్త్రీలను, మాంసాహారాన్ని త్యజించాలని లేదు. అలాగే బైరాగులై ఏకాంత కుహురాల్లో తిష్ఠవేయాలని కూడా లేదు. ఆత్మనిగ్రహం కొరకు నాధర్మంలో ఉపవాసవ్రతం ఉంది. వైరాగ్య ప్రయోజనాలన్నీ ఇక్కడ జిహాద్ ద్వారా సమకూరుతాయి. (కనుక) అల్లాహ్‌ను ఆరాధించండి. ఆయనకు మరెవరినీ సాటికల్పించకండి. హజ్, ఉమ్రా (విధు)లు నిర్వహించండి. నమాజ్ స్థాపించండి. జకాత్ చెల్లించండి. రమజాన్ రోజాలు పాటించండి. మీకు పూర్వం కొందరు ప్రజలు తమపై లేనిపోని భారం, కాఠిన్యాలు మోపుకోవడం వల్లనే నాశనమయ్యారు. వారు తమ మీద లేనిపోని బరువులు, కాఠిన్యాలు మోపుకున్నప్పుడు దేవుడు కూడా వారిపై బరువులు, కాఠిన్యాలు మోపాడు. మీకు మఠాలలో, ఆశ్రమాల్లో, ఏకాంతకుహరాల్లో కన్పిస్తున్న అవశేషాలు వారు వదలిపెట్టి పోయినవే." (బుఖారి, ముస్లిం)

హజ్రత్ అబ్దుల్లా బిన్ అమ్ర్ బిన్ ఆస్ (రజి) కథనం: దైవప్రవక్త (స) నన్నిలా అడిగారు- "అబ్దుల్లా! నీవు రోజూ పగలు ఉపవాసం పాటిస్తూ, రాత్రిపూట (ఆరాధనలో) జాగరణ చేస్తున్నావని నాకు తెలిసింది, నిజమేనా?" దానికి నేను నిజమే, నేను అలాగే చేస్తున్నాను" అని అన్నాను. అప్పుడు దైవప్రవక్త (స) ఇలా ఉపదేశించారు-

"ఇలాంటి వైఖరి అవలంబించకు. ఉపవాసాలు పాటించు, వాటిని విరమిస్తూ కూడా ఉండు. రాత్రివేళ తహజ్జుద్ నమాజ్ కూడా చెయ్యి, విశ్రాంతి కూడా తీసుకో. నీపై నీ శరీరానికి కూడా హక్కుంది, నీ కళ్ళకు కూడా హక్కుంది, నీ భార్యక్కూడా హక్కుంది, నీ అతిథికి కూడా హక్కుంది. జీవితాంతం ఉపవాసాలు పాటించేవాడు నిజానికి ఉపవాసాలు అసలు పాటించలేనట్లే. ప్రతి నెలా మూడు రోజులు ఉపవాసాలు పాటించడం జీవితాంతం ఉపవాసాలు పాటించడంతో సమానం. కాబట్టి నీవు ప్రతి నెలా మూడు రోజులు ఉపవాసం పాటించు, (చాలు). ప్రతి నెలా (ఒకసారి పూర్తి) ఖుర్ఆన్ పఠిస్తూ ఉండు." నేనీ మాటలు విని "నాకు ఇంతకంటే ఎక్కువ శక్తి ఉంది" అన్నాను.

అప్పుడు దైవప్రవక్త (స) "అయితే దావూద్ (అలైహి)లా ఒక రోజు ఉపవాసం పాటించి, ఒక రోజు మానెయ్యి. వారంలో ఒక సారి (మాత్రమే) ఖుర్ఆన్ పఠిస్తూఉండు. దీనికి మించిపోకు" అని చెప్పారు. (బుఖారి)

హజ్రత్ అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి) కథనం: “అజ్ఞానులు ఎన్నో పదార్థాలు తింటారు; మరెన్నో పదార్థాలను అసహ్యించుకుంటూ తినడం మానేస్తారు. దేవుడు (మన దగ్గరకు) తనప్రవక్త (స)ను పంపాడు, తనగ్రంథాన్ని అవతరింపజేశాడు, ధర్మసమ్మతమైన వాటి(హలాల్)ని ధర్మసమ్మతమైనవిగా నిర్ణయించాడు, నిషేధితాల (హరాం)ను నిషేధితాలుగా నిర్ణయించాడు. కొన్ని విషయాలలో ఆయన మౌనం వహించాడు. వాటిని స్వీకరించవచ్చు. (అయితే అవి ధర్మసమ్మతమైనవా కావా అని లోతుపాతులకు వెళ్ళి ఆరా తీయడానికి ప్రయత్నించకూడదు.”)- (అబూదావూద్: మిష్కాత్)

హజ్రత్ ఆయిషా (రజి) కథనం: ఒకసారి దైవప్రవక్త (స) నా దగ్గరకు వచ్చినప్పుడు నా ముందు ఒక స్త్రీ కూర్చొనిఉంది. ఆయన “ఎవరీమె?’ అనడిగారు. దానికి నేను “ఒకామె (నఫిల్) నమాజులు ఎక్కువగా చేస్తుందంటూ జనం చెప్పుకుంటున్నారే, ఆమే ఈస్త్రీ” అని అన్నాను. అది విని దైవప్రవక్త (స) “ఇక ఆపు (ఈమె పొగడ్తలు)! మీ శక్తి మేరకే పనులు చేయండి. దైవసాక్షి! దేవుడు విసుగు చెందడు. మీరే విసుగెత్తి పోతారు. (అతిగా ఆరాధనలు చేయటం వల్ల మీరు విసుగు చెందవచ్చేమోగాని దానికి పుణ్యం ప్రసాదించడంలో దేవుడు విసుగుచెందడు). మనిషి చేసే ధర్మకార్యాలలో శాశ్వతంగా పాటించే ఆరాధనే దేవునికి చాలా ప్రీతికరమైనది.” (బుఖారీ, ముస్లిం)

హజ్రత్ అబూహురైరా (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ప్రవచనం: “ధర్మం ఎంతో సులువైనది. ఎవరైనా ధర్మానుసరణలో అనవసరంగా కాఠిన్యం కోరితెచ్చుకుంటే ధర్మమే అతనిపై ఆధిక్యత సాధిస్తుంది (ఆ కాఠిన్యం భరించలేక ధర్మాన్ని ఆచరించడమే వదిలేస్తాడు). కనుక మీరు సన్మార్గంలో నడవండి. మధ్యే మార్గం అనుసరించండి. మీప్రభువు తరపున లభించే పుణ్యానికి సంబరపడండి. ఉదయం, సాయంత్రం రాత్రిపూట కొంత సేపు (ఆరాధన చేయటం) ద్వారా దైవసహాయాన్ని అర్థించండి.” (బుఖారీ)

హజ్రత్ అనస్ (రజి) కథనం: ఒకసారి దైవప్రవక్త (స) మస్జిద్‌లోకి ప్రవేశిస్తే అక్కడ రెండు నిట్టాడుల మధ్య ఒక పొడుగాటి త్రాడు కట్టిఉండటం కనిపించింది. అది చూసి ఆయన “ఈ త్రాడు ఏమిటీ?” అనడిగారు. అక్కడున్న వారు “ఈ త్రాడు జైనబ్ (రజి) గారిది. ఆమె (నిలబడి ఆరాధనచేస్తూ) అలసిపోయినప్పుడు అలసట దూరం కావడానికి దీని ఆధారంగా వ్రేలాడతారు” అని తెలియజేశారు. దైవప్రవక్త (స) ఈమాట విని “దాన్ని విప్పదీయండి. మీలోఎవరైనా సరే, ఉత్సాహంగా ఉన్నప్పుడే నమాజు చేయాలి. అలసట అనిపిస్తే పడుకోవాలి” అని ఆదేశించారు. (బుఖారీ, ముస్లిం)

హజ్రత్ ఆయిషా (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ఇలా అన్నారు: మీలో ఎవరికైనా నమాజు చేస్తున్నప్పుడు కునికిపాటు వస్తే అతను (నమాజు వదలి) నిద్ర దూరమయ్యే వరకూ పడుకోవాలి. కునికిపాట్లు పడుతూ నమాజు చేస్తున్నప్పుడు అతను మన్నింపు కోసం వేడుకోబోయి తన్ను తానే దూషించుకోవచ్చు. (బుఖారీ, ముస్లిం)

హజ్రత్ అబూఅబ్దుల్లా జాబిర్ బిన్ సమురా (రజి) కథనం: నేను దైవప్రవక్త (స) వెనుక నమాజు చేసేవాడిని. ఆయన నమాజు మధ్యస్థంగా ఉండేది. ఆయన ప్రసంగం కూడా మధ్యస్థంగా ఉండేది. (ముస్లిం)



హజ్రత్ అబూ జుహైఫా వహబ్ బిన్ అబ్దుల్లాహ్ (రజి) కథనం: దైవప్రవక్త (స) సల్మాన్ (రజి)కు, అబూదర్దా (రజి)కు మధ్య (హిజ్రత్ అనంతరం) సోదరత్వాన్ని ఏర్పరచారు. సల్మాన్ (రజి) (ఒకరోజు) అబూదర్దాను కలసుకోవడానికి ఆయన ఇంటికి వెళ్ళారు. అప్పుడు ఆయన (అబూదర్దాగారి భార్య) ఉమ్మెదర్దా (రజి) మురికి బట్టలు తొడుక్కొని ఉండటం గమనించారు. అది చూసి ఆయన కుశల ప్రశ్నలువేస్తూ “ఏమిటి మీరు ఇలాగైపోయారు?” అని అడిగారు. దానికి ఆమె “మీ సోదరుడు అబూదర్దాకు ఈ ప్రపంచంలో ఏమీ అక్కర్లేదు” అని (బాధపడుతూ) అన్నారు. (అంతలో) అబూదర్దా (రజి) వచ్చేశారు. సల్మాన్ (రజి) కోసం అన్నం వండించారు. (భోజనం వడ్డించిన తరువాత) ఆయనతో “మీరు తినండి, నేను ఉపవాసమున్నాను” అన్నారు. దానికి సల్మాన్ (రజి) “నువ్వు (నాతోపాటు) తిననంతవరకు నేనూ తినను” అన్నారు. అప్పుడు ఆయన (ఉపవాసం విరమించి ఆయనతో కలసి) భోజనం చేశారు.

రాత్రి అయిన తరువాత అబూదర్దా (రజి) నఫిల్ నమాజ్ చేయటానికి ఉపక్రమించారు. అప్పుడు సల్మాన్ (రజి) “(ముందు) పడుకో (తర్వాత లేచి నమాజు చేసుకోవచ్చు)” అన్నారు. దాని ప్రకారమే అబూదర్దా (రజి) నిద్రపోయారు. కొంతసేపటికి నిద్రనుండి మేల్కొని తిరిగి నఫిల్ నమాజ్ ప్రారంభించారు. సల్మాన్ (రజి) (అప్పుడు కూడా ఆయన్ని వారిస్తూ) “ఇంకాస్సేపు నిద్రపో” అన్నారు. ఆ తర్వాత రాత్రి చివరిభాగం రాగానే సల్మాన్ (రజి) “ఇప్పుడు లేచి నమాజు చెయ్యి” అన్నారు అబూదర్దా (రజి)తో. ఇద్దరూ కలసి నమాజు చేశారు. (నమాజు ముగిశాక) అబూదర్దా (రజి)తో సల్మాన్ (రజి) ఇలా అన్నారు: “నీపై నీ ప్రభువు హక్కుంది నిజమే. కాని నీపై నీ ప్రాణానిక్కూడా హక్కుంది. నీ భార్యాపిల్లలక్కూడా హక్కుంది. కనుక ప్రతి హక్కుదారుని హక్కు నెరవేర్చు.” తర్వాత సల్మాన్ (రజి) దైవప్రవక్త (స) దగ్గరికెళ్ళి జరిగినదంతా చెప్పారు. దైవప్రవక్త (స) విషయం విని “సల్మాన్ నిజం పలికాడు” అన్నారు. (బుఖారీ)

దైవప్రవక్త (స) ఇలా ఉపదేశించారు: “మీరు మధ్యేమార్గాన్ని అనుసరించండి. (వ్యవహారాల్లో నిలకడగా) ఖచ్చితంగా ఉండండి. మీలో ఏ ఒక్కరూ (కేవలం) తమ ఆచరణ ఆధారంగా ముక్తి పొందలేరని తెలుసుకోండి!” అనుచరులు ఈమాట విని “దైవప్రవక్తా! మీరు కూడానా?” అని అడిగారు. దానికి దైవప్రవక్త (స) “అవును, నేను కూడా (ఆచరణ ఆధారంగా ముక్తి పొందలేను) దేవుడు నన్ను తన కరుణాకటాక్షాలతో అనుగ్రహిస్తే తప్ప” అన్నారు ఆయన. (ముస్లిం)

దైవప్రవక్త (స) ప్రవచనం: “సిరిసంపదలు ఉన్నప్పుడు మధ్యేమార్గావలంబన ఎంత మంచి విషయం! దారిద్ర్యావస్థలో మధ్యేమార్గావలంబన ఎంత మంచి విషయం!! ఆరాధనలో మధ్యేమార్గావలంబన ఎంత మంచి విషయం!!!” (కన్జుల్ అమ్మాల్)

దైవప్రవక్త (స) ప్రవచనం: “తననుతాను కించపరచుకోవడం విశ్వాసికి ఏమాత్రం శోభించదు.”ప్రజలు ఈమాట విని “విశ్వాసి తననుతాను ఎలా కించపరచుకుంటాడు?” అనడిగారు. దానికి దైవప్రవక్త (స) ఇలా చెప్పారు- “శక్తికి మించిన (భారంతో) పరీక్షకు గురిచేసుకోవడం ద్వారా (అతను తననుతాను కించపరచుకుంటాడు).” (తిర్మిజి)

ఒకతను వచ్చి, “దైవప్రవక్తా! నేను (ప్రాపంచిక సుఖాలు వదలి) దూరంగా ఎక్కడికైనా వెళ్ళిపోవాలనుకుంటున్నాను, నాకు అనుమతి ప్రసాదించండి” అని అడిగాడు. దానికి దైవప్రవక్త (స) అనుమతి ఇవ్వటానికి నిరాకరిస్తూ, “నా అనుచర సముదాయం ప్రజలు అలా (ప్రాపంచిక సుఖాలకు) దూరంగా వెళ్ళదలచుకుంటే దైవమార్గంలో యుద్ధం చేయడానికి వెళ్ళాలి” అని అన్నారు. (అబూదావూద్)

హజ్రత్ ఖైస్ బిన్ అబూహాజిమ్ (రజి) కథనం: అబూబకర్ (రజి) జైనబ్ అనబడే అహ్‌మస్‌తెగ స్త్రీ దగ్గరికి వెళ్ళిచూస్తే ఆమె ఎవరితోనూ మాట్లాడటం లేదు. అప్పుడాయన “ఈమె మాట్లాడదు ఎందుకు?’ అని జనాన్ని అడిగితే, ‘తను (ఎవరితోనూ) మాట్లాడనని మొక్కుకుంది” అని చెప్పారు జనం. అది విని ఆయన ఆ స్త్రీని ఉద్దేశించి “మాట్లాడు. మౌనవ్రతం ధర్మసమ్మతం కాదు. ఇది అజ్ఞానకాలపు ఆచారం” అని చెప్పారు. ఆమె అప్పట్నుంచి మాట్లాడటం మొదలెట్టింది. (బుఖారీ)

హజ్రత్ అబూబర్జా (రజి) కథనం: “దైవప్రవక్త (స) ఇషా నమాజ్‌కు ముందు పడుకోవటాన్ని ఇషా తర్వాత కబుర్లు చెప్పుకోవటాన్ని అసహ్యించుకునేవారు.” (బుఖారీ)

హజ్రత్ ఆయిషా (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ఇలా అన్నారు: “ధర్మకార్యాలన్నిటిలో క్రమం తప్పకుండా చేసే పనే దైవానికి అత్యంత ప్రీతికరమైనది.” (బుఖారి)

హజ్రత్ అబ్దుల్లా బిన్ అమ్ర్ బిన్ ఆస్ (రజి) కథనం: “అబ్దుల్లా! నువ్వు ఫలానా వాడిలా అయిపోకు! అతను (రోజూ) రాత్రిపూట (నఫిల్ నమాజులు చేస్తుండేవాడు. కాని తర్వాత (విసుగుచెంది) రాత్రి నమాజులు చేయటం మానేశాడు.” (బుఖారీ, ముస్లిం)

హజ్రత్ అబూరిబ్‌యీ హంజలా (రజి) కథనం: ఒకసారి అబూబకర్ (రజి) నన్ను కలుసుకొని “బాగున్నావా హంజలా?” అనడిగారు. దానికి నేను “హంజలా కపటి అయిపోయాడు”అన్నాను. అదివిని ఆయన ఆశ్చర్యంతో “సుబ్‌హానల్లాహ్! ఏమిటి నువ్వనేది?” అన్నారు. దానికి నేను “మనం దైవప్రవక్త (స) సన్నిధిలో ఉన్నప్పుడు ఆయన స్వర్గనరకాలను గురించి చెబుతుంటే నిజంగా మనం వాటిని మన కళ్ళతో చూస్తున్నట్లే అనిపిస్తుంది. తీరా అక్కడ్నుంచి బయటికి రాగానే మనం మన భార్యాపిల్లల్లో, ప్రాపంచిక కార్యాకలాపాలలో మునిగిపోయి చాలా విషయాలు మరచిపోతుంటాం. (అంచేత నేను కపటినైపోయా ననిపిస్తోంది)” అంటూ నాబాధ వ్యక్తం చేశాను. అబూబకర్ ఈమాట విని “దైవసాక్షి! నాక్కూడా అలాగే అనిపిస్తోంది” అని తన మనోగతాన్ని వెలిబుచ్చారు.

ఆ తరువాత అబూబకర్ (రజి), నేను ఇద్దరం కలిసి దైవప్రవక్త (స) సన్నిధికి వెళ్ళి “దైవప్రవక్తా! హంజలా కపటి అయిపోయాడు” అన్నాను నేను. అందుకు ఆయన “అదెలా?” అని ప్రశ్నించారు. “దైవప్రవక్తా! మేము మీ దగ్గరున్నప్పుడు మీరు మా ముందు స్వర్గనరకాల గురించి చెబుతుంటే నిజంగా మేము వాటిని మా కళ్ళతో చూస్తున్నట్లనిపిస్తుంది. తీరా మీ దగ్గర్నుంచి బయటికి రాగానే భార్యాపిల్లల్లో, పనిపాటల్లో మునిగిపోయి (మీరు చెప్పిన) అనేక విషయాలు మరచిపోతుంటాము” అని చెప్పాను నేను. నేను చెప్పినదంతా విని దైవప్రవక్త (స) ఇలా ఉపదేశించారు: “నాప్రాణం ఎవరి



చేతిలో ఉందో ఆ శక్తిస్వరూపుని సాక్షి! మీరు నా ముందు ఉండే స్థితిలోనే ఎల్లప్పుడూ ఉంటే, (నిత్యం) దైవధ్యానంలో నిమగ్నులైవుండే దైవదూతలు మీ పడకలపై, మీరు (నడిచే) దారుల్లో కూడా మీతో కరచాలనం చేస్తుంటారు. కాని హంజలా! కాలమంతా ఒకేవిధంగా ఉండదు.” ఆయన ఇదే మాట మూడుసార్లు అన్నారు. (ముస్లిం)

# II. ఆరాధనల రూపురేఖలు

“నేను మానవుల్ని, జిన్నుల్ని నన్ను ఆరాధించడానికి తప్ప మరే లక్ష్యంతో పుట్టించ లేదు. నేను వారినుండి ఉపాధి కోరడంలేదు. నాకు తిండి పెట్టమని అడగడం లేదు. దేవుడే అందరి ఉపాధిప్రదాత.” (ఖుర్‌ఆన్–51:56,57)

పై సూక్తిలో రెండర్థాలు ఇమిడి ఉన్నాయి. ఒకటి, దేవుడ్ని తప్ప మరెవరినీ ఆరాధించకూడదు. రెండు, దైవారాధన తప్ప మరేపనీ చేయకూడదు. మొదటి విషయం అందరికీ అర్థమవుతోంది. కాని రెండో విషయమే నేడు అనేకమంది ముస్లింలకు సైతం అర్థంకావడం లేదు. కారణం వారి మస్తిష్కాలలో ‘ఆరాధన’ పదానికి పరిమిత భావం ఉండిపోవడమే.

ఇస్లాంలో ఆరాధన అనే పదానికి చాలా విస్తృత భావం ఉంది. నమాజ్, ఉపవాసం, కాబాయాత్ర, దైవధ్యానం లాంటి పూజాపురస్కారాలే కాదు; ఉపాధి సముపార్జన, కుటుంబ జీవనం, తోటిమానవులతో సంబంధాలు, వ్యాపారం, ఆర్థిక లావాదేవీలు, దేశపాలనా వ్యవహారాలు, యుద్ధం, స్నేహ ఒడంబడికలు, అంతర్జాతీయ సంబంధాలు సైతం ఆరాధన క్రిందికే వస్తాయి. ఒక్కమాటలో చెప్పాలంటే మానవ జీవితంలోని సకల రంగాలకు చెందిన సమస్త వ్యవహారాలు దైవారాధనల క్రిందికే వస్తాయి. కాకపోతే ఇవన్నీ దేవుడు, ఆయన ప్రవక్త (సల్లం) అందజేసిన ఆదేశాల ప్రకారం నడుచుకున్నప్పుడే దైవారాధనలుగా పరిగణించబడతాయి.

ఒకే దేవుడ్ని ఆరాధిస్తున్నామని చెప్పుకునేవారు ఫరజ్ నమాజులతో పాటు ఎన్ని నఫిల్ నమాజులు చేసినా, ఫరజ్ రోజాలతో పాటు ఎన్ని నఫిల్‌రోజాలు పాటిస్తున్నా. ఎంత ధ్యానం చేస్తున్నా, దైనందిన వ్యవహారాల్లో దైవేతరశక్తులకో లేక మనోవాంఛలకో దాస్యం చేస్తుంటే ఆ మేరకు వారు దైవారాధన పరిధిని అతిక్రమిస్తున్నట్లే. అంటే ఆయా వ్యవహారాల్లో వారు క్రియాత్మకంగా దేవునికి సాటి కల్పిస్తున్నారన్న మాట. ఈ వైఖరి దైవాగ్రహానికి గొనిపోతుంది.

కొందరు ఈ వైఖరి కప్పిపుచ్చుకోవడానికి లేక అజ్ఞానం వల్ల “ఇవి మత విషయాలు, అవి ప్రపంచవ్యవహారాల”ని వాదిస్తారు. కాని ప్రపంచవ్యవహారాలు కూడా దేవుని ఆజ్ఞలు, దైవప్రవక్త హితవుల వెలుగులోనే ఉండాలన్న యదార్థాన్ని వీరు గ్రహించకపోవడం విచారకరం.

## 13. నమాజ్ ప్రాముఖ్యం

దైవారాధనల్లో నమాజ్ ఎంతో ముఖ్యమైన ఆరాధన. ఇస్లాం సౌధానికున్న అయిదు మూల స్థంభాలలో ‘సద్వచనం’ (కలిమా తయ్యిబా) సెంట్రల్ పిల్లర్ అయితే, మిగిలిన నాలుగు దిశల నాలుగు మూలస్థంబాలలో ముఖ్యమైన మూలస్థంభం నమాజే. అలాంటి నమాజ్‌ని వదలిపెడితే ఇక ఆ సౌధం ఎంతో కాలం మనజాలదు. నిజదైవాన్ని గుర్తించి, ఇస్లాం ధర్మాన్ని విశ్వసించిన తరువాత దాని క్రియాత్మక రూపంలోని మొట్టమొదటి అంశం నమాజే. దేవుడు తన ప్రవక్తలకు ఈ విషయాన్నే బోధించాడు. ఆయన మూసా ప్రవక్త (అలైహి)ని సంబోధిస్తూ ఇలా ఆదేశించాడు:

"నేనే దేవుణ్ని, నేను తప్ప మరో ఆరాధ్యుడు లేడు. కనుక (మానవుడా!) నీవు నన్నే ఆరాధించు. నా జ్ఞాపకార్థం నమాజ్ (వ్యవస్థ)ను స్థాపించు." (ఖుర్ఆన్-20:14)

దైవప్రవక్త (స) కూడా అనేక విధాలుగా నమాజ్ ప్రాముఖ్యాన్ని వివరించారు.

ఆయన (స) ఇలా తెలియజేశారు: "మనిషికి, అవిశ్వాసానికి మధ్య విచక్షణారేఖ నమాజ్‌ను వదలిపెట్టడమే." (ముస్లిం); "విశ్వాసికి, అవిశ్వాసికి మధ్య వారిద్దరిని వేరుచేసే హద్దు నమాజే." (ముస్లిం)

హజ్రత్ బురైదా (రజి) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (స) ఈవిధంగా తెలియజేశారు: "మనకు, వారికి మధ్య గీటురాయి నమాజే. దాన్ని వదలిపెట్టినవాడు దైవాన్ని తిరస్కరించినట్లవుతాడు." (తిర్మిజీ)

హజ్రత్ షఖీఖ్ బిన్ అబ్దుల్లా (రహ్మ) కథనం: "ముహమ్మద్ (స) అనుచరులు ఆచరణల్లో దేన్ని విడిచిపెట్టినా 'కుఫ్ర్'గా భావించేవారుకాదు, నమాజ్‌ని తప్ప." (తిర్మిజీ)

"నమాజ్ చేయనివాడికి (ప్రళయదినాన) నమాజ్ వెలుగు నివ్వడంగాని, ప్రమాణంగా నిలవడంగాని, మోక్షప్రదాయిని కావడంగాని జరగదు." (అహ్మద్, దారిమి)

ధర్మానికి ఆధారం విశ్వాసం అయితే, విశ్వాసానికి దర్పణం ఆచరణ అవుతుంది. ఆచరణ ద్వారానే విశ్వాసం బహిర్గతమవుతుంది. ఇస్లాం సౌధానికుండే అయిదు మూలస్తంభాలలో విశ్వాసం తర్వాత నమాజ్ అగ్రస్థానం వహిస్తుంది. అలాంటి నమాజ్‌నే పాటించకపోతే దేవుని దగ్గర ముస్లింల విశ్వాసానికి విలువ ఏముంటుంది?

హజ్రత్ అనస్ (రజి) కథనం: "మేరాజ్ (సప్తాకాశాల పర్యటన) సంఘటన జరిగిన రాత్రి దైవప్రవక్త (స)కు (రోజుకు) యాభై నమాజ్‌లు చేయడం విధిగా చేయబడింది. ఆ తర్వాత ఆ సంఖ్యను అయిదుకు తగ్గించబడింది. అప్పుడు (అదృశ్య)వాణి ఇలా వినిపించింది- "నామాట మారదు. నీ కోసం, (నీ అనుచర సముదాయం కోసం) ఈ అయిదు నమాజుల్లో యాభై నమాజుల పుణ్యం ఉంది." (అహ్మద్, తిర్మిజి)

హజ్రత్ తల్హా (రజి) కథనం: ఓరోజు శిరోజాలు చిందరవందరగా పడివున్న ఒక పల్లెవాసి వచ్చి "దైవప్రవక్తా! దేవుడు ఎన్ని నమాజ్‌లు విధిగా చేశాడో చెప్పండి" అనడిగాడు. దానికి ఆయన ఇలా చెప్పారు- "ఐదు నమాజ్‌లు విధిగా చేశాడు. కాకపోతే నీ ఇష్టప్రకారం ఇంకా (నఫిల్ నమాజ్‌లు) చేయాలనుకుంటే చేయవచ్చు." (బుఖారి)

దైవప్రవక్త (స) మాట: "ఫజ్ర్ నమాజ్ చేసేవాడు దేవుని రక్షణలో ఉంటాడు. కనుక మనిషీ! తానిచ్చిన రక్షణ గురించి దేవుడు నిన్ను ప్రశ్నించకుండా జాగ్రత్తపడు!" (ముస్లిం)

ఖుర్ఆన్‌లోని మొదటి అధ్యాయంలో విశ్వాసులు "దేవా! మేము నిన్నే ఆరాధిస్తాము, నీ సహాయమే అర్థిస్తాము" అని వేడుకోవాలని ఉంది. ఈ వేడుకోలుకు చక్కని క్రియాత్మక రూపమే నమాజ్. అదే అధ్యాయంలో జీవితసాఫల్యం కొరకు తమకు రుజుమార్గం చూపమని విశ్వాసులు అర్థిస్తే, దానికి సమాధానంగా మొత్తం ఖుర్ఆన్ ఆజ్ఞల్ని వారిముందు పెట్టడం జరిగింది. ఈ ఆజ్ఞలలో "అతీంద్రియాల పట్ల విశ్వాసం" తర్వాత అతి ముఖ్యమైన మొదటి ఆజ్ఞ నమాజే అని ఆ తర్వాయి అధ్యాయంలో తెలియజేయబడింది.



"అలిఫ్-లామ్-మీమ్. ఇది ఎలాంటి సందేహానికి ఆస్కారంలేని (దైవదత్త) గ్రంథం. ఈ గ్రంథం భయభక్తులు కలవారికి రుజుమార్గం చూపుతుంది. వారు అగోచరాలు, అతీంద్రియాలను విశ్వసిస్తారు; నమాజ్‌ను స్థాపిస్తారు...." (ఖుర్ఆన్-2:1-5)

## విశ్వాసానికి గీటురాయి

నమాజ్ విశ్వాసానికి గీటురాయి వంటిది. ఇస్లాం పట్ల మనవిశ్వాసం ఏ స్థాయిలో ఉంటుందో నమాజ్‌లో దేవుని పట్ల మన సంబంధం కూడా అదే స్థాయిలో ఉంటుంది. ముస్లింలు రోజుకు అయిదు సార్లు విధిగా నమాజ్ చేయవలసి ఉంటుంది. దీన్ని నిరాకరించినవాడు అవిశ్వాసి (కాఫిర్) అవుతాడు. నిరాకరించకుండా దాన్ని పాటించనివాడు పరమపాపి అవుతాడు. కొందరు ముస్లింలు "అమ్మో, రోజుకు అయిదు సార్లే! మావల్ల కాదు బాబూ!" అంటారు. బద్ధకస్తులకు, ప్రాపంచిక ప్రయోజనాలే ధ్యేయంగా పెట్టుకున్నవారికి రోజుకు అయిదు సార్లేమిటీ, ఒక్కసారి చేయడం కూడా కష్టమే. ఖుర్ఆన్ ఇలాంటి ముస్లింలను హెచ్చరిస్తూ ఈవిధంగా ఉపదేశిస్తోంది:

"నమాజ్ కాస్త కష్టమైన పనే. సందేహంలేదు. కాని ఒకరోజు తమ ప్రభువును కలుసుకోవలసి ఉందని, ఆయన సన్నిధికే మరలిపోవలసి ఉందని భావించే దైవభీతిపరులకు మాత్రం నమాజ్ చేయడం కష్టమేమీ కాదు." (ఖుర్ఆన్-2:45,46)

దైవప్రవక్త (స) ప్రవచనం: "మనిషి రాత్రి పడుకున్న తర్వాత షైతాన్ అతని ముచ్చలి గుంటపై మూడు ముళ్ళు వేస్తాడు. ప్రతి ముడిపై 'రాత్రి ఇంకా చాలాఉంది, హాయిగా పడుకో' అంటూ మంత్రించి ఊదుతాడు. అప్పుడు మనిషి మేల్కొని దేవుణ్ని స్మరించగానే ఒక ముడి ఊడిపోతుంది. తర్వాత ఉజూ చేస్తే రెండవ ముడి ఊడిపోతుంది. దాంతో అతను తెల్లవారుజామున ఎంతో ఉత్సాహంతో లేస్తాడు. అలా చేయకపోతే వళ్ళు బరువయి బద్ధకంగా లేస్తాడు." (బుఖారి)

దైవప్రవక్త (స) ఓసారి నమాజ్ ప్రాముఖ్యం గురించి చెబుతూ "నమాజ్ నా కంటిచలువ" అన్నారు. ఔను, నమాజే మనకు నిత్య శాంతి చేకూర్చే నిజమైన సాధనం. నీతికి నెలవు కూడా నమాజే. క్రమశిక్షణకు మారుపేరు నమాజ్. నమాజే స్వర్గధామానికి సరైన తాళపుచెవి. పాపాలకు అడ్డుకట్ట కూడా నమాజే. ఇలాంటి నమాజే మానేస్తే ఇక ముస్లిం దగ్గర ఇస్లాం గురించి తనదంటూ చెప్పుకోవడానికి ఏముంటుంది?

దైవప్రవక్త (స) ప్రవచనం: "ఎవరు క్రమం తప్పకుండా సక్రమంగా నమాజ్ చేస్తాడో ప్రళయదినాన ఆ నమాజ్ అతని కోసం జ్యోతిగా, (విశ్వాసానికి) నిదర్శనంగా, ముక్తి సాధనంగా మారుతుంది. మరెవరు నిబద్ధతతో, ఏకాగ్రతతో నమాజ్ చేయడో అలాంటి నమాజ్ అతని కోసం జ్యోతిగా, (విశ్వాసానికి) నిదర్శనంగా మారదు. దైవశిక్ష నుండి కాపాడే సాధనంగా కూడా మారదు. అతను ప్రళయదినాన ఫిరౌన్, ఖారూన్, హామాన్, ఉబయి బిన్ ఖల్ఫ్ (లాంటి దుర్మార్గు)లతో కలసివుంటాడు." (అహ్మద్, బైహఖి)

దైవప్రవక్త (స) ప్రవచనం: "ప్రళయదినాన దాసుని కర్మలలో మొట్టమొదట అతని నమాజ్ గురించే విచారణ జరుగుతుంది. నమాజ్ గురించిన లెక్క సరిగాఉందని తేలితే అతను సఫలమవుతాడు. నమాజ్ సరిగాలేదని తేలితే మాత్రం చాలా నష్టపోతాడు. అతని

ఫరజ్ (విధిగా చేయవలసిన) నమాజులలో ఏదైనా వెలితి ఉంటే 'నాయీ దాసుని చిట్టాలో నఫిల్ నమాజులు ఉన్నాయేమో చూడండి' అంటాడు దేవుడు. ఉంటే ఫరజ్ నమాజులలోని వెలితిని ఈ నఫిల్ నమాజులు భర్తీచేస్తాయి. నమాజ్ విషయం తరువాత ఇతర కర్మల విషయంలో కూడా ఇదేవిధంగా లెక్క తీసుకోవడం జరుగుతుంది.'' (బైహఖీ)

నమాజ్ మనిషికి దైవదాస్యపు శిక్షణ ఇస్తుంది. అయితే నమాజ్‌లో మనం పఠించే ఖుర్ఆన్ సూక్తుల భావం తెలిసినప్పుడే అవి మన మనోమస్తిష్కాలపై మంచి ప్రభావం వేస్తాయి.

## మన ప్రార్థనే మన పాపవినాశిని

మనిషి ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉండాలనుకుంటాడు. ఇది మానవుని సహజలక్షణం. అందుకే మనం శరీరం మీద మురికి మలినాలు పేరుకోగానే స్నానం చేసి ఉతికిన బట్టలు తొడుక్కుంటాము. ఇది శరీరశుద్ధి కోసం చేయవలసిన పని. అదేవిధంగా ఆత్మశుద్ధి కోసం కూడా మన సృష్టికర్త మనకు నమాజ్ నిర్ణయించాడు.

హజ్రత్ అబూహురైరా (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ఇలాఅన్నారు: ''ఒకతని ఇంటి ముందు ఒక నది ప్రవహిస్తూ ఉండి, అతనా నదిలో రోజూ ఐదు సార్లు స్నానం చేస్తుంటే, ఇక అతని శరీరంపై మలినం ఉంటుందా? చెప్పండి.'' దానికి అనుచరులు ''ఎలాంటి మలినం ఉండద''న్నారు ముక్తకంఠంతో. అప్పుడు దైవప్రవక్త (స) ''రోజుకు ఐదుసార్లు నమాజ్ చేసే మనిషి పరిస్థితి కూడా అలాగే ఉంటుంది. ఐదు వేళలా నమాజ్ చేయడం వల్ల దాసుని పాపాలను దేవుడు క్షమిస్తాడు'' అని అన్నారు. (బుఖారి)

హజ్రత్ అబూజర్ కథనం: దైవప్రవక్త (స) శీతాకాలం ఆకురాలే రోజుల్లో ఓసారి బయటికొచ్చి ఓ చెట్టుకున్న రెండు కొమ్మలు పట్టుకొని ఊపారు. అప్పుడు చెట్టు నుండి గలగల ఆకులు రాలసాగాయి. ఆ తర్వాత ఆయన నాతో ఇలా అన్నారు: ''అబూజర్! ఏ ముస్లిం అయినా చిత్తశుద్ధి, ఏకాగ్రతలతో నమాజ్ చేస్తుంటే అతని పాపాలు కూడా ఈ చెట్టు నుండి ఆకులు ఎలా రాలుతున్నాయో అలా రాలిపడతాయి.'' (ముస్నద్ అహ్మద్)

దైవప్రవక్త (స) ప్రవచనం: ''ఘోరపాపాలకు పాల్పడకుండా ఉంటే (మనిషి చేసే) ఐదువేళల నమాజులు, ఒకజుమా నుండి మరొకజుమా వరకుగల కాలంలో, వాటిమధ్యలో (అతని వల్ల) జరిగే (చిన్నచిన్న) పాపాలకు పరిహారాలు అవుతాయి.'' (ముస్లిం)

హజ్రత్ అబ్దుల్లా బిన్ మస్‌వూద్ (రజి) ఈవిధంగా తెలియజేస్తున్నారు: ఒకతను ఓ (పర) స్త్రీని ముద్దు పెట్టుకున్నాడు. ఆ తరువాత అతను (పశ్చాత్తాపం చెంది) దైవప్రవక్త (స) సన్నిధికి వచ్చి తాను చేసిన తప్పు గురించి చెప్పుకున్నాడు. అప్పుడు ''వినండి. పగటివేళ ఆద్యంతాలలో (ఉదయం, సాయంత్రం), రాత్రివేళ కొంచెం సమయం గడచిన తరువాత నమాజ్ చేస్తూ ఉండండి. నిస్సందేహంగా సత్కార్యాలు దుష్కార్యాలను నిర్మూలిస్తాయి'' (11:114) అనే ఖుర్ఆన్ సూక్తి అవతరించింది. ఈ సూక్తి అవతరించిన తరువాత ఆ వ్యక్తి ''దైవప్రవక్తా! ఈ ఆదేశం నాకొక్కడి కోసమేనా?'' అని అడిగాడు. దానికి దైవప్రవక్త (స) ''(కాదు,) ఇది నా అనుచర సముదాయంలోని వారందరికీ వర్తిస్తుంది'' అని అన్నారు. (బుఖారి)



హజ్రత్ అనస్ బిన్ మాలిక్ కథనం: ఒకతను దైవప్రవక్త (స) సన్నిధికి వచ్చి ''దైవ ప్రవక్తా! నేను శిక్షార్హమైన నేరం చేశాను. నాకు శిక్ష విధించండి'' అన్నాడు. దానికి దైవప్రవక్త (స) అతడ్ని ఎలాంటి వివరాలు అడగలేదు. కాస్సేపటికి నమాజ్ వేళ అయింది. దైవప్రవక్త (స)తో పాటు అతను కూడా నమాజ్ చేశాడు. నమాజ్ చేశాక ''దైవప్రవక్తా! నేను శిక్షార్హమైన నేరం చేశాను, నాకు శిక్ష విధించండి'' అని మళ్ళీ విన్నవించుకున్నాడు. అప్పుడు దైవప్రవక్త (స) ''నీవు మాతో పాటు నమాజ్ చేయలేదా?'' అని అడిగారు. దానికా వ్యక్తి చేశానన్నాడు. ''అయితే దేవుడు నీ పాపం క్షమించాడు'' అని అన్నారు దైవప్రవక్త (స). (బుఖారి)

దైవప్రవక్త (స) ప్రవచనం: ''మీ దగ్గరకు రాత్రి దైవదూతలు, పగటి దైవదూతలు ఒకరి వెనుక ఒకరు వస్తారు. ఈ రెండు బృందాలు ఫజర్, అసర్ నమాజులలో మాత్రం కలుస్తారు. రాత్రంతా మీతోపాటు గడిపిన దైవదూతలు తిరిగి ఆకాశం పైకి వెళ్ళినప్పుడు మీ ప్రభువు వారినుద్దేశించి ''మీరు నాదాసుల్ని ఏ స్థితిలో వదలివచ్చారు?'' అని అడుగుతాడు. దానికి దైవదూతలు ''మేము వారి దగ్గర్నుంచి బయలుదేరేటప్పుడు వారు నమాజ్ చేస్తూ ఉండటం చూశాము. అంతకు ముందు మేము వారి దగ్గరకు చేరుకున్నప్పుడు కూడా వారిని నమాజ్ స్థితిలోనే చూశాము'' అని సమాధానమిస్తారు. (బుఖారి)

## చెడుల నుండి నిరోధించని నమాజ్...?

"నిస్సందేహంగా నమాజ్ (మనిషిని) చెడులు, అశ్లీల చేష్టల జోలికి పోకుండా నిరోధిస్తుంది." (ఖుర్ఆన్-29:45)

ఒక మనిషి నమాజు చేసేవాడైనప్పటికీ అశ్లీలచేష్టలకు, ఇతర చెడ్డ పనులకు పాల్పడుతున్నాడంటే అతను ఖుర్ఆన్‌లోని దైవాజ్ఞలను నిర్లక్ష్యం చేస్తున్నాడన్నమాట. లేదా దైవధర్మం పట్ల సరైన అవగాహన లేకుండా దేవుని దయాగుణం పట్ల నిరాధారమైన ఆశలు కల్పించుకున్నాడన్న మాట. ఈసూక్తి విషయంలో దైవప్రవక్త (స) ఇలా చెప్పారు:

''మనిషి చేసే నమాజ్ అతడ్ని చెడ్డపనుల నుండి, అశ్లీలచేష్టల నుండి నిరోధించకపోతే అతని నమాజ్ నమాజే కాదు...'' (ఇబ్నె ముస్లిం)

''ఒకవ్యక్తి చేసే నమాజ్ అతడ్ని అశ్లీలచేష్టల నుండి, చెడ్డపనుల నుండి, నిరోధించకపోతే అతని నమాజ్ అతడ్ని దేవునికి మరింత దూరం చేస్తుంది.'' (తబ్రాని)

ఇమామ్ జాఫర్ సాదిఖ్ వ్యాఖ్య: ''ఎవరైనా తన నమాజ్ స్వీకరించబడిందా లేదా అని తెలుసుకోదలిస్తే, అతను తన నమాజ్ తనను ఏమేరకు చెడ్డపనులు, అశ్లీలచేష్టల జోలికిపోనీకుండా నిరోధించిందో చూసుకోవాలి. నమాజ్ వల్ల అతను చెడ్డపనుల జోలికి పోకుండా నీతిగా ఉన్నాడంటే అతని నమాజ్ స్వీకరించబడినట్లే.'' (రూహుల్ మాని)

"వారు (నరకంలో) పాపాత్ముల్ని చూసి 'మిమ్మల్ని ఏ విషయం నరకంలో పడవేసింది?' అని అడుగుతారు. దానికి పాపులు ఇలా చెబుతారు: 'మేము నమాజ్ చేసేవారిలో చేరలేదు. పేదలకు అన్నదానం చేసేవారం కాము. సత్యతిరస్కారులతో కలసి మేమూ (సత్యాన్ని) తిరస్కరిస్తుండే వాళ్ళము. తీర్పుదినాన్ని అసత్యవిషయమని ఖండిస్తుండేవాళ్ళం. ఈ స్థితిలోనే చివరికి అనివార్యవిషయం (మృత్యువు) మా ముందుకు వచ్చింది." (ఖుర్ఆన్:74:40-47)

ఖలీఫా హజ్రత్ ఉమర్ (రజి) ఓసారి తన క్రింది అధికారులకు ఒక సర్క్యులర్ జారీచేస్తూ, అందులో ఇలా తాకీదు చేశారు: "అసలు నా దృష్టిలో మీ సమస్యలన్నిటిలోకెల్లా అతి ముఖ్యమయిన సమస్య నమాజే. నమాజ్‌ని కాపాడే మనిషి యావత్తు ధర్మాన్నే కాపాడిన వాడవుతాడు. దీనికి భిన్నంగా నమాజ్‌ని వ్యర్థపరచినవాడు మిగతా ధర్మాన్ని (ఇతర దైవాజ్ఞలను) అంతకంటే ఎక్కువ వ్యర్థపరచిన వాడవుతాడు." (మిష్కాత్)

దైవాజ్ఞలలో నమాజ్‌కు ఉన్నంత ప్రాముఖ్యం మరే ఆజ్ఞకూ లేదు. నమాజ్ ముస్లిం గుర్తింపు. హజ్రత్ ఈసా (అలై) మాటల్లో నమాజ్ మానసిక మందు. నమాజ్ హృదయ కవాటానికి తాళం వంటిది. నమాజ్ మన విశ్వాసాన్ని కాపాడే ఆయుధం; మనోవాంఛల్ని అదుపులోఉంచే కళ్ళెం. నమాజే ప్రళయదినాన మనల్ని రక్షిస్తుంది. దేవుడు మన పాపాలను నమాజ్ ద్వారా తుడిచిపెడతాడు. హజ్రత్ ఈసా (అలైహి) ఓసారి తన అనుచరులకు ఒక దృష్టాంతంతో నమాజ్ ప్రాముఖ్యం గురించి బోధిస్తూ "మూగవాడికి పుట్టుగ్రుడ్డి ముందు ఎలా తన ఉనికిని నిరూపించుకునే శక్తి ఉండదో అలాగే నమాజ్ పాటించని వ్యక్తికి సత్కార్యాలు చేసేవాడిగా తయారయ్యే శక్తి ఉండదు" అనిఅన్నారు.

## సామూహిక నమాజ్ ప్రాముఖ్యం

ఇస్లాం సామూహికత్వానికి ఎంతో ప్రాధాన్యం ఇచ్చింది. కనుక ఫర్జ్ నమాజులను తోటి భక్తులతో కలసి సామూహికంగా చేయాలి. బలమైన కారణం ఉంటే తప్ప మస్జిద్‌కు పోవడం మానెయ్యకూడదు. ఖుర్‌ఆన్ సామూహిక నమాజ్ గురించి ఇలా ఆదేశించింది:

"నా ముందు మోకరిల్లే (రుకూ చేసే)వారితో కలసి మీరూ మోకరిల్లండి." (2:43)

హజ్రత్ అబూహురైరా (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ఇలా అన్నారు: "వ్యక్తిగత నమాజ్ కంటే సంఘంతో కలసి చేసే సామూహిక నమాజ్ ఇరవై అయిదు రెట్లు శ్రేష్ఠమైనది. (ఇబ్నెఉమర్ ఉల్లేఖనం ప్రకారం ఇరవైఏడు రెట్లు శ్రేష్ఠమైనది.) ఫజర్ నమాజ్ (సమయం)లో రాత్రి దైవదూతలు, పగటి దైవదూతలు పరస్పరం సమావేశమవుతారు." (బుఖారి)

హజ్రత్ అబూహురైరా (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ఇలా అన్నారు: "నా ప్రాణం ఎవరి అధీనంలో ఉందో ఆ శక్తిస్వరూపుని సాక్షి! కట్టెలు పోగుచేసి పెట్టమని, అజాన్ ఇవ్వమని ఆజ్ఞాపించి, నమాజ్ చేయించడానికి నా స్థానంలో మరొకర్ని నిలబెట్టి (సామూహిక నమాజులో పాల్గొనని)వారి దగ్గరకు వెళ్ళి వారి ఇండ్లను తగల బెడదామని నేను (ఎన్నోసార్లు) అనుకున్నాను. నా ప్రాణం ఎవరి అధీనంలో ఉందో ఆ శక్తిస్వరూపుని సాక్షి! ఇషా నమాజ్ చేస్తే ఓ పెద్ద మాంసపు ముక్కగాని లేదా శ్రేష్ఠమైన రెండు మేక కాళ్ళు గాని లభిస్తాయని తెలిస్తే వారు తప్పకుండా ఇషా నమాజ్ చేయడానికి వస్తారు." (బుఖారి)

హజ్రత్ ఉస్మాన్ (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ప్రవచనం: "ఎవరైనా ఇషా నమాజ్ సామూహికంగా నెరవేరిస్తే వారు అర్ధరాత్రి వరకు దైవారాధనలో గడిపినట్లే. మరెవరైతే ఫజర్ నమాజ్ సామూహికంగా నెరవేరుస్తారో వారు రాత్రంతా నమాజ్ చేసినట్లే." (ముస్లిం)

హజ్రత్ అబూహురైరా (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ప్రవచనం: "ఇషా, ఫజర్ నమాజుల్ని (సామూహికంగా) చేయటంలో ఎంత పుణ్యముందో ప్రజలకు తెలిస్తే, వాటి



కోసం కాళ్ళీడుస్తూ రావలసివచ్చినా సరే వారు తప్పక వస్తారు." (బుఖారీ, ముస్లిం)

దైవప్రవక్త (స) హితోక్తి: "ఎవరైతే తమఇంటి దగ్గర చక్కగా పరిశుద్ధతనొంది (ఉజూ చేసి) దేవుడు నిర్దేశించిన విధుల్లో ఒకదాన్ని నిర్వర్తించే ఉద్దేశ్యంతో, దైవగృహాల్లో ఏదైనా ఒక గృహానికి వెళ్తారో, వారు వేసే అడుగుల్లో ఒక అడుగు వారివల్ల జరిగిన ఒక పాపాన్ని తుడిచిపెడ్తే, మరొక అడుగు ఒక అంతస్తును పెంచుతుంది." (ముస్లిం)

దైవప్రవక్త (స) ప్రవచనం: "చీకటిలో మస్జిద్‌కు నడిచివెళ్ళేవారికి ప్రళయదినాన సంపూర్ణ వెలుగు లభిస్తుందనే శుభవార్త అందజేయండి." (అబూదావూద్, తిర్మిజీ)

హజ్రత్ అబూసయీద్ ఖుద్రీ (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ఇలాఅన్నారు: "మీరు ఒక వ్యక్తిని మస్జిద్‌కు వస్తూపోతుండటం చూస్తే మీరతని విశ్వాసానికి సాక్ష్యం పలకండి. దేవుడిలా అంటున్నాడు- 'దేవుణ్ని, అంతిమదినాన్ని విశ్వసించి, నమాజ్‌ను స్థాపించేవారు, జకాత్ చెల్లించేవారు. ఒక్క దేవునికి తప్ప మరెవరికీ భయపడనివారు మాత్రమే దేవుని ఆలయాలకు సంరక్షకులు, సేవకులు కాగలుగుతారు." (తిర్మిజీ)

## కలసి చేయడంలోనే మీ శ్రేయస్సుంది

హజ్రత్ అబూహురైరా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (స) ఇలా తెలియజేశారు: "మనిషి తన ఇంట్లో లేదా వీధిలో ఒంటరిగా చేసే నమాజ్ కంటే సామూహికంగా చేసే నమాజ్ పుణ్యంరీత్యా పాతిక రెట్లు శ్రేష్ఠమైనది. మనిషి శుభ్రంగా సముచితరీతిలో ఉజూచేసి కేవలం నమాజ్‌చేసే ఉద్దేశంతో మసీదుకు వెళ్తుంటే, మసీదులో ప్రవేశించే వరకూ అతను వేసే ప్రతిఅడుగుకు దేవుడు ఒక్కొక్కటి చొప్పున అతనికి (పరలోక) అంతస్తులు పెంచుతాడు. పైగా అతని వల్ల జరిగిన ఒక్కొక్కపాపాన్ని తుడిచివేస్తాడు. ఇక మసీదులో ప్రవేశించిన తరువాత సామూహిక నమాజు కోసం ఎంతసేపు నిరీక్షిస్తాడో అంతసేపూ అతనికి నమాజు చేసినంత పుణ్యం లభిస్తుంది. అతను తన నమాజు స్థానంలో కూర్చొని ఉన్నంతవరకు దైవదూతలు అతని శ్రేయస్సు కోసం ప్రార్థిస్తూ 'దేవా! ఇతని ఉజూ భంగం కానంతవరకు ఇతడ్ని క్షమించు, కనికరించు' అనంటారు." (బుఖారి, ముస్లిం)

దైవప్రవక్త (స) ప్రవచనం: "మసీదుకు అందరికంటే ఎక్కువ దూరం ఉండే మనిషి నమాజ్ కోసం అందరికంటే ఎక్కువ దూరం నడవవలసి వస్తుంది. అంచేత అతనికే అందరికన్నా ఎక్కువ నమాజ్ పుణ్యం లభిస్తుంది. అలాగే (ఒంటరిగా ఇషా) నమాజ్ తొందరగా చేసి పడుకునే మనిషి కంటే ఇమామ్ వెనుక సామూహిక నమాజ్ కోసం ఎదురు చూసే మనిషికి ఎక్కువ పుణ్యం లభిస్తుంది." (బుఖారి)

మహాప్రవక్త ముహమ్మద్ (స) సామూహిక నమాజ్ ప్రాముఖ్యం గురించి ఇలా తెలిపారు: "సామూహిక నమాజ్ పుణ్యం గురించి తెలిసివుంటే ప్రజలు ఏస్థితిలో ఉన్నా సామూహిక నమాజ్ కోసం పరుగులు పెడ్తూ వస్తారు. జమాఅత్‌లోని మొదటి పంక్తి దైవదూతల పంక్తి వంటిది. ఒంటరిగా చేసే నమాజ్ కంటే ఇద్దరు వ్యక్తులతో కూడిన సామూహిక నమాజ్ సైతం ఎంతో శ్రేష్ఠమైనది. నమాజ్ చేసేవారు ఎంతమంది ఎక్కువగా ఉంటే ఆ జమాఅత్ అంతే ఎక్కువ దేవునికి ప్రియమైనది." (తిర్మిజి)

హజ్రత్ అనస్ బిన్ మాలిక్ (రజి) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (స) ఈ విధంగా తెలియజేశారు: "ఎవరైతే నలభై రోజుల పాటు క్రమం తప్పకుండా ప్రతి నమాజ్ మొదటి తక్బీర్ నుండి జమాఅత్‌లో పాల్గొని సామూహికంగా చేస్తాడో అతని కోసం రెండు విముక్తులు ఉన్నాయి. ఒకటి, నరకాగ్ని నుండి విముక్తి. రెండు, కాపట్యం నుండి విముక్తి." (అబూదావూద్, జామె తిర్మిజి)

ఒక అంధుడు వచ్చి, "దైవప్రవక్తా! నన్ను మస్జిద్‌కు తీసుకొచ్చేవారెవరూ లేరు" అని విన్నవించుకుంటూ తనకు ఇంట్లో నమాజ్ చేసుకునేందుకు అనుమతివ్వమని అడిగాడు. దైవప్రవక్త (స) అతనికి ఆమేరకు అనుమతినిచ్చారు. ఆతర్వాత అతను తిరిగి వెళ్ళిపోతుండగా అతడ్ని పిలిచి, 'నీకు నమాజ్ కోసం చేయబడే ప్రకటన (అజాన్) వినపడుతుందా?' అని అడిగారు. అతను వినపడుతుందన్నాడు. అప్పుడాయన ' అయితే దానికి హాజరు పలుకు (అంటే మస్జిద్‌కు వస్తూనేఉండాలి)" అని ఆదేశించారు. (ముస్లిం)

దైవప్రవక్త (స) ఓసారి "ఎలాంటి అవరోధం లేకపోయినా సామూహిక నమాజ్ చేయడానికి రాని మనిషి ఒంటరిగా చేస్తే ఆ నమాజ్ స్వీకరించబడదు" అని అన్నారు. అనుచరులు ఈమాట విని "అవరోధం అంటే ఏమిటీ దైవప్రవక్తా?" అని అడిగారు. దానికి దైవప్రవక్త (స) "అవరోధవం అంటే భయం లేదా ఎదయినా వ్యాధి" అన్నారు. (అబూదావూద్)

## కపట విశ్వాసుల నమాజ్

ఖుర్‌ఆన్‌లో కపట విశ్వాసుల దుర్లక్షణాలు పేర్కొనబడ్డాయి. వాటిలో నమాజ్‌కు సంబంధించిన దుర్లక్షణాలు కూడా ఉన్నాయి. ఈనాడు కొందరు ముస్లింలు కపట విశ్వాసులు కాకపోయినా వీరి నమాజులలో కూడా ఈ కాపట్యకాలుష్యం తొంగిచూస్తుంది.

"పరలోక తీర్పును ధిక్కరించే వాడ్ని నీవు గమనించావా? అతనే అనాథలను కసరి కొట్టేవాడు. పేదల అన్నదానం కోసం (ఇతరుల్ని) ప్రోత్సహించనివాడు. ప్రార్థన పట్ల అశ్రద్ధ, ఏమరుపాటులు వహించేవారికి వినాశం (రాసిపెట్టి) ఉంది. వారు ప్రతిపనీ లోకులమెప్పు కోసం చేస్తుంటారు. (మితిమీరిన పిసినారితనంతో) వాడుకునే సాధారణ వస్తువుల్ని సైతం ఇతరులకు ఇవ్వడానికి నిరాకరిస్తారు." (ఖుర్‌ఆన్–107:1–7)

నమాజులో అశ్రద్ధ, ఏమరుపాటులంటే నిర్ణీతవేళ దాటాక చేయడం. అయితే నమాజు చేస్తున్నప్పుడు మనసులో ఏవేవో ఆలోచనలు వస్తాయి. ఇదీ నమాజ్‌పట్ల అశ్రద్ధే కదా అంటారు కొందరు. మానవబలహీనత వల్ల ఇలాంటి ఆలోచనలు రావడం సహజం. కాని నిజమైన విశ్వాసి తన దృష్టి వేరే ఆలోచనల వైపు మళ్ళిందని గ్రహించగానే తిరిగి నమాజుపై దృష్టి కేంద్రీకరించడానికి ప్రయత్నిస్తాడు. లోకులమెప్పు కోసం నమాజ్ చేసేవారు నమాజుపై మనస్సు కేంద్రీకరించరు. ఈ సూక్తుల్లోని అశ్రద్ధ, ఏమరుపాటులు అలాంటివారికే వర్తిస్తాయి.

హజ్రత్ అబూహురైరా (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ఇలా అన్నారు: "కపటవిశ్వాసులకు ఫజర్, ఇషా నమాజుల కన్నా బరువైన నమాజ్ మరొకటి లేదు. ఆ రెండిటిని నెరవేర్చటంలో ఎంతపుణ్యముందో తెలిస్తే, వాటికోసం కాళ్ళు ఈడ్చుకుంటూ నడవవలసివచ్చినా సరే వారు తప్పకుండా పోటిపడి మరీ వస్తారు." (బుఖారీ, ముస్లిం)



"వారు నమాజ్ చేయడానికి నిల్చుంటే బద్ధకంచేస్తూ లోకులమెప్పు కోసం నిలబడతారు. పైగా దేవుడ్ని చాలా తక్కువగా స్మరిస్తారు." (4:142) "వారు నమాజు చేయడానికి బయలుదేరితే వళ్ళు విరుచుకుంటూ బద్ధకంతో లేస్తారు. దైవమార్గంలో ధనం ఖర్చుపెట్టవలసివస్తే ఏడ్పుగొట్టు ముఖంతో అయిష్టంగా ఖర్చుపెడతారు." (ఖుర్‌ఆన్–9:54)

# 14. శుచి శుభ్రతలు

మనిషికి ఆత్మపరిశుద్ధతతో పాటు దేహపరిశుద్ధత కూడా ఎంతో అవసరం. "దేవుడు తన వైపుకు మరలేవారిని, పవిత్రంగా పరిశుభ్రంగా ఉండేవారిని మాత్రమే ప్రేమిస్తాడు" అని ఖుర్‌ఆన్‌లో ఉంది. (2:222). "పరిశుభ్రత అర్థవిశ్వాసంతో సమానం" అన్నారు దైవప్రవక్త (స). విశ్వాసి మూత్రశుద్ధితో మటుకు 24 గంటలూ ఉండాలి.

"విశ్వాసులారా! నమాజ్ చేయడానికి సిద్ధమైనప్పుడు ముందుగా మీరు ముఖాన్ని, మోచేతులదాకా చేతుల్ని కడుక్కోండి; తలను తడిచేత్తో స్పర్శించండి; కాళ్ళు చీలమండల దాకా కడుక్కోండి. (వీర్యస్ఖలనం వల్ల) అశుద్ధావస్థ ఏర్పడితే పరిశుభ్రంగా తలంటు స్నానం చేయండి...." (ఖుర్‌ఆన్–5:6)

**నీటి శుభ్రత :-** ఉజూ లేక గుసుల్ చేయడానికి కూడా శుభ్రంగా ఉండాలి. కుక్కలు కుంటలు, కోనేరులు, చిన్నచెరువుల నీటి కంటే నదుల నీరు మంచిది. నమాజ్ చేయడానికి 'ఉజూ' చేయడం అవసరం. ఉజూ లేకుండా నమాజ్ నెరవేరదు. మనిషి లైంగిక అపరిశుద్ధావస్థలో ఉంటే 'గుసుల్' (శాస్త్రయుక్తమైన తలంటు స్నానం) చేయవలసి ఉంటుంది.

హజ్రత్ అబూహురైరా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "ఏదైనా పాత్రలో కుక్క నీళ్ళు తాగితే ఆ పాత్రను ఏడు సార్లు కడగాలి." (బుఖారి)

హజ్రత్ ఉమర్ బిన్ ఖత్తాబ్ (రజి) కథనం: "ఎండకు కాగిన నీటితో ఉజూ చేయకండి. ఆ నీటి వల్ల బొల్లివ్యాధి వచ్చే ప్రమాదం ఉంది." (దారెఖుత్ని-మిష్కాత్)

## ఉజూ (Abulation)

హజ్రత్ అబూనజీ అమ్ర్ బిన్ అబసా సులమీ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (స) ఆయనకు ఇలా ఉపదేశించారు: "నువ్వు ఫజర్ నమాజ్ చెయ్యి. ఆ తరువాత సూర్యుడు ఒక ఈటె అంత (బారెడు) పైకి ఎక్కేదాకా నమాజ్ చేయకుండా ఉండు. సూర్యుడు ఉదయించేటప్పుడు షైతాన్ రెండు కొమ్ముల మధ్యనుండి ఉదయిస్తాడు. ఆ సమయంలో అవిశ్వాసులు సూర్యునికి సాష్టాంగప్రణామం చేస్తారు. ఆతర్వాత నుంచి (వస్తువు నీడ(తగ్గుతూ) ఈటెఅంత అయ్యేవరకూ నమాజ్ చెయ్యి. నమాజ్ చేస్తున్నప్పుడు సాక్ష్యం చెప్పడానికి, పుణ్యం నమోదుచేయడానికి దైవదూతలు వస్తుంటారు. సూర్యుడు నడినెత్తి నుండి వాలుతున్నప్పుడు నమాజ్ చెయ్యకు. ఆ సమయంలో నరకాన్ని దహించడం జరుగుతుంది. ఆ తర్వాత నీడ పెరుగుతున్నప్పుడు (జుహ్ర్ వేళ మొదలవుతుంది. అప్పుడు) నువ్వు నమాజ్ చెయ్యి, నమాజ్‌కు సాక్ష్యం చెప్పడానికి (పుణ్యం నమోదు చేయటానికి) దైవదూతలు వస్తుంటారు. ఆ తరువాత అసర్ నమాజ్ చెయ్యి. అసర్ నమాజ్ అనంతరం సూర్యుడు అస్తమించేవరకూ (ఎలాంటి) నమాజ్ చేయరాదు.

సూర్యుడు షైతాన్ రెండుకొమ్ముల మధ్య నుంచి అస్తమిస్తాడు. ఆ సమయంలో అవిశ్వాసులు సూర్యునికి సాష్టాంగప్రణామం చేస్తారు.''

తరువాత నేను ''దైవప్రవక్తా! నాకు వుజూ గురించి బోధించండి'' అని అడిగాను. అప్పుడాయన ఉజూ గురించి ఈవిధంగా చెప్పారు-

''మీలోఎవరైనా ఉజూ చేస్తున్నప్పుడు (చేతులు కడుక్కున్న తర్వాత) పుక్కిలించాలి. ఆ తరువాత ముక్కులోకి నీళ్లు ఎక్కించి ముక్కుని శుభ్రంగా కడుక్కోవాలి. అలా చేసినప్పుడు అతని ముఖం, నోరు, ముక్కు వల్ల జరిగిన తప్పులన్నీ రాలిపోతాయి. ఆ తరువాత దైవాదేశం ప్రకారం అతను తన ముఖం కడుక్కున్నప్పుడు ముఖం వల్ల జరిగిన పాపాలు నీటితోపాటు గడ్డం అంచుల మీది నుండి రాలిపోతాయి. తరువాత రెండుచేతులు కడుక్కున్నప్పుడు వాటివల్ల జరిగిన తప్పులు నీళ్ళతోపాటు వ్రేళ్ళ వైపు నుండి రాలిపోతాయి. ఆ తరువాత తలకు మసహ్ చేసినప్పుడు అతని వల్ల జరిగిన తప్పులు నీళ్ళతో పాటు శిరోజాల చివరి భాగాల నుండి రాలిపోతాయి. ఆ తరువాత రెండు కాళ్ళను చీలమండల వరకు కడుక్కున్నప్పుడు కాళ్ళ వల్ల జరిగిన తప్పులు నీళ్ళతో పాటు కాలివ్రేళ్ళ ద్వారా క్రిందికి రాలిపోతాయి. ఆ తర్వాత నమాజ్‌కు ఉపక్రమించి తగిన విధంగా దేవుణ్ణి స్తుతించి ఆయన ఔన్నత్యాన్ని కొనియాడుతూ మనసును ఆయన భక్తి యందే లగ్నం చేసుకుంటే అతని పాపాలన్నీ సమసిపోయి అప్పుడే తన తల్లి కడుపున పుట్టినట్లు పునీతుడయిపోతాడు.'' (ముస్లిం)

దైవప్రవక్త (స) ప్రవచనం: ''మీలోఎవరి ఉజు భంగమైపోతే అతను (మళ్లీ) ఉజూ చేయనంతవరకు అతని నమాజ్‌ను దేవుడు స్వీకరించడు.'' (బుఖారి, ముస్లిం)

దైవప్రవక్త (స) ఎలా ఉజు చేసేవారని అడిగితే, హజ్రత్ అబ్దుల్లా బిన్ జైద్ (రజి) ఒక చెంబులో నీళ్ళు తెప్పించి దాంతో ఉజు చేసి ప్రశ్నించిన వ్యక్తికి దైవప్రవక్త (స) చేసిన ఉజు పద్ధతి (ఈవిధంగా) చూపారు.

మొదట ఆయన చెంబులో నుంచి నీళ్ళు తీసుకొని మూడు సార్లు ముంజేతులు కడుక్కున్నారు. తరువాత చెంబులో చేయి ముంచి మూడు సార్లు పుక్కిలించారు. అలాగే మూడు సార్లు ముక్కులోకి నీళ్ళు ఎక్కించి చీది శుభ్రపరచుకున్నారు. తర్వాత చెంబులో నుంచి నీళ్ళు తీసుకొని మూడు సార్లు ముఖం కడుక్కున్నారు. ఆ తరువాత చెంబులో నుంచి నీళ్ళు తీసుకొని రెండు చేతులు మోచేతుల వరకు మూడు సార్లు కడుక్కున్నారు. ఆ తర్వాత చెంబులో నీళ్ళు తీసుకొని (తడి చేతులతో) తుడుచుకున్నారు. అప్పుడు మొదట తన రెండుచేతుల్ని తల ముందుభాగం నుంచి వెనుకభాగం వరకు పోనిస్తూ తుడుచుకున్నారు. తరువాత తల వెనుకభాగం నుంచి ముందుభాగం వరకు రానిచ్చి తుడుచుకున్నారు. ఈవిధంగా ఆయన ఒకసారి మాత్రమే (మసహ్) చేశారు. ఆ తర్వాత రెండు కాళ్ళు చీలమండలు వరకు కడుక్కున్నారు. (బుఖారి, ముస్లిం)

హజ్రత్ అబూహురైరా (రజి) ఎక్కడికో పోతుంటే ఒక చోట కొందరు వ్యక్తులు చెంబుతో ఉజు చేసుకుంటూ ఉండటం కన్పించింది. అప్పుడాయన వారిని ఉద్దేశించి



''(నీటితో తడవని) కాలి మడమలకు నరకాగ్నితో వినాశం ఉందని అబుల్‌ఖాసిం (స) చెబుతుంటే నేను విన్నాను. అంచేత మీరు (ప్రవక్త) సంప్రదాయం ప్రకారం సమగ్రంగా, పూర్తిగా ఉజు చేయండి'' అని అన్నారు. (బుఖారి)

హజ్రత్ జరీర్ బిన్ అబ్దుల్లా (రజి) ఓసారి మూత్రవిసర్జన తరువాత ఉజు చేస్తూ మేజోళ్ళ మీద 'మసహ్' చేశారు. (అంటే తడిచేత్తో మేజోళ్ళు తుడుచుకున్నారు.) ఆ తరువాత ఆయన లేచి నమాజ్ చేశారు. దాన్నిగురించి ఒకతను అడిగితే దైవప్రవక్త (స) ఇలా చేయడాన్ని తాను చూశానని ఆయన సమాధానమిచ్చారు. (బుఖారి, ముస్లిం)

దైవప్రవక్త (స) ప్రవచనం: ''ప్రళయదినాన నా అనుచర సముదాయాన్ని (కర్మవిచారణ కోసం) పిలవడం జరుగుతుంది. అప్పుడు వారి ముఖాలు, కాళ్ళు, చేతులు ఉజూ ప్రభావంతో తెల్లగా, ఉజ్వలంగా ఉంటాయి. కాబట్టి మీలో ఎవరైనా తమ తెలుపు, తేజస్సులను వృద్ధి చేసుకోదలచుకుంటే వారు ఉజు చేస్తున్నప్పుడు పూర్తిగా ముఖం కడుక్కొని వృద్ధి చేసుకోవచ్చు.'' (బుఖారి)

దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: ''నా అనుచర సముదాయం (లేక) ప్రజలు ఇబ్బందికి లోనవుతారనే భయం గనక లేకపోతే నేను వారిని ప్రతి నమాజు సమయంలోనూ మిస్వాక్ చేయాలని ఆదేశించి ఉండేవాణ్ణి.'' (బుఖారీ, ముస్లిం)

హజ్రత్ షురైహ్ బిన్ హానీ (రజి) కథనం: నేను హజ్రత్ ఆయిషా (రజి)ను ''దైవప్రవక్త (సల్లం) ఇంటికి వస్తే ముందుగా ఏ పని చేస్తారని అడిగాను. దానికామె ''మిస్వాక్‌తో) పళ్ళు తోముకుంటారు'' అని చెప్పారు. (ముస్లిం)

పైరెండు హదీసుల్లో దైవప్రవక్త (సల్లం) నోటి శుభ్రతకు ఎంతో ప్రాముఖ్యం ఇచ్చినట్లు తెలుస్తోంది. మన ఆహారపానీయాలన్నీ నోటి ద్వారానే కడుపులోకి చేరుతాయి. అప్పుడవి కొద్దో గొప్పో పండ్లలో ఇరుక్కుపోతాయి. వాటిని మిస్వాక్, లేదా టూత్‌పేస్ట్‌తో ఎప్పటికప్పుడు శుభ్రపరచుకుంటే ఆరోగ్యానికి మంచిదన్నదే పై హదీసులోని అంతరార్థం.

## ఉజూ భంగమయ్యే విషయాలు

(1) మలమూత్ర విసర్జన కావడం, (2) అపాన వాయువు వెడలటం, (3) శరీరంలోని ఏ అవయవం నుండయినా రక్తస్రావం కావడం, (4) నోటినిండా వాంతికావడం, (5) పడుకొని లేదా దేనికైనా ఆనుకొని నిద్రించడం, (6) స్పృహ కోల్పోవడం. ఈకారణాల వల్ల ఉజు, తయమ్ముమ్ భంగమవుతాయి. నమాజ్ కోసం తిరిగి చేసుకోవలసి ఉంటుంది. పోతే (7) నీరు లభించని కారణాన చేసిన తయమ్ముమ్ నీరు లభించగానే భంగమవుతుంది.

దైవప్రవక్త (స) హితోక్తి: ''నమాజ్ చేస్తున్నప్పుడు ఎవరికైనా అపానవాయువు వెలువడితే అతను బయటికెళ్ళి ఉజు చేసి, మళ్ళీ నమాజ్ చేయాలి.'' (తిర్మిజి, నసాయి)

అబ్దుల్లా బిన్ జైద్(రజి) కథనం: నేను ''నమాజ్ చేస్తున్నప్పుడు ఒక్కోసారి ఏదోఅయి (అపానవాయువు వెడలి)నట్లు అన్పిస్తుంది. అప్పుడు నేనేం చేయాలి?'' అని దైవప్రవక్త (స)ను అడిగాను. దానికి ఆయన ''(అపానవాయువు)శబ్దం వినపడనంత వరకు లేదా దుర్వాసన రానంతవరకు నమాజ్‌ని భంగపరచకు'' అని చెప్పారు. (బుఖారి)

హజ్రత్ అనస్ (రజి) కథనం: "ఒకసారి (ఇషా నమాజ్ కోసం) ఇఖామత్ (పిలుపు) ఇవ్వబడింది. అయితే దైవప్రవక్త (స) మసీదులో ఓ మూలన ఎవరితోనో మాట్లాడుతూ ఉండిపోయారు. ఆ (సంభాషణ ముగిసిన) తరువాత ఆయన నమాజ్ కోసం లేచారు. అప్పటివరకు (ఆయన) అనుచరులు కునుకుపాట్లు పడుతూనే ఉన్నారు. దైవప్రవక్త (స)తో పాటు వారూ లేచి, మళ్ళీ ఉజు చేయకుండానే నమాజ్ చేశారు." (బుఖారి)

దైవప్రవక్త (స) ప్రవచనం: "ఎవరికైనా నమాజ్ చేస్తున్నపుడు వాంతి అయితే, లేదా ముక్కు నుండి రక్తం కారితే, లేదా కడుపులోని పదార్థమేదైనా నోటి గుండా బయటికి వస్తే, లేదా మర్మాంగం నుండి జిగట పదార్థం వెడలితే అతను నమాజ్ వదిలేసి ఉజు చేయాలి. ఉజూ చేసిన తర్వాత ఎక్కడ నమాజ్‌ని వదలిపెట్టాడో అక్కడ్నుంచి ప్రారంభించాలి. అయితే ఈలోగా అతను ఏమీ మాట్లాడకుండా ఉండాలి." (ఇబ్నెమాజ)

హజ్రత్ అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి) కథనం: దైవప్రవక్త (స) పాలు తాగిన తర్వాత నీటితో నోరు పుక్కిలించి "పాలు తాగడం వల్ల నోరు తైలయుతమవుతుంది (అంచేత నీళ్ళతో నోరు పుక్కిలించి) శుభ్రపరచుకోవాలి" అని అన్నారు. (బుఖారి)

హజ్రత్ అబూహురైరా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (స) ఇలాఅన్నారు: "షైతన్ నిద్రించేవాడి ముక్కుదూలం మీద రాత్రి గడుపుతాడు. కనుక నిద్ర నుండి లేచినవాడు (ముందుగా) మూడు సార్లు ముక్కు చీది శుభ్రపరచుకోవాలి." (బుఖారి, ముస్లిం)

## తయమ్ముమ్

"ఒకవేళ మీరు వ్యాధిగ్రస్తులైతే, లేదా ప్రయాణావస్థలో ఉంటే, లేదా మల మూత్ర విసర్జనచేస్తే, లేదా స్త్రీని కలుసుకుంటే– అప్పుడు నీళ్ళు దొరకని పక్షంలో పరిశుభ్రమైన మట్టి ఉపయోగించండి. అంటే మట్టిపై చేతులుతట్టి వాటితో ముఖం, చేతులు రుద్దుకోండి. దేవుడు మీ జీవితాన్ని దుర్భరం చేయగోరడం లేదు. మీరు కృతజ్ఞులై ఉండేందుకు ఆయన మిమ్మల్ని పరిశుద్ధపరచి, మీకు తన అనుగ్రహాలను పూర్తిగా ప్రసాదించదలిచాడు." (ఖుర్ఆన్–5:6)

నీళ్ళు లభించనప్పుడు లేదా నీటివల్ల వ్యాధి ముదురుతుందన్న భయమున్నప్పుడు ఉజూ లేక గుసుల్‌కు బదులు తయమ్ముమ్ చేయాలి. అంటే శుభ్రమైన మట్టిమీద లేక సున్నపు గోడమీద లేక ధూళిపేరుకున్న వస్తువుపై రెండు చేతులు తట్టి (విదిలించి) వాటితో ముఖాన్ని స్పర్శించాలి. ఆతర్వాత మరోసారి చేతుల్ని మట్టిమీద తట్టి చేతివ్రేళ్ళ నుంచి మోచేతుల దాకా రెండుచేతుల్ని రుద్దాలి. వీర్యస్ఖలనం అయినప్పుడు కూడా ఇలాగే తయమ్ముమ్ చేసుకోవచ్చు. అయితే నీళ్ళు లభించగానే ఆరోగ్యవంతుల తయమ్ముమ్ భంగమవుతుంది.

విశ్వాసుల మాతృమూర్తి హజ్రత్ ఆయిషా (రజి) ఇలా తెలియజేస్తున్నారు:- మేమొకసారి దైవప్రవక్త (స)తో కలసి ప్రయాణం చేస్తున్నాం. బైదా (లేక జాతుల్‌జైష్) అనే ప్రాంతానికి చేరుకునే సరికి నా కంఠహారం తెగి ఎక్కడో పడిపోయింది. దైవప్రవక్త (స) దాన్ని వెతకడానికి అక్కడ ఆగిపోయారు. ఆయనతో పాటు మిగిలినవాళ్ళు కూడా ఆగిపోయారు. ఆ ప్రదేశంలో ఎక్కడా నీటిచుక్క లేదు. జనం అబూబకర్ (రజి) దగ్గరకు వెళ్ళి "మీ అమ్మాయి ఆయిషా (రజి) ఏం చేసిందో చూశారా? ఆమె మూలంగా దైవ



ప్రవక్త (స) ఇక్కడ ఆగిపోవలసి వచ్చింది. ఆయనతో పాటు ప్రజలంతా ఆగిపోయారు. కాని ఈ ప్రదేశంలో చూస్తే (కనుచూపు మేరలో) ఒక్క నీటిచుక్క కూడా లేదు. జనం దగ్గరున్న నీళ్ళు కాస్తా అయిపోయాయి" అని అన్నారు.

హజ్రత్ అబూబకర్ (రజి) ఈ మాటలు విని నాదగ్గరకు వచ్చారు. ఆ సమయంలో దైవప్రవక్త నా ఒడిలో తలపెట్టి నిద్రపోతున్నారు. అబూబకర్ (రజి) వచ్చిరాగానే "నీ మూలంగా దైవప్రవక్త (స) ఇక్కడ ఆగిపోవలసి వచ్చింది. ఆయనతో పాటు ప్రజలు కూడా ఆగిపోయారు. ఇక్కడ చూస్తే చుక్క నీరులేదు. జనం దగ్గర కూడా నీళ్ళు లేవు" అని మండిపడ్డారు నామీద. ఆయన చేత్తో నా వీపు మీద కొడ్తూ అనదలచిన మాటలన్నీ అన్నారు. దైవప్రవక్త (స) నా తొడల మీద తలపెట్టి పడుకోవడంవల్ల నేను (దెబ్బలు సహిస్తూ) కదలకుండా అలాగే ఉండవలసి వచ్చింది. మరునాడు ఉదయం దైవప్రవక్త (స) మేల్కొంటే (ఉజూ చేయడానికి) అసలు నీళ్ళేలేవు. అప్పుడు దేవుడు "తయమ్ముమ్" ఆజ్ఞలు పంపాడు.

దాంతో అందరూ తయమ్ముమ్ చేశారు. ఆ సందర్భంలో ఉసైద్ బిన్ హజీర్ (రజి) మాట్లాడుతూ "అబూబకర్ సంతానమా! మీ మూలంగా (ముస్లింలకు) శుభం కలగడం ఇది మొదటిసారి కాదు" అన్నారు. ఆ తర్వాత నేను కూర్చున్న ఒంటెను లేపారు. దాని క్రింద నా కంఠహారం దొరికింది." (బుఖారి, ముస్లిం)

హజ్రత్ అబూ సయీద్ ఖుద్రీ (రజి) కథనం: ఇద్దరు వ్యక్తులు ప్రయాణం చేస్తున్నారు. (దారిలో) నమాజ్ వేళయింది. కాని వారి దగ్గర నీళ్ళు లేవు. ఇద్దరూ శుభ్రమైన మట్టితో తయమ్ముమ్ చేసి నమాజ్ చేశారు. నమాజ్ వేళ ముగిసిపోక ముందే వారికి నీళ్ళు లభించాయి. అంచేత వారిలో ఒకతను ఉజూ చేసి (తిరిగి)నమాజ్ చేశాడు. రెండోవాడు ఉజూ, నమాజ్ ఏదీ చేయలేదు. ప్రయాణం నుంచి తిరిగొచ్చిన తరువాత ఇద్దరూ దైవప్రవక్త (స) సన్నిధికి వెళ్ళి జరిగిన సంఘటన తెలియజేశారు. అప్పుడు దైవప్రవక్త (స) నమాజ్ చేయని వ్యక్తి నుద్దేశించి "నీవు సున్నత్‌ని (సంప్రదాయాన్ని) అనుసరించావు. నీవు చేసిన (మొదటి) నమాజే నీకు సరిపోతుంది" అని అన్నారు. రెండవసారి నమాజ్ చేసిన వ్యక్తితో "నీకు రెట్టింపు పుణ్యం లభిస్తుంది" అని అన్నారు. (అబూదావూద్, నసాయి)

## మలమూత్ర విసర్జన జాగ్రత్తలు

హజ్రత్ అబూఅయ్యూబ్ అన్సారి (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ఇలా ఉపదేశించారు: "మీరు మలమూత్రాల విసర్జన కోసం వెళ్ళినప్పుడు మీ ముఖం, వీపు ఖిబ్లా (కాబా) వైపుకుఉండేలా కూర్చోకండి. తూర్పు లేక పడమర వైపుఉండేలా కూర్చోండి."

ఈ హదీసు ఉల్లేఖించిన తరువాత హజ్రత్ అబూఅయ్యూబ్ అన్సారి (రజి) ఇలా అన్నారు: "ఆ తరువాత మేము సిరియా వెళ్తే అక్కడ మలమూత్ర విసర్జన కోసం నిర్మించిన గుంటలు ఖిబ్లా దిశగా ఉండటం వల్ల మేము విధిలేక వాటి మీదనే కూర్చునేవాళ్ళము. కాకపోతే ముఖం కాస్త పక్కకు తిప్పుకునే వాళ్ళము, (తరువాత) దైవాన్ని క్షమాపణ చెప్పుకునేవాళ్ళం." (బుఖారి, ముస్లిం).

హజ్రత్ హుజైఫా (రజి) కథనం: "ఒకసారి నేను దైవప్రవక్త (స) వెంట ప్రయాణం చేస్తున్నాను. (దారిలో) ఆయన ఒగ తెగవారి కసువుదిబ్బ సమీపంలోని ఓ గోడ చాటుకు వెళ్ళి అందరూ నిలబడినట్లే నిలబడ్డారు. అలా నిలబడి మూత్రవిసర్జన చేయడం ప్రారంభించారు. ఆ సమయంలో నేను కొంచెం పక్కకు తప్పుకున్నాను. అయితే దైవప్రవక్త (స) నన్ను (చేత్తో) సైగచేసి దగ్గరికి పిలిచారు. నేను వెళ్ళి ఆయన వెనకాల మూత్రవిసర్జన పని ముగించేదాకా నిల్చున్నాను." (బుఖారి)

నిలబడి మూత్రవిసర్జన చేసేవిషయంలో ఉల్లేఖకుల్లో భిన్నాభిప్రాయాలున్నాయి. హజ్రత్ ఆయిషా(రజి) ఉల్లేఖం ప్రకారం ఇలా చేయడం నిషిద్ధం. అంటే సాధారణ పరిస్థితుల్లో నిలబడి మూత్రవిసర్జన చేయకూడదన్న మాట. అసాధారణ పరిస్థితుల్లో ఏ వ్యవహారంలోనైనా మినహాయింపులు ఉంటాయి. కనుక ధర్మవేత్తలు దీన్ని గురించి రెండురకాల హదీసులు పరిశీలించి ఓ మధ్యేమార్గం నిర్ణయించారు. దాని ప్రకారం నేల బురదగా ఉన్నప్పుడు, మలిన బిందువులు మీద పడే ప్రమాదముంటే, లేదా బట్టలు పాడయ్యే సూచనలుంటే నిల్చొని మూత్రం పోయడంలో తప్పులేదు. ఈనాడు పట్టణాలలోని అనేకచోట్ల నిర్మించిన మూత్రశాలల్లో కూర్చోవడానికి వీలులేనందున నిలబడి మూత్రవిసర్జన చేయడం తప్పదు మరి.

దైవప్రవక్త (సల్లం) మరుగుదొడ్డికి పోయేటప్పుడు ముందుగా ఈవిధంగా దుఆ చేసేవారు- "అల్లాహుమ్మ ఇన్నీ అవూజుబిక మినల్ ఖుబ్సి వల్ ఖబాయిస్."

(అర్థం: దేవా! నేను అపరిశుద్ధ వస్తువుల, అపవిత్ర చర్యల కీడు నుండి నీ శరణు కోరుతున్నాను)- (బుఖారి, ముస్లిం)

దైవప్రవక్త (స) ఇలా అన్నారు: "నీళ్ళు తాగుతున్నప్పుడు నీళ్ళపాత్రలోకి శ్వాస వదలకూడదు. అలాగే మలమూత్ర విసర్జన సమయంలో కుడిచేత్తో మర్మాంగాన్ని పట్టుకోకూడదు. కుడిచేత్తో మూత్రశుద్ధి చేయకూడదు." (బుఖారి, ముస్లిం)

హజ్రత్ ఆయిషా (రజి) కథనం: "దైవప్రవక్త (స)కు ఏ పనయినా కుడివైపు నుండి ప్రారంభించడమంటే ఎంతో ఇష్టం. చివరికి చెప్పులు తొడుక్కున్నా, తల దువ్వుకున్నా, మూత్రశుద్ధి చేసినా సరే కుడివైపు నుండే ప్రారంభిస్తారు." (బుఖారి, ముస్లిం)

## గుసుల్ (స్నానం)

విశ్వాసుల మాతృమూర్తి హజ్రత్ ఆయిషా (రజి) కథనం: "దైవప్రవక్త (స) లైంగిక అశుద్ధతను తొలగించుకోవడానికి స్నానం చేయ సిద్ధమైనప్పుడు ముందుగా రెండు చేతులు కడిగి శుభ్రపరచుకుంటారు. తరువాత నమాజ్ కోసం చేసే విధంగా ఉజూ చేస్తారు. ఆ తరువాత చేతివ్రేళ్ళను నీటిలో ముంచితీసి దువ్వెనలా తలలోకి జొన్పించి తిప్పుకునేవారు. ఆ తరువాత రెండు చేతుల్లో నీళ్ళు తీసుకొని మూడు సార్లు తలమీద పోసుకుంటారు. ఆపై పూర్తి శరీరంపై నీళ్ళు పోసుకుంటారు." (బుఖారి)

విశ్వాసుల మాతృమూర్తి హజ్రత్ మైమూనా (రజి) కథనం: "దైవప్రవక్త (స) స్నానం చేయడానికి నేను నీళ్ళు తోడిపెట్టాను. ఆయన (మొదట) కుడిచేత్తో ఎడమచేతిపై నీళ్ళు పోసుకొని రెండు చేతులు కడుక్కున్నారు. తరువాత మర్మాంగాన్ని కడుక్కున్నారు. ఆ



తరువాత ఎడమచేతిని నేల మీద రుద్ది (నీళ్ళతో) కడుక్కున్నారు. ఆ తరువాత నోరు పుక్కిలించారు. దాంతరువాత ముక్కులోకి నీరు ఎక్కించి (చీది) శుభ్రపరచుకున్నారు. ఆ తరువాత ముఖం కడుక్కున్నారు. ఆ తరువాత తలపై నీళ్ళు పోసుకున్నారు. ఆ తరువాత ఆ చోటు నుంచి పక్కకు జరిగి రెండు కాళ్ళు కడుక్కున్నారు. ఆ తరువాత తువాలు తెచ్చిస్తే దాంతో ఆయన వళ్ళు తుడుచుకోలేదు." (బుఖారి, ముస్లిం)

హజ్రత్ ఆయిషా (రజి) కథనం: "దైవప్రవక్త (స) నాలుగు కారణాలపై గుసుల్ చేసేవారు. 1-సంభోగం (వీర్యస్ఖలనం) జరిగినపుడు, 2-శుక్రవారం వచ్చినపుడు, 3-శరీరం నుండి రక్తం తీసినపుడు, 4-మృతునికి స్నానం చేయించినపుడు." (అబూదావూద్)

ఈ హదీసులో నాలుగు పనుల కారణంగా స్నానం చేయాలని ఉంది. 1- వీర్యస్ఖలనం జరిగినపుడు స్నానం చేయడం విధి అనే విషయంలో ఏకాభిప్రాయముంది. కాని 2-శుక్రవారం స్నానం చేయడం చాలామంది సహాబీలు, ఇమాముల దృష్టిలో సంప్రదాయం (మస్నూన్) మాత్రమేగాని విధి(ఫరజ్) కాదు. అయితే ఇమామ్ అహ్మద్, ఇమామ్ మాలిక్‌ల దృష్టిలో మాత్రం ఈ స్నానం విధి. 3-శరీరం నుండి రక్తం తీసినపుడు స్నానం చేయడం కూడా మస్నూన్ మాత్రమేగాని, ఫరజ్ కాదు. 4-పోతే మృతునికి స్నానం చేయించిన తరువాత స్నానం చేయడం అధికసంఖ్యాక ధర్మవేత్తల దృష్టిలో ముస్తహబ్ (అభిలషనీయం), ఫరజ్ కాదు.

దైవప్రవక్త (స) ప్రవచనం: "శుక్రవారం ఉజూ చేసినవాడు మంచిపని చేశాడు, గుసుల్ చేసినవాడు అంతకంటే మంచిపని చేశాడు." (అహ్మద్, అబూదావూద్, తిర్మిజి)

"(వీర్యస్ఖలనం వల్ల) అశుద్ధావస్థలో ఉన్నప్పుడు స్నానం చేసేవరకు నమాజ్ దరిదాపులకు పోకూడదు, (మసీదు) దారిగుండా పోవడం అనివార్యమైతే తప్ప." (ఖుర్ఆన్–4:43)

హజ్రత్ ఆయిషా (రజి) కథనం: "దైవప్రవక్త (స) లైంగికశుద్ధావస్థలో పడుకోదలచుకుంటే, మర్మాంగం కడుక్కొని, నమాజ్ కోసం చేసేలా ఉజూ చేసేవారు." (బుఖారి)

హజ్రత్ అలి(రజి) కథనం: "నాకు తరచుగా శుక్రనష్టం జరుగుతుంటుంది. అయితే దైవప్రవక్త (స) కుమార్తె నాభార్య అయినందున ఈ సమస్య గురించి దైవప్రవక్త (స)ను అడగడానికి నేను సిగ్గుపడేవాడ్ని. అంచేత దీన్ని గురించి దైవప్రవక్త (స)ను అడిగి తెలుసుకోవలసిందిగా నేను మిఖ్దాద్ బిన్ అస్వద్ (రజి)తో అన్నాను. ఆయన వెళ్ళొచ్చి "శుక్రనష్టం జరిగితే మర్మాంగం కడుక్కొని ఉజూ చేసుకోవాలని దైవప్రవక్త (స) అన్నార"ని తెలియజేశారు. (ముస్లిం)

## ప్రకృతికి అనుగుణమైన విషయాలు

దైవప్రవక్త (స) ప్రవచనం: "మీ వేషధారణ బహుదైవారాధకులకు భిన్నంగా ఉండేలా చూసుకోండి. గడ్డం పెంచండి, మీసాలు కత్తిరించండి." (బుఖారి, ముస్లిం)

దైవప్రవక్త (స) హితోక్తి: "ప్రకృతికి అనుగుణమైన అయిదు విషయాలున్నాయి. 1-ఖత్నా (వడుగు) చేయడం, 2-నాభి కింది వెంట్రుకలు తీసేయడం, 3-చంకలోని వెంట్రుకలు తొలగించడం, 4-గోళ్ళు కత్తిరించడం, 5-మీసాలు కత్తిరించడం." (బుఖారి)

# 15. స్త్రీల పరిశుభ్రత

“వారు నిన్ను రుతుస్రావం గురించి ఆజ్ఞ ఏమిటని అడుగుతున్నారు. వారికిలా చెప్పు: “అది అపరిశుద్ధావస్థ. ఆ స్థితిలో మీరు స్త్రీల (పడకల)కు దూరంగా ఉండండి. వారు పరి శుద్ధులు కానంతవరకు వారివద్దకు వెళ్ళకండి. వారు పరిశుద్ధులైన తర్వాత దేవుడు మిమ్మల్ని ఆదేశించిన రీతిలో వారివద్దకు యథాప్రకారం వెళ్ళవచ్చు. దేవుడు తన వైపు మరలేవారిని, పవిత్రంగా పరిశుభ్రంగా ఉండేవారిని మాత్రమే ప్రేమిస్తాడు.” (ఖుర్ఆన్–2:223)

విశ్వాసుల మాతృమూర్తి హజ్రత్ ఆయిషా (రజి) దగ్గరకు ఓ స్త్రీ వచ్చి “బహిష్టు రోజుల్లో తప్పిపోయిన నమాజులను స్నానం చేసి పరిశుభ్రమైన తరువాత (బహిష్టుగడువు తీరి స్నానంచేశాక) ఖజా నమాజులుగా చేసుకోవాలా?” అనడిగింది. హజ్రత్ ఆయిషా (రజి) ఈమాట విని “నువ్వు (మార్గభ్రష్టులయి పోయిన) ఖార్జీ(వర్గం) మహిళవా? దైవప్రవక్త (స) కాలంలో మేము బహిష్టయితే తప్పిపోయిన నమాజులకు ఖజా పాటించాలని మమ్మల్ని ఆయన ఆదేశించేవారు కాదు” అని అన్నారు. లేక “మేము అలా చేసేవాళ్ళం కాదు” అని అన్నారు ఆమె. (బుఖారి)

హజ్రత్ ఉమ్మెసల్మా (రజి) కథనం: ఒకసారి నేను, దైవప్రవక్త (స) ఒకే దుప్పటి కప్పుకొని పడుకున్నాము. కాస్సేపటికి నాకు హఠాత్తుగా రుతుస్రావం మొదలయింది. వెంటనే నేను మెల్లగా దుప్పట్లో నుంచి బయటికి వచ్చి బహిష్టు బట్ట కట్టుకున్నాను. దైవప్రవక్త (స) ఇది గమనించి “ఏమిటీ, నువ్వు బహిష్టు అయ్యావా?” అని అడిగారు. నేను ఔనన్నాను. అయినప్పటికీ ఆయన నన్ను పడక మీదికి పిలుచుకున్నారు. నేను వెళ్ళి ఆయన దగ్గర అదే దుప్పటి క్రింద పడుకున్నాను. (బుఖారి, ముస్లిం)

ప్రవక్త సతీమణి హజ్రత్ ఆయిషా (రజి) కథనం: నేను బహిష్టు అయిన రోజుల్లో (కూడా) నన్నాయన దేహానికి దేహం ఆనిచ్చి స్పర్శించేవారు. అలాగే ఏతికాఫ్ (తపోనిష్ఠ)లో ఉన్నప్పుడు కూడా ఆయన మసీదులో ఉండి తమ శిరస్సును నా వైపుకు పెట్టే నేను బహిష్టు అయివుండి కూడా ఆయనకు తలంటేదాన్ని. (బుఖారి, ముస్లిం)

విశ్వాసుల మాతృమూర్తి హజ్రత్ ఆయిషా (రజి) కథనం: నేను బహిష్టు అయిన రోజుల్లో (కూడా) దైవప్రవక్త (స) నా ఒడిని తలగడగా ఉపయోగించుకొని ఖుర్ఆన్ పఠించేవారు. (ముస్లిం, బుఖారి)

హజ్రత్ ఉమ్మె సలమా (రజి) కథనం: “దైవప్రవక్త (స) కాలంలో స్త్రీలు ప్రసవించిన తరువాత నలభై రోజుల పాటు అశుద్ధావస్థలో ఉండేవారు.” (అబూదావూద్)

## నిరంతరాయ రక్తస్రావం అయితే?

హజ్రత్ ఆయిషా (రజి) కథనం: ఉమ్మెహబీబా (రజి) దైవప్రవక్త (స) సన్నిధికి వచ్చి (నిర్ణీత కాలం దాటిన తరువాత అయ్యే) రక్తస్రావం గురించి అడిగింది. దానికి ఆయన ఇలా చెప్పారు- “నీ నెలవారీ దినాలు లోగడ ఎన్ని నిర్ణయమైఉండేవో అన్ని దినాలు (నమాజ్, రోజాలు) వదిలెయ్యి. ఆ తరువాత స్నానంచేసి నమాజ్ విధి నెరవేర్చు.” (ముస్లిం); బుఖారీ గ్రంథంలో “ప్రతి నమాజ్ కోసం కొత్తగా ఉజూ చేస్తుండు” అని ఉంది.



హజ్రత్ హమ్నా బిన్త్ జహష్ (రజి) కథనం: నేను తీవ్రమైన రక్తస్రావానికి గురయి ఉండేదాన్ని. దీన్ని గురించి దైవప్రవక్త (స) అభిప్రాయం తెలుసుకోవడానికి వెళ్ళాను. ఆయన నాసంగతి విని ఇలా అన్నారు- “ఇది షైతాన్ దెబ్బ. కనుక నీవు ఆరు లేక ఏడు రోజులు బహిష్టు దినాలుగా లెక్కించి స్నానం చెయ్యి. ఇలా నీవు పరిశుద్ధత పొందిన తరువాత ఇరవై నాలుగు లేదా ఇరవై మూడు రోజులదాకా నమాజ్ చెయ్యి. ఉపవాసాలు కూడా పాటించు. నీకిది చాలు. ఇతర స్త్రీల మాదిరిగానే ప్రతినెలా ఈవిధంగానే చేస్తూవుండు. ఒకవేళ (ఇలా వద్దనుకుంటే) జుహర్ వేళను కాస్త ఆలస్యం చేసి, అసర్ వేళను కాస్త ఇవతలకు జరుపుకునే శక్తి ఉంటే స్నానం చేసి పరిశుద్ధురాలయిన తరువాత జుహర్, అసర్ నమాజులు కలుపుకో. (అంటే జుహర్, అసర్ నమాజులను ఒకదాని తర్వాత ఒకటి వెనువెంటనే చేయాలి.) అలాగే మగ్రిబ్‌నమాజ్‌ను కాస్సేపు వాయిదావేసి, ఇషానమాజ్‌ను కాస్త ఇవతలకు జరుపుకొని స్నానంచేసి పరిశుద్ధురాలైన తర్వాత ఈరెండు నమాజులు కలుపుకో.” ఆ తర్వాత ఆయన ఇలా అన్నారు- “ఈరెండు పద్ధతులలో రెండవదే నాకు ఇష్టమైనది.” (తిర్మిజి)

ఈ హదీస్‌లో హమ్నా (రజి)కు రోజుకు మూడుసార్లు స్నానం చేయాలని ఉంది. జుహర్-అసర్ నమాజ్‌ల కోసం ఒకసారి, మగ్రిబ్-ఇషా నమాజ్‌ల కోసం రెండవసారి, ఫజ్ర్ నమాజ్ కోసం మూడవసారి. అయితే అధికసంఖ్యాక ధర్మవేత్తల ప్రకారం నిరంతర రక్తస్రావం అయ్యే స్త్రీలు ప్రతి నమాజ్ కోసం కొత్తగా స్నానం చేయడం విధి కాదని అభిప్రాయపడ్డారు.

## రుతుమతి ఆంక్షలు

బహిష్టు, ప్రసూతి దినాలలో స్త్రీలు నమాజ్ చేయకూడదు, ఉపవాసాలు పాటించకూడదు, మస్జిద్‌లో ప్రవేశించకూడదు, కాబాప్రదక్షిణ చేయడం, ఖుర్ఆన్‌ని తాకడం-పఠించడం చేయ కూడదు. తప్పిపోయిన రోజాలు తరువాత ఖజా పాటించాలి. నమాజులకు ఖజా లేదు.

హజ్రత్ అనస్ బిన్ మాలిక్ (రజి) కథనం: యూదులలో స్త్రీ బహిష్టు అయితే బహిష్టు దినాలలో ప్రజలు ఆ స్త్రీతో కలసి తినడం, తాగడం చేసేవారు కాదు. అయితే దానికి వ్యతిరేకంగా దైవప్రవక్త (స) ఇలా ఉపదేశించారు- “(ముస్లింలారా!) మీరు ఒక్క సంభోగం తప్ప ఏ పనయినా మీ భార్యల చేత చేయించుకోవచ్చు.” (ముస్లిం)

విశ్వాసుల మాతృమూర్తి హజ్రత్ ఆయిషా (రజి) ఈవిధంగా ఉల్లేఖిస్తున్నారు: ఒక స్త్రీ దైవప్రవక్త (స) సన్నిధికి వచ్చి, బహిష్టు తరువాత స్నానం చేసే పద్ధతి ఏమిటని అడిగింది. దైవప్రవక్త (స) స్నానం చేసే పద్ధతి వివరించిన తరువాత “కస్తూరి వాసనగల గుడ్డపేలికతో శుభ్రపరచుకో” అన్నారు. ఆమె (విషయం అర్థంగాక) "సువాసనగల బట్టతో ఎలా శుభ్రపరచుకోవాలి?” అని అడిగింది. “అంతే, దాంతో శుద్ధిచేసుకో” అన్నారు దైవప్రవక్త (స). ఆ స్త్రీ (అప్పటికీ విషయం అర్థంగాక) “ఎలాగండీ?” అని అడిగింది. దైవప్రవక్త (స) ఆశ్చర్యం వెలిబుచ్చుతూ “సుబ్‌హానల్లాహ్! (నువ్వు ఆమాత్రం కూడా అర్థం చేసుకో లేవా?). సువాసన బట్టతో శుద్ధిచేసుకో, అంతే”అని అన్నారు. అప్పుడు నేనా స్త్రీని పక్కకు లాక్కెళ్ళి విషయం వివరిస్తూ “సువాసన బట్టతో రక్తస్రావమయిన శరీర భాగాన్ని తుడుచుకో” అని చెప్పాను. (బుఖారి)

విశ్వాసుల మాతృమూర్తి హజ్రత్ ఉమ్మెసల్మా (రజి) కథనం: ఒకసారి ఉమ్మెసలీం (రజి) దైవప్రవక్త (స) సన్నిధికి వచ్చి "దైవప్రవక్తా! సత్యం తెలపడంలో దేవుడు సిగ్గు పడడు. స్త్రీలకు స్వప్నస్ఖలనం అయితే వారు కూడా విధిగా గుసుల్(స్నానం) చేయాలా?" అని అడిగింది. దానికి దైవప్రవక్త (స) "చెయ్యాలి, స్వప్నస్ఖలనంలో వీర్యం కన్పిస్తే వాళ్ళు కూడా విధిగా గుసుల్ చేయవలసిందే" అని చెప్పారు.

హజ్రత్ ఉమ్మెసల్మా (రజి) ఈమాటలు విని సిగ్గుతో ముఖం దాచుకుంటూ "దైవ ప్రవక్తా! స్త్రీలకు కూడా స్వప్నస్ఖలనం అవుతుందా?" అనడిగారు. దానికి దైవప్రవక్త (స) "పిచ్చిదానా! స్త్రీకి కూడా వీర్యస్ఖలనం అవుతుంది. స్త్రీకి వీర్యస్ఖలనం కాకపోతే పిల్లవాడికి తల్లి పోలికలు ఎలా వస్తాయనుకున్నావు?" అని అన్నారు. (బుఖారి, ముస్లిం)

సంగమించినా, స్వప్నస్ఖలనమైనా, బహిష్టయినా, ప్రసవించినా తప్పక స్నానం (గుసుల్) చేయాలి. రుతుమతికి బహిష్టుదినాలు గడచిపోయినా రక్తస్రావమవుతుంటే, ఆ గడువుదినాలు గడచిపోయిన తరువాత ఒంటిమీది రక్తం కడుక్కొని ఉజూ చేస్తే సరిపోతుంది.

హజ్రత్ అబూహురైరా (రజి) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఇలా అన్నారు: "పురుషుడు స్త్రీ తొడల మధ్య కూర్చొని బలం ప్రయోగిస్తే చాలు, (వీర్యస్ఖలనం కాక పోయినా) విధిగా స్నానం చేయాలి." (బుఖారి, ముస్లిం)

ప్రవక్త సతీమణి హజ్రత్ ఆయిషా (రజి) కథనం: నేను, దైవప్రవక్త (సల్లం) ఒకే పాత్రలోని నీళ్ళతో స్నానం చేసేవాళ్ళము. ఆ పాత్ర నాకు, ఆయనకు మధ్య ఉంటుంది. ఆ పాత్రలో మా ఇద్దరి చేతులు ఒకదానికొకటి తగులుతుండేవి. ఆయన నాకంటే త్వర త్వరగా నీళ్ళు తీసుకొని పోసుకునేవారు. చివరికి నేను "నా కోసం కూడా కొంచెం నీళ్ళు మిగల్చండి, నాకోసం కూడా మిగల్చండి" అని అనేదానిని. అప్పుడు మేము లైంగిక అశుద్ధావస్థలో ఉండేవాళ్ళము. (బుఖారి, ముస్లిం)

భార్యాభర్తలు పూర్తిగా వివస్త్రయి కూడా స్నానం చేయవచ్చు. కాని ఆచ్ఛాదన యోగ్య మైన శరీరభాగం బట్టతో కప్పుకోవడం మంచిది. ఓసారి దైవప్రవక్త (స) దీన్ని ప్రస్తావిస్తూ "దేవుడు (మన ముందున్నాడని భావిస్తూ ఆయన) పట్ల సిగ్గుపడండి. మనం సిగ్గుపడటానికి అందరికన్నా ఆయనే ఎక్కువ హక్కుదారుడు" అని అన్నారు. (నసాయి)

# 16. అజాన్, నమాజ్ వేళలు, రకాతులు

హజ్రత్ అబూహురైరా (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ఇలా అన్నారు: "అజాన్‌లో, మొదటి వరుసలో ఏముందో తెలిస్తే ప్రజలు (అజాన్ చెప్పడానికి, మొదటి వరుసలో నిలబడటానికి) లాటరీ వేయడం తప్ప వేరేదారి లేనప్పుడు లాటరీ వేస్తారు. జుహర్ నమాజ్‌లో ఏముందో తెలిస్తే ప్రజలు దానికోసం పోటీపడతారు. ఇషా, ఫజర్ నమాజ్‌లలో ఏముందో తెలిస్తే వారు జీరాడుతూ రావలసి వచ్చినా వస్తారు." (బుఖారి)

హజ్రత్ అబూదర్దా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (స) ఇలా అన్నారు: "(కనీసం) ముగ్గురు వ్యక్తులు ఉన్నప్పుడు వారు అజాన్ చెప్పి సామూహికంగా నమాజ్ చేయకపోతే షైతాన్ వారిపై ఆధిక్యత వహిస్తాడు." (ముస్నద్ అహ్మద్)



దైవప్రవక్త (స) ప్రవచనం: "మొజన్ (అజాన్ ఇచ్చే వ్యక్తి)కి (అతని అజాన్ విని) నమాజ్ చేసే ప్రతి మనిషికీ లభించే పుణ్యంతో సమానమైన పుణ్యం లభిస్తుంది"; "అజాన్ వినే ప్రతి మానవుడు లేదా జిన్ లేదా మరేదైనా సృష్టితం ప్రళయదినాన మొజన్ కోసం సాక్ష్యమివ్వడం జరుగుతుంది." (నసాయి)

## అజాన్ (నమాజ్ పిలుపు)

అజాన్ చెప్పడానికి ఎత్తయిన స్థలంలో ఖిబ్లా (కాబామస్జిద్) వైపు తిరిగి నిలబడాలి. తరువాత రెండుచేతుల చూపుడు వ్రేళ్ళు చెవులలో దూర్చుకొని బిగ్గరగా అజాన్ చెప్పాలి:

హజ్రత్ అబ్దుల్లా బిన్ జైద్ (రజి) కథనం: దైవప్రవక్త (స) నమాజ్ కోసం మొదట శంఖం ఊదడం ద్వారా ప్రజలను సమావేశపరచమని ఆదేశించారు. అయితే నేనొక రోజు రాత్రి ఓ కలగన్నాను. ఆ కలలో ఒకతను వచ్చి నా చుట్టూ తిరగసాగాడు. అతని చేతిలో శంఖం ఉంది. నేనతడ్ని "దైవదాసుడా! ఈ శంఖాన్ని అమ్ముతావా?" అని అడిగాను. దానికా వ్యక్తి "ఈ శంఖం తీసుకొని ఏం చేస్తావు?" అన్నాడు. "మేము దీంతో ప్రజలను నమాజ్ కోసం సమావేశపరుస్తాం" అన్నా నేను. "నేను దానికంటే మంచి పద్ధతి చెప్పనా" అన్నాడా వ్యక్తి. నేను "తప్పక చెప్పండి" అన్నాను. అప్పుడతను ఈవిధంగా చెప్పాడు:

"అల్లాహు అక్బర్ (అల్లాహ్ అందరికంటే గొప్పవాడు)- (4 సార్లు). అష్హదు అన్ల్లా ఇలాహ ఇల్లల్లాహ్ (అల్లాహ్ తప్ప మరే ఆరాధ్యదైవం లేడని నేను సాక్ష్యమిస్తున్నాను)- (2 సార్లు). అష్హదుఅన్న ముహమ్మదర్ రసూలుల్లాహ్ (ముహమ్మద్ దేవుని ప్రవక్త అని నేను సాక్ష్యమిస్తున్నాను)- (2 సార్లు). హయ్యు అలస్సలాహ్ (నమాజ్ కోసం రండి)- (2 సార్లు). హయ్యఅలల్‌ఫలాహ్ (సాఫల్యం వైపుకు రండి)- (2 సార్లు). అల్లాహు అక్బర్ (అల్లాహ్ అందరికంటే గొప్పవాడు)- (2 సార్లు). లాఇలాహ ఇల్లల్లాహ్ (అల్లాహ్ తప్ప మరే ఆరాధ్య దైవం లేడు)- (ఒకసారి)."

ఆ తర్వాత అతను కాస్త వెనక్కి జరిగి "నమాజ్ (జనం) నిలబడినప్పుడు ఇలా (ఇఖామత్) చెప్పండి" అంటూ ఈవిధంగా తెలియజేశాడు- "అల్లాహు అక్బర్ (2 సార్లు). అష్హదుఅన్ ల్లాఇలాహ ఇల్లల్లాహ్ (ఒకసారి). అష్హదుఅన్న ముహమ్మదర్ రసూలుల్లాహ్ (ఒకసారి). హయ్యఅలస్సలాహ్ (ఒకసారి). హయ్యఅలల్‌ఫలాహ్ (ఒకసారి). ఖద్‌ఖామతి స్సలాహ్ (నమాజ్ సిద్ధంగా ఉంది) (2 సార్లు). లాఇలాహ ఇల్లల్లాహ్ (ఒకసారి)."

మరునాడు ఉదయం నేను దైవప్రవక్త (స) సన్నిధికి వెళ్ళి నా కల గురించి తెలియ జేశాను. ఆయన ఈమాట విని "దైవచిత్తమయితే ఇది నిజమైన కల అవుతుంది. సరే, నువ్వు బిలాల్ (రజి) పక్కన నిల్చొని నీ కలలో విన్న మాటలు ఉచ్చరించు. బిలాల్ వాటిని విని బిగ్గారగా అజాన్ చెబుతాడు. అతని కంఠస్వరం నీ కంఠస్వరం కంటే పెద్దది" అని అన్నారు. నేను (నమాజ్ వేళ అయినప్పుడు) బిలాల్ (రజి) పక్కన నిలబడి అజాన్ పలుకులు పఠించి విన్పిస్తుంటే ఆయన బిగ్గరగా అజాన్ చెప్పసాగారు. హజ్రత్ ఉమర్ (రజి) ఈ అజాన్ విని ఉత్తరీయం ఈడుస్తూ వచ్చి "దైవప్రవక్తా! మీకు సత్యాన్నిచ్చి పంపిన శక్తిస్వరూపుని సాక్షిగా చెబుతున్నాను. రాత్రి నేను కూడా ఇలాంటి కలే గన్నాను" అన్నారు. దైవప్రవక్త (స) అప్పుడు దేవునికి కృతజ్ఞతలు తెలిపారు." (ముస్నద్ అహ్మద్)

"ఫజర్ వేళలో 'హయ్యి అలల్ ఫలాహ్' తరువాత "అస్సలాతు ఖైరుమ్ మినన్నౌమ్ (నిద్ర కంటే నమాజ్ శ్రేష్ఠమైనది)" అని 2 సార్లు పలకాలి." (అహ్మద్, అబూదావూద్)

"అజాన్ విన్న తరువాత ఈ (క్రింది) దుఆ చేసే వ్యక్తి (పరలోకంలో) నా సిఫారసు పొందడానికి హక్కుదారుడు అవుతాడని దైవప్రవక్త (స) అన్నారు."

"అల్లాహుమ్మ రబ్బ హాజిహిద్దావతి త్తామ్మతి వస్సలాతిల్ ఖాయిమతి ఆతి ముహమ్మదనిల్ వసీలత వల్‌ఫజీలత వబ్అస్‌హు మఖామమ్ మహ్మూద నిల్లజీ వఅద్‌త్తహు"

అర్థం: దేవా! ఈ పిలుపు, ఆహ్వానాల అధిపతీ! ప్రారంభం కాబోతున్న నమాజ్ (యొక్క) యజమానీ! ముహమ్మద్ (సల్లం)కు 'వసీలా' స్థానం ప్రసాదించు. ఆయనకు 'ఫజీలా' (దైవసాన్నిధ్య విశిష్ఠ స్థానం) అనుగ్రహించు. నీవు వాగ్దానం చేసిన 'కీర్తి స్థానం' కూడా ముహమ్మద్ (సల్లం)కు ప్రసాదించు. (బుఖారి, ముస్లిం)

దైవప్రవక్త (స) ప్రవచనం: "మీరు అజాన్ వింటున్నప్పుడు ముఅజ్జిన్ పలికే పలుకులే పలకండి." (బుఖారి)

హ్రజత్ అబూజుహైఫా (రజి) ఉల్లేఖనం: "నేను బిలాల్‌ని అజాన్ ఇస్తుండగా చూశాను. అప్పుడాయన తన చూపుడు వ్రేళ్ళను చెవులలో పెట్టుకున్నారు. 'హయ్యఅలస్సలాహ్, (హయ్యఅలల్ ఫలాహ్) అని పలికేటప్పుడు తన ముఖాన్ని కుడి, ఎడమల వైపుకు తిప్పేవారు." (అహ్మద్, తిర్మిజి, ఇబ్నెమాజ)

దైవప్రవక్త (స) బిలాల్ (రజి)ను ఇలా ఆదేశించారు: "అజాన్ బాగా ఆగిఆగి ఇవ్వు. ఇఖామత్ మాత్రం త్వరత్వరగా చెప్పు. అజాన్, ఇఖామత్‌ల మధ్య విరామం భోంచేసేవ్యక్తి భోజనం ముగించి సామూహిక నమాజ్‌లో పాల్గొన గలిగేంతగా ఉండాలి." (తిర్మిజి)

హ్రజత్ జాబిర్ (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ఇలా అన్నారు: "అజాన్, ఇఖామత్‌ల మధ్య ఉండే విరామ సమయంలో చేసే దుఆ త్రోసిపుచ్చబడదు." (నసాయి)

## అజాన్ వినేవారు ఏం చెప్పాలి?

హ్రజత్ ఉమర్ (రజి) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (స) ఈ విధంగా తెలియజేశారు: "ముఅజ్జిన్ అల్లాహుఅక్బర్ అన్నప్పుడు వినేవారు కూడా అలాగే పలకాలి. ముఅజ్జిన్ 'అష్‌హదుఅన్ ల్లాఇలాహ, అష్‌హదుఅన్న ముహమ్మదర్ రసూలుల్లాహ్' అన్నప్పుడు వినేవారు కూడా అలాగే పలకాలి. ముఅజ్జిన్ 'హయ్యి అలస్సలాహ్' అన్నప్పుడు వినేవారు 'లాహౌలా వలా ఖువ్వత ఇల్లాబిల్లాహ్' అని పలకాలి. ముఅజ్జిన్ 'హయ్యఅలల్ ఫలాహ్' అన్నప్పుడు వినేవారు మళ్ళీ 'లాహౌలా వలాఖువ్వత ఇల్లాబిల్లాహి' అని పలకాలి. ఆ తరువాత ముఅజ్జిన్ 'అల్లాహుఅక్బర్, అల్లాహుఅక్బర్, లాఇలాహ ఇల్లల్లాహ్' అన్నప్పుడు వినేవారు కూడా అవే పలుకులు పునరుద్ఘాటించాలి. వినేవారు మనస్ఫూర్తిగా విశ్వసించి చిత్తశుద్ధితో ఈవిధంగా పలికితే వారు స్వర్గప్రవేశం చేస్తారు." (ముస్లిం)

దైవప్రవక్త (స) ప్రవచనం: "ప్రళయదినాన అజాన్ పిలుపునిచ్చే వ్యక్తి మెడ అందరి మెడలకంటే పొడుగ్గా ఉంటుంది." (ఇది గౌరవప్రతిష్ఠలకు చిహ్నం కావచ్చు.)- (ముస్లిం)



సామూహిక నమాజ్‌లో భక్తులు బారులు తీరి నిలబడిన తరువాత "ఇఖామత్" చెప్పాలి. ఇఖామత్ పలుకులు కూడా దాదాపు అజాన్ పలుకుల్లాంటివే. కాకపోతే 'హయ్యఅలల్ ఫలాహ్' తరువాత "ఖద్‌ఖామతిస్సలాహ్ (నమాజ్ కోసం జమాఅత్ నిలబడింది)" అని 2 సార్లు చెప్పాలి.

హ్రజత్ అబ్దుల్లా బిన్ అమ్ర్ బిన్ ఆస్ ప్రకారం దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "మీరు అజాన్ వింటున్నప్పుడు ముఅజ్జిన్ పలికే పలుకులే పలకండి. తరువాత నా (శ్రేయస్సు) కోసం 'దరూద్' పఠించండి. నా కోసం ఒకసారి దరూద్ పఠించే వ్యక్తిపై దేవుడు పదిసార్లు తన కారుణ్యం అవతరింపజేస్తాడు. ఆ తరువాత నాకు 'వసీలా' ప్రసాదించమని దైవాన్ని ప్రార్థించండి. 'వసీలా' అనేది దేవుడు తన దాసులలో ఒక దాసునికి స్వర్గంలో ప్రసాదించే ఓ ప్రతేక స్థానం. ఆ స్థానం నాకు లభిస్తుందని నేను ఆశిస్తున్నాను. నాకు వసీలా (మఖామె మహ్మూద్) ప్రసాదించమని దైవాన్ని ప్రార్థించే వ్యక్తికి (పరలోకంలో) నా సిఫారసు తప్పనిసరి (వాజిబ్) అవుతుంది." (ముస్లిం)

హ్రజత్ అనస్ బిన్ మాలిక్ (రజి) ఇలా ఉల్లేఖిస్తున్నారు: "అజాన్, ఇఖామత్‌ల మధ్య చేసే దుఆ తిరస్కరించబడదు" అన్నారు దైవప్రవక్త (స). "అయితే దైవప్రవక్తా! అప్పుడు మేము ఏమని దుఆ చేయాలి?" అని అడిగాను నేను. దానికి ఆయన "ఇహపరలోకాలలో పాపమన్నింపు, సంక్షేమాలు ప్రసాదించమని దైవాన్ని ప్రార్థించండి" అని చెప్పారు. (తిర్మిజి)

హ్రజత్ జియాద్ బిన్ హారిస్ సదాయి (రజి) కథనం: తెల్లవారిన తరువాత దైవప్రవక్త (స) నన్ను అజాన్ చెప్పమని ఆదేశించారు. నేను అజాన్ చెప్పాను. ఈలోగా దైవప్రవక్త (స) ఉజూచేసి నమాజ్ చేయించడానికి సిద్ధమయ్యారు. అప్పుడు బిలాల్ (రజి) ఇఖామత్ చెప్పడానికి ముందుకు వచ్చారు. అయితే దైవప్రవక్త (స) (ఆయన్ని వారిస్తూ) "జియాద్ ఇఖామత్ చెప్పాలి. ఎవరు అజాన్ చెబుతాడో అతనే ఇఖామత్ కూడా చెప్పాలి" అన్నారు. (అహ్మద్, అబూదావూద్, తిర్మిజి, నసాయి, ఇబ్నెమాజ)

అజాన్ చెప్పిన మనిషే ఇఖామత్ కూడా చెప్పడం అభిలషనీయం మాత్రమే కాని, తప్పనిసరి కాదని అధికసంఖ్యాక పండితుల అభిప్రాయం.

హ్రజత్ అబూహురైరా (రజి) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "అజాన్ చెప్పడం ప్రారంభించగానే షైతాన్ వెనక్కి తిరిగి పలాయనం చిత్తగిస్తాడు. (తీవ్ర మైన భయాందోళనలతో) వాడికి అపానవాయువు వెడలుతుంది. దాంతో వాడు అజాన్ వినరానంత దూరం పారిపోతాడు. అయితే అజాన్ చెప్పడం అయిపోగానే వాడు మళ్ళీ (ప్రార్థనా స్థలానికి) చేరుకుంటాడు. ఇఖామత్ చెప్పగానే తిరిగి తోకముడిచి పారిపోతాడు. ఇఖామత్ చెప్పడం అయిపోగానే మళ్ళీవచ్చి మనిషి హృదయంలో దుష్టాలోచనలు రేకెత్తిస్తాడు. మనిషికి అంతకు ముందు గుర్తుకురాని విషయాలన్నిటినీ (నమాజ్ కోసం నిలబడగానే) గుర్తుచేస్తూ 'ఇది జ్ఞాపకం తెచ్చుకో, అది జ్ఞాపకం తెచ్చుకో' అని పురిగొల్పుతాడు. దాంతో మనిషికి (వాడి మాయాజాలంలో పడిపోయి) తాను ఎన్ని రకాతులు పఠించానన్న సంగతి కూడా జ్ఞాపకం ఉండదు." (బుఖారి)

## నమాజ్ వేళలు

ఇస్లాం సమయపాలనకు ఎంతో ప్రాముఖ్యం ఇచ్చింది. సమయపాలన మనిషి జీవితానికి క్రమశిక్షణ ఇస్తుంది. క్రమశిక్షణ మనిషిని విజయపథంలో నడిపిస్తుంది. నిర్ణీత కార్యం నిర్ణీత సమయంలో చేసినప్పుడే అది నిజమైన సమయపాలన (Punctuality) అన్పించుకుంటుంది. నిర్ణీత సమయం దాటిపోయన తరువాత చేసే పనిని 'ఖజా' అంటారు. ఇస్లాంలోని ఈ "సమయపాలనా శిక్షణ" నమాజ్ వేళలతో ప్రారంభమవుతుంది.

"సూర్యుడు వాలినప్పటి నుండి రాత్రి పొద్దుపోయే వరకు నమాజ్ వ్యవస్థ స్థాపించు. వేకువజామున కూడా ఖుర్ఆన్ పఠనం చేస్తూఉండు. వేకువజాము ఖుర్ఆన్ పఠనం (దైవదూతల) సాక్ష్యానికి కారణమవుతుంది." (ఖుర్ఆన్–17:78)

"నీ ప్రభువు ఔన్నత్యాన్ని ఘనంగా కీర్తిస్తూ ఆయన్ని స్మరిస్తూఉండు. సూర్యోదయానికి పూర్వం, సూర్యాస్తమయానికి ముందు, రాత్రి సమయాల్లో, పగటి వేళల్లో కూడా దైవస్మరణ చేస్తుండు. దానివల్ల నీవు బహుశా (భవిష్యత్తులో) సంతోషిస్తావు." (ఖుర్ఆన్–20:130)

హజ్రత్ జాబిర్ బిన్ అబ్దుల్లా (రజి) కథనం: "దైవదూత జిబ్రీల్ (అలై) దైవప్రవక్త (స) దగ్గరకు వచ్చి 'రండి, నమాజ్ చేయండి' అన్నారు. దైవప్రవక్త (స) ఈమాట విని సూర్యుడు వాలినప్పుడు జుహర్ నమాజ్ చేశారు. జిబ్రీల్ మళ్ళీ అసర్ వేళ వచ్చి 'రండి, నమాజ్ చేయండి' అన్నారు. దైవప్రవక్త (స) ఈమాట విని (ఎండలో) ప్రతి వస్తువు నీడ దానికి సమానంగా ఉన్నప్పుడు అసర్ నమాజ్ చేశారు. జిబ్రీల్ మళ్ళీ మగ్రిబ్ వేళ వచ్చి 'రండి, మగ్రిబ్ నమాజ్ చేయండి' అన్నారు. దైవప్రవక్త (స) ఈమాట విని సూర్యుడు పూర్తిగా అస్తమించినప్పుడు మగ్రిబ్ నమాజ్ చేశారు. జిబ్రీల్ మళ్ళీ ఇషా వేళ వచ్చి 'రండి, ఇషా నమాజ్ చేయండి' అన్నారు. దైవప్రవక్త (స) ఈమాట విని ఆకాశంలో అరుణిమ పూర్తిగా కనుమరుగైనప్పుడు ఇషా నమాజ్ చేశారు. జిబ్రీల్ మళ్ళీ ఫజర్ వేళ వచ్చి 'లేవండి, ఫజర్‌నమాజ్ చేయండి' అన్నారు. దైవప్రవక్త (స) ఈమాట విని ఉషోదయం వేళయినప్పుడు ఫజర్ నమాజ్ చేశారు.

దైవదూత జిబ్రీల్ (అలై) మరుసటి రోజు జుహర్ వేళ దైవప్రవక్త (స) దగ్గరకు వచ్చి 'రండి, నమాజ్ చేయండి' అన్నారు. దైవప్రవక్త (స) ఈమాట (ఎండలో) ప్రతి వస్తువు నీడ దానికి సమానంగా ఉన్నప్పుడు జుహర్ నమాజ్ చేశారు. జిబ్రీల్ మళ్ళీ అసర్ వేళ వచ్చి 'రండి, అసర్ నమాజ్ చేయండి' అన్నారు. దైవప్రవక్త (స) ఈమాట విని (ఎండలో) ప్రతి వస్తువు నీడ దానికి రెట్టింపు అయినప్పుడు అసర్ నమాజ్ చేశారు. జిబ్రీల్ మళ్ళీ మొదటి రోజు వచ్చిన మగ్రిబ్ వేళకే వచ్చి 'రండి, మగ్రిబ్ నమాజ్ చేయండి' అన్నారు. దైవప్రవక్త (స) ఈమాట విని సూర్యుడు పూర్తిగా అస్తమించినప్పుడు మగ్రిబ్ నమాజ్ చేశారు. జిబ్రీల్ మళ్ళీ ఇషా వేళ వచ్చి 'రండి, ఇషా నమాజ్ చేయండి' అన్నారు. దైవప్రవక్త (స) ఈమాట విని అర్ధరాత్రి లేక 2/3 వంతు రాత్రి వేళయినప్పుడు ఇషా నమాజ్ చేశారు. జిబ్రీల్ మళ్ళీ ఉదయం బాగా తెల్లవారిన వేళ వచ్చి 'లేవండి, ఫజర్ నమాజ్ చేయండి' అన్నారు. దైవప్రవక్త (స) ఫజర్ నమాజ్ చేశారు. ఆ తరువాత జిబ్రీల్ (అలై) 'నమాజ్ వేళ ఈ రెండిటి మధ్య మధ్య ఉంటుంది' అని చెప్పారు." (అహ్మద్, నసాయి, తిర్మిజి)



ఈ హదీస్‌ని గురించి ఇమామ్ బుఖారి (రహ్మలై) వ్యాఖ్యానిస్తూ "నమాజ్ వేళలకు సంబంధించిన హదీసులన్నిటిలో ఇదెంతో విశ్వసనీయమైన హదీస్" అని అన్నారు. నమాజ్ వేళల్లో దైవం ప్రసాదించిన ఈ సడలింపులు దాసుల సౌలభ్యం కోసమేగాని, విభేదాలలో పడి వేర్వేరు కుంపట్లు పెట్టుకొని కీచులాడుకోవడానికి కాదు.

హజ్రత్ అబ్దుల్లా బిన్ అమ్ర్ (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ఇలా తెలిపారు: "జుహర్ వేళ పొద్దువాలిన తరువాత ప్రారంభమయి, (ఎండలో) మనిషి నీడ అతనిఎత్తుకు సమానం అయ్యేవరకు, అసర్ వేళ ప్రారంభం కానంతవరకు ఉంటుంది. అసర్ వేళ సూర్యుడు ఎర్రబారనంతవరకు ఉంటుంది. మగ్రిబ్ వేళ (సూర్యాస్తమయం అయిన తరువాత) ఆకాశంలో ఎరుపుదనం పూర్తిగా కనుమరుగైపోనంత వరకు ఉంటుంది. ఇషా వేళ అర్ధరాత్రి కానంతవరకు ఉంటుంది. ఫజర్ వేళ ఉషోదయం నుండి ప్రారంభమై సూర్యోదయం కానంతవరకు ఉంటుంది. సూర్యుడు షైతాన్‌కు ఉండే రెండుకొమ్ముల మధ్యనుండి ఉదయిస్తాడు. అంచేత సూర్యోదయం కాగానే నమాజ్ ఆపేయండి." (ముస్లిం)

## విభేదాలు పక్కన బెట్టండి

మరో ఉల్లేఖనంలో "మనిషి నీడ రెట్టింపు అయ్యేవరకు జుహర్ వేళ ఉంటుంద"ని ఉంది. హనఫీ పండితులు ఈ ఉల్లేఖనం ఆధారంగానే నీడ రెట్టింపు పొడుగు అయిన తరువాతనే అసర్ వేళ ప్రారంభమవుతుందని నిర్ణయించారు. (బులూగుల్ మరాం)

హజ్రత్ అనస్ (రజి) కథనం: "మేము ఎండ తీవ్రంగా ఉన్నప్పుడు దైవప్రవక్త (స) వెనుక జుహర్‌నమాజ్ చేసేవాళ్ళం. అప్పుడు (ఎండతీవ్రత వల్ల) కొందరు తమ నుదుటిని నేల మీద ఆనించలేక గుడ్డ పరచుకొని దానిపై సజ్దా చేసేవారు." (బుఖారి)

హజ్రత్ అబూహురైరా (రజి) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "నరక జ్వలనం అధికమయినప్పుడు (ఇహలోకంలో) ఎండ తీవ్రమవుతుంది. అందువల్ల మీరు ఎండ తీవ్రమయినప్పుడు (కాస్త ఆలస్యం చేసి) వాతావరణం చల్లబడిన తరువాత (జుహర్) నమాజ్ చేయండి." (బుఖారి, ముస్లిం)

హజ్రత్ జాబిర్ బిన్ సమురా (రజి) ఉల్లేఖనం: "సూర్యుడు (నెత్తి మీద నుంచి) వాలుతున్నప్పుడు దైవప్రవక్త (స) జుహర్ నమాజ్ చేసేవారు." (ముస్లిం)

హజ్రత్ రాఫె బిన్ ఖదీజ్ (రజి) కథనం: "మేము దైవప్రవక్త (స)తో కలసి (పొద్దు చాలా ఉండగానే) అసర్ నమాజ్ చేసేవాళ్ళము. నమాజ్ ముగిసిన తరువాత మేము ఒంటెను కోసి దాని మాంసాన్ని పది భాగాలుగా విభజిస్తాము. ఆ మాంసాన్ని వండి సూర్యాస్తమయం కాక మునుపే తినేసేవాళ్ళము." (బుఖారి)

హజ్రత్ జాబిర్ బిన్ అబ్దుల్లా (రజి) ఉల్లేఖనం: కందకం యుద్ధంలో ఉమర్ బిన్ ఖత్తాబ్ (రజి) ఓరోజు సూర్యాస్తమయమైన తరువాత దైవప్రవక్త (స) సన్నిధికి వచ్చారు. ఆయన వచ్చిరాగానే ఖురైష్ బహుదైవారాధకులకు శాపనార్థాలు పెడుతూ "దైవప్రవక్తా! (వీరి మూలంగా) నేను సూర్యాస్తమయమవుతున్నా అసర్ నమాజ్ ఇంతవరకు చేయలేకపోయాను" అని అన్నారు. దానికి దైవప్రవక్త (స) "దైవసాక్షి! నేను కూడా చేయలేకపోయాను"

అని అన్నారు. ఆ తరువాత మేమంతా బుత్హాన్ అనే ప్రదేశానికి చేరుకొని ఉజూ చేశాం. అప్పుడు దైవప్రవక్త (స) సూర్యాస్తమయం అయిన తర్వాత అసర్ నమాజ్ (సామూహికంగా) చేశారు. ఆ తరువాత (వెంటనే) మగ్రిబ్ నమాజ్ చేశారు. (బుఖారి)

దైవప్రవక్త (స) ఇలా తెలిపారు: "ఎవరికి సూర్యాస్తమయానికి ముందు ఒక రకాత్ అసర్ నమాజ్ లభిస్తుందో అతనికి అసర్‌నమాజ్ అంతా లభించినట్లే." (బుఖారి, ముస్లిం)

దైవప్రవక్త (స) ప్రవచనం: "ఇది కపటవిశ్వాసి చేసే నమాజ్. అతను సూర్యాస్తమయం కోసం ఎదురుచూస్తూ కూర్చుంటాడు. సూర్యుడు షైతాన్ రెండుకొమ్ముల మధ్యకు వచ్చినప్పుడు అతను (గబగబా) లేచి టకటకా నాలుగు పోట్లు పొడుస్తాడు; దేవుడ్ని చాలా తక్కువగా స్మరిస్తాడు." (ముస్లిం, అహ్మద్, అబూదావూద్, తిర్మిజి, నసాయి)

హనఫీ పండితుల దృష్టిలో అసర్‌నమాజ్ ఆలస్యంగా చేయడం మంచిది. ఇమామ్ ముహమ్మద్ (రహ్మ) ఇలా అన్నారు: "అసర్ నమాజ్ సూర్యునిలో ఎర్రదనం రాకుండా బాగా ప్రకాశవంతంగా ఉన్నప్పుడు చేయడంకంటే ఆలస్యంగా చేయడమే మా దృష్టిలో శ్రేష్ఠమైనది. ప్రవక్త అనుచరులు ఇలాగే చేసినట్లు సాధారణ సూచనలు తెలుపుతున్నాయి. ఇమామ్ అబూహనీఫా (రహ్మ) అభిప్రాయం కూడా ఇదే." (మువత్తా-ఇమామ్ ముహమ్మద్)

దైవప్రవక్త (స) ఇలా తెలిపారు: "మగ్రిబ్ నమాజ్ వేళ సూర్యాస్తమయం అయిన దగ్గర్నుంచి (ఆకాశంలో) అరుణిమ కనుమరుగు కానంతవరకు ఉంటుంది." (ముస్లిం)

హజ్రత్ రాఫె బిన్ ఖదీజ్ (రజి) కథనం: "మేము దైవప్రవక్త (స)తో కలసి మగ్రిబ్ నమాజ్ చేసి (ఇండ్లకు) తిరిగివస్తుంటే (పూర్తిగా చీకటి పడేదికాదు.) మనిషి తన బాణం పడిన చోటును స్పష్టంగా చూడగలిగినంత వెలుగు ఉండేది." (బుఖారి)

హజ్రత్ అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి) కథనం: "ఓరోజు రాత్రి దైవప్రవక్త (స) ఇషా నమాజ్‌కు చాలా ఆలస్యంగా వచ్చారు. జనం (ఆయన కోసం ఎదురు చూసిచూసి చివరకు) నిద్రపోయారు. ఆ తరువాత మరో కునుకు తీశారు. ఈ పరిస్థితి చూసి ఉమర్ బిన్ ఖత్తాబ్ (రజి) లేచి "నమాజ్ (కోసం జనసమూహం) సిద్ధంగా ఉంద"ని దైవప్రవక్త (స)తో అన్నారు. దైవప్రవక్త (స) ఈమాట విని బయటకు వచ్చారు. ఆయన తల మీద చేయి పెట్టుకొని రాసాగారు. తలపై నుండి నీటిచుక్కలు రాలుతున్నాయి. ఆ దృశ్యం ఇప్పటికీ నా కళ్ళముందు మెదలుతోంది. ఆ తరువాత దైవప్రవక్త (స) అనుచరుల్ని ఉద్దేశించి "నా అనుచర సముదాయం ఇబ్బందులకు గురవుతుందన్న ఆలోచన నాకు కలగకపోయి ఉంటే, ఇలాగే (ప్రతిరోజూ ఆలస్యంగా) ఇషా నమాజ్ చేయాలని నేను ఆదేశించేవాడ్ని" అని అన్నారు. (బుఖారి)

## ఇషాలో ఆలస్యమే అమృతం

హజ్రత్ అబ్దుల్లా బిన్ జాబిర్ (రజి) కథనం: "దైవప్రవక్త (స) ఇషా నమాజ్ ఒక్కోసారి పెందలాడ చేసేవారు, ఒక్కోసారి ఆలస్యంగా చేసేవారు. జనమంతా వచ్చారని నిర్ధారణ అయితే నమాజ్ తొందరగా ప్రారంభించేవారు. ఆలస్యంగా వస్తున్నారనిపిస్తే కాస్సేపు ఆగి చేసేవారు. ఫజర్ నమాజ్ మాత్రం ఆయన చీకటి ఉండగానే చేసేవారు." (బుఖారి)



హజ్రత్ ఆయిషా (రజి) కథనం: "దైవప్రవక్త (స) వెనుక ఫజర్ నమాజ్ చేయడానికి స్త్రీలు దుప్పట్లు కప్పుకొని మసీదుకు వెళ్ళేవారు. నమాజ్ ముగిశాక వారు తమ ఇండ్లకు మరలేటప్పుడు బయట తమను ఎవరూ గుర్తించలేనంత చీకటిగా ఉండేది." (బుఖారి)

రాఫె బిన్ ఖదీజ్ (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ప్రవచనం: "ఫజర్ నమాజ్‌ను బాగా తెల్లవారబోతుందనగా చేయండి." (అబూదావూద్, తిర్మిజి, నసాయి, ఇబ్నెమాజ)

హనఫీదృక్పథం పండితులు ఈ హదీస్‌ను బట్టే ఫజర్ నమాజ్‌ను ఆఖరివేళలో చేయడం మంచిదని నిర్ణయించారు. కాగా హంబలీ, అహ్లెహదీస్ దృక్పథం పండితులు దీనికిముందు పేర్కొన్న హదీస్ ఆధారంగా బాగాచీకటి ఉండగానే ఫజర్‌వేళ అవుతుందని నిర్ణయించారు.

దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "సూర్యోదయానికి ముందే ఫజర్ (వేళ ఫరజ్) నమాజ్‌లోని ఒక రకాత్ పూర్తిచేసేవాడు (మొత్తం) ఫజర్ నమాజ్‌ను నెరవేర్చిన వాడవుతాడు. అలాగే సూర్యాస్తమయానికి పూర్వమే అసర్(వేళ ఫరజ్) నమాజ్‌లోని ఒక రకాత్ పూర్తి చేసేవాడు (మొత్తం) అసర్ నమాజ్‌ను నెరవేర్చిన వాడవుతాడు." (బుఖారి, ముస్లిం)

దైవప్రవక్త (స) ప్రవచనం: "జమాఅత్ నమాజ్ చేయడానికి నిలబడినప్పుడు ఫరజ్ నమాజ్ తప్ప మరెలాంటి నమాజ్ లేదు." (అబూహురైరా- ముస్లిం, నసాయి, ఇబ్నెమాజ)

దైవప్రవక్త (స) ప్రవచనం: "ఫజర్ (వేళ ఫరజ్ నమాజ్) తరువాత కేవలం రెండు రకాతుల సున్నత్ నమాజ్ తప్ప మరెలాంటి నమాజ్ లేదు." (బుఖారి, ముస్లిం, తిర్మిజి)

హజ్రత్ ఇబ్నెమస్వూద్ (రజి) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "తొలి వేళ చేసే నమాజే ఆచరణలన్నిటిలో శ్రేష్ఠమైనది."

ఒకదాన్ని మించిన మరొకటి శ్రేష్ఠమైన పుణ్యకార్యాలున్నాయని మరికొన్ని హదీసులు చెబుతున్నాయి. ఇక్కడ ఈ హదీస్‌లో నమాజ్‌పట్ల ముస్లింలలో అత్యధిక ఆసక్తి, ఉత్సాహాలు కల్గించడానికి తొలివేళ చేసే నమాజ్‌ను అన్నిటికంటే శ్రేష్ఠమైన ఆచరణ అని చెప్పడం జరిగింది.)

## నమాజ్ నిషిద్ధ వేళలు

హజ్రత్ అబూసయీద్ (రజి) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "అసర్ నమాజ్ చేసిన తరువాత సూర్యాస్తమయం అయ్యేవరకు మరెలాంటి నమాజ్ లేదు. అలాగే ఫజర్ నమాజ్ చేసిన తరువాత సూర్యోదయం అయ్యేవరకు మరెలాంటి నమాజ్ లేదు." (బుఖారి, ముస్లిం)

హజ్రత్ ఉఖబా బిన్ ఆమిర్ (రజి) కథనం: "దైవప్రవక్త (స) మమ్మల్ని మూడు సమయాల్లో నమాజ్ చేయకూడదని, శవాన్ని ఖననం చేయకూడదని వారించారు. 1-సూర్యుడు ఉదయిస్తున్నప్పుడు, 2-మిట్టమధ్యాహ్నం సూర్యుడు నెత్తిమీద ఉన్నప్పుడు, 3-సూర్యుడు అస్తమిస్తున్నప్పుడు." (ముస్లిం, అహ్మద్, అబూదావూద్, ఇబ్నెమాజ)

హజ్రత్ అబూహురైరా (రజి) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "మీలో ఎవరికైనా సూర్యుడు అస్తమించక ముందే అసర్ నమాజ్‌లోని ఒక సజ్దా (అంటే ఒక రకాత్) లభిస్తే అతను పూర్తి నమాజ్ నెరవేర్చుకోవాలి. అలాగే ఎవరికైనా సూర్యుడు

ఉదయించక ముందే ఫజర్ నమాజ్‌లోని ఒక సజ్దా (అంటే ఒక రకాత్) లభిస్తే అతను పూర్తి నమాజ్ నెరవేర్చుకోవాలి." (బుఖారి, తిర్మిజి)

హజ్రత్ అబూఖతాదా (రజి) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "నిద్రావస్థలోనే మినహాయింపు ఉంది. మేల్కొనివున్న స్థితిలో మినహాయింపు లేదు. కనుక మీలో ఎవరైనా నమాజ్ చేయడం మరచిపోతే లేదా నిద్రపోతే జ్ఞాపకం రాగానే (లేదా మేల్కొనగానే) ఆ నమాజ్ నెరవేర్చుకోవాలి." (తిర్మిజి, నసాయి)

## అయిదువేళల నమాజుల్లోని రకాతులు

ఫజర్ వేళలో మొదట 2 రకాతులు సున్నత్ (ముఅక్కిదా) ఉంది. దైవప్రవక్త (స) ఈ సున్నత్ నమాజ్‌కు ఎంతో ప్రాముఖ్యం ఇచ్చారు. అందువల్ల నమాజీలు దీన్ని ఎట్టి పరిస్థితిలోనూ వదలకూడదు. రెండు రకాతుల సున్నత్ తరువాత 2 రకాతులు ఫరజ్ నమాజ్ చేయాలి.

దైవప్రవక్త (స) ఇలా తెలిపారు: "ఫజర్ నమాజ్‌లోని రెండు రకాతులు (అంటే సున్నత్ నమాజ్) ప్రపంచంకన్నా, ప్రపంచంలోని దానికన్నా ఎంతో శ్రేష్ఠమైనవి." (ముస్లిం)

హజ్రత్ ఆయిషా (రజి) కథనం: "దైవప్రవక్త (స) నఫిల్ (ఐచ్ఛిక) నమాజ్‌లలో అన్నిటికంటే ఫజర్ వేళ సున్నత్ నమాజ్ పట్ల ఎక్కువ శ్రద్ధవహించేవారు." (బుఖారి)

హజ్రత్ అబూహురైరా (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ఇలా అన్నారు: "మనిషి నిద్ర పోతున్నప్పుడు షైతాన్ అతని ముచ్చులిగుంటపై మూడు ముళ్ళు వేస్తాడు. 'రాత్రి ఇంకాచాలా ఉంది, హాయిగా పడుకో' అంటూ ప్రతి ముడిపై మంత్రించి ఊదుతాడు. ఆ మనిషి రాత్రి మేల్కొని దైవస్తుతి చేస్తే ఒక ముడి విడిపోతుంది. లేచి ఉజూ కూడా చేస్తే రెండవ ముడి విడిపోతుంది. తెల్లవారుజామున (ఫజర్ నమాజ్ కోసం) మేల్కోగానే (మూడవ ముడి విడిపోతుంది.) ఎంతో పావన హృదయుడవుతాడు. దీనికిభిన్నంగా రాత్రి తెల్లవారేదాకా పడుకున్న మనిషి ఉదయం ఎంతో బద్ధకస్తుడై, పైశాచిక మనస్కుడై లేస్తాడు." (బుఖారి)

హజ్రత్ అబ్దుల్లా బిన్ మస్‌వూద్ (రజి) కథనం: (నమాజ్ చేయకుండా) తెల్లవారేదాకా పడుకునే మనిషి గురించి దైవప్రవక్త (స) ముందు ప్రస్తావించినప్పుడు "అలాంటి మనిషి చెవిలో షైతాన్ మూత్రం పోస్తాడు" అని అన్నారు ఆయన. (బుఖారి)

జుహర్ వేళలో మొదట 4 రకాతులు సున్నత్ (గైర్‌ముఅక్కిదా) నమాజ్ చేయాలి. ఆ తర్వాత 4 రకాతులు ఫరజ్ నమాజ్ చేయాలి. ఫరజ్ తర్వాత 2 రకాతులు సున్నత్ (ముఅక్కిదా) నమాజ్ చేయాలి. ఆ తరువాత ఇష్టమైనవారు 2 రకాతులు నఫిల్ నమాజ్ చేయవచ్చు.

హజ్రత్ ఉమ్మెహబీబా (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ప్రవచనం: "జుహర్ (నమాజ్) లోని మొదటి నాలుగు (సున్నత్) రకాతుల్ని పరిరక్షించే, తరువాతి నాలుగు (సున్నత్) రకాతుల్ని (లేదా రెండు సున్నత్, రెండు నఫిల్ రకాతుల్ని) సక్రమంగా పఠించే వ్యక్తి కోసం దేవుడు నరకాగ్నిని నిషేధించాడు." (అహ్మద్, అబూదావూద్, తిర్మిజి)

అసర్‌వేళలో 4 రకాతులు ఫరజ్ నమాజ్ చేయాలి. ఫరజ్ నమాజ్‌కు పూర్వం ఇష్టమైన వారు 4) రకాతులు సున్నత్ నమాజ్ చేయవచ్చు. దీన్ని 'సున్నతె గైర్‌ముఅక్కిదా' అంటారు. ఇది ఐచ్ఛికమైన సున్నత్ నమాజ్. అంటే చేస్తే పుణ్యం, చేయకపోతే పాపం లేదు.



హజ్రత్ ఇబ్నెఉమర్ (రజి) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "ఎవరు అసర్ నమాజ్ పోగొట్టుకుంటాడో (అంటే ఖజా చేస్తాడో) అతని ఇల్లు, సంపద, సామగ్రి సర్వం నాశనమయిపోయినట్లే." (బుఖారి, ముస్లిం)

హజ్రత్ ఇబ్నెఉమర్ (రజి) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "అసర్ (ఫరజ్) నమాజ్‌కు ముందు నాలుగు రకాతులు (సున్నత్) నమాజ్ చేసిన వ్యక్తిని దేవుడు కరుణించుగాక!" (అహ్మద్, అబూదావూద్, తిర్మిజి)

మగ్రిబ్‌వేళ ముందుగా 3 రకాతులు ఫరజ్ నమాజ్ చేయాలి. తరువాత 2 రకాతులు సున్నత్. ఆ తరువాత ఇష్టమైనవారు 2 రకాతులు నఫిల్ నమాజ్ కూడా చేయవచ్చు. అహ్లెహదీస్ నమాజీలు ఫరజ్‌కు ముందు 2 రకాతులు 'తహ్యాతుల్‌మస్జిద్' నమాజ్ కూడా చేస్తారు. ఇది ఐచ్ఛికమైన సున్నత్ నమాజ్. ఇష్టమైతే చేయవచ్చు, లేకుంటే వదిలేయవచ్చు.

హజ్రత్ అనస్ (రజి) కథనం: "మేము సూర్యాస్తమయం అయిన తరువాత (ఫరజ్ నమాజ్‌కు ముందు) రెండు రకాతులు (సున్నత్ నమాజ్) చేసేవారము. ఆ సమయంలో దైవప్రవక్త (స) మమ్మల్ని గమనిస్తూనే ఉండేవారు. అయితే ఆయన ఈ నమాజ్ చేయండి అనిగాని, చేయవద్దు అనిగాని చెప్పేవారు కాదు." (ముస్లిం)

ఇషా నమాజ్‌లో మొదట 4 రకాతులు ఫరజ్ నమాజ్ చేయాలి. తరువాత 2 రకాతులు సున్నత్, 3 రకాతులు వితర్ నమాజ్ చేయాలి. ఫరజ్ నమాజ్‌కు ముందు ఇష్టమైనవారు 4 రకాతులు సున్నత్ (గైర్‌ముఅక్కిదా) నమాజ్ చేయవచ్చు. లేకుంటే వదిలేయవచ్చు. అలాగే ఫరజ్ నమాజ్ ముగిశాక రెండు రకాతుల సున్నత్ నమాజ్ తరువాత 2 రకాతులు నఫిల్ నమాజ్ కూడా చేయవచ్చు.

హజ్రత్ అబూమూసా అష్‌అరి (రజి) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "రెండు చల్లని వేళల్లో చేయవలసిన (ఫజర్, అసర్) నమాజులు (ప్రతి రోజూ క్రమం తప్పకుండా) చేసే మనిషి స్వర్గంలో ప్రవేశిస్తాడు." (బుఖారి)

హజ్రత్ ఖారిజా బిన్ హుజాఫా (రజి) ఉల్లేఖనం: "దేవుడు (మీరుచేసే) ఒక నమాజ్ ద్వారా మీకు సహాయం చేశాడు. ఆ సహాయం మీ కోసం ఎర్ర ఒంటెల కంటే కూడా ఎంతో శ్రేష్ఠమైనది" అని చెప్పారు దైవప్రవక్త (స). దానిపై మేము "ఆ నమాజ్ ఏదీ దైవ ప్రవక్తా!" అని అడిగాము. దానికి ఆయన "వితర్. అది ఇషా, ఫజర్ (వేళ)ల మధ్య ఉంది" అని తెలియజేశారు. (బుఖారి)

విశ్వాసుల మాతృమూర్తి హజ్రత్ ఉమ్మెహబీబా (రజి) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (స) ఇలా తెలిపారు: "రేయింబవళ్ళలో జుహర్ (ఫరజ్‌నమాజ్)కు ముందు 4 రకాతులు, తర్వాత 2 రకాతులు, మగ్రిబ్ (ఫరజ్) నమాజ్ తర్వాత 2 రకాతులు, ఇషా (ఫరజ్‌నమాజ్) తర్వాత 2 రకాతులు, ఫజర్ (ఫరజ్) నమాజ్‌కు ముందు 2 రకాతులు సున్నత్ నమాజ్ చేసే మనిషి కోసం దేవుడు స్వర్గంలో ఒక మహల్ నిర్మిస్తాడు." (తిర్మిజి)

హజ్రత్ అబూఅయ్యూబ్ అన్సారీ (రజి) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (స) ఇలా తెలిపారు: "వితర్ ప్రతి ముస్లింపై ఉన్న హక్కు. (అంటే వితర్ నమాజ్ నెరవేర్చవలసిన

బాధ్యత ప్రతి ముస్లింపై ఉంది). వితర్ నమాజ్ 5 రకాతులు చేయదలచినవారు అలాగే చేయాలి; 3 రకాతులు చేయదలచినవారు ఆ మేరకే చేయవచ్చు; 1 రకాత్ మాత్రమే చేయదలచుకున్నవారు ఆ ప్రకారమే చేయవచ్చు." (బుఖారి, ముస్లిం)

## 17. నమాజ్‌కు ముందు జాగ్రత్తలు

మన నమాజ్ సక్రమంగా నెరవేరాలంటే నమాజ్‌కు ముందు ఎన్నో విషయాల్ని పరిగణన లోకి తీసుకోవలసిఉంటుంది. చాలామంది ఉజూ, వస్త్రధారణ, స్థల శుభ్రతలే కదా అను కుంటారు. కాని వీటితోపాటు ఇంకా అనేక విషయాల్ని గురించి తెలుసుకోవలసి ఉంటుంది. మరెన్నో జాగ్రత్తలు తీసుకోవలసి ఉంటుంది. ఇస్లామీయ ఆరాధనకు, ఇస్లామేతర ఆరాధనకు చాలా వ్యత్యాసం ఉంది. ముఖ్యంగా ఓ మౌలిక వ్యత్యాసం ఉంది. ఇస్లామేతర ఆరాధనల్లో పూజాపురస్కారాల భావం మాత్రమే ఉంది. కాని ఇస్లామీయ ఆరాధనల్లో విధేయత, సమర్పణ భావాలు ఉన్నాయి. ముస్లింలు ఈ మౌలిక విషయాన్ని ఎల్లప్పుడూ గుర్తుంచుకోవాలి.

ఇస్లాంలో దేవుడు జారీచేసిన ప్రతి ఆజ్ఞను శిరసావహించడం, ఆయన ప్రవక్త (సల్లం) పాటించిన ప్రతి సంప్రదాయాన్ని ఆచరించడమే సరైన, సంపూర్ణ దైవారాధన అవుతుంది. దేవుని పట్ల, దైవప్రవక్త (స) పట్ల విధేయత చూపండని ఖుర్‌ఆన్ ఆదేశించింది. తాను ఇచ్చేదానిని స్వీకరించి, తాను వారిస్తున్న దాని జోలికి పోకండని దైవప్రవక్త (స) ఉపదేశించారు.

నమాజ్‌లో ఏకాగ్రత చాలా ముఖ్యం. మనస్సును ఎంత అదుపులో ఉంచుకోవడానికి ప్రయత్నించినా నమాజ్ చేస్తున్నప్పుడే షైతాన్ ఏవేవో విషయాలు గుర్తుచేసి మన ఏకాగ్రతను చెడగొట్టడానికి ప్రయత్నిస్తాడు. ఇది మనస్సుకు సంబంధించిన విషయం. ఇక భౌతికపరమైన విషయాలు కూడా ఉన్నాయి. వాటి కోసం ఈ క్రింది హదీస్ చూడండి:

దైవప్రవక్త (స) ప్రవచనం: "భోజనం సిద్ధంగా ఉన్నప్పుడు, (మలమూత్రవిసర్జన) అవసరం ఏర్పడినప్పుడు నమాజ్ చేస్తే ఆ నమాజ్ నెరవేరదు." (ముస్లిం)

### వస్త్రధారణ

"ఆదం సంతానమా! మీరు మీ మర్మావయవాలను కప్పుకోవడానికి, మీ దేహానికి రక్షణగా, అలంకరణగా ఉపయోగపడటానికి మేము మీకు దుస్తులు ప్రసాదించాము. అయితే అన్నిటికంటే భయభక్తుల దుస్తులే ఎంతోశ్రేష్ఠమైనవి. ఇది దేవుని సూచనల్లో ఒక సూచన. మీరు విషయం గ్రహిస్తారని (ఇలా తెలుపుతున్నాం)." (ఖుర్‌ఆన్-7:26)

హ్జరత్ అబూహురైరా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "ఒక్క వస్త్రం మాత్రమే ఉండి దాంతో నమాజ్ చేయదలచిన మనిషి (భుజాల మీద) (కాస్తయినా) ఆచ్ఛాదన లేకుండా నమాజ్ చేయకూడదు." (బుఖారి)

హ్జరత్ ఉమర్ బిన్ అబూసల్మా కథనం: "నేనొక సారి విశ్వాసుల మాతృమూర్తి ఉమ్మెసల్మా (రజి) ఇంట్లో దైవప్రవక్త (స) ఒక బట్ట మాత్రమే కట్టుకొని నమాజ్ చేస్తుంటే చూశాను. అప్పుడా వస్త్రం చెరుగులు ఆయన భుజాల మీద ఉన్నాయి." (బుఖారి)

హ్జరత్ జాబిర్ (రజి) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "వస్త్రం పెద్దదిగా, పొడవుగా ఉంటే (నమాజ్ ప్రారంభానికి ముందు) దాన్ని (దేహానికి)



బాగా చుట్టుకోండి." (బుఖారి); ముస్లింలోని ఉల్లేఖనంలో ఇలా ఉంది: "వస్త్రం పొడుగ్గా ఉంటే దాని అంచుల్ని రెండు భుజాల మీద ఉండేలా వేసుకోండి. ఒకవేళ వస్త్రం చిన్నదిగా, కురచగా ఉంటే లుంగీ మాదిరిగా కట్టుకోండి." (ముస్లిం)

ఇమామ్ అబూహనీఫా, ఇమామ్ షాఫయి (రహ్మలై), ఇమామ్ మాలిక్ (రహ్మలై)ల అభిప్రాయం ప్రకారం భుజాలమీద బట్ట లేకుండా నమాజ్ చేస్తే ఆ నమాజ్ అవాంఛనీయం (మక్రూహ్) అవుతుంది. అయితే బాతిల్ (చెడిపోవడం) మటుకు కాదు. ఇమామ్ అహ్మద్ (రహ్మ) అభిప్రాయం ప్రకారం అవకాశం ఉన్నప్పటికీ భుజాల మీద వస్త్రం లేకుండా నమాజ్ చేయడం సరికాదు. దానివల్ల నమాజ్ విధి నెరవేరుతుందిగాని, అలాచేయడం పాపం అవు తుంది. ఈనాటి ప్రజలకు అలాంటి పరిస్థితి లేదు గనక వారు సాధ్యమైనంతవరకు నిండు దుస్తులతో నమాజ్ చేయడమే మంచిది.

తలపై టోపీ లేదా మరేదైనా ఆచ్ఛాదన లేకుండా నమాజ్ చేయడం ధర్మసమ్మ తమేనని తెలుస్తోంది. ఈ విషయాన్ని హ్జరత్ అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి) ఉల్లేఖించిన కథనం సమర్థిస్తోంది. ఆయన ఇలా అన్నారు: "దైవప్రవక్త (స) కొన్ని సందర్భాలలో తలపై ఎలాంటి ఆచ్ఛాదన లేకుండా నమాజ్ చేసేవారు." (ఇబ్నె అసాకర్)

హనఫీ దృక్పథం ప్రకారం బద్ధకం కారణంగా తలపై ఆచ్ఛాదన లేకుండా నమాజ్ చేయడం అవాంఛనీయం (మక్రూహ్). భయభక్తులతో, ఏకాగ్రతతో నమాజ్ చేస్తుంటే తలపై ఆచ్ఛాదన లేకపోయినా ధర్మసమ్మతమవుతుంది.

హ్జరత్ సమూరా (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ఇలా అన్నారు: "తెల్ల బట్టలు ధరించండి. అవి ఎంతో పరిశుద్ధంగా, పరిశుభ్రంగా ఉంటాయి. మీలో చని పోయినవారి మృతదేహాలకు వాటితోనే వస్త్రసంస్కారం చేయండి." (నసాయి, హాకిమ్)

హ్జరత్ బరా బిన్ ఆజిబ్ (రజి) కథనం: "దైవప్రవక్త (స) మరీఅంత పొడవరి కాదు, మరీఅంత పొట్టివారూ కాదు. మధ్యస్థంగా ఉంటారు. నేనొక సారి ఆయన్ని ఎరుపు రంగు దుస్తులు ధరించి ఉండగా చూశాను. అప్పుడు ఆయనలో ఉన్న సౌందర్యం నేను మరే వస్తువులోనూ చూడలేదు." (బుఖారి, ముస్లిం)

హ్జరత్ అబూరిమ్సా రిఫాఆ తైమీ (రజి) కథనం: "నేనొక సారి దైవప్రవక్త (స) వంటిపై రెండు ఆకుపచ్చ రంగు వస్త్రాలు చూశాను." (అబూదావూద్, తిర్మిజి)

హ్జరత్ జాబిర్ (రజి) కథనం: "మక్కా విజయం రోజు దైవప్రవక్త (స) మక్కాలో ప్రవేశించినప్పుడు ఆయన నలుపు రంగు తలపాగా ధరించి ఉన్నారు." (ముస్లిం)

హ్జరత్ ఆయిషా (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ప్రవచనం: "పుష్పవతి అయిన యువతి ఓణీ ధరించేదాకా దేవుడు ఆమె నమాజ్‌ను స్వీకరించడు." (బుఖారి)

హ్జరత్ ఉమ్మెసలమా (రజి) కథనం: నేను "ఏ స్త్రీ అయినా నడుము బట్ట (పరికిణి, పైజామా, చీర వగైరా) లేకుండా కేవలం చొక్కా, ఓణి ధరించి నమాజ్ చేయ వచ్చా?" అని దైవప్రవక్త (స)ను అడిగాను. దానికి ఆయన చెప్పారు: "చొక్కా ఆమె పాదాల దాకా ఉంటే అలాంటి బట్ట ధరించడం ధర్మసమ్మతమే." (అబూదావూద్)

## ఖిబ్లా (ఆరాధనా దిశ)

"మీరు ఏప్రాంతానికి వెళ్ళినా అక్కడ్నుంచి ప్రతిష్ఠాలయం వైపుకే తిరిగి ప్రార్థన చేయండి. నిస్సందేహంగా ఇది మీప్రభువు నుండి వచ్చిన సత్యం." (ఖుర్ఆన్-2:149)

హజ్రత్ బరా బిన్ఆజిబ్ (రజి) కథనం: "మేము దైవప్రవక్త (స) వెనుక (మదీనాలో) పదహారు పదిహేడు నెలలదాకా బైతుల్‌మఖ్దిస్ వైపుకు తిరిగి నమాజ్ చేశాం. ఆ తర్వాత ప్రస్తుత ఖిబ్లా (కాబా) వైపుకు తిరిగి నమాజ్ చేయాలని ఆజ్ఞయింది." (ముస్లిం)

హజ్రత్ ఆమిర్ బిన్ రబిఆ (రజి) కథనం: "ఓరోజు చీకటి రాత్రివేళ మేము దైవ ప్రవక్త (స) వెంట ఉన్నాము. అప్పుడు మాకు 'ఖిబ్లా' దిశను నిర్ధారించడం చాలా కష్టమై పోయింది. అందువల్ల (అంచనాతో ఒక దిశను నిర్ధారించుకొని) నమాజ్ చేశాము. అయితే సూర్యోదయంఅయిన తర్వాత మేము నిర్ధారించుకున్న ఖిబ్లాదిశ సరైనది కాదని, వేరేదిశకు తిరిగి నమాజ్ చేశామని అర్థమయింది. అప్పుడీ ఖుర్ఆన్‌సూక్తి అవతరించింది- 'తూర్పు, పడమరలన్నీ అల్లాహ్‌కు చెందినవే. (నమాజ్ కోసం) మీరు ఏదిక్కుకు మరలితే ఆ దిక్కుకే ఆయన ఉంటాడు. దేవుడు సర్వోపగతుడు, సర్వజ్ఞుడు. (2:115)" (తిర్మిజి)

హజ్రత్ ఆమిర్ బిన్ రబిఆ (రజి) కథనం: "నేను ఓసారి దైవప్రవక్త (స)ను ఒంటె మీద (కూర్చొని ప్రయాణం చేస్తూ) నమాజ్ చేస్తుంటే చూశాను. అప్పుడాయన ఒంటె ఏ దిశకు తిరిగి నడుస్తున్నా నమాజ్ చేస్తూనే ఉండేవారు." (బుఖారి, ముస్లిం)

దేవుడు ప్రతిచోటా ఉన్నాడు. అయితే ముస్లింలు ఏప్రాంతంలో ఉన్నా కాబా వైపుకే తిరిగి నమాజ్ చేయాలన్నది దైవాజ్ఞ. ఇది ప్రపంచ ముస్లింల సమైక్యతకు, క్రమశిక్షణకు ఒక సూచన. అయితే కాబా ఏ వైపుందో తెలియనప్పుడు ఏదో ఒకదిశకు తిరిగి నమాజ్ చేయడం తప్పు కాదని కూడా పైహదీసుల ద్వారా తెలుస్తోంది. అలాగే వాహనప్రయాణం చేస్తున్నప్పుడు కూడా వీలున్న దిశకు తిరిగి నమాజ్ చేయవచ్చు. అయితే దైవధర్మంలో అసలు విషయం సత్కార్యాలు చేయడంలో పోటీపడాలని దేవుడు ముస్లింలను ఇలా ఆదేశిస్తున్నాడు:

"మీ ముఖాలు తూర్పు లేక పడమరకు తిప్పుకోవడమే పుణ్యకార్యం కాదు. దేవుణ్ణి, అంతిమదినాన్ని, దైవదూతలను, దేవుడు పంపిన (అంతిమ)గ్రంథాన్ని, ఆయన ప్రవక్తలను హృదయపూర్వకంగా విశ్వసించి, దేవుని మీది ప్రేమాభిమానాలతో మీకత్యంత ప్రియమైన ధనాన్ని బంధువుల కోసం, అనాథలకోసం, నిరుపేదల కోసం, బాటసారుల కోసం, సహాయార్థుల కోసం, బానిసల విముక్తి కోసం ఖర్చుచేయాలి; ప్రార్థనావ్యవస్థ నెలకొల్పాలి; జకాత్ చెల్లించాలి; ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి; కష్టకాలంలో, (సత్యాసత్యాల మధ్య జరిగే) పోరాటంలో సహనం వహించాలి. ఇలాంటి సత్కార్యాలు చేసేవారే సన్మార్గగాములు. వారే (దేవునిపట్ల) భయభక్తులు కలిగినవారు." (ఖుర్ఆన్-2:177)

## పంక్తులు ఎలా ఉండాలి?

నమాజ్‌లో పంక్తులు ఏమాత్రం వంకర లేకుండా తిన్నగా ఉండాలి. పంక్తి మధ్య ఎలాంటి సందులు ఉండకూడదు. ముందు వరుసలో ఖాళీ ఉన్నప్పటికీ వెనుక వరుసలో ఒంటరిగా నిలబడకూడదు.



హజ్రత్ వాబిసా బిన్ మాబద్ (రజి) కథనం: "ఒకతను (ముందు) వరుసలో చోటున్నా వెనుక వరుసలో ఒంటరిగా నిలబడి నమాజ్ చేయసాగాడు. దైవప్రవక్త (స) అది చూసి, అతడ్ని నమాజ్ మళ్ళీ చేయాలని ఆదేశించారు." (అహ్మద్, తిర్మిజి)

హజ్రత్ అనస్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "మీ పంక్తులను (వంకర టింకరగా లేకుండా) తిన్నగా ఉంచుకోండి. పంక్తులను తీర్చిదిద్దడం నమాజ్ (వ్యవస్థ)కు పరిపూర్ణత నివ్వడంలో ఒక భాగమయి ఉంది." (బుఖారి)

హజ్రత్ అనస్ (రజి) కథనం: "మీ పంక్తులను (వంకరటింకరగా లేకుండా) తిన్నగా ఉంచుకోండి. మీరు నా వెనుక నిల్చున్నప్పుడు కూడా నేను మిమ్మల్ని చూడగలను" అన్నారు దైవప్రవక్త (స). "(ఈ ఆదేశం ప్రకారం) మాలో ప్రతిఒక్కడూ (నమాజ్‌లో) భుజానికి భుజం, పాదానికి పాదం కలిపేవాడు." (బుఖారి)

నమాజ్‌లో హనఫీ దృక్పథంగల ముఖ్తదీలు భుజానికి భుజం కలిపి నిలబడతారు. అహ్లెహదీస్ దృక్పథంగల ముఖ్తదీలు పాదానికి పాదం కలిపి నిలబడతారు. పైహదీసు వెలుగులో పరిశీలిస్తే ఈ రెండు పద్ధతులు కూడా సరయినవి కావని చెప్పవచ్చు.

హదీస్‌లోని అసలు విషయం పాదానికి పాదం కలిపి నిల్చోవడమో లేక భుజానికి భుజం కలిపి నిల్చోవడమో అని కాదు. పంక్తి వంకరటింకర లేకుండా తిన్నగా, మనిషికి మనిషికి మధ్య ఖాళీలేకుండా పటిష్ఠంగా సైనిక పంక్తిలా ఉండాలన్నదే అసలు విషయం. దీన్ని విస్మరించి వాదులాడుకోవడం అనైక్యతకు ఊపిరిపోయడమే అవుతుంది. సైనిక పంక్తిని గురించి ఖుర్ఆన్ ఆదేశం కూడా ఇక్కడ పేర్కొనడం సందర్భోచితంగా ఉంటుంది.

"దేవుడు తన మార్గంలో పంక్తులు తీరి దృఢమైన కాంక్రీటు గోడలా స్థిరంగా నిలచి పోరాడేవారినే ప్రేమిస్తాడు." (ఖుర్ఆన్-61:4)

గోడలు దృఢంగా ఉంటేనే ఇల్లు నాలుగు కాలాలపాటు సురక్షితంగా మనగలుగుతుంది. బలహీనమైన గోడలు తొందరగా పడిపోతాయి. ఇక నెర్రలు (పగుళ్ళు) పడిన గోడలయితే ఇల్లు ఏక్షణాన్నయినా కుప్పకూలిపోక తప్పదు. నెర్రల్ని గురించి ఈ హదీసులు చూడండి:

హజ్రత్ అనస్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (స) ఇలా చెప్పారు: "మీ పంక్తుల్ని (అంటే బారులు తీరి నిలబడిన భక్తుల్ని) కలిపి ఉంచండి. పంక్తుల మధ్యను (ఖాళీ లేకుండా) దగ్గరకు చేర్చండి. మీ మెడలు సరిగా ఉంచుకోండి. నా ప్రాణం ఎవరి అధీనంలో ఉందో ఆ శక్తిస్వరూపుని సాక్షి! షైతాన్ మేకపిల్ల మాదిరిగా పంక్తుల నెర్రలలో దూరడాన్ని నేను చూస్తున్నాను." (అబూదావూద్)

హజ్రత్ ఇబ్నెఉమర్ (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ప్రవచనం: "భుజాల మధ్య నెర్రలను పూడ్చి పంక్తులు సరిచేసుకోండి. మీ సోదరుల చేతుల్లో మృదువుగా ఉండండి. షైతాన్ (దూరగలిగే) సందులు వదలకండి. పంక్తులు కలిపేవాడ్ని దేవుడు కలుపుతాడు. పంక్తులు విడదీసేవాడ్ని దేవుడు విడదీస్తాడు." (అబూదావూద్, నసాయి, మిష్కాత్)

హజ్రత్ బరా బిన్ ఆజిబ్ (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ఇలా చెప్పారు: "మొదటి పంక్తుల్లో (ఖాళీ లేకుండా ఒకరికొకరు) దగ్గరయి నిలబడేవారిపై దేవుడు, దైవదూతలు

కారుణ్య కురిపిస్తారు. దేవుని దృష్టిలో (నమాజ్ కోసం) నడిచే, పంక్తిలో (పక్కవారి పాదాలకు) కలిపివుంచే పాదంకంటే ఎక్కువ శ్రేష్ఠమైన పాదం మరేదీ లేదు.” (అబూదావూద్)

హజ్రత్ నోమాన్ బిన్ బషీర్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (స) ఇలా చెప్పారు: “మీరు సర్వావస్థల్లోనూ మీ పంక్తులను తిన్నగా, సక్రమంగా ఉంచుకోవాలి. అలా చేయకపోతే దేవుడు మీ ముఖాలను పరస్పరం వ్యతిరేకంగా మార్చివేస్తాడు. (అంటే మీరు పరస్పరం విభేదించుకొని అనైక్యతకు గురయిపోతారు.)” (బుఖారి)

సరిగ్గా ఉండే పంక్తులే సమైక్యతకు ప్రబల నిదర్శనం. పంక్తులు సరిగ్గా ఉంచకోవడం అంటే ప్రతి వ్యవహారంలోనూ దైవాజ్ఞల్ని పాటిస్తూ కలసికట్టుగా ఉండమని అర్థం. అలా కలసికట్టుగా ఉండకపోతే శత్రువుల బెదిరింపులకు, కుట్రలకు గురయి నాశనమవడం తప్పదు.

## ప్రజలకు భారం అన్పించని సంక్షిప్త నమాజ్

దైవప్రవక్త (స) ప్రవచనం: “నమాజ్‌కు వచ్చేవారిలో బలహీనులు, వ్యాధిగ్రస్తులు, వృద్ధులు కూడా ఉంటారు. కనుక ప్రజలకు నాయకత్వం వహించి నమాజ్ చేయించే వ్యక్తి (ఎవరికీ భారం అన్పించకుండా) సంక్షిప్తంగా నమాజ్ చేయించాలి. అతను ఒంటరిగా నమాజ్ చేస్తున్నప్పుడు ఎంత దీర్ఘంగానైనా నమాజ్ చేసుకోవచ్చు.” (బుఖారి)

హజ్రత్ అనస్ (రజి) కథనం: “దైవప్రవక్త (సల్లం) నమాజ్ ఎంతో సంక్షిప్తంగా, సమగ్రంగా చేయించేవారు. ఆ విధంగా మరెవరూ నమాజ్ చేయించడాన్ని నేను చూడలేదు. నమాజ్ చేయిస్తున్నప్పుడు ఎవరి బిడ్డయినా ఏడుస్తూ ఉండటం వింటే చాలు, బిడ్డ తల్లి ఎక్కడ కంగారుపడుతుందో నన్న భయంతో దైవప్రవక్త (స) వెంటనే నమాజ్‌ను మరింత సంక్షిప్తం చేసేవారు.” (బుఖారి)

హజ్రత్ జాబిర్ బిన్ అబ్దుల్లా (రజి) కథనం: ముఆజ్ బిన్ జబల్ (రజి) దైవప్రవక్త (స) వెనుక (ఇషా) నమాజ్ చేసి (ఇంటికి) వెళ్ళిపోయారు. వెళ్ళి తన తెగవారికి (ఇషా) నమాజ్ చేయించేవారు. ఒకసారి ఆయన నమాజ్‌లో ‘బఖరా’సూరా పఠించారు. అప్పుడు ఒకతను పంక్తి నుండి వేరైపోయి విడిగా సంక్షిప్త నమాజ్ చేసి వెళ్ళిపోయాడు. ముఆజ్ (రజి)కు అతను చేసిన పని తెలిసి “నిస్సందేహంగా అతను కపటవిశ్వాసి” అన్నారు.

ముఆజ్ (రజి) తనను కపటవిశ్వాసి అన్నారని తెలుసుకున్న ఆ వ్యక్తి దైవప్రవక్త (స) దగ్గరకు వెళ్ళి “దైవప్రవక్తా! మేము కూలినాలి చేసి బతికే కష్టజీవులం. (పగలంతా) ఒంటెల సహాయంతో నీళ్ళు తోడి మోసుకెళ్ళి పోస్తుంటాము. కాని ముఆజ్ (రజి) గత రాత్రి (ఇషా) నమాజ్‌లో బఖరా సూరా (పూర్తిగా) పఠించారు. దాంతో నేను పంక్తి నుండి వేరయి ఒంటరిగా సంక్షిప్త నమాజ్ చేసుకొని వెళ్ళిపోయాను. దానిపై ముఆజ్ నన్ను కపటవిశ్వాసి అంటున్నారు” అని ఫిర్యాదు చేశారు. అప్పుడు దైవప్రవక్త (స) ముఆజ్ (రజి)ని పిలిపించి “ఏమిటీ నీ సంగతి, జనాన్ని చిక్కుల్లో పడవేసి వారికి ధర్మం పట్ల వెగటు కలిగించదలిచావా?” అని అడిగారు. ఈమాట ఆయన మూడుసార్లు అన్నారు. ఆ తరువాత “వష్షమ్సి వజ్జుహాహా, సబ్బిహిస్మ రబ్బికల్ ఆలా’ లాంటి (చిన్న) సూరాలు (సామూహిక నమాజ్‌లో) పఠిస్తూ ఉండు” అని అన్నారు. (బుఖారి)



హజ్రత్ అబూమస్వూద్ అన్సారీ (రజి) కథనం: ఒక వ్యక్తి దైవప్రవక్త (స) సన్నిధికి వచ్చి “దైవప్రవక్తా! ఒకతను (సామూహిక నమాజ్‌లో) సుదీర్ఘ పారాయణం చేస్తుంటాడు. దానివల్ల నేను ఫజర్ వేళ సామూహిక నమాజ్‌లో పాల్గొనలేక పోతున్నాను” అని ఫిర్యాదు చేశాడు. అప్పుడు దైవప్రవక్త (స) ప్రజలను సంబోధిస్తూ “ప్రజలారా! మీలో కొందరు ఇతరులకు ధర్మం పట్ల వెగటు కలిగించేవారు కూడా ఉన్నారు. ఒక విషయం గుర్తుంచుకోండి. మీలో ఇమామత్ బాధ్యతలు నిర్వహించేవారు నమాజ్‌ని క్లుప్తంగా చేయించాలి. ఇమామ్ వెనుక నమాజ్ చేసేవారిలో వృద్ధులు, బలహీనులు, కష్టజీవులు కూడా ఉంటారు” అని ఉపదేశించారు. అప్పుడాయన ఇదివరకెన్నడూ లేనంత కోపంతో ఉండటం నేను చూశాను. (బుఖారి)

## నమాజ్ స్థితిలో ఇతర విషయాలు

హజ్రత్ అబూసయీద్ ఖుద్రీ (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: “మీలో ఎవరైనా మసీదుకు వచ్చినప్పుడు (లోపలికి ప్రవేశించే ముందు తన చెప్పుల వైపు) సరిగ్గా చూసుకోవాలి. ఒకవేళ చెప్పులకు ఏదైనా మలినం అంటుకొని వుంటే దాన్ని శుభ్రం చేసుకొని నమాజ్ చేయాలి.” (అబూదావూద్)

దీనికి పూర్వం చెప్పులకు సంబంధించిన ఒక సంఘటన జరిగింది. ఓసారి దైవప్రవక్త (స) చెప్పులు తొడిగి నమాజ్ చేయించసాగారు. అయితే ఓ చెప్పుకు మలినం అంటుకొని ఉన్న సంగతి ఆయనకు తెలియదు. నమాజ్ మధ్యలో దైవదూత జిబ్రీల్ (అలై) ఆయనకీ సంగతి తెలియజేశారు. వెంటనే దైవప్రవక్త (స) నమాజ్ మధ్యలోనే (ఓపక్కన) చెప్పులు విడిచి నమాజ్‌ను కొనసాగించారు. దాంతో ఆయన వెనుక నమాజ్ చేస్తున్న అనుచరులు కూడా తమతమ చెప్పులు విడిచి నమాజ్‌ను కొనసాగించారు. నమాజ్ ముగిసిన తర్వాత చెప్పులు విడిచిపెట్టడానికి కారణం అడిగారు దైవప్రవక్త (స) తన అనుచరుల్ని. దానికి వారు సమాధానమిస్తూ “మేము మిమ్మల్ని అనుసరించేవాళ్ళం కదా! మీరు ఎలా చేస్తే అలా చేశాం” అన్నారు. అప్పుడు దైవప్రవక్త (స) తాను చెప్పులు వదలడానికి కారణం ఏమిటో తెలియజేశారు.

హజ్రత్ ముఅవియా బిన్ హకమ్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (స) ఇలా అన్నారు: నమాజ్‌లో సంభాషణకు (మాట్లాడటానికి) ఎలాంటిఅవకాశం లేదు. నమాజ్‌లో దేవుని పవిత్రత, ఘనతలనే ప్రశంసించాలి; ఖుర్ఆన్‌పారాయణం చేయాలి.” (ముస్లిం)

“...దైవప్రవక్త (స) ప్రజల వైపు తిరిగి “మీరు (అనవసరంగా) చాలాసార్లు చప్పట్లు కొట్టారు. అసలీ (చప్పట్లు) చేత్తో శబ్దం చేయడమనేది స్త్రీల పని. నమాజులో ఏదైనా ఊహించని విషయం జరిగితే మీరు ‘సుబ్‌హానల్లాహ్’ అనంటే చాలు. సుబ్‌హానల్లాహ్ అనగానే ఇమామ్ మీ ఉద్దేశం గ్రహిస్తాడు” అని అన్నారు. (బుఖారి, ముస్లిం)

హజ్రత్ అబూహురైరా (రజి) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (స) ఇలా అన్నారు: “నమాజ్‌లో (ఏదైనా ఊహించని విషయం జరిగితే) పురుషులు తస్బీహ్ పలకాలి. స్త్రీలయితే చప్పట్లు చరచాలి.” (ముస్లిం)

హజ్రత్ అబూఖతాదా (రజి) ఉల్లేఖనం: “దైవప్రవక్త (స) నమాజ్ చేయిస్తూ (తన మనుమరాలైన) ఉమామా బిన్తె జైనబ్ (రజి)ను ఒడిలో ఎత్తుకొని ఉండేవారు. సజ్దా

చేయబోయే ముందు ఆమెను క్రిందికి దించేవారు. సజ్దా చేసి నిలబడిన తరువాత మళ్ళీ ఎత్తుకునేవారు." (బుఖారి, ముస్లిం)

హజ్రత్ అబూహురైరా (రజి) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (స) ఇలా అన్నారు: "నమాజ్ చేస్తున్నప్పుడు రెండు (ప్రమాదకరమైన) నల్లటి పురుగుల్ని (అంటే పామును, తేలును) చంపేయండి." (అబూదావూద్, తిర్మిజి, నసాయి, ఇబ్నెమాజ)

దైవప్రవక్త (స) ప్రవచించారు: "మనిషి నమాజ్ చేస్తున్నప్పుడు అతని వైపు దైవ కారుణ్యం ప్రసారమవుతూ ఉంటుంది. కనుక మీలో ఎవరైనా నమాజ్ చేస్తున్నప్పుడు అతను (సజ్దాచోటు నుండి) చేత్తో కంకర్రాళ్ళను తొలగించకూడదు. ఒకవేళ కంకర్రాళ్ళను తొలగించడం అనివార్యమయితే ఒక సారి తొలగించవచ్చు." (అహ్మద్)

హజ్రత్ ఇబ్నెఅబ్బాస్ (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ఇలాచెప్పారు: "ఏడు ఎముకల (ఎనిమిది అంగాల) ఆధారంగా సజ్దా (సాష్టాంగం) చేయాలని, (నమాజ్ చేస్తున్నప్పుడు) దుస్తులు, శిరోజాలు సరిచేసుకోకూడదని నన్ను ఆదేశించడం జరిగింది." (ముస్లిం)

హజ్రత్ జాబిర్ బిన్ సమురా (రజి) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "ముస్లింలు నమాజ్ చేస్తున్నప్పుడు తమ చూపుల్ని ఆకాశం వైపుకు మరల్చకూడదు. అలాచేస్తే వారి దృష్టి తిరిగిరాని పరిస్థితి ఏర్పడవచ్చు. (అంటే అంధులై పోయే ప్రమాదం ఉంటుందన్న మాట)." (ముస్లిం)

హజ్రత్ అబూహురైరా (రజి) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (స) ఇలా అన్నారు: "ఆవులింత అనేది షైతాన్ చేష్ట. కనుక మీలోఎవరికైనా నమాజ్ చేస్తున్నప్పుడు ఆవులింత వస్తే దాన్ని వీలైనంత వరకు ఆపుకోవడానికి ప్రయత్నించాలి." (తిర్మిజి)

## ఇమామ్ ఎలాచేస్తే అలాచేయాలి

హజ్రత్ అబూహురైరా (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ఇలా అన్నారు: "(నమాజ్‌లో రుకూ, సజ్దాల సందర్భంగా) ఇమామ్‌కు ముందు తల పైకెత్తేవాడు తన తలను దేవుడు, గాడిద తలగా మార్చుతాడేమోనని భయపడడా?" అన్నారు. లేక "తన రూపాన్ని దేవుడు, గాడిద రూపంగా మార్చుతాడేమోనని భయపడడా?" అని అన్నారు. (బుఖారి)

హజ్రత్ బరా బిన్ ఆజిబ్ (రజి) కథనం: "మేము దైవప్రవక్త (స) వెనుక నమాజ్ చేస్తున్న సమయంలో ఆయన 'సమిఅల్లహు లిమన్ హమిదహ్' అని అన్నప్పుడు, ఆ తరువాత ఆయన తన నుదుటిని నేల మీద ఆనించనంత వరకు మాలో ఏ ఒక్కడూ (సజ్దా చేయడానికి) నడుము వంచేవాడు కాదు." (బుఖారి)

విశ్వాసుల మాతృమూర్తి హజ్రత్ ఆయిషా (రజి) కథనం: "దైవప్రవక్త (స) ఓసారి వ్యాధిగ్రస్తులయితే ఇంట్లోనే నమాజ్ చేశారు. ఇంట్లో ఆయన కూర్చొని నమాజ్ చేస్తుంటే కొందరు అనుచరులు ఆయన వెనుక నిలబడి నమాజ్ చేశారు. దైవప్రవక్త (స) అది గమనించి వాళ్ళను కూర్చోమని (సూచనప్రాయంగా) ఆదేశించారు. నమాజ్ ముగిసిన తరువాత ఆయన ఇలా అన్నారు- "ఇమామ్ నియమించబడేది ఆయన్ని అనుసరించ డానికే. అందువల్ల ఆయన రుకూ చేస్తే మీరూ రుకూ చేయండి; రుకూ నుండి పైకి



లేస్తే మీరూ లేవండి; అతను కూర్చొని నమాజ్‌చేస్తే మీరూ కూర్చొనే నమాజ్ చేయండి' అని అన్నారు." (బుఖారి, ముస్లిం)

ముస్లిం గ్రంథంలోని మరో ఉల్లేఖనంలో దైవప్రవక్త (స) ఇలా అన్నారు: "పార్శీలు, రోమన్లు తమ రాజులు కూర్చొనివుంటే వారిముందు (చేతులు కట్టుకొని) నిలబడతారు. మీరలా చేయకండి. మీరు ఎల్లప్పుడూ మీ ఇమామ్‌ని అనుసరించండి. ఒకవేళ అతను కూర్చొని నమాజ్ చేయిస్తే మీరూ కూర్చొనే నమాజ్ చేయండి." (ముస్లిం)

అయితే దైవప్రవక్త (స) జీవితపు అంత్యకాలంలో ఇద్దరు వ్యక్తుల సహాయంతో కాళ్ళీడ్చు కుంటూ మస్జిద్‌కు వచ్చి హజ్రత్ అబూబకర్ (రజి) పక్కన కూర్చొని నమాజ్ చేయించారు. అంతకుముందే ఇమామ్ స్థానంలో నిలబడివున్న అబూబకర్ (రజి) అక్కడే నిలబడి దైవప్రవక్త (స)ను అనుసరిస్తూ నమాజ్ చేశారు. ఇతర నమాజీలు అబూబకర్ (రజి) వెనుక నిలబడి నమాజ్ చేశారు. ఈ సంఘటన ఆధారంగా అత్యధికమంది ధర్మవేత్తలు, కూర్చొని నమాజ్ చేయించే ఇమామ్ (నాయకుడి) వెనుక శక్తి కలిగిన ముఖ్తదీలు (అనుచరులు) నిలబడి నమాజ్ చేయాలని నిర్ణయించారు.

ఇమామ్ ముస్లిం (రహ్మాలై) కథనం: "శక్తి కలిగిన ముఖ్తదీలు కూర్చొని నమాజ్ చేసే ఆదేశం రద్దయిపోయింది. అంచేత ఇమామ్ కూర్చొని నమాజ్ చేయిస్తున్నప్పుడు నిలబడే శక్తి కలిగిన ముఖ్తదీలు నిలబడే నమాజ్ చేయాలి." (ముస్లిం)

## సుత్రా (నమాజీ ముందునుంచి నడవరాదు)

హజ్రత్ జుహైమ్ బిన్ హారిస్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రవచించారు: "నమాజ్ చేస్తున్న మనిషి ముందునుంచి నడిచేవానికి, తన ఈ చేష్ట వల్ల ఎంత పాపం కలుగుతుందో తెలిస్తే అతను అలా నడవడానికి బదులు నలభై (ఏండ్లు) అయినాసరే అక్కడే నిలబడటానికే ఇష్టపడతాడు." (బుఖారి, ముస్లిం)

హజ్రత్ అబూహురైరా (రజి) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (స) ఇలా హితోపదేశం చేశారు: "మీలో ఎవరైనా నమాజ్ చేయడానికి సిద్ధమైనప్పుడు తన ముందు (బాణం, బల్లెం లాంటి) ఏదైనా వస్తువు పాతుకోవాలి. ఏదీ లభించకపోతే తన దగ్గరున్న కర్రను నిలబెట్టుకోవాలి. అదీ లేకపోతే నేలపై కనీసం ఓ గీత అయినా గీసుకోవాలి. (ఇలాంటి వస్తువుని 'సుత్రా' అంటారు.) అప్పుడు నమాజ్ చేసేవాని ముందు నుంచి పోయే వారివల్ల నమాజ్ చేసేవానికి ఎలంటి నష్టం కలగదు." (అహ్మద్, ఇబ్నెమాజ)

హజ్రత్ అబూసయీద్ ఖుద్రీ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (స) ఇలా అన్నారు: "మీలో ఎవరైనా 'సుత్రా' పెట్టి నమాజ్ చేస్తున్నప్పుడు దాని ముందు నుంచి (అంటే సుత్రాకు, నమాజీకి మధ్య నుంచి ఎవరైనా నడచిపోతుంటే నమాజ్ చేసే వ్యక్తి అతడ్ని ఆపేందుకు ప్రయత్నించాలి. అప్పటికీ అతను ఖాతరుచేయకపోతే అతనితో పోరాడాలి. అతనసలు (మానవరూపంలో వచ్చిన) షైతాన్." (బుఖారి, ముస్లిం)

హజ్రత్ ఆయిషా (రజి) కథనం: "దైవప్రవక్త (స) (నమాజ్ చేస్తున్నప్పుడు) నేను ఆయన ఎదురుగా పడుకొని ఉండేదాన్ని. అప్పుడు నా కాళ్ళు ఆయన ముందు ఖిబ్లా

వైపు, ఆయన సజ్దా చేసే చోట ఉండేవి. ఆయన సజ్దా చేయడానికి ఉపక్రమిస్తూ నా కాళ్ళను తాకేవారు. నేనప్పుడు నా కాళ్ళను ముడుచుకునేదాన్ని. ఆయన సజ్దా నుండి లేచి నిలబడగానే నేను యథాప్రకారం కాళ్ళు చాపుకునేదాన్ని. ఆ రోజుల్లో మేము ఇండ్లలో దీపాలు వెలిగించే వాళ్ళముకాము." (బుఖారి, ముస్లిం)

హజ్రత్ మస్రూఖ్ (రహ్మలై) కథనం: నమాజ్ చేసేవాని ముందునుంచి కుక్కగాని, గాడిదగాని, స్త్రీగాని వెళ్ళడం జరిగితే అతని నమాజ్ భంగమైపోతుంది అనే విషయం హజ్రత్ ఆయిషా (రజి) ముందు ప్రస్తావించబడింది. (ప్రవక్త సతీమణి హజ్రత్ ఆయిషా (రజి) ఈమాట వినగానే "ఏమిటీ! మీరు మమ్మల్ని (అంటే స్త్రీలను) కుక్కలతో, గాడిదలతో పోల్చుతున్నారా? వినండి, దైవసాక్షిగా చెబుతున్నాను. దైవప్రవక్త (సల్లం) నమాజ్ చేస్తున్నప్పుడు నేను ఆయన ముందు ఖిబ్లా వైపు బల్ల మీద పడుకొని ఉండేదాన్ని. తరువాత నాకేదయినా పనిబడితే నేను లేచి ఆయనకు బాధ కలిగించడం భావ్యం కాదని తలచి, పడుకున్న స్థితిలోనే మెల్లిగా కాళ్ళ వైపు నుంచి జారుకునేదాన్ని" అని అన్నారు. (బుఖారి)

# 18. ఆరాధనాలయాల ఆవశ్యకత

"దేవాలయంలో ఈలలు వేయడం, చప్పట్లు కొట్టడం మినహా వారు చేసే ప్రార్థన మరేముంది?" (ఖుర్ఆన్–8:34,35)

హజ్రత్ ఆయిషా (రజి) కథనం: ఉమ్ముల్‌మోమినీన్ ఉమ్మెహబీబా, ఉమ్మెసల్మా (రజి)లు అబిసీనియాలోని ఓ చర్చీలో విగ్రహాలు ఉండటంచూసి వాటిని గురించి దైవ ప్రవక్త (స) ముందు ప్రస్తావించారు. దానిపై దైవప్రవక్త (స) ఇలా అన్నారు- "వారిలో (యూదులు, క్రైస్తవులలో) ఎవరైనా సత్పురుషుడు చనిపోతే అతని సమాధిపై వారు ప్రార్థనామందిరం నిర్మిస్తారు. అందులో ఇలాంటి విగ్రహాలు చేసి ప్రతిష్ఠిస్తారు. వారిలో ఇదొక సంప్రదాయమైపోయింది. అయితే వారు ప్రళయదినాన దేవుని దృష్టిలో యావత్తు సృష్టిలో అత్యంత నీచమైన వాళ్ళుగా పరిగణించబడతారు." (బుఖారి)

దేవాలయాలు నిరాకారుడు, నిర్గుణుడైన శుద్ధపరబ్రహ్మను ఆరాధించడానికే ప్రత్యేకించ బడాలి. కాని ముస్లిమేతరుల దేవాలయాల్లో ఏదో ఒక దేవతా విగ్రహమో లేక విగ్రహాల్లో, చిత్రపటమో లేక చిత్రపటాలో ఉంటాయి. వాటిని పూజించడానికే వారు ఆరాధనాలయాలకు వెళ్తారు. విగ్రహాలు, చిత్రపటాలు ఏమీ లేకపోతే వారు ఆరాధనాలయాలు నిర్మించుకోవలసిన అవసరమే ఉండదు. దీనికిభిన్నంగా ఇస్లాంలో ఆరాధనాలయాల నిర్మాణం వెనుక ఒక లక్ష్యం ఉంది. జీవిత సమస్తరంగాల్లో పాటించవలసిన దైవాజ్ఞల్ని నిత్యం వింటూ అర్థం చేసుకునే అభ్యాసానికి, విశ్వాసులు పరస్పరం కలుసుకొని ఒకరి సమస్యలు మరొకరు తెలుసుకోవడానికి తగిన వేదిక మసీదే. అందుకే ఇస్లాంలో మసీదులకు ఎంతో ప్రాముఖ్యం ఇవ్వబడింది.

హజ్రత్ అబూజర్ (రజి) కథనం: నేనొక సారి దైవప్రవక్త (స)తో మాట్లాడుతూ "దైవ ప్రవక్తా! ప్రపంచంలో అన్నిటికంటే ముందు నిర్మించబడిన మస్జిద్ ఏది"ని అడిగాను. దానికి దైవప్రవక్త (స) మస్జిదుల్‌హరాం" అని చెప్పారు. "ఆ తర్వాత ఏది?"ని అడిగాను. "బైతుల్‌మఖ్దిస్" అన్నారు ఆయన. "అయితే ఈ రెండిటి నిర్మాణాల మధ్య ఎంత



వ్యవధి ఉంది?" అని అడిగాను మళ్ళీ. "నలభై ఏళ్ళ"ని ఆయన సమాధానమిచ్చారు. ఆ తరువాత "కాలచక్రం నిన్ను ఏ చోటుకు తెస్తే ఆ చోటనే (వేళకు) నమాజ్ చెయ్యి. ఇదే శ్రేష్ఠమైన పని" అని ఉపదేశించారు ఆయన. (సహీహ్‌బుఖారి)

ఏ ప్రాంతంలోని విగ్రహారాధకులు ఇస్లాం స్వీకరించినప్పుడు ఆ ప్రాంతంలోని విగ్రహా లయాలను మసీదులుగా మార్చివేయడమో లేక వాటిలో ఉండే విగ్రహాలను తీసివేయడమో జరిగితే అది ఇస్లాంలో అభ్యంతరకరమైన చర్యకాదు. అంతేగాని ఆ ప్రాంతంలో విగ్రహారాధ కులు ఉన్నంతవరకూ వారి దేవాలయాలను ధ్వంసం చేయడాన్ని మాత్రం ఇస్లాం సుతరామూ అంగీకరించదు. దీనికి భిన్నంగా యుద్ధంలో మతదురభిమానులైన విజేతలు పరాజితుల దేవాలయాలను ఈనాడు కూడా ధ్వంసం చేస్తున్నారు. ఈ చర్య సత్యానికి-అసత్యానికి, ధర్మానికి-అధర్మానికి, న్యాయానికి-అన్యాయానికి మధ్య సంఘర్షణకు దారితీస్తుంది.

"దేవుడు గనక ప్రజలను ఒకరిద్వారా మరొకరిని తుదముట్టించకపోతే, దేవుని పేరు అత్యధికంగా స్మరించబడే మఠాలు, మందిరాలు, చర్చీలు, మసీదులు, (ఇతర) ఆరాధనాలయాలు ధ్వంసం చేయబడే ప్రమాదం ఉంటుంది. (కనుక) దేవుడు (తన ధర్మానికి) సహాయం చేసేవారిని తప్పక ఆదుకుంటాడు." (ఖుర్ఆన్–22:40)

## మస్జిద్ గౌరవం కాపాడాలి

"దేవుడ్ని, పరలోకాన్ని విశ్వసించినవారే దైవగృహాలకు (మస్జిద్‌లకు) సేవచేయడానికి అర్హులు. (వారికే ఆ బాధ్యత ఉంది.)" (ఖుర్ఆన్–9:18)

మస్జిద్ గౌరవాన్ని గురించి దైవప్రవక్త (స) చెప్పిన ఈ హితోక్తులు చూడండి:

"మీలో ఎవరైనా ఎప్పుడు మసీదులో ప్రవేశించినా కూర్చునే ముందు రెండు రకాతులు (తహ్యాతుల్‌ఉజూ-నఫిల్) నమాజ్ చేయాలి." (బుఖారి, ముస్లిం)

"మీలో ఎవరినైనా వ్యాపారవ్యవహారం జరుపుతున్నట్లు చూస్తే 'దేవుడు నీ వ్యాపారంలో లాభం చేకూర్చకుండుగాక' అనండి మీరు." (తిర్మిజి, నసాయి)

"ఎవరైనా మస్జిద్‌లో కేకలు పెడుతూ తన వస్తువును వెతుకుతుంటే అతనికా వస్తువును లభింపజేయవద్దని దైవాన్ని ప్రార్థించండి. మస్జిద్‌ను ఇలా కేకలు పెట్టడానికి కాదు నిర్మించింది." (ముస్లిం)

"ఓ కాలం రానున్నది. అప్పుడు ప్రజలు మస్జిద్‌లో కేవలం ప్రాపంచిక విషయాలే మాట్లాడుకుంటారు." (బుఖారి, అబూదావూద్)

"ప్రజలు మసీదుల (నిర్మాణం) పట్ల గొప్పలు చెప్పుకొని గర్వపడనంత వరకు ప్రళయం రాదు." (ముస్లిం)

"మసీదుల అలంకరణ గురించి నాకెలాంటి ఆజ్ఞ రాలేదు." (అబూదావూద్)

మాదాన్ బిన్ అబూతల్హా ఉల్లేఖనం ప్రకారం హజ్రత్ ఉమర్ (రజి) శుక్రవారం రోజు జుమా ప్రసంగం చేస్తూ ఇలా అన్నారు: "......ప్రజలారా! మీరు రెండు రకాల చెట్ల ఉత్పత్తుల్ని తినడం నేను చూస్తున్నాను. కాని వాటిని నేను అపరిశుద్ధమైనవిగా భావిస్తు

న్నాను. అవి ఉల్లిగడ్డలు, చిన్నెల్లిపాయలు. దైవప్రవక్త (స) కాలంలో ఈ రెండిటి (దుర్) వాసన ఎవరి నోటి నుంచైనా వస్తుంటే ప్రవక్త ఆజ్ఞతో అతడ్ని మస్జిద్ నుండి బయటికి బఖీ వైపున తీసివేయడం జరిగేది. వాటిని ఎవరైనా తినాలనుకుంటే (దుర్వాసన పోయేలా) బాగా వండి తినాలి." (ముస్లిం)

హజ్రత్ అబూహురైరా (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ఇలా అన్నారు: "(ఇమామ్) ఫరజ్ నమాజ్ కోసం తక్బీర్ చెప్పినప్పుడు మీరు పరుగెత్తుకుంటూ రాకండి, నెమ్మదిగా వచ్చేయండి. (ఇమామ్ వెనుక) మీకు లభించినంత నమాజ్ చేయండి. తప్పిపోయిన నమాజ్‌ను తరువాత నెరవేర్చండి. మీలో ఎవరైనా నమాజ్ చేయడానికి సంకల్పించు కుంటే అది మీకు (సామూహిక) నమాజ్‌లో నెరవేరుతుంది." (ముస్లిం)

మస్జిద్ ప్రాముఖ్యం గురించి దైవప్రవక్త (స) చెప్పిన ఈ హితోక్తులు చూడండి:

"కేవలం దేవుని ప్రసన్నత కోసం ఎవరైనా మస్జిద్ నిర్మిస్తే అతని కోసం దేవుడు అలాంటిదే ఒక ఇల్లు స్వర్గంలో నిర్మిస్తాడు." (బుఖారి, ముస్లిం)

"ఎవరైనా ఓ పిచ్చుక గూడు లాంటి మస్జిద్ నిర్మించినా అతని కోసం దేవుడు స్వర్గంలో ఒక ఇల్లు నిర్మిస్తాడు." (ముస్నద్ అహ్మద్)

"లోకంలో అన్నిటికంటే శ్రేష్ఠమైన భూభాగాలు దేవుని దృష్టిలో మస్జిద్‌లే." (తిర్మిజి)

"మస్జిద్‌లు స్వర్గంలోని ఉద్యానవనాలు" (తిర్మిజి)

"ఎలాంటి నీడ ఉండని ప్రళయదినాన ఏడు రకాల వ్యక్తులకు దేవుని కారుణ్య ఛాయ లభిస్తుంది. వారిలో ఒకడు, దైవవిధేయతలో జీవితం గడిపిన యువకుడు, మరొకడు, తన మనస్సును మస్జిద్‌లో కట్టివేసినవాడు." (బుఖారి, ముస్లిం)

## 19. నమాజ్ విధానం

హజ్రత్ ఆయిషా (రజి) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "మూడు విధాల వ్యక్తులకు నమాజ్ నుండి మినహాయింపు ఉంది- 1-నిద్రపోతున్నవాడు మేల్కొనంతవరకు, 2-యుక్తవయస్సుకు చేరుకోని పిల్లవాడు, 3-ఉన్మాది చైతన్యవం తుడు కానంతవరకు." (అహ్మద్, తిర్మిజి, అబూదావూద్)

హజ్రత్ ఇమ్రాన్ బిన్ హుసైన్ (రజి) కథనం: నేను మూలశంఖ వ్యాధిగ్రస్తుడ్ని. అంచేత నేను దైవప్రవక్త (స) సన్నిధికి వెళ్ళి నమాజ్ గురించి అడిగాను. దానికి ఆయన ఇలా సమాధానమిచ్చారు- "(నిలబడగలిగితే) నిలబడి నమాజ్ చెయ్యి. నిలబడలేకపోతే కూర్చొని నమాజ్ చెయ్యి. కూర్చోలేకపోతే పడుకొని నమాజ్ చెయ్యి." (మిష్కాత్)

ఇది ఫరజ్ నమాజ్‌కు సంబంధించిన విషయం. నఫిల్ నమాజులు మనిషి ఆరోగ్యంగా ఉన్నాసరే కూర్చొని చేయవచ్చు. కాకపోతే పుణ్యం సగానికి తగ్గిపోతుంది.

హజ్రత్ అబూమూసా అష్అరీ (రజి) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "మనిషి జబ్బుపడితే లేక ప్రయాణావస్థలో ఉంటే దేవుడు అతనికి ఆరోగ్యవంతుడిగా, స్థానికుడిగా ఉన్నప్పుడు చేస్తుండిన కర్మలే వ్రాస్తాడు." (బుఖారి)



యుక్తవయస్కుడై ఉండి చైతన్యవంతుడైన ప్రతి ముస్లింకు నమాజ్ చేయడం విధిగా చేయబడింది. ఉజూచేసి నమాజ్ చేయడానికి ఉపక్రమించినప్పుడు నమాజ్‌లో పాటించవలసిన విషయాలను గురించి ముందుగా తెలుసుకుందాం:

1-ఖిబ్లా దిశగా నిలబడటం, 2-'ఇన్నీ వజ్జహ్‌తు వజ్‌హియ...'పఠించడం, 3-ఫలానా వేళ ఫలానానమాజ్ ఇన్ని రకాతులు చేస్తున్నానని సంకల్పించుకోవడం, 4-తక్బీర్ చెప్పడం, 5-తక్బీర్ చెబుతున్నప్పుడు రెండు అరచేతులు ఖిబ్లా వైపుకు తిప్పి చెవులవరకు లేదా భుజాలవరకు ఎత్తి దించడం, 6-ఎడమ ముంజేతిపై కుడిముంజేయి ఉండేలా రెండు చేతులు నాభిపై లేక రొమ్ముపై కట్టుకోవడం, 7-'సనా' (ప్రశంసా పలుకులు) పఠించడం లేక పాపక్షమాపణ దుఆ చేయడం, 8-అవూజుబిల్లహి-బిస్మిల్లా పఠించడం, 9-ఫాతిహా సూరా పఠించడం, 10-ఫాతిహా సూరా తర్వాత రెండవది మరేదైనా సూరా పఠించడం, 11-తక్బీర్ (అంటే అల్లాహుఅక్బర్ అని) చెబుతూ 'రుకూ' చేయడం, 12-రుకూస్థితిలో 'సుబ్‌హాన రబ్బియల్ అజీం' అని కనీసం మూడుసార్లు పలకడం, 13-'సమిఅల్లాహు లిమన్‌హమిదహ్' అంటూ నిటారుగా లేచి నిల బడటం, 14-తక్బీర్ చెబుతూ సజ్దాలోకి పోవడం, 15-సజ్దా స్థితిలో 'సుబ్‌హాన రబ్బియల్ ఆలా'అని కనీసం మూడుసార్లు పలకడం, 16-రెండు సజ్దాల తర్వాత లేచి నిలబడటం, 17-రెండవ రకాత్ రెండవ సజ్దా తర్వాత 'తషహ్హుద్' పఠించడం, 18-తషహ్హుద్‌లో 'లాఇలాహ ఇల్లల్లాహ్' పఠిస్తున్నప్పుడు కుడిచేతి చూపుడు వ్రేలిని పైకెత్తడం, 19-'దరూద్-దుఆ' పఠిం చడం, 20-సలాం చెబుతూ కుడి-ఎడమల వైపుకు ముఖం తిప్పి నమాజ్ ముగించడం.

(1) దైవపవక్త (స) ప్రవచనం: "మీరు నమాజ్ చేయదలచుకున్నప్పుడు సక్రమంగా ఉజూచేసి ఖిబ్లా వైపుకు తిరిగి నిలబడండి......" (బుఖారి, ముస్లిం)

(2) హజ్రత్ అలి (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (స) నమాజ్ కోసం నిలబడి నప్పుడు ఇలా పఠించేవారు: "ఇన్నీ వజ్జహ్‌తు వజ్‌హియ లిల్లజీ ఫతరస్ సమావాతి వల్అర్జ హనీఫవ్వమా అనా మినల్ ముష్రికీన్. ఇన్న సలాతి వ నుసుకి వమహ్‌యాయ వమమాతీ లిల్లాహి రబ్బిల్ ఆలమీన్. లాషరీక లహూ వబిజాలిక ఉమిర్‌తు వఅనా అవ్వలుల్ ముస్లిమీన్."

అర్థం: నేనిప్పుడు సమస్త విషయాలు వదలి పూర్తి ఏకాగ్రతతో భూమ్యాకాశాలు సృష్టించిన శక్తిస్వరూపుని వైపుకు మరలాను. ఆయనకు సాటి కల్పించేవారిలోని వాడ్ని కాను. నా నమాజ్, నా త్యాగం, నా జీవన్మరణాలు సమస్తం సకలలోక ప్రభువయిన అల్లాహ్‌కే సమర్పితం. ఆయనకు సాటి ఎవరూ లేరు. నాకు ఆయన ఆదేశమే లభించింది. నేను యావత్తు దైవవిధేయులలో ప్రప్రథమ దైవవిధేయుడ్ని.

(3) సంకల్పం అనేది మనస్సుకు సంబంధించిన విషయం. అయితే సంకల్పించు కున్న విషయాలు నోటి ద్వారా వెలిబుచ్చడంలో కూడా తప్పు లేదు.

హజ్రత్ ఉమర్ (రజి) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (స) ఇలా అన్నారు: "సంకల్పాన్ని బట్టి ఆచరణ ఉంటుంది." (బుఖారి, ముస్లిం, అబూదావూద్, తిర్మిజి, ఇబ్నెమాజ)

(4) సంకల్పం తర్వాత "అల్లాహుఅక్బర్" అనే మాటతో నమాజ్ ప్రారంభమవుతుంది. దీన్ని 'తక్బీరె తహ్రీమా లేక తక్బీరె ఊలా" అని అంటారు.

హజ్రత్ అలి (రజి) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (స) ఇలా తెలిపారు: "పరిశుద్ధత నమాజ్ తాళపుచెవి. నమాజ్ దీక్ష అల్లాహుఅక్బర్ అనడమే. దాని విరమణ సలాం చెబుతూ (ముఖం కుడి ఎడమల వైపుకు) తిప్పడమే." (షాఫయి, అహ్మద్, అబూదావూద్, తిర్మిజి)

## చేతులు చెవులదాకా, భుజాలదాకా?

(5) హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి) ఉల్లేఖనం: "దైవప్రవక్త (స) నమాజ్ ప్రారంభించినప్పుడు తన రెండు చేతుల్ని భుజాల వరకు ఎత్తి 'అల్లాహుఅక్బర్' అని చెప్పేవారు. రుకూ నుండి లేచేటప్పుడు కూడా ఇలాగే చేసేవారు. సజ్దా నుండి లేచే టప్పుడు మాత్రం ఇలా చేసేవారు కాదు." ( ముస్లిం)

హజ్రత్ మాలిక్ బిన్ హువైరిస్ (రజి) కథనం: "దైవప్రవక్త (సల్లం) అల్లాహుఅక్బర్ అంటూ (నమాజ్ కోసం) చేతులు చెవుల దాకా ఎత్తేవారు." (ముస్లిం, అహ్మద్)

హజ్రత్ వాయిల్ బిన్ హుజర్ (రజి) తబూక్ దండయాత్ర తరువాత ఇస్లాం స్వీక రించారు. మరుసటి సంవత్సరం ఆయన దైవప్రవక్త (స) సన్నిధికి వచ్చినప్పుడు మదీనాలో చలి తీవ్రంగా ఉండింది. అందువల్ల ప్రవక్త అనుచరులు (చలి తీవ్రత వల్ల) దుస్తుల లోపలి నుంచి చేతులు భుజాల వరకే ఎత్తి 'రఫెయదైన్' చేసేవారు. (బలూగుల్‌మరాం)

హజ్రత్ వాయిల్ బిన్ హుజర్ (రజి) కథనం: దైవప్రవక్త (స) నమాజ్ ప్రారంభించి నప్పుడు తన రెండు చేతులు పైకెత్తి 'అల్లాహుఅక్బర్' అనడం తాను చూశానని అన్నారు.

ఈ హదీస్‌ని ఉల్లేఖించిన హమ్మామ్ ఇలా తెలియజేశారు- "దైవప్రవక్త (స) రెండు చేతులు చెవుల వరకు ఎత్తి (దించిన) తర్వాత దుప్పటి కప్పుకున్నారు. ఆ తరువాత ఎడమ చేతిపై కుడిచేయి పెట్టుకున్నారు. ఆ తర్వాత దుప్పటిలో నుంచి చేతులు బయటికి తీసి చెవులవరకు పైకెత్తి (అల్లాహుఅక్బర్ అంటూ) తక్బీర్ పలికారు. ఆ తరువాత రుకూ స్థితిలోకి పోయారు. రుకూ నుండి లేచి 'సమిఅల్లాహులిమన్‌హమిదా అంటూ రఫెయదైన్ చేశారు. ఆ తరువాత రెండు అరచేతుల మధ్య సజ్దా చేశారు." (ముస్లిం)

హజ్రత్ మాలిక్ బిన్ హువైరిస్ (రజి) ఉల్లేఖనం: "దైవప్రవక్త (స) తక్బీర్ (తహ్రీమా) పలికేటప్పుడు తన రెండు చేతుల్ని చెవుల వరకు ఎత్తేవారు. రుకూ చేస్తున్నప్పుడు కూడా రెండు చేతుల్ని చెవుల వరకు ఎత్తేవారు...." (ముస్లిం)

దైవప్రవక్త (స) చేతులు చెవులదాకా ఎత్తినట్లు కూడా ఉల్లేఖనాలు ఉన్నాయి. అబూదావూద్, నసాయి, అహ్మద్, తబ్రానీ, దారెఖుత్నీ, తహావీ, ముస్లిం గ్రంథాలలో ఈ ఉల్లేఖనం ఉంది.

'రఫేయదైన్' గురించి ఇమామ్ ఔజాయి (రహ్మలై), ఇమామ్ అబూహనీఫా (రహ్మలై)ల మధ్య ఒక సంభాషణ జరిగింది. ఆ సంభాషణలో ఇమామ్ ఔజాయి (రహ్మలై) హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి) ఉల్లేఖనంతో ఇలా తెలిపారు: "దైవప్రవక్త (సల్లం) రుకూలోకి పోయేటప్పుడు, రుకూ నుండి లేచేటప్పుడు కూడా చేతులు పైకెత్తేవారు." ఇమామ్ అబూహనీఫా (రహ్మలై) హజ్రత్ అబ్దుల్లా బిన్ మస్‌వూద్ (రజి) ఉల్లేఖనంతో ఇలా తెలిపారు: "దైవప్రవక్త (సల్లం) తక్బీరె తహ్రీమా (మొదటి తక్బీర్) చెప్పేటప్పుడు మాత్రమే చేతులు పైకెత్తేవారు. ఆ తరువాత చేతులు పైకెత్తేవారు కాదు."



దైవప్రవక్త(స) ప్రవచనం: "ఏడు సందర్భాలలో తప్పమరే సందర్భంలోనూ చేతులు పైకెత్తకూడదు. 1-తక్బీరెతహ్రీమా (నమాజ్‌లో మొదటితక్బీర్) చెప్పేటప్పుడు, 2-దుఆయే ఖునూత్‌కు సంబంధించిన తక్బీర్ చెప్పేటప్పుడు, 3-ఈద్‌నమాజ్ తక్బీర్‌లు చెప్పేట ప్పుడు, 4-అరఫాత్‌తక్బీర్ చెప్పేటప్పుడు, 5-జమ్రాలతక్బీర్ చెప్పేటప్పుడు, 6-సఫా మర్వా ల తక్బీర్ చెప్పేటప్పుడు, 7-ఇస్తిలాం తక్బీర్ చెప్పేటప్పుడు." (హదాయ వ దరాయ)

## చేతులు రొమ్ముపైనా, నాభిపైనా?

(6) చేతులు కట్టుకోవడం గురించి విభిన్న ఉల్లేఖనాలలో **I**-కుడి ముంజేతిని ఎడమ మోచేతి కీలు మీద పెట్టుకొని రొమ్ముపై కట్టుకోవాలని, **II**-కుడి ముంజేతిని ఎడమ ముంజేతి మీద పెట్టుకొని రొమ్ముపై కట్టుకోవాలని, **III**-కుడి ముంజేతిని ఎడమ ముంజేతి మీద పెట్టుకొని నాభి మీద లేదా నాభి కింద కట్టుకోవాలని, **IV**-అసలు చేతులు కట్టుకోకుండా కిందికి జార విడువాలని నాలుగు రకాల పద్ధతులు ఉన్నాయి. ఈ నాలుగు పద్ధతుల్లో మొదటి రెండు పద్ధతుల్ని అహ్లెహదీస్ దృక్పథకులు అవలంబించారు. హనఫీ దృక్పథకులు మూడవ పద్ధతిని పురుషులకు, రెండవ పద్ధతిని స్త్రీలకు వర్తింపజేశారు. హంబలీ దృక్పథకులు స్త్రీపురుషులు ఉభయులకూ మూడవ పద్ధతినే వర్తింపజేశారు. నాలుగవ పద్ధతిని మాలికీ దృక్పథకులు అవలంబించారు. అయితే ఎవరినీ తప్పు పట్టడం ఏమాత్రం మంచిది కాదు. ఎవరి దృక్పథానికి అనుకూలంగా వారి ప్రమాణాలు ఉన్నాయి.

**I**-హజ్రత్ హులబ్ తాయీ (రజి) కథనం: "నేను, దైవప్రవక్త (స) కుడిచేతిని ఎడమ మోచేతి కీలుపై పెట్టుకొని రొమ్ముపై కట్టుకుంటుంటే చూశాను." (అహ్మద్, తిర్మిజి)

**II**-హజ్రత్ వాయిల్ బిన్ హుజర్ (రజి) ఉల్లేఖనం: "నేను దైవప్రవక్త (స)తో కలసి నమాజ్ చేశాను. ఆయన తన కుడిచేతిని ఎడమచేతి మీద పెట్టుకొని రొమ్ముపై కట్టుకున్నారు." (ఇబ్నెఖుజైమా)

**III**-హజ్రత్ జరీర్ జబీ (రజి) ఉల్లేఖనం: "హజ్రత్ అలి (రజి) చేతులు నాభి పైన కట్టుకుంటుంటే చూశాను నేను." (అబూదావూద్)

హజ్రత్ హుజైఫా (రజి) ఉల్లేఖనం ప్రకారం హజ్రత్ అలి (రజి) ఇలా అన్నారు: "చేయిపై చేయిపెట్టి నాభి కింద కట్టుకోవడమే సంప్రదాయం (సున్నత్)." (అబూ దావూద్, అహ్మద్, ఇబ్నె అబీషైబా, దార్‌ఖుత్నీ, బైహఖీ)

హజ్రత్ అల్ఖమా (రజి) నుండి హజ్రత్ వాయిల్ బిన్ హుజర్ ఉల్లేఖించిన ఒక హదీస్‌లో తాను దైవప్రవక్త (స)ను నాభి కింద చేతులు కట్టుకోవడం చూశానని ఆయన అన్నారు. అల్లామా ఫరంగిమహల్లా (రహ్మ) 'అల్‌ఖౌలుల్‌హాజిమ్'లో ఈహదీస్‌ని పేర్కొంటూ, ఇందులోని ఉల్లేఖకులందరూ విశ్వసనీయులనే, హజ్రత్ అల్ఖమా (రజి)ను హజ్రత్ ఇబ్నెహుజర్ కలుసుకున్నారనేవి నిరూపిత విషయాలని అన్నారు. (ఆసాన్ ఫిఖా-1)

**IV**-హజ్రత్ జాబిర్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (స) ఇలా అన్నారు: "ఏమిటీ, నేను మిమ్మల్ని తిరిగిన గుర్రపు తోకల మాదిరిగా చేతులు పైకెత్తడం చూస్తున్నాను? (అలా చేయకండి.) నమాజ్ నింపాదిగా చేయండి." (ముస్లిం, అబూదావూద్)

హేతుబద్ధంగా ఆలోచిస్తే ఈ అయిదు పద్ధతులూ సమంజసమైనవేనని అన్పిస్తోంది. **I**-పద్ధతిలో చదువురాని అమాయక కార్మికుడు తన యజమాని ముందు నిలబడినప్పుడు ప్రదర్శించే వినయ భావం ద్యోతకమవుతుంది. **II**-పద్ధతిలో సేవకుడు దర్పం, గాంభీర్యతలు గల యజమాని ముందు వణుకుతూ నిలబడినప్పుడు ప్రదర్శించే భయభక్తుల భావం గోచరిస్తుంది. **III, IV**-పద్ధతుల్లో సభ్యతా నాగరికతలు తెలిసిన ఒక ఉద్యోగి తన పైఅధికారి ముందు నిలబడినప్పుడు ప్రదర్శించే విధేయతా భావం వ్యక్తమవుతుంది. **V**-పద్ధతిలో మంచి క్రమశిక్షణ ఉన్న సైనికుడు తన సైన్యాధ్యక్షుడి ముందు సావధానంగా నిలబడినప్పుడు ప్రదర్శించే వినయ విన్రమతలు గోచరిస్తాయి. కనుక వీటిలో ఏ ఒక్క పద్ధతీ ఇతర పద్ధతుల కంటే నీచమైనదని, తక్కువ స్థాయి కలదని కొట్టిపారేయకూడదు.

(7) హ్రజత్ ఉమర్ (రజి) తక్బీరెతహ్రీమా (అంటే అల్లాహుఅక్బర్ అని చెప్పి చేతులు పైకెత్తి దించిన) తర్వాత 'సనా' ఇలా పఠించేవారు: "సుబ్‌హానక అల్లాహుమ్మ వబిహమ్‌దిక వతబార కస్ముక వతఆలా జద్దుక వలాఇలాహ గైరుక్" (ముస్లిం)

అర్థం:- దేవా! నీవు పరమ పవిత్రడవు. ప్రశంసలకు నీవే అర్హుడవు. నీవే శుభ దాయకుడవు, మహోన్నతుడవు. నీ పేరు, ప్రాభవం ఎంతో ఉన్నతమైనవి. నీవు తప్ప మరే ఆరాధ్యనీయుడు లేడు.)

హ్రజత్ అబూహురైరా (రజి) ప్రకారం దైవప్రవక్త (స) తక్బీరెతహ్రీమా తరువాత ఈ దుఆ చేసేవారు: "అల్లాహుమ్మ బాయిద్ బైని వబైన ఖతాయాయ కమా బాఅద్‌త బైనల్ మష్రిఖివల్‌మగ్రిబి అల్లాహుమ్మ నఖ్ఖిని మిన్ఖతాయాయ కమా యునఖ్ఖస్సౌబుల్ అబ్ యజు మినద్దనసి అల్లాహుమ్మ ఇగ్‌సిల్‌మినీన్ ఖతాయాయ బిస్సల్జివల్‌మాయి వల్‌బర్ద్."

అర్థం:- దేవా! నాకు, నా పాపాలకు తూర్పు పడమరల మధ్య ఉన్నంత దూరం ఉంచు. దేవా! తెల్లబట్ట మురికి పోయి ఎలా పరిశుభ్రమవుతుందో అలా నా పాపాలు ప్రక్షాళనం చేసి నన్ను పవిత్రుడ్ని చెయ్యి. దేవా! నా పాపాలను నీటితో, మంచుతో, వడగళ్ళతో కడిగెయ్యి.)- (ముస్లిం)

(8) ఆ తర్వాత 'తఅవ్వుజ్' (అంటే అవూజుబిల్లాహి) పఠించడం అభిలషనీయం.

"మీరు ఖుర్‌ఆన్ పఠించడానికి ఉపక్రమించినప్పుడు (ముందుగా) శాపగ్రస్తుడైన షైతాన్ బారినుండి దేవుడ్ని శరణు వేడుకోండి." (ఖుర్‌ఆన్-16:98)

హ్రజత్ నాఫె బిన్ జుబైర్ (రజి) ఉల్లేఖనం: "దైవప్రవక్త (స) (ఖుర్‌ఆన్ పఠనానికి ముందు) 'అవూజుబిక మినష్షైతానిర్రజీం' (నేను శాపగ్రస్తుడైన షైతాన్ కీడు నుండి నీ శరణు కోరుతున్నాను) అని పఠించేవారు." (అహ్మద్, అబూదావూద్, ఇబ్నెమాజ)

ఈ హదీస్‌ని బట్టి ప్రతి రకాత్‌లోనూ 'అవూజుబిల్లాహి' పఠించవచ్చని తెలుస్తోంది. ఈ పద్ధతిని షాఫయి దృక్పథం పండితులు అవలంబించారు. అయితే వేరొక హదీస్‌లో మొదటి రకాత్ ప్రారంభంలో మాత్రమే 'అవూజుబిల్లాహి' పఠించాలని ఉంది. ఈ పద్ధతిని హంబలి, హనఫీ పండితులు అవలంబించారు. దీనికి సంబంధించిన హదీస్ ఇలా ఉంది:

"దైవప్రవక్త (స) రెండవ రకాత్ కోసం లేచినప్పుడు 'అల్‌హమ్దులిల్లాహిరబ్బిల్ ఆలమీన్' నుండి ఖుర్‌ఆన్ పఠనం ప్రారంభించేవారు." (ముస్లిం)



'అవూజుబిల్లాహి' తరువాత 'బిస్మిల్లా' పఠించాలా లేక బిస్మిల్లా పఠించకుండానే అల్‌హమ్ సూరాతో నమాజ్ ప్రారంభించాలా అనే విషయంలో ప్రవక్త అనుచరుల్లో కూడా భేదాభిప్రాయాలు ఉన్నాయి.

హ్రజత్ అనస్ (రజి) కథనం: "నేను దైవప్రవక్త (స) వెనుక, అబూబకర్ (రజి) వెనుక, ఉమర్ (రజి) వెనుక, ఉస్మాన్ (రజి) వెనుక నమాజ్ చేశాను. వీరంతా 'బిస్మిల్లా'ని నిశ్శబ్దంగా పఠించేవారు." (నసాయి, ఇబ్నెహబ్బాన్, తహావీ)

ఇమామ్ ఇబ్నెఖయ్యూమ్ (రహ్మాలై) కథనం: "దైవప్రవక్త (స) 'బిస్మిల్లా'ని శబ్దంగా పఠించేవారు. అయితే ఎక్కువగా నిశ్శబ్దంగానే పఠించేవారు." (ఫిఖహ్‌సున్న)

(9) తరువాత ప్రతి రకాత్‌లో ఫాతిహా (అల్‌హమ్దు) సూరా పఠించడం విధి (ఫరజ్).

దైవప్రవక్త (స) ప్రవచనం: "ఫాతిహా సూరా పఠించకుండా నమాజ్ చేస్తే ఆ నమాజ్ నమాజే కాదు." (బుఖారి, ముస్లిం, అహ్మద్, అబూదావూద్, తిర్మిజి, ఇబ్నెమాజ)

మనిషి నమాజ్ ఒంటరిగా చేసినా, సామూహికంగా చేసినా ఫాతిహా సూరా చివర్లో 'ఆమీన్' అని పలకాలి. ఈ విషయంలో ఎలాంటి భేదాభిప్రాయాలు లేవు.

దైవప్రవక్త (స) ప్రవచనం: "మీలో ఎవరైనా 'ఆమీన్' అనగానే ఆకాశంలో దైవ దూతలు కూడా 'ఆమీన్' అంటారు. ఇలా మీరు చెప్పే ఆమీన్, వారు పలికే ఆమీన్ కలసిపోతాయి. ఆపై ఆమీన్ చెప్పే మనిషి గతపాపాలన్నీ క్షమించబడతాయి." (బుఖారి)

(10) తరువాత రెండవ సూరాగా మరేదైనా సూరాగాని, ఒక సూరాలో కొంతభాగం గాని పఠించాలి. ఈ రెండవ సూరా ఫజర్, జుమా ఫరజ్ నమాజుల్లోని రెండు రకాతుల్లో; జుహర్, అసర్, మగ్రిబ్, ఇషా నమాజుల్లోని మొదటి రెండు రకాతుల్లో పఠించాలి.

హ్రజత్ అబూసయీద్ (రజి) కథనం: "ఫాతిహాసూరా (ప్రారంభధ్యాయం) తరువాత ఖుర్‌ఆన్‌లో మాకు సులభంగా ఉన్న భాగం పఠించాలని దైవప్రవక్త (స) మమ్మల్ని ఆదేశించారు." (అబూదావూద్)

## రఫెయదైన్ ఎన్నిసార్లు చేయాలి?

(11) నమాజ్‌లో చేతులు చెవులదాకా లేక భుజాలదాకా పైకెత్తడాన్ని రఫెయదైన్ అంటారు. అయితే ఈ 'రఫైయదైన్' ఒక రకాత్‌లో ఎన్నిసార్లు చేయాలా అనే విషయమై పండితుల్లో భేదాభిప్రాయాలున్నాయి. ఎవరి ఆధారాలు, ప్రమాణాలు వారికున్నాయి. నమాజ్ ప్రారంభంలో తక్బీరె తహ్రీమా చెబుతున్నప్పుడు ఒకసారి మాత్రమే చెప్పాలన్నది హనఫీ పండితుల దృక్పథం. ప్రతిరకాత్‌లో 'రుకూ' చేయబోతున్నప్పుడు, రుకూ నుండి లేస్తున్నప్పుడు కూడా చేయాలన్నది అహ్లెహదీస్ పండితుల దృక్పథం.

హ్రజత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి) కథనం: "దైవప్రవక్త (స) నమాజ్ కోసం నిల బడినప్పుడు చేతులు భుజాలదాకా పైకెత్తి 'అల్లాహుఅక్బర్' అని పలికేవారు. రుకూ చేస్తు న్నప్పుడు కూడా చేతులు భుజాలదాకా పైకెత్తేవారు. రుకూ నుండి తలెత్తేటప్పుడు కూడా చేతులు భుజాలదాకా పైకెత్తేవారు. తరువాత 'సమీఅల్లాహు లిమన్‌హమీదహూ రబ్బనా లకల్‌హమ్దు' అని పలికేవారు." (బుఖారి, ముస్లిం, బైహఖి)

హజ్రత్ నాఫె (రజి) కథనం: "హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి) రెండవ రకాత్ తరువాత మూడో రకాత్ ఆరంభంలో చేతులు పైకెత్తేవారు. దైవప్రవక్త (స) కూడా ఇలాగే చేసేవారని ఆయన మాకు తెలియజేశారు." (బుఖారి, అబూదావూద్, నసాయి)

హజ్రత్ అబ్దుల్లా బిన్ మస్ఊద్ (రజి) కథనం: "దైవప్రవక్త (స) నమాజ్ ఎలా చేసేవారో నేను మీకు చూపిస్తాను చూడండి" అంటూ ఆయన నమాజ్‌చేశారు. అప్పుడు ఆరంభంలో ఒకసారి తప్ప మళ్ళీ రఫేయదైన్ చేయలేదు." (అబూదావూద్, అహ్మద్, తిర్మిజి, తహావీ, మువత్తా-ఇమామ్ ముహమ్మద్)

హజ్రత్ అబ్దుల్లా బిన్ మస్ఊద్ (రజి) కథనం: "నేను దైవప్రవక్త (స) వెనుక, అబూబకర్ (రజి) వెనుక, ఉమర్ (రజి) వెనుక నమాజ్ చేశాను. వారు మొదటి సారి తక్బీర్ పలికేటప్పుడు మాత్రమే రఫేయదైన్ చేసేవారు." (దార్‌ఖుత్నీ, బైహఖి)

హజ్రత్ అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి) కథనం: "దైవప్రవక్త (స) రుకూ చేయబోతున్నప్పుడు, రుకూ నుండి లేచేటప్పుడు రఫేయదైన్ చేసేవారు. ఈవిధంగా ఆయన ప్రారంభంలో చేసేవారు. తర్వాత ఇలా రఫేయదైన్ చేయడం మానేశారు." (ముస్నద్ ఇమామ్ అబూహనీఫా-ఫిఖ్‌హ్‌సున్న)

హనఫీ దృక్పథం పండితులు చేతులు చెవులదాకా ఎత్తే పద్ధతిని పురుషుల కోసం, భుజాల దాకా ఎత్తే పద్ధతిని స్త్రీల కోసం నిర్ణయించారు.

(12) వివిధ హదీసుల్ని బట్టి రుకూలో 'సుబ్‌హాన రబ్బియల్ అజీం' (నా ప్రభువు పరిశుద్ధుడు, మహోన్నతుడు) అని మూడు లేక అయిదు లేక ఏడు లేక తొమ్మిది లేక పదకొండు సార్లు చెప్పాలని తెలుస్తోంది. హజ్రత్ ఉఖబా బిన్ ఆమిర్ (రజి) కథనం: "దైవప్రవక్త (స) 'ఫసబ్బిహ్ బిస్మిరబ్బికల్‌అజీం' అనే (ఖుర్‌ఆన్) సూక్తి అవతరించినప్పుడు దాన్ని మీ 'రుకూ'లో వాడుకోండి అని చెప్పారు." (అహ్మద్, అబూదావూద్)

(13) రుకూ నుండి లేచేటప్పుడు 'సమీఅల్లాహు లిమన్‌హమీదహ్' (దేవుడు తనను స్తుతించినవాని పలుకులు విన్నాడు) అని పలకాలి. నిటారుగా నిలబడిన తరువాత 'రబ్బనా లకల్‌హమ్ద్' (మాప్రభూ, అన్నివిధాల ప్రశంసలు నీకే శోభిస్తాయి) లేక 'రబ్బనా వలకల్‌హమ్ద్' అని పలకాలి.

హజ్రత్ అబూహురైరా (రజి) కథనం: "దైవప్రవక్త (స) రుకూ స్థితి నుండి నడుం లేపేటప్పుడు 'సమీఅల్లాహు లిమన్‌హమీదహ్' అని, నిలబడిన తరువాత 'రబ్బనా వలకల్‌హమ్ద్' అని పలికేవారు." (బుఖారి, ముస్లిం, అహ్మద్)

హజ్రత్ రిఫా బిన్ రాఫె (రజి) కథనం: ఓరోజు మేము దైవప్రవక్త (స) వెనుక నమాజ్ చేస్తున్నాం. దైవప్రవక్త (స) రుకూ నుండి లేస్తూ 'సమీఅల్లాహు లిమన్‌హమీదహ్' అన్నారు. అప్పుడు వెనుక నుండి ఒకతను 'రబ్బనా లకల్‌హమ్దు హమ్దన్‌కసీరన్ తయ్యిబన్ ముబారకన్ ఫీహి' (దేవా! స్తోత్రం నీకే శోభిస్తుంది. అత్యధిక పవిత్రతా పరిశుద్ధతలు, శ్రేయోశుభాలు సమస్తం నీ కోసమే) అని పలికాడు. దైవప్రవక్త (స) నమాజ్ ముగిసిన తరువాత "ఇప్పుడు (నమాజ్‌లో) ఎవరు మాట్లాడింది?" అని ప్రశ్నించారు.



దానికా వ్యక్తి "నేనే దైవప్రవక్తా!" అన్నాడు. అప్పుడు దైవప్రవక్త (స) ఇలా చెప్పారు: "ఇప్పుడే నేను ముప్ఫయి మందికి పైగా దైవదూతల్ని చూశాను. వారా 'దుఆ'ను వ్రాసుకోవడానికి పరస్పరం పోటీపడుతూ దాని వైపు లంఘించారు." (బుఖారి, అహ్మద్)

## సజ్దా (సాష్టాంగప్రణామం) చేసే విధానం

(14) తరువాత తక్బీర్ (అంటే అల్లాహుఅక్బర్) పలుకుతూ సజ్దా స్థితిలోకి పోవాలి.

హజ్రత్ బరా (రజి) కథనం: "దైవప్రవక్త (స) సమిఅల్లాహు లిమన్‌హమిదహ్ అని రుకూ నుండి లేచి నిలబడి సజ్దా కోసం శిరస్సు నేలపై ఆనించనంత వరకు మాలో ఏ ఒక్కరూ (సజ్దా కోసం) నడుం వంచేవారు కాదు." (బుఖారి)

హజ్రత్ వాయిల్ బిన్ హుజర్ (రజి) కథనం: "నేను దైవప్రవక్త (స)ను సజ్దా చేస్తుండగా చూశాను. ఆయన సజ్దా చేస్తున్నప్పుడు చేతులు నేలకు ఆనించడానికి ముందు మోకాళ్ళు నేలకు ఆనించేవారు. సజ్దా నుండి లేస్తున్నప్పుడు మోకాళ్ళు లేపడానికి ముందు చేతులు లేపేవారు." (అబూదావూద్, తిర్మిజి, నసాయి, ఇబ్నెమాజ)

హజ్రత్ అబ్దుల్లా బిన్ సుహైనా (రజి) కథనం: "దైవప్రవక్త (స) సజ్దా చేస్తున్నప్పుడు తమ చంకలు కన్పించేటంతగా చేతుల్ని పక్కలకు ఎడం ఉంచేవారు." (బుఖారి)

హజ్రత్ బరా బిన్‌ఆజిమ్ (ర) ప్రకారం దైవప్రవక్త (స) ఇలా చెప్పారు: "మీరు సజ్దా చేస్తున్నప్పుడు మీ అరచేతుల్ని నేల మీద ఆనించి, మోచేతుల్ని పైకెత్తండి." (ముస్లిం)

దైవప్రవక్త (స) ప్రవచనం: "నాకు ఏడు ఎముకల (అవయవాల)పై సజ్దా చేయమని ఆదేశించబడింది." ఆయన ఈమాట చెప్పి "నుదురు-ముక్కు, రెండు చేతులు, రెండు మోకాళ్ళు, రెండు పాదాలు" అంటూ సైగచేసి చూపారు. (బుఖారి, ముస్లిం)

పై హదీస్‌లో నుదురు, ముక్కు రెండిటిని ఒకే దేహాంగంగా లెక్కించినట్లు తెలుస్తోంది. వాటిని వేర్వేరుగా లెక్కిస్తే మొత్తం ఎనిమిది అవయవాలు అవుతాయి. ఇలా ఎనిమిది అంగాలను నేలకు ఆనించి చేసే సజ్దానే హిందూమతగ్రంథాల్లో సాష్టాంగప్రణామం అన్నారు.

దైవప్రవక్త (స) ప్రవచనం: "సజ్దాలో మధ్యేమార్గం అవలంబించండి. మీలోఎవరూ కుక్కలాగా చేతిరెక్కలు మరీఎడంగా చాచకండి." (బుఖారి, ముస్లిం, అబూదావూద్)

హజ్రత్ అబూహమీద్ (రజి) కథనం: "దైవప్రవక్త (స) సజ్దా చేస్తున్నప్పుడు తొడల్ని పొట్టకు ఆనించకుండా ఎడంగా ఉంచేవారు." (అబూదావూద్)

## స్త్రీలు చేసే సజ్దా పద్ధతి

స్త్రీలు చేసే సజ్దా విషయంలో కూడా అహ్లెహదీస్ దృక్పథానికి, హనఫీ దృక్పథానికి తేడా ఉంది. అహ్లెహదీస్ దృక్పథం ప్రకారం స్త్రీలు పురుషులు మాదిరిగా పిరుదులు ఎత్తిపెట్టి సజ్దా చేస్తారు. హనఫీదృక్పథం ప్రకారం స్త్రీలు సజ్దాస్థితిలో తమ పొట్టను తొడలకు, బాహువుల్ని చంకలకు ఆనించి ఉంచాలి. మోచేతుల్ని పైకెత్తకుండా అరచేతులతో పాటు నేల మీదనే ఆనించాలి. అలాగే కాళ్ళ మడిమలను పైకి లేపకుండా నేల మీదనే పరచిఉంచాలి. ఖాయిదాలో రెండుపాదాలను కుడి వైపుకు తీసి, రెండు తొడల్ని దగ్గరకు చేర్చి, ఎడమ

ముంగాలిపై కుడిముంగాలు, తొడ ఉండేలా కూర్చోవాలి. ఈ రెండు దృక్పథాలకు కూడా అనుకూలమైన ఉల్లేఖనాలు ఉన్నాయి.

దైవప్రవక్త (సల్లం) ఇద్దరు స్త్రీలు నమాజ్ చేస్తున్నప్పుడు వారి దగ్గరకు వెళ్ళారు. ఆయన వారిద్దర్ని ఉద్దేశించి "మీరు సజ్దా చేసేటప్పుడు నేలకు అతుక్కుపోవాలి; మీ శరీరాన్ని నేల మీద ఆనిచ్చి పెట్టండి" అని చెప్పారు. (అబూదావూద్)

దైవప్రవక్త (సల్లం) మరొక సందర్భంలో ఇలా ప్రవచించారు: "స్త్రీ సజ్దా చేస్తున్నప్పుడు పొట్టను తొడలతో కలపాలి." (బైహఖి)

హనఫీ, షాఫయి, హంబలి దృక్పథాల ప్రకారం స్త్రీలు సజ్దా చేస్తున్నప్పుడు తొడలను పొట్టలకు ఆనించాలి. దాని వల్ల వారి "సతర్" (శరీరం మీద ఉండవలసిన కనీస ఆచ్ఛాదన) సురక్షితంగా ఉంటుంది. (ఫిఖ్‌హుస్సున్న)

(15) సజ్దా స్థితిలో "సుబ్‌హాన రబ్బియల్‌ఆలా" (నా ప్రభువు పవిత్రుడు, మహోన్నతుడు) అని కనీసం మూడు సార్లు ఉచ్చరించాలి.

హజ్రత్ అఖ్బా బిన్ ఆమిర్ (రజి) కథనం: "దైవప్రవక్త (స) 'సబ్బిహిస్మరబ్బికల్‌ఆలా' అనే ఖుర్‌ఆన్ సూక్తి అవతరించినప్పుడు, దాన్ని సజ్దాలో వాడుకోండి అన్నారు మాతో." (అహ్మద్, అబూదావూద్, ఇబ్నెమాజ, హాకిమ్)

హజ్రత్ అబూహురైరా (రజి) ప్రకారం దైవప్రవక్త (స) సజ్దాలో ఈ దుఆ పఠించేవారు: "అల్లాహుమ్మగ్ఫిర్లీ జనూబి కుల్లహూ దిఖ్ఖహూ వ జుల్లహూ అవ్వలహూ వ ఆఖిరహూ (దేవా! నా పాపాలన్నీ క్షమించు. చిన్నపాపాలు, పెద్దపాపాలు, గతపాపాలు, భావిపాపాలు, బహిరంగపాపాలు, రహస్యపాపాలు సమస్తం మన్నించు)." (ముస్లిం)

దైవప్రవక్త (స) ప్రవచనం: "మనిషి సజ్దా స్థితిలోనే తన ప్రభువుకు అతి సమీపంగా ఉంటాడు. కనుక మీరు సజ్దా స్థితిలో ఎక్కువగా దుఆ చేస్తూవుండండి." (మిష్కాత్)

దైవప్రవక్త (స) ఇలా అన్నారు: "రుకూ, సజ్దాలలో ఖుర్‌ఆన్ పఠించకూడదని నన్ను వారించడం జరిగింది." (అహ్మద్, ముస్లిం)

హజ్రత్ ఆయిషా ఇలా తెలిపారు: "దైవప్రవక్త (స) ఎడమకాలు (పాదం) నేలమీద పరచి, కుడికాలు (పాదం)ను నిటారుగా నిలబెడతారు." (బుఖారి, ముస్లిం)

హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి) కథనం: "కుడికాలు (పాదం)ను వ్రేళ్ళు ఖిబ్లా వైపు ఉండేలా నిలబెట్టి, ఎడమకాలు మీద కూర్చోవడమే సంప్రదాయం." (నసాయి)

హజ్రత్ అబూహురైరా (రజి) కథనం: "దైవప్రవక్త (స) నన్ను (నమాజ్‌లో) మూడు పనులు చేయకూడదని వారించారు. 1-కోడిలా టకటక పొడవడం (అంటే రుకూ, సజ్దాలు తొందరతొందరగా చేయడం), 2-కుక్కలా కూర్చోవడం, 3-నక్కలా అటూఇటూ తొంగిచూడటం." (అహ్మద్, బైహఖి, తబ్రాని)

హజ్రత్ మాలిక్ బిన్ హువైరిస్ (రజి) కథనం: "నేను దైవప్రవక్త (స)ను నమాజ్ చేస్తుండగా చూశాను. బేసి రకాత్ చేస్తున్నప్పుడు ఆయన నిటారుగా నిలబడనంతవరకు



(తరువాతి రకాత్ కోసం) లేచేవారు కాదు." (బుఖారి, అబూదావూద్, తిర్మిజి)

హజ్రత్ ఇబ్నెఅబ్బాస్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (స) రెండు సజ్దాల మధ్య ఈ విధంగా దుఆ చేసేవారు: "అల్లాహుమ్మగ్ఫిర్లి రబ్బిగ్ఫిర్లి (దేవా! నన్ను కనికరించు. నాకు సంక్షేమం, సద్బుద్ధి, ఉపాధి ప్రసాదించు)." (అబూదావూద్, ఇబ్నెమాజ, తిర్మిజి)

(16) రెండు సజ్దాలు చేసిన తరువాత 'అల్లాహుఅక్బర్' అంటూ లేచి నిలబడాలి. రెండవ రకాత్ 'బిస్మిల్లా'తో ప్రారంభించి మొదటి రకాత్ మాదిరిగానే చేయాలి.

## తషహ్హుద్, దరూద్

(17,18) రెండవ రకాత్‌లోని రెండు సజ్దాల తర్వాత నింపాదిగా కూర్చొని 'తషహ్హుద్' పఠించాలి. తషహ్హుద్‌లో "అష్‌హదుఅన్ ల్లాఇలాహ ఇల్లల్లాహు" అనే వాక్యం వచ్చినప్పుడు కుడిచేయి చూపుడు వ్రేలు పైకెత్తి సైగ చేయాలి.

హజ్రత్ అబ్దుల్లా బిన్ మస్‌వూద్ (రజి) కథనం: ప్రారంభంలో మేము దైవప్రవక్త (స)తో కలసి నమాజ్ చేస్తున్నప్పుడు (తషహ్హుద్‌లో) "దైవదాసుల ప్రస్తావనకు ముందు దేవునికి శాంతి కలుగుగాక అని, తరువాత జిబ్రయీలుకు, మెకాయీల్‌కు, ఫలానా మనిషికి (ఇలా) మొదలగువారికి శాంతి కలుగుగాక" అని పఠించేవాళ్ళము. అయితే ఓరోజు నమాజ్ ముగిసిన తరువాత దైవప్రవక్త (స) మావైపుకు తిరిగి ఇలా అన్నారు-

"దేవుడు స్వయంగా శాంతిమయుడు. (మీరాయనకు శాంతి కలుగుగాకని చెప్పనవసరం లేదు. కనుక మీరు (తషహ్హుద్ పఠించడానికి) కూర్చున్నప్పుడు ఇలా అనండి- 'అత్తహియ్యాతు లిల్లహి వస్సలాతు వత్తయ్యిబాతు అస్సలాము అలైక అయ్యుహన్నబియ్యు వరహ్మతుల్లహి వబరకాతుహూ అస్సలాము అలైనా వఅలా ఇబాదిల్లాహి స్సాలిహీన అష్‌హదుఅన్ ల్లాఇలాహ ఇల్లల్లాహు వఅష్‌హదు అన్న ముహమ్మదన్ అబ్‌దుహూ వరసూలుహూ.' (అర్థం- సకల ప్రశంసలు, స్తోత్రాలు, ఆరాధనలు, పరిశుద్ధ విషయాలు దేవునికి మాత్రమే శోభిస్తాయి. దైవప్రవక్తా! మీపై శాంతి నెలకొను గాక. దేవుని కారుణ్యం, ఆయన శుభాలు మీపై వర్షించుగాక. మాపై, సజ్జనులైన దైవదాసులందరిపై శాంతి నెలకొనుగాక. అల్లాహ్‌తప్ప మరోఆరాధ్యుడు లేడని, ముహమ్మద్ ఆయన దాసుడు, సందేశహరుడని నేను సాక్ష్యమిస్తున్నాను).

ఇలా పఠించడం వల్ల భూమ్యాకాశాల్లో ఉండే ప్రతి పుణ్యదాసుడికి శాంతి చేకూరుతుంది. ఆ తర్వాత మీకిష్టమైన దుఆ చేసుకోండి." (బుఖారి,ముస్లిం)

హజ్రత్ ఇబ్నెఉమర్ (రజి) కథనం: "దైవప్రవక్త (స) తషహ్హుద్ పఠించడానికి కూర్చున్నప్పుడు కుడిచేతిని కుడితొడ మీద, ఎడమచేతిని ఎడమతొడ మీద పెట్టుకునేవారు. (కుడిచేయి) వ్రేళ్ళను కలిపివుంచి చూపుడువ్రేలితో సైగ చేసేవారు." (ముస్లిం)

హజ్రత్ వాయిల్ బిన్ హుజర్ (రజి) కథనం: "....తర్వాత ఆయన (స) (చూపుడు) వ్రేలు ఎత్తి (అటూఇటూ) తిప్పుతూ దుఆ చేయడం నేను చూశాను." (అబూదావూద్)

(19) తషహ్హుద్ పఠించిన తరువాత 'దరూద్' పఠించాలి:

కాబ్ బిన్ ఉజర్ (రజి) కథనం: ఓసారి మేము దైవప్రవక్త (స)ను “దైవప్రవక్తా! మీకోసం, మీకుటుంబం కోసం సలాం ఎలా చెయ్యాలో మాకు దేవుడు తెలియజేశాడు. ఇక మీకోసం, మీకుటుంబం కోసం దరూద్ వేడుకోలు ఎలా చెయ్యాలో చెప్పండి” అని అడిగాము. అప్పుడాయన ఇలా చెప్పారు- “అల్లాహుమ్మ సల్లిఅలా ముహమ్మదిన్వ్వ వఅలాఆలి ముహమ్మదిన్ కమాసల్లయిత అలాఇబ్రాహీమ వఅలాఆలి ఇబ్రాహీమ ఇన్నక హమీదుమ్మజీద్. అల్లాహుమ్మ బారిక్అలా ముహమ్మదిన్వ్వఅలా ఆలిముహమ్మదిన్ కమాబారక్త అలాఇబ్రాహీమ వఅలాఆలిఇబ్రాహీమ ఇన్నక హమీదుమ్మజీద్.” (బుఖారి)

(అర్థం: దేవా! నీవు ఇబ్రాహీంపై, ఆయన కుటుంబీకులు-సంబంధీకులపై ఎలా కారుణ్యం కురిపించావో అలా ముహమ్మద్పై, ఆయన కుటుంబీకులు-సంబంధీకులపై కూడా కారుణ్యం కురిపించు. నిస్సందేహంగా నీవే ప్రశంసనీయుడవు, మహత్తు గలవాడవు. దేవా! ఇబ్రాహీంకు, ఆయన కుటుంబీకులు-సంబంధీకులకు ఎలా శుభాలు ప్రసాదించావో అలా ముహమ్మద్కు, ఆయన కుటుంబీకులు-సంబంధీకులకు కూడా శుభాలు ప్రసాదించు. నిస్సందేహంగా నీవే ప్రశంసనీయుడవు, మహత్తు గలవాడవు.)

హజ్రత్ అబూబకర్ (రజి) కథనం: ఓసారి దైవప్రవక్త (స)తో ఆయన అనుచరులు మాట్లాడుతూ “దైవప్రవక్తా! మేము మీకోసం దరూద్ వేడుకోలు ఎలా చెయ్యాలి?” అని అడిగారు. దానికి ఆయన ఇలా సమాధానమిచ్చారు: “ఇలా అనండి- అల్లాహుమ్మ సల్లి అలా ముహమ్మదిన్ వ్వఅజ్వాజిహీ వజుర్రియ్యతిహీ కమాసల్లయిత అలా ఇబ్రాహీమ వబారిక్ అలా ముహమ్మదిన్ వ్వ అజ్వాజిహీ వజుర్రియ్యతిహీ కమాబారక్త అలా ఆలి ఇబ్రాహీమ ఇన్నక హమీదుమ్మజీద్.” (బుఖారి, ముస్లిం)

దరూద్ తరువాత ఈ క్రింది దుఆలలో ఏదో ఒకటి పఠించాలి:

హజ్రత్ అబూబకర్ (రజి) కథనం: దైవప్రవక్త (స) నాకు నమాజ్లో పఠించడానికి ఈ దుఆ నేర్పారు- “అల్లాహుమ్మ ఇన్నీజలమ్తు నఫ్సీ జుల్మన్ కసీరన్వ్వలా యగ్ఫిరుజ్జునూబ ఇల్లాఅన్త ఫగ్ఫిర్లీ మగ్ఫిరతమ్మిన్ ఇన్దకవర్హమ్నీ ఇన్నక అన్తల్ గఫూరుర్రహీం.” (దేవా! నేను నా ఆత్మకు చాలా అన్యాయం చేసుకున్నాను. పాపాలు మన్నించేవారు నీవు తప్ప మరెవరూ లేరు. కనుక (దేవా!) నా పాపాలు క్షమించు. నన్ను కరుణించు. నిస్సందేహంగా నీవు ఎంతో క్షమించేవాడవు, కరుణించేవాడవు.)- (బుఖారి, ముస్లిం)

దైవప్రవక్త(స) నమాజ్లో ఈ దుఆ కూడా చేసేవారు: “అల్లాహుమ్మ ఇన్నీ అవూజుబిక మిన్ అజాబి జహన్నమ వమిన్ అజాబిల్ ఖబ్రి వ అవూజుబిక మిన్ఫిత్నతిల్ మసీహిద్దజ్జాలి వఅవూజుబిక మిన్ఫిత్నతిల్ మహ్యా వల్మమాతి అల్లాహుమ్మ ఇన్నీ అవూజుబిక మినల్ మఅ్సమి వల్మగ్రిమ్.” (దేవా! నరక, సమాధి యాతనల నుండి, దజ్జాల్ ఉపద్రవం నుండి, జీవన్మరణాల పరీక్ష నుండి నేను నీ రక్షణ కోరుతున్నాను. దేవా! పాపాల బారి నుండి, ప్రాణసంకటమైన రుణబాధ నుండి నీశరణు కోరుతున్నాను.) (బుఖారి, ముస్లిం)

(20) ఆ తరువాత కుడి ఎడమల వైపు ముఖం తిప్పుతూ మీపై శాంతి, దైవానుగ్రహాలు వర్షించుగాక అని సలాం చెప్పాలి.



హజ్రత్ ఇబ్నెఅబ్బాస్ (రజి) కథనం: “దైవప్రవక్త (స) ‘అస్సలాము అలైకుమ్ వరహ్మతుల్లాహ్’ అంటూ కుడి, ఎడమలు రెండు వైపులా ముఖం తిప్పి సలాం చెప్పేవారు.” (అహ్మద్, అబూదావూద్, తిర్మిజి, నసాయి, ఇబ్నెమాజ)

హజ్రత్ వాయిల్ బిన్ హుజర్ (రజి) కథనం: “నేను దైవప్రవక్త (స) వెనుక నమాజ్ చేశాను. ఆయన కుడి వైపు ముఖం తిప్పుతున్నప్పుడు ‘అస్సలాము అలైకుమ్ వరహ్మతుల్లాహి వబర్కాతుహూ’ అని, ఎడమ వైపు ముఖం తిప్పుతున్నప్పుడు ‘అస్సలాము అలైకుమ్ వరహ్మతుల్లాహ్’ అని చెప్పేవారు.” (అబూదావూద్)

## ఒక్కచూపులో పూర్తి విధానం

నమాజ్ చేసే పూర్తివిధానం ఏఒక్క ఉల్లేఖనంలో కూడా విపులంగా లేదు. పూర్తివిధానంలోని వివిధ అంశాలు విభిన్న ఉల్లేఖనాలలో ప్రస్తావించబడ్డాయి. అంచేత నేనిక్కడ నమాజ్ చేసే సంపూర్ణ విధానం సంక్షిప్తంగా పేర్కొంటున్నాను:

ఖిబ్లాకు అభిముఖంగా (అంటే కాబాలయం దిశకు తిరిగి) నిలబడి “ఇన్నివజ్జహ్తు వజ్హియ...” పఠించి నమాజ్ చేయడానికి సంకల్పించుకోవాలి. ఉదా:- “నేను ఫజర్ నమాజ్కు సంబంధించిన రెండు రకాతులు ఫరజ్ నమాజ్ చేస్తున్నాన’ని సంకల్పించుకొని ‘అల్లాహుఅక్బర్’ అంటూ రెండు అరచేతులు ఖిబ్లావైపుకు పెట్టి చెవులదాకా పైకెత్తాలి. తర్వాత వెంటనే చేతులు దించుతూ హనఫీదృక్పథం ప్రకారం ఎడమముంజేతిపై కుడి ముంజేయి ఉండేలా నాభిక్రింద కట్టుకోవాలి. రెండుపాదాల మధ్య 6-12 అంగుళాలు ఖాళీ ఉండాలి. దృష్టి సజ్దా చేసే చోటుపై ఉండాలి. అహ్లెహదీస్ దృక్పథం ప్రకారం అయితే చేతులు భుజాలవరకే ఎత్తి దించి, ఎడమముంజేతితో కుడిమోచేయి పైభాగంమీద, కుడిముంజేతితో ఎడమమోచేయి పైభాగంమీద ఉండేలా రొమ్ముమీద కట్టుకోవాలి. వీరు రెండు పాదాల మధ్య దాదాపు రెండడుగులు ఖాళీ ఉంచి నిలబడతారు.

తరువాత ఈవిధంగా ‘సనా’ (‘సుబ్హానక అల్లాహుమ్మవబిహమ్దిక) పఠించాలి. అహ్లెహదీస్ వారు ‘సనా’కు బదులు “అల్లాహుమ్మ బాయిద్ బైని వబైన...” అనే దుఆ చేస్తారు. ‘సనా’ తరువాత “అవూజు బిల్లాహి మినష్షయితా నిర్రజీం, బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీమ్” అని చెప్పి ‘ఫాతిహా సూరా’, ఆమీన్, మరేదైనా రెండవ సూరా పఠించాలి.

ఈవిధంగా పఠించిన తరువాత ‘అల్లాహుఅక్బర్’ అంటూ ‘రుకూ’లోకి పోయాలి. అంటే తలక్రిందుల ‘యల్’(**L**)షేప్లా వంగాలి. అరచేతులతో మోకాళ్ళు పట్టుకొని “సుబ్హాన రబ్బియల్ అజీం” అని కనీసం మూడుసార్లు పఠించాలి. తర్వాత “సమిఅల్లాహు లిమన్ హమిదహ్” అంటూ నిటారుగా లేచి నిలబడి “రబ్బనా లకల్హమ్ద్” అని చెప్పాలి. ఆ తర్వాత ‘అల్లాహుఅక్బర్’ అంటూ సజ్దాలోకి పోవాలి. మొదట మోకాళ్లు, అరచేతులు తరువాత ముక్కు, నుదురు నేలకు ఆనిచ్చి సజ్దా చేయాలి. ముఖం మధ్యలోఉండేలా చెవులకు రెండు వైపులా అరచేతులు నేలకు ఆనిచ్చి పెట్టాలి. మోచేతులు నేలకు తాకనీకూడదు. సజ్దా స్థితిలో “సుబ్హాన రబ్బియల్ ఆలా” అని కనీసం మూడుసార్లు చెప్పాలి. తర్వాత ‘అల్లాహుఅక్బర్’ అంటూ లేచి కూర్చోవాలి. ఎడమ మడమలపై పిరుదులు ఆనిచ్చి కుడిపాదం లేచి ఉండేలా నిటారుగా, నింపాదిగా కూర్చోవాలి. అహ్లెహదీస్ దృక్పథం ప్రకారం ఈ స్థితిలో “అల్లాహుమ్మగ్ఫిర్లీ వర్హమ్నీ” (దేవా! నన్ను క్షమించు, నాపై దయజూపు) అని వేడుకోవాలి. ఆ తర్వాత మళ్ళీ సజ్దా చేయాలి.

ఇలా రెండుసార్లు సజ్దా చేసిన తరువాత 'అల్లాహుఅక్బర్' అంటూ నిటారుగా లేచి నిలబడాలి. దీంతో ఒక రకాతు అవుతుంది. తిరిగి 'బిస్మిల్లా...., ఫాతిహా సూరా' పఠించి రెండవ సూరాగా మరేదైనా సూరా పఠించాలి. ఆతర్వాత మొదటి రకాత్ మాదిరిగానే ఒక రుకూ, రెండు సజ్దాలు చేసి నిటారుగా నింపాదిగా కూర్చొని 'తషహ్హుద్' (అత్తహియ్యాతు) పఠించాలి. ఇందులో 'లా ఇలాహ ఇల్లల్లహ్' అనే వాక్యం రాగానే కుడిచేతి వ్రేళ్ళు పిడికిలిగా మడచి, చూపుడు వ్రేలిని పైకెత్తి సైగ చేయాలి. ఆ వెనువెంటనే కుడిచేతి అయిదు వ్రేళ్ళను యథాప్రకారం చాచి మోకాలుపై ఉంచాలి. ఈవిధంగా రెండు రకాత్‌లు, తషహ్హుద్ పఠించిన తర్వాత 'దరూద్, దుఆ పఠించాలి. దరూద్, దుఆ పఠించిన తరువాత కుడివైపు ముఖం తిప్పుతూ "అస్సలాము అలైకుం వరహ్మతుల్లాహ్" అని పలకాలి. తరువాత ఎడమవైపు ముఖం తిప్పుతూ కూడా అదే విధంగా సలాం పలకాలి. దీంతో నమాజ్ ముగుస్తుంది.

మూడు లేక నాలుగు రకాత్‌ల ఫరజ్ నమాజ్ చేయవలసి వస్తే 'తషహ్హుద్' పఠించిన తరువాత 'అల్లాహుఅక్బర్' అంటూ లేచి నిలబడి మూడవ, నాల్గవ రకాతుల్లో ఫాతిహా సూరా మాత్రమే పఠించాలి. తర్వాత 'తషహ్హుద్‌తో పాటు దరూద్, దుఆ కూడా పఠించి, కుడిఎడమల వైపు ముఖంతిప్పుతూ సలాం పలకాలి. ఈవిధంగా ఈ నమాజు ముగుస్తుంది. నాలుగు రకాతుల సున్నత్ నమాజ్ చేయవలసివస్తే మూడవ, నాల్గవ రకాతుల్లో ఫాతిహా సూరాతో పాటు రెండవ సూరాగా ఖుర్‌ఆన్‌లోని మరేదైనా సూరా లేక సూరాలో కొంతభాగం కూడా పఠించాలి.

## వితర్, దుఆయె ఖునూత్

ఇషా తరువాత చేసే వితర్ నమాజ్‌ను గురించి దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు:

"దేవుడు మీకోసం ఒక నమాజ్ అధికంగా చేశాడు. అది వితర్ నమాజ్. మీరు దీన్ని ఇషా, ఉషోదయం వేళల మధ్య చేసుకోండి" (ఇబ్నెమాజ)

"దేవుడు మీకు మరొక నమాజ్ (కూడా) చేయాలని ఆజ్ఞ జారీచేశాడు. ఈ నమాజ్ మీ ఎర్రఒంటెల కంటే శ్రేష్ఠమైనది. అది వితర్ నమాజ్. దీన్ని మీకు ఇషా, ఉషోదయం వేళల మధ్య చేయాలని నిర్దేశించాడు." (అబూదావూద్, తిర్మిజి, ఇబ్నెమాజ)

ఇషా నమాజ్‌లోని ఫరజ్, సున్నత్, నఫిల్ తర్వాత మూడు రకాత్‌లు 'వితర్' నమాజ్ చేయాలి. ఇందులో రెండు రకాత్‌లు పైన పేర్కొన్నట్లే చేసి, 'తషహ్హుద్' తరువాత నిలబడి మూడవ రకాత్‌లో బిస్మిల్లా, ఫాతిహా సూరా, మరేదైనా రెండవ సూరా పఠించాలి. ఆ తరువాత 'అల్లహుఅక్బర్' అంటూ చేతులు చెవులదాకా పైకెత్తి, దించి నాభి క్రింద లేక నాభి పైన కట్టుకొని క్రింద పేర్కొన్నట్లు "ఖునూత్" దుఆ చేయాలి:

ఖునూత్ దుఆ: "అల్లహుమ్మ ఇన్నా నస్తఈనుక వనస్తగ్ఫిరుక వనుఅ్ మిను బిక వ నతవక్కలు అలైక వనుస్నీ అలైకల్ ఖైర వనష్కురుక వలా నక్ఫురుక వనఖ్‌లవు వ నత్‌రుకు మన్‌య్యఫ్‌జురుక అల్లాహుమ్మ ఇయ్యాక నఅ్‌బుదు వలక నుసల్లి వనుస్‌జుదు వ ఇలైక నస్‌ఆ వనహ్‌ఫిదు వనర్జూ రహ్మతక వనఖ్షా అజాబక ఇన్న అజాబక బిల్‌కుప్ఫారి ముల్‌హిఖ్"

(అర్థం: దేవా! మేము నీ సహాయం అర్థిస్తున్నాము. నీ నుండి పాపమన్నింపు కోరుతున్నాము. మేము నిన్ను విశ్వసించాము. నిన్నే నమ్ముకొని నీమీద ఆధారపడు



తున్నాము. నిన్ను బహువిధాల కొనియాడుతున్నాము. నీకు కృతజ్ఞతలు తెలుపుకుంటు న్నాము. నీ పట్ల కృతఘ్నులుగా ఉండబోము. నీ పట్ల కృతఘ్నత, అవిధేయతలు చూపేవారితో మేము ఎలాంటి సంబంధం పెట్టుకోము. మేము నిన్నే ఆరాధిస్తున్నాం. నీ ప్రసన్నత కోసమే నమాజ్ చేస్తున్నాము. నీ సన్నిధిలోనే సాష్టాంగ పడుతున్నాము. నీ వైపుకే మరలి వస్తాము. నీ ఆజ్ఞల్ని శిరసావహించడానికి మేము ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటున్నాము. నీ కరుణాకటాక్షాల పైనే ఆశలు పెట్టుకున్నాము. నీ శిక్షకు భయపడు తున్నాము. నీవు సత్యతిరస్కారుల్ని తప్పకుండా శిక్షిస్తావు.)

ఈ దుఆ పఠించిన తర్వాత యథాప్రకారం రుకూ-సజ్దాలు, తషహ్హుద్ వగైరా పఠించి నమాజ్ ముగించాలి. అహ్లెహదీస్ దృక్పథం కలవారు మూడవరకాత్ 'రుకూ' తరువాత ఖునూత్ దుఆ చేతులు కట్టుకొని చేయడానికి బదులు చేతులు జోడించి పైకెత్తి చేస్తారు. వారు ఫజర్ నమాజ్‌లో కూడా ఫరజ్ రెండవరకాత్ 'రుకూ' తర్వాత ఈ దుఆ చేస్తారు. ఈ రెండు పద్ధతులు కూడా సరైనవే. రెండిటికీ హదీసు ప్రమాణాలు ఉన్నాయి.

'ఖునూత్ దుఆ' వితర్ నమాజ్‌లో తప్ప మరే నమాజ్‌లో పఠించకూడదు. అయితే సామూహిక ఆపద వచ్చినప్పుడు ఫజర్ నమాజ్‌లో కూడా ఈ దుఆ చేయవచ్చు.

హజ్రత్ అనస్ (రజి) కథనం: "దైవప్రవక్త (స) ఒక నెలరోజుల పాటు (వితర్‌నమాజ్ చివరి రకాత్‌లో) రుకూ నుండి తల పైకెత్తిన తరువాత 'ఖునూతె నాజిలా' పఠించారు. అందులో ఆయన బనీసలీంకు చెందిన కొన్ని (రీల్, జక్వాన్) ఉపతెగలను శపించారు. ఆ బహుదైవారాధకుల వైపుకు నలభై లేక డెబ్భయి మంది (హదీస్ ఉల్లేఖకుడికి సంఖ్య గుర్తులేదు.) ఖారీల (ఖుర్‌ఆన్ పఠికుల)ను పంపితే వారిపై ఆ దుర్మార్గులు దాడిచేసి హతమార్చారు. ఈ సంఘటనతో దైవప్రవక్త (స) ఆ తెగలపై ఆగ్రహోదగ్రులైపోయారు. ఆయనలో అంతటి ఆగ్రహాన్ని నేనిదివరకు ఎన్నడూ చూడలేదు." (బుఖారి)

హజ్రత్ అబూహురైరా (రజి) కథనం: (ముస్లిం యుద్ధఖైదీల విముక్తి, అవిశ్వాసుల వినాశం కోసం) దైవప్రవక్త (సల్లం) నిరంతరాయంగా ఒక నెల రోజులదాకా ఇషా నమాజ్ తరువాత 'ఖునూత్ దుఆ' పఠించారు. ఆతర్వాత ఒక రోజు ఈ దుఆ పఠించ లేదు. పఠించక పోవడానికి కారణం అడిగితే "ముస్లిం ఖైదీలు విడుదలయి వచ్చారు కదా!" అన్నారు దైవప్రవక్త (సల్లం)- (అబూదావూద్)

దైవప్రవక్త (స) ఖునూత్ దుఆను ఇతర వేళల నమాజుల్లో కూడా పఠించినట్లు ఈ క్రింది ఉల్లేఖనాల ద్వారా తెలుస్తోంది.

హజ్రత్ అబూహురైరా (రజి) ఇలా అన్నారు: "నేను మీకు ఇంచుమించు దైవప్రవక్త (స) చేసేటటువంటి నమాజ్ చేసి చూపనా?" అని అన్నారు. తరువాత ఆయన జుహర్, ఇషా, ఫజర్ నమాజులలో 'సమిఅల్లాహు లిమన్‌హమిదహ్' అని పలికిన తరువాత ఖునూత్ దుఆ పఠించారు. ఆ దుఆలో అవిశ్వాసులపై అభిశాపం, విశ్వాసుల కోసం శ్రేయోసంక్షేమాలు ఉన్నాయి. (బుఖారి)

హజ్రత్ అనస్ (రజి) ఇలా తెలిపారు: "(దైవప్రవక్త కాలంలో) ఫజర్, మగ్రిబ్ నమాజుల్లో ఖునూత్ దుఆ పఠించడం జరుగుతుండేది." (బుఖారి)

హజ్రత్ సాద్ బిన్ తారిఖ్ అష్జయి (రజి) కథనం: నేను మా నాన్నను "నాన్నా! మీరు దైవప్రవక్త (స), అబూబకర్ (రజి), ఉమర్ (రజి), ఉస్మాన్ (రజి), అలి (రజి)ల వెనుక నమాజ్ చేసివున్నారు కదా! వీళ్ళంతా ఫజర్ నమాజ్‌లో ఖునూత్ దుఆ పఠించేవారా?" అని అడిగాను. దానికి ఆయన "అబ్బాయ్! ఇదొక కొత్త విషయం (బిద్అత్)" అని సమాధానం ఇచ్చారు. (బుఖారి, ముస్లిం, తిర్మిజి, నసాయి, ఇబ్నెమాజ)

హనఫీ దృక్పథం ప్రకారం వితర్ నమాజ్‌లో మూడు రకాత్‌లు పఠించాలి. షాఫయి, అహ్లెహదీస్ ప్రజలు ఒక్క రకాత్ మాత్రమే పఠిస్తారు. అహ్లెహదీస్ మూడు, అయిదు, ఏడు రకాత్‌ల నమాజ్‌ని కూడా సమర్థిస్తారు.

హజ్రత్ ఆయిషా (రజి) కథనం: "దైవపవక్త (స) రాత్రివేళ పదమూడు రకాతులు నమాజ్ చేసేవారు. వాటిలో మూడు వితర్‌కు సంబంధించిన రకాతులు, రెండు ఫజర్ వేళ సున్నత్‌కు సంబంధించిన రకాతులు కూడా ఉండేవి." (బుఖారి)

"దైవప్రవక్త (సల్లం) వితర్ నమాజ్‌లో మూడు రకాత్‌లు పఠించేవారు. ఆ తర్వాత చివర్లో (కుడి ఎడమల వైపు ముఖం తిప్పుతూ) సలాం చేసేవారు." (హాకిమ్)

హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) కథనం ప్రకారం దైవపవక్త (స) ఇలా ప్రవచించారు: "మీరు రాత్రివేళ చివరి నమాజ్‌ను వితర్ రూపంలో చేయండి." (బుఖారి, ముస్లిం)

ఈ ఆదేశం అభిలషనీయమైనదే కాని తప్పనిసరికాదు. ఎవరైనా ఇషా నమాజ్‌తో పాటు వితర్ నమాజ్ చేసి పడుకొని అర్థరాత్రిగాని, మూడవ జామునగాని మెలుకువ వచ్చి ఏదైనా నఫిల్ నమాజ్ చేయదలచుకుంటే నిరభ్యంతరంగా చేయవచ్చు.

హజ్రత్ ఆయిషా (రజి) కథనం: "దైవపవక్త (స) వితర్ నమాజ్ చేసిన తరువాత కూర్చొని మళ్ళీ రెండు రకాతులు (నఫిల్) నమాజ్ చేసేవారు." (ముస్లిం, అబూదావూద్)

పై ఉల్లేఖనంపై ఇమామ్ నవవీ (రహ్మలై) వ్యాఖ్యానం: "అసలు విషయం- వితర్ తర్వాత నఫిల్ నమాజ్ చేయడంలో తప్పు లేదని తెలియజేయడానికి మాత్రమే దైవప్రవక్త (స) వితర్ తర్వాత కూర్చొని ఇలా రెండు రకాతులు నమాజ్ చేశారు. అదైనా ఆయన ఈ నమాజ్‌ను ఎల్లప్పుడూ చేసేవారు కాదు, ఒకసారి లేదా కొన్నిసార్లు మాత్రమే చేశారు."

హజ్రత్ జాబిర్ (రజి) కథనం ప్రకారం దైవపవక్త (స) ఇలా చెప్పారు: "రాత్రి చివరి భాగంలో (మూడో జామున) మేల్కోలేమన్న భయమున్న వారు రాత్రి తొలి భాగంలోనే (మొదటి జామునే) వితర్ నమాజ్ చేసుకోవచ్చు. 'రాత్రి చివరి భాగంలో (మూడో జామున) మేల్కోగలమన్న నమ్మకం ఉన్నవారు రాత్రి చివరి భాగంలోనే (మూడో జామునే) వితర్ నమాజ్ చేయడం మంచిది. రాత్రి చివరి భాగంలో చేసే నమాజ్ కోసం దైవదూతలు వస్తారు. ఇదెంతో శుభకరమైనది." (ముస్లిం)

## నిదానమే ప్రధానం

హజ్రత్ అబూహురైరా (రజి) కథనం ప్రకారం దైవపవక్త (స) ఇలా ప్రవచించారు: "మీరు నమాజ్ చేయదలచుకున్నప్పుడు సరిగ్గా ఉజూ చేసి ఖిబ్లా దిశకు తిరిగి నిలబడి (అల్లాహుఅక్బర్) తక్బీర్ పలకండి. తరువాత ఖుర్‌ఆన్‌లో మీకు జ్ఞాపకం ఉండి సులభంగా



చదవగలిగినంత భాగం చదవండి. తరువాత రుకూ చేయండి. రుకూ వీలైనంతవరకు నిదానంగా, నింపాదిగా చేయండి. తరువాత నిటారుగా, ప్రశాంతంగా నిలబడండి. ఆ తరువాత సజ్దా చేయండి. సజ్దా కూడా నింపాదిగా చేయాలి. సజ్దా స్థితి నుండి లేచి నిటారుగా, నింపాదిగా కూర్చోండి. ఆ తరువాత రెండవ సజ్దా చేయండి. ఈ సజ్దా కూడా నింపాదిగా, ప్రశాంతంగా చేయాలి." (బుఖారి, ముస్లిం)

హజ్రత్ అబూహురైరా (రజి) కథనం: ఓరోజు దైవప్రవక్త (స) మస్జిద్‌లో కూర్చొని ఉన్నప్పుడు ఒకతను వచ్చి నమాజ్ చేశాడు. నమాజ్ ముగించుకున్న తరువాత అతను దైవప్రవక్త (స) దగ్గరకు వచ్చి ఆయనకు సలాం చేశాడు. దైవప్రవక్త (స) అతనికి ప్రతిసలాం చేసి "నువ్వు నమాజ్ సరిగా చేయలేదు. వెళ్ళి నమాజ్ చెయ్యి" అని చెప్పారు. ఆ వ్యక్తి వెళ్ళి (మరొక సారి) నమాజ్ చేశాడు. నమాజ్ చేసివచ్చి దైవప్రవక్త (స)కు సలాం చేశాడు. దైవప్రవక్త (స) ప్రతిసలాం చేసి మళ్ళీ అదే మాట చెబుతూ "నువ్వు (ఇప్పుడూ) సరిగా నమాజ్ చేయలేదు. వెళ్ళి నమాజ్ చెయ్యి" అని అన్నారు. ఈవిధంగా ఆ వ్యక్తి మూడు సార్లు నమాజ్ చేసివచ్చాడు. మూడవసారి కూడా దైవప్రవక్త (స) "నువ్వసలు నమాజ్ చెయ్యలేదు, వెళ్ళి నమాజ్ చెయ్యి" అని అన్నారు.

చివరికా ఆవ్యక్తి దైవప్రవక్త (స) దగ్గరికి వచ్చి "మిమ్మల్ని దైవప్రవక్తగా నియమించి పంపిన ఆ దేవుని సాక్షి! నాకు ఇంతకంటే మెరుగైన నమాజ్ చేయడం రాదు. ఎలా చేయాలో మీరే నేర్పండి నాకు" అని అన్నాడు. అప్పుడు దైవప్రవక్త (స) ఇలా చెప్పారు: "నువ్వు నమాజ్ కోసం నిలబడినప్పుడు మొట్టమొదట 'అల్లాహుఅక్బర్' అని చెప్పు. తరువాత ఖుర్‌ఆన్‌లో ఎంత భాగం సులభంగా పఠించగలవో అంత పఠించు. ఆ తరువాత 'రుకూ' చెయ్యి. రుకూ నింపాదిగా చేశాక తల పైకెత్తి నిటారుగా నిలబడు. ఆ తరువాత సజ్దా చెయ్యి. సజ్దా నింపాదిగా చేసిన తర్వాత, తలఎత్తి (నిటారుగా) ప్రశాంతంగా కూర్చో. ఆ తరువాత మళ్ళీ సజ్దా చెయ్యి. సజ్దా నింపాదిగా చేసిన తరువాత తలఎత్తి (నిటారుగా) ప్రశాంతంగా కూర్చో. ఈవిధంగా పూర్తి నమాజ్ చేసి ముగించాలి." (బుఖారి)

హజ్రత్ బరా కథనం: "దైవప్రవక్త (స) నమాజ్‌లో ఖియాం (నిలబడే పద్ధతి), ఖాయిదా (కూర్చునే పద్ధతి) తప్ప రుకూ (వంగటం), సజ్దా (సాష్టాంగపడటం), రెండు సజ్దాల మధ్య జల్సా (విరామ) స్థితి, రుకూ నుండి లేచినిలబడే ఖౌమా (నిదానం) వంటి అంశాలన్నిటి విషయంలో పాటించే సమయం సమానంగా ఉంటుంది." (బుఖారి)

హజ్రత్ బరా (రజి) కథనం: "దైవప్రవక్త (స) సమిఅల్లాహు లిమన్‌హమిదహ్ అని రుకూ నుండి లేచి నిలబడి సజ్దా కోసం శిరస్సు నేలపై ఆనించనంత వరకు మాలో ఏ ఒక్కరూ (సజ్దా కోసం) నడుం వంచేవారు కాదు." (బుఖారి)

## నమాజ్‌లో ఫరజ్(విధు)లు, సున్నత్(సంప్రదాయా)లు

నమాజ్‌లో కొన్ని ఫరజ్‌లు, వాజిబ్‌లు ఉన్నాయి. (ఫరజ్‌కు, వాజిబ్‌కు పెద్ద తేడాలేదు.) వాటిలో ఏఒక్కటి మరచి వదిలేసినా, కావాలని వదిలేసినా నమాజ్ నెరవేరదు. (1) సంకల్పం. (2) తక్బీరె తహ్రీమా. దీన్నే 'తక్బీరెఊలా' అని కూడా అంటారు. అంటే నమాజ్ ప్రారంభంలో 'అల్లాహుఅక్బర్' అంటూ చేతులు పైకెత్తి దించి కట్టుకోవడం అన్న మాట. (3) ఫరజ్ నమాజ్

నిలబడి చేయడం. ఫరజ్ తప్ప సున్నత్, నఫిల్ నమాజులు శక్తి ఉన్నప్పటికీ కూర్చొని చేయడం ధర్మసమ్మతమే. కాని పుణ్యం తగ్గిపోతుంది. (4) ప్రతి రకాత్‌లో ఫాతిహా (అల్‌హం) సూరా పఠించడం. (5) రుకూ (నింపాదిగా) చేయడం. (6) ఖౌమా (రుకూ చేసిన తరువాత లేచి నిటారుగా నిలబడటం). (7) ప్రతి రకాత్‌లో రెండు సజ్దాలు చేయడం. రెండు సజ్దాల మధ్య నింపాదిగా కూర్చోవడం. (8) రెండవ, చివరి రకాత్‌లో కూర్చొని తషహ్హుద్ (అత్తహియ్యాత్) పఠించడం. (9) నమాజ్ చివర్లో "అస్సలాము అలైకుమ్ వరహ్మతుల్లాహ్" అంటూ కుడి ఎడమల వైపు ముఖం తిప్పి నమాజ్ ముగించడం. (10) నమాజ్ నింపాదిగా, నిదానంగా, ప్రశాంతంగా చేయడం. (11) నమాజ్‌లో ముందు చేయవలసిన పని వెనుక, వెనుక చేయవలసిన పని ముందు చేయకుండా దైవప్రవక్త (స) చేసినట్లు క్రమపద్ధతితో చేయడం.

**గమనిక** :- ఫరజ్‌కు సంబంధించిన పైవిషయాలే గాకుండా హనఫీ దృక్పథంలో మరికొన్ని విషయాలు కూడా ఉన్నాయి. హనఫీ దృక్పథం ప్రకారం నఫిల్, వితర్ నమాజుల్లోని రకాతులన్నిటిలో, ఫరజ్ నమాజుల్లోని మొదటి రెండు రకాతుల్లో ఫాతిహా సూరాతో పాటు రెండవ సూరాగా మరేదైనా సూరాగాని లేదా ఖుర్‌ఆన్‌లోని కొంత భాగంగాని పఠించడం వాజిబ్ (తప్పనిసరి).

హజ్రత్ అబూహురైరా (రజి) కథనం: దైవప్రవక్త (స) మమ్మల్ని ప్రతి నమాజ్‌లోనూ ఖుర్‌ఆన్ పఠించాలని ఆదేశించారు. ఆయన ఏఏ నమాజుల్లో ఖుర్‌ఆన్‌ని బిగ్గరగా పఠించే వారో ఆయా నమాజుల్లో మేము బిగ్గరగా పఠిస్తాము. ఆయన ఏఏ నమాజుల్లో నిశ్శబ్దంగా పఠించేవారో ఆయా నమాజుల్లో మేము నిశ్శబ్దంగా పఠిస్తాము. మీరు ఫాతిహా సూరా తప్ప మరే సూరా పఠించకపోయినా సరిపోతుంది. (అంటే నమాజ్ నెరవేరుతుంది.) అయితే (రెండవ సూరా) పఠిస్తే మంచిది." (బుఖారి)

హంబలీ దృక్పథం ప్రకారం నమాజ్‌లో ఒక స్థితి నుండి మరొక స్థితికి మారేటప్పుడు 'అల్లాహుఅక్బర్' అని పలకడం; రుకూలో కనీసం ఒకసారి 'సుబ్‌హాన రబ్బియల్‌అజీం' అని, సజ్దాలో కనీసం ఒకసారి 'సుబ్‌హాన రబ్బియల్‌ఆలా' అని పలకడం; రుకూ నుండి లేచేటప్పుడు 'సమిఅల్లాహు లిమన్‌హమిదహ్' అని పలకడం; రుకూ నుండి లేచి నిలబడిన తరువాత 'రబ్బనా వలకల్‌హమ్ద్' అని పలకడం; రెండు సజ్దాల మధ్య ఒకసారి 'రబ్బిగ్‌ఫిర్లీ' అని పలకడం వాజిబ్ (తప్పనిసరి). ప్రతి నమాజ్‌లోని చివరి రకాత్‌లో 'దరూద్' పఠించడం ఫరజ్ (విధి). ఇవన్నీ ఇతర ఫిఖా దృక్పథాల ప్రకారం సున్నత్ (సంప్రదాయాలు) అవుతాయి.

నమాజ్‌లో కొన్ని సున్నత్‌లు (సంప్రదాయాలు) ఉన్నాయి. 1-రఫెయదైన్ (రెండు చేతులు చెవులదాకా లేక భుజాలదాకా ఎత్తడం), 2-కుడిచేతిని ఎడమ చేతిపై కట్టుకోవడం, 3-ప్రారంభ లేక ప్రశంసా (సనా) పలుకులు; 4-తఅవ్వుజ్ (అంటే అవూజుబిల్లాహి మినష్షయితా నిర్రజీం) పఠించడం; 5-'బిస్మిల్లా' తరువాత ఫాతిహా సూరా ముగింపులో 'ఆమీన్' చెప్పాలి; 6-ఫాతిహా సూరా తరువాత రెండవ సూరాగా ఖుర్‌ఆన్‌లోని మరొక సూరాగాని అందులో కొంత భాగంగాని పఠించాలి; 7-ఫాతిహా సూరా తరువాత, రెండవ సూరా తరువాత కాస్సేపు మౌనంగా ఉండిపోవడం 'ముస్తహబ్' (అభిలషణీయం).

8-నమాజ్‌లో ఒక స్థితి నుండి మరొక స్థితికి మారుతున్నప్పుడు (రుకూ నుండి లేచేటప్పుడు తప్ప) 'అల్లాహుఅక్బర్' అని పలకడం; 9-రుకూ సరిగా చేయడం. అంటే 90 డిగ్రీల కోణంలో వంగి చేతులతో మోకాలి చిప్పలు పట్టుకొనిఉండటం అన్నమాట; 10-ఖౌమా దుఆలు (అంటే రుకూ నుండి లేచేటప్పుడు 'సమిఅల్లాహు లిమన్‌హమిదహ్' అని, రుకూ నుండి లేచి నిటారుగా నిలబడిన తరువాత 'రబ్బనాలకల్‌హమ్ద్' అని పలకడం; 11-సజ్దాలోకి పోయేటప్పటి, సజ్దా నుండి లేచేటప్పటి ఆచరణ. అంటే సజ్దాలోకి పోయేటప్పుడు ముందు మోకాళ్ళు, ఆ తరువాత చేతులు నేలపై ఆనించాలి. సజ్దానుండి లేచేటప్పుడు ముందు చేతులు, ఆ తరువాత మోకాళ్ళు ఎత్తాలి; 12-సజ్దా సరిగ్గా చేయాలి; 13-సజ్దా స్థితిలో 'సుబ్‌హానరబ్బియల్‌ఆలా' అని పఠించడం; 14-రెండు సజ్దాల మధ్య సరిగ్గా, నింపాదిగాకూర్చోవడం; 15- జల్సా ఇస్తిరాహత్. అంటే మొదటి రకాత్, మూడవరకాత్ సజ్దాల తరువాత కాస్సేపు కూర్చొని లేవడం; 16-తషహ్హుద్ పఠించడానికి కూర్చోవడం, అందులో 'అష్‌హదుఅన్‌ల్లాఇలాహాఇల్లల్లాహు....' వచ్చినప్పుడు కుడిచేతి చూపుడు వేలెత్తి సైగ చేయడం; 17-నమాజ్ చివరి రకాత్‌లో 'తషహ్హుద్' తరువాత 'దరూద్' పఠించడం; 18-దరూద్ తరువాత సాంప్రదాయక దుఆ చేయడం.



## 20. సహూసజ్దా, తిలావత్‌సజ్దా

హజ్రత్ అబూహురైరా (రజి) కథనం: దైవప్రవక్త (స) ఓసారి జుహర్ నమాజ్‌లో రెండు రకాతులు మాత్రమే పఠించి కుడి ఎడమల వైపు (ముఖం తిప్పి) సలాం చేశారు. ఆ తరువాత మస్జిద్‌లో ఖిబ్లా వైపున్న ఓ కర్ర దగ్గరకు వెళ్ళి దానిమీద చేయి ఆనించి నిలబడ్డారు. ఆ సమయంలో అబూబకర్ (రజి), ఉమర్ (రజి)లు కూడా మస్జిద్‌లోనే ఉన్నారు. కాని వారిద్దరూ నోరు విప్పడానికి భయపడ్డారు. తొందరపాటు తత్వం గలవారు "నమాజ్ తగ్గించబడింది" అంటూ లేచి నిలబడ్డారు.

అంతలో దైవప్రవక్త (స) చేత 'జువాలీదైన్' (ద్విహస్తుడు) అని పిలువబడే ఓ వ్యక్తి వచ్చి "దైవప్రవక్తా! మీరు నమాజ్ తగ్గించారు లేదా మరచిపోయి ఉంటారు" అని అన్నాడు. దానికి దైవప్రవక్త (స) "నేను నమాజ్ తగ్గించనూ లేదు, మరచిపోనూ లేదు" అన్నారు. ఇతర అనుచరులు కొందరు జోక్యం చేసుకుంటూ "లేదు దైవప్రవక్తా! మీరు మరచి పోయారు" అని చెప్పారు. అప్పుడు దైవప్రవక్త (స) "అంటే జువాలీదైన్ చెప్పింది నిజమే నన్నమాట" అని అన్నారు. ఆ తరువాత ఆయన నిలబడి మరో రెండు రకాతులు నమాజ్ చేసి, కుడి ఎడమల వైపు సలాం చేశారు. ఆ వెనువెంటనే 'అల్లాహుఅక్బర్' అంటూ సజ్దా చేశారు. ఇది ఆయన లోగడ చేస్తూవస్తున్న సజ్దా లాంటిదే. కాకపోతే కాస్త సుదీర్ఘంగా చేసి ఉండవచ్చు. ఆ తరువాత సజ్దా నుండి లేచి 'అల్లాహుఅక్బర్' అంటూ తిరిగి అదేవిధంగా సజ్దా చేశారు. లేదా అంతకంటే కొంచెం దీర్ఘంగా చేసి ఉంటారు. ఆ తరువాత సజ్దా నుండి తలఎత్తుతూ 'అల్లాహుఅక్బర్' అన్నారు. (బుఖారి)

హజ్రత్ అబ్దుల్లా బిన్ బహీనా (రజి) కథనం: (ఓరోజు) దైవప్రవక్త (స) ఒక నమాజ్‌లో రెండు రకాతులు పఠించిన తరువాత లేచి నిల్చున్నారు. 'ఖాయిదాఊలా' ప్రకారం (మొదటి రెండు రకాతుల తరువాత) కూర్చోవడం మరచిపోయారు. అనుచరులు కూడా ఆయనతో పాటు లేచి నిలబడ్డారు. నమాజ్ పూర్తయి 'సలాం' చేయడానికి మేము ఎదురుచూస్తున్న తరుణంలో దైవప్రవక్త (స) 'అల్లాహుఅక్బర్' అంటూ కూర్చునే రెండు సార్లు సజ్దా చేశారు. ఆ తరువాత కుడి ఎడమల వైపు 'సలాం.' (బుఖారి)

హజ్రత్ అబ్దుల్లా బిన్ మస్‌వూద్ (రజి) కథనం: దైవప్రవక్త (స) నమాజ్ చేయించారు.. ....నమాజ్ పూర్తి చేసి కుడి, ఎడమల వైపు సలాం చేసిన తరువాత "దైవప్రవక్తా! నమాజ్

గురించి ఏదైనా కొత్త ఆదేశం జారీ అయ్యిందా?'' అని అడిగారు అనుచరులు. దానికి దైవప్రవక్త (స) "ఎందుకు, ఏమయిందీ?'' అని ప్రశ్నించారు. "మీరు (రోజా చేసే పద్ధతికి భిన్నంగా) ఇలా నమాజ్ చేశారే!'' అన్నారు అనుచరులు. అప్పుడు దైవప్రవక్త (స) కాళ్ళు ముడుచుకొని ఖిబ్లా వైపు తిరిగి రెండు సార్లు సజ్దా చేశారు. ఆ తరువాత కుడి, ఎడమల వైపు సలాం చేసి, మావైపు తిరిగి ఇలా అన్నారు-

"నమాజ్ గురించి ఏదైనా కొత్త ఆదేశం వస్తే నేను మీకు ముందే తెలియజేసేవాడ్ని. అలాంటిదేమీ లేదు. విషయం ఏమిటంటే (నేను మరచిపోయాను.) నేను కూడా మీ లాంటి మానవమాత్రుడ్నే. మీకులాగే నాకూ మరుపు వస్తుంది. అందువల్ల ఎప్పుడైనా నేనేదైనా మరచిపోతే గుర్తుచేయండి. నమాజ్ చేస్తున్నప్పుడు ఎవరికైనా ఏదైనా అనుమానం వస్తే సరైన నిర్ణయం తీసుకోవడానికి కృషి చేసి దాని ప్రకారం నమాజ్ పూర్తిచేయండి. కుడి, ఎడమల వైపు సలాం చేయండి. ఆ తర్వాత రెండుసార్లు సజ్దా చేయండి.'' (బుఖారి)

హజ్రత్ అబూసయీద్ ఖుద్రీ (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ఇలా అన్నారు: "మీలో ఎవరికైనా నమాజ్‌లో పఠించిన రకాతులు ఎన్ని, మూడా, నాలుగా? అన్న అనుమానం వస్తే దాన్ని ఉపేక్షించి మీకు కలిగిన దృఢ అభిప్రాయాన్నే ఆధారంగా తీసుకొని నిశ్చింతగా నమాజ్‌ను కొనసాగించండి. 'సలాం' చేయడానికి ముందు రెండు సహూసజ్దాలు చేయండి. ఒకవేళ మీరు అయిదు రకాతులు చదివివుంటే ఈ సజ్దాలు ఆరవ రకాతుకు ప్రత్యామ్నాయం అవుతాయి. ఒకవేళ ముందే పూర్తినమాజ్ (సరిగా) చేసివుంటే ఈ రెండు సజ్దాలు షైతాన్ పాలిట పరాభవంగా మారుతాయి.'' (ముస్లిం)

హజ్రత్ ముగీరా బిన్ షొబ (రజి) కథనం ప్రకారం దైవపవక్త (స) ఇలా ప్రవచించారు: "మీలో ఎవరికైనా రెండు రకాతుల తరువాత అనుమానం వస్తే, అప్పటికే అతను లేచి నిలబడటం కూడా జరిగితే తన నమాజ్‌ను కొనసాగించాలి, వెనుకంజ వేయనవసరం లేదు. తరువాత రెండు సహూసజ్దాలు చేసుకుంటే సరిపోతుంది. ఒకవేళ అతను నిటారుగా నిలబడక ముందే అనుమానం వస్తే వెంటనే కూర్చోవాలి. అలాంటి స్థితిలో అతను సహూసజ్దా చేయనవసరం లేదు.'' (అబూదావూద్, ఇబ్నెమాజ, దార్‌ఖుత్నీ)

హజ్రత్ ఇబ్నెమస్‌వూద్ (రజి) కథనం ప్రకారం దైవపవక్త (స) ఇలా ప్రవచించారు: "మనిషి తన నమాజ్‌లో (పొరపాటున) ఎక్కువగాని, తక్కువగాని చేయడం జరిగితే అతను రెండు సజ్దాలు చేయాలి.'' (ముస్లిం)

సహూసజ్దా నమాజ్ చివరి రకాత్‌లో సలాం చేయడానికి ముందు చేయడం కూడా ధర్మసమ్మతమే, తరువాత చేయడం కూడా ధర్మసమ్మతమే. దైవప్రవక్త (స) సందర్భాన్ని బట్టి రెండు విధాలా సహూసజ్దా చేశారు. సహూసజ్దా సలాంకు ముందు చేయదలచినప్పుడు తషహ్హుద్, దరూద్, దుఆ తరువాత సజ్దాలోకి పోయేటప్పుడు, సజ్దా నుండి లేచేటప్పుడు 'అల్లాహుఅక్బర్' అంటూ రెండు సజ్దాలు చేయాలి. ఆ తరువాత కుడి ఎడమల వైపు ముఖం తిప్పి సలాం చేయాలి. సలాం తరువాత సహూసజ్దా చేయదలచినప్పుడు తషహ్హుద్, దరూద్, దుఆ తరువాత కుడి ఎడమల వైపు సలాం చేసిన తరువాత సజ్దాలోకి పోయేటప్పుడు, సజ్దా నుండి లేచేటప్పుడు 'అల్లాహుఅక్బర్' అంటూ రెండు సజ్దాలు చేయాలి. ఆ తరువాత కుడి ఎడమల వైపు సలాం



చేయాలి. హనఫీ దృక్పథం ప్రకారం చివరి రకాత్‌లో తషహ్హుద్ తరువాత కుడివైపు ముఖం తిప్పి సలాం చేసి రెండు సజ్దాలు చేయాలి. ఆ తర్వాత తషహ్హుద్, దరూద్, దుఆ పఠించి కుడి ఎడమల వైపు ముఖం తిప్పి సలాం చేయాలి.

హజ్రత్ అబ్దుల్లా బిన్ అబీ ఔఫా (రజి) కథనం: ఒకతను దైవప్రవక్త (స) దగ్గరకు వచ్చి "నేను ఖుర్‌ఆన్‌లోని ఏ భాగాన్ని జ్ఞాపకం ఉంచుకోలేకపోతున్నాను. దీనికి ప్రత్యామ్నాయంగా మరేదైనా ఉంటే నాకు ఉపదేశించండి'' అని విన్నవించుకున్నాడు. అప్పుడు దైవప్రవక్త (స)"సుబ్‌హానల్లాహి వల్‌హమ్దులిల్లాహి వలాఇలాహ ఇల్లల్లాహు వల్లాహు అక్బర్ వలాహౌల వలాఖువ్వత ఇల్లా బిల్లాహిల్ అలియ్యిల్‌అజీం'' అని పఠించమని చెప్పారు. (అహ్మద్, అబూదావూద్, నసాయి)

## పొరపాటు నిష్కృతి-సహూసజ్దా

నమాజ్‌లో ఒక్కోసారి ఏదైనా పొరపాటు జరగవచ్చు. వాటిని సరిదిద్దుకోకపోతే నమాజ్ విధి నెరవేరదు. నమాజ్ మళ్ళీ చేయవలసి వస్తుంది. అయితే కొన్ని రకాల పొరపాట్లు జరిగినప్పుడు "సహూసజ్దా" చేస్తే సరిపోతుంది. నమాజ్ మళ్ళీ చేయనవసరం లేదు. ఆ పొరపాట్లు, సహూసజ్దా పద్ధతి ఏమిటో తెలుసుకుందాం.

నమాజ్‌లో కొన్ని ప్రధానాంశాలు (అర్కానె నమాజ్) ఉన్నాయి. అవి తప్పిపోతే, లేక సరిగా చేయకపోతే 'సహూసజ్దా' చేసినా నమాజ్ నెరవేరదు. అవి ఇలా ఉన్నాయి:

❋ తక్బీరె తహ్రీమా (నమాజ్ ప్రారంభించడానికి చెప్పే 'అల్లాహుఅక్బర్' అనే వచనాన్నే 'తక్బీరె తహ్రీమా' అంటారు.

❋ ఖియాం (ఒక పెద్ద ఆయత్‌గాని, మూడు చిన్న ఆయత్‌లుగాని పఠించ గలిగేటంత సేపు నమాజ్ స్థితిలో నిటారుగా నిలబడటాన్ని 'ఖియాం' అంటారు. ఖియాం ఫరజ్, వాజిబ్ నమాజుల్లో మాత్రమే విధి.

❋ ఖిరాత్ (నమాజ్‌లో ఒక పెద్ద ఆయత్‌గాని, మూడు చిన్న ఆయత్‌లుగాని పఠించడాన్ని 'ఖిరాత్' అంటారు.

❋ రుకూ (అంటే తలక్రిందుల 'యల్' L షేప్‌లా వంగి చేతులతో మోకాళ్ళు పట్టుకోవాలి.

❋ సజ్దా (సాష్టాంగ ప్రణామం).

❋ ఆఖిరి ఖాయిదా (అంటే నమాజ్ చివరి రకాత్‌లో 'తషహ్హుద్' పఠించ గలిగేటంత సేపు కూర్చోవడం.

నమాజ్‌లో కొన్ని ముఖ్యాంశాలు (వాజిబాతె నమాజ్) ఉన్నాయి. అవి తప్పిపోతే లేదా సరిగా చేయకపోతే నమాజ్ కాదు. అయితే 'సహూసజ్దా' చేస్తే మాత్రం నమాజ్ విధి నెరవేరుతుంది. ఆ ముఖ్యాంశాలు ఇలా ఉన్నాయి:

❁ ఫరజ్ నమాజుల్లోని మొదటి రెండు రకాతుల్లో ఖుర్‌ఆన్ సూక్తులు పఠించడం.

❁ ఫరజ్ నమాజుల్లోని మొదటి రెండు రకాతుల్లో; సున్నత్, వితర్, నఫిల్ నమాజుల్లోని మొత్తం రకాతుల్లో ఫాతిహా సూరా పఠించడం.

❁ ఫరజ్ నమాజ్‌లోని మొదటి రెండు రకాతుల్లో; సున్నత్, వితర్ నమాజుల్లోని మొత్తం రకాతుల్లో ఫాతిహా సూరా తరువాత మరేదైనా సూరా పఠించడం.

☸ ఖిరాత్, రుకూ, సజ్దాలు, రకాత్‌లలో వరుసక్రమాన్ని పాటించడం.

☸ ఖౌమా (అంటే రుకూ నుండి లేచి నిటారుగా నిలబడటం).

☸ జల్సా (మొదటి సజ్దా చేసిన తర్వాత నిటారుగా, స్థిమితంగా కూర్చోవడం). కొందరు మొదటి సజ్దా చేశాక నిటారుగా కూర్చోరు. తల కాస్తంత పైకెత్తి వెంటనే రెండవ సజ్దాలోకి పోతారు. ఇది సరైన పద్ధతి కాదు. ఒకవేళ ఎప్పుడైనా పొరపాటున అలా జరిగితే 'సహూసజ్దా' చేయాలి. సహూసజ్దా చేయకపోతే నమాజ్ నెరవేరదు.

☸ తాదిలె అర్కాన్ (రుకూ, సజ్దా మొదలైన అంశాలన్నీ నింపాదిగా చేయడం).

☸ ఖాయిదాయె ఊలా (మూడు లేక నాలుగు రకాత్‌ల నమాజ్‌లోని రెండవ రకాత్ చివర్లో 'తషహ్హుద్' పఠించగలిగేటంత సేపు కూర్చోవడం).

☸ మూడు లేక నాలుగు రకాత్‌ల (నమాజ్) చివర్లో 'తషహ్హుద్' పఠించడం.

☸ "అస్సలాము అలైకుం వరహ్మతుల్లాహ్" అంటూ నమాజ్ ముగించడం.

☸ వితర్ మూడవ రకాత్‌లో రుకూకు ముందు చేతులు చెవులదాకా ఎత్తి 'అల్లహుఅక్బర్' (తక్బీర్) చెప్పి, చేతులు దించి కట్టుకొని ఖునూత్ దుఆ పఠించడం.

☸ ఈద్ నమాజ్‌లలో అదనపు 'తక్బీర్'లు చెప్పడం.

☸ ఖుర్‌ఆన్ బిగ్గరగా పఠించే (జుహ్రీ) నమాజుల్లో నిశ్శబ్దంగా పఠించడం, నిశ్శబ్దంగా పఠించే (సిర్రీ) నమాజుల్లో బిగ్గరగా పఠించడం జరిగినప్పుడు సహూసజ్దా చేయవలసి ఉంటుంది. లేకుంటే నమాజ్ నెరవేరదు.

## తిలావత్ సజ్దా (పఠన సజ్దా)

ఖుర్‌ఆన్‌లో 14 ప్రత్యేక సూక్తులున్నాయి. వాటిని పఠించేవారు, వినేవారు విధిగా సజ్దా చేయవలసి ఉంటుంది. సూక్తి పూర్తిగా పఠించిన తర్వాతగాని, సజ్దా గుర్తున్న పదం సమీపంలోని వాక్యం పూర్తయ్యాకగాని సజ్దా చేయాలి. దీన్ని "పఠనసజ్దా" (సజ్దాయేతిలావత్) అంటారు.

దైవప్రవక్త (సల్లం) ఓసారి సజ్దా (సాష్టాంగ ప్రమాణం) గురించి ప్రస్తావిస్తూ ఇలా అన్నారు: "మనిషి సజ్దా సూక్తి పఠించి సజ్దా చేసినప్పుడు షైతాన్ ఓ మూలకు వెళ్ళి కూర్చొని 'అయ్యయ్యో' అంటూ తెగ బాధ పడుతుంటాడు. ఆ బాధతో 'అయ్యో! (నేనెంతటి దౌర్భాగ్యుడ్ని!!) ఆదం సంతానాన్ని సజ్దా చేయండని ఆజ్ఞాపించినప్పుడు ఆదం సంతానం సజ్దా చేసి స్వర్గప్రవేశానికి అర్హులైపోయారు. నన్ను సజ్దా చేయమని ఆజ్ఞాపించినప్పుడు నేను సజ్దా చేయడానికి తిరస్కరించి నరకాగ్నికి అర్హుడైపోయాను' అని పశ్చాత్తాపంతో కుమిలిపోతాడు. (అహ్మద్, ముస్లిం, ఇబ్నెమాజ)

హజ్రత్ అబ్దుల్లా బిన్ మస్‌వూద్ (రజి) కథనం: దైవప్రవక్త (స) ఓసారి మక్కాలో 'నజ్మ్' సూరా పఠించారు. అందులో సజ్దా సూక్తి వచ్చినప్పుడు, ఆయనతో పాటు, ఆయన సమీపంలో ఉన్నవారంతా (బహుదైవారాధకులు సైతం) సజ్దా చేశారు. ఒక వృద్ధుడు మాత్రం (సజ్దా చేయకుండా) చేతిలో కొన్ని కంకర్రాళ్ళు తీసుకొని నుదుటి దగ్గరకు ఎత్తి "నాకిది చాలు" అన్నాడు. ఆ తరువాత కొంతకాలానికి నేనతని పరిస్థితి గమనించాను. అతను అవిశ్వాస స్థితిలోనే వధించబడ్డాడు. (బుఖారి)



హజ్రత్ అతా బిన్ యసార్ (రహ్మలై) ఉల్లేఖనం: నేను హజ్రత్ జైద్ బిన్ సాబిత్ (రజి)ని ఖుర్‌ఆన్ పఠనం గురించి విచారిస్తే దానికి ఆయన "నేను దైవప్రవక్త (స) ముందు 'నజ్మ్' సూరా పఠించినప్పుడు ఆయన సజ్దా చేయలేదు" అని అన్నారు. (బుఖారి, ముస్లిం)

హజ్రత్ అబూరాఫె (రహ్మ) కథనం: హజ్రత్ అబూహురైరా (రజి) వెనుక ఇషా నమాజ్ చేశాను. అందులో ఆయన "ఇజస్సమావున్‌షఖ్ఖత్" సూరా పఠించి పఠనసజ్దా చేశారు. ఆ తరువాత నేను "ఏమిటీ సజ్దా?" అని అడిగాను. దానికి ఆయన "నేనీ సూరా పఠన సమయంలో దైవప్రవక్త (స) వెనుక సజ్దా చేశాను. ఇప్పుడిక నేను ఆయన దగ్గరకు వెళ్ళేదాకా సజ్దా చేస్తూఉంటాను" అని చెప్పారు. (బుఖారి)

అధికసంఖ్యాక పండితుల అభిప్రాయం ప్రకారం పఠనసజ్దా చేయడం ఖుర్‌ఆన్ పఠించే, దాన్ని వినేవారి కోసం సున్నత్ (సంప్రదాయం) అవుతుంది. అంటే విధి (ఫరజ్) కాదన్న మాట. పఠనసజ్దా చేస్తే పుణ్యం, చేయకపోతే పాపం మటుకు కాదు. హనఫీ దృక్పథం ప్రకారం పఠన సజ్దా ఖుర్‌ఆన్ పఠించే, దాన్ని వినేవారు ఉభయులూ తప్పనిసరి (వాజిబ్)గా చేయాలి.

ఒక సారి శుక్రవారం రోజు (రెండవ శ్రేష్ఠఖలీఫా) హజ్రత్ ఉమర్ (రజి) తన జుమా ప్రసంగంలో 'నహల్' సూరా పఠించారు. ఆ పఠనంలో సజ్దాసూక్తి వచ్చినప్పుడు ఆయన వేదిక (మింబర్) దిగి సజ్దా చేశారు. జనం కూడా సజ్దా చేశారు. ఆ తరువాత వచ్చిన శుక్రవారం రోజు జుమా ప్రసంగంలో ఆయన మళ్ళీ అదేసూరా పఠించారు. అయితే సజ్దా సూక్తి వచ్చినప్పుడు సజ్దా చేయకుండా ఇలా అన్నారు: "ప్రజలారా! (తప్పనిసరిగా) సజ్దా చేయాలని మనకు ఆజ్ఞ లేదు. ఎవరైనా చేస్తే మంచిదే, చేయకపోతే పాపం మటుకు లేదు" అని అన్నారు. (బుఖారి)

నమాజ్‌లో ఖుర్‌ఆన్ పఠిస్తున్నప్పుడు సజ్దాకు సంబంధించిన సూక్తిరాగానే అల్లాహుఅక్బర్ అంటూ సజ్దాలోకి పోవాలి. సజ్దాలో యథాప్రకారం 'సుబ్‌హాన రబ్బియల్‌ఆలా' అని కనీసం మూడుసార్లు చెప్పి తిరిగి అల్లాహుఅక్బర్ అంటూ నిలబడాలి. ఇతర సమయాల్లో కూర్చొని లేదా వాహనం ఎక్కిపోతూ ఖుర్‌ఆన్ పఠిస్తున్నప్పుడు కూడా పఠనసజ్దా చేయాలి. అప్పుడు ఉజూతో ఉండాలని, ఖిబ్లా వైపుకు తిరగాలని, నమాజ్‌లోని సజ్దాలాగా నుదురు-ముక్కు నేలకు ఆనిచ్చాలని కొందరి అభిప్రాయం. కాని ఈ షరతులకు హదీసులలో నిర్దిష్టమైన ప్రమాణం ఏదీ కన్పించదు.

"ఇమామ్ బుఖారి (రహ్మలై) హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి)ని గురించి వ్రాస్తూ, ఆయన ఉజూ లేకుండా పఠన సజ్దా చేసేవారని అన్నారు. హజ్రత్ అబూ అబ్దుర్రహ్మాన్ సలమీ (రహ్మలై) గురించి 'ఫతహుల్‌బారీ'లో ఇలా ఉంది- 'ఆయన ఉజూతోఉన్నా లేకపోయినా, ఖిబ్లాకు అభిముఖంగా ఉన్నా లేకపోయినా సరే దారిలో నడుస్తూ ఖుర్‌ఆన్ పఠించేవారు. సజ్దా సూక్తి వచ్చినప్పుడు శిరస్సు వంచేవారు.' కాబట్టి ఒకవేళ ఎవరైనా అధికసంఖ్యాక ధర్మవేత్తల దృక్పథానికి వ్యతిరేకంగా నడిస్తే అతడ్ని నిందించరాదని మేము భావిస్తున్నాం. అధికసంఖ్యాక ధర్మవేత్తల దృక్పథాన్ని సమర్థించే ఎలాంటి నిరూపితసున్నత్ (హదీసుగ్రంథాల్లో) లేదు. పైగా మన పూర్వీకుల్లో 'అధికసంఖ్యాక ధర్మవేత్తల' దృక్పథానికి వ్యతిరేకంగా ఆచరించినవారు కూడా అనేకమంది ఉన్నారు." (తఫ్‌హీముల్ ఖుర్‌ఆన్, రెండవ భాగం)

# 21. ఖజా, ఖసర్ నమాజులు

నిర్ణీతవేళ తప్పిపోయిన నమాజ్‌ను ‘ఖజానమాజ్’ అంటారు. బలమైన కారణం లేకుండా నమాజ్ ‘ఖజా’ చేయడం సరికాదు. ఖజా అయినప్పుడు దాన్ని వీలైనంత త్వరగా నెరవేర్చాలి. ఖజా నమాజ్ నిర్ణీతవేళకు చేసే నమాజులాగే చేయాలి. ఫరజ్, వితర్ నమాజులు మాత్రమే ఖజా నమాజులుగా చేయాలి. సున్నత్, నఫిల్ నమాజులకు ఖజా లేదు. వితర్ నమాజ్‌లోని మూడు రకాతులక్కూడా ఖజా పాటించాలి.

## ఖజా నమాజ్

దైవప్రవక్త (సల్లం) ఇలా ఉపదేశించారు: “ఎవరైనా (ఫరజ్) నమాజ్ మరచిపోతే లేక నిద్రపోతే (నిద్ర నుండి సకాలానికి మేల్కోలేకపోతే), నిద్రపోవడం వల్ల నమాజ్ తప్పిపోవడం జరిగితే దానికి ప్రాయశ్చిత్తం (కప్ఫారా)గా జ్ఞాపకం వచ్చిన తరువాత వీలైనంత త్వరగా అతనా నమాజ్ చేయాలి.” (బుఖారి, ముస్లిం)

హజ్రత్ ఇమ్రాన్ బిన్ హుసైన్ కథనం: ఓసారి మేము దైవప్రవక్త (స)తో కలసి ప్రయాణం చేస్తూ రాత్రంతా నడిచాము. తెల్లవారుతూ ఉండగా ఓ చోట విడిది చేసి పడుకున్నాం. రాత్రంతా మేల్కొనడం వల్ల పడుకోగానే గాఢ నిద్ర పట్టింది. చివరికి లేచి చూస్తే సూర్యుడు దేదీప్యమానంగా ప్రకాశించసాగాడు. అందరికంటే ముందు హజ్రత్ అబూబకర్ (రజి) మేల్కొన్నారు. దైవప్రవక్త (స) స్వయంగా మేల్కోనంతవరకు ఆయన్ని ఎవరూ లేపకూడదని ముందు నుంచే ఒక ఆనవాయితీ ఉంది. (అందువల్ల ఆయన్ని ఎవరూ లేపలేదు.) ఆ తరువాత హజ్రత్ ఉమర్ (రజి) మేల్కొన్నారు. హజ్రత్ అబూబకర్ (రజి) దైవప్రవక్త (స) తలవైపు కూర్చొని “అల్లాహుఅక్బర్! అల్లాహుఅక్బర్!!” అంటూ బిగ్గరగా పలకసాగారు. దాంతో దైవప్రవక్త (స) కూడా మేల్కొన్నారు. (వెంటనే) ఆయన మాకు (నాయకత్వం వహించి) నమాజ్ చేయించారు.

అప్పుడొకతను మాతోపాటు కలసి నమాజ్ చేయలేదు. నమాజ్ ముగిశాక దైవప్రవక్త (స) అతడ్ని పిలిపించి “నీవు మాతో పాటు నమాజ్ ఎందుకు చేయలేదు?” అని అడిగారు. దానికా వ్యక్తి “నేను (లైంగిక) స్నానం చేయవలసిన పరిస్థితి వచ్చింది” అని అన్నాడు. దైవప్రవక్త (స) ఈమాట విని “(నీళ్ళు లభించకపోతే) మన్నుతో తయమ్ముమ్ చేసుకో” అని ఆదేశించారు. అప్పుడా వ్యక్తి తయమ్ముమ్ చేసి నమాజ్ చేశాడు. (బుఖారి)

హజ్రత్ అలి (రజి) కథనం: దైవప్రవక్త (స) అహ్జాబ్ యుద్ధం రోజుల్లో (బహుదైవారాధకుల్ని శపిస్తూ) “దేవుడు వారి ఇళ్ళను, వారి సమాధుల్ని అగ్నితో నింపుగాక! సూర్యుడు అస్తమించినా వారు మనల్ని సలాతుల్‌ఉస్తా (అసర్ నమాజ్) చేయనివ్వలేదు” అని అన్నారు. (బుఖారి, ముస్లిం)

హజ్రత్ జాబిర్ బిన్ అబ్దుల్లా (రజి) కథనం: ఉమర్ బిన్ ఖత్తాబ్ (రజి) కందకం (అహ్జాబ్) యుద్ధం జరుగుతున్న రోజుల్లో ఓరోజు సూర్యాస్తమయమైన తరువాత దైవప్రవక్త (స) సన్నిధికి వచ్చారు. వచ్చిరాగానే ఆయన ఖురైష్ బహుదైవారాధకులకు శాపనార్థాలు పెడుతూ “దైవప్రవక్తా! (వీరి మూలంగా) నేను సూర్యాస్తమయమవుతున్నా అసర్ నమాజ్ ఇంతవరకు చేయలేకపోయాను” అన్నారు. దానికి దైవప్రవక్త (స) “దైవసాక్షి! నేను కూడా



చేయలేకపోయాను” అన్నారు. ఆతర్వాత మేమంతా బుత్హాన్ ప్రదేశానికి చేరుకొని ఉజూ చేశాము. అప్పుడు దైవప్రవక్త (స) సూర్యాస్తమయం అయిన తర్వాత అసర్ నమాజ్ (సామూహికంగా) చేశారు. ఆ తర్వాత (వెంటనే) మగ్రిబ్ నమాజ్ చేశారు. (బుఖారి)

## ఖసర్ నమాజ్

“మీరు ఎక్కడికైనా ప్రయాణమై వెళ్తే నమాజ్‌ను తగ్గించి చేసుకోడంలో ఎలాంటి తప్పు లేదు. ముఖ్యంగా అవిశ్వాసులు మిమ్మల్ని వేధిస్తారని భయముంటే అలా చేయవచ్చు. ఎందుకంటే వారు బహిరంగంగా మీతో విరోధానికి పాల్పడ్డారు.” (ఖుర్‌ఆన్-4:101)

“మీరొకవేళ ఏదైనా ప్రమాదంలో చిక్కుకుంటే నడుస్తూవున్నా, వాహనమెక్కి వున్నా ఎలా సాధ్యమైతే అలా ప్రార్థన చేయండి. తరువాత మీ భయాందోళనలు తొలగి మనసు కుదుటపడితే దేవుడు నేర్పిన పద్ధతి ప్రకారం ఆయన్ని ధ్యానించండి.” (ఖుర్‌ఆన్-2:239)

విశ్వాసుల మాతృమూర్తి హజ్రత్ ఆయిషా (రజి) కథనం: (ప్రారంభంలో) దేవుడు నమాజ్ విధిగా చేయాలని నిర్ణయించినప్పుడు ప్రయాణావస్థలో ఉన్నా లేకపోయినా రెండేసి రకాతులు తప్పనిసరిగా చేయాలని ఆదేశించాడు. అయితే ఆ తర్వాత కొన్నాళ్ళకు ప్రయాణావస్థలో రకాతుల సంఖ్యను ఇదివరకటిలాగే యధాతథంగా ఉంచి, ప్రయాణావస్థలో లేనప్పుడు నెరవేర్చవలసిన రకాతుల సంఖ్యను పెంచడం జరిగింది.” (బుఖారి)

హజ్రత్ అనస్ (రజి) ఉల్లేఖనం: “నేను మదీనాలో దైవప్రవక్త (స) వెనుక నాలుగు రకాతులు జుహర్‌నమాజ్ చేశాను. (మక్కా వెళ్తూ మదీనా నుండి 6 మైళ్ళ దూరమున్న) ‘జుల్‌హులైఫా’లో రెండు రకాతులు అసర్‌నమాజ్ చేశాను.” (బుఖారి, ముస్లిం)

హజ్రత్ ఆమిర్ బిన్ రబీయా (రజి) కథనం: “దైవప్రవక్త (స) వాహనంపై కూర్చొని ప్రయాణం సాగిస్తూనే రాత్రివేళ నఫిల్ నమాజ్ చేస్తుండటం నేను చూశాను. వాహనం ఏ దిశ వైపుకు నడుస్తున్నా సరే (ఆ దిశకే ముఖం పెట్టి నమాజ్ చేసేవారు). (బుఖారి)

హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి) కథనం: “దైవప్రవక్త (స) ప్రయాణావస్థలో త్వరగా వెళ్లాలనుకున్నప్పుడు మగ్రిబ్, ఇషానమాజులు కలిపి ఒకేసారి చేసేవారు.” (ముస్లిం)

హజ్రత్ అనస్ (రజి) కథనం: “దైవప్రవక్త (స) సూర్యుడు నెత్తి మీద నుండి వాలక ముందే ప్రయాణం చేయవలసివస్తే జుహర్ నమాజ్‌ని వేళకాగానే చేయకుండా అసర్ వేళ సమీపించేదాకా ఆలస్యం చేసేవారు. తరువాత (అసర్ వేళకు) ఓచోట ఆగి (జుహర్, అసర్) రెండు నమాజులు కలిపి ఒకేసారి చేసేవారు. ఒకవేళ ఆయన ప్రయాణమవడానికి ముందే సూర్యుడు నెత్తి మీద నుంచి వాలితే జుహర్ నమాజ్ చేసిన తరువాత బయలుదేరేవారు.” (బుఖారి, ముస్లిం)

హజ్రత్ హఫ్స్ బిన్ ఆసిమ్ (రహ్మాలై) కథనం ప్రకారం హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి) ఇలా తెలిపారు: “నేను (ఓసారి ప్రయాణంలో) దైవప్రవక్త (స) వెంట ఉన్నాను. ఆయనీ ప్రయాణంలో సున్నత్ నమాజులు చేస్తుండగా నేను చూడలేదు. సున్నత్ నమాజ్ కూడా చేయవలసివచ్చినప్పుడు నేను ఫరజ్‌నమాజ్ మాత్రమే చేస్తాను. దేవుడు (ఖుర్‌ఆన్‌లో) ‘దైవప్రవక్త (జీవనసరళి)లో మీకొక చక్కని ఆదర్శం ఉంద’ని అన్నాడు.” (ముస్లిం)

"దైవప్రవక్త (స) ఏ ప్రయాణావస్థలో కూడా ఫరజ్ నమాజ్‌కు ముందుగాని, తరువాత గాని నఫిల్, (సున్నత్) నమాజులు చేసినట్లు ఏ సహీహదీస్‌లోనూ ఆధారం లేదు. అయితే రాత్రివేళ చేసే వితర్ నమాజ్, ఫజర్‌వేళ చేసే రెండు రకాతుల సున్నత్ నమాజ్ మాత్రం ఆయన ప్రయాణావస్థలో కూడా వదలకుండా చేసేవారు." (జాదుల్‌ముఆద్)

హజ్రత్ ఇబ్నెఉమర్ (రజి), మరికొందరు సహాబీల దృక్పథం ప్రకారం ప్రయాణావస్థలో సున్నత్, నఫిల్ నమాజులు చేయడం సరికాదు. హజ్రత్ ఇబ్నెఉమర్ (రజి) ఒక ప్రయాణంలో కొందరు వ్యక్తులు ఫరజ్ నమాజ్ తరువాత (సున్నత్) నమాజ్ చేయడం చూసి ఇలా అన్నారు: "నేను దైవప్రవక్త (స)తో కలసి ప్రయాణం చేశాను. ఆయన రెండు (ఫరజ్) రకాతులకు మించి మరెలాంటి నమాజులు చేసేవారుకాదు. నేను హజ్రత్ అబూబకర్ (రజి)తో కూడా కలసి ప్రయాణం చేశాను. ఆయన కూడా రెండు రకాతులకు మించి మరెలాంటి నమాజులు చేయలేదు." హజ్రత్ ఉమర్ (రజి), హజ్రత్ ఉస్మాన్ (రజి)ల ప్రస్తావన వచ్చినప్పుడు ఆయన 'దైవప్రవక్త-స (జీవనసరళి)లో మీ కోసం మంచి ఆదర్శం ఉంది' అనే ఖుర్‌ఆన్ సూక్తి పఠించారు. (బుఖారి)

అయితే ప్రవక్త అనుచరులు (రజి) ప్రయాణావస్థలో ఫరజ్ నమాజ్‌కు ముందు, ఆ తర్వాత సున్నత్, నఫిల్ నమాజులు చేసేవారని హజ్రత్ హసన్ బస్రి (రహ్మ) అన్నారు.

పై రెండు విధాల ఉల్లేఖనాలను కలిపి పరిశీలిస్తే ప్రయాణావస్థలో సున్నత్, నఫిల్ నమాజులు చేయడం, చేయకపోవడం రెండూ ధర్మసమ్మతమేనని తెలుస్తుంది. కాకపోతే ఫజర్ వేళ రెండు రకాతులు సున్నత్ నమాజ్, ఇషా తరువాత వితర్ నమాజ్ మాత్రం తప్పకుండా చేయాలి. వీటిని వదిలేయడం సరికాదు.

ఖసర్ నమాజ్ చేయడానికి ప్రయాణం చేయవలసిన దూరం కనీసం ఎన్ని మైళ్ళు ఉండాలి; ప్రయాణావస్థలో ఎన్ని రోజులు ఉండాలి అనే విషయాలపై ఖుర్‌ఆన్‌లోగాని, సహీహదీస్‌లోగాని కచ్చితమైన ఆదేశం ఏదీ లేదు.

హజ్రత్ అనస్ (రజి) స్వస్థలం నుంచి 15 మైళ్ళ దూరం ఉండే ప్రయాణంలో ఖసర్ నమాజ్ చేసేవారని ఒక ఉల్లేఖనం ఉంది. హజ్రత్ అలి (రజి) నయాసిస్సుకు వెళ్ళి అక్కడ జుహర్ వేళ ప్రజలకు నాయకత్వం వహించి రెండు రకాతులు నమాజ్ చేయించి అదేరోజు మదీనా తిరిగివచ్చినట్లు మరోఉల్లేఖనం ఉంది. (ముఆలిముస్సునన్)

"హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి), హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి)లు 48 మైళ్ళ ప్రయాణంలో ఖసర్ నమాజ్ చేసేవారు, ఉపవాసం పాటించేవారు కాదు." (బుఖారి)

హజ్రత్ ఇబ్నెఅబ్బాస్ (రజి) కథనం: "దైవప్రవక్త (స) ఒక ప్రయాణంలో 19 రోజులు (ఒక చోట) ఆగి ఖసర్ నమాజ్ చేశారు. కాబట్టి మేము కూడా ఏ ప్రాంతంలోనైనా 19 రోజుల పాటు బస చేయవలసివస్తే ఖసర్ నమాజ్ చేస్తాము; అంతకంటే ఎక్కువ రోజులయితే పూర్తి నమాజ్ చేస్తాము." (బుఖారి)

హజ్రత్ అలి (రజి) కథనం: "ఎవరైనా 10 రోజులు బస చేయవలసివస్తే పూర్తి నమాజ్ చేయాలి." (తిర్మిజి)



ఇబ్నెఉమర్ (రజి) ద్వారా రెండు ఉల్లేఖనాలు వెలువడ్డాయి. ఒకదాని ప్రకారం "ఎవరైనా 15రోజులు ఆగవలసివస్తే పూర్తినమాజ్ చేయాలి" అన్నారాయన. రెండవ దాని ప్రకారం "ఎవరైనా 12 రోజులు ఆగవలసివస్తే పూర్తినమాజ్ చేయాలి" అన్నారు. (తిర్మిజి)

హజ్రత్ ఉస్మాన్ (రజి), హజ్రత్ అనస్ (రజి)ల ఉల్లేఖనాలలో 4 రోజుల ప్రస్తావన ఉంది. (సబ్లుస్సలాం)

ఎవరైనా ఏదైనా అవరోధం వల్ల ఎక్కడైనా ఆగిపోయి, ఆ అవరోధం తొలగిపోగానే స్వస్థలం వెళ్ళిపోతానని భావిస్తూ ఉంటున్నప్పుడు, ఆ ప్రాంతంలో ఎన్ని రోజులున్నా ఖసర్ నమాజ్ చేయవచ్చన్నది సహాబీల ఏకాభిప్రాయం.

దాని ప్రకారం హజ్రత్ ఇబ్నెఉమర్ (రజి) దారిలో మంచు కారణంగా అజర్‌బైజాన్‌లో ఆరు నెలలు ఆగిపోవలసివచ్చింది. ఆ ఆర్నెలలూ ఆయన ఖసర్ నమాజ్ చేశారని హజ్రత్ నాఫె (రహ్మలై) తెలియజేశారు. కొందరు సహాబీలు రాంహర్మిజ్‌లో ఏడు నెలల పాటుండి ఖసర్ నమాజ్ చేశారని హజ్రత్ అనస్ (రజి) తెలిపారు. స్వయంగా హజ్రత్ అనస్ (రజి) సిరియాలో రెండేండ్లు ఆగిపోవలసి వచ్చినప్పుడు ఆయన ఆ రెండేండ్ల పాటు ఖసర్ నమాజే చేశారు. (ఫిఖహ్‌సున్న)

## 22. సామూహిక నమాజ్ విధానం

హజ్రత్ అబూదర్దా (రజి) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "ఏ జనావాసం లేక ఊళ్ళో (కనీసం) ముగ్గురు మనుషులు ఉంటారో అక్కడ (ప్రతి రోజూ) సామూహిక నమాజ్ జరగకపోతుంటే, వారిపై షైతాన్ తప్పకుండా ఆధిక్యత పొందినట్లే. తోడేలు, మందను వీడిన గొర్రెలను మాత్రమే చీల్చిచెండాడుతుంది. కనుక మీరు తప్పకుండా సామూహిక నమాజ్ చేస్తుండండి." (అబూదావూద్)

సామూహిక నమాజ్ కోసం ఇమాంతో పాటు కనీసం ఒకరిద్దరు ఉన్నా చాలు. హజ్రత్ అబూమూసా (రజి) ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఇలా తెలిపారు: "ఇద్దరు లేక అంతకన్నా ఎక్కువమంది వ్యక్తుల సమూహం జమాఅత్ అవుతుంది." (ఇబ్నెమాజ)

హజ్రత్ ఉబై బిన్ కాబ్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "ఒక మనిషి ఒంటరిగా చేసే నమాజ్ కంటే మరొక మనిషితో కలసి చేసే నమాజ్ ఎంతో పుణ్యప్రదమైనది. ఇద్దరు మనుషులతో కలసి చేసే నమాజ్ మరింత పుణ్యప్రదమైనది. అలాగే (నమాజ్ చేసేవారు) ఎంతమంది ఎక్కువగా ఉంటే ఆ నమాజ్ దేవుని దృష్టిలో అంతే ఎక్కువగా పుణ్యప్రదమైనది అవుతుంది." (అబూదావూద్, నసాయి)

హజ్రత్ ఇబ్నెఅబ్బాస్ (రజి) కథనం: "నేనొక రోజు రాత్రి మా పిన్ని మైమూనా (రజి) ఇంట్లో పడుకున్నాను. ఆ రాత్రి దైవప్రవక్త (స) లేచి (తహజ్జుద్) నమాజ్ చేయడం ప్రారంభించారు. నేను కూడా లేచి నమాజ్ చేయడానికి ఆయనకు ఎడమ వైపున నిలబడ్డాను. అప్పుడు దైవప్రవక్త (స) నా తల పట్టుకొని నన్ను తనకు ఎడమ వైపున లాగి నిలబెట్టారు. (బుఖారి, ముస్లిం, తిర్మిజి, అబూదావూద్, ఇబ్నెమాజ, అహ్మద్)

ముస్నద్ అహ్మద్‌లో "అప్పుడు నా వయస్సు పదేండ్లు" అని అదనంగా ఉంది.

హ్రజత్ అబూమూసా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: “మీలో అందరికంటే ఎక్కువ దూరం నడచివచ్చి జమాఅత్‌తో కలసి నమాజ్ చేసేవానికి నమాజ్‌లో అందరికంటే ఎక్కువ పుణ్యఫలం లభిస్తుంది.” (ముస్లిం)

## సామూహికనమాజ్ నుండి మినహాయింపులు

సామూహిక నమాజ్ విధి నుండి రోగులు, పిల్లలు, స్త్రీలు, నడవలేని బలహీనులు మినహాయించబడ్డారు. (1) వర్షం, చలి, తుఫాన్ సందర్భాలలో మసీదుకు పోకుండా ఇండ్లలోనే నమాజ్ చేసుకోవచ్చు. (2) ఆకలిగా ఉండి భోజనం ముందుకు వచ్చినప్పుడు మసీదుకు పోకుండా భోజనం చేసి నింపాదిగా నమాజ్ చేయవచ్చు. (3) మలమూత్ర విసర్జన సమయం వచ్చినప్పుడు వాటిని అణచిపెట్టి నమాజ్ కోసం తొందరపడకూడదు. (4) అలాగే ఏదైనా అత్యంతవసరమైన పని వచ్చినప్పుడు కూడా దాన్ని నెరవేర్చకుండా నమాజ్ కోసం మస్జిద్‌కు పోకూడదు. ప్రశాంతంగా నమాజ్ చేయడానికి ముందుగా ఈ అవసరాలన్నీ తీర్చుకోవాలి.

హ్రజత్ నాఫె (రహ్మలై) కథనం: ఓరోజు రాత్రి తీవ్రమైన ఈదురు గాలులు వీస్తున్న ప్పుడు హ్రజత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి) అజాన్ చెప్పారు. అయితే ఆ అజాన్‌లో ఆయన (నమాజ్ కోసం మసీదుకు రండని చెప్పడానికి బదులు) “ప్రజలారా! మీరు మీ ఇండ్లలోనే నమాజ్ చేసుకోండి” అని అన్నారు. ఇలా అజాన్ చెప్పిన తరువాత రాత్రివేళ బాగా చలి ఉన్నప్పుడుగాని, (కుండపోత) వర్షం కురుస్తున్నప్పుడుగాని మీరు మీమీ ఇండ్లలోనే నమాజ్ చేసుకోండి అంటూ అజాన్ చెప్పాలని దైవప్రవక్త (స) ముఅజ్జిన్‌ని ఆదేశించేవారు” అని తెలియజేశారు. (బుఖారి, ముస్లిం)

ఒకసారి (శుక్రవారం నాడు) హ్రజత్ ఇబ్నెఅబ్బాస్ (రజి) అజాన్ చెప్పమని ముఅజ్జిన్‌ని ఆజ్ఞాపిస్తూ ‘అష్‌హదుఅన్న ముహమ్మదర్రసూలుల్లాహ్’ అని పలికిన తరువాత ‘హయ్యా అలస్సలాహ్’ అని చెప్పకుండా ‘సల్లూ ఫీ బుయూతికుమ్’ (మీమీ ఇండ్లలోనే నమాజ్ చేసుకోండి) అని చెప్పాలని అన్నారు. జనం ఈమాట విని ఆశ్చర్యపోయారు. అప్పుడు హ్రజత్ ఇబ్నెఅబ్బాస్ (రజి) వారి ఆశ్చర్యాన్ని పటాపంచలు చేస్తూ “నాకంటే ఎంతో శ్రేష్ఠు డయిన మహనీయుడు (సల్లం) ఈవిధంగానే ఆచరించారు. జుమా నమాజ్ విధిగా చేయవలసిన ప్రార్థన అన్నది నిజమే. కాని మిమ్మల్ని బురదలో, జారుడులో నడిపించి ఇబ్బందులకు గురిచేయడం నాకిష్టం లేదు” అని అన్నారు. (బుఖారి)

హ్రజత్ ఇబ్నెఉమర్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (స) ఇలా అన్నారు: “మీలో ఎవరి ముందుకైనా భోజనం వస్తే అతను (నమాజ్‌కోసం) తొందరపడకూడదు. సామూహిక నమాజ్ ప్రారంభమైనా సరే ముందు తన అవసరం నెరవేర్చుకోవాలి.” (బుఖారి)

హ్రజత్ ఆయిషా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (స) ఇలా అన్నారు: “భోజనం ముందుకు వచ్చినప్పుడు నమాజ్ లేదు. అలాగే మలమూత్ర విసర్జన అవసరం ఏర్పడి నప్పుడు కూడా నమాజ్ లేదు.” (అహ్మద్, ముస్లిం, అబూదావూద్)

హ్రజత్ అబూదర్దా (రజి) ఇలా అన్నారు: “మనిషికి అత్యంతవసరమైన పని ఏదైనా వచ్చినప్పుడు మొదట ఆ పని నెరవేర్చాలి. ఆ తర్వాతే అతను నమాజ్ కోసం సిద్ధపడితే దాన్ని ప్రశాంతంగా నిర్వర్తిస్తాడు. మనిషి విజ్ఞతకు ఇది కూడా ఒక సంకేతం.” (బుఖారి)



## ఇమామత్ అర్హతలు

హ్రజత్ అబూసయీద్ (రజి) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: “ముగ్గురు వ్యక్తులు ఉంటే వారిలో ఒకడు ఇమాం (నాయకుడు) కావాలి. ఇమామత్ (నాయకత్వం) వహించడానికి వారిలో ఖుర్‌ఆన్ ఎక్కువగా పఠించగలవాడికే ఎక్కువ అర్హత ఉంటుంది.” (బుఖారి, ముస్లిం)

హ్రజత్ ఇబ్నె మస్‌వూద్ (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: “ప్రజలం దరిలో ఎక్కువ ఖుర్‌ఆన్ పఠించగలవాడే వారికి నాయకత్వం వహించాలి. ఒకవేళ ఖుర్‌ఆన్ పఠనంలో అందరూ సమానమైనప్పుడు వారిలో అందరికన్నా ఎక్కువ సున్నత్ (హదీస్) విద్య తెలిసినవాడు నాయకత్వం వహించాలి. సున్నత్ విద్యలో కూడా అందరూ సమానమైనప్పుడు వారిలో అందరికన్నా ముందు హ్రజత్ చేసినవాడు నాయకత్వం వహించాలి. హ్రజత్ విషయంలో కూడా అందరూ సమానమైనప్పుడు వారిలో అందరికన్నా ఎక్కువ వయసు కలవాడు నాయకత్వం వహించాలి. ఏ మనిషి కూడా అనుమతి లేకుండా ఇతరుల స్థానంలో నాయకత్వం వహించకూడదు. అలాగే ఇతరుల ఇండ్లలో వారి అనుమతి లేకుండా వారు కూర్చునే స్థానంలో కూర్చోకూడదు.” (ముస్లిం)

బానిసలు, బాటసారులు, వికలాంగులు కూడా నాయకత్వానికి అర్హులే.

హ్రజత్ ఇమ్రాన్ బిన్ హుసైన్ (రజి) కథనం: దైవప్రవక్త (స) ప్రయాణావస్థలో ఉన్నంత కాలం రెండు రకాతుల (ఖసర్) నమాజ్ చేస్తుండేవారు. మక్కాలో ఆయన 18 రోజులు ఉన్నారు. ఆ రోజుల్లో ఆయన మగ్రిబ్ నమాజ్ తప్ప ఇతర నమాజుల్లో రెండేసి రకాతులు నెరవేర్చేవారు. ఆ తరువాత ఆయన (స్థానికుల్ని ఉద్దేశించి) “మక్కావాసులారా! మేము బాటసారులం. (ఖసర్ నమాజ్‌లో రెండు రకాతులే చేస్తాం. కనుక) మీరు లేచి నిలబడి మిగతా రకాతుల్ని పూర్తిచేసుకోండి” అని చెప్పేవారు. (ముస్నద్ అహ్మద్)

హ్రజత్ ఇబ్నె మలైకా (రజి) కథనం: “ఉబైద్ బిన్ ఉమైర్ (రజి), మసూర్ బిన్ మఖ్రమా (రజి), మరికొందరు ఇతరులు హ్రజత్ ఆయిషా (రజి) ఇంటికి వస్తుండేవారు. అప్పుడామె స్వేచ్ఛపొందిన తన బానిస అబూఅమ్ర్ (రజి) చేత వారికి నాయకత్వం వహింపజేసి నమాజ్ చేయించేవారు. ఆ రోజుల్లో అబూఅమ్ర్ (రజి) ఇంకా బానిసత్వం నుంచి విముక్తి పొందలేదు, బానిసగానే ఉన్నారు.” (ముస్నద్ షాఫయి)

హ్రజత్ అనస్ (రజి) కథనం: “దైవప్రవక్త (స) (తన అంధ అనుచరుడు) ఇబ్నె ఉమ్మెమక్తూమ్ (రజి)ను తాను లేనప్పుడు (తన స్థానంలో) రెండు సార్లు మదీనా పాలకునిగా నియమించారు. ఇబ్నె ఉమ్మెమక్తూమ్ అంధులైనప్పటికీ ఆయన ప్రజలకు నాయకత్వం వహించి నమాజ్ చేయించేవారు.” (అహ్మద్, అబూదావూద్)

## ఇమామత్ అర్హతలేని ఇమాములు

హ్రజత్ అబ్దుల్లా బిన్ అమ్ర్ (రజి) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రవచించారు: “ముగ్గురు వ్యక్తుల నమాజ్‌ను దేవుడు స్వీకరించడు. 1-ప్రజలు తనను ఇష్టపడకపోయినా వారికి నాయకత్వం వహించేవాడు; 2-నమాజ్ వేళ ముగిసిపోతున్న

సమయంలో నమాజ్‌కోసం (మసీదుకు) వచ్చేవాడు; 3-తన బానిసకు బానిసత్వం నుంచి విముక్తి కల్గించి మళ్ళీ అతడ్ని బానిసగా చేసుకునేవాడు.'' (అబూదావూద్, ఇబ్నెమాజ)

హ్రజత్ అబూహురైరా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రవచించారు: ''నాయకుడు మంచివాడయినా, చెడ్డవాడయినా అతనితో కలసి జిహాద్ చేయడం మీకు విధి (వాజిబ్)గా చేయబడింది. అలాగే ఒక ముస్లిం మంచివాడయినా, చెడ్డవాడయినా, చివరికి ఘోరపాపాలకు పాల్పడివున్నా అతని వెనుక నమాజ్ చేయడం మీకు విధి (వాజిబ్)గా చేయబడింది.'' (అబూదావూద్)

హ్రజత్ అబూహురైరా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రవచించారు: ''మీరు అల్లాహ్ తప్ప మరో ఆరాధ్యుడు లేడ'ని చెప్పే ప్రతివ్యక్తి వెనుక నమాజ్ చేయండి. అలాగే మీరు అల్లాహ్ తప్ప మరో ఆరాధ్యుడు లేడ'ని చెప్పే ఏ వ్యక్తి అయినా చనిపోతే అతని కోసం జనాజా నమాజ్ చేయండి.'' (దారెఖుత్నీ)

పైరెండు ఉల్లేఖనాలు ప్రమాణం రీత్యా బలహీనమైనప్పటికీ 'బనూఉమయ్య' పాలనాకాలంలో ఉన్న సహాబీలందరూ వాటి ప్రకారమే నడచుకున్నారు. ఉదాహరణకు-

''హ్రజత్ ఇబ్నెఉమర్ (రజి) క్రూర పాలకుడయిన హజ్జాజ్ వెనుక నమాజ్ చేసినట్లు ఉల్లేఖనాలు ఉన్నాయి.'' (బుఖారి)

''(మరో క్రూర పాలకుడయిన) మర్వాన్ పండుగ నమాజ్ చేయించడానికి ముందే ఖుత్బా (ఉపన్యాసం) ఇచ్చాడు. అలాంటి మర్వాన్ వెనుక హ్రజత్ అబూసయీద్ ఖుద్రీ (రజి) ఈద్ నమాజ్ చేశారు.'' (ముస్లిం, అబూదావూద్, తిర్మిజి)

ఖాజి షూకాని (రహ్మ) అభిప్రాయం: ''ధర్మవేత్తలలో అభిప్రాయభేదం ఏదైనా ఉందంటే అది, దుర్జనుడు-దుర్మార్గుని వెనుక చేసే నమాజ్ నెరవేరుతుందా లేదా అనే విషయంలో మాత్రమే ఉంది. పోతే అలాంటి మనిషి వెనుక నమాజ్ చేయడం అవాంఛనీయం (మక్రూ) అనే విషయంలో ఎలాంటి భేదాభిప్రాయాలు లేవు.''

## సామూహిక నమాజ్-మహిళా సమస్యలు

సామూహిక నమాజ్ విషయంలో ఇస్లాం పురుషులకు ఇచ్చిన ఆదేశాలకు, స్త్రీలకు ఇచ్చిన ఆదేశాలకు చాలా తేడా ఉంది. పురుషులు మసీదులో సామూహికంగా చేసే నమాజే అత్యంత శ్రేష్ఠమైన నమాజ్‌గా పరిగణించబడింది ఇస్లాంలో. కాగా ఇంట్లో ఒంటరిగా చేసే నమాజ్ స్త్రీల కోసం ఎంతో శ్రేష్ఠమైన నమాజ్‌గా ఇస్లాం పేర్కొన్నది.

హ్రజత్ ఉమ్మెసల్మా (రజి) ప్రకారం దైవప్రవక్త (స) హితోక్తి: ''స్త్రీలకు అన్నిటికంటే అత్యంత శ్రేష్ఠమైన మస్జిద్ వారి ఇంట్లోని లోపలి గదే.'' (అహ్మద్)

హ్రజత్ ఉమ్మెహమీద్ సాయిదియా (రజి) దైవప్రవక్త (సల్లం)తో మాట్లాడుతూ ''దైవప్రవక్తా! నాకు మీతోపాటు నమాజ్ చేయాలని ఉంది'' అని అన్నారు. అప్పుడు దైవప్రవక్త (స) ఇలా చెప్పారు: ''నీవిలా అడుగుతావని నాకు తెలుసు. కాని నీవు నీ గది (మధ్య)లో నమాజ్ చేయడం కంటే ఒక మూలలో నమాజ్ చేయడం మంచిది. నీవు నీఇంటి ప్రాంగణంలో చేసే నమాజ్ కంటే ఇంటిగదిలో చేసే నమాజే శ్రేష్ఠమైనది. మీ



వీధిలో ఉండే మసీదులో నమాజ్ చేయడం కంటే మీ ఇంటి ప్రాంగణంలో నమాజ్ చేయడం ఉత్తమం. జామియా మసీదులో కంటే వీధి మసీదులో నమాజ్ చేయడం చాలా మంచిది.'' (త్రబాని)

అయితే దైవప్రవక్త (సల్లం) స్త్రీలకు మసీదుకు పోయే స్వేచ్ఛపై ఆంక్షలు విధించ లేదు. వారికి నమాజు కోసం మసీదుల కన్నా వారి ఇండ్లే మంచివని చెబుతూ ఇలా అన్నారు: ''మీ స్త్రీలను మసీదులకు పోనీయకుండా నిరోధించకండి. అయితే వారి కోసం వారి గృహాలే శ్రేష్ఠమయినవి.'' (అహ్మద్, అబూదావూద్)

నమాజు కోసం మసీదుకు పోవడం పురుషునికి విధి అయివుంటే, స్త్రీకి ఇది అనుమతి మాత్రమే. అదైనా చివరి వరుసలో ఉండి నమాజ్ చేయడాన్నే ఇస్లాం ఎక్కువగా ఇష్టపడుతుంది. అయినా దైవప్రవక్త (సల్లం) వారి స్వేచ్ఛను హరించలేదు.

హ్రజత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (స) ఇలా అన్నారు:

''మీ భార్యలు మసీదుకు వెళ్ళడానికి అనుమతి అడిగితే, వారిని అనుమతించకుండా నిరోధించకండి.'' (బుఖారి)

''స్త్రీలకు రాత్రివేళ మసీదులకు వెళ్ళడానికి అనుమతి ఇవ్వండి.'' (బుఖారి, ముస్లిం)

హ్రజత్ అబూహురైరా (రజి) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఇలా అన్నారు: ''దేవుని దాసీలను దేవుని ఆలయాలకు పోనివ్వకుండా నిరోధించకండి. అయితే వారు (ఎలాంటి అలంకరణలు లేకుండా) నిరాడంబరంగా వెళ్ళాలి.'' (ముస్నద్ అహ్మద్)

హ్రజత్ ఉమర్ (రజి) భార్యలలో ఒకరు ఫజర్, ఇషా వేళల నమాజులు చేయడానికి మసీదుకు వెళ్ళేవారు. ''స్త్రీలు మసీదుకు వెళ్ళడాన్ని ఉమర్ (రజి) ఇష్టపడరని, ఈ విషయంలో ఆయన ఎంతో అభిమానంగల మనిషని తెలిసి కూడా మీరు ఇంటి నుండి బయటికెందుకు వెళ్తున్నారు?'' అని ఒకరు అడిగారు. దానికామె ''అయితే ఉమర్ (రజి) నన్నెందుకు నిరోధించడం లేదూ?''అని ఆమె ఎదురుప్రశ్న వేశారు. ''ఎందుకంటే దేవుని దాసీలను దేవుని ఆలయానికి వెళ్ళడాన్ని నిరోధించకండని దైవప్రవక్త (స) అన్నారు. ఈ మాటే మిమ్మల్ని నిరోధించకుండా ఆయనకు అడ్డుతగిలింది'' అన్నాడా వ్యక్తి. (బుఖారి)

హ్రజత్ ఆయిషా (రజి) కథనం: ''కొత్త కొత్త పోకడలు అవలంబించిన ఈనాటి స్త్రీలను గనక దైవప్రవక్త (స) చూస్తే ఇస్రాయీల్ సంతతి స్త్రీలు వారించబడినట్లు ఆయన వీరిని మస్జిద్‌లకు పోవద్దని వారించేవారు.'' (తిర్మిజి, సబ్లుస్సలాం)

స్త్రీలు జమాఅత్‌తో నమాజ్ చేయదలచుకుంటే చిట్టచివరి వరుసలో నిలబడాలి.

హ్రజత్ అనస్ (రజి) కథనం: ''ఓసారి నేను, మాఇంట్లో ఉండే ఒక అనాథ బాలుడు దైవప్రవక్త (స) వెనుక నమాజ్ చేశాము. అప్పుడు మా తల్లిగారు ఉమ్మెసులైమ్ (రజి) మా వెనుక నిల్చున్నారు.'' (బుఖారి, ముస్లిం)

హ్రజత్ అబూమాలిక్ అష్అరీ (రజి) కథనం: ''దైవప్రవక్త (స) సామూహిక నమాజ్‌లో పురుషుల్ని అందరికంటే ముందు వరుసలో నిలబెడతారు. వారి వెనుక పిల్లల్ని, పిల్లల వెనుక స్త్రీలను నిలబెడతారు.'' (అహ్మద్, అబూదావూద్)

హజ్రత్ అబూహురైరా (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "పురుషుల కోసం అన్నిటికంటే అత్యంత శ్రేష్ఠమైన వరుస ముందువరుస (మొదటి పంక్తి), అధమాతి అధమ వరుస చివరివరుస. స్త్రీల కోసం అన్నిటికంటే అత్యంత శ్రేష్ఠమైన వరుస చిట్టచివరి వరుసే, అధమాతిఅధమ వరుస ముందువరస." (ముస్లిం, అహ్మద్, తిర్మిజి, నసాయి)

ఇక స్త్రీల ఇమామత్ విషయానికి వస్తే, స్వేచ్ఛ-సమానత్వాల పేరుతో స్త్రీలను ఇంటి నుండి రచ్చకీడ్చడానికి శతవిధాల ప్రయత్నిస్తున్న పాశ్చాత్య నాగరికతా ధ్వజవాహకులు ఈ విషయాన్ని కూడా వివాదాస్పదం చేశారు. హదీసుల్లో నుంచి 'సందర్భం'తో పొసగని ఒక విషయం వెలికితీసి, స్త్రీలు కూడా పురుషుల జమాఅత్‌కు ఇమామత్ వహించి నమాజ్ చేయించ వచ్చని గోలగోల చేస్తూ ఇటీవల అమెరికాలో ఒక స్త్రీ చేత ఈ 'ఘనకార్యం' చేయించారు. స్త్రీ స్త్రీలకు ఇమామత్ వహించి నమాజ్ చేయించవచ్చనే విషయంలో ఎలాంటి సందేహం లేదు. కాని ఆమె పురుషులకు ఇమామత్ వహించి నమాజ్ చేయించడం ఎట్టి పరిస్థితిలోనూ ధర్మసమ్మతం కాదు. ఇది ఇమాములు, ధర్మవేత్తలందరి ఏకాభిప్రాయం.

హజ్రత్ ఉమ్మెవరఖా బిన్తె నౌఫల్ (రజి) కథనం: "దైవప్రవక్త (స) ఆమెను కలుసుకోవడానికి అప్పుడప్పుడు ఆమె ఇంటికి వస్తుండేవారు. ఆయన ఆమె కోసం ఓ ముఅజ్జిన్‌ని కూడా నియమించారు. అతను అజాన్ ఇస్తుండేవాడు. హజ్రత్ ఉమ్మెసల్మా (రజి) తన ఇంటివారికి ఇమామత్ వహించి నమాజ్ చేయిస్తుండేవారు." (అబూదావూద్)

ఇబ్నెఅబ్బాస్ (రజి) కథనం:"స్త్రీ స్త్రీలకు ఇమామత్ వహించి నమాజ్ చేయిస్తుంది. అప్పుడామె స్త్రీల పంక్తికి (ముందు కాదు) మధ్యలో నిలబడాలి." (ఫిఖాసున్న)

"స్త్రీలు తమ కంఠస్వరం పరపురుషులకు విన్పించడాన్ని దైవప్రవక్త (స) ఇష్టపడేవారు కాదు. మసీదులో ఇమామ్ నమాజ్ చేయిస్తున్నప్పుడు అతని వల్ల ఏదైనా పొరపాటు జరిగితే అతని వెనుక నమాజు చేస్తున్న పురుషులు 'సుబ్‌హానల్లహ్' అని పలకాలని దైవప్రవక్త (స) ఆదేశించారు. కాని స్త్రీలయితే రెండు చేతులు కలిపి చప్పుడు చేయడం ద్వారా మాత్రమే ఇమామ్‌ని హెచ్చరించాలని ఆయన చెప్పారు." (బుఖారి, ముస్లిం)

## ఇమామ్ బాధ్యతలు

నమాజ్ చేయించే ఇమామ్‌కు కొన్ని బాధ్యతలు ఉన్నాయి.

హజ్రత్ నోమాన్ బిన్ బషీర్ (రజి) కథనం: "దైవప్రవక్త (స) మా (నమాజ్) పంక్తుల్ని బాణాన్ని సరిచేసినట్లు తిన్నగా సరిచేసేవారు, తద్వారా మేమీ విషయం అర్థం చేసుకున్నామని ఆయన తెలుసుకునేవారు. ఒకరోజు ఆయన బయటికొచ్చి నమాజ్ చేయించడానికి సిద్ధమయ్యారు. 'అల్లాహుఅక్బర్' అని తక్బీర్ చెప్పబోయేముందు పంక్తిలో ఒకతని రొమ్ము ముందుకు వచ్చివున్నట్లు చూసి 'దైవదాసులారా! మీ పంక్తులు సరిచేసుకోండి. లేకుంటే దేవుడు మిమ్మల్ని పరస్పరం ప్రత్యర్థులయ్యేలా చేస్తాడు' అని హెచ్చరించారు." (ముస్లిం)

హజ్రత్ అనస్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "మొదట ముందు వరుస భర్తీచేయండి. ఆ తరువాత రెండవ వరుస. ఈవిధంగా భర్తీచేస్తూ పూర్తికాని వరుస (ఏదైనా ఉంటే అది) చివర్లో ఉండాలి." (అబూదావూద్, నసాయి)



హజ్రత్ అబూహురైరా (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ఇలాఅన్నారు: "మీలో ఎవరైనా ప్రజలకు ఇమామత్ (నాయకత్వం) వహిస్తే అతను తేలికపాటి నమాజ్ చేయించాలి. ఎందుకంటే వారిలో బలహీనులు, రోగులు, వృద్ధులు కూడాఉంటారు. అతను ఒంటరిగా నమాజ్ చేయదలచుకుంటే సుదీర్ఘ నమాజ్ చేసుకోవచ్చు." (బుఖారి, ముస్లిం)

హజ్రత్ అబూఖతాదా (రజి) కథనం: "దైవప్రవక్త (స) జుహర్ నమాజ్‌లో రెండవ రకాత్‌కంటే మొదటి రకాత్ దీర్ఘంగా పఠించేవారు. అలాగే అసర్, ఫజర్ నమాజుల్లో కూడా (మొదటి రకాత్‌ను దీర్ఘంగా పఠించేవారు). (బుఖారి, ముస్లిం, అబూదావూద్) అబూదావూద్‌లో అదనంగా ఈ విషయం ఉంది: "(ఆలస్యంగా వచ్చే) ప్రజలు మొదటి రకాత్‌లో చేరడానికి వీలుగా దైవప్రవక్త (స) ఇలా చేసేవారని మేము భావించే వాళ్ళం."

హజ్రత్ హులబ్ (రజి) కథనం: "దైవప్రవక్త (స) మాకు ఇమామత్ వహించేవారు. (సలాం) తరువాత ఆయన కుడి వైపుగాని, ఎడమ వైపుగాని తిరిగి మాకు ఎదురుగా కూర్చునేవారు. (తిర్మిజి- ఇది తప్పనిసరికాదు, అభిలషనీయం మాత్రమే)

హజ్రత్ ముగైరా బిన్ షాబా (రజి) ప్రకారం దైవప్రవక్త (స) హితోక్తి: "ఇమామ్ ఫరజ్‌నమాజ్ చేసినచోట (సున్నత్ లేక నఫిల్) నమాజ్ చేయకూడదు. ఆ చోటు మార్చి వేరేచోట చేయాలి." (అబూదావూద్, ఇబ్నెమాజ-ఇది కూడా అభిలషనీయం మాత్రమే)

ఇమామ్ ఒంటరిగా ఎలా నమాజ్ చేస్తాడో సామూహిక నమాజ్ కూడా అలాగే చేయాలి. అయితే 'రుకూ' నుండి లేచేటప్పుడు 'సమీఅల్లాహులిమన్‌హమిదహ్' అని మాత్రమే చెప్పి నిటారుగా నిలబడాలి. 'రబ్బనాలకల్‌హమ్ద్' అని చెప్పకూడదు.

ఫజర్, మగ్రిబ్, ఇషా వేళల ఫరజ్ నమాజుల్లో ఇమామ్ ఖుర్‌ఆన్‌ని బిగ్గరగా పఠించాలి. జుహర్, అసర్ వేళల ఫరజ్ నమాజుల్లో ఖుర్‌ఆన్‌ని నిశ్శబ్దంగా పఠించాలి. ఇలా బిగ్గరగా పఠించే నమాజుల్ని 'జుహ్రీ నమాజుల'ని, నిశ్శబ్దంగా పఠించే నమాజుల్ని 'సిర్రీ నమాజుల'ని అంటారు.

హజ్రత్ సౌబాన్ (రజి) ప్రకారం దైవప్రవక్త (స) హితోక్తి: "చేయకూడని పనులు మూడు ఉన్నాయి. 1-ఇమామ్ అయినవాడు ముఖ్తదీలను వదలి తనకోసం దుఆ చేయకూడదు. తన కోసం మాత్రమే దుఆ చేస్తే అతను ముఖ్తదీలకు ద్రోహం చేసినవాడవుతాడు. 2-అనుమతి లేకుండా మనిషి ఇతరుల ఇంటితలుపు సందు గుండా లోపలికి తొంగి చూడటం. ఎవరైనా ఇలా చేస్తే అతను అనుమతి లేకుండా ఇంట్లోకి చొరబడినవాడవుతాడు. 3-తీవ్రమైన మలమూత్ర అవసరం ఏర్పడినప్పుడు దాన్ని తీర్చుకోక ముందే నమాజ్ ప్రారంభించడం లేదా సామూహిక నమాజ్‌లో చేరడం." (అబూదావూద్)

## ముఖ్తదీల (అనుచరుల) బాధ్యతలు

సామూహిక నమాజ్ విషయంలో ముఖ్తదీలకు కూడా కొన్ని బాధ్యతలు ఉన్నాయి.

హజ్రత్ అలీ (ర) ప్రకారం దైవప్రవక్త (స) హితోక్తి: "మీలో ఎవరైనా నమాజ్ చేయడానికొస్తే, ఇమామ్‌ను ఏస్థితిలో చూస్తే ఆస్థితి ప్రకారమే అతడ్ని అనుసరించండి. (తిర్మిజి)

హనఫీ దృక్పథం ప్రకారం నిశ్శబ్దంగా ఖుర్‌ఆన్ పఠించే 'సిర్రీ'నమాజ్‌లో ఇమామ్ 'అల్లాహు అక్బర్' అని 'తక్బీరెతహ్రీమా' చెప్పిన తరువాత ముఖ్తదీ జమాఅత్‌లో కలిస్తే తక్బీరెతహ్రీమా

పలికిన తరువాత 'సనా' (సుబహానకల్లాహుమ్మ...) కూడా పఠించాలి. నిశ్శబ్దంగా పఠించే 'సిర్రీ' నమాజ్ అయితే తక్బీరెతహ్రీమా మాత్రమే చెప్పాలి, ఆ తరువాత వెంటనే 'సనా' పఠించకూడదు. ఇమామ్ 'సలాం' చెప్పి నమాజ్ ముగించిన తరువాత ముఖ్తదీ వెంటనే లేచి జమాఅత్‌లో తప్పిపోయిన రకాత్ నెరవేర్చడానికి ప్రారంభించే ముందు 'సనా' పఠించాలి. ఇమామ్ సిర్రీనమాజ్ గాని, జుహ్రీనమాజ్‌గాని చేస్తూ రుకూ లేక సజ్దా స్థితిలో ఉన్నప్పుడు ముఖ్తదీ వచ్చి జమాఅత్‌లో కలిస్తే తక్బీరెతహ్రీమా తరువాత 'సనా' పఠించాలి. ఒకవేళ సనా పఠించకముందే ఇమామ్ రుకూ లేక సజ్దా నుండి లేస్తే ముఖ్తదీ అప్పుడు సనా పఠించకూడదు. ఇమామ్ 'సలాం' చెప్పి నమాజ్ ముగించిన తరువాతనే లేచి తప్పిపోయిన రకాత్ ప్రారంభంలో సనా పఠించాలి.

హజ్రత్ అబూహురైరా (రజి) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "మీరు (సామూహిక) నమాజ్ చేయడానికి వచ్చినప్పుడు మేము సజ్దా స్థితిలో ఉంటే మీరూ సజ్దాస్థితిలో కలవండి. అయితే అది మీకు లభించిన రకాత్‌గా పరిగణించకండి. (సామూహిక నమాజ్‌లో) రకాత్ పొందినవాడు, అంటే రుకూ పొందినవాడు ఆ (రకాత్) నమాజ్ పొందినట్లే పరిగణించబడతాడు." (అబూదావూద్, ఇబ్నెఖుజైమా, హాకిమ్)

హజ్రత్ అబూబక్రా (రజి) కథనం: దైవప్రవక్త (స) నమాజ్ చేయిస్తూ రుకూ స్థితిలో ఉన్నప్పుడు నేను పంక్తి దగ్గరకు చేరుకోకముందే 'రుకూ' చేశాను. అలాగే నడచి జమాఅత్‌లో కలిశాను. (నమాజ్ ముగిసిన) తర్వాత దైవప్రవక్త (స) నాతో "దేవుడు నీ అత్యాశను మరింత వృద్ధి చేయుగాక! ఇకముందు అలా చేయకు" అని అన్నారు. (బుఖారి)

పై ఉల్లేఖనంలో దైవప్రవక్త (స) హజ్రత్ అబూబక్రా (రజి)ను ప్రారంభం నుంచే రుకూ చేసి జమాఅత్‌లో కలిసే చర్య గురించి ఇకముందు అలా చేయకూడదని వారించారు. అయితే ఆ రకాత్‌ను మళ్ళీ నెరవేర్చాలని ఆదేశించలేదు. దీన్నిబట్టి ఎవరైనా రుకూ స్థితిలో వచ్చి జమాఅత్‌లో కలిస్తే అతనికి ఆ రుకూకు సంబంధించిన రకాత్ లభించినట్లేనని తెలుస్తోంది. ఇది హనఫీ దృక్పథకుల విధానం. అయితే 'ఫాతిహా సూరా పఠించనిదే నమాజ్ నెరవేరదు' అన్న ఉల్లేఖనం ఉన్నందున అహ్లెహదీస్ దృక్పథకులు సిర్రీనమాజ్ అయినా, జుహ్రీనమాజ్ అయినా, ఇమామ్ అయినా, ముఖ్తదీ అయినా, నమాజ్ ఒంటరిగా చేసినా, జమాఅత్‌తో కలసి చేసినా ఫాతిహా సూరా తప్పనిసరిగా పఠిస్తారు.

హజ్రత్ ముగైరా బిన్ షూబా (రజి) కథనం: నేను తబూక్ దండయాత్ర సమయంలో దైవప్రవక్త (స) వెంట ఉన్నాను. ఓసారి దైవప్రవక్త (స) అవసరార్థం వెళ్ళి అక్కడే ఉజూ చేసి వచ్చారు. అంతలో అబ్దుర్రహ్మాన్ బిన్‌ఔఫ్ (రజి) ఇమామత్ వహించి నమాజ్ చేయించసాగారు. దైవప్రవక్త (స) జమాఅత్‌లో కలసి చివరి రకాత్ (మాత్రమే) నెరవేర్చారు. అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (రజి) 'సలాం' చెప్పి నమాజ్ ముగించగానే దైవప్రవక్త (స) లేచి మిగతా నమాజ్ పూర్తి చేసుకున్నారు. ఆ తర్వాత ఆయన ప్రజల్ని ఉద్దేశించి "మీరు సమయానికి నమాజ్ చేసి మంచి పని చేశారు" అన్నారు. (బుఖారి, ముస్లిం, అహ్మద్)

హజ్రత్ అబూజైన్ (రహ్మలై) కథనం: "ఒకరోజు హజ్రత్ అలీ (రజి) నమాజ్ చేయిస్తుంటే ఆయన ఉజూ భంగమైపోయింది. వెంటనే ఆయన (మొదటి పంక్తిలో తనకు దగ్గరగా ఉన్న) ఒక వ్యక్తి చేయి పట్టి ముందుకు లాగి నిలబెట్టి, తాను (ఇమామ్ స్థానం నుండి) పక్కకు తప్పుకున్నారు." (సునన్ సయీద్ బిన్ మన్సూర్)



ఇలాంటి సందర్భాలలో హజ్రత్ ఉమర్ (రజి) దాడి జరగడం వల్ల, హజ్రత్ అలీ (రజి) ఉజూ భంగం కావడంవల్ల ఇమాం తన స్థానంలో ఒక ముఖ్తదీని ఇమామ్‌గా చేసినట్లు చేయడం కూడా ధర్మసమ్మతమే; హజ్రత్ ముఆవియా (రజి)పై దాడి జరిగినప్పుడు ముఖ్తదీలు చేసినట్లు తమ నమాజులు విడివిడిగా చేసుకోవడం కూడా ధర్మసమ్మతమే.

హజ్రత్ యజీద్ బిన్ అస్వద్ (రజి) కథనం: నేను ఓరోజు దైవప్రవక్త (స)తో కలసి 'ఖైఫ్' మస్జిద్‌లో ఫజర్ నమాజ్ చేశాను. దైవప్రవక్త (స) సలాంతో నమాజ్ ముగించి చూస్తే పంక్తుల వెనుక ఇద్దరు వ్యక్తులు నమాజ్ చేయకుండా నిలబడి ఉన్నారు. దైవప్రవక్త (స) వారిద్దర్ని తన దగ్గరకు తీసుకురండని ఆదేశించారు. వారిని తీసుకురావడం జరిగింది. అప్పుడు వారు భయంతో వణకసాగారు. దైవప్రవక్త (స) వారినుద్దేశించి "మీరిద్దరు మాతో పాటుకలసి నమాజ్ ఎందుకు చేయలేదు?" అనడిగారు. దానికి వారు "మేము మాఇండ్లలో నమాజ్ చేసివచ్చాం"అన్నారు. దైవప్రవక్త (స) ఈమాట విని "అలా చేయకండి. మీరొకవేళ మీఇండ్లలో నమాజ్ చేసి మస్జిద్‌కు రావడం జరిగితే, అప్పుడు మస్జిద్‌లో సామూహిక నమాజ్ జరుగుతుంటే మీరందులో పాల్గొనండి. మస్జిద్‌లో చేసే ఆ నమాజ్ మీకోసం నఫిల్‌నమాజ్ అవుతుంది" అని అన్నారు. (అహ్మద్, అబూదావూద్, తిర్మిజి)

హజ్రత్ అబూజర్ (రజి) కథనం: దైవప్రవక్త (స) ఓరోజు నాతో "నమాజ్‌ను నిర్ణీత సమయంలో చేయకుండా ఆలస్యంగా చేయించే నాయకులు మీపై పెత్తనం వహిస్తారు. అప్పుడు మీ పరిస్థితి ఏమవుతుంది?" అని అన్నారు. "అప్పుడు నేనేమి చేయాలో సెలవియ్యండి" అన్నాను నేను. దానికి దైవప్రవక్త (స) నీవు నిర్ణీత సమయానికే నమాజ్ చెయ్యి. వారితో పాటు చేయవలసివస్తే అది కూడా చెయ్యి. ఆ నమాజ్ నీ కోసం నఫిల్ నమాజ్ అవుతుంది" అని చెప్పారు. (బుఖారి, ముస్లిం)

ఫరజ్ నమాజ్ ముగిసిన తరువాత ఇమామ్ కుడివైపు గాని, ఎడమవైపు గాని తిరగనంత వరకూ ముఖ్తదీలు తాము కూర్చున్న చోటు నుండి కదలకూడదు. తరువాత ముఖ్తదీలు కూడా ఫరజ్ నమాజ్ చేసిన చోటు వదలి వేరే చోట సున్నత్, నఫిల్ నమాజులు చేయాలి. ఈ రెండు విషయాలు అభిలషనీయం (ముస్తహబ్) మాత్రమే, తప్పనిసరి కాదు.

## ఇమామ్ వెనుక ఫాతిహాసూరా పఠనం

సామూహిక నమాజ్‌లో ఫాతిహాసూరా విషయమై ఇమాములు, ధర్మవేత్తల మధ్య భేదాభిప్రాయాలున్నాయి. ఈ విషయంలో మూడు దృక్పథాలున్నాయి. ప్రతివర్గం తన దృక్పథానికి అనుకూలంగా హదీసు ఆధారాలు, ఇతర దృక్పథాలకు ప్రతికూలంగా సహేతుక ప్రమాణాలు చూపుతుంది. ఇక్కడ వాటన్నిటిని పేర్కొని పాఠకుల్ని వాదోపవాదాల ఊబిలోకి దించడానికి బదులు ఆ చర్చను సంక్షిప్తంగా తెలియజేస్తూ సంబంధిత హదీసుల్ని మాత్రమే ఉదాహరించి విషయం పాఠకుల నిర్ణయానికి వదిలేస్తున్నాను.

"ఎవరికి ఇమామ్ ఉంటాడో ఆ ఇమామ్ చేసే పఠనం (ఖిరాత్) వారి పఠనం అవుతుంది." (ఇబ్నెమాజ, దారెఖుత్నీ, బైహఖీ, ముఅత్తా-ఇమాం మాలిక్)

హజ్రత్ అబూహురైరా (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ఇలా అన్నారు: "ఇమామ్‌ను అనుసరించాలన్న ఉద్దేశ్యంతోనే అతడ్ని నియమించడం జరుగుతుంది. కాబట్టి ఇమామ్ 'అల్లాహుఅక్బర్' అనంటే మీరు కూడా అల్లాహుఅక్బర్ అనండి. ఇమామ్ అల్లాహుఅక్బర్

అని చెప్పక ముందే మీరు అల్లాహుఅక్బర్ అని చెప్పకండి. ఇమామ్ రుకూ చేస్తే మీరు కూడా రుకూ చేయండి. అతను రుకూ చేయనంతవరకు మీరూ రుకూ చేయకండి. ఇమామ్ 'సమిఅల్లాహు లిమన్‌హమిదహ్' అనంటే మీరు 'అల్లాహుమ్మ రబ్బనాలకల్ హమ్ద్' అనండి. అతను సజ్దా చేస్తే మీరూ సజ్దా చేయండి. అతను సజ్దా చేయనంతవరకు మీరు సజ్దా చేయకండి. ఇమామ్ నిలబడి నమాజ్ చేస్తే మీరూ నిలబడి నమాజ్ చేయండి. అతను కూర్చొని చేస్తే మీరూ కూర్చొని చేయండి.'' (అబూదావూద్)

హజ్రత్ ఉబాదా బిన్ సామిత్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (స) ఇలా అన్నారు: ''ఫాతిహా సూరా పఠించనివారు చేసే నమాజ్ నెరవేరదు.'' (బుఖారి, ముస్లిం)

ఈ ఉల్లేఖనాన్ని బట్టి ఇమామ్, ముఖ్తదీలు ఉభయులూ ప్రతి నమాజ్‌లో ఫాతిహా సూరా పఠించవలసిన అవసరముందని హజ్రత్ అబూహురైరా (రజి) భావించినట్లు తెలుస్తోంది. ఈ విషయమై సహాబీలలో కూడా భిన్నాభిప్రాయాలున్నాయి. ముఖ్తదీలు ఫాతిహా సూరా పఠించడం మక్రూహ్(అవాంఛనీయం) అని కొందరు భావించారు. ముఖ్తదీలు కూడా ఫాతిహాసూరా పఠించాలని మరికొందరు అభిప్రాయపడ్డారు. ఇంకా కొందరు సహాబీలు ఇలా పఠించడం అవసరమని గాని, మక్రూహ్ అనిగాని భావించలేదు. అందువల్లనే హజ్రత్ అబూబకర్ (రజి) మనవడు హజ్రత్ ఖాసిం (రహ్మలై) దృష్టికి ఈ సమస్య వచ్చినప్పుడు కొందరు ఇమాములు ఫాతిహాసూరా పఠించకూడదని, మరికొందరు ఇమాములు ఫాతిహాసూరా పఠించాలని అన్నారని ఆయన తెలియచేశారు. అంతేగాని ఆయన తన సొంత అభిప్రాయం వెలిబుచ్చలేదు.

అలాగే వివిధ ధర్మవేత్తలు, సంస్కరణవాదులలో కూడా ఈ సమస్య గురించి భిన్నాభిప్రాయాలున్నాయి. ఇమామ్ షాఫయి, ఇమామ్ అహ్మద్ బిన్ హంబల్, ఇమామ్ మాలిక్ (రహ్మలై)ల అభిప్రాయం ప్రకారం నమాజ్ ఒంటరిగా చేసినా, ఇమామ్ వెనుక సామూహికంగా చేసినా సరే ఫాతిహా సూరా పఠించడం వాజిబ్ (తప్పనిసరి). హనఫీ ధర్మవేత్తల అభిప్రాయం ప్రకారం ఇమామ్ వెనుక నమాజ్ చేసేవాళ్ళు ఫాతిహా సూరా పఠించడం మక్రూహ్ (అవాంఛనీయం)- ('మహాప్రవక్త మహితోక్తులు' గ్రంథం నుండి.)

హజ్రత్ అబూహురైరా (రజి) ఉల్లేఖనం: దైవప్రవక్త (స) ఖుర్ఆన్ బిగ్గరగా పఠించే ఒక (జుహ్రీ) నమాజ్‌ని సలామ్‌తో ముగించిన తరువాత ''నా వెనుక మీలో ఎవరైనా పారాయణం చేశారా?'' అని అడిగారు. ఒకతను ''నేను పారాయణం చేశాను దైవప్రవక్తా!'' అని అన్నాడు. దైవప్రవక్త (స) ఈమాట విని ''అందువల్లనే నేను ఖుర్ఆన్ పఠనం చేస్తున్నప్పుడు నాకెందుకు ఇబ్బంది ఏర్పడిందీ అని అనుకున్నాను'' అని అన్నారు. ప్రజలు దైవప్రవక్త (స) పలికిన ఈ మాటలు విన్నప్పటి నుండి జుహ్రీ నమాజుల్లో ఖుర్ఆన్ పారాయణం చేయడం మానేశారు. (అబూదావూద్, తిర్మిజి, నసాయి, అహ్మద్, ఇబ్నెమాజ)

హజ్రత్ ఉబాదా బిన్ సామిత్ (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ఇలా అన్నారు: ''నేను బిగ్గరగా ఖుర్ఆన్ పఠిస్తున్నప్పుడు మీలో ఎవరూ ఫాతిహా సూరా తప్ప ఖుర్ఆన్ (లోని ఇతర సూరాలేవీ) పఠించకూడదు.'' (అబూదావూద్, తిర్మిజి, అహ్మద్, నసాయి)

హజ్రత్ జాబిర్ (రజి) ప్రకారం దైవప్రవక్త (స) హితోక్తి: ''ఎవరి ఇమామ్ ఖుర్ఆన్ పఠనం చేస్తాడో అది వారి పఠనంగానే పరిగణించబడుతుంది.'' (దార్‌ఖుత్నీ)



దైవప్రవక్త (స) హితోక్తి: ''(ప్రజలు) ఇమామ్‌ను అనుసరించడానికే అతడ్ని నియమించడం జరుగుతుంది. కనుక ఇమామ్ 'అల్లాహుఅక్బర్' అంటే మీరూ 'అల్లహుఅక్బర్' అనండి. అయితే ఇమామ్ ఖుర్ఆన్ పఠిస్తుంటే మీరు మౌనంగా ఉండండి.'' (ముస్లిం)

'హదాయా' గ్రంథకర్త ఇమామ్ వెనుక ఫాతిహాసూరా పఠించరాదనే విషయం మీద సహాబీల ఏకాభిప్రాయం ఉందని అన్నారు. అలాగే ఇమామ్ వెనుక ఖుర్ఆన్ పఠించరాదనే విషయాన్ని 80 మంది సహాబీల అభిప్రాయం నిరూపిస్తోందని అల్లామా అయినీ తన గ్రంథంలో వ్రాశారు. ముస్లింలోని ఒక హదీసులో కూడా ఈమాట ఇలా ఉంది:

''దైవప్రవక్త (సల్లం) హితోక్తులు:- ''ఇమామ్ (ఖుర్ఆన్) పఠిస్తున్నప్పుడు మీరు మౌనంగా ఉండండి.'' (ముస్లిం); ''మీ నమాజులు స్వీకరించబడాలని మీరు కోరుకుంటే మీకు నాయకత్వం మీ ధర్మవేత్తలే వహించాలి. ఎందుకంటే వారు మీకు, మీ ప్రభువుకు మధ్య ప్రతినిధి వర్గం (నాయకులు).'' (హాకిం, బైహఖి)

హజ్రత్ అబూహురైరా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఇలా అన్నారు: ''(నమాజ్‌లో) ఇమామ్‌ని మీరి పోకండి. ఇమామ్ (అల్లాహుఅక్బర్ అని) తక్బీర్ చెబితే మీరూ తక్బీర్ చెప్పండి. అతను 'వలజ్జాల్లీన్' అంటే మీరు 'ఆమీన్' అనండి. ఇమామ్ రుకూ చేస్తే మీరూ రుకూ చేయండి. అతను 'సమిఅల్లాహు లిమన్ హమిదహ్' అంటే మీరు 'అల్లాహుమ్మ రబ్బనా లకల్ హమ్ద్' అనండి.'' (బుఖారి, ముస్లిం)

పై హదీసులో దైవప్రవక్త (స) ఖుర్ఆన్ పఠనం గురించి ప్రస్తావించలేదు. ఫాతిహా సూరా చివరిపదాన్ని మాత్రమే ప్రస్తావించి ముఖ్తదీలు 'ఆమీన్' చెప్పాలనిఅన్నారు. ఒకవేళ సామూహిక నమాజ్‌లో ఇమామ్‌తోపాటు ముఖ్తదీలు కూడా ఫాతిహాసూరా పఠించవలసివుంటే, దైవప్రవక్త (స) ఈ విషయాన్ని పై హదీసులో తప్పక ప్రస్తావించిఉండేవారు. కాని అలా జరగలేదు.

హజ్రత్ జాబిర్ (రజి) ప్రకారం దైవప్రవక్త (స) హితోక్తి: ''నావాక్కు దైవవాణిని రద్దు చేయదు. దైవవాణి నావాక్కును రద్దుచేస్తుంది......'' (దారిమి-మిష్కాత్)

ఫాతిహా సూరా పఠించనిదే నమాజ్ నెరవేరదనే హదీసు సమక్షంలో ఖుర్ఆన్‌లో కూడా ఓ ఆసక్తికరమైన సూక్తి ఈవిధంగా ఉంది: "మీ ముందు ఖుర్ఆన్ పఠిస్తున్నప్పుడు నిశ్శబ్దంగా ఉండి దాన్ని శ్రద్ధగా వినండి, మీరు కరుణించబడతారు." (7:204)

ఈ సూక్తిలోని ఆజ్ఞ సాధారణమైనది. కనుక ఖుర్ఆన్ సూక్తులు నమాజ్‌లో పఠిస్తున్నా, వేరేసమయాల్లో పఠిస్తున్నా వాటిని వినేవారు మౌనంగా ఉండి, శ్రద్ధగా ఆలకించాలి. అంతేగాని వాటిని నెమ్మదిగానైనా పునరుద్ఘాటించకూడదని హనఫీ దృక్పథం పేర్కొన్నది.

## 'ఆమీన్' పలకాలి బిగ్గరగానా, నిశ్శబ్దంగానా?

దైవప్రవక్త (స) హితోక్తి: ''ఇమామ్ 'ఆమీన్' (తథాస్తు) అని చెప్పినప్పుడు మీరు కూడా ఆమీన్ అని చెప్పండి. ఎవరు పలికే ఆమీన్ దైవదూతలు పలికే ఆమీన్‌తో కలుస్తుందో అతని గత పాపాలు క్షమించబడతాయి.'' (బుఖారి, ముస్లిం, తిర్మిజి, అబూదావూద్)

హజ్రత్ నయీముల్ మజ్మరీ (రహ్మ) కథనం: ''నేను హజ్రత్ అబూహురైరా (రజి) వెనుక నమాజ్ చేశాను. ఆయన మొదట 'బిస్మిల్లాహిర్రహ్మానిర్రహీం' చదివారు. తరువాత

ఫాతిహా సూరా చదివారు. అందులో 'వలజ్జాల్లీన్' పఠించిన తరువాత 'ఆమీన్' అని చెప్పారు. అప్పుడు ప్రజలు (ముఖ్తదీలు) కూడా 'ఆమీన్' చెప్పారు." (బుఖారి, నసాయి)

హజ్రత్ అతా (రహ్మ) కథనం: "నేనీ మస్జిద్‌లో 200 మంది సహాబీలను చూశాను. ఇమామ్ 'వలజ్జాల్లీన్' చెప్పగానే ప్రజలు పలికే 'ఆమీన్'తో (మస్జిద్) ప్రతిధ్వనించేది.

దైవప్రవక్త (స) ప్రవచనం: "(మీరు పరస్పరం చెప్పుకునే) సలాం విషయంలో, ఇమామ్ వెనుక పలికే ఆమీన్ విషయంలో యూదులు మీపట్ల ఎంత అసూయ పడతారో మరే విషయంలోనూ అంతగా అసూయ పడరు." (అహ్మద్, ఇబ్నెమాజ)

ఇలా జుహ్రీనమాజ్‌లో ఇమామ్‌తో పాటు ముఖ్తదీలు 'ఆమీన్' పదాన్ని బిగ్గరగా పలికే పద్ధతిని షాఫయి, హంబలీ దృక్పథకులు, అహ్లెహదీస్ ధర్మవేత్తలు అవలంబించారు. కాగా హనఫీ దృక్పథకులు, మాలికీ దృక్పథకుల అభిప్రాయం ప్రకారం ఎలాంటి పరిస్థితిలోనైనా సరే 'ఆమీన్'ని నిశ్శబ్దంగానే పలకాలి. దానికి వారు ఈక్రింది ఆధారాలు పేర్కొంటారు-

"అనేక ఖుర్‌ఆన్ సూక్తుల్లో, హదీసుల్లో దేవుడ్ని మెల్లిగా వేడుకోవాలని, ఆయన్ని మెల్లిగా స్మరించాలని ఉంది." (ఫతహుర్రబ్బాని)

1-హజ్రత్ ఇబ్నెవాయిల్ (రహ్మ) కథనం: "హజ్రాత్ ఉమర్, అలీ (రజి)లు 'బిస్మిల్లా, అవూజుబిల్లాహి, ఆమీన్' పలుకుల్ని బిగ్గరగా పఠించేవారు కాదు." (తహావి)

2-హజ్రాత్ ఇబ్నెవాయిల్ (రహ్మ) కథనం: "దైవప్రవక్త (స) 'ఆమీన్ పఠించారు. అయితే తన కంఠస్వరాన్ని తగ్గించారు." (తిర్మిజి)

3-వాయిల్ బిన్ హజర్ (రహ్మ):- "ఉమర్ (రజి), అలీ (రజి)లు 'బిస్మిల్లా, అవూజు బిల్లాహి, ఆమీన్' పలుకుల్ని పఠించారు; తమ కంఠస్వరాన్ని సుదీర్ఘం చేశారు." (తిర్మిజి)

'ఆమీన్'ని బిగ్గరగా పఠించాలని చెప్పే హదీసువేత్తలు, అహ్లెహదీస్ దృక్పథకులు పైన పేర్కొన్న మొదటి రెండు ఉల్లేఖనాల కంటే మూడవ ఉల్లేఖనం ఎక్కువ ప్రామాణికమైనదని, అందులో కంఠస్వరాన్ని సుదీర్ఘం చేయడమంటే బిగ్గరగా పఠించడమేనని అంటారు. హనఫీ ధర్మవేత్తలు మాత్రం కంఠస్వరాన్ని సుదీర్ఘం చేయడమంటే మెల్లిగా పఠించడమేనని చెబుతారు.

## జుమా ప్రాముఖ్యం

"విశ్వాసులారా! శుక్రవారం సమావేశం రోజున నమాజు కోసం పిలుపునిచ్చినప్పుడు మీరు వెంటనే అమ్మకం, కొనుగోళ్ళ వ్యవహారాలు వదిలేసి దైవస్మరణ (ధర్మబోధ) వైపుకు పరుగెత్తండి. మీరు అర్థం చేసుకుంటే ఇది మీకెంతో శ్రేయస్కరమైనది. నమాజ్ ముగిసిన తరువాత మీరు యథాప్రకారం నేల నలువైపులా విస్తరించి దైవానుగ్రహం (ఉపాధి) అన్వేషించవచ్చు. (ఆ సందర్భంలో కూడా) దేవుడ్ని ఎక్కువగా స్మరిస్తూ ఉండండి. దీనివల్ల మీకు సాఫల్యభాగ్యం లభించవచ్చు." (ఖుర్‌ఆన్-62:9-10)

మూఢకాలంలో అరబ్బులు శుక్రవారాన్ని "యౌముల్‌అరూబా" పేరుతో ప్రత్యేక ఆరాధనా దినంగా పాటించేవారు. దీన్ని దైవప్రవక్త (స) ముస్లింల కోసం "జుముఅ" పేరుతో నిర్ణయించారు.

ఇస్లాంకు పూర్వం యూదుల్లో వారంలో ఒక రోజును ప్రత్యేక ఆరాధనా దినంగా, జాతీయచిహ్నంగా పరగణించే సంప్రదాయం ఉండేది. దానికోసం వారికి శనివారం నిర్ణయించ



బడింది. శనివారం దేవుడు ఇస్రాయీల్ సంతతిని ఫిరౌన్ బానిసత్వం నుండి విముక్తి చేయడం వల్ల ఆరోజు వారికి ప్రత్యేక ఆరాధనాదినంగా, జాతీయచిహ్నంగా నిశ్చయించబడింది.

దాన్ని చూసి క్రైస్తవులు కూడా తమ కోసం ప్రత్యేక ఆరాధనా దినంగా, జాతీయ చిహ్నంగా ఆదివారాన్ని నిర్ణయించుకున్నారు. ఇది వారి సొంత నిర్ణయమే కాని, ఈసా (అలై) చేసిన నిర్ణయం కాదు. ఆయనపై అవతరించిన ఇన్జీల్‌లో అలాంటి ఆదేశం ఏదీలేదు. ఆదివారం ఏసుక్రీస్తు శిలువపై ప్రాణం విడిచిన తర్వాత, ఆరోజే సమాధి నుండి లేచి పైకి వెళ్ళాడని క్రైస్తవులు నమ్ముతారు. ఈ కారణంగానే ఆ తర్వాతి కాలం క్రైస్తవులు ఆదివారాన్ని ప్రత్యేక ఆరాధనాదినంగా నిర్ణయించుకున్నారు. క్రీ.శ. 321లో రోమన్ ప్రభుత్వం దాన్ని సాధారణ సెలవుదినంగా పరిగణిస్తూ ఆజ్ఞ జారీచేసింది.

ఇస్లాం యూదులు, క్రైస్తవులకు భిన్నంగా ముస్లింలకోసం శుక్రవారాన్ని ప్రత్యేక ఆరాధనా దినంగా నిర్ణయించింది. ఆరోజు ముస్లింలు వ్యాపారం, ఉద్యోగం వగైరా ప్రాపంచిక వ్యవహారాలన్నీ కట్టిపెట్టి జుమానమాజు కోసం సిద్ధంకావాలని దేవుడు ఆదేశిస్తున్నాడు. ముఖ్యంగా "అజాన్" కాగానే ప్రాపంచిక కార్యకలాపాలు పూర్తిగా వదిలెయ్యాలి. అజాన్ తరువాత కూడా ప్రాపంచిక కార్యకాలాపాలు కొనసాగించడాన్ని ధర్మవేత్తలు హరాంగా పరిగణించారు.

హజ్రత్ అబూహురైరా (రజి) కథనం దైవప్రవక్త (స) హితోక్తి: "సూర్యుడు ఉదయించే దినాలలో అతి శ్రేష్ఠమైన దినం శుక్రవారం. ఆరోజు ఆదం (అలై) సృజించబడ్డారు. ఆరోజే ఆయన స్వర్గంలో ప్రవేశపెట్టబడ్డారు. ఆరోజే ఆయన్ని స్వర్గం నుంచి తీసివేయడం జరిగింది. ప్రళయం కూడా శుక్రవారమే సంభవిస్తుంది." (ముస్లిం)

దైవప్రవక్త (స) ప్రవచనం: "ముస్లింలు జుమా నమాజ్ వదిలేయకూడదు. జుమా నమాజ్ వదిలేస్తే దేవుడు వారి హృదయకవాటాలు మూసివేస్తాడు. ఆ తరువాత వారు తీవ్రమైన ఏమరుపాటుకు లోనైపోతారు." (ముస్లిం)

హజ్రత్ అబూహురైరా (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ఇలాఅన్నారు: "ముస్లింలారా! శుక్రవారాన్ని దేవుడు మీకు పండుగ దినంగా నిర్ణయించాడు. కనుక ఆరోజు మీరు శుభ్రంగా స్నానం చేసి పలుదోముపుల్లతో ముఖం కడుక్కోండి." (త్కాబ్రాని)

హజ్రత్ అబూహురైరా (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ఇలా అన్నారు: "శుక్రవారం రోజు ప్రతి ముస్లిం శుభ్రంగా స్నానం చేయాలి; మంచి బట్టలు ధరించాలి; సువాసన ఏదైనా ఉంటే దాన్ని పూసుకోవాలి." (బుఖారి, ముస్లిం, అహ్మద్)

హజ్రత్ సమురా (రజి) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "శుక్రవారంనాడు ఉజూ చేసినవాడు మంచిపని చేశాడు, గుసుల్ చేసినవాడు అంత కంటే మంచిపని చేశాడు." (అహ్మద్, అబూదావూద్, తిర్మిజి, నసాయి)

హజ్రత్ అబూసయీద్ ఖుద్రీ (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ప్రవచనం: "ప్రతి వయోజన పురుషుడు శుక్రవారం రోజు తప్పనిసరిగా స్నానం చేయాలి." (బుఖారి)

ఈ హదీసుని బట్టి శుక్రవారం తప్పనిసరిగా తలంటు స్నానం చేయాలని తెలుస్తోంది. ఈ ఆదేశాన్ని కొందరు సహాబీలు పాటించారు. అయితే హజ్రత్ ఆయిషా (రజి) ఉల్లేఖనం

ప్రకారం శుక్రవారం స్నానం తప్పనిసరి కాదని ముస్తహిబ్ (అభిలషనీయం) మాత్రమేనని కూడా మరొక వైపు తెలుస్తోంది. అందువల్ల అత్యధికమంది ధర్మవేత్తలు ఈ పద్ధతినే అవలంబించారు. దీనికి మరింత బలం చేకూర్చుతున్న మరో హదీసు ఇలా ఉంది:

దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "ఎవరైనా (శుక్రవారం రోజు) ఉజూ చేస్తే సరే (సరిపోతుంది). అయితే గుసుల్ చేస్తే మరీ మంచిది." (అల్లూలూ వల్ మర్జాన్)

హజ్రత్ అబూహురైరా (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ఇలా అన్నారు: "శుక్రవారం రోజు లైంగిక అశుద్ధావస్థ పోవడానికి చేసే స్నానంలాంటి స్నానం చేసి (అందరికంటే ముందు) మస్జిద్‌కు వెళ్ళే వ్యక్తి ఒక ఒంటెను దానం చేసినవాడవుతాడు. ఆ తరువాత మస్జిద్‌కు వెళ్ళే వ్యక్తి ఒక ఆవును బలిచ్చిన వాడవుతాడు. ఆ తరువాత మూడవ సమయంలో మస్జిద్‌కు వెళ్ళే వ్యక్తి కొమ్ముల పొటేలును బలిచ్చిన వాడవుతాడు. ఆ తరువాత నాల్గవ సమయంలో మస్జిద్‌కు వెళ్ళే వ్యక్తి ఒక కోడిని దానం చేసినవాడవుతాడు. ఆ తరువాత ఐదవ సమయంలో మస్జిద్‌కు వెళ్ళే వ్యక్తి ఒక గుడ్డును దానం చేసినవాడవుతాడు. ఆ తరువాత ఇమామ్ (ఉపన్యాసం ఇవ్వడానికి) వస్తాడు. అప్పుడు దైవదూతలు వచ్చి జుమాప్రసంగం వింటారు." (బుఖారి, ముస్లిం, తిర్మిజి)

హజ్రత్ అవస్ బిన్ అవస్ (రజి) ఉల్లేఖనం: దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు- "మీ (ఐహిక) దినాలన్నిటిలో శుక్రవారం అత్యంత శ్రేష్ఠమైన దినం. ఆరోజే ఆదం (అలై) పుట్టారు. ఆరోజే ఆయన చనిపోయారు. ఆరోజే ప్రళయం సంభవిస్తుంది. కనుక శుక్రవారం రోజు నాకోసం అత్యధికంగా 'దరూద్' పఠించండి. మీ దరూద్ నా దగ్గరకు చేర్చడం జరుగుతుంది." అనుచరులు ఈమాట విని "దైవప్రవక్తా! మేము మీ కోసం దరూద్ ఎలా పఠించగలం, మీరు (ఇహలోకం వీడిన తర్వాత) చీకి తునకలయి కన్పించకుండా పోతారు కదా?" అని అన్నారు. దానిపై దైవప్రవక్త (స) "భూమి దైవప్రవక్తల దేహాలను తినకుండా దాన్ని నిషేధించాడు" అని అన్నారు. (అబూదావూద్, అహ్మద్, ఇబ్నెమాజ)

హజ్రత్ అబూహురైరా (రజి) కథనం: దైవప్రవక్త (స) ఓరోజు (మస్జిద్‌లో) జుమా నమాజ్ గురించి ప్రస్తావిస్తూ "అందులో ఒక విశేష ఘడియ ఉంది. ఆ ఘడియలో ఏ ముస్లిం దాసుడయినా నమాజ్ చేసి దేవుడ్ని ఏదైనా వేడుకుంటే దేవుడు దాన్ని తప్పకుండా అతనికి ప్రసాదిస్తాడు" అని చెప్పారు. ఆ ఘడియ కొద్దిసేపే ఉంటుందని ఆయన చేత్తో సైగ చేశారు. (బుఖారి)

దైవప్రవక్త (స) ప్రవచనం: "ఆ ఘడియ ఇమామ్ వేదికపై కూర్చున్న క్షణం నుంచి మొదలయి సామూహిక నమాజ్ ముగిసే వరకూ ఎప్పుడైనా ఉండవచ్చు." (ముస్లిం)

హజ్రత్ జాబిర్ (రజి) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (స) ఇలా అన్నారు: "శుక్రవారం రోజులో పన్నెండు ఘడియలు ఉన్నాయి. ఆ పన్నెండు ఘడియల్లో ఓ విశేష ఘడియ ఉంది. ఆ ఘడియలో ముస్లిం దాసుడెవరైనా నమాజ్ చేసి దేవుడ్ని ఏదైనా వేడుకుంటే దేవుడు దాన్ని తప్పకుండా నెరవేరుస్తాడు. మీరా ఘడియను 'అసర్' (ప్రారంభ ఘడియ) తరువాత అంతిమ ఘడియలో అన్వేషించండి." (నసాయి, అబూదావూద్, హాకిమ్)



హజ్రత్ తారిఖ్ బిన్ షిహాబ్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "జుమా సామూహిక నమాజ్ చేయడం బానిసలు, స్త్రీలు, పిల్లలు, వ్యాధిగ్రస్తులకు తప్ప ప్రతి ముస్లింకు విధి (ఫరజ్)గా చేయబడింది." (అబూదావూద్)

హజ్రత్ అబూజాద్ జమ్రీ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "ఎవరైనా జుమాను గౌరవించకుండా (అకారణంగా) మూడు జుమా(నమాజ్)లను వదిలేస్తే దేవుడు అలాంటివాడి హృదయకవాటాలను మూసేస్తాడు." (అబూదావూద్, తిర్మిజి)

"దైవప్రవక్త (స) శుక్రవారం ప్రయాణంలో ఉంటే జుమానమాజ్‌కు బదులు జుహర్ నమాజ్ చేసేవారు. వీడ్కోలుహజ్ సందర్భంలో శుక్రవారం ఆయన అరఫాత్‌లో ఉన్నారు. ఆరోజు జుమానమాజ్ చేయకుండా జుహర్, అసర్ నమాజులు కలిపి (జమాతఖ్దీమ్) చేశారు. ఖుల్ఫాయెరాషిదీన్ కూడా అలాగే చేసేవారు." (జాదుల్‌మాద్)

హజ్రత్ అబూహురైరా (రజి) ప్రకారం దైవప్రవక్త (స) హితోక్తి: "(శుక్రవారం) ఎవరైతే శుభ్రంగా స్నానం చేసి, జుమానమాజ్‌కు వచ్చి తన అదృష్టంలో ఉన్నంత నమాజ్ చేసి, ఇమామ్ ఖుత్బా ఇచ్చేదాకా నిశ్శబ్దంగా కూర్చొని, తర్వాత ఇమామ్‌తో కలసి ఫరజ్ నమాజ్ చేస్తాడో, గతరెండు శుక్రవారాల మధ్య అతనివల్ల జరిగిన పాపాలన్నీ క్షమించబడతాయి. అదనంగా మరోమూడు రోజుల పాపాలు కూడా క్షమించబడతాయి." (ముస్లిం)

హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (స) ఇలా చెప్పారు: "జుమా (నమాజ్)లో మూడు రకాల మనుషులు వస్తారు. 1-ఒకరకం మనిషి పనికిమాలిన మాటలు మాట్లాడుతాడు. అతనికి లభించే (కర్మఫలం)వాటాలో ఆ మాటలే ఉంటాయి. 2-రెండవరకం మనిషి దేవుడ్ని వేడుకుంటాడు. దేవుడు తలచుకుంటే అతని వేడుకోలును స్వీకరించవచ్చు లేదా స్వీకరించకపోవచ్చు. 3-మూడోరకం మనిషి నిశ్శబ్దంగా, ప్రశాంతంగా కూర్చుంటాడు. (పంక్తిని చీల్చుతూ) ప్రజల మెడలపై నుంచి దాటుకుంటూపోడు; ఎవరికీ బాధ కలిగించడు. ఈ ఆచరణ వచ్చే శుక్రవారందాకా, మరో మూడురోజులదాకా అతని వల్ల జరిగే పాపాలకు పరిహారం అవుతుంది..." (అహ్మద్, అబూదావూద్)

హజ్రత్ ముఆజ్ బిన్ అనస్ జుహని (రజి)గారి తండ్రి ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "శుక్రవారం రోజు ఎవరైనా (పంక్తిని చీల్చుతూ) ప్రజల మెడలపై నుంచి దాటుకుంటూ ముందుకు పోవడం జరిగితే, (పరలోకంలో) అతడ్ని నరకపు వంతెనగా చేయడం జరుగుతుంది." (తిర్మిజి)

పై హదీసు గురించి ఇమామ్ తిర్మిజి (రహ్మాలై) ఇలా తెలియజేస్తున్నారు: "ఈ హదీస్ అంతగా ప్రామాణికమైనది కాకపోయినా పండితులందరి దృష్టిలో 'శుక్రవారం రోజు ప్రజల మెడలపై నుంచి దాటుకుంటూ ముందుకు పోవడం అవాంఛనీయం (మక్రూహ్).

హజ్రత్ అబూహురైరా (రజి) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఇలా అన్నారు: "మీలో ఎవరైనా తాను కూర్చున్న చోటు నుంచి ఏదైనా పనిబడి లేచి వెళ్ళిపోయి (పనయి పోయిన తరువాత) తిరిగొస్తే ఆ చోటులో కూర్చోవడానికి అందరికంటే అతనికే ఎక్కువ హక్కుంటుంది." (ముస్లిం, అహ్మద్)

## జుమా ప్రసంగం

జుమానమాజ్‌కు ముందు ఖుత్బా (ఉపన్యాసం) ఇవ్వవలసిఉంటుంది. ఇది రెండు భాగాలు. ఈ ఉపన్యాసం కొందరి అభిప్రాయం ప్రకారం సున్నత్ (సంప్రదాయం) మాత్రమే. అయితే మరికొందరి అభిప్రాయం ప్రకారం వాజిబ్ (తప్పనిసరి). ఇందులో అయిదు అంశాలు ఉన్నాయి. 1-దైవస్తోత్రం, 2-ముహమ్మద్ మహనీయుని (స) దైవదౌత్యం (రిసాలత్) గురించిన సాక్ష్యం, 3-ప్రజలకు హితోపదేశం, 4-ఖుర్‌ఆన్‌లోని కొన్ని సూరాలు లేక సూక్తుల పఠనం, 5-ముస్లింల శ్రేయోసంక్షేమాల కోసం వేడుకోలు.

హజ్రత్ అబూహురైరా (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ఇలా అన్నారు: "దైవస్తోత్రంతో ప్రారంభంకాని ప్రతి వాణీ (మాటలు, ప్రసంగం వగైరా) నిరర్థకమైనదే." (అబూదావూద్)

మరొక ఉల్లేఖనంలో ఇలా ఉంది: "(దేవుని ఏకత్వానికి, దైవప్రవక్త-(స) దౌత్యానికి సంబంధించిన) సాక్ష్యంలేని ప్రసంగం తెగిన చేయిలాంటిది."

హజ్రత్ అమ్మార్ బిన్ యాసిర్ (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "ఎవరైనా (జుమా)నమాజ్‌ను సుదీర్ఘంగా, ప్రసంగాన్ని సంక్షిప్తంగా చేస్తున్నాడంటే, అది అతని ధార్మిక అవగాహనకు నిదర్శనం అని చెప్పవచ్చు. కనుక మీరు నమాజ్ సుదీర్ఘంగా చేయండి; ఉపన్యాసం సంక్షిప్తంగా ఇవ్వండి." (అహ్మద్, ముస్లిం)

హజ్రత్ జాబిర్ బిన్ సమురా (రజి) కథనం: "దైవప్రవక్త (స) జుమా ప్రసంగంలో ఖుర్‌ఆన్‌లోని కొన్ని సూక్తులు పఠించి ప్రజలకు హితబోధ చేసేవారు." (అబూదావూద్)

హజ్రత్ జాబిర్ బిన్ అబ్దుల్లా (రజి) కథనం: "దైవప్రవక్త (స) జుమాప్రసంగం చేస్తున్నప్పుడు ఆయన పరిస్థితే మారిపోయేది. ఓ(పెద్ద) శత్రుసైన్యం (ఈరోజు) సాయంత్రమో, (రేపు)ఉదయమో వచ్చిపడుతుందని ప్రజల్ని హెచ్చరిస్తున్నట్లు ఆయన కళ్ళు ఎర్రబారేవి, కంఠస్వరం పెరిగిపోయేది, ఆగ్రహం తీవ్రమయ్యేది." (ముస్లిం, ఇబ్నెమాజ)

హజ్రత్ అబ్దుల్లా బిన్ మస్‌వూద్ (రజి) కథనం: దైవప్రవక్త (స) తమ జుమాప్రసంగంలో దైవస్తుతి తరువాత ఇలా చెప్పేవారు- "అల్‌హమ్దులిల్లాహి నస్తఈనుహూ వస్తగ్ఫిరుహూ వనఊజుబిల్లాహి మిన్‌షురూరి అన్‌ఫుసినా మన్‌య్యహ్దిల్లాహు ఫలాముజిల్లలహూ వ మన్‌య్యుజ్‌లిల్ ఫలాహాదియ లహూ వఅష్‌హదుఅన్న ముహమ్మదన్ అబ్దుహూ వ రసూలుహూ అర్సలహూ బిల్‌హఖ్ఖి బషీరమ్ బైన యదయిస్సాఅతి వమన్‌య్యుతి ఇల్లాహ వరసూలహూ ఫఖద్‌రషద వమన్‌య్యుఅ్‌సిహిమా ఫయిన్నహూ లాయజుర్రు ఇల్లానఫ్సహూ వలా యజుర్రుల్లాహ షైఅన్." (అబూదావూద్)

(అనువాదం: స్తుతి స్తోత్రాలు దేవునికే శోభిస్తాయి. మేము ఆయన్నే సహాయం అర్థిస్తాము. ఆయన్నే క్షమాపణ కోరుకుంటాము. మా హృదయాలు ఉసిగొల్పే చెడులనుండి మేము దేవుని శరణు కోరుతాము. దేవుడు ఎవరినైనా సన్మార్గం చూపితే ఆయన తప్ప మరెవరూ అతడ్ని సన్మార్గం నుండి తప్పించలేరు. ముహమ్మద్ (సల్లం) దేవుని దాసుడని, ఆయన ప్రవక్తని నేను సాక్ష్యమిస్తున్నాను. దేవుడు ఆయన్ని ప్రళయం సంభవించడానికి ముందే శుభవార్తాహరునిగా చేసి ప్రభవింపజేశాడు. దేవునికి, ఆయన ప్రవక్త (స)కు విధేయుడయినవాడే సన్మార్గం పొందుతాడు. దేవునికి, ఆయన ప్రవక్త (స)కు అవిధేయుడైపోయినవాడు తననుతానే నష్ట



పరచుకుంటాడు. అతను దేవునికి ఎలాంటి నష్టం కలిగించలేడు.)

జుమాప్రసంగం ఏదైనా వేదికపై లేదా ఎత్తయిన చోటుపై నిలబడి చేయడం, ప్రసంగం మధ్యలో కాస్సేపు కూర్చోవడం ప్రవక్త సంప్రదాయం (సున్నత్). ఈవిధంగా జుమాఖుత్బా రెండు ప్రసంగాలు అవుతాయి.

హజ్రత్ జాబిర్ (రజి) కథనం: ఓరోజు దైవప్రవక్త నిల్చొని జుమా ప్రసంగం చేస్తుండగా సిరియా నుండి ఒక వర్తకబిడారు వచ్చింది. ప్రజలు దాన్ని చూడగానే (ప్రసంగం వదలి) అటుగా పరుగెత్తారు. మస్జిద్‌లో పన్నెండుమంది మాత్రమే ఉండిపోయారు." (ముస్లిం)

"వారు వ్యాపారసంరంభం, వినోదం చూడగానే నిన్ను నిలబడ వదిలేసి వాటి వైపు పరుగెత్తారు. వారికి ఈవిధంగా చెప్పు: "ఈ వ్యాపారం, వినోదాలకంటే దేవుని దగ్గర ఉన్నవి అనేక రెట్లు శ్రేష్ఠమైనవి. దేవుడు అందరికంటే ఎంతో శ్రేష్ఠమైన ఉపాధిప్రదాత." (దివ్యఖుర్‌ఆన్-62:11)

దైవప్రవక్త (స) ప్రవచనం: "జుమా రోజు ఇమామ్ వేదికపై నిల్చొని ప్రసంగిస్తున్నప్పుడు ఎవరైనా మాట్లాడితే అతను పుస్తకాలు మోసే గాడిద లాంటివాడు. అతనితో 'నిశ్శబ్దంగా ఉండు' అనే మనిషి జుమా కూడా వ్యర్థమవుతుంది." (ముస్నద్ అహ్మద్)

హజ్రత్ జాబిర్ (రజి) కథనం: శుక్రవారం రోజు ఒకతను మస్జిద్‌లో ప్రవేశిస్తున్న సమయంలో దైవప్రవక్త (స) ఉపన్యాసం ఇస్తున్నారు. ఆయన అప్పుడే వచ్చిన మనిషిని ఉద్దేశించి "నీవు నమాజ్ చేశావా?" అని అడిగారు. అతను చేయలేదన్నాడు. దైవప్రవక్త (స) ఈమాట విని "అయితే (ముందు) రెండు రకాతులు (తహ్యాతుల్‌మస్జిద్) నమాజ్ చెయ్యి" అని ఆదేశించారు. (బుఖారి, ముస్లిం)

ఈ హదీసును ఇమామ్ షాఫయి, ఇమామ్ అహ్మద్ (రహ్మలై)లు, అహ్లెహదీస్ దృక్పథకులు అనుసరిస్తారు. వీరికి భిన్నంగా ఇమామ్ అబూహనీఫా, ఇమామ్ మాలిక్ (రహ్మలై)లు, వారి అనుచరులు ఖుత్బా (జుమాప్రసంగం) సమయంలో ఎలాంటి నమాజ్ చేయకూడదని అంటారు. వారు తమ దృక్పథానికి అనుకూలంగా ఈ క్రింది హదీసులు చూపుతారు-

హజ్రత్ అబూహురైరా (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ఇలా అన్నారు: "ఇమామ్ ఉపన్యాసం ఇస్తున్నప్పుడు మీరు మీ స్నేహితుడితో 'నిశ్శబ్దంగా ఉండ'ని అంటే అది కూడా పనికిమాలిన మాటవుతుంది." (బుఖారి, ముస్లిం, అబూదావూద్, తిర్మిజి)

హజ్రత్ ఇబ్నెఉమర్ (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ఇలా అన్నారు: "మీలో ఎవరైనా ఇమామ్ ఉపన్యాసం ఇస్తున్నప్పుడు మస్జిద్‌లోకి ప్రవేశిస్తే, ఉపన్యాసం ముగిసేవరకూ అతను ఎలాంటి నమాజయినా, మాట్లాడటమైనా చేయకూడదు." (తబ్రాని)

హజ్రత్ అబూరఫాఅ అద్వి (రజి) కథనం: నేనొకసారి మస్జిద్‌లో ప్రవేశించి చూస్తే దైవప్రవక్త (స) ఉపన్యాసం (ఖుత్బా) ఇస్తున్నారు. "దైవప్రవక్తా! వేరే ప్రాంతం నుంచి ఒక వ్యక్తి వచ్చాడు. అతనికి మన ధర్మం గురించి ఏమీ తెలియదు, తెలుసుకోవాలనుకుంటున్నాడు" అన్నాను నేను. దైవప్రవక్త (స) ఈమాట విని నావైపు చూశారు. ఉపన్యాసం ఆపి నా దగ్గరకు వచ్చారు. ఇనుప కాళ్ళ కుర్చీ తెప్పించి దానిపై కూర్చున్నారు. కూర్చొని నాకు

ధర్మం గురించిన విషయాలు తెలియజేయసాగారు. ఆ తరువాత వేదిక పైకెళ్ళి తమ ఉపన్యాసం పూర్తిచేశారు. (ముస్లిం, నసాయి)

హజ్రత్ సమురా బిన్ జుందబ్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (స) ఇలా అన్నారు: "దేవుని ప్రస్తావన వైపుకు రండి, ఇమామ్‌కు దగ్గరగా కూర్చోండి. మనిషి (దేవుని విషయాలు శ్రద్ధగా వినడానికి ఇమామ్‌కు దగ్గరగా కూర్చోకుండా) దూరంగా ఉంటే, అతను స్వర్గంలో ప్రవేశించినా ఆలస్యంగా ప్రవేశిస్తాడు." (అబూదావూద్)

## అధికప్రసంగం

అరబ్బేతర ప్రజల కోసం జుమాప్రసంగం అరబీ భాషలోనే ఉండాలా? లేక అరబ్బేతర ప్రజలు మాట్లాడే భాషలో ఉండాలా? ఈ సమస్య గురించి ధర్మవేత్తలలో భిన్నాభిప్రాయాలు ఏర్పడ్డాయి. కొందరు అరబీ భాషలోనే ఉండాలన్నారు. మరికొందరు అరబ్బేతర భాషలో ఉండాలన్నారు. అయితే రెండవ ప్రసంగం అరబీ భాషలోనే ఉండాలనే విషయంలో మాత్రం ధర్మవేత్తల్లో ఏకాభిప్రాయం ఉంది. మొదటి ప్రసంగంలో విషయంలోనే సమస్య వచ్చిపడింది. ఎవరి వాదనలు వారికున్నాయి. కనుక వీటిలో తలదూర్చకుండా ఉండటమే మంచిది.

పోతే జుమా ప్రసంగాలు రెండు మాత్రమే చేయాలని హదీసుల ద్వారా స్పష్టంగా తెలుస్తోంది. గతంలో అనేక మసీదుల్లో ఇమాములు మొదటి ప్రసంగం ఉర్దూలో చేసి రెండవ ప్రసంగాన్ని మాత్రమే అరబీలో చేసేవారు. కాని ఈనాడు అనేక చోట్ల జుమాప్రసంగాలు అరబీభాషలో మాత్రమే ఉండాలని చెప్పేవారు ఆ రెండు అరబీ ప్రసంగాలకు ముందు వేదికపై కాకుండా దాని పక్కన నిలబడి ఉర్దూలో ఒక ప్రసంగం చేస్తున్నారు.

జుమా ప్రసంగం లక్ష్యం దృష్ట్యా ప్రజల విశ్వాసాన్ని పటిష్ఠం చేయడం, వర్తమాన సమస్యల వైపు వారిదృష్టి మళ్ళించి ఖుర్‌ఆన్, హదీసుల వెలుగులో వాటి పరిష్కారం కోసం వారిని సమాయత్తపరచడం మంచి విషయమే. శుక్రవారం మసీదుకు అత్యధికమంది జనం వస్తారు గనక ఇలా వారికి తెలిసిన భాషలో ప్రసంగించడం అవసరమే. అందులో ఎలాంటి సందేహం లేదు. కాని రెండు అరబీప్రసంగాలతో పాటు ఉర్దూలో మరొకప్రసంగం చేయడం ఎంతవరకు సమంజసం? నాకైతే మూడవది 'అధికప్రసంగం' అవుతుందేమోనని అనుమానంగా ఉంది.

## జుమా నమాజ్

జుమానమాజ్‌లో రెండు రకాతులు బిగ్గరగా పఠించాలనే విషయంలో ఎవరికీ ఎలాంటి భేదాభిప్రాయాలు లేవు. ఈ రెండు రకాతులలో ఫాతిహా సూరా తరువాత ఖుర్‌ఆన్‌లోని మరే సూరానైనా లేదా సూక్తులైనా పఠించవచ్చు. అయితే మొదటి రకాత్‌లో ఫాతిహా సూరా తర్వాత 'జుమా'సూరా, రెండవ రకాత్‌లో 'ఇజాజాఅకల్ మునాఫిఖూన్' లేదా మొదటి రకాత్‌లో సూరా 'సబ్బిహిస్మ రబ్బికల్‌ఆలా, రెండవ రకాత్‌లో 'హల్‌అతాక హదీసుల్‌గాషియా' లేదా మొదటి రకాత్‌లో 'జుమా'సూరా, రెండవ రకాత్‌లో 'హల్‌అతాక హదీసుల్‌గాషియా' సూరా పఠించడం అభిలషణీయం (ముస్తహబ్).

ఇబ్నెతైమియా (రహ్మ) అభిప్రాయం ప్రకారం జుహర్‌నమాజ్‌లా జుమానమాజ్‌కు పూర్వం సున్నత్ నమాజ్ చేసే విషయంలో దైవప్రవక్త (స) ఏదైనా చెప్పినట్లు గట్టి ఆధారమేదీ లేదు.

ఇమామ్ మాలిక్ (రహ్మ), అహ్లెహదీస్ పండితుల దృక్పథం ఇదే. వారు జుమా నమాజ్‌కు పూర్వం సున్నత్ నమాజ్ చేయరు. హనఫీ, షాఫయి దృక్పథాల ప్రకారం జుమా ఫరజ్ నమాజ్‌కు



పూర్వం నాలుగు రకాతుల సున్నత్ నమాజ్ చేయవలసిఉంటుంది. దీనికి ప్రమాణంగా వారు "హజ్రత్ అబ్దుల్లా బిన్ మస్‌ఊద్ (రజి) జుమా ఫరజ్ నమాజ్‌కు పూర్వం నాలుగు రకాతులు, తరువాత నాలుగు రకాతులు సున్నత్ నమాజ్ చేసేవార"న్న ఉల్లేఖనం పేర్కొంటారు. ఇమామ్ సుఫ్యాన్‌సౌరి, అబ్దుల్లా బిన్ ముబారక్ (రహ్మ)ల దృక్పథం కూడా ఇదే.

హజ్రత్ ఇబ్నెఉమర్ (రజి) కథనం: "దైవప్రవక్త (స) జుమా తర్వాత (మస్జిద్‌లో) ఎలాంటి నమాజ్ చేసేవారు కాదు. మస్జిద్ నుండి తిరిగొచ్చిన తర్వాతే ఇంట్లో రెండు రకాతులు (సున్నత్) నమాజ్ చేసేవారు." (ముస్లిం)

హజ్రత్ అబూహురైరా (రజి) ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఇలా అన్నారు: "మీలో ఎవరైనా జుమానమాజ్ తరువాత (సున్నత్) నమాజ్ చేసేవాడై ఉంటే, అతను నాలుగు రకాతులు నమాజ్ చేయాలి." (ముస్లిం, అబూదావూద్, తిర్మిజి)

ఇబ్నెతైమియా (రహ్మ) అభిప్రాయం ప్రకారం "(జుమానమాజ్ తరువాత) మనిషి మస్జిద్‌లో చేయదలచుకుంటే నాలుగు రకాతుల నమాజ్ చేయాలి; ఇంటికెళ్ళి చేయదలచు కుంటే రెండు రకాతుల నమాజ్ చేయాలి." (ఫిఖ్హుస్సున్న)

హజ్రత్ జైద్ బిన్ సాబిత్ (రజి) ఉల్లేఖనం: దైవప్రవక్త (సల్లం) ఈద్‌నమాజ్ మాత్రమే చేసి జుమానమాజ్ నుండి మినహాయింపు ఇస్తూ "జుమానమాజ్ చేయదలచుకున్నవారు (నిరభ్యంతరంగా) చేయవచ్చు" అన్నారు. (అబూదావూద్, నసాయి, ఇబ్నెమాజ)

హజ్రత్ అబూహురైరా (రజి) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (స) ఇలా అన్నారు: "ఈరోజు రెండు పండుగలు (ఈద్, జుమా) ఒకేసారి వచ్చాయి. కనుక మీలో ఎవరైనా కోరితే జుమా నమాజ్ చేయకుండా వదిలేయవచ్చు. అతనికి ఈద్‌నమాజ్ ఒక్కటే సరిపోతుంది." (అబూదావూద్)

## ఈద్ నమాజ్

హజ్రత్ అనస్ బిన్ మాలిక్ (రజి) ఉల్లేఖనం: దైవప్రవక్త (స) మక్కా నుండి మదీనాకు వలస వచ్చిన తర్వాత చూస్తే మదీనాలో జనం సంవత్సరంలో రెండు రోజులు వినోదం, ఆటపాటల కోసం నిర్ణయించుకున్నారు. దైవప్రవక్త (స) "ఈ రెండు రోజుల సంగతేమిట"ని అడిగితే దానికి ప్రజలు "మేము అజ్ఞానకాలంలో ఈ దినాలలో ఆటపాటలు, ఆనందోత్సవాలు జరుపుకునేవాళ్ళము" అని సమాధానమిచ్చారు. దైవప్రవక్త (స) ఈమాట విని "దేవుడు ఈ రెండు రోజులకు బదులు వీటికంటే శ్రేష్ఠమైన రెండు రోజులు నిర్ణయించాడు. 1-ఈదుల్‌ఫితర్ దినం, 2-ఈదుల్‌అజ్హా దినం" అని చెప్పారు. (అబూదావూద్)

హజ్రత్ ఆయిషా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (స) ఇలా అన్నారు: "ఏరోజు ప్రజలు (రమజాన్) ఉపవాసాలన్నీ పూర్తిచేసి విరమిస్తారో ఆరోజు వారికి పండుగ రోజు (ఈదుల్‌ఫితర్) అవుతుంది. ప్రజలు ఖుర్బానీ (పశుబలి) ఇచ్చే రోజు ఈదుల్‌అజ్హా (బక్రీద్ పండుగ) అవుతుంది." (తిర్మిజి)

**గమనిక :** శుక్రవారం రోజు మొదట ఖుత్బా, ఆ తరువాత నమాజ్ ఉంటుంది. పండుగ రోజుల్లో మొదట నమాజ్, ఆ తరువాత ఖుత్బా ఉంటుంది.

హజ్రత్ ఇబ్నె బురైదా (రహ్మ) తమ తండ్రి చెప్పిన హదీస్‌ని ఇలా ఉల్లేఖించారు: "దైవప్రవక్త (స) ఏదైనా తినేదాకా ఈదుల్‌ఫితర్ కోసం బయలుదేరేవారు కాదు. అయితే ఖుర్బానీ పండుగరోజు నమాజ్ చేసేదాకా ఏమీ తినేవారు కాదు." (అహ్మద్, తిర్మిజి)

ఈద్ నమాజ్ హంబలీ దృక్పథం ప్రకారం ఫరజ్; హనఫీ దృక్పథం ప్రకారం వాజిబ్; మాలికియా, షాఫియా, అహ్లెహదీస్ దృక్పథాల ప్రకారం సున్నతె గైర్‌ముఅక్కిదా.

హజ్రత్ జుందుబ్ (రజి) ఉల్లేఖనం: "దైవప్రవక్త (స) ఈదుల్ ఫితర్ నమాజ్‌ను సూర్యుడు రెండు బాణాలు పైకెక్కిన సమయంలో చేసేవారు; ఈదుల్ అజ్హా నమాజ్‌ను ఒక బాణం పైకెక్కిన సమయంలో చేసేవారు." (అహ్మద్ బిన్ హసనుల్‌బన్నా)

హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) కథనం: "దైవప్రవక్త (స) ఒక పండుగరోజు ఈద్గాహ్‌కు వెళ్ళి రెండు రాకాతులు (ఈద్) నమాజ్ చేశారు. దీనికి ముందుగాని, తరువాతగాని ఎలాంటి (సున్నత్ లేదా నఫిల్) నమాజ్ చేయలేదు." (బుఖారి, ముస్లిం, తిర్మిజి)

హజ్రత్ అబూసయీద్ ఖుద్రీ (రజి) కథనం: "దైవప్రవక్త (స) పండుగ నమాజ్‌కు ముందు ఎలాంటి నమాజ్ చేసేవారు కాదు. అయితే (ఈద్గాహ్ నుంచి) ఇంటికి వచ్చిన తరువాత రెండు రకాతులు నఫిల్ నమాజ్ మాత్రం చేసేవారు." (ఇబ్నెమాజ)

హజ్రత్ జాబిర్ బిన్ అబ్దుల్లా (రజి) కథనం: "ఈదుల్ ఫితర్, ఈదుల్ అజ్హా రెండు పండుగల నమాజు కోసం (ప్రవక్త కాలంలో) అజా ఇవ్వడం జరిగేది కాదు." (బుఖారి)

అయితే ఈద్ నమాజ్‌కు ముందు "అస్సలాతు జామిఆ" అని చెప్పడం అభిలషనీయం. ఇమామ్ షాఫయి, ఇమామ్ జుహ్రీ (రహ్మలై)ల ప్రకారం "దైవప్రవక్త (స) పండుగ రోజు ముఅజ్జిన్‌ని ఆదేశించేవారు, ముఅజ్జిన్ 'అస్సలాతు జామిఆ' అని బిగ్గరగా చెప్పేవాడు."

హజ్రత్ అమ్ర్ బిన్ ఔఫ్ మజ్ని (రజి) ఉల్లేఖనం: "దైవప్రవక్త (స) ఈద్ నమాజ్ మొదటి రకాతులో ఖుర్‌ఆన్ పఠనానికి ముందు (అల్లాహుఅక్బర్ అంటూ) ఏడు తక్బీర్‌లు, రెండవ రకాతులో ఖుర్‌ఆన్ పఠనానికి ముందు ఐదు తక్బీర్‌లు చెప్పారు." (తిర్మిజి)

ఈద్ నమాజ్ తక్బీర్‌ల సంఖ్య విషయంలో కచ్చితమైన, దృఢమైన ఉల్లేఖనం ఏదీ లేదు. వాటన్నిటిని బట్టి ఏర్పడిన పది రకాల దృక్పథాలలో పై ఉల్లేఖనాన్ని ఇమామ్ తిర్మిజి (రహ్మ) మధ్య తరగతి ఉల్లేఖనంగా పరిగణించారు.

వేరొక దృక్పథం ప్రకారం మొదటి రకాత్‌లో 'తక్బీరెతహ్రీమా' తరువాత ఖుర్‌ఆన్ పఠనానికి ముందు మూడు తక్బీర్‌లు, రెండవ రకాత్‌లో ఖుర్‌ఆన్ పఠనం తరువాత రుకూకు ముందు మూడు తక్బీర్‌లు చెప్పాలి. ఇది ఇబ్నెమస్వూద్ (రజి), అబూమూసా (రజి), అబూమస్వూద్ (రజి)ల దృక్పథం. దీన్ని ఇమామ్ సౌరి, ఇమామ్ అబూహనీఫా (రహ్మ)లు అవలంబించారు. ఈ అదనపు తక్బీర్‌లు చెప్పేటప్పుడు కూడా చేతులు చెవులదాకా ఎత్తి దించాలి.

హజ్రత్ ఉమ్మెఅతియా (రజి) కథనం: "ఈదుల్‌ఫితర్, ఈదుల్‌అజ్హా రెండు పండుగల్లోనూ కన్యలు, యువతులు, బహిష్టుస్త్రీలు, పరదామహిళలు, ఈద్గాహ్‌కు వెళ్ళి పురుషులతో పాటు దుఆలో పాల్గొనాలని మాకాజ్ఞ ఇవ్వబడింది. అయితే బహిష్టు స్త్రీలు నమాజ్ చేసే చోటుకు కొంచెం దూరం కూర్చోవాలని ఆదేశించారు..." (బుఖారి, ముస్లిం)



## ఈద్ ప్రసంగం

హజ్రత్ అబూసయీద్ ఖుద్రీ (రజి) కథనం: "ఈదుల్ ఫితర్, ఈదుల్ అజ్హా దినాల్లో దైవప్రవక్త (స) ఈద్గాకు వెళ్ళి మొదట నమాజ్ చేయించేవారు. నమాజ్ ముగించగానే బారులు తీరి తమతమ స్థానాల్లో కూర్చున్న ప్రజల ముందు నిలబడి వారికి ధర్మబోధ చేస్తూ మంచి విషయాలను గురించి ఆదేశించేవారు. (ఆ సమయంలో) సైన్యాన్ని ఎక్కడికైనా పంపవలసివుంటే ఆ ఏర్పాటు చేసేవారు లేదా ఏదైనా ఆజ్ఞ జారీ చేయవలసివుంటే జారీ చేసేవారు. ఆ తరువాత తిరిగి (తమ స్థానానికి) వచ్చేవారు." (బుఖారి, ముస్లిం)

హజ్రత్ జాబిర్ బిన్ అబ్దుల్లా (రజి) కథనం: "ఈదుల్‌ఫితర్ రోజు దైవప్రవక్త (స) నిలబడి మొదట నమాజ్ చేయించారు. ఆ తరువాత ఉపన్యాసం ఇచ్చారు. ఉపన్యాసం ముగిసిన తరువాత వేదిక దిగి స్త్రీల దగ్గరికి వెళ్ళి వారికి ధర్మబోధ చేశారు. అప్పుడు ఆయన హజ్రత్ బిలాల్ (రజి) చేతిని ఊతగా చేసుకొని నిల్చున్నారు. తరువాత హజ్రత్ బిలాల్ (రజి) వస్త్రం తీసి కింద పరిచారు. అందులో స్త్రీలు తమ తమ విరాళాలు (అంటే ఉంగరాలు, మెట్టెలు) వేస్తూపోయారు." (బుఖారి)

ఈద్‌నమాజ్ తరువాత ఈద్ ప్రసంగం చేయవలసి ఉంటుంది. అయితే ఒక ప్రసంగం చేయాలా లేక రెండుప్రసంగాలు చేయాలా అనే విషయంలో కూడా ధర్మవేత్తల మధ్య భేదాభిప్రాయాలు ఉన్నాయి. ఇమామ్ నవవి (రహ్మ), ఇమామ్ షూకాని (రహ్మ), అహ్లెహదీస్ ధర్మవేత్తల దృక్పథం ప్రకారం ఒకప్రసంగం (ఖుత్బా) మాత్రమే చేయడం సంప్రదాయం (సున్నత్). హనఫీ, షాఫయిల దృక్పథం ప్రకారం రెండు ప్రసంగాలు చేయడం సంప్రదాయం.

హజ్రత్ ఉబైదుల్లా బిన్ అబ్దుల్లా బిన్ ఉతెబా (రహ్మ) కథనం: "పండుగ రోజు ఇమామ్ రెండు ఉపన్యాసాలు (ఖుత్బాలు) ఇవ్వడం, ఆ రెండిటి మధ్య కాస్సేపు మౌనంగా కూర్చోవడం సంప్రదాయం. (షాఫయి)

హజ్రత్ సాద్ (రజి) కథనం: "(ఈద్) ప్రసంగం మధ్య 'తక్బీర్' చెప్పేవారు. పండుగ ప్రసంగాల మధ్య అనేక సార్లు 'తక్బీర్' చెప్పేవారు." (ఇబ్నెమాజ)

ఈ తక్బీర్ ఇలా చెప్పాలి: "అల్లాహుఅక్బర్ అల్లాహుఅక్బర్ లాఇలాహ ఇల్లల్లాహు వల్లాహు అక్బర్ అల్లాహుఅక్బర్ వలిల్లా హిల్‌హమ్ద్" దీన్ని 'తక్బీరె తష్రీఖ్' అంటారు.

హజ్రత్ అబూహురైరా (రజి) ఉల్లేఖనం: "దైవప్రవక్త (స) పండుగ నమాజ్ కోసం ఈద్గాహ్‌కు ఒక దారిన వెళ్ళి, మరొక దారిన తిరిగొచ్చేవారు." (ముస్లిం, తిర్మిజి)

హజ్రత్ ఆయిషా (రజి) కథనం: "ఓ పండుగ రోజు కొందరు అబిసీనియా (నీగ్రో) ప్రజలు దైవప్రవక్త (స) సన్నిధిలో ఆటాడసాగారు. నేనా తమాషాను (మునివ్రేళ్ళపై నిల్చొని) దైవప్రవక్త (స) భుజమ్మీదుగా తొంగిచూడసాగాను. అప్పుడు దైవప్రవక్త (స) తమ భుజాన్ని కొంచం కిందకు దించారు. దాంతో నేను ఆయన భుజం పైనుంచి చూశాను. ఇలా తృప్తిగా చూసిన తరువాత (ఇంట్లోకి) వెళ్ళిపోయాను." (బుఖారి, ముస్లిం, అహ్మద్)

హజ్రత్ ఆయిషా (రజి) కథనం: ఓసారి పండుగరోజు మా ఇంట్లో ఇద్దరు అన్సార్ బాలికలు బాస్ యుద్ధం గురించి అన్సారులు రచించిన ఒక గేయం పాడసాగారు.

(అంతలో మా నాన్న) అబూబకర్ (రజి) వచ్చి "ఏమిటిది, దైవప్రవక్త (స) ఇంట్లో ఈ పైశాచికపు పాటలు?" అని అరిచారు. దైవప్రవక్త (స) ఈమాట విని "అబూబకర్! ప్రతి జాతీ పండుగ జరుపుకుంటుంది. ఈరోజు మన పండుగ. (ఇలా సంతోషంగా మంచి పాటలు పాడుకోవడంలో తప్పులేదు." అని అన్నారు. (బుఖారి, ముస్లిం)

ఒక ఉల్లేఖనంలో "కొందరు బాలికలు దైవప్రవక్త (స) ఇంట్లో పాటలు పాడటంతో పాటు డప్పు కూడా వాయించార"ని ఉంది. (ముస్లిం)

## ఖౌఫ్, కుసూఫ్, ఇస్తిస్ఖా నమాజులు

మీరు ఎక్కడికైనా ప్రయాణమై వెళ్తే నమాజ్‌ను తగ్గించి చేసుకోడంలో ఎలాంటి తప్పు లేదు. పోతే అవిశ్వాసులు మీతో బహిరంగంగా విరోధానికి పాల్పడ్డారు గనక వారు మిమ్మల్ని వేధిస్తారని భయముంటే అలా చేయవచ్చు. (ఖుర్‌ఆన్-4:101)

ప్రవక్తా! నీవు (యుద్ధరంగంలో) ముస్లింల దగ్గరుండి వారికి నాయకత్వం వహించి నమాజు చేయడానికి ఉపక్రమించినప్పుడు వారిలో ఒక వర్గం ఆయుధాలు ధరించి నీతో పాటు నిలబడాలి. వారు సాష్టాంగప్రణామం చేసి ప్రార్థన ముగించగానే వెనక్కి వెళ్ళిపోవాలి. ఆ తరువాత ఇంకా ప్రార్థన చేయని రెండవ వర్గం వచ్చి నీతో కలసి ప్రార్థన చేయాలి. వారు కూడా ఆయుధాలు ధరించి అప్రమత్తులయి ఉండాలి. ఎందుకంటే మీరు గనక మీ ఆయుధాలు, ఇతర సామగ్రి విషయంలో ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా వారు ఒక్కసారిగా మీపై విరుచుకుపడేందుకు కాచుకొనిఉంటారు.

ఒకవేళ వర్షంవల్ల మీకేమైనా అసౌకర్యంగా ఉంటే లేదా మీరు వ్యాధిగ్రస్తులైఉంటే ఆయుధాలు తీసి పక్కన పెట్టడంలో ఎలాంటి తప్పులేదు. అయినప్పటికీ మీ జాగ్రత్తలో మీరుండటం చాలా అవసరం. దేవుడు అవిశ్వాసుల కోసం అత్యంత అవమానకరమైన యాతన సిద్ధపరచిఉంచాడు. ఆవిధంగా (ప్రార్థన) ముగిసిన తరువాత మీరు నిల్చొని, కూర్చొని, పడుకొని ఎలాంటి స్థితిలో ఉన్నా దేవుడ్ని స్మరిస్తూఉండండి. శాంతియుత వాతావరణం నెలకొనడం జరిగితే పూర్తి నమాజు చేయాలి. నమాజ్ విశ్వాసులు నియమం తప్పకుండా వేళకు విధిగా పాటించవలసిన విధ్యుక్తధర్మం. (ఖుర్‌ఆన్-4:102,103)

ప్రయాణావస్థలోనే గాకుండా అలజడి, అల్లర్లతో యుద్ధవాతావరణం నెలకొనిఉన్న పరిస్థితుల్లో లేదా మరేదైనా భయానక పరిస్థితి ఎదురైనప్పుడు కూడా ఫర్జ్ నమాజ్‌ని ఖస్ర్ చేసుకోవచ్చు. అయితే ఆ స్థితిలో నాలుగు రకాతుల ఫర్జ్ నమాజ్‌లో రెండు రకాత్‌లు తప్పక పఠించాలన్న నియమం లేదు. పరిస్థితిని బట్టి ఒక్కరకాత్ అయినా పఠించవచ్చు. ఇతర అంశాలలో కూడా సడలింపుకు అనుమతి ఉంది. ఈ నమాజ్‌ను **'సలాతె ఖౌఫ్'** అంటారు.

హజ్రత్ అబూమూసా (రజి) ఉల్లేఖనం: దైవప్రవక్త (స) కాలంలో ఒకసారి సూర్యగ్రహణం పట్టితే 'ప్రళయం రాదుకదా!' అంటూ ఆయన ఆందోళనపడుతూ మసీదుకు వెళ్ళి నమాజ్ చేశారు. అందులో ఖుర్‌ఆన్ పఠనం, రుకూ, సజ్దాలు, నేనిది వరకెన్నడూ చూడనంత దీర్ఘంగా జరిగాయి. (ఆతర్వాత) దైవప్రవక్త (స) ఇలా ప్రసంగించారు: "ఇవి (సూర్యచంద్ర గ్రహణాలు) దేవుని నిదర్శనాలు. అంతేగాని ఏ ఒక్కరి చావు పుట్టుకలకు కారణభూతం కాజాలవు. ఈ నిదర్శనాల ద్వారా దేవుడు తన దాసులను భయపెడ్తు



న్నాడు. కాబట్టి మీరు ఇలాంటి నిదర్శనాలేమైనా చూస్తే వెంటనే దేవుని స్మరణ (నమాజ్) వైపుకు పరుగెత్తండి, ఆయన్ని వేడుకోండి, పాపమన్నింపు కోరుకోండి." (బుఖారి)

హజ్రత్ ఆయిషా (రజి) కథనం: దైవప్రవక్త (స) కాలంలో ఒకసారి సూర్యగ్రహణం పట్టితే ఆయన మసీదుకు వెళ్ళారు. ప్రజలు కూడా వెళ్ళి ఆయన వెనుక బారులు తీరి నిలబడ్డారు. అప్పుడు దైవప్రవక్త (స) 'అల్లాహుఅక్బర్' అని చెప్పి (నమాజ్‌లో) ఖుర్‌ఆన్ పఠనం ప్రారంభించారు. సుదీర్ఘ పఠనం గావించారు. తరువాత 'అల్లాహుఅక్బర్' అంటూ రూకూలోకి పోయారు. రుకూలో చాలాసేపు ఉన్నారు. ఆ తరువాత 'సమిఅల్లాహులిమన్ హమిదా' అని చెబుతూ పైకి లేచి నిలబడ్డారు. అయితే సజ్దాలోకి పోలేదు. మళ్ళీ సుదీర్ఘ పారాయణం చేశారు. ఈసారి మొదటిసారి పఠనం కంటే కొంచెం తక్కువ చేశారు. ఆ తరువాత 'అల్లాహుఅక్బర్' అంటూ రూకూలోకి పోయారు. రుకూలో చాలా సేపు ఉన్నారు. అయితే మొదటి రుకూ కంటే ఈ రుకూలో కొంచెం తక్కువ సేపు ఉన్నారు. ఆ తరువాత 'సమిఅల్లాహులమన్ హమిదా, రబ్బనా లకల్‌హమ్ద్' అన్నారు. ఆ తరువాత సజ్దా చేశారు. అదేవిధంగా రెండవ రకాత్‌లో కూడా చేశారు. ఇలా మొత్తం నాలుగు రుకూలు, నాలుగు సజ్దాలు చేశారు. (దీన్ని **'సలాతె కుసూఫ్'** అంటారు.) ఆయన (కుడిఎడమల వైపు) సలాం చేసి నమాజ్ ముగించక ముందే గ్రహణం పూర్తిగా వీడిపోయి సూర్యుడు ప్రకాశించసాగాడు.

ఆ తరువాత దైవప్రవక్త (స) నిలబడి ఖుత్బా (ఉపన్యాసం) ఇచ్చారు. అందులో దైవస్తోత్రం తరువాత ఇలా అన్నారు: "సూర్యచంద్రులిద్దరూ దేవుని (ఔన్నత్యానికి) నిదర్శనాలు. అంతేగాని ఎవరో చనిపోవడం వల్లనో లేక జన్మించడం వల్లనో (సూర్యచంద్రులకు) గ్రహణం పట్టదు. కనుక మీరు వారిద్దరిలో ఎవరికైనా గ్రహణం పట్టడం చూస్తే వెంటనే నమాజ్ చేయడానికి పరుగెత్తండి." (బుఖారి)

హజ్రత్ ఆయిషా (రజి) కథనం: ఒకసారి సూర్యగ్రహణం పట్టింది. అప్పుడు దైవప్రవక్త (స) (నమాజ్ చేయడానికి నిలబడి) ఓ సుదీర్ఘమైన సూరా పఠించారు. తరువాత సుదీర్ఘమైన రుకూ చేశారు. రుకూ నుండి లేచి నిలబడి మరొక సూరా పఠించారు. ఆ తరువాత మళ్ళీ రుకూ చేశారు. రుకూ పూర్తిచేసి సజ్దా చేశారు. రెండవ రకాత్‌లో కూడా ఇలాగే చేశారు. ఈవిధంగా నమాజ్ ముగించి ఇలా ప్రసంగించారు:

"సూర్యచంద్రులు దేవుని నిదర్శనాలలో రెండు నిదర్శనాలు. కనుక మీరు సూర్యచంద్రులకు గ్రహణం పట్టడం చూస్తే (కుసూఫ్) నమాజ్ చేయండి. దీని ద్వారా దేవుడు మీ కష్టాలు దూరం చేస్తాడు. ఈరోజు నేను నమాజ్ సందర్భంలో నాకు వాగ్దానం చేయబడిన వాటన్నిటినీ చూశాను. చివరికి నేను స్వర్గవనంలోని ఒక పండ్లగుత్తిని తీసుకుందామని అనుకుంటున్నట్లు అనుభూతి కూడా చెందాను. అప్పుడు నేను ముందుకు అడుగేయడం మీరు గమనించి ఉంటారు. అలాగే నరకంలోని ఒక భాగం మరొక భాగాన్ని మింగేస్తూ ఉండటం కూడా నేను చూశాను. అప్పుడు నేను కాస్త వెనక్కి జరగడం కూడా మీరు గమనించి ఉంటారు. నేను నరకంలో అమ్ర్ బిన్ లుహ్యీని కూడా చూశాను. అతను దేవతల పేర అంబోతును వదిలిపెట్టే ఆచారం సృష్టించాడు." (బుఖారి)

**'సలాతె ఇస్తిస్ఖా'**:- హజ్రత్ అనస్ బిన్‌మాలిక్ (రజి) కథనం: దైవప్రవక్త (స) కాలంలో ఓసారి కరువు వచ్చింది. ఆరోజుల్లో ఒక శుక్రవారం దైవప్రవక్త (స) జుమా ఖుత్బా ఇస్తుంటే ఓ పల్లెవాసి లేచి "దైవప్రవక్తా! మా పశువులు నాశనమయ్యాయి. మా భార్యా పిల్లలు ఆకలితో చస్తున్నారు. మాశ్రేయస్సు కోసం దైవాన్ని ప్రార్థించండి" అని అన్నాడు. అప్పుడు దైవప్రవక్త (స) చేతులు పైకెత్తి దుఆ చేయడానికి సిద్ధమయ్యారు.

ఆ సమయంలో ఆకాశంలో ఒక మబ్బుతునక కూడా లేదు. కాని నాప్రాణం ఎవరి అధీనంలోఉందో ఆ శక్తిస్వరూపుని సాక్ష్యం! ఆ మరుక్షణమే కొండల్లాంటి మేఘ మాలికలు నలువైపుల నుంచి కమ్ముకురావడం మొదలయింది. అవి పూర్తిగా ఆవరించనంత వరకూ దైవప్రవక్త (స) చేతులు కిందికి దించలేదు. ఆ తరువాత ఆయన వేదిక నుండి దిగారో లేదో ఆయన గడ్డం వెండ్రుకలపై చిటపట చినుకులు పడటం నేను చూశాను. ఆ రోజంతా వర్షం కురుస్తూనేఉంది. మరునాడు, మరునటి రోజు, ఆ తరువాత కూడా ఏకధాటిగా కురుస్తూనేపోయింది. ఆవిధంగా చివరికి రెండవ శుక్రవారం వచ్చింది.

మళ్ళీ ఆ పల్లెవాసే (లేక మరో పల్లెవాసో) లేచి నిలబడి "దైవప్రవక్తా! మా ఇండ్లు పడిపోయాయి. మా పశువులు మునిగిపోయాయి. కాస్త మాకోసం దైవాన్ని ప్రార్థించండి" అని విన్నవించుకున్నాడు. అందువల్ల దైవప్రవక్త (స) మళ్ళీ చేతులెత్తి "దేవా! మా చుట్టు పక్కల మాత్రమే వర్షం కురిపించు, మా మీద కురిపించకు" అని ప్రార్థించారు. ఈ విధంగా ఆయన ఎటువైపు సూచన చేశారో అటువైపు మేఘాలు విడిపోయాయి. చివరికి మదీనా పట్నం (వర్షం కురియని) ఒక వలయంగా మిగిలిపోయింది. ఖినాతా కాలువ ఒక నెలరోజుల పాటు ప్రవహించింది. చుట్టుపక్కల ప్రాంతాల నుండి వచ్చే ప్రతి మనిషీ అక్కడ కుంభవృష్టి కురిసిందన్న వార్తలు మోసుకొచ్చేవాడు. (బుఖారి)

హజ్రత్ ఆయిషా (రజి) కథనం: దైవప్రవక్త (స) ఆకాశంలో ఏదైనా అసాధారణ వస్తువు చూస్తే, ఉదాహరణకు- మబ్బు లేక మెరుపు చూస్తే ఆయన ముఖకవళికలు మారిపోయేవి. (ఎంతో ఆందోళనపడుతూ) ఒకసారి ముందుకు, మరొకసారి వెనక్కి అడుగు వేస్తారు. ఒకసారి లోపలికి, మరొకసారి బయటికి నడుస్తారు. అయితే వర్షం కురవగానే ఆయన భయందోళనలు దూరమయిపోతాయి.

ఒకసారి నేనీ పరిస్థితి చూసి కారణం అడిగితే ఆయన ఇలా చెప్పారు: "ఆద్‌జాతి గురించి ఖుర్‌ఆన్‌లో వచ్చినట్లు మన మీద కూడా విధివశాత్తు అలాంటి ఆపద ఏదైనా వస్తుందేమోనని నేను భయపడుతున్నాను. (ఆ సంఘటన) ఖుర్‌ఆన్‌లో ఇలాఉంది- '(ఓరోజు) ఆ విపత్తు మేఘాలరూపంలో తమ లోయల వైపు రావడం చూసి, ఇవి మన కెంతో ప్రయోజనం కలిగిస్తాయి అన్నారు వారు (మహా సంబరపడిపోతూ)...కాదు, ఇది మీరు లోగడ తొందరపెట్టిన ఉపద్రవం. ఇదొక పెనుతుఫాన్, ఘోరమైన ఆపద మోసు కొస్తోంది. అది తన ప్రభువాజ్ఞతో (మిమ్మల్ని) సర్వనాశనం చేస్తుంది." (బుఖారి)

హజ్రత్ ఇబ్నెఅబ్బాస్ (రజి) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "తూర్పు గాలి ద్వారా నాకు సహాయం చేయబడింది. పడమర గాలి ద్వారా ఆద్‌జాతి నాశనం చేయబడింది." (బుఖారి, ముస్లిం)



తూర్పుగాలి ద్వారా సహాయం అహ్జాబ్ యుద్ధంలో దేవుని సహాయం అని అర్థం. ఆ యుద్ధంలో పన్నెండు వేలమంది బహుదైవారాధకులు మదీనా పట్టణాన్ని దిగ్బంధించారు. అప్పుడు ఓరోజు రాత్రి ఎముకలు కొరికే చలితో పాటు తూర్పుదిక్కు నుంచి తీవ్రమైన ఈదురు గాలులు వీచడంతో వారి శిబిరాలన్నీ ధ్వంసమయ్యాయి. దాంతో వారు యుద్ధం చేయకుండానే బ్రతుకుజీవుడా అంటూ పారిపోయారు. అలాగే పూర్వం ఆద్‌జాతి ప్రజలు హూద్ ప్రవక్త (స)ను తిరస్కరించడంతో వారిపై దైవాగ్రహం విరుచుకుపడింది. దేవుడు పడమర నుండి తీవ్రమైన తుఫాను పంపి ఆ జాతిని సర్వనాశనం చేశాడు.

**వర్షం కోసం పాపమన్నింపు ప్రార్థన**:- ఓసారి మదీనాలో తీవ్రమైన కరువు వస్తే అప్పటి ఖలీఫా హజ్రత్ ఉమర్ (రజి) వర్షం కోసం దైవాన్ని ప్రార్థించడానికి బదులు పాప మన్నింపుకై దుఆ (వేడుకోలు) చేసి ఊరుకున్నారు. దానిపై ప్రజలు ఆయన్ని విమర్శిస్తూ "మీరు వర్షం కోసం దుఆ చేయనే లేదు" అన్నారు. దానికి ఆయన సమాధానమిస్తూ "నేను ఆకాశం నుండి వర్షం కురిసే తలుపుల్ని తట్టాను. (అంతకంటే మరేం కావాలి?)" అని చెప్పి ఖుర్‌ఆన్‌లో నూహ్ అధ్యాయంలోని ఈ సూక్తులు పఠించారు:

"మీ ప్రభువును క్షమాపణ కోరుకోండి. ఆయన గొప్ప క్షమాశీలి. ఆయన మీకోసం ఆకాశం నుండి వర్షం కురిపిస్తాడు. మీకు సంతానం సిరిసంపదలు అనుగ్రహిస్తాడు. మీకోసం తోటలు పండిస్తాడు; సెలయేరులు ప్రవహింపజేస్తాడు..." (71:10-12)

ప్రఖ్యాత దైవప్రియుడు హజ్రత్ హసన్‌బస్రీ (రహ్మ) సన్నిధికి ఒకతను వచ్చి తమ ప్రాంతంలో కరువు వచ్చిందని తెలిపాడు. అప్పుడాయన, అయితే పాపమన్నింపుకై దైవాన్ని వేడుకోండి అని చెప్పారు. కాస్సేపటి మరొకతను వచ్చి తన దారిద్ర్య స్థితిని ఏకరువు పెట్టు కున్నాడు. ఇంకొకడు వచ్చి తనకు సంతానం కలగడం లేదని చెప్పుకున్నాడు. వేరొకడు వచ్చి తన పొలంలో పంట తగ్గిపోతోంది ఏం చెయ్యాలని అడిగాడు. హజ్రత్ హసన్ బస్రీ (రహ్మ) వారందరికీ పాపమన్నింపు కోసం దైవాన్ని వేడుకోండని ఒకే సమాధానమిచ్చారు. దానికి ప్రజలు ఆశ్చర్యపోతూ "అదేమిటండీ మీరు విభిన్న రకాల ఫిర్యాదులు చేసిన వారందరికీ ఒకే నివారణ చూపుతున్నారు?" అని అడిగారు. దానికి సమాధానంగా ఆయన ఖుర్‌ఆన్‌లోని పై (71:10-12) సూక్తులే పఠించారు.

## జనాజా నమాజ్

హజ్రత్ అబూహురైరా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "ఎవరు జనాజా నమాజ్‌లో పాల్గొంటాడో అతనికి ఒక యూనిట్ పుణ్యం లభిస్తుంది. మరెవరు (జనాజా నమాజ్‌లో పాల్గొన్న తరువాత) భౌతిక కాయాన్ని ఖననం చేసేవరకు ఎదురుచూస్తాడో అతనికి రెండు యూనిట్ల పుణ్యం లభిస్తుంది." అనుచరులు ఈమాట విని "దైవప్రవక్తా! యూనిట్ అంటే ఎంత?" అని అడిగారు. దానికి దైవప్రవక్త (స) "ఒక యూనిట్ రెండు పెను పర్వతాలకు సమానం" అని చెప్పారు. (బుఖారి, ముస్లిం)

హజ్రత్ ఆయిషా (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ఇలా చెప్పారు: "ఏ ముస్లిం అయినా చనిపోయినప్పుడు అతని జనాజా నమాజ్‌లో ముస్లింలు అత్యధిక సంఖ్యలో వంద మందివరకు పాల్గొని మృతుని కోసం (దేవుని సన్నిధిలో) సిఫారసు చేస్తే వారి సిఫారసు ఆమోదించడం జరుగుతుంది." (ముస్లిం, అహ్మద్, తిర్మిజి, నసాయి)

దైవప్రవక్త (స) ప్రవచనం: "ఏ మనిషి శవం కోసం (ముస్లింలు) మూడు వరుసల్లో (నిలబడి) జనాజానమాజ్ చేయడం జరుగుతుందో దేవుడు ఆ మనిషి పాపాలను మన్నించడం వాజిబ్ (తప్పనిసరి) చేసుకున్నాడు." (అహ్మద్, అబూదావూద్, తిర్మిజి)

హ్జ్రత్ అబూహురైరా (రజి) కథనం: "దైవప్రవక్త (స) ఓ జనాజానమాజ్‌లో తక్బీర్ చెబుతూ చేతులు పైకెత్తి, దించి ఎడమచేతిపై కుడిచేయి కట్టుకున్నారు." (తిర్మిజి)

హ్జ్రత్ అబూహురైరా (రజి) కథనం: "(అబిసీనియా రాజు) నజాషీ (రజి) చనిపోయిన రోజు దైవప్రవక్త (స) ఆ మరణవార్త మాకు తెలిపి నమాజ్ చేసే స్థలానికి వెళ్ళిపోయారు. అక్కడ తమ అనుచరులతో కలసి (జనాజా నమాజ్ కోసం) పంక్తులు ఏర్పరచి నాలుగు తక్బీర్‌లు పలికారు." (బుఖారి, ముస్లిం)

"(అబిసీనియా రాజు) అస్హమా నజాషీ (రజి) కోసం దైవప్రవక్త (స) జనాజానమాజ్ చేశారు. అందులో ఆయన 4 సార్లు  తక్బీర్‌లు చెప్పారు." (బుఖారి, ముస్లిం)

"హ్జ్రత్ అనస్(రజి) ఓసారి ఒక పురుషశవం కోసం జనాజానమాజ్ చేయించారు. అప్పుడాయన మృతుని శిరస్సు ముందు నిలబడ్డారు. ఆ శవం పోయిన తరువాత ఒక స్త్రీ శవం వచ్చింది. దానికోసం కూడా హ్జ్రత్ అనస్ (రజి) జనాజానమాజ్ చేయించారు. అయితే అప్పుడాయన మృతురాలి నడుం ముందు నిలబడ్డారు..." (తిర్మిజి)

**జనాజా నమాజ్ విధానం** :- జనాజా నమాజ్ చేయడానికి ఇమాం మనిషి భౌతిక కాయం ఎదురుగా నిలబడాలి. పురుషుని జనాజా అయితే ఇమామ్ అతని రొమ్ముకు ఎదురుగా నిలబడాలి. స్త్రీ జనాజా అయితే ఇమామ్ ఆమె నడుముకు ఎదురుగా నిలబడాలి. తరువాత ఇమామ్, ఆయన వెనుక నమాజ్ చేసేవారు "నేను దైవప్రసన్నత కోసం ఈ జనాజా నమాజ్ చేస్తున్నాను" అని సంకల్పించుకోవాలి.

తరువాత ఇమాం అల్లాహుఅక్బర్ అని బిగ్గరగా చెబుతూ అరచేతులు రెండూ పైఎత్తి దించి కట్టుకోవాలి. తర్వాత "సుబ్‌హానక అల్లాహుమ్మ వబిహమ్దిక వతబారకస్‌ముక వతఆలా జద్దుక వలాఇలాహ గైరుక్" అని పఠించాలి. (అహ్లెహదీస్ దృక్పథం ప్రకారం తవూజ్, ఫాతిహా సూరా కూడా పఠించాలి.) తర్వాత చేతులు పైకెత్తకుండా అల్లాహుఅక్బర్ చెప్పి దరూద్ పఠించాలి. ఆ తర్వాత చేతులు పైకెత్తకుండా అల్లాహుఅక్బర్ చెప్పి ఈక్రింది దుఆ పఠించాలి:

"అల్లాహుమ్మగ్‌ఫిర్లి హయ్యినా వమయ్యితినా వషాహిదినా వగాయిబినా వసగీరినా వకబీరినా వమన్‌త వఫ్ఫయితహుమిన్నా. అల్లాహుమ్మ మన్ అహ్‌యైతహు మిన్నా ఫలహ్‌యిహీ అలల్‌ఇస్లామి వమన్‌తవఫ్ఫయితహు మిన్నా ఫతవఫ్ఫహు అలల్‌ఈమాన్."

(భావం: దేవా! మాలో సజీవంగా ఉన్నవారిని, చనిపోయినవారిని క్షమించు. మా దగ్గర ఉన్నవారిని-లేనివారిని, మా పిన్నలను-పెద్దలను, మా స్త్రీలను-పురుషులను కూడా క్షమించు. దేవా! మాలో నీవు సజీవంగా ఉంచేవారిని ఇస్లాం (ఆదేశాలను ఆచరిస్తున్న) స్థితిలో సజీవంగా ఉంచు. మాలో నీవు మృత్యువు కలిగించేవారిని విశ్వాస స్థితిలో మృత్యువు కలిగించు.) ఇలా మొత్తం నమాజ్ విషయాలను నిశ్శబ్దంగా పఠించాలి.

ఈ 'దుఆ' రానివారు మరే దుఆ అయినా పఠించవచ్చు. తరువాత అల్లాహుఅక్బర్ అనాలి. ఆ తరువాత కుడిఎడమల వైపు ముఖం తిప్పి సలాం పలకాలి.



# 23. సున్నత్, నఫిల్ నమాజులు

మనం రోజూ చేసే అయిదు పూటల నమాజ్‌లలో ఫరజ్ తరువాత సున్నత్, నఫిల్ నమాజులు కూడా ఉన్నాయి. సున్నత్ నమాజుల్లో 'సున్నతెముఅక్కిద, సున్నతె గైర్‌ముఅక్కిద' అని రెండు రకాలున్నాయి. సున్నతెముఅక్కిదా అంటే దైవప్రవక్త (స) ఎల్లప్పుడూ చేస్తుండిన సున్నత్‌నమాజులు అన్నమాట. సున్నతె గైర్‌ముఅక్కిదా అంటే దైవప్రవక్త (స) అప్పుడప్పుడు చేసిన నమాజులు అన్నమాట. సున్నత్, నఫిల్ నమాజులు మన ఇండ్లలో చేసుకోవడమే మంచిది, అభిలషనీయం (ముస్తహబ్).

హ్జ్రత్ జాబిర్ (రజి) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "మీలో ఎవరైనా మస్జిద్‌లో నమాజ్ చేయడం జరిగితే అతనా నమాజ్‌లో కొంత భాగం తన ఇంట్లో చేసుకోవడానికి మిగుల్చుకోవాలి. ఆ నమాజ్ అతనింట్లో శ్రేయోశుభాలు కలగజేస్తుంది." (అహ్మద్, ముస్లిం)

హ్జ్రత్ ఇబ్నెఉమర్ (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ప్రవచనం: "మీ నమాజుల్లో కొంతభాగం మీఇండ్లలో చేసుకోండి, వాటిని సమాధులుగా మార్చకండి." (అహ్మద్)

హ్జ్రత్ జైద్ బిన్ సాబిత్ (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ఇలా అన్నారు: "ప్రజలారా! మీరు మీఇండ్లల్లో (కూడా) నమాజ్ చేస్తుండండి. పురుషుని నమాజుల్లో ఫరజ్ నమాజ్ తప్ప ఇంట్లో చేసే నమాజే అత్యంత శ్రేష్ఠమైనది  (బుఖారీ, ముస్లిం)

హ్జ్రత్ జైద్ బిన్ సాబిత్ (రజి) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (స) ఇలా అన్నారు: "ఒక్క ఫరజ్ నమాజ్ తప్ప మనిషి నాయీ మస్జిద్ (మస్జిదెనబవీ)లో చేసే నమాజ్ కంటే తన ఇంట్లో చేసే నమాజే ఎంతో శ్రేష్ఠమైనది." (అబూదావూద్)

ఇమామ్ మాలిక్ , ఇమామ్ సౌరీ (రహ్మలై)ల అభిప్రాయం ప్రకారం రాత్రి నఫిల్ నమాజులు ఇంట్లో, పగటి నఫిల్ నమాజులు మస్జిద్‌లో చేయడం మంచిది.

## ఫజర్‌వేళ సున్నత్ నమాజ్

అయిదువేళల నమాజుల్లోని సున్నత్ నమాజుల్ని గురించి మనం గత పేజీలలో తెలుసుకున్నాం. (16వ అధ్యాయం-అజాన్, నమాజ్‌వేళలు, రకాతులలోని 'అయిదు వేళల నమాజుల్లో రకాతులు' చూడండి.) ఫజర్‌వేళ ఫరజ్ నమాజ్‌కు ముందు చేసే రెండురకాతుల సున్నత్ నమాజ్‌కు దైవప్రవక్త (స) ఎంతో ప్రాముఖ్యం ఇచ్చినందున దాన్ని గురించి ఇక్కడ వివరంగా తెలుసుకుందాం. దీన్ని ఎట్టి పరిస్థితిలోనూ వదలకూడదు. ఒకవేళ ఫరజ్ నమాజ్‌కు పూర్వం ఈ సున్నత్ నమాజ్ తప్పిపోతే ఏం చేయాలి? దానికి ఈ క్రింది హదీసులు చూడండి-

హ్జ్రత్ అబూహురైరా (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ఇలా అన్నారు: "ఫజర్‌వేళ సున్నత్‌నమాజ్ చేయనివారు సూర్యోదయమైన తర్వాత చేయాలి." (తిర్మిజి)

దైవప్రవక్త (స) హితోక్తి: "సూర్యోదయం అయ్యేవరకూ ఫజర్‌వేళ సున్నత్ నమాజ్ చేయనివారు దాన్ని (సూర్యోదయమైన తరువాతైనా తప్పక) చేయాలి." (బైహఖి)

నిర్ణీతవేళతప్పిపోయిన ఫజర్ సున్నత్ నమాజ్‌ను సూర్యోదయమైన తర్వాత చేసే ఈ పద్ధతిని ఇమామ్ మాలిక్, అహ్మద్ బిన్ హంబల్, సుఫియాన్ సౌరి, అబ్దుల్లా బిన్ ముబారక్,

ఇస్హాఖ్ (రహ్మలై)లు అవలంబించారు. దీనికి భిన్నంగా ఇమామ్ షాఫయి (రహ్మలై), అహ్లె హదీస్ ధర్మవేత్తలు సామూహిక ఫరజ్ నమాజ్‌కు పూర్వం సున్నత్ నమాజ్ చేయలేకపోయిన వారు దాన్ని ఫరజ్ నమాజ్ ముగిసిన వెంటనే చేయాలని అభిప్రాయపడ్డారు. దీనికి వారు ఈ క్రింది ఉల్లేఖనాన్ని ప్రమాణంగా పేర్కొంటారు-

హజ్రత్ ఖైస్ బిన్ ఉమర్ (రజి) కథనం: నేనొక రోజు ఫజర్ నమాజ్ చేయడానికి (మస్జిద్‌కు) వెళ్తే దైవప్రవక్త (స) ఫరజ్‌నమాజ్ చేయిస్తూఉండటం గమనించాను. అప్పుడు నేను జమాఅత్‌లో కలసి ఫరజ్‌నమాజ్ చేశాను. ఆ తరువాత లేచి సున్నత్ నమాజ్ చేయడం ప్రారంభించాను. (కాస్సేపటికి) దైవప్రవక్త (స) నా పక్కగా నడుస్తూ "ఇది ఏ నమాజ్?" అని అడిగారు. నేను విషయం చెప్పిన తరువాత ఆయన మరేమీ మాట్లాడ లేదు." (అహ్మద్, అబూదావూద్, తిర్మిజి, ఇబ్నెమాజ)

## నఫిల్ నమాజుల వివరాలు

మనం రోజూ చేసే నమాజుల్లో ఫరజ్, సున్నత్‌లే కాకుండా నఫిల్ నమాజులు కూడా ఉన్నాయి. వాటినిగురించి 16వ అధ్యాయం-అజాన్, నమాజ్‌వేళలు, రకాతుల్లో తెలుసుకున్నాం. అయిదు వేళల నమాజుల్లో చేసే నఫిల్ నమాజులే గాకుండా బయట వేరే నఫిల్ నమాజులు కూడా ఉన్నాయి. వాటిలో **'తహజ్జుద్ నమాజ్'** అన్నిటికంటే శ్రేష్ఠమైన నమాజ్.

"రాత్రివేళ తహజ్జుద్ నమాజ్ కూడా చేస్తూఉండు. ఇది నీకోసం అదనపు నమాజ్‌గా నిర్ణయించబడింది." (ఖుర్ఆన్-17:78)

"కరుణామయుని భక్తులు భూమిపై (విర్రవీగకుండా) నమ్రతగా నడుస్తారు. మూర్ఖులు వారితో వాదనకు దిగితే 'మీకు సలాం' అంటారు. వారు తమప్రభువు సన్నిధిలో నిలబడి ప్రార్థనచేస్తూ, సాష్టాంగపడుతూ రాత్రిళ్ళు గడుపుతారు. అదీగాక దైవాన్ని వేడుకుంటూ "ప్రభూ! మమ్మల్ని నరకయాతనల నుండి కాపాడు. అవెంతో బాధాకరంగా, దారుణంగా ఉంటాయి. నరకం పరమచెడ్డ నివాసస్థలం" అని అంటారు." (ఖుర్ఆన్-25:63-66)

"రాత్రివేళ (నమాజుకోసం) లేచి నిలబడు. అయితే రేయంతా కాదు, అర్థరాత్రిదాకా. లేదా అంతకంటే కొంచెం తక్కువ చేసుకో. లేదా అంతకంటే కొంచెంఎక్కువ చేసుకో. ఖుర్ఆన్‌ని ఆగిఆగి నిదానంగా పఠించు... మనస్సును అదుపులో ఉంచడానికి రాత్రిజాగరణ ఎంతో ప్రయోజనకరమైనది. పైగా ప్రశాంతంగా ఖుర్ఆన్ పఠించడానికి కూడా అది చాలా సమంజసమైన వేళ." (ఖుర్ఆన్73:2-6)

## తహజ్జుద్ నమాజ్

ఒకతను "ఫరజ్ నమాజ్ తరువాత శ్రేష్ఠమైన నమాజ్ ఏద'ని అడిగాడు. దానికి దైవప్రవక్త (స) 'అర్థరాత్రి చేసే (తహజ్జుద్)నమాజ్' అని చెప్పారు. (ముస్లిం, తిర్మిజి)

హజ్రత్ అబూఅమామా (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ఇలా బోధించారు: "మీకు పూర్వం రాత్రివేళ నమాజ్ చేయడం సజ్జనులైన దైవదాసుల లక్షణంగా ఉండింది. కనుక మీరు రాత్రివేళ (తహజ్జుద్) నమాజ్ చేయండి. ఇది మీకు దైవసాన్నిధ్యం చేకూర్చుతుంది; మీలోని చెడుల్ని దూరంచేస్తుంది; మిమ్మల్ని పాపాల నుండి కాపాడుతుంది." (తిర్మిజి)



హజ్రత్ అబూహురైరా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "మీలో ఎవరైనా రాత్రివేళ మేల్కొంటే అతను రెండు తేలికపాటి రకాతులతో నమాజ్ ప్రారంభించాలి." (ముస్లిం)

హజ్రత్ అబూహురైరా (రజి) ఉల్లేఖనం ప్రకారమే దైవప్రవక్త (స) ఇలా అన్నారు: "మీలో ఎవరైనా అర్థరాత్రి వేళ మేల్కొని తన భార్యని కూడా లేపి, ఇద్దరూ కలసి (తహజ్జుద్) నమాజ్ చేయడం జరిగితే వారిద్దరి పేర్లు 'దైవసంస్మరణ చేసేవారి జాబితాలో వ్రాయబడతాయి." (అబూదావూద్)

హజ్రత్ ఆయిషా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "మీలో ఎవరైనా రాత్రివేళ మేల్కొని (తహజ్జుద్) నమాజ్ చేస్తున్నప్పుడు (కునికిపాట్ల వల్ల) ఖుర్ఆన్ సరిగా పఠించలేకపోతే, పఠిస్తున్నదేమిటో కూడా తెలియకపోతే, అతను (నమాజ్ వదిలేసి) పడుకోవాలి." (ముస్లిం)

హజ్రత్ ఆయిషా (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ప్రవచనం: "మీరు మీ శక్తి మేరకే కర్మలు ఆచరించండి. దైవసాక్షి! కర్మలు ఆచరించడంలో మీరు విసుగు చెందనంత వరకు దేవుడు (మీకు పుణ్యం ప్రసాదించడంలో) విసుగుచెందడు." (బుఖారి)

తహజ్జుద్ నమాజ్‌లో ఇన్ని రకాతులు పఠించాలన్న నిబంధన ఏదీ లేదు. కనిష్ఠంగా ఒక రకాత్ నుండి గరిష్ఠంగా ఎనిమిది రకాతుల వరకు పఠించవచ్చు.

హజ్రత్ ఇబ్నెఅబ్బాస్ (రజి) కథనం: దైవప్రవక్త (స) రాత్రి (తహజ్జుద్) నమాజ్ చేయాలని మమ్మల్ని ఆదేశిస్తూ ఇలా అన్నారు- "మీరు రాత్రివేళ ఒక్క రకాత్ అయినా సరే నమాజ్ చేయండి." (తబ్రాని)

హజ్రత్ సమురా బిన్ జుందుబ్ (రజి) కథనం: "దైవప్రవక్త (స) మమ్మల్ని తక్కువ రకాతులతోగాని, ఎక్కువ రకాతులతోగాని మొత్తంమీద రాత్రి నమాజ్ చేయాలని ఆదేశించారు. వితర్ నమాజ్ అన్నిటికంట చివర్లో చేయాలని అన్నారు." (తబ్రాని)

వివిధ ఉల్లేఖనాలను బట్టి దైవప్రవక్త (స) వితర్ నమాజ్‌తో కలుపుకొని 7 రకాతుల నుండి 13 రకాతుల వరకు పఠించినట్లు తెలుస్తోంది. నాలుగు లేక ఆరు రకాతులు పఠించాలనుకుంటే ప్రతి రెండు రకాతుల తర్వాత 'సలాం' చేయాలి. నాలుగు లేక ఎనిమిది రకాతులు పఠించదలచుకుంటే ప్రతి నాలుగు రకాతుల తర్వాత కూడా 'సలాం' చేయవచ్చు. కొన్ని ఉల్లేఖనాలలో దైవప్రవక్త (స) నాలుగు రకాతుల తరువాత కూడా 'సలాం' చేసినట్లుంది. ఖుర్ఆన్ పఠనం నిశ్శబ్దంగానూ చేయవచ్చు, బిగ్గరగానూ చేయవచ్చు.

హజ్రత్ ఆయిషా (రజి) కథనం: "దైవప్రవక్త (స) ఇషా నమాజ్‌కు, ఉషోదయానికి మధ్య (తహజ్జుద్ నమాజ్‌లో) పదకొండు రకాతులు పఠించేవారు. ప్రతి రెండు రకాతుల తరువాత (కుడిఎడమల వైపుకు ముఖం తిప్పి) సలాం చేసేవారు. చివర్లో ఒక రకాత్ వితర్ నమాజ్ చేసేవారు." (బుఖారి, ముస్లిం)

హజ్రత్ ఆయిషా (రజి) కథనం: ఒకతను దైవప్రవక్త (స)ను "దేవునికి అన్నిటికంటే అత్యంత ప్రియమైన ఆచరణ ఏద"ని అడిగాడు. దానికి దైవప్రవక్త (స) ఇలా అన్నారు:

"పరిమాణంలో తక్కువగా ఉన్నాసరే క్రమం తప్పకుండా ఆచరించే సత్కర్మే దేవునికి అత్యంత ప్రియమైనది." (బుఖారి, ముస్లిం)

హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి) కథనం: దైవప్రవక్త (స) నాకిలా ఉపదేశించారు- "అబ్దుల్లా! నీవు రాత్రి (తహజ్జుద్) నమాజ్ చేస్తూ కొన్నాళ్ళ తరువాత మానేసిన మనిషిలా మారకు." (బుఖారి, ముస్లిం)

దైవప్రవక్త (స) ప్రవచనం: "ఎవరి నిర్ణీత సంస్మరణ (అంటే తహజ్జుద్ వగైరా) లేదా అందులో ఏదైనా భాగం నిద్ర వల్ల తప్పిపోతే అలాంటి మనిషి ఫజర్, జుహర్ నమాజ్‌ల మధ్య దాన్ని నెరవేర్చుకోవాలి. అలాచేస్తే అతను రాత్రిపూటే తన నిర్ణీత సంస్మరణ నెరవేర్చినట్లు అతని కర్మపత్రంలో రాయడం జరుగుతుంది." (ముస్లిం, తిర్మిజి, ఇబ్నెమాజ)

## చాష్త్, ఇష్రాఖ్, అవ్వాబీన్- నమాజులు

హజ్రత్ ఆయిషా (రజి) కథనం: "దైవప్రవక్త (స) జుహా (చాష్త్) నమాజ్‌లో నాలుగు రకాతులు పఠించేవారు. దైవం తలచిన మేరకు ఎక్కువ కూడా చేసేవారు." (ముస్లిం)

హజ్రత్ ఆయిషా (రజి)ను "దైవప్రవక్త (స) జుహా నమాజ్ చేసేవారా?" అని అడిగిన ప్రశ్నకు ఆమె ఇలా సమాధానమిచ్చారు: "ప్రయాణం నుంచి తిరిగొచ్చినప్పుడు మాత్రమే జుహా నమాజ్ చేసేవారు." (ముస్లిం)

హజ్రత్ ఆయిషా (రజి) కథనం: "దైవప్రవక్త (స) ఓసారి నా ఇంటికి వచ్చి, జుహా నమాజ్‌కి సంబంధించిన ఎనిమిది రకాతులు పఠించారు." (ఇబ్నె హిబ్బాన్)

హజ్రత్ ఆయిషా (రజి) కథనం: "నేను దైవప్రవక్త (స)ను జుహానమాజ్ చేస్తుండగా ఎన్నడూ చూడలేదు. అయినప్పటికీ నేను నఫిల్ నమాజులు చేస్తుంటాను." (ముస్లిం)

"దైవప్రవక్త (స) తన బంధువరుసకు సోదరి అయ్యే ఉమ్మెహానీ (రజి) ఇంట్లో ఒకసారి నమాజ్ చేశారు. తరువాత ఉమ్మెహానీని పిలిచి 'ఇది ఇష్రాఖ్ నమాజ్' అని తెలియజేశారు." (తబ్రాని)

అయితే హజ్రత్ అనస్ (రజి) ఉల్లేఖనం ప్రకారం ఇది "జుహానమాజ్" అని తెలుస్తోంది. ఈ నమాజ్ సమయం సూర్యోదయం అయినప్పటి నుండి మొదలయి సూర్యుడు నాలుగో వంతు పైకెక్కే వరకు ఉంటుంది. "అవ్వాబీన్ నమాజ్" వేళ ఎండ ముదిరిన తరువాత నుండి మొదలయి సూర్యుడు బాగా పెకెక్కే వరకు ఉంటుంది.

దైవప్రవక్త (స) ప్రవచనం: "అవ్వాబీన్ నమాజ్ వేళ ఒంటెదూడలు ఎండ తీవ్రతను అనుభూతి చెందసాగినపుడు మొదలవుతుంది." (తిర్మిజి)

జుహా నమాజ్, చాష్త్ నమాజ్ ఒకటేనని తెలుస్తోంది. అయితే చాష్త్, ఇష్రాఖ్, అవ్వాబీన్ నమాజులు నిజానికి ఒక్కటేనని, పేర్లు మాత్రమే విభిన్నంగా ఉన్నాయని కొందరు అభిప్రాయ పడ్డారు. మరికొందరి అభిప్రాయం ప్రకారం 'చాష్త్ నమాజ్, ఇష్రాఖ్ నమాజ్ ఒక్కటేగాని, అవ్వాబీన్ నమాజ్ మాత్రం వేరు. జుహా (చాష్త్) నమాజ్‌లో కనిష్ఠంగా రెండు రకాతులు, గరిష్ఠంగా పన్నెండు రకాతులు పఠించవచ్చని తెలుస్తోంది.



## సలాతుల్ హాజా

మన పని ఏదైనా నెరవేరడానికి చేయవలసిన నఫిల్ నమాజ్‌ని 'సలాతుల్ హాజా' అంటారు. సాధారణంగా ప్రజలు తమపని నెరవేరితే రెండో నాలుగో రకాతులు చేస్తామని లేదా మూడు రోజులు ఉపవాసం ఉంటామని మొక్కుబడి చేసుకుంటారు. అంటే "నువ్వీ పని చేస్తే నేను నీకు ఫలానా కానుక సమర్పించుకుంటాన"ని సృష్టికర్తకు షరతు పెడతారన్న మాట. ఆ పని నెరవేరకపోతే వారు ఎలాంటికానుక సమర్పించుకోరు. షరతులతో కూడిన ఇలాంటి మొక్కుబడులకు దేవుని దృష్టిలో ఎలాంటి విలువ లేదు. దీనికి భిన్నంగా పని ఫలితం ముందుకు రాకమునుపే "హాజత్ నమాజ్" చేయాలని దైవప్రవక్త (స) ఉపదేశించారు.

హజ్రత్ అబూదర్దా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త ఇలా అన్నారు: "ఎవరు సక్రమంగా ఉజూ చేసి రెండు రకాతులు (నఫిల్) నమాజ్ చేస్తాడో, దేవుడు అతని ప్రతి కోరికను తొందరగానైనా, ఆలస్యంగానైనా నెరవేరుస్తాడు." (ముస్నద్ అహ్మద్)

హజ్రత్ అబ్దుల్లా బిన్ అబీ ఔఫ (రజి) ప్రకారం దైవప్రవక్త (స) హితోక్తి: "దేవుని ద్వారాగాని లేదా మరేమనిషి ద్వారాగాని తన పని నెరవేర్చుకోదలచినవాడు సక్రమంగా ఉజూ చేసి రెండు రకాతులు (నఫిల్) నమాజ్ చేయాలి. ఆ తరువాత దైవస్తోత్రం, దైవప్రవక్త కోసం దరూద్ పఠనం చేసి, ఈ (కింది) దుఆ పఠించాలి"-

లాఇలాహ ఇల్లల్లాహుల్ హలీముల్ కరీం, సుబ్‌హానల్లాహి రబ్బిల్‌అర్షిల్ అజీం, అల్‌హమ్దులిల్లాహి రబ్బిల్‌ఆలమీన్, అసాఅలుక మూజిబాతి రహ్మతిక వఅజాయిమ మగ్‌ఫిరతిక వల్‌గనీమత మిన్‌కుల్లి బిర్రిన్ వస్సలామత మిన్‌కుల్లి ఇస్మిన్, లాతదాలీ జమ్‌బన్ ఇల్లా గఫర్‌తహూ, వలాహమ్మన్ ఇల్లా ఫర్రజ్‌తహూ, వలాహాజతన్ హియలక రజన్ ఇల్లా ఖజైతహా యా అర్హమర్రాహిమీన్. (తిర్మిజి)

(అర్థం:- అల్లాహ్ తప్ప వేరే ఆరాధ్యుడు లేడు. ఆయనే మృదుహృదయుడు, కనికరించే వాడు. అత్యున్నత సింహాసనానికి యజమాని అయిన అల్లాహ్ ఎంతో పవిత్రుడు. సకలలోకాల ప్రభువైన ఆ దేవునికే సమస్త స్తుతిస్తోత్రాలు శోభిస్తాయి. దేవా! నేను నీకారుణ్యానికి, నా పాప మన్నింపుకు కారణమయ్యే సత్కార్యాలు చేసే సద్బుద్ధి ప్రసాదించు నాకు. నేను నీకు విధే యుణ్ణయి సమస్త పాపాలకు దూరంగా ఉండే సద్బుద్ధి అనుగ్రహించమని ప్రార్థిస్తున్నాను. నా పాపాలు క్షమించు. నా మనస్సులోని విచారం దూరం చెయ్యి. నీ దృష్టిలో మంచిదైన నా ప్రతి అవసరం నెరవేర్చు. దయామయుల్లో కల్లా గొప్ప దయామయుడా! నా మొరాలకించి నా వేడుకోలు స్వీకరించు.) ఈ 'దుఆ' తప్పనిసరికాదు, అభిలషనీయం మాత్రమే.

**వితర్ తరువాత నఫిల్**:-వితర్ తర్వాత రెండురకాతులు నఫిల్‌నమాజ్ చేయవచ్చు. దీని వివరాలు వితర్‌నమాజ్ అధ్యాయంలో వచ్చింది. కొంతమంది దీన్ని తహజ్జుద్ నమాజ్‌కు ప్రత్యామ్నాయ నమాజ్ అంటారు. ఈ అభిప్రాయానికి హదీసుల్లో ఆధారం లేదు.

## సలాతుత్తస్బీహ్

హజ్రత్ అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి) కథనం ప్రకారం ఆయన తండ్రితో దైవప్రవక్త (స) ఇలా అన్నారు: "అబ్బాస్! నా ప్రియమైన బాబాయీ!! నేను మీకు ఓ ముఖ్యమైన విషయం చెప్పనా? నేను మీకు ముఖ్యమైన పది విషయాలు తెలుపనా? వాటిని గనక నెరవేర్చితే మీ తొలి పాపాలు, చివరి పాపాలు, పాత పాపాలు, కొత్త పాపాలు, ఉద్దేశ్య

పూర్వకంగా చేసిన పాపాలు, పొరపాటున చేసిన పాపాలు, చిన్నపాపాలు, పెద్దపాపాలు, బహిరంగంగా చేసిన పాపాలు, రహస్యంగా చేసిన పాపాలు- సమస్త పాపాలను దేవుడు క్షమిస్తాడు. (ఆ పది విషయాలు ఇలా ఉన్నాయి:)

మీరు నాలుగు రకాతులు నమాజ్ చేయండి. దాని ప్రతి రకాత్‌లో ఫాతిహా సూరా, దాంతోపాటు మరొక సూరా పఠించండి. మొదటి రకాత్‌లో ఖుర్‌ఆన్ పఠనం తరువాత నిల్చున్న స్థితిలోనే 15 సార్లు-

'సుబ్‌హానల్లాహి వల్‌హమ్దులిల్లాహి లాఇలాహ ఇల్లల్లాహు వల్లాహుఅక్బర్'

-అని పఠించాలి. ఆ తర్వాత రుకూ చేస్తూ (సుబ్‌హాన రబ్బియల్ అజీం తరువాత) ఇంతకుముందు (నిల్చున్న స్థితిలో) పఠించిన తస్బీహ్‌నే పఠించాలి. అయితే 10 సార్లు మాత్రమే పఠించాలి. రుకూ నుండి లేచి నిలబడి ఈ తస్బీహ్‌నే 10 సార్లు పఠించాలి. తరువాత సజ్దా చేయాలి. సజ్దా స్థితిలో (సుబ్‌హాన రబ్బియల్ ఆలా తర్వాత) మళ్ళీ ఈ తస్బీహ్‌నే 10 సార్లు పఠించాలి. సజ్దా నుండి లేచి కూర్చొని మళ్ళీ ఈ తస్బీహ్‌నే 10 సార్లు పఠించాలి. ఆ తర్వాత రెండవ సజ్దాలో కూడా 10 సార్లు, సజ్దా నుండి లేచికూర్చొని 10 సార్లు దీన్నే పఠించాలి. ఈవిధంగా ఒక రకాత్‌లో మీరు 75 సార్లు ఈ తస్బీహ్ పఠిస్తారు. అదేవిధంగా మిగతా మూడు రకాత్‌లలో కూడా 75సార్లు ఈ తస్బీహ్ పఠించాలి.

ఈ నమాజ్‌ను మీరు ప్రతిరోజూ చేయగలిగితే చేయండి. లేదా ప్రతి వారం చేయ గలిగితే చేయండి. లేదా ఏడాదికొకసారి అయినా చేయండి. ఒకవేళ జీవితంలో ఒకసారి మాత్రమే చేయగలిగితే ఆ ఒక్క సారయినా చేయండి." (అబూదావూద్, ఇబ్నెమాజ)

## 24. జికర్(ధ్యానం), దుఆ(వేడుకోలు)

"విశ్వాసుల హృదయాలు దేవుని ప్రస్తావనతో ద్రవించిపోయే సమయమింకా రాలేదా? ఆయన పంపిన సత్యంముందు లొంగిపోయే వేళ ఆసన్నం కాలేదా?" (ఖుర్‌ఆన్-57:16)

పైసూక్తి మూలభాషలో 'జిక్ర్' అనే పదమే ఉంది. ఇక్కడ జిక్ర్ అంటే దైవనామ స్మరణ లేక జపం, ధ్యానం కాదు. ఈసూక్తిలో జిక్ర్ అనే పదం విస్తృతభావంతో కూడుకున్నది. దేవునికి సంబంధించిన, ఆయన ధర్మానికి సంబంధించిన ప్రతి విషయమూ జిక్ర్ కిందికే వస్తుంది. దేవుడు తన గ్రంథం ద్వారా తెలిపిన సమస్త విషయాలు, ఆయన ఆదేశించిన-సూచించిన సంగతులన్నీ జిక్ర్ కిందికే వస్తాయి. ఖుర్‌ఆన్‌కు మరోపేరు "అజ్జిక్ర్" అనికూడా ఉంది. ఇక్కడ అజ్జిక్ర్ అంటే జ్ఞాపకం చేసేదని అర్థం. ఖుర్‌ఆన్ మానవులకు వారు మరచిపోయిన పాఠాలను జ్ఞాపకం చేస్తుంది కనుక దాన్ని 'అజ్జిక్ర్' అని కూడా పేర్కొనడం జరిగింది.

ఖుర్‌ఆన్ దైవప్రవక్తల ప్రస్తావనను కూడా జిక్ర్ అనే పేర్కొన్నది. 'జుముఆ' సూరాలో పేర్కొనబడిన 'జిక్రిల్లా' అంటే దైవధ్యానం లేదా దైవనామ స్మరణ అని అర్థం కాదు. ఇక్కడ 'జిక్రిల్లా' అంటే శుక్రవారం జుమానమాజ్‌లో నమాజ్‌కు పూర్వం చేసే ధర్మబోధ అని అర్థం. దైవధర్మం గురించి తెలుసుకునే పని కూడా జిక్ర్ కిందికే వస్తుంది. ప్రత్యేకంగా దైవధ్యానం అర్థంలో కూడా కొన్ని విషయాలు ఉన్నాయి. వాటిని మనం కూర్చొని, నిల్చొని, పడుకొని, నడుస్తూ లేదా యాంత్రికమైన మరే పని చేస్తున్నప్పుడయినా సరే పఠిస్తుండవచ్చు.



**జిక్ర్ (స్మరణ)**:- హజ్రత్ అబూమూసా అష్‌అరీ (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ఇలా అన్నారు: "ఎవరు తన ప్రభువును స్మరిస్తుంటాడో అతను సజీవుడైన మనిషిలాంటి వాడు. మరెవరు తన ప్రభువును స్మరించడో అతను శవం లాంటివాడు" (బుఖారి)

దైవప్రవక్త (స) ఇలా అన్నారు: "మీరు వీలైనంత అధికంగా దైవనామస్మరణ చేయ మని నేను మీకు ఉపదేశిస్తున్నాను. దైవనామస్మరణ చేసేవాని పోలిక ఇలా ఉంటుంది- ఒక మనిషిని అతని శత్రువులు అతివేగంగా తరుముకు వస్తుంటే అతను పారిపోయి ఓ దృఢమైన కోటలో ఆశ్రయం పొందుతాడు. అలాగే దైవదాసుడు దైవనామస్మరణ ద్వారా మాత్రమే షైతాన్ బారి నుండి తప్పించుకోగలుగుతాడు." (తిర్మిజి)

దైవప్రవక్త (స) ప్రవచనం: మానవుల్లో ఎవరు దేవుడ్ని స్మరిస్తున్నారో చూడటానికి కొందరు దైవదూతలు వివిధ ప్రదేశాలలో తిరుగుతుంటారు. వారిలో కొందరు ఎక్కడైనా దైవాన్ని స్మరిస్తున్న మానవుల్ని చూడగానే తమ స్నేహితుల్ని పిలుస్తూ "ఇటు వచ్చేయండి, మీరు వెతుకుతున్న మనుషులు ఇక్కడున్నారు రాండి" అంటారు. అప్పుడు వారంతా ఆకాశందాకా తమ రెక్కలు జాపి (దైవనామస్మరణ చేసేవారిని) కప్పివేస్తారు. తరువాత వారు దేవుని సన్నిధిలో హాజరవుతారు. దేవుడు తనకంతా తెలిసినప్పటికీ తన దూతల్ని ఉద్దేశించి "దైవదూతలారా! నాయీ దాసులు ఏమంటున్నారు?" అని అడుగుతాడు.

దానికి దైవదూతలు సమాధానమిస్తూ "ప్రభూ! వారు మిమ్మల్ని స్మరిస్తున్నారు. మీ ఘనతను ప్రశంసిస్తున్నారు. మీకు కృతజ్ఞతలు సమర్పించుకుంటున్నారు. మీ ఔన్నత్యం, మహనీయతలను చాటుతున్నారు" అని చెబుతారు. దేవుడీ సమాధానం విని "వారు నన్ను ఎప్పుడైనా చూశారా?" అని ప్రశ్నిస్తాడు. దానికి దైవదూతలు "లేదు, మీ సాక్షి! వారు మిమ్మల్ని (ఎన్నడూ) చూడలేదు" అంటారు. "ఒకవేళ నన్ను చూసివుంటే వారి పరిస్థితి ఎలా ఉంటుంది?" అని అడుగుతాడు దేవుడు. "వారు గనక మిమ్మల్ని చూసి ఉంటే, ఇప్పటికంటే ఎంతో ఉత్సాహంతో మిమ్మల్ని ఆరాధించడంలో లీనమైపోతారు. వీలైనంత అధికంగా మిమ్మల్ని స్మరిస్తూవుంటారు" చెబుతారు దైవదూతలు.

"సరే, వారు నన్ను ఏం అర్థిస్తున్నారు?" అడుగుతాడు దేవుడు. దానికి దైవదూతలు "వారు మిమ్మల్ని స్వర్గం అర్థిస్తున్నారు"అని చెబుతారు. "మరి వారు స్వర్గం చూశారా?" అని అడుగుతాడు దేవుడు. "లేదు ప్రభూ! వారు (ఎన్నడూ) స్వర్గం చూడలేదు" అంటారు దైవదూతలు. "ఒకవేళ స్వర్గం చూసివుంటే వారి పరిస్థితి ఎలా ఉంటుంది?" అడుగుతాడు దేవుడు. "వారు గనక స్వర్గం చూసివుంటే దాన్ని పొందలన్న వారి కోరిక మరింత బలీయమవుతుంది. దాని వైపు వారి ఆకర్షణ ద్విగుణీకృతమవుతుంది" అని చెబుతారు దైవదూతలు. "సరే, వారు దేని బారినుండి తప్పించుకోవడానికి నన్ను శరణు గోరుతున్నారు?" అడుగుతాడు దేవుడు మళ్ళీ. దానికి దైవదూతలు "వారు నరకం నుండి తప్పించుకోవడానికి మిమ్మల్ని శరణుగోరుతున్నారు" అంటారు దైవదూతలు. "మరి వారు నరకం చూశారా?" అని అడుగుతాడు దేవుడు. దానికి దైవదూతలు "లేదు ప్రభూ! వారు నరకం (ఎన్నడూ) చూడలేదు" అంటారు. "ఒకవేళ నరకం చూసివుంటే వారి పరిస్థితి ఎలా ఉంటుంది?" అడుగుతాడు దేవుడు. "వారు గనక నరకం చూసివుంటే

దానికి మరింత భయపడి చాలా దూరం పరుగెత్తుతారు” అంటారు దైవదూతలు.

ఆ తరువాత దేవుడు ఇలా అంటాడు: “సరే, నేను వారి పాపాలు క్షమిస్తున్నాను. వారి వైపుకు నరకజ్వాలల్ని పోనివ్వకుండా కాపాడుతాను. వారిని నేను నా కారుణ్యాశ్రయంలో దాచుకుంటాను.”

(హజ్రత్ అబూహురైరా (రజి) ఉల్లేఖనం: బుఖారి)

హజ్రత్ ముగైరా బిన్ షాబ (రజి) కథనం: “దైవప్రవక్త (స) ప్రతి ఫరజ్ నమాజ్ తరువాత ఈ దుఆ (జికిర్) చేసేవారు- “లాఇలాహ ఇల్లల్లాహు వహ్దహూ లాషరీక లహూ, లహుల్‌ముల్కు వలహుల్‌హమ్దు, వహువఅలాకుల్లిషయిన్‌ఖదీర్, అల్లాహుమ్మ లామానిఅ లిమా అఅ్తైత వలాముఅ్తియ లిమామనఅ్త వలాయున్‌ఫవు జల్‌జద్ది మిన్కల్‌జద్దు.” (బుఖారి)

(అర్థం: అల్లాహ్ తప్ప మరే ఆరాధ్యుడు లేడు. ఆయన అద్వితీయుడు. ఆయనకు మరెవరూ సాటి లేరు. ఆయన సర్వాధికారి, ప్రతి విషయంపై అధికారం కలిగినవాడు. దేవా! నీవు ఎవరికైనా ఏదైనా ఇవ్వదలచుకుంటే దాన్ని ఎవరూ అడ్డుకోలేరు. ఎవరికైనా నీవు ఏదైనా ఇవ్వకుండా ఉండదలచుకుంటే అతనికి మరే శక్తీ ఇవ్వజాలదు. నీ శక్తిసామర్థ్యాల ముందు మరెవరి శక్తిసామర్థ్యాలూ పనికిరావు.)

హజ్రత్ సాద్ బిన్ వఖ్ఖాస్ (రజి) కథనం: ఒక పల్లెవాసి దైవప్రవక్త (స) సన్నిధికి వచ్చి “నేను దేవుడ్ని స్మరించుకోవడానికి ఏదైనా మంచి సంస్మరణ చెప్పండి” అన్నాడు. అప్పుడు దైవప్రవక్త (స) ఇలా స్మరించుకోమన్నారు- “లాఇలాహ ఇల్లల్లాహు వహ్దహూ లాషరీకలహూ, అల్లాహుఅక్బర్ కబీరా, వల్‌హమ్దులిల్లాహి కసీరా, వసుబ్‌హానల్లాహి రబ్బిల్‌ఆలమీన్, లాహౌల వలాఖువ్వత ఇల్లాబిల్లాహిల్ అజీజుల్‌హకీం.” (ముస్లిం)

ఒక హదీసులో 33 సార్లు ‘సుబ్‌హానల్లాహ్,’ 33 సార్లు ‘అల్‌హమ్దులిల్లాహ్,’ 34 సార్లు ‘అల్లాహుఅక్బర్’ అని జికర్ చేయడం ఎంతో పుణ్యప్రదమైన విషయమని ఉంది. ఈ జిక్ర్ ఫరజ్ నమాజ్ తరువాత చేయడం మంచిది. అలాగే ‘లాఇలాహ ఇల్లల్లాహ్, ముహమ్మదుర్రసూలుల్లాహ్’ అని కూడా ధ్యానం చేయవచ్చు. నమాజ్ తర్వాత చేయవలసిన కొన్ని స్మరణలు ఇక్కడ పేర్కొనబడుతున్నాయి:

“అస్తగ్ఫిరుల్లాహ, అస్తగ్ఫిరుల్లాహ, అస్తగ్ఫిరుల్లాహ, అల్లాహుమ్మ అన్తస్సలాము వమిన్‌కస్సలాము తబారక్‌త యాజల్‌జలాలి వల్‌ఇక్రామ్.” (ముస్లిం)

(అర్థం:-నేను నా పాపాలు క్షమించమని దేవుడ్ని అర్థిస్తున్నాను. నా పాపాలు క్షమించమని దేవుడ్ని అర్థిస్తున్నాను. నా పాపాలు క్షమించమని దేవుడ్ని అర్థిస్తున్నాను. దేవా! నీవు శాంతిమయుడవు. నీనుండే శాంతి లభిస్తుంది. మహోపకారీ! మహానుభావా!! నీవు గొప్ప శుభకరుడవు.)

పాపమన్నింపు కోసం తరచుగా చేయవలసిన ఈ దుఆ లేక స్మరణ కూడా మైఖ్యమైనదే:

“అస్తగ్ఫిరుల్లాహ రబ్బీ మిన్‌కుల్లి జన్‌బిన్‌వ్వ అతూబు ఇలైహి”

దైవప్రవక్త (స) ఒకసారి హజ్రత్ ముఆజ్ (రజి) చేయి పట్టుకొని “ముఆజ్! నాకు నీమీద అభిమానం ఉంది” అన్నారు. తర్వాత ఆయనిలా ఉపదేశించారు: “అల్లాహుమ్మ



అఇన్నీ అలా జిక్రిక వహుస్ని ఇబాదతిక” (అర్థం: దేవా! మేము నిన్ను స్మరించడానికి, నీకు కృతజ్ఞత చెప్పుకోవడానికి, నిన్ను గొప్పగా ఆరాధించడానికి వీలుగా మాకు సహాయం చెయ్యి.)- (రియాజుస్సాలిహీన్)

హజ్రత్ అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి) కథనం: “దైవప్రవక్త (స) కాలంలో ఫరజ్ నమాజుల తరువాత ప్రజలు బిగ్గరగా జికర్ (ధ్యానం) చేసేవారు. దాంతో వారి నమాజ్ ముగిసిందని తెలిసేది.” (బుఖారి)

**దుఆ (వేడుకోలు)**:- దుఆ చేయడమంటే అర్థించడం, ప్రార్థించడం, వేడుకోవడం, బ్రతిమాలడం, మొరపెట్టుకోవడం, విన్నవించుకోవడం అనే అర్థాలున్నాయి. ప్రతి విషయంలోనూ ఏ శక్తిస్వరూపుని అధీనంలో మన కష్టసుఖాలు, లాభనష్టాలున్నాయో ఆ అద్వితీయుడ్ని మాత్రమే వేడుకోవడం, మొరపెట్టుకోవడం జరగాలి. ఆ అద్వితీయుడు సృష్టికర్త, విశ్వప్రభువు, నిజయజమాని అయిన అల్లాహ్ మాత్రమే. ఆయనే మన ఆపద్బాంధవుడు, ఆపదల మొక్కులవాడు. కనుక మానవులు తమ వేడుకోళ్లు, మొరలు, విన్నపాలు ఆ ఏకైక దేవునికే ప్రత్యేకించాలి. ఖుర్‌ఆన్‌లోని ఈ క్రింది సూక్తులు చూడండి:

✦ “నీవు ఏకాగ్ర చిత్తుడవయి ఈ ధర్మంలోనే స్థిరంగా ఉండు. బహుదైవారాధకుల్లో చేరిపోకు. దేవుడ్ని వదలి నీకు ఎలాంటి లాభంగాని, నష్టంగాని కలిగించలేని మిథ్యాదైవాలను ఎన్నటికీ ప్రార్థించకు. అలా చేస్తే నీవు దుర్మార్గుడవైపోతావు. దేవుడు నిన్ను ఏదయినా కష్టానికి గురిచేయదలిస్తే ఆయన తప్ప ఆ కష్టం నుండి నిన్ను గట్టెక్కించేవారు మరెవరూ ఉండరు.” (10:105,106)

✦ “నా దాసులు నా గురించి అడిగితే నేను వారికి చేరువలోనే ఉన్నానని చెప్పు. మొరపెట్టుకునేవాడు నన్ను మొరపెట్టుకుంటున్నప్పుడు నేనతని మొరాలకించి, దానికి సమాధానం ఇస్తానని కూడా చెప్పు. అయితే వారు నా సందేశాన్ని స్వీకరించి నా పట్ల పూర్తి విశ్వాసం కలిగివుండాలి. అప్పుడే వారు సన్మార్గం పొందగలరు.” (2:186)

✦ “కొందరు ప్రజలు దేవుడ్ని ప్రార్థిస్తూ “ ప్రభూ! మాకు (నీవు ప్రసాదించేవన్నీ) ప్రపంచంలోనే ప్రసాదించు” అంటారు. అలాంటివారికి (ప్రపంచంలోనే తప్ప) పరలోక (స్వర్గ)ంలో ఎలాంటి వాటా లభించదు.” (2:199)

✦ “మీరు నన్ను ప్రార్థించండి, నేను మీ ప్రార్థన స్వీకరిస్తాను. అహంకారంతో నన్ను ఆరాధించడానికి అంగీకరించనివారు నీచులై నరకానికి పోతారు.” (40:60)

దైవప్రవక్త (స) దేవుని మాటలను ఇలా తెలియజేశారు: “(విశ్వసనీయుడైన) నా దాసుడు నా గురించి ఏవిధమైన ఆశలు పెట్టుకుంటాడో ఆవిధంగానే నన్ను పొందుతాడు. నన్నతను స్మరిస్తున్నప్పుడు నేనతని వెంటే ఉంటాను. అతను నన్ను ఏకాంతంలో స్మరిస్తే నేను కూడా అతడ్ని ఏకాంతంలో స్మరిస్తాను. అతను నాగురించి ఏదైనా జనసమూహంలో ప్రస్తావిస్తే నేనతడ్ని గురించి జనసమూహం కంటే శ్రేష్ఠమైన (దైవదూతల) సమూహంలో ప్రస్తావిస్తాను. అతను నా వైపు జానెడు దూరం కదిలివస్తే నేనతని వైపు బారెడు దూరం కదలివస్తాను. అతను నా వైపుకు బారెడు దూరం వస్తే నేనతని వైపుకు నాలుగు బారెడుల దూరం ఎదురువెళ్తాను. అతను నా వైపుకు నడచివస్తే నేనతని

వైపుకు పరుగెడుతూ వస్తాను.'' (హజ్రత్ అబూహురైరా ఉల్లేఖనం, బుఖారి, ముస్లిం)

హజ్రత్ అబూహురైరా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (స) ఇలా అన్నారు: ''మహోన్నతుడు, శుభదాయకుడయిన మన ప్రభువు ప్రతిరోజూ రాత్రి చివరి మూడో జాముప మొదటి ఆకాశం పైకి వచ్చి (మానవుల్ని సంబోధిస్తూ) 'నన్ను మొరపెట్టుకునే వారెవరైనా ఉన్నారా? నేను వారి మొరలు ఆలకిస్తాను; నన్ను పిలిచే వారెవరైనా ఉన్నారా? నేను వారి పిలుపుకు సమాధానమిస్తాను; నన్ను క్షమాపణ కోరేవారెవరైనా ఉన్నారా? నేను వారిని క్షమిస్తాను' అని అంటాడు.'' (బుఖారి)

హజ్రత్ సల్మాన్ ఫార్సి (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ఇలా అన్నారు: ''దేవుడు లజ్జావంతుడు, గొప్పదాత. ఏ దాసుడైనా దేవుని సన్నిధిలో చేతులు జోడించి ఏదైనా అర్థిస్తే అతడ్ని వట్టి చేతులతో పంపడానికి దేవుడు సిగ్గుపడతాడు.'' (తిర్మిజి)

కష్టసుఖాలు, లాభనష్టాలు, కీడు మేళ్ళు అన్నీ సృష్టికర్త, విశ్వపాలకుడైన దేవుని చేతిలోనే ఉన్నాయి. ఆయనే సర్వేశ్వరుడు, అసాధారణ శక్తిసంపన్నుడు. ఆయన తన దాసుల మొరలను ఎలాంటి మధ్యవర్తులు లేకుండానే ప్రత్యక్షంగా వింటాడు; తాను తలచుకున్నవారికి సహాయం కూడా చేస్తాడు. కనుక మానవులు ఎట్టి పరిస్థితులు ఎదురైనా ఆయన్నే వేడుకోవాలి.

ఈ కార్యకారణ ప్రపంచంలోని సహజ వనరులు, సాధనసంపత్తులేవీ ఒక్కోసారి దాసుల కష్టాలు దూరంచేయలేవు, వారి అవసరాలు తీర్చలేవు. అప్పుడు దాసులు అసాధారణ శక్తి సంపన్నుడి (Super Natural Power)ని వేడుకోవడానికి సిద్ధమవుతారు. ఆ అసాధారణ శక్తిసంపన్నుడు, సృష్టికర్త, సర్వేశ్వరుడైన దేవుడే. ఆయన్ని వదలి సృష్టితాలను వేడుకునేవారు ప్రపంచంలో తాత్కాలిక ప్రయోజనం పొందగలిగినా ఘోరపాపానికి పాల్పడిన వారవుతారు. నిజమైన విశ్వాసమున్న ముస్లింలు ఆయన్నే వేడుకుంటారు. అయితే వేడుకునేవారు తమ భౌతికప్రయత్నాలతో పాటు ఈ క్రింది ప్రవక్త ప్రవచనాలు కూడా గమనించాలి:

❁ ''నమాజ్ చేసేవాడా! నీవు దుఆ చేయడానికి సిద్ధమైనపుడు ముందుగా దేవుడ్ని స్తుతించు. తరువాత నా కోసం దరూద్ పఠించు. ఆ తర్వాత (నీవు తలచుకున్న) దుఆ చేసుకో.'' (తిర్మిజి, అబూదావూద్, నసాయి)

❁ ''ఒక ముస్లిం పాపకార్యానికి లేదా బంధువుల పట్ల నిర్దయకు సంబంధించిన విషయంలో గాకుండా మరేదైనా విషయంలో దుఆ చేసినప్పుడు దేవుడు అతని దుఆను మూడురూపాల్లో ఏదోఒక రూపంలో స్వీకరిస్తాడు. అతని దుఆను ఇహలోకంలోనే స్వీకరిస్తాడు; లేదా అతనికి పరలోకంలో ప్రతిఫలం ఇవ్వడానికి దాన్ని భద్రపరుస్తాడు లేదా ఆ దుఆలోని విషయానికి సమానస్థాయిగల ఏదైనా ఆపదను అతని మీద పడకుండా నిరోధిస్తాడు.'' (ముస్నద్ అహ్మద్)

❁ ''దుఆను దేవుడు తప్పక స్వీకరిస్తాడన్న గట్టి నమ్మకంతో చేయాలి.'' (తిర్మిజి)

❁ ''మనిషి తొందరపాటుతో 'నేను ఎంతో వేడుకున్నాను, చాలాసార్లు వేడుకున్నా. కాని నావేడుకోలు స్వీకరించబడే సూచనలు కానరావడం లేదు' అని చెప్పి అలసిపోయి వేడుకోవడం మానేస్తాడు. అలాంటి తొందరపాటు పనికిరాదు.'' (ముస్లిం)



❁ ''మీలో ప్రతి వ్యక్తీ తన అవసరాల కోసం దేవుడ్ని వేడుకోవాలి. చివరికి తన చెప్పువారు తెగిపోయినా (దానికోసం కూడా) దేవుడ్ని వేడుకోవాలి.'' (తిర్మిజి)

❁ ''ఒకతను సుదూర ప్రయాణం చేసి దుమ్ము ధూళి కొట్టుకొని వస్తాడు. అతను ఆకాశం వైపు చేతులెత్తి 'ప్రభూ! ప్రభూ!' అంటూ ప్రార్థిస్తాడు. కాని అతను తిన్నది అధర్మమైన తిండి, అతను కట్టుకున్నవి అధర్మవస్త్రాలు, అతని శరీరం అధర్మ సంపాదనతో పోషించబడింది. అలాంటప్పుడు అతని ప్రార్థన ఎలా స్వీకరించబడుతుంది?'' (ముస్లిం)

**ఖుర్ఆన్ 'దుఆ'లు** :-ఖుర్ఆన్‌లో భావగర్భితమైన, సమగ్రమైన 'దుఆ'లున్నాయి. నమాజ్ తర్వాత వీటిని పఠించడం మంచిది. ఇతర సమయాల్లోనూ పఠించవచ్చు.

(1) ''రబ్బనా ఆతినా ఫిద్దున్యా హసనతన్వ్వ ఫిల్ఆఖిరతి హసనతన్ వ్వఖినా అజాబన్నార్.'' (2:201)– (భావం: ప్రభూ! మాకు ఇహలోకంలోనూ, పరలోకంలోనూ మంచిని ప్రసాదించు. మమ్మల్ని నరకయాతనల నుండి రక్షించు.)

(2) ''రబ్బనా లా తుఆఖిజ్నా ఇన్నసీనా ఔ అఖ్తానా. రబ్బనా వలా తహ్మిల్ అలైనా ఇస్రన్ కమా హమల్తహూ అలల్లజీన మిన్ ఖబ్‌లినా. రబ్బనా వలా తుహమ్మిల్నా మాలా తాఖతలనా బిహీ. వఅ్ఫుఅన్నా వగ్‌ఫిర్‌లనా వర్‌హమ్నా అన్త మౌలానా ఫన్‌సుర్నా అలల్ ఖౌమిల్ కాఫిరీన్.'' (2:286) (భావం: ప్రభూ! మేము మరచిపోయి ఏదైనా పొరపాటు చేసివుంటే దాన్ని పట్టుకోకు. మాకు పూర్వం గతప్రజలపై మోపిన భారం మా పై మోపకు. ప్రభూ! మేము మోయలేని భారం మామీద వేయకు. మాపట్ల మృదువుగా ప్రవర్తించు. మా పొరపాట్లు పట్టించుకోకు. మమ్మల్ని క్షమించు, కనికరించు. నీవే మా స్వామివి, సంరక్షకుడివి. అవిశ్వాసులకు వ్యతిరేకంగా మాకు సహాయం చెయ్యి.)

(3) ''రబ్బనాఇన్ననా ఆమన్నా ఫగ్‌ఫిర్లనా జునూబనా వఖినాఅజాబన్నార్.''(3:16)– (భావం: ప్రభూ! మేము (నిన్ను, నీ ప్రవక్తను) విశ్వసించాము. మా తప్పులు మన్నించు. మమ్మల్ని నరకాగ్ని నుండి రక్షించు.)

(4) రబ్బనా లాతుజిగ్ ఖులూబనా బఅ్ద ఇజ్‌హదైనా వహబ్‌లనా మిన్‌ల్లదున్క రహ్మతన్. ఇన్నక అన్తల్ వహ్హాబ్. రబ్బనా ఇన్నక జామివున్నాసి లియౌమిల్ ల్లారైబ ఫీహి. ఇన్నల్లాహ లా యుఖ్లిఫుల్ మీఆద్.'' (3:8,9)– (భావం: ప్రభూ! నీవు మాకు (ఒకసారి) సన్మార్గం చూపిన తరువాత తిరిగి మా హృదయాల్ని వక్రమార్గం వైపుకు పోనివ్వకు. నీ సన్నిధి నుండి మాకు కారుణ్యం ప్రసాదించు. నీవే గొప్ప (కారుణ్య)ప్రదాతవు. ప్రభూ! ఒకరోజు నీవు మానవులందర్నీ సమావేశ పరచనున్నావు. ఆరోజు తప్పకుండా వస్తుంది. దేవుడు తన వాగ్దానాన్ని ఎన్నటికీ మీరడు.)

(5) ''రబ్బనా హబ్‌లనా మిన్ అజ్‌వాజినా వ జుర్రియ్యాతినా ఖుర్రత అఅ్‌యునిన్ వ్వజ్అల్‌నా లిల్‌ముత్తఖీన ఇమామా.''(25:74)– (భావం: ప్రభూ! మా భార్యాపిల్లల ద్వారా మాకంటికి చలువ ప్రసాదించు. మేము దైవభీతిపరులకు నాయకులయ్యేలా చెయ్యి.)

(6) ''రబ్బనగ్ ఫిర్‌లనా వ లిఇఖ్వాని నల్లజీన సబఖూనా బిల్ఈమాని వలా తజ్అల్ ఫీఖులూబినా గిల్లన్ లిల్లజీన ఆమనూ రబ్బనా ఇన్నక రవూఫుర్రహీమ్.'' (59:10)–

(భావం: ప్రభూ! మమ్మల్ని, మాకు పూర్వం విశ్వసించిన మా సోదరులందర్నీ క్షమించు. (యావత్తు) విశ్వాసుల పట్ల మా హృదయాల్లో ఎలాంటి అసూయాద్వేషాలు ఉంచకు. ప్రభూ! నీవు గొప్ప క్షమాశీలివి, అపార దయామయుడవు.)

(7) "రబ్బనా అలైక తవక్కల్నా వఇలైక అనబ్నా వఇలైకల్ మసీర్. రబ్బనా లా తజ్ అల్నా ఫిత్నతన్ లిల్లజీనా కఫరూ వగ్ఫిర్లనా రబ్బనా ఇన్నకఅన్తల్ అజీజుల్ హకీమ్." (60:4,5)–(భావం: ప్రభూ! మేము నిన్నే నమ్ముకున్నాం. నీవైపుకే మరలాము. మేము నీ సన్నిధికే రావాలి. ప్రభూ! మమ్మల్ని అవిశ్వాసులకోసం పరీక్షగా చేయకు. ప్రభూ! మా తప్పులు మన్నించు. నీవే అపార శక్తిసంపన్నుడవు, అసామాన్య వివేకవంతుడవు.)

(8) "రబ్బనా ఆమన్నా ఫగ్ఫిర్లనా వర్హమ్నా వఅన్త ఖైరుర్రాహిమీన్." (23:109)– (భావం: ప్రభూ! మేము విశ్వసించాం. మమ్మల్ని క్షమించు. మామీద దయ జూపు. నీవు దయామయుల్లో కెల్లా గొప్ప దయామయుడవు.)

(9) "రబ్బి అవ్జిఅనీ అన్అష్కుర నిఅ్మత కల్లతీ అన్అమ్త అలయ్య వఅలా వాలిదయ్య వఅన్ అఅ్మల సాలిహన్ తర్జాహు వఅస్లిహ్లి ఫీ జుర్రియ్యతి. ఇన్నితుబ్తు ఇలైక వఇన్నిమినల్ముస్లిమీన్."(46:15)– (భావం: ప్రభూ! నీవు నాకు, నా తల్లిదండ్రులకు చేసిన మేళ్ళకు నేను నీపట్ల కృతజ్ఞుణ్ణయివుండే సద్బుద్ధి ప్రసాదించు. నీ ప్రసన్నతాభాగ్యం లభించేటటువంటి సత్కార్యాలుచేసే సద్బుద్ధి కూడా ప్రసాదించు. నా సంతానాన్ని కూడా సజ్జనులుగా చేసి నాకు సుఖాన్నివ్వు. నేనునీకు విధేయుణ్ణయిన దాసుణ్ని. నా పాపాలకు నేను పశ్చాత్తాపపడుతూ నన్ను క్షమించమని నీ సన్నిధిలో వేడుకుంటున్నాను.)

(10) రబ్బిష్ రహ్లి సదరి వయస్సిర్లీ అమ్రి వహ్లులల్ ఉఖ్దతమ్మిన్లిసారి యఫ్ఖహూ ఖౌలి." (20:25–28)

(భావం: ప్రభూ! నాకు మనోస్థైర్యం ప్రసాదించు. నా పనులు సులభంగా నెరవేరేలా చెయ్యి. ప్రజలు నా మాట గ్రహించడానికి వీలుగా నాకు (మంచి) వాక్పటిమ ప్రసాదించు.)

**హదీస్ 'దుఆ'లు** : హదీసుల్లో కూడా భావగర్భితమైన ఎంతో మంచి 'దుఆ'లు ఉన్నాయి. ఇక్కడ కొన్ని 'దుఆ'లు పేర్కొంటున్నాను.

**ఉదయం, సాయంత్రం చేసే దుఆ:** "అల్లాహుమ్మ బిక అస్బహ్నా వబిక అమ్సైనా వబిక నహ్యా వబిక నమూతు వఇలైకల్ మసీర్." (తిర్మిజి)

(భావం: దేవా! మాకు నీ సహాయం వల్లనే తెల్లవారింది. నీ సహాయం వల్లనే సాయంత్రమయింది. నీ సహాయంతోనే మేము జీవిస్తున్నాం. నీ ఆజ్ఞతోనే మరణిస్తాం. చివరికి మేము నీ దగ్గరికే తిరిగిరావలసి ఉంది.)

**ఆపదలో చేసే దుఆ:** "ఇన్నాలిల్లాహి విఇన్నాఇలైహి రాజివూన్, అల్లాహుమ్మ అజర్నీ ఫీముసీబతి వఖ్లుఫ్లి ఖైరన్మిమ్నహా." (ముస్లిం)

(భావం: మేము దేవునికే చెందినవాళ్ళం. ఆయన దగ్గరికే పోవలసినవాళ్ళం. దేవా! నా ఆపదలో పుణ్యం కలిగించు. తద్వారా నాకు మంచి ప్రతిఫలం ప్రసాదించు.)



**రాత్రి పడుకోబోయే ముందు చేసే దుఆ :** రాత్రి పడుకోడానికి ఉపక్రమించి నప్పుడు మొదట పడకను మూడు సార్లు విదిలించి శుభ్రపరచుకొని కుడిచెంప కింద చేయి పెట్టుకొని పడుకోవాలి. తరువాత 33 సార్లు 'సుబ్హానల్లాహ్, 33 సార్లు 'అల్హమ్దులిల్లాహ్, 34 సార్లు 'అల్లాహుఅక్బర్' అని పఠించాలి. ఆ తరువాత ఈ దుఆ పఠించాలి- "అల్లాహుమ్మ బిస్మిక రబ్బి వజఅ్తు వఅహ్యా." (బుఖారి)

(భావం: దేవా! నేను నీ పేరుతోనే మరణిస్తాను, నీ పేరుతోనే జీవిస్తాను.)

హజ్రత్ అబూఇమారా బరా ఇబ్నెఆజిబ్ (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ఇలా ఉపదేశించారు: "నీవు పడకపై మేను వాల్చినప్పుడు ఈ దుఆ పఠించు:

"అల్లాహుమ్మ అస్లమ్తు నఫ్సీ ఇలైక, వ వజ్జహ్తు వజ్హీ ఇలైక, వ ఫవ్వత్తు అమ్రీ ఇలైక, వ అల్జాతు జహ్రీ ఇలైక, రగ్బతన్ వ రహ్బతన్ ఇలైక, లా మల్జఅ వలా మన్జా మిన్క ఇల్లా ఇలైక, ఆమన్తు బికితాబికల్లజీ అన్జల్త, వ నబియ్యికల్లజీ అర్సల్త."

(భావం: దేవా! నన్ను నేను నీకు సమర్పించుకున్నాను. నా ముఖాన్ని నీ వైపుకు తిప్పుకున్నాను. నా వ్యవహారాలన్నీ నీకు అప్పగించాను. నీ అనుగ్రహాన్ని కోరుకుంటూ, నీ ఆగ్రహానికి భయపడుతూ నీ శరణుజొచ్చాను. నీవు ఆశ్రయమిస్తే తప్ప మరెక్కడా ఆశ్రయం లేదు. నీవు రక్షణ కల్పిస్తే తప్ప రక్షణ పొందటానికి మరోచోటు లేదు. నేను నీవు పంపిన గ్రంథాన్ని విశ్వసించాను. నీవు పంపిన ప్రవక్తను కూడా నమ్మాను.)

ఈ దుఆ పఠించి నిద్రపోయినప్పుడు అదేరాత్రి మరణం సంభవిస్తే, అప్పుడు నీవు సహజత్వం (ఇస్లాం)పై మరణించినట్లు పరిగణించబడతావు. ఒకవేళ తెల్లవారిన తరువాత బతికివుంటే అప్పుడూ నీకు శుభం కలుగుతుంది. (బుఖారీ, ముస్లిం)

**నిద్ర పట్టనప్పుడు చేసే దుఆ :**"అల్లాహుమ్మ గారతిన్నుజూము వహదఅ్తిల్ ఉయూను వఅన్త హయ్యున్ ఖయ్యూమున్ లాతాఖుజుక సినతున్వ్వలా నౌమున్ యాహయ్యు యాఖయ్యూము ఇహ్దిలైలి వఅనిమ్ ఐని."

(భావం: దేవా! నక్షత్రాలు అస్తమిస్తున్నాయి. కళ్ళు మండుతున్నాయి. నీవు నిత్య జీవుడవు. నీకు నిద్ర రాదు, తూగూ రాదు. నిత్యజీవుడా! ఈరాత్రి నాకు సుఖం ప్రసా దించు. నా కళ్ళకు నిద్ర కలిగించు.)

**మరుగుదొడ్డికి వెళ్ళేముందు చేసే దుఆ :** "అల్లాహుమ్మ ఇన్ని అవూజుబిక మినల్ ఖుబుసి వల్ఖబాయిస్." (ముత్తఫఖున్అలై)

(అర్థం:దేవా! అపవిత్రమైన షైతానుల బారినుండి నేను నీ శరణుగోరుతున్నాను.)

**మరుగుదొడ్డి నుండి బయటికి వచ్చిన తర్వాత చేసే దుఆ :** "అల్లాహుమ్మ గుఫ్రానక" (అర్థం: దేవా! నేను నీనుండి క్షమాభిక్ష అర్థిస్తున్నాను.)

**మస్జిద్లో ప్రవేశించేటప్పుడు చేసే దుఆ :** "అల్లాహుమ్మఫ్ తహ్లి అబ్వాబ రహ్మతిక." (కుడికాలు మస్జిద్లో పెడ్తూ ఈ దుఆ పఠించాలి- ముస్లిం)

(అర్థం: దేవా! నా కోసం నీ కారుణ్య ద్వారాలు తెరువు.)

**మస్జిద్ నుండి బయటికి వెళ్లేటప్పుడు చేసే దుఆ :** "అల్లాహుమ్మ ఇన్నీ అస్అలుక మిన్ ఫజ్‌లికల్ అజీమ్." (ఎడంకాలు బయటపెడ్తూ పఠించాలి- ముస్లిం)

(అర్థం: దేవా! నేను నీ మహత్తరమైన అనుగ్రహాన్ని అర్థిస్తున్నాను.)

**ఇంటి నుండి బయలుదేరేటప్పుడు చేసే దుఆ :** హజ్రత్ అనస్ (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "ఇంటి నుండి బయలుదేరే వ్యక్తి 'బిస్మిల్లాహి తవక్కల్తు అలల్లాహి, వలాహౌల వలా ఖువ్వత, ఇల్లా బిల్లాహి" (భావం:- నేను దేవుని పేరుతో ప్రారంభిస్తున్నాను. నేను ఆయన్నే నమ్ముకున్నాను. పాపాల నుండి మరలిపోవాలన్నా, మంచిపనులు చేయాలన్నా ఆయన శక్తివల్లనే సాధ్యమవుతుంది) అని పఠించి బయలుదేరినప్పుడు ఆ వ్యక్తితో "నీవు సన్మార్గం పొందావు, నీకు సహాయం కల్పించబడింది, నీవు రక్షించబడ్డావు" అని అదృశ్యవాణి ఎవరికీ వినపడని విధంగా పలుకుతుంది. అంతేకాదు, షైతాన్ కూడా అలాంటి మనిషి నుండి దూరంగా పారిపోతాడు. (అబూదావూద్, తిర్మిజీ, నసాయి)

**వాహనం ఎక్కేటపుడు చేసే దుఆ :** "సుబ్‌హానల్లజీ సఖ్ఖరలనా హాజా వమాకున్నా లహూ ముఖ్‌రినీన వఇన్నా ఇలా రబ్బినా లమున్‌ఖలిబూన్." (43:13,14)

భావం: మాకోసం వీటిని అదుపులో ఉంచిన దేవుడు ఎంతో పవిత్రుడు. మేము వీటిని అదుపులో పెట్టగల శక్తిమంతులం కాము. ఒకరోజు మేము మా ప్రభువు దగ్గరికి మరలి పోవలసి ఉంది." (ఖుర్ఆన్-43:13,14)

**వివిధ కీడులనుండి రక్షణకోసం చేసే దుఆ :** "అల్లాహుమ్మ ఇన్నీ అవూజుబిక మిన్ అజాబిల్‌ఖబ్రి వఅవూజుబిక మిన్ ఫిత్నతిల్ మసీహిద్దజ్జాలి వఅవూజుబిక మిన్ ఫిత్నతిల్ మహ్‌యా వల్‌మమాతి, అల్లాహుమ్మ ఇన్నీ అవూజుబిక మినల్ మాసమి వల్ మగ్‌రమి." (ముత్తఫఖున్ అలై)

భావం: దేవా! నేను సమాధి యాతనల నుండి నీ శరణ కోరుతున్నాను. దజ్జాల్ ఉపద్రవం నుండి, జీవన్మరణాల పరీక్షల నుండి నీ శరణు కోరుతున్నాను. దేవా! నేను పాపాల బారినుండి, రుణభారం నుండి కూడా నీ శరణు కోరుతున్నాను." (బుఖారి)

**శ్మశానానికి వెళ్ళినపుడు చేసే దుఆ :** "అస్సలాము అలైకుమ్ అహ్‌లద్దియారి మినల్ ముఅ్‌మినీన వల్‌ముస్లిమీన వఇన్న ఇన్‌షాఅల్లహు బికుమ్ లాహిఖూన నస్అలుల్లాహ లనా వలకుముల్ ఆఫియత." (ముస్లిం)

(భావం: విశ్వాసులు, ముస్లిములైన సమాధివాసులారా! మీరు శాంతి కలుగుగాక. దైవచిత్తమయితే మేమూ (ఓరోజు) మిమ్మల్ని కలుసుకుంటాము. మేము మనందరి కోసం అల్లాహ్‌ను క్షేమం కోరుతున్నాం.)

**భోజన సమయంలో చేసే దుఆలు :** "బిస్మిల్లాహిర్రహ్మానిర్రహీం" (కరుణామయుడు, కృపాసాగరుడైన అల్లాహ్ పేరుతో ప్రారంభం) అని చెప్పి భోజనం చేయడం ప్రారంభించాలి. భోజనం ముగిసిన తరువాత "అలహమ్దు లిల్లహిల్లజీ అత్‌ఆమని హాజా వరజఖనీహి మిన్‌గైరి హౌలిమ్మిన్ని వలాఖువ్వతి." అని పఠించాలి. (తిర్మిజి)



(భావం: నాకీ ఆహారం తినిపించిన దేవునికి కృతజ్ఞతలు. నా శక్తిసామర్థ్యాల ప్రమేయం లేకుండానే ఆయన నాకు దీన్ని ప్రసాదించాడు.)

హజ్రత్ అనస్ (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ఇలాఅన్నారు: "భోజనం చేసి దానిపై దేవునికి కృతజ్ఞతలు తెలుపుకునేవాడి పట్ల, నీళ్ళు తాగి దానిపై దేవుడ్ని స్తుతించే దాసుడి పట్ల దేవుడు అమితంగా ప్రసన్నుడౌతాడు." (ముస్లిం)

**కొత్తబట్టలు ధరించేటపుడు చేయవలసిన దుఆ :** "అల్లాహుమ్మ లకల్‌హమ్దు అన్తకసౌ తనీహి అస్అలుక ఖైరహూవఖైర మాసునిఅ లహూ వఅవూజుబిక మిన్‌షర్రి మాసునిఅ లహూ." (తిర్మిజి)

(భావం: దేవా! సకల విధాల ప్రశంసలు నీకే శోభిస్తాయి. నీవే నాకీ బట్ట ధరింప జేశావు. ఈ బట్ట శ్రేయోశుభాలను, దేని కోసం ఇది తయారుచేయబడిందో దాని శ్రేయో శుభాలను నీ నుండి అర్థిస్తున్నాను.)

**భార్యాభర్తల కలియకకు ముందు చేసే దుఆ :** "బిస్మిల్లాహి అల్లాహుమ్మ జన్నిబ్‌న షయ్‌తాని వజన్నిబి షయ్‌తాన మారజఖ్తనా." (అర్థం: దేవుని పేరుతో ప్రారంభం. మమ్మల్ని షైతాన్ కీడునుండి కాపాడు)

**ఓ సమగ్రమైన దుఆ :** హజ్రత్ జైద్ బిన్ అర్ఖమ్ (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ఇలా ప్రార్థించేవారు: "దేవా! దీనావస్థ నుంచి, సోమరితనం నుంచి, పిసినారితనం నుంచి, నికృష్టమైన వృద్ధాప్యం నుంచి, సమాధి యాతన నుంచి, నేను నీ శరణు వేడుతున్నాను. దేవా! నా మనసుకు భయభక్తులు అనుగ్రహించు. దాన్ని శుద్ధిచేయి. నీవు మనసుని అందరికంటే బాగా శుద్ధిచేస్తావు. దాని కార్యసాధకుడివి, సంరక్షకుడివి నీవే. దేవా! పనికిమాలిన విద్య నుండి నీ శరణు వేడుతున్నాను. భయపడని హృదయం నుండి, తృప్తి చెందని మనసు నుండి, ఆమోదించబడని ప్రార్థన నుండి నీ శరణు వేడుతున్నాను." (ముస్లిం)

**రోగాల నుండి శరణు :** హజ్రత్ అనస్ (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ఇలా ప్రార్థించేవారు: "దేవా! తెల్లమచ్చల రోగం నుండి, పిచ్చితనం నుండి, కుష్ఠువ్యాధి నుండి, ఇతర నీచమైన రోగాల నుండి నేను నీ శరణు వేడుతున్నాను." (అబూదావూద్)

**గమనార్హమైన విషయాలు :** హజ్రత్ అబూహురైరా (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ఇలా చెప్పారు: "మనిషి సాష్టాంగప్రణామం (సజ్దా) స్థితిలో తన ప్రభువుకు అత్యంత దగ్గరవుతాడు. కనుక (ఆ స్థితిలో) ఎక్కువగా ప్రార్థనలు చేయండి." (ముస్లిం)

ఒకతను దైవప్రవక్త (స)ను "ఏ ప్రార్థన ఎక్కువగా స్వీకరించబడుతుంది?" అని అడిగాడు. దానికాయన "రాత్రి చివరి జాములో ఫరజ్ నమాజుల తర్వాత (చేసే) ప్రార్థన (ఎక్కువగా స్వీకరించబడుతుంది)" అని చెప్పారు. (తిర్మిజీ)

హజ్రత్ అబూదర్దా (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ఇలా అన్నారు: "ఏ ముస్లిం దాసుడైనా తన సోదరుని పరోక్షంలో అతని శ్రేయస్సు కోసం ప్రార్థించినప్పుడు, ఒక దైవదూత 'నీక్కూడా అలాగే జరుగుగాక!' అని దీవిస్తాడు." (ముస్లిం)

హజ్రత్ ఉసామా బిన్ జైద్ (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ఇలా బోధించారు: "తమకు మేలు చేసినవారి కోసం 'జజాకల్లాహు ఖైరా' (దేవుడు నీకు మంచి ప్రతిఫలం ఇవ్వుగాక!) అని ప్రార్థిస్తే, వారిని పొగిడినట్లే." (తిర్మిజీ)

హజ్రత్ ఉమర్ (రజి) ఉల్లేఖనం: "దైవప్రవక్త (స) 'దుఆ' కోసం చేతులు ఎత్తిన తర్వాత అరచేతులతో ముఖం స్పర్శించుకునేదాకా చేతులు దించేవారుకాదు."(తిర్మిజి)

# 25. జకాత్ ప్రాముఖ్యం

ఇస్లాంలోని సమస్త ఆరాధనల్లో నమాజ్‌కు ఎంత ప్రాముఖ్యం ఉందో జకాత్‌కు కూడా అంతే ప్రాముఖ్యం ఉంది. ఈ రెండిటిలో ఏ ఒక్కదాన్ని నిరాకరించినా ముస్లిం అవిశ్వాసి అవుతాడు. వీటిలో ఒకటి లేకపోతే, రెండో దానికి ఏమాత్రం విలువ ఉండదు. ఒక ముస్లిం నమాజ్ చేస్తున్నప్పటికీ ప్రతి సంవత్సరం జకాత్ చెల్లించకపోతే అతని నమాజ్ అతనికి ఎలాంటి ప్రయోజనం చేకూర్చదు. అలాగే మరొకతను ఏటేటా జకాత్ చెల్లిస్తున్నా జీవితాంతం నమాజ్ చేయకపోతే పరలోకంలో అతని జకాత్‌సత్కార్యం బూడిదలో పోసిన పన్నీరులా అవుతుంది.

## ధనప్రక్షాళనా సాధనం

"(సత్యాన్ని) విశ్వసించి సదాచార సంపన్నులయి నమాజ్ (విధి) నిర్వహిస్తూ, జకాత్‌ను నెరవేరుస్తూ ఉండేవారికి వారిప్రతిఫలం వారిప్రభువు వద్ద సిద్ధంగా ఉంది. వారికి (పరలోకంలో) ఎలాంటి భయంగాని, దుఃఖంగాని ఉండదు." (ఖుర్ఆన్–2:277)

"విశ్వసించిన స్త్రీపురుషులంతా ఒకరికొకరు స్నేహితులు, శ్రేయోభిలాషులు. వారు (ప్రజలకు) మంచివిషయాలు బోధిస్తారు. చెడువిషయాల నుండి వారిస్తారు. నమాజ్ (వ్యవస్థ) స్థాపిస్తారు. జకాత్ చెల్లిస్తారు. దేవుని పట్ల, ఆయన ప్రవక్త పట్ల వినయవిధేయ తలతో మసలుకుంటారు. వీరిపైన్నే దైవకారుణ్యం వర్షిస్తుంది." (ఖుర్ఆన్–9:71)

జకాత్ అంటే పవిత్రత, పరిశుద్ధత అని అర్థాలున్నాయి. ఇక్కడ ప్రత్యేక పారిభాషలో, ధనికుడు పవిత్రుడయ్యే ఉద్దేశ్యంతో ఏడాదికొకసారి సంపద నుండి రెండున్నరశాతం చొప్పున పేదలకు, ధర్మసంస్థాపనాకార్యాలకు దానం చేసే ధనకనక వస్తువుల్ని జకాత్ అంటారు.

దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "దేవుడు జకాత్ చెల్లింపును ముస్లింలకు విధి (ఫరజ్)గా చేశాడు. ఇది వారి ధనికుల నుండి వసూలుచేసి, వారి నిరుపేదలకు అంద జేయబడుతుంది." (బుఖారి, ముస్లిం)

పై హదీస్‌ని బట్టి జకాత్ పేదప్రజల హక్కు అని స్పష్టంగా తెలుస్తోంది. ఇస్లాం సౌధానికి ఉండే అయిదు మూలస్తంభాలలో విశ్వాస ప్రకటన, నమాజ్‌ల తరువాత 'జకాత్' మూడవ స్తంభంగా పరిగణించబడుతోంది. ఖుర్ఆన్‌లో కనీసం 32 చోట్ల నమాజ్‌తో పాటు జకాత్ ప్రస్తావన వచ్చింది. దీన్నిబట్టి కూడా జకాత్‌కు ఎంత ప్రాముఖ్యం ఉందో తెలుస్తుంది. అదీగాక ఖుర్ఆన్ అనేకచోట్ల 'ఈమాన్' తర్వాత నమాజ్, జకాత్‌లను గురించి ప్రస్తావించి, ఇవే మొత్తం ధర్మానికి ముఖ్య ప్రాతిపదికలన్న భావాన్ని స్ఫురింపజేస్తుంది.

"వారు నమాజ్ స్థాపిస్తారు; జకాత్ చెల్లిస్తారు; దేవునికి తప్ప మరెవరికీ భయపడరు. అలాంటివారే సన్మార్గంలో నడుస్తారని ఆశ ఉంటుంది." (ఖుర్ఆన్–9:18)



జకాత్ చెల్లించని వారు రుజుమార్గం పొందలేరని, ఒకవేళ రుజుమార్గం ప్రాప్తమైనా అందులో వారు స్థిరంగా ఉండలేరని కూడా ఖుర్ఆన్ బోధనలు స్పష్టంచేస్తున్నాయి. అలాంటి వారు అవిశ్వాసులు, బహుదైవారాధకులని గుర్తించబడటానికి వారు జకాత్ చెల్లించక పోవడమే పెద్ద నిదర్శనమని ఖుర్ఆన్ అధ్యయనం ద్వారా తెలుస్తుంది. జకాత్ చెల్లించడానికి నిరాకరించిన ముస్లింలపై ఖలీఫా హజ్రత్ అబూబకర్ (రజి) యుద్ధం చేయడానికి సిద్ధ మయ్యారంటే జకాత్ ఎంత ముఖ్యమైన ఆరాధనో వివరించనవసరం లేదు.

"పరలోకాన్ని తిరస్కరించి జకాత్ (విధి) నెరవేర్చని బహుదైవారాధకులకు వినాశం (రాసిపెట్టి) ఉంది." (ఖుర్ఆన్–41:6,7)

దైవప్రవక్త (స) ప్రవచనం: "ఏ సంపద నుండి జకాత్ తీయకుండా అందులోనే కలసి ఉంటుందో ఆ సంపదను ఇది నాశనం చేస్తుంది". (మిష్కాత్)

## జకాత్ చెల్లించనివారి పర్యవసానం

దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "వెండి బంగారాలు కలిగి వున్నవాడు వాటి హక్కు నెరవేర్చకపోతే ప్రళయదినాన ఆ వెండిబంగారాలను అగ్నిలో కాల్చి పలకలుగా చేసి మండుతున్న ఆ పలకలతో అతని వీపుపై, పక్కలపై, నుదుటిపై వాతలు పెట్టడం జరుగుతుంది. పలకలలు చల్లారినప్పుడల్లా వాటిని మళ్ళీ కాల్చి అతని శరీరం మీద వాతలు పెడ్తారు. ఈవిధంగా ఏభైవేల సంవత్సరాల సుదీర్ఘదినాన యావత్తు మానవాళి తీర్పు ముగిసేదాకా మాటిమాటికి వాతలు పెట్టడం జరుగుతుంది. చివరికి అతను (తన విశ్వాసం, కర్మలను బట్టి) స్వర్గానికి లేక నరకానికి పంపబడతాడు..... (ముస్లిం)

దైవప్రవక్త (స) ఇలా సెలవిచ్చారు: "ఎవరికైతే దేవుడు ఐశ్వర్యం ప్రసాదించాడో అతను జకాత్ చెల్లించకపోతే ప్రళయదినాన ఆ ధనం ఓ పెద్ద కొండచిలువగా మారుతుంది. దాని నెత్తి మీద రెండు చుక్కలుంటాయి. ఆ పామును కంఠపాశంగా చేసి అతని మెడలో వేయడం జరుగుతుంది. అప్పుడా పాము నోటితో అతని దౌడలు పట్టుకొని 'నేను నీ ధనాన్ని, నీ నిధిని' అంటుంది." ఆ తరువాత దైవప్రవక్త (స) ఈసూక్తి పఠించారు:

"దేవుడు తన అనుగ్రహంతో ప్రసాదించిన సంపద విషయంలో పిసినారితనం వహించేవారు ఆ పిసినారితనం తమకు మేలు చేకూరుస్తుందని భావించకూడదు. అది వారికి హాని కలిగిస్తుంది. వారు ఏ ధనం విషయంలో పిసినారితనం వహిస్తున్నారో అది రేపు ప్రళయదినాన వారి మెడకు గుదిబండగా మారుతుంది." (ఖుర్ఆన్–3:180)

హజ్రత్ అబూజర్ గిఫ్ఫారి (రజి) కథనం: నేనొకసారి దైవప్రవక్త (సల్లం) సన్నిధికి వెళ్ళాను. అప్పుడాయన కాబా (గోడ) నీడలో కూర్చొని "కాబా ప్రభువు సాక్షి! అందరికంటే వాళ్ళే ఎక్కువగా నష్టపోయేవాళ్ళు. కాబా ప్రభువు సాక్షి!! అందరికంటే వాళ్ళే ఎక్కువగా నష్టపోయేవాళ్ళు" అని (రెండు సార్లు) అన్నారు. నేను (ఆశ్చర్యపోతూ) "ఏమిటీ, నా పరిస్థితి ఏమిటీ? నాలో అలాంటి దేదయినా కన్పిస్తుందా?" అని అడిగాను. ఆ తరువాత నేను దైవప్రవక్త (సల్లం) దగ్గరికి వెళ్ళి కూర్చున్నాను. ఆయన తిరిగి అవే మాటలు ఉద్ఘాటించారు. నేను తీవ్రంగా చింతిస్తూ ఉండబట్టలేక "దైవప్రవక్తా! నా తల్లిదండ్రులు మీ కోసం అర్పితమవుగాక, ఎవరు వాళ్ళు (దైవప్రవక్తా)?" అని అడిగాను మళ్ళీ.

అప్పుడాయన ఇలా సమాధానమిచ్చారు:

"అత్యధిక సిరిసంపదలు కలవాళ్ళు. అయితే ఈవిధంగా, ఆవిధంగా (అంటే ముందూ, వెనుకా, కుడి, ఎడమల వైపు) దైవమార్గంలో ఖర్చు పెట్టేవాళ్ళు మాత్రం కాదు. ఒంటెలు, ఆవులు లేదా మేకలు కలిగివున్నవాడు వాటి హక్కు (జకాత్) గనక నెరవేర్చకపోతే ప్రళయదినాన ఆ పశువులు బాగా పెరిగి బలసిపోయేలా చేసి తీసుకు రాబడతాయి. ఆ తర్వాత అవి ఒకదాని తర్వాత మరొకటి వరుసగా ఆ వ్యక్తిని కొమ్ము లతో పొడిచి, కాళ్ళతో తొక్కివేస్తాయి. చివరి పశువు కూడా పొడిచి, తొక్కివేసిన తరువాత తిరిగి మొదటి పశువు వచ్చేస్తుంది. ఈవిధంగా ఈ యాతన యావత్తు మానవుల్ని గురించి తీర్పు ముగిసేదాకా కొనసాగుతుంది."

(సహీహ్ బుఖారి, సహీహ్ ముస్లిం)

దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "గుర్రాలు మూడు విధాలుగా ఉంటాయి. కొందరికవి పుణ్యఫలానికి ఉద్దేశించినవి. మరికొందరికి లోపాలను కప్పి పుచ్చేవిగా ఉంటాయి. ఇంకా కొందరికి (నరక)యాతనకు కారణభూతమవుతాయి.

దైవమార్గంలో పోరాడేందుకు గుర్రాన్ని పెంచే మనిషికి అది పుణ్యఫలం ఆర్జించి పెడుతుంది. అతనా గుర్రాన్ని పొడుగాటి త్రాటితో కట్టివేసి ఏదైనా పచ్చిక బయలులో గాని లేదా తోటలోగాని వదలిపెడితే, ఆ త్రాటి పొడవు ఆ పచ్చిక బయలులో లేక తోటలో ఎంత మేరకు విస్తరిస్తుందో అన్ని పుణ్యాలు అతని కర్మల చిట్టాలో వ్రాయ బడతాయి. ఒకవేళ ఆ గుర్రం తాడు తెంచుకొని ఒకటి రెండు గుట్టలు దూకి వెళ్తే దాని లద్దీ, దాని గిట్టల గుర్తులు సైతం అతని కోసం పుణ్యాలుగా పరిగణించబడతాయి. అంతేకాదు, ఆ గుర్రానికి దాని యజమాని నీళ్ళు తాగించే ఉద్దేశ్యం లేకపోయినా సరే అది తనంతటతాను ఏదైనా నది దగ్గరకెళ్ళి నీళ్ళు తాగితే అప్పుడు కూడా అతని ఖాతాలో పుణ్యాలు వ్రాయబడతాయి. దీనికి భిన్నంగా ఎవరైనా ప్రదర్శనా బుద్ధితో, గర్వకారణం కోసం గుర్రాన్ని పెంచుతూ, ఇస్లాం శత్రులకు వ్యతిరేకంగా పోరాడే ఉద్దేశ్యంతో కట్టి ఉంచితే అతని కోసం ఆ గుర్రం పాపఫలానికి కారణభూతమవుతుంది..." (బుఖారి)

## ఆర్థిక నేరస్థులు

ఆర్థిక స్తోమత కలిగిన ముస్లింలు తమ సంపద నుండి రెండున్నర శాతం జకాత్ తీసి ఇస్లామీయ ప్రభుత్వానికి విధిగా చెల్లించాలి. అలాంటి ప్రభుత్వం లేని చోట్ల ముస్లింలు వ్యక్తిగతంగాగాని ఏదైనా సంఘం ద్వారాగాని జకాత్‌ని అర్హులైనవారికి దానం చేయాలి. జకాత్ చెల్లించడానికి నిరాకరించేవారు ఇస్లాం దృష్టిలో ఆర్థిక నేరస్థులుగా పరిగణించబడతారు.

హజ్రత్ అబూబకర్ (రజి) ఖలీఫా అయిన తర్వాత కొన్ని తెగలు జకాత్ చెల్లించ డానికి నిరాకరించాయి. అప్పుడాయన ఆ తెగలతో యుద్ధంచేసి వాటినుండి బలవంతం గా జకాత్ వసూలు చేయడానికి నిర్ణయించుకున్నారు. హజ్రత్ ఉమర్ (రజి) ఈ నిర్ణయం పట్ల అభ్యంతరం లేవదీసినప్పుడు ఆయన ఇలా సమాధానమిచ్చారు:

"దైవసాక్షి! నమాజ్, జకాత్‌ల మధ్య విచక్షణ చేసే ప్రతి వ్యక్తితో నేను యుద్ధం చేస్తాను. జకాత్ సంపద హక్కు. (అంటే సంపద కలిగినవారు దానిమీద పేదల ఆర్థిక



హక్కు అయిన జకాత్‌ని విధిగా చెల్లించాలి.) దైవసాక్షి! వారు గనక దైవప్రవక్త (స) కాలంలో ఇస్తూ ఉండిన సంపద నుండి ఒంటె తాడయినా సరే ఇవ్వడానికి నిరాకరిస్తే నేను వారితో తప్పకుండా పోరాడుతాను".

ఆ తరువాత హజ్రత్ ఉమర్ (రజి) మాట్లాడుతూ "దైవసాక్షి! దేవుడు సత్యావ గాహన కోసం అబూబకర్ హృదయకవాటాలు తెరిచాడు. అబూబకర్ దృక్పథమే సరైన దని నేను ఆ తరువాత గ్రహించాను" అని అన్నారు. (సహీ బుఖారి)

దైవప్రవక్త (సల్లం) హజ్రత్ ముఆజ్ (రజి)ని యమన్ రాష్ట్రానికి గవర్నర్‌గా నియమించి పంపుతూ ఇలా ఉపదేశించారు:

"ముఆజ్! నీవిప్పుడు క్రైస్తవులుండే ప్రాంతానికి వెళ్తున్నావు. అందువల్ల మొట్ట మొదట నీవు వారిని ఏకేశ్వరారాధన వైపుకు పిలువాలి. వారు గనక ఏకేశ్వరుడయిన అల్లాహ్‌ను ధృవీకరించడం జరిగితే, ఆయన వారికి రోజుకు అయిదు సార్లు విధిగా నమాజు చేయాలని ఆదేశించాడని చెప్పు. దీనికి వారు అంగీకరిస్తే వారు తమ సిరి సంపదల నుండి విధిగా జకాత్ తీసి చెల్లించాలని ఆయన ఆజ్ఞాపించాడని తెలియ జెయ్యి. ఈ జకాత్ సొమ్ము వారిలో ధనికుల నుండి వసూలు చేసి పేదలకు పంచబడు తుంది. ఈ ఆదేశాన్ని కూడా శిరసావహించి జకాత్ చెల్లించడానికి అంగీకరిస్తే వారి దగ్గర జకాత్ వసూలు చేయాలి. అయితే ఒక విషయం బాగా గుర్తుంచుకో. ప్రజల దగ్గరుండే అతి శ్రేష్ఠమైన వస్తువుల జోలికి మాత్రం పోకూడదు." (బుఖారి, ముస్లిం)

# 26. జకాత్ విధింపుకు షరతులు

జకాత్ ధనవంతుడైన ప్రతి ముస్లిం ప్రతి సంవత్సరం తప్పనిసరిగా పాటించవలసిన విధి (Obligatory duty). జకాత్ విధిని నిరాకరించిన మనిషి కాఫిర్(అవిశ్వాసి) అవుతాడు. విధి (వాజిబ్) అని తెలిసికూడా జకాత్ చెల్లించని ముస్లిం పాపాత్ముడిగా, పరమదుర్మార్గుడిగా పరిగణించబడతాడు. జకాత్ విధి (వాజిబ్) కావడానికి ఏడు షరతులు ఉన్నాయి. ఈ ఏడు షరతులు పూర్తి అయితే జకాత్ చెల్లించడం విధి (వాజిబ్) అవుతుంది. ఇందులో ఏ ఒక్క షరతు పూర్తి కాకపోయినా జకాత్ చెల్లించడం విధి కాజాలదు.

దైవప్రవక్త (స) ఇలా అన్నారు: "జాగ్రత్త! సంపద కలిగివున్న అనాథకు సంరక్షకునిగా ఉన్నవాడు ఆ ధనంతో ఏదైనా వ్యాపారం చేయాలి. అంతేగాని ఆ బాలుని ధనమంతా జకాత్ చెల్లింపుకే హరించిపోయేలా దాన్ని అలాగే ఉంచకూడదు." (బైహఖీ, తిర్మిజి)

జకాత్ విధింపు కోసం మూలధన పరిమితి అంటే జకాత్ చెల్లింపు విధి (వాజిబ్) కావడానికి ధర్మశాస్త్రం (షరీఅత్) నిర్ణయించిన కనీస మూలధనం అని అర్థం. దీన్ని "నిసాబె జకాత్" అని కూడా అంటారు. నిసాబ్‌అంత లేక నిసాబ్‌కు మించిన మూలధనం కలిగివున్న వ్యక్తిని "సాహెబె నిసాబ్" అంటారు.

జకాత్ విధింపుకు కావలసిన కనీస మూలధనం ఎంత ఉండాలన్న విషయాన్ని దైవప్రవక్త (స) ఇలా తెలిపారు: "అయిదు ఊఖియాలు కన్నా తక్కువ వెండిపై జకాత్ లేదు. ఐదు కంటే తక్కువ ఒంటెలపై కూడా జకాత్ లేదు. అలాగే అయిదు వసఖ్‌ల

కన్నా తక్కువ ఖర్జూరం లేక ధాన్యంపై కూడా జకాత్ లేదు." (బుఖారి)

హజ్రత్ షాహ్ వలియుల్లాహ్ (రహ్మ) ఈ హదీసులో ప్రస్తావించబడిన కొలమానాలను గురించి వివరిస్తూ ఇలా అన్నారు: "ఆ కాలంలో అయిదు 'వసఖ్'లు అంటే ముప్ఫయి మణుగుల (దాదాపు 609 కిలోగ్రాముల) ఖర్జూర పండ్లు. అవి ఒక చిన్న కుటుంబం ఏడాదిపాటు గడపటానికి సరిపోయేవి. ఇదే విలువ అయిదు 'ఊఖీ'ల, అంటే రెండొందల దిర్హమ్‌ల వెండికి (లేక) అయిదు ఒంటెల ధరకు సమానంగా ఉండేది. అందువల్ల ఈ పరిమాణమంత సంపద కలిగివుండే వ్యక్తిని ధనికుడిగా పరిగణిస్తూ అతనిపై జకాత్‌ని విధి (వాజిబ్)గా నిర్ణయించడం జరిగింది.

**వెండి, బంగారాల పరిమితి (నిసాబ్)** : జకాత్ విధింపుకు బంగారం పరిమితి (నిసాబ్) ఇరవై 'మిస్ఖాల్'లు. దీని బరువు అయిదు తులాల రెండున్నర మాషాల (దాదాపు 5-1/2 తులాలు= 65 గ్రాముల)కు సమానం. అంటే కనీసం అంత పరిమాణంలో ఎవరి దగ్గరైనా బంగారం ఉండి, ఒక సంవత్సరం గడచిపోతే అతనిపై జకాత్ చెల్లింపు విధి అవుతుందన్న మాట. అంతకంటే తక్కువ బంగారంపై జకాత్ లేదు.

కొందరు ధర్మవేత్తల అభిప్రాయం ప్రకారం బంగారం పరిమితి (నిసాబ్) 7-1/2 తులాలు (అంటే దాదాపు 87 గ్రాములు). ఈ విషయమే ప్రసిద్ధి చెందింది. "బెహిష్తి జేవర్" గ్రంథంలో కూడా బంగారం పరిమితి 7-1/2 తులాలేనని పేర్కొనబడింది.

వెండిపరిమితి రెండొందల దిర్హమ్‌లు. దీని బరువు ముప్ఫయి ఎనిమిది తులాల అయిదున్నర మాషాల (దాదాపు 38-1/2 తులాలు= 455 గ్రాముల)కు సమానమవుతుంది. కనీసం అంత పరిమాణంలో ఎవరి దగ్గరైనా వెండి ఉండి, ఒక సంవత్సరం గడచిపోతే అతనిపై జకాత్ చెల్లింపు విధి అవుతుంది. అంతకంటే తక్కువ వెండిపై జకాత్ లేదు.

కొందరు ధర్మవేత్తల అభిప్రాయం ప్రకారం వెండి పరిమితి (నిసాబ్) 52-1/2 తులాలు (అంటే దాదాపు 609 గ్రాములు). ఈ విషయమే ఎక్కువగా ప్రసిద్ధి చెందింది. "బెహిష్తి జేవర్" గ్రంథంలో కూడా వెండి పరిమితి 52-1/2 తులాలనే ఉంది.

అయితే వెండి, బంగారాలలో ఏ ఒక్కదాని నిసాబ్ పూర్తి అయినా దాని ప్రకారమే లెక్క కట్టి జకాత్ చెల్లించాలన్న విషయాన్ని దృష్టిలో పెట్టుకోవాలి. ఉదాహరణకు- ఈనాడు ఎవరి దగ్గరైనా పన్నెండు వేల (12,000/-) రూపాయలు నగదుంటే అతనిపై జకాత్ చెల్లింపు విధి అవుతుంది. కారణం పన్నెండు వేల రూపాయలు బంగారం పరిమితి (నిసాబ్) విలువకు (అంటే 87 గ్రాముల బంగారం ధరకు) సమానం కాకపోయినా, ఆ పైకం వెండి పరిమితి (నిసాబ్) విలువకు (609 గ్రాముల వెండి ధరకు) మించిపోతుంది.

హజ్రత్ ఉమ్మెసల్మా (రజి) కథనం: నేను కడియాలు ధరించేదాన్ని. (అంచేత) "దైవప్రవక్తా! ఇవి కూడా నిధి (ఖజానా) కిందికి వస్తాయా?" అనడిగాను. అప్పుడాయన ఇలాఅన్నారు- "జకాత్ చెల్లింపుకు అవసరమైనంత పరిమాణానికి చేరుకున్న ధనం ఉంటే దానిపై జకాత్ కూడా ఇస్తుంటే ఆ ధనం నిధి కిందికి రాదు." (అబూదావూద్)

"దైవప్రవక్త (సల్లం) సన్నిధికి ఓసారి యమన్ దేశానికి చెందిన ఒక స్త్రీ వచ్చింది. ఆ స్త్రీ వెంట ఆమె కూతురు కూడా ఉంది. ఆ అమ్మాయి చేతులకు బరువైన రెండు బంగారు మురుగులు ఉన్నాయి. దైవప్రవక్త (స) ఆ స్త్రీని ఉద్దేశించి 'నీవు ఈ బంగారు



మురుగుల మీద జకాత్ చెల్లిస్తున్నవా?' అని అడిగారు. అందుకామె లేదండీ అన్నది. దానిపై దైవప్రవక్త (స) 'అయితే ప్రళయదినాన దేవుడు దీని పర్యవసానంగా నీకు అగ్ని మురుగులు తొడిగించడం ఇష్టమేనా?' అని అడిగారు.

(ఈ మాటలు వినగానే) ఆ స్త్రీ ఆ రెండు బంగారు మురుగులు తీసి దైవప్రవక్త (సల్లం)కు ఇచ్చివేస్తూ 'దేవుని ప్రసన్నత, ఆయన ప్రవక్త (స) ప్రీతి కోసం నేను వీటిని మీకు సమర్పించుకుంటున్నాను' అని అన్నది." (తిర్మిజి, నసాయి)

ఒకసారి దైవప్రవక్త (స) సన్నిధికి ఇద్దరు మహిళలు వచ్చారు. వారి చేతులకు బంగారు గాజులు ఉన్నాయి. దైవప్రవక్త (స) వాటిని చూసి "ఈ బంగారు గాజులపై మీరు జకాత్ చెల్లిస్తున్నారా?" అని అడిగారు. దానికి వారు "లేదు దైవప్రవక్తా!" అని అన్నారు. అప్పుడు దైవప్రవక్త (స) "మరి (పరలోకంలో) వీటికి బదులు మీకు అగ్ని గాజులు తొడిగించడాన్ని మీరు ఇష్టపడతారా?" అని ప్రశ్నించారు. దానికి వారు "ఇష్టపడం దైవప్రవక్తా!" అన్నారు. అప్పుడు దైవప్రవక్త (స) "అయితే వీటిపై జకాత్ చెల్లించండి" అన్నారు. (తిర్మిజి)

ఇబ్నె హజమ్ తన గ్రంథం "ముహల్లీ" ప్రకారం రెండవ ఖలీఫా హజ్రత్ ఉమర్ (రజి) తన గవర్నర్ హజ్రత్ అబూమూసా అష్అరీ (రజి)కి పంపిన ఒక ఉత్తర్వులో "తమ ఆభరణాల మీద జకాత్ చెల్లించాలని ముస్లిం స్త్రీలను ఆజ్ఞాపించు" అని ఆదేశించారు.

హజ్రత్ అబ్దుల్లా బిన్ మస్‌వూద్ (రజి)ని ఒకతను "ఆభరణాలను గురించి ఆజ్ఞ ఏమిటీ?" అని అడిగాడు. దానికి ఆయన "అవి రెండొందల దిర్హమ్‌లకు చేరుకుంటే వాటిపై జకాత్ ఉంది" అని సమాధానమిచ్చారు.

ఇదే విషయాన్ని గురించి చెప్పిన సహాబీలలో ఇబ్నె అబ్బాస్ (రజి), అబ్దుల్లా బిన్ అమ్ర్ బిన్ ఆస్ (రజి), హజ్రత్ ఆయిషా (రజి); తాబయీలలో సయీద్ బిన్ మసీబ్ (రహ్మలై), సయీద్ బిన్ జబీర్ (రహ్మలై), జుహ్రీ; ఇమాములలో సుఫ్యాన్ సౌరి (రహ్మలై), అబూహనీఫా (రహ్మలై), వారి అనుచరులు ఉన్నారు. వీరంతా ఇదే అభిప్రాయాన్ని వెలిబుచ్చారు."

## 27. జకాత్ స్వీకార అర్హులు-అనర్హులు

జకాత్ తీసుకోవడానికి అర్హులు ఖుర్ఆన్ తెలియజేసింది. వారిని గురించి వివరంగా పేర్కొనవలసిఉంటుంది. జకాత్‌కు అర్హులెవరో తెలిసిన తర్వాత మిగిలినవారంతా అనర్హులని చెప్పడానికి వీలులేదు. ఆ అనర్హుల్ని గురించి కూడా వివరంగా పేర్కొనవలసిఉంటుంది.

### అర్హులు

"అసలీ దానధర్మాలు (జకాత్) అగత్యపరులకు-1, ఆత్మాభిమానులైన నిరుపేదలకు-2, వాటిని వసూలుచేసే ఉద్యోగుల కోసం-3, హృదయాలు చూరగొనడానికి-4, బానిసల విముక్తికి-5, రుణగ్రస్తుల రుణభారం తగ్గించడానికి-6, దైవమార్గంలో వినియోగించడానికి-7, (నిర్ధనులైన) బాటసారులకు-8 మాత్రమే కేటాయించబడ్డాయి. ఇది దేవుని వైపున నిర్ణయించబడిన విధి. దేవుడు సర్వం ఎరిగినవాడు, మహా వివేకవంతుడు." (ఖుర్ఆన్-9:60)

**(1) అగత్యపరుడు (ఫకీర్)** : ధనికుడు అనే పదానికి వ్యతిరేక భావంలో ఇది ఉపయోగించబడింది. షరీఅత్ పరిభాషలో 'ఫకీర్' అంటే జకాత్ విధింపుకు కావలసినంత సంపద లేనివాడని అర్థం. ఇటు జకాత్ విధింపుకు అవసరమైన ఆస్తిపాస్తులుగాని, అటు జీవనోపాధి కోసం పనిచేసే శక్తిగాని, యోగ్యతగాని, అవకాశంగాని లేని వ్యాధిగ్రస్తులు, వికలాంగులు, అనాథలు, వితంతువులు వగైరా వ్యక్తులందరూ ఈ పద్దు కిందికి వస్తారు.

**(2) ఆత్మాభిమాని అయిన నిరుపేద (మిస్కీన్):-** మిస్కీన్ అంటే ఎంత కష్టపడినా సరిగా ఇల్లు కూడా గడవని, ఒక్కొక్కసారి ఒకపూట తింటే మరోపూట పస్తుండే, ఎవరి ముందూ చేయి జాపడానికి ఇష్టపడని ఆత్మాభిమానంగల నిరుపేద అని అర్థం.

మిస్కీన్ గురించి దైవప్రవక్త (స) ఇలా అభివర్ణించారు: "అతను తన అవసరాలకు సరిపడ సంపద పొందలేనివాడు; ప్రజలు ఆర్థిక సహాయం చేయడానికి అవకాశం లేకుండా (తన ఆత్మాభిమానం వల్ల) గుర్తించబడని వాడు; ప్రజల ముందు నిలబడి (ఆర్థిక సహాయం) అడగనివాడు." (బుఖారి, ముస్లిం)

**(3) జకాత్ వసూలు చేసే ఉద్యోగి (ఆమిల్ సదఖా):-** ఇస్లామీయ ప్రభుత్వం జకాత్ వసూలు చేయడానికి నియమించిన ఉద్యోగి ఎంత స్థితిపరుడైనా సరే అతని జీతం జకాత్ ధనం నుండే ఇవ్వడం జరుగుతుంది.

**(4) హృదయాలను చూరగొనడానికి (తాలిఫ్ ఖులూబ్):-** అతి ముఖ్యమైన ధార్మిక, జాతీయ (మిల్లత్‌కు సంబంధించిన) ప్రయోజనాల కోసం వ్యక్తుల హృదయాలను ఆకట్టుకోవడానికి వారిక్కూడా జకాత్ ఇవ్వచ్చు. హనఫీ, మాలికీ దృక్పథాల ప్రకారం ఇప్పుడీ పద్దు లేదు. మరికొందరు ఇమామ్‌లు, షరీఅత్‌వేత్తల దృక్పథం ప్రకారం ఈ పద్దు యధాతథంగా ఉంది. అవసరం రీత్యా ఎప్పుడైనా ఈ పద్దులో జకాత్ ధనాన్ని వినియోగించవచ్చు.

ఈ చివరి దృక్పథం ప్రకారం కొత్తగా ఇస్లాం స్వీకరించినవారు ఇస్లాంలో స్థిరంగా ఉండేందుకు వారికి ఈ పద్దు కింద జకాత్ పైకం ఇవ్వచ్చు. అలాగే ఇస్లాంవ్యతిరేక శక్తుల విరోధభావం తగ్గించడానికి అవసరమైతే జకాత్ పైకం ఖర్చు పెట్టవచ్చు.

**(5) బానిస విముక్తి (రిఖాబ్):-** బానిసత్వం నుంచి విముక్తి కలిగించడానికి జకాత్ పైకం ఖర్చుపెట్టవచ్చు. ఇంత డబ్బిస్తే బానిసత్వం నుంచి విముక్తి కలిగించడం జరుగుతుందని యజమానితో ఒప్పందం చేసుకునే బానిసను షరీఅత్ పరిభాషలో "మకాతబ్" అంటారు. ఇలాంటి బానిసక్కూడా జకాత్ పైకం ఇవ్వచ్చు. ఈనాడు బానిసత్వం ఆచారం లేనందువల్ల జైలుశిక్ష అనుభవించే అమాయకుల్ని జైలు నుండి విడిపించడానికి జకాత్ పైకం ఖర్చు పెట్టవచ్చని కొందరు ధర్మవేత్తలు అన్నారు.

**(6) రుణభారంతో సతమతమవుతున్న రుణగ్రస్తుడు (గారిమ్):-** రుణభారం క్రింద నలుగుతూ తన జీవితావసరాల నుండి మిగిల్చి అప్పు తీర్చలేని రుణగ్రస్తునికి కూడా జకాత్ నుండి ఆర్థికసహాయం అందజేయవచ్చు. అంతేకాకుండా ఆస్తి ధ్వంసానికి గురయినవారు, భారీ జరిమానా విధించబడినవారు, వ్యాపారంలో దీవాళా తీసినవారు, ప్రకృతి విపత్తులు సంభవించి సర్వస్వం కోల్పోయినవారు కూడా ఈఖాతా క్రిందికి వస్తారు. అయితే వ్యభిచారం, మద్యసేవనం, దుబారా ఖర్చులతో అప్పులపాలయిన మనిషికి జకాత్ ఇవ్వడం మంచిది కాదని ధర్మవేత్తలు అన్నారు.



**(7) నిర్ధనులైన బాటసారి (ఇబ్నుస్సబీల్):-** ప్రయాణంలో ఉన్నవారు ఎవరైనా సరే, గృహజీవితంలో వారు ఎంత ఆనందంగా గడిపేవారైనా, జకాత్ విధింపుకు అవసరమైన సంపద కలిగిన స్థితిపరులైనా ప్రయాణావస్థలో ఒక్కొక్కసారి హఠాత్తుగా ఏదైనా ఆపదకు గురయి ఆర్థిక ఇబ్బందులకు గురయ్యే అవకాశం ఉంటుంది. అలాంటి బాటసారులను ఆదుకోవడానికి కూడా జకాత్ పైకం ఇవ్వచ్చు.

**(8) దైవమార్గంలో (ఫీసబీలిల్లాహ్):-** పైసూక్తిలోని పద్దులలో ఒకటి "దైవమార్గంలో" అని ఉంది. అంటే దైవమార్గంలో జరిపే పోరాటం అని అర్థం. ధర్మసంస్థాపన కోసం, ధర్మప్రచారం కోసం చేసే ప్రతిపనీ "దైవమార్గం" పద్దు క్రిందికే వస్తుంది. "ఫీసబీలిల్లాహ్" (దైవమార్గంలో) అనే పదం చాలా విస్తృతమైన అర్థంతో కూడుకున్నది.

జకాత్‌లో వచ్చిన ఒంటెలను హజ్‌యాత్రికులకు ఇవ్వచ్చని దైవప్రవక్త (స) అనుమతించినట్లు కొన్ని హదీసుల ద్వారా తెలుస్తోంది. ఈ కారణంగానే హనఫీ ఫిఖ్హావేత్తలలో ఇమామ్ ముహమ్మద్, ఇమామ్ అబూయూసుఫ్ , హసన్ (రహ్మాలై) ప్రభృతులు 'దైవమార్గం' పద్దులో హాజీల ప్రయాణానికి వాహనాల ఏర్పాటును ధర్మసమ్మతం చేశారు. "షామీ" రెండవ భాగం, 25వ పేజీలో ధర్మవిద్య నేర్చుకునే విద్యార్థుల్ని కూడా 'దైవమార్గం' పద్దులో చేర్చారు.

అల్లామా ఆలూసీ (రహ్మా) తన గ్రంథం 'రూహుల్‌మాని'లో "దైవమార్గంలో" అనే పదానికి రాసిన వ్యాఖ్యానంలో హనఫియా దృక్పథాన్ని ఉటంకిస్తూ ఇలా పేర్కొన్నారు: "ఇందులో విద్యార్థులనే భావం కూడా ఉంది. 'ఫతావా జహీరియా'లో ఈ పద్దు విద్యార్థుల వరకే పరిమితం చేయబడింది. 'అల్‌బదాయివుజ్జాయి'లో దీని వ్యాఖ్యానం ఇలా ఉంది- ఈ పద్దులో దేవునికి సన్నిహితం చేసే పనులన్నీ ఉన్నాయి. కనుక దేవుని విధేయత, సత్కార్యాల మార్గాలలో చేసే ప్రయత్నాలన్నీ ఈ పద్దు క్రిందికి వస్తాయి."

మౌలానా సులైమాన్ నద్వీ (రహ్మాలై) తన గ్రంథం "సీరతున్నబీ" అయిదో భాగంలో "ఫీసబీలిల్లాహ్" పదాన్ని వ్యాఖ్యానిస్తూ ఇలా వ్రాశారు: "చాలామంది ఫిఖ్హావేత్తలు ఫీసబీలిల్లాహ్ (దైవమార్గంలో) అంటే దైవమార్గంలో జరిపే పోరాటం అని మాత్రమే అర్థం తీసుకున్నారు. కాని ఇలా ఒక హద్దు ఏర్పరచడం సమంజసంగా తోచడం లేదు. పైన 'దైవమార్గంలో నిమగ్నులైపోయి, జీవనోపాధి కోసం ధరణిపై తిరిగే అవకాశంలేని నిరుపేదలకు (సహాయం చేయండి)' (2:273) అనే సూక్తి వచ్చింది. ఇక్కడ 'దైవమార్గంలో' అంటే జిహాద్ కాదన్న భావం అందరూ అంగీకరించిన విషయమే. ఇక్కడ 'దైవమార్గంలో' అంటే ధర్మానికి సంబంధించిన ప్రతి పనీ, ప్రతి సత్కార్యమూ అని అర్థం."

"అమారతె షరిఅ" (బిహార్) నాయకులు మౌలానా అబ్దుస్సమద్ రహ్మానీ గారు కూడా "కితాబుల్ ఉష్ వ జ్జకాత్" అనే తన గ్రంథంలో 'ఫీసబీలిల్లాహ్' పద్దు క్రింద 'దైవమార్గంలో నిమగ్నులైపోయిన వారిని చేర్చారు.

"ఒకసారి ఒక వ్యక్తి దైవప్రవక్త (సల్లం) సన్నిధికి వచ్చి జకాత్ ధనం నుండి కొంత తనక్కూడా ఇవ్వమని అడిగాడు. దైవప్రవక్త (సల్లం) అతనికి సమాధానమిస్తూ 'జకాత్ వినియోగ పద్దులకు సంబంధించిన (ఖుర్‌ఆన్‌లోని) నిర్ణయాన్ని దేవుడు ఏ ప్రవక్తకూ, ఏ ప్రవక్తేతరునికీ వదలిపెట్టలేదు. ఆయన స్వయంగా (ఖుర్‌ఆన్‌లో) జకాత్ పద్దులను నిర్ణయించాడు. దాన్ని ఎనిమిది భాగాలు (పద్దులు)గా నిర్ణయించాడు. నీవు ఈ పద్దు

లలో ఏదైనా పద్దు క్రిందికి వస్తే నేను తప్పకుండా నీకు జకాత్ పైకం కొంత ఇవ్వ గలను' అని అన్నారు." (అబూదావూద్)

"ముఖ్యంగా దైవకార్యాల్లో నిమగ్నులయిపోయి, జీవనోపాధి కోసం ధరణిపై తిరిగే అవకాశంలేని నిరుపేదలకు (చేయండి). వారి స్థితిగతులు ఎరగనివారు వారి ఆత్మాభిమానం చూసి వారు స్థితిపరులేనని భావిస్తారు. కాని వారి ముఖాలు చూస్తే మీరు వారి వాస్తవస్థితి గ్రహిస్తారు. వారు (సిగ్గు వదలి) ప్రజల వెంటపడి అర్థించే (యాచకుల్లాంటి) వారు కాదు. వారి కోసం మీరు చేసే ఏఖర్చయినా దేవునికి తెలియకుండా ఉండదు." (ఖుర్ఆన్-2:273)

ఒక హదీసులో దైవప్రవక్త (సల్లం) "తినడానికి తిండి ఉన్నవాడు, సంపాదించే శక్తి ఉన్నవాడు జకాత్ తీసుకోకూడదు" అని అన్నారు. అయితే మరొక హదీసులో "అర్థించే వాడు గుర్రమెక్కి వచ్చినా అది అతని హక్కు" అని చెప్పారు.

## అనర్హులు

దైవప్రవక్త (సల్లం) ఇలా తెలిపారు: "ధనికుడికి జకాత్ ఇవ్వడం ధర్మసమ్మతం కాదు, ఈ అయిదు రకాల వ్యక్తులకు తప్ప- 1. దైవమార్గంలో పోరాడే యోధుడు; 2. దానధర్మాల వసూలు, పంపిణీ లాంటి పనులు చేసేవాడు; 3. రుణగ్రస్తుడు; 4. డబ్బుతో సదఖా (దానం) వస్తువులు కొనేవాడు; 5. తన పొరుగున పేదవాడు కలిగివున్న వ్యక్తి. ఆ పేదవాడికి సదఖా లభిస్తే అతను దాన్ని తన ధనికుడైన పొరుగువానికి కానుకగా ఇచ్చే వ్యక్తి." (ముఅత్తా-ఇమామ్‌మాలిక్)

ఇమామ్ మాలిక్ (రహ్మలై) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఇలా చెప్పారు: "సదఖా ప్రజలకు చెందిన సొత్తు అయినందున సదఖా (జకాత్) సొమ్ము ముహమ్మద్ (సల్లం) సంతతికి ఇవ్వడం ధర్మసమ్మతం కాదు." (ఆసాన్ ఫిఖ్హా రెండో భాగం)

# 28. భూ ఉత్పత్తులపై జకాత్

జకాత్ వ్యవహారంలో భూ ఉత్పత్తులు రెండు రకాలు ఉన్నాయి. 1-వృక్షసంపద, 2-ఖనిజ సంపద. ఈ రెండు సంపదల మూలధన పరిమితి (నిసాబ్), జకాత్ రేటు వేర్వేరుగా ఉంది. ముందుగా మనం ఇక్కడ వృక్షసంపదను గురించి తెలుసుకుందాం.

## ఉష్ర్ (వృక్షసంపదపై జకాత్)

"ఉష్ర్" అంటే శాబ్దిక భావం పదో వంతు. షరీఅత్ పరిభాషలో ఉష్ర్ అంటే కొన్ని పంట భూముల ఉత్పత్తులపై పదో వంతుగా, మరికొన్ని పంట భూములపై ఇరవయ్యో వంతుగా విధించబడిన "ఉత్పత్తి సంబంధిత జకాత్" అని అర్థం. ప్రకృతి సంబంధమైన వర్షాలు, నదులు, వాగులు, చెరువుల మూలంగా పండే భూముల్లోగాని లేదా నదీ తీరాల తేమ కారణంగా పండే చిత్తడి నేలల్లోగాని ఉత్పత్తి అయ్యే ఫలసాయం నుంచి పదో భాగాన్ని ఉష్ర్‌గా చెల్లించడం విధి అవుతుంది. అలాగే కృత్రిమ కాలువలు, జలాశయాలు, సాధారణ బావులు, గొట్టపు బావుల మూలంగా పండే భూముల్లోగాని, లేదా మరేదైనా శ్రమ లేక డబ్బు ద్వారా లభించే నీటి వల్ల పండే భూముల్లోగాని ఉత్పత్తి అయ్యే ఫలసాయం అయితే ఇరవయ్యో భాగాన్ని ఉష్ర్‌గా చెల్లించాలి.



**ఉష్ర్ ఆదేశం** : భూసంబంధ ఉత్పత్తులపై ఉష్ర్ తప్పక చెల్లించాలి. ఉదాహరణకు-ధాన్యం, అపరాలు, వేరుసెనగ, పండ్లు, ఫలాలు, పుష్పాలు, కాయగూరలు, ఆముదాలు, తేనె మొదలైనవి. ఇలాంటి ఫలసాయాలపై 'ఉష్ర్' చెల్లించాలని ఖుర్ఆన్ స్పష్టంగా ఆదేశించింది.

అహ్లెహదీస్‌కు చెందిన కొందరు ధర్మవేత్తలు దైవప్రవక్త (సల్లం) కాలంలో గోధుములు, యవలు, ఖర్జూరపండ్లు, ద్రాక్షాపండ్లు మొదలైన వాటిపై మాత్రమే ఉష్ర్ చెల్లింపు ఉండేదని, నిల్వచేయడానికి వీలుకాని కూరగాయలు, ఆకుకూరలు లాంటి వాటిపై ఉష్ర్ చెల్లింపు ఉండేదికాదని అంటారు. ఇమామ్ మాలిక్, ఇమామ్ షాఫయి (రహ్మలై)ల దృక్పథం ప్రకారం ఎండిపోయి నిల్వచేయడానికి వీలయిన ఆహార వస్తువులపై మాత్రమే ఉష్ర్ చెల్లింపు విధి అవుతుంది. కాని ఇమామ్ అబూహనీఫా (రహ్మలై) దృక్పథం ప్రకారం ఉద్దేశ్యపూర్వకంగా పండించిన, అమ్మడానికి వీలైన భూఉత్పత్తులన్నిటి మీదా ఉష్ర్ చెల్లించవలసి ఉంటుంది. ఈ దృక్పథాన్ని ఖుర్ఆన్‌లోని ఈ సూక్తులు కూడా ధృవపరుస్తున్నాయి:

"విశ్వాసులారా! మీరు సంపాదించిన దానిలోనూ, మేము నేలనుండి మీ కోసం ఉత్పత్తిచేసిన దానిలోనూ శ్రేష్ఠమైనదాన్ని దైమార్గంలో ఖర్చుచేయండి." (2:267)

"పందిళ్ళ మీద ప్రాకే, ప్రాకని చెట్లతో సహా రకరకాల తోటలు, తోపులను సృష్టించిన వాడు ఆ దేవుడే. వివిధ రకాల ఆహార పదార్థాలు ఉత్పత్తి చేసే పొలాలు, ఖర్జూరపు చెట్లను సృష్టించినవాడు కూడా ఆయనే. ఆయనే ఆలివ్ (జైతూన్), దానిమ్మ వృక్షాలను సృజిస్తున్నాడు. వాటి పండ్లు చూడటానికి ఆకారంలో ఇంచుమించు ఒకేలా ఉన్నప్పటికీ రుచిలో వ్యత్యాసం ఉంటుంది. అవి పంటకు వచ్చినప్పుడు వాటి పండ్లు హాయిగా తినండి. దాంతోపాటు పంట కోతకు వచ్చినప్పుడు అందులో నుంచి దేవుని హక్కు (పేదల ఆర్థికహక్కు) కూడా నెర వేర్చండి. దుబారా చేయకండి. దుబారా చేసేవారిని దేవుడు ప్రేమించడు." (6:141)

హాఫిజ్ ఇబ్నెహజర్ (రహ్మలై) 'తల్ఖీసుల్‌జబీర్' గ్రంథంలో దోసకాయలు, గుమ్మడి కాయలు, దానిమ్మపండ్లు, కూరగాయల మీద ఉష్ర్ లేదని దైవప్రవక్త (సల్లం) చెప్పిన ఒక హదీసును ఉల్లేఖించిన తరువాత ఈ హదీసు బలహీనమైనదని, దాని ప్రమాణంలో కంటిన్యూటి లేదని పేర్కొన్నారు. ఈ సందర్భంలో ఆయన తిర్మిజీ (రహ్మలై) అభిప్రాయాన్ని కూడా ఇలా ఉదాహరించారు: "దైవప్రవక్త (సల్లం) కూరగాయలు, తీగెసొగులు మొదలైన వాటి విషయంలో చెప్పిన ఏ హదీసు కూడా సరిగా ఉల్లేఖించబడలేదు."

ఉష్ర్ (భూసంబంధ ఉత్పత్తులపై చెల్లించే జకాత్)ను గురించి దైవప్రవక్త (స) ఉపదేశించిన ఈ క్రింది హదీసులు చూడండి:

"వర్షం లేక సెలయేరుల (నదులు, వాగుల) ద్వారా నీరు పొందే భూముల (ఉత్పత్తుల)పైగాని, స్వతహాగా (నదుల దగ్గర్లో ఉండటం వల్ల) నీరు పొందే భూముల (ఉత్పత్తుల)పైగాని ఉష్ర్ చెల్లింపు విధి (వాజిబ్) అవుతుంది. బావుల నుండి తోడటం ద్వారా నీరు పొందే నేలల (ఉత్పత్తుల)పై అర్ధ 1/2 ఉష్ర్ చెల్లింపు విధి (వాజిబ్) అవుతుంది." (బుఖారి, బైహఖి)

"నదులు, వర్షాల వల్ల పండిన పంటపై పదో వంతు, మోటబావి ద్వారా పండే పంటపై ఇరవయ్యే వంతు ఉష్ర్ (జకాత్) ఉంది." (ముస్లిం)

తేనెకు సంబంధించిన జకాత్ గురించి ఆయన ఇలా ప్రవచించారు:

“తేనె (సంపద)పై ఉష్ర్ చెల్లించండి.” (బైహఖి, తిర్మిజి)

“పది మిష్కుల తేనె (సంపద)పై ఒక మిష్క్ తేనె ఇవ్వడం విధి.” (తిర్మిజి)

**ఖనిజ సంపదపై జకాత్** ఉంది. భూమిలో లభించే పెట్రోలు, సహజ వాయువు ల్లాంటి సున్నితమైన పల్చటి ఖనిజాలు; అగ్నికి మెత్తబడని వజ్రాలు వగైరా వస్తుసంపదలు తప్ప మిగతా ఖనిజ సంపదలో అయిదో వంతు జకాత్ చెల్లించవలసి ఉంటుంది.

అయితే ఇమామ్ అహ్మద్ బిన్ హంబల్ (రహ్మ) ఇలా అన్నారు: “లోహ సంబంధమైన ఖనిజాలైనా, (గంథకంలాంటి) అసలు (స్థిర) స్థితిలో ఉండే ఖనిజాలైనా లేక పెట్రోలు, పాదరసం లాంటి) ద్రవరూప ఖనిజాలైనా సరే ‘నిసాబ్’ సరిపడే పరిమాణంలో ఉంటే, అవి ప్రైవేటు యాజమాన్యంలో ఉంటే అన్ని రకాల ఖనిజ సంపదలపై రెండున్నర శాతం చొప్పున జకాత్ చెల్లించడం విధి అవుతుంది.” (ఆసాన్‌ఫిఖ్హా)

హజ్రత్ అబూహురైరా (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ఇలా తెలిపారు: పూర్వ కాలంలో ఒకతను మరొకని దగ్గర కొంతభూమి కొన్నాడు. ఆ భూమిలో ఒక మట్టిముంత బయల్పడింది. అందులో బంగారం ఉంది. భూమిని కొన్నవాడు అమ్మినవాడితో “నీ దగ్గర కొన్న స్థలంలో ఓ ముంతలో బంగారం బయల్పడింది. ఇదిగో ఈ బంగారం నీదే, తీసుకో. నేను భూమిని మాత్రమే నీ దగ్గర కొన్నాను, అందులోని బంగారాన్ని కొనలేదు” అని అన్నాడు. భూమిని అమ్మినవాడు (ఆ బంగారాన్ని తీసుకోవడానికి నిరాకరిస్తూ) “నేను నీకు భూమిని, అందులో ఉన్నవాటిని కూడా అమ్మేశాను” అని అన్నాడు.

చివరికి వాళ్ళిద్దరు ఈ వివాదాన్ని ఒకతని దగ్గరకు తీసికెళ్ళారు. అతను వారిద్దరి మాటలు విని “మీకు పిల్లలు ఉన్నారా?” అని అడిగాడు. ఆ ఇద్దరిలో ఒకతను “నాకో కొడుకున్నాడ”ని చెప్పాడు. రెండోవాడు “నాకొక కూతురుంది” అన్నాడు. అప్పుడా మధ్యవర్తి “అయితే ఆ ఇద్దర్ని కలిపి పెళ్ళిచేయండి. ఈ బంగారాన్ని వాళ్ళిద్దరి కోసం ఖర్చుచేయండి. కొంతదానం కూడా చేయండి” అని తీర్పిచ్చాడు. (బుఖారి, ముస్లిం)

## 29. ఉపవాసవ్రతాల ప్రాముఖ్యం

రమజాన్ నెల వచ్చిందంటే ముస్లింలు అధిక సంఖ్యాకులుగా ఉండే ప్రాంతాలలో ఆ నెలంతా దాదాపు పండుగ వాతావరణం నెలకొంటుంది. పిల్లలు సైతం ఉపవాసాలు పాటించడానికి ఆరాటపడతారు. రమజాన్ నెలకు ఇంత ప్రాముఖ్యం రావడానికి కారణం ఆ నెలలో ఖుర్ఆన్ అవతరణ ప్రారంభం కావడమే.

“రమజాన్ ఖుర్ఆన్ అవతరించిన నెల. ఈగ్రంథం మానవాళికి మార్గదర్శిని. ఇందులో రుజుమార్గం తెలిపే, సత్యాసత్యాలను, మంచీచెడులను వేరుపరచి చూపే స్పష్టమైన బోధనలు ఉన్నాయి, కనుక ఇకనుండి మీలో రమజాన్ నెలను పొందేవారు ఆ నెలంతా విధిగా ఉపవాసం పాటించాలి.” (ఖుర్ఆన్-2:185)

ఇస్లాం సౌధానికుండే అయిదు మూలస్తంభాలలో రమజాన్ ఉపవాసవ్రతాలు ఒకటి. కనుక ఈ ఉపవాసాలను విస్మరించడమంటే మొత్తం ఇస్లాంనే విస్మరించినట్లు అవుతుంది.



ఉపవాస వ్రతాలు పాటిస్తున్నప్పుడు వాటి బాహ్య నియమాలతో పాటు, అంతర్ నియమాలను కూడా తప్పకుండా పాటించాలి. ఉదాహరణకు అబద్ధమాడటం, చాడీలు చెప్పడం, దూషించడం, పరోక్షంగా నిందించడం, దురుసుగా మాట్లాడటం, అశ్లీలపు మాటలు పలకడం, జగడానికి దిగడం మొదలైన చేష్టలకు పాల్పడకూడదు. ఇది ఇతర సమయాల్లో కూడా పాపకార్యాలే. అయితే ప్రత్యేకించి రమజాన్ నెలలో వీటికి మరీ దూరంగా ఉండాలి.

మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) రమజాన్ నెల సమీపించినప్పుడు జరిగే విశేషాలను గురించి ఇలా ప్రవచించారు:

“రమజాన్ నెల రాగానే స్వర్గద్వారాలన్నీ తెరవబడతాయి; నరకద్వారాలన్నీ మూసి వేయబడతాయి; దుష్టశక్తుల్ని కట్టివేయడం జరుగుతుంది.” (బుఖారి, ముస్లిం)

“రమజాన్ నెల మొదటి రాత్రి రాగానే (సమాజంలో) చెడ్డపనులు వ్యాపింపజేయడానికి అనుక్షణం కాచుకొనివుండే షైతానులను, జిన్నులను కట్టివేయడం జరుగుతుంది. నరకద్వారాలన్నీ మూసివేయబడతాయి. వాటిలో ఒక్క ద్వారం కూడా తెరవడం జరగదు. అలాగే స్వర్గద్వారాలన్నీ తెరవబడతాయి. వాటిలో ఒక్క ద్వారం కూడా మూసి వేయడం జరగదు. పిలిచేవాడొకడు ఇలా పిలుస్తాడు- ‘మేలు, శ్రేయాలను కోరుకునేవాడా, ముందుకు రా! చెడు, దురాచారాల వెంటపడేవాడా, ఆగిపో.’ దేవుని తరఫున అనేకమందికి నరకాగ్ని నుండి విముక్తి కలుగుతుంది- ఇలా ప్రతిరాత్రీ జరుగుతుంది.” (తిర్మిజి, ఇబ్నెమాజ)

మానవుని పుట్టుక లక్ష్యం దైవాన్ని ఆరాధించడమేనని ఖుర్ఆన్ పేర్కొన్నది. మనిషి తన దైనందిన జీవితంలో పూర్తిగా దైవాజ్ఞలను పాటించడం ద్వారా అతని జీవితమంతా దైవారాధనే అవుతుంది. అసలైన ఈ దైవారాధన కోసం నమాజ్, రోజా, జకాత్, హజ్, ఆరాధనలు మనిషిని సుశిక్షితుడ్ని చేస్తాయి. ఏవిధంగా నమాజ్ అందులో పఠించే ఖుర్ఆన్ ద్వారా మనిషికి దైవాదేశాలకు అనుగుణంగా జీవితం గడపటానికి నిరంతరం శిక్షణనిస్తుందో, అదేవిధంగా ఉపవాసం కూడా మనిషిలో మనోనిగ్రహం, సహనం, స్థయిర్యం, దైవభీతి పెంపొందే శిక్షణనిస్తుంది.

“విశ్వాసులారా! గతప్రవక్తల అనుయాయులకు ఏవిధంగా ఉపవాసాలు విధించబడ్డాయో అదేవిధంగా (ఇప్పుడు) మీరు కూడా ఉపవాసాలు పాటించాలని నిర్ణయించాము. దీనివల్ల మీలో భయభక్తులు జనించే అవకాశముంది.” (ఖుర్ఆన్-2:183)

దైవంపట్ల భయభక్తులు ఉన్నప్పుడే మనిషి చెడును వదలి మంచిని స్వీకరిస్తాడు. రమజాన్‌లో ప్రత్యేక దైవభీతి కలగడానికి కారణమయ్యే ఉపవాసవ్రతాన్ని అరబీలో ‘సౌమ్’ అంటారు. సౌమ్ అంటే చేస్తున్న పని నుండి ఆగిపోవడం. దాన్ని విడనాడటం అని అర్థం. షరీఅత్ పరిభాషలో వేకువ జాము నుండి సూర్యాస్తమయం వరకు తినడం, త్రాగడం, సంభోగించడం వంటి అవసరాలను మానుకోవడాన్నే ‘సౌమ్’ అంటారు. అయితే వీటితో పాటు ప్రత్యేకంగా రమజాన్ నెలలో అశ్లీలం, అవినీతి, దుర్భాష, పోట్లాటలు కూడా పూర్తిగా మానుకోవాలి. వీటిని గురించి అనేక హదీసులు ఉన్నాయి.

హజ్రత్ అబూఉమామా (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ఇలా అన్నారు: “ఎవరయినా దైవమార్గంలో ఒక రోజు ఉపవాసముంటే అతనికీ, నరకాగ్నికి మధ్య దేవుడు భూమ్యాకాశాలంత (వెడల్పయిన) కందకం ఉండేలా చేస్తాడు.” (తిర్మిజీ)

హ్రజత్ అబూహురైరా (రజి) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (స) ఇలా తెలిపారు: "ఉపవాసం డాలు వంటిది. (కనుక) ఉపవాసం పాటిస్తున్న మనిషి అశ్లీలమైన పలుకులు పలకడంగాని, మూర్ఖుడిలా అజ్ఞానిలా ప్రవర్తించడంగాని చేయకూడదు. ఎవరైనా అతనితో  జగడానికి దిగితే లేదా దూషిస్తే అతనా వ్యక్తితో తాను ఉపవాసం ఉన్నానని రెండు సార్లు చెప్పాలి." (ఆయనింకా ఇలా అన్నారు:) "నా ప్రాణం ఎవరి అధీనంలో ఉందో ఆ శక్తిస్వరూపుని సాక్షి! ఉపవాసి నోటి వాసన దేవుని దృష్టిలో కస్తూరి సువాసన కన్నా ఎంతో శ్రేష్ఠమైనది. దేవుడు ఇలా అంటున్నాడు. ఉపవాసం ప్రత్యేకంగా నా కోసం పాటించబడుతుంది. కాబట్టి స్వయంగా నేనే దాని పుణ్యఫలం ప్రసాదిస్తాను. ఒక సత్కార్యానికి పదింతల పుణ్యం లభిస్తుంది." (బుఖారి)

"ఒకవేళ షైతాన్ నుండి నీకేదయినా దుష్టప్రేరణ కలిగినట్లు అన్పిస్తే (వెంటనే) నీవు దేవుని శరణు వేడుకో." (ఖుర్ఆన్-41:36)

షైతాన్ ఎల్లప్పుడూ ఏదో వంకతో మానవుడ్ని రెచ్చగొట్టి, కోపం తెప్పించి అతని చేత ధర్మవ్యతిరేక కార్యాలు చేయించడానికి ప్రయత్నిస్తాడు. అలాంటి పరిస్థితి ఎదురయితే వెంటనే ఆ దుష్టుడి కీడు నుండి దైవాన్ని శరణుకోరుకోవాలని పై సూక్తిలో హెచ్చరించబడింది.

ఒకసారి దైవప్రవక్త (స) దగ్గర హ్రజత్ అబూబకర్ (రజి) కూర్చొని ఉంటే ఒకతను వచ్చి అబూబకర్ (రజి)ని అనవసరంగా దూషించసాగాడు. హ్రజత్ అబూబకర్ (రజి) వెంటనే రెచ్చిపోకుండా మౌనం వహించి అతని దూషణలు వినసాగారు. దైవప్రవక్త (స) ఆయన్ని చూసి చిరునవ్వు చిందించసాగారు. కాని తరువాత కాస్సేపటికి అబూబకర్ (రజి) అతని దూషణలు సహించలేక సమాధానంగా ఒక తీవ్రమైన మాట అన్నారు. ఆయన నోట ఆమాట వినగానే దైవప్రవక్త (స) ముఖారవిందం ముడుచుకు పోయింది. ఆయన తక్షణమే లేచి అక్కడ్నుంచి వెళ్ళిపోయారు.

అబూబకర్ (రజి) కూడా లేచి ఆయన వెనకాలే నడిచారు. దారిలో ఆయన దైవప్రవక్త (స)తో మాట్లాడుతూ "(ఏమిటీ మీధోరణి) చాలా వింతగా ఉందే! ఆ వ్యక్తి నన్ను తిడ్తున్నంత సేపు మీరు మౌనంవహించి చిరునవ్వు నవ్వుతుండేవారు. కాని తర్వాత నేను అతని దూషణకు జవాబివ్వగానే మీకు కోపం వచ్చేసింది" అని అన్నారు. దానికి దైవప్రవక్త (స) "నువ్వు మౌనంగా ఉన్నంతసేపు ఒక దైవదూత నీ దగ్గర నిలబడి నీ తరఫున అతని దూషణలకు జవాబిచ్చాడు. కాని నీవు మాట్లాడటం మొదలెట్టగానే ఆ దూత అదృశ్యమై అతని స్థానంలో షైతాన్ ప్రత్యక్షమయ్యాడు. మరి నేను షైతాన్‌తో కలసి కూర్చోలేనుగా?" అన్నారు. (ముస్నద్ అహ్మద్)

"(ఉపవాసం పాటిస్తున్నప్పటికీ) అసత్యం పలకడాన్ని, అసత్యాన్ని ఆచరించడాన్ని మానివేయని వ్యక్తి ఆకలిదప్పులతో పడుండటం పట్ల దేవునికి ఏమాత్రం ఆసక్తిలేదు" అన్నారు దైవప్రవక్త (స) ఒక సందర్భంలో." (బుఖారి)

మరొక సందర్భంలో ఆయన ఇలా అన్నారు: "రోజా పాటించే ఎందరో వ్యక్తులకు తమ రోజావ్రతం ద్వారా ఆకలిదప్పులు తప్ప మరేమీ లభించదు."



"ఉపవాసం పాటిస్తున్న ఇద్దరు వ్యక్తులు (ఆ రోజు) జుహర్, అస్ర్ నమాజులు చేశారు. వారి నమాజులు ముగిసిన తరువాత దైవప్రక్త (స) వారిని ఉద్దేశించి, "మీరిద్దరు మళ్ళీ ఉజూ చేసి నమాజు చేయండి. మీ ఉపవాసాన్ని కూడా పూర్తి చేసి మరునాడు దాని ఖజా పాటించండి" అన్నారు. వారు "ఎందుకు?" అని అడిగారు. దానికి దైవప్రవక్త (స) మీరు ఫలానా వ్యక్తిని అతని పరోక్షంలో నిందించారు" అని అన్నారు. (బైహఖి)

"రమజాన్ నెలలో షరీఅత్ పరమైన కారణం ఏదీ లేకుండా ఒక్క ఉపవాసం వదిలేసినా ఆ తరువాత ఆ కొరతను తీర్చడానికి జీవితాంతం ఉపవాసాలు పాటించినా అవన్నీ కలసి రమజాన్ నెలలో వదిలేసిన ఆ ఒక్క ఉపవాసం కొరతను తీర్చలేవు" అని దైవప్రవక్త (స) స్పష్టంగా చెప్పారు. (తిర్మిజీ)

దైవప్రవక్త (స) ఓసారి షాబాన్ నెల చివరి తేదీన ఉపన్యసిస్తూ ఇలా బోధించారు: "ప్రజలారా! ఒక మహోజ్వలమైన శుభాలమాసం త్వరలో రానున్నది. అందులోని ఒక రాత్రి వేయినెలల కన్నా ఎంతో శుభప్రదమయినది. దేవుడు ఆ నెలలో ఉపవాసం పాటించడం విధిగా నిర్ణయించాడు. ఆ నెల రాత్రి వేళల్లో 'తరావీహ్' నమాజ్ చేయడం నఫిల్‌గా నియమించాడు. కనుక ఆ నెలలో ఎవరైనా అంతర్ ప్రేరణతో, సంతోషంగా ఒక సత్కార్యం చేస్తే, అది ఇతర మాసాల్లో విధి (ఫర్జ్)ని నిర్వర్తించిన దానికి సమానం. మరెవరైనా ఆ మాసంలో ఫర్జ్ (విధి)నిర్వహిస్తే, అది ఇతర నెలలో డెబ్బై ఫర్జ్‌లను నిర్వర్తించిన దానికి సమానం. ఇది సహనం వహించవలసిన నెల. సహనానికి ప్రతిఫలం స్వర్గం. ఇది సమాజలోని బీదసాదల పట్ల సానుభూతి చూపవలసిన నెల." (మిష్కాత్)

"ధర్మనిష్ఠతో ఆత్మపరిశీలనతో, పరలోక ప్రతిఫలాపేక్షతో రమజాన్  రోజాలు పాటించే మనిషి గతపాపాలు దేవుడు మన్నిస్తాడని" దైవప్రవక్త (స) బోధించారు.

దైవప్రవక్త (స) వేరొకహదీసులో ఇలా అన్నారు: "ఆదం కుమారుడు చేసే ప్రతి సత్కర్యానికి పుణ్యఫలం పది నుండి ఏడు వందల రెట్ల దాకా పెంచడం జరుగుతుంది. అయితే ఉపవాసం విషయంలో దేవుడు ఇలా తెలియజేశాడు- 'ఉపవాసం వ్యవహారం వేరుగా ఉంది. ఇది ప్రత్యేకంగా నా (ప్రసన్నత) కోసం పాటించబడుతుంది. అందువల్ల నేను స్వయంగా దాని పుణ్యఫలాన్ని ప్రసాదిస్తాను. మనిషి నాకోసం మాత్రమే తన లైంగిక వాంఛల్ని, తన ఆహార పానీయాల్ని మానుకుంటాడు, ఉపవాసం పాటించే మనిషికి రెండు సంతోషకరమైన విషయాలు ఉన్నాయి. ఒకటి ఉపవాస విరమణ సమయంలో. రెండు, తన ప్రభువును సందర్శించే సమయలో. ఉపవాసం పాటించే మనిషి నోటికంపు దేవునికి కస్తూరీసువాసన కన్నా ఎంతో ప్రియమైనది...." (బుఖారి, ముస్లిం-పాక్షికం)

## పరలోకంలో ఉపవాస పుణ్యఫలం

ఏకైక దేవుడ్ని విశ్వసించి ఆయనకు విధేయుడయి పోయిన మనిషినే ఖుర్ఆన్ పరిభాషలో ముస్లిం అంటారు. అలాంటి ముస్లిం ఖుర్ఆన్ అవతరించిన పవిత్ర రమజాన్ నెలలో ఉపవాసాలు పాటించకపోతే అతను ఆచరణలో దేవునికి అవిధేయుడయ్యాడన్న మాట. నిజంగా ఇది అతనికెంతో దురదృష్టకరమైన విషయం. అలాంటి ముస్లింలు రమజాన్ శుభాలను పోగొట్టు కోవడమే గాక మరణానంతరం తీవ్రమైన శిక్షకు గురయ్యే ప్రమాదం కూడా ఉంది.

దైవప్రవక్త (స) ఇలా తెలియజేశారు: “(ఓ రోజు) నేను నిద్రపోతుంటే ఇద్దరు వ్యక్తులు నా దగ్గరికి వచ్చి నా భుజం తట్టిలేపి నన్నొక కఠినమార్గం గల పర్వతం దగ్గరికి తీసికెళ్ళారు. దానిపై ఎక్కమని చెప్పారు. నేనీ కొండ ఎక్కడం నా శక్తికి మించిన పని' అని అన్నాను. 'పర్వాలేదు ఎక్కండి. మేము మీకు ఊతమిస్తాం' అన్నారు వారు. అప్పుడు నేను కొండపైకెక్కాను. కొండపై సగం దూరం చేరుకొనేటప్పటికీ (ఎక్కడ్నుంచో) అరుపులు, పెడబొబ్బలు విన్పించాయి. 'ఈ ఏడ్పులు, పెడబొబ్బలు ఏమిట'ని నేను అడిగాను. 'ఇది నరకవాసుల పెడబొబ్బలు' అని వారు చెప్పారు. ఆ తరువాత నన్ను మరి కాస్త పైకి తీసికెళ్ళారు. అక్కడ కొందరు మనుషులు తలక్రిందులుగా చేయబడి ఉన్నారు. వారి దవడలు చీల్చబడి ఉన్నాయి. వాటి నుండి రక్తం కారుతోంది. నేను వీరెవరని అడిగాను. 'వీరు రమజాన్ నెలలో ఉపవాసాలు పాటించకుండా పగటి వేళల్లో హాయిగా తింటూ, త్రాగుతూ ఉండేవారు' అని సమాధానమిచ్చారు.” (అల్ మన్జరి)

దైవప్రవక్త (స) ప్రవచనం: “ఖుర్ఆన్, రోజాలు విశ్వాసి కొరకు దైవానికి సిఫారసు చేస్తాయి. రోజా ఇలా అంటుంది- 'ప్రభూ! నేనీ వ్యక్తిని పగటి వేళల్లో తిండికి, ఇతర వాంఛలకు దూరంచేశాను. ఇతను దాన్ని శిరసావహించాడు. కనుక (ఇతని మోక్షం కోసం) నా సిఫారసు స్వీకరించు.' ఖుర్ఆన్ ఇలా అంటుంది- 'నేను ఇతడ్ని రాత్రిళ్ళలో సుఖనిద్రకు దూరం చేశాను. కనుక స్వామీ! ఇతని విషయంలో నా సిఫారసు స్వీకరించు.' అప్పుడు దేవుడు ఈ రెండిటి సిఫారసు స్వీకరిస్తాడు.” (మిష్కాత్, బైహఖి)

దైవప్రవక్త (స) రమజాన్ ఉపవాసాల ప్రాముఖ్యం తెలుపుతూ “రమజాన్ నెల చివరి రాత్రిన నా అనుచర సముదాయం పాపాలు క్షమించబడతాయ”ని అన్నారు. అనుచరులు ఈమాట విని “దైవప్రవక్తా! ఆ రాత్రేనా లైలతుల్‌ఖదర్ (మహా శుభరాత్రి)?” అని అడిగారు. దానికి దైవప్రవక్త (స) ఇలా అన్నారు: “కాదు. శ్రామికుడు తన పని పూర్తిగా నిర్వహించిన తర్వాత అతనికి కూలి ఇవ్వబడుతుంది. (అంటే పని నిర్ణీతకాలం ముగింపులో లేదా నెల చివరితేదీన వేతనం ఇవ్వబడుతుంది).” (అహ్మద్)

దైవప్రవక్త (స) ప్రవచనం: “స్వర్గానికి ఎనిమిది ప్రధాన ద్వారాలుంటాయి. వాటిలో ఒక ద్వారం పేరు 'రయ్యాన్.' దీని గుండా ఉపవాసాలు పాటించేవారు మాత్రమే స్వర్గంలో ప్రవేశిస్తారు. వారు తప్ప మరెవరూ ఈద్వారం గుండా ప్రవేశించలేరు.” (బుఖారి, ముస్లిం)

దైవప్రవక్త(స) ప్రవచనం: “దైవమార్గంలో పోరాడుతూ ఒకరోజు రోజా పాటించే మనిషిని దేవుడు నరకానికి డెబ్భయి సంవత్సరాల (ప్రయాణం) మేరకు దూరంగా ఉంచుతాడు.” (బుఖారి)

దైవప్రవక్త (స) ఇలాఅన్నారు: “రమజాన్ కోసం స్వర్గం ఒక సంవత్సరాంతం నుంచి వచ్చే సంవత్సరారంభం వరకు అలంకరించబడు తుంది. రమజాన్ నెల మొదటి రోజు రాగానే దైవసింహాసనం (అర్ష్) క్రింద ఒక విధమైన గాలి వీస్తుంది. ఈ గాలి స్వర్గవృక్షాల గుండా వీస్తూ లేడికళ్ళ అప్సరసల మీదికి చేరుతుంది. ఈ పవన వీచికల స్పర్శతో ఆ అప్సరసలు 'ప్రభూ! నీ పుణ్యదాసులలో మా కళ్ళకు చలువ కలిగించే భర్తలను మాకు ప్రసాదించు. మా సహచర్యంతో వారి కళ్ళకు చలువ కలిగించు' అని ప్రార్థిస్తారు.” (బైహఖి)



## ఉపవాసవ్రత సన్నాహాలు

హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి) కథనం: దైవప్రవక్త (స) ఓసారి రమజాన్ గురించి ప్రస్తావిస్తూ ఇలా అన్నారు- “నెలవంక కన్పించనంత వరకు ఉపవాసాలు పాటించకండి. అలాగే (తిరిగి) నెలవంక కన్పించనంత వరకు ఉపవాస విరమణ (పండుగ) చేయకండి. ఒకవేళ ఆకాశం మేఘావృతమయి ఉంటే ఆ నెల ముప్ఫయి రోజులు పూర్తిగా ఉపవాసాలు ఉండండి.” (బుఖారి)

“ఉపవాసకాలం రాత్రివేళల్లో మీరు మీభార్యల దగ్గరకు పోవడం ధర్మసమ్మతం చేయబడింది. వారు మీకు, మీరు వారికి దుస్తుల్లాంటివారు. మీరు (మీభార్యల చెంతకు పోవడానికి సంకోచిస్తూ) ఆత్మద్రోహం చేసుకుంటున్న సంగతి దేవునికి తెలుసు. అందువల్ల ఆయన మిమ్మల్ని కనికరించి మీ పొరపాట్లు మన్నిస్తున్నాడు. ఇప్పుడిక మీరు మీభార్యలతో నిస్సంకోచంగా రాత్రులు గడపవచ్చు. దేవుడు మీకు ధర్మసమ్మతం చేసినదాన్ని (దాంపత్య సుఖాన్ని) అనుభవించండి. మీరు (ఉపవాసకాలంలో) కడరేయి నలుపు(చీకటి) తగ్గి తొలిజాము తెలుపు (ఉషోదయకాంతి) కనపడేవరకు హాయిగా తినండి, త్రాగండి. ఆ తర్వాత (వీటన్నిటినీ త్యజించి) సూర్యాస్తమయమై చీకటిపడేవరకు ఉపవాసం పాటించాలి. (ఖుర్ఆన్-2:187)

దేహానికి దుస్తులకు మధ్య ఎలాంటి అవినావభావ సంబంధముంటుందో భార్యాభర్తల మధ్య కూడా అలాంటి సంబంధమే ఉందని, కనుక రమజాన్‌నెల రాత్రివేళల్లో పురుషులు తమ భార్యాల్ని ఎలాంటి సంకోచం లేకుండా కలుసుకోవచ్చని దేవుడు తెలియజేస్తున్నాడు.

నిషిద్ధ ఉపవాసాలను గురించి దైవప్రవక్త (స) ఇలా ఆదేశించారు:

“మీలో ఎవరూ రమజాన్‌కు ఒకటి రెండు రోజుల ముందు (నఫిల్) ఉపవాసం పాటించకూడదు. కాకపోతే ఎవరికైనా ఇంతకు పూర్వం నుంచే ఆ రోజు ఉపవాసం పాటించే అలవాటుంటే అలాంటి వ్యక్తి ఉపవాసం పాటించవచ్చు.” (బుఖారి, ముస్లిం)

“(రమజాన్‌కు ముందు వచ్చే) షాబాన్ నెలలో సగం రోజులు గడచిన తరువాత (నఫిల్) ఉపవాసాలు పాటించకండి.” (అబూదావూద్, తిర్మిజి, ఇబ్నెమాజ)

హజ్రత్ అమ్మార్ బిన్ యాసిర్ (రజి) దైవప్రవక్త (స) ఆజ్ఞను తన మాటల్లో ఇలా వ్యక్తపరిచారు: “అనుమానాస్పదమైన రోజున ఉపవాసం పాటించినవాడు (దైవప్రవక్త) అబుల్‌ఖాసిం-సల్లల్లాహు అలైహి వసల్లం పట్ల అవిధేయతకు పాల్పడిన వాడవుతాడు.” (తిర్మిజి, అబూదావూద్, ఇబ్నెమాజ)

# 30. ఆరువిధాల ఉపవాసాలు

రమజాన్‌లో తప్ప ఇతర దినాలలో పాటించే రోజాలన్నీ నఫిల్ రోజాల కిందికి వస్తాయి. అయితే కొన్ని ప్రత్యేక దినాలలో నఫిల్‌రోజాలు పాటించడం సంప్రదాయం, మరికొన్ని నిషిద్ధం. ఇలాంటి ఉపవాసాలలో ఆరు విధాల ఉపవాసాలు ఉన్నాయి.

**1. ఫరజ్ ఉపవాసాలు:-** ప్రతి ఏడూ రమజాన్ నెలంతా పాటించే ఉపవాసాలు 'ఫరజ్' ఉపవాసాలు. అంటే తప్పకుండా పాటించవలసిన ఉపవాసాలు అన్న మాట. రమజాన్

ఉపవాసాలు ఫరజ్ (తప్పనిసరి)కాదని తిరస్కరించినవాడు కాఫిర్ (సత్యతిరస్కారి)గా పరిగణించ బడతాడు. షరీఅత్ పరమైన కారణం ఏదీ లేకుండా రమజాన్ ఉపవాసాలు పాటించనివాడు చెడ్డవాడు (ఫాసిఖ్), ఘోరమైన పాపాత్ముడు అవుతాడు. అలాగే ఏమరుపాటుతో లేదా మరేదైనా కారణంవల్ల కొన్ని ఉపవాసాలు తప్పిపోతే వాటి "ఖజారోజాలు" పాటించడం కూడా 'ఫరజ్' (తప్పనిసరి) అవుతుంది. ఖజారోజాలు వీలయినంత త్వరగా పాటించాలి.

**2. వాజిబ్ ఉపవాసాలు:-** మొక్కుబడి ఉపవాసాలు, పాపపరిహారం ఉపవాసాలు పాటించడం 'వాజిబ్' (అనివార్యం) అవుతుంది. మొక్కుబడి కోసం ఫలానా రోజు ఉపవాసం పాటిస్తానని ఒక దినం నిర్ణయించుకుంటే ఆ నిర్ణీతదినానే ఉపవాసం పాటించాలి. రోజు నిర్ణ యించుకోకపోతే ఎప్పుడైనా ఉపవాసం ఉండవచ్చు. అయితే మొక్కుబడి ఉపవాసాన్ని కూడా వీలయినంత త్వరగా పాటించాలి. అనవసరంగా ఆలస్యం చేయడం మంచిపద్ధతి కాదు.

**3. మస్నూన్ ఉపవాసాలు:-** దైవప్రవక్త (స) స్వయంగా పాటించి, ఇతరుల్ని పాటించమని పురమాయించిన ఉపవాసాలను సాంప్రదాయిక (మస్నూన్) ఉపవాసాలు అంటారు. వీటిని పాటించడంలో గొప్ప పుణ్యం ఉంది. అయితే పాటించకపోతే పాపం మాత్రం లేదు. మస్నూన్ ఉపవాసాలు ఇలా ఉన్నాయి:

❖ ముహర్రమ్ 9, 10 తేదీల (రెండు రోజులు) ఉపవాసాలు. ముహర్రమ్ 10వ తేదీని "యౌమె ఆషురా" అంటారు. దైవప్రవక్త (స) ముహర్రంలో ఆ ఒక్క రోజు మాత్రమే ఉపవాసం ఉండేవారు. ఆ తరువాత ఆయన తన అంత్యకాలంలో 9,10 తేదీల రెండు రోజులు ఉపవాసం పాటించాలని అన్నారు.

హజ్రత్ ఆయిషా (రజి) కథనం: అజ్ఞాన కాలంలో ఖురైషీయులు ఆషురా రోజు ఉపవాసం ఉండేవారు. అంచేత దైవప్రవక్త (స) కూడా ఆరోజు ఉపవాసం ఉండాలని ప్రజలను ఆదేశించారు. అయితే రమజాన్ ఉపవాసాలు ఫరజ్ (విధి) అయినప్పుడు దైవప్రవక్త (స) "ఆషురా రోజు ఇష్టమున్నవాళ్ళు ఉపవాసం పాటించవచ్చు, లేదా వదిలేయవచ్చు" అని చెప్పారు. (బుఖారి, ముస్లిం)

హజ్రత్ అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి) కథనం: దైవప్రవక్త (స) మదీనాకు వలస వచ్చినప్పుడు ఆయన (మదీనాలో యూదులు) ఆషురా రోజు ఉపవాసం పాటించడం చూశారు. అప్పుడాయన 'ఈ ఉపవాసం ఏమిట'ని అడిగారు. దానికి వారు జవాబిస్తూ "ఈరోజు సుదినం. ఈదినమే దేవుడు హజ్రత్ మూసా (అలై)కు, ఆయన జాతికి విముక్తి కల్గించాడు; ఫిరౌన్‌ని, అతని జాతిని (సముద్రంలో) ముంచివేశాడు. అందువల్ల హజ్రత్ మూసా (అలై) దేవుని పట్ల కృతజ్ఞతా పూర్వకంగా ఈరోజు ఉపవాసం పాటిస్తుండేవారు" అని అన్నారు. దైవప్రవక్త (స) ఈమాట విని "అయితే మూసా (అలై) సంప్రదాయం ప్రకారం నడచుకోవడానికి మీకంటే మేమే ఎక్కువ హక్కుదారులం" అన్నారు. అందువల్ల దైవప్రవక్త (స) అప్పటించి 'ఆషురా ఉపవాసం' పాటించడం ప్రారంభించారు. ఇతరుల్ని కూడా ఆరోజు ఉపవాసం పాటించాలని ఆదేశించారు. (బుఖారి, ముస్లిం)

హజ్రత్ అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి) కథనం: దైవప్రవక్త (సల్లం) ఓసారి ఆషురా రోజు ఉపవాసం పాటించినప్పుడు ప్రజలు ఆయనతో మాట్లాడుతూ "దైవప్రవక్తా! ఇది



యూదులు, క్రైస్తవులు కూడా పవిత్రమైనదిగా భావిస్తున్న దినం. (ఇలాంటి దినాన మనం కూడా ఉపవాసం పాటించడం బాగుంటుందా?)" అని అన్నారు. దైవప్రవక్త (సల్లం) ఈమాట విని "నేను వచ్చే సంవత్సరం బ్రతికుంటే ముహర్రమ్ నెల తొమ్మిదో తేదీన కూడా ఉపవాసం పాటిస్తాను" అని అన్నారు. (ముస్లిం)

దీన్నిబట్టి ఈ విషయాన్ని ప్రజలు దైవప్రవక్త (సల్లం) జీవితపు చివరి రోజుల్లో ఆయన దృష్టికి తెచ్చారని తెలుస్తోంది. అంతకు పూర్వం దైవప్రవక్త (స) ఆషురా రోజు (ముహర్రం పదో తేదీన) ఉపవాసం పాటిస్తున్నప్పుడు ఈ విషయాన్ని ఎవరూ ఆయన దృష్టికి తీసుకురాలేదు. యూదులు, క్రైస్తవులు ఆషురా దినాన్ని పవిత్రమైన దినంగా పరిగణించారు; దైవప్రవక్త (స) కూడా ఆ దినానికి పవిత్రత ఆపాదించారు. దీనివల్ల ముస్లింలు తమను అనుకరిస్తున్నారని యూదులు, క్రైస్తవులు చెప్పుకోవచ్చని కొందరు ముస్లింలు భావించారు. అందువల్లనే బహుశా వారు ఆ తరువాత దైవప్రవక్త (స) జీవితపు అంత్యదశలో ఈ విషయాన్ని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. అప్పుడు దైవప్రవక్త (స) పై హదీసులో పేర్కొన్నట్లు ముహర్రమ్ పదో తేదీతో పాటు తొమ్మిదో తేదీ కూడా కలిపి రెండు రోజులు ఉపవాసం పాటిస్తానని అన్నారు.

ఈ వివరణను బట్టి ముస్లింలు ముహర్రం నెలలో ఒక్క పదో తేదీన మాత్రమే ఉపవాసం పాటించకూడదని, దానికి మరోరోజు కలిపి రెండు రోజులు ఉపవాసం పాటించా లని తెలుస్తోంది. అంటే, పదో తేదీకి తొమ్మిదోతేదీ లేదా పదకొండోతేదీ కలిపి రెండురోజులు ఉపవాసం ఉండవచ్చు.

❖ జిల్‌హజ్జ తొమ్మిదవ తేదీ (అర్ఫా రోజు) ఉపవాసం.

ఈ ఉపవాసం జిల్‌హజ్జ తొమ్మిదవ తేదీన హజ్‌యాత్రలో లేనివారు మాత్రమే పాటించ వచ్చు. హజ్‌నియమాలు పాటించే హజ్‌యాత్రికులు పాటించకూడదు.

దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "అర్ఫారోజు పాటించే ఉపవాసానికి లభించే పుణ్యఫలం వేయిరోజుల ఉపవాసాల పుణ్యఫలానికి సమానం." (అత్తర్గీబ్)

హజ్రత్ ఉమ్ముల్ ఫజల్ బిన్త్ హారిస్ (రజి) కథనం:- నా ముందు అర్ఫారోజు ఉపవాసం గురించి కొందరు వాదించుకోసాగారు. వారిలో కొందరు దైవప్రవక్త (స) ఉపవాసంతో ఉన్నారని భావిస్తుంటే, మరికొందరు ఉపవాసంతో లేరని భావిస్తున్నారు. నేనప్పుడు (నిజం తెలుసుకోవడానికి) దైవప్రవక్త (స) సన్నిధికి ఓ పాలగిన్నె పంపాను. ఆ సమయంలో ఆయన అరఫాత్ మైదానంలో ఒంటె మీద కూర్చొని ఉన్నారు. నేను పంపిన పాలగిన్నెను ఆయన తీసుకొని పాలు తాగారు." (బుఖారి, ముస్లిం)

❖ ప్రతి నెలా (అయ్యామె బైజ్) 13, 14, 15 తేదీల ఉపవాసాలు.

హజ్రత్ అబూజర్ గిఫ్ఫారీ (రజి) ఉల్లేఖనం:- దైవప్రవక్త (స) నాకు హితోపదేశం చేస్తూ "అబూజర్! నీవు ప్రతినెలా మూడు రోజులు ఉపవాసం పాటించదలచుకుంటే 13, 14, 15 తేదీలలో పాటిస్తూవుండు" అని అన్నారు. (తిర్మిజి, నసాయి)

హజ్రత్ ముఆజతల్ అదవియ్యా (రజి) కథనం:- నేను హజ్రత్ ఆయిషా (రజి)తో మాట్లాడుతూ "దైవప్రవక్త (స) ప్రతి నెలా మూడు రోజులు ఉపవాసం పాటించేవారా?"

అని అడిగాను. దానికామె ఔనన్నారు. నేను మళ్ళీ "అయితే దైవప్రవక్త (స) ప్రతినెలా ఏఏ తేదీలలో మూడు రోజులు ఉపవాసం పాటించేవారు?" అని అడిగాను. దానికామె సమాధానమిస్తూ "దైవప్రవక్త (స) నెలలో మూడు రోజులు ఏఏ తేదీలలో ఉపవాసం ఉండాలనే విషయం గురించి పట్టించుకునేవారు కాదు." (ముస్లిం)

**4. నఫిల్ ఉపవాసాలు:-** ఫరజ్, వాజిబ్, మస్నూన్ ఉపవాసాలు తప్ప మిగిలిన ఉపవాసాలన్నీ నఫిల్ రోజాలుగా పరిగణించబడతాయి. వీటిని పాటించడం వాంఛనీయం (ముస్తహబ్). వీటిలో కొన్ని గొప్ప పుణ్యఫలం తెచ్చే ఉపవాసాలు ఉన్నాయి.

- షవ్వాల్ నెలకు చెందిన 6 రోజుల ఉపవాసాలు.

దైవప్రవక్త (స) ప్రవచనం: "రమజాన్ ఉపవాసాలాతో పాటు ఎవరైతే షవ్వాల్ నెలలో ఆరురోజుల ఉపవాసాలు కూడా పాటిస్తాడో అతడ్ని ఈరోజే అతనితల్లి కన్నదా అన్నట్లు అతను పరమ పవిత్రుడయి పోతాడు." (ముస్లిం, అబూదావూద్)

హజ్రత్ అయ్యూబ్ అన్సారి (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "రమజాన్ రోజాలన్నిటితో పాటు షవ్వాల్ నెలలో ఆరు రోజుల ఉపవాసాలు కూడా పాటించేవాడు ఎల్లప్పుడూ ఉపవాసాలు పాటిస్తున్న వాడవుతాడు." (ముస్లిం)

హజ్రత్ ముస్లిం ఖురైషీ (రజి) కథనం ప్రకారం "సాయిముద్దహర్" (ఎల్లప్పుడూ ఉపవాసం పాటించడం) గురించి అడిగిన ప్రశ్నకు దైవప్రవక్త (స) ఇలా జవాబిచ్చారు: "నీపై నీభార్యాపిల్లల హక్కు కూడా ఉంది. కనుక రమజాన్ ఉపవాసాలతో పాటు ఆ తర్వాత (షవ్వాల్) నెలలోని (ఆరు రోజుల) ఉపవాసాలు కూడా పాటించు. అదీగాక బుధవారం, గురువారం కూడా ఉపవాసం పాటించు. ఈవిధంగా నీవు ఎల్లప్పుడూ ఉపవాసాలు పాటించేవాడిగా పరిగణించబడతావు." (అబూదావూద్, తిర్మిజి)

- సోమవారం, గురువారం ఉండే ఉపవాసాలు.

హజ్రత్ అబూహురైరా (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ఇలా అన్నారు: "సోమ, గురు వారాలలో కర్మలు (దేవుని ముందు) సమర్పించబడతాయి. అంచేత నేను ఉపవాసం పాటిస్తున్న స్థితిలో నా కర్మలు సమర్పించబడాలని నేను కోరుకుంటున్నాను." (తిర్మిజి)

హజ్రత్ ఆయిషా (రజి) కథనం: "దైవప్రవక్త (స) ప్రతి సోమవారం, ప్రతి గురు వారం ఉపవాసం పాటిస్తుండేవారు." (తిర్మిజి, నసాయి)

- కేవలం దైవప్రసన్నత కోసం ఒకరోజు ఉండే ఉపవాసం.

దైవప్రవక్త (సల్లం) ప్రవచనం: "కేవలం దైవప్రసన్నత కోసం ఎవరైనా ఒక రోజు ఉపవాసం పాటిస్తే దేవుడు అతడ్ని నరకం నుండి చాలా దూరం ఉంచుతాడు. ఒక కాకి పుట్టిన దగ్గర్నుంచి ముసలిదయి చచ్చిపోయేదాకా ఎంత దూరం ఎగిరి పోతుందో అంత దూరం ఉంచుతాడు." (అహ్మద్, బైహఖి)

దైవప్రవక్త (స) ప్రవచనం: "మనిషి ఇతర దినాలలో చేసే దైవారాధన కంటే జిల్‌హజ్ మొదటి దశకంలో చేసే ఆరాధన దేవునికి ఎంతో ప్రియమైనది. ఆ దశకంలో



ప్రతిరోజూ పాటించే ఉపవాసం సంవత్సరమంతా పాటించే ఉపవాసాలకు సమానమవు తుంది. ఆ దశకంలోని ప్రతిరాత్రి చేసే నఫిల్ నమాజ్ మహాశుభరాత్రి (షబెఖదర్)న చేసే నఫిల్ నమాజులకు సమానమవుతుంది." (ఆసాన్‌ఫిఖ్హా, రెండవభాగం)

**5. హరాం ఉపవాసాలు:-** నిషిద్ధ ఉపవాసాలు. ఈ దినాలలో ఉపవాసం నిషిద్ధం:

- ఈదుల్ ఫితర్ (రమజాన్ పండుగ) నాడు పాటించే ఉపవాసం.

హజ్రత్ అబూ సయీద్ ఖుద్రీ (రజి) కథనం: "దైవప్రవక్త (స) మమ్మల్ని ఈదుల్ ఫితర్ నాడు ఉపవాసం పాటించకూడదని వారించారు." (బుఖారి, ముస్లిం)

- ఈదుల్‌అజ్హా (బక్రీద్ పండుగ) నాడు పాటించే ఉపవాసం.

హజ్రత్ అబూసయీద్ ఖుద్రీ (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "ఈదుల్‌ఫితర్, ఈదుల్‌అజ్హా రోజుల్లో ఎలాంటి ఉపవాసాలు లేవు." (బుఖారి, ముస్లిం)

- అయ్యామె తష్రీఖ్ (జిల్‌హజ్జ 11, 12, 13 తేదీల) ఉపవాసాలు.

హజ్రత్ నుబైషా హుజలీ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (స) ఇలా అన్నారు: "అయ్యామె తష్రీఖ్ (జిల్‌హజ్జ 11,12,13 తేదీలు) తినే, త్రాగే, దైవాన్ని స్మరించే రోజులు." (ముస్లిం). అంటే ఆ మూడురోజులు రోజా ఉండకూడదు.

**6. మక్రూహ్ ఉపవాసాలు:-** అవాంఛనీయమైన ఉపవాసాలు. కొందరు ఒక రోజు నిర్ణయించుకొని ఎల్లప్పుడూ ఆ నిర్ణీతదినాన క్రమతప్పకుండా రోజా పాటిస్తారు. ఇది మంచి పద్ధతి కాదు. దైవప్రవక్త (స) ఆదేశించిన, పురమాయించిన, దినాలలో మాత్రమే ఉపవాసం పాటించాలి. ఇవి అవాంఛనీయమైన ఉపవాసాలు. ఉదాహరణకు క్రింద చూడండి:

- కేవలం శనివారం లేక ఆదివారం నాడు ఉపవాసం పాటించడం.

దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రవచించారు: "శనివారంనాడు ఫరజ్ (విధిగా) పాటించ వలసిన ఉపవాసం ఏదైనా వస్తే తప్ప (సాధారణ పరిస్థితుల్లో) ఆరోజు ఉపవాసం పాటించకండి. ఒకవేళ ఎవరైనా పొరపాటున శనివారం ఉపవాసం ఉంటే అలాంటి వ్యక్తి కనీసం ద్రాక్షపండు తొక్కగాని లేదా ఏదైనా చెట్టుబెరడుగాని నమలి ఉపవాస భంగం చేయాలి." (అహ్మద్, అబూదావూద్, తిర్మిజి, ఇబ్నెమాజ)

హజ్రత్ ఉమ్మెసల్మా (రజి) కథనం: దైవప్రవక్త (సల్లం) నఫిల్ ఉపవాసాలలో సాధారణంగా శని, ఆదివారాల ఉపవాసాలు పాటించేవారు. వాటిని గురించి ఆయన ఇలా చెబుతుండేవారు: "ఇవి బహుదైవారాధకుల (అంటే యూదులు, క్రైస్తవుల) పండుగ దినాలు. అందువల్ల నేను (ఒకేసారి రెండురోజులు) ఉపవాసం పాటించడం ద్వారా) వారికి వ్యతిరేకంగా ఆచరించదలిచాను." (అహ్మద్)

- కేవలం ముహర్రం పదో తేదీన ఒక రోజు ఉపవాసం పాటించడం.

ముహర్రమ్ 10వ తేదీని "యౌమె ఆషురా" అంటారు. దైవప్రవక్త (స) ముహర్రం నెలలో ఆ ఒక్క రోజు మాత్రమే ఉపవాసం ఉండేవారు. ఆ తరువాత ఆయన తన

అంత్యకాలంలో 9, 10 తేదీల రెండురోజులు ఉపవాసం పాటించాలని అన్నారు. (మస్నూన్ ఉపవాసాల శీర్షికలో దీని ప్రస్తావన వచ్చింది, చూడండి.)

✴ కేవలం శుక్రవారం నాడు ఉపవాసం పాటించడం.

హజ్రత్ అబూహురైరా (రజి) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఇలా అన్నారు: "మీలో ఎవరూ (కేవలం) శుక్రవారం నాడు ఉపవాసం పాటించకూడదు. కాకపోతే దానికి ముందుగాని తరువాతగాని ఒకరోజు కలుపుకొని (రెండు రోజులు) ఉపవాసం పాటించవచ్చు." (ముత్తఫఖున్ అలై)

✴ స్త్రీ తన భర్త అనుమతి లేకుండా నఫిల్ ఉపవాసం పాటించడం.

హజ్రత్ అబూహురైరా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఇలా చెప్పారు: "స్త్రీ తన భర్త ఇంట్లో ఉన్నప్పుడు అతని అనుమతి లేకుండా (నఫిల్) ఉపవాసం పాటించడం ధర్మసమ్మతం కాదు. అలాగే స్త్రీ తన భర్త అనుమతి లేకుండా ఏ వ్యక్తినీ తన ఇంట్లోకి రానివ్వకూడదు." (ముస్లిం)

హజ్రత్ అబూసయీద్ (రజి) ఉల్లేఖనం: ఓరోజు మేము దైవప్రవక్త (సల్లం) దగ్గర కూర్చొని ఉంటే ఒక స్త్రీ వచ్చి తన బాధామయ గాథను ఇలా ఏకరువు పెట్టింది- "దైవప్రవక్తా! నా భర్త సుఫ్వాన్ బిన్ ముఅత్తల్ నమాజు చేస్తున్నందుకు నన్ను కొడ్తున్నారు. ఆయనేమో పొద్దెక్కిన తరువాత లేచి నమాజు చేస్తారు. నేనెప్పుడైనా ఉపవాసం పాటిస్తే ఉపవాసం పాటించవద్దని వారిస్తున్నారు."

ఈ ఆరోపణలు చేస్తున్నప్పుడు ఆమె భర్త సుఫ్వాన్ అక్కడే కూర్చొని ఉన్నారు. దైవప్రవక్త (సల్లం) విషయం ఏమిటని అడిగితే హజ్రత్ సుఫ్వాన్ "ఈమె నమాజులో సుదీర్ఘమైన రెండు సూరాలు పఠిస్తుంది. అంత పెద్ద సూరాలు పఠించవద్దని మాత్రమే నేను చెప్పాను" అని అన్నారు. దైవప్రవక్త (సల్లం) ఈ మాట విని "నువ్వు ఒక్క సూరా పఠించినా సరిపోతుంది" అని చెప్పారు ఆ స్త్రీకి.

ఆ తరువాత సుఫ్వాన్ (రజి) మాట్లాడుతూ "దైవప్రవక్తా! నేనీమె ఉపవాసాలను నిరోధిస్తున్నానని ఆరోపిస్తోంది. కాని ఈవిడ నఫిల్ (ఐచ్ఛిక) ఉపవాసాలు పాటించడం మొదలెడితే వాటినిక విరమించకుండా రోజుల తరబడి అలా పాటిస్తూనే ఉంటుంది. కాని, నేనేమో యువకుడ్ని, నిగ్రహించుకోలేక పోతున్నాను" అని అన్నారు. దైవప్రవక్త (సల్లం) ఈ సంగతి విని "భర్త అనుమతి లేకుండా ఏ స్త్రీ కూడా నఫిల్ ఉపవాసాలు పాటించకూడదు" అని ఆదేశించారు.

హజ్రత్ సుఫ్వాన్ (రజి) మూడో ఆరోపణకు సంజాయిషీ ఇస్తూ "దైవప్రవక్తా! మేము కష్ట జీవులం. పొద్దుపొడవనిదే నిద్రలేవని వంశస్థులుగా పేరుపడ్డాం" అన్నారు. అప్పుడు దైవప్రవక్త (సల్లం) "సరే సుఫ్వాన్! నిద్ర నుంచి మేల్కోగానే నమాజ్ చేస్తుండు" అని ఉపదేశించారు. (బుఖారి, ముస్లిం)

✴ నిర్విరామంగా అనేకరోజులు ఉపవాసం పాటించడం. ఇలాంటి ఉపవాసాలను "సౌమెవిసాల్" అంటారు. వీటిని పాటించడానికి దైవప్రవక్త (స)కు మాత్రమే అనుమతి ఉంది.



# 31. రోజా నుండి మినహాయించబడినవారు

ఇస్లాం ధర్మశాస్త్రం (షరీఅత్) రమజాన్ ఉపవాసాల నుండి కొందరిని మినహా యించింది. వారిలో కొందరిని ఉపవాసం ఉండరాదని నిషేధించింది. మరికొందరిని ఉపవాసం పాటించ కుండా ఉండేందుకు అనుమతించింది. శక్తి, స్పృహ కలిగిన ప్రతి ముస్లిం రమజాన్ ఉపవాసాలు విధిగా పాటించవలసి ఉంటుంది. బహిష్టు అయిన, ప్రసూతి మైలతోవున్న స్త్రీలు ఆ రెండు అపరిశుద్ధావస్థలు దూరం కానంతవరకు నమాజ్ చేయడం, ఉపవాసం పాటించడం నిషిద్ధం. అపరిశుద్ధావస్థలు తొలగిన తర్వాత తప్పిపోయిన రమజాన్ ఉపవాసాలకు ఖజా పాటించవలసి ఉంటుంది. తప్పిపోయిన నమాజులకు మాత్రం ఖజా పాటించనవసరం లేదు.

బాటసారులు, వ్యాధిగ్రస్తులు, అతివృద్ధులు, మతిస్థిమితం లేనివారు, గర్భిణీ స్త్రీలు, బాలింతలు, అశుద్ధావస్థలో ఉన్న స్త్రీలు ఉపవాసం నుండి మినహాయించబడ్డారు. అయితే బాటసారులు, వ్యాధిగ్రస్తులు, బాలింతలు, అశుద్ధావస్థలో ఉన్న స్త్రీలు తప్పిపోయిన ఉపవాసా లను ఇతర దినాలలో పాటించి నెల రోజుల వ్రతం పూర్తిచేయాలి.

"రోగగ్రస్తులు, ప్రయాణీకులు (తప్పిపోయిన) ఉపవాసాలను ఇతర దినాలలో పాటించి (ఆ సంఖ్యను) పూర్తిచేయాలి. దేవుడు మీకు సౌలభ్యం చేకూర్చదలిచాడుగాని, మిమ్మల్ని ఇబ్బంది పాల్జేయాలని భావించడంలేదు. మీరు ఉపవాసాల సంఖ్యను పూర్తి చేసుకోవడానికి, దేవుడు మీకు సన్మార్గం చూపినందుకు ఆయన ఔన్నత్యాన్ని కొనియాడటానికి, ఆయనకు కృతజ్ఞులై ఉండటానికిగాను ఈ సౌలభ్యం ప్రసాదించాడు." (ఖుర్ఆన్-2:185)

పోతే మిగిలినవాళ్ళంతా రమజాన్ రోజాలు పాటించడానికి అర్హులవుతారు. అయితే కొందరు వారి స్థితిగతులదృష్ట్యా రమజాన్‌రోజాల పాటింపు నుండి మినహాయించబడ్డారు.

హజ్రత్ అబూసయీద్ ఖుద్రీ (రజి) కథనం: "మేము రమజాన్ పదహారవ తేదీన దైవప్రవక్త (స)తో కలసి ఒక దండయాత్ర కోసం ప్రయాణమయ్యాము. ఈ ప్రయాణంలో మాలో కొందరు ఉపవాసం ఉన్నారు, మరికొందరు ఉపవాసం లేరు. అయితే ఉపవాసం ఉన్నవారు ఉపవాసం లేనివారికి, ఉపవాసం లేనివారు ఉపవాసం ఉన్నవారికి ఎలాంటి అభ్యంతరం చెప్పలేదు." (ముస్లిం)

"ఇకనుండి మీలో రమజాన్ నెలను పొందేవారు ఆ నెలంతా విధిగా ఉపవాసం పాటించాలి. అయితే వ్యాధిగ్రస్తులు, ప్రయాణీకులు (తప్పిపోయిన) రోజాలను ఇతర దినాలలో పాటించి (ఆ సంఖ్యను) పూర్తిచేయాలి. దేవుడు మీకు సౌలభ్యం చేకూర్చ దలిచాడుగాని, మిమ్మల్ని ఇబ్బంది పాల్జేయాలని భావించడంలేదు. మీరు ఉపవాసాల సంఖ్యను పూర్తి చేసు కోవడానికి, దేవుడు మీకు సన్మార్గం చూపినందుకు ఆయన ఔన్నత్యాన్ని కొనియాడటానికి, ఆయనకు కృతజ్ఞులై ఉండటానికిగాను ఈ సౌలభ్యం ప్రసాదించాడు." (ఖుర్ఆన్-2:185)

(1) హజ్రత్ ఆయిషా (రజి) ఉల్లేఖనం: హజ్రత్ హమ్జా బిన్ అమ్ర్ అస్లమీ (రజి) అత్యధిక ఉపవాసాలు పాటించేవారు. ఆయన ఒకసారి దైవప్రవక్త (స) సన్నిధికి వచ్చి "దైవప్రవక్తా! ప్రయాణావస్థలో నేను ఉపవాసం పాటించవచ్చా?" అని అడిగారు. దానికి దైవప్రవక్త (సల్లం) "నీకిష్టమయితే ఉపవాసం పాటించు, లేకుంటే మానెయ్యి. (అంతా నీ ఇష్టాయిష్టాలపై ఆధారపడి ఉంది.)" అని అన్నారు. (ముత్తఫఖున్ అలై)

(2) హజ్రత్ అనస్ బిన్ మాలిక్ (రజి) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "దేవుడు ప్రయాణీకుడి నమాజ్‌ని సగం తగ్గించాడు. అతనికి ఉపవాసం వదిలే అనుమతి కూడా ప్రసాదించాడు. అదేవిధంగా పాలిచ్చే స్త్రీకి, గర్భిణీ స్త్రీకి కూడా ఉపవాసం వదిలే అనుమతి ప్రసాదించాడు." (అబూదావూద్, తిర్మిజి, నసాయి)

(3) హజ్రత్ జాబిర్ బిన్ అబ్దుల్లా (రజి) ఉల్లేఖనం: ఒకసారి దైవప్రవక్త (స) (అనుచరులతో కలసి) ప్రయాణం చేస్తున్నారు. (దారిలో ఓచోట ప్రయాణీకుల్లో) ఒక వ్యక్తి చుట్టూ కొందరు గుమికూడి (ఒక వస్త్రంతో) నీడ పట్టారు. దైవప్రవక్త (స) ఆ జన సమూహం చూసి "ఏమయింది?" అనడిగారు. అప్పుడు జనం "ఒక ఉపవాసి (నీరసంతో ఢీలా పడిపోతున్నాడు.)" అన్నారు. దైవప్రవక్త (స) ఈమాట విని "ప్రయాణావస్థలో రోజా పాటించడం పుణ్యకార్యం కాదు" అని అన్నారు. (ముత్తఫఖున్ అలై)

పై హదీసులో దైవప్రవక్త (స) "ప్రయాణావస్థలో ఉపవాసం పాటించడం పుణ్యకార్యం కాదు" అంటే అన్నివిధాల ప్రయాణావస్థలలో అని, అందరికోసం అని అర్థంకాదు. ప్రయాణం కఠినమైనదా, తేలికయినదా; ప్రయాణావస్థలో ఉపవాసం పాటించే శక్తీ, ధైర్యం తనకు ఉందా, లేదా వగైరా విషయాలన్నీ పరిగణనలోకి తీసుకోవలసి ఉంటుంది.

(4) హజ్రత్ జాబిర్ బిన్ అబ్దుల్లా (రజి) కథనం: మక్కా జయించబడిన యేడు రమజాన్ నెలలో దైవప్రవక్త (స) (తమ అనుచరులతో) మదీనా నుండి మక్కా పట్టణానికి బయలుదేరారు. దారి పొడుగూతూ ఆయన ఉపవాసం పాటించారు. చివరికి 'కురాఅల్ గమీమ్' అనే ప్రదేశానికి చేరుకొని ఆగారు. ప్రజలు ఆరోజు కూడా యథాప్రకారం ఉపవాసం ఉన్నారు. అయితే దైవప్రవక్త (స) ఒక పాత్రలో నీళ్ళు తెప్పించి, ఆ నీటిపాత్రను జనమంతా చూడగలిగేటంత పైకెత్తి పట్టుకున్నారు. తరువాత ఆ నీటిని ఆయన తాగారు. (అంటే ఆ నీటితో రోజా విరమించారు.) ఆ తర్వాత కొందరు దైవప్రవక్త (స) దగ్గరకు వెళ్ళి "మాలో కొందరు ఇంకా ఉపవాసంతోనే ఉన్నారు" అని చెప్పారు. దైవప్రవక్త (స) ఈమాట విని "వారు అవిధేయులు, వారు అవిధేయులు" అని (రెండు సార్లు) అన్నారు. (ముస్లిం)

ఈ హదీసులో దైవప్రవక్త (స) ఉపవాసాన్ని ఏ సమయంలో విరమించారో స్పష్టంగా పేర్కొనబడకపోయినప్పటికీ దైవప్రవక్త (స) ఉపవాసవిరమణ తీరునుబట్టి సూర్యాస్తమయానికి పూర్వమే ఉపవాసం విరమించినట్లు తెలుస్తోంది.

అది నడిఎండాకాలంలో సాగిన సుదీర్ఘప్రయాణం. మక్కా చేరుకొని యుద్ధం చేయవలసిన అవసరం కూడా ఉందప్పుడు. నిర్విరామంగా ఉపవాసాలు పాటిస్తూ ప్రయాణం చేస్తే మక్కా చేరుకునేటప్పటికి యోధులు బలహీనులైపోయి యుద్ధం చేయలేని దుస్థితికి గురికావచ్చు. దైవప్రవక్త (స) వీటన్నిటినీ దృష్టిలో పెట్టుకొని, దేవుడిచ్చిన రాయితీని ఉపయోగించుకుంటూ ఉపవాసం విరమించారు. ఆయన స్వయంగా ఉపవాసం భంగం చేసి తన ఆచరణ ద్వారా అనుచరులు కూడా ఉపవాస భంగం చేయాలని పరోక్షంగా ఆదేశించారు.

ఈ పరోక్ష ఆదేశాన్ని పాటించనివారిని దైవప్రవక్త (సల్లం) 'అవిధేయులు' అన్నారు. అంతేగాని 'మీరు చాలా మంచిపని చేస్తున్నారు. ఉపవాసంలో ధైర్యసాహసాలు చూపుతున్నారు. శభాష్! మీరు గురువును మించిన శిష్యులైపోయారు' అని వాళ్ళను పొగడ లేదు. ఇస్లాంలో అన్నిటికంటే



ముఖ్యమైన విషయం వినయవిధేయతలే. ఇక్కడ ధర్మ పరాయణతకు గీటురాయి దేవునికి, ఆయన ప్రవక్తకు విధేయత చూపడమే. విధేయత లోపించిన ధర్మపరాయణత నిజమైన ధర్మపరాయణత అన్పించుకోదు. పైగా అలాంటి వైఖరి దైవధిక్కార వైఖరి అవుతుంది.

హజ్రత్ అనస్ (రజి) కథనం: మేమొక సారి దైవప్రవక్త (స)తో కలసి ప్రయాణం చేస్తున్నాము. అప్పుడు మాలో కొందరు ఉపవాసంతో ఉన్నారు; మరికొందరు ఉపవాసం లేరు. తీవ్రమైన వేసవి తాపం రోజున మేమొక ప్రదేశానికి చేరుకొని విడిది చేశాము. అక్కడికి చేరుకోగానే ఉపవాసం ఉన్నవారు (అలసిపోయి చెట్ల క్రింద) పడుకున్నారు. ఉపవాసంలేనివారు నడుంవాల్చకుండా గుడారాలు వేయడంలో, ఒంటెలకు నీరు పెట్టడంలో లీనమైపోయారు. అప్పుడు దైవప్రవక్త (స) "ఈరోజు ఉపవాసం లేనివారు అమితమైన పుణ్యఫలం దోచుకున్నారు" అని అన్నారు. (బుఖారి, ముస్లిం)

పై హదీసు బట్టి కఠినమైన ప్రయాణం చేయవలసి వచ్చినప్పుడు ఉపవాసం పాటించక పోవడమే మంచిదనిపిస్తుంది. ప్రయాణం తేలికగా, స్వల్పకాలిక ప్రయాణమయివుండి, చేరుకునే స్థలంలో తగిన సౌకర్యాలు లభించే అవకాశం ఉన్నప్పుడు ఉపవాసాలు పాటించడమే మంచిది.

దైవప్రవక్త (స) ఇలా ఉపదేశించారు: "ఎవరి దగ్గరైనా మంచి వాహనం ఉండి, అది అతడ్ని (రాత్రికి) కడుపు నిండా భోజనం దొరికే (అతను తృప్తిగా తినే) ప్రాంతానికి చేర్చగలిగితే అలాంటి మనిషి రమజాన్ నెల ఉపవాసం పాటించాలి." (అబూదావూద్)

ఈనాడు బస్సులు, రైళ్ళు, విమానాల ద్వారా ప్రయాణం చాలా సులభమయి పోయింది. ప్రయాణ సమయం కూడా చాలా తగ్గిపోయింది. అదీగాక జేబులో డబ్బుంటే చాలు ఎక్కడబడితే అక్కడ ఆహారపదార్థాలు కూడా లభిస్తున్నాయి. అందువల్ల ఈనాటి ప్రయాణీకులు అందరూ కాకపోయినా అనేకమంది పై హదీసు దృష్ట్యా రమజాన్ ఉపవాసాలను ఖజా చేయకుండా పాటించడం మంచిదని నా అభిప్రాయం. ఉపవాసం పాటించకుండా ఖుర్‌ఆన్ ఇచ్చిన రాయితీని ఉపయోగించుకోదలచినవారికి ఈ క్రింది హదీసు ఊతమిస్తుంది. చూడండి ఈ హదీసు:

హజ్రత్ హమ్జా బిన్ అమ్ర్ అస్లమీ (రజి) కథనం: నేనొక సారి దైవప్రవక్త (స)తో మాట్లాడుతూ "దైవప్రవక్తా! నాకు ప్రయాణావస్థలో కూడా ఉపవాసం పాటించే అంతటి శక్తి ఉంది. మరి నేను అలా చేస్తే పాపినవుతానా?" అని అడిగాను. దానికి దైవప్రవక్త (స) సమాధానమిస్తూ "ఇది మహోన్నతుడు, సర్వశక్తిమంతుడయిన దేవుని తరఫున ఇవ్వబడిన రాయితీ. ఎవరైనా ఈ రాయితీని ఉపయోగించుకొని ప్రయోజనం పొందితే ఇది చాలా మంచి విషయం. ఒకవేళ ఎవరైనా ఉపవాసం పాటించడానికే ఇష్టపడితే అందులో దోషం కూడా లేదు" అని అన్నారు. (ముస్లిం)

ఈ హదీసులో ప్రస్తావించబడిన ఉపవాసం నఫిల్ ఉపవాసం గురించినదో లేక రమజాన్ ఉపవాసం గురించినదో పేర్కొనలేదు. నఫిల్ ఉపవాసం గురించి అయితే ప్రయాణావస్థలో నఫిల్ ఉపవాసం పాటించకపోవడమే మంచిదని నా అభిప్రాయం. ఒకవేళ అది రమజాన్ ఉపవాసం గురించి అయితే రమజాన్ ఉపవాసం పాటించడం మంచిదని నా అభిప్రాయం.

"ఒకవేళ మీలో ఎవరైనా వ్యాధిగ్రస్తుడయితే లేదా ప్రయాణావస్థలో ఉంటే అలాంటి వ్యక్తి ఆ తప్పిపోయిన ఉపవాసాలను ఇతర దినాలలో పాటించి (నెల ఉపవాసాలు) పూర్తి

చేయాలి. ఉపవాసం పాటించే శక్తి ఉండి కూడా దానిని పాటించనివారు మాత్రం పాప పరిహారం చెల్లించవలసి ఉంటుంది. ఒక ఉపవాస దినానికి పరిహారంగా ఒక నిరుపేదకు భోజనం పెట్టాలి. (ఈ విషయంలో) ఎవరైనా తమంతట తాము సంతోషంగా మరింత పుణ్యం చేయదలచుకుంటే అది వారికే మేలు చేకూర్చుతుంది. (ఏమైనప్పటికీ) మీరు విషయం గ్రహించగలిగితే ఉపవాసం పాటించడమే మీకు శ్రేయస్కరం." (ఖుర్ఆన్-2:184)

## ఖజా (తప్పిపోయిన) రోజాలు

రమజాన్ ఉపవాసాలలో షరీఅత్ పరమైన కారణం వల్ల కొన్ని ఉపవాసాలు తప్పిపోతే రమజాన్ నెల తరువాత వాటిని ఖజా ఉపవాసాలుగా పాటించాలి. ఈ ఉపవాసాలు వెంటనే పాటించనవసరం లేదు, వచ్చే రమాజన్ లోపు ఎప్పుడైనా పాటించవచ్చు. ఇలా చేయడం దైవప్రవక్త (స) కాలంలో ధర్మసమ్మతమైన విషయమే.

హజ్రత్ ఆయిషా (రజి) కథనం: "నాకు రమజాన్ ఉపవాసాలు(కొన్ని) 'ఖజా'అయి వుండేవి. వాటిని నేను (రాబోయే) షాబాన్ నెలలో పాటించగలిగేదాన్ని." (బుఖారి)

హజ్రత్ ఆయిషా (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "ఒక వ్యక్తి చనిపోయినప్పుడు అతనిపై కొన్ని ఉపవాసాలు పాటించవలసిన బాధ్యత ఉంటే వాటిని అతనికి బదులుగా అతని సంరక్షకుడు పాటించాలి." (బుఖారి, ముస్లిం)

హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఇలా ఉపదేశించారు: "ఒక వ్యక్తి చనిపోయినప్పుడు అతనిపై రమజాన్ ఉపవాసాలు ఏవైనా పాటించవలసిన బాధ్యత ఉంటే అతని తరపున అతని సంరక్షకుడు ప్రతి ఉపవాసానికి బదులుగా (అంటే ఫిదియా కింద) ఒక నిరుపేదకు భోజనం పెట్టాలి." (తిర్మిజి)

పై రెండు హదీసులలో మొదటి హదీసు ఆధారంగా "మృతునిపై రమజాన్ ఉపవాసాల బాధ్యత ఉన్నప్పుడు వాటిని అతని సంరక్షకుడు ఖజా ఉపవాసాలుగా పాటించాల"ని ఇమామ్ అహ్మద్ బిన్ హంబల్ (రహ్మలై) ఫత్వా జారీచేశారు. ఇమామ్ అబూహనీఫా, ఇమామ్ షాఫయి, ఇమామ్ మాలిక్ (రహ్మ)లు మాత్రం "ఈ హదీస్‌లోని ఉపవాసాలు రమజాన్‌కు సంబంధించినవా కావా అనే విషయం లేనందున ఇవి మొక్కుబడి ఉపవాసాలు కావచ్చని, పైగా హదీసులో 'వాజిబ్' (తప్పనిసరి) అని లేదు కనుక అతని సంరక్షకుడు తలచుకుంటే మృతుని తరపున ఈ ఉపవాసాలు ఉండవచ్చని, అదీగాక మరికొన్ని హదీసుల్ని బట్టి ఈ హదీసు ఆతరువాత వచ్చినందు వల్ల ఇది రద్దయి పోయింది" అని చెప్పారు.

రెండవ హదీసు విషయంలో "అసలిది దైవప్రవక్త (స) నోట వెలువడిన ప్రవచనమేనా లేక హజ్రత్ ఇబ్నెఉమర్ (రజి) అభిప్రాయమా" అని ఇమామ్‌లు సందిగ్ధంలో పడ్డారు.

ఇమామ్ మాలిక్ (రహ్మలై) తనకు అందిన ఒక సమాచారం ఈవిధంగా ఉందని తెలియజేశారు: "హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి)ను ఒకతను 'ఏ వ్యక్తి అయినా మరొకనికి బదులుగా ఉపవాసం పాటించగలడా? లేక మరొకతనికి బదులుగా నమాజ్ చేయగలడా?' అని ప్రశ్నించాడు. దానికి హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి) సమాధాన మిస్తూ 'ఏ వ్యక్తి కూడా మరొకని తరపున ఉపవాసం పాటించడంగాని, నమాజ్ నెరవేర్చ డంగాని చేయలేడు" అని అన్నారు." (మువత్తా-ఇమామ్ మాలిక్)



# 32. 'సహ్‌రీ'తో రోజా ఆరంభం

'సహ్‌రీ' అంటే ఉపవాసం పాటించే ఉద్దేశ్యంతో తెల్లవారుజామున భోజనం చేయడం అని అర్థం. సహ్‌రీ వేళ మించిపోయిందని అసలేమీ తినకుండా రోజా పాటించడం మంచిది కాదు. సహ్‌రీ తినకుండా ఉపవాసం ఉండటం వల్ల మధ్యాహ్నం కల్లా మనిషి నీరసించిపోతాడు. సూర్యాస్తమయం వరకు ఆసక్తి, ఉత్సాహాలతో ఉపవాసం పాటించలేడు.

"సహ్‌రీ (భోజనం) చేయండి. సహ్‌రీ చేయడంలో శుభం ఉంది" అన్నారు మహా ప్రవక్త ముహమ్మద్ (స)- (బుఖారి, ముస్లిం)

"సహ్‌రీ భోజనంలో ఎంతో శుభం ఉంది. కనుక సహ్‌రీ చేయడం ఎన్నటికీ వదలి పెట్టకండి. గుక్కెడు నీళ్ళతోనైనా సరే సహ్‌రీ చేయండి. సహ్‌రీ ఆహారం తినే వారిపై దైవకారుణ్యం వర్షిస్తుంది, వారి కోసం దైవదూతలు పాపమన్నింపు ప్రార్థన చేస్తారు" అన్నారు దైవప్రవక్త (సల్లం) మరొక సందర్భంలో. (అత్తర్గీబ్)

దైవప్రవక్త (సల్లం) తమ అనుచరులతో మాట్లాడుతూ "మీలో ఎవరైనా అజాన్ విన్నప్పుడు అతని ముందు కంచంలో అన్నం ఇంకా మిగిలివుంటే, అతనా అన్నం తినే దాకా కంచం వదలి లేవకూడదు" అని అన్నారు. (అబూదావూద్)

హజ్రత్ ఆయిషా (రజి) కథనం: "(రమజాన్ నెలలో) బిలాల్ (రజి) (అర్థ)రాత్రి వేళ ఇంకా ఉండగానే అజాన్ ఇస్తుంటారు. అందువల్ల మీరు (ఆయన అజాన్ గురించి పట్టించుకోకుండా) ఇబ్నె ఉమ్మెమఖ్తూమ్ (రజి) తిరిగి అజాన్ ఇచ్చే వరకు నిరభ్యంత రంగా (సహ్‌రీ) తినవచ్చు, తాగవచ్చు." (బుఖారి, ముస్లిం)

అంతేకాదు "మూడు విషయాలు ప్రవక్తల లక్షణాల్లాంటివి. అవి: 1- సహ్‌రీ ఆలస్యంగా తినడం, 2- ఇఫ్తార్ తొందరగా చేయడం, 3- నమాజ్‌లో ఎడమ చేతిపై కుడిచేయి పెట్టుకోవడం" అని కూడా దైవప్రవక్త (స) తెలిపారు. (ఆసాన్‌ఫిఖ్హా)

"మీరు (ఉపవాసకాలంలో) కడరేయి నలుపు (చీకటి) తగ్గి తొలిజాము తెలుపు (ఉషోదయ కాంతి) కనపడేవరకు హాయిగా తినండి, త్రాగండి. ఆతర్వాత (వీటన్నిటినీ త్యజించి) సూర్యాస్తమయమై చీకటిపడేవరకు ఉపవాసం పాటించాలి." (ఖుర్ఆన్-2:187)

హజ్రత్ అద్దీ బిన్‌హాతిం (రజి) పైసూక్తి విషయంలో తన అనుభవాన్ని ఇలా తెలియ జేశారు: "'నడిరేయి నలుపు తగ్గి తొలిజాము తెలుపు కనబడేవరకు' (2:187) అనే సూక్తి అవతరించినప్పుడు నేను ఒక నల్లదారం, ఒక తెల్లదారం తీసుకొని తలగడ క్రింద పెట్టు కున్నాను. కాని రాత్రి చీకటిలో చూస్తే అవి నాకు కన్పించలేదు. ఉదయం కాగానే నేను దైవప్రవక్త (స) సన్నిధికి వెళ్ళి విషయం తెలిపాను. దైవప్రవక్త (స) అది విని 'వాటి అర్థం రాత్రి నలుపు, పగటి తెలుపు అని గ్రహించాలి' అని అన్నారు." (బుఖారి)

హజ్రత్ సహెల్ బిన్ సాద్ (రజి) కథనం: "'వకులూ వష్రబూ హత్తాయతబయ్యన లకుముల్ ఖైతుల్ అబ్‌యజుమినల్ ఖైతిల్ అస్వది' అనే సూక్తి (2:187) అవతరించింది. 'మినల్ ఫజ్ర్' ఇంకా అవతరించలేదు. అప్పుడు (మాలో) కొందరు ఉపవాసం ఉండేం దుకు (సహ్‌రీ వేళ తెలుసుకోవడానికి) తమ కాళ్ళకు ఒక నల్లదారం, ఒక తెల్లదారం

కట్టుకొని ఆ దారాలు స్పష్టంగా కన్పించేవరకు (రాత్రివేళ నిస్సంకోచంగా) తింటూవుండేవారు. తరువాత దేవుడు 'మినల్ ఫజ్ర్' సూక్తి అవతరింపజేశాడు. దాంతో వారికి ఈ సూక్తి అర్థం పగలు-రేయి అని తెలిసింది." (బుఖారి, ముస్లిం)

దైవప్రవక్త (సల్లం) ఒకసారి ఇలా అన్నారు: "మన ఉపవాసాలకు, గ్రంథప్రజల (యూదులు, క్రైస్తవుల) ఉపవాసాలకు తేడా సహ్రీ భోజనమే." (ముస్లిం)

ఒకసారి ముగ్గురు సహాబీలు ప్రవక్త సతీమణి హజ్రత్ ఆయిషా (రజి) ద్వారా దైవప్రవక్త (సల్లం) ఆరాధనలను గురించి విన్న తరువాత వారిలో ఒకతను తానిక నుంచి ఎల్లప్పుడూ రాత్రంతా నమాజులో గడుపుతానని నిశ్చయించుకున్నాడు. మరొకతను తాను ఎల్లప్పుడూ ఉపవాసవ్రతం పాటిస్తానని, ఒక్కరోజు కూడా విడిచి పెట్టనని అన్నాడు. వేరొకడు తానసలు వివాహమే చేసుకోనని, స్త్రీలతో ఎలాంటి సంబంధం పెట్టుకోనని నిర్ణయించుకున్నాడు.

దైవప్రవక్త (సల్లం) ఈ సంగతి తెలుసుకొని "మీరేనా ఈ మాటలు అంటున్నది? దైవసాక్షి! నేను మీ అందరిలో కెల్లా దేవునికి ఎక్కువగా భయపడేవాడ్ని. అయినా నేను కొన్నాళ్ళు ఉపవాసం ఉంటే, కొన్నాళ్ళు ఉపవాసం లేకుండా గడుపుతున్నాను. రాత్రి వేళల్లో ప్రార్థన కూడా చేస్తాను, నిద్ర కూడా పోతాను. అలాగే స్త్రీలను వివాహమాడి దాంపత్య జీవితం కూడా గడుపుతాను. కనుక నాసంప్రదాయాలు పాటించనివారితో నాకెలాంటి సంబంధం లేదు" అని హెచ్చరించారు. (బుఖారి, ముస్లిం)

'సహ్రీ అంటే రోజూతినే ఆహారంమే కదా! కాకపోతే ఈ ఆహారం ఉషోదయానికి ముందు తినాలి, అంతేగా!' అనుకుంటారు కొందరు. కాని ఇదెంతో శుభవంతమైన ఆహారం.

హజ్రత్ ఇర్బాజ్ బిన్ సారియా (రజి) కథనం: "ఒక సారి దైవప్రవక్త (సల్లం) తనతో పాటు సహ్రీ చేయడానికి నన్ను పిలుస్తూ 'శుభవంతమైన (సహ్రీ) భోజనం చేయడానికి వచ్చెయ్యి' అన్నారు." (అబూదావూద్, నసాయి)

"విశ్వాసికి ఖర్జూరపండ్లు అత్యంత శ్రేష్ఠమైన సహ్రీ (ఆహారం)." (అబూదావూద్)

ఖర్జూర పండ్లలో మానవుని ఆహారపు అవసరాలన్నీ సమకూర్చే సామర్థ్యం ఉంది. మనిషికి ఖర్జూర పండ్లు తప్ప మరే ఆహార పదార్థాలు లభించకపోతే ఆ పండ్లే అతనికి చాలు. వాటిలోనే కావలసిన పోషక పదార్థాలన్నీ ఉన్నాయి.

సైంటిస్టుల పరిశోధన ప్రకారం మానవునికి తన శక్తిసామర్థ్యాలు కాపాడుకోవడానికి ఎన్ని కేలరీల ఆహారం కావాలో అన్ని కేలరీలు ఖర్జూరపండ్లలో ఉన్నాయి. అందుకే ఈనాడు సైనికులు ఎడారి ప్రాంతంలో సుదీర్ఘకాలం ఉండవలసి వచ్చినప్పుడు సాధారణ ఆహారపదార్థాల సరఫరాకు సత్వర అవకాశాలులేని పక్షంలో వారికి ఖర్జూర పండ్లు సరఫరా చేయడం జరుగుతోంది. ఇలా నెలల తరబడి కేవలం ఖర్జూర పండ్లతో గడిపినా వారి శక్తి ఏమాత్రం సన్నగిల్లదు.

ఉపవాసవ్రతం కోసం సంకల్పం ఎంతో అవసరం. ఈ రోజు నేను రమజాన్ ఉపవాసం పాటిస్తున్నానని సంకల్పించుకొని వేకువజాము నుంచి ఉపవాసవ్రతం ప్రారంభించాలి. ప్రతిరోజూ ఉపవాసం ప్రారంభించినప్పుడల్లా ఈవిధంగా సంకల్పించుకోవాలి:



"నవైతు బిసౌమిల్ యౌమ మిన్‌షహ్రి రమజాన్." (అర్థం:- నేను రమజాన్ నెలకు చెందిన ఈ రోజు ఉపవాసం పాటిస్తున్నాను.)

దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రవచించారు: "ఎవరైనా ఫజర్ వేళకు ముందే ఉపవాసం ఉంటానని నిర్ణయించుకోకపోతే అతని ఉపవాసం ఉపవాసం కాజాలదు." (తిర్మిజి)

# 33. ఉపవాసంలో ఆంక్షలు, రాయితీలు

ఉపవాసం అంటే కేవలం కూడు, నీళ్ళు మానెయ్యడం మాత్రమే కాదు. మరెన్నో పనులు మానెయ్యవలసి ఉంటుంది. ఒక ఉపవాసికి ఉపవాస స్థితిలో ఏఏ పనులు చేయకూడదో తెలుసుకోవలసిన అవసరముంది.

హజ్రత్ అబూహురైరా (రజి) కథనం దైవప్రవక్త (సల్లం) ఇలా తెలియజేశారు: "ఉపవాసం ఉన్న వ్యక్తి ఒకవేళ మరచిపోయి ఏదైనా తింటే లేదా త్రాగితే అతని ఉపవాసం భంగం కాదు. కనుక ఉపవాసం ఉన్న వ్యక్తి అలా మరచిపోయి తినడం, త్రాగడం జరిగితే (గుర్తొచ్చిన తరువాత సూర్యాస్తమయం వరకూ మరేమీ తినకుండా, త్రాగకుండా) అతనా ఉపవాసాన్ని పూర్తి చేయాలి. (ఆ మనిషి మరచిపోయి తిన్నా, త్రాగినా) వాస్తవానికి దేవుడే అతనికి తినిపించాడు, త్రాగించాడు." (బుఖారి, ముస్లిం)

నోరు, ముక్కు, చెవి, మల మార్గాల ద్వారా పదార్థాన్ని మెదడు, అన్నకోశాలకు చేర్చడానికి మానవశరీరంలో సహజమైన కవాటాలు ఉన్నాయి. ఈ కవాటాన్ని ఫిఖ్హ్ పరిభాషలో "మన్ఫజ్" అంటారు. మనిషి రోజా స్థితిలో ఉన్నప్పుడు ఎలాంటి పదార్థమైనా 'మన్ఫజ్' గుండా శరీరంలోకి ప్రవేశించనీయకూడదు. ఉపవాసం విషయంలో ఇది సూత్రప్రాయమైన విషయం.

**ఇంజెక్షన్ ద్వారా పదార్థ ప్రవేశం:-** ఇంజెక్షన్ ద్వారా శరీరంలోకి ఎక్కించే ఏ పదార్థమైనా 'మన్ఫజ్' గుండా మెదడుకు, అన్నకోశానికి చేరదు. అందువల్ల మన ఆధునిక ధర్మవేత్తలు పూర్వకాలపు ఫిఖ్హ్‌వేత్తల అభిప్రాయాలను విశ్లేషించిన తరువాత ఇంజెక్షన్ ద్వారా గ్లూకోజ్, రక్తం, మందులు శరీరంలోకి ఎక్కిస్తే ఉపవాసం భంగం కాదని తీర్మానించారు. ఈ ఇంజెక్షన్ శరీరం మీద ఎక్కడ చేసినా రోజా భంగం కాదు. ఈ విషయంలో కొందరు ధర్మవేత్తలు ఇలా ఓ స్పష్టమైన ఉదాహరణ పేర్కొన్నారు:

పాము కరిస్తే దాని విషం శరీరమంతా పాకుతుందని అందరికీ తెలుసు. అయినా పాము కాటు వల్ల ఉపవాసం భంగమవుతుందని ఫిఖ్హ్ గ్రంథాల్లో ఎక్కడా ప్రస్తావన లేదు. దీనిక్కారణం ఈ విషం "సహజసిద్ధమైన మార్గం" (మన్ఫజ్) గుండా శరీరంలోకి ఎక్కదని వీరి అభిప్రాయం. కాని ఇది అంత బలమైన హేతువుగా కన్పించడం లేదు. పాముకాటు వల్ల ఉపవాసం భంగం కాకపోవడానికి కారణం బహుశా శరీరంలోకి పోయే విషం ఆరోగ్యం చేకూర్చడానికి బదులు ప్రాణాపాయం తెచ్చిపెడ్తుందని కావచ్చు.

ఫిఖ్హ్ గ్రంథాల్లో పేర్కొన్న ఉదాహరణలను బట్టి ఒక విషయం మాత్రం స్పష్టంగా అర్థమవుతోంది. శరీరారోగ్యానికి ప్రయోజనం చేకూర్చేదయినా, నష్టం కలిగించేదయినా నోటి గుండా అన్నకోశానికి చేరే పదార్థాలన్నీ ఉపవాస వ్రతాన్ని భంగపరుస్తాయి. నోటి గుండా కాకుండా ఇతర అవయవాల గుండా శరీరంలోకి ప్రవేశించి ప్రయోజనం మాత్రమే చేకూర్చే పదార్థాలు కూడా ఉపవాసాన్ని భంగపరుస్తాయి. అందువల్ల 'హిదాయా' గ్రంథకర్త చెవిలో వేసే మందును

మాత్రమే ఉపవాస భంగకరమైన పదార్థంగా పేర్కొని, నీటిని మినహాయించారు. కారణం పైన పేర్కొన్నట్లు చెవిలో వేసే మందు ప్రయోజనం చేకూర్చుతుంది, నీరు నష్టం కలిగిస్తుంది.

కాబట్టి ఇంజెక్షన్ ద్వారా శరీరంలోకి ఎక్కించే పదార్థం మందయినా, రక్తమయినా సరే అది ఉపవాసాన్ని భంగం చేయదని తెలుస్తోంది. అలాగే నరాల గుండా శరీరంలోకి ఇంజెక్షన్ ద్వారా ఎక్కించే గ్లూకోజ్ కూడా ఉపవాసాన్ని భంగం చేయదు. ఇవి మెదడుకు, అన్నకోశానికి సహజసిద్ధమైన కవాటం(మన్ఫజ్) గుండా చేరవు గనక వాటివల్ల రోజాకు భంగం కలగదు.

**గాయాలపై మందుపూత:-** రెండురకాల గాయాలకు మందు పూస్తే ఉపవాసం చెడిపోతుందని ఫిఖ్హావేత్తలు అభిప్రాయపడ్డారు. అవి: (1) తల మీద మెదడు దాకా అయిన లోతైన గాయం. (2) పొట్ట మీద అన్నకోశం దాకా అయిన గాయం. ఈ రెండు గాయాలకు మందు పూయడం వల్ల ఉపవాసం చెడిపోతుంది. తల, పొట్ట మినహా ఇతర అవయవాలకు మందు పూయడంవల్ల ఉపవాసానికి ఎలాంటి భంగంఉండదు. ఉదాహరణకు- తలకు నూనె రాయడం వల్లగాని, నూనెతో శరీరం మర్దన చేయడం వల్లగాని ఉపవాసం చెడిపోదు.

**చెవులు, కళ్ళలో మందు వేయడం:-** మందు ద్రవ స్థితిలో ఉన్నా, ఘన స్థితిలో ఉన్నా కంటిలో వేస్తే ఉపవాసం భంగం కాదని ఫిఖ్హావేత్తలు తీర్మానించారు. కంటిలో వేసిన మందు గొంతులోకి దిగి దాని రుచి అనుభూతమైనా సరే ఉపవాసం భంగం కాదని "ఫతావా ఆలంగీర్" గ్రంథంలో ఉంది. అలాగే కళ్ళకు సుర్మా లేక కాటుక పెట్టుకోవడం వల్ల, దాని రుచి అనుభూతమైనప్పటికీ ఉపవాసానికి భంగం రాదని "ఖులాసతుల్ ఫతావా" గ్రంథంలో పేర్కొనబడింది. అయితే మందు చెవిలో పోస్తే మాత్రం ఉపవాసం భంగమవుతుంది.

ఇది ఫిఖ్హాశాస్త్రానికి సంబంధించిన సమస్య. కాని ఇప్పుడిది వైద్యశాస్త్రానికి సంబంధించిన సమస్యగా మారింది. అనేకమంది డాక్టర్లు జరిపిన పరిశోధన ప్రకారం చెవికి, మెదడుకు లేక అన్నకోశానికి మధ్య ఎలాంటి కవాటం లేదు. పైగా చెవి అంతర్భాగంలో ఉండే కర్ణభేరి (గూబ) చెవి నుండి మెదడుకు లేక అన్నకోశానికి పోయే దారిని మూసివేస్తుంది. దీనికి భిన్నంగా కంటి నుండి మెదడు వైపుండే దిశలో కవాటం ఉంది. అంటే చెవిలో వేసే మందు రుచి ఏమిటో మనకు తెలియదు. కాని కంటిలో వేసే మందు మాత్రం గొంతులోకి దిగి రుచి తెలుస్తుంది. అందువల్ల వైద్యశాస్త్రం రీత్యా కంటిలో ద్రవస్థితిలో ఉండే మందు వేసుకుంటే ఉపవాసం భంగమవుతుంది; చెవిలో వేసుకుంటే మాత్రం భంగం కాదు. అయితే ఫిఖ్హాదృక్పథం రీత్యా ఉపవాసం ఉండి చెవిలో మందు వేసుకోక పోవడమే మంచిది.

హజ్రత్ అనస్ (రజి) కథనం: ఒకతను దైవప్రవక్త (స) సన్నిధికి వచ్చి "నా కళ్ళలో బాధగా ఉంది. మరి నేను ఉపవాస స్థితిలో కళ్ళకు సుర్మా పెట్టుకోవచ్చా? " అని అడిగాడు. దానికి దైవప్రవక్త (స) "ఆ... పెట్టుకో" అన్నారు. (తిర్మిజి)

ఈ ఉల్లేఖనం బలహీనమైనది. ఒకవేళ సరైనదేనని భావించినా దాని ద్వారా కళ్ళకు సుర్మా మాత్రమే పెట్టుకోవచ్చని తెలుస్తోంది. కళ్ళకు పెట్టుకునే సుర్మా కొద్ది పరిమాణంలో పొడి రూపంలో ఉండే పదార్థం. అంతేగాని ఈ హదీసు ఆధారంగా ద్రవం లేక పేస్టు రూపంలో ఉండే మందు కళ్ళలో వేసుకోవచ్చని చెప్పడం సరికాదు. దీనికి ముందు పేరాలో పేర్కొన్నట్లు కంటి నుండి మెదడు వైపుండే దిశలో కవాటం (మన్ఫజ్) ఉంది గనక కంటిలో వేసే మందు గొంతులోకి దిగి రుచి తెలుస్తుంది. గొంతులోకి మందు దిగితే ఉపవాసం భంగమైనట్లే.



**టూత్‌పేస్ట్, టూత్‌పౌడర్ల వాడకం:-** రోజా స్థితిలో పలుదోముపుల్ల పచ్చదైనా సరే వాడవచ్చని హనఫీ ధర్మవేత్తలు అనుమతించారు. కాకపోతే పలుదోము పుల్లను నీటిలో తడిపి వాడటం మాత్రం 'మక్రూహ్' అని ఇమామ్ అబూయూసుఫ్ (రహ్మ) అభిప్రాయపడ్డారు.

హజ్రత్ ఆమిర్ బిన్ రబీఆ (రజి) కథనం: "దైవప్రవక్త (సల్లం) ఉపవాస స్థితిలో మిస్వాక్ (బ్రష్) చేస్తుండగా ఆయన్ని నేను అనేక సార్లు చూశాను." (తిర్మిజి)

ఈ హదీసును బట్టి మిస్వాక్‌తో పళ్ళు తోముకోవడం వల్ల రోజా భంగంకాదని తెలుస్తోంది. అయితే టూత్‌పేస్ట్, టూత్‌పౌడర్ల రుచి గాఢంగా ఉంటుంది కనుక వీటిని మిస్వాక్‌తో పోల్చలేం. అనివార్య పరిస్థితిలో వాడటం అన్నది వేరే విషయం. బలమైన కారణం లేకుండా ఏదైనా పదార్థం రుచి చూడటం, నమలడం (అవాంఛనీయం) అని ఫిఖ్హావేత్తలు తీర్మానించారు.

**మర్మాంగం గుండా మందు వాడకం:-** ఎలాంటి మందైనా, ద్రవపదార్థమైనా స్త్రీ మర్మాంగం గుండా ఒక చుక్కయినా సరే శరీరంలోకి ఎక్కిస్తే ఆమె రోజా భంగమవుతుందని "ఫతావాఆలంగీర్" గ్రంథంలో ఉంది. అంతేకాదు, చివరికి నీటితో లేక నూనెతో తడిఅయిన వ్రేలిని సైతం స్త్రీ మర్మాంగంలోకి జొప్పిస్తే ఆమె ఉపవాసం భంగమయ్యే ప్రమాదం ఉంది.

స్త్రీ ఉపవాసం భంగమవడానికి కారణం స్త్రీ శరీరంలో గర్భాశయం దాకా వస్తువుని గొనిపోయే సహజసిద్ధమైన కవాటం (మన్ఫజ్) ఉంది. పురుషుని శరీరనిర్మాణం దీనికి భిన్నంగా ఉంది. పురుషుని మూత్రనాళానికి, అన్నకోశానికి మధ్య నేరుగా సహజసిద్ధమైన ఎలాంటి దారిగాని, కవాటం (మన్ఫజ్)గాని లేదు. అందువల్ల పురుషాంగంలోకి ఏదైనా పదార్థంగాని, వస్తువుగాని జొప్పిస్తే అతని ఉపవాసం భంగం కాదు.

హజ్రత్ ఆయిషా (రజి) కథనం: "రమజాన్‌లో దైవప్రవక్త (స)కు ఒక్కోసారి ఆయన లైంగిక అశుద్ధావస్థలో ఉన్నప్పుడు ఫజర్‌వేళ వస్తుంది. ఈ లైంగిక అశుద్ధావస్థ స్వప్న స్ఖలనం వల్ల ఏర్పడే అశుద్ధావస్థ లాంటిదే. కనుక దైవప్రవక్త (స) ఉపవాస స్థితిలో ఉండగా స్నానం చేసేవారు." (బుఖారి, ముస్లిం)

ఈ హదీసులో రమజాన్ ఉపవాసం పాటించడానికి స్వప్నస్ఖలనం అడ్డురాదని, దానివల్ల అయ్యే అశుద్ధావస్థ సంభోగంవల్ల అయ్యే అశుద్ధావస్థ లాంటిది కాదని ఇక్కడ స్పష్టంగా తెలియ జేయబడింది. అంతేకాదు, పగటిపూట స్వప్నస్ఖలనం జరిగినా రోజా భంగం కాదని తెలుస్తోంది. కనుక ఇలాంటి పరిస్థితులు ఎదురయినప్పుడు ఉపవాసం పాటించవచ్చు.

**ఉపవాస స్థితిలో భార్యతో ఎలా మసలుకోవాలి :-**భార్యఅన్నాక భర్త ఉపవాసం ఉన్నప్పటికీ ఎప్పుడో ఒకప్పుడు ఆమెను తాకడం, చేయిపట్టుకోవడం, కలసి కూర్చోవడం జరుగుతాయి. అప్పుడు పురుషుడు తన భార్యతో ఎలా మసలుకోవాలి? ఈ క్రింది హదీసు చూడండి:

హజ్రత్ అబూహురైరా (రజి) కథనం: "ఒకతను దైవప్రవక్త (స)తో మాట్లాడుతూ 'ఉపవాసం పాటిస్తున్న మనిషికి తన భార్యతో కలసిమెలసి మసులుకునేందుకు అనుమతి ఉందంటారా?' అని అడిగాడు. దైవప్రవక్త (స) అతనికి అలా మసలుకోవడానికి అనుమతి ఇచ్చారు. ఆ తర్వాత మరొకతను వచ్చి దైవప్రవక్త (స)ను ఇదే ప్రశ్న అడిగాడు. అప్పుడు దైవప్రవక్త (స) అతడ్ని అలా మసలుకోకూడదని వారించారు. దైవప్రవక్త (స) అనుమతించిన మనిషి వయస్సుమీరిన వృద్ధుడు. కాగా దైవప్రవక్త (స) వారించిన మనిషి యువకుడు."

లైంగిక భావోద్రేకాలను అదుపులో ఉంచగలిగేవారు ఉపవాస స్థితిలో తన భార్యతో కలసిమెలసి మసులుకోవచ్చుని, లైంగిక భావోద్రేకాలను అదుపులో ఉంచుకోలేనివారు అలా చేయకుండా జాగ్రత్త వహించాలని ఈ హదీసు ద్వారా స్పష్టమవుతోంది.

**వేసవితాపం, దప్పిక సమయాల్లో చన్నీటిస్నానం :-** తీవ్రమైన దాహాన్ని, వేసవి తాపాన్ని భరించలేనప్పుడు ఉపవాసి తలమీద చన్నీళ్ళు పోసుకోవడం వల్ల లేదా చన్నీటి స్నానం చేయడం వల్ల ఉపవాసం భంగం కాదు.

దైవప్రవక్త (సల్లం) సహాబీ ఒకరు ఇలా తెలియజేశారు: “నేను (మక్కా, మదీనాల మధ్య ఉన్న) ‘అర్జ్’ ప్రదేశంలో దైవప్రవక్త (సల్లం) తల మీద నీళ్ళు పోసుకుంటుంటే చూశాను. అప్పుడాయన ఉపవాస స్థితిలో ఉన్నారు. తీవ్రమైన దప్పిక వల్లనో, వేసవి తాపం వల్లనో అలా చేశారాయన.” (మాలిక్, అబూదావూద్)

వేసవి తాపం, దప్పిక తీవ్రతలను తగ్గించుకోవడానికి తల మీద చన్నీళ్ళు పోసుకుంటే ఉపవాసం భంగం కాదని పై హదీసు ద్వారా తెలుస్తోంది. అంతేకాదు, చన్నీళ్ళతో తలంటు స్నానం చేసినా, చన్నీళ్ళ గాబులో ఎంత సేపు కూర్చున్నా ఉపవాసం భంగం కాదని కూడా ఈ హదీసు వెలుగులో ధర్మవేత్తలు అభిప్రాయం వెలిబుచ్చారు.

హ్జ్రత్ అబూహురైరా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రవచించారు: “మనిషి ఉపవాస స్థితిలో ఉన్నప్పుడు వాంతి దానంతటది వస్తే అతను ఖజా ఉపవాసం పాటించనవసరం లేదు. మనిషి కావాలని వాంతి చేసుకుంటే మాత్రం ఖజా ఉపవాసం పాటించవలసి ఉంటుంది.” (తిర్మిజి, అబూదావూద్, ఇబ్నెమాజ)

హ్జ్రత్ మాదాన్ బిన్ తల్హా (రహ్మలై) కథనం: నేను డెమాస్కస్ మస్జిద్‌లో హ్జ్రత్ సూబాన్ (రజి)ని కలుసుకోవడం జరిగింది. అప్పుడు నేనాయనతో మాట్లాడుతూ “దైవప్రవక్త (స) వాంతి చేసుకొని (నఫిల్) ఉపవాసం విరమించారని నాకు హ్జ్రత్ అబుద్దర్దా (రజి) చెప్పార”ని అన్నాను. హ్జ్రత్ సూబాన్ (రజి) ఈమాట విని “అబుద్దర్దా (రజి) నిజం చెప్పారు. నేను స్వయంగా దైవప్రవక్త (స) చేతిపై నీళ్ళు పోశాను. పుక్కిలించడానికి ఆయనకు నీళ్ళు అందించాను” అని అన్నారు. (అబూదావూద్, తిర్మిజి)

వాంతి అయినప్పుడు నఫిల్ రోజా విరమించడంలో తప్పు లేదని పై హదీస్ తెలుపుతోంది.

## 34. ఇఫ్తార్ (ఉపవాస విరమణ)

“రోజా పాటింపులో సహ్‌రీ తినడం ద్వారా సహాయం తీసుకోండి. అలాగే తరావీ నమాజ్ నిర్వహణలో మధ్యాహ్నం విశ్రాంతి తీసుకోవడం ద్వారా సహాయం తీసుకోండి” అన్నారు దైవప్రవక్త (స)- (ఆసాన్ ఫిఖ్హా, రెండవ భాగం)

తీవ్రమైన ఆకలిదప్పులతో ఢీలాపడిపోయి, కళ్ళు లోపలికి పీక్కుపోయి, జీవచ్ఛమై ఉండే మనిషికి గుక్కెడు గంజినీళ్ళు దొరికినా చాలు, అమితమైన సంతోషంతో పొంగిపోతూ దాన్ని అమృతంలా సేవిస్తాడు. అతని కళ్ళలో దైవం పట్ల కృతజ్ఞతాజ్యోతులు వెలిగిపోతాయి.

“ఉపవాసం పాటించే మనిషికి రెండు సంతోషకరమైన విషయాలు ఉన్నాయి. ఒకటి ఉపవాస విరమణ సమయంలో. రెండు, తన ప్రభువును సందర్శించే సమయలో.



ఉపవాసం పాటించే మనిషి నోటికంపు దేవునికి కస్తూరీ సువాసన కన్నా ఎంతో ప్రియ మయినది.” (బుఖారి, ముస్లిం)

సూర్యాస్తమయం కాగానే ఉపవాస విరమణ (ఇఫ్తార్) కోసం ఇలా దుఆ చేయాలి: “అల్లాహుమ్మ లక సుమ్‌తు వఅలా రిజ్‌ఖిక అఫ్‌తర్తు” (దేవా! నేను నీ కోసం రోజా పాటించాను. నీవు ప్రసాదించిన ఆహారంతోనే రోజా విరమిస్తున్నాను) ఇలా దుఆ చేసిన తరువాత ఖర్జూర పండ్లుగాని, మరేదయినా పదార్థంగాని తినడం ద్వారా ఇఫ్తార్ చేయాలి. ఇఫ్తార్ చేసిన తరువాత ఇలా ‘దుఆ’ చేయడం మంచిది: “జహబజ్జమాఉ వబ్‌తల్లతిల్ ఉరూఖు వసబతల్ అజ్‌రు ఇన్‌షాఅల్లాహ్” (దాహం తీరింది. నరాలు నిండిపోయాయి. దేవుడు తలిస్తే ప్రతిఫలం కూడా తప్పక లభిస్తుంది.) (అబూదావూద్)

సూర్యాస్తమయం తరువాత ఇఫ్తార్ కోసం ఆలస్యం చేయకూడదు. సహ్‌రీ ఆలస్యంగా చేయాలని, ఇఫ్తార్ తొందరగా చేయాలని దైవప్రవక్త (స) ఆదేశించారు. ఆ మహనీయుని ఆదేశం పాటించడం కంటే గొప్ప ధర్మపరాయణత మరేం కాగలుగుతుంది?

దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: “ప్రజలు ఉపవాస విరమణ (ఇఫ్తార్) తొందరగా చేస్తున్నంత కాలం మంచికి కట్టుబడి ఉంటారు.” (బుఖారి, ముస్లిం)

దైవప్రవక్త (స) ప్రవచనం: “రాత్రి(చీకటి) అటువైపు నుంచి రావడం ప్రారంభమై, పగలు(వెల్తురు) ఇటువైపు నుంచి (కనుమరుగై) పోవడం మొదలై సూర్యుడు అస్తమించి నప్పుడు ఉపవాసికి అతని ఉపవాస వేళ ఆరంభమవుతుంది.” (ముత్తఫకున్ అలై)

దైవప్రవక్త (స) దేవుని మాటలను ఇలా తెలిపారు: “నా దాసులలో అందరికంటే ఉపవాస విరమణలో తొందర చేసేవారే నాకెక్కువ ప్రియమైనవారు.” (తిర్మిజి)

హ్జ్రత్ ఇబ్నె అబీ ఔ ఫా (రజి) కథనం: మేమొక సారి దైవప్రవక్త (సల్లం)తో కలసి ప్రయాణం చేస్తున్నాం. అప్పుడు దైవప్రవక్త (స) ఉపవాసంతో ఉన్నారు. సూర్యుడు కను మరుగైపోగానే ఆయన (మాలో) ఒకతడ్ని ఉద్దేశించి “దిగు. దిగి నాకోసం సత్తుపిండి కలిపితీసుకురా” అన్నారు. అతనీ మాట విని “దైవప్రవక్తా! ఇంకాస్సేపు ఆగండి, చీకటి అలుముకుంటే మంచిది కదా!” అన్నాడు. కాని దైవప్రవక్త (స) అతడ్ని మళ్ళీ ఆదేశిస్తూ “వాహనం దిగి నాకోసం సత్తుపిండి కలిపి తీసుకురా” అన్నారు. దానికా వ్యక్తి “దైవప్రవక్తా! పగటి వెల్తురు ఇంకా ఉంది కదా! (ఇంకాస్సేపు ఆగితే మంచిదేమో)” అన్నాడు. దైవప్రవక్త (స) మళ్ళీ “వాహనం దిగి నాకోసం సత్తుపిండి కలిపి తీసుకురా” అన్నారు.

అప్పుడతను వాహనం దిగి మాఅందరి కోసం సత్తుపిండి తయారుచేశాడు. దైవ ప్రవక్త (స) సత్తుపిండి తిని “రాత్రిచీకటి అటు(తూర్పు) వైపు నుండి అలుముకోనారం భించడం చూడగానే ఉపవాసి తన ఉపవాసాన్ని విరమించాలి” అన్నారు. (బుఖారి)

హ్జ్రత్ జైద్ బిన్ ఖాలిద్ (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ఇలా అన్నారు: “ఒక వ్యక్తి ఏ ఉపవాసికైనా ఉపవాస విరమణ చేయిస్తే లేదా ఏ యోధుడి కోసమైనా (యుద్ధ) సామగ్రి సరఫరా చేస్తే అలాంటి వ్యక్తికి ఉపవాసికి ఉపవాసం పాటించినందుకు లభించే, యోధుడికి యుద్ధం చేసినందుకు లభించే పుణ్యమే లభిస్తుంది.” (బైహఖి)

## పరిహారం, ప్రాయశ్చిత్తం

ఎవరైనా రమజాన్ మాసంలో షరీఅత్ పరమైన కారణం లేకుండా కేవలం బద్ధకంతో ఒక రోజు ఉపవాసం మానేసినా లేదా ఉపవాస స్థితిలో మనస్సును అదుపులో పెట్టుకోలేక భార్యతో రమించినా సరే, దానికి ప్రాయశ్చిత్తంగా రెండు నెలలు నిరంతరాయంగా ఉపవాసాలు పాటించాలి. ఆ రెండునెలల కాలంలో ఒక్క రోజు తప్పినా మళ్ళీ రెండు నెలలు నిరంతరాయంగా ఉపవాసం పాటించవలసి ఉంటుంది. ఒకవేళ వృద్ధులు, బలహీనులు ఎవరైనా నిరంతరాయంగా రెండు నెలలు ఉపవాసం పాటించలేకపోతే అరవై మంది పేదలకు రెండు పూటలా కడుపునిండా భోజనం పెట్టాలి. అది తాను తినేటటువంటి భోజనమయి ఉండాలి.

అది రమజాన్ నెల. మదీనాలో ప్రజలు వరాలవసంతానికి నీరాజనం పడ్తున్నారు. ఓరోజు దైవప్రవక్త (స) కొందరు అనుచరులతో సమావేశమైఉన్నారు. అప్పుడు ఒక వ్యక్తి ఎంతో ఆందోళన చెందుతూ దైవప్రవక్త (స) సన్నిధికి వచ్చాడు. అతని బక్కచిక్కిన శరీరం, చినిగిన బట్టలు అతని దుర్భర దారిద్ర్యాన్ని చెప్పకనే చెబుతున్నాయి. అతను రాగానే "దైవప్రవక్తా! నేను నాశనమైపోయాను" అన్నాడు. అక్కడ కూర్చున్నవారందరి దృష్టి ఒక్కసారిగా ఆ వ్యక్తి మీదికి మళ్ళింది. "ఏమిటి! ఏమైంది నీకు?" అనడిగారు దైవప్రవక్త (స) ఆదుర్దాగా. "దైవప్రవక్తా! నేను ఉపవాసముండి నా భార్యతో కలిశాను" అన్నాడతను.

"అయితే (దీనికి పరిహారంగా) నువ్వు ఒక బానిసను (విముక్తి కలిగించడానికి) తీసుకురాగలవా?" అడిగారు దైవప్రవక్త (స). "తీసుకురాలేనండీ!" అన్నాడతను. "సరే, మధ్యలో ఒక్క నాగా కూడా లేకుండా వరుసగా రెణ్ణెల్ల పాటు ఉపవాసం పాటించగలవా?" మళ్ళీ ప్రశ్నించారు దైవప్రవక్త (స) "(అన్ని రోజులు) పాటించలేనండీ" "పోనీ, అరవై మంది పేదలకు అన్నదానం చేయగలవా?" "లేదండీ, అంత తాహతు కూడా లేదండీ నాకు" అన్నాడు ఎముకల గూడులో నకనకలాడుతున్న ఆ వ్యక్తి.

"అయితే అక్కడ కూర్చో కాస్సేపు" అన్నారు దైవప్రవక్త (స). ఆ తరువాత దైవప్రవక్త (స) కొన్నిక్షణాలు మౌనంగా ఉండిపోయారు. అంతలో ఎవరో ఒకతను దైవప్రవక్త (స) సన్నిధికి ఖర్జూరపండ్లతో నిండిన ఓపెద్ద బుట్ట తీసుకువచ్చాడు.

అప్పుడు దైవప్రవక్త (స)- "ఏడా మనిషి? నాశనమయిపోయానంటూ వచ్చిన మనిషి ఎక్కడున్నాడు?" అన్నారు అనుచరుల్ని ఉద్దేశించి. "ఇక్కడే ఉన్నానండి నేను" అంటూ ఆ వ్యక్తి లేచి దైవప్రవక్త (స) సమీపానికి వచ్చాడు. "ఇదిగో ఈ పళ్ళబుట్ట తీసికెళ్ళి (నీ పాపనిష్కృతిగా ఇందులోని పళ్ళు) పేదలకు దానంచెయ్యి" అన్నారు దైవప్రవక్త (స).

"దైవప్రవక్తా! (ఈ పళ్ళు తీసికెళ్ళి) నాకంటే ఎక్కువ పేదవాడికి దానం చెయ్య మంటున్నారా? దైవసాక్షి! నాకుటుంబానికి మించిన పేదకుటుంబం మొత్తం మదీనాలోనే లేదు" అన్నాడా వ్యక్తి. ఈ మాటలు వినగానే దైవప్రవక్త (స) పకాలున నవ్వారు. "సరే, ఈ పళ్ళను నువ్వే తీసికెళ్ళి నీ భార్యాపిల్లలకు తినిపించు" అన్నారు ఆయన (పళ్ళబుట్టను ఆ నిరుపేద అనుచరుడికి అందజేస్తూ).

(సహీ బుఖారి, సహీ ముస్లిం గ్రంథాలలోని ఒక హదీసు ఆధారంగా)



# 35. తరావీ నమాజ్, ఏతికాఫ్

ఇస్లాం రమజాన్‌లో అదనంగా 'తరావీహ్' నమాజులను నిర్ణయించింది. తరావీహ్ నమాజ్ 'సున్నతె ముఅక్కిద.' అంటే దైవప్రవక్త (స) తన జీవితకాలంలో ఎన్నడూ విడువకుండా చేసిన నమాజులన్నమాట. దైవదాసుడు సంతోషంగా చేసే ఈ అదనపు నమాజ్ వల్ల అతనికి ఇతర దినాల్లో చేసే ఫర్జ్ నమాజ్ అంత పుణ్యఫలం లభించగలదు.

దైవప్రవక్త (స) ప్రవచనం: "ఎవరయితే రమజాన్ నెల రాత్రుళ్ళలో విశ్వాసంతో కూడిన పరిస్థితిలో, పరలోక పుణ్యఫలం ఆర్జించాలన్న సంకల్పంతో (తరావీహ్) నమాజ్ చేస్తారో దేవుడు అతను లోగడ చేసిన పాపాలన్నిటిని క్షమిస్తాడు." (మిష్కాత్-పాక్షికం)

తరావీహ్ బహువచనం. దాని ఏకవచనం 'తర్‌వీహ.' అరబీభాషలో తర్‌వీహ అంటే విశ్రాంతి తీసుకోవడం, కాస్సేపు కూర్చోవడం అని అర్థం. ఇస్లామీయ షరీఅత్ పరిభాషలో తర్‌వీహ అంటే రమజాన్ నెల రాత్రి సమయాల్లో చేసే అదనపు (నఫిల్) నమాజుల సందర్భంగా ప్రతి నాలుగు రకాతుల తరువాత కాస్సేపు విశ్రాంతి తీసుకోవడం అని అర్థం.

**సామూహిక తరావీ నమాజ్:-** తరావీ నమాజ్ జమాఅత్‌తో కలసి సామూహికంగా చేయడం సంప్రదాయమై పోయింది. దైవప్రవక్త (స) రమజాన్ మాసం 23, 25, 27 తేదీలలో మూడు రాత్రులు మాత్రమే తరావీ నమాజ్ సామూహికంగా చేయించారు. ప్రజలు ఈ నమాజ్ పట్ల ఎంతో ఆసక్తి, ఉత్సాహం కనబరస్తూ మస్జిద్‌కు రాసాగారు. మూడవ రాత్రి నాటికి వారి సంఖ్య గణనీయంగా పెరిగిపోయింది. ఆ తరువాత దైవప్రవక్త (స) తరావీ నమాజ్ కోసం మస్జిద్‌కు రాలేదు. అప్పుడు అనుచరులు బహుశా దైవప్రవక్త (స) పడుకొని ఉంటారని భావించి ఆయన ఇంటికి పోయి కేకవేసి పిలువసాగారు.

వారి పిలుపుకు దైవప్రవక్త (స) బయటికొచ్చి ఇలా అన్నారు: "(తరావీ పట్ల) మీ ఆసక్తి, ఉత్సాహాలలో దేవుడు మరింత శుభం కలిగించుగాక! ఈ నమాజ్ మీకు ఫరజ్ అయిపోతుందేమోనని, ఒకవేళ ఫరజ్ అయిపోతే మీరు దాన్ని ఎల్లప్పుడూ పాటించలేరేమో నని భయపడి నేను బయటికిరాలేదు. కనుక మీరీ నమాజ్‌ని మీ ఇండ్లలోనే చేస్తుండండి. నఫిల్ నమాజులు ఇండ్లలో చేయడమే ఎక్కువ పుణ్యప్రదమైనవి." (ముస్లిం)

ఈహదీసుని బట్టి తరావీనమాజ్ సామూహికంగా చేయడం ధర్మసమ్మతమేనని తెలుస్తోంది. కారణం దైవప్రవక్త (స) ఈ నమాజ్ మూడురాత్రులు సామూహికంగా చేశారు. అదీగాక దైవప్రవక్త (స) హితోపదేశం విన్న అనుచరులు కూడా ఆయన కాలంలో, ఆయన తదనంతరం మస్జిద్‌లోనే చిన్నచిన్న జమాఅత్‌లుగా ఏర్పడి తరావీనమాజ్ సామూహికంగా చేస్తుండేవారు. చివరికి రెండవ ఖలీఫా హజ్రత్ ఉమర్ (రజి) తరావీనమాజ్ సామూహికంగా చేసే పనిని క్రమబద్ధీకరించారు. అంటే ఆయన ఒకే మస్జిద్‌లో చిన్న చిన్న జమాఅత్‌లు కాకుండా ఒకే జమాఅత్ రూపంలో ఈ సామూహిక నమాజ్‌ని క్రమబద్ధీకరించారు. ప్రవక్త అనుచరులంతా దాన్ని అంగీకరించారు.

ఈ పని దైవప్రవక్త (సల) చేసివుంటే సామూహిక తరావీనమాజ్ ఫరజ్ (విధి) అయివుండేది. హజ్రత్ ఉమర్ (రజి) ఖలీఫా అయినప్పటికీ ప్రవక్తేతర వ్యక్తి గనుక ఆయన క్రమబద్ధీకరించిన సామూహిక తరావీనమాజ్ 'ఫరజ్' అన్న ప్రసక్తి రాదు.

**రకాతుల సంఖ్య:-** ఇషానమాజ్ తరువాత (వితర్‌కు ముందు) చేసే తరావీహ్ నమాజ్ రెండేసి రకాతుల చొప్పున ఇరవై రకాతులు చేయాలి. 'అహ్లెహదీస్' ప్రజలు ఎనిమిది రకాతులే

చేస్తారు. అనేక ఉల్లేఖనాలు వారి అభిప్రాయాన్ని సమర్థిస్తున్నాయి. అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి) ఉల్లేఖించిన ఒక హదీసులో ఇరవై రకాతుల ప్రస్తావన ఉంది. అహ్లెహదీస్ అభిప్రాయాన్ని సమర్థించే హదీసుల సమక్షంలో ఈ హదీసు బలహీనమైనది. అయితే హజ్రత్ ఉమర్ (రజి) పాలనాకాలంలో సామూహిక తరావీనమాజ్ ప్రారంభమైనప్పుడు ప్రవక్త అనుచరులంతా ఏకాభిప్రాయంతో ఇరవై రకాతులే చేసేవారు. హజ్రత్ ఉస్మాన్, హజ్రత్ అలీ (రజి)ల పాలనాకాలాల్లో కూడా ఇరవై రకాతులే చేసేవారు. దీంతో ప్రవక్త అనుచరులలో ఎవరూ విభేదించ లేదు.

ఇరవై రకాతుల తరావీ నమాజ్‌పై ముగ్గురు ఖలీఫాలు ఏకీభవించడం, సహాబీలలో ఎవరూ విభేదించక పోవడం గమనిస్తే దైవప్రవక్త (స) కాలంలో కూడా ప్రజలు తరావీ నమాజ్‌లో ఇరవై రకాతులే పఠించేవారని నిరూపితమవుతోంది. ఇక ఇమాముల విషయానికి వస్తే ఇమామ్ అబూహనీఫా, ఇమామ్ షాఫయి, ఇమామ్ అహ్మద్ (రహ్మ)లు ఇరవై రకాతుల నమాజ్‌నే సమర్థించారు. ఇమామ్ మాలిక్ (రహ్మ)కూడా ఓ సందర్భంలో ఇరవై రకాతుల అభిప్రాయాన్నే వెలిబుచ్చారు. హజ్రత్ దావూద్ జాహిరీ (రహ్మ) కూడా దీన్ని సమర్థించారు.

ఒకవేళ అహ్లెహదీస్ వారి దృక్పథమే సరయినదనుకుంటే ఇరవై రకాతుల నమాజ్ పట్ల ప్రవక్త అనుచరుల్లో కొందరైనా అభ్యంతరం లేవదీసిఉండాలి. కాని అలాంటిదేమీ జరగలేదు. పైగా వారంతా ఇరవై రకాతులనే సమర్థించారు. అహ్లెహదీస్ దృక్పథాన్ని సమర్థించే ఉల్లేఖనాలు "ముత్తఫఖున్అలై" హదీసుల జాబితాలో కూడా లేవు. దీన్నిబట్టి ఈ ఉల్లేఖనాలలో ఎక్కడో గందరగోళం జరిగినట్లు అన్పిస్తోంది నా మట్టుకు.

ఈ వివరణతో నేను ఏదో ఒక వర్గానికి వత్తాసు పలకడం నా ఉద్దేశం కాదు. ధర్మావగాహనా దృక్పథాలలో వచ్చిన విభేదాల కారణంగా ప్రజలు పరస్పరం రాగద్వేషాలకు పోకూడదని, ఇస్లాంలోని మౌలిక విషయాలపై దృష్టి కేంద్రీకరించి వారు తమపై మోపబడిన ధర్మప్రచార బాధ్యతను సమైక్యంగా నిర్వహిస్తూ ఉండాలని మాత్రమే నేను కోరుకుంటున్నాను. ధర్మావగాహనా దృక్పథం విషయానికి వస్తే, ఎవరైనా సరే ఏదో ఒక దృక్పథాన్ని మాత్రమే అనుసరించడం సహజం. నేను అంతే. అంతమాత్రాన రెండవ దృక్పథం అనుసరిస్తున్నవారు సత్యమార్గంలో లేరని నేను ఎన్నటికీ చెప్పలేను. నేను ఇరవై రకాతుల ఇమామ్ వెనుక కూడా తరావీ నమాజ్ చేశాను; ఎనిమిది రకాతుల ఇమామ్ వెనుక కూడా తరావీ నమాజ్ చేశాను.

తరావీ నమాజ్‌లో ప్రతి నాలుగు రకాత్‌ల తర్వాత కాస్సేపు విశ్రాంతి తీసుకోవడం ప్రవక్త (స) సంప్రదాయం. ఈ విరామ సమయంలో దైవధ్యానం (జిక్ర్)గాని, నఫిల్ నమాజ్‌గాని చెయ్యవచ్చు. ఖుర్ఆన్ కూడా పఠించవచ్చు లేదా ఊరికనే మౌనంగా కూర్చోవచ్చు. ఈ విషయంలో ముఖ్తదీలు ఇమాంని అనుసరించనవసరం లేదు. దైవప్రవక్త (సల్లం) కాలంలో మౌనంగా కూర్చోవడానికి బదులు మక్కాలోని ప్రజలు కాబా ప్రదక్షిణ చేసేవారు; మదీనాలోని ప్రజలయితే నాలుగు రకాతుల నఫిల్ నమాజ్ చేసేవారు.

ఈనాడు కొన్నిచోట్ల ప్రతి నాలుగు రకాత్‌ల తరువాత ఖుర్ఆన్ అనువాదం విన్పించడం జరుగుతున్నది. ఇది చాలా మంచి విషయం. ఇలా ఖుర్ఆన్‌లో ఏముందో తెలుసుకోవడానికి ఓ చక్కని అవకాశం లభిస్తుంది. అరబీ భాష తెలిసినవారయితే తరావీహ్ నమాజ్‌లోనే ఖుర్ఆన్‌ని అర్థం చేసుకోవచ్చు. రమజాన్ నెలలో తరావీహ్ నమాజ్‌లో కనీసం ఒకసారి మొత్తం ఖుర్ఆన్ గ్రంథాన్ని పఠించడం లేదా వినడం ప్రవక్తసంప్రదాయం. అందుకే మస్జిద్‌లలో ఈ నెల ప్రత్యేకంగా హాఫిజ్‌ల ఏర్పాటు జరుగుతుంది.



దైవప్రవక్త (స) నమాజ్‌లో ఖుర్ఆన్‌ని ఆగిఆగి నిదానంగా పఠించేవారు. ఈ విషయమై హజ్రత్ అబూవాయిల్ (రహ్మలై) కథనం వినండి. ఆయన ఇలా అన్నారు:

ఒక వ్యక్తి హజ్రత్ అబ్దుల్లా బిన్ మస్‌వూద్ (రజి) దగ్గరికి వచ్చి "నేను గతరాత్రి ఒక్క రకాత్‌లో 'ముఫస్సిల్' సూరాలన్నీ పఠించాను" అని అన్నాడు. అబ్దుల్లా బిన్ మస్‌వూద్ (రజి) ఈమాట విని "ఏమిటీ నువ్వు కవుల మాదిరిగా వడివడిగా పఠిస్తున్నావా?" అని అడిగారు. ఆ తర్వాత ఆయన 'నజాయిర్' సూరాలను గురించి నాకు బాగా తెలుసు. దైవప్రవక్త (స) వాటిని కలిపేసి (ఒక్కొక్క రకాతులో) పఠించేవారు" అని అన్నారు. ఆయన 'ముఫస్సిల్' సూరాలలో ఇరవై సూరాలను ప్రస్తావించి "వీటిలో దైవప్రవక్త (స) ప్రతిరకాతులో రెండేసిసూరాలు పఠించేవారు" అని చెప్పారు. (బుఖారి, ముస్లిం)

ఖుర్ఆన్‌లోని ఫతహ్ సూరా నుంచి చివరి సూరా వరకున్న 66 సూరాలను "ముఫస్సిల్" సూరాలు అంటారు. పోతే సూక్తుల సంఖ్యారీత్యా పరస్పరం పోలిక వున్న పది జంట సూరాలను "నజాయిర్" సూరాలు అంటారు. ఇవి ఈ విధంగా ఉన్నాయి: (1) అర్రహ్మాన్-అన్నజ్మ్, (2) ఇఖ్తరబత్-అల్‌హాఖ్ఖా, (3) జారియా-తూర్, (4) వాఖియా-నూన్, (5) సాలసాయిల్-నాజియాత్, (6) వైలుల్లిల్ ముతఫ్ఫిఫీన్-అబస, (7) ముదస్సిర్-ముజమ్మిల్, (8) హల్‌హతాక-లాఉఖ్సిమ్, (9) అమ్మయతసాలూన్- ముర్సలాత్, (10) ఇజష్షమ్సు కువ్విరత్- దుఖ్ఖాన్.

## ఏతికాఫ్ (తపోనిష్ఠ)

రమజాన్ మాసంలో ఉపవాసవ్రతం, తరావీహ్ నమాజ్, ఫిత్రాదానం తరువాత "ఏతికాఫ్"కు ఎంతో ప్రాముఖ్యం ఉంది. ఏతికాఫ్ అంటే శాబ్దిక అర్థం తననుతాను ఆపి ఉంచడం లేక ఏదైనా విషయంపై స్థిరంగా ఉండటం. షరీఅత్ పరిభాషలో మనిషి ఓ ప్రత్యేక రీతిలో ఓ నిర్ణీతకాలం మస్జిద్‌లో ఉండి పోవడం లేక తనను తాను ఆపిఉంచడాన్ని ఏతికాఫ్ అంటారు. ఏతికాఫ్ సామూహిక విధి (ఫర్జెకిఫాయా). అంటే ఒక వాడలో, లేక ఒక మస్జిద్ పరిధిలో ఏ ఒక్కరు ఏతికాఫ్ పాటించినా అందరి బాధ్యత నెరవేరుతుంది.

"మీరు మసీదుల్లో ఎతెకాఫ్(తపోనిష్ఠ) పాటిస్తున్నప్పుడు మీభార్యల్ని కలుసుకోకూడదు. ఇవి దేవుడు నిర్ణయించిన హద్దులు. వాటి దరిదాపులకు వెళ్ళకండి. ప్రజలు (పెడత్రోవ తొక్కకుండా) భయభక్తులతో మెలిగేందుకే దేవుడు ఈవిధంగా తన ఆదేశాలను విడమరచి తెలియజేస్తున్నాడు. (ఖుర్ఆన్-2:187)

ప్రతి ఏడూ రమజాన్ నెల చివరి పది రోజులు మస్జిద్‌లో ఏతికాఫ్ పాటించడం ప్రవక్త సంప్రదాయం. రమజాన్‌లో దైవప్రవక్త (స) పరిస్థితే మారిపోయేది. ప్రత్యేకంగా రమజాన్ చివరి పదిరోజులు ఆయన రాత్రిళ్ళు ఇతోధికంగా జాగరణ చేసి దైవారాధనలో గడిపేవారు.

లైలతుల్ ఖద్ర్‌ని పొంది, దాన్ని సద్వినియోగం చేసుకోవడానికి మంచి సాధనం 'ఏతికాఫ్.' రమజాన్ చివరిదశకంలో తొమ్మిది పదిరోజులపాటు ప్రపంచవ్యవహారాలన్నీ పక్కన బెట్టి కేవలం దైవారాధన, దైవసంస్మరణ సంకల్పంతో మస్జిద్‌లో ఉండిపోవడాన్నే ఏతికాఫ్ అంటారు.

ఏతికాఫ్ కోసం మస్జిద్‌లో ఓమూల కొంతస్థలాన్ని ప్రత్యేకించుకోవాలి. అక్కడ ఓ పరదా కట్టుకొని డేరాలా తయారుచేసుకోవాలి. అందులో రమజాన్ 21వ తేదీ నుంచి పది రోజులపాటు ఉండాలి. అక్కడే తినడం, త్రాగడం, పడుకోవడం చేయాలి. పెద్ద అవసరమేదీ లేకుండానే బయటికి పోకూడదు. ఫర్జ్ నమాజ్ మాత్రం డేరా నుంచి బయటికొచ్చి జమాఅత్‌తోనే చేయాలి.

విశ్వప్రభువు ఏ విశ్వాసికీ ఇవ్వనటువంటి ఓ ప్రత్యేక వరాన్ని ఏతికాఫ్ చేసే వ్యక్తికి ఇస్తున్నాడు. అతని విషయంలో దైవప్రవక్త (స) ఏమన్నారో చూడండి:

"ఏతికాఫ్ చేసే వ్యక్తి (ఏతికాఫ్ దినాలలో) చెడులకు దూరంగా ఉంటాడు. అందువల్ల అతను (ఇతర దినాలలో) చేసే సత్కార్యాలన్నిటికీ రాయబడే పుణ్యాలన్నీ ఇప్పుడు (ఏతికాఫ్‌లో ఉన్నప్పుడు) కూడా అతనికి రాయబడతాయి." (ఇబ్నెమాజ)

## 36. లైలతుల్‌ఖద్ర్ (మహాశుభరాత్రి)

యావత్ మానవ చరిత్రలోనే కనీవినీ ఎరుగని ఓ అద్భుత సంఘటన సంభవించింది. ఆ సంఘటన మానవుల చరిత్రగతిని సమూలంగా మార్చి, ఓ నూతన ప్రపంచ ఆవిష్కరణకు నాందీవాచకం పలికింది. అది మానవుని సకల జీవన రంగాల్లోనూ అణువణువునా మానవత్వాన్ని నూరిపోసి అతణ్ని అత్యున్నత నైతికశిఖరాలపైకి చేర్చింది. ఈ సంఘటన సంభవించిన శుభ సమయం ఒక రాత్రిలో కొన్ని ఘడియలు మాత్రమే అయినప్పటికీ ఆ రాత్రి అంతా శుభ ప్రదమయిన రాత్రే. అంతేకాదు ఆ రాత్రి వచ్చే నెల కూడా శుభప్రదమైనదిగానే పరిగణించబడింది. ఆ నెలే వరాల వసంతమైన రమజాన్ మాసం.

రమజాన్ నెలలోని ఆ శుభరాత్రినే ఖుర్‌ఆన్ "లైలతుల్ ఖద్ర్" అని పేర్కొన్నది.

"మేము దీన్ని ఘనతగల రాత్రిన అవతరింపజేశాం. ఘనతగల ఆరాత్రి ఏమిటో నీకేం తెలుసు? ఆ మహారాత్రి వేయినెలలకన్నా ఎంతో శ్రేష్ఠమైనది. ఆ రాత్రి పరిశుద్ధాత్మ, దైవ దూతలు తమప్రభువు అనుమతితో ప్రతివ్యవహారానికి సంబంధించిన ఆజ్ఞలు తీసుకొని అవతరిస్తారు. అది ఉషోదయం వరకు శుభవంతమైన రాత్రి." (ఖుర్‌ఆన్-97:1-5)

'ఖద్ర్' అంటే ఎంతో విలువైన, ఘనమైన, గౌరవప్రదమైన అని అనేక అర్థాలు ఉన్నాయి. లైలతుల్‌ఖద్ర్ అంటే ఎంతో విలువైన, ఘనమైన, గౌరవప్రదమైన రాత్రి అని భావం. దుఖాన్ సూరాలో ఖుర్‌ఆన్ ఓ శుభరాత్రి అవతరించిందని ఉంది. అంటే ఈ రాత్రిని గొప్ప శుభాల నిలయంగా పేర్కొనవచ్చు. ఈ వరాలవసంతాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకోవడానికి దైవప్రవక్త (స) షాబాన్ నెల నుంచే తేదీలు లెక్కబెడ్తూ రమజాన్ నెలారంభ సమయం కోసం ఎదురు చూసేవారు. దాన్ని గురించి అనుచరులకు కూడా తాకీదు చేస్తూ "రమజాన్ తేదీలు తెలుసు కోవడానికి వీలుగా షాబాన్ నెలవంక లెక్కగడ్తూ ఉండండ"ని సెలవిచ్చారు.

దైవప్రవక్త (స) షాబాన్ నెల చివరిరోజుల్లో ఓసారి ఇలా బోధించారు: "ప్రజలారా! మీ కోసం ఒక మహోజ్వలమైన, ఎనలేని శుభాల నెల రాబోతున్నది. అందులోని ఒక రేయి వేయి నెలలకన్నా శ్రేష్ఠమైనది. దేవుడు ఈనెలలో ఉపవాసాల పాటింపు విశ్వాసులకు వ్యక్తిగత విధి (ఫర్జెఅయిన్)గా నిర్ణయించాడు." (బైహఖి)

దైవప్రవక్త (స) ప్రవచనం: "మీకు ఈ నెల వచ్చింది. ఇందులో ఒక రాత్రి వేయి నెలల కంటే కూడా శ్రేష్ఠమైనది. దీనికి నోచుకోనివాడు యావత్తు శ్రేయోశుభాలకు దూర మైపోతాడు. పరమదౌర్భాగ్యుడే దాని శ్రేయోశుభాలకు దూరమైపోతాడు." (ఇబ్నెమాజ)

అంచేత రమజాన్ రోజాలను నిరాకరించినవాడు అవిశ్వాసి అవుతాడని, షరీఅత్ కారణం లేకుండా వీటిని వదలినవాడు పాపాత్ముడిగా పరిగణించబడతాడని ఫిఖ్హావేత్తలు నిర్ధారించారు.



దైవప్రవక్త (స) ప్రవచనం: లైలతుల్‌ఖద్ర్ రాగానే హజ్రత్ జిబ్రీల్ (అలై) ఓపెద్ద దైవ దూతల బృందంతో భూలోకానికి వస్తారు. అప్పుడు నిల్చొని, కూర్చొని మహోన్నతుడైన దేవుణ్ని స్మరించే ప్రతి దైవదాసుడి కోసం ఆయన దుఆ చేస్తారు. పండుగరోజు వచ్చాక దేవుడు తన దాసుల పట్ల దైవదూతల ముందు గర్విస్తాడు. "దైవదూతలారా! తనకు అప్పగించిన పనిని నెరవేర్చిన కార్మికుడికి ప్రతిఫలం ఏమిట"ని వారిని ప్రశ్నిస్తాడు. దానికి దైవదూతలు "కార్మికుడికి అతని వేతనం పూర్తిగా ఇచ్చేయాలి" అని అంటారు.

అప్పుడు దేవుడు ఇలా అంటాడు: "దైవదూతలారా! నేను నా దాసులకు, దాసీలకు అప్పగించిన బాధ్యతను వారు నెరవేర్చారు. ఇప్పుడు వీరు నన్ను దీనాతిదీనంగా వేడుకోవ డానికి ఇండ్ల నుంచి (ఈద్‌నమాజ్ కోసం) బయలు దేరారు. (వినండి!) నా గౌరవప్రతిష్ఠల సాక్షిగా, నారౌద్రత సాక్షిగా, నాదాక్షిణ్యం సాక్షిగా, నామహోన్నత హోదా-అంతస్తుల సాక్షిగా, నాఅత్యున్నత స్థాయి సాక్షిగా, చెబుతున్నాను- నేను వీరి వేడుకోళ్ళను తప్పకుండా స్వీకరిస్తాను." ఆ తర్వాత దేవుడు తనదాసుల్ని ఉద్దేశించి "(నా దాసులారా!) నేను మిమ్మల్ని క్షమించాను. మీ పాపాలను పుణ్యాలుగా మార్చేశాను, వెళ్ళండి" అంటాడు-

దైవప్రవక్త (స) ఈ విషయాలు చెబుతూ "అప్పుడు వారు దేవుడు తమను క్షమించిన స్థితిలో తమ (ఇండ్లకు) మరలిపోతారు" అని అన్నారు. (బైహఖి)

ఒకసారి హజ్రత్ ఆయిషా (రజి) "దైవప్రవక్తా! నాకే గనక లైలతుల్ ఖద్ర్‌ని దర్శించే భాగ్యం లభిస్తే దైవాన్ని నేనేం వేడుకోను?" అనడిగారు. దానికి దైవప్రవక్త (స) "అల్లాహుమ్మ ఇన్నక అఫువ్వున్ తుహిబ్బుల్ అఫ్ వఫఅవఫ్ అన్నీ" (దేవా! నీవు అమితంగా క్షమించేవాడివి. క్షమాభిక్ష అంటే నీకెంతో ఇష్టం. కనుక నన్ను క్షమించు) అని వేడుకో అన్నారు. (మిష్కాత్)

ఈ "మహారాత్రిన మన పాపాల మన్నింపు కోసం దైవాన్ని వేడుకోవడం నఫిల్ నమాజ్ చేయడం కన్నా ఉత్తమం" అని ఇమామ్ సుఫియాన్ సౌరీ (రహ్మలై) అన్నారు.

దివ్యఖుర్‌ఆన్‌లోని 'ఖద్ర్' సూరాలో "దైవదూతలు, జిబ్రయీల్ (అలైహి) ఈ రాత్రి తమ ప్రభువాజ్ఞతో అన్ని రకాల ఉత్తర్వులను, ఆదేశాలను తీసుకొని అవతరిస్తారని" ఉంది. దుఖాన్ సూరాలో ఈ రాత్రిని దైవాజ్ఞతో అన్ని వ్యవహారాలకు సంబంధించిన తిరుగులేని గట్టి నిర్ణయాలు జారీ చేయబడే రాత్రి అని పేర్కొనడం జరిగింది.

హజ్రత్ ఆయిషా (రజి) ప్రకారం 'లైలతుల్‌ఖద్ర్'ని రమజాన్ నెల చివరి పది రాత్రుల్లోని బేసి రాత్రుల్లో అన్వేషించమని దైవప్రవక్త (స) చెప్పారు. (బుఖారి, ముస్లిం)

దైవప్రవక్త (స) ప్రవచనం: "లైలతుల్ ఖద్ర్‌ని రమజాన్ నెల చివరి దశకంలో అన్వేషించండి. అంటే 21, 23, 25, 27, 29 తేదీలలో అన్వేషించండి." (బుఖారి)

దైవప్రవక్త (స) అనుచరులు అనేక మంది రమజాన్ నెల చివరి ఏడు తేదీలలో లైలతుల్‌ఖద్ర్ ఉన్నట్లు కల గాంచారు. ఈ వార్త దైవప్రవక్త (స) దృష్టికి రాగా ఆయన ఇలా అన్నారు: "మీరు కలలో రమజాన్‌నెల చివరి ఏడురోజుల విషయంలో ఏకాభి ప్రాయానికి వచ్చినట్లు కన్పిస్తున్నారు. కనుక ఇక నుంచి లైలతుల్‌ఖద్ర్‌ని అన్వేషించే మనిషి రమజాన్ నెల చివరి ఏడు తేదీలలో అన్వేషించాలి." (ముత్తఫఖున్ అలై)

లైలతుల్‌ఖద్ర్‌కు సంబంధించిన జ్ఞానాన్ని దేవుడు వాపసు తీసుకున్నప్పుడు దైవప్రవక్త (స) తమ అనుచరులతో "బహుశా అందులోనే మీ శ్రేయస్సు ఉంది కనుక మీరిప్పుడు దాన్ని 21వ లేదా 23వ లేదా 25వ తేదీ రాత్రి వెతకండి" అని సెలవిచ్చారు. (బుఖారి)

హజ్రత్ అబూహురైరా (రజి) ఉల్లేఖించారు: "27వ రాత్రి లేక 29వ రాత్రి అని ఈ మహారాత్రిని గురించి దైవప్రవక్త (స) అన్నారు." (అబూదావూద్)

హజ్రత్ అబూజర్ (రజి)ను ఈ రాత్రిని గురించి అడిగితే ఆయన, హజ్రత్ ఉమర్ (రజి), హజ్రత్ హుజైఫా (రజి), ఇంకా ఇతర సహాబీలలో ఏ ఒక్కరికీ ఆ రాత్రి 27వ రాత్రి అనే విషయంలో అనుమానంలేకుండేదని అన్నారు. (ఇబ్నె అబిషైబా)

షబేఖద్ర్ గురించి సహాబీల అభిప్రాయాలు ఎలా ఉన్నా దేవుడు అది ఫలానా రాత్రి అని మాత్రం నిక్కచ్చిగా చెప్పలేదని తెలుస్తోంది. దీనిక్కారణం ప్రజలు ఏదో ఒక రాత్రితో తృప్తి పడకుండా ఆ మహారాత్రి శుభాలతో ప్రయోజనం పొందాలనే ఆసక్తితో వీలైనన్ని ఎక్కువ రాత్రులు దైవారాధనలో గడుపుతారని కావచ్చు.

దైవప్రవక్త (స) ప్రవచనం: "ఎవరు (దృఢమైన) విశ్వాసంతో, ఆత్మపరిశీలన (స్పృహ)తో రమజాన్ ఉపవాసాలు పాటిస్తాడో, అతని గత పాపాలన్నీ క్షమించబడతాయి. అలాగే మరెవరు (దృఢమైన) విశ్వాసంతో, ఆత్మపరిశీలన (స్పృహ)తో రమజాన్ నెలలో రాత్రి జాగరణ (అంటే తరావీ నమాజ్) చేస్తాడో, అతని గత పాపాలు కూడా క్షమించబడతాయి. అలాగే ఎవరు మహాశుభరాత్రిన విశ్వాస స్ఫూర్తితో, ఆత్మపరిశీలన స్పృహతో రాత్రి జాగరణ చేస్తాడో అతని గత పాపాలు కూడా క్షమించబడతాయి." (బుఖారి, ముస్లిం)

# 37. పేదలహక్కు ఫిత్రాదానం

రమజాన్ నెలలో ఉపవాసాలు, ఖుర్‌ఆన్ పఠనం, నమాజ్‌లతోపాటు దానధర్మాలు కూడా ఇతోధికంగా చేయాలి. ఉపవాసం ఉన్నవారికి ఇఫ్తార్ విందు చేయడం కూడా గొప్ప పుణ్యకార్యమే. పేదవాడి ఆకలిబాధను ఆచరణాత్మకంగా అర్థంచేసుకోవడానికి ఉపవాసవ్రతమే ఉత్తమసాధనం. కడుపు నింపుకోవడం, సుఖాలు జుర్రుకోవడం జీవితం అసలు ధ్యేయం కాదని, వాటికంటే జీవితానికి ఎంతో విలువ ఉందని ఉపవాసవ్రతం మనకు గుణపాఠం నేర్పుతుంది.

"ఒకసారి దైవప్రవక్త (సల్లం) ఒక వ్యక్తి తేన్పుతుంటే చూసి- 'తేన్పును తగ్గించు. ప్రపంచంలో ఉండగా బాగా కడుపునిండా తిన్న వ్యక్తి ప్రళయదినాన అందరికంటే ఎక్కువ ఆకలితో ఉంటాడు" అని అన్నారు. (తిర్మిజ)

అందువల్ల రమజాన్ నెలలో అత్యధికంగా దానధర్మాలు చేయడం, ఇతర ధర్మకార్యాలకు డబ్బు ఖర్చు చేయడం జరగాలి. ఈ లక్ష్యం కోసమే ఫిత్రా మనకు ఫర్జ్ (విధి)గా నిర్ణయించబడింది. ఫిత్రా పేదల హక్కు. దాన్ని తప్పనిసరిగా నెరవేర్చాలి.

రమజాన్ ఉపవాసవ్రతాలన్నీ ఎలాంటి ఆటంకాలు లేకుండా పూర్తయితే దైవదాసునికి కలిగే ఆనందం వర్ణనాతీతం. దైవం పట్ల అతని హృదయం కృతజ్ఞతాభావంతో నిండిపోతుంది. ఆ కృతజ్ఞతను వెలిబుచ్చుకోవడానికి అతను ఈద్‌నమాజ్ చేస్తాడు. దానికి ముందు అతను తన సంతోషాన్ని తోటి దాసులతో ముఖ్యంగా నిరుపేద దాసులతో పంచుకుంటాడు.



సమాజంలో కడుపునిండా తిండికి, ఒంటినిండా బట్టకు సైతం నోచుకోని నిర్భాగ్యజీవులు ఎందరో ఉన్నారు. పండుగ శుభసందర్భంలో ఇలాంటి పేదవాళ్ళకు సహాయం అందజేయడం కన్నా విశ్వాసికి గొప్ప సంతోషం మరొకటి ఏముంటుంది? దివ్యఖుర్‌ఆన్ అవతరించిన రమజాన్ నెలలో పేదలకు అందజేసే ఈ సహాయాన్నే ఫిత్రా (ఫిత్ర్) దానం అంటారు.

## రోజా విరమణ రుసుం

'ఫిత్ర్' అంటే ఉపవాసాల్ని విరమించడం లేక పరిసమాప్తం చేయడం అని అర్థం. ఈదుల్ ఫిత్ర్ అంటే రమజాన్ రోజాలు ముగించి సంతోషించే రోజు. అదే పండుగరోజు. ఫిత్రా దానం రమజాన్ ఉపవాసాలను పూర్తి చేసిన సందర్భంగా పేదలకు ఇవ్వాల్సిన తప్పనిసరి దానం.

దైవప్రవక్త (స) ఇలా అన్నారు: "పండుగకు ముందే (పేదలకు) చేసే ఫిత్రాదానం దేవుని దృష్టిలో 'స్వీకృత ఫిత్రా'గా పరిగణించబడుతుంది. పండుగ తరువాత చేసే ఫిత్రాదానం సాధారణమైన దానం అవుతుంది." (బుఖారి)

హజ్రత్ అబ్దుల్లా బిన్‌అబ్బాస్ (రజి) కథనం: దైవప్రవక్త (స) ఫిత్రాదానం నిర్ణయించడానికి కారణం- అది ఉపవాసకులను పనికిమాలిన పనుల నుండి, సిగ్గుమాలిన చేష్టల నుండి ప్రక్షాళనం చేస్తుంది. మరోవైపు పేదల కోసం ఆహారపానీయాల ఏర్పాటు జరుగుతుంది. కనుక పండుగ నమాజ్‌కు ముందే చెల్లించే ఫిత్రాదానం స్వీకృత దానంగా పరిగణించబడుతుంది. పండుగ నమాజ్ తర్వాత చెల్లించే ఫిత్రాదానం సాధారణమైన దానంలాగా ఒక దానం అవుతుంది." (అబూదావూద్, ఇబ్నెమాజ)

రమజాన్ ఉపవాసాలు ఫరజ్ (విధి)గా నిర్దేశించబడిన తరువాత దైవప్రవక్త (స) తన మనిషి ఒకడ్ని పట్నం వీధుల్లోకి పంపి ఈవిధంగా ప్రకటన చేయించారు: "(జనులారా!) వినండి. ప్రతి ముస్లిం పురుషుడు, స్త్రీ, బానిస, స్వేచ్ఛాపరుడు, చిన్నా, పెద్దా అందరూ ఫిత్రా దానం విధి (వాజిబ్)గా చెల్లించాలి." (తిర్మిజ)

హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి) కథనం: "ముస్లిం అయిన ప్రతి పురుషుడు, స్త్రీ, బానిస, స్వేచ్ఛాపరుడు, చిన్నా, పెద్దా ఫిత్రాదానంగా ఒక 'సా' ఎత్తు గోధుమలు గాని, యవలుగాని (పేదలకు) విధిగా చెల్లించాలని దైవప్రవక్త (స) నిర్దేశించారు. ఈ ఫిత్రా ఈద్గాహ్‌కు వెళ్ళకముందే చెల్లించాలని కూడా ఆయన ఆదేశించారు." (బుఖారి)

ఫిత్రా ఇవ్వగల ఆర్థికస్తోమత ఉన్న ప్రతి ముస్లిం రమజాన్ ఉపవాసాలు ఉన్నా లేకపోయినా ఫిత్రా మాత్రం పేదలకు తప్పనిసరి (వాజిబ్)గా ఇవ్వాలి. హదీసులో వచ్చిన ఫిత్రా కొలమానం, పరిమాణాలను గురించి ఈనాటి ధర్మవేత్తలు పరిశోధించి తమ అభిప్రాయాలు ప్రకటించారు. దానిప్రకారం ఫిత్రాదానంగా (ఒక మనిషి తరపున) సుమారు పావుతక్కువ రెండు కిలోలు గోధుమలు గాని, అంతే ఖరీదుగల ఇతర ఆహారధాన్యాలుగాని పేదలకు అందజేయాలి. లేదా ఆ ఖరీదు నగదు రూపంలోనైనా ఇవ్వచ్చు, వస్త్రరూపంలోనైనా ఇవ్వచ్చు.

కుటుంబంలో ఎంతమంది సభ్యులుంటే అంతమంది వైపునా ఫిత్రా చెల్లించవలసిందే. చివరికి అప్పుడే పుట్టిన పిల్లల తరపున కూడా వారి సంరక్షకులు ఫిత్రా దానం చెల్లించవలసి ఉంటుంది. భార్య ఫిత్రా చెల్లించవలసిన బాధ్యత భర్తపై లేకపోయినా, అతను చెల్లిస్తే ఆమెపై ఉన్న ఫిత్రాబాధ్యత తీరిపోతుంది. ఫిత్రా ఈద్‌నమాజ్‌కు ముందే చెల్లించాలి.

## పాప వినాశిని

ఈ ఫిత్రా చెల్లింపు వెనుక విశ్వాసికి మరో ప్రయోజనం కూడా ఉంది. మనిషి ఎంత నిష్ఠగా ఉపవాసవ్రతాలు పాటించినప్పటికీ 'మానవ సహజ దౌర్బల్యం' కారణంగా అతని వల్ల కొన్ని పొరపాట్లు జరుగుతాయి. ఒక్కొక్కసారి అతనికి తెలియకుండానే ఈ పొరపాట్లు జరగడం కూడా సంభవమే. అందువల్ల ఈ పొరపాట్లు, బలహీనతలు హరించబడేందుకు ఇస్లాం ధర్మశాస్త్రం (షరీఅత్) ముస్లిములకు ఫిత్రా చెల్లింపును వాజిబ్ (విధి)గా నిర్ణయించింది.

హజ్రత్ అబ్దుల్లా బిన్ మస్ఊద్ (రజి) ఫిత్రా ప్రాముఖ్యాన్ని తెలుపుతూ ఇలా అన్నారు: "దైవప్రవక్త (స) ఫిత్రా దానాన్ని విధిగా నిర్ణయించడానికి కారణం ఏమిటంటే- ఉపవాసవ్రతంలో పొరపాటున మననోట పనికిమాలిన మాటలు వెలువడుతుంటాయి. ఇంకా అనాలోచితంగా మన హృదయంలో చెడు తలంపులు కూడా కలుగుతుంటాయి. అందువల్ల ఫిత్రాదానం వల్ల (ఈ పొరపాట్లన్నీ క్షమించబడి) మన ఉపవాసాలు ప్రక్షాళనం అవుతాయి. మరో వైపు దీనిద్వారా పేదలకు ఆహారం (లాంటి ప్రాథమిక అవసరాలు) కూడా ఏర్పాటవుతుంది." (మిష్కాత్)

# 38. హజ్, ఉమ్రాల ప్రాముఖ్యం

'హజ్' అంటే సందర్శనా సంకల్పం అని అర్థం. షరీఅత్ పరిభాషలో కాబా చేరుకొని ప్రత్యేక నియమాలతో చేసే ఆరాధన అని అర్థం. ఇది నిర్ణీత దినాలలో మాత్రమే నెరవేర్చాలి. ముస్లింలు దైవాలయాన్ని సందర్శిస్తామని సంకల్పించుకుంటారు గనక దీన్ని హజ్ అన్నారు. 'ఉమ్రా' అంటే కూడా సందర్శనా సంకల్పం అనే అర్థం. ఇక్కడ ఉమ్రా అంటే చిన్నహజ్ అని అర్థం. దీనికి ఒక నిర్ణీత మాసం, తేదీ అంటూ ఏమీ లేవు. ఎప్పుడైనా చేయవచ్చు.

"మానవుల కోసం నిర్మించబడిన మొట్టమొదటి ఆరాధనాలయం మక్కాలో ఉన్నదే. అది ఎంతో శుభప్రదమైనది, యావత్ మానవాళికి మార్గదర్శకమైనది. అందులో (కళ్ళున్న వారికి) అనేక సూచనలున్నాయి. ఆ సూచనల్లో ఇబ్రాహీం (ప్రార్థనకోసం నిలబడే) చోటొకటి. అందులో (కాబాలో) ప్రవేశించే ప్రతివ్యక్తీ శాంతీ, రక్షణా పొందగలడు." (ఖుర్ఆన్-3:96)

"సత్యతిరస్కారులు (ప్రజలను) దైవమార్గంలోకి రానివ్వకుండా నిరోధిస్తున్నారు. మేము ప్రజలందరి కోసం నిర్మించిన ప్రతిష్ఠాలయాన్ని సందర్శించ నీయకుండా ఆటంకాలు సృష్టిస్తున్నారు. ప్రతిష్ఠాలయంపై స్థానికులకేగాకుండా, బయట నుండి వచ్చేవారి క్కూడా సమాన హక్కులున్నాయి. అలాంటి దేవాలయంలో ఎవరైనా సరే నీతిమార్గం తప్పి దౌర్జన్యానికి పాల్పడితే వారికి మేము దుర్భరశిక్ష చవిచూపిస్తాం." (ఖుర్ఆన్-22:25)

"అక్కడకు చేరుకోగలిగేవారు దాన్ని విధిగా సందర్శించాలి. (హజ్ చేయాలి.) ఇది ప్రజలపై దేవునికున్న హక్కు. ఈ ఆజ్ఞను శిరసావహించడానికి నిరాకరించేవాడు దేవుడు నిరపేక్షాపరుడని తెలుసుకోవాలి." (ఖుర్ఆన్-3:97)

దైవప్రవక్త (స)ను కొందరు అనవసరమైన విషయాలను గురించి అడిగేవారు. ఖుర్ఆన్‌లో హజ్ విధిగా చేయబడిందని అవతరించిన సూక్తి విని ఒకతను "ప్రతియేడూ విధిగా చేయాలా?" అనడిగాడు. దానికాయన జవాబివ్వలేదు. అతను మళ్ళీ అడిగాడు.



దానికీ జవాబివ్వలేదు. ఆ వ్యక్తి మూడోసారి అడిగినప్పుడు దైవప్రవక్త (స) ఇలా అన్నారు: "మీధోరణి చాలా శోచనీయం. నేను గనక ఔనంటే హజ్ ప్రతియేడూ విధి అవుతుంది. అప్పుడు మీరే దాన్ని పాటించలేక అవిధేయతకు పాల్పడతారు." (ముస్లిం)

దైవప్రవక్త (స) ఇలా అన్నారు: "ప్రజలారా! మీ కోసం హజ్ విధిగా నిర్ణయించ బడింది. కనుక ఆ విధిని పాటించే విషయాన్ని గురించి ఆలోచించండి." (ముస్లిం)

ఒక వ్యక్తి దైవప్రవక్త (స) సన్నిధికి వచ్చి "హజ్‌ను ఏ విషయాలు విధి (ఫర్జ్)గా చేస్తున్నాయి?" అని అడిగాడు. దానికి ఆయన "దారి ఖర్చులు, వాహన ఏర్పాటు" అని సమాధానమిచ్చారు. (మిష్కాత్)

స్తోమతఉన్న ముస్లిం జీవితంలో ఒకసారి హజ్, ఉమ్రా విధులు తప్పక నిర్వహించాలి. హజ్ చేసేటంత డబ్బు సమకూరగానే హజ్ విధి(ఫరజ్) అవుతుంది. మున్ముందు పరిస్థితులు ఎలా ఉంటాయో చెప్పలేం. అంచేత ఆరోగ్యం, ఆర్థికస్తోమత ఉన్నప్పుడే వీలైనంత త్వరగా హజ్ విధి నిర్వహించాలి.

దైవప్రవక్త (స) ప్రవచనం: "హజ్ చేయడానికి నిర్ణయించుకున్న మనిషి దాన్ని త్వరగా నెరవేర్చాలి. (అలా చేయకపోతే) బహుశా (వచ్చే ఏడు) అతను వ్యాధిగ్రస్తుడైనా కావచ్చు లేదా అతని వాహనం కనపడకుండా ఎటయినా పోవచ్చు. లేదా (వచ్చే ఏడు) హజ్ చేయడానికి వీలుకుదరని మరేదైనా పని తగలవచ్చు." (ఇబ్నెమాజా)

దైవప్రవక్త (స) ప్రవచనం: "హజ్, ఉమ్రా యాత్రలు చేసేవారు దేవుని అతిథులు. కనుక వారు ఏదీ వేడుకున్నా దేవుడు వారికి దాన్ని అనుగ్రహిస్తాడు. క్షమాపణ కోరుకుంటే దేవుడు వారి పాపాలను క్షమిస్తాడు." (ఇబ్నెమాజ)

దైవప్రవక్త (స) ప్రవచనం: "హాజీ ఎన్నటికీ పేదరికానికి గురికాలేడు." (తబ్రాని)

"దేవుని ప్రవక్త దావూద్ దేవుడ్ని ప్రార్థిస్తూ 'ప్రభూ! నీ ఆలయాన్ని దర్శించడానికి వచ్చిన నీ దాసులకు ఏం ప్రతిఫలం లభిస్తుంది?' అనడిగారు. దానికి దేవుడు 'దావూద్! వారు నాఅతిథులు. నేను ప్రపంచంలో వారిపాపాలు క్షమిస్తాను. ఇది వారి హక్కు. వారు నన్ను కలుసుకున్నప్పుడు నేను వారిని మన్నిస్తాను' అని అన్నాడు." (మిష్కాత్)

"అన్నిటికంటే శ్రేష్ఠమైన ఆచరణ విశ్వాసానికి సంబంధించి సాక్ష్యం చెప్పడం. తరువాత హిజ్రత్ (వలస), జిహాద్ (ధర్మ పోరాటం)లు. ఆ తర్వాత మబ్రూర్ హజ్, మబ్రూర్ ఉమ్రాలకు మించిన గొప్ప ఆచరణ లేదు." (ముస్నద్ అహ్మద్)

మబ్రూర్‌హజ్ లేక మబ్రూర్‌ఉమ్రా అంటే చిత్తశుద్ధి, స్పృహ, నియమనిబంధనలతో చేసే హజ్ లేక ఉమ్రా అని అర్థం. ప్రయాణం చేస్తున్నప్పుడు, హజ్ ఆచారాలు పాటిస్తున్నప్పుడు మనిషి ఎలాంటి పాపాలకు పాల్పడకుండా నిష్ఠతో మసలుకోవడానికి కూడా ప్రయత్నించాలి.

దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "హజ్ సందర్భంలో ఎలాంటి అశ్లీల విషయా లకు పాల్పడకుండా, దేవుని అవిధేయతకు దూరంగా మసలుకుంటూ హజ్ చేసే వ్యక్తి పాపాలను దేవుడు పూర్తిగా తుడిచిపెట్టి, ఈరోజే అతను తనతల్లి గర్భం నుండి పుట్టినంత పవిత్రంగా అతడ్ని ప్రక్షాళన చేస్తాడు" (బుఖారి, ముస్లిం)

దైవప్రవక్త (స) ప్రవచనం: "హజ్, ఉమ్రాలు ఒకదాని తర్వాత ఒకటి వరుసగా నిర్వహించండి. కొలిమి లోహాన్ని, వెండి బంగారాలను కరగబెట్టి వాటి మాలిన్యాలను తొలగించి ఎలా శుద్ధి చేస్తుందో, అలా హజ్, ఉమ్రాలు రెండూ దారిద్ర్యాన్ని, పాపాలను సమూలంగా తుడిచేస్తాయి. మబ్రూర్‌హజ్‌కు ప్రతిఫలం స్వర్గమే." (తిర్మిజి, నసాయి)

దైవప్రవక్త (స) హితోక్తి: "ఎవరైనా హజ్ లేక ఉమ్రా చేసే ఉద్దేశంతో ఇంటి నుండి బయలుదేరి దారిలోనే చనిపోతే, దేవుడు అతని కర్మపత్రంలో హాజీకి, గాజీ (సమర యోధుడు)కి, ఉమ్రా చేసేవానికి నిర్ణయించిన పుణ్యఫలమే వ్రాస్తాడు." (ముస్లిం)

దేవుడు స్త్రీల కోసం జిహాద్‌ను విధి (ఫర్జ్)గా చేయలేదు. అయితే వారికోసం దేవుడు హజ్‌యాత్రను జిహాద్‌తో సమానమైన సత్కార్యంగా నిర్ణయించాడు.

దైవప్రవక్త (స) ప్రవచనం: "వృద్ధులు, బలహీనులు, స్త్రీలకు హజ్, ఉమ్రాల వల్ల లభించే పుణ్యఫలం జిహాద్ పుణ్యఫలంతో సమానంగా ఉంటుంది." (మిష్కాత్)

హజ్రత్ హుసైన్ (రజి) కథనం: ఒక వ్యక్తి దైవప్రవక్త (స) దగ్గరకు వచ్చి "అయ్యా! నా శరీరం కూడా బలహీనమైనది, నా హృదయం కూడా బలహీనమైనది. (ఇలాంటి పరిస్థితిలో నేను ధర్మయుద్ధంలో ఎలా పాల్గొనాలి?)" అని అన్నాడు. దైవప్రవక్త (స) ఈమాట విని "అయితే నీవు ఒక ముల్లు కూడా గుచ్చుకొనని ధర్మయుద్ధం (జిహాద్) చెయ్యి" అన్నారు. ఆ వ్యక్తి (ఆశ్చర్యపోతూ) "ఏమాత్రం కష్టనష్టాలు ఎదురుకాని ధర్మ యుద్ధం ఏమిటీ?" అని అడిగాడు. దానికి దైవప్రవక్త (స) "నీవు హజ్‌యాత్ర జరుపు" అని సమాధానమిచ్చారు. (తబ్రాని)

"ఒకతను అరఫాత్ మైదానంలో దైవప్రవక్త (స)కు చాలా దగ్గర్లో తన ఒంటె మీద కూర్చున్నాడు. కాని హఠాత్తుగా అతను ఒంటె మీద నుంచి క్రిందపడి చనిపోయాడు. అప్పుడు దైవప్రవక్త (స) అనుచరులతో మాట్లాడుతూ ఇలా అన్నారు: 'ఇతని భౌతిక కాయానికి స్నానం చేయించి, ఇహ్రాం దుస్తుల్లోనే ఇతడ్ని ఖననం చేయండి. ఇతను ప్రళయదినాన (లబ్బైక్ అల్లాహుమ్మ లబ్బైక్ అని) తల్బియా పఠిస్తూ లేస్తాడు. ఇతని తల మీద, ముఖం మీద ఆచ్ఛాదన లేకుండా ఉంచండి." (బుఖారి, ముస్లిం)

దైవప్రవక్త (స) ప్రవచనం: "ఒకతని దగ్గర హజ్ చేయడానికి కావలసిన ప్రయాణ సామగ్రి, వాహనం ఉండి తద్వారా కాబా చేరుకోగల శక్తి ఉన్నా అతను హజ్ చేయక పోతే, అలాంటి వ్యక్తి యూదుడై చనిపోయినా లేక క్రైస్తవుడై చనిపోయినా ఒకటే; భేదమేమీ లేదు. ఎందుకంటే 'దైవగృహానికి చేరుకోగలిగేవారు దాన్ని విధిగా సందర్శిం చాలి. ఇది ప్రజలపై దేవునికున్న హక్కు' అని ఖుర్‌ఆన్‌లో ఉంది." (ముస్లిం)

ఖుర్‌ఆన్‌లో ఒక చోట "నమాజ్‌ని స్థాపించండి, బహుదైవారాధకులతో కలసిపోకండి" (30:31) అనిఉంది. అంటే నమాజు చేయని ముస్లింలను ఖుర్‌ఆన్ బహుదైవారాధకులతో పోల్చింది. అలాగే పైహదీసులో స్తోమతఉన్నా హజ్ నిర్వహించకుండా చనిపోయే ముస్లింలను దైవప్రవక్త (స) యూదులతో, క్రైస్తవులతో పోల్చారు.

అజ్ఞానకాలంలో అరబ్ బహుదైవారాధకులు హజ్ చేసేవారు కాని, నమాజ్ చేసేవారు కాదు. అందువల్ల ఖుర్‌ఆన్ ఈ సూక్తిలో నమాజ్ చేయని ముస్లింలను బహుదైవారాధకులతో



పోల్చింది. అలాగే యూదులు, క్రైస్తవులు నమాజ్ చేస్తారుకాని, హజ్‌విధిని పూర్తిగా వదిలేశారు. అందుకే దైవప్రవక్త (స) హజ్ చేయని ముస్లింలను యూదులు, క్రైస్తవులతో పోల్చారు.

దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "దేవుడు ఇస్లాంలో నాల్గు విషయాల్ని విధిగా నిర్ణయించాడు. ఈ నాల్గింటిలో ఎవరైనా మూడింటిని మాత్రమే పాటిస్తే, నాల్గవదాన్ని పాటించనంతవరకూ ఈ మూడింటి వల్ల అతనికి ఎలాంటి ప్రయోజనం ఉండదు. ఆ నాలుగు ఇవి: నమాజ్, జకాత్, రమజాన్ ఉపవాసాలు, హజ్‌యాత్ర." (మిష్కాత్)

"దైవప్రవక్త (స) ఒక హదీసులో దేవుని మాటలను ఇలా తెలియజేశారు: 'నేను ఏ దాసునికి ఆరోగ్యభాగ్యం, విస్తృతమైన ఉపాధి ప్రసాదిస్తానో, అతను నా సన్నిధికి (కాబాగృహానికి) రాకుండా అదే స్థితిలో అయిదేండ్లు గడిపితే, అతను సర్వం కోల్పోయిన దురదృష్టవంతుడవుతాడు." (హదీసు)

హజ్రత్ ఉమర్ (రజి) హజ్‌కు ఇంత ప్రాముఖ్యం ఉన్నందునే హజ్ చేయనివారిని హెచ్చరిస్తూ ఇలా అన్నారు: "ఇస్లామీయ రాజ్యంలోని వివిధ పట్టణాలకు కొందరిని పంపి, స్తోమత ఉండికూడా హజ్‌విధి నిర్వహించని వారు ఎవరెవరు ఉన్నారో తెలుసు కొని వారిపై జిజియా (ముస్లిమేతరులపై విధించే రక్షణరుసుం) విధించాలని అను కుంటున్నాను. వీరసలు ముస్లింలు కారు; ముస్లింలు కారు." (అల్‌ముస్తఖా)

**మబ్రూర్ హజ్** : "ఒకతను 'అన్నిటికంటే ఏఆచరణ ఎక్కువ శ్రేష్ఠమైనది' అని అడిగాడు దైవప్రవక్త (స)ను. దానికాయన 'దేవుడ్ని, ఆయన ప్రవక్తను విశ్వసించడం' అన్నారు. ఆ వ్యక్తి 'తర్వాత ఏదీ?' అనడిగాడు. దానికి దైవప్రవక్త (స) 'దైవమార్గంలో పోరాడటం (జిహాద్)' అన్నారు. 'ఆ తర్వాత ఏదీ?' అని అడిగాడు మళ్ళీ అతను. అప్పుడు దైవప్రవక్త (స) 'మబ్రూర్ హజ్' అని సమాధానమిచ్చారు." (హదీసు)

## 39. ఇహ్రాం నిషేధితాలు, తల్బియా పఠనం

కాబా యాత్రికుడు హజ్ లేక ఉమ్రా దీక్ష పూనక ముందు గోళ్ళు కత్తిరించుకొని, క్షవరం చేయించుకొని, అనవసరమైన వెంట్రుకలు గొరిగేసి, శుభ్రంగా స్నానం చేయాలి. దీక్ష పూనిన తరువాత కొన్ని పనులు నిషిద్ధమవుతాయి.

హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి) కథనం: ఒకతను వచ్చి "దైవప్రవక్తా! ఇహ్రాం (దీక్ష) పూనడానికి ఎలాంటి బట్టలు ధరించాలి?" అని అడిగాడు. దానికి దైవప్రవక్త (స) ఇలా సమాధానమిచ్చారు- "చొక్కా, పైజామా, వాన ఉడుపు (రైన్ కోట్) ధరించకూడదు. తలపాగా (టోపీ) ఉండకూడదు. మేజోళ్ళు తొడగరాదు. పాదరక్షలు లేనివాళ్ళు మేజోళ్ళు ధరించవచ్చుగాని, వాటిని చీలమండల నుండి కిందిభాగం వరకు కత్తిరించివేయాలి. అలాగే కాషాయ వస్త్రాలు, కుంకుమపువ్వు రంగు బట్టలు కూడా ధరించకూడదు. (ఇవి తప్ప కుట్టులేని తెల్ల బట్టలు కట్టుకోవచ్చు.)" బుఖారి)

- ✦ పురుషులు రోజూ ధరించే సాధారణ దుస్తులు వదిలేసి కుట్లులేని రెండు తెల్ల బట్టలు మాత్రమే కట్టుకోవాలి.
- ✦ తలపై టోపీగాని లేదా మరేదైనా వస్త్రంగాని ధరించకూడదు.

- ✦ స్త్రీలు ముఖ ముసుగు (నిఖాబ్) ధరించకూడదు.
- ✦ సంభోగం, ఇతర లైంగికోద్రేక చర్యలకు పాల్పడకూడదు.
- ✦ సువాసనలు వాడకూడదు. షాంపుతో, సువాసన సబ్బుతో కడుక్కోకూడదు.
- ✦ శరీరంలోని ఏభాగం నుంచి కూడా వెంట్రుకలు తీయకూడదు.
- ✦ గోళ్ళు కత్తిరించ కూడదు.
- ✦ వెంట్రుకలకు నూనె పూసుకోకూడదు. నూనెతో శరీరం మర్దన చేయరాదు.
- ✦ చెట్టు రెమ్మలు విరచడం, ఆకులు రాల్చడం, గడ్డి పీకడం చేయకూడదు.
- ✦ అడవి జంతువులను, పక్షులను వేటాడటం, వేటాడేవారికి సహకరించడం. అయితే విషపురుగులు, క్రూరజంతువులను చంపవచ్చు.

ఈక్రింది పనులు ఎలాంటి పరిస్థితిలోనైనా చేయడం అధర్మమే. అయితే వీటిని ఇహ్రాం స్థితిలో చేయడం మరింత ఘోరమైన పాపం అవుతుంది:

- ✦ అశ్లీల చేష్టలకు పాల్పడటం, వాటిని గురించి మాట్లాడటం, ఆసక్తితో వినడం, అశ్లీల చిత్రాలు చూడటం.
- ✦ పోట్లాడటం, దుర్భాషకు దిగడం, దురుసుగా ప్రవర్తించడం.

“విశ్వాసులారా! నియమ నిబంధనలను పూర్తిగా పాటించండి. ఇకముందు మీకు తెలియజేయబోయేవి తప్ప పశువుల్ని పోలిన చతుష్పాదాలన్నీ మీ కోసం (ఆహారంగా) ధర్మసమ్మతం చేయబడ్డాయి. అయితే ఇహ్రాం (కాబాయాత్ర దీక్ష)లో ఉన్నప్పుడు మాత్రం వేటాడటాన్ని ధర్మసమ్మతం చేసుకోకండి. దేవుడు తాను తలచుకున్న ఆదేశం జారీ చేస్తాడు.”

“జాగ్రత్త! కొందరు మిమ్మల్ని ప్రతిష్ఠాలయానికి పోకుండా నిరోధించారన్న ఆగ్రహంతో మితిమీరి వారిపై దౌర్జన్యం చేయకూడదు సుమా!! సత్కార్యాల్లో, దైవభక్తికి సంబంధించిన పనుల్లో పరస్పరం సహకరించుకోండి. అంతేగాని, పాపకార్యాల్లో, హింసా దౌర్జన్యాల్లో మాత్రం ఎవరితోనూ సహకరించకూడదు. దేవునికి భయపడండి. ఆయన (నేరస్థుల్ని) చాలాకఠినంగా శిక్షిస్తాడని తెలుసుకోండి.” (ఖుర్ఆన్-5:1,2)

కాబాయాత్ర దీక్ష పూనిన తరువాత చేయకూడని పనులు (నిషేధితాలు) ఏమిటో తెలుసుకున్నాం. ఇక్కడ చేయవలసిన పనులు ఉన్నాయి. వాటిలో కొన్ని పనులు చేయడం విధి (ఫర్జ్), కొన్ని పనులు సంప్రదాయం (సున్నత్), కొన్ని అభిలషనీయం (ముస్తహబ్). మరికొన్ని పనులు చేయడంలో తప్పులేదు. వాటిని గురించి తెలుసుకుందాం:

- ✠ స్నానం చేయవచ్చు. అయితే సువాసగల సబ్బుతో శరీరం కడగకూడదు.
- ✠ ఇహ్రాం బట్టలు మార్చుకోవచ్చు, విడిచిన బట్టలు ఉతికేయవచ్చు.
- ✠ సువాసనలేని సుర్మా, కాటుక పెట్టుకోవచ్చు.
- ✠ గడియారం, ఉంగరం ధరించవచ్చు. నడుముకు బెల్టు కట్టుకోవచ్చు. బెల్టుకు ఉండే జేబులలో డబ్బు, ముఖ్యమైన కాగితాలు దాచుకోవచ్చు.
- ✠ పాము, తేలు, పులి మొదలైన విషపురుగుల్ని, క్రూరజంతువుల్ని చంపవచ్చు.

“ప్రతిష్ఠాలయం పరిధిలో ఇహ్రాం స్థితిలో ఉన్నప్పుడు ఐదురకాల ప్రాణుల్ని చంపడంలో తప్పు



లేదు. అవి: ఎలుక, కాకి, గ్రద్ద, తేలు, దాడిచేసే కుక్క” అని దైవప్రవక్త (స) తెలిపారు.”

✠ సముద్రంలో, నదులలో చేపలు, రొయ్యలు వగైరా పట్టవచ్చు.

**తల్బియా**: దైవప్రవక్త (స) ఇలా చెప్పేవారు-“లబ్బైక్ అల్లాహుమ్మ లబ్బైక్, లబ్బైక్, లాషరీక్ లక లబ్బైక్, ఇన్నల్‌హమ్ద వనిఅ్‌మత, లక వల్‌ముల్క లాషరీక లక” (బుఖారి)

(అర్థం:- నేను హాజరయ్యాను దేవా! నేను హాజరయ్యాను, నీ సన్నిధిలో హాజరయ్యాను. నీకు సాటి ఎవరూలేరు, నేను హాజరయ్యాను. నిస్సందేహంగా నీవే ప్రశంసనీయుడవు. సమస్త వరప్రసాదాలకు నీవే అర్హుడవు. రాజ్యాధికారం కూడా నీదే. నీకు సాటి ఎవరూలేరు.)

దీన్నే ‘తల్బియా’ అంటారు. ఇహ్రాం (హజ్ దీక్ష) పూనగానే ఈవిధంగా ‘తల్బియా’ కనీసం ఒకసారి పఠించడం విధి (ఫర్జ్). ఒకటి కంటే ఎక్కువసార్లు పఠించడం సంప్రదాయం (సున్నత్). తల్బియాను పురుషులు బిగ్గరగా పఠించాలి; స్త్రీలు మాత్రం మెల్లిగా పఠించాలి. తల్బియా పఠించినప్పుడల్లా కనీసం మూడుసార్లు పఠించడం అభిలషనీయం (ముస్తహబ్).

దైవప్రవక్త (స) ఇలా అన్నారు: “ముస్లిం దైవదాసుడు లబ్బైక్, లబ్బైక్ అంటూ నినదించినప్పుడల్లా అతని కుడిఎడమల వైపుండే రాళ్ళు రప్పలు, చెట్లు చామలు, మట్టి మశానం వగైరా నేల మీదుండే సమస్తం అతనితో గొంతు కలుపుతాయి.” (తిర్మిజి)

“కాబాయాత్రికుడు సూర్యాస్తమయం అయ్యేవరకూ పగలంతా లబ్బైక్, లబ్బైక్ అంటూ నినదిస్తే, అతని పాపాలన్నీ పరిహరించబడి అతని తల్లి అతడ్ని ఇప్పుడే కనినట్లు పరమ పవిత్రుడయి పోతాడు.” (తిర్మిజి)

తల్బియా తర్వాత పఠించే దుఆ: “అల్లాహుమ్మ ఇన్నీఅస్‌అలుక రిజ్వానక వల్‌జన్నత వఅవూజు బిరహ్మతిక మినన్నార్” (అర్థం: దేవా! నేను నీ ప్రసన్నతాభాగ్యాన్ని, స్వర్గ వైభవాన్ని అర్థిస్తున్నాను. నరకాగ్ని బారినుండి నీ కారుణ్యఛాయలో శరణుగోరుతున్నాను.)

“దైవప్రవక్త (స) తల్బియా పఠించినప్పుడల్లా, తల్బియా పఠనం తరువాత ‘దేవుడ్ని తన ప్రసన్నత-స్వర్గ భాగ్యాలు ప్రసాదించమని, తన కారుణ్యంతో నరకాగ్ని నుండి కాపాడ మని ప్రార్థించేవారు.” (ముస్నద్ షాఫయి)

## 40. కాబాలయం, దాని ప్రత్యేక విభాగాలు

కాబా మందిరం ముస్లింల అంతర్జాతీయ ఆరాధనా కేంద్రం, సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం. అరబ్బులు బహుదైవారాధకులుగా ఉండిన మధ్య యుగాలలో కూడా ఇది యావత్తు అరేబియా ఉపఖండం ప్రజలకు కేంద్రీయ పుణ్యక్షేత్రంగా ఉండేది.

“మానవుల కోసం (ఇబ్రాహీం, ఇస్మాయీల్ ప్రవక్తల చేత) నిర్మించబడిన మొట్ట మొదటి ఆరాధనాలయం మక్కాలో ఉన్నదే. (కాబాగృహం.) అది ఎంతో శుభప్రదమైనది, యావత్ మానవాళికి మార్గదర్శకమైనది.” (ఖుర్ఆన్-3:96)

“అందులో ప్రవేశించే ప్రతివ్యక్తీ శాంతీ, రక్షణా పొందగలడు.” (ఖుర్ఆన్-3:97)

“దేవుడు కాబా ప్రతిష్ఠాలయాన్ని మానవుల కోసం శాంతిభద్రతల నిలయంగా చేశాడు.” (ఖుర్ఆన్-5:98)

హజ్రత్ అబ్దుల్లా బిన్ జుబైర్ (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ఇలా అన్నారు: "కాబాను అవిశ్వాసి అయిన ఏరాజూ ఆక్రమించుకోలేడు కాబట్టి దీన్ని బైతుల్అతీఖ్ అన్నారు." (తిర్మిజి)

జమ్‌జమ్‌ను దేవుని ఆజ్ఞతో దైవదూత హజ్రత్ జిబ్రీల్ (అలై) తవ్వారని హదీసు ద్వారా తెలుస్తోంది. దాన్నిగురించి దైవప్రవక్త (స) ఇలా అన్నారు: "ఇది జిబ్రీల్ తవ్విన బావి; ఇస్మాయీల్ కోసం నిర్మించిన జలనిధి." (దారె ఖుత్నీ)

సఫా, మర్వా కొండల మధ్య 'సయీ' చేసి, క్షవరం చేయించుకున్న తరువాత జమ్‌జమ్ నీళ్ళను బాగా కడుపునిండా తాగాలి. జమ్‌జమ్ ఎంతెక్కువ తాగితే అంత మంచిది. జమ్‌జమ్ ఔన్నత్యం, విశిష్ఠతలను గురించి దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు:

"మనకు, కపట విశ్వాసులకు ఓ ప్రత్యేక తేడా ఉంది. కపటులు పక్కటెముకలు నిటారయ్యే వరకు జమ్‌జమ్ నీళ్ళను కడుపునిండా తాగలేరు." (ఇబ్నెమాజ)

"జమ్‌జమ్ నీటిని ఏ ఉద్దేశంతో తాగితే ఆ ఉద్దేశం నెరవేరుతుంది." (ఇబ్నెమాజ)

"ఎవరైనా శత్రువుల బారి నుండి రక్షణ పొందే ఉద్దేశంతో జమ్‌జమ్ నీరు తాగితే అతనికా రక్షణ లభిస్తుంది." (హాకిమ్)

"భూమండలపై అన్నిటికంటే అత్యంత శ్రేష్ఠమైన నీరు జమ్‌జమ్ నీరే; అతిచెడ్డ నీరు హజ్రెమౌత్ (యమన్ ఎడారిఊబి)లోని బర్హూత్‌లోయ నీరే. ఆ నీటిలో మిడత కాళ్ళంతటి పొడవైన పురుగులుంటాయి. ఆ నీరు ఉదయం (మరుగుతున్న నీటిలా పొంగుతుంటుంది. కాని సాయంత్రం కాగానే అక్కడ తడి కూడా కన్పించదు." (తబ్రాని)

"ఒకసారి దైవప్రవక్త (స) హజ్రెఅస్వద్ నుండి హజ్రెఅస్వద్ వరకు 'రమల్' చేస్తూ (అంటే ఠీవీ, దర్పంతో నడుస్తూ) మూడు ప్రదక్షిణలు చేశారు. తరువాత రెండు రకాతులు నమాజ్ చేసి హజ్రెఅస్వద్ వైపుకు నడిచారు. ఆ తరువాత జమ్‌జమ్ బావి దగ్గరకు వెళ్ళి జమ్‌జమ్ నీళ్ళు తాగారు. తల మీద కూడా కొంచెం జమ్‌జమ్ నీళ్ళు పోసుకున్నారు." (ముస్నద్ అహ్మద్, ముస్లిం)

"జమ్‌జమ్‌ను ఏలక్ష్యంతో తాగితే ఆ లక్ష్యానికి ఇది దోహదపడుతుంది. స్వస్థత కోసం తాగితే దేవుడు స్వస్థత చేకూర్చుతాడు. సుఖంగా ఉండాలని తాగితే దేవుడు మీకు సుఖం కలిగిస్తాడు. దప్పిక తీరడానికి తాగితే దప్పిక తీరుస్తాడు. ఇది జిబ్రీల్ తన కాలితోపుతో తవ్విన బావి; ఇస్మాయీల్ కోసం వెలసిన జలధార." (దారెఖుత్నీ)

అబూజర్ గిఫ్ఫారీ (రజి) కథనం: "నేను ముస్లిం అయిన తరువాత దైవప్రవక్త (స)తో మాట్లాడుతూ 'దైవప్రవక్తా! నేను ముప్ఫయి రోజుల పాటు రాత్రింబవళ్ళు ఇక్కడే (కాబాలో) గడిపాను' అన్నాను. దైవప్రవక్త (స) ఈమాట విని 'అయితే (అన్ని రోజులదాకా) అన్నం నీళ్ళు ఎక్కడ్నుంచి వచ్చాయి నీకు?' అని అడిగారు. దానికి నేను 'దైవప్రవక్తా! జమ్‌జమ్ నీళ్ళు తప్ప మరెలాంటి తిండిలేదు నాకు. అయినా నాలో ఎలాంటి నీరసం రాలేదు. పైగా నేను పొట్టమీద మడతలు పడేటంతగా లావెక్కిపోయాను' అని చెప్పాను. అప్పుడు దైవప్రవక్త (స) 'ఇది శుభవంతమైన నీరు, ఆహారంగా కూడా పనిచేస్తుంది' అన్నారు." (ముస్లిం)



## హజ్రెఅస్వద్ (నల్లరాయి)

కాబా గర్భగుడిపై వెలుపల తూర్పుదిక్కున ఓ మూలలో ఆరడుగుల ఎత్తున అమర్చబడిన నల్లరాయినే "హజ్రెఅస్వద్" అంటారు. ఇది దైవప్రవక్త (స) తన శుభహస్తంతో, పెదవులతో స్పర్శించిన పవిత్రశిల. అంచేత హాజీలు కాబాప్రదక్షిణ చేసే ప్రతిసారి దీన్ని ముద్దాడుతారు లేదా చేత్తో తాకుతారు. చేత్తో తాకలేనంత దూరంలోఉంటే చేత్తో సైగచేసి ఆ చేతిని ముద్దాడుతారు. ఇలా చేయడం హజ్, ఉమ్రాల నియమాల్లో ఒక నియమం, సున్నత్. దీన్ని షరీఅత్ పరిభాషలో "ఇస్తిలాం" అంటారు. దీనికి అంతకుమించి ఎలాంటి ప్రాముఖ్యం లేదు.

హజ్రత్ ఉమర్ (రజి) ఓసారి హజ్రెఅస్వద్‌ని సంబోధిస్తూ "నీవు ఎలాంటి లాభ నష్టాలు కలిగించలేని ఒక రాయివి మాత్రమే. దైవప్రవక్త (స) గనక నిన్ను ముద్దాడటాన్ని చూడక పోయివుంటే నేను నిన్ను ఎన్నటికీ ముద్దాడను" అని అన్నారు. (బుఖారి)

హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి) ఓసారి హజ్రెఅస్వద్‌ని చేత్తో తాకి ఆ చేతిని ముద్దెట్టుకున్న తరువాత "దైవప్రవక్త (స) దీన్ని ముద్దాడటం చూసినప్పటి నుంచి నేను దీన్ని ముద్దాడుతున్నాను" అని అన్నారు. (సహీ ముస్లిం)

హజ్రత్ ఇబ్రాహీం (అలైహి) కాబానిర్మాణం పూర్తిచేశారు. అయితే ఒక చోట గోడలో ఓ మోస్తరు రాయంతటి ఖాళీ మిగిలిపోయింది. ఆయన కుమారుడు హజ్రత్ ఇస్మాయీల్ (అలై) అక్కడ సరిపడే రాయి కోసం వెతకడం ప్రారంభించారు. హజ్రత్ ఇబ్రాహీం (అలైహి) ఆయన్ని పిలిచి "నేను చెప్పే రాయిలాంటి రాయి తీసుకురా" అన్నారు. హజ్రత్ ఇస్మాయీల్ (అలై) మళ్ళీ వెతికి చివరికి ఒక రాయి తెచ్చారు. కాని హజ్రత్ ఇబ్రాహీం (అలై) అప్పటికే (కాంతిమంతమైన) ఒక రాయిని కాబా గోడలో అమర్చారు. హజ్రత్ ఇస్మాయీల్ (అలైహి) దాన్ని చూసి "నాన్నా! ఈ రాతిని ఎవరు తీసుకొచ్చారు?" అని అడిగారు. దానికి ఆయన "దీన్ని నీ నిర్మాణపు పనుల అవసరంలేని వ్యక్తి తీసుకొచ్చాడు. ఆకాశం నుండి జిబ్రీల్ (అలైహి) తీసుకొచ్చారు" అని అన్నారు. (తఫ్సీరె ఇబ్నెకసీర్)

హజ్రెఅస్వద్ స్వర్గం నుండి దిగిన ప్రారంభకాలంలో ఎంతో తెల్లగా మెరిసిపోతూ ఉండేది. దీన్ని గురించి దైవప్రవక్త (స) ప్రస్తావిస్తూ "హజ్రెఅస్వద్ స్వర్గం నుండి తీసుకు రాబడింది. అప్పుడిది పాలకన్నా తెల్లగా ఉండేది. అయితే ఆ తర్వాత ఆదం సంతతి చేసిన పాపాల వల్ల ఇది నల్లగా మారిపోయింది" అని అన్నారు. (తిర్మిజి)

హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఈవిధంగా ప్రవచించారు: "హజ్రెఅస్వద్, మఖామె ఇబ్రాహీంలు స్వర్గం నుండి తీసుకురాబడిన రెండు మెరిసిపోతుండిన రాళ్ళు. అయితే దేవుడు వాటి కాంతిని అంతం చేశాడు. దేవుడు వాటి కాంతిని గనక అంతం చేయకపోయివుంటే ఇవి భూమ్యాకాశాల మధ్య లేక తూర్పు పడమరల మధ్య యావత్తు ప్రపంచాన్ని ప్రకాశవంతం చేస్తాయి." (అహ్మద్)

హజ్రెఅస్వద్ అనేక శతాబ్దాలపాటు ఒకే రాయిగా ఉండేది. కాని ఆతర్వాత ప్రమాదాలు, ప్రకృతి వైపరీత్యాల వల్ల పగిలి ముక్కలైపోయింది. ఇప్పుడా ముక్కలన్నిటిని కలిపి ఒకటిగా చేసి, దాన్ని ఒక వెండి చట్రంలో బిగించి, యధాతథ స్థానంలో అమర్చారు. హజ్రెఅస్వద్ ప్రతి ప్రదక్షిణ ప్రారంభానికి, ముగింపుకు గుర్తుగా కాబాగోడలో పొదగబడిన ఒక విశిష్ఠశిలారాజం.

## ముల్తజం, రుకునె యమాని

కాబాగర్భగుడి తూర్పువైపున తలుపుకు, హ్రజెఅస్వద్‌కు మధ్య ఉన్న ఆరడుగుల గోడ భాగాన్నే ముల్తజం అంటారు. కాబాప్రదక్షిణ చేసిన తరువాత ఇక్కడదాకా చేరుకోగలిగే హాజీలు ముల్తజంను గుండెలకు గట్టిగా హత్తుకొని కడు దీనంగా దుఆ చేయడం సంప్రదాయం.

**ముల్తజం** దగ్గర నిలబడి దుఆ చేయడం గురించి దైవప్రవక్త (స) ఇలా అన్నారు: “కష్టాలలో ఉన్న మనిషి ఎవరైనా ముల్తజం దగ్గర దైవాన్ని వేడుకుంటే అతని కష్టాలు తప్పకుండా దూరమవుతాయి.” (అబూదావూద్, ఇబ్నెమాజ)

హ్రజత్ షుఐబ్ కథనం: “అబ్దుల్లా బిన్ అమ్ర్ (రజి) హ్రజెఅస్వద్‌కు, తలుపుకు మధ్య కాబాకు ఎదురుగా నిలబడి తన రొమ్ము, ముఖం, అరచేతులను కాబాగోడకు ఆనిచ్చి, ‘దైవప్రవక్త (స) ఇలా చేస్తుంటే చూశాను’ అని అన్నారు.” (అబూదావూద్)

హ్రజత్ ముజాహిద్ ‘ముల్తజం’ ప్రాముఖ్యాన్ని గురించి ఇలా చెప్పారు: “హ్రజెఅస్వద్‌కు, తలుపుకు మధ్య ఉన్న చోటునే ముల్తజం అంటారు. ఇక్కడకు వచ్చి ఎవరయినా దేవుడ్ని వేడుకుంటే దేవుడు అతని వేడుకోలును తప్పకుండా స్వీకరిస్తాడు.”

“హ్రజత్ ఇబ్నెఅబ్బాస్ (రజి) హ్రజెఅస్వద్‌కు, తలుపుకు మధ్య ఉండే చోటును హత్తుకొని ‘హ్రజెఅస్వద్‌కు, తలుపుకు మధ్య (ముల్తజంకు ఎదురుగా) నిల్చొని ఎవరైనా దైవాన్ని వేడుకుంటే అతని పని తప్పక నెరవేరుతుంది’ అని చెప్పేవారు.” (బైహఖి)

ప్రవక్త అనుచరులలో అనేకమంది ముల్తజంను హత్తుకొని దుఆ చేసేవారు. “అబ్దుల్లా బిన్ ఉమర్, అబ్దుల్లా బిన్ అబ్బాస్, అబ్దుల్లా బిన్ జుబైర్ (రజి) ప్రభృతులు ముల్తజంను హత్తుకొని దుఆ చేస్తుంటే తాను చూశానని అబూజుబైర్ అన్నారు.”

హ్రజత్ తారిఖ్ బిన్ అబ్దుర్రహ్మాన్ ఉల్లేఖనం: “నేను హ్రజత్ అలి బిన్ హుసైన్ (రహ్మలై)తో కలసి కాబా ప్రదక్షిణ చేశాను. ఆయన ప్రదక్షిణ చేసిన తరువాత పొట్ట మీది బట్ట తొలగించి హ్రజెఅస్వద్‌కు, తలుపుకు మధ్య ఉండే చోటుకు (అంటే ముల్తజంకు) తన నగ్నగర్భాన్ని ఆనిచ్చారు.” (అఖ్బారె మక్కా)

ప్రాముఖ్యం, ఔన్నత్యాల విషయంలో ముల్తజం తరువాత **“రుకునె యమాని”** చెప్పుకోదగిన కాబా అంతర్భాగం. కాబా గర్భగుడి నాలుగు మూలలో ఒక మూల యమన్ దేశం దిశగా ఉంది. ఆ మూలనే ‘రుకునె యమాని’ అంటారు. దాన్ని ఇస్తిలాం (ముద్దాడటం లేక తాకడం) చేయడం అభిలషనీయం (ముస్తహబ్).

దైవప్రవక్త (స) ఇలా అన్నారు: “రుకునె యమాని దగ్గర డెబ్బయి మంది దైవదూతలు నియమించబడ్డారు. హాజీలు ఇక్కడ ఈవిధంగా దుఆ చేసినప్పుడు ఈ దైవదూతలు ఆమీన్ (తథాస్తు) అంటారు- ‘అల్లాహుమ్మ ఇన్నీ అస్‌అలుకల్ అఫ్వ వల్‌ఆఫియత ఫిదున్యా వల్‌ఆఖిరతి రబ్బనా ఆతినా ఫిద్దున్యా హస్నతన్‌వ్వ ఫిల్‌ఆఖిరతి హస్నతన్ వ్వఖినా అజాబన్నార్’ (అర్థం: దేవా! నేను ఇహపర లోకాలలో నా మన్నింపు, సంక్షేమాల కోసం నిన్ను వేడుకుంటున్నాను. ప్రభూ! మాకు ఇహలోకంలోనూ, పరలోకంలోనూ మంచిని ప్రసాదించు. మమ్మల్ని నరక యాతనల నుండి రక్షించు.)” (ఇబ్నెమాజ)



## హతీం (ఖాళీగా వదలిన కాబాస్థలం)

కాబా గర్భగుడికి ఒక వైపు దాదాపు తొమ్మిది అడుగుల దూరాన అర్థ వృత్తాకారంలో నాలుగడుగుల ఎత్తుతో కట్టబడిన పిట్టగోడ ఉంది. దాని లోపలి ప్రదేశాన్నే “హతీం” అంటారు. ఖురైషీయులు కాబాను పునర్నిర్మించవలసి వచ్చినప్పుడు సరిపడ పైకం సమకూరకపోవడంతో ఆ స్థలం ఖాళీగా వదలి కాబాగోడలు కట్టారు. మక్కా పట్టణం దైవప్రవక్త (స) అధీనంలోకి వచ్చిన తరువాత కూడా ఆయన ఆ ఖాళీస్థలం కలిపేసి కాబాను పునర్నించలేదు. దానికి కారణం దైవప్రవక్త (స) తన సతీమణి హ్రజత్ ఆయిషా (రజి)కు ఇలా తెలియజేశారు:

“నీ జాతివాళ్ళు ఈ మధ్యనే (కొత్తగా) ఇస్లాం స్వీకరించారు. అలా కాకపోతే నేను కాబాను పడగొట్టి దాని తలుపును నేలబారు చేసేవాడ్ని. తలుపులు రెండు పెట్టించే వాడ్ని; ఒకటి తూర్పు వైపున, మరొకటి పడమర వైపున. అంతేకాదు, హిజ్ర్ (హ్రజత్ ఇబ్రాహీం తన భార్యాపిల్లలకు నిర్ణయించిన ప్రదేశం) నుండి ఆరు మూరల స్థలాన్ని కాబా కట్టడంలో కలిపేసేవాడ్ని. ఖురైషీయులు కాబానిర్మాణ సమయంలో అంత చోటును తీసేశారు.” (ముస్నద్ అహ్మద్)

హ్రజత్ అబ్దుల్లా బిన్ జుబైర్ (రజి) అధికారంలోకి వచ్చిన తరువాత ఆయన ఆ ఖాళీ స్థలం కలిపేసి కాబాను మళ్ళీ నిర్మించారు. కాని హ్రజత్ అబ్దుల్లా బిన్‌జుబైర్ (రజి) అమరగతి నొందిన తరువాత మక్కా గవర్నర్‌గా వచ్చిన హజ్జాజ్ ఆ సమగ్ర కట్టడాన్ని పడగొట్టి గతంలో మాదిరిగానే పునర్నిర్మించాడు. ఆనాటి నుంచి ఈనాటి వరకూ కాబా కట్టడం అలాగే ఉంది. కాబా గర్భగుడిని దైవప్రవక్త (స) ప్రవచనాల వెలుగులో హ్రజత్ అబ్దుల్లా బిన్ జుబైర్ (రజి) పునర్నిర్మించినట్లు సమగ్ర ఆలయాన్ని ఈనాడు కూడా పునర్నిర్మించవచ్చు కదా! ఈ విధంగా నేటి సౌదీప్రభుత్వం ఎందుకు పునర్నిర్మించలేదో నాకర్థం కాలేదు.

## మఖామె ఇబ్రాహీం

ఇబ్రాహీం ప్రవక్త (అలై) కాబాలయం నిర్మించడానికి నిలబడిన బండరాయినే మఖామె ఇబ్రాహీం అంటారు. ఇది కూడా హ్రజెఅస్వద్‌లా స్వర్గం నుండి తీసుకురాబడిన కాంతిమంతమైన రాయే. ఇబ్రాహీం ప్రవక్త (అలైహి) ఈ రాతి మీద నిలబడే ప్రజలకు హజ్ పిలుపు ఇచ్చారని కూడా చెబుతారు. దాని మీద ఆయన అడుగుజాడలు కూడా దశాబ్దాల తరబడి ఉండేవి. కాని ప్రజలు చేతులతో తాకడం వల్ల ఆ గుర్తులు క్రమేణా చెరిగిపోయాయి. వాటి చుట్టూ ఇప్పుడు పాదాకారంలో వెండి అంచు (బార్డర్) మాత్రమే కన్పిస్తుంది.

“హ్రజత్ ఖతాదా కథనం ప్రకారం, ముస్లింలకు మఖామె ఇబ్రాహీం దగ్గర నమాజ్ చేయాలని ఆజ్ఞయింది; దాన్ని తాకాలని కాదు. అనేకమంది ప్రజలు ఇబ్రాహీం (అలైహి) గారి కాలి మడమ, వ్రేళ్ళ గుర్తులు చూశారు. కాని ప్రజల చేతులు తగలడంతో అవి చెరిగిపోయాయి.” (తఫ్సీరె ఇమాం తబ్రీ)

మఖామె ఇబ్రాహీం రాయి పొడవు, వెడల్పు దాదాపు 14 చదరపు అంగుళాలు, మందం 8 అంగుళాలతో తేలికపాటి ఎరుపురంగు మీద నల్లటి చారలు కలిగి ఉంది. దీన్ని ఓ పెద్ద పంజరం లాంటి గ్రిల్ లోపల కదలకుండా పెట్టారు. ఈ రాయి మొదటి ఖలీఫా హ్రజత్ అబూబకర్ (రజి) పాలనాకాలం వరకూ కాబా గోడకు దాదాపు ఆనుకునే ఉండేది. అయితే రెండవ ఖలీఫాగా హ్రజత్ ఉమర్ (రజి) వచ్చిన తరువాత హాజీలకు ప్రదక్షిణ

సమయంలో ఇబ్బంది కలుగుతోందని దాన్ని అక్కడ్నుంచి తీసేయించి కాబాకు కొంచెం దూరంలో ప్రస్తుతమున్న చోట పెట్టించారు.

హజ్రత్ అనస్ (రజి) కథనం ప్రకారం హజ్రత్ ఉమర్ (రజి) మాట్లాడుతూ "నేను 'వహీ'కి అనుగుణంగా మూడు విషయాలు ప్రతిపాదించాను. నేను దైవప్రవక్తతో 'దైవప్రవక్తా! మనం (కాబాప్రదక్షిణ తర్వాత) మఖామెఇబ్రాహీం దగ్గర నమాజ్ చేస్తుంటే ఎంత బాగుంటుంది!' అని అన్నాను. అప్పుడు 'మీరు మఖామె ఇబ్రాహీంని నమాజు చోటుగా చేసుకోండి' అనే ఖుర్ఆన్ సూక్తి అవతరించింది." (బుఖారి)

ఈ కారణంగానే హజ్రత్ ఉమర్ (రజి) 'మఖామె ఇబ్రాహీం' రాతిని దాని పూర్వస్థానం నుండి జరిపించి కాబాగర్భగుడికి కొద్దిదూరంలో పెట్టించినప్పుడు పురప్రముఖులు ఎవరూ ఆయన్ని విమర్శించలేదు.

# 41. హజ్ చేసే విధానం

హజ్ విధానమంతా కేవలం అయిదు రోజుల్లో పూర్తవుతుంది. మొదటి మూడు రోజుల్లోనే హజ్విధి (ఫర్జ్) నెరవేరుతుంది. అయితే మిగతా నాలుగైదు రోజుల్లో 'రమీ' చేయడానికి, అంటే జమ్రాలపై కంకర్రాళ్లు విసరడానికి 'మినా'లో ఉండిపోవలసి ఉంటుంది.

అర్ఫారోజు ప్రాముఖ్యం గురించి దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రవచించారు: "దేవుడు అర్ఫారోజున తప్ప మరే రోజు కూడా ఇంతమంది జనాన్ని నరకాగ్ని నుండి విముక్తి కలిగించడు. ఆర్ఫారోజున దేవుడు హాజీలకు దగ్గరవుతాడు. అప్పుడాయన దైవదూతల ముందు హాజీలను గురించి గర్వంగా మాట్లాడుతూ '(ఈ హాజీలంతా ఇక్కడకు రావడంలో) వీరి ఉద్దేశం ఏమిటో తెలుసా మీకు?" అని అడుగుతాడు." (ముస్లిం)

"మీరు అరఫాత్లో ఆగినప్పుడు దేవుడు అరఫాత్వారిని చూస్తూ 'నా భక్తులు చెదరిన శిరోజాలతో, దుమ్ముకొట్టుకొని సుదూరప్రాంతాల నుంచి నా సన్నిధికి వస్తున్నా ర'ని అంటాడు. తర్వాత దైవదూతల ముందు తన దాసుల్ని ప్రశంసిస్తాడు. 'మీ పాపాలు ఎడారిలోని ఇసుకరేణువులన్ని ఉన్నా, ఆకాశంలోని నక్షత్రాలన్నిఉన్నా లేదా వర్షం, సముద్రాలలోని నీటిబిందువులన్ని ఉన్నా, దేవుడు వాటన్నిటినీ క్షమిస్తాడు." (తర్గీబ్వతర్హీబ్)

"అర్ఫారోజు దేవుని కరుణామృతం విపరీతంగా అవతరిస్తుంది. ఆయన పెద్ద పెద్ద పాపాలను సైతం క్షమిస్తాడు. అందువల్ల షైతాన్ ఆరోజు తప్ప మరే రోజుల్లోనూ అంతగా కుంచించుకు పోవడం, అవమానం పాలవడం, నీచుడవడం, మూతి ముడుచుకోవడం జరగదు." (మువత్తా-ఇమామ్ మాలిక్)

హజ్రత్ తారిఖ్ బిన్ షిహాబ్ ఉల్లేఖనం: ఓసారి ఒక యూదుడు (ఖలీఫా) ఉమర్ దగ్గరకు వచ్చి "విశ్వాసుల నాయకా! మీరు (ముస్లింలు) మీ గ్రంథంలో ఎంతో శ్రేష్ఠమైన ఓ సూక్తి పఠిస్తారు. ఆ సూక్తి గనక మాపై అవతరించివుంటే మేమా సూక్తి అవతరించిన రోజును పండుగ దినంగా చేసుకునేవాళ్ళం" అని అన్నాడు.

హజ్రత్ ఉమర్ (రజి) ఈమాట విని "ఏమిటా సూక్తి?" అనడిగారు. దానికా యూదుడు ఖుర్ఆన్లోని ఈ సూక్తి పఠించాడు- "నేనీ రోజు మీకోసం మీ ధర్మాన్ని



(సమగ్ర జీవనవ్యవస్థగా) పరిపూర్ణం చేశాను. మీకోసం నాఅనుగ్రహాన్ని పూర్తిగా నెరవేర్చాను. మీశ్రేయస్సు కోసం ఇస్లాంను మీ జీవనధర్మంగా ఆమోదించాను." (ఖుర్ఆన్-5:4)

హజ్రత్ ఉమర్ (రజి) ఈ సూక్తి విని "దైవసాక్షిగా చెబుతున్నాను. ఈ సూక్తి ఏ రోజు, ఎక్కడ, ఎప్పుడు అవతరించిందో నాకు తెలుసు. ఈ సూక్తి (అరఫాత్లో) అర్ఫా రోజున, శుక్రవారం నాడు అవతరించింది" అని అన్నారు. (బుఖారి)

హజ్రత్ అబూఖతాదా (రజి) కథనం: ఒకతను దైవప్రవక్త (స)ను "దైవప్రవక్తా! అర్ఫారోజు పాటించే ఉపవాసం గురించి మీ అభిప్రాయం ఏమిటీ?" అని అడిగాడు. దానికి దైవప్రవక్త (స) "దేవుడు ఆరోజు శుభాలతో (ప్రజల) గత ఏడు పాపాలను, వచ్చే ఏడు పాపాలను క్షమిస్తాడని నేను ఆశిస్తున్నాను" అని అన్నారు. (సహీ ముస్లిం)

ఇబ్నెఅబ్బాస్ (రజి) కథనం: "దైవప్రవక్త (స) అరఫాత్లో దుఆ చేశారు. ఆయన ఆకలిగొన్న పేదవాడు ఏవిధంగా దాత ముందు చేతులుజాపి పరిపరివిధాలా బతిమాలుతూ సహాయం అర్థించినట్లు దైవసన్నిధిలో అత్యంత దీనంగా దుఆ చేశారు."

అరఫాత్లో బతన్ లోయ ఉంది. అక్కడ "జబలెరహ్మాత్" పేరుతో ఓ కొండ ఉంది. ఆకొండ సమీపంలోనే నమీరా మస్జిద్ ఉంది. అదే ప్రదేశంలో 1400 సంవత్సరాల క్రితం దైవప్రవక్త (స) లక్ష మందికి పైగా గుమికూడిన హాజీ అనుచరుల ముందు ముఖ్యమైన ఓ చారిత్రక ప్రసంగం చేశారు. దీన్నే "వీడ్కోలుహజ్" (హజ్జతుల్విదా) ప్రసంగం అనంటారు.

ముజ్దల్ఫాను "మష్అరిల్ హరాం" అనికూడా అంటారు. ఖుర్ఆన్ దీన్ని గురించి ఇలా ప్రస్తావించింది: "అరఫాత్ నుండి తిరిగివస్తూ మష్అరిల్ హరాం (ముజ్దల్ఫా)లో ఆగి అల్లాహ్ను ఆయన నేర్పిన విధంగా స్మరించండి." (2:198)

ముజ్దల్ఫా, 'మినా'ల మధ్య "వాదియే ముహస్సిర్" అనే ప్రదేశం ఉంది. అక్కడ ఎట్టి పరిస్థితిలోనూ ఆగడంగాని, అటువైపు పోవడంగాని చేయకూడదు. ఒకవేళ ఆ ప్రదేశం మీదుగా తప్పనిసరిగా పోవలసివస్తే వేగంగా దాటిపోవాలి. అది దైవప్రవక్త (స) జన్మకు పూర్వం కాబాను ధ్వంసం చేయడానికి అబ్రహా సైన్యం వచ్చి సర్వనాశనమయిన ప్రదేశం.

'రమీ' చేయడానికి పూనుకున్నప్పుడు ముందుగా జమ్రా ఎదుట నిలబడి "బిస్మిల్లాహి అల్లాహుఅక్బర్ రగ్మన్ లిష్షయితాని వరిజన్ లిర్రహ్మాని అల్లాహుమ్మ అజ్అల్హు హజ్జమ్ మబ్రూరన్ వజన్బమ్ మగ్ ఫూరన్ వసాయమ్ మష్కూరా" అని దుఆ చేయాలి.

దుఆ (వేడుకోలు) మనకు తెలిసినభాషలోనైనా చేయవచ్చు. దానర్థం ఇలాఉంది: "అల్లాహ్ పేరుతో ప్రారంభం. అల్లాహ్ అందరికంటే గొప్పవాడు. షైతాన్ని అవమానించడానికి, దేవుని ప్రసన్నత పొందడానికి నేనీ రాళ్ళు కొడ్తున్నాను. దేవా! నా హజ్ను ఆమోదయోగ్యమైన హజ్గా చెయ్యి. నా పాపాలు క్షమించు. ఈ కృషిని స్వీకరించు."

ఇలా పఠించిన తరువాత అల్లాహుఅక్బర్ అంటూ కుడిచేత్తో ఒక్కొక్కటి చొప్పున ఏడురాళ్ళు విసరాలి. ఇది 'రమీ' చేసే సాంప్రదాయక విధానం. స్త్రీలు, పిల్లలు, వృద్ధులు, బలహీనుల తరఫున ఇతరులు రమీ చేయవచ్చు.

'రమీ' కోసం జమ్రాల దగ్గర పడివుండే కంర్రాళ్ళు ఉపయోగించకూడదు. దేవుని దృష్టిలో స్వీకారయోగ్యంకాని కంకర్రాళ్ళు మాత్రమే జమ్రాల దగ్గర మిగిలివుంటాయి. స్వీకారయోగ్య

మయిన కంకర్రాళ్ళను దైవదూతలు ఎత్తుకుపోతారని ఒక హదీసులో ఉంది.

హ్జ్రత్ అబూసయీద్ ఖుద్రీ (రజి) ఓసారి "దైవప్రవక్తా! మనం ప్రతి యేడూ జమ్రాలపై కంకర్రాళ్ళు విసురుతున్నాం కదా, కాని అవి (పెరిగిపోవాల్సింది పోయి) తరిగి పోతున్నట్లు అన్పిస్తుంది మాకు. కారణం ఏమిటీ?" అని అడిగారు. దానికి దైవప్రవక్త (స) సమాధానమిస్తూ "నిజమే, తరిగిపోతున్నాయి. దైవం స్వీకరించిన రాళ్ళు పైకి ఎత్తుకో బడతాయి. అలా జరగకపోతే ఈ కంకర్రాళ్ళు కొండల్లాగా పెద్ద పెద్ద గుట్టలుగా పడి వుండటం మీకు కన్పిస్తుంది" అని అన్నారు. (దారె ఖుత్నీ)

## ఖుర్బానీ (బలిదానం)

"ప్రజలు తమకు దేవుడిచ్చిన పశువుల్ని దేవునిపేరు స్మరించి బలివ్వడానికి మేము ప్రతి సమాజానికి ఒక బలివిధానం నిర్ణయించాము. గుర్తుంచుకోండి, మీఆరాధ్యుడు ఒక్క దేవుడు మాత్రమే. ఆయన ఆజ్ఞలనే శిరసావహిస్తూ ఆయనకే విధేయులైఉండాలి." (ఖుర్ఆన్–22:34)

దైవప్రవక్త (స) ఇలా అన్నారు: "స్తోమత ఉన్నప్పటికీ ఖుర్బానీ ఇవ్వనివాడు మా ఈద్గాహ్ దరిదాపులకు రాకూడదు." (జమావుల్ ఫవాయెద్)

దైవప్రవక్త (స) ప్రవచనం: "ఎవరు పండుగ నమాజ్ తరువాత ఖుర్బానీ ఇస్తాడో అతని ఖుర్బానీ (విధి) నెరవేరుతుంది; అతను ముస్లింల పద్ధతి అవలంబించిన వాడవుతాడు. ఎవరైనా పండుగ నమాజ్కు ముందే పశువును జిబహ్ చేయడం జరిగితే అతను (నమాజ్ తరువాత) మళ్ళీ ఖుర్బానీ ఇవ్వవలసి ఉంటుంది."

"దేవుని దృష్టిలో జిల్హజ్ పదోతేదీన ఖుర్బానీ రక్తం చిందించడం కంటే శ్రేష్ఠమైన పని మరేదీ లేదు. ప్రళయదినాన ఖుర్బానీపశువు కొమ్ములతో, రోమాలతో, గిట్టలతో ముందుకొస్తుంది. ఖుర్బానీ రక్తం నేలమీద పడుతుందో లేదో దైవసన్నిధిలో ఖుర్బానీ స్వీకరించబడుతుంది. కనుక సంతోషంగా, మనస్ఫూర్తిగా ఖుర్బానీ ఇవ్వండి." (తిర్మిజి)

హ్జ్రత్ ఉమ్మెసలమా (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ప్రవచనం: ఖుర్బానీ కొరకు పశువు ఉండి ఖుర్బానీ చేయదలచుకునేవారు జిల్హజ్ నెలవంక కనపడినప్పటి నుంచి ఖుర్బానీ ఇచ్చేవరకు తమ వెంట్రుకల్ని, గోళ్ళను కొంచెమైనా కత్తిరించుకోరాదు. (ముస్లిం)

"ఒకసారి ప్రవక్త అనుచరులు 'దైవప్రవక్తా! ఈ ఖుర్బానీ సంగతి ఏమిటీ?" అని అడిగారు. దానికి దైవప్రవక్త (సల్లం) 'ఇది మీ తండ్రి సంప్రదాయం' అని చెప్పారు. 'అయితే ఇందులో మాకు లభించే పుణ్యం ఏమిటీ?' అని అడిగారు అనుచరులు మళ్ళీ. దానికి దైవప్రవక్త (స) "(పశువు మీది) ప్రతి వెండ్రుకకు బదులుగా ఒక యూనిట్ పుణ్యం లభిస్తుంది' అని చెప్పారు. 'మరి ఉన్నికి బదులుగా ఏం లభిస్తుంది?' అని అడిగారు అనుచరులు. 'ఉన్ని విషయంలో కూడా అలాంటి పుణ్యమే లభిస్తుంది' అన్నారు దైవప్రవక్త (స)." (తిర్మిజి, ఇబ్నెమాజ)

దైవప్రవక్త (స) (తన ముద్దుల కుమార్తె) హ్జ్రత్ ఫాతిమా (రజి)తో "ఫాతిమా! లే, నీ ఖుర్బానీ పశువు దగ్గర నిలబడుదువుగాని రా. దాని నుండి నేలమీద పడే ప్రతి (రక్త)



బిందువుకు బదులుగా దేవుడు నీ గతపాపాలు క్షమిస్తాడు" అని అన్నారు. అప్పుడు హ్జ్రత్ ఫాతిమా (రజి) "ఈ శుభవార్త మన కుటుంబానికి మాత్రమే ప్రత్యేకమా లేక యావత్తు ముస్లిం సముదాయానికి వర్తిస్తుందా?" అని ప్రశ్నించారు. దానికి దైవప్రవక్త (స) "ఇది మన కుటుంబానికి కూడా వర్తిస్తుంది; యావత్తు ముస్లిం సముదాయానికి కూడా వర్తిస్తుంది" అని చెప్పారు. (జమావుల్ ఫవాయెద్)

ఖుర్బానీ చేయవలసిన పశువుని ఇలా దుఆ చేసి కోయాలి: "ఇన్నీ వజ్జహ్తు వజ్హియ లిల్లజీ ఫతరస్సమావాతి వల్అర్జ హనీఫన్వ్వమా అనా మినల్ ముష్రికీన్. ఇన్న సలాతి వనుస్కి వమహ్యాఅ వమమాతి లిల్లాహి రబ్బిల్ఆలమీన్. లాషరీక లహూ వబిజాలిక ఉమిర్తు వఅనా మినల్ ముస్లిమీన్. అల్లాహుమ్మ లక వమిన్క అన్నీ బిస్మిల్లాహి అల్లాహుఅక్బర్."

(అర్థం-నేను పూర్తిఏకాగ్రతతో ఇబ్రాహీం విధానం ప్రకారం భూమ్యాకాశాల్ని సృష్టించిన శక్తిస్వరూపుని వైపుకు మరలాను. నానమాజ్, నాత్యాగం (ఖుర్బానీ), నా జీవన్మరణాలు సమస్తం సాటిలేని సర్వలోకప్రభువుకే సమర్పితం. నాకు ఆయన ఆదేశమే లభించింది. నేను ఆయనకే విధేయుడ్ని. ఈఖుర్బానీ నీవు ప్రసాదించినదే. నీప్రసన్నత కోసమే దీన్ని నాతరపున సమర్పించు కుంటున్నాను." దేవుని పేరుతో (కోస్తున్నాను), దేవుడే అందరికన్నా గొప్పవాడు.

"మేము బలి పశువుల్ని మీ కోసం దైవచిహ్నాల జాబితాలో చేర్చాము. వాటిలో మీ శ్రేయస్సు ఉంది. కనుక వాటిని (ఒంటెలను) నిలబెట్టి దేవుని పేరు ఉచ్చరించండి. (అంటే దేవుని పేరు స్మరించి జిబహ్ చేయండి. బలిచేసిన కొద్ది క్షణాలకు) వాటి వీపులు నేలమీద (చలనరహితంగా) నిలిచిపోయిన తరువాత వాటి మాంసాన్ని మీరూ తినండి; అర్థించే వారికి, అర్థించనివారికి కూడా ఇవ్వండి. మీరు మా పట్ల కృతజ్ఞులై ఉండటానికే మేమిలా పశువుల్ని మీకోసం అదుపులో ఉంచాము." (ఖుర్ఆన్–22:36)

"దేవుని వద్దకు వాటి రక్తమాంసాలు చేరవు. మీ భయభక్తులే ఆయన వద్దకు చేరు కుంటాయి. మీకు సన్మార్గం చూపినందుకు కృతజ్ఞతగా తనను స్తుతించడానికే దేవుడు ఈ పశువుల్ని మీఅదుపులో ఉంచాడు. ప్రవక్తా! సజ్జనులకు శుభవార్త అందజేయి." (ఖు-22:37)

మనిషి త్యాగాలు చేయడానికి బలమైన ప్రేరకాలు కావాలి. సాధారణంగా పదార్థ పూజారులకు సిరిసంపదలు, పేరుప్రతిష్ఠలు, పదవీహోదాలే ప్రేరకాలు. కాని దేవుడ్ని, ఆయన ప్రవక్తను దృఢంగా విశ్వసించే ముస్లింలకు దైవప్రసన్నత, పరలోక సాఫల్యాలే అన్నిటికంటే బలమైన ప్రేరకాలు. ఈ ప్రేరకాల ముందు ప్రపంచంలోని ఎలాంటి భయప్రలోభాలైనా సరే బలదూర్. ఇస్లాంలో ప్రాపంచికప్రేరకాల కంటే పారలౌకికప్రేరకాలే ఎంతో శక్తిమంతమైనవి.

హ్జ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి) సాక్ష్యం: "దైవప్రవక్త (స) మదీనాలో పదేండ్లు ఉన్నారు. ఆ పదేండ్ల కాలంలో ఆయన ఒక్క సంవత్సరం కూడా బీరు పోకుండా ప్రతి ఏడూ ఖుర్బానీ ఇస్తుండేవారు." (తిర్మిజి)

హ్జ్రత్ బరీదా (రజి) కథనం: "దైవప్రవక్త (స) ఈదుల్ఫితర్ రోజు ఏదోఒకటి తినకుండా (పండుగ) నమాజ్కు వెళ్ళేవారుకాదు. ఈదుల్అజ్హా రోజు మాత్రం పండుగ నమాజ్కు ముందు ఏమీ తినేవారుకాదు. పండుగనమాజ్ నుండి తిరిగొచ్చిన తరువాత ఖుర్బానీపశువు గుండెకాయను తినేవారు." (తిర్మిజి, అహ్మద్)

జిల్‌హజ్ నెలవంక చూసినప్పటి నుండి పండుగరోజు వరకు మనిషి క్షవరం చేయించుకోకుండా, గోళ్ళు కత్తిరించుకోకుండా ఉండటం అభిలషనీయం (ముస్తహబ్) అని ధర్మవేత్తలు అన్నారు. ఈ విషయంలో దైవప్రవక్త (స) ఈవిధంగా ప్రవచించారు:

"ఖుర్బానీ చేయవలసిన మనిషి జిల్‌హజ్జ నెలవంక చూసిన దగ్గర్నుండి ఖుర్బానీ చేసేవరకు క్షవరం చేయించుకోకూడదు; గోళ్ళు కత్తిరించుకోకూడదు." (ముస్లిం)

హజ్రత్ అబ్దుల్లా బిన్‌అమ్ర్ బిన్‌ఆస్ (రజి) కథనం: "జిల్‌హజ్జ 10వ తేదీన పండుగ జరుపుకొమ్మని దైవప్రవక్త (స) నన్నాదేశించారు. ఆ రోజును దేవుడు ముస్లింల కోసం పండుగదినంగా నిర్ణయించాడు. ఒక వ్యక్తి వచ్చి 'దైవప్రవక్తా! ఒకతను పాలు పితుక్కోమని నాకు ఓ మేక ఇచ్చాడు. నా దగ్గర అదొక్కటే ఉంది. మరి నేనా మేకను ఖుర్బానీ చేయాలా?' అని అడిగాడు. దానికి దైవప్రవక్త (స) ఇలా అన్నారు: 'వద్దు, నీవా పశువును బలిచేయకు. అయితే ఖుర్బానీ రోజు క్షవరం చేయించుకో, గోళ్ళు కత్తిరించుకో, మీసాలు కత్తిరించుకొని సరిచేసుకో, నాభికింది వెంట్రుకలు తీసి శుభ్రపరచుకో. అంతే, ఈ ఆచరణే నీ ఖుర్బానీకి ప్రత్యామ్నాయం అవుతుంది." (అబూదావూద్, నసాయి)

## 42. కప్ఫారా (పాపపరిహారం)

హజ్‌యాత్రకు వెళ్ళేవారు దేవుడు నిషేధించిన పనులను తెలిసి చేసినా, తెలియక చేసినా, పొరపాటున చేసినా పాపపరిహం చెల్లించవలసి ఉంటుంది.

☯ ఇహ్రాం పూనకుండా ఎవరైనా ప్రతిష్ఠాలయం (హరం) సరిహద్దులలో ప్రవేశించడం జరిగితే అలాంటివ్యక్తి ఒక పశువుని ఖుర్బానీ ఇవ్వడం విధి (వాజిబ్).

☯ హాజీ "హరం" సరిహద్దుల బయట క్షవరం చేయించుకుంటే దానికి కూడా పరిహారంగా ఒక పశువుని ఖుర్బానీ ఇవ్వడం విధి (వాజిబ్).

☯ పురుషుడు గాఢమైన సువాసన తలకు రాసుకున్నపుడు ఆ సువాసన ఒకరాత్రి, ఒక పగలు ఉంటే దానికతను రెండు పశువుల్ని ఖుర్బానీ ఇవ్వడం విధి(వాజిబ్) అవుతుంది. స్త్రీ అయితే ఒక పశువును ఖుర్బానీ ఇస్తే సరిపోతుంది. గాఢమైన సువాసన పూసుకుంటే, అది కొద్దిసేపు ఉన్నాసరే ఒక పశువును ఖుర్బానీ ఇవ్వడం విధి (వాజిబ్) అవుతుంది.

☯ సంభోగం లేక స్వప్నస్ఖలనంతో కూడిన అశుద్ధావస్థలో కాబాప్రదక్షిణ చేస్తే, ఒక ఖుర్బానీ ఇవ్వడం విధి (వాజిబ్) అవుతుంది. ఉజూలేని అశుద్ధావస్థలో ఐచ్ఛిక ప్రదక్షిణ చేస్తే ఒక సదఖా (ఫిత్రాఅంత) దానం చేయడం విధి (వాజిబ్) అవుతుంది.

☯ ఇహ్రాంలో ఉన్నప్పుడు తలపై ఆచ్ఛాదన ఉండకూడదు. ఒకవేళ తలపై కొన్ని గంటల పాటు వస్త్రం కప్పుకుంటే, లేదా టోపీ పెట్టుకుంటే ఒక సదఖా (అంటే ఫిత్రాఅంత) దానం చేయడం విధి (వాజిబ్) అవుతుంది.

☯ విధి (వాజిబ్)గా పాటించాల్సిన హజ్ నియమాలలో దేన్నయినా కారణం లేకుండా వదిలేస్తే ఒక ఖుర్బానీ ఇవ్వడం విధి (వాజిబ్) అవుతుంది. ఏదైనా బలమైన కారణం ఉండి వదిలేస్తే ఖుర్బానీగాని, సదఖాగాని ఏదీ ఇవ్వనవసరం లేదు.

☯ హాజీ ప్రతిష్ఠాలయం సరిహద్దులలోపల జంతువును వేటాడితే అతను ఒక మేకనో, పొటేలునో బలివ్వడం విధి. వేటాడేవారికి ఆ పనిలో సహకరించడం కూడా నిషిద్ధమే.



"విశ్వాసులారా! మీరు హజ్‌దీక్ష (ఇహ్రాం)లో ఉన్నప్పుడు వేటాడకండి. ఒకవేళ ఎవరైనా కావాలని ఇలా చేస్తే అతను తాను వేటాడిన జంతువుకు సమానమైన మరో జంతువును సమర్పించి మొక్కుబడి చెల్లించవలసి ఉంటుంది. దీన్ని గురించి మీలో ఇద్దరు నిజాయితీపరులు నిర్ణయం తీసుకోవాలి. తరువాత ఈ కానుకను కాబాగృహానికి చేర్చాలి. అలాంటి మొక్కుబడి చెల్లించే స్తోమత లేనివారు తమపాపానికి నిష్కృతిగా కొందరు పేదలకు అన్నదానం చేయాలి. లేదా దానికి సమానమైన ఉపవాసాలు పాటించాలి. ఈవిధంగా వారు తాముచేసిన నేరానికి శిక్ష అనుభవించాలి. గతంలో చేసిన దాన్ని దేవుడు క్షమిస్తాడు. అయితే మళ్ళీ అలాంటి పనికి పాల్పడితే మాత్రం దేవుడు దానికి ప్రతీకారం చేస్తాడని తెలుసుకోండి. దేవుడు సర్వశక్తిమంతుడు, ప్రతీకారం చేయగల సమర్థుడు కూడా." (ఖుర్ఆన్-5:95)

ఈ నిషేధం నేల మీద వేటాడబడే జంతువులకు, ఆకాశంలో ఎగిరేపక్షులకు మాత్రమే వర్తిస్తుంది. సముద్రం, నదులు, సరస్సులలో వేటాడబడే ప్రాణులకు వర్తించదు.

"దేవుడు మీకు సముద్ర జీవాలను వేటాడటాన్ని, వాటిని తినడాన్ని ధర్మసమ్మతం చేశాడు. దానివల్ల మీకూ, తోటి ప్రయాణీకులకూ ప్రయోజనం ఉంది. అయితే మీరు ఇహ్రాం (దీక్ష)లో ఉన్నంతవరకు నేలపై వేటాడకూడదు. కనుక మీరు దేవునికి భయపడండి. ఆయన మిమ్మల్నందరినీ సమీకరించి తనముందు సమావేశ పరచుకుంటాడు." (ఖుర్ఆన్-5:96)

"దైవప్రసన్నత కోసం హజ్‌యాత్ర చేయండి. ఉమ్రా ఆచారం కూడా పాటించండి. మార్గమధ్యలో మీకేదైనా అవరోధం ఎదురైతే, మీకు అందుబాటులో ఉన్న బలిదానాన్నే దేవునికి సమర్పించుకోండి. అయితే బలి (పశువు) దానం, దాని స్థానానికి చేరుకోనంత వరకు మీరు శిరోముండనం చేయించుకోకండి. ఒకవేళ మీలో ఎవరైనా వ్యాధిగ్రస్తు లయితే లేదా శిరోబాధకు లోనయి (బలిపశువు నిర్ణీతస్థలానికి చేరుకోకముందే) శిరోముండనం చేయించుకో వలసివస్తే అలాంటివారు దానికి పరిహారంగా ఉపవాసం పాటించాలి; లేదా దానధర్మాలు చేయాలి; లేదా ఖుర్బాని (పశుబలి) ఇవ్వాలి." (ఖుర్ఆన్-2:196)

"తర్వాత (ఆ అవరోధం తొలగిపోయి లేదా) ప్రశాంత పరిస్థితి ఏర్పడినప్పుడు మీలో ఎవరైనా హజ్ దినాలు రాకముందే యాత్రాస్థలానికి చేరుకొని ఉమ్రా ఆచారం పాటిస్తే, అలాంటివారు తమ స్తోమతను బట్టి బలిదానం ఇవ్వాలి. బలిదానం ఇవ్వలేని వారు హజ్ కాలంలో మూడురోజులు, ఇంటికి తిరిగొచ్చిన తరువాత ఏడురోజులు చొప్పున మొత్తం పదిరోజులు ఉపవాసం పాటించాలి. ప్రతిష్ఠాలయం (మస్జిదుల్‌హరాం) సమీపంలో ఇల్లూ వాకిలి లేనివారికి మాత్రమే ఈ సౌలభ్యం వర్తిస్తుంది. దేవుని పట్ల భయభక్తులు కలిగి ఉండండి. ఆయన కఠినంగా శిక్షిస్తాడని గుర్తుంచుకోండి." (ఖుర్ఆన్-2:196)

### హజ్ సీజన్‌లో జీవనోపాధి

అజ్ఞానకాలంలో అరబ్బులు హజ్ సీజన్‌లో జీవనోపాధి కృషిని పాపంగా భావించేవారు. వారి దృష్టిలో బ్రతుకుతెరువు కోసం కూలి, వ్యాపారం వగైరా పనులు చేసి సంపాదించడం అనేది ప్రాపంచిక వ్యవహారం. హజ్‌యాత్ర లాంటి గొప్ప మతకార్యం నిర్వహిస్తున్నప్పుడు ప్రాపంచిక వ్యవహారమయిన జీవనోపాధి కోసం పాటుపడటం నీచమైన పనని, పాపకార్యమని వారు భావిస్తుండేవారు.

ఖుర్‌ఆన్ ఈ మూఢనమ్మకాన్ని ఖండిస్తోంది. దైవభీతిపరుడైన ముస్లిం దైవాదేశాలను గౌరవిస్తూ జీవనోపాధి కోసం కృషి చేస్తున్నాడంటే అతను తనప్రభువు అనుగ్రహాన్ని అన్వేషిస్తున్నాడన్నమాట. ఏ ప్రాపంచికకార్యమైనా, చివరికి బ్రతుకుతెరువు కోసం పాటుపడటమైనా దైవాజ్ఞల పరిధిలో ఉండి చేస్తే అది పాపకార్యం కాదు, పుణ్యకార్యంగా పరిగణించబడుతుంది.

“హజ్‌దినాలలో మీరు దేవుని అనుగ్రహం (ఉపాధి) అన్వేషించ దలచుకుంటే నిరభ్యంతరంగా అన్వేషించవచ్చు. అందులో ఎలాంటి తప్పులేదు..” (ఖుర్‌ఆన్-2:198)

దైవప్రవక్త (స) ప్రవచనం: “నీతిమంతుడైన వ్యాపారి అంతిమ దినాన దైవప్రవక్తల, సత్యసంధుల, అమరగతుల సహచర్యంలో ఉంటాడు.” (తిర్మిజి)

“ఇబ్రాహీం కోసం మేమీ ఆలయ స్థలాన్ని ప్రతిపాదిస్తూ ఇలా ఉపదేశించాం: ‘నా దైవత్వంలో ఎవరికీ భాగస్వామ్యం కల్పించకూడదు. నా ఆలయప్రదక్షిణ చేసేవారి కోసం, ఇక్కడ ప్రార్థనకై నిలబడే, మోకరిల్లే, సాష్టాంగపడేవారి కోసం పవిత్రంగా ఉంచాలి. హజ్ చేయడానికి ప్రజలకు సాధారణ అనుమతినివ్వాలి. వారు దూరదూర ప్రాంతాల నుంచి కాలి నడకన, ఒంటెల మీద వస్తారు. వారిక్కడ తమకోసం ఉంచబడిన ప్రయోజనాలు చూసి తరిస్తారు. నిర్ణీత దినాలలో మేము ప్రసాదించిన పశువుల్ని దేవుని పేరుతో బలిచేస్తారు. తర్వాత దాన్ని తింటారు, పేదలక్కూడా దానం చేస్తారు. ఆతర్వాత తమ మురికి, మలినాలు తొలగించుకుంటారు. తమ మొక్కుబడులు తీర్చుకుంటారు. ఆపై ఈ ప్రాచీనాలయం చుట్టూ ప్రదక్షిణ చేస్తారు. ఇదే (కాబానిర్మాణ లక్ష్యం). దేవుడు నిర్దేశించిన ప్రతిష్ఠాత్మక విషయాల్ని ఎవరు గౌరవిస్తారో అది దేవుని దృష్టిలో వారికే శ్రేయస్కరం.” (ఖుర్‌ఆన్: 22:26-30)

## బదులు హజ్

ఎవరైనా ఆర్థికస్తోమత ఉన్నప్పటికీ అనారోగ్య కారణాల వల్లగాని లేక మరేవైనా షరీఅత్ పరమైన కారణాల వల్లగాని విధి (ఫరజ్)గా చేయవలసిన హజ్ చేయలేని పరిస్థితిలో ఉంటే అతను తన తరఫున డబ్బిచ్చి ఇతరుల చేత హజ్ చేయించాలి. దీన్నే “బదులు హజ్” (హజ్జెబదల్) అనంటారు. నఫిల్ (ఐచ్ఛిక) హజ్ విషయంలో మాత్రం మనిషి ఆరోగ్యంగా ఉన్నా సరే తన తరఫున ఇతరులచేత ‘హజ్జెబదల్’ నిరభ్యంతరంగా చేయించుకోవచ్చు. అలాగే ఐచ్ఛిక ఉమ్రా విషయంలో కూడా డబ్బిచ్చి ఇతరుల చేత చేయించుకోవచ్చు.

హజ్రత్ అబూరజీన్ (రజి) ఓరోజు హజ్ గురించి దైవప్రవక్త (స)తో మాట్లాడుతూ “దైవప్రవక్తా! మానాన్న చాలా ముసలివారైపోయారు. ఆయన ఇప్పుడు హజ్, ఉమ్రాలు చేయలేని పరిస్థితిలో ఉన్నారు; వాహనం మీద కూర్చునే శక్తి కూడా లేదు. (ఇలాంటి పరిస్థితిలో నేనేం చెయ్యాలి)?” అని అన్నారు. దానికి దైవప్రవక్త (స) “నీవు నీతండ్రి వైపున హజ్, ఉమ్రా (విధు)లు నెరవేర్చు” అని సమాధానమిచ్చారు. (తిర్మిజి)

దైవప్రవక్త (స) సన్నిధికి ఒకతను వచ్చి “దైవప్రవక్తా! మానాన్న చనిపోయారు. ఆయన బ్రతికుండగా హజ్ చేయలేకపోయారు. మరి నేనిప్పుడు ఆయన తరఫున హజ్ చేయవచ్చా?” అనడిగాడు. దానికాయన “నీతండ్రి అప్పుచేసివుంటే దాన్ని నీవు తీర్చవా?” అనడిగారు. దానికా వ్యక్తి “తప్పక తీర్చుతాను దైవప్రవక్తా!” అన్నాడు. అప్పుడు దైవప్రవక్త (స) “అలాగే దేవుని రుణం కూడా తప్పక తీర్చాలి” అన్నారు. (జమావుల్ ఫవాయెద్)



పైరెండు హదీసుల్నిబట్టి వృద్ధాప్యం, శాశ్వతమైన అనారోగ్య కారణాలతో హజ్ చేయలేని మనిషి తరఫున ఇతరులు హజ్జెబదల్ చేయవచ్చని; బ్రతికుండగా హజ్ చేయలేకపోయిన మనిషి చనిపోయాక అతని వైపున అతని వారసులు హజ్జెబదల్ చేయాలని తెలుస్తోంది.

దైవప్రవక్త (స) ప్రవచనం: “ఒక (బదులు)హజ్ ద్వారా దేవుడు ముగ్గురు మనుషలను స్వర్గంలో ప్రవేశింపజేస్తాడు. ఆ ముగ్గురిలో ఒకతను, (ఎవరి తరఫున బదులుహజ్ చేయడం జరుగుతుందో ఆ) మృతమనిషి. రెండో అతను, హజ్ చేసేవాడు. మూడో అతను, హజ్‌యాత్రకు పంపేవాడు.” (తర్గీబ్ వ తర్హీబ్, కన్జుల్ అమ్మాల్)

# 43. హాజీ ఎలా ఉండాలి?

సాధారణంగా ప్రజలు మతవ్యవహారాల్లో బాహ్యావిషయాలకే ప్రాధాన్యమిస్తారు. అంతర్విషయాల్ని గురించి అంతగా పట్టించుకోరు. నమాజ్, రోజా, హజ్ వగైరా విషయాల్లో ఈనాడు ముస్లింల పరిస్థితి ఇలాగే ఉంది. “హజ్” అనగానే ఓ ప్రత్యేక వస్త్రధారణతో మక్కా వెళ్ళడం, కాబా ప్రదక్షిణ చేయడం, సఫా-మర్వా కొండల మధ్య తిరగడం, అరఫాత్, ముజ్దల్ఫాలకు వెళ్ళిరావడం వంటి విషయాలే వారి హృదయాల్లో మెదలుతాయి. కాని హజ్ అసలు ధ్యేయం ఏమిటో, అది మనిషిని ఎలా తీర్చిదిద్దదలచిందో ఆలోచించరు. హజ్ ఆశయాలను గురించి ఇక్కడ ముందుగా మనం దైవప్రవక్త (స) హితోక్తులను పరిశీలిద్దాం.

“మీ రక్తం, మీ ధనం, మీ మానమర్యాదలు మీఈ పట్టణంలో ఏవిధంగా నిషేధించబడ్డాయో అదేవిధంగా (ఇవన్నీ ఇకనుంచి) మీ మధ్య నిషేధించబడ్డాయి. జాగ్రత్త! ఎవరైనా దౌర్జన్యపరుడు దౌర్జన్యం చేస్తున్నాడంటే తనపై తానే దౌర్జన్యం చేసుకుంటున్నాడు (అని గ్రహించండి). జాగ్రత్త! ఏ తండ్రీ తన సంతానంపై, ఏ సంతానం కూడా తన తండ్రిపై దౌర్జన్యం చేయకూడదు....” (ఇబ్నెమాజ, తిర్మిజి)

హజ్‌సీజన్‌లో ప్రజలు మక్కాలో రక్తపాతం జరుపుకోవడం, దోచుకోవడం, అవమానించుకోవడం నిషిద్ధం. అలాగే ఇకనుంచి శాశ్వతంగా ఇస్లామీయ సమాజంలో రక్తపాతం, దోపిడీలు, అగౌరవాలు జరగకూడదని, ప్రజలు పరస్పరం సఖ్యతతో, ఒకరి హక్కులు ఒకరు గౌరవించుకుంటూ శాంతియుతంగా మెలగాలని దైవప్రవక్త (స) ఈ హదీసులో అనుచరులకు బోధించారు. అదీగాక, ముస్లిం సముదాయంలో సమైక్యతా, సౌభ్రాతృత్వాలను గురించి కూడా ఈ హదీసు పరోక్షంగా మనల్ని ఉపదేశిస్తోంది.

హజ్రత్ ఉసామా బిన్ షరీక్ (రజి) ఇలా తెలియజేస్తున్నారు:“నేను దైవప్రవక్త (స)తో కలసి హజ్ చేయడానికి బయలుదేరాను. అప్పుడు ప్రజలు (హజ్ ఆచారాలు తెలుసుకోవడానికి) ఆయన సన్నిధికి వస్తుంటారు. వారు వచ్చి ‘దైవప్రవక్తా! కాబాప్రదక్షిణ చేయకముందు నేను ‘సయీ’ (సఫా, మర్వా కొండలు ఎక్కిదిగే పని) చేశాను. లేదా (మొదట చేయవలసిన) పని తర్వాత చేశాను. లేదా (తర్వాత చేయవలసిన పని) మొదట్లో చేశాను’ అని అంటాడు. దైవప్రవక్త (స) ప్రతి మనిషికీ ‘పర్వాలేదు. (అందులో నష్టమేమీ లేదు). కాని ఎవరైనా దౌర్జన్యంగా ఒక ముస్లిం పరువుప్రతిష్ఠలకు భంగం కలిగిస్తే మాత్రం నష్టమే. కనుక అలాంటి మనిషి నష్టపోయి హతమయ్యాడు (అని తెలుసుకోండి)’ అని చెప్పేవారు.” (అబూదావూద్)

హజ్ విధులలో ఎవరైనా పొరపాటున ముందు చేయవలసిన పని వెనుక, వెనుక చేయవలసిన పని ముందు చేసినంత మాత్రాన దైవధర్మం పట్ల మనిషికుండే విశ్వాసానికి పెద్ద ప్రమాదమేమీ ముంచుకురాదని, మనిషిని ఇహపరలోకాల్లో నష్టపరచే అసలు విషయం తోటి మనుషులపై అన్యాయానికి, అత్యాచారానికి, అగౌరవానికి పాల్పడమేనని పైహదీసు బట్టి తెలుస్తోంది. మరోవిషయం- అశ్లీలం, అసభ్యతలకు దూరంగా ఉండాలని కూడా ముస్లింలకు కాబా సందేశమిస్తోంది. దీన్ని గురించి దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు:

“ఎలాంటి అశ్లీలకార్యానికి పాల్పడకుండా, మరే పాపకార్యానికి గురికాకుండా ఈ (కాబా)గృహాన్ని సందర్శించిన మనిషి తన తల్లి గర్భం నుండి (అప్పుడే) పుట్టిన వాడిలా (పరమ పవిత్రుడిగా హజ్ నుండి) మరలిపోతాడు.” (ముస్లిం)

మనిషి హృదయంలో నిజమైన భయభక్తులు ఉంటే అతను ఏచెడునూ దరికి చేరని వ్వడు. హజ్ సందర్భంలోనైతే మనసులోకి చెడుతలంపును కూడా రానివ్వకుండా దైవగృహాన్ని సందర్శించాలన్న అకుంఠిత దీక్షతో ఆయన్ని స్మరిస్తూ తన ఉనికినే మరచిపోతాడు. ఇలాంటి భక్తుడ్ని గురించి దేవుడు ఎలా వర్ణించాడో దైవప్రవక్త (స) ఈ క్రింది ప్రవచనం చూడండి:

దైవప్రవక్త (స) హితోక్తి: “హజ్ చేసేవారు అరఫాత్‌లో ఆగి దేవుడ్ని ప్రార్థించడంలో, (దైవభీతితో) దుఃఖించడంలో నిమగ్నులై ఉన్నప్పుడు దేవుడు ఇహలోక ఆకాశానికి వచ్చి దైవదూతలతో ఇలా అంటాడు- ‘నాఈ దాసుల్ని చూడండి. చెదరిన శిరోజాలతో, దుమ్ము ధూళితో ఉన్న స్థితిలో వీరు నా దగ్గరికి వచ్చారు చూడండి.” (మిష్కాత్)

నీటుగా, టిప్‌టాప్‌గా ఉండాలిగాని, ఇదేమిటీ దేవుడు దుమ్ము ధూళి కొట్టుకున్న వారిని పొగడుతున్నాడు! అని కొందరు ఆశ్చర్యపడవచ్చు. కాని మనిషి ఏదైనా ముఖ్యమైన పని దీక్షగా చేస్తున్నప్పుడు జుట్టు చెదిరిపోతే దువ్వుకోవాలని ఆలోచిస్తాడా? చెమట, దుమ్ము పడ్తుంటే మాటిమాటికి టాయ్‌లెట్ అవుతూ బట్టలు మార్చుకుంటాడా? అలా ఎన్నటికీ చేయడు. తలపెట్టిన పని ముగిసేదాకా అతనికి మరోపని మీద ధ్యాసేఉండదు. హజ్‌చేసే మనిషి పరిస్థితి కూడా ఇలాగే ఉండాలని ఈహదీసు మనకు వివరిస్తోంది.

# III. ఆర్థిక వ్యవస్థ

మనిషి తన జీవితంలోని అత్యధిక భాగాన్ని ‘ఉపాధి, తదితర ఆర్థిక వ్యవహారాల’ కోసమే వినియోగిస్తాడు. అయితే ఈ రంగంలో మన ఇష్టానుసారం వ్యవహరించడమేనా లేక సృష్టికర్త పంపిన మార్గదర్శక సూత్రాల ప్రకారం నడచుకోవలసి ఉందా? అనుదిన జీవితంలో నమాజ్‌కు ఎంతో ప్రాముఖ్యమిచ్చే ముస్లింలు కూడా దీన్ని గురించి పెద్దగా పట్టించుకోకపోవడం విచారకరం, మన ఐహికజీవితం ఇలాగే సాగితే మన పరలోక జీవితం అత్యంత విచారకరంగా మారుతుంది.

## 44. ధనవ్యామోహం

“ప్రాపంచిక వ్యామోహంలో పరస్పరం పోటీపడి వీలైనంత ఎక్కువ సంపాదించాలన్న తపనే మిమ్మల్ని ఏమరుపాటులో పడవేసింది. చివరికి (అదే రందిలో) మీరు సమాధికి చేరుకుంటారు. (మీరసలు ప్రాపంచిక సంపదే ప్రగతికి చిహ్నమని అనుకుంటున్నారు కాబోలు.) ఎంతమాత్రం కాదు. త్వరలోనే మీకు తెలుస్తుంది (వాస్తవం ఏమిటో). ఎంత మాత్రం కాదు. త్వరలోనే మీకు తెలుస్తుంది. ఎంతమాత్రం కాదు. విశ్వసనీయ జ్ఞానంతో



మీరు విషయాన్ని గ్రహిస్తే (మీ వైఖరి ఇలా ఉండదు). మీరు తప్పకుండా నరకాన్ని చూస్తారు. ఔను, మీరు నమ్మకంగా దాన్ని మీ కళ్ళారా చూస్తారు. ఆరోజు ఈ సౌఖ్యాలు, సిరిసంపదల్ని గురించి మిమ్మల్ని తప్పకుండా నిలదీయడం జరుగుతుంది.” (ఖుర్ఆన్. 102:1-8)

“విశ్వాసులారా! గ్రంథప్రజలకు చెందిన ధర్మవేత్తలు, సాధువులలో అనేకమంది అక్రమ పద్ధతుల ద్వారా ప్రజల ధనాన్ని కాజేస్తున్నారు. పైగా వారిని దైవమార్గంలోకి రాకుండా నిరోధిస్తున్నారు. వెండిబంగారాలు కూడబెట్టి వాటిని దైవమార్గంలో వినియోగించని పిసినారులకు దుర్భరయాతన కాచుకొని ఉందని శుభవార్త విన్పించు!” (9:34)

దైవప్రవక్త (స) ఇలా బోధించారు: “సంపద కూడ బెట్టుకోకండి. దానివల్ల మీలో ఇహలోక జీవితం పట్ల ఆసక్తి పెరిగే ప్రమాదం ఉంది.” (తిర్మిజీ)

దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: “ప్రతి సమాజంలోనూ ఓ ఉపద్రవం తలెత్తు తుంది. నా అనుచర సమాజానికి పొంచివున్న ఉపద్రవం ధనవ్యామోహం.” (తిర్మిజీ)

దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: “అత్యధిక సిరిసంపదలతో కలిమి రాదు. నిజమైన కలిమి ఆత్మసంతృప్తి వల్లనే ఒనగూడుతుంది.” (బుఖారి, ముస్లిం)

హజ్రత్ అబూసయీద్ ఖుద్రీ (రజి) కథనం: దైవప్రవక్త (స) ఓసారి మాతో ముచ్చ టిస్తూ “మీ విషయంలో నాకు భూశుభాలను గురించి భయంగా ఉంది” అన్నారు. అప్పుడు ఒకతను “భూశుభాలు అంటే ఏమిటీ దైవప్రవక్తా!” అని అడిగాడు. దానికి దైవప్రవక్త (స) “భూశుభాలు అంటే ప్రాపంచిక సిరిసంపదలు” అని చెప్పారు. అప్పుడు మరొకతను “మంచి నుండి కూడా చెడు పుడ్తుందా?” అని ప్రశ్నించాడు.

దైవప్రవక్త (స) ఈమాట విని మౌనంగా ఉండిపోయారు. అలా చాలా సేపు ఉన్నారు. దాంతో మేము దైవప్రవక్త (స)పై దివ్యావిష్కృతి (వహీ) అవతరిస్తోందని భావించాము. కాస్సేపటికి దైవప్రవక్త (స) నుదుటికి పట్టిన చెమట తుడుచుకుంటూ “ప్రశ్న అడిగిన మనిషి ఎక్కడున్నాడు?” అని అడిగారు. అప్పుడా వ్యక్తి “నేను ఇక్కడే ఉన్నానండీ!” అన్నాడు... అప్పుడు దైవప్రవక్త (స) ఇలా చెప్పారు:

“మంచి విషయంవల్ల ఎప్పుడూ మంచే జరుగుతుంది. కాని ఈ ప్రాపంచిక సంపద తళుకుబెళుకులతో నవనవలాడుతూ, రుచిలో ఎంతో మధురంగా ఉంటుంది. వర్షా కాలంలో ఏపుగాపెరిగి నయనానందకరంగా ఉండే పచ్చికను పశువు మితిమీరి మేస్తే దానిపొట్ట ఉబ్బిపోతుంది. దాంతో అది చావనైనా చస్తుంది. లేదా చావు దరిదాపులకైనా చేరుతుంది. అలాగాక ఆ పశువు మితంగా మేసి, కడుపు నిండగానే ఎండలోకెళ్ళి నిలబడి నెమరువేసి, మలమూత్ర విసర్జన తరువాత తిరిగొచ్చి మేస్తుంటే బాగుంటుంది. ప్రాపంచిక ఐశ్వర్యం కూడా అలాంటిదే. ఇది పైకి ఎంతో ఆకర్షవంతంగా, రుచిలో మధురంగా ఉంటుంది. కనుక దీన్ని (అవసరమైనంత మేరకు) ధర్మయుక్తంగా సంపా దించి ధర్మయుక్తంగా వినియోగించాలి. అప్పుడే అది మనిషికి సత్ఫలమిస్తుంది. దానికి బదులు అధర్మంగా, అక్రమంగా తనకు లభించవలసినదాని కంటే ఎక్కువ సంపాదించి తినేవాడు, ఎంతతిన్నా కడుపునిండనివాడితో సమానుడవుతాడు.” (బుఖారి, ముస్లిం)

ధనదాహం, ప్రాపంచికవ్యామోహం ఎంతటి ప్రమాదకరమైన విషయాలో దైవప్రవక్త (స) ప్రవచించిన ఈక్రింది హితోక్తులు చూడండి:

“ధనవ్యామోహం, (ఇస్లాంపట్ల) విశ్వాసం రెండూ కలసి ఏ దాసుని హృదయం లోనూ ఇమిడి ఉండలేవు.” (నసాయి)

“ఐశ్వర్య పూజారి (ధన పిపాసి) శపించబడ్డాడు.” (తిర్మిజి)

“ఆకలిగొన్న రెండు తోడేళ్ళను మేకలమందలోకి వదిలితే ఆ తోడేళ్ళు మేకలను ఎంత నష్టపరుస్తాయో, మనిషిలోని ధనపిపాస అతని ధర్మాన్ని అంతకంటే ఎక్కువ నష్టపరుస్తుంది.” (తిర్మిజి, దార్మి)

“రెండు విషయాల్లో వృద్ధుని హృదయం కూడా యువ హృదయమైపోతుంది. ఒకటి, ప్రాపంచిక వ్యామోహం. రెండు, సుదీర్ఘకాలం బ్రతకాలన్న కోరిక.” (బుఖారి)

“మానవుడు ఒకవైపు వృద్ధుడయిపోతుంటే, మరోవైపు అతనిలో రెండు విషయాలు అధికమవుతుంటాయి. (1) ధనవ్యామోహం, (2) దీర్ఘాయువు పట్ల కోరిక.” (ముస్లిం)

ఇస్లాం అంటే ఏమిటనే ప్రశ్నకు సాధారణంగా ప్రజలు ఇతరమతాల్లా ఇస్లాంను కూడా ఒక మతవ్యవస్థగా భావించి “ఆ, ఇస్లాం అంటే ఏముంది, పూజాపునస్కారాలే కదా! కాకపోతే ముస్లింలు వాటిని నమాజ్, రోజా వగైరా పేర్లతో పిలుస్తార”ని అంటారు. కాని ఇస్లాం ప్రారంభ దశలో దైవప్రవక్త (స) ఇస్లామంటే ఏమిటని అడిగిన ప్రశ్నకు ఏం సమాధానమిచ్చారో చూడండి:

హజ్రత్ అమ్ బిన్ అబస (రజి) ఉల్లేఖనం- నేను దైవప్రవక్త (సల్లం) సన్నిధికి పోయి “ఇస్లాం అంటే ఏమిట”ని ప్రశ్నించాను. దానికి ఆయన “(ఇస్లాం అంటే) మంచి మాటలు చెప్పడం, (ఆకలిగొన్నవారికి) అన్నం పెట్టడం” అని సమాధానమిచ్చారు. నేను మళ్ళీ “విశ్వాసం అంటే ఏమిట”ని అడిగాను. దానికి ఆయన సమాధానం ఇస్తూ “సహనం వహించడం, దానం చేయడం” అని అన్నారు. (అహ్మద్-మిష్కాత్)

“అతను కఠినమైన కనుమ గుండా నడవడానికి సాహసించలేదు. కఠినమైన కనుమ అంటే ఏమిటో నీకు తెలుసా? (కఠినమైన కనుమంటే) బానిసను బంధవిముక్తి చేయడం, లేదా (కరువుదినాల్లో) ఆకలిగొన్న రోజు సమీప అనాథకుగాని, దారిద్ర్యంలో మగ్గే నిరు పేదకుగాని పట్టెడన్నం పెట్టడం, ఆపై ఓర్పు, దయాదాక్షిణ్యాల్ని గురించి పరస్పరం ఉప దేశించుకునే విశ్వాసుల్లో చేరిపోవడం.” (ఖుర్ఆన్-90:11-17)

ఇస్లాం శారీరక ఆరాధనలతోపాటు ఆర్థికారాధనలకు కూడా ప్రాముఖ్యం ఇస్తుంది. మనిషికున్న సంపదలో తనకంటే దిగువస్థాయిలో ఉండే పేదవాడికి ఎంతోకొంత హక్కు తప్పక ఉంటుంది. ఇక్కడ్నుంచే ఇస్లామీయ అర్థశాస్త్రానికి పునాదులు ప్రారంభమవుతాయి.

## పేరాశ, పిసినారితనం

“కేవలం ప్రాపంచిక జీవితాన్ని, దాని తళుకు బెళుకుల్ని కోరుకునే వారికి వారి కర్మ ఫలాన్ని పూర్తిగా ఇక్కడే ఇచ్చివేస్తాము. అందులో వారికి ఎలాంటి కొరత చేయము. అయితే పరలోకంలో అలాంటి వారికి నరకాగ్ని తప్ప మరేమీ ఉండదు. వారు ప్రపంచంలో సమ కూర్చుకున్నదంతా నిరర్థకమయి పోయింది.” (ఖుర్ఆన్-11:15,16)



దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రవచించారు: “తన ప్రపంచాన్ని బాగుపరచుకోవడంలోనే మునిగిపోయేవాడు తన పరలోకాన్ని నష్టపరచుకుంటాడు. అదేవిధంగా తన పరలోకాన్ని బాగుపరచుకునేవాడు తన ఇహలోకాన్ని నష్టపరచుకుంటాడు. కనుక మీరు శాశ్వతంగా ఉండే విషయాలను అవలంబించండి. త్వరలో అంతమయ్యే అశాశ్వతమైన విషయా లను అవలంబించకండి.” (బైహఖి)

దైవప్రవక్త (స) హితోక్తి: “మానవునికి సిరిసంపదలతో (లేక బంగారంతో) నిండిన ఓ పెద్ద లోయ లభించినా, అలాంటి మరోలోయ దొరికితే బాగుంటుందని భావిస్తాడు. అతని పేరాశ కడుపు (సమాధి)మట్టితో మాత్రమే నిండుతుంది. అయితే ప్రాపంచిక వ్యామోహం వదలి పశ్చాత్తాపంతో దేవుని వైపుకు మరలితే అలాంటి మనిషిని దేవుడు మన్నిస్తాడు. అతని పశ్చాత్తాపాన్ని స్వీకరిస్తాడు. (అతనికి ఆత్మసంతృప్తి భాగ్యం ప్రసాదిస్తాడు.)” (బుఖారి, ముస్లిం)

దైవప్రవక్త (స) ప్రవచనం: “మనిషి ఏ వస్తువు కోసం పుట్టించబడ్డాడో అతనికా వస్తువు తప్పకుండా లభిస్తుంది. కనుక మీరు (దేవుడ్ని) మీ సామర్థ్యం మేరకే ప్రాపంచిక సంపద అర్థించండి.” (ఇబ్నెమాజ)

“దేవుడు తన అనుగ్రహంతో ప్రసాదించిన సంపద విషయంలో పిసినారితనం వహించేవారు ఆ పిసినారితనం తమకు మేలు చేకూరుస్తుందని భావించకూడదు. అది వారికి హాని కలిగిస్తుంది. వారు ఏ ధనం విషయంలో పిసినారితనం వహిస్తున్నారో అది రేపు ప్రళయదినాన వారి మెడకు గుదిబండగా మారుతుంది.” (ఖుర్ఆన్-3:180)

సత్కార్యాల కోసం జేబు నుండి డబ్బుతీయనీయకుండా మనిషిని నిరోధించే ప్రధాన అడ్డంకి అతని అంతరంగంలో దాగివుండే పిసినారితనమే. స్వార్థం, ధనపిపాస, పేరుప్రతిష్ఠల భావనలు పిసినారితనానికి దగ్గరి బంధువులు. ధనవ్యామోహం మనిషి చేత ముఖ్యంగా రెండు తప్పులు చేయిస్తుంది. ఒకటి, ధనార్జన కోసం అక్రమ పద్ధతులు అవలంబించడం. రెండు, ధనాన్ని అత్యధికంగా కూడబెట్టడం లేదా దుబారా, దుష్కార్యాల్లో దుర్వినియోగపరచడం. ఇవి రెండు తీవ్రమైన నేరాలు. వీటికి పరలోకంలో ఘోరశిక్ష చవిచూడవలసి వస్తుంది.

“నిందించే, హేళనచేసే, చాడీలుచెప్పే ప్రతివాడికీ వినాశం ఉంది. అతను (మితి మీరిన ధనదాహంతో) డబ్బు కూడబెడ్తున్నాడు. దాన్ని మాటిమాటికి లెక్కపెట్టి దాచిపెడ్తున్నాడు. అతనీ సంపద శాశ్వతంగా తన దగ్గర ఉంటుందని భావిస్తున్నాడు. ఎంతమాత్రం ఉండదు. అతను కసకస తొక్కివేసే చోట విసిరేయబడతాడు. కసకస తొక్కివేసే చోటంటే ఏమిటో నీకు తెలుసా? దేవుని (నరకా)అగ్ని. అది భగభగమండుతూ గుండెలదాకా చేరుతుంది. వారిని ఆ అగ్నిగుండాలలో వేసి మూసేయడం జరుగుతుంది.” (ఖుర్ఆన్:104:1-9)

హజ్రత్ అబూజర్ గిఫారి (రజి) కథనం: నేను దైవప్రవక్త (స) దగ్గరకు వెళ్ళాను. అప్పుడాయన కాబా నీడలో కూర్చొనివున్నారు. నన్ను చూడగానే “వారు సర్వనాశనమవు తారు” అన్నారు. నేనీ మాట విని “నా తల్లిదండ్రులు మీకోసం సమర్పితం. ఎవరా సర్వ నాశనమయ్యేవారు?” అనడిగాను. “ధనికులైనప్పటికీ దైవమార్గంలో ధనాన్ని ఖర్చుపెట్టని వారు సర్వనాశనమవుతారు. దైవమార్గంలో తమ ధనాన్ని ఉదారంగా ఖర్చుపెట్టేవారే

సఫలమవుతారు. వారు ముందున్నవారికి, వెనుకున్నవారికి, కుడివైపున్నవారికి, ఎడమ వైపున్నవారికి ఇస్తారు. ఇలాంటి ధనికులు చాలా తక్కువమంది ఉంటారు." (బుఖారి)

హ'జ్రత్ అదీ (రజి) కథనం: దైవప్రవక్త (స) నరకం గురించి ప్రస్తావిస్తూ "నరకాగ్ని నుండి కాపాడుకోండి" అన్నారు. ఈ మాట చెప్పి ఆయన ముఖం ఓ పక్కకు తిప్పుకున్నారు. (నరకాగ్నిని ప్రత్యక్షంగా చూస్తున్నట్లు) నరకాగ్ని పట్ల భయం, అసహ్యతలు వెలిబుచ్చారు. ఆ తర్వాత ఆయన "నరకాగ్ని నుండి రక్షించుకోండి" అన్నారు. మళ్ళీ ఆయన నరకాగ్ని పట్ల భయం, అసహ్యతలు వెలిబుచ్చాతూ ముఖం ఓ పక్కకు తిప్పుకున్నారు.

ఈవిధంగా దైవప్రవక్త (స) మూడు సార్లు చేశారు. చివరికి ఆయన నిజంగానే నరకాగ్నిని చూస్తున్నారేమోనని మాకు అనుమానం వచ్చింది. ఆ తరువాత ఆయన ఇలా అన్నారు: "ఓ ఖర్జూరపు ముక్కయినా సరే దానంచేసి నరకాగ్ని నుండి కాపాడుకోండి. అదీ దొరక్కపోతే ఓ మంచి మాటయినా పలకండి. నోట ఒక మంచి మాట వెలువడటం కూడా దానం (సదఖా)గానే పరిగణించబడుతుంది." (బుఖారి)

హ'జ్రత్ అహ్నఫ్ బిన్ ఖైస్ (రజి) కథనం:- నేనొక సారి ఖురైష్ నాయకుల దగ్గర ఉన్నప్పుడు ఒకతను వచ్చాడు. అతను ముతక బట్టలు ధరించి ఉన్నాడు. తల వెంట్రుకలు బిరుసుగా ఉన్నాయి. అతని రూపురేఖలు చూస్తే చాలా మొరటుగా ఉన్నాడు. అతను వారి దగ్గర నిలబడి సలాం చేసి ఇలా అన్నాడు: "డబ్బు కూడబెట్టేవారికి శుభవార్త చెప్పండి! (దైవదూతలు) నరకాగ్నిలో ఒక రాయిని కాల్చి దాన్ని వారి గుండెల మీద ఉంచుతారు. అది వారి భుజపు టెముకల దగ్గర్నుంచి రెండో వైపుకు వచ్చేస్తుంది. తర్వాత దాన్ని వారి భుజపుటెముకల మీద ఉంచుతాడు. అది వారి గుండెల నుండి రెండోవైపుకు వస్తుంది. ఈవిధంగా ఆ రాయి నిరంతరాయంగా అటూఇటూ తిరుగుతుంటుంది."

ఈమాటలు చెప్పి ఆ మనిషి (దగ్గర్లోఉన్న) ఒక స్తంభం దగ్గరికి వెళ్ళి కూర్చున్నాడు. ఆ మనిషి ఎవరో నాకు తెలియదు. నేనతనితో "మీ మాటలు వారికి కోపం కలిగించా యనుకుంటున్నాను నేను" అన్నాను. దానికా మనిషి "వారు బుద్ధిహీనులు. నాకీ విషయం నా ప్రాణస్నేహితుడు తెలియజేశాడు" అన్నాడు. నేను "మీ ప్రాణస్నేహితుడు ఎవరు?" అనడిగాను. అప్పుడతను ఇలా అన్నాడు: "నా ప్రాణస్నేహితుడు దైవప్రవక్త (స). ఆయన నాతో "అబూజర్! నీకు ఉహద్ పర్వతం కన్పిస్తోంది కదూ?"అని అన్నారు. ఈమాట విని ఇంకా ఎంత పొద్దుందోనని నేను సూర్యుని వైపు చూశాను. ఆయన నన్ను ఏదైనా పని మీద ఎక్కడికైనా పంపదలచుకున్నారేమోనని భావించాను. నేను (వెంటనే తేరుకొని) "కన్పిస్తోంది దైవప్రవక్తా!" అన్నాను. అప్పుడాయన "నాదగ్గర ఉహద్ కొండంత బంగారం ఉండి, మూడువరహాలు తప్ప ఆ బంగారమంతా ఖర్చుచేయకుండా అట్టి పెట్టుకోవడం నాకు (ఏమాత్రం) ఇష్టం లేదు" అని అన్నారు (బుఖారి, ముస్లిం)

హ'జ్రత్ అబూజర్ గిఫ్ఫారి (రజి) కథనం:- నేనొక రోజు సాయంత్రం దైవప్రవక్త (స)తో కలసి మదీనా వెలుపల కంకరనేలపై నడచివెళ్తుంటే మా ఎదురుగా ఉహద్ పర్వతం వచ్చింది. అప్పుడు దైవప్రవక్త (స) ఇలా అన్నారు: "అబూజర్! నాదగ్గర ఉహద్ కొండంత బంగారం ఉండి, ఒకరాత్రి లేక మూడురాత్రులు గడిచినంత కాలంలో అప్పు



తీర్చడానికి పెట్టుకునే దీనార్ తప్ప ఆ బంగారంలో ఒక దీనార్ కూడా నాదగ్గర ఉండి పోవడం నాకిష్టంలేదు. నేనా సంపదను దైవదాసుల కోసం ఇలాఅలా ఖర్చు పెడతాను." దైవప్రవక్త (స) ఈమాట అంటూ తన చేతిని అటూఇటూ తిప్పి చూపారు. (బుఖారి)

## యాజమాన్య హక్కులు

"భూమ్యాకాశాల్లోని సర్వస్వం దేవునిదే. ఆయనే వాటికి వారసుడు. అలాంటప్పుడు మీరు దైవమార్గంలో సంపదను ఎందుకు ఖర్చుపెట్టరు?" (ఖుర్ఆన్-57:10)

ఇస్లామీయ విశ్వాసం ప్రకారం మానవులకు ఏ వస్తువుపై కూడా యాజమాన్య హక్కులు ఎంతమాత్రమూ లేవు. చివరికి మానవులకు తమ శరీరాలపై, ఆత్మలపై కూడా యాజమాన్య హక్కులు లేవు. వాటన్నిటికీ అసలు యజమాని దేవుడు మాత్రమే. అంతేకాదు, మానవులకు వాటిని తమ ఇష్టమొచ్చినట్లు ఉపయోగించుకునే అధికారం కూడా లేదు.

"ఆయనే సూర్య చంద్ర నక్షత్రాలను సృష్టించినవాడు. సకల సృష్టిరాసులూ ఆయన ఆజ్ఞే శిరసావహిస్తున్నాయి. వినండి! సృష్టి ఆయనదే, ఆజ్ఞ (అధికారం) కూడా ఆయనదే. సకలలోక ప్రభువయిన ఆ దేవుడు ఎంతో శుభదాయకుడు." (ఖుర్ఆన్-7:54)

దైవప్రవక్త (స) (తన అనుచరులతో మాట్లాడుతూ) "సొంత ఐశ్వర్యం కంటే తమ వారసుల ఐశ్వర్యాన్ని ఎక్కువగా అభిమానించేవారు మీలో ఎవరైనా ఉంటారా?" అని అడిగారు. దానికి అనుచరులు "దైవప్రవక్తా! మా అందరికి మా వారసుల ఐశ్వర్యం కంటే మా ఐశ్వర్యమే ఎక్కువ ప్రీతికరమైనది" అని అన్నారు. అప్పుడు దైవప్రవక్త (స) "(పరలోకానికి) ముందు పంపుకున్నది మాత్రమే తన సొంత ధనం అవుతుంది. అతను వదలి వెళ్ళినది అతని వారసులది అవుతుంది" అని అన్నారు. (బుఖారి)

ఎవరైనా సరే, దేవుడు ప్రసాదించిన ఉపాధి ఒనరుల్ని సరయిన పద్ధతిలో ఉపయో గించకపోతే లేదా దాన్ని వెట్టిగా వదిలేస్తే దానిపై ఉండే యాజమాన్య హక్కులు అతను కోల్పోయే ప్రమాదం ఉంటుంది. దీన్ని గురించి దైవప్రవక్త (స) ఇలా అన్నారు:

"పాడుపడిన లేదా బీడుపడిన భూమిని ఎవరు సద్వినియోగం చేస్తారో ఆ భూమి అతనిదవుతుంది. (దానిపై అతనికే యాజమాన్యహక్కులుంటాయి.)" (అహ్మద్, తిర్మిజి)

"ఎవరి యాజమాన్యంలో లేని బంజరు భూమిని ఎవరైనా సాగుచేసుకుంటే ఆ భూమిపై అతనికే యాజమాన్య హక్కులు సంక్రమిస్తాయి." (బుఖారి, నసాయి.)

"ఎవరైనా ఏదైనా బంజరు భూమికి (సాగుచేసే ఉద్దేశ్యంతో) కంచె కట్టి స్వాధీనం చేసుకుంటే అది అతనిదే అవుతుంది." (అబూదావూద్)

"భూమి దేవుని సొత్తు, దాసులు (మానవులు) కూడా దేవుని సొత్తే. కనుక ఎవరైతే బంజరు భూమిని సాగుచేస్తాడో ఆ భూమి అతనిదే అవుతుంది." (అబూదావూద్)

"ఎవరి యాజమాన్యంలోలేని, ఏ వారసుడు సంరక్షుడు లేని భూమి దేవునికి, దైవ ప్రవక్తకు చెందుతుంది. ఆ తరువాత (అనుచరులారా!) అది మీదవుతుంది. కాబట్టి ఎవరైతే బంజరు భూమిని సాగుచేస్తాడో అది అతనికే చెందుతుంది. బంజరు భూమిని

(తాను సాగుచేయకుండా, ఇతరులకు ఇవ్వకుండా) ఆపివుంచేవాడికి మూడు సంవత్స రాల తరువాత దానిపై ఎలాంటి హక్కు ఉండదు." (కితాబుల్ ఖిరాజ్)

సాలమ్ బిన్ అబ్దుల్లా కథనం: దైవప్రవక్త (స) ప్రసంగవేదికపై నిలబడి "ఎవరు బంజరుభూమిని సాగుచేస్తాడో అది అతనిదే అవుతుంది. బంజరుభూమిని సాగుచేయ కుండా ఆపివుంచేవాడికి మూడేండ్ల తర్వాత దానిపై ఎలాంటి హక్కుండదు" అని బహిరంగంగా ప్రకటించారు. కొందరు సేద్యభూముల్ని సాగుచేయకుండా బీడుపడ వేస్తారు. అందువల్ల ఆయన ఇలా ప్రకటించవలసి వచ్చింది." (కితాబుల్ ఖిరాజ్)

దొరికిన వస్తువులు తక్కువ విలువ గలవయితే వాటిని చేజిక్కించుకున్న వ్యక్తి సొంతం చేసుకోవచ్చు. ఒకవేళ ఆ వస్తువు యజమాని వచ్చి ఆనవాలు చెప్పి అడిగితే అతనికి వాపసు చేయవలసి ఉంటుంది. ఎక్కువ విలువ గలవయితే వాటిని సొంతం చేసుకోకుండా వాటి యజమాని వచ్చి అడిగే వరకు ఒక నిర్ణీతకాలం వేచిచూడవలసి ఉంటుంది.

"పట్టుకర్ర, చంద్రకోల, తాడు, అలాంటి ఇతర వస్తువులు దొరికితే వాటిని సొంతం చేసుకొని వాడుకోవడానికి దైవప్రవక్త (స) అనుమతి ఇచ్చారు." (అబూదావూద్)

ఓసారి హజ్రత్ అలి (రజి)కు ఒక దీనార్ దొరికింది. దాన్ని ఆయన ఫాతిమా (రజి)కు తెచ్చిచ్చారు. తర్వాత ఆయన దొరికిన వస్తువు గురించి ఆజ్ఞ ఏమిటని దైవప్రవక్త (స)ను అడిగారు. దైవప్రవక్త (స) "అది దేవుడు ప్రసాదించిన ఉపాధి" అన్నారు. ఆ దీనార్‌తో కొన్న పదార్థాలు దైవప్రవక్త (స) కూడా తిన్నారు; అలి, ఫాతిమా కూడా తిన్నారు. ఆతర్వాత ఒక స్త్రీ తాను పోగొట్టుకున్న దీనార్‌ని వెతుక్కుంటూ వచ్చింది. అప్పుడు దైవప్రవక్త (స) "అలీ! ఆమె దీనార్‌ని ఆమెకు ఇచ్చెయ్యి" అన్నారు. (అబూదావూద్)

దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రవచించారు: "ముస్లిం పోగొట్టుకున్న వస్తువు (ఇతరులు సొంతం చేసుకుంటే అది వారి కోసం) అగ్నిజ్వాల అవుతుంది." (దారిమి-మిష్కాత్)

హజ్రత్ అమ్ర్ బిన్ షుఐబ్ (రజి) కథనం: ఒకతను దొరికిన వస్తువు గురించి ఆజ్ఞ ఏమిటని దైవప్రవక్త (స)ను అడిగాడు. దానికి ఆయన ఇలా చెప్పారు- "రాకపోకలు జరిగే దారులలో, ప్రజల నివాస ప్రాంతాలలో వస్తువు దొరికితే దాన్ని గురించి ఒక సంవత్సరం పాటు ప్రకటన చేస్తుండాలి. ఈలోగా ఆ వస్తువు యజమాని వస్తే దాన్ని అతనికి వాపసుచెయ్యి. రాకపోతే అది నీసొంతం అవుతుంది. పోతే పాడుపడిన ప్రదేశాలలో దొరికిన వస్తువులలో, గనులలోని నిక్షేపాలలో అయిదో వంతు దేవునికి చెందుతుంది." (అంటే ప్రభుత్వ ఖజానాకు చేర్చాలి.)- (అబూదావూద్)

ఒక వ్యక్తిలోని ధనవ్యామోహం అతనికేగాక, ఇతరులక్కూడా అనేక అనర్థాలు తెచ్చి పెడ్తుంది. ఒక్కోసారి మనిషి ఎన్ని అడ్డదారులు తొక్కినా అతనికి రెండుపూటల తిండి కూడా సరిగా దొరకదు. మనిషి తనదని చెప్పుకునే ధనం నిజానికి అతనిది కాదు. దానధర్మాలు చేసే, ధర్మసంస్థాపనా కృషికి వినియోగించే ధనం మాత్రమే అతనిదవుతుంది.

దైవప్రవక్త (స) ప్రవచనం: "మనిషి నాధనం, నాడబ్బు అంటాడు. నిజానికి నీ ధనంలో నీవు తిని అంతంచేసింది, నీవు ధరించి మాసి పోయేలాచేసింది లేదా నీవు



దానం చేసి ముందుకు పంపుకున్నది మాత్రమే నీవాటాకు వస్తుంది. మిగిలినదంతా నీనుండి చేజారిపోయేదే. దాన్ని ఇతరులకోసం వదలిపోవలసి ఉంటుంది." (ముస్లిం)

హజ్రత్ అబూఅమ్ర్ ప్రకారం దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "మనిషికి ఈ (క్రింది) వస్తువుల్లో తప్ప ఇతర వస్తువుల్లో ఎలాంటి హక్కులేదు- 1-అతను నివసించే ఇల్లు. 2-తొడుక్కునే బట్టలు. 3-కూరలేని రొట్టె. 4-నీళ్లు." (తిర్మిజీ)

## కలిమిలేముల పరీక్ష

"ఆయనే మిమ్మల్ని ధరణిపై దైవప్రతినిధిగా నియమించాడు. మీకు ప్రసాదించిన దాని విషయమై మిమ్మల్ని పరీక్షించడానికి ఆయన మీలో కొందరికి కొందరికన్నా ఎక్కువ హోదా, అంతస్తులు ప్రసాదించాడు." (ఖుర్‌ఆన్-6:165)

ఇహలోకం మానవుల పాలిట పరీక్షాగృహం. ఇక్కడ మానవులు కష్టసుఖాల ద్వారానే కాకుండా కలిమిలేములు ద్వారా కూడా పరీక్షించబడతారు. ఈ పరీక్షలలో కృతార్థులైనవారే పరలోకంలోనూ కృతార్థులవుతారు. దీన్ని గురించి దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు:

"తన దారిద్ర్యం లేక ఆకలి గురించి ఎవరికీ చెప్పుకోకుండా సహనం వహించే వాడికి దేవుడు ఒక ఏడాది పాటు ధర్మసమ్మతమైన ఉపాధి ప్రసాదిస్తాడు." (బైహఖీ)

"ఐశ్వర్యం దైవభీతిపరుడికి ఉంటే పరవాలేదు. కాని అతని కోసం ఐశ్వర్యం కంటే దేహారోగ్యం, అన్ని భాగ్యాలకంటే ఆత్మసంతృప్తి ఎంతో శ్రేష్ఠమైనవి." (అహ్మద్-మిష్కాత్)

"ఇహలోకం ఎంతో మంచి వాహనం. మీరు దాని మీదెక్కి అదుపులోకి తీసుకోగలి గితే అది మిమ్మల్ని పరలోకానికి (స్వర్గసీమకు) చేర్చుతుంది." (అల్‌మదీనతువల్‌ఇస్లాం)

"తన ప్రపంచాన్ని బాగుపరచుకోవడంలోనే మునిగిపోయేవాడు తన పరలోకాన్ని నష్టపరచుకుంటాడు. అదేవిధంగా తన పరలోకాన్ని బాగుపరచుకునేవాడు తన ఇహ లోకాన్ని నష్టపరచుకుంటాడు. కనుక మీరు శాశ్వతంగా ఉండే విషయాలను అవలంబిం చండి. త్వరలో అంతమయ్యే అశాశ్వతమైన విషయాలను అవలంబించకండి." (బైహఖీ.)

హజ్రత్ సుఫ్యాన్ సౌరి (రహ్మలై) ఉల్లేఖనం: "ధర్మపరాయణత ముతక బట్టలు ధరించడంలో, ఎండిన రొట్టెలు తినడంలో లేదు. ప్రపంచంలో కోర్కెలను అదుపులో ఉంచుకోవడంలోనే (అసలైన) ధర్మపరాయణత ఉంది." (షర్‌హుస్సున్న)

హజ్రత్ జైద్ బిన్ హుసైన్ (రహ్మలై) కథనం:- ఇమామ్ మాలిక్‌ని ఎవరో ప్రపంచం లో ధర్మపరాయణత అంటే ఏమిటని అడిగారు. దానికి ఆయన "ధర్మపరాయణత అంటే ధర్మసంపాదన, కోర్కెలపై అదుపు" అని చెప్పారు. (బైహఖీ)

"మీ సంతానం, సిరిసంపదలు మీకు పరీక్షగా చేయబడ్డాయి. (ఈ పరీక్ష నుండి గట్టెక్కితే మీ కోసం) దేవుని దగ్గర గొప్ప ప్రతిఫలం ఉంది." (ఖుర్‌ఆన్-64:15)

మనిషికి సాధారణంగా సంతానం, సిరిసంపదల పట్లే ఎక్కువ ప్రేమావ్యామోహాలు ఉంటాయి. సంతానం, సిరిసంపదలే అతనికి దైవమార్గంలో అవరోధాలై నిలుస్తాయి. అందుకే విశ్వాసి వాటిపట్ల అప్రమత్తంగా ఉండాలని ఈ సూక్తి చెబుతోంది.

దైవప్రవక్త (స) ప్రవచనం: “నీవొక శత్రువుని చంపి విజయం సాధించాననో లేక అతను నిన్ను చంపడం వల్ల నీకు స్వర్గప్రాప్తి కలుగుతుందనో అనుకుంటావు. కాని నీ అసలు శత్రువు అతను కాదు. నీ అసలుశత్రువు నీ కడుపున పుట్టిన పిల్లవాడు కావచ్చు. అంతకంటే పెద్ద శత్రువు నీఅధీనంలో ఉన్న నీ సిరిసంపదలే.” (తబ్రాని)

ఒకసారి దైవప్రవక్త హజ్రత్ ఈసా (అలై) ఓ శిష్యుడ్ని వెంటబెట్టుకొని ఎక్కడికో వెళ్తున్నారు. దారిలో ఒక చోట ఆగవలసివచ్చింది. ఆయన దగ్గర మూడు రొట్టెలు న్నాయి. ఆయన తన శిష్యుడితొ “మన దగ్గర మూడు రొట్టెలున్నాయి. ఒకటి నేను తింటాను, ఒకటి నువ్వు తిను, ఒకటి రేపటి కోసం వుంచు” అని చెప్పి తను ఒక రొట్టె తిన్నారు. తిన్న తర్వాత ఆయన సెలయేటి దగ్గరకు వెళ్ళారు. నీరు త్రాగి తిరిగి వచ్చేసరికి ఒక్క రొట్టె కూడా లేదు. ఆయన మూడో రొట్టె ఏమైందని శిష్యుడ్ని అడిగారు. దానికా శిష్యుడు తాను ఒక రొట్టె తిని సెలయేటి దగ్గరకు వెళ్ళి నీరు త్రాగి తిరిగివస్తుండగా ఎవరో ఒకతను వచ్చి ఆ రొట్టె తీసుకుని పారిపోయాడని చెప్పాడు.

శిష్యుడి సంకల్పం చెడిందని హజ్రత్ ఈసా (అలై) గ్రహించారు. అతనా రొట్టెను తినడమే గాకుండా అబద్ధం కూడా చెబుతున్నాడు. అయితే ఈసా (అలై) అప్పుడు శిష్యుడిని ఏమీ అనలేదు. ఆయన మూడు ఇసుక దిబ్బలు తయారుచేసి దేవుడ్ని ప్రార్థించారు. దాంతో ఆ మూడు ఇసుక దిబ్బలు బంగారు రాసులుగా మారిపొయ్యాయి. అప్పుడాయాన శిష్యుడితో “చూడు, ఇక్కడ మూడు బంగారురాసులు ఉన్నాయి. ఇందులో ఒకటి నీది, ఒకటి నాది, ఒకటి మూడవ రొట్టె తిన్నవాడిది” అన్నారు. ఇది వినగానే శిష్యుడికి దురాశ కలిగింది. వెంటనే అతను “అయ్యా! మూడవ రొట్టె తిన్నది నేనే. కాబట్టి ఈ బంగారురాశి నాకే దక్కాలి” అన్నాడు.

హజ్రత్ ఈసా (అలై) శిష్యుడి పేరాశకు చిరునవ్వు నవ్వారు. “శిష్యా! మూడు రాసులూ నువ్వే తీసుకో. అయితే ఇప్పుడిక నీకూ నాకూ పొత్తు కుదరదు” అని చెప్పి ఆయన వెళ్ళిపొయ్యారు. శిష్యుడు అక్కడే నిలబడ్డాడు, ఈ మూడు రాసుల్నీ ఎలా తీసుకుపోవాలని ఆలోచిస్తూ. కూలివాడు దొరుకుతాడేమోనని ఎదురుచూశాడు. ఎవరూ దొరక్కపోయేసరికి ఆ రాత్రి అక్కడే జాగారం చేస్తూ ఉండిపోయాడు.

ఆ రాత్రి ఎక్కడ్నుంచో నలుగురు దొంగలు వచ్చి ఆ బంగారురాసుల్నీ, అక్కడ పడుకున్నవాడ్నీ చూశారు. వెంటనే వారు అతడ్ని చంపి బంగారాన్ని చేజిక్కించుకున్నారు. తరువాత ఆ దొంగలు “ఈ మూడు బంగారురాసుల్ని మనం నలుగురం ఉదయాన్నే తూకం వేసి పంచుకుందాం” అని చెప్పుకొని బంగారురాసుల దగ్గరే పడుకొని నిద్ర పోయారు. ఉదయం మేల్కోగానే వాళ్ళకు ఆకలి వేసింది. తమలో ఒకరు బజారుకు వెళ్ళి భోజనం తీసుకురావాలని, మిగిలిన ముగ్గురు బంగారానికి కాపలాగా వుండాలని, భోజనం చేసి బంగారాన్ని పంచుకుందామని చెప్పుకున్నారు.

దాని ప్రకారం ఒకడు భోజనం తీసుకురావడానికి బజారుకు వెళ్ళాడు. మిగతా ముగ్గురి బుద్ధులు మారిపోయాయి. “భోజనం తేవడానికి వెళ్ళినవాడ్ని తిరిగిరాగానే చంపేద్దాం. అప్పుడు మనం ముగ్గురమే వుంటాం. రాసులూ మూడే వున్నాయి కనుక



పంచుకోవడం సులభం. తలా ఒక రాసి పంచుకోవచ్చు” అని చెప్పుకున్నారు వారు. అటు భోజనం తేవడానికి బజారుకు వెళ్ళినవాడికి కూడా దుర్బుద్ధి కలిగింది. ఎలాగైనా ఆ మూడు బంగారురాసుల్నీ తానే చేజిక్కించుకోవాలని భావించాడు. ఆముగ్గుర్నీ చంపే ఉద్దేశంతో భోజనంలో విషయం కలిపి తెచ్చాడు. భోజనం తేవడానికి వెళ్ళినవాడు రాగానే ఆ ముగ్గురు దొంగమిత్రులు అతని మీద కర్రలతో దాడిచేసి చంపేశారు. తరువాత ముసిముసి నవ్వులతో భోజనం చేశారు. అందులో విషం వుందన్న సంగతి తెలియని ఆ ముగ్గురు మూర్ఖులు తినగానే గిలగిల కొట్టుకొని ప్రాణాలొదిలారు. (మిష్కాత్)

## పరలోకంలో పేదలు, ధనికుల పరిస్థితి

“అవిశ్వాసుల్ని నరకాగ్ని ముందు నిలబెట్టి వారితో (దైవదూతలు) ఇలా అంటారు: ‘మీరు ప్రపంచజీవితంలో మీవాటాకు వచ్చిన సిరిసంపదలన్నీ తనివితీరా అనుభవించి కాజేశారు. అదీగాక అక్కడ ఎలాంటి నీతి న్యాయం లేకుండా అహంకారంతో విర్రవీగే వారు. ఎన్నో అక్రమాలకు, అధర్మాలకు పాల్పడ్డారు. తత్పర్యవసానంగా ఈరోజు మీరు అత్యంతవమానకరమైన శిక్షగా యాతనలకు గురికాబోతున్నారు.” (ఖుర్ఆన్–46:20)

దైవప్రసాదిత భాగ్యాల విచారణ గురించి మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) ఇలా ప్రవచించారు: “ప్రళయదినాన అయిదు విషయాలను గురించి అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇవ్వనంతవరకు మానవుడు నిల్చున్న చోటు నుంచి ఒక్క అంగుళం కూడా కదలలేడు. ఆ అయిదు విషయాలివి: (1) నీ వయస్సును ఏ కార్యకాలాపాలలో అంత మొందించావు? (2) నీ యౌవనాన్ని ఎక్కడ వ్యర్థపరిచావు? (3) నీవు ధనాన్ని ఎలా సంపాదించావు? (4) దాన్ని ఏవిధంగా ఖర్చుపెట్టావు? (5) నీకు ప్రసాదించిన (ధర్మ) జ్ఞానాన్ని ఏమేరకు ఆచరించావు?” (తిర్మిజి)

“ప్రళయదినాన మానవుడు ఎలాంటి విలువ, బలం లేని మేకపిల్లలా తీసుకురా బడతాడు. తరువాత దేవుని ముందు ప్రవేశపెట్టబడతాడు. దేవుడు అతడ్ని ‘నేను నీకు ఎన్నో మహాభాగ్యాలు ప్రసాదించాను. వాటిని ఏం చేశావు?’ అని అడుగుతాడు. దానికి మానవుడు సమాధానమిస్తూ ‘ప్రభూ! నేను ధనాన్ని కూడబెట్టాను. ఎన్నో లాభాలతో దాన్ని అభివృద్ధి పరిచాను. ప్రారంభంలో ఉన్న ఆస్తికి ఎన్నో రెట్లు పెంచి వదిలేసి వచ్చాను. మీరు అనుమతిస్తే నేనా సంపదంతా తీసుకొచ్చి మీ ముందు పెడ్తాను’ అని అంటాడు. ‘(ఇక్కడ్నుంచి తిరిగెళ్ళే ప్రసక్తే లేదు.) నీవు ఇక్కడకు పంపుకున్న దేమిటో చూపించు’ అంటాడు దేవుడు. మానవుడు మళ్ళీ అదే సమాధానమిస్తూ తనను వెనక్కి పంపితే ఆ సంపదంతా తెచ్చి మీముందు పెడ్తానంటాడు. కాని ఆ మానవుడు ముందుగా ఎలాంటి సత్కర్మలు పంపుకోలేదు కనుక, అతడ్ని నరకానికి పంపడం జరుగుతుంది.” (తిర్మిజి)

ప్రళయదినాన దేవుడు మానవులందర్నీ సమావేశపరచిన తర్వాత “ఈ అనుచర సముదాయానికి చెందిన పేదవాళ్ళు ఎక్కడున్నారు?” అని అడుగుతాడు. ఆ తరువాత “మీరేం చేశార”ని అడుగుతాడు వారిని. దానికి వారిలా అంటారు: “మీరు అధికారం, సిరిసంపదలు మాకు కాకుండా వేరేవాళ్ళకు ఇచ్చారు. మమ్మల్ని పేదవాళ్ళుగా చేసి పరీక్షించారు. మేము (మీ ప్రసన్నతాభాగ్యం ఆశిస్తూ) సహనం వహించాము.”

దైవప్రవక్త (స) ఇలా చెప్పి "ఆతర్వాత ఆ పేదలు స్వర్గానికి పంపబడతారు. ధనికుల్ని, అధికారుల్ని మాత్రమే నిలదీసి కఠినంగా లెక్కతీసుకుంటారు"అన్నారు. (తర్గీబ్, తబ్రానీ)

దైవప్రవక్త (సల్లం) ప్రవచించిన మరికొన్ని హితోక్తులు చూడండి:

"ఆదం పుత్రుడు రెండు విషయాలను అసహ్యించుకుంటాడు. ఒకటి, మృత్యువుని. కాని విశ్వాసికి మృత్యువు కల్లోలం, సంక్షోభాలకన్నా శ్రేష్ఠమైనది. రెండు, ధనం కొరతను. కాని స్వల్పధనం వల్ల (కర్మల)లెక్క కూడా తక్కువగా ఉంటుంది." (అహ్మద్)

"ఏ మనిషిలో రెండు లక్షణాలు ఉంటాయో అతడ్ని దేవుడు కృతజ్ఞుడిగా, సహనశీలిగా పరిగణిస్తాడు. 1- ధర్మపరాయణతలో తనకంటే అధికుడ్ని చూసి అతడ్ని అనుసరించడం. 2-ప్రాపంచిక విషయాల్లో (సిరిసంపదలు, సుఖభోగాలలో) తనకంటే తక్కువ స్థాయి వాడ్ని చూసి, దేవుడు తనకు అతనికంటే ఎక్కువ భాగ్యం ప్రసాదించాడన్న భావనతో దైవాన్ని ప్రశంసించడం. ఇలాంటి మనిషిని దేవుడు కృతజ్ఞుడిగా, సహనశీలిగా పరిగణిస్తాడు. దీనికి భిన్నంగా ధర్మపరాయణతలో తనకంటే తక్కువ స్థాయివాడ్ని చూసి సంతోషించే, ప్రాపంచిక విషయాల్లో తనకంటే అధికుడ్ని చూసి, తనకు అంతటి భాగ్యాలు లభించలేదే అని విచారించే మనిషిని దేవుడు కృతజ్ఞుడిగా, సహనశీలిగా పరిగణించడు." (తిర్మిజి)

"ఎవరైతే కొంచెం ఉపాధి (ప్రాపంచిక సామగ్రి)తో దేవుని పట్ల సంతృప్తి చెందుతాడో దేవుడు అతను చేసుకున్న కొంచెం సత్కర్మల పట్ల సంతృప్తి చెందుతాడు." (బైహఖి)

"పేదవాడు ధనికుడి కంటే అయిదు వందల సంవత్సరాలకు ముందే స్వర్గంలో ప్రవేశిస్తాడు. ఇది (దేవుని దృష్టిలో) సగం దినంతో సమానం." (తిర్మిజి)

ఒకసారి దైవప్రవక్త (సల్లం) తన అనుచరులను "దరిద్రుడంటే ఎవరో మీకు తెలుసా?" అని అడిగారు. దానికి అనుచరులు "డబ్బు, ఇతర సంపదలు లేనివాడ్ని మేము దరిద్రుడని భావిస్తున్నాం" అని అన్నారు. ఆ తరువాత దైవప్రవక్త (సల్లం) ఇలా చెప్పారు:

"నా అనుచర సముదాయంలో ప్రళయదినాన ఒకడు నమాజ్, జకాత్, రోజాలు వగైరా సత్కార్యాలు తీసుకొని వస్తాడు. అయితే అతను ఎవరినైనా దూషించి ఉంటాడు. ఎవరిపైనయినా అపవాదు లేపి ఉంటాడు. ఎవరి ధనాన్నయినా అన్యాయంగా కాజేసి ఉంటాడు. ఎవరినైనా హత్యచేసి ఉంటాడు. ఎవరినైనా అన్యాయంగా కొట్టి ఉంటాడు. అంచేత అతను ఎవరెవరిని వేధించాడో, ఎవరెవరి హక్కులు కొల్లగొట్టాడో వారందరికీ అతని పుణ్యకర్మలు పంచిస్తారు. అప్పటికీ వారందరి హక్కులు పూర్తిగా నెరవేరక ముందే అతని పుణ్యకర్మలు అంతమయిపోతే, ఆ హక్కుదారులు చేసిన పాపాలు అతని ఖాతాలో వేసి అతడ్ని నరకంలో పడవేయడం జరుగుతుంది." (ముస్లిం)

# 45. దానం, ధనత్యాగం

"విశ్వాసులారా! ఎలాంటి క్రయవిక్రయాలు జరగని, స్నేహసహకారాలు ఉపయోగ పడని, ఎవరి సిఫారసు కూడా చెల్లని (పరలోక తీర్పు) దినం రాకముందే మేము మీకు ప్రసాదించిన సంపద నుండి (కొంత దైవమార్గంలో) ఖర్చుపెట్టండి." (ఖుర్ఆన్-2:254)



దైవప్రవక్త (స) హితోక్తి: "నీవు అయిదు విషయాలను మరో అయిదు విషయాలకు పూర్వమే శ్రేష్ఠమైనవని తెలుసుకో. వృద్ధాప్యానికి పూర్వం యౌవనాన్ని, వ్యాధికి పూర్వం ఆరోగ్యాన్ని, దారిద్ర్యానికి పూర్వం భాగ్యవంతాన్ని, కార్యకలాపాల వత్తిడికి పూర్వం తీరికను, మృత్యువుకు పూర్వం జీవితాన్ని శ్రేష్ఠమైనవని తెలుసుకో." (తిర్మిజి)

## ప్రదర్శనాబుద్ధితో దానధర్మాలా?

"విశ్వాసులారా! లోకులమెప్పు కోసం ప్రదర్శనా బుద్ధితో దానధర్మాలు చేసేవాడిలా, మీరు మీ దానధర్మాలను ఎత్తిపొడుపు మాటలద్వారా, (గ్రహీత) మనస్సు నొప్పించి వృథా చేసుకోకండి. అతనికి దేవునిమీద, పరలోకమ్మీద నమ్మకం లేదు. అలాంటివ్యక్తి(చేసే దానం) భారీవర్షం కురవగానే పైనున్న పల్చటి మట్టిపొర కాస్తా తుడిచి పెట్టుకుపోయి నున్నగా మిగిలిపోయే రాతి(ప్రదేశం)తో సమానం."(ఖుర్ఆన్-2:264)

"కేవలం దైవప్రసన్నత కోసం చిత్తశుద్ధితో సంపద ఖర్చు చేసేవారు మెరక ప్రాంతం లోఉండే తోట లాంటివారు. ఆతోట వర్షాలు బాగాఉంటే రెండింతలు ఫలసాయాన్నిస్తుంది. అంతగా వర్షాలులేకుండా సన్నటి జల్లులు పడినా దానికి సరిపోతుంది." (ఖురాన్-2:265)

## క్రిందిచేయి కంటే పైచేయి శ్రేష్ఠమైనది

దైవప్రవక్త (స) ఇలా తెలియజేశారు:- "ప్రతిరోజూ ఉదయం ప్రజలు నిద్ర నుండి మేల్కొనగానే ఇద్దరు దైవదూతలు అవతరిస్తారు. వారిలో ఒకతను దైవాన్ని ప్రార్థిస్తూ 'దేవా! (దానం) ఇచ్చేవాడికి మరింత (పుణ్యఫలం) ఇవ్వు' అనంటాడు. రెండో దూత 'దేవా! పిసినారి సంపదను నాశనం చెయ్యి' అని ప్రార్థిస్తాడు." (బుఖారి)

దైవప్రవక్త (స) ప్రవచనం: "దేవుని దగ్గరకు పవిత్ర వస్తువు మాత్రమే చేరుతుంది. అందువల్ల ఎవరైనా తన పవిత్ర సంపద (కష్టార్జితం) నుండి ఒక ఖర్జూరపుటంత దానం చేసినాసరే, దేవుడు దాన్ని కుడిచేత్తో స్వీకరిస్తాడు. ఆ తరువాత మీరు గుర్రపు పిల్లను పెంచి పెద్దచేసినట్లు ఆయన ఆ దానాన్ని వృద్ధి పరుస్తాడు. ఆ విధంగా వృద్ధిచెందుతూ చివరికది పర్వతం మాదిరిగా పెరిగిపోతుంది." (బుఖారి, ముస్లిం)

హజ్రత్ అస్మా (రజి) ప్రకారం దైవప్రవక్త (స) హితోక్తి: "(దైవమార్గంలో) ధనం ఖర్చు పెట్టు. లెక్కపెట్టకు. లెక్కపెట్టి ఇస్తే దేవుడు కూడా నీకు లెక్కపెట్టి మరీ ఇస్తాడు. (అంటే నీపట్ల ఉదారంగా వ్యవహరించడు.) అలాగే ధనం కూడబెట్టి ఉంచకు. కూడబెడ్తే దేవుడు కూడా (నీకు పుణ్యఫలం ప్రసాదించకుండా) ఆపి ఉంచుతాడు." (బుఖారి)

దేవుని కారుణ్యఛాయ తప్ప మరెలాంటి ఛాయ లభించని దినాన దేవుడు ఏడుగురికి తన నీడపట్టు ప్రసాదిస్తాడు. ఆ ఏడుగురిలో "కుడిచేత్తో ఇచ్చింది ఎడమచేతికి సైతం తెలియనంత గోప్యంగా దానధర్మాలు చేసిన మనిషి" కూడా ఉన్నాడు. (బుఖారి)

ఒకతను వచ్చి "దైవప్రవక్తా! ఎవరి దానధర్మాల పుణ్యఫలం అందరికంటే అధికం గా ఉంటుంది?" అనడిగాడు. దానికి దైవప్రవక్త (స) ఇలా చెప్పారు: "నీవు ఆరోగ్యంగా ఉండి, అత్యధిక ధనాశ కలిగివున్న రోజుల్లో (ఖర్చుచేస్తే) పేదవాణ్ణయి పోతానన్న భయంతోపాటు ధనికుడై పోవాలన్న కోరిక కలిగిఉన్నా చేసే దానం ఎక్కువ శ్రేష్ఠమైనది.

కనుక దానం చేయడంలో నీవు అంత్యకాలం దాపురించే దాకా వేచిఉండకు. ప్రాణం కంఠంలోకి వచ్చి కొనఊపిరితో కొట్టుమిట్టాడే స్థితి వచ్చినప్పుడు, నేను ఫలానా మనిషికి అంతిస్తాను; ఫలానా మనిషికి ఇంతిస్తాను అని చెబితే ఎలాంటి ప్రయోజనం ఉండదు. ఇప్పుడది ఫలానా, ఫలానా వారిదైపోయినట్లే (నీవిచ్చేదేమీ లేదు)." (బుఖారి, ముస్లిం)

హజ్రత్ హకీం బిన్ హిజాం (రజి) కథనం: ఒకతను దైవప్రవక్త (స)ను "ఏ దానం శ్రేష్ఠమైన"దని అడిగాడు. దానికి దైవప్రవక్త (స) "మనిషి తనతో విరోధిస్తున్న తన పేద బంధువులకు చేసే దానం శ్రేష్ఠమైనది" అని చెప్పారు. (తర్గీబ్)

హజ్రత్ ఇబ్నెఅబ్బాస్ (రజి) ప్రకారం దైవప్రవక్త (స) హితోక్తి: "దైవమార్గంలో ఖర్చు పెట్టడం వల్ల ధనం తరిగిపోదు. దాసుడు దానం చేయడానికి చేయి జాపినపుడు అది గ్రహీత చేతికి చేరుకోకముందే దేవుని చేతికి చేరిపోతుంది." (తబ్రాని)

దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "(సిరిసంపదలు పొంగిపొరలే) ఒక కాలం రానున్నది. అప్పుడు దానధర్మాలు చేయడానికి ఒక వ్యక్తి బయలుదేరితే అతనికి దానం స్వీకరించేవారే దొరకరు. అతను ఎవరికి దానం చేయాలన్నా 'నాకిప్పుడు అవసరం లేదు. నీవు నిన్న తీసుకొని వచ్చివుంటే నేనీ దానం స్వీకరించేవాడ్ని' అనంటాడు." (బుఖారి)

దైవప్రవక్త (స) హితోక్తి : "క్రిందిచేయి కంటే పైచేయి ఎంతో శ్రేష్ఠమైనది. పైచేయి అంటే (దానం) ఇచ్చే, (సత్కార్యాల కోసం) ఖర్చుపెట్టే చేయి. క్రిందిచేయి అంటే (దానం) అడిగి తీసుకునే చేయి." (బుఖారి, ముస్లిం)

హజ్రత్ అబూజర్ (రజి) కథనం:- నేను దైవప్రవక్త (స)ను "అన్నిటికంటే శ్రేష్ఠమైన ఆచరణ ఏద"ని అడిగాను. దానికి ఆయన "దేవుడ్ని విశ్వసించి ఆయన మార్గంలో పోరాడటం" అని చెప్పారు. "బానిసకు స్వేచ్ఛనివ్వడం (కూడా) శ్రేష్ఠమైన ఆచరణేనా?" అనడిగాను. "విలువను బట్టి ఎక్కువ ధరకు అమ్ముడుపోవడంతోపాటు, యజమానికి అందరికన్నా ఎక్కువ ఇష్టమైన బానిసకు స్వేచ్ఛ ప్రసాదించాలి" అన్నారు దైవప్రవక్త (స). "ఒకవేళ నేనీ పని చేయలేని పరిస్థితిలో ఉంటే?" అనడిగాను. "అప్పుడు ఏదైనా పని చేసేవాడికి ఆపనిలో సహాయపడు లేదా పనిచేయడం రానివాడికి పని చేసిపెట్టు" అని చెప్పారు ఆయన. "మరి నేనీ పని కూడా చేయలేని స్థితిలో ఉంటే మరేం చేయాలి?" అడిగాను మళ్ళీ. "అయితే ప్రజలను ఎలాంటి కష్టనష్టాలకు గురిచేయకు. ఇది కూడా నీ పాలిట ఒక విధమైన దానమే" అన్నారు దైవప్రవక్త (స). (బుఖారి, ముస్లిం)

దైవప్రవక్త (స) తన అనుచరులతో మాట్లాడుతూ "ప్రతి ముస్లిం విధిగా దానం చేయాలి" అన్నారు. అనుచరులు ఈమాట విని "మరి ఎవరి దగ్గరైనా దానం చేయడానికి ఏమీ లేకపోతే ఎలా?" అనడిగారు. దానికి దైవప్రవక్త (స) "అప్పుడా వ్యక్తి కష్టపడి సంపాదించి దాన్ని తానూ అనుభవించాలి, దానం కూడా చేయాలి" అన్నారు.

"ఒకవేళ అలా చేసే శక్తి కూడా లేకపోతే లేదా అలా కూడా చేయకపోతే?" అని మళ్ళీ అడిగారు అనుయాయులు. "అప్పుడు ఎవరైనా అగత్యపరుడు ఏదైనా ఆపదలో చిక్కుకుంటే అతడ్ని ఆదుకోవాలి" అన్నారు దైవప్రవక్త (స). అనుచరులు మళ్ళీ "అది



కూడా చేయకలేక పోతేనో?" అనడిగారు. దానికి దైవప్రవక్త (స) "(అదీ చేయలేకపోతే) మేలు లేక సత్కార్యాలు చేయాలని ఇతరులకు సలహాలివ్వాలి" అని చెప్పారు. "అదీ చేయలేకపోతే...?" మళ్ళీ అడిగారు అనుచరులు. అప్పుడు దైవప్రవక్త (స) "(కనీసం) తాను చెడ్డపనులు చేయకుండా, ఇతరులకు చెడు తలపెట్టకుండా ఉండాలి. ఇది కూడా దానం (సదఖా) కిందికే వస్తుంది" అని సమాధానమిచ్చారు. (బుఖారి, ముస్లిం)

హకీమ్ బిన్ హిజామ్ (రజి) కథనం:- నేనొక సారి దైవప్రవక్తను (కొంత ధనం) అడిగితే ఆయన ఇచ్చారు. (అది చాలక) నేను మళ్ళీ అడిగాను. దైవప్రవక్త (స) నాకు మరికొంత ఇచ్చారు. నేను తృప్తిచెందక మళ్ళీ అడిగాను. ఆయన నాకు మరికాస్త ఇచ్చి ఇలా అన్నారు: "హకీమ్! ఈ ఐహికసంపద (పైకి) ఎంతో (కనులపండుగగా) పచ్చపచ్చగా, తియ్యగా ఉండవచ్చు. కాని దాన్ని ఆత్మసంతృప్తితో తీసుకునేవారికే శుభం కలుగుతుంది. అత్యాశతో అడిగేవాడికి అందులో శుభం ఉండదు. అతను ఎంత తిన్నా కడుపు నిండని వ్యక్తి లాంటివాడు. (గుర్తుంచుకో.) ఇచ్చేచేయి పుచ్చుకునే చేయి కంటే శ్రేష్ఠమైనది." అప్పుడు హకీమ్ (రజి) ఇలా అన్నారు: "దైవప్రవక్తా! మిమ్మల్ని సత్యానిచ్చి పంపిన ఆ ప్రభువు సాక్షిగా చెబుతున్నాను. నేనీ క్షణం నుంచి ఇహలోకం వీడిపోయే వరకు ఏ వస్తువు కోసం కూడా ఎవరి ముందూ చేయిజాపను." హదీస్ ఉల్లేఖకుని కథనం: "హకీమ్ (రజి) తాను దైవప్రవక్త (స) ముందు చేసిన ఈ వాగ్దానానికి కట్టుబడి ఇహలోకం వీడిపోయేదాకా ఎవరి నుండీ దానం స్వీకరించలేదు." (బుఖారి, ముస్లిం)

## ధనత్యాగం

"(విశ్వాసులారా!) మీరు అమితంగా ప్రేమించేవాటిని సైతం (దైవమార్గంలో) వినియోగించనంత వరకూ మీరు ధర్మపరాయణులు కాలేరు." (ఖుర్ఆన్–3:92)

"మీలో దేవునికి రుణమిచ్చే వారెవరైనా ఉన్నారా? శ్రేష్ఠమైన రుణం? అలాంటి వారికి దేవుడు ఆ రుణాన్ని అనేకరెట్లు పెంచి తిరిగి ఇచ్చివేస్తాడు. పైగా వారికి అత్యంత శ్రేష్ఠమైన ప్రతిఫలం కూడా లభిస్తుంది." (ఖుర్ఆన్–57:11)

హజ్రత్ అబుద్దహ్దా అన్సారీ (రజి) ఈసూక్తి (57:11) విని "దైవప్రక్తా! దేవుడు మనల్ని అప్పు అడుగుతున్నాడా?" అని ప్రశ్నించారు. దానికి ఆయన అవునన్నారు. అప్పుడు అబుద్దహ్దా (రజి) "అయితే కాస్త మీ చేయి జాపండి" అన్నారు. దైవప్రవక్త (స) చేయి జాపారు. హజ్రత్ అబుద్దహ్దా (రజి) ఆయన చేతిని తన చేతిలోకి తీసుకొని "నేను నా ప్రభువుకు నా తోటను (అప్పుగా) ఇస్తున్నాను" అని చెప్పారు.

అబుద్దహ్దా (రజి) తోటలో ఆరొందల ఖర్జూర చెట్లున్నాయి. తోటలోనే ఇల్లు కూడా ఉంది. అక్కడే ఆయన భార్యాపిల్లలు నివసిస్తున్నారు. ఈమాట చెప్పి ఆయన తోట దగ్గరికి వెళ్ళి "ఉమ్మెదహ్దా! బయటికి వచ్చేసేయి. నేనీ తోటను నా ప్రభువుకు అప్పుగా ఇచ్చేశాను" అన్నారు. ఆయన భార్య కూడా ఎంతో సాధ్వీమణి. ఆమె ఈ మాటలు విని "మీరు చాలా లాభదాయకమైన వ్యాపారమే చేశారు" అన్నారు. అప్పటికప్పుడు ఆయన తన ఇంటి సామగ్రిని, భార్యాపిల్లలను తీసుకొని తోటలో నుంచి బయటికి వచ్చేశారు.

రోమన్లు మదీనాపై దాడిచెయ్యడానికి సన్నాహాలు చేస్తున్నారని సమాచారం అందడంతో దైవప్రవక్త (సల్లం) వారిని ఎదుర్కోవడానికి "తబూక్" దండయాత్రకు సన్నాహాలు చేయవలసి వచ్చింది. సిరియా సరిహద్దున గల తబూక్ ప్రాంతానికి ముస్లిం యోధులు సుదీర్ఘ ప్రయాణం చేయవలసి ఉండింది. పైగా అది తీవ్రమైన ఎండాకాలం. పకడ్బందీగా భారీఎత్తు సన్నాహాలు చేయడానికి అత్యధిక ఆయుధాలు, ఆహార పదార్థాలు, వాహనాలను సమీకరించవలసి వచ్చింది. అందువల్ల దైవప్రవక్త (సల్లం) ధన, కనక, వస్తు త్యాగాల కోసం ప్రజలను ప్రేరేపించారు.

దైవప్రవక్త (స) బోధతో ఉత్తేజితులైన ప్రజలు విశాలహృదయంతో భూరి విరాళాలు అందజెయ్యడం ప్రారంభించారు. కొందరు ధర్మసంస్థాపనా మార్గంలో తమ సర్వస్వం త్యాగం చెయ్యాలన్న వీరావేశంతో తమ శక్తికి మించిన విరాళాలు కూడా ఇచ్చారు.

హజ్రత్ ఉస్మాన్ (రజి) వేయి దీనార్‌ల విలువగల వస్తువుల్ని దైవప్రవక్త (సల్లం)కు అందజేశారు. ఆయన ధనికులైనప్పటికీ ఈ విరాళం ఆ కాలంలో అత్యధికమైనదే.

హజ్రత్ ఉమర్ (రజి) ధనత్యాగం విషయంలో అబూబకర్ (రజి)ని మించిపోవాలని నిర్ణయించుకొని తన యావదాస్తిలో అర్ధభాగం తీసుకొని వచ్చారు. దైవప్రవక్త (సల్లం) అది చూసి "భార్యాపిల్లల కోసం ఏమైనా మిగిల్చి పెట్టావా లేదా?" అని అడిగారు. దానికి హజ్రత్ ఉమర్ "వాళ్ళ కోసం సగం వదలిపెట్టాను" అన్నారు.

ఆ తర్వాత హజ్రత్ అబూబకర్ (రజి) ఇంట్లో ఉన్నదంతా ఊడ్చి తెచ్చి ప్రవక్త (స) పాదాల చెంత పోశారు. ఈ అసాధారణ దాతృత్వం చూసి ఆయన ఆశ్చర్యంతో "అబూబకర్! ఉన్నదంతా తెచ్చినట్లుంది. మరి ఇంట్లో భార్యాపిల్లల కోసం ఏం వదలి పెట్టావు?" అని అడిగారు. "భార్యాపిల్లల కోసం దేవుడు, దైవప్రవక్త చాలు" అన్నారు అబూబకర్ (రజి).

పాపం అబూఖలీల్ (రజి) దగ్గర విరాళం ఇవ్వడానికి ఏమీ లేదు. ఆయన కూలినాలి చేసి బ్రతికే నిరుపేద శ్రమజీవి. ఒక్కోరోజు ఆ కూలిపని కూడా దొరక్క కుటుంబం పస్తు లుండవలసి వచ్చేది. అయితే దైవప్రవక్త (స) ప్రకటన వినగానే అబూఖలీల్ (రజి) ఓ తోటయజమాని దగ్గరికెళ్ళి చెట్లకు నీళ్ళు తోడిపోస్తానని చెబితే అతను ఒప్పుకున్నాడు. ఆరోజు అబూఖలీల్ (రజి) ఇషానమాజ్ తరువాత తోటకెళ్ళి రాత్రి తెల్లవారేదాకా బావి నుంచి నీళ్ళు తోడారు. ఇంత కష్టపడితే యజమాని ఆయనకు నాలుగుసేర్లు ఖర్జూర పండ్లు ఇచ్చాడు. అబూఖలీల్ (రజి) వాటిని తీసుకొని సంతోషంగా ఇంటికి వచ్చారు.

ఆ ఖర్జూర పండ్లలో సగం భార్యాపిల్లల కోసం వదలిపెట్టి మిగతా సగం పండ్లు మూటకట్టుకొని ఆయన దైవప్రవక్త (స) సన్నిధికి వెళ్ళారు. కాని జనం పెద్దపెద్ద విరాళాలు ఇస్తుంటే తాను ఈ చిన్న విరాళం ఇవ్వాల్సి వస్తున్నదే అని భావించి సిగ్గుపడి పోతున్నారు. అందువల్ల ఆయన ఓ క్షణం అటూ ఇటూ చూసి ఆ పండ్ల మూటను విరాళాల కుప్పలో ఎక్కడో అడుగు భాగాన పెట్టేశారు సిగ్గుపడుతూనే. కాని దైవప్రవక్త (స) అది గమనించారు. వెంటనే ఆయన ఆ పండ్ల మూటను అక్కడ్నుంచి తీసి విరాళాల కుప్పలో అన్నిటికన్నా పైభాగాన పెట్టేశారు. అబూఖలీల్ (రజి) అది చూసి ఎంతో సంతోషించారు. (మిష్కాత్)



హజ్రత్ అబూతల్హా (రజి) మదీనాలోని అన్సార్ ముస్లింలలో కెల్లా గొప్ప ధనికులు. ఆయనకు (అనేక) ఖర్జూరపు తోటలుండేవి. వాటిలో 'బైర్హా' తోటంటే ఆయనకు ఎంతో ఇష్టం. ఖుర్ఆన్‌లో 3:92 సూక్తి అవతరించినపుడు ఆయన ఇలా అన్నారు:

"దైవప్రవక్తా! 'మీకు అత్యంత ప్రియమైన వస్తువుని దైవమార్గంలో ఖర్చు పెట్టనంత వరకు మీరు పుణ్యస్థాయికి చేరుకోలేర'ని దేవుడు సెలవిస్తున్నాడు కదా! 'బైర్హా' తోట నాకెంతో ఇష్టమైనది. అంచేత నేనా తోటను దైవమార్గంలో దానం చేస్తున్నాను. దైవం నుండి దాని పుణ్యఫలం ఆశిస్తున్నాను. పరలోకంలో అది నాకోసం గొప్పనిధిగా తయారవు తుందని నమ్ముతున్నాను. దైవప్రవక్తా! మీరు దైవాజ్ఞ ప్రకారం దాన్ని ఉపయోగించండి."

అప్పుడు దైవప్రవక్త (స) ఇలా అన్నారు: "చాలా మంచిది. ఇదెంతో లాభదాయకమైన సంపద. నిజంగా ఇదెంతో లాభదాయకమైన సంపద. నీ మాటలు నేను విన్నాను. అయితే నాదొక సలహా. ఆ తోటను నీ (పేద)బంధువులకు పంచివ్వు." హజ్రత్ అబూతల్హా (రజి) ఈమాట విని "నేను మీఆజ్ఞ శిరసావహిస్తున్నాను" అన్నారు. తర్వాత ఆయన ఆ తోటను తన పెదనాన్న, చిన్నాన్న కొడుకులకు, ఇతర బంధువులకు పంచివేశారు. (బుఖారి)

అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి) కథనం: ప్రవక్త అనుచరులలో ఒకతనికి ఎవరో కానుకగా ఓ మేకతల ఇచ్చారు. అప్పుడతను "దీన్ని నా మిత్రుడు ఫలానాకు ఇవ్వండి, అతను నా కంటే ఎక్కువ అగత్యపరుడు" అన్నాడు. ఆ వ్యక్తి దాన్ని అతని దగ్గరకు పంపాడు. కాని అతను కూడా "దీన్ని నా మిత్రుడు ఫలానాకు ఇవ్వండి, అతను నాకంటే ఎక్కువ అగత్య పరుడు" అన్నాడు. ఈవిధంగా ఆ మేకతల ఏడుగురి దగ్గరకు చేరుకున్న తర్వాత చివరికి మొదటి మనిషి దగ్గరకు తిరిగొచ్చింది." (సహీఫతుల్‌హఖ్)

# 46. ఆర్థిక ఒనరుల వినియోగం

"ఆయనే భూమి (దొర్లిపోకుండా దాని)మీద పర్వతాలు పాతిపెట్టాడు. అందులో అనేక శుభాలు ఉంచాడు. అంతేకాదు, ఆహారం అర్థించే సమస్త ప్రాణికోటికి అవసరమైన మేరకు లెక్క ప్రకారం దానిపై ఆహారసామగ్రి కూడా ఏర్పాటు చేశాడు". (ఖుర్ఆన్–41:9,10)

భూమండలంపై మానవులందరికీ కావలసిన సహజ ఒనరులు పుష్కలంగా ఉన్నాయి. అప్పుడప్పుడు వచ్చే ప్రకృతివైపరీత్యాల వల్ల కొంతనష్టం జరుగుతున్నా సహజ ఒనరులలో ఏ మాత్రం కొరతరాదు. దేవుడు సృష్టికర్త మాత్రమే కాదు; ఆయన శాసనకర్త, పోషకుడు కూడా. ప్రాణికోటిని పోషించే బాధ్యత ఆయనే తీసుకున్నాడు. ఉపాధి సముపార్జనకు మానవులు కృషి మాత్రమే చేయగలరు. ఉపాధిప్రదాత దేవుడే. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఆయన ఆహారోత్పత్తి పెంచుతున్నాడు. అధికోత్పత్తి కోసం నేడు వ్యవసాయరంగంలో అద్భుత మైన విధానాలు, సాంకేతిక పద్ధతుల్ని మానవులకు ప్రసాదించినవాడు కూడా ఆ ప్రభువే.

## ధర్మసంపాదనే ధర్మపరాయణత

"విశ్వాసులారా! మీరు ఒకరి సొమ్మును మరొకరు అన్యాయంగా కబళించకండి. పరస్పరామోదంతో వ్యాపార లావాదేవీలు, ఇచ్చిపుచ్చుకోవడాలు జరుపుకోవచ్చు. (అన్యాయం, అక్రమం, హత్య, ఆత్మహత్యల ద్వారా) మిమ్మల్ని మీరు హతమార్చుకోకండి.

దేవుడు మీ విషయంలో ఎంతో దయామయుడని తెలుసుకోండి. అన్యాయం, అక్రమాలతో ఇలా చేసేవాడ్ని మేము త్వరలోనే నరకాగ్నిలో విసరేస్తాం." (ఖుర్ఆన్-4:29,30)

దైవప్రవక్త (స) హితోక్తి: "ఒకతను దూరప్రయాణం చేసి దుమ్ముకొట్టుకొని వస్తాడు. అతను ఆకాశం వైపు చేతులెత్తి ప్రభూ! ప్రభూ! అంటూ ప్రార్థిస్తాడు. కాని అతను తిన్నది అధర్మమైన తిండి, కట్టుకున్నవి అధర్మవస్త్రాలు, అతని శరీరం అక్రమసంపాదనతో పోషించబడింది. అలాంటప్పుడు అతని ప్రార్థన ఎలా స్వీకరించబడుతుంది?" (ముస్లిం)

దైవప్రవక్త (స) ప్రవచనం: "అధర్మ సంపాదనతో పోషించబడిన శరీరం నరకాగ్నిలో పడేయడానికి ఎక్కువ అర్హత కలిగివుంటుంది." (ఐజా)

దైవప్రవక్త (స) హితోక్తి: "ధర్మసంపాదన కోసం పాటుపడటమంటే దైవమార్గంలో వీరాధివీరులతో పోరాడటమే. ఎవరైనా ధర్మసంపాదన కోసం శ్రమించి అలసిపోయి రాత్రి నిద్రపోతే అలాంటి మనిషి పట్ల దేవుడు ప్రసన్నుడవుతాడు." (ఐజా)

## దుబారా ఖర్చులు

"దుబారాఖర్చు చేయకండి. దుబారాఖర్చు చేసేవారు షైతాన్ సోదరులుగా పరిగణించబడతారు. షైతాన్ తన ప్రభువుకు కృతఘ్నుడైపోయాడు." (ఖుర్ఆన్-17:26,27)

"వారు తమ సంపద వినియోగిస్తున్నప్పుడు దుబారా ఖర్చుచేయరు; ఇటు పిసినారితనం కూడా వహించరు. వారి ఖర్చు ఆ రెండిటికి మధ్యస్తంగా ఉంటుంది." (ఖు-25:67)

దైవప్రవక్త (సల్లం) ప్రవచనం: "తినండి, తాగండి, దానం చేయండి, ధరించండి. అయితే దుబారా ఖర్చులు చేయకండి; అహంకారానికి లోనుకాకండి." (నసాయి)

ఇబ్నెఅబ్బాస్(రజి) అన్నారు: "మీలో రెండు విషయాలు లేనంతవరకు మీరు కోరుకున్నది తినండి తాగండి ధరించండి. 1-దుబారా ఖర్చులు, 2-అహంకారం." (బుఖారి)

"మా ధనాన్ని మా ఇష్టమొచ్చినట్లు ఖర్చు పెట్టుకునే అధికారం కూడా లేదా మాకు? ఇదేనా నీప్రార్థన నీకు నేర్పుతున్నది?" (ఖుర్ఆన్-11:87)

పేరుప్రతిష్ఠల కోసం పెద్దపెద్ద భవనాలు నిర్మించడాన్ని కూడా ఇస్లాం హర్షించదు.

"మీరు ఎత్తయిన ప్రతి చోటా పనికిమాలిన స్మారక భవనం నిర్మిస్తున్నారేమిటీ? ఇక్కడే శాశ్వతంగా ఉండాలన్నట్లు పెద్దపెద్ద మేడలు కడ్తున్నారు." (ఖుర్ఆన్-26:128-130)

"ఈ తోటలు, కాలువలు, పచ్చటిపొలాలు, పండ్లతో నిండిన ఈ ఎడారి వనాల మధ్య మిమ్మల్ని హాయిగా ఎల్లకాలం ఉండనివ్వడం జరుగుతుందని భావిస్తున్నారా? అదీగాక మీరు కొండల్ని తొలచి బడాయికోసం పెద్దపెద్ద కట్టడాలు నిర్మిస్తున్నారే! కాస్త దేవునికి భయపడండి. నాకు విధేయత చూపండి." (ఖుర్ఆన్-26:146-150)

హజ్రత్ అనస్ (రజి) ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఇలా చెప్పారు: "భవననిర్మాణం కోసం చేసేఖర్చు తప్ప ఇతర ఖర్చులన్నీ దైవమార్గంలో చేసిన ఖర్చులుగా పరిగణించబడతాయి. భవననిర్మాణం కోసం చేసేఖర్చులో ఎలాంటి పుణ్యం లేదు." (తిర్మిజి)



## పొదుపు ద్వారా సత్కార్యాలు

ఇస్లాంలో పొదుపు చేయడమంటే ఒక్కొక్క పైసా కూడబెట్టూ ఆస్తులు పెంచుకోవడం కాదు. విలాసాలకు పోకుండా అనవసరపు ఖర్చులు వీలైనంత తగ్గించుకొని, తద్వారా పేదల సంక్షేమం, ఇతర సత్కార్యాల కోసం పాటుపడాలన్నదే పొదుపు లక్ష్యం. అలాగే ఇస్లాం అవసరానికి మించిన (Surplus) వస్తువులు ఉంచుకోవడాన్ని కూడా అంగీకరించదు.

హజ్రత్ బరా బిన్ ఆజిమ్ (రజి) కథనం: దైవప్రవక్త (సల్లం) మాకు ఏడు రకాల పనులు చేయాలని ఆదేశించారు. అలాగే ఏడు రకాల పనులు చేయకూడదని మమ్మల్ని వారించారు. చేయమని ఆదేశించిన ఏడు పనులు ఇవి............

చేయవద్దని వారించిన ఏడు పనులు- 1-బంగారపు ఉంగరం పెట్టుకోవడం, 2-వెండి పాత్రలలో నీరు తాగడం, 3-పట్టు జీనును వాడటం, 4-ఖిస్ (ప్రాంతం)లో తయారైన బట్టలు వాడటం, 5-పట్టువస్త్రాలు ధరించడం, 6-ముతక పట్టువస్త్రాలు ధరించడం, 7-పల్చటి పట్టువస్త్రాలు ధరించడం. (బుఖారి)

దైవప్రవక్త (సల్లం) స్త్రీలకు మాత్రమే వెండి బంగారాలను ఆభరణాలుగా మాత్రమే వాడటానికి అనుమతిచ్చారు. అయితే స్త్రీలు తమ భర్తల కోసం మాత్రమే బంగారు నగలు ధరించాలి. లోకుల మెప్పు కోసం ధరించకూడదు. దైవప్రవక్త (స) ఈ విషయాన్ని చెబుతూ "ఏ స్త్రీ అయినా జనానికి చూపే ఉద్దేశ్యంతో బంగారు నగలు ధరిస్తే ఆమె (నరక) యాతనలకు గురవుతుంది" అని అన్నారు. (మిష్కాత్)

పురుషులు బంగారు గొలుసులు, ఉంగరాలు, చెవిపోగులు మొదలైన నగలు వాడటాన్ని ఆయన నిషేధించారు. అసలు పురుషులు బంగారం వాడనే వాడకూడదు. అలాగే స్త్రీలైనా, పురుషులైనా పాత్రలు, గ్లాసులు, ఇతరత్రా సామగ్రి కోసం వెండి బంగారాలు వాడరాదు.

దైవప్రవక్త (స) ఇలా అన్నారు: "వెండి బంగారాలతో చేసిన పాత్రలలో గాని, లేదా వెండి బంగారాలు కలిపి ఇతర లోహాలతో చేసిన పాత్రలలోగాని ఎవరైనా తింటే, తాగితే అలాంటివాడు తన పొట్టను నరకాగ్నితో నింపుకున్నాడన్న మాట. (దార్‌ఖత్ని)

దైవప్రవక్త (స) హితోక్తి : "ఎవరైనా వెండిచెంబుతో మంచినీళ్ళు తాగితే అతనసలు ఒక్కో గుక్కతో పాటు తన పొట్టలో అగ్ని పోసుకున్నట్లే." (బుఖారి, ముస్లిం)

హజ్రత్ అలి (రజి) కథనం: దైవప్రవక్త (సల్లం)కు ఓసారి స్వచ్ఛమైన పట్టువస్త్రాల జత ఒకటి కానుకగా లభించింది. దాన్ని మా ఇంటికి పంపిస్తే నేను ధరించాను. కాని అది చూడగానే దైవప్రవక్త (సల్లం) ముఖారవిందం ఆగ్రహోదగ్రమయింది. దాంతో నేనా పట్టువస్త్రాలను చించి మా కుటుంబంలోని స్త్రీలకు ఇచ్చివేశాను. (బుఖారి)

హజ్రత్ ఉమర్ (రజి) కథనం: ఓరోజు నేను మస్జిద్ ద్వారం దగ్గర స్వచ్ఛమైన పట్టువస్త్రాల జతను చూసి "దైవప్రవక్తా! ఈ జతబట్టల్ని మీరు కొని శుక్రవారం బయటి నుండి మిమ్మల్ని కలుసుకోవడానికి ప్రతినిధివర్గాలు వచ్చినప్పుడు వాటిని ధరిస్తే ఎంత బాగుంటుంది!" అని అన్నారు. దానికి దైవప్రవక్త (స) "పరలోకం (స్వర్గం)లో ఎలాంటి (ప్రతిఫలం) వాటాకు నోచుకోనివాడే దీన్ని ధరిస్తాడు" అని అన్నారు. (బుఖారి)

హజ్రత్ ఉఖ్బా బిన్ ఆమిర్ (రజి) కథనం: దైవప్రవక్త (స)కు కానుకగా ఒక సిల్కు కోటు వచ్చింది. ఆయన దాన్ని ధరించి నమాజు చేశారు. అయితే (ఇంటికి) తిరిగొచ్చి తీసేశారు తనకది ఇష్టంలేనట్లుగా. తరువాత (పట్టువస్త్రాలను గురించి మాట్లాడుతూ) "దైవభీతిపరులకు ఇలాంటి బట్టలు శోభించవు" అన్నారు. (బుఖారి, ముస్లిం)

హజ్రత్ అబూహురైరా (రజి) కథనం: దైవప్రవక్త (సల్లం) మమ్మల్ని బంగారపు ఉంగరం ధరించడాన్ని వారించారు. (బుఖారి, ముస్లిం)

హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి) కథనం: దైవప్రవక్త (సల్లం) బంగారపు ఉంగరం చేయించుకొని దాని రాయి చేతిలోపలికి ఉండేలా ధరించసాగారు. అది చూసి ఆయన అనుచరులు కూడా అదేవిధంగా ధరించడం మొదలెట్టారు. ఆ తరువాత ఓరోజు దైవప్రవక్త (స) మసీదు వేదిక ఎక్కి ఉంగరాన్ని తీసేసి ఇలా అన్నారు. "నేనీ ఉంగరం ధరించేవాడ్ని. దీని రాయి చేతికి క్రింది వైపు ఉండేలా పెట్టుకునేవాడ్ని" అని అన్నారు. తరువాత ఆయన ఆ ఉంగరాన్ని పారేసి "దైవసాక్షి! నేనిక నుంచి ఈ ఉంగరం ఎన్నటికీ పెట్టుకోను" అని అన్నారు. ఈమాట వినగానే అనుచరులు కూడా తమతమ ఉంగరాలను తీసి పారేశారు. (బుఖారి, ముస్లిం)

హజ్రత్ జాబిర్ (రజి) ప్రకారం దైవప్రవక్త (స) హితోక్తి : "(భార్యాభర్తలు మాత్రమే ఉన్న ఇంట్లో) ఒక పడక పురుషుని కోసం, రెండవ పడక అతని భార్య కోసం, మూడవ పడక అతిథి కోసం, నాల్గవ పడక షైతాన్ కోసం ఉంటాయి." (ముస్లిం-మిష్కాత్)

జీవితం గడపడానికి కావలసిన తిండి, బట్ట, నివాసం లాంటి కనీసవసరాలే మనిషి ముఖ్యావసరాలని, అంతకు మించినవాటిని కోరుకోవడం తగదని చెబుతోంది ఇస్లాం. అంతకుమించిన వాటిని కోరుకోవడమంటే విలాసజీవితం గడపడానికి ఉబలాట పడటమే. విలాసజీవితానికి హద్దంటూ ఉండదు. అది క్రమంగా అక్రమ జీవనోపాధికి దారితీస్తుంది.

దైవప్రవక్త (స) ప్రవచనం: "ఆదం కుమారుడికి ఈ (మూడు) విషయాల్లో తప్ప మరెందులోనూ హక్కులేదు- (1) తల దాచుకోవడానికి ఒక ఇల్లు, (2) వళ్ళు దాచుకోవడానికి బట్ట, (3) (కడుపు నింపుకోవడానికి) అన్నపానీయాలు." (తిర్మిజి-మిష్కాత్)

# 47. అక్రమసంపాదనా మార్గాలు

ధనార్జనే జీవిత లక్ష్యంగా పెట్టుకున్నవారు నేడు డబ్బు సంపాదించడానికి ఎన్నో కొత్త మార్గాలు కనిపెట్టారు. అనేక వ్యాపారసంస్థలు రకరకాల ప్రకటనల ద్వారా 'స్పెక్యులేషన్' వ్యాపారం చేస్తూ ప్రజలను పరోక్షంగా నిలువుదోపిడి చేస్తున్నాయి. ఇలాంటి వ్యాపారాలలో అబద్ధం, అన్యాయం, దగ, మోసాలే ఎక్కువగా పనిచేస్తాయి. పాపభీతి, పరలోకపు జవాబుదారీ భావనలేని పేరాశపరులు వాటి ప్రకటనలకు మోసపోయి చేతులు కాల్చుకుంటున్నారు.

## అన్యాయం, దౌర్జన్యం

ఖుర్ఆన్ అవతరణ ప్రారంభం నుంచీ ఇస్లాం దేవుని హక్కులతో పాటు దాసుల హక్కులకు ఎంతో ప్రాముఖ్యమిచ్చింది. దాసుల హక్కులలో తల్లిదండ్రుల హక్కులు ప్రథమ స్థానం వహిస్తాయి. ఆతర్వాత అనాథల, నిరాధారుల(వికలాంగుల) హక్కులకే ప్రాధాన్యం ఉంది.



"అనాథలకు రావలసిన ఆస్తులు వారికి ఇచ్చివేయండి. వారికి దక్కవలసిన మంచి సొమ్ముకు బదులు నాసిరకం సొమ్ము అప్పగించకండి. వారి ధనాన్ని మీ ధనంతో కలిపేసి (లెక్కాపత్రం లేకుండా) తినకండి. అలా చేయడం ఘోరమైన పాపం." (ఖుర్ఆన్-4:2)

"వారు పెద్దవారయిన తరువాత తమ (ఆస్తి)హక్కు అడుగుతారన్న భయంతో ముందుగానే వారి సొమ్మును త్వరత్వరగా తిని హరించి వేయకండి. (అనాథ) సంరక్షకుడు స్థితిపరుడయితే అలాంటి సొమ్ము జోలికే పోకూడదు. ఒకవేళ అతను పేదవాడయితే సముచిత రీతిలో కొంత సొమ్ము వాడుకోవచ్చు." (ఖుర్ఆన్-4:6)

దైవప్రవక్త (స) ప్రవచనం: "చేతివ్రేళ్ళు రెండు ఒకదానికొకటి అతి దగ్గరగా ఉన్నట్లు అనాథను పోషించే వ్యక్తి, నేను స్వర్గంలో ఎంతో దగ్గరగా ఉంటాము." (బుఖారి)

దైవప్రవక్త (స) ప్రవచనం: "ఏముస్లిం ఇంట్లో అనాథపట్ల మంచిగా మసలుకోవడం జరుగుతుందో ఆ ఇల్లు ముస్లింల ఇండ్లన్నిటి కంటే ఎంతో శ్రేష్ఠమైనది. అలాగే ఏ ముస్లిం ఇంట్లో అనాథపట్ల చెడుగా వ్యవహరించడం జరుగుతుందో ఆ ఇల్లు ముస్లింల ఇండ్లన్నిటి కంటే అతిచెడ్డ ఇల్లు." (ఇబ్నెమాజ)

ఉహుద్ యుద్ధం తరువాత హజ్రత్ సాద్ బిన్ రుబై (రజి) భార్య తన కుమార్తెలిద్దర్ని వెంటబెట్టుకొని దైవప్రవక్త (సల్లం) సన్నిధికి వచ్చారు. ఆమె తనకు జరిగిన అన్యాయాన్ని ఏకరువు పెడ్తూ ఇలా అన్నారు: "దైవప్రవక్తా! వీళ్ళిద్దరూ సాద్ కుమార్తెలు. సాద్ మీతోపాటు ఉహుద్ యుద్ధంలో పాల్గొని అమరగతులయ్యారు. ఆ తరువాత ఈ బాలికల పినతండ్రి మా ఆస్తినంతటినీ స్వాధీనం చేసుకున్నాడు. వీరి కోసం ఒక్క పైసా వదలిపెట్ట లేదు. ఇలాంటి స్థితిలో ఈ బాలికల్ని ఎవరు పెళ్ళి చేసుకుంటారు?" దీన్ని గురించే ఈ క్రింది ఖుర్ఆన్ సూక్తులు అవతరించాయి:

"ప్రజలు చనిపోతూ తమ పసిపిల్లలను నిస్సహాయ స్థితిలో వదలి వెళ్ళవలసివస్తే, ఆ తర్వాత వారి పరిస్థితి ఏమిటని ఆలోచించి భయపడాలి. కనుక వారు (ఇతరుల అనాథ బాలల విషయంలోనూ) దేవునికి భయపడుతూ సవ్యమైన మాటనే పలకాలి. అన్యాయంగా అనాథబాలల ఆస్తుల్ని తింటున్నవారు నిజానికి తమ పొట్టలను అగ్నితో నింపుకుంటున్నారు. వారు తప్పకుండా భగభగ మండే అగ్నిగుండంలో విసరి వేయబడతారు." (4:9,10)

అన్యాయపరులైన భూకబ్జాదారులను గురించి దైవప్రవక్త (స) ప్రస్తావిస్తూ ఇలా హెచ్చరించారు: "ఇతరుల భూమిని ఏ కొంచెమైనా సరే అన్యాయంగా ఆక్రమించుకున్నవాడ్ని పాతాళలోకంలోకి దిగబడేవరకు భూమిలోకి అణచివేయడం జరుగుతుంది." వేరొక ఉల్లేఖనంలో "ఎవరైనా అన్యాయంగా జానెడు భూమిని ఆక్రమించుకున్నా ప్రళయదినాన అతని మెడలో ఏడు భూముల కంఠ పాశాన్ని వేయడం జరుగుతుంద"ని అన్నారు ఆయన. (బుఖారి, ముస్లిం)

ఉర్వా బిన్త్ అవేస్ (అనే స్త్రీ) ఒక స్థలం విషయంలో తన యాజమాన్య హక్కును చాటుకుంటూ హజ్రత్ సయీద్ బిన్ జైద్ (రజి)కు వ్యతిరేకంగా మర్వాన్ బిన్ హకమ్ న్యాయస్థానంలో ఒక వ్యాజ్యం వేసింది. అప్పుడు సయీద్ బిన్ జైద్ (రజి) మాట్లాడుతూ

“ఎవరైనా ఇతరులకు చెందిన ఒక జానెడు స్థలాన్ని ఆక్రమించుకున్నా ప్రళయదినాన భూమికి ఏడు రెట్ల పరిమాణంగల హారం చేసి అతని మెడలో (గుదిబండగా) వేయడం జరుగుతుంద”ని దైవప్రవక్త (స) తెలిపారు. నేనందుకు సాక్ష్యమిస్తున్నాను. అలాంటప్పుడు నేనామె హక్కును ఎలా కాజేయగలను?” అని అన్నారు. (బుఖారి)

(ముస్లిం గ్రంథం ప్రకారం) హజ్రత్ సయీద్ (రజి) ప్రవక్తప్రవచనం విన్పించిన తర్వాత న్యాయమూర్తి మర్వాన్ మాట్లాడుతూ “నేను మీ నుండి మరెలాంటి సాక్ష్యం అడగబోను” అని అన్నాడు. అదీగాక హజ్రత్ సయీద్ (రజి) ఆ స్థలాన్ని ఆ స్త్రీ ఉర్వాకు వదిలేశారు. అయితే ఆయన ఆ స్త్రీని శపిస్తూ “దేవా! ఈస్త్రీ మాటలు అబద్ధమయితే ఈమె కళ్ళు పోగొట్టు. ఈ స్థలమే ఈమెకు సమాధి అవుగాక!” అని ప్రార్థించారు.

హదీసు ఉల్లేఖకుని కథనం: “ఆ తర్వాత ఆమె నిజంగానే గుడ్డిదయి పోయింది. గోడలు వెతుక్కుంటూ నడుస్తూ ‘నాకు సయీద్ బిన్ జైద్ (రజి) గారి శాపం తగిలింది’ అని చెబుతుండేది. చివరికి ఓరోజు ఆమె అదే స్థలంలో కట్టుకున్న తన ఇంట్లో నడుస్తూ నూతిలో పడి చనిపోయింది. ఈవిధంగా ఆ ఇల్లే ఆమెకు సమాధి అయిపోయింది.”

ఒకసారి దైవప్రవక్త (స) తన అనుచరులతో మాట్లాడుతూ “దరిద్రుడంటే ఎవరో మీకు తెలుసా?” అనడిగారు. దానికి అనుచరులు “డబ్బు, ఇతర సంపదలు లేనివాడ్ని మేము దరిద్రుడని భావిస్తున్నాం” అన్నారు. ఆ తరువాత దైవప్రవక్త (స) ఇలా చెప్పారు:

“నా అనుచర సముదాయంలో ప్రళయదినాన ఒకడు నమాజ్, జకాత్, రోజాలు వగైరా సత్కార్యాలు తీసుకొని వస్తాడు. అయితే అతను ఎవరినైనా దూషించి ఉంటాడు. ఎవరిపైనయినా అపవాదు లేపి ఉంటాడు. ఎవరి ధనాన్నయినా అన్యాయంగా కాజేసి ఉంటాడు. ఎవరినైనా హత్యచేసి ఉంటాడు. ఎవరినైనా అన్యాయంగా కొట్టి ఉంటాడు. అంచేత అతను ఎవరెవరిని వేధించాడో, ఎవరెవరి హక్కులు కొల్లగొట్టాడో వారందరికీ అతని పుణ్యకర్మలు పంచిస్తారు. అప్పటికీ వారందరి హక్కులు పూర్తిగా నెరవేరక ముందే అతని పుణ్యకర్మలు అంతమయిపోతే, ఆ హక్కుదారులు చేసిన పాపాలు అతని ఖాతాలో వేసి అతడ్ని నరకంలో పడవేయడం జరుగుతుంది.” (ముస్లిం)

## దోపిడి, దొంగతనాలు

“స్త్రీ అయినా, పురుషుడైనా దొంగతనం చేస్తే ఇద్దరికీ చెయ్యి నరికివేయండి. ఇది వారు సంపాదించుకున్న దానికి ప్రతిఫలం. దేవుని తరపున కనువిప్పు కలిగించే శిక్ష ఇది. దేవుడు సర్వాధికారి, సర్వశక్తిమంతుడు. ఆయన ఎంతో వివేకవంతుడు కూడా. అయితే తప్పు చేసిన తరువాతయినా పశ్చాత్తాపం చెంది తమ నడవడిక సరిదిద్దుకుంటే, దేవుడు గొప్ప క్షమాశీలి, అపార కృపాశీలుడని తెలుసుకోండి.” (ఖుర్ఆన్–5:38)

దేశంలో సర్వత్రా “ఆర్థికన్యాయం” నెలకొన్న తర్వాతనే హస్తఖండన శిక్షలు అమలుజరపాలి. అయితే (యుద్ధంలో వాడే) ఒక డాలు విలువకు లోపు వస్తువుని దొంగిలిస్తే చేతిని నరకకూడదని దైవప్రవక్త(స) అన్నారు. అలాగే పండ్లు, కూర గాయలు, ఆహారవస్తువుల్ని (పరిమిత స్థాయిలో) దొంగిలించినా హస్తఖండన శిక్ష ఉండదు.



దైవప్రవక్త (స) ఇలా అన్నారు: “సొంత ఆస్తిని కాపాడుకునే ప్రయత్నంలో (దోపిడీ దొంగలచేత) చంపబడిన మనిషి అమరగతి (వీరమరణం) పొందుతాడు.” (బుఖారి)

హజ్రత్ జాబిర్ (రజి) ఉల్లేఖించిన ఒక హదీసులో దైవప్రవక్త (సల్లం) ఈవిధంగా తెలియజేశారు: “దేవుడు వాగ్దానం చేసిన ప్రతి వస్తువూ మీకు లభిస్తుంది. కాని నా దగ్గరకు నరకం తేబడింది. నేను దాని వేడి భరించలేక వెనక్కి తగ్గుతున్నప్పుడు మీరు నన్ను చూశారు కదా! నేనా నరకంలో వంకరతల కర్ర (గొడుగుకర్ర) మనిషిని చూశాను. అతను నరకంలో తన పొట్టలోని పేగులు లాక్కుంటున్నాడు. అతను (ఇహలోకంలో ఉన్నప్పుడు తన కర్రతో హజ్‌యాత్రికుల వస్తువుల్ని దొంగిలిస్తుండేవాడు. ఒకవేళ పట్టుబడితే ‘నా వంకరతల కర్ర ఆ వస్తువులో ఇరుక్కుపోయింది’ అని చెప్పేవాడు. పట్టుబడకపోతే ఆ వస్తువును తీసుకునేవాడు.” (ముస్లిం-మిష్కాత్)

## అశ్లీలం, వ్యభిచారం

“మానవుల్లో మనసును మభ్యపెట్టే వ్యర్థవస్తువుని కొనితెచ్చేవాడు కూడా ఒకతను ఉన్నాడు. అతను (సరయిన) జ్ఞానం లేకుండా ప్రజల్ని దైవమార్గం నుండి తప్పించి, ఆ ప్రచారాన్ని పరిహసించడానికే ఇలాంటి చేష్టలకు పాల్పడ్డాడు. ఇటువంటి వారికి అవమాన కరమైన శిక్ష కాచుకొని ఉంది.” (ఖుర్ఆన్–31:6)

పైసూక్తిలో “మనస్సును మభ్యపెట్టే వ్యర్థవస్తువు” అనే పదం వచ్చినచోట మూల భాషలో “లహ్వల్‌హదీస్” అనే పదం ఉంది. అబ్దుల్లా బిన్ మస్‌వూద్ (రజి)ని లహ్వల్ హదీస్ అంటే ఏమిటని అడిగితే, ఆయన దేవుని మీద ప్రమాణంచేసి “లహ్వల్‌హదీస్ అంటే పాటలు (సంగీతం)” అని మూడుసార్లు నొక్కి చెప్పారు. (ఇబ్నెజరీర్, బైహఖి)

“పాటలుపాడే స్త్రీలను అమ్మడం, కొనడం, వారి వ్యాపారం చేయడం ధర్మసమ్మ తంకాద”న్నారు దైవప్రవక్త (సల్లం)- (తిర్మిజి). ఆయన మరోసందర్భంలో “పాటలు పాడే బానిసస్త్రీ సభలో కూర్చొని, ఆమెపాటలు వినేవాడి చెవిలో ప్రళయదినాన కరిగించిన సీసం పోయబడుతుంద”ని అన్నారు. (అహ్‌కాముల్ ఖుర్ఆన్- ఖాజీ అబూబకర్)

ఈనాడు ఆర్ట్, కల్చరల్‌ప్రోగ్రాం పేర్లతో అశ్లీలం, అర్ధనగ్నవిన్యాసాల్ని ప్రదర్శిస్తూ జీవిత ప్రధాన సమస్యల నుండి జనం దృష్టిని మరలింపజేసే పనులన్నీ ‘లహ్వల్‌హదీస్’ క్రిందికేవస్తాయి.

## మద్యం, మత్తుపదార్థాలు

“విశ్వాసులారా! మద్యం, జూదం, దైవేతరాలయాలు, పాచికల జోస్యం- ఇవన్నీ అసహ్యకరమైన పైశాచిక విషయాలు. వాటికి దూరంగా ఉండండి, మీ జీవితం సార్థక మవుతుంది. మద్యం, జూదాల ద్వారా షైతాన్ మీ మధ్య విరోధం, విద్వేష బీజాలు నాటి మిమ్మల్ని దైవధ్యానం, ప్రార్థనల నుండి నిరోధించగోరుతున్నాడు. కనుక ఇకనైనా మీరు వాటిని మానుకోండి.” (ఖుర్ఆన్–5:90,91)

ఈ ఆదేశం వెలువడిన తర్వాత మద్యం నిషేధించబడిందని, ఇక నుండి ఎవరూ మద్యం ముట్టడంగాని, అమ్మడంగాని చేయకూడదని దైవప్రవక్త (సల్లం) ఒక బహిరంగ ప్రకటన చేయించారు. ఈ ప్రకటన వినగానే ముస్లింలంతా తమ తమ ఇండ్లలో ఉన్న

మద్యాన్నంతటినీ వీధుల్లోకి తెచ్చి పారబోశారు. ఆరోజు మదీనా వీధుల్లో మద్యం ఏరులై ప్రవహించింది. సారాఅంగళ్ళు శాశ్వతంగా కనుమరుగై పోయాయి.

కొందరు మద్యం గురించి దైవప్రవక్త (స) ముందు ప్రస్తావిస్తూ "దీన్ని యూదులకు కానుకగా ఇవ్వచ్చా?" అనడిగారు. దానికి దైవప్రవక్త (స) "మద్యాన్ని నిషేధించిన వాడు (దేవుడు) దాన్ని ఇతరులకు కానుకగా ఇవ్వడాన్ని కూడా నిషేధించాడు" అన్నారు. మరొకతను దీన్ని మందుగా వాడుకోవడానికి అనుమతివ్వమని అడిగాడు. దైవప్రవక్త (స) అనుమతి నిరాకరిస్తూ "అది మందు కాదు, వ్యాధి" అన్నారు.

వేరొకతను వచ్చి "దైవప్రవక్తా! మేము తీవ్రమయిన చలి ఉండే ప్రాంతంలో ఉంటున్నాం. కాయకష్టం కూడా ఎక్కువగా చేయవలసి వస్తుంది. మద్యం వల్ల మాకు కాస్త సేద తీరుతుంది. చలికి తట్టుకునే శక్తి కూడా వస్తుంది" అన్నాడు. దైవప్రవక్త (సల్లం) ఈమాట విని "మీరు తాగే ఆ పానీయం వల్ల మత్తు కలుగుతుందా?"అని అడిగారు. దానికా వ్యక్తి "కలుగుతుంది" అన్నాడు. "అయితే దాన్ని మానుకోవాల్సిందే" అన్నారు దైవప్రవక్త (సల్లం). "కాని మా ప్రాంతం జనం ఒప్పుకోరే ఎలా?"అన్నాడా వ్యక్తి. "ఒప్పుకోకపోతే వారితో యుద్ధం చేయండి" అన్నారు దైవప్రవక్త (సల్లం).

దైవప్రవక్త (స) అబూమూసా అష్అరి (రజి), ముఆజ్ బిన్ జబల్ (రజి)లను యమన్ దేశానికి (పాలకులుగా) పంపేటప్పుడు వారికిలా ఉపదేశించారు: "(ప్రజలకు) సౌలభ్యాలు కలగజేయండి. కాఠిన్యాలలోకి నెట్టకండి. శుభవార్తలు విన్పించండి, ద్వేషం కలిగించకండి. పరస్పర సహకారంతో మెలగండి, సంతోషంగా ఉండండి." అప్పుడు అబూమూసా (రజి) మాట్లాడుతో "దైవప్రవక్తా! మా ప్రాంతంలో బార్లీతో ఒక విధమైన సారా తయారుచేస్తారు. తేనెతో 'బితా' అనే మరో విధమైన సారా కూడా తయారుచేస్తారు. (వీటిగురించి మీ అభిప్రాయం ఏమిటీ)?" అని అడిగారు. దానికి దైవప్రవక్త (స) "మత్తు కలిగించే ప్రతి వస్తువూ నిషిద్ధమే" అని అన్నారు. (బుఖారి, ముస్లిం)

ఈ హదీసులో మత్తు కలిగించే మద్యం మాత్రమే నిషిద్ధమని ఉంది. కాని వేరొక హదీసుని బట్టి ఏ మద్యం అధిక పరిమాణం మత్తు కలిగిస్తుందో ఆ మద్యం అల్ప పరిమాణం కూడా నిషిద్ధమేనని స్పష్టంగా తెలుస్తోంది. (ఇమామ్ నవవీ-రహ్మాలై)

హజ్రత్ అనస్ (రజి) ఉల్లేఖనం: "దైవప్రవక్త (సల్లం) సారాయికి సంబంధించిన పన్నెండు మంది వ్యక్తులలో పది మందిని శపించారు. వారు-(1) సారాయి పిండేవాడు (అంటే తయారుచేసేవాడు), (2) దాన్ని పిండించేవాడు (తయారు చేయించేవాడు, (3) దాన్ని తాగేవాడు, (4) దాన్ని మోసేవాడు, (5) మోసేవాడి నుంచి తీసుకునేవాడు, (6) దాన్ని తాగించేవాడు, (7) దాన్ని అమ్మేవాడు, (8) దాని ధర తినేవాడు, (9) దాన్ని కొనే వాడు, (10) ఎవరి కోసం కొంటే అతను." (తిర్మిజి, ఇబ్నెమాజ)

దైవప్రవక్త (సల్లం) ఈవిధంగా పేర్కొన్నారు: "నా ప్రభువు ప్రమాణం చేసి ఇలా అన్నాడు- 'నా దాసులలో ఎవరైనా సారా తాగితే, ఎంత సారా తాగివుంటే అంత చీము (నరకంలో) నేనతనికి తాగిస్తాను. అలాగే నా దాసులలో ఎవరైనా నాకు భయపడి



మద్యపానం మానుకుంటే, అతనికి నేను (స్వర్గంలో) పరిశుద్ధ కోనేరులలోని (మద్యం, మకరందం, పాలు వగైరా) పానీయాలు తాగిస్తాను." (అహ్మద్)

హజ్రత్ అబూమూసా అష్అరీ (రజి) ఉల్లేఖనం: దైవప్రవక్త (సల్లం) మద్యం గురించి ప్రస్తావిస్తూ "మద్యసేవనానికి అలవాటు పడి అదే స్థితిలో చనిపోయిన మనిషికి దేవుడు (నరకంలో) గౌతా సెలయేటి పానీయం తాగిస్తాడు" అని అన్నారు. అనుచరులు ఈమాట విని "గౌతా సెలయేరు అంటే ఏమిటీ దైవప్రవక్తా?" అని అడిగారు. దానికి దైవప్రవక్త (సల్లం) గౌతా సెలయేరు అంటే వ్యభిచార స్త్రీపురుషుల మర్మావయవాల నుండి వెలువడే ద్రవాలు కలిగిన సెలయేరు అన్నమాట" అని చెప్పారు. (అహ్మద్)

## జూదం, మట్కా, లాటరీలు

జూదం కూడా ఘోరమైన పాపకార్యమే. ఇందులో అనేకమంది డబ్బు ఎలాంటి శ్రమ లేకుండానే ఒక వ్యక్తికి లభిస్తుంది. ఈనాటి మట్కా, లాటరీలు కూడా ఈ కోవకు చెందినవే. వ్యాపారస్థులు నడిపే కొన్నిరకాల స్కీములు కూడా జూదం క్రిందికే వస్తాయి. ఎలాంటి పద్ధతి ద్వారానైనా సరే పదిమంది జేబులు ఖాళీచేసి ఒక్కడి జేబును నింపే జూదాన్ని ఇస్లాం శాశ్వతంగా అంతమొందించింది.

"విశ్వాసులారా! మద్యం, జూదం, దైవేతరాలయాలు, పాచికల జోస్యం – ఇవన్నీ అసహ్యకరమైన పైశాచిక విషయాలు. వాటికి దూరంగా ఉండండి, మీ జీవితం సార్థక మవుతుంది. (ఖుర్ఆన్–5:90)

పాచికల ద్వారా జోస్యం చెప్పడమనేది అజ్ఞానకాలం అరబ్బుల్లో ఉండే మూఢనమ్మకం. జాతకం, జోతిష్యం, వారఫలాల పేరుతో ఈనాడు కూడా అనేకమంది ఈ జాడ్యానికి గురవు తున్నారు. జూదంలో ప్రధానాంశం శ్రమ, వ్యాపారం ఏమీ లేకుండా గిమ్మిక్కుల ద్వారా అనేక మంది వ్యక్తుల ధనాన్ని దోచి ఒక్కడికి కట్టబెట్టే అక్రమ సంపాదనే. డబ్బు లేదా మరేదైనా విలువగల వస్తువుల ప్రమేయంలేకుండా ఏఆట ఆడినా పర్వాలేదు. కాకపోతే అవి కాల హరణ క్రీడలుగా పరిగణించబడతాయి. కాని కాలహరణ క్రీడలు కూడా సృష్టికర్తను, ఆయన ప్రవక్త (స)ను దృఢంగా విశ్వసించే ధర్మపరాయణులకు శోభించవు.

అహ్కాముల్ ఖుర్ఆన్ రచయిత జూదంపై వ్యాఖ్యానిస్తూ ఇలా అన్నారు: "లాభ నష్టాలకు సంబంధించిన అత్యాశ, భయాల ప్రాతిపదికపై చేపట్టే ప్రతి వ్యవహారమూ జూదం క్రిందికే వస్తుంది." (అహ్కాముల్ ఖుర్ఆన్-6వ భాగం)

"అజ్ఞానకాలంలో ప్రజలు ధనంతో పాటు తమ భార్యలను కూడా జూదం, పందేల కోసం ఉపయోగించేవారు. ఆ కాలంలో ఇవన్నీ ధర్మసమ్మతంగానే చలామణి అయ్యేవి. గెలుపు ఓటముల ప్రాతిపదికపై ఈ వ్యవహారాలన్నీ నడిచేవి. అంటే ఫలానా విషయంలో "నీవు గెలిస్తే నేను నీకు ఇంత సొమ్ము ఇస్తాను. ఓడిపోతే అంత సొమ్ము నీవు నాకు ఇవ్వాల్సి ఉంటుంది. లేదా ఈ ఆటలో నీవు గెలిస్తే నా భార్యను నీకిస్తాను. నేను గెలిస్తే నీ భార్యను నాకు అప్పగించాలి" అని పందేలు పెట్టుకుంటారు.

ఇలా గెలుపు, ఓటముల ఆధారంగా జరిగే ఈ వ్యవహారాలన్నిటిపై ప్రతివ్యక్తికీ తనకు లాభం వస్తుందనే ఆశతోపాటు నష్టపోతాననే భయం కూడా పట్టిపీడిస్తుంది.

తత్ఫలితంగా ఇందులో మోసం, వంచన, అహంకారాలతో పాటు ఇరువురి మధ్య విద్వేషం, విరోధ భావాలు జనించే అవకాశం కూడా ఎంతో ఉంటుంది. చివరికి ఇది పరస్పరం జగడాలకు, హత్యలకు కూడా దారితీస్తుంది. ఈ కారణంగానే ఇస్లాం వంచన, విద్వేషం, విరోధభావాలకు దారితీసే జూదపు విధానాలన్నిటినీ నిషేధించింది.''

''ఇస్లామీయ ధర్మశాస్త్రం (షరీఅత్) క్రయవిక్రయాలకు, దానధర్మాలకు సంబంధించిన వ్యవహారాలకు మాత్రమే అనుమతి ఇచ్చింది. పందెం షరతుపై చేసుకునే ప్రతి ఒప్పందం మిథ్య, మాయ మాత్రమేనని ధర్మశాస్త్రం పేర్కొన్నది. అంతేకాదు, ఫలానా మనిషి ఈ దేశం వీడిపోవాలి లేదా వేరే దేశంలో ఉన్న ఫలానా మనిషి ఇక్కడికి వచ్చేయాలి అనే షరతుపై ఈ వస్తువును అమ్ముతానని; లేదా వర్షం కురిస్తే ఫలానా వస్తువును నీకు బహూకరిస్తానని షరతు విధించడం వగైరా అధర్మకార్యాలే...'' (అహ్కాముల్ ఖుర్ఆన్, 6వ భాగం)

మానవుల బద్ధశత్రువయిన షైతాన్ మనిషిలో రక్తంలా ప్రవహిస్తూ అధర్మ వ్యవహారాలను ధర్మ వ్యవహారాలుగా చూపించి లేనిపోని భ్రమలు కల్పిస్తాడు. కొత్త కొత్త పేర్లతో, ప్రకటనలతో ఆశల గుర్రాలపై ఎక్కించి వదలిపెడ్తాడు.

దైవప్రవక్త (స) ప్రవచనం: ''ఎవరైనా తన స్నేహితుడ్ని జూదం ఆడదాం రమ్మని పిలిస్తే దానికి అతను పాపపరిహారం చెల్లించవలసి ఉంటుంది.'' (మిష్కాత్)

## కానుక రూపంలో లంచం

ఉద్యోగులు లంచం ఏరూపంలో తీసుకున్నా అధర్మకార్యంగానే, అక్రమ సంపాదనగానే పరిగణించబడుతుంది. కానుకరూపంలో ఇచ్చినా సరే తీసుకోవడం నిషిద్ధం.

హజ్రత్ అబ్దుల్లా బిన్ అమ్రిబిన్ఆస్ (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ఇలా అన్నారు: ''లంచం తీసుకునేవాడిపై, ఇచ్చేవాడిపై దేవుని అభిశాపం పడుగాక.'' (బుఖారి)

హజ్రత్ అబూహమీద్ సాయిదీ (రజి) కథనం: దైవప్రవక్త (స) జకాత్, సదఖాలు (రెవెన్యూ) వసూలు చేయడానికి ఒకతడ్ని నియమించారు. అతను తనకప్పగించబడిన పని పూర్తి చేసుకొని తిరిగొచ్చి ''దైవప్రవక్తా! ఈ ధనం మీది, ఇది నాకు పారితోషికంగా లభించింది'' అని అన్నాడు. దైవప్రవక్త (సల్లం) ఈమాట విని ''నువ్వు నీ తల్లిదండ్రుల ఇంట్లోనే ఎందుకు కూర్చోలేదు? అప్పుడు నీకెవరైనా పారితోషికం తెచ్చిస్తారో లేదో తెలుస్తుంది కదా!'' అని అన్నారు. ఆ తర్వాత ఆయన ఇషా నమాజ్ చేసి (ఉపన్యాసం ఇవ్వడానికి) నిలబడ్డారు. ముందుగా ఆయన సత్యసాక్ష్య వచనం పఠించి దైవస్తోత్రం చేశారు. స్తోత్రం దేవునికే శోభిస్తుంది. తరువాత ఆయన ఇలా అన్నారు:

''ఈ కార్యనిర్వాహకులకు ఏమయింది? మేమొక వ్యక్తిని కార్యనిర్వాహకునిగా (రెవెన్యూ వసూలుచేసే ఉద్యోగిగా) నియమించి పంపితే అతను తిరిగొచ్చి 'ఇది నన్ను వసూలుచేసి తీసుకురమ్మని పంపిన ధనం, ఇది నాకు పారితోషికంగా లభించిన ధనం' అని అంటున్నాడు. అతను తన తల్లిదండ్రుల ఇంట్లోనే ఎందుకు కూర్చోలేదు? అప్పుడు తెలుస్తుందిగా అతనికి పారితోషికం ఎవరు తెచ్చిస్తారో! ఎవరి అధీనంలో ముహమ్మద్ ప్రాణముందో ఆ శక్తిస్వరూపుని సాక్షి! ఈ (ప్రభుత్వ)రాబడిలో ఎవరు నమ్మకద్రోహానికి



పాల్పడతాడో ప్రళయదినాన దొంగిలించబడిన ఆ ధనం అతని మెడమీద పెనుభారంగా పరిణమిస్తుంది. అతను ఒంటెను దొంగిలించి ఉంటే, ఆ ఒంటె అతని మెడ మీదెక్కి అరుస్తూ అతనికి దుర్భరంగా మారవచ్చు. ఒకవేళ అతను ఆవును దొంగిలించి ఉంటే, ఆ ఆవు అతని మెడ మీదెక్కి అంబా అంటూ అరుస్తుండవచ్చు. మేకయితే మ్యామ్యా అంటూ అరుస్తుండవచ్చు. గుర్తుంచుకోండి! నేను దేవుని ఆజ్ఞలన్నీ మీకు అందజేశాను. (నా బాధ్యత తీరిపోయింది. ఇక ఎవరి కర్మలకు వారే బాధ్యులు.)'' (బుఖారి)

ఈ హదీసుని బట్టి ప్రభుత్వఉద్యోగులు కానుకలు, పారితోషికాలు స్వీకరించకూడదని, అది ప్రభుత్వధనం నుండి దొంగిలించి ద్రోహానికి పాల్పడినట్లు అవుతుందని తెలుస్తోంది. ప్రభుత్వఉద్యోగి కానుకలు స్వీకరించడమంటే తన హోదా అధికారాల ద్వారా అక్రమ ప్రయోజనాలు పొందడమే. అందుకే దైవప్రవక్త (స) సమరసొత్తు కాజేసేవాడికి ఎలాంటి శిక్ష పడుతుందో, లంచం తీసుకునేవాడికి కూడా అలాంటి శిక్షే పడుతుందని హెచ్చరించారు.

## మరికొన్ని అధర్మ సంపాదనలు

హజ్రత్ అబూ మస్వూద్ అన్సారీ (రజి) కథనం: ''కుక్క ధరను, వ్యభిచార సంపాదనను, జ్యోతిష్కుని వేతనాన్ని దైవప్రవక్త (సల్లం) నిషేధించారు.'' (బుఖారి)

దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: ''ఎవరైనా వేట కోసం లేదా పశురక్షణ కోసం తప్ప ఇతరత్రా ఉద్దేశాలతో కుక్కను పెంచితే అతని సత్కర్మల నుండి ప్రతిరోజూ రెండు యూనిట్ల చొప్పున పుణ్యం తగ్గుతూ ఉంటుంది.'' (బుఖారి, ముస్లిం)

దైవప్రవక్త (స) ప్రవచనం: ''ఎవరైనా కుక్కను పెంచితే అతని సత్కర్మల నుండి ప్రతిరోజూ ఒక యూనిట్ చొప్పున  పుణ్యం తగ్గుతూ ఉంటుంది. అయితే పొలాన్ని, పశువుల్ని కాపాడుకునేందుకు మాత్రం కుక్కను పెంచుకోవచ్చు.'' (బుఖారి, ముస్లిం)

వ్యభిచారసంపాదన అధర్మ సంపాదనే అని తెలుస్తూనే ఉంది. అలాగే జ్యోతిష్యం, సోది, హస్తసాముద్రికం, జాతకం, వారఫలాలు చెప్పేవారి సంపాదన కూడా అధర్మసంపాదనే. జ్యోతిష్కుల, హస్తసాముద్రికుల, భూతవైద్యుల సంపాదనలను అరికట్టడం (అంటే వాటిని నిషేధించడం) పాలకుల కర్తవ్యమని, అవసరమైతే అలాంటివారికి శిక్షలు కూడా విధించాలని హజ్రత్ ఖతాబీ (రహ్మలై) తన గ్రంథం ''అహ్కాముస్సుల్తానియా''లో పేర్కొన్నారు.

హజ్రత్ జాబిర్ బిన్ అబ్దుల్లా (రజి) కథనం: మక్కా జయించబడిన సంవత్సరం దైవప్రవక్త (సల్లం) మక్కాలోనే ఉన్నప్పుడు (ప్రజల్ని సంబోధిస్తూ) ''సారాయిని, మృత పశువుని, పందిని, విగ్రహాల అమ్మకం-కొనుగోళ్ళను దేవుడు, దైవప్రవక్త నిషేధించారు'' అని అన్నారు. (అప్పుడు ఒకతను లేచి) ''దైవప్రవక్తా! మృతపశువు కొవ్వును మేము నౌకలకు పూతగా వాడతాము. దాంతో చర్మానికి పదును పెడ్తాము. ప్రజలు దాన్ని దీపాలు వెలిగించుకోవడానికి (నూనెగా) వాడుకుంటారు. మరి ఇలాంటి కొవ్వు విషయంలో మీ అభిప్రాయం ఏమిటీ?'' అని అడిగాడు. దానికి దైవప్రవక్త (స) ''కాదు, అది నిషిద్ధం'' అన్నారు. ఈ సందర్భంలో ఆయన ''దేవుడు యూదుల్ని నాశనం చేయుగాక! మృతపశువు కొవ్వును దేవుడు నిషేధిస్తే వారు దాన్ని కరగబెట్టి అమ్ముకొని తినడం మొదలెట్టారు'' అని అన్నారు. (బుఖారి)

ఈ హదీసులో "కాదు, అది నిషిద్ధం" అంటే కొవ్వును అమ్మడం ఎట్టి పరిస్థితిలో కూడా మంచిది కాదని అర్థం అన్నారు ఇమాం నవవీ (రహ్మాలై). అంటే దాని వ్యాపారం మాత్రమే నిషిద్ధంకాని, దాని ద్వారా ప్రయోజనం పొందడం నిషిద్ధం కాదన్న మాట. ఇమాం షాఫయి (రహ్మాలై), ఆయన అనుచరులు కూడా మృతపశువు కొవ్వు ద్వారా ప్రయోజనం పొందడం ధర్మసమ్మతమేనని తీర్పిచ్చారు. అంటే దాంతో ఓడలకు లేపనం పూయడం, దీపాలు వెలిగించుకోవడం వంటి పనులు ధర్మసమ్మతమే. ఈ కొవ్వును ఆహారంగా వాడటం, మానవ శరీరానికి రాయడం మాత్రమే నిషిద్ధం. అతా బిన్ రబాహ్ (రహ్మాలై), ముహమ్మద్ బిన్ జరీర్ తబ్రీ (రహ్మాలై)ల అభిప్రాయం కూడా ఇదే.

అత్యధికమంది ధర్మవేత్తల అభిప్రాయం ప్రకారం కొన్ని ప్రత్యేక పనులకు వాడటం తప్ప మృతపశువుల కొవ్వు ద్వారా ప్రయోజనం పొందడం ఎంతమాత్రం ధర్మసమ్మతం కాదు. ఉదాహరణకు పదును పెట్టిన చర్మం వగైరా వంటనూనె, నెయ్యి లాంటి ఆహారపదార్థాలతో కలిసి కలుషితమయిపోతే దాని ఆజ్ఞలు వేరుగా ఉన్నాయి. దీపాలు వెలిగించుకోవడానికి, ఆహారంగా ఉపయోగించడానికి, మానవ దేహానికి రాయడానికి తప్ప ఇతర పనుల కోసం కొవ్వును ఉపయోగించడం ధర్మసమ్మతమే. సబ్బులతయారీ, పశువులదాణా కోసం కొవ్వు వాడకం విషయంలో సలఫీ ధర్మవేత్తలలో భిన్నాభిప్రాయాలున్నాయి.

కాని ఇమామ్ నవవీ (రహ్మా) ప్రకారం ధర్మసమ్మతమే. ఖాజీ అయాజ్ (రహ్మా) తెలియజేస్తున్నట్లు ఇమామ్ మాలిక్, ఇమామ్ షాఫయి, సుఫియాన్ సూరీ, ఇమామ్ అబూహనీఫా (రహ్మా)లు, ప్రవక్త ప్రత్యక్ష అనుచరుల్లో అనేకమంది అభిప్రాయం కూడా ఇదే. అపరిశుభ్రమైన నూనె అని ముందుగా తెలియజేసి దాన్ని అమ్మడం వారి దృష్టిలో ధర్మసమ్మతమే. ఇమామ్ అహ్మద్ బిన్ హంబల్ (రహ్మాలై), ఇమామ్ మాలిక్ బిన్ మాజుషూన్ (రహ్మాలై)ల దృష్టిలో ఏ విధంగానైనా సరే కొవ్వు వాడకం ధర్మసమ్మతం కాదు.

ఎలాంటి అపరిశుద్ధ వస్తువునయినా అమ్మడం ధర్మసమ్మతం కాదని పండితుల అభిప్రాయం. యుద్ధంలో చనిపోయిన అవిశ్వాసి మృతదేహం, విగ్రహాలను అమ్మడం కూడా నిషిద్ధమే. అయితే విగ్రహాల ముక్కలను అమ్మే విషయంలో భేదాభిప్రాయం ఉంది. కొందరు అమ్మవచ్చని, మరికొందరు అమ్మకూడదని అన్నారు. కాని మృతపశువు, మద్యం, పందుల అమ్మకం పూర్తిగా హరాం (నిషిద్ధం) అనే విషయంలో ఎలాంటి భేదాభిప్రాయం లేదు.

(అల్‌హఖ్ తెలుగు పబ్లికేషన్స్‌వారి "మహాప్రవక్త మహితోక్తుల" నుండి)

## భిక్షాటన నిషిద్ధం

దైవప్రవక్త (స) భిక్షాటనను గర్హిస్తూ ఇలా ప్రవచించారు: "ఎల్లప్పుడూ ప్రజల దగ్గర అడుక్కుంటూ ఉండేవాడు ప్రళయదినాన ముఖాన ఒక్క మాంసపు తునకయినా లేనివాడయి (వికృత ముఖాకృతితో) వస్తాడు." (బుఖారి)

"ఉదయం, సాయంత్రం రెండు పూటలా తిండి ఉంచుకొని కూడా ముష్టెత్తేవాడు వాస్తవానికి తన కోసం అగ్ని సేకరించుకుంటున్నాడు." (మిష్కాత్)

"లోకుల దగ్గర ముష్టెత్తడం కన్నా (అడవి నుండి) కట్టెల మోపు మోసుకొచ్చి అమ్ముకొని తినడం మనిషికి ఎంతో మేలు. అతనికి వారు ఏదైనా (దానం) ఇవ్వచ్చు లేదా ఇవ్వడానికి నిరాకరించనూ వచ్చు." (బుఖారి, ముస్లిం)



"నిరుపేద అంటే వీధుల వెంబడి తిరుగుతూ ఒకటి రెండు ముద్దలు అన్నం లేక ఒకటి రెండు ఖర్జూరపు పండ్లు అడుక్కునేవాడు కాదు. సిసలైన నిరుపేద అంటే ఇతరుల్ని అర్థించనవసరం లేనంత ఆర్థిక స్తోమత లేనివాడు. అటు దానం చేయడానికి ప్రజల దృష్టిలో అతనంత పేదవాడిగా కూడా కన్పించడు. పైగా అతను ప్రజల ముందు దేబిరిస్తూ తిరగడు." (బుఖారి, ముస్లిం)

హ్జ్రత్ ఉమర్ (రజి) కథనం: దైవప్రవక్త (సల్లం) నాకేదైనా ప్రసాదిస్తున్నప్పుడు "దీన్ని అతనికివ్వండి. నాకంటే అతనికి దీని అవసరం ఎక్కువగా ఉంది" అని అనేవాడ్ని నేను. ఈవిషయం గురించి (ఓరోజు) దైవప్రవక్త (స) ప్రస్తావిస్తూ "అత్యాశకు పోకుండా, అర్థించకుండానే మీకేదయినా సంపద లభిస్తే నిరభ్యంతరంగా తీసుకోండి. ఆ విధంగా లభించకపోతే దాన్ని గురించి పట్టించుకోకండి" అని అన్నారు. (బుఖారి-మిష్కాత్)

హ్జ్రత్ అబూసయీద్ ఖుద్రీ (రజి) కథనం: కొందరు అన్సార్‌లు దైవప్రవక్త (స) సన్నిధికి వచ్చి కొంతధనం అర్థించారు. దైవప్రవక్త (స) వారికి కొంత ఇచ్చారు. కాని వారు మళ్ళీ అడిగారు. దైవప్రవక్త (స) రెండవసారి కూడా ఇచ్చారు. ఇలా ఇస్తూ చివరికి దగ్గరున్నదంతా అయిపోయింది. అప్పుడాయన ఇలా అన్నారు- "నా దగ్గరున్న ధనసంపద (ఎంతైనా) మీకివ్వడానికి నాకెలాంటి అభ్యంతరం లేదు. మీకివ్వకుండా నేనేదీ దాచుకోను. కాని (ఒక విషయం గుర్తుంచుకోండి.) దానం అడగకుండా ఉండేవాడికి దేవుడు అలాంటి పరిస్థితి రాకుండా కాపాడుతాడు. నిరపేక్షా వైఖరి అవలంబించేవాడికి దేవుడు అక్కరలేనంతగా ప్రసాదిస్తాడు. సహనం వహించేవాడికి సహనశక్తి ప్రసాదిస్తాడు. (దైవానుగ్రహాలలో) సహనానికి మించిన మహాభాగ్యం లేదు." (బుఖారి, ముస్లిం)

హ్జ్రత్ అబూహురైరా (రజి) కథనం: దైవప్రవక్త (స)కు ఎవరైనా ఆహారపదార్థాలు సమర్పిస్తున్నప్పుడు "ఇది దానంగా ఇస్తున్నావా, కానుకగా ఇస్తున్నావా?" అని అడిగేవారు ఆయన ఆ వ్యక్తిని. అతను గనక ఆ వస్తువుని దానంగా ఇస్తున్నానని చెబితే దైవప్రవక్త (స) తన అనుచరుల్ని ఉద్దేశించి "దీన్ని మీరు తినండి" అనంటారు. ఆయన మాత్రం దాన్ని ముట్టరు. ఒకవేళ అతను ఆ వస్తువుని కానుకగా ఇస్తున్నానని అంటే మాత్రం దైవప్రవక్త (స) దాన్ని స్వీకరించి, ఇతరుల్ని కూడా కలుపుకొని తినేవారు. (బుఖారి)

దైవప్రవక్త (స) హితోక్తి: ఒకతను తానీ రోజు(రాత్రి) దానంచేస్తానని నిశ్చయించుకొని ఇంటి నుండి బయలుదేరాడు. అయితే అతను (తెలియక) ఒక దొంగకు దానం చేశాడు. మరునాడుదయం జనం, ఒకతను రాత్రి దొంగకు దానం చేశాడని చెప్పుకోసాగారు. అతనీ మాట విని "దేవా! సకల స్తోత్రాలకు నీవే అర్హుడివి" అన్నాడు. తరువాత అతను తానీ రోజు(రాత్రి) మళ్ళీ దానం చేస్తానని సంకల్పించుకొని ఇంటి నుంచి బయలుదేరాడు. (కాని ఆరోజు కూడా తెలియక ఒక వేశ్యకు దానం చేశాడు.)

మరునాడు ఉదయం జనం మళ్ళీ, ఒకతను రాత్రి ఒక వేశ్యకు దానం చేశాడని గుసగుసలాడుకున్నారు. అతనీ మాట విని "దేవా! సకల స్తోత్రాలకు నీవే అర్హుడివి. నా దానం ఒక వేశ్య చేతికి చిక్కింది" అన్నాడు. ఆ తర్వాత తానీ రోజు(రాత్రి) మళ్ళీ దానం చేస్తానని నిశ్చయించుకొని బయలుదేరాడు. అయితే (ఆరోజు కూడా) అతను దానం

ఒక ధనికుడి చేతిలో పెట్టాడు. మరుసటి రోజు ఉదయం జనంలో, ఒకతను రాత్రి ఒక ధనికుడికి దానం చేశాడని గుసగుసలు బయలుదేరాయి. ఆ సంగతి తెలిసి "దేవా! సకల స్తోత్రాలకు నీవే అర్హుడివి. నా దానం ఒకసారి ఓ దొంగకు, మరోసారి ఒక వేశ్యకు దొరికింది. ఇప్పుడేమో ఒక ధనికునికి చిక్కింది. దేవా! ఏమిటీ వైపరీత్యం!!" అని అన్నాడు. ఆ తరువాత (రాత్రి) ఒక వ్యక్తి కలలో కన్పించి ఇలా అన్నాడు:

"(దొంగ చేతికి లభించిన దానంవల్ల ఆదొంగ (త్వరలోనే) దొంగతనాలు మానేయ వచ్చు. వేశ్యకు దొరికిన దానంవల్ల ఆ వేశ్య తన వేశ్యవృత్తిని వదలిపెట్టవచ్చు. అలాగే ధనికుడికి లభించిన దానంవల్ల ఆ ధనికుడు సిగ్గుపడి తనకు దేవుడు ప్రసాదించిన సంపద నుంచి కొంత దైవమార్గంలో ఉపయోగించవచ్చు." (సహీ బుఖారి)

# 48. వడ్డీ వ్యవస్థ

"ప్రజల ధనంలో కలిసిపోయి వృద్ధిచెందుతుందన్న ఉద్దేశ్యంతో మీరిచ్చే వడ్డీ దేవుని దృష్టిలో ఎన్నటికీ వృద్ధిచెందదు. (దీనికి భిన్నంగా) దైవప్రసన్నత కోసం (పేదల ఆర్థిక హక్కుగా) మీరు చెల్లించే జకాత్ (మీకు శుభాన్నిస్తుంది). అలా జకాత్ చెల్లించేవారే నిజానికి తమ ధనాన్ని వృద్ధిచేసుకుంటారు." (ఖుర్ఆన్–30:39)

"పోతే వడ్డీ తినేవాడు పిశాచం పట్టిన పిచ్చివాడిలా (సమాధి నుండి) లేస్తాడు. ఈ దుస్థితికి కారణం, వారు వ్యాపారం కూడా వడ్డీ లాంటిదే అనంటారు. కాని దేవుడు వ్యాపారాన్ని ధర్మసమ్మతం చేశాడు. వడ్డీని అధర్మకార్యంగా నిర్ణయించాడు. కనుక ఈ హితబోధ అందినవారు ఇకముందు వడ్డీ తినటాన్ని మానుకోవాలి. జరిగిందేదో జరిగింది. ఇకనుండి మానుకోవాలి. ఆలాంటివారి వ్యవహారం (పరలోక న్యాయస్థానంలో) దేవుడు పరిష్కరిస్తాడు. ఒకవేళ ఈ ఆదేశం అందిన తరువాత కూడా మళ్ళీ ఎవరైనా ఈ పాపకార్యానికి పాల్పడితే వారు నరకం పాలవుతారు. నరకంలోనే ఎల్లకాలం పడివుంటారు. దేవుడు వడ్డీ (వ్యవస్థ)ని తుదముట్టిస్తాడు. దానధర్మాలకు వృద్ధివికాసాలు కలిగిస్తాడు. (ఖుర్ఆన్–2:275,276)

వడ్డీవ్యవస్థను దేవుడు పూర్తిగా నిషేధించాడు. వడ్డీ తినే (తీసుకునే)వాడ్ని, తిన్పించే (ఇచ్చే) వాడ్ని, దానికి సాక్షులుగా ఉండేవారిని, వడ్డీపత్రం రాసేవాడ్ని- అందర్నీ దేవుడు శపించాడని దైవప్రవక్త (స) తెలిపారు. (అబూదావూద్, ఇబ్నెమాజ, నసాయి.)

వడ్డీ కూడా వ్యాపారం లాంటిదేనన్న అర్థం స్ఫురించేలా 'వడ్డీవ్యాపారం' అనే పదాన్ని సృష్టించి జనంలోకి వదిలేశారు వడ్డీకోరులు. ధర్మవిద్య అంతగాలేని కొందరు ముస్లింలు సైతం వడ్డీరక్కసి కబంధహస్తాలలో చిక్కుకొని, క్రమంగా స్థిరపడి చివరికి దాని ఒడిలో దత్తపుత్రులై కూర్చున్నారు. కాని డబ్బు ద్వారా డబ్బు గడించే, ఒకేవిధమైన ఒకే విలువగల వస్తువు ద్వారా లాభం పొందే పద్ధతులను దైవప్రవక్త (స) నిషేధిస్తూ ఇలా ప్రవచించారు:

"ఒక దిర్హమ్ (రూపాయి)ని రెండు దిర్హమ్‌లకు బదులుగా అమ్మకండి. ఇలా చేస్తే మీరు వడ్డీకోరుతనంలో చిక్కుకుంటారని నేను భయపడుతున్నాను." (ముస్లిం)

"బరువులో, విలువలో సమానంగా యధాతథంగా ఉన్నప్పుడు తప్ప బంగారానికి బదులు బంగారం, వెండికి బదులు వెండి అమ్మకండి." (అహ్మద్, ముస్లిం)



"బంగారానికి బదులు బంగారం, వెండికి బదులు వెండి, గోధుమలకు బదులు గోధుమలు, యవలకు బదులు యవలు, ఖర్జూరాలకు బదులు ఖర్జూరాలు, ఉప్పుకు బదులు ఉప్పు యధాతథంగా తప్ప, చేబదులు తప్ప మార్పిడి చేయకండి. ఎవరైనా తాను తీసుకున్నదాని కంటే ఎక్కువ ఇచ్చినా, ఇచ్చినదాని కంటే ఎక్కువ తీసుకున్నా అతను వడ్డీ వ్యవహారానికి పాల్పడినట్లే. ఆ విధంగా ఇచ్చేవాడు, తీసుకునేవాడు ఇద్దరూ పాపంలో సమానులవుతారు." (అహ్మద్, ముస్లిం)

ఒకసారి హజ్రత్ బిలాల్ (రజి) దైవప్రవక్త (సల్లం) దగ్గరకు బర్నీ ఖర్జూరపండ్లు (ఒక విధమైన మేలుజాతి ఖర్జూరాలు) తెచ్చారు. దైవప్రవక్త (సల్లం) వాటిని చూసి "వీటిని ఎక్కడ్నుంచి తెచ్చావు?" అని అడిగారు. దానికి బిలాల్ (రజి) "మా దగ్గర నాసిరకం ఖర్జూరాలు ఉంటే వాటిని రెండు 'సా'ల ఎత్తుకు బదులుగా ఒక 'సా' ఎత్తు ఈ బర్నీ ఖర్జూరాలు కొన్నాను" అని సమాధానమిచ్చారు. దైవప్రవక్త (సల్లం) ఈమాట విని "ఇది కచ్చితంగా వడ్డీయే, ఇది కచ్చితంగా వడ్డీ కిందకు వస్తుంది. మీరు మేలుజాతి ఖర్జూర పండ్లు కొనదలచినప్పుడు మీ దగ్గరుండే నాసిరకం పండ్లను నగదు పైకానికిగాని, లేదా మరేదైనా వస్తువుకు బదులుగాని అమ్మేయండి. ఆ తరువాత ఆ పైకంతో మేలుజాతి ఖర్జూరాలు కొనుక్కోండి" అని అన్నారు. (బుఖారి, ముస్లిం)

మరొక హదీసులో దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రవచించారు: "అధర్మకార్య కలాపాలతో సత్యాన్ని అణచివేసే ఉద్దేశ్యంతో అన్యాయపరుడికి అండగా నిలిచిన వ్యక్తి దేవుని రక్షణ నుండి, దైవప్రవక్త రక్షణ నుండి బయటికి పోయినట్లే. ఒక్క దిర్హం (రూపాయి) కూడా వడ్డీ తిన్నవాడి పాపం 33 సార్లు వ్యభిచారంచేసిన పాపంతో సమానం. అధర్మ సంపాదనతో పోషించబడిన శరీరానికి (నరకా)అగ్నే తగిన శిక్ష". (తబ్రాని)

వేరొక హదీసులో ఆయన ఇలా బోధించారు: "మీలో ఎవరయినా వేరొకరికి అప్పు ఇచ్చినట్లయితే (అప్పు తీసుకున్న) అతను ఆ వ్యక్తికి కానుకలు పంపినప్పుడు లేదా తన వాహనమ్మీద కూర్చోబెట్టుకోడానికి ముందుకొచ్చినప్పుడు (రుణదాత) ఆ కానుకను స్వీకరించడంగాని, అతని వాహనమ్మీద ఎక్కడంగాని చేయరాదు. అయితే ఈ పనులు ముందునుంచీ సాగుతూ వస్తుంటే అలా చేయడంలో తప్పులేదు". (ఇబ్నెమాజా)

కొన్ని హదీసులలో "మనిషి అక్రమసంపాదన, సక్రమసంపాదన అనే విషయాన్ని పట్టించుకోకుండా ఎలాగైనా సంపాదించడమే ధ్యేయంగా పెట్టుకునే రోజులు వస్తాయి" అని; మరికొన్ని హదీసులలో "వడ్డీ తిననివారంటూ ఉండని రోజులు వస్తాయి. ఒకవేళ ఎవరైనా వడ్డీ తినకపోయినా వారిపై వడ్డీధూళి మాత్రం వచ్చి పడుతుంద"ని ఉంది.

బ్యాంకుల్లో దాచుకునే డబ్బుపై వచ్చే వడ్డీని ముస్లింలు తీసుకోవాలా లేక బ్యాంకులకు వదిలేయాలా అనే ప్రశ్న ఉత్పన్నమవుతుంది. దీనికి మన దేశంలో కొందరు ధర్మవేత్తలు "వడ్డీ పైకాన్ని బ్యాంకులకు వదలి పెట్టుబడీదారులకు మరింత బలం చేకూర్చడానికి బదులు, దాన్ని ముస్లింలు తీసుకొని పుణ్యఫలం ఆశించకుండా దారిద్ర్యంలో మగ్గుతూ మార్గాంతరం లేక అప్పులు చేసే నిరుపేదలకు ఇవ్వడం; లేదా పేదముస్లింల సంక్షేమకార్యాలకోసం వినియోగించడం మంచిది" అని సమాధానమిచ్చారు. మరికొందరు ధర్మవేత్తలు అలాంటి వడ్డీపైకాన్ని మసీదుల్లో మరుగుదొడ్ల నిర్మాణం కోసం వినియోగించాలని అభిప్రాయపడ్డారు.

"విశ్వాసులారా! దేవునికి భయపడండి. మీరు నిజంగా విశ్వసించిన వారయితే మీకు రావలసిన వడ్డీని వదిలేయండి. మీరిలా చేయకపోయారా, జాగ్రత్త! దేవుని తరఫున, ఆయన ప్రవక్త తరఫున మీకు వ్యతిరేకంగా యుద్ధప్రకటన వెలువడినట్లేనని తెలుసుకోండి. కనుక ఇకనయినా పశ్చాత్తాపం చెంది (వడ్డీ తీసుకోవడాన్ని మానేసి) నట్లయితే మీకు మీ మూల ధనం తీసుకునే హక్కు ఉంటుంది. దానివల్ల మీకూ నష్టం ఉండదు; ఇతరులకూ నష్టం ఉండదు." (ఖుర్ఆన్-2:278,279)

ఇస్లామీయపాలనలో ఉండేవారు ముస్లిములైనా, ముస్లిమేతరులైనా సరే వడ్డీ వ్యాపారం చేయడం నేరం. హజ్రత్ ఇబ్నెఅబ్బాస్, హసన్ బస్రీ, ఇబ్నెసీరీన్ లాంటి ప్రముఖ షరీఅత్‌వేత్తలు ఈసూక్తిని బట్టి వడ్డీ తీసుకునే వ్యక్తిపై వత్తిడితెచ్చి ఆపని మాన్పింపజేయాలని, మానుకోకపోతే అతడ్ని వధించాలని అభిప్రాయపడ్డారు. అయితే మరికొందరు షరీఅత్‌వేత్తలు, అలాంటి వ్యక్తిని వడ్డీ తీసుకోవడం మానేవరకు జైల్లో పెడ్తే చాలని అభిప్రాయపడ్డారు.

## 49. రుణానుబంధం

అప్పుచేసి పప్పుకూడు తినడం కంటే ఉన్నదాంతోనే తృప్తిచెందడం మంచిదని ఇస్లాం బోధనల ద్వారా తెలుస్తోంది. అయినా ఒక్కోసారి అప్పుచేయవలసిన పరిస్థితి వస్తుంది. ఈనాడు మధ్యతరగతి ప్రజలు కొద్దో గొప్పో చేబదులు తీసుకోవడం తెలిసిందే. దీనికి లెక్కా పత్రం ఉండవు. అధికమొత్తాలు అప్పుగా ఇచ్చినపుడు మాత్రం దస్తావీజు రాయించుకోవాలి.

"విశ్వాసులారా! మీరు ఏదైనా ఒక నిర్ణీత కాలానికిగాను అప్పు ఇచ్చిపుచ్చుకోవడం గురించి పరస్పరం మాట్లాడుకుంటే ఆ విషయాన్ని వ్రాతపూర్వకంగా నమోదు చేసుకోండి. అయితే రుణపత్రం రాసేవ్యక్తి ఎవరికీ ఎలాంటి నష్టం కలగనీయకుండా న్యాయంగా, నిష్పక్షపాతంగా వ్రాయాలి. దేవుడు తనకు నేర్పినవిధంగా వ్రాయాలి. అతను దస్తావీజు వ్రాయడానికి నిరాకరించకూడదు. బాధ్యత పైనబడిన వ్యక్తి (రుణగ్రస్తుడు) మాత్రమే విషయం చెప్పి వ్రాయించాలి. అతను తన నిజప్రభువైన దేవునికి భయపడుతూ నిర్ణీత వ్యవహారంలో ఎలాంటి తగ్గింపు చేయకుండా వ్రాయించాలి." (ఖుర్ఆన్-2:282)

దైవప్రవక్త (స) ఇలా అన్నారు: "మూడువిధాల వ్యక్తులు దేవుడ్ని మొరపెట్టు కుంటారు. కాని దేవుడు వారి మొరలు ఆలకించడు. ఒకడు, భార్య శీలంలేని స్త్రీ అని తెలిసినప్పటికీ ఆమెకు విడాకులివ్వని వ్యక్తి. రెండోవాడు, (తన అధీనంలోఉన్న) అనాథ బాలుడు యుక్తవయస్సుకు చేరుకోకముందే అతని ఆస్తిని అతనికి అప్పగించిన వ్యక్తి. మూడోవాడు, ఎవరికైనా అప్పిచ్చి దానికి సాక్షులు పెట్టుకోని వ్యక్తి." (మిష్కాత్)

"దైవమార్గంలో ప్రాణాలర్పించిన వ్యక్తి పాపాలన్నీ క్షమించబడతాయి, ఒక్క అప్పు తప్ప" అని దైవప్రవక్త (సల్లం) తెలిపారు. (ముస్లిం)

ఆయన ఒకసారి "దేవా! నేను పాపం, రుణ(భార)ం నుండి నీ శరణు కోరు తున్నా"నని అన్నారు. అప్పుడు ఒక అనుచరుడు "దైవప్రవక్తా! మీరు తరచుగా రుణ భారం నుండి శరణు కోరుతున్నారేమిటీ?" అని అడిగాడు. దానికి దైవప్రవక్త (సల్లం) సమాధానమిస్తూ "మనిషి అప్పుల పాలైనప్పుడు మాట్లాడితే అబద్ధమాడుతాడు; వాగ్దానం



చేస్తే దాన్ని నిలబెట్టుకోలేడు" అన్నారు. (బుఖారి)

"ఒకవేళ అప్పు తీసుకునే వ్యక్తి బుద్ధిమాంద్యం కలవాడో, బలహీనుడో అయిన ట్లయితే లేదా చెప్పి వ్రాయించే శక్తి లేనివాడైతే అతని సంరక్షకుడు చెప్పి న్యాయంగా వ్రాయించాలి. (ఈ వ్యవహారం గురించి) మీలో ఇద్దరు పురుషుల్ని సాక్షులుగా పెట్టుకోండి. పురుషులు ఇద్దరు లభించకపోతే ఒక పురుషుడు, ఇద్దరు స్త్రీలయినా చాలు. వారిలో ఒక స్త్రీ మరచిపోతే రెండో స్త్రీ అయినా గుర్తుచేస్తుంది. సాక్షులు మీకు ఆమోదయోగ్యమైన వారుగా ఉండాలి. సాక్ష్యం కోసం పిలిచినప్పుడు సాక్షులు నిరాకరించకూడదు. గడువు నిర్ణయించబడిన రుణవ్యవహారం చిన్నదైనాపెద్దదైనా దస్తావీజుగా రాయడంలో అశ్రద్ధ చేయకండి. ఇది దేవుని దృష్టిలో ఎంతో న్యాయమైన పద్ధతి. సాక్షమివ్వడానికి చాలా మంచి పద్ధతి. దానివల్ల మీరు ఎలాంటి అనుమానాలకు లోనయ్యే తావుండదు."

"మీరు పరస్పరం ఎప్పటికప్పుడు అక్కడికక్కడ జరుపుకునే క్రయవిక్రయాల విషయంలో దస్తావీజు వ్రాసుకోకపోయినా పర్వాలేదు. మీరు వ్యాపార ఒప్పందాలు కుదుర్చుకునేటప్పుడు సాక్ష్యం పెట్టుకోండి. దస్తావీజు వ్రాసే వ్యక్తికిగాని, సాక్షులుగా ఉండే వారికిగాని నష్టం వాటిల్లరాదు. అలాంటి నష్టం ఏదైనా జరిగితే మీకది పాపకార్యంగా పరిణమిస్తుంది. దేవునికి భయపడుతూ మసలుకోండి. చూడండి, ఆయన మీకు ఎలాంటి మంచి విషయాలు నేర్పుతున్నాడో! దేవుడు సమస్త విషయాలు ఎరిగినవాడు." (ఖుర్ఆన్-2:282)

### తాకట్టు పెట్టి అప్పు తీసుకోవం

ఈనాడు ఆర్థిక వ్యవహారాల్లో నిజాయితీ లోపించింది. ధార్మికులు, దగ్గరి బంధువులు, సైతం మాటకు కట్టుబడి ఉండటంలేదు. అందుకే ఖుర్ఆన్ అప్పు విషయంలో సాక్షులతో సహా దస్తావీజు రాయించుకోవాలని, వస్తువు కుదువపెట్టుకొని డబ్బివ్వాలని చెప్పింది.

"మీరు ప్రయాణావస్థలో ఉన్నప్పుడు దస్తావీజు వ్రాసేవారు లభించకపోతే ఏదైనా వస్తువు తాకట్టుపెట్టి అప్పు తీసుకోండి. అప్పిచ్చేవాడు అప్పుతీసుకునే వ్యక్తిని నిజాయితీ పరుడని భావించి తాకట్టు లేకుండానే అప్పు ఇస్తే రుణగ్రహీత నిజాయితీగా దాన్ని (గడువు తీరగానే) రుణదాతకు తిరిగి చెల్లించాలి. అతను తన నిజప్రభువయిన దేవునికి భయపడాలి. సాక్ష్యాన్ని దాచకూడదు. సాక్ష్యాన్ని దాచేవాడి ఆంతర్యం పాపపంకిలంతో నిండిపోతుంది. మీరు చేసేదంతా దేవుడు గమనిస్తూనే ఉంటాడు." (ఖుర్ఆన్-2:283)

వడ్డీ తీసుకోకుండా అప్పివ్వడం గొప్ప పుణ్యకార్యమే, సందేహంలేదు. కాని నిజాయితీ లోపించిన ఈనాటి సమాజంలో స్నేహితులకు సైతం అప్పివ్వడమంటే తగాదా కొనితెచ్చు కోవడమే. చిన్న మొత్తంలో అప్పివ్వ వలసివస్తే అది తిరిగి రాకపోవచ్చని భావించి అప్పివ్వడం మంచిది. పెద్ద మొత్తంలో అప్పివ్వవలసివస్తే ఏదైనా వస్తువు కుదువపెట్టుకొని మరీ అప్పివ్వడం ఉభయత్రా మంచిది.

వడ్డీ ఎలాంటి పరిస్థితిలోనైనా నిషిద్ధమే. తాకట్టుగావస్తువు ద్వారా ప్రయోజనం పొందడం కూడా నిషిద్ధమే. ఉదాహరణకు- ఎవరైనా ఇల్లు తాకట్టుపెట్టి అప్పు తీసుకుంటే రుణదాత ఆ ఇంటి అద్దెపైకం తింటే వడ్డీ తిన్నట్లే అవుతుంది. అయితే తాకట్టువస్తువు కోసం ఖర్చు చేయవలసి వచ్చినప్పుడు అలాంటి వ్యవహారాలకు ఈ షరతు నుండి మినహాయింపు ఉంది.

ఉదాహరణకు- ఎవరైనా గేదెను తాకట్టుపెడ్తే రుణదాత ఆ గేదెను మేపడానికి, పోషించడానికి డబ్బు ఖర్చుచేయవలసి వస్తుంది గనక అతను దాని పాలను వాడుకోవచ్చు.

తాకట్టు వస్తువులపై రుణగ్రస్తునికి సంబంధించిన చిహ్నాలు ఏవైనాఉంటే లేదా తాకట్టు వస్తువులు రుణగ్రస్తునికి సంబంధించిన దస్తావీజులయి ఉంటే అప్పిచ్చేవాడు ఆ వస్తువులు కుదువ పెట్టుకోవడంతో పాటు దస్తావీజు కూడా రాయించుకోవాలి. దస్తావీజు రాయించుకోకుండా తాకట్టుపై అప్పిస్తే తరువాత రుణగ్రస్తుడు లేనిపోని సమస్యలు సృష్టించవచ్చు.

## రుణగ్రస్తుని పట్ల మృదువైఖరి

"ఒకవేళ రుణగ్రస్తుడు ఇబ్బందులతో సతమతమవుతుంటే పరిస్థితి చక్కబడే వరకు అతనికి అవకాశమివ్వండి. రుణం మాఫీచేస్తే మరీ మంచిది." (ఖుర్ఆన్- 2:280)

హ్రజత్ ఆయిషా (రజి) కథనం: దైవప్రవక్త (స) మాఇంటి ముందు ఎవరో తగాదాలాడుకోవడం విన్నారు. ఇద్దరు వ్యక్తులు బిగ్గరగా పోట్లాడుకుంటున్నారు. వారిలో ఒకతను రెండవ వ్యక్తిని బ్రతిమాలుతూ "కొంత వదిలేయండి. కాస్త మృదువుగా వ్యవహరించండి" అన్నాడు. దానికి రెండవవ్యక్తి "దైవసాక్షి! నేనిలా ఎన్నటికీ వదలను" అన్నాడు. అంతలో దైవప్రవక్త (స) బయటికి వెళ్ళి "ఎవరతను, దేవుని మీద ప్రమాణం చేసిమరీ తాను పుణ్యకార్యం చేయనంటున్నాడు?" అనడిగారు. అప్పుడు వారిలో ఒకతను (ముందుకొచ్చి) "దైవప్రవక్తా! ఆ వ్యక్తిని నేనే. నేనితనికి (ఇప్పుడు) తాను కోరిన వస్తువుని తానే ఉంచుకోవచ్చని అనుమతిస్తున్నాను" అని అన్నాడు. (బుఖారి, ముస్లిం)

హ్రజత్ కాబ్ బిన్ మాలిక్ (రజి) కథనం: నేనొక రోజు మసీదులో అబ్దుల్లా బిన్ అబీహద్ర్ (రజి)ని నాకివ్వాల్సిన బాకీ ఇవ్వమని నిలదీశాను. మేమిద్దరం (అరచుకుంటూ) బిగ్గరగా మాట్లాడుకోసాగాము. మా అరుపులు ఆ సమయంలో ఇంట్లోనే ఉన్న దైవ ప్రవక్త (సల్లం)కు విన్పించాయి. ఆయన వెంటనే తమ కుటీరం తెరను పైకెత్తి "కాబ్!" అని పిలిచారు. నేను "వస్తున్నానండీ" అన్నాను. అప్పుడాయన "నీకు రావలసిన బాకీలో కొంచెం తగ్గించుకో" అని చెప్పారు. చేత్తో సైగచేస్తూ "సగం తగ్గించుకో" అన్నారు. నేను "మీరెలా ఆజ్ఞాపిస్తే అలా చేస్తాను" అన్నాను. "మరయితే లే, వెంటనే అతని హక్కు నెరవేర్చు" అని ఆదేశించారు దైవప్రవక్త (సల్లం) (బుఖారి)

దైవప్రవక్త (స) ఇలా చెప్పారు: "మీ పూర్వీకులలో ఒకతని ఆత్మకు దైవదూతలు వచ్చి స్వాగతం చెప్పారు. "(నిన్నింతగా స్వాగతించాలని ఆజ్ఞ జారీకావడానికి కారణం) నువ్వేమైనా (విశేష)పుణ్యకార్యం చేశావా?" అని అడిగారు దైవదూతలు. దానికా వ్యక్తి "నేను నా సేవకుల్ని పేద (రుణగ్రస్తు)లకు తగిన వ్యవధి నివ్వమని, ధనికుల్ని క్షమించమని ఆజ్ఞాపించేవాడ్ని" అనిఅన్నాడు. అందువల్లనే దేవుడు ఆ ధనికుడి తప్పులు క్షమించి అతని పట్ల మంచిగా వ్యవహరించమని దైవదూతలను ఆజ్ఞాపించాడు." (ముస్లిం)

దైవప్రవక్త (స) హితోక్తి: "ఒక వర్తకుడు ప్రజలకు అప్పులిస్తుండే వాడు. వారిలో ఎవరైనా పేదవాడున్నాడని తెలిస్తే 'అతడ్ని క్షమించండి. అప్పుతీర్చమని వత్తిడి చేయకండి. దీనివల్ల దేవుడు మన పాపాలు క్షమించవచ్చు" అని సేవకులతో అంటుండేవాడు. ఆ సత్కార్యం కారణంగానే దేవుడు అతడి పాపాలు, పొరపాట్లు క్షమించాడు." (బుఖారి)



## అప్పు తీర్చనివాడి పర్యవసానం

మరొక హదీసు ప్రకారం ఒకతను దైవప్రవక్త (స) దగ్గరకొచ్చి, తాను దైవమార్గంలో జిహాద్ చేయడానికి వెళ్తున్నానని చెప్పి, తన పాపమన్నింపు కోసం ప్రార్థన చేయమని అంటాడు. దైవప్రవక్త (స) సరే అంటారు. ఆ వ్యక్తి వెళ్ళిపోవడానికి వెను తిరుగుతాడు. అప్పుడు దైవప్రవక్త (స) అతడ్ని పిలిచి "నీ పాపాలన్నీ క్షమించబడతాయి కాని, అప్పుకు సంబంధించిన పాపం మటుకు క్షమించబడదు" అని అన్నారు. (ముస్లిం)

"ఎవరైనా ప్రజలనుండి అప్పు తీసుకొని దాన్ని తీర్చే ఉద్దేశ్యముంటే దేవుడు అతని ద్వారా ఆ అప్పు తీర్చుతాడు. ప్రజల నుండి అప్పు తీసుకొని (దాన్ని తీర్చకుండా) నష్టం కలిగించే ఉద్దేశ్యం పెట్టుకుంటే అలాంటివాడికి దేవుడు నష్టం కలిగిస్తాడు." (బుఖారి)

"విశ్వాసి (మోమిన్) చనిపోయిన తరువాత అతని ఆత్మ కేవలం అప్పు కారణంగా (ఆకాశానికి ఎక్కలేక) ఒక చోట ఆగిపోతుంది. అప్పు తీర్చనిదే అతని ఆత్మ స్వర్గానికి చేరుకోలేదు. (తిర్మిజి, ఇబ్నెమాజ, బైహఖి)

హ్రజత్ అనస్ (రజి) కథనం: మేము ఓరోజు దైవప్రవక్త (స) దగ్గర కూర్చొనిఉంటే కొందరు ప్రజలు ఒక జనాజా (శవం) తెచ్చి జనాజానమాజ్ (శవప్రార్థన) చేయమన్నారు. అప్పుడు దైవప్రవక్త (స) వారిని "ఈ మృతుని మీద రుణభారం ఏదైనా ఉందా?" అని అడిగారు. వారు ఉంది అన్నారు. దైవప్రవక్త (స) ఈమాట విని ఇలా అన్నారు:

"ఇలాంటి మనిషి కోసం జనాజానమాజ్ చేయడం వల్ల లాభం ఏమిటీ? ఇతని ఆత్మ సమాధిలో ఆగిపోయింది. ఆకాశం వైపు అధిరోహించలేదు. మీలో ఎవరైనా ఇతని అప్పు తీరుస్తామని హామీ ఇస్తే నేనితని జనాజా నమాజ్ చేస్తాను. లేకపోతే చేయలేను. ఎవరైనా ఇతని అప్పు తీర్చడంగాని, లేదా తీరుస్తామని హామీనివ్వడంగాని జరిగినప్పుడే నేను చేసే జనాజానమాజ్ వల్ల ఇతనికి ప్రయోజనం చేకూరుతుంది." (తబ్రాని)

హ్రజత్ ఇబ్నెఅబ్బాస్ (రజి) కథనం: దైవప్రవక్త (స) ఒకరోజు ప్రభాతవేళ ప్రార్థన చేసిన తర్వాత "ఇక్కడ హుజైల్‌తెగ మనిషి ఎవరైనా ఉన్నాడా? మీ సోదరుడు స్వర్గద్వారం దగ్గర నిరోధించబడ్డాడు, అతను చేసిన అప్పు కారణంగా" అని అన్నారు. (తబ్రాని)

దైవప్రవక్త (స) హితోక్తి: "ఎవరైనా అప్పుతీర్చకుండా చనిపోతే, ఆ అప్పు కారణంగా అతను నిర్బంధానికి గురవుతాడు. తన అసహాయత, ఒంటరితనాలను గురించి దేవుడ్ని వేడుకుంటాడు. అప్పు తీరగానే అతని ఆత్మ గమ్యానికి చేరుకుంటుంది." (తబ్రాని)

హ్రజత్ అబూహురైరా (రజి) కథనం: ఒకతను దైవప్రవక్త (సల్లం) దగ్గరికి వచ్చి పరుషపదజాలంతో తన అప్పు తీర్చమని ఒత్తిడి చేయసాగాడు. ప్రవక్త అనుచరులు ఈ దురుసు మాటలు విని దూషించడానికి (లేదా గద్దించడానికి) ఉపక్రమించారు. అయితే దైవప్రవక్త (స) (వాళ్ళను వారిస్తూ) "అతడ్ని ఏమీ అనకండి, వదిలేయండి. తన సొమ్ము రాబట్టుకోవలసిన మనిషికి ఇలా (కఠినంగా) మాట్లాడే అధికారం ఉంది" అని అన్నారు. ఆ తర్వాత ఆయన "అతను నాకిచ్చిన ఒంటె వయస్సు ఎంతుందో అంతే వయస్సుగల ఒంటెను అతనికిచ్చేయండి" అని అన్నారు. అప్పుడు ప్రవక్త అనుచరులు "దైవప్రవక్తా!

అతని ఒంటెలాంటి ఒంటె లేదు. మన దగ్గర ఉన్నవన్నీ మంచి ఒంటెలే" అన్నారు. దైవప్రవక్త (సల్లం) ఈమాట విని "ఆ మంచి ఒంటే ఇవ్వండతనికి. అప్పు తీర్చడంలో ఉత్తముడే మీలో ఉత్తముడు" అని అన్నారు. (బుఖారి, ముస్లిం)

## వాణిజ్య రుణాలు

ప్రాచీన భాష్యకారులలో 'జహాక్' ఖుర్ఆన్‌లోని "మీరు నిజంగా విశ్వసించిన వారయితే మీకు రావలసిన వడ్డీని వదిలేయండి" (2:278) అనే సూక్తిపై వ్యాఖ్యానిస్తూ "అనాగరిక కాలంలో (అరబ్) ప్రజలు అమ్మకం కొనుగోళ్ళ వ్యవహారంలో ఇచ్చిపుచ్చు కునే వడ్డీ ఇలాంటిదే" అని అన్నారు. (ఇబ్నెజరీర్)

హజ్రత్ ఖతాదా ఆనాటి వ్యాపార పద్ధతిని గురించి ప్రస్తావిస్తూ ఇలా అన్నారు: "ఆనాడు ఒకతను మరొకతనికి సరుకు అమ్ముతున్నప్పుడు దాని ధర చెల్లింపు కోసం ఒక గడువు నిర్ణయిస్తాడు. ఆ గడువులోపు కొన్నవాడు నిర్ణీతధర చెల్లించలేకపోతే అమ్మకందారుడు గడువును మరికొంతకాలం పొడిగించి మొదట్లో నిర్ణయించిన ధరను పెంచుతాడు. ఇదే ఆనాటి అనాగరికుల వ్యాపార విధానం." (ఇబ్నెజరీర్)

ఇది పెట్టుబడిదారుడు వర్తకునికి ముందుగానే నగదురూపంలో ఇచ్చే వాణిజ్యరుణం కాదు. ఇది అమ్మకందారుడు తన సరుకును కొనుగోలుదారునికి అప్పుగా ఇచ్చే పద్ధతి. ఇది నేడు కూడా అనేకదేశాలలో సాగుతోంది. గడువు దాటాక దాన్ని మరికొంత కాలం పొడిగించి ముందుగా నిర్ణయించిన ధరను పెంచడం షరీఅత్ ప్రకారం వడ్డీ కిందికే వస్తుంది.

ఖలీఫా హజ్రత్ ఉమర్ (రజి) పాలనాకాలంలో జరిగిన సంఘటన. ఈజిప్టు గవర్నర్ అబూమూసా అష్అరీ (రజి) ఖలీఫా హజ్రత్ ఉమర్ (రజి) కుమారులు అబ్దుల్లా, ఉబైదుల్లాలకు వ్యాపారం చేసుకోవడానికి ప్రభుత్వ ధనాగారం నుంచి కొంత డబ్బు అప్పుగా ఇచ్చారు. అయితే ఆ తర్వాత హజ్రత్ ఉమర్ (రజి) ఈ రుణాన్ని అభ్యంతరకర మైన విషయంగా పరిగణించి మూలధనంతో పాటు వ్యాపారంలో వచ్చిన లాభమంతా ఇచ్చేయాలని డిమాండ్ చేశారు. చివరికాయన కొందరి సలహాతో ప్రభుత్వంనుంచి తీసు కున్న పైకాన్ని అప్పుకు బదులు వ్యాపారభాగస్వామ్యం (Bussiness partnership)గా పరిగణించి సగం లాభం వసూలు చేశారు. (మువత్తా- కితాబుల్‌ఖిరాజ్)

ప్రాచీనకాలంలో వడ్డీ లేకుండానే వ్యాపార అవసరాల కోసం రుణాలు ఇచ్చే పద్ధతి కూడా ఉండేదని ఓ హదీసుద్వారా తెలుస్తోంది. అందులో దైవప్రవక్త (స) ఇలా అన్నారు:

"పూర్వం ఇస్రాయీల్‌సంతతిలో ఒకతను మరొకతని దగ్గర వ్యాపారం కోసం వేయి దీనార్లు అప్పు తీసుకున్నాడు. అప్పుడతను రుణదాతతో 'ఈ వ్యవహారంలో నాకు, నీకు మధ్య దేవుడే సాక్షి! దేవుడే జామీనుదారుడు" అని అన్నాడు. ఇలా చెప్పి అతను ఓడలో పయనమయ్యాడు. అక్కడ తన వ్యాపార వ్యవహారాలు ముగించుకొని తిరుగు ప్రయాణం కోసం రేవు దగ్గరకు చేరుకున్నాడు. కాని అక్కడ చాలా రోజులదాకా ఎలాంటి నౌకలు దొరకలేదు. ఈలోగా అప్పు గడువు ముగిసిపో వచ్చింది.

"చివరికి ఆ వ్యక్తి ఒక కర్రకు రంధ్రంచేసి ఆ రంధ్రంలో వేయి దీనార్ల (నాణాల)తో పాటు ఒక లేఖ కూడా పెట్టి దాని రెండు చివర్లు మూసివేశాడు. అలా మూసేసిన ఆ



కర్రను సముద్రంలో వదలిపెడ్తూ 'దేవా! నేను నిన్ను సాక్షిగా, పూచీకత్తుగా చేసి ఈ పైకం అతని దగ్గర అప్పుగా తీసుకున్నాను. ఇప్పుడు నీవే దీన్ని అతని దగ్గరకు చేర్చు" అని ప్రార్థించాడు. విధివశాత్తు అటు రుణదాత తన దేశంలో ఓరోజు సముద్ర తీరం మీద కూర్చొని ఉంటే అకస్మాత్తుగా ఆ కర్ర నీటి అలలపై తేలియాడుతూ అతని ముందుకు వచ్చి ఆగిపోయింది. రుణదాత ఆ కర్రను చేతిలోకి తీసుకొని పరిశీలిస్తే అందులో వేయి దీనార్లతో పాటు తన పేర ఒక ఉత్తరం కూడా కన్పించింది.

"కొన్నాళ్ళ తర్వాత రుణగ్రహీత స్వదేశానికి తిరిగొచ్చాడు. అతను అప్పు తీర్చడానికి వేయి దీనార్లు తీసుకొని రుణదాత దగ్గరకు పోయాడు. కాని రుణదాత ఆ డబ్బు తీసుకో వడానికి నిరాకరిస్తూ 'నాడబ్బు నాకు లభించింది చాలు' అన్నాడు." (బుఖారి, నిసాయి)

# 50. కష్టార్జితం-శ్రమజీవులు

కష్టార్జితాన్ని ఇస్లాంలో ఎంతో ప్రశంసించడం జరిగింది. అయితే కష్టార్జితం పెట్టుబడి సంపాదనకు వ్యతిరేకంగా చెప్పిన మాట కాదు. కష్టపడి సంపాదించడం, కూలిపని చేయడం అవమానకరమైన విషయం కాదని చెప్పడమే దీని అంతరార్థం.

దైవప్రవక్త (స) ఇలా చెప్పారు: "వేతనంపై మేకలు కాయకుండా ఉండని ఏ ప్రవక్త నూ దేవుడు ప్రభవింపజేయలేదు." అనుచరులు ఈమాట విని "దైవప్రవక్తా! మరి మీరు కూడా ఈపని చేశారా?" అని అడిగారు. దానికి దైవప్రవక్త (స) "నేను కొన్ని పైసల (వేతనం)పై మక్కావారి పశువులు కాసేవాణ్ని" అని అన్నారు. (బుఖారి)

మరొకసారి ఆయన కష్టార్జితం ఔన్నత్యం గురించి ప్రస్తావిస్తూ "తన చేతులతో కష్టపడి సంపాదించిన ఉపాధి కంటే శ్రేష్ఠమైన ఉపాధి తిన్నవారెవరూ లేరు. దైవప్రవక్త దావూద్ తన చేతులతో పనిచేసి ఉపాధి సంపాదించేవారు" అని అన్నారు. (బుఖారి)

హజ్రత్ ఇబ్నెఉమర్ (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "దేవుడు కష్టపడి ఉపాధి సంపాదించే ముస్లింను ప్రేమిస్తాడు." (తబ్రాని-అల్‌మంజరి)

## కృషితో నాస్తి దుర్భిక్షం

ఏ పనైనా నెరవేరాలంటే దానికోసం ప్రయత్నించాలి. ఎలాంటి ప్రయత్నం చేయకుండా కళ్ళు మూసుకొని జపం చేస్తుంటే కడుపు నిండదు. దాని కోసం తీవ్రంగా ప్రయత్నించాలి. ప్రయత్నం మానవ లక్షణమేకాదు అది అతని విధి కూడా. దైవప్రవక్త (స) ఇలా అన్నారు:

"కృషి చేయండి. కృషి చేయడాన్ని దేవుడు మీకు విధిగా చేశాడు." (అహ్మద్)

"కృషి చేసేవాడికి అతని కృషి ఫలితం తప్పక లభిస్తుంది. కృషిచేసే ప్రతి మనిషికీ ఎంతో కొంత లభిస్తుంది." (అల్ మదీనతుల్ ఇస్లాం)

"దేవుడు తన దాసునికి అతని ధైర్యం, అర్థింపుల ప్రకారమే వస్తువు ప్రసాదిస్తాడు." (హదీస్)

"దేని కోసం మానవుడు పుట్టించబడ్డాడో అది అతనికి తప్పకుండా లభిస్తుంది. కాబట్టి మనిషి తన శక్తిసామర్థ్యాల మేరకు ప్రాపంచిక వస్తువుల్ని కోరుకోవాలి. (అంటే వాటిని పొందడానికి శక్తివంచన లేకుండా కృషి చేయాలి.)- (ఇబ్నెమాజ)

హజ్రత్ రాఫె బిన్ ఖదీజ్ (రజి) ఉల్లేఖనం: ఒకతను దైవప్రవక్త (స) మాట్లాడుతూ "దైవప్రవక్తా! ఉపాధి మార్గాలలో ఏ ఉపాధిమార్గం అన్నిటికంటే శ్రేష్ఠమైనద"ని అడిగాడు. దానికి దైవప్రవక్త (స) ఇలా చెప్పారు- "మనిషి తన చేత్తో చేసే (వృత్తి)పని, నిజాయితీగా చేసే వ్యాపారం (అన్నిటికంటే శ్రేష్ఠమైన ఉపాధిమార్గాలు)." (మిష్కాత్)

"శ్రమ, వృత్తిపనుల ద్వారా ఉపాధి సంపాదించడం మనిషి విధి (ఫర్జెకిఫాయ)."

"స్త్రీ ఇంట్లో ఖాళీగా కూర్చోవడానికి బదులు రాట్నం (నూలు) వడకడం మంచి సంపాదనా కార్యకలాపం." (ఐజా)

"కార్మికుని సంపాదనే అత్యంత శ్రేష్ఠమైన సంపాదన. అయితే అతను తనకు అప్ప గించబడిన పనిని చిత్తశుద్ధితో, తన యజమానిపట్ల శ్రేయోభిలాషతో నిర్వహించాలి." (ముస్నద్అహ్మద్)

"మీరు ఫజర్ నమాజ్ చేసిన తరువాత ఏమరుపాటుకు గురయి ఉపాధి అన్వేషణ గురించి ఆలోచించకుండా పడుకోకండి"; "ఔదార్యం, ఆర్థిక స్థితులే ఇహలోకపు మంచితనం. దైవభీతి పరాయణతే పరలోకపు మంచితనం." (కన్జుల్‌హఖాయఖ్)

"తల్లిదండ్రుల కోసం కష్టపడి పనిచేసే వాడు దైవమార్గంలో పనిచేసే వాడవుతాడు. భార్యాపిల్లల కోసం కష్టపడి పని చేసేవాడు కూడా దైవమార్గంలో పనిచేసే వాడవుతాడు. స్వయంగా తననుతాను దారిద్ర్యం నుండి కాపాడుకోవడానికి శ్రమించే వాడు కూడా దైవమార్గంలో పనిచేసే వాడవుతాడు. అహంకారంతో ఠీవి, దర్పం ప్రదర్శించడానికి పని చేసేవాడు షైతాన్ మార్గంలో పనిచేసే వాడవుతాడు." (బైహఖి, తబ్రాని, సగీర్)

"ఉపాధి కోసం అన్వేషించకుండా, 'దేవుడే నాకు ఉపాధి ప్రసాదిస్తాడు' అంటూ చేతులు ముడుచుకొని కూర్చోవడం మీలో ఎవరికీ శోభించదు. ఉపాధి కోసం కృషి కూడా చేయాలి. ఆకాశం నుండి వెండిబంగారాలు వర్షించవన్న సంగతి మీకు తెలుసు. ప్రళయదినాన మీరు మీ ముఖంపై ముష్టి మచ్చతో రావడం కంటే (ఉపాధి కోసం పని చేయడమే మీకు మంచిది." (అల్ మదీనతు వల్ఇస్లాం)

## శ్రామికుల పట్ల యజమాని ప్రవర్తన

కార్మికుల హక్కుల విషయంలో ఇస్లాం నిర్దేశించిన మౌలిక సూత్రాలు సోషలిజం లో కూడా కానరావు. అందులో మొట్టమొదటి మౌలికసూత్రాన్ని గురించి దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "శ్రామికుని చెమట ఆరకముందే అతనికి రావలసిన వేతనం ఇచ్చేయండి." (ఇబ్నెమాజ)

దైవప్రవక్త (స) దేవుని పలుకుల్ని ఈవిధంగా పేర్కొన్నారు: "ప్రళయదినాన నేను ముగ్గురు మనుషులతో పోట్లాడుతాను. వారిలో ఒకడు- నా పేరుతో ప్రమాణం చేసి దాన్ని ఉల్లంఘించినవాడు. రెండోవాడు- స్వతంత్రుడయిన వ్యక్తిని పట్టుకొని అమ్మి ఆ ధరను తిన్నవాడు. మూడోవాడు- ఒక కూలివాణ్ణి పెట్టుకొని అతని చేత పని చేయించు కొని అతనికివ్వాల్సిన కూలిడబ్బు ఇవ్వకుండా ఎగవేసినవాడు." (బుఖారి-మిష్కాత్)



రెండవ మౌలికసూత్రం క్రిందిఉద్యోగుల పట్ల అధికారుల ప్రవర్తనకు సంబంధిం చిన విషయం. బుఖారి, ముస్లిం గ్రంథాలలో మామూర్ ఇబ్నె సువైద్ ఇలా అన్నారు:

నేనొక సారి హజ్రత్ అబూజర్ గిఫ్ఫారి (రజి)ని, ఆయన సేవకుణ్ణి ఒకే విధమైన దుస్తులు ధరించి ఉండటం చూశాను. ఇలా ఎందుకు చేస్తున్నారని అడిగాను. దాని కాయన ఇలా చెప్పారు: "నేనొక సారి ఒకతను తన బానిసను దూషిస్తుంటే చూశాను. అప్పుడు దైవప్రవక్త (స) ఆగ్రహోదగ్రులయి అతనితో 'వీరు నీ సోదరులే, మానవులే, ఆదం-హవ్వా (అలై)ల సంతతికి చెందినవారే. దేవుడు వీళ్ళను నీ అధీనంలో ఉంచాడు' అన్నారు. తర్వాత ఆయనిలా ఆదేశించారు- "దేవుడు ఒక మనిషిని మరొక మనిషికి అధీనం చేసినప్పుడు ఆ మరోమనిషి తాను తినే తిండే అతనికి పెట్టాలి; తాను ధరించే దుస్తులే ఇవ్వాలి. అతను మోయలేని బరువు అతనిపై మోపకూడదు. ఒకవేళ అంతటి బరువు మోపడం తప్పనిసరైతే ఆ పనిలో తానుకూడా పాల్గొని అతనికి సహకరించాలి."

# 51. వ్యాపార లావాదేవీలు

ప్రజలు తిండి, బట్ట, ఇతర జీవితావసరాలు సమకూర్చుకోవడానికి అన్నిటికంటే గొప్ప సాధనాలు రెండు ఉన్నాయి. 1-వ్యాపారం. 2-వ్యవసాయం. కాని ఈనాడు వ్యవసాయం, పరిశ్రమలు, ఇతర ఉపాధి మార్గాలన్నీ వ్యాపారం అధీనంలోకి వచ్చేశాయి. వ్యాపారం సరైన విధానాలతో నిజాయితీగా సాగకపోతే దేశంలో ఆహార పదార్థాలు, ఇతర జీవితావసరాలు ఎంత పెద్దఎత్తున ఉత్పత్తి అయినా వాటి కొరత ఎల్లప్పుడూ ఉంటూనే ఉంటుంది. అలాగే వాటి ధరలు నానాటికి పెరుగుతూనే ఉంటాయి. వ్యాపారానికున్న ఈ ప్రాముఖ్యం దృష్ట్యానే మహాప్రవక్త ముహమ్మద్ (స) "ప్రజలకు ఉపాధి మార్గాలు పదిలో తొమ్మిది వంతులు వ్యాపారం ద్వారానే లభిస్తాయ"ని అన్నారు.

వర్తకుల ఆలోచనా వైఖరిని, వారి మనస్తత్వాన్ని సరైనగాడిలో పెట్టేందుకు ఇస్లాం వ్యాపారానికి సంబంధించిన అనేక సకారాత్మక, నకారాత్మక సూచనలు చేసింది. ఈ సూచనలు రెండు విధాలుగా ఉన్నాయి. ఒకటి, నీతిపరమైనవి. రెండు, చట్టపరమైనవి. నీతిపరమైనవి అంటే, ఇవి ముస్లిం మతవిశ్వాసాలకు, సాధారణ మానవ విలువలకు వ్యతిరేకమైనవని, అందువల్ల వాటి ఫలితాలు పరలోకంలో చాలా దారుణంగా ఉంటాయని బోధించడం. చట్ట పరమైనవి అంటే, వాటిని ఉల్లంఘిస్తే ఈ ప్రపంచంలో కూడా శిక్ష విధించబడవచ్చు.

వ్యాపార లావాదేవీలలో జరిగే అబద్ధం, వంచన, వాగ్దానభంగం మొదలైన చెడులు సాధారణ నైతిక విలువలకు, ఇస్లామీయ విశ్వాసాలకు వ్యతిరేకమైనవి. వీటికి పరలోకంలో శిక్షలు ఉంటాయి. పదార్థాలలో కల్తీచేయడం, తూనికల్లో కొలతల్లో తగ్గించి ఇవ్వడం లాంటి అక్రమాలు దేశచట్టాల పరిధిలోకి కూడా వస్తాయి. కనుక మనిషి పట్టుబడితే ఈ నేరాలకు పరలోకంలోనే గాకుండా ప్రపంచంలో కూడా శిక్షలు పడతాయి. ఇలాంటి చెడులకు-అక్రమా లకు పాల్పడకుండా, కొనుగోలుదారుని అజ్ఞానాన్ని ఆసరా చేసుకొని హద్దుమీరిన లాభార్జనకు పోకుండా నిజాయితీగా వ్యాపారం చేసే వర్తకుణ్ణి ఇస్లాం ప్రశంసిస్తుంది.

దైవప్రవక్త (స) ఒకతనికి ఒక దీనార్ ఇచ్చి, ఖుర్బానీ పశువు కొని తీసుకురమ్మని చెప్పారు. అతను వెళ్ళి ఒకదీనార్‌తో ఒక పొట్టేలు కొని దాన్ని రెండు దీనార్లకు అమ్మాడు.

తరువాత ఒక దీనార్‌తో ఖుర్బానీ పశువు కొని, మిగిలిన ఒక దీనార్‌తో తిరిగొచ్చి వాటిని దైవప్రవక్త (స) అందజేశాడు. దైవప్రవక్త (స) ఆ దీనార్‌ని దానంచేసి, అతని వ్యాపారంలో శుభం, వృద్ధి కలుగుగాక అని దీవించారు. (తిర్మిజి, అబూదావూద్)

## అబద్ధం, మోసం

"విశ్వాసులారా! మీరు ఒకరి సొమ్మును మరొకరు అన్యాయంగా, అక్రమంగా కాజేయకండి. ఇచ్చిపుచ్చుకోవడాలు జరగవలసిందే. అయితే అవి పరస్పరం ఆమోదంతో జరగాలి. మిమ్మల్ని మీరు హతమార్చుకోకండి. (ఆత్మవంచనకు పాల్పడకండి.) దేవుడు మీపట్ల ఎంతో దయామయుడని గ్రహించండి. ఎవరు అన్యాయం, అక్రమాల ద్వారా ఇలా చేస్తాడో అతడ్ని మేము తప్పనిసరిగా నరకంలో పడవేస్తాము." (ఖుర్‌ఆన్-4:29,30)

సత్యప్రియులకు అసత్యం ఏవిధంగానూ శోభించదు. అసత్యం ఏ వ్యవహారంలోనైనా, ఏ స్థాయిలోనైనా, ఎంత చిన్న విషయంలోనైనా గర్హించదగినదే. అసత్య ప్రమాణం తమకెంతో లాభం చేకూర్చుతుందనుకుంటారు చాలామంది వ్యాపారులు. కాని దానివల్ల జరిగే పరోక్ష నష్టం సంగతి గ్రహించరు. దైవప్రవక్త (స) వ్యాపారస్తుల్ని దృష్టిలో పెట్టుకొని ఇలా అన్నారు:

"(అసత్య)ప్రమాణం చేయడం వల్ల సరుకు అమ్ముడుపోతుంది గాని, వ్యాపారంలోని శుభం మాత్రం తరిగిపోతుంది." (బుఖారి)

హజ్రత్ అబూహురైరా కథనం: దైవప్రవక్త (సల్లం) ప్రవచనం ప్రకారం మూడు రకాల మనుషుల వైపు దేవుడు ప్రళయదినాన దయాభావంతో కన్నెత్తి కూడా చూడడు. వారి పాపాలు క్షమించి వారిని పరిశుద్ధపరచడు. పైగా వారికి తీవ్రమైన (నరక) శిక్ష విధిస్తాడు. వారిలో ఒక కోవకు చెందిన మనిషి అవసరానికి మించిన ప్రయాణసామగ్రి కలిగివున్నా తోటిప్రయాణీకులకు వాటినిచ్చి ఆదుకోవడానికి నిరాకరిస్తాడు. రెండవ మనిషి ప్రాపంచిక స్వలాభాపేక్షతో రాజ్యాధినేతకు మద్దతునిస్తూ ప్రమాణం చేస్తాడు. అయితే ఆ రాజ్యాధినేత ధనమిస్తే సంతోషిస్తాడు, ఇవ్వకపోతే ముఖం మాడ్చుకుంటాడు. మూడవ మనిషి సాయంత్రంవేళ తన వ్యాపార సరుకుతో నిలబడి "సాటిలేని మేటి అయిన దేవుని సాక్షిగా చెబుతున్నాను. నేనీ సరుకును ఇంత ధరకు కొన్నాను" అని (అబద్ధం) చెబుతాడు. ప్రజలు అతను నిజమే చెబుతున్నాడని భావిస్తారు.

దైవప్రవక్త (సల్లం) ఆ తరువాత ఖుర్‌ఆన్‌లోని ఈ సూక్తి పఠిస్తారు: "కొందరు తమ వాగ్దానాలను, దేవుని విషయంలో చేసిన ప్రమాణాలను అతిస్వల్ప మూల్యానికి అమ్ముకుంటారు. ఇలాంటి (అమ్ముడుబోయిన)వారికి పరలోకంలో ఎలాంటి (సుకృతఫలం) వాటా లభించదు. వారితో దేవుడు మాట్లాడడు. చివరికి ప్రళయదినాన వారివైపు కన్నెత్తి కూడా చూడడు. వారిని పరిశుద్ధపరిచే ప్రసక్తి అంతకన్నా లేదు. పైగా వారికి (నరకంలో) వ్యధాభరితమైన శిక్ష పడుతుంది." (ఖుర్‌ఆన్-3:77) (బుఖారి, ముస్లిం)

హజ్రత్ హుజైఫా (రజి) కథనం: దైవప్రవక్త (స) మాకు రెండు హదీసులు (భవిష్యత్ ప్రకటనలు) విన్పించారు. ఇందులో ఒకటి నిజమవడం నేను చూశాను. రెండవదాని కోసం ఎదురుచూస్తున్నాను. దైవప్రవక్త (స) దీన్ని ప్రస్తావిస్తూ "నిజాయితీ, విశ్వసనీయ



తలు ప్రజల హృదయాల్లో వేళ్ళూని ఉన్నాయి. ఆ తరువాత ప్రజలు వాటిని గురించి ఖుర్‌ఆన్, హదీసుల ద్వారా వివరంగా తెలుసుకున్నారు" అని అన్నారు.

ప్రజల హృదయాల నుండి నిజాయితీ, విశ్వసనీయతలు క్షీణించిపోవడం గురించి ఆయనిలా అన్నారు: "ఒక మనిషి కాస్సేపు పడుకుంటాడు. అప్పుడతని హృదయం నుండి నిజాయితీ తీసివేయబడుతుంది. గాయం నయమైన తర్వాత దానిగుర్తు మిగిలిపోయినట్లు అతని నిజాయితీకి సంబంధించిన ఓ చిన్న గుర్తు మాత్రమే ఉండిపోతుంది.

తర్వాత ఆ వ్యక్తి మరికాస్సేపు పడుకుంటాడు. మిగిలిన ఆ కాస్త నిజాయితీ కూడా తీసివేయబడుతుంది. నిప్పుకణం కాలు మీద పడినప్పుడు బొబ్బి వచ్చి చర్మం ఎలా ఉబ్బెత్తుగా కన్పిస్తుందో అలా ఉంటుంది మిగిలిన ఈ నిజాయితీకి సంబంధించిన గుర్తు. బొబ్బి లోపల ఏమీ ఉండదు (పల్చటి రసి తప్ప). ఈ నిజాయితీ స్థితి కూడా అంతే. ప్రజలు అమ్మకం, కొనుగోళ్ళయితే చేస్తారు. కాని ఏ ఒక్కరూ నిజాయితీతో వ్యవహరించరు. చివరికి 'ఫలానా తెగ మనిషి ఎంతో నిజాయితీపరుడు, ఫలానా వ్యక్తి ఎంతో మంచివాడు, ఎంతో బుద్ధిమంతుడు' అని ప్రశంసిస్తారు. కాని అతనిలో అణుమాత్రం నిజాయితీ కూడా ఉండదు."

ఒకప్పుడు నేను ఎవరి నుండి కొనుగోలు చేస్తున్నానన్న విషయం పట్టించుకునేవాడ్ని కాను. ఆ వ్యక్తి ముస్లిం అయివుంటే అతని ధర్మమయిన ఇస్లాం నాకు రావలసిన హక్కు అతని నుండి ఇప్పిస్తుంది. ఒకవేళ ఆ వ్యక్తి క్రైస్తవుడయి ఉంటే అతని అధికారి ఆహక్కు నాకు ఇప్పించేవాడు. ఈనాడు పరిస్థితి మారిపోయింది. ఇప్పుడు నేను ఫలానా వ్యక్తులతో మాత్రమే అమ్మకం, కొనుగోళ్ళు చేస్తున్నాను.

(సహీబుఖారి: 81వ ప్రకరణం, 35వ అధ్యాయం; సహీముస్లిం)

## సరకుల కల్తీ, నాణ్యతలు

దైవప్రవక్త (సల్లం) ఓసారి (మార్కెట్‌లో నడుస్తూ) ఒక ధాన్యపు దుకాణం దగ్గరికొచ్చి ధాన్యపు కుప్పలో చేయి దూర్చారు. చూస్తే చేతికి తడి అంటుకుంది. అది చూసి ఆయన "ధాన్యపు వర్తకుడా! ఏమిటిది?" అని అడిగారు. దానికా వర్తకుడు "దైవప్రవక్తా! ఇది వర్షానికి తడిసింది" అని అన్నాడు. అప్పుడు దైవప్రవక్త (సల్లం) "మరి ఆ ధాన్యాన్ని పైన ఎందుకు పెట్టలేదు? పైన పెట్టివుంటే జనం చూసేవారుకదా! మోసం చేసేవాడు నావాడు కాడు" అని అన్నారు. (ముస్లిం-మిష్కాత్)

పై హదీస్‌ని బట్టి దైవప్రవక్త (స) మార్కెట్‌లో వ్యాపారవ్యవహారాలు ఎలా సాగుతున్నాయో తెలుసుకోవడానికి తనిఖీ కూడా చేస్తుండేవారని తెలుస్తోంది.

దైవప్రవక్త (సల్లం) ప్రవచనం:- "అమ్ముతున్న సరుకులోని లోపాలను కొనుగోలుదారులకు బహిర్గతం చేసి మరీ అమ్మడం (ధర్మయుక్తమైన పద్ధతి. అది) తప్ప మరే పద్ధతినయినా అనుసరించి సరుకు విక్రయించడం ఎట్టి పరిస్థితిలోనూ ధర్మసమ్మతం కాదు. అంతేకాదు, ఆ లోపం తెలిసివున్న వ్యక్తి దాన్ని బహిర్గతం చేయకుండా మౌనం వహించడం కూడా ధర్మసమ్మతం కాదు". (ముస్తఖా)

## బ్లాక్‌మార్కెట్

అక్రమ లాభార్జన పద్ధతుల్లో బ్లాక్ మార్కెట్ ఒకటి. ఈ రోజుల్లో చిన్నా పెద్దా వ్యాపారస్తులంతా ఈ జాడ్యానికి లోనయి వినియోగదారుల రక్తాన్ని పీల్చివేస్తున్నారు. వీరు అత్యధిక లాభాలు గడించాలన్న ఆత్యాశతో నిత్యావసర వస్తువుల్ని నెలల తరబడి ఆపి అలా కృతిమ కరువు సృష్టించి విపరీతమైన ధరలతో వాటిని క్రమంగా మార్కెట్‌లోకి ప్రవేశపెడ్తారు.

అక్రమ వ్యాపారస్తుల్ని గురించి దైవప్రవక్త (స) చేసిన ఈ హితోక్తులు చూడండి:

"అక్రమ నిల్వలు చేసేవాడు పాపాత్ముడవుతాడు." (ముస్లిం-మిష్కాత్)

"అక్రమనిల్వలు చేసేవాడు దుర్మార్గుడు. దేవుడు ధరలు తగ్గిస్తే అతను సంతోషిస్తాడు, ధరలు పెంచితే తెగ బాధపడిపోతాడు." (బైహఖీ-మిష్కాత్)

"నిత్యావసర వస్తువుల్ని నిలువచెయ్యక సమయానికి బజారుకు తెచ్చి అమ్మే వ్యక్తి దైవానుగ్రహానికి అర్హుడవుతాడు. దేవుడు అతనికి పుష్కలంగా ఉపాధి ప్రసాదిస్తాడు. దీనికి భిన్నంగా (సరుకులు) నిలువచేసే వ్యక్తి దైవశాపానికి గురవుతాడు". (ఇబ్నెమాజ)

"ఒక మనిషి నలభై రోజులదాకా ధాన్యాన్ని (బజారుకు తరలించకుండా) ఆపి వుంచి ధరలు పెరిగేందుకు ఎదురుచూస్తున్నాడంటే అతను దేవుని పట్ల విసిగెత్తి పోయాడన్న మాట. దేవుడు కూడా అతని పట్ల విసిగెత్తిపోతాడు." (మిష్కాత్)

"ఎవరైనా నలభై రోజులదాకా ధాన్యం (మార్కెట్‌లోకి తీసుకురాకుండా) ఆపి వుంచిన తరువాత దానికి సంబంధించిన దానం చేస్తే ఆ దానం అతనికి పాప పరిహారంగా మారదు." (మిష్కాత్ షరీఫ్)

రైతుగాని, రైతు దగ్గర కొన్నవాడుగాని ధాన్యాన్ని నెలల తరబడి నిల్వఉంచకుండా వీలైనంత త్వరగా మార్కెట్‌కు తరలించాలి. దొంగవ్యాపారులు దేశంలో కరువుకాటకాలు వస్తే సంబరపడిపోతారు. ఆహార పదార్థాలను ఆకాశాన్నంటే ధరలకు అమ్ముకోవడానికి వారికి మంచి అవకాశం లభిస్తుంది. గోదాముల్లో నుంచి సరుకుల్ని కొద్దికొద్దిగా విడుదలచేస్తూ విపరీతమైన లాభాలు గడిస్తారు. ఇలాంటి చీడపురుగుల మూలంగా సమాజంలో అప్పుడప్పుడు ఆకలి చావులు కూడా సంభవిస్తూ ఉండటం మనకు తెలిసిన విషయమే.

ఒకసారి మదీనాలో తీవ్రమైన క్షామం ఏర్పడింది. ఈ దుస్థితి చూసి ఖలీఫా హజ్రత్ ఉస్మాన్ (రజి) ధాన్యాగారాలను తెరిపించి, ధాన్యం కావలసినవాళ్ళంతా వచ్చి పట్టుకెళ్ళ వచ్చని ప్రకటన గావించారు. ఆవిధంగా ప్రభుత్వ ధాన్యాగారాలు ఖాళీ అయ్యాయి.

అలాగే మదీనాలో మరోసారి కరువు ఏర్పడే సూచనలు కన్పించగానే ప్రజలు ఆందోళన చెంది ఆహార ధాన్యాల అన్వేషణకై అనేక ఇబ్బందులు పడుతూ ఊరూరు తిరగసాగారు. ఇమామ్ జైనుల్ ఆబిదీన్ (రజి) ప్రజల అగచాట్లను గమనించి తన సొంత ధాన్యాగారాన్ని నిర్వహించే వ్యక్తిని పిలిపించారు. అతనితో, ప్రస్తుతం మన దగ్గర ఎంత ధాన్యం ఉందని అడిగారు. కరువు పరిస్థితిని వాడుకొని అధిక లాభాలు ఆర్జించడానికే ఇమామ్‌గారు ఇలా అడుగుతున్నారని భావించి ఆ వ్యక్తి పరమ సంతోషంతో మన దగ్గర ధాన్యం చాలా ఉందండీ అని చెప్పాడు.



వెంటనే ఇమామ్ "అయితే ఆ ధాన్యం మొత్తాన్ని మార్కెట్‌కు తరలించు" అని ఆదేశించారు. కోశాధికారి విస్తుబోయి "అయ్యా! ఈ ధాన్యం కాస్తా అయిపోయాక మన పరిస్థితి ఏమిటీ?" అని అడిగాడు. దానికి ఇమామ్ "ప్రజలందరి పరిస్థితి ఏమిటో అదే మన పరిస్థితి కూడా. వారు కూడా మన సోదరులే కదా!" అని అన్నారు.

## తూనికలు, కొలతలు

ఆర్థిక వ్యవహారాలకు సంబంధించిన ఖుర్‌ఆన్, హదీసు ఆజ్ఞలను పాటించడం కూడా దైవారాధన క్రిందికే వస్తుంది. శారీరక ఆరాధనల విషయంలో ఏవైనా పొరపాట్లు జరిగితే దేవుడు క్షమిస్తాడని ఆశించగలం. కాని అర్థ సంబంధమైన ఆరాధనల విషయంలో జరిగిన పాపాలను సంబంధిత వ్యక్తులు క్షమించనంతవరకూ దేవుడు కూడా క్షమించడు.

"సరైన పాత్రతో కొలచి ఇవ్వండి. తూచవలసి వస్తే సరైన త్రాసుతో తూచివ్వండి. ఇదే సరైన పద్ధతి. ఫలితం రీత్యా కూడా ఈ పద్ధతే మంచిది". (ఖుర్‌ఆన్-17:35)

"ఆయనే త్రాసును (న్యాయాన్ని) కూడా సృష్టించాడు. కనుక మీరు త్రాసు సమతూకాన్ని చెడగొట్టకండి. న్యాయంగా, సవ్యంగా తూచివ్వండి". (ఖుర్‌ఆన్-55:8,9)

"తూకం తగ్గించేవారికి వినాశం తప్పదు. వారు ప్రజల నుండి (సరుకు) తీసుకునేటప్పుడు పూర్తిగా తూచి లేక కొలచి తీసుకుంటారు; ఇచ్చేటప్పుడు తగ్గించి ఇస్తారు. ఒక భయంకర దినాన తాము లేపి ప్రవేశపెట్టబడతామని వారికి తెలియదా? ఆరోజు యావత్తు మానవులు విశ్వప్రభువు ముందు (తలలు వంచి) నిలబడతారు." (ఖుర్‌ఆన్-83:1-6)

"నీతిమంతుడయిన వ్యాపారి అంతిమ (ప్రళయ) దినాన దైవప్రవక్తల, సత్యవంతుల, అమరగతుల సహచర్యంలో ఉంటాడు". (తిర్మిజి)

## తప్పుడు వ్యాపారపద్ధతులు

పూర్వం అరేబియాలో కొన్ని తప్పుడు వ్యాపారపద్ధతులు ఇలా ఉండేవి:

✦ హజ్రత్ అబూహురైరా (రజి) కథనం: "వస్తువుని చేత్తో తాకడం ద్వారా, చేతిలోకి తీసుకొని విసరేయడం ద్వారా వ్యాపార నిర్ధారణ చేయడాన్ని దైవప్రవక్త (సల్లం) నిషేధించారు." (బుఖారి, ముస్లిం)

ఈ హదీసు మూలభాషలోని "ములామస, మునాబజ" అనే పదాలు వ్యాపారనిర్ధారణ కోసం పూర్వం అరేబియాలో వాడేవారు. (1) నీవు నా వస్త్రాన్ని తాకితే బేరం కుదిరినట్లే అని అమ్మకందారుడు కొనుగోలుదారుడితో అంటాడు. దీన్ని "ములామస" వ్యాపారం అంటారు. ఈ వ్యాపారంలో కొనుగోలుదారుడు బట్టనాణ్యతను పరిశీలించడానికి వీల్లేదు. (2) రెండో విధానంలో అమ్మకందారుడు ఈ వస్త్రాన్ని వంద రూపాయలకు నీవైపు విసురుతున్నాను అంటాడు. కొనుగోలుదారుడు దానికి అంగీకరించి ఆ వస్త్రాన్ని పట్టుకుంటాడు. దాంతో బేరం అయినట్లే. దీన్ని "మునాబజ" అంటారు. ఈ రెండు వ్యాపార విధానాలు నిషేధించబడ్డాయి.

✦ హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ కథనం: ఒంటె (ఈనక ముందే దాని) కడుపులో ఉన్న పిల్లను అమ్మి వేయడాన్ని నిషేధించారు. ఇలాంటి వ్యాపారం (ఇస్లాంకు పూర్వం) అజ్ఞానకాలంలో ఉండేది. ఆనాడు ఒక మనిషి (ఉనికిలోకే రాని) ఒంటెను

కొనేముందు అమ్మేవాడితో ఒప్పందం చేసుకుంటూ “సూడిఒంటె కడుపులో ఉన్న పిల్ల (బయటికొచ్చి) పెరిగి పెద్దదయి ఈనాలి” అని మాట్లాడుకుంటాడు. (బుఖారి).

✦ దైవప్రవక్త (స) ప్రవచనం: “మేక పొదుగులో పాలను ఆపి ఉంచకూడదు. ఒకవేళ ఎవరైనా (మోసపోయి) అలాంటి పశువును కొన్న పక్షంలో, పాలు పితుక్కున్న తరువాత ఆ మేకను ఇష్టమయితే ఉంచుకోవడానికి, ఇష్టంలేకపోతే ఒక “సా” ఎత్తు ఖర్జూర పండ్లిచ్చి వాపసు చేయడానికి అతనికి హక్కుంది.” (బుఖారి)

✦ దైవప్రవక్త (స) ప్రవచనం: “ఒక ముస్లిం తోటి ముస్లిం సోదరుడు బేరం చేస్తున్నప్పుడు అదే వస్తువు కోసం పోటాపోటీగా బేరం చేయకూడదు.” (బుఖారి)

## దళారీ వ్యవస్థ

ఏ వస్తువునైనా కొని స్వాధీనంలోకి తీసుకోనంతవరకు దాన్ని ఇతరులకు అమ్మడం నిషిద్ధం. “మీ దగ్గరలేని వస్తువును అమ్మకూడద”ని దైవప్రవక్త (స) ఆదేశించారు. (తిర్మిజి) అలాగే “మీరేదైనా వస్తువును కొన్నప్పుడు దాన్ని మీ అధీనంలోకి తీసుకోక ముందే ఇతరులకు అమ్మకూడద”ని కూడా దైవప్రవక్త (స) ఆదేశించారు. (అహ్మద్)

“ప్రజలు మార్కెట్‌లో ధాన్యపు రాసులను నిల్చున్నపళంగా కొని అక్కడికక్కడే అమ్మేస్తారు. కాని దైవప్రవక్త (సల్లం) ధాన్యపు రాసిని కొన్నచోటు నుంచి వేరే చోటుకు తరలించనంత వరకు దాన్ని ఇతరులకు అమ్మకూడదని సెలవిచ్చారు.” (బుఖారి)

ఈ పద్ధతి అనేక చోట్ల ఈనాడు కూడా సాగుతోంది. ఒకతను ఒకచోట సరుకును లక్ష రూపాయలకు “బుక్” చేసుకొని దాన్ని మరొకతనికి బయానా (అడ్వాన్స్) తీసుకొని లక్షన్నర రూపాయలకు అమ్ముతాడనుకోండి. లేదా మొదటి వ్యక్తి సరుకును పదివేలో ఇరవై వేలో బయానా మాత్రమే ఇచ్చి కొన్న తరువాత దాన్ని లాభం మీద మరొకతనికి అమ్ముతాడు. అలాంటి పరిస్థితిలో మొదటి వ్యక్తి అమ్మకందారునికి, కొనుగోలుదారునికి మధ్య దళారీగా వ్యవహరించినట్లు అవుతుంది. ఈ పద్ధతినే ఇస్లాం నిషేధించింది.

హజ్రత్ అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఇలా తెలిపారు: “మీరు అమ్మకంలో అత్యధిక లాభాలు గడించే ఉద్దేశ్యంతో పట్టణం బయటికి వెళ్ళి వర్తక బిడారాలను ముందుగా కలుసుకోకండి. పట్టణవాసి బయట నుండి సరుకులతో వచ్చే గ్రామీణుని సరుకు అమ్మకూడదు.”

ఈ హదీసుని ఉల్లేఖించినవారు హజ్రత్ ఇబ్నెఅబ్బాస్ (రజి)ని “పట్టణవాసి గ్రామీణుని కొరకు సరుకు అమ్మడం అంటే ఏమిటీ?” అని అడిగారు. దానికి ఆయన “అంటే దళారిగా మారకూడదని అర్థం” అని చెప్పారు. (బుఖారి, ముస్లిం)

“పట్టణం వెలుపల వాణిజ్య బృందాలకు ఎదురేగి సరుకు (మార్కెట్‌కు చేరుకోక ముందే) కొనడాన్ని దైవప్రవక్త (సల్లం) వ్యతిరేకించారు.” (బుఖారి)

హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి) కథనం: “ప్రజలు పెద్ద మార్కెట్‌లో సరుకు కొని అక్కడే ఒకచోట వాటిని అమ్మేవారు. దైవప్రవక్త (స) సరుకును అదేచోట అమ్మ కూడదని, దాన్ని తీసికెళ్ళి వేరేచోట అమ్ముకోవాలని ఆదేశించారు.” (బుఖారి)



దైవప్రవక్త (సల్లం) ప్రవచనం: “ధాన్యం లేక అపరాలను కొన్న తరువాత వాటిని స్వాధీనం చేసుకోనంత వరకు మరొకరికి అమ్మకూడదు.” (బుఖారి, ముస్లిం)

హజ్రత్ అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి) కథనం: “ధాన్యం, అపరాలను (అమ్మకం దారుడి నుండి) స్వాధీనం చేసుకోక ముందే (మరొకరికి) అమ్మకూడదని దైవప్రవక్త (సల్లం) ఆంక్ష విధించారు.” హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) ఉద్దేశ్యంలో ఈ ఆజ్ఞ ఇలాంటి వస్తువులకు మాత్రమేగాని అన్ని వస్తువులకు వర్తించదు. (బుఖారి)

ఇమాం షాఫయి (రహ్మ) ప్రకారం ఒక్క ధాన్యం, అపరాలే కాదు స్థిర, చర వస్తువులన్నీ స్వాధీనంలోకి తీసుకోకముందే అమ్మడం ధర్మసమ్మతం కాదు. అయితే ఇమాం అబూహనీఫా (రహ్మ) ప్రకారం భూమి, ఇల్లు, తోట మొదలైన స్థిరాస్తులు స్వాధీనం చేసుకోవడానికి ముందే అమ్మడం ధర్మసమ్మతమే. ఎక్కువమంది ధర్మవేత్తలు ఈ అభిప్రాయాన్నే సమర్థించారు.

ఈనాడు పెద్దపెద్ద కంపెనీలు కమీషన్ ప్రాతిపదికపై ఏజెంట్లను నియమించి వ్యాపారం నడుపుతున్నాయి. ఈ పద్ధతి కొంతవరకు నయమే. కాని ఏజెంట్లు దళారులై సంస్థ నుంచి కమీషన్‌తో పాటు కొనుగోలుదారుల నుంచి కూడా దోచుకుంటున్నారు. హైదరాబాద్‌లో నేనొక సాఫ్ట్‌వేర్ (అప్‌గ్రేడ్ వర్షన్) కొనడానికి ఓకంపెనీ ఏజెంటుని పిలిపించి ధర అడిగితే 7000/- రూపాయలని చెప్పాడు. నేనిదివరకే ఒరిజినల్ వర్షన్ 7000/- రూపాయలకు కొనివున్నాను. ఇప్పుడితను అప్‌గ్రేడ్ వర్షన్‌కు కూడా ఏడువేలు అడగటంతో నాకు అనుమానం వచ్చి అతడ్ని పంపివేశాను. తరువాత నేను నేరుగా ఆ సాఫ్ట్‌వేర్ కంపెనీకి వెళ్ళి అడిగితే రూ 2,500/-లు మాత్రమేనని చెప్పారు. నేనందులో బేరం చేసి రూ 2,200/-లకే కొన్నాను.

## వస్తుమార్పిడి విధానం

వస్తుమార్పిడి విధానం ఈనాడు కూడా కొనసాగుతోంది. అయితే ఈవిధానం వల్ల రెండు పక్షాలలో ఎవరికీ నష్టం జరగకుండా ఉన్నప్పుడే దీన్ని అనుసరించాలి. దానికోసం మార్పిడికి సంబంధించిన రెండు వస్తువులు ఒకేవిలువ లేదా ధర కలిగివుండాలి. రెండు వస్తువులకు ఒకేవిలువ లేనప్పుడు అంచనాలతో వస్తుమార్పిడి చేసుకోవడం సరైనపద్ధతి కాదు. అప్పుడు మనిషి తన దగ్గరుండే ఆ వస్తువును నగదు పైకానికి అమ్మి ఆ పైకంతో ఇతర వస్తువుల్ని కొనుక్కోవాలి. ఇస్లాం ఈ చివరి పద్ధతిని అనుసరించడానికే అనుమతినిస్తుంది.

దైవప్రవక్త (స) ఖైబర్‌ప్రాంతపు శిస్తు వసూలుచేయడానికి ఒకతడ్ని నియమించారు. అతను వెళ్ళి (శిస్తు క్రింద) మేలుజాతి ఖర్జూరపండ్లు తెచ్చాడు. అప్పుడు దైవప్రవక్త (స) “ఖైబర్‌లోని ఖర్జూరపండ్లన్నీ ఇలాగే ఉంటాయా?” అని ప్రశ్నించారు. దానికా వ్యక్తి “లేదు దైవప్రవక్తా! దైవసాక్షి! అన్నీ ఇలా ఉండవు. మేము ఇలాంటి ఒక ‘సా’ఎత్తు (మేలు రకం) ఖర్జూరపండ్లను రెండు ‘సా’ల ఎత్తు రెండవ రకం ఖర్జూరపండ్లకు బదులుగా కొంటాము. లేదా ఇలాంటి రెండు ‘సా’ల ఎత్తు ఖర్జూరపండ్లను మూడు ‘సా’ల ఎత్తు నాసిరకం ఖర్జూరపండ్లకు బదులుగా కొంటాము” అని అన్నాడు.

దైవప్రవక్త (స) ఈమాట విని “అలా చేయకండి. మొదట (నాసిరకం) ఖర్జూర పండ్లన్నీ దిర్హంలకు (నగదుకు) అమ్మేయండి. తర్వాత ఆ దిర్హంలతో (నగదుపైకంతో) మేలురకం ఖర్జూరపండ్లు కొనండి” అని చెప్పారు. (బుఖారి, ముస్లిం)

హ్జ్రత్ అబూసయీద్ ఖుద్రీ (రజి) కథనం: ఓరోజు బిలాల్ (రజి) దైవప్రవక్త (స) సన్నిధికి బర్నీ (అత్యంతమేలు)జాతికి చెందిన ఖర్జూరపండ్లను తెచ్చారు. దైవప్రవక్త (స) వాటిని చూసి "ఇవి ఎక్కడ్నుంచి తెచ్చావు?" అని అడిగారు. దానికి బిలాల్ (రజి) "మా దగ్గర మొదట్లో కొన్ని నాసిరకం ఖర్జూరపండ్లు ఉండేవి. మేము వాటిలో రెండు 'సా'ల ఎత్తు ఇచ్చి ఈ పండ్లు ఒక 'సా' ఎత్తు చొప్పున తీసుకున్నాము మీకు సమర్పించడానికి" అని అన్నారు.

దైవప్రవక్త (స) ఈమాట విని "చాలా విచారకరమైన విషయం. ఇది పూర్తిగా వడ్డీ క్రిందికి వస్తుంది. అలా చేయకండి. ఇలాంటి (వస్తుమార్పిడి) వ్యాపారం చేయాలనుకు న్నప్పుడు ముందుగా మీ దగ్గరుండే ఖర్జూరపండ్లను నగదుకు అమ్మేయండి. తరువాత ఆ పైకంతో మరో రకం ఖర్జూరపండ్లు కొనుక్కోండి" అని అన్నారు. (ముస్లిం)

హ్జ్రత్ అబూసయీద్ ఖుద్రీ (రజి) కథనం: మాకు అన్ని రకాలు కలిసిన నాసి రకం ఖర్జూరపండ్లు లభించేవి. మేము అలాంటి రెండు 'సా'ల ఎత్తు ఖర్జూరపండ్లకు బదులుగా అమ్మేవాళ్ళము. కాని దైవప్రవక్త (స) (ఇలాంటి వస్తుమార్పిడి వ్యాపారాన్ని నిషేధిస్తూ) "ఒక 'సా' ఎత్తు ఖర్జూరపండ్లకు బదులు రెండు 'సా'ల ఎత్తు ఖర్జూరపండ్లను గాని, ఒక దిర్హానికి బదులుగా రెండు దిర్హంలు గాని ఏదీ అమ్మడం ధర్మసమ్మతం కాదు" అని చెప్పారు. (బుఖారి)

## వ్యాపార ఒప్పందాలు

దైవప్రవక్త (స) ఇలా ఆదేశించారు: "కొనేవారు, అమ్మేవారు ఇద్దరూ వ్యాపారం జరుగుతున్న చోట ఉన్నంతవరకు వారికి వ్యాపార వ్యవహారాన్ని కొనసాగించడానికి లేక రద్దు చేసుకోవడానికి హక్కుంది. అయితే హక్కుకు సంబంధించిన షరతు ఏదైనా పెడితే ఆ షరతును బట్టి ఆ హక్కు ఉంటుంది." (బుఖారి, ముస్లిం)

దైవప్రవక్త (స) ప్రవచనం: "కొన్నవాడు, అమ్మినవాడు వ్యాపార వ్యవహారం జరిగిన చోట కలిసిఉన్నంతవరకు వారిరువురికి వ్యాపార వ్యవహారం ఖాయపరచడానికి లేదా రద్దుపరచడానికి హక్కుంటుంది. లేదా దాన్ని ఖాయపరచడానికి లేక రద్దు పరచడానికి ఒకరికొరకు అధికారం ఇచ్చుకోవచ్చు. ఆ తర్వాత వారిద్దరు వ్యాపారవ్యవహారాన్ని అమలు పరచడానికి అంగీకరిస్తే అప్పుడు కూడా వ్యవహారం ఖాయమవుతుంది. ఒకవేళ వారిద్దరు వ్యాపార వ్యవహారం జరుపుకున్న తరువాత పరస్పరం విడిపోతూ ఇద్దరిలో ఏఒక్కరూ సరుకును మానుకునే విషయం ప్రస్తావించకపోతే అప్పుడు కూడా వ్యాపార వ్యవహారం ఖాయమయిపోతుంది. (ఇక దాన్ని రద్దుచేసే హక్కుండదు.)" (బుఖారి)

దైవప్రవక్త (స) ప్రవచనం: "కొనేవారు, అమ్మేవారు విడిపోనంతవరకు వారిద్దరికి (వ్యాపార వ్యవహారాన్ని రద్దు చేయడానికి లేదా ఖాయపరచడానికి) హక్కుంటుంది. వ్యాపార వ్యవహారంలో వారిద్దరు ఏ విషయాన్నీ దాచకుండా నిజం చెప్పి పరస్పరం స్పష్టంగా మసలుకుంటే అలాంటి వ్యాపారంలో ఇద్దరికీ శుభం కల్గుతుంది. అబద్ధమాడి పరస్పం (సరుకు) లోపాలను దాచినట్లయితే అందులో ఎవరికీ ఎలాంటి శుభం చేకూరదు." (బుఖారి, ముస్లిం)



హ్జ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి) కథనం: వ్యాపారంలో తరచుగా మోసానికి గురవుతున్న ఒక వ్యక్తిని గురించి దైవప్రవక్త (సల్లం) ముందు ప్రస్తావన వచ్చింది. అప్పుడు దైవప్రవక్త (స) "నీవు ఏదైనా కొనేటప్పుడుగాని లేదా అమ్మేటప్పుడుగాని మోసం చేయకూడదని ముందే చెప్పేయాలి" అని అన్నారు. (బుఖారి)

హ్జ్రత్ అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి) కథనం: దైవప్రవక్త (స) మదీనా వచ్చిన తర్వాత (చూస్తే) మదీనాపౌరులు రెండు మూడేండ్ల అడ్వాన్సు చెల్లింపు ప్రాతిపదికపై వ్యాపారం చేస్తుండేవారు. అప్పుడు దైవప్రవక్త (స) "ఏదైనాసరుకు విషయంలో అడ్వాన్సు చెల్లింపు ప్రాతిపదికపై వ్యాపారం చేయదలచుకుంటే ఆ సరుకు బరువు, కొలత, పరిమా ణాలతో పాటు గడువు కూడా నిర్ణయమవ్వాలి" అని అన్నారు. (బుఖారి, ముస్లిం)

## వ్యాపార భాగస్వామ్యం

"కలసిమెలసి పనిచేసేవాళ్ళు సాధారణంగా పరస్పరం అన్యాయానికి పాల్పడతారు. అయితే సత్యాన్ని విశ్వసించి సత్కార్యాలు చేసేవారు మాత్రం అలా చేయరు. అలాంటి నిజాయితీపరులు బహుకొద్ది మంది మాత్రమే ఉంటారు." (ఖుర్ఆన్–38:24)

దైవప్రవక్త (స) దేవుని మాటలను ఇలా తెలిపారు: "ఇద్దరు భాగస్వాములు కలసి ఏదైనాపని చేస్తున్నప్పుడు వారిద్దరు పరస్పరం నమ్మకద్రోహానికి, మోసానికి పాల్పడకుండా నిజాయితీగా వ్యవహరిస్తున్నంతవరకూ నేను వారితో ఉంటాను. (నేను వారికి సహాయం చేస్తూ ఉంటాను.) ఒకవేళ వారు నమ్మకద్రోహానికి పాల్పడటం మొదలుపెడితే మాత్రం నేను వారికి సహాయం చేయడం ఆపేస్తాను." (మిష్కాత్)

ఖైబర్‌యుద్ధంలో జరిగిన ఒప్పంద ప్రకారం ముస్లింల యాజమాన్యంలోకి వచ్చిన యూదుల సేద్యభూములను సేద్యం చేసి అర్ధపంట ముస్లింలకు ఇచ్చే షరతుపై వాటిని ఖైబర్ యూదుల అధీనంలోనే ఇవ్వడం జరిగింది. మరుసటి సంవత్సరం పంటలు పండిన తరువాత దైవప్రవక్త (స) పంట వసూలుచేసి తీసుకురావడానికి హ్జ్రత్ అబ్దుల్లా బిన్ రవాహా (రజి)ను ఖైబర్‌కు పంపించారు.

ఆయన వెళ్ళి యూదులతో "మీరు పంచుతారా లేక నన్ను పంచమంటారా?" అని అడిగారు. దానికి వారు మీరే పంచండని అన్నారు. అప్పుడాయన మొత్తం పంటను రెండు భాగాలుగా చేసి "వీటిలో మీరు కోరుకున్న భాగం తీసుకోండి" అని చెప్పారు. యూదులు ఈ న్యాయవైఖరి చూసి "ఈ న్యాయ వైఖరి కారణంగానే భూమ్యాకాశాలు నిలకడగా ఉన్నాయి. (లేకుంటే ఎప్పుడో ప్రళయం వచ్చిపడేది.)" అన్నారు. (హదీస్)

## పండ్లు, పంటల వ్యాపారం

హ్జ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి) కథనం: "పండ్లు వాడేందుకు యోగ్యమైనవని స్పష్టం కానంతవరకు వాటిని అమ్మకూడదని దైవప్రవక్త (సల్లం) వారించారు. ఆయన కొనేవాడిని కూడా వారించారు." (బుఖారి, ముస్లిం)

పండ్లు కోయనివ్వకుండా చెట్లకే ఉండనివ్వాలని షరతుపెట్టి వ్యాపారం చేయకూడదు. వ్యాపారం జరిగిన తరువాత అవి చీడపట్టి చెడిపోవచ్చు లేదా మరేదైనా కారణం వల్ల నష్టం

కలగవచ్చు. అప్పుడు అమ్మకందారుడు తన సోదరుని డబ్బు అప్పనంగా ఎగరేసుకున్నవాడవుతాడు. అలాగే ఎలాంటి షరతు లేకుండా అమ్మడం కూడా ధర్మసమ్మతం కాదు.

సహెల్ బిన్ అబూహష్మా (రజి) ఉల్లేఖనం: ఎండు ఖర్జూర పండ్లకు బదులు చెట్ల మీదున్న పండ్లు అమ్మకూడదని దైవప్రవక్త (సల్లం) వారించారు. అయితే చెట్ల మీదుండే పండ్లు పక్వానికి వచ్చిన సంగతి అంచనా వేసి అమ్మవచ్చని అన్నారు. (మిష్కాత్)

హజ్రత్ జాబిర్ బిన్ అబ్దుల్లా (రజి) కథనం: "పండ్లు బాగాఎదిగి పంటకు రానంత వరకూ వాటిని అమ్మకూడదని దైవప్రవక్త (స) వారించారు. అలాగే ఆ పండ్లను అరాయా (నగదు చేతిలోలేని నిరుపేద కొనుగోలుదారుల) విషయంలో తప్ప దిర్హం, దీనార్‌లకు (నగదుకు) మాత్రమే అమ్మాలని ఆయన (స) ఆదేశించారు." (బుఖారి)

హజ్రత్ జైద్ బిన్ సాబిత్ (రజి) కథనం: "నగదు డబ్బు చేతిలోలేని నిరుపేద అమ్మకందారులు తమ (తోటలోని పచ్చి) ఖర్జూరపండ్లను ఎండు ఖర్జూరపండ్లకు బదులు అమ్ముకోవచ్చని దైవప్రవక్త (స) అనుమతించారు." (బుఖారి, ముస్లిం)

హజ్రత్ అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి) కథనం: ఖర్జూర పండ్లు తినడానికి యోగ్యమవనంత వరకు లేదా బరువయినవి కానంతవరకు వాటిని అమ్మకూడదని దైవప్రవక్త (స) వారించారు. అప్పుడొకతను "బరువయినవంటే ఏమిటని అడిగితే "నిల్వ చేయడానికి వీలైనవి (బాగా పండినవి) అని అర్థం" అని చెప్పారు ఆయన. (బుఖారి)

హజ్రత్ అనస్ బిన్ మాలిక్ (రజి) కథనం: పండ్ల మీద రంగు స్పష్టంగా వ్యక్తం కానంతవరకు వాటిని అమ్మకూడదని దైవప్రవక్త (స) ఆదేశించారు. అప్పుడు ఒకతను "రంగు స్పష్టంగా వ్యక్తమవడం అంటే ఏమిటీ?" అని అడిగాడు. దానికి దైవప్రవక్త (స) "పండి దానిపై ఎరుపుదనం రానంతవరకు" అని చెప్పారు. ఆ తరువాత ఆయన "కాస్త మీరే ఆలోచించండి. (కాపుకు రాకముందే లావాదేవీలు జరిగిన పక్షంలో) ఒకవేళ దేవుడు పండ్లను ఆపిఉంచితే (అంటే పంటనష్టం జరిగేతే) అమ్మకందారుడు తన సోదరుని పైకం ఏ వస్తువుకు బదులుగా తీసుకుంటాడు?" అని అన్నారు. (బుఖారి)

## సేద్యభూములు కౌలుకు ఇవ్వడం

హజ్రత్ జాబిర్ బిన్ అబ్దుల్లా (రజి) కథనం: మాలో కొందరి దగ్గర బీడుభూములు వృథాగా పడివున్నాయి. అలాంటి భూములను వారు అర్ధ పంట, పావుపంట, లేదా మూడోవంతు పంట షరతుపై పాలికివ్వాలని భావించారు. అప్పుడు దైవప్రవక్త (సల్లం) ఇలా బోధించారు: "భూమి యజమాని అందులో స్వయంగా సేద్యం చేయాలి లేదా తోటి ముస్లిం సోదరునికి ఎలాంటి ప్రతిఫలం ఆశించకుండా సేద్యం చేసుకోవడానికి ఇచ్చేయాలి. ఇలా చేయకపోతే ఆ భూమిని అలాగే పడి ఉండనివ్వాలి." (బుఖారి)

దైవప్రవక్త (సల్లం) ప్రవచనం: "ఎవరి దగ్గరయినా భూమి ఉంటే అతనా భూమిలో స్వయంగా సేద్యం చేసుకోవాలి లేదా తోటి ముస్లిం సోదరునికెవరికైనా దాన్ని ఎలాంటి ప్రతిఫలం ఆశించకుండా సేద్యం చేసుకోవడానికి ఇచ్చేయాలి. అలా చేయకపోతే దాన్ని అలాగే ఆపిఉంచాలి." (బుఖారి)



హజ్రత్ జహీర్ బిన్ రాఫె (రజి) కథనం: "దైవప్రవక్త (స) మమ్మల్ని మాకు ప్రయోజనం చేకూర్చే ఒక పని నుండి వారించారు." (ఈ హదీసు ఉల్లేఖించిన రాఫె బిన్ ఖుదైజ్ మాట్లాడుతూ) "దైవప్రవక్త (స) చెప్పింది వాస్తవం, సత్యంతో కూడినది. ఇంతకూ అదేమిటీ?" అని అడిగాను నేను.

దానికి జహీర్ (రజి) సమాధానమిస్తూ "దైవప్రవక్త (స) నన్ను పిలిచి 'నీవు నీ సేద్యభూముల విషయంలో ఎలా చేస్తున్నావు?' అని అడిగారు. నేను 'అద్దెకు ఇస్తున్నాను లేదా నాల్గవ భాగం పంటకై పాలికిస్తున్నాను లేదా కొన్ని వసఖ్‌ల ఎత్తు ఖర్జూరపండ్లు, గోధుములకు బదులుగా ఇస్తున్నాను' అని చెప్పాను. అప్పుడు దైవప్రవక్త (స) "అలా చేయకు. నువ్వు స్వయంగా సేద్యంచెయ్యి లేదా (ప్రతిఫలం తీసుకోకుండా) ఇతరులకు సేద్యం చేసుకోవడానికి ఇచ్చేయ్యి, లేదా దాన్ని అలాగే పడిఉండనివ్వు" అని అన్నారు. హజ్రత్ జహీర్ బిన్ రాఫె (రజి) మాట్లాడుతూ "నేను మీ ఆజ్ఞ విన్నాను, దానికి కట్టుబడి ఉంటాను" అని అన్నాను. (ముస్లిం)

ఇవి పేదముస్లింలను ఉద్ధరించడానికి ఇవ్వబడిన ప్రాథమిక హితవులు. ఆ తర్వాత సేద్యభూమిని కౌలుకు లేక పాలికిచ్చే అనుమతి లభించింది.

హజ్రత్ అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి) కథనం: "దైవప్రవక్త (సల్లం) వ్యవసాయ భూమిని పాలికివ్వకూడదని మమ్మల్ని వారించలేదు. నిర్ణీత పైకంతో భూమిని అద్దెకు ఇవ్వడం కంటే ఎలాంటి ప్రతిఫలం తీసుకోకుండా దాన్ని తోటి ముస్లిం సోదరునికి ఉచితంగా ఇవ్వడం ఎంతో మంచిదని మాత్రమే ఆయన అన్నారు." (బుఖారి)

## ఇస్లామిక్ మార్కెట్

దైవప్రవక్త (సల్లం) మక్కా నుండి మదీనాకు వలస వచ్చినప్పుడు మదీనాలోని ఆర్థిక, వాణిజ్య లావాదేవీలన్నీ యూదుల స్వాధీనంలో ఉండేవి. యూదులు వాటిని తమకిష్టమైన రీతిలో నిర్వహిస్తూ మితిమీరిన లాభాలు గడిస్తుండేవారు. ఆనాడు మదీనాలోని ఒకేఒక ముఖ్యమైన వాణిజ్య కేంద్రం యూదుల వాడైన బనూఖైనుఖాలో ఉండేది. వారీ వ్యాపార కేంద్రంపై గుత్తాధిపత్యం వహించి దగా, మోసం, కల్తీ, బ్లాక్‌మార్కెటింగ్ మొదలైన అవినీతి చర్యలన్నీ యధేచ్ఛంగా సాగిస్తూ ప్రజలను దోచుకునేవారు.

దైవప్రవక్త (స) ఈ అన్యాయం, అక్రమాలు చూసిన తర్వాత ఎలాంటి నియంత్రణలు లేకుండా విచ్చలవిడిగా సాగుతున్న ఈ ఆర్థిక దోపిడీ నుంచి ప్రజల్ని కాపాడేందుకు వేరే మార్కెట్‌ను నెలకొల్పాలని నిశ్చయించారు. వెంటనే ఆయన తన ముఖ్య అనుచరులతో సంప్రదించి బనూఖైనుఖాలోని యూదుల మార్కెట్ దగ్గర్లోనే మరొక మార్కెట్‌ని నెలకొల్పారు. మార్కెట్ కోసం నిర్దేశించిన ప్రదేశంలో ఆయన డేరాతో కూడిన ఒక శిబిరాన్ని వేయించారు. ఇది మార్కెట్ ఉనికిని తెలియజేసే చిహ్నం. ఆరోజు నుంచి ప్రజలు ఈ శిబిరం చుట్టూచేరి సరుకులు అమ్మకం, కొనుగోళ్ళు నిర్వహించసాగారు.

ఈ కొత్త మార్కెట్ నెలకొనడంతో ఆర్థిక రంగం మీద యూదులకున్న గుత్తాధి పత్యం క్రమంగా తగ్గిపోవడం ప్రారంభించింది. పైగా ఇక్కడ వ్యాపారస్తులు అమ్మకం, కొనుగోళ్ళలో నైతిక సూత్రాలు పాటిస్తున్నందు వల్ల ప్రజలు యూదుల మార్కెట్‌ని వదిలేసి ఇస్లామిక్ మార్కెట్ వైపే అమితంగా ఆకర్షితులవసాగారు.

ఈ మార్పు చూసి యూద వ్యాపారస్తులు ఆగ్రహోదగ్రులయ్యారు. దైవప్రవక్త (సల్లం) నెలకొల్పిన ఈ కొత్త మార్కెట్‌ని అంతమొందించడానికి సంకల్పించుకున్నారు. ఇస్లాంకు బద్ధవిరోధి అయిన కాబ్ బిన్ అష్రఫ్ అనే యూదనాయకుడు మార్కెటింగ్ కోసం దైవప్రవక్త (స) వేయించిన శిబిరాన్ని పీకివేశాడు. దైవప్రవక్త (స) అతని ఓర్వలేనితనం, దుశ్చర్యల్ని సహించారు. ప్రస్తుత పరిస్థితుల్లో అతడ్ని శిక్షించడం వల్లగాని, అతని నుండి నష్టపరిహారం వసూలు చేయడం వల్లగాని ప్రయోజనం ఉండదని భావించారు. ఆయన ప్రజల్లో ఒక ప్రకటన చేస్తూ "నేనీ మార్కెట్‌ని అతనిలో మరింత కోపం రగల్చ గలిగేటటువంటి (కీలక) ప్రదేశానికి తరలిస్తాను" అని అన్నారు. ఆ తర్వాత దైవప్రవక్త (స) మదీనాలో ఒక విశాలమైన బహిరంగ ప్రదేశాన్ని ఎంపికచేసి "ఇకనుంచి ఇదీ మన మార్కెట్. ఇది చాలా విశాలమైన స్థలం. రాళ్ళతో సరిహద్దుగోడలు కూడా నిర్మించనవసరం లేదు" అని చెప్పారు.

ఇదే ఇస్లామీయ వాణిజ్యకేంద్రం. దీని వ్యాపార పద్ధతులు, సూత్రాలు, నిబంధనలన్నీ యూదుల వర్తకకేంద్రం విధానాలకు పూర్తిభిన్నంగా ఉండేవి. ఇదే ఇస్లామిక్ ఎకానామిక్ మార్కెట్. ఇక్కడ మోసం, కల్తీ, దోపిడీ, బ్లాక్‌మార్కెట్ వంటి అక్రమాలేవీ జరిగేవి కావు. ఈ కారణంగా ఇది కొనుగోలుదారులను విపరీతంగా ఆకట్టుకునేది. ఇలా స్వచ్ఛమైన లావాదేవీల కారణంగా ఈ మార్కెట్ అనతికాలంలోనే వినుతికెక్కి అనూహ్యమైన ప్రగతి సాధించింది.

ఇక్కడ ప్రతి వస్తువుకూ వేర్వేరు స్థలాలు కేటాయించబడ్డాయి. ఒంటెల కోసం ఒకస్థలం, గొర్రెలు-మేకల కోసం ఒకస్థలం, ధాన్యం కోసం ఒకస్థలం, పండ్ల కోసం ఒకస్థలం- ఇలా వేర్వేరు అంగళ్ళు వెలిశాయి. ఈ మార్కెట్‌ని దైవప్రవక్తే (స) పర్యవేక్షిస్తుండేవారు. ఆయన మార్కెట్ పరిస్థితుల్ని, ధరవరల్ని సమీక్షిస్తుండేవారు. అప్పుడప్పుడు ఆయన మార్కెట్‌ప్రాంతాన్ని పర్యటించి అక్కడి స్థితిగతుల్ని గురించి తెలుసుకునేవారు. నీతినిజాయితీ సూత్రాలకు వ్యతిరేకంగా ఏవైనా అక్రమాలు, అవకతవకలు జరుగుతున్నట్లు తన దృష్టికి వస్తే తక్షణమే ఆయన సంబంధితవర్తకుల్ని మందలించేవారు. ఆయన మార్కెట్‌లో వ్యాపారస్తుల్ని ఉద్దేశించి "మోసం చేసేవారు మాలోని వారుకాదు" అని మూడుసార్లు నొక్కి చెప్పేవారు.

వ్యాపార వ్యవహారాల్లో కూడా నమ్రతను, మృదు వైఖరిని పాటించాలని, నీతి నిజాయితీలతో వ్యవహరించాలని ఆయన ఇలా బోధించేవారు:

"కొనుగోలులో, అమ్మకంలో, ఇచ్చిన అప్పును తిరిగి రాబట్టడంలో నెమ్మదిని, నమ్రతను, మంచి నడవడికను ప్రదర్శించే వ్యక్తిని దైవం కరుణించుగాక." (బుఖారి); "నీతిమంతుడైన వ్యాపారి ప్రళయదినాన దైవప్రవక్తల, సత్యవంతుల, అమరగతుల సహచర్యంలో ఉంటాడు". (తిర్మిజి)

అసత్యప్రమాణం చేసి తన సరకును అమ్ముకునే మనిషి వైపు దేవుడు ప్రళయ దినాన కన్నెత్తి కూడా చూడడని దైవప్రవక్త (స) వర్తకులకు హితోపదేశం చేస్తుండేవారు. ఆయన ఒకసారి వ్యాపారస్తుల్ని సంబోధిస్తూ "సరకును అమ్మడానికి మాటిమాటికి ఒట్లు వేసుకోవడం మానుకోండి. ఇది వృద్ధి పరిచేదిగా కన్పించినా చివరికి నష్టమే కలగ జేస్తుంది. పైగా శుభాన్ని దూరం చేస్తుంది" అని హెచ్చరించారు. (ముస్లిం)

"నిత్యావసర వస్తువుల్ని నిలువచెయ్యక సమయానికి బజారుకు తెచ్చి అమ్మే వ్యక్తి దైవానుగ్రహానికి అర్హుడవుతాడు. దేవుడు అతనికి పుష్కలంగా ఉపాధి ప్రసాదిస్తాడు. దీనికి



భిన్నంగా (సరుకులు) నిలువచేసే వ్యక్తి దైవశాపానికి గురవుతాడు"; "అక్రమ నిల్వలు చేసేవాడు పరమపాపిష్ఠి." (ఇబ్నెమాజ)

హజ్రత్ రిఫాఅ (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ప్రవచనం: "వ్యాపారంలో దైవభీతి పరాయణత, నిజాయితీలతో మసలుకుంటూ (కొనుగోలుదారుని) హక్కు పూర్తిగా నెరవేర్చిన వ్యాపారులు తప్ప మిగిలిన (అక్రమ) వ్యాపారులందరూ పునరుత్థాన దినాన హషర్ మైదానంలో పచ్చితిరుగుబోతులుగా ప్రవేశపెట్టబడతారు." (తిర్మిజి)

హజ్రత్ అబూగర్జా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (స) ఓసారి వ్యాపారస్థులను సంబోధిస్తూ ఇలా అన్నారు: "వ్యాపారస్థులారా! సరుకులు అమ్మడంలో మీరు ఎన్నో పనికిమాలిన మాటలు పలికే, అసత్య ప్రమాణాలు చేసే అవకాశం ఉంటుంది. అంచేత మీరు మీ పొరపాట్లకు పరిహారంగా దానం చేస్తూవుండండి." (అబూదావూద్)

# 52. వారసత్వపు ఆస్తి పంపకం

ఇస్లాం ఆర్థికవ్యవస్థలో జకాత్‌తర్వాత వారసత్వపు ఆస్తిపంపిణీకి ఎంతోప్రాముఖ్యం ఇచ్చింది. ఆస్తిపంపిణీ విద్య ప్రతిముస్లిం తాను నేర్చుకోవడమేగాకుండా ఇతరులకు కూడా నేర్పాలని దైవప్రవక్త (స) తాకీదుచేశారు. కనుక ప్రతిముస్లిం సామాజిక బాధ్యతలు, ఆస్తి పంపకం, ఇతర ఆర్థిక విషయాలకు సంబంధించిన ఇస్లాం బోధనలను గురించి కూడా తెలుసుకొని ఉండాలి. అజ్ఞానం మనిషిని దైవాగ్రహం నుండి తప్పించజాలదు.

దైవప్రవక్త (స) ఈ విషయాన్ని ప్రస్తావిస్తూ "మీ విధులేమిటో తెలుసుకోండి. అంటే మీరు ఆస్తిపంపకం పద్ధతుల్ని నేర్చుకోండి. ఇతరులక్కూడా నేర్పండి. ఆస్తిపంపకానికి సంబంధించిన జ్ఞానం సగం జ్ఞానంతో సమానం" అని అన్నారు. (ఇబ్నెమాజ)

ఈ హదీసులో ఆస్తిపంపిణీ జ్ఞానాన్ని మొత్తం ఇస్లామీయజ్ఞానంలో సగం జ్ఞానమని చెప్ప బడింది. కాని ఈ జ్ఞానాన్నే నేటి ముస్లింలు మరచిపోయారు. లేదా దానికి తగిన ప్రాముఖ్యం ఇవ్వడం లేదు. దీన్ని గురించి దైవప్రవక్త (స) ఇలా తెలిపారు:

"ఆస్తి పంపకం గురించిన జ్ఞానాన్ని ప్రజలు మరచిపోతారు. నా అనుచర సముదా యం (ఉమ్మత్)లో మొట్టమొదట (ఆకాశానికి) ఎత్తుకోబడే విషయం ఇదే." (ఇబ్నెమాజ)

"తల్లిదండ్రులు, ఇతర బంధువులు వదలి వెళ్ళిన ఆస్తి కొద్దిగా వున్నా, ఎక్కువగా వున్నా అందులో పురుషులకూ వాటా ఉంది; స్త్రీలకూ వాటా ఉంది. ఇవి (దైవ) నిర్ణీత వాటాలు. (వాటిని తగ్గించడానికి గాని, పెంచడానికి గాని ఎవరికీ అధికారం లేదు.) ఆస్తి పంపకం జరుగుతున్న సమయంలో వారసులుకాని (నిరుపేద) బంధువులు, అనాథలు, అగత్యపరులు ఎవరయినా వస్తే వారికి కూడా మీరు ఎంతో కొంత ఇచ్చి పంపండి. వారితో మృదువుగా మాట్లాడండి." (ఖుర్ఆన్-4:7,8)

దూరపు బంధువులలో ఎవరైనా పేదలు, అనాథలుంటే ఆస్తిపరుడు చనిపోయే ముందు తనఆస్తిలో 1/3వంతు లోపుభాగాన్ని అలాంటి అగత్యపరులకు చెందేలా వీలునామా రాయడం మంచిది. ఒకవేళ అతను అలాంటి వీలునామా ఏదీ రాయకుండా చనిపోతే అతని వారసులు

విశాలహృదయంతో తమ వాటాలకు వచ్చిన దానిలో నుంచే ఆ అభాగ్యులకు ఎంతోకొంత ఇచ్చి వారిని సంతోషపెట్టాలని ఈ సూక్తులలో దేవుడు ఆదేశిస్తున్నాడు.

దైవప్రవక్త (సల్లం) ప్రవచనం: "వారసత్వపు ఆస్తిని దాని హక్కుదారులకు (అంటే వారసులకు) ఇచ్చేయండి. అందులో ఏదైనా మిగిలితే దాన్ని పురుషులలో మృతునికి సన్నిహితులైనవారికి ఇవ్వండి." (బుఖారి, ముస్లిం)

"దేవుడు మీకు జీవనాధారంగా చేసిన సంపదను మూఢులకు అప్పగించకండి. అయితే వారికి తిండి, బట్ట సమకూర్చండి. వారికి హితబోధ చేస్తూ ఉండండి." (ఖుర్ఆన్-4:5)

సంపదను సద్వినియోగం చేసే సామర్థ్యంలేని మూఢులకు దాన్ని అప్పగించకూడదని అయితే వారికి కనీస జీవితావసరాలు సమకూర్చాలని, వారికి మంచిని గురించి, ధర్మాన్ని గురించి బోధిస్తూ ఉండాలని ఈ సూక్తిలో సృష్టికర్త మనకు ఉపదేశిస్తున్నాడు.

ఉహుద్ యుద్ధం తర్వాత హజ్రత్ సాద్ బిన్ రుబై (రజి) భార్య తన కుమార్తెలిద్దర్ని వెంటబెట్టుకొని దైవప్రవక్త (స) సన్నిధికి వచ్చి తనకు జరిగిన అన్యాయాన్ని ఏకరువు పెడ్తూ ఇలా అన్నారు: "దైవప్రవక్తా! వీళ్ళిద్దరూ సాద్ కుమార్తెలు. సాద్ మీతోపాటు ఉహుద్ యుద్ధంలో పాల్గొని అమరగతులయ్యారు. తర్వాత ఈ బాలికల పినతండ్రి మా ఆస్తిని స్వాధీనం చేసుకున్నాడు. వీరికోసం ఒక్కపైసా వదలిపెట్ట లేదు. ఇలాంటి స్థితిలో ఈబాలికల్ని ఎవరు పెళ్ళి చేసుకుంటారు?" దీన్నిగురించే పైసూక్తులు అవతరించాయి.

హజ్రత్ అనస్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (స) ఇలా అన్నారు: "ఏ మనిషి తన వారసునికి అతనికి రావలసిన వారసత్వపు ఆస్తివాటా దక్కకుండా చేస్తాడో అలాంటి మనిషికి దేవుడు స్వర్గవారసత్వం లభించకుండా చేస్తాడు." (ఇబ్నెమాజ)

## వీలునామా (మరణ శాసనం)

వీలునామా విషయంలో ముఖ్యంగా మూడు షరతులు గుర్తుంచుకోవాలి. ఈ మూడు షరతుల్లో ఏ ఒక్కటి నెరవేర్చకపోయినా వీలునామా, ఆస్తిపంపకాలు చెల్లవు. ఆ మూడు షరతులు ఇలా ఉన్నాయి:

(1) మృతుని శవసంస్కారం (కఫన్, దఫన్) ఖర్చులు, అప్పులతోపాటు వీలు నామాలో రాయబడిన పైకం తీసేసిన తర్వాతే వారసులు తమ వాటాలు పంచుకోవాలి.

(2) షరీఅత్ (ధర్మశాస్త్రం) సూచించిన వారసులలో ఎవరికైనా వారి నిర్ణీత వాటా కంటే ఎక్కువ సంక్రమించేలా వీలునామా వ్రాయకూడదు.

"దేవుడు ప్రతి హక్కుదారుని హక్కు ఇచ్చేశాడు. కనుక ఏ వారసుని విషయంలో కూడా వీలునామా వ్రాయకూడద"ని దైవప్రవక్త (స) ఆదేశించారు. (బుఖారి)

ఇస్లాం ధర్మశాస్త్రం ప్రకారం ఆస్తిపరుని జీవితకాలంలోనే తన సంతానంలో ఒక కుమారుడు చనిపోవడం జరిగితే అతని కొడుక్కి (అంటే మనవడికి) తాత ఆస్తిలో భాగం లభించదు. అలాంటి అనాథ మనవడికి తాత తన జీవితకాలంలోనే 1/3 వంతు లోపు ఆస్తి వాటా లభించేలా వీలునామా వ్రాయవచ్చు. అలా వ్రాయడం ఎంతో పుణ్యకార్యం కూడా. దైవప్రవక్త (స) బోధించిన ఈ హితోక్తులు చూడండి:



"ఎవరైతే తాను తినే తాగే ఆహారపానీయాలలో అనాథబాలుడ్ని చేర్చుకుంటాడో దేవుడు అతనికి స్వర్గప్రవేశం విధిగా చేస్తాడు." (ఇబ్నెమాజ)

"నేను మీకు ఇద్దరు బలహీనుల హక్కులను గురించి తాకీదు చేస్తున్నాను. ఆ ఇద్దరు బలహీనులు- అనాథ బాలలు, స్త్రీలు." (నసాయి)

కొందరు ఈ నైతిక బోధనలను ఎవరు ఖాతరు చేస్తారని ప్రశ్నిస్తారు. దేవుడ్ని, ఆయన ప్రవక్త (స)ను మనస్ఫూర్తిగా విశ్వసించిన ముస్లిం నమాజు, ఉపవాసాలను పాటించడం లేదా? నమాజు, రోజాలు పాటించని ముస్లిం షరీఅత్‌పరమైన ఏ ఆజ్ఞలనైనా ఖాతరు చేస్తాడని ఆశించలేము. షరీఅత్ చట్టాలను గౌరవించేవారు నైతిక బోధనలను కూడా గౌరవిస్తారు.

(3) మొత్తం ఆస్తిలో 1/3 వంతు లోపుపై మాత్రమే వీలునామా వ్రాయాలి. అంతకు మించిన పైకంపై వీలునామా రాసినా అది చెల్లదు.

హజ్రత్ సాద్ బిన్ అబీవఖాస్ (రజి) కథనం: వీడ్కోలు హజ్‌యాత్ర జరిగిన యేడు నేను జబ్బుతో తీవ్రంగా బాధపడుతుంటే దైవప్రవక్త (స) నన్ను పరామర్శించడానికి వచ్చారు. అప్పుడు నేను ఆయనతో మాట్లాడుతూ "దైవప్రవక్తా! నా జబ్బు బాగా ముదిరి పోయింది. నేను ధనవంతుడ్ని. నాకు ఒక కూతురు తప్ప వారసులు లేరు. ఈ స్థితిలో నేను మూడింట రెండొంతులు ఆస్తిని దానం చేయవచ్చా?" అని అడిగాను. దానికి దైవ ప్రవక్త (స) "లేదు, అర్ధభాగం కూడా చేయకూడదు" అని అన్నారు.

ఆ తరువాత ఆయన ఇలా చెప్పారు: "మూడింట ఒకవంతు ఆస్తి దానం చెయ్యి. నిజానికి ఇది కూడా ఎక్కువే. నీ వారసులు లోకుల ముందు చేతులు జాపి దేబరించేలా వారిని నిరుపేదలుగా, నిరాధారులుగా చేసి వెళ్ళడం కంటే స్థితిపరులుగా చేసి వెళ్ళడం ఎంతో మంచిది. నీవు ఏది ఖర్చుపెట్టినా ఖర్చుపెట్టేటప్పుడు దైవప్రసన్నత పొందడం నీ ఉద్దేశ్యమై వుంటే నీకు దాని పుణ్యఫలం తప్పక లభిస్తుంది. చివరికి నీ భార్య కోసం వెచ్చించే ధనం కూడా నీకు పుణ్యం ఆర్జించి పెడుతుంది."....(బుఖారి, ముస్లిం)

వారసులకు నష్టం కలిగించే వీలునామా వ్రాయకూడదు. వ్రాసినా అది చెల్లదు.

"మృతుడు రాసిన వీలునామా నెరవేర్చి, అప్పులు తీర్చిన తర్వాతనే వారసులకు వాటాలు లభిస్తాయి. అయితే వీలునామా (ఎవరికీ) బాధాకరంగా ఉండరాదు. ఇది దేవుడు జారీచేస్తున్న ఆజ్ఞ. దేవుడు సర్వజ్ఞుడు; ఎంతో మృదుహృదయుడు." (ఖుర్ఆన్-4:12)

దైవప్రవక్త (స) ఈ సూక్తి గురించి ఇలా అన్నారు: "ఎందరో పురుషులు, స్త్రీలు ఇలాంటి వారున్నారు- వారు అరవై ఏళ్ళ వయస్సు వచ్చేదాకా మొత్తం జీవితాన్ని దేవుని విధేయతలో గడుపుతారు. కాని తీరా మరణకాలం ఆసన్నమయినప్పుడు వారు తమ వీలునామా ద్వారా (వారసులకు) నష్టం కలిగిస్తారు. (లేదా అర్హుల కోసం వీలునామాలో ఏదీ రాయరు.) ఈ కారణంగా వారు నరకానికి అర్హులైపోతారు." (అబూదావూద్)

ఇలాంటి వీలునామా చెల్లదు. దాన్ని అమలుపరచాల్సిన అవసరం లేదు. మృతుని ఆస్తిలో మూడువిధాల వారసులకు తప్పనిసరిగా నిర్ణీతవాటాలు లభించాలి. వారు (1) కొడుకులు, కూతుళ్ళు, (2) తల్లిదండ్రులు, (3) భార్యాభర్తల్లో బ్రతికి ఉండేవారు.

దైవప్రవక్త (స) ప్రవచనం: "ఒక ముస్లిం ఏదైనాఆస్తి కలిగివుండి దాని విషయంలో వీలునామా వ్రాయదలచినప్పుడు (వెంటనే వ్రాయాలి.) రెండు రాత్రులు గడచి పోయినా వీలునామా వ్రాయకుండా ఉండటం అతనికి వాంఛనీయం కాదు." (బుఖారి)

వీలునామా విధిగా రాయాలన్న ఆజ్ఞ రద్దయిపోయింది. రాయదలచుకుంటే మొత్తం ఆస్తిలో మూడో వంతుకు మించి రాయకూడదు.

హజ్రత్ తల్హా బిన్ మస్రఫ్ (రజి) కథనం: నేనొక సారి హజ్రత్ అబ్దుల్లా బిన్ అబీఔఫా (రజి) గారిని "దైవప్రవక్త (స) వీలునామా రాశారా?" అని అడిగాను. దానికాయన లేదన్నారు. "మరి ప్రజలకు వీలునామా (ఆజ్ఞ)ను ఎలా విధించారు? ప్రజలకు వీలునామా ఆజ్ఞ ఎలా ఇచ్చారు?" అని అడిగాను నేను. అప్పుడు హజ్రత్ అబ్దుల్లా బిన్ అబీఔఫా (రజి) సమాధానమిస్తూ "ప్రజలు దైవగ్రంథాన్ని గట్టిగా పట్టుకొని దాని ప్రకారం నడచుకోవాలని దైవప్రవక్త (స) ఆదేశించారు కదా!" అని అన్నారు. (బుఖారి)

## ఆస్తి పంపకం

ఏ మనిషయినా చనిపోయిన తరువాతే అతని ఆస్తి వారసుల్లో పంచడం జరగాలి. తండ్రి బ్రతికుండగానే తన వాటా ఇవ్వమని అడిగే అధికారం కొడుక్కు లేదు. స్త్రీపురుషుల ఆస్తివాటాలను గురించి ఖుర్ఆన్ ఇలా ఓ ప్రాథమిక సూత్రం పేర్కొన్నది:

"మీ సంతానం విషయంలో దేవుడు మిమ్మల్ని ఇలా ఆదేశిస్తున్నాడు: ఒక పురుషుని వాటా ఇద్దరు స్త్రీల వాటాలతో సమానం." (ఖుర్ఆన్-4:11)

ఉదా/కు- మృతునికి ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నప్పుడు అతను వదలిపోయిన 7 లక్షల రూపాయల ఆస్తిలో ఒక్కొక్క కుమారునికి 2 లక్షలు చొప్పున ఇద్దరు కుమారులకు 4 లక్షలు, ఒక్కొక్క కుమార్తెకు 1 లక్ష చొప్పున ముగ్గురు కుమార్తెలకు 3 లక్షలు లభిస్తాయి. ఇలా పురుషునికి లభించే వాటాలో స్త్రీకి సగం లభిస్తుంది. ఇది ఆస్తిపంపిణీ విషయంలో ఇస్లాం నిర్దేశిస్తున్న సూత్రప్రాయమైన విషయం.

వారసుల ఆస్తి వాటాలను గురించి ఖుర్ఆన్ ఇలా పేర్కొంటోంది:

"(మృతునికి) ఇద్దరు లేక ఇద్దరికన్నా ఎక్కువమంది కుమార్తెలు ఉంటే, వారికి అతని ఆస్తిలో మూడింట రెండు వంతులు (2/3) లభించాలి. ఒకవేళ ఒకే కుమార్తె ఉంటే, ఆమెకు ఆస్తిలో అర్ధభాగం (1/2) లభించాలి." (4:11)

మిగిలిన 1/3 వంతు లేక 1/2 అర్ధభాగం ఇతర వారసులకు లభిస్తుంది.

"మృతుడు సంతానం కలిగివున్నవాడైతే అతని తల్లిదండ్రులలో ప్రతి ఒక్కరికీ అతని ఆస్తిలో ఆరోవంతు (1/6) లభించాలి." (4:11)

మిగిలిన 2/3 వంతు సంతానానికి లభిస్తుంది. మృతునికి ఒక్క కొడుకుండి ఇతర వారసులెవరూ లేకుంటే, 2/3 వంతు ఆస్తి అంతా అతనికే దక్కుతుంది. ఇతర వారసులుంటే 2/3లో వారివాటాలు పోగా మిగిలినది కొడుక్కు లభిస్తుంది. మృతునికి కొడుక్కు బదులు కూతురుండి ఇతర వారసులెవరూ లేకుంటే, ఆమెకు 1/3 వంతే లభిస్తుంది. మిగతా 1/3 వంతు తండ్రికి వస్తుంది. ఈవిధంగా తండ్రికి మొత్తం 1/6+1/3=1/2 వంతు లభిస్తుంది.



ఇక్కడ మరో విషయం వివరించడం సందర్భోచితంగా ఉంటుంది. మృతునికి ఒక భార్య, తండ్రి, ఒక కొడుకు మాత్రమే ఉన్నప్పుడు తండ్రికి 1/6 వంతు, భార్యకు 1/8 వంతు, కొడుక్కు 1-(1/6+1/8)= 17/24 వంతు ఆస్తి లభిస్తుంది. ఒకవేళ మృతునికి ఒక భార్య, తండ్రి, ఒక కూతురు మాత్రమే ఉన్నప్పుడు భార్యకు 1/8 భాగం, కూతురికి 1/2 భాగం, తండ్రికి 1-(1/8+1/2)=9/24 భాగం లభిస్తుంది.

"అతనికి సంతానం లేకుండా తల్లిదండ్రులే అతని వారసులైతే, తల్లికి మూడింట ఒక భాగం (1/3) ఇవ్వాలి." (ఖుర్ఆన్-4:11)

ఈ సూక్తిలోని మిగిలిన 2/3 భాగం ఇతర వారసులు ఎవరూ లేనప్పుడు తండ్రికి లభిస్తుంది. ఇతర వారసులు ఉంటే 2/3 భాగంలో వారి వాటాలు పోగా మిగిలినది తండ్రికి లభిస్తుంది. అంటే మృతునికి తండ్రి, తల్లి, ఒకభార్య ఉన్నప్పుడు భార్యకు 1/4 వంతు, తల్లికి 1/4 వంతు, తండ్రికి 1-(1/4+1/4)=1/2 వంతు లభిస్తాయన్న మాట.

"మృతునికి అన్నదమ్ములు, అక్కచెల్లెళ్ళు కూడా ఉంటే, తల్లికి ఆరవ భాగం (1/6) రావాలి." (ఖుర్ఆన్-4:11)

ఈ సూక్తిలో పేర్కొనబడిన తల్లి వాటా ఆరవభాగం (1/6) పోగా మిగిలిన 5/6 భాగం తండ్రికి లభిస్తుంది. మృతుని తల్లిదండ్రులు జీవించివుంటే అతని అన్నదమ్ములకు, అక్కచెల్లెళ్ళకు ఎలాంటి వాటాలు లభించవు.

దైవప్రవక్త (స) ప్రవచనం: "మృతునికి తల్లి లేనిపక్షంలో అతని నాయనమ్మకు ఆరవభాగం (1/6) లభిస్తుంది." (అబూదావూద్)

"మృతుడు రాసిపోయిన వీలునామా(లోని విషయాలు) నెరవేర్చడంతో పాటు, అతను చేసిన అప్పులన్నీ తీర్చిన తరువాతనే ఈ వాటాలన్నీ పంచాలి." (ఖుర్ఆన్-4:11)

"మీ తల్లిదండ్రులలో, మీ సంతానంలో ప్రయోజనంరీత్యా ఎవరెక్కువ సన్నిహితులో మీకు తెలియదు. ఇవి దేవుడు నిర్ణయించిన వాటాలు. దేవుడు సమస్త విషయాలు ఎరిగినవాడు, ఎంతో వివేచనాపరుడు." (ఖుర్ఆన్-4:11)

"మీభార్యలకు సంతానం లేనప్పుడు వారు వదలిన ఆస్తిలో మీకు అర్ధభాగం (1/2) లభిస్తుంది. సంతానం ఉంటే, మీకు నాల్గింట ఒక భాగమే (1/4) దక్కుతుంది. అయితే వారు రాసిన వీలునామా నెరవేర్చి, అప్పులన్నీ తీర్చిన తరువాతే ఇలా జరగాలి. మీకు సంతానం లేకపోతే మీరొదలిన ఆస్తిలో మీభార్యలకు నాల్గోవంతు (1/4) వాటా లభిస్తుంది. సంతానం ఉంటే ఎనిమిదోవంతు (1/8) మాత్రమే దక్కుతుంది. మీరు రాసిన వీలునామా నెరవేర్చి, అప్పులన్నీ తీర్చడం జరిగిన తరువాతే ఈ వాటాలు లభిస్తాయి." (4:12)

మృతునికి సంతానం జీవించి ఉన్నప్పుడు అతని మనవళ్ళకు, మనవరాళ్ళకు ఎలాంటి ఆస్తివాటాలు లభించవు. సంతానం జీవించి లేకుండా ఒక భార్య, ఒక మనవడు, ఒక మనవరాలు మాత్రమే ఉన్నప్పుడు భార్యకు 1/4 వంతు లభిస్తుంది. మిగిలిన 3/4 వంతులో మనవడికి, మనవరాలికి 2:1 నిష్పత్తిలో వాటాలు లభిస్తాయి. అంటే 1/2 వంతు మనవడికి, 1/4 వంతు మనవరాలికి లభిస్తాయన్నమాట.

భర్త వ్యాధిగ్రస్త స్థితిలో ఉండి భార్యకు తలాఖ్ ఇచ్చినప్పుడు ఇద్దత్ ముగిసిపోక ముందే చనిపోతే అతనిఆస్తిలో భార్యకు లభించవలసిన వాటా లభిస్తుంది. ఒకవేళ ఆ వ్యాధిగ్రస్త భర్త ఇద్దత్ ముగిసిన తరువాత చనిపోతే అతని ఆస్తి నుండి భార్యకు వాటా లభించదు.

జబ్బు పడివున్న భర్త తన భార్య కోరికపై ఆమెకు విడాకులివ్వడం జరిగితే భర్త ఇద్దత్ ముగిసిపోక ముందు చనిపోయినా లేదా ఇద్దత్ ముగిసిన తర్వాత చనిపోయినా అతని ఆస్తిలో ఆమెకు వాటా లభించదు. ఒకవేళ భార్య తన వ్యాధిగ్రస్త భర్తకు 'ఖులా' ఇచ్చి దాన్ని ఆమోదింపజేసుకున్న తరువాత ఇద్దత్ గడువు ముగిసిపోక ముందే భర్త చనిపోవడం జరిగితే అతని ఆస్తిలో ఆమెకు వాటా లభిస్తుంది. వ్యాధిగ్రస్త భర్త తనభార్యతో 'నీవు ఇంటినుండి వెళ్ళిపోతే నీకు తలాఖ్' అని చెప్పినా భార్య వినకుండా వెళ్ళిపోవడం జరిగితే ఆమెకు భర్త ఆస్తి నుండి వాటా లభించదు.

"పురుషునికి లేక స్త్రీకి సంతానంగాని, తల్లిదండ్రులుగాని లేకుండా ఒక సోదరుడో, ఒక సోదరియో ఉంటే వారిద్దరిలో ఒక్కొక్కరికి ఆరోవంతు (1/6) లభిస్తుంది. సోదరులు, సోదరీలు ఒకరి కంటే ఎక్కువమంది ఉంటే మొత్తం ఆస్తిలో మూడింట ఒకభాగం (1/3) వారికి లభిస్తుంది. అదైనా రాసిన వీలునామా నెరవేర్చి, అప్పులు తీర్చిన తర్వాతనే లభిస్తుంది. అయితే వీలునామా (ఎవరికీ) బాధాకరంగా ఉండరాదు. ఇది దేవుడు జారీచేస్తున్న ఆజ్ఞ. దేవుడు సర్వజ్ఞుడు; ఎంతో మృదుహృదయుడు." (4:12)

మిగిలిన 5/6 లేదా 2/3 భాగం ఇతర వారసులకు లభిస్తుంది. ఇతర వారసులు లేనప్పుడు మిగిలిన ఆస్తిని గురించి వీలునామా రాసే అధికారం మృతునికి ఉంది.

మృతునికి ఒక కూతురు, ఒక భార్య, ఒక సోదరి ఉన్నప్పుడు అతని ఆస్తిలో కూతురికి 1/2 భాగం, భార్యకు 1/8 భాగం, సోదరికి 3/8 భాగం లభిస్తాయి.

అలాగే మృతురాలికి భర్త, తల్లి, ఒక కూతురు, ఒక సోదరుడు, ఒక సోదరి ఉన్న పక్షంలో ఆమె ఆస్తిలో భర్తకు 1/4 భాగం, తల్లికి 1/6 భాగం, కూతురికి 1/2 భాగం, సోదరుడికి 1/18 భాగం, సోదరికి 1/36 భాగం లభిస్తాయి.

"ఇవి దేవుడు నిర్ణయించిన పరిమితులు. దేవునికి, ఆయన ప్రవక్తకు విధేయులై నడచుకునేవారిని దేవుడు సెలయేరులు ప్రవహించే స్వర్గవనాలలో ప్రవేశింపజేస్తాడు. అక్కడే వారు కలకాలం (సుఖంగా) ఉంటారు. ఇదే అసలు ఘనవిజయం. దీనికి భిన్నంగా దేవునికి, ఆయన ప్రవక్తకు అవిధేయులై, దేవుడు నిర్దేశించిన పరిమితుల్ని అతిక్రమించేవారిని ఆయన నరకాగ్నిలో పడవేస్తాడు. అక్కడే వారు ఎల్లకాలం పడిఉంటారు." (ఖుర్ఆన్-4:13,14)

ఇస్లాం ప్రకారం ముస్లిం మేతరునికి వారసుడు కాలేడు. అలాగే ముస్లిమేతరుడు ముస్లింకు వారసుడు కాలేడు. అలాగే పితృహంతకుడు తన తండ్రికి వారసుడు కాలేడు.

పోతే రక్తసంబంధమైన సంతానం మాత్రమే తమ తల్లిదండ్రుల ఆస్తులకు వారసు లవుతారు. సవతికొడుకులు, సవతికుమార్తెలు వారసులు కాలేరు. అలాగే ఎవరికైనా ఇద్దరు భార్యలున్నప్పుడు ఆ ఇద్దరి సంతానానికి తండ్రి ఆస్తి నుండి వాటాలు లభిస్తాయి. అయితే ఆ సంతానంలో ఏ ఒక్కరికీ తమ సవతితల్లి ఆస్తి నుండి వాటా లభించదు. వారికి వారి కన్నతల్లుల ఆస్తుల నుండే వాటాలు లభిస్తాయి.



మృతునికి వారసులు ఎవరూ లేకపోతే అతని అన్నదమ్ములు, అక్కచెల్లెళ్ళు అతని వారసులవుతారు. వారు కూడా లేకపోతే అతని మొత్తంఆస్తి (Unclaimed Property)ని స్వాధీనం చేసుకునే అధికారం ప్రభుత్వానికి ఉంటుంది.

అయితే ఒక హదీసులో దైవప్రవక్త (స) సతీమణి హజ్రత్ ఆయిషా (రజి) ఇలా తెలియజేశారు: "దైవప్రవక్త (స) బానిస ఒకతను స్వేచ్ఛపొందిన తరువాత (కొన్నాళ్ళకు) చనిపోయాడు. అతను కొంత ఆస్తి వదలిపోయాడు. కాని అతనికి సంతానంగాని ఇతర వారసులుగాని ఎవరూ లేరు. అప్పుడు దైవప్రవక్త (స) అతని ఆస్తిని అతని ఊళ్ళోని (పేద)వ్యక్తి ఎవరికైనా ఇచ్చేయమని చెప్పారు." (తిర్మిజి, అబూదావూద్)

"ప్రజలు నిన్ను నిర్వారసుడి విషయంలో దైవాజ్ఞ ఏమిటని అడుగుతున్నారు. వారికి చెప్పు: దేవుడు మీకిలా తన ఆజ్ఞ వినిపిస్తున్నాడు- ఎవరైనా సంతానరహితుడుగా చనిపోతే, అతనికి ఒక సోదరి మాత్రం ఉన్న పక్షంలో అతని ఆస్తిలో ఆమెకు అర్ధభాగం (1/2) లభిస్తుంది. సోదరి సంతానం లేకుండా చనిపోతే ఆమె సోదరుడే ఆమె ఆస్తికి వారసుడవు తాడు. మృతునికి వారసులుగా ఇద్దరు సోదరీలు ఉన్నప్పుడు వారిద్దరికి అతని ఆస్తిలో మూడింట రెండువంతుల ఆస్తి లభిస్తుంది. అనేకమంది అన్నదమ్ములు, అక్కచెల్లెళ్ళు గనక ఉంటే స్త్రీలకు ఒకవాటా, పురుషులకు దానికి రెట్టింపువాటా లభిస్తుంది." (ఖుర్ఆన్-4:176)

## దత్తస్వీకారం నిషిద్ధం

ఇస్లాం ఆవిర్భవించిన ప్రారంభంలో కొన్నేండ్ల వరకు అరేబియాలో ఈ దత్త స్వీకారపద్ధతి అమల్లో ఉండేది. దైవదౌత్యానికి పూర్వం మహనీయ ముహమ్మద్ (స) కూడా జైద్ బిన్ హారిస్ (రజి)ని దత్తపుత్రునిగా స్వీకరించారు. కాని ఆతర్వాత ఇది ప్రకృతివిరుద్ధమైన పద్ధతి అయి నందున ఇస్లాం దీన్ని నిషేధించింది. పెంపుడుకొడుకు ఎన్నటికీ కన్నకొడుకు కాలేడు.

"ఆయన (దేవుడు) మీ పెంపుడు కొడుకుల్ని సొంత కొడుకులుగా చేయలేదు. ఇవన్నీ మీరు నోటికొచ్చినట్లు కల్పించుకున్న మాటలే. దేవుడు సత్యంతో కూడిన మాట చెబుతున్నాడు. ఆయనే మీకు సరైనమార్గం చూపేవాడు. పెంపుడు కొడుకుల్ని వారి కన్న తండ్రుల సంబంధంతోనే పిలవండి. ఇదే దేవుని దృష్టిలో న్యాయమైన విషయం. ఒకవేళ వారి కన్నతండ్రులెవరో మీకు తెలియకపోతే వారిని మీ ధార్మిక సోదరులుగా, స్నేహితులుగా పరిగణించండి." (ఖుర్ఆన్-33:4,5)

వారసత్వపుహక్కుల విషయంలో ఖుర్ఆన్ రక్తసంబంధంగాని, దగ్గరిబంధుత్వం గాని లేనివారికి ఆస్తివాటా ఉండదు. అలాగే దత్తపుత్రుల భార్యలు సొంతకోడళ్ళు కారు.

"దైవగ్రంథం ప్రకారం రక్తసంబంధీకులే ఒకరికొకరు ఎక్కువ హక్కుదారులు. నిస్సందేహంగా దేవుడు ప్రతి విషయాన్నీ ఎరిగినవాడు." (ఖుర్ఆన్-8:75)

పెంపుడుకొడుకు మూలంగా నిజమైన వారసులకు వారి ఆస్తిహక్కులు దక్కనీయ కుండా చేయడానికి వీల్లేదు. పెంపుడుకొడుక్కు ఇస్లామీయ చట్టం ప్రకారం అతని కన్న తండ్రి నుంచే ఆస్తి వాటా లభిస్తుంది. పోతే అనాథ అయితే అతడ్ని పెంచుకున్న వ్యక్తి తన ఆస్తిలో 1/3వంతును ఆ పెంపుడుకొడుక్కు సంక్రమింపజేస్తూ వీలునామా రాయవచ్చు.

# 53. సమరసొత్తు (అన్ఫాల్, ఫై)

యుద్ధంలో శత్రువర్గం ఓడి పారిపోతూ యుద్ధమైదానంలో వదలిపెట్టిన వివిధ వస్తుసంపదను “సమరసొత్తు” అంటారు. ఇది విజేతవర్గానికి లభిస్తుంది. అయితే ఈ సమరసొత్తులో యుద్ధంలో పాల్గొన్న సైనికులతోపాటు ప్రభుత్వానికి కూడా వాటా ఉంటుంది. ప్రభుత్వం దాన్ని పేదలకు, ఇతర ప్రజాసంక్షేమకార్యాలకు వినియోగిస్తుంది. ఈ పద్ధతి పూర్వం నుంచీ వస్తోంది. ఖుర్‌ఆన్‌లోని ఈ సూక్తులు చూడండి:

“ముహమ్మద్ (స)! వారు నిన్ను సమరసొత్తు గురించి అడుగుతున్నారు. వారికి చెప్పు: ఈ సమరసొత్తు దేవునికి, ఆయన ప్రవక్తకు మాత్రమే చెందుతుంది. కనుక మీరు నిజమైన విశ్వాసులైతే (అన్నిటికన్నా ముందు) దేవునికి భయపడి మీ పరస్పర సంబంధాలు మెరుగు పరచుకోండి; దేవునికి, ఆయన ప్రవక్తకు పూర్తిగా విధేయులై మసలుకోండి.” (8:1)

హజ్రత్ అబూహురైరా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (స) ఈ విధంగా తెలియజేశారు: “దైవప్రవక్తలలో (వారిపై దేవుని శాంతి కలుగుగాక) ఒకాయన దైవమార్గంలో యుద్ధానికి బయలుదేరుతూ తన జాతివారితో ఇలా అన్నారు: “మీలో (కొత్తగా) పెళ్ళి చేసుకొని మొదటిసారి భార్యతో గడపాలనుకుంటున్న వ్యక్తి, ఇల్లు కట్టుకొని ఇంకా కప్పు వేసుకోని వ్యక్తి, సూడి మేకలు-ఒంటెలు కొని అవి త్వరలోనే ఈనుతాయని ఎదురు చూస్తున్న వ్యక్తి నాతోపాటు యుద్ధానికి రానవసరం లేదు.”

ఆ తర్వాత ఆయన యుద్ధం చేయటాని బయలుదేరారు. వారు అస్ర్ వేళకు లేక అంతకన్నా కాస్త ముందే (యుద్ధం చేయవలసిన) ఊరికి చేరుకున్నారు. అప్పుడాయన సూర్యుడ్ని సంబోధిస్తూ “నువ్వు కూడా దైవాజ్ఞల్ని పాలించేవాడివే. నేనూ దైవాజ్ఞల్ని పాలించే వాడినే” అంటూ దేవా! మా కోసం ఈ సూర్యుడ్ని (అస్తమించకుండా) ఆపిఉంచు” అని ప్రార్థించారు. (వారికోసం) సూర్యుడు నిలిపి ఉంచబడ్డాడు. దేవుడు వారికి ఆ ఊరిపై విజయం సాధించి పెట్టేదాకా సూర్యుడు అస్తమించలేదు.

యుద్ధానంతరం ఆయన సమరసొత్తును ఒకచోట సమీకరించారు. దాన్ని తినేయ డానికి (ఆకాశం నుండి) అగ్ని వచ్చి తినకుండానే వెళ్ళిపోయింది. అది చూసి ఆ దైవ ప్రవక్త (తన సైన్యంతో) “మీలో ఎవరో (సమరసొత్తు విషయంలో) నమ్మకద్రోహానికి పాల్పడ్డారు. కాబట్టి మీలోని ప్రతితెగ నుండి ఒక్కొక్క వ్యక్తి వచ్చి నాముందు ప్రమాణం చేసి చెప్పాలి” అని అన్నారు. దాని ప్రకారం సైనికులు దైవప్రవక్త చేతిలో చెయ్యివేసి ప్రమాణం చేస్తున్నప్పుడు ఒకతని చేయి దైవప్రవక్త చేతికి అతుక్కుపోయింది. దైవప్రవక్త అతనితో “నీ తెగవాళ్ళలోనే ఎవరో ఈ ద్రోహానికి పాల్పడిఉండాలి. కనుక నీ తెగవారంతా నా చేతిమీద ప్రమాణం చేయాలి” అని అన్నారు. ఆ తెగవారు ప్రమాణం చేస్తున్నప్పుడు ఇద్దరు లేక ముగ్గురు వ్యక్తుల చేతులు దైవప్రవక్త చేతులకు అతుక్కుపోయాయి. అప్పుడా దైవప్రవక్త “ఈ ద్రోహానికి పాల్పడింది మీరే” అన్నారు. దాంతో ఆ ముగ్గురు (తాము దాచిన) ఆవు తలలాంటి బంగారుబొమ్మను (సమరసొత్తులో కలిపి) పెట్టేశారు. వెంటనే అగ్ని వచ్చి ఆ సమరసొత్తునంతా తినేసింది.” (అంటే దైవమార్గంలో చేసిన పోరాటం దైవసమక్షంలో ఆమోదించబడిందన్నదానికి అది తార్కాణం అన్నమాట!)



దైవప్రవక్త (స) ఇంకా ఇలా తెలియజేశారు: “మనకు పూర్వం ఎవరికీ సమరసొత్తు ధర్మసమ్మతంగా ఉండేది కాదు. దేవుడు మన గత్యంతరంలేని పరిస్థితిని, బలహీనతల్ని చూసి దాన్ని మన కోసం ధర్మసమ్మతం చేశాడు.” (బుఖారీ,ముస్లిం)

యుద్ధంలో శత్రువులు వదలివెళ్ళిన సామగ్రిని విజేతలు హస్తగతం చేసుకుంటారు. దీన్నే సమరసొత్తు (అన్ఫాల్) అంటారు. ఇందులో ఆయుధాలు, ఆహార వస్తువులు, వాహనాలు, పశువులు, వస్త్రాలు వగైరా సామగ్రితోపాటు యుద్ధఖైదీలు కూడా ఉంటారు. ఈ సమరసొత్తు ను ఇస్లామీయ రాజ్యాధినేత దైవనిర్ణీత వాటాల ప్రకారం పంపిణీ చేస్తాడు.

“మీకు లభించిన సమరసొత్తులో అయిదోవంతు దేవునికి, ఆయన ప్రవక్తకు, బంధువు లకు, అనాథబాలలకు, నిరుపేదలకు, బాటసారులకు చెందినదని తెలుసుకోండి. మీరు దేవుడ్ని, (సత్యాసత్యాలను) వేరుచేసిన రోజు, అంటే రెండుసైన్యాలు పరస్పరం ఢీకొన్న రోజు మేము మా దాసునిపై అవతరింపజేసినదాన్ని విశ్వసించిన వారయితే (ఈ అయిదో వంతు సమరసొత్తు సంతోషంగా ఇచ్చేయండి).” (ఖుర్‌ఆన్-8:41)

ఈ అయిదోవంతు 1/5 సమరసొత్తు ప్రజాసంక్షేమకార్యాల వినియోగం కోసం ప్రభుత్వ ధనాగారంలో జమ అవుతుంది. యుద్ధం జరగకుండా శత్రువర్గం లొంగిపోయి ఏదైనా ఒప్పందం చేసుకున్నప్పుడు ఆ ఒప్పందం ప్రకారం ఇస్లామీయ రాజ్యానికి లభించే సంపదను షరీఅత్ పరిభాషలో “ఫై” అంటారు. అలాగే యుద్ధం జరగకుండానే శత్రువులు పారిపోయి కోల్పోయిన భూభాగం కూడా ఇస్లామీయ రాజ్యం అధీనంలోకి వస్తుంది. అలాంటి భూభాగంలోని సంపద కూడా “ఫై” క్రిందికే వస్తుంది. ప్రభుత్వం ఇలాంటి సంపదను సైనికులకు పంచకుండా దాన్ని ఇలా దైవనిర్ణీత పద్దుల క్రింద ఖర్చుపెడ్తుంది:

“దేవుడు వారి అధీనం నుండి తీసి తన ప్రవక్తకు హస్తగతం చేసిన సిరిసంపదలు, నిజానికి (యుద్ధంలో) మీరు గుర్రాలు, ఒంటెల్ని పరుగెత్తించి సాధించిన సిరిసంపదలు కావు. దేవుడు తన ప్రవక్తలకు తాను కోరిన వారిపై ఆధిక్యతనిస్తాడు. ఆయన ప్రతి పనీ చేయగల సమర్థుడు, సర్వ శక్తిమంతుడు. దేవుడు ఈ వాడవాసుల నుండి తన ప్రవక్తకు అధీనం చేసిన ధన (కనక) వస్తు సంపదల్లో దేవునికి, దైవప్రవక్తకు, బంధువులకు, అనాథలకు, పేదలకు, బాటసారులకు హక్కుంది. ధనం (ఎల్లప్పుడూ) మీలోని ధనిక వర్గంలోనే కేంద్రీకృతమయి ఉండరాదన్న లక్ష్యంతో ఈ విధానం నిర్ణయించబడింది.” (ఖుర్‌ఆన్-59:6,7)

“(మక్కాలోని) తమ ఇండ్ల నుండి, తమ ఆస్తిపాస్తుల నుండి వెడలగొట్టబడిన పేద కాందిశీకులకు కూడా (ఆ సంపదలో) హక్కుంది. వారు దేవుని అనుగ్రహాన్ని, ఆయన ప్రసన్నతను ఆశిస్తూ దేవునికి, ఆయన ప్రవక్తకు అన్ని విధాలా మద్దతు నివ్వడానికి నడుం బిగించారు. వారే సత్యసంధులు, సన్మార్గగాములు.” (ఖుర్‌ఆన్-59:8)

“ఈ కాందిశీకులు రాక పూర్వమే (ఇస్లాం ధర్మాన్ని) విశ్వసించి (మదీనా)పట్టణంలో నివసిస్తున్నవారికి కూడా (ఆ సంపదలో) హక్కుంది. (మక్కానుండి) తమ దగ్గరకు (మదీనా) వలసవచ్చిన వారిని వీరు అభిమానిస్తున్నారు. వీరికి ఏదిచ్చినా అది తమకు అవసరమని వీరు తమ హృదయాల్లో సైతం ఆకాంక్షించరు. వారు నిరుపేదలైనప్పటికీ ఇతరుల అవసరాలకే ప్రాధాన్యం ఇస్తారు. పేరాశ, పిసినారితనాల నుండి రక్షించబడినవారే ధన్యులు.

పోతే వీరందరి తరువాత (ఇస్లాంలోకి) వచ్చినవారికి కూడా (ఆ సంపదలో హక్కుంది). వారిలా ప్రార్థిస్తారు: "ప్రభూ! మమ్మల్ని, మాకు పూర్వం విశ్వసించిన మా సోదరులందర్నీ క్షమించు. విశ్వాసుల పట్ల మాహృదయాల్లో ఎలాంటి అసూయాద్వేషాలు ఉంచకు. ప్రభూ! నీవు గొప్ప క్షమాశీలివి, అపార దయామయుడవు". (ఖుర్ఆన్–59:9,10)

**జిజ్యా (భద్రతారుసుం):-** శత్రుదేశం యుద్ధం చేయకముందే ఇస్లామీయ సేనలకు లొంగిపోయి నిర్యుద్ధ ఒడంబడిక చేసుకుంటే ఆ దేశం ఇస్లామీయ రాజ్యానికి ప్రతి ఏడూ కొంత పన్ను కట్టవలసి ఉంటుంది. ఇది సామంతరాజులు తమ విజేత చక్రవర్తికి చెల్లించే కప్పం లాంటిది. దీన్ని ఇస్లామీయ షరీఅత్ పరిభాషలో "జిజ్యా" అంటారు.

"గ్రంథప్రజల్లో కూడా దేవుడ్ని, అంతిమదినాన్ని విశ్వసించనివారితో యుద్ధం చేయండి. దేవుడు, ఆయనప్రవక్త నిషేధించినవాటిని వారు నిషేధితాలుగా పరిగణించడంలేదు. సత్య ధర్మాన్ని తమ జీవనధర్మంగా చేసుకోవడం లేదు. కనుక వారు మీకు పూర్తిగా లొంగిపోయి తమ చేతులారా జిజ్యా చెల్లించనంతవరకూ వారితో పోరాడండి." (ఖుర్ఆన్–9:29)

జిజ్యా అంటే, ఇస్లామీయ రాజ్యంలోని ముస్లిమేతరులు తమ మతాచారాలు పాటించడానికి పొందే స్వేచ్ఛాస్వాతంత్ర్యాలకు, విదేశీశక్తుల దాడుల నుంచి ప్రభుత్వం కల్పించే రక్షణకు ప్రతిఫలంగా ఇస్లామీయ ప్రభుత్వానికి ప్రతియేటా చెల్లించవలసిన 'రక్షణ రుసుం'.

ఇమాం అబూయూసుఫ్ (రహ్మలై) ప్రకారం ముస్లిమేతరుల్లో స్తోమత కలిగిన పురుషులు మాత్రమే జిజ్యా చెల్లించవలసి ఉంటుంది. స్త్రీలు, పిల్లలు, వృద్ధులు, అంధులు, సన్యాసులు, దేవాలయాల్లో పనిచేసే ఉద్యోగులు జిజ్యా చెల్లింపు నుండి మినహాయించబడ్డారు.

దీనికిభిన్నంగా ఆర్థికస్తోమత కలిగిన ప్రతిముస్లిం జకాత్ విధిగా ప్రభుత్వానికి చెల్లించవలసిఉంటుంది. అంతేకాదు, విదేశీశక్తుల నుండి ప్రమాదం ఎదురైనప్పుడు శారీరకశక్తి ఉండే ప్రతిముస్లిం పురుషుడు తప్పనిసరిగా యుద్ధంలో పాల్గొనవలసి ఉంటుంది. ముస్లిమేతరులు ఆ యుద్ధంలో పాల్గొనవసరం లేదు. ముస్లిమేతరులు జిజ్యా చెల్లిస్తున్నందున వారికి రక్షణ చేకూర్చడానికి ముస్లింలే విదేశీశక్తులతో పోరాడవలసి ఉంటుంది.

## 54. మహర్ (స్త్రీ ఆస్తిహక్కు)

"మహర్" అనేది పురుషుడి నుండి స్త్రీకి సంక్రమించవలసిన ఆర్థికహక్కు. కనుక వధువుకు వరుడు మహర్ (వధుకట్నం) చెల్లించాలి. ఏదైనా కారణం వల్ల మహర్ వివాహ సమయంలో చెల్లించలేకపోతే ఆ తరువాతయినా వీలైనంత త్వరగా చెల్లించాలి. మహర్ త్వరగా చెల్లించకుండా ఏళ్ళతరబడి గడపడం మంచిది కాదు. అందునా రోజురోజుకు ధరలు పెరుగుతూ, రూపాయివిలువ తరుగుతున్న ఈరోజుల్లో మహర్ చెల్లింపులో జాప్యం చెయ్యడమంటే భార్యహక్కును తొక్కిపట్టడమే.

ఇస్లాం ప్రకారం స్త్రీకి తన తండ్రి నుంచి తన సోదరునికి లభించే ఆస్తివాటాలో సగమే లభిస్తుంది. మిగతా సగం మహర్ రూపంలో భర్త నుండి లభిస్తుంది. ఈ మహర్ వివాహ సందర్భంలో ఇవ్వలేకపోతే ఆ తరువాత ఎప్పటికైనా భర్త దాన్ని అప్పుగా భావించి తన భార్యకు ఇవ్వవలసిందే. వివాహంలో మహర్ చెల్లింపు కూడా ఒక షరతుగా ఉంది. ఈ షరతు పాటించనిదే వివాహం కాదు. మహర్‌ని గురించి ఖుర్ఆన్ ఇలా చెబుతోంది:



"స్త్రీలకు లభించవలసిన మహర్ (వధు కట్నం)ను (విధిగా భావించి) వారికి సంతోషంగా ఇచ్చివేయండి. అయితే వారు గనక సంతోషంగా కొంత మహర్ మాఫీచేస్తే దాన్ని మీరు నిరభ్యంతరంగా అనుభవించవచ్చు." (ఖుర్ఆన్–4:4)

మహర్, ఇతర కానుకల రూపంలో పురుషుడు స్త్రీకి ఎంత పెద్ద ధనరాసి ఇచ్చి ఉన్నా అవన్నీ ఆమె సొంతఆస్తుల క్రిందికి వస్తాయి. వాటిని పురుషుడు మళ్ళీ తీసుకోకూడదు. అలాగే మహర్‌కు పరిమితి విధించి అంతే చెల్లించాలని షరతులు కూడా పెట్టకూడదు.

"మీరు గనక ఒకభార్య స్థానంలో మరొక భార్యను చేసుకోవడానికి నిర్ణయించుకుంటే, మొదటి భార్యకు మీరు (మహర్‌గా) ఎంతపెద్ద ధనరాసి ఇచ్చివున్నా దాన్ని ఎలాంటి పరిస్థితిలోనూ మళ్ళీ తీసుకోరాదు." (ఖుర్ఆన్–4:20)

దైవప్రవక్త (స) ప్రవచనం: "ఎగవేసే ఉద్దేశ్యం పెట్టుకొని మహర్ కింద కొంతపైకం చెల్లించే ఒప్పందంతో ఏదైనా స్త్రీని వివాహమాడిన పురుషుడు వాస్తవంగా ఒక వ్యభిచారి. అప్పు తీసుకొని తిరిగిచెల్లించే ఉద్దేశ్యం లేనివాడు నిజానికి ఒక దొంగ." (మిష్కాత్)

స్త్రీ విడాకులు ఇవ్వబడినప్పుడుగాని, వితంతువయి నప్పుడుగాని నిర్ణీత కాలలకు ఆమెకు భర్త లేదా భర్త తరపు బంధువులు తగిన జీవనభృతి ఇవ్వాల్సి ఉంటుంది.

"మీలో ఎవరికైనా మరణకాలం ఆసన్నమైనప్పుడు వారి భార్యలు జీవించివుంటే, ఒక ఏడాదిపాటు వారి (పోషణ) ఖర్చులు భరించాలని, ఇంటినుండి వెడలగొట్టరాదని వారు (తమ వారసులకు) విల్లు రాసిపోవాలి. ఆ స్త్రీలు తమంతటతాము ఇంటి నుండి వెళ్ళిపోయి తమకు నచ్చిన పని (పునర్వివాహం) ధర్మసమ్మతంగా చేసుకోదలిస్తే దానికి మీపై ఎలాంటి బాధ్యత ఉండదు. దేవుడు సర్వశక్తిమంతుడు, ఎంతో వివేచనా పరుడు. విడాకులు పొందిన మహిళలకు కూడా సముచిత రీతిలో జీవనభృతి ఇచ్చి పంపాలి. ఇది దైవభీతిపరులు నెరవేర్చవలసిన విధ్యుక్తధర్మం. మీరు విషయాన్ని అర్థం చేసుకుంటారని దేవుడు ఈవిధంగా తన ఆజ్ఞలను మీకు విడమరచి బోధిస్తున్నాడు." (2:240–242)

# IV. సామాజిక వ్యవస్థ

మానవసమాజం మానవేతర సమాజం కంటే పూర్తిగా భిన్నమైనది. మానవేతర సమాజాల్లోని జంతువులు, పక్షులు, పురుగులు, కీటకాలు, జలచరాలు సమస్తం ఎంతో ప్రశాంతంగా మనుగడ సాగిస్తున్నాయి. వాటి మధ్య ఎలాంటి అశాంతి, అలజడులు కానరావడం లేదు. ఒక్క మానవ సమాజమే ఎల్లప్పుడూ అశాంతి అలజడులతో సతమతమవుతోంది. తల్లిదండ్రుల్ని వేధించే తనయులు, భార్యలను హింసించే భర్తలు, ప్రాణస్నేహితుల ప్రాణాలను తోడే మిత్రద్రోహులు, స్వార్థ ప్రయోజనాల కోసం వేలాది మందిని సైతం నిర్దాక్షిణ్యంగా హతమార్చే రాజకీయ గూండాలు, కుట్రలతో గప్‌చుప్‌గా బాంబులు పెట్టి అమాయకుల్ని మట్టుబెట్టే మతోన్మాదులు మానవ సమాజాన్ని చీడపురుగుల్లా తొలచివేస్తూ మానవత్వాన్ని మంట గలుపుతున్నాయి.

దీనికంతటికీ మూలకారణం మానవులు తమ సృష్టికర్త, విశ్వపాలకుడయిన దేవుడు పంపిన 'శాంతి వ్యవస్థ'ను త్రోసిపుచ్చి మనోవాంఛలకు బానిసలయి పోవడమే. ఈ శాంతి వ్యవస్థలో సామాజిక వ్యవస్థ ఎంతో ముఖ్యమైనది. శాంతికి పర్యాయపదమైన ఇస్లాం శాంతియుతమైన సామాజిక వ్యవస్థకు కావలసిన రూపురేఖల్ని ఎలా పేర్కొన్నదో తెలుసుకుందాం.

# 55. బంధుప్రేమ

“అల్లాహ్‌ను తప్ప మరెవర్నీ ఆరాధించరాదని; తల్లిదండ్రుల పట్ల, బంధువుల పట్ల, అనాథలపట్ల, పేదలపట్ల సద్భావనతో మెలగాలని; ప్రజలతో (చిరునవ్వుతో) మంచిమాటలు పలకాలని; ప్రార్థనావ్యవస్థ స్థాపించాలని; జకాత్ చెల్లిస్తుండాలని మేము ఇస్రాయీల్‌సంతతి చేత ప్రమాణం చేయించాం.” (ఖుర్ఆన్-2:83)

సామాజిక వ్యవస్థలో బంధువులతో సత్సంబంధాలు ఎంతో ముఖ్యమైన విషయం. రక్త సంబంధీకులతో, సన్నిహిత బంధువులతోనే సంబంధాలు విచ్ఛిన్నం చేసుకునే మనిషి సమాజం లోని ఇతర మానవుల పట్ల చిత్తశుద్ధితో సత్సంబంధాలు కలిగివుంటాడని ఆశించలేము.

“రక్త సంబంధీకులతో మీకేర్పడివున్న సహజ బాంధవ్యాన్ని తెంచకండి. దేవుడు మీ చర్యల్ని ఒకకంట గమనిస్తున్నాడన్న సంగతి మరచిపోకండి.” (ఖుర్ఆన్-4:1)

“తల్లిదండ్రుల పట్ల సద్వర్తనంతో వ్యవహరించండి. బంధువులు, అనాథలు, నిరు పేదలతో మంచిగా మసలుకోండి. ఇరుగుపొరుగు బంధువులకు, పరిచయంలేని పొరుగువారికి, (మీ దైనందిన కార్యకలాపాలలో) తారసపడే మిత్రులకు, బాటసారులకు, మీ అధీనంలో వున్న బానిసలకు మేలు చేయండి.” (4:36); “అయితే దైవగ్రంథం ప్రకారం రక్తసంబంధీకులే ఒకరికొకరు ఎక్కువ హక్కుదారులు.” (ఖుర్ఆన్-8:75)

హజ్రత్ అబూహురైరా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: “దేవుడ్ని, అంతిమదినాన్ని విశ్వసించిన మనిషి తన(ఇంటికొచ్చిన) అతిథిని గౌరవించాలి. దేవుడ్ని, అంతిమదినాన్ని విశ్వసించిన మనిషి తన బంధువులతో సత్సంబంధాలు కలిగి ఉండాలి. దేవుడ్ని, అంతిమదినాన్ని విశ్వసించిన మనిషి మాట్లాడితే మంచి మాటనే మాట్లాడాలి లేదా మౌనం వహించాలి.” (బుఖారి, ముస్లిం)

మనిషి ఆంతర్యంలో నిజమైన బంధుప్రేమ ఉంటేనే బంధువులతో సత్సంబంధాలు కలిగివుంటాడు. ఇలాంటి బంధుప్రేమను ఇస్లాంలో “సిలారహ్మి” అంటారు. బంధుత్వాన్ని విచ్ఛిన్నం చేసుకోవడం, ఆస్తి-అంతస్తులు చూసుకొని మిడిసిపడుతూ పేదబంధువులకు దూరంగా మసలుకోవడం, వారి హక్కులు కాలరాయడం బంధుప్రేమ అన్పించుకోదు.

హజ్రత్ అబూహురైరా (రజి) ప్రకారం దైవప్రవక్త (స) హితోక్తి : దేవుడు సమస్త సృష్టిరాసుల్ని సృజించిన తర్వాత ‘బంధుప్రేమ’ లేచినిలబడి “(దేవా!) నేను బంధుత్వాల తెగతెంపుల బారినుండి నీ శరణు కోరుతున్నాను” అన్నది. దేవుడు దాని మాట విని “అయితే నీపట్ల సత్సంబంధాలు కలిగివుండే వాడిపట్ల నేనూ సత్సంబంధాలు కలిగి వుంటాను. నీతో సంబంధాలు తెగతెంపులు చేసుకునే వాడితో నేనూ సంబంధాలు తెగ తెంపులు చేసుకుంటాను. ఇది నీకిష్టమేనా?” అనిఅన్నాడు. దానికి బంధుప్రేమ “ఇష్టమే ప్రభూ!” అన్నది. అప్పుడు దేవుడు “సరే ఆ భాగ్యం నీకు దక్కుతుంది” అని చెప్పాడు.

దీన్ని గురించి మీకు ప్రమాణం కావాలంటే ఖుర్ఆన్‌లోని ఈ సూక్తులు చదువు కోండి- “మీరు (సత్యానికి) విముఖులైపోతే లోకంలో మళ్ళీ అరాచకం, అల్లకల్లోలాలు రేకెత్తిస్తూ ఒకరి గొంతులు మరొకరు కోసుకుంటారు. అంతకంటే మీనుండి మరేం



ఆశించగలం? వీరసలు దైవశాపగ్రస్తులు. దేవుడు వీరిని (సత్యంకానలేని) అంధులుగా, (హితోక్తులు వినలేని) బధిరులుగా చేశాడు. (47:22,23)- (బుఖారి, ముస్లిం)

వేరొక ఉల్లేఖనంలో దేవుడు ఇలా అన్నాడు: “నీతో సత్సంబంధాలు కలిగివున్న వాడితో నేనూ సత్సంబంధాలు కలిగివుంటాను. నీతో సంబంధాలు తెంచుకున్నవాడితో నేనూ సంబంధాలు తెంచుకుంటాను” అని ఉంది. (బుఖారి)

హజ్రత్ జుబైర్ బిన్ ముత్యిమ్ (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ప్రవచనం: “బంధు త్వాన్ని త్రెంచివేసేవాడు స్వర్గంలో ప్రవేశించలేడు.” (బుఖారి)

హజ్రత్ ఆయిషా (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ఇలా తెలిపారు: బంధుత్వం దైవ సింహాసనానికి వ్రేలాడబడి “నాతో సత్సంబంధాలు కలిగివున్న వాడితో దేవుడు కూడా సత్సంబంధాలు కలిగివుండుగాక! నన్ను విచ్ఛిన్నం చేసినవాడిని దేవుడు కూడా విచ్ఛిన్నం చేయుగాక!” అని ప్రార్థిస్తూ ఉంటుంది. (బుఖారి, ముస్లిం)

హజ్రత్ అబూఅయ్యూబ్ ఖాలిద్ బిన్ జైద్ అన్సారీ (రజి) కథనం: ఒకతను దైవ ప్రవక్త (స) సన్నిధికి వచ్చి “నన్ను నరకం నుండి దూరంచేసి, స్వర్గానికి గొనిపోయే ఆచరణ గురించి నాకు తెలియజేయండి” అని అడిగాడు. దానికి దైవప్రవక్త (స) ఇలా చెప్పారు- “అల్లాహ్‌ను మాత్రమే ఆరాధించు. ఆయనకు మరెవరినీ సాటి కల్పించకు. నమాజ్ వ్యవస్థ నెలగొల్పు. (పేదల ఆర్థిక హక్కయిన) జకాత్ చెల్లిస్తూఉండు. బంధువు లతో సత్సంబంధాలు కలిగివుండు.” (బుఖారి, ముస్లిం)

రోమ్ చక్రవర్తి హెర్క్యులస్ దగ్గరకు దైవప్రవక్త (సల్లం) పంపిన ధర్మప్రచార లేఖ వచ్చి నప్పుడు, అతను వాస్తవ పరిస్థితి తెలుసుకోవాడానికి వ్యాపార నిమిత్తం జెరూసలేంకు వచ్చి వున్న అబూసుఫ్యాన్‌ని పిలిపించుకొని మాట్లాడాడు. ఆ రోజుల్లో అబూసుఫ్యాన్ ఇస్లాంకు, దైవప్రవక్త (స)కు బద్ధశత్రువుగా ఉండేవారు. ఇస్లాం స్వీకరించిన తరువాత ఆయన ఆనాడు తనకు, హెర్క్యులస్‌కు మధ్య జరిగిన సంభాషణను గురించి వివరించిన ఒక హదీసులో ఈ క్రింది విషయాలు కూడా ఎంతో గమనార్హమైనవి:

హెర్క్యులస్ అబూసుఫ్యాన్‌ని ఉద్దేశించి “ఆయన (స) మిమ్మల్ని ఏ విషయాల్ని గురించి ఆదేశిస్తున్నాడు?” అనడిగాడు. దానికి అబూసుఫ్యాన్ (రజి) ఇలా సమాధానమి చ్చారు: “ఆయన మమ్మల్ని ‘మీరంతా ఒకే దేవుడ్ని ఆరాధించండి. ఆయనకు మరెవరినీ సాటి కల్పించకండి. మీపూర్వీకుల మాటల్ని వదలిపెట్టండి’ అని ఆదేశిస్తున్నాడు. అదీగాక ఆయన మమ్మల్ని నమాజ్ చేస్తుండాలని, సత్యమే పలకాలని, నీతిమంతమైన జీవితం గడపాలని, బంధువులను ప్రేమించాలని కూడా ఆదేశిస్తున్నాడు.” (బుఖారి, ముస్లిం)

హజ్రత్ అనస్ (రజి) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: “ఎవరైనా తన ఉపాధిలో సమృద్ధిని, ఆయుష్షులో పెరుగుదలను కోరుకుంటుంటే అతను తన బంధువుల పట్ల సత్ప్రవర్తన కలిగివుండాలి” (బుఖారి, ముస్లిం)

హజ్రత్ అమ్ర్ బిన్ అబస (రజి) ఉల్లేఖించిన ఒక సుదీర్ఘమైన హదీసులో ఆయన ఇలా అన్నారు: దైవప్రవక్త (స)కు ప్రవక్త పదవి లభించిన తొలిరోజుల్లో నేనొక సారి మక్కా

వెళ్ళి ఆయన్ని "మీరెవరండీ?"అనడిగాను. దానికి ఆయన "దేవుడు నన్ను తన ప్రవక్తగా నియమించి పంపాడు" అని చెప్పారు. "దేవుడు మిమ్మల్ని ఏ లక్ష్యం కోసం పంపాడు?" అని నేను మళ్ళీ అడిగాను. దైవప్రవక్త (స) విషయం వివరిస్తూ "బంధువుల మధ్య సత్సంబంధాలు నెలగొల్పడానికి, విగ్రహాలను తొలిగించడానికి (అంటే విగ్రహారాధనను అంతమొందించడానికి), బహుదైవారాధన జరగకుండా ఒకే దేవుడు ఆరాధించబడటా నికి దేవుడు నన్ను పంపించాడు" అని అన్నారు. (సుననె తిర్మిజి)

హజ్రత్ అబ్దుల్లా బిన్ అమ్ర్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (స) ఇలా తెలిపారు: "ఒక బంధువు ఉపకారం చేస్తే దానికి ప్రత్యుపకారం చేసేవాడు బంధుప్రియుడు కాడు. బంధువులు తనతో సంబంధాలు తెగతెంపులు చేసుకున్నప్పటికీ వారితో సత్సంబంధాలు కొనసాగించేవాడే (నిజమైన) బంధుప్రియుడు." (బుఖారి)

విశ్వాసుల మాతృమూర్తి హజ్రత్ మైమూనా బిన్తె హారిస్ (రజి) తన దగ్గరున్న ఒక దాసికి బానిసత్వం నుంచి విముక్తి కలిగించారు. దీని కోసం ఆమె దైవప్రవక్త (స) నుండి అనుమతి తీసుకోలేదు. ఆమె దాంపత్యం వంతు వచ్చిన రోజు దైవప్రవక్త (స) ఆమె దగ్గరకు వెళ్ళారు. అప్పుడామె "దైవప్రవక్తా! మీకీ సంగతి తెలుసా? నేను నా దాసికి బానిసత్వం నుంచి విముక్తి కలిగించాను" అని అన్నారు. దైవప్రవక్త (స) ఈమాట విని "నువ్వు నిజంగా అలా చేశావా?" అనడిగారు. దానికామె ఔనన్నారు. అప్పుడాయన "నీవా దాసిని నీ మేనమామలలో ఎవరికైనా ఇచ్చివుంటే (తద్వారా బంధుప్రేమ వ్యక్తం చేసినందుకు) నీకు మరింత పుణ్యం లభించి ఉండేదికదా! అని అన్నారు. (బుఖారి)

హజ్రత్ సల్మాన్ బిన్ ఆమిర్ (రజి) ప్రకారం దైవప్రవక్త (స) హితోక్తి : "పేదవాడికి చేసే దానం (సాధారణ)దానంగా పరిగణించబడుతుంది. కాని (పేదవాడైన) బంధువుకు చేసే దానం రెండువిధాల ప్రయోజనకరమైనది. ఒకటి, అది దానంగా పరిగణించబడు తుంది. రెండు, బంధుప్రేమతో ఇచ్చినట్లుగా కూడా ఉంటుంది." (తిర్మిజి)

హజ్రత్ అబూఅబ్దుల్లా అమ్ర్ బిన్ ఆస్ (రజి) ప్రకారం దైవప్రవక్త (స) మెల్లిగా కాకుండా బిగ్గరగా ఇలా అన్నారు: "ఫలానా తెగవారు నా మిత్రులు కాజాలరు. దేవుడు, సదాచారులైన విశ్వాసులే నామిత్రులు. అయితే ఆ తెగవారితో నాకు బంధుత్వం ఉంది గనక నేను బంధుత్వ సత్సంబంధాలను మాత్రం తప్పక కొనసాగిస్తాను." (బుఖారి)

హజ్రత్ అబూహురైరా (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ఇలా తెలిపారు: ఒకతను వచ్చి "దైవప్రవక్తా! నా బంధువులు కొందరున్నారు. నేను వారితో సత్సంబంధాలు కొన సాగించాలని ఎంత ప్రయత్నిస్తున్నా వారు మాత్రం నాతో సంబంధాలు తెగతెంపులు చేసుకోవాలనే చూస్తున్నారు. నేను వారిపట్ల మంచిగా వ్యవహరిస్తుంటే వారు నాకు కీడు తలపెడ్తున్నారు. నేను వారిపట్ల మృదువైఖరి అనుసరిస్తుంటే వారు నాపట్ల కఠినంగా ప్రవర్తిస్తున్నారు" అంటూ తన గోడు వెళ్ళబుచ్చున్నాడు. దైవప్రవక్త (స) అతని మాటలు విని "నువ్వు చెప్పింది నిజమేఅయితే నువ్వు వారి నోళ్ళలో వేడి బూడిద పోస్తున్నావనుకో. నువ్వు వారిపట్ల ఇలాగే సత్ప్రవర్తనతో మెలుగుతున్నంత కాలం దేవుని తరపున వారికి వ్యతిరేకంగా ఒక సహాయకుడు నీవెంట ఉంటాడు" అని అన్నారు. (ముస్లిం)



హజ్రత్ అనస్ (రజి) కథనం: మదీనాలోని అన్సార్ ముస్లింలందరిలో అబూతల్హా (రజి) గొప్ప ధనికులు. ఆయనకు అనేక ఖర్జూరపు తోటలు ఉండేవి. వాటిలో 'బైరహా' తోటంటే ఆయనకు చాలా ఇష్టం. ఈ తోట మస్జిదెనబవీ ముందుభాగాన ఉండేది. దైవప్రవక్త (స) తరచూ ఆ తోటకు వెళ్ళి అక్కడి మంచినీళ్ళు తాగేవారు. ఖుర్ఆన్‌లో "మీకు అత్యంత ప్రీతికరమైన వస్తువుని దైవమార్గంలో ఖర్చు చేయనంతవరకు మీరు పుణ్యస్థాయికి చేరుకోలేరు" అనే సూక్తి (3:92) అవతరించినపుడు హజ్రత్ అబూతల్హా (రజి) లేచి దైవప్రవక్త (స)తో ఇలా అన్నారు:

"దైవప్రవక్తా! 'అత్యంత ప్రీతికరమైన వస్తువుని దైవమార్గంలో ఖర్చు చేయనంత వరకు మీరు పుణ్యస్థాయికి చేరుకోలేర'ని దేవుడు సెలవిస్తున్నాడు కదా! 'బైరహా' తోట నాకెంతో ఇష్టమైనది. నేనా తోటను దైవమార్గంలో దానం చేయాలనుకుంటున్నాను. దైవం నుండి దాని పుణ్యఫలం ఆశిస్తున్నాను. మీరు దైవాజ్ఞ ప్రకారం దాన్ని ఉపయో గించండి." దైవప్రవక్త (స) ఈమాట విని "చాలా మంచిది. ఇదెంతో లాభదాయకమైన సంపద. అయితే నాదొక సలహా. ఆ తోటను నీ (పేద) బంధువులకు పంచివ్వు" అని చెప్పారు. దానికి అబూతల్హా (రజి) "నేను మీఆజ్ఞ శిరసావహిస్తున్నాను" అన్నారు. తర్వాత ఆయన ఆ తోటను తన పెదనాన్న, చిన్నాన్న కొడుకులకు పంచివేశారు. (బుఖారి).

# 56. తల్లిదండ్రుల హక్కులు

ఇస్లాంలో దేవునిహక్కులు, దాసులహక్కులని రెండు భాగాలు ఉన్నాయి. ఈ రెండిటి కలియకతోనే పరిపూర్ణ దైవధర్మం, సమగ్ర జీవనవ్యవస్థ అవుతుంది. దాసుల హక్కులలో మొట్టమొదటి అంశం తల్లిదండ్రుల హక్కులే. కనిపెంచి, విద్యాబుద్ధులు నేర్పిన తల్లిదండ్రుల హక్కులనే నెరవేర్చని మనిషి మనస్ఫూర్తిగా దేవుని హక్కులు నెరవేర్చగలడని కూడా ఏమాత్రం ఆశించలేము. తల్లిదండ్రుల హక్కులకు ఎంత ప్రాముఖ్యముందో చూడండి:

"మేము మానవునికి తన తల్లిదండ్రుల పట్ల సత్ప్రవర్తన కలిగివుండాలని ఆదేశిం చాము. అతని తల్లి అతడ్ని ఎంతో శ్రమకోర్చి తన గర్భంలో పెట్టుకొని మోసింది. ఎంతో శ్రమపడి అతడ్ని కన్నది. అతడ్ని గర్భంలో పెట్టుకొని మోయడానికి, ఆ తర్వాత పాలు మాన్పించడానికి ముప్ఫయి నెలలు పట్టింది. చివరికతను పూర్తిగా శక్తిమంతుడవుతాడు. (అలా) నలభైయేళ్ళ ప్రాయానికి చేరుకున్న తర్వాత అతను (దేవుడ్ని) ఇలా ప్రార్థిస్తాడు":

"ప్రభూ! నీవు నాకు, నా తల్లిదండ్రులకు చేసిన మేళ్ళకు నేను నీపట్ల కృతజ్ఞుడయి ఉండే సద్బుద్ధి ప్రసాదించు. నీ ప్రసన్నతాభాగ్యం లభించేటటువంటి సత్కార్యాలు చేసే సద్బుద్ధి కూడా ప్రసాదించు. నా సంతానాన్ని కూడా సజ్జనులుగా చేసి నాకు సుఖాన్నివ్వు. నేను నీకు విధేయుణ్ణయిన దాసుడ్ని. నా పాపాలకు నేను పశ్చాత్తాపపడుతూ నన్ను క్షమించమని నీ సన్నిధిలో వేడుకుంటున్నాను." (ఖుర్ఆన్-46:15)

ప్రవక్త అనుచరులలో ఒకతను దైవప్రవక్త (స)ను "దేవునికి అన్నిటికన్నా ఎక్కువ ఇష్టమైన సదాచరణ ఏదీ?" అని అడిగాడు. దానికి దైవప్రవక్త (స) "వేళకు నమాజు చేయడం" అని చెప్పారు. "ఆ తర్వాత ఏద"ని అడిగాడు ఆ అనుచరుడు. "తల్లిదండ్రుల

పట్ల సత్ప్రవర్తన కలిగివుండటం" అన్నారు దైవప్రవక్త (స). "ఆ తర్వాత ఏది"ని ప్రశ్నిం చాడతను. "దైవమార్గంలో పోరాడటం" అన్నారు దైవప్రవక్త (స) (బుఖారి, ముస్లిం)

దైవప్రవక్త (స) ప్రవచనం: "వృద్ధులయిన తల్లి దండ్రులు ఇద్దరుగాని లేక వారిలో ఒకరుగాని బ్రతికుండగా (వారికి సేవచేసి) స్వర్గంలో ప్రవేశించలేకపోయిన వాడి ముక్కుకు మన్ను తగల! వాడి ముక్కుకు మన్ను తగల!! వాడి ముక్కుకు మన్ను తగల!!!" ఇలా ఆయన మూడు సార్లు శపించారు. (ముస్లిం)

దైవప్రవక్త (స) ఇలా అన్నారు: "బానిసత్వంలో మగ్గుతున్న తండ్రిని కొని అతనికి విముక్తి కలిగించితే తప్ప సంతానం అతని రుణం తీర్చుకోలేదు." (బుఖారి)

"తల్లిదండ్రుల పట్ల సద్భావంతో మసలుకోండి. మీ ముందు వారిద్దరిలో ఎవరైనా వృద్ధులైఉంటే వారిని 'ఉఫ్' అనికూడా విసుక్కోకండి. కసురుకుంటూ విదిలించి మాట్లాడ కండి. వారితో గౌరవంగా మాట్లాడండి; దయార్ద్రహృదయంతో, వినయంతో వారి ముందు తలవంచిఉండండి. 'ప్రభూ! వీరు నన్ను చిన్నతనంలో ఎలా కరుణతో, వాత్సల్యంతో పెంచి పోషించారో అలానీవు వీరిని కరుణించు' అని ప్రార్థించండి." (ఖుర్ఆన్-17:23,24)

"తల్లిదండ్రులకు సేవచేయాలని మేము మానవుడ్ని ఆదేశించాము. అతని తల్లి బాధ మీద బాధ భరిస్తూ అతడ్ని తన గర్భంలో పెట్టుకొని మోసింది. అతడ్ని పాలు విడిపించ డానికి రెండేండ్లు పట్టింది. (అందువల్ల మేమతనికి ఇలా ఉపదేశించాం:) 'నాపట్ల కృతజ్ఞుడై ఉండు. నీ తల్లిదండ్రుల పట్ల కూడా కృతజ్ఞతాభావంతో మసలుకో. నీవు (చివరికి) నా దగ్గరికే రావలసిఉంది. అయితే నీకు తెలియనిదాన్ని నాకు సాటి కల్పించమని వత్తిడిచేస్తే మటుకు నీవు వారిమాట ఎన్నటికీ వినకు. ప్రపంచంలో వారి పట్ల సత్ప్రవర్తన కలిగిఉండు. అనుసరణ విషయంలో మాత్రం నావైపు మరలినవారి మార్గాన్నే అనుసరించు. చివరికి మీరంతా నా దగ్గరికే తిరిగిరావలసి ఉంది." (ఖుర్ఆన్-31:14,15)

హజ్రత్ అబ్దుల్లా బిన్ అమ్ బిన్ ఆస్ (రజి) ఉల్లేఖనం: ఒకతను దైవప్రవక్త (స) సన్నిధికి వచ్చి "నేను (ధర్మస్థాపన కోసం) హిజ్రత్ (వలస) చేస్తానని, జిహాద్‌లో పాల్గొం టానని ప్రమాణం చేసి మీతో అంటున్నాను. దీనివల్ల నాకు దైవం నుండి పుణ్యం లభించాలని కోరుకుంటున్నాను" అని అన్నాడు. దైవప్రవక్త (స) ఈమాట విని "నీ తల్లి దండ్రులలో ఎవరైనా జీవించివున్నారా?" అని అడిగారు. దానికా వ్యక్తి "ఉన్నారు, ఇద్దరూ జీవించే ఉన్నారు" అని చెప్పాడు. "నువ్వు నిజంగానే దేవుడు నీకు పుణ్యం ప్రసాదించా లని కోరుకుంటున్నావా?" అని అడిగారు దైవప్రవక్త (స) మళ్ళీ. ఆ వ్యక్తి ఔనన్నాడు. అప్పుడు దైవప్రవక్త (స) "అలాగైతే నువ్వు నీ తల్లిదండ్రుల దగ్గరకు తిరిగివెళ్ళిపో. వారిద్దరికీ బాగా సేవ చెయ్యి. (అందులో నీకు హిజ్రత్, జిహాద్‌ల కంటే ఎక్కువ పుణ్యం లభిస్తుంది.)" అని ఉపదేశించారు. (బుఖారి, ముస్లిం)

వేరొక ఉల్లేఖనంలో ఇలా ఉంది: ఒకతను దైవప్రవక్త (స) సన్నిధికి వచ్చి తనను జిహాద్ (ధర్మపోరాటం)లో పాల్గొనడానికి అనుమతించమని విన్నవించుకున్నాడు. దైవ ప్రవక్త (స) ఈమాట విని "నీ తల్లిదండ్రులు జీవించి ఉన్నారా?" అని అడిగారు. దానికా



వ్యక్తి, ఉన్నారని చెప్పాడు. అప్పుడు దైవప్రవక్త (స) "అయితే నీవు వారిద్దరి సేవలోనే పోరాడుతూ ఉండు" అని చెప్పారు. (బుఖారి, ముస్లిం)

దైవప్రవక్త (స) హితోక్తి : "తండ్రి స్వర్గద్వారాలన్నిటిలో మధ్యద్వారం లాంటివాడు. నీ కిష్టమయితే ఆ ద్వారాన్ని నాశనం చేసుకో లేదా కాపాడుకో." (తిర్మిజి)

దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "(ఏకేశ్వరుడయిన) దేవునికి ఇతరుల్ని సాటి కల్పించడం, తల్లిదండ్రుల మాట వినకపోవడం, నరహత్య చేయడం, అసత్య ప్రమాణం (మొదలైనవి) ఘోరమైన పాపాలు." (బుఖారి)

హజ్రత్ అబ్దుల్లా బిన్ అమ్ బిన్ ఆస్ (రజి) కథనం: దైవప్రవక్త (స) తన అనుచ రులతో మాట్లాడుతూ "ఘోరపాపాల్లో తల్లిదండ్రుల్ని దూషించడం కూడా ఉంది" అని అన్నారు. అనుచరులు ఈమాట విని "ఎవరైనా తమ తల్లిదండ్రుల్ని దూషిస్తారా" అన్నారు ఆశ్చర్యపోతూ. దానికి దైవప్రవక్త (స) "ఆ...ఇతను మరొకని తండ్రిని దూషిస్తే అతను ఇతని తండ్రిని దూషిస్తాడు. అలాగే ఇతను మరొకని తల్లిని దూషిస్తే అతను ఇతని తల్లిని దూషిస్తాడు. (ఈ విధంగా మనిషి ఇతరుల తల్లిదండ్రుల్ని దూషించి తన కన్న తల్లిదండ్రుల్నే దూషించిన వాడవుతాడు.)- (బుఖారి, ముస్లిం)

హజ్రత్ అబూఉసైద్ మాలిక్ బిన్ రబియా సాయిదీ (రజి) కథనం: ఒకసారి మేము దైవప్రవక్త (స) దగ్గర కూర్చొని ఉన్నప్పుడు బనూసలమా తెగకు చెందిన ఒకతను వచ్చి "దైవప్రవక్తా! నా తల్లిదండ్రులు చనిపోయిన తరువాత కూడా నేను వారికి చేయవలసిన సేవ ఏదైనా ఉంటుందా?" అని అడిగాడు. దానికి దైవప్రవక్త (స) ఇలా సమాధానం ఇచ్చారు- "ఉంటుంది. వారి శ్రేయస్సు మన్నింపుల కోసం దైవాన్ని వేడుకోవడం, వారు చేసిపోయిన ప్రమాణాలను నెరవేర్చడం, కేవలం వారి ద్వారానే కలిసే బంధుత్వాలను కలపడం, వారి స్నేహితుల్ని గౌరవించడం." (అబూదావూద్)

దైవప్రవక్త (స) ఇలా చెప్పారు: "ఒక వ్యక్తి తనతండ్రి కానివాణ్ణి తన తండ్రి కాదని తెలిసినా తన కన్నతండ్రిగా చెప్పుకుంటే అతనికి స్వర్గం నిషిద్ధం అవుతుంది." (బుఖారీ)

## తండ్రి కంటే తల్లి స్థానమే ఉన్నతమైనది

తల్లిదండ్రులిద్దరిలోనూ తల్లి స్థానానికి ఓ ప్రత్యేకత ఉంది. పిల్లవాడి పుట్టుక, పోషణల విషయంలో తండ్రి శ్రమ-త్యాగాల కన్నా తల్లి శ్రమ-త్యాగాలే ఎక్కువగా ఉంటాయి. కనుక న్యాయంరీత్యా సంతానంపై తండ్రిహక్కుల కన్నా తల్లిహక్కులే అధికంగా ఉంటాయి.

హజ్రత్ అబూహురైరా (రజి) ఉల్లేఖనం: ఒకతను దైవప్రవక్త (స)ను "నేను సేవ చేయడానికి నా తల్లి దండ్రులలో ఎవరెక్కువ హక్కుదారులు?" అని అడిగాడు. దానికి దైవప్రవక్త "నీ తల్లి" అని సమాధానమిచ్చారు. ఆ వ్యక్తి మళ్ళీ "ఆ తరువాత ఎవరు?" అని ప్రశ్నించాడు. దానికి కూడా దైవప్రవక్త (స) "నీ తల్లి" అనే సమాధానమిచ్చారు. ఆ వ్యక్తి తిరిగి "ఆ తరువాత ఎవరు?" అని అడిగాడు. దైవప్రవక్త (స) "నీ తల్లి" అనే జవాబిచ్చారు. అతను మళ్ళీ "ఆ తరువాత ఎవరు?" అని అడిగాడు. దానికి దైవప్రవక్త (స) "నీ తండ్రి" అని చెప్పారు. (బుఖారి, ముస్లిం)

వేరొక ఉల్లేఖనంలో ఇలా ఉంది: "దైవప్రవక్తా! నా సత్ప్రవర్తనకు ఎవరెక్కువ హక్కుదారులు?" అని అడిగాడా వ్యక్తి. దానికి దైవప్రవక్త (స) "నీ తల్లి, ఆ తరువాత నీ తల్లే, ఆ తరువాత కూడా నీ తల్లే, ఆ తరువాత నీ తండ్రి. ఆ తరువాత నీకు ఎవరెంత దగ్గరి బంధువైతే వారు" అని చెప్పారు. (బుఖారి, ముస్లిం)

హజ్రత్ బరా బిన్ ఆజిబ్ (రజి) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (స) ఇలా అన్నారు: "పినతల్లికి తల్లి స్థానం ఉంది." (తిర్మిజి)

మరొకతను వచ్చి "దైవప్రవక్తా! మీరు నన్ను ఏ విషయం గురించి ఆదేశిస్తారు?" అని అడిగాడు. దానికి దైవప్రవక్త (సల్లం) "నీ తల్లి పట్ల సత్ప్రవర్తన కలిగివుండు" అని చెప్పారు. ఆ వ్యక్తి అదే ప్రశ్న మూడు సార్లు అడిగాడు. మూడు సార్లు కూడా దైవప్రవక్త (సల్లం) "నీ తల్లి పట్ల సత్ప్రవర్తన కలిగివుండ"మనే చెప్పారు. నాల్గవ సారి అడిగిన ప్రశ్నకు ఇచ్చిన సమాధానంలో తండ్రిని కూడా చేర్చారు. (బుఖారి, ముస్లిం)

దైవప్రవక్త (స) ఓ రోజు తన సహచరులతో ముచ్చటిస్తూ ఇలా చెప్పారు: "నేను (రాత్రి) స్వర్గదృశ్యాలు చూస్తున్నట్లు కలగన్నాను. అక్కడ నేను ఎవరో ఖుర్ఆన్ పఠించడం విన్నాను. నేను 'ఈ కంఠస్వరం ఎవరిది'ని అడిగాను. దానికి 'ఇది హారిసా బిన్ నోమాన్ (రజి) కంఠస్వరం' అని సమాధానం వచ్చింది. ఇదీ తల్లి పట్ల సత్ప్రవర్తన పుణ్యఫలం. ఇదీ అసలు తల్లి పట్ల సత్ప్రవర్తన పుణ్యఫలమంటే." (మిష్కాత్)

ఒకతను దైవప్రవక్త (స) సన్నిధికి వచ్చి "నావల్ల పెద్ద పాపం జరిగిపోయింది. దీనికి నిష్కృతి ఏదైనా ఉందంటారా?" అని అడిగాడు. దైవప్రవక్త (స) ఈమాట విని "నీ తల్లి (జీవించి) ఉందా?" అని ప్రశ్నించారు. దానికా వ్యక్తి లేదన్నాడు. "పోనీ నీ పిన్నమ్మగాని, పెద్దమ్మగాని ఉందా?" అని అడిగారు దైవప్రవక్త (స). అతను ఉందన్నాడు. "అయితే ఆమెపట్ల మంచిగా ప్రవర్తిస్తూ ఉండు" అన్నారు దైవప్రవక్త (స). (తిర్మిజి)

హజ్రత్ అబూబకర్ (రజి) కుమార్తె హజ్రత్ అస్మా (రజి) దైవప్రవక్త (స)ను "దైవప్రవక్తా! నా తల్లి నన్ను చూడటానికి వచ్చింది. ఆమె (ఇంకా సత్యాన్ని విశ్వసించని) అవిశ్వాసి. మరి నేనామె పట్ల మంచిగానే ప్రవర్తించాలా?" అని అడిగారు. దానికి దైవప్రవక్త (స) "నీవు నీతల్లి హక్కును కూడా నిర్వహిస్తూ ఉండాలి" అని చెప్పారు. ( బుఖారి)

## తల్లి పాదాల క్రింద తనయుల స్వర్గం

ఒకతను దైవప్రవక్త (స)తో "నేను జిహాద్ చేయాలనుకుంటున్నాను" అని అన్నాడు. దైవప్రవక్త (స) ఈమాట విని "నీ తల్లిదండ్రులు ఉన్నారా?" అని అడిగారు. దానికా వ్యక్తి "నా తల్లి మాత్రమే బ్రతికుంది" అన్నాడు. "అయితే నీ తల్లి పట్ల సత్ప్రర్తన కలిగివుండు. నీవు నీ తల్లికి శక్తివంచనలేకుండా సేవ చేయగల్గితే జిహాద్ పుణ్యమే కాదు, హజ్-ఉమ్రాలు చేసినంత పుణ్యం కూడా లభిస్తుంది" అన్నారు దైవప్రవక్త (స)- (అబూయాలా-తబ్రాని)

దైవప్రవక్త (స) ప్రవచనం:"తల్లి పాదాల క్రింద స్వర్గం ఉంది." (తబ్రాని)

ఒకతను దైవప్రవక్త (సల్లం) సన్నిధికి వచ్చి దైవమార్గంలో జిహాద్ (ధర్మయుద్ధం) చేయడానికి అనుమతి ఇవ్వమని అడిగాడు. అప్పుడు దైవప్రవక్త (సల్లం) "నీ తల్లి బ్రతికే



ఉందా?" అని అడిగారు. దానికా వ్యక్తి "బ్రతికే ఉంది" అన్నాడు. "అయితే నీ తల్లి కాళ్ళు పట్టుకో. ఆమే నీ స్వర్గం" అన్నారు దైవప్రవక్త (సల్లం). (తర్గీబ్ వ తర్హీబ్)

ఒకతను వచ్చి "నేను జిహాద్‌లో పాల్గొనాలని అనుకుంటున్నాను. మీ సలహా ఏమిట"ని అడిగాడు. దానికి దైవప్రవక్త (స) నీ తల్లి బ్రతికే ఉందా?" అని అడిగారు. ఆ వ్యక్తి "నా తల్లి బ్రతికే ఉంది" అన్నాడు. అప్పుడు దైవప్రవక్త (స) "అయితే నువ్వామెకు సేవ చేస్తూఉండు. ఆమె పాదాల క్రింద (నీ)స్వర్గం ఉంది" అని చెప్పారు. (నసాయి)

హజ్రత్ ఉవైస్ ఖర్నీ (రహ్మలై) యమన్ దేశ నివాసి. మహనీయ ముహమ్మద్ (స) దైవప్రవక్తగా ప్రభవించిన సమాచారం, ఇస్లాం సందేశం ఆయన దగ్గరకు చేరినప్పుడు ఆయన వెంటనే ఇస్లాం స్వీకరించారు. ఆయనగారి తల్లి అప్పటికి బ్రతికే ఉంది. కాని ఆ వృద్ధురాలు చాలా బలహీనంగా ఉండటం వల్ల కొడుకు సేవ మీద ఆధారపడవలసి వచ్చింది. హజ్రత్ ఖర్నీ (రహ్మలై) దైవప్రవక్త (స) బోధనల ప్రకారం జీవితాంతం తల్లి సేవలో ఉండిపోయారు. దైవప్రవక్త (స) పట్ల హృదయంలో అమితమైన ప్రేమాభిమానాలు ఉన్నప్పటికీ ఆయన దైవప్రవక్త (స)ను దర్శించి ఆ మహనీయునికి సహాబీ (ప్రత్యక్ష అనుచరుడు) అయ్యే భాగ్యానికి నోచుకోలేక పోయారు.

హజ్రత్ ఉవైస్ ఖర్నీ (రహ్మలై) వైఖరి దైవప్రవక్త (స)కు ఎంతగానో నచ్చింది. ఆయన ఒకసారి అనుచరులకు హితోపదేశం చేస్తూ "తాబయీన్ (ప్రవక్త ప్రత్యక్ష అనుచరుల్ని దర్శించిన ముస్లింల)లో ఒకతను ఉన్నాడు. అతని పేరు ఉవైస్. అతనికి ఒక తల్లి ఉంది. అతని శరీరం మీద ఒక తెల్లని మచ్చ కూడా ఉంటుంది. మీరు మీ పొరపాట్లకు అతడ్ని మన్నింపు ప్రార్థన చేయమని అడగండి" అని చెప్పారు.

దైవప్రవక్త (సల్లం) ఒకసారి నాలుగు ఘోరపాపాలను గురించి ప్రస్తావించారు. అందులో మొట్టమొదటి ఘోరపాపం తల్లి పట్ల అవిధేయత చూపడమే. (బుఖారి, ముస్లిం)

# 57. సంతాన శిక్షణ

స్త్రీ కార్యాచరణపరిధిలో భర్తపట్ల విధేయత తర్వాత సంతానశిక్షణకు ఎంతో ప్రాముఖ్యం ఇవ్వబడింది. "మీరు ఉత్తమ తల్లులను ఇవ్వండి, నేను మీకు ఉత్తమ జాతిని ఇస్తాను" అన్న నెపోలియన్ బోనాపార్టీ మాట కూడా సంతాన శిక్షణ ప్రాముఖ్యం తెలియజేస్తోంది. దీన్నిబట్టి భావితరాల భవితవ్యం స్త్రీ చేతిలోనే ఉందని కూడా తెలుస్తోంది. పిల్లల ప్రాథమిక పాఠశాల తల్లివడియే. కనుక స్త్రీ తలచుకుంటే సమాజాన్ని సంస్కరించ గలుగుతుంది. అలాగే ఆమె తలచుకుంటే సమాజాన్ని చెడగొట్ట గలుగుతుంది కూడా.

ఇస్లాంలో తల్లిదండ్రులు కలుసుకున్నప్పటి నుంచే సంతానశిక్షణ ప్రారంభమవు తుంది. వారప్పుడు దైవప్రవక్త (స) నేర్పిన ఈ దుఆ (వేడుకోలు) పదాలు పఠిస్తారు:

"దేవుని పేరుతో ప్రారంభిస్తున్నాం. దేవా! మమ్మల్ని షైతాన్ కీడు నుండి కాపాడు. నీవు మాకు ప్రసాదించే సంతానాన్ని కూడా షైతాన్ కీడు నుండి కాపాడు." (బుఖారి)

సంతానశిక్షణ విషయంలో ఖుర్ఆన్ బోధనలు ఏమిటో పరిశీలిద్దాం. హజ్రత్ లుఖ్మాన్ (అలైహి) తన కుమారునికి హితోపదేశం చేస్తూ ఇలా చెబుతారు:

"లుఖ్మాన్ తన కుమారునికి హితోపదేశం చేసిన సందర్భం గుర్తుచేసుకో. అతను తన కుమారునితో 'బాబూ! దేవునికి (ఆయన దైవత్వంలో) ఎవరినీ సాటికల్పించకు. దేవునికి సాటికల్పించడం ఘోరపాపం, దారుణమైన అన్యాయం' అన్నాడు." (31:13)

"కుమారా! ఏదయినా బండరాయిలో గాని, ఆకాశంలోగాని, భూమిపైగాని, లేదా మరెక్కడైనా సరే ఆవగింజంత వస్తువు దాగివున్నా దేవుడు దాన్ని బయటికి తీయగలడు. ఆయన ఎంతో సూక్ష్మగ్రాహి, సమస్తం తెలిసినవాడు."

"(కనుక) కుమారా! నీవు ప్రార్థనా (నమాజ్) వ్యవస్థ నెలకొల్పు. (ప్రజలను) మంచిని గురించి ఆదేశించు, చెడు విషయాల నుండి వారించు. కష్టాలు వచ్చినప్పుడు సహనం వహించు. ఇవి ఎంతో ధైర్యసాహసాలతో కూడిన విషయాలు. భూమిపై (మిడిసిపాటుతో) నిక్కుతూ నీల్గుతూ నడవకు. తననుతాను పొగడుకునే, మిడిసిపడే వాడ్ని దేవుడు ఏమాత్రం మెచ్చుకోడు. నీ నడవడిలో మధ్యేమార్గాన్ని అవలంబించు. నీ కంఠస్వరం కాస్త తగ్గించుకో. అన్ని స్వరాల కంటే గాడిదస్వరం అత్యంత కఠోరమైనది". (31:16-19)

"ఇబ్రాహీంను అతని ప్రభువు 'నిన్ను నీవు (మాకు) సమర్పించుకో' అని ఆదేశించగానే అతను (ఏమాత్రం తటపటాయించకుండా) 'నన్ను నేను సర్వలోక ప్రభువుకు సమర్పించు కుంటున్నా'నని అన్నాడు. తరువాత అతను తన కుమారులక్కూడా ఈ (స్వయం సమర్పణ) విధానాన్నే ఉపదేశించాడు." యాఖూబ్ కూడా తన కొడుకులకు హితవు చేస్తూ 'దేవుడు మీ కోసం ఈ జీవన విధానాన్నే నిర్ణయించాడు. కనుక చనిపోయే వరకూ దైవవిధేయులు (ముస్లిములు)గానే జీవించాలి' అన్నాడు." (2:131,132)

## బిడ్డజన్మ తరువాత తీసుకునే జాగ్రత్తలు

పిల్లవాడు పుట్టగానే అతని కుడి చెవిలో అజాన్, ఎడమ చెవిలో ఇఖామత్ పఠించాలి. హజ్రత్ ఫాతిమా (రజి)కు "ఇమామ్ హుసైన్ (రజి) పుట్టగానే దైవప్రవక్త (సల్లం) వచ్చి ఆయన కుడి చెవిలో అజాన్, ఎడమ చెవిలో ఇఖామత్ పఠించారు." (తబ్రాని)

"పిల్లవాడు పుట్టిన వెంటనే అతని చెవుల్లో దేవుని స్తుతి, దైవప్రవక్త (సల్లం) ప్రస్తావన పడగానే షైతాన్ అక్కడ్నుంచి పారిపోతాడు. పిల్లవాడు పుట్టిన ఏడవ రోజున అతనికి పేరుపెట్టాలి. (తప్పుడు అర్థం వచ్చే పేరు కాకుండా మంచి పేరు పెట్టాలి.) తరువాత తల వెంట్రుకలు గొరిగించి 'అఖీఖా' (జన్మదినోత్సవం) చేయాలి." (తిర్మిజి)

దైవప్రవక్త (స) ప్రవచనం: "ప్రజలారా! ప్రళయదినాన మీరు మీపేరు, మీతండ్రి పేరుతో పిలవబడతారు. అంచేత మీరు మంచిపేర్లు పెట్టుకోండి." (అబూదావూద్)

పిల్లవాడికి అదే రోజున ఖత్నా (వడుగు) కూడా చేయవచ్చు. బిడ్డకు తల్లిపాలే అన్నిటికంటే శ్రేష్ఠమైన ఆహారం. కనుక వీలైనంతవరకు తల్లిపాలే పట్టాలి. పోతే పిల్లవాడు మాట్లాడటం మొదలెట్టగానే ముందుగా అతని చేత 'లాఇలాహ ఇల్లల్లాహు, ముహమ్మద్ రసూలుల్లాహ్' అని చెప్పించాలి.

దైవప్రవక్త (స) పిల్లలను అమితంగా ప్రేమించేవారు. "మన పెద్దలను గౌరవించని, మన పిన్నలపట్ల వాత్సల్యం చూపనివాడు మనలోనివాడు కాదు" అన్నారాయన. (హదీసు).



పిల్లలకు విద్యాబుద్ధులు గరిపే విషయమయి ఆయన ఇలా అన్నారు:

"తండ్రి తన సంతానానికి ఇచ్చే కానుకలలో మంచి విద్యాబుద్ధులు గరపడమే గొప్ప కానుక. దానికి మించిన శ్రేష్ఠమైన కానుక మరేదీ లేదు." (తిర్మిజి)

"తండ్రి తన కొడుకుకు విద్యాబుద్ధులు గరపడం కంటే మించిన గొప్ప ఉపకారం అతని నుండి మరేదీ లేదు." (తిర్మిజి)

ప్రళయదినాన మనిషితో అందరికన్నా ముందు జగడమాడేవారు అతని సంతానమే. వారు దేవునితో "దేవా! ఇతడ్ని గురించి మా ఫిర్యాదు తీసుకో. ఇతను మమ్మల్ని అధర్మ సంపాదనతో పోషించాడు. మాకు విధిగా నేర్పవలసిన విషయాలు ఇతను మాకు నేర్ప లేదు. అందువల్ల మేము అజ్ఞానులుగా ఉండిపోయాము" అని అంటారు. (తిర్మిజి)

"ఒక వ్యక్తి తన సంతానానికి విద్యాబుద్ధులు గరపడం మూడున్నర సేర్ల ధాన్యం లేక ఖర్జూరపండ్లు వగైరా దానం చేయడం కంటే ఎంతో శ్రేష్ఠమైన విషయం" (తిర్మిజి)

పై హదీసులలో తండ్రి ప్రస్తావన వచ్చింది. దీనర్థం సంతానశిక్షణకు తండ్రి మాత్రమే బాధ్యుడని కాదు, తండ్రితో పాటు తల్లి కూడా బాధ్యురాలే. ముఖ్యంగా పిల్లల ప్రాథమిక దశలో వారి శిక్షణ గురించి ఎక్కువగా తల్లే బాధ్యురాలవుతుంది. దైవప్రవక్త (సల్లం) బోధించిన మరికొన్ని హితోక్తులు చూడండి:

"మీ పిల్లలు ఏడేళ్ళ వయస్సుకు చేరుకోగానే వారిని నమాజు గురించి ఆదేశించండి. పదేళ్ళ వయస్సు నిండిన తరువాత (కూడా) నమాజు చేయకపోతే వారిని కొట్టండి. పదేళ్ళు నిండిన తరువాత వారి పడకలు వేరుచేయండి." (అబూదావూద్)

## స్త్రీసంతానం-తల్లిదండ్రుల బాధ్యతలు

"దేవుడు భూమ్యాకాశాలకు యజమాని, సార్వభౌముడు. తాను తలచిన ప్రతిదాన్నీ సృష్టించగలడు. తాను కోరినవిధంగా కొందరికి మగసంతానం, కొందరికి ఆడసంతానం, మరి కొందరికి ఆడ, మగ సంతానం ప్రసాదిస్తాడు. అలాగే తాను కోరినవారిని సంతాన హీనులుగా కూడా చేస్తాడు. ఆయన గొప్ప జ్ఞానసంపన్నుడు, సమస్తకార్యాలు చేయగల సమర్థుడు." (ఖుర్ఆన్-42:49,50)

"దారిద్ర్యభయంతో మీ సంతానాన్ని చంపుకోకండి. మేము వారికీ ఆహారమిస్తున్నాం, మీకూ ఇస్తున్నాం. వారిని చంపడం ఘోరమైన పాపం." (ఖుర్ఆన్-17:31)

దేవుడు సృష్టికర్త, ఆరాధ్యుడు మాత్రమే కాదు; ఆయన శాసనకర్త, పోషకుడు కూడా. ప్రాణికోటిని పోషించే బాధ్యతను ఆయనే తీసుకున్నాడు. ఉపాధి సముపార్జనకు మానవులు కృషి మాత్రమే చేయగలరు. ఉపాధిప్రదాత దేవుడే. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఆయన ఆహారోత్పత్తి కుడా పెంచుతున్నాడు. అధికోత్పత్తి కోసం వ్యవసాయరంగంలో అద్భుత విధానాలు, అసాధారణ సాంకేతికపద్ధతుల్ని మానవులకు అనుగ్రహించినవాడు ఆ ప్రభువే.

అజ్ఞాన కాలంలో అరబ్బులు ఆడపిల్లల్ని దేవుని సంతానంగా నమ్మేవారు. కాని అలాంటి పిల్లల్ని రక్షణ, దారిద్ర్యభయాలతో నిర్దాక్షిణ్యంగా సజీవసమాధి చేసేవారు. వారి పైశాచిక చేష్టల్ని ఖుర్ఆన్ ఈ విధంగా ఖండించింది:

“అజ్ఞానాంధకారంలో పడి తమ సంతానాన్ని హతమార్చినవారు, దేవుడు ప్రసాదించిన ఆహారవస్తువుల్ని దేవుని మీద అబద్ధాలుమోపి నిషేధించుకున్నవారు ఘోరంగా నష్టపోతారు. వారు పూర్తిగా మార్గభ్రష్టులై పోయారు.” (ఖుర్ఆన్–6:140)

ఇలాంటి అజ్ఞానులు ప్రతి యుగంలో దారిద్ర్య భయంతో తమ సంతానాన్ని హతమార్చుతున్నారు. కుటుంబ నియంత్రణ పేరుతో నేడు నాగరికులమని చెప్పుకునేవారు మానవజాతిని ప్రపంచంలోకే రానీయకుండా మాతృగర్భంలోనే మట్టుపెడ్తున్నారు. ట్యుబెక్టమీ-వేసక్టమీ ఆపరేషన్ల ద్వారా, మందులు-కండోమ్‌ల ద్వారా పిండోత్పత్తిని అరికడ్తున్నారు. దైవం ప్రసాదించిన సాంకేతిక పరిజ్ఞానాన్ని దుర్వినియోగపరుస్తూ భ్రూణహత్యలకు సైతం పాల్పడుతున్నారు.

“వీరు దేవునిదాసులలో కొందరిని ఆయనకు సంతానం అంటగట్టారు. మానవుడు నిజంగా పరమ కృతఘ్నుడు. దేవుడు తన సృష్టితాలలో కొందరిని తనకు కూతుళ్ళుగా ఎంచుకొని, మీకు మాత్రం కోరి కొడుకుల్ని ప్రసాదించాడా? (ఎంతఅపచారం?) అయితే వారు కరుణామయుడయిన దేవునికి ఏ ఆడసంతానం అంటగట్టారో ఆ సంతానం గురించిన శుభవార్తే వారిలో ఎవరికైనా విన్పిస్తే అతను ముఖం మాడ్చుకొని పుట్టెడు దుఖంతో క్రుంగిపోతాడు. ఆభరణాలలో అల్లారుముద్దుగా పెరుగుతూ, వాదనలో తన అభిప్రాయాన్ని కూడా సరిగా వివరించలేని ఆడపిల్ల దేవుని వాటాలోకి వచ్చిందా?” (ఖుర్ఆన్–43:15–18)

పూర్వం అరబ్బులు సంతానోత్పత్తిని అరికట్టేందుకు సంపర్క సమయంలోనే వీర్యం స్త్రీ గర్భంలోకి పోకుండా నిరోధించేవారు. దైవప్రవక్త (స) ఈ చర్య పట్ల అయిష్టత వెలిబుచ్చుతూ “ప్రళయం వరకు పుట్టవలసిన పిల్లలు ఎట్టి పరిస్థితిలోనూ పుట్టి తీరుతారు” అన్నారు.

దైవప్రవక్త (స) సన్నిధిలో ఆయన అనుచరులు కొందరు నిష్ఫలన సంపర్కం గురించి ప్రస్తావిస్తూ “దైవప్రవక్తా! సంపర్కం తర్వాత స్త్రీ గర్భం దాల్చకుండా ఉండేందుకు మేమేదైనా పని చేయవచ్చా?” అని అడిగారు. దానికి దైవప్రవక్త (స) “మీరు నిష్ఫలన సంపర్కం చేయడం వల్ల ఒరిగేదేమీ లేదు. దేవుడు ఏ మానవుణ్ణి పుట్టించాలని విధివ్రాతలో రాశాడో అతను ఎలాగూ పుట్టితీరుతాడు“ అని అన్నారు. (బుఖారి)

ప్రవక్త అనుచరుడొకాయన నిష్ఫలన సంపర్కం గురించి ప్రస్తావిస్తూ, ఇలా చేయవచ్చా? అని ప్రశ్నించారు. దానికి దైవప్రవక్త (స) “ప్రతి వీర్యబిందువు ద్వారా పిల్లవాడు పుట్టాల్సిన అవసరంలేదు. దేవుడు ఎవరినైనా పుట్టించదలచుకున్నప్పుడు ఆయన నిర్ణయాన్ని (మానవుని) ఏయుక్తీ అడ్డుకోజాలదు” అని అన్నారు. (ముస్లిం)

ఆనాటిఅరబ్బులు తల్లిపాలవల్ల బిడ్డకు నష్టం కల్గుతుందని ఆమెతో సంభోగిస్తున్నప్పుడు వీర్యం లోపలికిపోకుండా చేసేవారు. దైవప్రవక్త (స) అలా చేయడాన్ని కూడా ఇష్టపడ లేదు.

దైవప్రవక్త (స) ఓసారి అనేకమంది అనుచరుల మధ్య కూర్చొని మాట్లాడుతూ “స్త్రీ బిడ్డకు పాలిచ్చే కాలంలో భర్త ఆమెతో సంభోగించడంపై నేను మొదట్లో ఆంక్ష విధించాలనుకున్నాను. కాని రోమన్లు, పార్సీలు ఇలా చేస్తున్నప్పటికీ వారి పిల్లలకు ఎలాంటి నష్టం వాటిల్లకపోవడం నేను గమనించాను” అని అన్నారు. ఆ తర్వాత అనుచరులు నిష్ఫలన సంపర్కం గురించి అడిగారు. దానికి దైవప్రవక్త (స) ఇలా సమాధానమిచ్చారు: “నిష్ఫలన సంపర్కం చేయడమంటే పరోక్షంగా (బిడ్డను) సజీవసమాధి చేయడమే. ఈ



పని ‘సజీవసమాధి చేయబడిన పసిబాలికను నీవు ఏ తప్పు వల్ల చంపబడ్డావని అడిగినప్పుడు...’ (ఖుర్ఆన్-81:8) అనే సూక్తి లాంటిదే.” (ముస్లిం)

ఆడపిల్లల పట్ల వివక్ష అరేబియాలో దైవప్రవక్త (స) ప్రభవించక పూర్వం మరింత ఎక్కువగా ఉండేది. దైవప్రవక్త(స) వారిని ఖుర్ఆన్, హదీసుల ద్వారా నయాన భయాన ఎంతగానో నచ్చజెప్పారు. ముఖ్యంగా ఖుర్ఆన్‌లోని పరలోకపు జవాబుదారీ భావన, పరలోక దుష్పరిణామాలను గురించి తెలియజేసి వారినిలా తీవ్రంగా హెచ్చరించారు:

“సూర్యుడు నిస్తేజమై చుట్టివేయబడినప్పుడు, నక్షత్రాలు చెదరి కాంతి కోల్పోయినప్పుడు, పర్వతాలు కదలి నడచినప్పుడు, పది నెలల సూడిఒంటెలు వాటి మానాన వదలివేయబడినప్పుడు, క్రూరమృగాలు ఒకచోట గుమిగూడినప్పుడు, సముద్రం ప్రజ్వరిల్లినప్పుడు, ఆత్మలు (దేహాలతో) అనుసంధానం చేయబడినప్పుడు, సజీవసమాధి చేయబడిన పసిబాలికను నీవు ఏతప్పు వల్ల చంపబడ్డావని అడిగినప్పుడు, కర్మలచిట్టా తెరవబడినప్పుడు, ఆకాశానికున్న తెర తొలగించబడినప్పుడు, నరకం దహించబడినప్పుడు, స్వర్గం సమీపానికి తేబడినప్పుడు– ఆ...అప్పుడు ప్రతిమనిషికీ తానేమి వెంటతెచ్చుకున్నాడో తెలుస్తుంది.” (ఖుర్ఆన్–81:1–14)

ఈ సూక్తులు ఆనాడు అరబ్బు సమాజంలో పెద్ద సంచలనం సృష్టించాయి. ఇస్లాం స్వీకరించని బహుదైవారాధకులు సైతం ఆడపిల్లల్ని సజీవసమాధి చేయడానికి భయపడటం మొదలెట్టారు. ఆ తరువాత అనతి కాలంలోనే ఈ వ్యవహారం గురించి అరబ్బులో విప్లవాత్మకమైన మార్పు వచ్చింది. వారు ఆడపిల్లల్ని మగపిల్లలతో పాటు సమానంగా చూసుకోవడం ప్రారంభించారు. రెండే రెండు దశాబ్దాలలో స్త్రీస్వాతంత్ర్య ప్రభంజనం అరేబియా దశదిశలా వీచి యావత్తు స్త్రీజాతినే ఆశ్చర్యపరిచింది.

## నరకానికి అడ్డుగోడలు ఆడపిల్లలే

బాలికల సంరక్షణపై ఇస్లాం ప్రత్యేక దృష్టి సారించింది. బాలికలను ఉత్తమ రీతిలో పెంచి పోషించినవారికి గొప్ప ప్రతిఫలం లభిస్తుందని తెలిపింది. దైవప్రవక్త (సల్లం) వివిధ సందర్భాలలో ఇలా ఉపదేశించారు:

“ఒక వ్యక్తికి ఓ కుమార్తె ఉండి, అతనా బాలికను సజీవసమాధి చేయకుండా, ఎలాంటి బాధలకు, అవమానాలకు గురిచేయకుండా, ఆమె కంటే కొడుక్కు ఎక్కువ ప్రాధాన్యమివ్వకుండా పోషించేవానికి దేవుడు స్వర్గం ప్రసాదిస్తాడు”. (అబూదావూద్)

“ఏ దాసునిపై లేక దాసిపై దేవుడు కుమార్తెల (సంరక్షణా)బాధ్యతను మోపినప్పుడు అతను లేక ఆమె ఆ కుమార్తెల పట్ల మంచిగా ప్రవర్తిస్తారో, ఆ ఆడపిల్లలు అతడ్ని లేక ఆమెను నరకం నుండి కాపాడే సాధనాలుగా మారుతారు.” (బుఖారి, ముస్లిం)

“బాలికలను ద్వేషించకండి. వారు దుఃఖితురాళ్లు, విలువైన వాళ్ళు.” (అహ్మద్)

ఒకసారి ఆయన “ముగ్గురు కుమార్తెలు లేక ముగ్గురు చెల్లెళ్ళు పెరిగి పెద్దవారయి ఎవరిమీదా ఆధారపడకుండా ఉండే స్థితికి చేరుకునే వరకూ వారిని పోషించి, విద్యాబుద్ధులు నేర్పి, వారి పట్ల ప్రేమ, వాత్సల్యాలతో ప్రవర్తించిన వ్యక్తికి దేవుడు విధిగా స్వర్గప్రాప్తి కలిగిస్తాడు” అని బోధించారు. అప్పుడు ఒకతను “దైవప్రవక్తా! మరి ఇద్దరు ఉంటేనో?” అనడిగాడు. దానికి ఆయన “అప్పుడు కూడా” అన్నారు. జనం అప్పుడు

ఒక్క ఆడపిల్లను గురించి అడిగినా దైవప్రవక్త (స) అదే సమాధానమిచ్చేవారని ఈ హదీసు ఉల్లేఖకుడు హజ్రత్ ఇబ్నెఅబ్బాస్ అన్నారు. (తిర్మిజి, అబూదావూద్)

మరోసారి దైవప్రవక్త (స) హితోపదేశం చేస్తూ "ఏ దాసుడు ఇద్దరు ఆడపిల్లల (సంరక్షణ) బాధ్యత వహిస్తూ వారిని యుక్తవయస్సు వచ్చేవరకు (సరిగా) పోషిస్తాడో, ప్రళయదినాన అతను, నేను (పరస్పరం) ఈవిధంగా వెంటఉంటాం" అని అన్నారు. హజ్రత్ అనస్ (రజి) ఈ హదీసును ఉల్లేఖిస్తూ దైవప్రవక్త (స) తన చేతి (రెండు)వ్రేళ్ళను పూర్తిగా కలిపి చూపించారని తెలిపారు. (ముస్లిం)

పై హదీసుల ద్వారా మూడు విషయాలు ప్రస్ఫుటమవుతున్నాయి. 1-తల్లిదండ్రుల సత్ప్రవర్తన ఆడపిల్లల హక్కు. 2-ఆడపిల్లల పట్ల సత్భావంతో మెలిగిన తండ్రి లేక తల్లి ప్రళయదినాన దైవప్రవక్త (స)కు అతి చేరువులో ఉంటారు. 3-అతనికి లేక ఆమెకు నరకం నుండి విముక్తి కలిగి స్వర్గప్రవేశం లభిస్తుంది. దైవప్రవక్త (స) సతీమణి హజ్రత్ ఆయిషా (రజి) ఒక సంఘటన గురించి ఈ విధంగా తెలిపారు:

"ఒకరోజు ఓ (పేద) స్త్రీ ఇద్దరు బాలికలను వెంటబెట్టుకొని నా దగ్గరకు యాచించ డానికి వచ్చింది. అప్పుడు నా దగ్గర ఒక ఖర్జూరపండు తప్ప మరేమీ లేదు. ఆ ఖర్జూర పండునే నేనామె చేతిలో పెట్టాను. ఆమె దాన్ని తన ఇద్దరు కూతుళ్ళకు చెరి సగం పంచిచ్చి తనుమాత్రం దాన్ని కాస్తయినా రుచిచూడ లేదు. ఆ తర్వాత ఆమె లేచి వెళ్ళి పోయింది. ఆమె వెళ్ళిపోయాక దైవప్రవక్త (స) నా ఇంటికి వచ్చారు. నేనాయనకు ఈ సంఘటన గురించి చెప్పాను. అప్పుడాయన ఇలా అన్నారు: "ఆడపిల్లల (సంరక్షణ బాధ్యత) ద్వారా పరీక్షకు గురిచేయబడిన ఏ మనిషయినా వారిపట్ల మంచిగా ప్రవర్తిస్తే అతనికోసం ఈ బాలికలు నరకానికి అడ్డు(గోడలు) అవుతారు." (ముత్తఫఖున్ అలైహ్)

"పేదలకు దానం చేయడం గొప్ప పుణ్యకార్యం. అది నరకాగ్ని నుండి కాపాడే ముక్తి సాధనం. అందువల్ల 'మీ దగ్గర ఒక ఖర్జూరపు పండయినా సరే ఉంటే దానంచేసి నరకాగ్ని నుండి కాపాడుకోండి" అన్నారు దైవప్రవక్త (స) అలాంటి "దానాలలో గొప్ప దానం (సదఖా) ఏమిటో మీకు చెప్పనా?" అన్నారు ఆయన ఓసారి తన అనుచరులతో. "తప్పకుండా చెప్పండి దైవప్రవక్తా!" అన్నారు అనుచరులు. అప్పుడు దైవప్రవక్త (స) ఈవిధంగా చెప్పారు: "(విడాకులివ్వబడటం వల్లగాని, లేదా వితంతువయినందు వల్ల గాని) నీ దగ్గరకు తిప్పిపంపబడిన నీ కుమార్తెకు నువ్వు తప్ప మరెవరూ సంపాదించి పెట్టేవారు లేనప్పుడు నువ్వామెకు మేలు చేయాలి." (ఇబ్నెమాజ)

దైవప్రవక్త (స)కు నలుగురు కుమార్తెలు. వారందర్నీ ఆయన ఎంతో అల్లారు ముద్దుగా పెంచారు. వారిలో హజ్రత్ ఫాతిమా (రజి) అందరికన్నా చిన్న కుమార్తె. ఓసారి దైవప్రవక్త (స) ఆమెను గురించి ప్రస్తావిస్తూ "ఫాతిమా నా బంగారుకొండ. ఆమెకు ఎవరైనా కోపం కలిగిస్తే వారు నాకు కోపం కలిగించినట్టే" అని అన్నారు.

హజ్రత్ ఫాతిమా (రజి)ను దైవప్రవక్త (స) ఎంతగా ప్రేమించేవారంటే ఆమె ఇంటికి వస్తే ఆయన ఆమెకు స్వాగతం చెప్పడానికి లేచి నిలబడేవారు. ఆమెను తన పక్కన కూర్చోబెట్టుకొని ప్రేమగా ఆమె నుదుటిని ముద్దాడేవారు. ఎక్కడికైనా ప్రయాణమై



బయలుదేరితే అందరికన్నా చివర్లో ఆమె దగ్గర్నుంచే వీడ్కోలు తీసుకునేవారు. ప్రయాణం నుంచి తిరిగొచ్చిన తరువాత అందరికన్నా ముందుగా హజ్రత్ ఫాతిమా (రజి)నే కలుసుకొని యోగక్షేమాలు విచారించేవారు.

దైవప్రవక్త (స) కుమార్తె హజ్రత్ జైనబ్ (రజి)కు ఒక కూతురు ఉంది. ఆ పాప పేరు ఉమామా. దైవప్రవక్త (స) ఉమామాను కూడా ఎంతో ప్రేమించేవారు. నమాజు చేయడానికి మసీదుకు వెళ్తే ఆమెను వెంటబెట్టుకునేవారు. ఆయన నమాజు చేస్తున్న ప్పుడు ఆ పాప తాతయ్య వీపు మీదెక్కి కూర్చుంటుంది. దైవప్రవక్త (స) రుకూ, సజ్దాలు చేయవలసి వచ్చినప్పుడు ఆమెను వీపు మీది నుంచి మెల్లిగా దించివేస్తారు. రుకూ, సజ్దాల నుంచి లేవగానే ఆ పాప మళ్ళీ తాతయ్య వీపుపైకెక్కి కూర్చునేది.

దైవప్రవక్త (స) ఆచరణ, ఆయన చేసిన హితవులతో ప్రభావితులయిన ఆయన అనుచరులు ఆడపిల్లల పట్ల ప్రవర్తించిన తీరు కూడా చూడండి:

హజ్రత్ హమ్జా (రజి) ఉహద్ యుద్ధంలో అమరగతి కావడంతో ఆయన కుమార్తె ఉమామా మక్కాలో అనాథగా ఉండిపోతుంది. మక్కా ముస్లింల అధీనంలోకి వచ్చిన ప్పుడు, ఆపాప బాబాయి అంటూ రాగానే హజ్రత్ అలి (రజి) ఆమెను వళ్ళోకి ఎత్తుకుం టారు. తర్వాత ఆ పాపను తన అర్ధాంగికి అందిస్తూ "ఇదిగో తీసుకో నీ పినతండ్రి కూతుర్ని" అంటారు. అయితే హజ్రత్ జాఫర్ తయ్యార్ (రజి) అభ్యంతరం చెబుతూ "ఈ పాపతో నాకు రెండువిధాల బంధుత్వం ఉంది. ఈమె నా పినతండ్రి కూతురు. ఈమె పిన్ని నాఇంట్లో ఉంటున్నది. కనుక ఈ పాపను నాకివ్వండి" అని అంటారు.

హజ్రత్ జైద్ (రజి) ముందుకు వచ్చి "దైవప్రవక్తా! ఈ పాప నాకు లభించాలి. హమ్జా (రజి) నా ధార్మిక సోదరుడు" అని అంటారు. హజ్రత్ అలి (రజి) తన వాదన విన్పిస్తూ "ఈ పాప నా చెల్లెలు, అందరికన్నా ముందు ఈమె నా ఒడిలోకే వచ్చింది. కాబట్టి ఈ పాప నాకే దక్కాలి" అని అంటారు.

చివరికి దైవప్రవక్త (స) "పినతల్లి కన్నతల్లితో సమానమవుతుంది. కనుక ఈ పాప జాఫర్ (రజి) ఒడిలోకే వస్తుంద"ని చెప్పి ఈ సమస్యను పరిష్కరించారు.

దైవప్రవక్త (స) తన అనుచరుల హృదయాల్లో అనాథ బాలిక పట్ల పెల్లుబికిన ప్రేమ, సానుభూతుల్ని చూసి పరమానందభరితులవుతారు. ఆ మహనీయుని అమృత బోధనల ఫలితంగా బాలికలను సజీవసమాధి చేసిన రాతిగుండెలు సైతం మైనంలా కరిగిపోయాయి.

## పాలుతాగే పసివాడి పసిడి పలుకులు

హజ్రత్ అబూహురైరా (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ఇలా అన్నారు: "ఉయ్యాలలో (పసిపిల్లలుగా) ఉన్నప్పుడే ముగ్గురు మాట్లాడారు. (ఒకాయన) ఈసా(అలై), (రెండోతను) జురైజ్. జురైజ్ దైవారాధకుడు. ఆయన ఓ కుటీరాన్ని (ఆశ్రమంగా) తయారుచేసుకున్నాడు. (ఒకరోజు) ఆయన తన కుటీరంలో నమాజు చేస్తుండగా ఆయన తల్లి వచ్చి 'జురైజ్!' అని పిలిచింది. తల్లి పిలుపు విని ఆయన 'దేవా! (ఒకవైపు) అమ్మ పిలుస్తోంది. నేనా నమాజులో ఉన్నాను. (ఇప్పుడేం చేయాలి అన్న ఆలోచనలో పడిపోయాడు). చివరికి

నమాజు మీదే మనస్సు లగ్నం చేసుకున్నాడు. (ఆయన తల్లి వెళ్ళిపోయింది) ఆమె మరుసటిరోజు వచ్చినప్పుడు కూడా ఆయన నమాజులోనే ఉన్నాడు. ఆమె 'జురైజ్!' అని పిలిచింది. అప్పుడు కూడా ఆయన అమ్మపిలుపుకు సమాధానం ఇవ్వాలా లేక నమాజ్‌ని కొనసాగించాలా అన్న సందిగ్ధంలో పడిపోయాడు. చివరికి ఆయన నమాజునే కొనసాగించాడు. (ఆయన్నుంచి ఎలాంటి సమాధానం రాకపోవటంతో ఆయనతల్లి వెళ్ళిపోయింది.) తిరిగి మూడోరోజు వచ్చినప్పుడు కూడా ఆయన నమాజులోనే ఉన్నాడు. ఆమె 'జురైజ్!' అని పిలిచింది. తల్లి పిలుపు విని ఆయన "దేవా! అటు అమ్మ పిలుస్తోంది. ఇటు నేను నమాజులో ఉన్నాను. (ఇప్పుడేం చేయాలి?"అన్న ఆలోచనలోనే ఉండిపోయాడు) ఆఖరికి నమాజునే కొనసాగించాలనుకున్నాడు. దాంతో ఆయన తల్లి ఆయన్ని శపించింది. "దేవా! ఇతనికి వేశ్యలు ఎదురుపడేదాకా ఇతని ప్రాణం తీయకు" అని చెప్పి వెళ్ళిపోయింది.

(కొంతకాలానికి) ఇస్రాయీల్‌జాతిలో జురైజ్ ఆరాధనకు బాగా పేరొచ్చింది. వారిలో అందగత్తె అయిన ఒక వ్యభిచారిణి ఉండేది. ఆమె (ఇస్రాయీల్ జాతివారితో) "మీరు సరేనంటే నేను ఈయన్ని నా వలలో వేసుకుంటాను" అంది. ఆ తర్వాత ఆమె ఆయన ముందుకు వచ్చి ఆయన్ని కవ్వించింది. కాని ఆయన మాత్రం తన దృష్టి మరల్చలేదు. ఆమె (అక్కడ్నుంచి) ఓ పశువులకాపరి దగ్గరికి వెళ్ళింది. ఆ పశువుల కాపరి జురైజ్ ఆశ్రమానికి వస్తూపోతూ ఉండేవాడు. ఆ స్త్రీ పశువులకాపరికి తన మీద అధికారం ఇచ్చింది. అతనామెతో వ్యభిచారం చేశాడు. దాంతో ఆమె గర్భవతి అయింది. (కొంత కాలానికి) ఆమెకు ఓ మగపిల్లవాడు పుట్టాడు. అయితే ఆ పిల్లవాడు తనకు జురైజ్ వల్ల పుట్టాడని ఆ స్త్రీ జనంలో ప్రచారం చేసింది. అది తెలుసుకొని జనం జురైజ్‌ను కొట్టడానికి పరుగెత్తారు. ఆయన్ని కుటీరం నుంచి ఈడ్చి కుటీరాన్ని నేలమట్టం చేశారు. తరువాత ఆయన్ని (క్రిందపడేసి) చితకబాదసాగారు. ఆయన (కొంతసేపటికి తేరుకొని) "అసలు నేనేం పాపం చేశానని మీరు నన్ను కొడుతున్నారు" అనడిగాడు. దానికి వారు "నీవు ఆ స్త్రీతో వ్యభిచారం చేశావు, నీ వల్ల ఆమెకు ఒక పిల్లవాడు కూడా పుట్టాడు" అని అన్నారు. వారి మాటలు విని "ముందు ఆ పిల్లవాడ్ని తీసుకురండి" అన్నాడాయన. వారా పిల్లవాడ్ని తీసుకొచ్చారు. తర్వాత ఆయన "నన్ను కాస్త విడిచిపెడతారా? నమాజ్ చేసుకుంటాను" అన్నాడు. (వాళ్ళు ఆయన్ని విడిచిపెట్టారు). ఆయన నమాజ్ చేసుకున్నాడు. నమాజ్ ముగించుకున్న తరువాత పిల్లవాడి దగ్గరికి వచ్చి అతని పొట్టపై గిల్లి "బాబూ! నీ తండ్రి ఎవరూ?" అని అడిగాడు. (అంతే మాటలురాని ఆ చంటి పిల్లవాడు) "నా తండ్రి ఫలానా పశువుల కాపరి" అని చెప్పాడు. చంటిపిల్లవాడు మాట్లాడటం చూసి జనం ఆశ్చర్యపోయారు. జురైజ్ మహిమకు ప్రభావితులై అందరూ ఆయన్ని చుంబించసాగారు. భక్తితో తాకసాగారు. వాళ్ళంతా జురైజ్‌తో "మేము మీ కుటీరాన్ని బంగారంతో కట్టించిఇస్తాం" అన్నారు. దానికి జురైజ్ "అవసరం లేదు, మునుపు ఎలాగుందో అలా మట్టితో కట్టించండి చాలు" అని అన్నాడు.

(ఇక మూడవ సంఘటన ఇలా ఉంది.) ఒక స్త్రీ తన చంటిపిల్లవాడికి పాలు త్రాపుతుండగా ఖరీదైన దుస్తులు ధరించివున్న ఒక రౌతు వేగంగా ఆమె ముందు నుంచి దూసుకు వెళ్ళాడు. ఆ స్త్రీ అతడ్ని చూసి "దేవా! నా పిల్లవాడ్ని కూడా అంతటి గొప్ప



వాడిగా చెయ్యి" అని వేడుకుంది. వెంటనే ఆ పిల్లవాడు తల్లి స్తనాన్ని వదలిపెట్టి రౌతు వైపు (పరిశీలనగా) చూసి, "దేవా! నన్ను ఇతనిలా చేయకు" అని అన్నాడు. ఆ తరువాత తల్లి వైపుకు తిరిగి పాలు త్రాగటం ప్రారంభించాడు.

ఆ పిల్లవాడు పాలు త్రాగిన వైనాన్ని దైవప్రవక్త (స) తన చూపుడు వ్రేలుని నోట్లో పెట్టుకొని చప్పరిస్తూ చెప్పిన దృశ్యం ఇప్పటికీ తన కళ్ళముందు మెదలుతోంది.

తరువాత ఆ స్త్రీ ముందు నుంచి కొందరు ఒక బానిసరాలిని కొట్టుకుంటూ తీసుకువెళ్ళారు. వాళ్ళు ఆ బానిసరాలిని (కొడ్తూ) "నువ్వు వ్యభిచారం చేశావు. దొంగతనం చేశావు" అని దూషిస్తున్నారు. ఆమె మాత్రం "హస్బియల్లాహు వనీమల్ వకీల్" (నాకు దేవుని సహాయం చాలు. ఆయనే నన్ను రక్షించగల శ్రేష్ఠ కార్యసాధకుడు)" అని అంటోంది. పిల్లవాడి తల్లి అది చూసి "దేవా! నా కొడుక్కి ఈ బానిసరాలి గతి పట్టకూడదు" అని వేడుకుంది. వెంటనే పిల్లవాడు పాలు త్రాగటం వదలి ఆ బానిసరాలి వైపు చూసి, "దేవా! నన్ను ఈమెలాగే చెయ్యి" అన్నాడు. అప్పుడా తల్లీకొడుకుల మధ్య ప్రశ్నోత్తరాలు జరిగాయి. తల్లి తన కొడుకుని "ముందు ఆ సొగసరివాడు వెళ్ళినప్పుడు నేను నా కొడుకుని కూడా అంతటి వాడిని చేయమని దైవాన్ని ప్రార్థిస్తే నువ్వేమో అలా చేయవద్దని ప్రార్థించావు. తరువాత కొంతమంది ఆ బానిసరాలిని 'నువ్వు వ్యభిచారం చేశావు, దొంగతనం చేశావ'ని తిడ్తూ కొట్టుకుంటూ తీసుకెళ్తుంటే నేను నా పిల్లవాడికి ఆ గతి పట్టకూడదని ప్రార్థించాను. కాని నువ్వు మాత్రం ఆమెలాగే అవ్వాలని కోరుకుంటున్నావు (అసలు నువ్విలా ఎందుకు మాట్లాడుతున్నావు?)" అని అడిగింది. దానికా చంటిపిల్లవాడు "ముందు వెళ్ళిన ఆ సొగసరి పరమ దుర్మార్గుడు. నేనూ అతనిలా కాకూడదని దైవాన్ని ప్రార్థించాను. కాని ఈ బానిసరాలిని వీళ్ళు వ్యభిచారం చేసిందని, దొంగతనం చేసిందని అంటున్నారుగాని నిజానికి ఆమె అలా చేయలేదు. అందుకే దేవుడు ఈమెలా నన్ను కూడా (సౌశీల్యవంతుడిగా) చేయాలని కోరుకున్నాను" అని సమాధానమిచ్చాడు. (బుఖారీ, ముస్లిం)

# 58. వివాహ బంధం

"ఆయన భూమ్యాకాశాలకు సృష్టికర్త. ఆయనే మీజాతి నుండి మీకుతోడుగా జంటల్ని పుట్టించాడు. అలాగే జంతువుల్లో కూడా జంటల్ని పుట్టించాడు. ఇలా ఆయన ప్రాణికోటి సంతతిని విస్తరింపజేస్తున్నాడు. (ఖుర్ఆన్–42:11); మీరు గుణపాఠం నేర్చుకుంటారని మేము ప్రతి వస్తువునీ జంటలు జంటలుగా సృష్టించాము. (ఖుర్ఆన్–51:49)

ఆయన మీకోసం మీజాతి నుండే జీవిత భాగస్వాము(స్త్రీ)లను సృజించాడు, వారి దగ్గర మీరు సౌఖ్యం పొందడానికి. ఇంకా ఆయన మీ మధ్య ప్రేమానురాగాలు, దయాదాక్షిణ్యాలను కూడా జనింపజేశాడు. ఇది కూడా ఆయన సూచనల్లోనిదే. యోచించే వారికి ఇందులో అనేక నిదర్శనాలున్నాయి. (ఖుర్ఆన్–30:21)

ఇస్లాం శాంతి, సుహృద్భావాల వాతావణం సృజించే లక్ష్యంతో అశ్లీలం, అత్యాచారాల్ని పూర్తిగా తుడిచిపెట్టి ఆరోగ్యవంతమైన పవిత్ర సమాజాన్ని నిర్మించగోరుతోంది. అత్యాచారాలు, అక్రమ సంబంధాల వల్ల సమాజానికి మూలస్తంభమైన కుటుంబవ్యవస్థ కుంటుపడుతుంది.

దీనివల్ల కుటుంబంలోనేగాక, మొత్తం సమాజంలో అశాంతి ఏర్పడుతుంది; సుఖవ్యాధులు ప్రబలుతాయి; హత్యలు, ఆత్మహత్యలు పెరుగుతాయి. ఈ రుగ్మతలను నివారించడానికి ఇస్లాం పటిష్ఠమైన వివాహవ్యవస్థ నెలకొల్పదలచింది.

## వివాహనిషిద్ధ స్త్రీలు

ఖుర్ఆన్‌లో 'నిసా' అధ్యాయంలోని 22, 23 సూక్తులలో వివాహమాడకూడని స్త్రీల జాబితా 22వ సూక్తిలో దైవదౌత్యానికి పూర్వం అరబ్బులు అజ్ఞానంతో తండ్రుల మరణానంతరం తమ సవతితల్లులను వివాహమాడే దురాచారాన్ని ఖండిస్తూ, ఇకముందు అలాంటి చేష్టలకు పాల్పడకూడదని, ఇది అవాంఛనీయమైన అశ్లీలపు చేష్టని హెచ్చరించడం జరిగింది. తర్వాత 23వ సూక్తిలో పేర్కొనబడిన మిగతా నిషిద్ధస్త్రీల వివరాలు ఇలాఉన్నాయి:

"మీ తల్లులు, కుమార్తెలు, అక్కాచెల్లెళ్ళు, మేనత్తలు, పినతల్లులు, పెత్తల్లులు, మేనకోడళ్ళు, సోదరకుమార్తెలు, మీకు పాలుపట్టిన స్తన్యసంబంధ తల్లులు, మీరు పాలు పంచుకున్న స్తన్యసంబంధ సోదరీలు, మీ భార్యలతల్లులు, మీతో లైంగిక సంబంధం ఏర్పడిన మీభార్యలకు (గతభర్తల ద్వారా) పుట్టి మీసంరక్షణలో పెరిగిన కుమార్తెలు– మీకు నిషేధించబడ్డారు. (వీరిని మీరు చేసుకోరాదు.) పోతే, మీతో లైంగిక సంబంధం ఏర్పడకుండా (పెళ్ళి మాత్రమే జరిగి)ఉంటే (అలాంటి భార్యల్ని వదలి వారి కుమార్తెల్ని చేసుకోవడంలో) తప్పులేదు. ఇక కన్నకొడుకుల (వితంతువులైన లేక విడాకులు పొందిన) భార్యలు (అంటే కోడళ్ళు) కూడా మీకు నిషేధించబడ్డారు." (ఖుర్ఆన్–4:23)

ఈ స్త్రీలతో పాటు కొన్ని హదీసుల్నిబట్టి ఈక్రింది స్త్రీలు కూడా నిషేధించబడ్డారు:

1-మారు(సవతి) తల్లులు, 2-మారుకుమార్తెలు, 3-మనుమరాళ్ళు, 4-మారుతల్లి కుమార్తెలు, 5-మారుసోదరీలు), 6-మారుతండ్రి కుమార్తెలు (మారుసోదరీలు), 7-మారు మేనత్తలు, 8-మారుపినతల్లులు, 9-మారుపెత్తల్లులు, 10-మారు మేనకోడళ్ళు, 11-మారు సోదర కుమార్తెలు, 12-మారుసోదరి కుమార్తెలు.

ఇక్కడ సూత్రప్రాయమైన ఒక విషయం గుర్తుంచుకోవడం ఎంతో అవసరం. ఈ సూక్తిలో పురుషుని వివాహానికి నిషేధించబడిన స్త్రీలలో 1-రక్తసంబంధ స్త్రీలు, 2-సవతిసంబంధ స్త్రీలు, 3-స్తన్యసంబంధ స్త్రీలు అని మూడురకాల సంబంధాలున్నాయి. పురుషుడు వివాహానికి ముందు ఈ మూడు సంబంధాలు పరిశీలించి, వాటి పరిధిలోకి రాని స్త్రీని మాత్రమే వివాహమాడాలి.

23వ సూక్తిలోని తల్లులకు సంబంధించిన నిషేధాజ్ఞలో అమ్మమ్మలు, నాయనమ్మలు కూడా చేరిఉన్నారు. అలాగే ఈసూక్తిలోని కుమార్తెలకు సంబంధించిన నిషేధాజ్ఞలో మనుమరాళ్ళు కూడా చేరిఉన్నారు. అంటే మనుమరాళ్ళను వివాహమాడటం కూడా నిషిద్ధమే నన్నమాట. ఈ నిషేధాజ్ఞలో రక్తసంబంధమైన మనుమరాళ్ళతో పాటు, స్తన్య సంబంధమైన మనుమరాళ్ళు, సవతి సంబంధమైన మనుమరాళ్ళు కూడా ఉన్నారు.

పోతే తండ్రితో అక్రమ సంబంధం ఏర్పడిన స్త్రీని కొడుకు వివాహమాడవచ్చా లేదా అనే విషయంలో ధర్మవేత్తల్లో భేదాభిప్రాయాలున్నాయి. కొందరు అలాంటి స్త్రీలను పెళ్ళాడటంలో తప్పు లేదన్నారు. మరికొందరు అది కూడా నిషిద్ధమేనన్నారు. పైగా తండ్రి కామేచ్ఛతో తాకిన స్త్రీని సైతం కొడుకు పెళ్ళాడటం వారి దృష్టిలో నిషిద్ధమే. అలాగే కొడుకుతో అక్రమ సంబంధం ఏర్పడిన స్త్రీని తండ్రి పెళ్ళాడే విషయంలో కూడా ధర్మవేత్తల్లో భేదాభిప్రాయాలు ఉన్నాయి.



ఇక కొడుకు లేక కూతురి అక్రమసంబంధం వల్ల పుట్టిన బాలికను వివాహమాడవచ్చా లేదా అనే విషయంలో కూడా ధర్మవేత్తల మధ్య అభిప్రాయభేదాలు వచ్చాయి. హజ్రత్ ఇమాం అబూహనీఫా(రహ్మలై) అభిప్రాయం ప్రకారం అలాంటి అక్రమసంబంధం వల్ల కలిగిన బాలిక కూడా కన్నకూతురిలా నిషిద్ధ స్త్రీయే. ఆమెను కూడా చేసుకోకూడదు.

పై సూక్తిలో ప్రస్తావించబడినట్లు పురుషుడు ఏ స్త్రీ పాలు త్రాగాడో ఆ స్త్రీ కుమార్తెలు, తన తల్లి పాలు త్రాగిన ఇతర స్త్రీలు కూడా అతనికి నిషేధించబడ్డారు. అలాగే ఒక భార్య ఉండగానే ఆమె సోదరీని వివాహమాడటం కూడా నిషిద్ధమే.

## స్తన్యసంబంధాన్ని గుర్తుంచుకోవాలి

కొందరు అజ్ఞానం వల్ల స్తన్యసంబంధాన్ని రక్తసంబంధంతో సమానమైన విషయంగా భావించరు. అంచేత స్తన్యసంబంధమైన సోదరీని కూడా చేసుకుంటున్నారు. ఇది తెలిసి కూడా చేస్తున్న ఘోరమైన పాపం. మరికొందరు ముస్లింలు స్తన్యసంబంధం సంగతి మరచిపోయి పెళ్ళిళ్ళు చేస్తారు. ఇది కూడ ఘోరమైన పొరపాటే. స్తన్యసంబంధం ఏర్పడితే ఆ విషయాన్ని వ్రాతపూర్వకంగా నమోదుచేసుకొని గుర్తుంచుకోవాలి. వివాహం చేయ బోతున్నప్పుడు సంబంధిత యువకుడు లేక యువతి వేరేస్త్రీ పాలు తాగిఉన్నారా లేదా అని ఆలోచించాలి.

హజ్రత్ ఆయిషా (రజి) కథనం: ఓరోజు దైవప్రవక్త (స) నా దగ్గర ఉన్నప్పుడు బయట నుంచి ఒకతని మాటలు విన్పించాయి. అతను హఫ్సా (రజి) ఇంట్లో ప్రవేశించడానికి ఆమె అనుమతి అడుగుతున్నాడు. అప్పుడు నేను దైవప్రవక్త (స)తో "దైవప్రవక్తా! బహుశా ఆయన హఫ్సా (రజి) గారి స్తన్యసంబంధం పినతండ్రి కావచ్చనుకుంటా. ఆయన మీ ఇంట్లోకి (హఫ్సా ఇంట్లోకి) రావడానికి అనుమతి అడుగుతున్నారు" అని అన్నాను. దానికి దైవప్రవక్త (స) "(ఔనౌను.) ఈయన ఫలానా వ్యక్తి హఫ్సా (రజి)కు స్తన్యసంబంధం పినతండ్రి అవుతాడు" అన్నారు. అప్పుడు నేను "అయితే నాకు స్తన్యసంబంధం పినతండ్రి అయిన ఫలానా వ్యక్తి బ్రతికిఉంటే ఆయన కూడా నాముందు (పరదా లేకుండా) రావచ్చా?" అని అడిగాను. దానికి దైవప్రవక్త (స) ఇలా సమాధానమిచ్చారు-

"రక్త సంబంధం బంధువులు ఎలా వివాహ నిషిద్ధులవుతారో అలాగే స్తన్య సంబంధం వల్ల ఏర్పడిన బంధువులు కూడా వివాహ నిషిద్ధులవుతారు." (బుఖారి, ముస్లిం)

దైవప్రవక్త (స) ఇలా తెలిపారు: "స్తన్యసంబంధం కలిగిన వారంతా (దగ్గరి) బంధువులైపోతారు. అనువంశిక బంధుత్వం (రక్తసంబంధం) వల్ల ఏవిధంగా నిషేధం ఏర్పడుతుందో వీరి మధ్య కూడా పరస్పర వివాహం నిషిద్ధమవుతుంది." (బుఖారి, ముస్లిం)

హజ్రత్ ఆయిషా (రజి) కథనం: హజ్రత్ అఫ్లా (రజి) లోపలికి రావడానికి అనుమతి అడిగితే నేనాయనకు అనుమతి ఇవ్వలేదు. అప్పుడాయన "ఏమిటీ, నువ్వు నా ముందు కూడా పరదా పాటిస్తున్నవా? నేను నీ బాబాయినమ్మా!" అని అన్నారు. నేను "ఎలా?" అని అడిగాను. "నీకు నా సోదరుడి భార్య పాలిచ్చింది. ఆమెలో ఆ పాలు నా సోదరుడి వల్లనే పడ్డాయి" అన్నారు ఆయన. ఆ తరువాత నేను దీన్ని గురించి దైవప్రవక్త (సల్లం)ను అడిగితే "అఫ్లా చెప్పింది నిజమే. ఆయన్ని లోపలికి రావడానికి అనుమతించు" అని అన్నారు ఆయన. (బుఖారి, ముస్లిం)

## అత్తమామలు తల్లిదండ్రులతో సమానం

భార్యతల్లి (అత్త) ఇస్లాం దృష్టిలో కన్నతల్లితో సమానం. భార్యతండ్రి (మామ) కన్న తండ్రితో సమానం. కనుక అత్తను చేసుకోవడం ఘోరమైన పాపం. పిల్లనిచ్చిన అత్త కన్న తల్లితో సమానం కనుక ఆమె తన అల్లుడి ముందు పరదా పాటించనవసరం లేదు.

దీన్నిబట్టి ఇస్లాం దృష్టిలో అత్తా-అల్లుళ్ళు, మామా-అల్లుళ్ళ సంబంధం తల్లీకొడుకులు, తండ్రీకొడుకుల సంబంధంలా ఎంత పవిత్రమైనదో తెలుస్తోంది. అదేవిధంగా ఇస్లాం దృష్టిలో కోడలికి అత్తమామలు తల్లిదండ్రులతో సమానం. ఈ అనుబంధాన్ని ఉభయపక్షాలు అర్థం చేసుకొని ఆచరిస్తే నేడు మన సమాజంలో అల్లుడు-అతని అత్తామామల మధ్య, కోడలు-ఆమె అత్తామామల మధ్య నెలకొన్న ఉద్రిక్తవాతావరణం చాలావరకు సమసిపోతుంది.

ఈ (4:23)సూక్తిలో "మీతో లైంగికసంబంధం ఏర్పడిన మీభార్యలకు (గతభర్తల ద్వారా) పుట్టి మీసంరక్షణలో పెరిగిన కుమార్తెలు" అన్న పదం మనకు వింతగా అనిపిస్తుంది. మీ సంరక్షణలో లేక మీవడిలో పెరగడం అనే పదం కన్నకూతుళ్ళు అని నొక్కిచెప్పడానికి మాత్రమే ఇక్కడ ఉపయోగించబడింది. నిషేధాజ్ఞ క్రింద కన్నకూతుళ్ళే కాదు, సవతికూతుళ్ళు కూడా చేరివున్నారు. అంటే తనభార్యకు గతభర్త వల్ల జన్మించిన కుమార్తెలను కూడా పురుషుడు వివాహం చేసుకోకూడ దన్నమాట. వారు కూడా తన సంరక్షణలో పెరిగినా, వారి కన్నతండ్రి సంరక్షణలో పెరిగినా, మరెక్కడ పెరిగినా సరే తన సొంత కూతుళ్ళ క్రిందికే వస్తారు.

## ఏకకాలంలో వివాహబంధంలో ఉండకూడని స్త్రీలు

"ఒక వివాహబంధంలో (ఏకకాలంలో) ఇద్దరు అక్కాచెల్లెళ్ళను ఉంచడం కూడా నిషిద్ధమే. లోగడ జరిగిందేదో జరిగింది. దేవుడు అమిత క్షమాశీలి, అపార కృపాశీలుడు." (ఖుర్ఆన్-4:23)

వివాహనిషిద్ధ స్త్రీల జాబితాలో సొంత అక్కాచెల్లెళ్ళయిన స్త్రీల ప్రస్తావన కూడా ఉంది. పురుషుడు ఏకకాలంలో సొంత అక్కాచెల్లెళ్ళయిన ఇద్దరు స్త్రీలను భార్యలుగా కలిగి ఉండకూడదు. మొదట ఒకామెను చేసుకొని, ఆమెకు విడాకులిచ్చిన తరువాతనో లేదా ఆమె మరణించిన పక్షంలోనో ఆమె సోదరిని వివాహమాడవచ్చు. మనిషి అజ్ఞానం వల్ల ఇలా ఇద్దర్నీ ఏకకాలంలో చేసుకుంటే దేవుడు క్షమించే అవకాశం ఉందని ఖుర్ఆన్ చెబుతోంది. అయితే అది పొరపాటు, పాపం అని తెలిసిన తరువాత అతను వెంటనే ఆ ఇద్దరిలో ఒకామెను విడాకులిచ్చి వదిలేయవలసి ఉంటుంది. అదేవిధంగా సోదరుని కుమార్తె-సోదరి కుమార్తె, మేనత్త-పిన్నమ్మ ఏకకాలంలో ఒక పురుషుని వివాహబంధంలో ఉండటం కూడా నిషిద్ధమే.

దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "ఏ స్త్రీ కూడా తన పిన్ని లేక మేనత్తతో కలసి ఒకరి వివాహబంధంలో ఉండకూడదు." (బుఖారి, ముస్లిం)

## ముస్లిమేతర స్త్రీలతో వివాహం ధర్మసమ్మతమేనా?

"బహుదైవారాధకురాలైన స్త్రీలు (సత్యాన్ని) విశ్వసించనంత వరకు వారిని మీరు ఎలాంటి పరిస్థితిలోనూ వివాహమాడకండి. బహుదైవారాధకురాలైన స్త్రీ మీకు ఎంత నచ్చినా, ఆమెకంటే (సత్యాన్ని) విశ్వసించిన బానిసమహిళే ఎంతో మేలు. అలాగే బహు దైవారాధకులైన పురుషులు (సత్యాన్ని) విశ్వసించనంతవరకు వారితో మీ స్త్రీల వివాహం చేయకండి. బహుదైవారాధకుడైన పురుషుడు మీకు ఎంత నచ్చినా, అతనికంటే (సత్యాన్ని) విశ్వసించిన బానిస పురుషుడే



ఎంతో శ్రేష్ఠుడు. బహుదైవారాధకులు మిమ్మల్ని నరకాగ్ని వైపు పిలుస్తారు. దేవుడు మిమ్మల్ని దయతో స్వర్గం వైపు, క్షమాభిక్ష వైపు పిలుస్తున్నాడు. ప్రజలు దారికి వచ్చేందుకు దేవుడు తన ఆజ్ఞలను ఇలా విడమరచి తెలియజేస్తున్నాడు." (ఖుర్ఆన్-2:221)

"అపవిత్ర పురుషులకు అపవిత్రస్త్రీలు, అపవిత్ర స్త్రీలకు అపవిత్ర పురుషులే తగిన జంటలు. అలాగే పవిత్ర పురుషులకు పవిత్రస్త్రీలు, పవిత్ర స్త్రీలకు పవిత్ర పురుషులు మాత్రమే యోగ్యులు. జనం చెప్పుకునే (తప్పుడు)మాటలకు అతీతంగా వారు పరిశుద్ధులు, పవిత్రులు. వారికోసం మన్నింపు, ఉదారమైన ఉపాధి ఉన్నాయి." (ఖుర్ఆన్-24:26)

4:23 సూక్తిలో పేర్కొన్న స్త్రీలను తప్ప ఇతర ఏ స్త్రీలనైనా మహర్ చెల్లించి నిక్షేపంగా వివాహమాడవచ్చని ఆ తరువాత సూక్తి (ఖుర్ఆన్-4:24) ఇలా సూచిస్తోంది:

"వీరు తప్ప ఇతర స్త్రీలందర్నీ ధనవినియోగం ద్వారా (మహర్ చెల్లించి) మీరు వివాహ మాడవచ్చు. అయితే వివాహలక్ష్యం శీలరక్షణయి ఉండాలిగాని, స్త్రీలోలత్వమై ఉండకూడదు."

వివాహనిషిద్ధంకాని స్త్రీలలో గ్రంథప్రజల (యూద, క్రైస్తవ) స్త్రీలు కూడా ఉన్నారు. ఈ విషయం ఖుర్ఆన్‌లోనే మరో అధ్యాయంలో ఈవిధంగా ఉంది:

"ఈరోజు మీకు పరిశుద్ధ వస్తువులన్నీ ధర్మసమ్మతం చేయబడ్డాయి. గ్రంథప్రజల ఆహారం మీకు, మీ ఆహారం గ్రంథప్రజలకు ధర్మసమ్మతం చేయబడింది. శీలవతులైన ముస్లిం స్త్రీలు, గ్రంథప్రజలకు చెందిన శీలవతులు కూడా (వివాహానికి) మీకు ధర్మసమ్మతం చేయబడ్డారు. కాకపోతే వారికి చెల్లించవలసిన మహర్ సొమ్ము చెల్లించి, వారిని వివాహ బంధంలో సురక్షితంగా ఉంచాలి. అంతేగాని, వారితో విచ్చలవిడిగా కామక్రీడలకు పాల్పడ టంగాని, దొంగచాటుగా అక్రమ సంబంధాలు పెట్టుకోవడంగాని చేయకూడదు. సత్యాన్ని విశ్వసించడానికి నిరాకరిస్తే మనిషి తన జీవితంలో సాధించినదంతా వ్యర్థమవుతుంది. చివరికి అతను పరలోకంలో ఘోరంగా నష్టపోతాడు." (ఖుర్ఆన్-5:5)

ఈ సూక్తిలో గ్రంథప్రజల స్త్రీలంటే ఇస్లామీయ రాజ్యంలో జిమ్మీ పౌరులుగా నివసించే యూద, క్రైస్తవ స్త్రీలని; దారుల్‌హరబ్ (శత్రు దేశం), దారుల్‌కుఫర్ (అవిశ్వాసులు పాలించే దేశం)లో నివసించే యూద, క్రైస్తవ స్త్రీలను వివాహమాడటం సరికాదని హజ్రత్ అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి) అభిప్రాయపడ్డారు.

హనఫీ ఫిఖావేత్తలు ఈ అభిప్రాయంతో కొంచెం విభేదిస్తూ "విదేశాలకు చెందిన యూద, క్రైస్తవ స్త్రీలను వివాహమాడటం హరాం (నిషిద్ధం) కాదుకాని, అవాంఛనీయమైన దని మాత్రం చెప్పవచ్చు" అని అభిప్రాయపడ్డారు. ఈ రెండిటికి భిన్నంగా సయీద్ బిన్ ముసయ్యిబ్, హసన్ బస్రీ (రహ్మలై)లు జిమ్మీ (ఇస్లామీయ రాజ్యపౌరుడు), గైర్‌జిమ్మీ (ఇస్లామేతర రాజ్యపౌరుడు) అని తేడా లేదని అన్నారు.

పోతే ఈ సూక్తిలో పేర్కొన్నట్లు ఆ స్త్రీలు శీలవతులయి మాత్రం తప్పకుండా ఉండాలి. అలాంటి స్త్రీలనే వివాహమాడటానికి ముస్లింలకు అనుమతి ఉంది. అయితే ఈ అనుమతిని దుర్వినియోగం చేయకుండా వారు ఇస్లాం పట్ల తమ విశ్వాసాలు, నీతినడవడికలను గురించి జాగ్రత్త వహించాలి. ఆ స్త్రీల అందచందాలు, మనోవాంఛల వలలో పడిపోతే మాత్రం ముస్లిం భర్తల పుణ్యకర్మలన్నీ వ్యర్థమైపోతాయి. ఖుర్ఆన్ కొన్ని షరతులలో ముస్లింలకు క్రైస్తవ, యూద

మతాలకు చెందిన స్త్రీలను వివాహమాడే అనుమతి ఇచ్చింది కాని, వారు తమ స్త్రీలను క్రైస్తవ, యూద మతాలకు చెందిన పురుషలకు ఇవ్వడానికి మాత్రం అనుమతి ఇవ్వలేదు.

పోతే స్వతంత్ర స్త్రీలను వివాహమాడలేని నిరుపేద ముస్లిం యువకులు ఇస్లాం స్వీకరించిన బానిస యువతుల్ని వివాహమాడవచ్చని కూడా ఖుర్‌ఆన్ (4:25 సూక్తిలో) చెబుతోంది.

## వివాహ బంధం

మనిషిలోని లైంగికశక్తి సహజ విషయం. దాన్ని అరికట్టడాన్ని లేదా దుర్వినియోగ పరచడాన్ని ఇస్లాం అంగీకరించదు. లైంగికశక్తిని బలవంతంగా అణచి ఆజన్మ బ్రహ్మచారిగా ఉండిపోవడం, నిషిద్ధం. సహధర్మ చారిణిని వదలి వ్యభిచారానికి పాల్పడటం కూడా నిషిద్ధమే.

“విశ్వాసులారా! దేవుడు మీ కొరకు ధర్మసమ్మతం చేసిన పరిశుద్ధ వస్తువుల్ని నిషేధించుకోకండి” (ఖుర్‌ఆన్-5:87) అని దేవుడు స్పష్టంగా చెప్పాడు.

హజ్రత్ అనస్ బిన్ మాలిక్ (రజి) కథనం: ఒకసారి ముగ్గురు వ్యక్తులు దైవప్రవక్త (సల్లం) భార్యల ఇండ్లకు వచ్చి దైవప్రవక్త (సల్లం) ఆరాధనా పరిస్థితి గురించి అడిగారు. దాన్ని గురించి తెలుసుకున్న తరువాత వారు ప్రవక్త (సల్లం) ఆరాధనను స్వల్పమైనదిగా భావించి “దైవప్రవక్త (సల్లం) ఆరాధనకు, మన ఆరాధనకు పోలికేమిటీ? దైవప్రవక్త (సల్లం)కు సంబంధించిన భూత భవిష్యత్ కాలాల పొరపాట్లన్నీ మన్నించబడ్డాయి” అని చెప్పుకున్నారు. అందువల్ల వారిలో ఒకతను “నేనిక నుండి ఎల్లప్పుడూ రాత్రి తెల్లవార్లూ మేల్కొని నమాజు చేస్తుంటాను” అన్నాడు. రెండవతను మాట్లాడుతూ “నేనిక నుండి ప్రతిరోజూ ఉపవాసం ఉంటాను. ఒక్కరోజు కూడా నాగా చేయను” అన్నాడు. మూడవతను తన నిర్ణయం తెలుపుతూ “నేనిక నుంచి స్త్రీల జోలికే పోను. ఎప్పటికీ పెళ్ళి చేసుకోను. (దైవారాధనకే నా జీవితమంతా అంకితం చేస్తాను.)” అని అన్నాడు.

అంతలో దైవప్రవక్త (సల్లం) అక్కడికి వచ్చారు. వారు చెప్పుకుంటున్న మాటలు విని ఇలా అన్నారు: “ఏమిటీ, మీరేనా ఈ మాటలు అంటున్నది! వినండి. నేను మీ అందరికంటే ఎక్కువ దేవునికి భయపడేవాడ్ని. మీ అందరికంటే ఎక్కువ దైవభీతి పరాయణుడ్ని అయినప్పటికీ నేను ఉపవాసాలు పాటిస్తున్నాను, వాటిని వదిలేస్తున్నాను కూడా. అలాగే రాత్రిళ్ళు నమాజు చేస్తున్నాను, నిద్ర కూడా పోతున్నాను. స్త్రీలను వివాహం కూడా చేసుకుంటున్నాను. గుర్తుంచుకోండి! నా సంప్రదాయాలను విడనాడే వాడితో నాకెలాంటి సంబంధం లేదు. (అతనసలు ముస్లిమే కాదు.)” (బుఖారి, ముస్లిం)

దైవప్రవక్త ముహమ్మద్ (సల్లం) హజ్రత్ ఉస్మాన్ బిన్ మజ్‌వూన్ (రజి)ని బ్రహ్మచారిగా ఉండవద్దని వారించారు. హజ్రత్ సాద్ బిన్ అబీ వఖాస్ (రజి) ఈ విషయం తెలిపిన తరువాత “దైవప్రవక్త (సల్లం) గనక ఆయన్ని వివాహం చేసుకోకుండా ఉండేందుకు అనుమతించి ఉంటే మేమంతా (కామవాంఛను అణచే పద్ధతులు అవలంబించి) నపుంసకులుగా మారిపోవడానికి ఇష్టపడే వాళ్ళము” అని అన్నారు. (బుఖారి)

దైవప్రవక్త (స) హితోక్తి: “యువకుల్లారా! మీలో పెళ్ళి చేసుకునే శక్తి కలవారు పెళ్ళిచేసుకోవాలి. పెళ్ళి దృష్టిని కిందికి వాలేలా చేస్తుంది. ఆ శక్తి లేనివారు ఉపవాసవ్రతం పాటించాలి. ఉపవాసం కామవాంఛను అదుపులో ఉంచుతుంది.” (బుఖారి, ముస్లిం)



సమాజంలో అశ్లీలతను నివారించి ప్రశాంతవాతావరణం నెలకొల్పడానికి వివాహం ఎంతో పటిష్ఠమైన వ్యవస్థ. వివాహానికి మొట్టమొదటి ఆకర్షణ స్త్రీపురుషుల మధ్య ప్రేమ, సంతృప్తులే.

“ఆయన మీకోసం మీజాతి నుండే జీవిత భాగస్వాము(స్త్రీ)లను సృజించాడు, వారి దగ్గర మీరు సౌఖ్యం పొందడానికి. ఇంకా ఆయన మీ మధ్య ప్రేమానురాగాలు, దయాదాక్షిణ్యాలు కూడా జనింపజేశాడు. ఇది కూడా ఆయన సూచనల్లోనిదే. యోచించే వారికి ఇందులో అనేక నిదర్శనాలున్నాయి.” (ఖుర్‌ఆన్–30:21)

## పెళ్ళిచూపులు, వధూవరుల ఎంపిక

పెళ్ళికి ముందే పెళ్ళాడదలచిన యువజంట ఏకాంతంగా కలుసుకోవడాన్ని, విచ్చలవిడిగా తిరగడాన్ని ఇస్లాం అంగీకరించదు. వెకిలి చేష్టల్ని సహించదు. అలా అని అది ముక్కు మొహం తెలియని వ్యక్తిని చేసుకొమ్మని కూడా శాసించదు. పెళ్ళి చేసుకోదలచినవారు మనోతృప్తి కోసం పెళ్ళికి ముందు పరస్పరం ఒకసారి చూసుకోవాలని బోధిస్తోంది. ఇది ‘ఆజ్ఞ’ కాకపోయినా, పటిష్ఠమైన వైవాహిక బంధం, సుఖమయమైన జీవితం కోసం ఇవ్వబడిన అతిముఖ్య హితవు అన్న సంగతి ఇక్కడ గ్రహించాలి. షరీఅత్‌వేత్తలు దీన్ని “ముస్తహబ్”గా పేర్కొన్నారు.

మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) పెళ్ళిచూపుల విషయం గురించి నొక్కిచెబుతూ “మీలో ఎవరైనా ఏదైనా స్త్రీని వివాహమాడ దలచుకుంటే అతనా స్త్రీని వీలైనంత వరకు ప్రత్యక్షంగా చూసి, వివాహం వైపుకు ఆకట్టుకోలేని దోషం ఏదీ ఆమెలో లేదన్న సంగతి నిర్ధారించుకొని తృప్తిచెందాలి” అని అన్నారు. (అహ్మద్, అబూదావూద్)

హజ్రత్ ముగైరా బిన్ షోబా (రజి) కథనం: నేనొక స్త్రీని పెండ్లాడదలచి కబురు పంపాను. ఈ సంగతి దైవప్రవక్త (స) ముందు ప్రస్తావిస్తే, ఆయన “మరి నువ్వామెను చూశావా?” అనడిగారు. నేను లేదన్నాను. “అయితే నువ్వామెను ఒకసారి చూసుకో. దీనివల్ల మీఇద్దరిలో శాశ్వతంగా పరస్పర ప్రేమానురాగాలు జనించే అవకాశం ఉంటుంది” అన్నారు ఆయన. నేనీ మాట విన్న తరువాత ఆ స్త్రీ ఇంటికి వెళ్ళాను. ఇంట్లో ఆమె తల్లి దండ్రులు ఉన్నారు. ఆమె తెరవెనుక ఉంది. నేను వాళ్ళతో “దైవప్రవక్త (స) నాకు కాబోయే భార్యను చూసుకోమని చెప్పారు” అనిఅన్నాను. ఈమాట విని ఆమె తల్లిదండ్రులు మౌనంగా ఉండిపోయారు. అప్పుడా అమ్మాయి తెర వెనుక నుండి తొంగిచూస్తూ “నన్ను చూడమని దైవప్రవక్త (స) మిమ్మల్ని ఆదేశించివుంటే నేను తెర నుండి బయటికి వస్తాను, మీరు నన్ను చూసుకోవచ్చు. దైవప్రవక్త (స) అలాంటి ఆజ్ఞ ఏదీ ఇవ్వకపోతే మీరు నన్ను చూడకూడదు” అని అన్నది. అప్పుడు నేను ఇది దైవప్రవక్త ఆజ్ఞే నంటూ ఆమెను చూశాను. నేను (సంతృప్తి చెంది) ఆ తర్వాత ఆ అమ్మాయిని పెళ్ళి చేసుకున్నాను. (అబూదావూద్)

“వితంతువు లేక విడాకులుపొందిన స్త్రీ నోటిమాట ద్వారా తన అంగీకారం తెలియజేయనంత వరకు ఆమె వివాహం కాజాలదు. అలాగే కన్య తన ఆమోదం తెలపనంత వరకు ఆమె వివాహం కూడా కాజాలదు” అన్నారు దైవప్రవక్త (సల్లం)

ప్రవక్త అనుచరులు ఈ చివరి మాట విని “ఎలాంటి ఆమోదం?” అని అడిగారు. దానికి దైవప్రవక్త (సల్లం) “నిరాకరించకుండా మౌనంగా ఉండిపోవడమే ఆమె ఆమోదం అవుతుంది” అని సమాధానమిచ్చారు. (బుఖారి, ముస్లిం)

ఒకసారి ఒక స్త్రీ దైవప్రవక్త (స) వద్దకు వచ్చి తన తండ్రి తన వివాహం తన అభీష్టానికి వ్యతిరేకంగా చేశాడని ఫిర్యాదు చేసింది. అప్పుడు దైవప్రవక్త (స) "నీకు ఆ వివాహాన్ని రద్దుచేయడానికి లేదా అమోదించడానికి అధికారముంది" అని సెలవిచ్చారు.

అలాగే మరొక స్త్రీ కూడా తన ఇష్టానికి వ్యతిరేకంగా తన తండ్రి తన వివాహం తన పినతండ్రి కుమారునితో జరిపించాడని ఫిర్యాదు చేసింది. దానికి దైవప్రవక్త (సల్లం) "ఈ సంబంధాన్ని ఇష్టమయితే అంగీకరించవచ్చు లేదా రద్దు చేయవచ్చ"ని తెలియజేశారు. అప్పుడా స్త్రీ "దైవప్రవక్తా! నా తండ్రి చేసినదంతా నేను ఒప్పుకున్నాను. (ఇలా అడగడంలో) నా ఉద్దేశ్యం ఈ వ్యవహారంలో తమ తండ్రులకు ఎలాంటి అధికారం లేదని స్త్రీలకు తెలియపరచడం తప్ప మరేమీ కాదు" అని అన్నది. (అబూదావూద్, నిసాయి)

ఇదే సారాంశం మరోహదీసులో ఇలా ఉంది: దైవప్రవక్త (స) హజ్రత్ హమ్జా (రజి) కుమార్తె పెళ్ళి పిన్న వయస్సులోనే హజ్రత్ అమ్ బిన్ అబీముస్లిం (రజి)తో చేయించారు. ఆ సందర్భంలో ఆయన "యుక్తవయస్సు రాగానే ఆమెకు ఈ సంబంధం విషయంలో అంగీకరించేందుకు లేదా రద్దు పరిచేందుకు అధికారం ఉందని సెలవిచ్చారు.

ఇలా పెళ్ళిచూపుల్లో కాబోయే వధూవరులు పరస్పరం చూసుకొని ఇష్టపడటం చాలా అవసరమని పై హదీసుల ద్వారా స్పష్టమవుతోంది. అదీగాక వివాహబంధం ఒక ఒడంబడిక కనుక ఈ ఒడంబడికలో వధూవరుల అంగీకారం ముఖ్యమైన షరతుగా ఉంది. వధూవరుల్లో ఎవరు అంగీకరించకపోయినా ఆ వివాహం నెరవేరదు. ఒకవేళ సామాజిక స్పృహరాని లేత వయసులో పెళ్ళి కావడం జరిగితే చట్టప్రకారం ఆ పెళ్ళి చెల్లుతుంది కాని, వివాహం తర్వాత వారిద్దరిలో ఎవరికైనా సరే ఆ విహాన్ని ఆమోదించడానికి లేదా రద్దు చేసుకోవడానికి (తలాఖ్ ద్వారా విడిపోవడానికి) పూర్తి అధికారం ఉందని కూడా పై హదీసుల ద్వారా తెలుస్తోంది.

## నాలుగు ప్రాతిపదికలపై స్త్రీ వివాహం

దాంపత్యజీవితం దినాభివృద్ధి చెందుతూ ఫలపుష్పాదులతో బాగా ఎదగాలంటే వధువు లేక వరుని ఎంపికకోసం మంచిప్రమాణం కావాలి. దాన్ని గురించి దైవప్రవక్త(స) ఇలా చెప్పారు:

"సాధారణంగా స్త్రీని నాలుగు విషయాల ప్రాతిపదికపై వివాహమాడుతారు. (1) ఆమె సిరిసంపదలు చూసి చేసుకుంటారు. (2) ఆమె కుటుంబం వంశాలను చూసి చేసుకుంటారు. (3) ఆమె అందచందాలు చూసి చేసుకుంటారు. (4) ఆమె ధర్మపరాయణతను చూసి చేసుకుంటారు. కనుక మీరు ధర్మపరాయణురాలయిన స్త్రీని చేసుకొని సాఫల్యం పొందండి. అలా చేసుకోకపోతే మీ చేతులకు మట్టి అంటుకుంటుంది. (చివరికి మీకు పశ్చాత్తాపమే మిగులుతుంది.)"- (బుఖారి, ముస్లిం)

వివాహవ్యవస్థ ఓ పవిత్రమైన బంధం. శీలరక్షణతో పాటు ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో కీలకపాత్ర వహించగల కుటుంబవ్యవస్థకు ఇది పటిష్ఠమైన పునాది. అందువల్ల వివాహం తరువాత అకారణంగా దాన్ని విచ్ఛేదం చేయడానికి, లేదా నిర్ణీతప్రతిఫలం, నిర్ణీతగడువు షరతుపై వివాహం చేసుకొని గడువు తీరిపోగానే విడిపోవడానికి ఇస్లాం అనుమతించదు.

హజ్రత్ సబ్రా జహ్నీ (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ప్రవచనం: "ప్రజలారా! నేను మీకు మొదట్లో 'ముతా' (తాత్కాలిక వివాహం) చేసుకోవడానికి అనుమతిచ్చాను. అయితే



దేవుడు ఇప్పుడు దీన్ని ప్రళయందాకా (శాశ్వతంగా) నిషేధించాడు. కనుక మీలో ఎవరి దగ్గరయినా తాత్కాలిక వివాహం చేసుకున్న స్త్రీ గనక ఉంటే ఆమెను (వెంటనే వదిలేయండి. అయితే ఆమెకిచ్చిన ప్రతిఫలం మాత్రం వాపసు తీసుకోకండి." (ముస్లిం, అహ్మద్)

హజ్రత్ అలి (రజి) ఇలా తెలియజేస్తున్నారు: "ఖైబర్ యుద్ధకాలంలో దైవప్రవక్త (సల్లం) మమ్మల్ని 'ముత్అ' (తాత్కాలిక వివాహం) చేయకూడదని, గాడిద మాంసం తినకూడదని వారించారు." (బుఖారి, ముస్లిం)

## వితంతు వివాహానికి ఇస్లాం ప్రోత్సాహం

ఇస్లాం వితంతు వివాహాన్ని ఎంతగానో ప్రోత్సహించింది. ఖుర్ఆన్ ఆదేశం ఈ విధంగా ఉంది: "మీలో భార్యావిహీనులుగా, భర్తవిహీనులుగా ఉన్నవారికి పెళ్ళిళ్ళు చేయండి." (24:32) ఈ ఆజ్ఞలో పెళ్ళికాని కన్యలు, విడాకులివ్వబడిన స్త్రీలతో పాటు వితంతువులు కూడా చేరిఉన్నారు. వితంతువివాహం విషయంలో దైవప్రవక్త (స) ఇలా చెప్పారు:

"పేదలు, వితంతువుల సంక్షేమం కోసం పాటుపడే మనిషి దైవమార్గంలో పోరాడే యోధుడి (ముజాహిద్)లాంటి వాడు. అంతేకాదు, పగలల్లా ఉపవాసాలు పాటిస్తూ రాత్రి వేళల్లో ఉదయం వరకూ నమాజుచేసే భక్తుడిలాంటి వాడు కూడా." (బుఖారి)

"కళావిహీనమైన చెక్కిళ్ళుగల స్త్రీ (అంటే వితంతువు), నేను ప్రళయదినాన ఈ విధంగా దగ్గరయి ఉంటాము." ఈ హదీసును ఉల్లేఖించినవారు ఈవిధంగా అంటూ తన చూపుడు వ్రేలు, మధ్యవ్రేలు చూపించారు. (అబూదావూద్)

దైవప్రవక్త (సల్లం) మరో సందర్భంలో మాట్లాడుతూ "ప్రళయదినాన అందరికంటే ముందు నేను స్వర్గంలో ప్రవేశించడానికి స్వర్గ ద్వారం తెరుస్తాను. అయితే ఒక స్త్రీ నా కంటే కూడా ముందు స్వర్గంలో ప్రవేశించడానికి ప్రయత్నిస్తుంది. నేనామెను 'ఎవరు నీవు?' అని అడుగుతాను. దానికామె 'నేను కొందరు చిన్న చిన్న అనాథ పిల్లలు ఉన్న ఒక వితంతువుని' అని అంటుంది." (అబూదావూద్)

## నికాహ్ (పెళ్ళి) పద్ధతి

ఇస్లాంలో వివాహం చేసుకోవడం చాలా సులభం. ప్రాజ్ఞులు, వయోజనులయిన ఇద్దరు ముస్లిం స్త్రీపురుషులు పరస్పరం ఒప్పుకుంటే నికాహ్ (వివాహం) అవుతుంది. పరస్పర అంగీకారం తప్పనిసరిగా ఉండాలి. ఇది మొదటి షరతు. వివాహం కావడానికి రెండవ షరతు సాక్ష్యం. వధూవరులు పరస్పరం ఒప్పుకున్నట్లు సాక్ష్యం తప్పనిసరిగా ఉండాలి. ప్రాజ్ఞులు, వయోజనులయిన కనీసం ఇద్దరు ముస్లిం పురుషులుగాని లేదా ఒక పురుషుడు, ఇద్దరు స్త్రీలుగాని సాక్షులుగా ఉండాలి. మూడవ షరతు వరుడు వధువుకు చెల్లించవలసిన మహర్. మహర్ స్త్రీ ఆస్తి అవుతుంది. దాన్ని వరుడు వివాహ సందర్భంలోనే వధువుకు ఇచ్చేస్తే మంచిది. వెంటనే ఇవ్వలేని పక్షంలో ఆ తరువాతయినా వీలైనంత త్వరగా ఇచ్చేయాలి.

వివాహం చేసుకునే రెండవ పద్ధతి వకీలు ద్వారా చేసుకునే పెళ్ళి. పైన పేర్కొన్న మూడు షరతులతో వకీలు సమక్షంలో వివాహం చేసుకోవచ్చు. వివాహం అనేది ఒక స్త్రీ, ఒక పురుషుని మధ్య జరిగే ఒప్పందం. అందువల్ల వకీలు సంతకంతో పాటు వధూవరుల సంతకాలు, సాక్షుల సంతకాలు, మహర్ ధనం, తేదీ, స్థలం వగైరా వివరాలను దస్తావీజులో తీసుకోవడం

చాలా అవసరం. ఇలాంటి పెళ్ళి కోసం ముహూర్తం పెట్టుకొని తేది, సమయం, స్థలం గురించి ఒక ప్రకటన చేస్తూ బంధుమిత్రుల్ని ఆహ్వానించాలి. ఇది ప్రవక్త సంప్రదాయం.

దైవప్రవక్త (స) తన ప్రియకుమార్తె హజ్రత్ ఫాతిమా (రజి)ను హజ్రత్ అలీ (రజి)కి ఇచ్చి వివాహం చేస్తున్న సందర్భంలో ఆయన తన అనుచరుల్లో కొందరిని పిలిపించారు.

## పెళ్ళి ప్రసంగం

తిర్మిజీ గ్రంథం ప్రకారం హజ్రత్ అబ్దుల్లా బిన్ మస్వూద్ (రజి) కథనం: "దైవప్రవక్త 'సల్లల్లాహు అలైహి వసల్లం' మాకు నమాజ్‌లో పఠించే 'తషహ్హుద్' కూడా నేర్పారు; నికాహ్ ప్రసంగం కూడా నేర్పారు." ఇబ్నెమస్వూద్ (రజి) తషహ్హుద్ గురించి చెప్పిన తరువాత నికాహ్ ప్రసంగం ఇలా పఠించి తెలియజేశారు-

"అల్‌హమ్దులిల్లాహి నస్తయీనుహూ వనస్తగ్ఫిరుహూ వనవూజుబిల్లాహి మిన్ షురూరి అన్‌ఫుసినా మయ్యహ్‌దిహీ అల్లాహు ఫలాముజిల్లలహూ వమయ్యుజ్‌లిల్ ఫలా హాదియలహూ వఅష్‌హదుఅన్ లాఇలాహ ఇల్లల్లాహు వఅష్‌హదుఅన్న ముహమ్మదన్ అబ్దుహూ వరసూలుహూ. ఇత్తఖుల్లాహ హఖ్ఖ తుఖాతిహీ వలా తమూతున్న ఇల్లా వ అన్తుమ్ ముస్లిమూన్, ఇత్తఖుల్లాహల్లజీ తసాఅలూన బిహీ వల్‌అర్‌హామ ఇన్నల్లాహ కాన అలైకుమ్ రఖీబా, ఇత్తఖుల్లాహ వఖూలూ ఖౌలన్ సదీదా." (తిర్మిజి)

"స్తుతి, కృతజ్ఞతలు దేవునికి మాత్రమే శోభిస్తాయి. మనం ఆయన్నే సహాయం వేడుకుంటాము. మన పాపాల మన్నింపు కోసం ఆయన్నే మొరపెట్టుకుంటాము. మన మనసు ఉసిగొల్పే పైశాచిక ఆలోచనల బారినుండి దేవుని శరణుకోరుకుంటాము. దేవుడు దారి చూపిన మనిషిని మరెవరూ దారి తప్పించలేరు. స్వయంగా దేవుడు దారి తప్పించిన మనిషిని మరెవరూ దారికి తీసుకురాలేరు. అల్లాహ్ తప్ప మరేఆరాధ్యుడు లేడని; ముహమ్మద్ (స) ఆ దేవుని దాసుడు, సందేశహరుడని నేను సాక్ష్యమిస్తున్నాను."

ఆ తరువాత సుఫ్యాన్ సౌరి (రహ్మలై) వ్యాఖ్యానం ప్రకారం హజ్రత్ ఇబ్నెమస్వూద్ (రజి) ఈకింది విధంగా మూడు ఖుర్ఆన్ సూక్తులు పఠించారు-

"విశ్వాసులారా! మీరు దేవునికి భయపడవలసిన విధంగా భయపడండి. ( దేవునికి అంకితమైన) ముస్లింలుగా వున్న స్థితిలో తప్ప (ఇతర స్థితిలో) చనిపోకండి." (3:102)

"మానవులారా! మీ ప్రభువుకు భయపడండి. ఆయన మిమ్మల్ని ఒకే ప్రాణి ద్వారా సృష్టించాడు. అదేప్రాణి నుండి దాని జతను కూడా సృష్టించాడు. తిరిగి వారిరువురి నుండి కోటానుకోట్ల మంది స్త్రీపురుషుల్ని ప్రపంచంలో విస్తరింపజేశాడు. మీరు ఒకరిద్వారా మరొకరు తమ అవసరాలు గడుపుకోవడానికి దేవుని పేరును ఒక సాధనంగా చేసుకుంటారు. అలాంటి దేవునికి భయపడండి. రక్త సంబంధీకులతో మీకు ఏర్పడివున్న సహజ బాంధవ్యాన్ని తెంచకండి. దేవుడు మీ చర్యల్ని ఓకంట గమనిస్తు న్నాడన్న సంగతి మరచిపోకండి." (4:1)

"విశ్వాసులారా! దేవునికి భయపడండి. సరైన మాటే పలకండి. దేవుడు మీ పనులు చక్కబెడతాడు. మీ పొరపాట్లు క్షమిస్తాడు. దేవునికి, ఆయన ప్రవక్తకు విధేయుడైనవాడు నిజంగా గొప్ప విజయం సాధించినట్లే." (33:70,71)



## వివాహమహోత్సవం

హజ్రత్ ఆయిషా (రజి) కథనం: "నా వివాహం షవ్వాల్ నెలలో పండుగ నెలవంక రోజున జరిగింది. నా వీడ్కోలు కూడా షవ్వాల్ నెలలో పండుగ నెలవంక రోజునే జరిగింది. ఇప్పుడు మీరే చెప్పండి, దైవప్రవక్త (స) భార్యలలో నాకంటే ఎక్కువ అదృష్టవంతురాలు ఎవరుంటారు?" (ముస్లిం)

హజ్రత్ ఆయిషా (రజి) కథనం: "మా ఇంట్లో అన్సార్ కుటుంబానికి చెందిన ఒక అమ్మాయి ఉండేది. నేనా అమ్మాయికి పెళ్ళి చేశాను. అప్పుడు దైవప్రవక్త (సల్లం) 'ఆయిషా! నువ్వు ఎవరిచేతనైనా పాట పాడించవా? ఈ అన్సార్ ప్రజలకు పాటలంటే చాలా ఇష్టం' అని అన్నారు. (ఇబ్నెహబాన్)

హజ్రత్ రబీ బిన్త్ మావుజ్ (రజి) కథనం: "నా పెళ్ళి అయిన తరువాత పుట్టింటి నుండి మెట్టింటికి వచ్చాను. అప్పుడు దైవప్రవక్త (సల్లం) నాకు శుభాకాంక్షలు చెప్పడానికి వచ్చారు. ఆయన నా పడక మీద కూర్చున్నారు. అంతలో మా వంశానికి చెందిన కొందరు అమ్మాయిలు వచ్చి డప్పు వాయిస్తూ పాట పాడటం ప్రారంభించారు. వారిలో ఒక అమ్మాయి 'మా దగ్గర దైవప్రవక్త (సల్లం) ఉన్నారు. ఆయనకు రేపు జరగబోయే విషయాలు కూడా తెలుసు' అని పాడింది. దైవప్రవక్త (సల్లం) ఈమాట విని 'ఈమాట వదలి ఇంతకు ముందు చెప్పిన మాటలే చెబుతూ పాడు' అని అన్నారు."

హజ్రత్ ఆయిషా (రజి) కథనం: ఒక అన్సార్ యువతికి (పెళ్ళయి) వీడ్కోలు జరిగింది. పెళ్ళి చాలా నిరాడంబరంగా జరిగింది. అప్పుడు దైవప్రవక్త (స) మాట్లాడుతూ "మీ దగ్గర డప్పు వగైరాలాంటి వినోద సామగ్రి ఏదీ లేదా? ఇలాంటి శుభసందర్భాలలో అన్సార్‌లు పాటలు, వాయిద్యాలంటే చెవికోసుకుంటారు" అని అన్నారు. (బుఖారి)

"పాటలుపాడే స్త్రీలను అమ్మడం, కొనడం, వారి వ్యాపారం చేయడం ధర్మసమ్మతం కాదు" అన్నారు దైవప్రవక్త (స)- (తిర్మిజి). ఆయన మరో సందర్భంలో "పాటలు పాడే బానిసస్త్రీ సభలో కూర్చొని, ఆమె పాటలు వినేవాడి చెవిలో ప్రళయదినాన కరిగించిన సీసం పోయబడుతుంద"ని అన్నారు. (అహ్‌కాముల్ ఖుర్ఆన్- ఖాజీ అబూబకర్)

## వలీమా విందు

నికాహ్, సాంప్రదాయిక ప్రసంగం, సామూహిక ఆశీర్వాదాలతో పెళ్ళితంతు పూర్తవుతుంది. ఆ తరువాత వధువు మెట్టింటికి చేరుకున్నాక వరుని తరఫున "వలీమా" చేయాలి. పెళ్ళి సంతోషాన్ని పదిమందితో పంచుకోవడానికి బంధుమిత్రులకు విందుభోజనం ఏర్పాటు చేయడం కూడా ప్రవక్త సంప్రదాయమే.

హజ్రత్ అనస్ (రజి) కథనం: "దైవప్రవక్త (స) హజ్రత్ జైనబ్ (రజి)ను వివాహమాడినప్పుడు ఎంతోమంచి వలీమా విందు ఇచ్చారు. అంతటి మంచి విందు మరే భార్యను చేసుకున్నప్పుడు కూడా ఇవ్వలేదు. హజ్రత్ జైనబ్ (రజి) వివాహంలో ఆయన ఒక మేకను కోసి వలీమా విందు చేశారు." (బుఖారి, ముస్లిం)

హజ్రత్ అనస్ (రజి) కథనం: ఖైబర్ యుద్ధం నుండి మదీనా తిరిగొస్తూ దైవప్రవక్త (స) దారిలో ఒకచోట (యుద్ధఖైదీ అయిన) హజ్రత్ సఫియా (రజి)ను వివాహమాడారు.

అప్పుడు నేను (ఆయన ఆజ్ఞతో) ముస్లింలను వలిమా విందుకు ఆహ్వానించాను. తర్వాత ఆయన ఆజ్ఞతో భోజన వస్త్రం పరిచాను. దానిమీద కొన్ని ఖర్జూర పండ్లు, జున్ను ముక్కలు, నెయ్యి మాత్రమే పెట్టబడ్డాయి. అంతకు మించి మరేమీ లేవు.'' (బుఖారి)

ఒకసారి దైవప్రవక్త (సల్లం) హజ్రత్ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (రజి) బట్టల మీద పసుపుపచ్చ రంగు చూసి ఇదేమిటీ అని అడిగారు. దానికి హజ్రత్ అబ్దుర్రహ్మాన్ (రజి) సమాధానమిస్తూ ''నేను పెళ్ళి చేసుకున్నానండీ! పావు తక్కువ పదహారు (తులాల) బంగారం మహర్‌గా నిర్ణయమయింది'' అని అన్నారు. దైవప్రవక్త (సల్లం) ఈ శుభవార్త విని ''దేవుడు నీకు శుభం చేకూర్చుగాక! సరే, నువ్వు ఒక మేకయినా సరే కోసి వలిమా విందు చెయ్యి'' అని చెప్పారు. (ముత్తఫఖున్ అలై)

హజ్రత్ అబూహురైరా (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ప్రవచనం: ''వలీమా విందు ఆహ్వానాన్ని తిరస్కరించినవాడు దేవునికి, దైవప్రవక్తకు అవిధేయుడైపోయినట్లే. పోతే ధనికులను మాత్రమే పిలిచి, పేదలను విస్మరించే వలీమావిందు భోజనం పరమ నికృష్ట మైన విందు భోజనమవుతుంది.'' (బుఖారి, ముస్లిం)

హజ్రత్ ఇమ్రాన్ బిన్‌హుసైన్ (రజి) ఉల్లేఖనం: ''పాపాత్ములు ఇచ్చే విందుఆహ్వానాన్ని స్వీకరించకూడదని దైవప్రవక్త (స) మమ్మల్ని వారించారు.'' (మిష్కాత్)

## మహర్ కంటే కట్నకానుకలే ముఖ్యమా?

ఈనాడు మన దేశంలో మహర్‌కు బదులు కట్నకానుకల ప్రాముఖ్యం ఎక్కువైపోయింది. ఇది హిందూ ఆచారాల పర్యవసానంగా ఉనికిలోకి వచ్చింది. దాని దుష్ప్రభావం ముస్లిమ్ సమాజంపై కూడా పడింది. హిందూ ధర్మశాస్త్రం ప్రకారం కుమార్తెకు తండ్రి ఆస్తిలో వాటా ఉండదు కనుక, పెళ్ళి సమయంలోనే కట్న కానుకల రూపంలో కొత్తసంసారం కోసం పెద్దఎత్తున వస్తుసామగ్రినిచ్చి ఆమెను కాపురానికి పంపుతారు. కొందరు కట్నకానుకల్ని ధర్మబద్ధమైనవిగా చిత్రించడానికి అతితెలివి ఉపయోగిస్తూ, హజ్రత్ ఫాతిమా (రజి) పెళ్ళిలో ఇవ్వబడిన కొన్ని గృహోపకరణాల ఉదాహరణ ఇస్తారు. కాని ఈ గృహోపకరణాలను దైవప్రవక్త(స) ఎలా తెచ్చిచ్చారు, వాటిని ఇవ్వాల్సిన అవసరం ఏమొచ్చింది మొదలైన వాస్తవాలను వీరు విస్మరిస్తున్నారు.

హజ్రత్ ఫాతిమా (రజి) పెళ్ళి అయ్యేదాకా హజ్రత్ అలి (రజి) దైవప్రవక్త (స) సంరక్షణ లోనే పెరిగారు. ఆయనకు దైవప్రవక్త (స) తప్ప ఇతర ఆప్తులు కూడా లేరు. అందువల్ల దైవప్రవక్త (స) వారిద్దరి కొత్తకాపురం కోసం కావలసిన కనీస గృహోపకరణాలు ఇవ్వడం అనివార్యమయ్యింది. అదైనా హజ్రత్ అలి (రజి) మహర్ చెల్లించవలసి ఉన్నందున దైవప్రవక్త (స) ఆయన దగ్గరున్న యుద్ధకవచం తీసుకొని అమ్మి వీటిని కొనిచ్చారు.

దైవప్రవక్త (స) ఆ యుద్ధకవచం అమ్మగా వచ్చిన డబ్బుతో ఒక పడక, ఒక తలగడ, కొన్ని మట్టి పాత్రలు మాత్రమే ఇచ్చినట్లు తెలుస్తోంది. ఆయన 'మహర్'ని అడ్వాన్సుగా తీసుకొని వీటిని కొనిచ్చారు. ఇలా అడ్వాన్సు మహర్ తీసుకొని కొత్త సంసారానికి కావాల్సిన సామగ్రిని కొనిచ్చే సంప్రదాయం ఈనాడు కూడా కొన్ని దేశాల్లో ఉంది. దైవప్రవక్త (స) ఇలా గృహోపకరణాలు హజ్రత్ ఫాతిమా (రజి)కు మాత్రమే ఇచ్చారు గాని, తన ఇతర కుమార్తెలెవరికీ ఇచ్చినట్లు చరిత్రలో మనకెక్కడా ఆధారాలు లభించవు. అడిగి లేదా వత్తిడిచేసి తీసుకున్న కట్నం కూడా



ఒక విధమైన లంచంలా అధర్మమేనని కొందరు ధర్మవేత్తలు అన్నారు. కనుక ఎవరైనా తెలియక తీసుకుంటే తిరిగి ఇచ్చివేయడం వాజిబ్ (విధి) అని కూడా వారు పేర్కొన్నారు.

"స్త్రీలకు లభించవలసిన మహర్ (వధుకట్నం)ను (విధిగా భావించి) వారికి సంతో షంగా ఇచ్చివేయండి. అయితే వారు సంతోషంగా కొంత మహర్ మాఫీచేస్తే దాన్ని మీరు నిరభ్యంతరంగా అనుభవించవచ్చు." (ఖుర్‌ఆన్-4:4)

మహర్ పురుషుడినుండి స్త్రీకి రావలసిన ఆర్థికహక్కు. కనుక వధువుకు వరుడు మహర్ చెల్లించాలి. ఏదైనా కారణంవల్ల మహర్ వివాహంలో చెల్లించలేకపోతే ఆ తర్వాతైనా వీలైనంత త్వరగా చెల్లించాలి. చెల్లించకపోతే పురుషుడు ఘోరమైన పాపం చేసినవాడవుతాడు; ప్రళయ దినాన పట్టుబడతాడు. భర్త ఆర్థికదుస్థితి గమనించి స్త్రీ మహర్ పైకం చెల్లించడానికి తన భర్తకు కొంత వ్యవధి ఇయ్యవచ్చు లేదా మహర్ కొంచెం తగ్గించి తీసుకోవచ్చు. అవసరమైతే మహర్ మొత్తం అసలు తీసుకోకుండా వదలి పెట్టవచ్చు.

"మీరు వారి వల్ల అనుభవించే దాంపత్య సుఖానికిగాను వారికి చెల్లించవలసిన నిర్ణీత మహర్‌ధనాన్ని విధిగా భావించి చెల్లించాలి. కాకపోతే మహర్ నిర్ణయం జరిగిన తరువాత మీరిద్దరు ఆ విషయంలో పరస్పరం ఇష్టపూర్వకంగా ఏదైనా చేయదలచుకుంటే చేయవచ్చు. అందులో ఎలాంటి తప్పు లేదు. (ఖుర్‌ఆన్-4:24)

"స్త్రీలకు రావలసిన మహర్ సంతోషంగా ఇచ్చేయండి. అయితే వారు సంతోషంగా కొంత మహర్ మాఫీచేస్తే దాన్ని మీరు నిరభ్యంతరంగా అనుభవించవచ్చు." (ఖుర్‌ఆన్-4:4)

మహర్, కానుకల రూపంలో పురుషుడు స్త్రీకి ఎంత పెద్ద ధనరాసి ఇచ్చివున్నా అవన్నీ ఆమె సొంతఆస్తుల క్రిందికివస్తాయి. వాటిని పురుషుడు మళ్ళీ తీసుకోకూడదు. అలాగే మహర్‌కు పరిమితి విధించి అంతే చెల్లించాలని షరతులు పెట్టే అధికారం కూడా ఎవరికీ లేదు.

"విశ్వాసులారా! బలవంతంగా స్త్రీల (ఆస్తి)కి వారసులై పోవడం మీకు ధర్మసమ్మతం కాదు. అలాగే మీరు మీ భార్యలకిచ్చిన మహర్ ధనంలో కొంతభాగం కాజేసే ఉద్దేశ్యంతో వారిని వేధించడం కూడా మీకు భావ్యంకాదు." (ఖుర్‌ఆన్-4:19)

"మీరు గనక ఒకభార్య స్థానంలో మరొక భార్యను చేసుకోవడానికి నిర్ణయించుకుంటే, మొదటి భార్యకు మీరు (మహర్‌గా) ఎంతపెద్ద ధనరాసి ఇచ్చివున్నా దాన్ని ఎలాంటి పరిస్థితి లోనూ మళ్ళీ తీసుకోరాదు. మీరామెపై నీలాపనిందలు వేసి, మరీఅంత అన్యాయంంగా దాన్ని తిరిగి తీసుకుంటారా? (ఎంత సిగ్గుచేటు!) " (ఖుర్‌ఆన్-4:20)

దైవప్రవక్త (స) ప్రవచనం: ''ఎగవేసే ఉద్దేశం పెట్టుకొని మహర్ కింద కొంతపైకం చెల్లించే ఒప్పందంతో ఏదైనా స్త్రీని వివాహమాడిన పురుషుడు నిజానికి ఒక వ్యభిచారి. అప్పు తీసుకొని తిరిగి చెల్లించే ఉద్దేశం లేనివాడు వాస్తవానికి ఒక దొంగ.'' (హదీసు)

"విశ్వాసులారా! విశ్వసించిన స్త్రీలు, హిజ్రత్ (వలస) చేసి మీ దగ్గరకు (మదీనా) వచ్చినప్పుడు (వారి విశ్వసనీయతను) మీరు ఓసారి పరీక్షించుకోండి. నిజానికి వారి విశ్వాసస్థితి దేవునికే బాగా తెలుసు. వారు నిజమైన విశ్వాసులే అని మీరు నిర్ధారించుకుంటే ఇక వారిని అవిశ్వాసుల దగ్గరికి తిప్పిపంపకండి. వారు అవిశ్వాసులకు (భార్యలుగా) ధర్మ

సమ్మతం కాలేరు. అవిశ్వాసులు కూడా వారికి (భర్తలుగా) ధర్మసమ్మతం కాలేరు. ఆ స్త్రీలకు ఇవ్వబడిన మహర్ ధనాన్ని వారి (భర్తల)కి తిరిగి ఇచ్చి వేయండి. అప్పుడు మీరు ఆ స్త్రీలకు మహర్ ధనం చెల్లించి వారిని వివాహమాడవచ్చు. అందులో ఎలాంటి తప్పు లేదు."

"స్వయంగా మీరు కూడా అవిశ్వాసులయిన స్త్రీలను మీ వైవాహికబంధంలో అట్టే ఆపి ఉంచకండి. అవిశ్వాసులైన మీభార్యలకు మీరిచ్చిన మహర్ ధనాన్ని అడిగి తీసుకోండి. అలాగే అవిశ్వాసులు కూడా తమ ముస్లింభార్యలకు లోగడ ఇచ్చిన మహర్ ధనాన్ని వారి నుండి అడిగి తీసుకోవచ్చు. ఇది దైవాజ్ఞ. దేవుడు మీమధ్య (ఈవిధంగా) తీర్పు చేస్తున్నాడు. ఆయన సర్వం తెలిసినవాడు, ఎంతో వివేకవంతుడు."

"ఒకవేళ మీరు (అవిశ్వాసులైన) మీభార్యలకు ఇచ్చిన మహర్ అవిశ్వాసుల నుండి మీకు తిరిగిలభించని పక్షంలో, మీవంతు వచ్చినప్పుడు, అవిశ్వాసులకు మీరు చెల్లించ వలసిన ధనాన్ని (వారికి అందజేయకుండా) ఇటు మహర్ నష్టపోయినవారికి ఇచ్చివేయండి. మీరు విశ్వసించిన దేవునికి భయపడుతూ మసలుకోండి." (ఖుర్ఆన్–60:10,11)

# 59. బహుభార్యత్వం

లైంగికపరంగా, స్త్రీలో కంటే పురుషునిలోనే సామర్థ్యం, దుడుకు స్వభావం ఎక్కువగా ఉంటాయి. అంచేత స్త్రీ ఒకేభర్త కలిగివుండేలా, పురుషుని భార్యలు పూర్వకాలంలోని మితి మీరిన బహుభార్యత్వాన్ని కొన్ని షరుతులతో గరిష్ఠంగా నలుగురికి పరిమితమయ్యేలా ఇస్లాం చట్టాలు రూపొందాయి. వైద్య కారణంతో లేదా మరేదైనా కారణంతో ఉన్నఒక భార్య ద్వారా సుఖం పొందలేని పురుషునికి రెండవ వివాహం చేసుకునే అవకాశం లేకపోతే అతను జీవితం మీద విరక్తిచెంది ఆత్మహత్య చేసుకోవచ్చు. లేదా వ్యభిచారానికి పాల్పడవచ్చు.

పాశ్చాత్యబాకాలకు శివమెత్తినవారు, మతదురభిమానులు ముస్లింలు నల్గురేసి భార్యల్ని చేసుకుంటున్నారని, వారి జనాభా విపరీతంగా పెరిగిపోతోందని గగ్గోలు పెడుతున్నారు. కాని వాస్తవ దృష్టితో పరిశీలిస్తే ముస్లిమేతరుల్లోనే ఉపపత్నుల (ఉంపుడుగత్తెల) రూపంలో బహు భార్యత్వం ఎక్కువగా కన్పిస్తుంది. ఇస్లాంలో బహుభార్యత్వం అనేక షరతులతో కూడిన ఒక అనుమతి మాత్రమే. పైగా క్లిష్టపరిస్థితుల్లో అదొక సామాజిక అవసరం కూడా.

అయినా ఈనాడు ఒక భార్యను పోషించడమే కష్టమైపోతున్నప్పుడు ముగ్గురు నల్గురు భార్యలను ఎలా చేసుకుంటారు? ఇస్లాం షరతులకు లోబడినవారు ఎవరో కొందరు మాత్రమే ఇద్దరు భార్యలు కలిగిఉంటున్నారు. ఎక్కువమంది భార్యలున్నప్పుడు వారందర్నీ సమానదృష్టితో చూస్తూ పూర్తిన్యాయం చేకూర్చడం శక్తికి మించిన పనని కూడా ఇస్లాం చెబుతోంది.

"భార్యలందరి పట్ల సమాన దృష్టితో మసలుకుంటూ వారికి పూర్తి న్యాయం చేకూర్చడం మీ శక్తికి మించిన పని. మీరు తలచినా అలా చేయలేరు. అయినప్పటికీ మీరు ఒక భార్య వైపు పూర్తిగా మొగ్గి మరొకామెను డోలాయమాన స్థితిలో పడవేయకండి." (ఖుర్ఆన్–4:129)

ఇద్దరు లేక అంతకన్నా ఎక్కువమంది భార్యలు ఉన్నప్పుడు పురుషుడు వారి మధ్య అన్ని విధాల సమానత్వం పాటించలేడు. భార్యల మధ్య ఉండే అందం, వయస్సు, స్వభావం, ఆరోగ్యం వగైరా వ్యత్యాసాల కారణంగా అతను వారందర్నీ సమానదృష్టితో చూడటం, ఒకే విధంగా ప్రేమించడం సహజంగానే సాధ్యంకాదు. అయితే అంతమాత్రాన ఆకర్షణ లేని భార్యను



పూర్తిగా విస్మరించి ఆకర్షణగల భార్యవైపు మొగ్గడం భావ్యంకాదు. లైంగికవ్యవహారంలో పూర్తిగా సమానత్వం పాటించకపోయినా ఇతర వ్యవహారాల్లో సంపూర్ణ సమానత్వం పాటించాలి.

దైవప్రవక్త (స) ప్రవచనం: "ఎవరికైనా ఇద్దరు భార్యలుండి, వారిద్దరి హక్కుల్ని న్యాయంగా, సమానంగా నిర్వర్తించకపోతే, తీర్పుదినాన అతను సగం శరీరం కోల్పో తాడు. ఆ స్థితిలోనే అతను (అర్థ శరీరంతో సమాధి నుండి) లేచివస్తాడు." (తిర్మిజి)

లైంగిక విషయంలో ఆకర్షణలేని భార్య వైపు మొగ్గు చూపలేకపోవడం మానవుని సహజ దౌర్బల్యం. దీన్ని గురించి దైవప్రవక్త (స) దైవాన్ని ఇలా ప్రార్థించారు:

"దేవా! (భార్యలతో కలియక గురించిన) నా విభజన నాకున్న శక్తిసామర్థ్యాల మేరకే. నా శక్తి పరిధిలోలేని విషయంలో నన్ను తప్పుపట్టకు." (అబూదావూద్)

"ప్రవక్త సంప్రదాయం ప్రకారం మొదటిసారిగా పడుచుభార్య అయితే ఆమె దగ్గర ఏడు రాత్రులు గడపాలి; ప్రౌఢభార్య అయితే ఆమె దగ్గర మూడు రాత్రులు గడపాలి. ఆ తరువాత నుంచి నిర్ణీత వంతులవారిగా గడపాలి." (బుఖారి, ముస్లిం)

ఇమామ్ మాలిక్ (రహ్మాలై) గారి హదీసు గ్రంథంలో ఇబ్నె షిహాబ్ ఉల్లేఖించిన కథనం ప్రకారం హజ్రత్ రాఫె బిన్ ఖదీజ్ (రజి) ఒక యువతిని వివాహం చేసుకున్నారు. అంతకు ముందు నుంచే ఆయన వివాహబంధంలో హజ్రత్ ముహమ్మద్ బిన్ ముస్లిం (రజి) గారి కుమార్తె ఉంది. హజ్రత్ రాఫె (రజి) రెండవ పెళ్ళి చేసుకున్న తరువాత పడుచు భార్యకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వసాగారు. అందువల్ల ఆయన మొదటి భార్య దైవప్రవక్త (సల్లం) సన్నిధికి వెళ్ళి భర్త మీద ఫిర్యాదు చేసింది.

అప్పుడు దైవప్రవక్త (సల్లం) హజ్రత్ రాఫె (రజి)ని పిలిచి "నీ భార్యలిద్దరి పట్ల న్యాయంగా మసలుకో లేదా ఈమెను వదలిపెట్టు" అని చెప్పారు.

# 60. దాంపత్య జీవితం

ఇస్లాం కుటుంబం అనే సంస్థకు పురుషుడ్ని చైర్మన్‌గా, స్త్రీని సెక్రటరీగా నియమించి ఎవరి బాధ్యతల్ని, హక్కుల్ని వారికి న్యాయవంతంగా కేటాయించింది. అంతేగాక ఆ చైర్మన్, సెక్రటరీలు ఎవరి విధుల్ని వారు సక్రమంగా నిర్వహిస్తున్నప్పుడే కుటుంబం అనే సంస్థ సవ్యంగా, సాఫీగా, సజావుగా సాగుతుందని చెబుతోంది. ఏ దేశంలోనూ ఇద్దరు అధ్యక్షులు, ఇద్దరు ప్రధానులు ఉండరు. ఏ సైనిక దళంలోనూ ఇద్దరు సేనాపతులు ఇమడలేరు. ఏ కార్యాలయంలోనూ ఇద్దరు అధికారులు పని చేయలేరు. అలాగే కుటుంబవ్యవస్థ సజావుగా సాగాలంటే భార్యాభర్తల్లో ఒక్కరే అధికారిగా ఉండాలి. శారీరక, మానసిక సామర్థ్యాల్లో స్త్రీకన్నా పురుషునికి కొంత ఆధిక్యత ఉన్నందున కుటుంబవ్యవస్థకు ఇస్లాం పురుషుడ్ని అధికారిగా నిర్ణయించింది. భార్య అతని సహాయకురాలు మాత్రమే. కనుక చైర్మన్‌పురుషుడు, సెక్రటరీస్త్రీ సమానత్వం పేరుతో రచ్చకెక్కి సంసారంలో చిచ్చు రగుల్చుకోవలసిన అవసరంలేదు. హక్కులు, బాధ్యతలు సంస్థ నిబంధనావళి (ఖుర్ఆన్)లో స్పష్టంగా పేర్కొనబడ్డాయి.

"సాధారణంగా స్త్రీలపై పురుషులకు ఎలాంటి హక్కులున్నాయో న్యాయపరంగా పురుషులపై స్త్రీలకు కూడా అలాంటి హక్కులే ఉన్నాయి. కాకపోతే పురుషులకు స్త్రీలపై ఒక

మెట్టు ఆధిక్యత ఉంది. దేవుడు శక్తిమంతుడు, వివేచనాపరుడు." (ఖుర్ఆన్-2:228)

"దేవుడు స్త్రీలపై పురుషులకు కొంత ఆధిక్యత ప్రసాదించడం వల్ల, పురుషులు తమ సంపదను స్త్రీల కోసం ఖర్చుపెడ్తున్నందు వల్ల పురుషులు స్త్రీలపై వ్యవహారకర్తలు అవుతారు. కనుక సుగుణవతులైన స్త్రీలు తమ భర్తలకు విధేయత చూపుతూ వారి కనుసన్నలలో నడచు కుంటారు. పురుషులు (ఇంటి పట్టున) లేనప్పుడు దేవునిరక్షణలో వారి హక్కులు కాపాడు తుంటారు." (ఖుర్ఆన్-4:34)

ఇస్లామీయ దాంపత్యచట్టం లక్ష్యాలలో శీలరక్షణ మొట్టమొదటి లక్ష్యం. స్త్రీపురుషులు తమ సహజసంబంధం విషయంలో శీలం, సంస్కృతులను కాపాడగలిగే ఓ నైతిక నియమావళికి కట్టుబడివుండేలా చేస్తుంది. అందుకే ఖుర్ఆన్‌లో నికాహ్‌ను **'ఎహ్సాన్'**తో పోల్చడం జరిగింది. **'హిస్న్'** అంటే కోట. "ఎహ్సాన్" అంటే కోటనిర్మాణం. వివాహం చేసుకున్న పురుషుడ్ని **'ముహ్సిన్'** అంటారు. అంటే అతను కోట నిర్మాత అన్నమాట. అతను వివాహమాడిన స్త్రీని **'ముహ్సినా'** అంటారు. అంటే కోటలో ఆశ్రయంపొందిన స్త్రీ అని అర్థం. మరోమాటలో చెప్పాలంటే స్త్రీ వ్యక్తిత్వాన్ని, ఆమె మానాన్ని, శీలాన్ని వివాహం అనే కోట కాపాడుతుందన్న మాట. గ్రంథప్రజల (యూదులు, క్రైస్తవుల) స్త్రీలను వివాహమాడవచ్చని ఖుర్ఆన్ అనుమతించింది. అయితే ఇస్లాం దృష్టిలో ఈ సంబంధం కూడా అవాంఛనీయమైనదే. ముఖ్యంగా ఈనాడు అలాంటి స్త్రీలతో వివాహం మరింత అవాంఛనీయమైనది.

హజ్రత్ కాబ్ బిన్ మాలిక్ (రజి) గ్రంథప్రజల (యూదుల)లోని ఒక స్త్రీని వివాహమాడ దలచినప్పుడు దైవప్రవక్త (సల్లం) ఆయన్ని వారిస్తూ "ఆమె నిన్ను ముహ్సిన్ (కోటనిర్మాత) చేయలేదు" అన్నారు. (హదీస్)

## వివాహ లక్ష్యాలు

దీన్నిబట్టి వివాహ **మొదటిలక్ష్యం-స్త్రీ శీలాన్ని, ఆమె మానమర్యాదలను కాపాడటమే** నని తెలుస్తోంది. వివాహరూపేణ నిర్మించబడిన ఈ కోటను దాంపత్యచట్టం పటిష్ఠపరుస్తుంది.

"(మీకు నిషేధించబడిన) ఈ స్త్రీలు తప్ప ఇతర స్త్రీలందర్నీ ధన వినియోగం ద్వారా మీరు వివాహమాడవచ్చు. అయితే వివాహలక్ష్యం శీలరక్షణయి ఉండాలిగాని, స్త్రీలోలత్వమయి ఉండకూడదు." (ఖుర్ఆన్-4:24)

"కనుక బానిస స్త్రీలను వారి యజమానుల అనుమతి తీసుకొని వివాహమాడండి. చట్టం ప్రకారం వారికి చెల్లించవలసిన మహర్ ధనం కూడా చెల్లించాలి. అయితే వారిని వివాహబంధంలో సురక్షితంగా ఉంచండి. విచ్చలవిడిగా చెడుతిరుగుళ్ళు తిరగనివ్వకండి. దొంగచాటుగా ప్రేమకలాపాలకు పాల్పడనీయకండి." (ఖుర్ఆన్-4:25)

"వారికి చెల్లించాల్సిన మహర్ సొమ్ము చెల్లించి, వారిని వివాహబంధంలో సురక్షితంగా ఉంచాలి. అంతేగాని, వారితో విచ్చలవిడిగా కామక్రీడలకు పాల్పడటంగాని, దొంగచాటుగా అక్రమ సంబంధాలు పెట్టుకోవడంగాని చేయకూడదు." (ఖుర్ఆన్-5:5)

దంపతులు దైవనిర్ణీత పరిమితులకు కట్టుబడి ఉంటూ సహజ సిద్ధమైన తమ కోర్కెలను తీర్చుకోవడానికి వారిని ఈవిధంగా వివాహబంధంలో బంధించడం జరిగింది. ఒకవేళ ఏదయినా వివాహబంధంలో దంపతులు దైవనిర్ణీత పరిమితులకు కట్టుబడి ఉండలేని పరిస్థితులు



ఏర్పడితే, వాటి పరిరక్షణ కోసం వివాహబంధాన్ని త్యాగం చేయడమే మంచిది. సారంలేని వివాహబంధం కొనసాగించేందుకు దైవపరిమితుల్ని త్యాగం చేయకూడదు.

ఈ కారణంగానే భార్యతో సంభోగించనని ప్రమాణం చేసే పురుషునికి నాలుగు నెలలు గడువు ఇవ్వబడింది. అంటే ఈ నాలుగు నెలలలోపే అతను తన ప్రమాణాన్ని భంగపరచి భార్యను కలుసుకోవలసివుంటుంది. ఒకవేళ అతను నాలుగునెలల గడువు దాటిన తర్వాతకూడా భార్యను కలుసుకోవడానికి సిద్ధంకాకపోతే, ఆమెను తన వివాహబంధంలో కొనసాగించడానికి అతనికెలాంటి అధికారం లేదు. అలాగే ప్రమాణం చేయకపోయినా సరే, నాలుగు నెలలకు మించి భార్యను పడక మీదికి రానీయకుండా ఉండటం కూడా మంచిది కాదు.

వివాహం రెండవలక్ష్యం- స్త్రీపురుషుల మధ్య దాంపత్యసంబంధం కారుణ్యాభిమానాల ప్రాతిపదికపై ఉండాలి. కారుణ్యాభిమానాల ప్రాతిపదికపై ఏర్పడిన వైవాహిక బంధం ద్వారా మాత్రమే దంపతులు పరస్పరం సహకారంతో సంస్కృతీ సభ్యతలకు సంబంధించిన లక్ష్యాలు సాధించే అవకాశం ఉంటుంది. పైగా వారు తమ సాంసారికజీవితంలో సుఖసంతోషాలు కూడా పొందగలుగుతారు. ఈ లక్ష్యం గురించి ఖుర్ఆన్ వర్ణించిన తీరును గమనిస్తే ఇస్లాం దృష్టిలో దాంపత్యమంటే కారుణ్యాభిమానాలే అన్న భావన మనకు తప్పకుండా కలుగుతుంది. నిజానికి స్త్రీపురుషులు ఒకరి ద్వారా మరొకరు సౌఖ్యం పొందడానికే దంపతులవుతారు.

"ఆయన మీకోసం మీజాతి నుండే జీవిత భాగస్వాము(స్త్రీ)లను సృజించాడు, వారిదగ్గర మీరు సౌఖ్యం పొందడానికి. ఇంకా ఆయన మీ మధ్య ప్రేమానురాగాలు, దయాదాక్షిణ్యాలను కూడా జనింపజేశాడు." (ఖుర్ఆన్-30:21); "వారు మీకు, మీరు వారికి దుస్తులు వంటి వారు." (ఖుర్ఆన్-2:187)

భార్యభర్తల్ని దుస్తులతో పోల్చడంలోని ఉద్దేశ్యం దేహానికి, దుస్తులకు మధ్య ఎలాంటి అవినాభావ సంబంధం ఉంటుందో ఆలుమగల మధ్య వైవాహికసంబంధం కూడా అలాంటిదే ఉండాలని తెలియజేయడమే. అంటే వారు ఒకరికొకరు ఆచ్ఛాదనగా, రక్షణ కవచంగా ఉండాలి. తమ గౌరవప్రతిష్ఠలకు, నీతినడవడికలకు భంగం కలిగించే చెడుల నుండి కాపాడుకోవాలి.

"ముస్లిములయిన, విశ్వసించిన, విధేయులయిన, నిజాయితీపరులైన, సహనశీలు రయిన, దానశీలురయిన, మర్మాయవాలు కాపాడుకునే, ఉపవాసవ్రతాలు పాటించే, అణుకువ వినయం కలిగివుండే, దేవుడ్ని అత్యధికంగా స్మరించే స్త్రీ పురుషుల కోసం దేవుడు మన్నింపు, గొప్ప ప్రతిఫలం సిద్ధపరచి ఉంచాడు." (ఖుర్ఆన్-33:35)

ఆలుమగల మధ్య సదవగాహన, ప్రేమానురాగాలు ఉన్నప్పుడు ఎలాంటి పొరపొచ్చాలు రావు. అయినా ఒక్కోసారి షైతాన్ దంపతుల్లో అపోహలు సృష్టించి వారి సంసారంలో చిచ్చు రగల్చడానికి ప్రయత్నిస్తాడు. కనుక దంపతులు పరస్పరం సర్దుబాటు వైఖరి అవలంబించాలి.

ప్రపంచంలోని భార్యాభర్తలందరికీ అలి, ఫాతిమా (రజి)లు ఆదర్శ దంపతులనడంలో ఎలాంటి సందేహం లేదు. అయితే భార్యభర్తలు అన్నాక ఎప్పుడో ఒకప్పుడు, ఏదో ఒక సందర్భంలో వారి మధ్య కీచులాట రాకుండా ఉండదు. ఒక రోజు ఫాతిమా (రజి) ఏదో విషయంలో భర్త మీద అలిగి తండ్రి ఇంటికి వెళ్ళిపోయారు. కాస్సేపటికి అలి (రజి) కూడా ఆమె వెనకాల దైవప్రవక్త (స) ఇంటికి వెళ్ళారు.

ఫాతిమా (రజి) చేసిన ఆరోపణలన్నీ దైవప్రవక్త (స) విన్నారు. కాని అంతమాత్రాన ఆయన కూతుర్ని వెనకేసుకొని రాలేదు. పైగా కూతురికి గుణపాఠం గరిపే విధంగా "లోకంలో ఏ భార్యాభర్తల మధ్య పొరపొచ్చాలు రాకుండా ఉంటాయమ్మా! అయినా ప్రతి విషయంలోనూ భర్త భార్యమాట వినాల్సిన అవసరం ఏముంది?" అన్నారు.

తలుపు చాటున నిలబడి తండ్రీకూతుళ్ళ సంభాషణ విన్న హజ్రత్ అలి (రజి)ని ఈమాటలు ఎంతో ప్రభావితంచేశాయి. తానిక ఎన్నటికీ ఫాతిమా మనస్సు నొప్పించనని ఆయన గట్టిగా నిర్ణయించుకున్నారు. ఫాతిమా (రజి) కూడా తండ్రి మాటలు విన్న తరువాత ఇకముందు ఏ విషయంలో కూడా భర్తకు ఎదురుచెప్పకుండా మసలుకుంటానని నిశ్చయించుకున్నారు. (మిష్కాత్)

"ఏ స్త్రీ అయినా భర్త తనను వేధిస్తున్నాడని లేదా సరిగా ఆదరించడంలేదని భావించినప్పుడు భార్యాభర్తలు పరస్పరం సంప్రదించుకొని సర్దుకుపోతే అందులో తప్పు లేదు. అసలు వారు సర్దుకుపోవడమే సర్వదా శ్రేయస్కరం. హృదయాలు సంకుచితత్వం వైపు ఎక్కువగా మొగ్గుతాయి. అయితే మీరు పరస్పరం శ్రేయోభిలాషతో, దైవభీతి పరాయణతో వ్యవహరిస్తూ ఉండండి. మీరు చేసే పనులన్నిటినీ దేవుడు గమనిస్తూనే ఉన్నాడు." (ఖుర్ఆన్-4:128)

## లైంగిక భావోద్రేకాల వినియోగం

సత్కార్యాల నుండి నిరోధిస్తూ దుష్కార్యాల వైపు పురిగొల్పేవారు స్త్రీలలో కూడా ఉంటారు; పురుషులలో కూడా ఉంటారు. అందువల్ల సత్యాన్ని విశ్వసించిన స్త్రీ పురుషులు ఇలాంటి దుష్ట స్త్రీ పురుషుల పట్ల చాలా జాగ్రతగా మసలుకోవాలి. బహుశా దీన్ని గురించే దైవప్రవక్త (స) ఈవిధంగా ప్రవచించారు:

"ప్రతిరోజూ ఉదయం ఇద్దరు దైవదూతలు ఒక ప్రకటన గావిస్తూ 'పురుషులకు స్త్రీలు నష్టదాయకం, స్త్రీలకు పురుషులు నష్టదాయకం' అని అంటారు." (ఇబ్నెమాజ)

"ఇహలోకం సుమధురమైన పచ్చటి వస్తువు. దేవుడు మిమ్మల్ని ఇలాంటి భోగ భాగ్యాల ప్రపంచానికే వారసులుగా చేస్తాడు. కనుక మీరు ప్రాపంచిక రంగేళికి దూరంగా ఉండండి. అలాగే స్త్రీల ద్వారా ఎదురయ్యే పరీక్షల నుండి కూడా మిమ్మల్ని మీరు కాపాడుకోండి. మీకు పూర్వం ఇస్రాయీల్ సంతతి ప్రజలకు ఎదురైన మొదటి పరీక్ష కూడా స్త్రీల ద్వారానే వచ్చింది." (ఇబ్నెమాజ, ముస్లిం)

"మీలో ఎవరికైనా ఒక స్త్రీ అందంగా కన్పించి మీరామె పట్ల ఆకర్షించబడితే, (వెంటనే) అతను తన భార్య దగ్గరకు వెళ్ళి ఆమెతో రమించాలి. ఈ విధంగా అతనిలో జనించిన అక్రమ లైంగికాలోచనలు సమసిపోతాయి." (ముస్లిం, తిర్మిజి)

భార్యాభర్తల కలియక విషయంలో తీసుకోవలసిన కొన్ని జాగ్రత్తలు, పాటించవలసిన కొన్ని హితవులు ఉన్నాయి. వాటిని గురించి దైవప్రవక్త (స) ఇలా తెలిపారు:

"తన నోరు, మర్మావయవాల రక్షణ గురించి నాకు హామీ ఇచ్చే వ్యక్తికి నేను స్వర్గప్రవేశం గురించి హామీ ఇస్తాను." (బుఖారి, తిర్మిజి)



"దేవుడు ఎవరి నోరు, మర్మావయవాల కీడు నుండి కాపాడుతాడో అతను స్వర్గంలో ప్రవేశిస్తాడు." (తిర్మిజి)

"ఏ స్త్రీ తనభర్త ఇంట్లో కాకుండా వేరేచోట దుస్తులు విడిచిపెడ్తుందో ఆమె తనకు, తన ప్రభువుకు మధ్య గల (భక్త) సంబంధాన్ని త్రెంచివేసినట్లే." (ముస్నద్ అహ్మద్)

హజ్రత్ జాబిర్ (రజి) ఉల్లేఖనం: మేము ఒక యుద్ధం నుండి తిరిగొచ్చిన తరువాత మా ఇండ్లకు పోవడానికి సిద్ధమవుతుంటే దైవప్రవక్త (స) మమ్మల్ని వారిస్తూ ఇలా అన్నారు: "ఆగండి, అప్పుడే వెళ్ళకండి. చీకటిపడ్డాక రాత్రి సమయంలో వెళ్ళండి. ఈలోగా స్త్రీలు నాభిక్రింది వెండ్రుకలు తొలగించి, తలదువ్వుకొని జడే వేసుకుంటారు. అలాగే భర్తలు ఎక్కడికైనా పోయివున్న స్త్రీలు కూడా వారు వచ్చే ముందు నాభిక్రింది వెండ్రుకలు తొలగించి స్నానంచేసి సిద్ధంగా ఉంటారు." (బుఖారి, ముస్లిం, ముత్తఫఖున్ అలై)

"భార్యాభర్తలు కలుసుకునే ముందు 'బిస్మిల్లాహి అల్లాహుమ్మ జన్నిబ్ నష్షయితాన వ జన్ని బిష్షయితాన మా రజఖ్తనా' (దేవుని పేరుతో ప్రారంభం. దేవా! మమ్మల్ని షైతాన్ కీడు నుండి కాపాడు. నీవు మాకు ప్రసాదించే సంతానం దగ్గరికి షైతాన్ రాకుండా వాడ్ని దూరంగా ఉంచు.) అని వేడుకోవాలి. ఇలా వేడుకొని కలిస్తే విధివ్రాత ప్రకారం ఆమె గర్భం దాల్చుతుంది. ఆ తరువాత సంతానం కలిగితే ఆ సంతానానికి షైతాన్ ఎన్నడూ కీడు తలపెట్టలేడు." (బుఖారి, ముస్లిం)

"భార్యతో సంభోగించడం దానం (సదఖా) చేసినంత పుణ్యకార్యం." (ముస్లిం)

"మీలో ఎవరైనా తన భార్యతో సంభోగిస్తున్నప్పుడు వారిద్దరు గాడిదల్లా (పూర్తిగా వివస్త్ర అయి) నగ్నం కాకుండా పరదా పాటించాలి." (ఇబ్నెమాజ)

సతీసతుల సంయోగం సౌఖ్యానికి పరాకాష్ఠ. కాని వ్యామోహంలో తొందరపాటు వ్యర్థం. దానికి ముందు తతంగం పూర్తిచేసి నింపాదిగా అసలు రంగంలోకి దిగాలి. ముద్దులు, ముచ్చట్లు, చుంబనాలు, గుంభనాలు, కౌగిట్లు, క్రీగంట్లతో దారి సుగమంచేయాలి. ఆ తర్వాతే కదంబ కార్యక్రమానికి శ్రీకారం. అలాకాకుండా ఏకంగా పైనబడి పనికి ఉపక్రమించడం తెలివైన పతి లక్షణం కాదు. అంతేకాదు, పగలు పెళ్ళాన్ని చితకబాది రాత్రి కాగానే పడక మీదికి లాక్కోవడం కూడా మొగుడికి మంచిది కాదు. దానివల్ల ఇద్దరి మధ్య మురిపెం పోయి ముభావం చోటుచేసుకుంటుంది. దైవప్రవక్త (సల్లం) అలాంటి చేష్టలను నిరసించారు.

అబూమన్సూర్ వైల్మి ఉల్లేఖనం: దైవప్రవక్త (స) (సంభోగానికి ముందు తతంగం గురించి చెబుతూ) "మీలో ఎవరూ తన భార్య మీద ఏకంగా పశువు ఎక్కినట్లు ఎక్కకూడదు. ఇద్దరి మధ్య ముందుగా ఒక దూత ఉండాలి" అని అన్నారు. ప్రవక్త అనుచరులు ఈమాట విని "దైవప్రవక్తా! దూత అంటే ఎవరూ?" అని అడిగారు. "దూత అంటే మాట్లాడుకోవడం, ముద్దాడుకోవడం" అని చెప్పారు దైవప్రవక్త (స).

అబూమన్సూర్ ఉల్లేఖించిన మరో ఉల్లేఖనం ప్రకారం "మూడు విషయాలు బలహీనతల్లో చేరివున్నాయి" అన్నారు దైవప్రవక్త (స). వాటిలో ఒకదాన్ని గురించి ఇలా తెలిపారు: "మనిషి తన భార్యతో లేదా దాసీతో సంభోగిస్తున్నప్పుడు ఆమెతో ముద్దూ ముచ్చటా

ఏమీ చేయకుండానే ఒక్కసారిగా లైంగిక క్రీడకు దిగుతాడు. ఈవిధంగా అతను తనతో ఆమె తృప్తిచెందక ముందే ఆమెతో తృప్తిచెందుతాడు" అని అన్నారు.

ముస్నద్ ఫిర్దౌస్‌లో పేర్కొనబడిని ఈ రెండు హదీసులు ప్రమాణంరీత్యా బలహీన మైన హదీసులయినప్పటికీ విషయం రీత్యా ఎంతో సమంజసంగా ఉన్నాయి. ఇమామ్ గజాలీ (రహ్మలై) కూడా తన గ్రంథం "ఇహ్యావుల్ ఉలూమ్"లో ఈ విషయం ప్రస్తావిస్తూ భర్త తన కోరిక తీర్చుకున్నప్పుడు తన భార్యక్కూడా ఆ కోరిక తీర్చుకునే అవకాశమివ్వాలని అన్నారు. కొందరు స్త్రీలకు స్ఖలనం ఆలస్యంగా జరుగుతుంది. అందువల్ల భర్త తన కోరిక తీర్చుకున్న వెంటనే భార్య నుండి వేరుకాకూడదన్నారు ఆయన.

"భార్యతో సంపర్కం జరిపి, దాని రహస్యవిషయాలు జనంతో చెప్పుకుంటూ తిరిగే పురుషునికి ప్రళయదినాన ప్రజలందరిలోకెల్లా అతి చెడ్డ నివాసం లభిస్తుంది." (ముస్లిం)

దైవప్రవక్త (సల్లం) సతీమణి హ్జ్రత్ ఆయిషా (రజి) ఉల్లేఖనం: "నేను దైవప్రవక్త 'సతర్' (నాభి నుండి మోకాళ్ళ వరకుండే శరీర) భాగాన్ని ఏనాడు చూడలేదు."

హ్జ్రత్ జాబిర్ (రజి) ఉల్లేఖనం: "భార్యతో వెనుక వైపు నుంచి సంభోగిస్తే పిల్లలు అవిటివాళ్ళుగా పుడ్తారని యూదులు అంటుండేవారు. దానికి సమాధానంగా (ఖుర్‌ఆన్‌లో) 'మీ భార్యలు మీకు వ్యవసాయ క్షేత్రాల్లాంటివారు. మీరు మీ వ్యవసాయ క్షేత్రాలకు మీ కిష్టమైన రీతిలో వెళ్ళవచ్చు.' (2:223) అనే సూక్తి అవతరించింది." (బుఖారి, ముస్లిం)

అయితే పృష్ఠసంపర్కం గురించి దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు:

"తన భార్యతో పృష్ఠసంపర్కం జరిపే పురుడిపై దేవుని అభిశాపం, ఛీత్కారం పడుగాక!" (అబూదావూద్)

"సత్యం తెలపడానికి దేవుడు ఏమాత్రం సిగ్గుపడడు. మీరు మీ భార్యలతో అనుచిత సంపర్కం జరపకండి. వారితో పృష్ఠసంపర్కం కూడా జరపకండి." (అహ్మద్)

"తన భార్యతోగాని, బాలుడితోగాని పృష్ఠసంపర్కం జరిపిన, లేదా మరేదైనా అనుచిత సంపర్కం జరిపిన పురుషుడ్ని దేవుడు కన్నెత్తి కూడా చూడడు." (ఇబ్నెమాజ, అబూదావూద్)

దైవప్రవక్త (స) ప్రవచనం: 'రుతుమతితో సంగమించినవాడు, స్త్రీతో లూత్‌జాతి నిర్వాకానికి పాల్పడినవాడు లేక జ్యోతిష్కుడు చెప్పినజోస్యం నమ్మినవాడు ముహమ్మద్ (స)పై అవతరించిన బోధనలు తిరస్కరించినవాడవుతాడు." (తిర్మిజి)

## 61. భర్త బాధ్యతలు

పురుషుడు వివాహసందర్భంలో ఏదయినా కారణం వల్ల మహర్ చెల్లించలేకపోతే, వివాహం తరువాత వీలైనంత త్వరగా మహర్ చెల్లించాలి. ఇది భర్త నెరవేర్చవలసిన మొదటి బాధ్యత. తరువాత అతను తన స్తోమతను బట్టి ఆమె పోషణఖర్చులు భరించాలి.

"ధనికుడు తన ఆర్థిక స్తోమతనుబట్టి ఈ పోషణ ఖర్చులు భరించాలి. తక్కువ ఉపాధి ఇవ్వబడినవాడు దేవుడు తనకిచ్చిన దాన్నుంచే ఎంతోకొంత ఖర్చుపెట్టాలి." (ఖుర్‌ఆన్–65:7)



దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "మనిషి తన భార్యాపిల్లల కోసం ఖర్చు చేసే దీనార్ (డబ్బు), జిహాద్ వాహనం కోసం ఖర్చుచేసే దీనార్, దైవమార్గంలో తన సహచరుల కోసం ఖర్చుచేసే దీనార్- ఈ దీనార్ అన్నిటికంటే ఎంతో శ్రేష్ఠమయినది." (ముస్లిం)

హ్జ్రత్ అబూహురైరా (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ఇలా అన్నారు: ఒక దీనారుని నువ్వు దైవమార్గంలో (అంటే ధర్మోన్నతి కోసం చేసే కృషిలో) ఖర్చు చేస్తావు. ఒక దీనారుని నువ్వు బానిసస్వేచ్ఛ కోసం ఖర్చు చేస్తావు. మరోదీనారు ఓ అభాగ్యుడికి దానంగా ఇస్తావు. ఇంకో దీనారుని నీ ఆలుబిడ్డల కోసం ఖర్చుపెడతావు. అయితే వీటన్నింటిలో నువ్వు నీ ఆలుబిడ్డల కోసం ఖర్చుపెట్టే దీనారే ఎంతో పుణ్యప్రదమైనది." (ముస్లిం)

దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "మీరు దైవప్రసన్నత కోసం ఏ పని చేసినా దాని పుణ్యఫలం మీకు తప్పకుండా లభిస్తుంది. చివరికి మీరు మీ భార్య నోటికి ఒక అన్నంముద్ద అందించినా దానికీ పుణ్య ఫలం లభిస్తుంది." (బుఖారి, ముస్లిం)

"ఒక ముస్లిం పుణ్యఫలాపేక్షతో తన భార్యాపిల్లల కోసం ఖర్చు పెడ్తుంటే అదంతా అతని పాలిట దానం (సదఖా) చేసే పుణ్యంతో సమానమవుతుంది." (బుఖారి)

దైవప్రవక్త (స) ప్రవచనం: "మనిషి ఒకరి అన్నపానీయాలకు బాధ్యుడై తన బాధ్యత) నిర్లక్ష్యం చేయటం చాలు, అతను పాపాత్ముడని చెప్పడానికి." (అబూదావూద్)

భర్త తన భార్యాపిల్లల కోసం ఖర్చుపెట్టడంలో పిసినారితనం వహిస్తే అతని భార్యకు భర్త అనుమతి లేకుండా తన పిల్లల కోసం సరిపడేంత డబ్బు తీసుకునే హక్కుంది.

హ్జ్రత్ అబూసుఫ్యాన్ (రజి) భార్య హ్జ్రత్ హిందా (రజి) ఓసారి దైవప్రవక్త (స)తో "దైవప్రవక్తా! నా భర్త పీనాసి మనిషి. నా పిల్లల పోషణకు సరిపడేటంత కూడా (డబ్బు) ఆయన సంతోషంగా ఇవ్వడు. మరి నేను ఆయన డబ్బు నుంచి కొంత తీసుకొని నా పిల్లలకు అన్నపానీయాలు సమకూర్చుకోవచ్చా?" అని అడిగారు. దానికి దైవప్రవక్త (స) "నీకు, నీ పిల్లలకు సరిపడేటంత తీసుకుంటూఉండు." అని అన్నారు. (హదీస్)

ఒకతను దైవప్రవక్త (స)ను "మామీద భార్యకున్న హక్కేమిట?"ని అడిగాడు. దానికి దైవప్రవక్త (స) "నీవు తినగలిగే ఆహారం ఆమెకు పెట్టాలి. నీవు ధరించగలిగే వస్త్రాలు ఆమెకివ్వాలి. (నీపట్ల అవిధేయతకు పాల్పడినపుడు) నీవామె ముఖంపై కొట్టకూడదు. ఇంట్లో తప్ప మరెక్కడా ఆమెను వదలిపెట్టకూడదు" అని అన్నారు. (అబూదావూద్)

హ్జ్రత్ అబూహురైరా ప్రకారం దైవప్రవక్త (స) ఇలా అన్నారు: "దైవసాక్షి! భార్యా పిల్లల వ్యవహారంలో (వారి బాగోగులు చూడకుండా) చేసిన (తప్పుడు) ప్రమాణం పట్ల మొండివైఖరి అవలంబించడం ఘోరపాపం. అలాంటి ప్రమాణాన్ని భంగపరచి దేవుడు నిర్ణయించిన పాపపరిహారం చెల్లించడం కంటే ఆ ప్రమాణాన్ని భంగపరచకుండా దానిపై స్థిరంగా ఉండటమే దేవుని దగ్గర ఎక్కువ పాపానికి కారణభూతం అవుతుంది." (బుఖారి)

సాధారణంగా ప్రమాణాన్ని భంగపరచకూడదు. అయితే బంధుమిత్రులకు నష్టం కలిగించే, వారిని కష్టాల్లో పడవేసే ప్రమాణం చేసివుంటే దాన్ని భంగపరచడం చాలా అవసరం. అలాంటి ప్రమాణాన్ని భంగపరచకపోతే మనిషి పాపాత్ముడవుతాడు. ఉదా:- ఎవరైనా తనభార్యతో కలసి

భోజనం చేయనని, ఆమెతో మాట్లాడనని లేక ఇంట్లో వెచ్చాలు తీసుకురానని ప్రమాణం చేసి వుంటే అలాంటి ప్రమాణాన్ని భంగపరచాలి. కాకపోతే ప్రమాణభంగానికి పరిహారం చెల్లించుకోవలసి ఉంటుంది. ప్రమాణాన్ని భంగపరిస్తే పాపానికి పాల్పడిన వారయ్యే ప్రమాదముంటే అలాంటి ప్రమాణాన్ని భంగపరచకూడదు. ఉదా:- ఎవరైనా తన భార్యతో కలసి మద్యం సేవించనని, లేదా జూదమాడనని ప్రమాణం చేసివుంటే దాని పైన్నే స్థిరంగా ఉండాలి. (ఇమామ్‌నవవీ-రహ్మలై)

హజ్రత్ అమ్ర్ బిన్ అహ్వస్ జుషమీ (రజి) కథనం: దైవప్రవక్త (స) తన వీడ్కోలుహజ్ సందర్భంగా.... ఇలా అన్నారు: "వినండి, భార్యల పట్ల మంచిగా మెలగండి. వారు మీ దగ్గర బందీలుగా ఉన్నారు. మీరు వారితో సంభోగించవచ్చు. వారు తమ శీలాన్ని కాపాడు కుంటూ మీ సంపదను కాపాడుతుంటారు. దానికిమించి మీకు వారిపై ఎలాంటి అధికారం లేదు. అయితే వారు బహిరంగంగా నీతిబాహ్యతకు పాల్పడితే (వారిని దండించవచ్చు.) ఒకవేళ వారు (అలాంటి తప్పేదయినా చేస్తే) వారిని మీ పడకల నుండి వేరుచేయండి. (అప్పటికీ తప్పు మానుకోకపోతే) వారిని హింసించకుండా (తేలిగ్గా)కొట్టండి. మీకు విధేయు లైపోతే ఇక (దురుద్దేశ్యంతో వారిని వదిలించుకునే) మార్గాలు వెతకకండి. జాగ్రత్త! మీకు మీ భార్యలపై హక్కులున్నట్లే, మీ భార్యలకు కూడా మీపై హక్కులున్నాయి. వారిపై మీకున్న హక్కు- వారు మీ పడకలను మీకిష్టంలేనివారిచే తొక్కనీయకూడదు. మీకిష్టం లేనివారిని మీ ఇంట్లోకి రావటానికి అనుమతించకూడదు. ఇక వారికి మీమీద ఉన్న హక్కు- మీరు వారికి (వీలైనంతవరకు) మంచి అన్నవస్త్రాలు సమకూర్చాలి." (తిర్మిజీ)

దైవప్రవక్త (స)"దేవుని దాసీలను (స్త్రీలను) కొట్టకండని (ప్రజలకు) హితబోధ చేశారు. ఆయనీ హితోపదేశం చేసిన కొంతకాలానికి ఉమర్ (రజి) ఆయన దగ్గరికి వచ్చి "స్త్రీలు తమ భర్తలకు ఎదురుతిరుగుతున్నారని ఫిర్యాదు చేశారు. అప్పుడు దైవప్రవక్త (స) (అవసరమైతే) భార్యల్ని కొట్టేందుకు అనుమతి ఇచ్చారు. (ఆ తరువాత కొంత కాలానికి) ఎంతోమంది స్త్రీలు దైవప్రవక్త (స) భార్యల దగ్గరికి వచ్చి తమ భర్తలు తమల్ని కొడుతున్నా రని ఫిర్యాదు చేయసాగారు. అప్పుడు దైవప్రవక్త (స) ప్రజలతో "చాలామంది స్త్రీలు ముహమ్మద్ ఇంటి దగ్గర గుమిగూడి తమ భర్తల గురించి ఫిర్యాదు చేస్తున్నారు. మీలో తమ భార్యల్ని వేధించేవారు మంచివారు కాదు, జాగ్రత్త!" అని అన్నారు. (అబూదావూద్)

## ఇస్లాం దృష్టిలో మంచి భర్త

దైవప్రవక్త (స) ఒకసారి మంచి భర్తను గురించి చెబుతూ "తనభార్య కోసం ఉత్తము డయినవాడే మీలో ఉత్తముడు" అని అన్నారు. (ఇబ్నెమాజ)

దైవప్రవక్త (సల్లం) మరొక సందర్భంలో మహిళల హక్కుల్ని గురించి ప్రస్తావిస్తూ "గుర్తుంచుకోండి! స్త్రీలకు అన్నవస్త్రాలు ఇవ్వడంలో వారి పట్ల మంచిగా మసలుకోండి. ఇది మీమీద స్త్రీలకున్న హక్కు" అని తాకీదు చేశారు. (తిర్మిజి)

దైవప్రవక్త (స) ప్రవచనం: "తన భార్యాపిల్లల విషయంలో మంచివాడే మీలో మంచివాడు. నేను కూడా నా భార్యాపిల్లల విషయంలో మంచివాణ్ని." (తిర్మిజి)

దైవప్రవక్త (స) హితోక్తి: "విశ్వాసులలో అందరికన్నా ఎక్కువ గుణవంతుడే పరిపూర్ణ విశ్వాసి. అలాగే మీభార్యల పట్ల మంచివాడే మీలో అందరికన్నా శ్రేష్ఠుడు." (తిర్మిజి)



భార్యావిధేయులయిన భర్తలను గురించి దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "భార్యలకు విధేయులయ్యే భర్తలు నాశనమవుతారు." (ముస్తదరక్ హాకమ్)

హజ్రత్ లఖీత్ (రజి) కథనం: నేను ఓరోజు దైవప్రవక్త (స) సన్నిధికెళ్ళి నా భార్య నోటిదురుసు గురించి ఆయనకు ఫిర్యాదు చేశాను. దైవప్రవక్త (స) నా ఫిర్యాదు విని "నీవు నీభార్య నోటిదురుసును భరించలేకపోతే ఆమెకు విడాకులివ్వు" అన్నారు.

దానికి నేను "దైవప్రవక్తా! నేను మొదట పిల్లల్ని గురించి ఆలోచిస్తున్నాను. తరువాత ఆమె నాతో ఓ సుదీర్ఘకాలం సంసారం చేసింది. అంచేత ఆమెకు విడాకులివ్వడానికి నాకు మనసొప్పడం లేదు" అని అన్నాను. అప్పుడు దైవప్రవక్త (స) ఇలా సలహా ఇచ్చారు: "అయితే ఆమెకు మంచితనంతో, నేర్పుగా హితబోధ చెయ్యి. ఆమె నైజంలో మంచితనం ఉంటే నీమాట విని నీవు చెప్పినట్లు నడుచుకుంటుంది. అయితే (ఒకటి గుర్తుంచుకో.) బానిసను కొట్టినట్లు ఆమెను కొట్టడం ధర్మసమ్మతం కాదు." (అబూదావూద్)

"వారిపట్ల మంచితనం కలిగివుంటూ సంసారం చేయండి. ఒకవేళ వారు మీకు (ఒక విషయంలో) నచ్చకపోతే, నచ్చని విషయంలోనే దేవుడు మీకు ఎంతో శ్రేయస్సు, మేలు పెట్టి ఉండవచ్చు." (ఖుర్‌ఆన్-4:19)

హజ్రత్ అబూహురైరా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (స) ఇలా అన్నారు: "ఏ విశ్వాసీ విశ్వాసురాలిని (భార్యను) అసహ్యించుకోరాదు. అతనికి ఆమెలో ఒక గుణం నచ్చకపోయినా అతనికి నచ్చిన మరోగుణం ఆమెలో ఉండవచ్చు." (ముస్లిం)

దంపతుల మధ్య పరస్పర అవగాహన, ప్రేమానురాగాలు ఉన్నప్పుడే ఆ కలియకలో నిజమైన ఆనందం, సంతృప్తి కలుగుతాయి.

హజ్రత్ అబ్దుల్లా బిన్ జమ్‌ఆ కథనం దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "మీలో కొందరు తమ భార్యల్ని బానిసల్ని బాదినట్లు బాదుతున్నారు. కాని అదేరోజు రాత్రి మళ్ళీ ఆమె ప్రక్కన పడుకుంటారు. (ఇది అమానుషమైన చర్య)." (బుఖారీ, ముస్లిం)

"వారు నిన్ను రుతుస్రావం గురించి ఆజ్ఞ ఏమిటని అడుగుతున్నారు. వారికిలా చెప్పు: "అది అపరిశుద్ధావస్థ. ఆ స్థితిలో మీరు స్త్రీల(పడకల)కు దూరంగా ఉండండి. వారు పరి శుద్ధులు కానంతవరకు వారిదగ్గరకు వెళ్ళకండి. వారు పరిశుద్ధులైన తర్వాత దేవుడు మిమ్మల్ని ఆదేశించిన రీతిలో వారి దగ్గరకు యథాప్రకారం వెళ్ళవచ్చు. దేవుడు తన వైపు మరలేవారిని, పవిత్రంగా పరిశుభ్రంగా ఉండేవారిని మాత్రమే ప్రేమిస్తాడు." (ఖుర్‌ఆన్-2:223)

దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "మీరు స్త్రీల పట్ల మృదువుగా వ్యవహరించండి. స్త్రీలు ప్రక్కటెముకలతో సృజించబడ్డారు. ప్రక్కటెముకలలో కూడా అన్నిటికంటే ఎక్కువ వంకరగా ఉండే పైఎముకతో సృజించబడ్డారు. మీరు దాన్ని సరిచేయడానికి ప్రయత్నిస్తే విరిగిపోతుంది. ఒకవేళ దాని మానాన వదిలేస్తే అది అలా వంకరగానే ఉంటుంది. కనుక మీరు స్త్రీలతో మంచిగా (మృదువుగా) మసలుకోండి." (బుఖారి, ముస్లిం)

దైవప్రవక్త (స) హితోక్తి: "స్త్రీ ప్రక్క టెముకతో సృజించబడింది. అది ఏ విధంగానూ తిన్నగా కాదు. కనుక నీవు ఆమె నుండి ప్రయోజనం పొందాలనుకుంటే వంకరగా

ఉన్నప్పుడు కూడా ప్రయోజనం పొందగలవు. నీవామెను తిన్నగా చేయటానికి ప్రయత్నిస్తే ఆమెను విరగ్గొడతావు. ఆమెను విరవటం అంటే ఆమెకు విడాకులివ్వటమే.'' (ముస్లిం)

"మీ మాటలకు ఎదురు చెప్పి తిరగబడతారని భయమున్న స్త్రీలకు (నయాన భయాన) నచ్చజెప్పండి. (అలా దారికి రాకపోతే) వారిని మీ పడకల నుండి వేరుచేయండి. (అప్పటికీ మీ మాట వినకపోతే) కొట్టండి. ఆ తరువాత వారు మీకు విధేయులయిపోతే ఇక వారిని అనవసరంగా వేధించడానికి సాకులు వెతకకండి." (ఖుర్ఆన్-4:34)

కొందరు స్త్రీలు చేయిచేసుకోనిదే దారికిరారు. అలాంటప్పుడు భార్య ముఖమ్మీద కొట్టరాదని, శరీరం కందిపోయే వస్తువులతో కొట్టరాదని, నిర్దయగా కొట్టరాదని దైవప్రవక్త (స) అన్నారు. ఏమైనా ఆయన భార్యల్ని కొట్టేవారిని అభిమానించేవారు కాదు. మనిషి తన భార్యలో ఏదో నచ్చలేదని తొందరపడి వివాహబంధాన్ని తెంచుకోకూడదు. అనివార్య పరిస్థితులు ఏర్పడి నప్పుడే విడాకులిచ్చే అనుమతిని వినియోగించుకోవాలి. దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు:

"ధర్మ సమ్మతమైన పనులలో దేవునికి అన్నిటికంటే తలాఖ్ (విడాకులు) ఎంతో అప్రియమైన పని.'' (హదీస్)

"రకరకాల పూవుల మాధుర్యాన్ని ఆస్వాదిస్తూ తిరిగే తుమ్మెదల్లాంటి స్త్రీ పురుషుల్ని దేవుడు అభిమానించడు. కనుక మీరు వివాహం చేసుకోండి, విడాకులివ్వకండి."(హదీస్)

"విశ్వాసులారా! మీరు మిమ్మల్ని, మీ భార్యాపిల్లల్ని నరకాగ్ని నుండి రక్షించుకోండి. ఆ నరకాగ్నికి మానవులు, రాళ్ళు సమిధలవుతారు." (ఖుర్ఆన్-66:6)

ఒక వ్యక్తిపై తన భార్యాపిల్లల సంరక్షణబాధ్యత ఎలా ఉందో, వారిని సన్మార్గగాములుగా తీర్చిదిద్దవలసిన బాధ్యత కూడా ఉంది. స్త్రీకి కూడా తన పిల్లలను సన్మార్గగాములుగా తీర్చి దిద్దవలసిన బాధ్యత ఉంది. దైవప్రవక్త (స) ఇలా అన్నారు:

"మీలో ప్రతివ్యక్తీ బాధ్యతాయుతుడైన సంరక్షకుడే. కనుక అతని సంరక్షణలో ఉండేవారిని గురించి (పరలోకంలో) ప్రశ్నించబడతాడు. పాలకుడు పాలితప్రజల సంరక్ష కుడు. అతను తనప్రజల విషయంలో బాధ్యుడవుతాడు. పురుషుడు తన భార్యాపిల్లలకు సంరక్షకుడు. అతను వారివిషయంలో బాధ్యుడవుతాడు. స్త్రీ తన భర్త ఇంటికి, అతని పిల్లలకు సంరక్షకురాలు. ఆమె వారి విషయంలో బాధ్యురాలవుతుంది." (బుఖారి)

దైవప్రవక్త (స) ప్రవచనం: "మీరు చెడ్డ స్త్రీలతో సంబంధాలు పెట్టుకోకుండా జాగ్రత్త వహించండి, మీ స్త్రీలు పరపురుషులతో సంబంధాలు పెట్టుకోకుండా ఉంటారు. మీరు మీ తల్లిదండ్రుల పట్ల సత్ప్రవర్తన కలిగివుండండి, మీ సంతానం మీ పట్ల సత్ప్ర వర్తన కలిగి ఉంటుంది....'' (హాకిమ్)

# 62. భార్య బాధ్యతలు

"దేవుడు స్త్రీలపై పురుషులకు కొంత ఆధిక్యత ప్రసాదించడం వల్ల, పురుషులు తమ సంపదను స్త్రీల కోసం ఖర్చుపెడ్తున్నందు వల్ల పురుషులు స్త్రీలపై వ్యవహారకర్తలు అవుతారు. కనుక సుగుణవతులైన స్త్రీలు తమ భర్తలకు విధేయత చూపుతూ వారి కనుసన్నలలో నడచుకుంటారు." (ఖుర్ఆన్-4:34)



స్త్రీపై పురుషునికి ఆధిక్యత నివ్వడానికి రెండు కారణాలున్నాయి. ఒకటి, శారీరకంగా, మానసికంగా స్త్రీ కన్నా పురుషుడు ఎక్కువ శక్తిమంతుడు, సమర్థుడు. రెండు, ఈ కారణంగా భార్యాపిల్లల పోషణబాధ్యత పురుషుని మీదే మోపబడింది. స్త్రీలోని సుకుమారత్వం, కోమలత్వం, మార్దవం, లజ్జ, బిడియంల రక్షణ దృష్ట్యా ఆమె ఇంటిపట్టున ఉండటమే మంచిది. సమాజ శ్రేయస్సు కూడా అందులోనే ఉంది. స్త్రీ బయట పురుషులతో కలసి పనిచేయడం వల్ల అనేక సామాజిక రుగ్మతలు వ్యాపించే ప్రమాదం ఉంటుంది.

ఈ కారణంగానే "ఏజాతి తన వ్యవహారాల నిర్వహణ బాధ్యతను స్త్రీకి అప్పగిస్తుందో ఆ జాతి ఎన్నటికీ బాగుపడదు'' అన్నారు దైవప్రవక్త (స)- (బుఖారి)

ఇతర విషయాలను గురించి దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు:

"స్త్రీ తన భర్త ఇంట్లో అతని అనుమతి లేకుండా ఏ వస్తువు కూడా దానం చేయ కూడదు. ఒకవేళ ఆమె అలా అనుమతి లేకుండా దానం చేస్తే పుణ్యఫలం భర్తకు పోతుంది, ఆమెకు పాపం మిగులుతుంది.'' (బుఖారి)

"భర్త అనుమతి లేనిదే భార్య అతని ఇంటి నుండి బయలుదేరకూడదు." (అంటే భర్త వద్దన్నా అతని ఆజ్ఞను ధిక్కరించి బయటికి పోకూడదని అర్థం.)- (మిష్కాత్)

"భర్త ఇంట్లో ఉన్నప్పుడు అతని అనుమతి లేకుండా రమజాన్ ఉపవాసాలు తప్ప ఆమె ఇతర ఐచ్ఛిక (నఫిల్) ఉపవాసాలు పాటించకూడదు.'' (ముస్లిం)

దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "ఒక స్త్రీ దగ్గర (హజ్‌యాత్ర చేయగలిగినంత) ధనం ఉన్నప్పటికీ ఆమె భర్త హజ్‌యాత్ర జరిపే అనుమతి ఇవ్వకపోతే, అతని అనుమతి లేకుండా ఆమె హజ్ యాత్ర జరపలేదు.'' (దారుల్ ఖుత్నీ)

హజ్రత్ అబూసయీద్ (రజి) కథనం: ఓరోజు మేము దైవప్రవక్త (స) దగ్గర కూర్చొని ఉంటే ఒక స్త్రీ వచ్చి తన బాధామయ గాధను ఇలా ఏకరువు పెట్టింది- "దైవప్రవక్తా! నా భర్త సుఫ్వాన్ బిన్ ముఅత్తల్ నమాజు చేస్తున్నందుకు నన్ను కొడ్తున్నారు. ఆయనేమో పొద్దెక్కిన తరువాత లేచి నమాజు చేస్తారు. నేనెప్పుడైనా ఉపవాసం పాటిస్తే ఉపవాసం పాటించవద్దని వారిస్తున్నారు.''

ఈ ఆరోపణలు చేస్తున్నప్పుడు ఆమె భర్త సుఫ్వాన్ అక్కడే కూర్చొని ఉన్నారు. దైవ ప్రవక్త (సల్లం) విషయం ఏమిటని అడిగితే హజ్రత్ సుఫ్వాన్ "ఈమె నమాజులో సుదీర్ఘ మైన రెండు సూరాలు పఠిస్తుంది. అంత పెద్ద సూరాలు పఠించవద్దని మాత్రమే నేను చెప్పాను'' అని అన్నారు. దైవప్రవక్త (సల్లం) ఈ మాట విని "నువ్వు ఒక్క సూరా పఠించినా సరిపోతుంది'' అని చెప్పారు ఆ స్త్రీకి.

ఆ తరువాత సుఫ్వాన్ (రజి) మాట్లాడుతూ "దైవప్రవక్తా! నేనీమె ఉపవాసాలను నిరోధిస్తున్నానని ఆరోపిస్తోంది. కాని ఈవిడ ఐచ్ఛిక ఉపవాసాలు పాటించడం మొదలెడితే వాటినిక విరమించకుండా రోజులతరబడి పాటిస్తూనేవుంటుంది. కాని, నేనేమో యువకుడ్ని, నిగ్రహించుకోలేకపోతున్నాను'' అనిఅన్నారు. దైవప్రవక్త (స) ఈ సంగతి విని "భర్త అనుమతి లేకుండా ఏ స్త్రీ కూడా ఐచ్ఛిక ఉపవాసాలు పాటించకూడదు'' అని ఆదేశించారు.

హజ్రత్ సుఫ్యాన్ (రజి) మూడో ఆరోపణకు సంజాయిషీ ఇస్తూ "దైవప్రవక్తా! మేము కష్టజీవులం. పొద్దుపొడవనిదే నిద్రలేవని వంశస్థులుగా పేరుపడ్డాం" అని అన్నారు. అప్పుడు దైవప్రవక్త (స) "సరే సుఫ్యాన్! నిద్రనుంచి మేల్కోగానే నమాజ్ చేస్తుండు" అని ఉపదేశించారు. (అబూదావూద్)

దైవప్రవక్త (సల్లం) ఓసారి కొందరు స్త్రీలను సంబోధిస్తూ ఇలా ఉపదేశించారు: "మహిళల్లారా! మేలు చేసినవారికి మీరు ఎల్లప్పుడూ కృతజ్ఞులయి ఉండండి. మీలో ఎవరైనా ఒకరు తమ తల్లిదండ్రుల దగ్గర కాలం గడుపుతూ ఉంటారు. తరువాత దేవుడు ఆమెకు భర్తను అనుగ్రహిస్తాడు. ఆ తరువాత ఆమెకు సంతానభాగ్యం కూడా కలిగిస్తాడు. కాని ఎప్పుడయినా భర్తతో ఏదైనా చిన్నగొడవ వస్తే చాలు, 'నీ వల్ల నేనెప్పుడు సుఖపడ్డానని' అంటారు స్త్రీలు (లోగడ చేసిన మేళ్ళన్నీ మరచిపోయి)." (బుఖారి)

దైవప్రవక్త (స) ఇలా తెలిపారు: "రెండు రకాల మనుషులు ఉన్నారు. వారు చేసే నమాజులు వారి శిరస్సుల ఎత్తుకు మించి పైకి పోలేవు. ఒకటి, తన యజమానిని వదలి పారిపోయి తిరిగిరాని బానిస చేసే నమాజు. రెండు, తన భర్త ఆజ్ఞలను ధిక్కరించి ఇక ఎన్నటికీ దారికిరాని భార్య చేసే నమాజ్." (హదీసు)

సాష్టాంగ ప్రణామం దేవుని హక్కు మాత్రమే. మానవులు తమ తోటి మానవులతో సహా ఏ సృష్టితానికి కూడా సాష్టాంగ ప్రణామం చేయకూడదు. అలాంటి సాష్టాంగ ప్రణామం విషయంలో దైవప్రవక్త (సల్లం) మరో దృక్కోణంతో ఏం చెప్పారో చూడండి:

హజ్రత్ అబూహురైరా (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ఇలా చెప్పారు: "నేనెవరికైనా ఇతరులకు సజ్దా (పాదాభివందనం) చేయమని ఆజ్ఞాపించేనట్లయితే తన భర్త ముందు సజ్దా చేయమని స్త్రీకి ఆదేశించి ఉండేవాణ్ణి" అని అన్నారు. (తిర్మిజీ)

దైవప్రవక్త (స) మరో సందర్భంలో ఇలా ప్రవచించారు: "నా ప్రాణం ఎవరి అధీనంలో ఉందో ఆ శక్తిస్వరూపుని సాక్షిగా చెబుతున్నాను. ఏ స్త్రీ అయినా తన భర్త హక్కుల్ని నెరవేర్చనంత వరకు ఆమె తన ప్రభువు (దేవుని) హక్కుల్ని కూడా నెరవేర్చనట్టే." (హదీసు) వేరొక సందర్భంలో ఆయన ఇలా అన్నారు: "భర్త హక్కుల్ని నెరవేర్చనంత వరకు ఏ స్త్రీ కూడా విశ్వాసంలోని మాధుర్యం ఆస్వాదించలేదు." (మిష్కాత్)

దైవప్రవక్త (స) ఇలా ఉపదేశించారు: "మీపై మీస్త్రీల హక్కులున్నాయి. మీ స్త్రీలపై మీ హక్కులున్నాయి. మీపై మీస్త్రీలకున్న హక్కులు- మీరు వారిపట్ల మంచిగా ప్రవర్తించండి; అన్నవస్త్రాలు ఇవ్వడంలో కొరత రానివ్వకండి. మీ స్త్రీలపై మీకున్న హక్కులు- వారు మీ పడకలపై ఇతర పురుషులు ఎవరినీ పడుకో నీయకూడదు; మీ అనుమతి లేకుండా ఇతరులెవరినీ మీ ఇంట్లోకి రానీయకూడదు." (ఇబ్నెమాజ)

హజ్రత్ అబూహురైరా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (స) ఇలా అన్నారు: "స్త్రీ తన భర్త పడక వదలి అతని నుండి వేరయి రాత్రి గడిపితే, ఆమె అతని దగ్గరకు తిరిగి రానంతవరకూ దైవదూతలు ఆమెను శపిస్తూ ఉంటారు." (బుఖారి, ముస్లిం)

హజ్రత్ అబూఅలి తలఖ్ బిన్ అలి (రజి) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (స) ఇలా



ప్రవచించారు: "భర్త తన భార్యను పిలిచినప్పుడు ఆమె పొయ్యి దగ్గరున్నా సరే వెంటనే అతని దగ్గరికి వచ్చేయాలి." (తిర్మిజి, నసాయి)

హజ్రత్ ఉమ్మెసలమా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (స) ఇలా అన్నారు: "భర్త తన పట్ల ప్రసన్నుడిగా ఉన్న స్థితిలో మరణించే స్త్రీ స్వర్గానికి పోతుంది." (తిర్మిజీ)

హజ్రత్ ముఆజ్ బిన్ జబల్ (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "స్త్రీ తన భర్తకు బాధ కలిగించినప్పుడు (స్వర్గంలోని) అప్సరసల్లో అతనికి కాబోయే భార్య (ఇహలోకపు సవతిపై మండిపడుతూ) "ఆయన్ని బాధపెట్టకు. దేవుడు నిన్ను నాశనం చేస్తాడు. ఆయన నీదగ్గర (కొన్నాళ్ళు మాత్రమే) అతిథిగా ఉన్నారు అంతే; త్వరలోనే ఆయన నిన్ను విడిచిపెట్టి నా దగ్గరికి వచ్చేస్తారు" అని అంటుంది. (తిర్మిజీ)

హజ్రత్ ఆయిషా (రజి) కథనం: నేను "దైవప్రవక్తా! స్త్రీ మీద అందరికంటే ఎక్కువ హక్కు ఎవరికుంది?" అని అడిగాను. దానికాయన "ఆమె భర్తకు ఉంది" అని అన్నారు. మళ్ళీ నేను "పురుషుని మీద అందరికంటే ఎక్కువ హక్కు ఎవరికుంది?" అని ప్రశ్నించాను. ఆయన "అతని తల్లికి ఉంది" అని చెప్పారు. (ముస్తద్రక్ హాకిమ్)

దైవభీతి పరాయణురాలైన పతివ్రత పాటించవలసిన విధులేమిటో పై హితోక్తుల్లో వచ్చాయి. అంతేకాదు, కుటుంబవ్యవస్థ ఏకాంతాన్ని చక్కదిద్ది పటిష్ఠమైన పునాదులను ఏర్పరచే విషయాలపై సైతం శ్రద్ధ తీసుకొని జాగ్రత్తగా మసలుకోవలసి ఉంటుంది. అప్పుడే ఆమె ఇల్లు స్వర్గధామమయి సుఖసంతోషాలతో అలరారుతుంది.

"భర్త పట్ల కృతఘ్నురాలయి ఉండే స్త్రీ వైపు దేవుడు తీర్పుదినాన కన్నెత్తి కూడా చూడడ"ని దైవప్రవక్త (సల్లం) తెలిపారు.

కేవలం భర్త కోసమే మేకప్, అలంకరణలు చేసుకోవడం ఉత్తమ ఇల్లాలి లక్షణం. కేవలం భర్త కోసం, అతను ఇంట్లో ఉన్నప్పుడు లేక ఇంటికొచ్చే ముందు భార్య అలంకరణలు చేసుకోవడం భర్త హక్కని ఇస్లాం చెబుతోంది.

దైవప్రవక్త (స) తన సహచరులకు ఇలా బోధించారు: "మీరు (ప్రయాణం నుంచి) తిరిగొస్తే, వచ్చేముందు మీరాక గురించి కబురు పంపండి. దాని వల్ల మీ భార్యలు అలంకరించుకొని మీ కోసం ఎదురుచూడటానికి సిద్ధంగా ఉంటారు."

నాలుగు వస్తువులు లభించినవారికి ఇహపరలోకాల మేళ్ళు లభించినట్లేనని దైవప్రవక్త (స) తెలిపారు. ఆ నాలుగు ఇవి: 1-కృతజ్ఞతతో ఉండే హృదయం, 2-ఎల్లవేళలా దైవాన్ని స్మరించే నోరు, 3-కష్టాలను సహించే శరీరం, 4-దైవభీతితో తన మానమర్యాదలు, భర్త ధనసంపత్తి విషయంలో అతని అవిధేయతకు దూరంగాఉండే ఇల్లాలు.

శీలవతులైన భార్యల్ని గురించి దైవప్రవక్త (స) బోధించిన హితోక్తులు చూడండి:

"స్త్రీ (రోజా) అయిదు వేళలా నమాజ్ చేస్తూ, రమజాన్నెల ఉపవాసాలు పాటిస్తూ, తన శీలాన్ని కాపాడుకుంటూ భర్తపట్ల వినయంతో మసలుకుంటూ ఉంటే ఆమె పరలోకాన స్వర్గద్వారాల్లో తనకు నచ్చిన ద్వారం గుండా ప్రవేశించవచ్చు." (మిష్కాత్)

దైవప్రవక్త (సల్లం)ను ఒకతను ఉత్తమ మహిళ ఎవరని అడిగితే ఆయన ఇలా సమాధానమిచ్చారు: "ఏ స్త్రీ అయితే భర్త తనవైపు చూసినప్పుడు అతడ్ని సంతోష పెడ్తుందో, అతను ఏదైనా చెయ్యమన్నప్పుడు ఎదురుచెప్పకుండా అతనికి విధేయత చూపుతుందో, ఎవరు తన విషయంలో, తన సొత్తు విషయంలో భర్త మనస్సు నొప్పించే వైఖరి అవలంబించకుండా ఉంటుందో ఆమే ఉత్తమ మహిళ." (నసాయి)

అయితే పతిసేవంటే భర్త చేసే అక్రమ పనుల్లో కూడా అతనికి తోడ్పడుతూ, అతనిచ్చే ధర్మవ్యతిరేక ఆజ్ఞలకు సైతం తలూపుతూ కట్టుబానిసలా పడి ఉండమని ఎంత మాత్రం అర్థంకాదు. ధర్మబద్ధ విషయాల్లో మాత్రమే భర్తతో సహకరిస్తూ, అనుక్షణం అతని మంచిచెడ్డలు విచారిస్తూ మసలుకోవాలి. అంతేగాని ధర్మవ్యతిరేక పనులు చేయమని ఆదేశించడం జరిగితే అలాంటి ఆజ్ఞల్ని ఏమాత్రం పాటించకూడదు.

ఏస్త్రీ అయినా భర్త తనను వేధిస్తున్నాడని లేదా సరిగా ఆదరించడంలేదని భావించి నప్పుడు భార్యాభర్తలు పరస్పరం సంప్రదించుకొని సర్దుకుపోతే తప్పులేదు. అసలు వారు సర్దుకుపోవడమే సర్వదా శ్రేయస్కరం. హృదయాలు సంకుచితత్వం వైపు ఎక్కువగా మొగ్గు తాయి. అయితే మీరు పరస్పరం శ్రేయోభిలాషతో, దైవభీతిపరాయణతో వ్యవహరిస్తూ ఉండండి. మీరు చేసే పనులన్నిటినీ దేవుడు గమనిస్తూనే ఉన్నాడు. (ఖుర్ఆన్-4:128)

# 63. పరదా వ్యవస్థ

పరదాలో రెండు అంశాలు ఉన్నాయి. మొదటి అంశం కనీస శరీరభాగాలను కప్పవలసిన ఆచ్ఛాదన. దీన్ని సతర్ అంటారు. రెండవ అంశం ముంజేతులు, పాదాలు తప్ప మొత్తం శరీరాన్ని కప్పే బురఖాలాంటి ఆచ్ఛాదన. ఇందులో ముఖం కన్పించకుండా ధరించే మేలి ముసుగు కూడా ఉంటుంది. ముందుగా మనం సతర్ గురించి తెలుసుకుందాం.

"సతర్" ఆజ్ఞలను పాటిస్తూ స్త్రీలు వివాహమాడటానికి ధర్మసమ్మతంకాని పురుషుల ముందు ఇంట్లో స్వేచ్ఛగా మసలుకోవచ్చు. అయితే ఇంటి నుంచి బయటికి పోవలసివచ్చి నప్పుడు పరపురుషుల వీక్షణల నుంచి తప్పించుకోవడానికి ఆమె సతర్‌ఆజ్ఞలతో పాటు మరికొన్ని ఆజ్ఞలను కూడా పాటించవలసి ఉంటుంది. వాటినే పరదా నియమాలు అంటారు.

## పరదా పడతుల కంచుకోట

పూర్వం మూఢకాలంలో అరబ్ మహిళలు తల మీద వస్త్రం కట్టుకొని ఒక విధమైన ముడి వేసుకునేవారు. అది వారి జడలపై వ్రేలాడుతుంటుంది. గొను పైభాగాన ఆచ్ఛాదన ఉండేదికాదు. దానివల్ల గొంతు, ఛాతీ పైభాగం స్పష్టంగా కన్పిస్తుండేది. వక్ష స్థలాలాపై గొను తప్ప మరెలాంటి వస్త్రం ఉండేదికాదు. తరువాత దైవప్రవక్త (సల్లం) ద్వారా పరదా ఆజ్ఞలు అవతరించాయి. వాటిలో "వారు తమ వక్షస్థలాలను తమ ఓణీలతో కప్పుకోవాలి" (24:31) అనే ఆజ్ఞ రాగానే ముస్లిం మహిళలు దాన్ని శిరసావహించారు.

హజ్రత్ ఆయిషా (రజి) కథనం: దైవప్రవక్త (స) 'నూర్' సూరా అవతరించినప్పుడు దాన్ని ప్రజలకు విన్పించగానే వారు తమ తమ ఇండ్లకు వెళ్ళిపోయి తమ భార్యలకు, కుమార్తెలకు, అక్కాచెల్లెళ్ళకు ఆ సూక్తులు తెలియజేశారు. అన్సార్ స్త్రీలు ఈ సూక్తులు విన్న మరుక్షణమే లేచి వాటిని ఆచరణలో పెట్టే పనుల్లో నిమగ్నులయిపోయారు. కొందరు



తమ దుప్పట్లు తీసి, మరికొందరు తమ నడుంకట్టు తీసి ఓణీలుగా తయారుచేసుకున్నారు. మరుసటి రోజు ఉదయం వారందరూ తలల పైనుంచి వక్షస్థలాల క్రిందివరకూ ఓణీలు కప్పుకొని నమాజ్ కోసం మసీదుకు వచ్చారు. (తఫ్సీరె ఇబ్నెకసీర్, అబూదావూద్)

హజ్రత్ వహ్యా కల్బీ (రజి) కథనం: దైవప్రవక్త (స) దగ్గరకు ఈజిప్టులో తయారైన ఒక సన్నటి వస్త్రం వచ్చింది. అందులో నుంచి ఒక భాగం చించి నాకిచ్చారు ఆయన. అప్పుడు ఆయన "ఇందులో ఒక ముక్క చించి నీవు చొక్కా కుట్టించుకో. మిగిలినదాన్ని నీ భార్యకు ఇచ్చెయ్యి, దుప్పటి తయారు చేసుకుంటుంది. అయితే శరీర ఛాయలు లోపలి నుంచి కనపడకుండా ఆ దుప్పటి క్రింద మరో గుడ్డ వేసి తయారు చేసుకోవాలని ఆమెకు చెప్పాలి" అని అన్నారు. (అబూదావూద్)

"ప్రవక్తా! విశ్వసించిన పురుషులు తమ చూపులు (పరస్త్రీలపై పడకుండా వేరే వైపు) మరల్చుకోవాలని, తమ మర్మావయవాలు కాపాడుకోవాలని వారికి చెప్పు. వారికిది చాలా శ్రేష్ఠమైన పద్ధతి. వారు చేసే పనులన్నీ దేవుడు గమనిస్తూనే ఉంటాడు." (ఖుర్ఆన్-24:30)

దైవప్రవక్త (స) హజ్రత్ అలి (రజి)తో ఇలా అన్నారు: "అలీ! (యాదృచ్ఛికంగా) ఒకసారి (పరస్త్రీపై) దృష్టిపడిన తర్వాత, రెండవసారి దృష్టి సారించకు. మొదటిసారి చూపుకు క్షమాపణ ఉంది కాని, రెండవసారి చూపుకు లేదు." (అబూదావూద్)

హజ్రత్ జరీర్ బిన్ అబ్దుల్లా (రజి) పరస్త్రీలపై దృష్టి పడటం గురించి దైవప్రవక్త (సల్లం) ముందు ప్రస్తావిస్తూ "అకస్మాత్తుగా దృష్టి పడితే ఏం చెయ్యాలి?" అని అడిగారు. దానికి దైవప్రవక్త (స) "వెంటనే దృష్టి వేరే వైపుకు మరల్చుకో లేదా క్రిందికి దించుకో" అని సమాధానమిచ్చారు. (ముస్లిం, తిర్మిజి, అబూదావూద్)

"విశ్వసించిన స్త్రీలు తమ చూపులు (పరపురుషుల నుండి వేరే వైపు) మరల్చుకోవాలని, తమ మర్మావయవాలను కాపాడుకోవాలని కూడా వారికి చెప్పు. అదీగాక వారు తమ అలంకరణలను బయటికి కనబడనీయకూడదు. ఒకవేళ వాటంతటవే బయటపడితే ఎలాంటి తప్పులేదు. వారు తమ వక్షస్థలాలను ఓణీలతో కప్పుకోవాలి." (ఖుర్ఆన్-24:31)

"భర్తలు, తండ్రులు, భర్తల తండ్రులు, కన్నకొడుకులు, భర్తల కొడుకులు (అంటే సవతి కొడుకులు), అన్నదమ్ములు, అన్నదమ్ముల కొడుకులు, అక్కచెల్లెళ్ళ కొడుకులు, తమతో కలసిమెలసిఉండే సహచరస్త్రీలు, సొంతబానిసలు, తమ అధీనంలోని స్త్రీవాంఛ లేని పురుషులు, స్త్రీల ఆంతరంగిక విషయాలు తెలియని బాలురు- వీరి ఎదుట తప్ప ఇతరుల ముందు స్త్రీలు తమ అందచందాలు, అలంకరణలను బహిర్గతం చేయకూడదు. ఇంకా తాము దాచిన అలంకరణల సంగతి ప్రజలకు తెలిసేలా వారు తమ కాళ్ళను నేలకేసి కొడ్తూ నడవకూడదు. విశ్వాసులారా! మీరంతా కలసి దేవుడ్ని క్షమాపణ కోరుకోండి. అప్పుడే మీరు కృతార్థులయ్యే అవకాశముంటుంది." (ఖుర్ఆన్- 24:31)

హజ్రత్ ఉమ్మెఖలాద్ (రజి) కుమారుడొకతను ఒక యుద్ధంలో అమరగతడయ్యాడు. అప్పుడు హజ్రత్ ఉమ్మెఖలాద్ (రజి) తన కొడుకు పరిస్థితి విచారించడానికి (యుద్ధమైదా నంలోఉన్న) దైవప్రవక్త (స) సన్నిధికి వచ్చారు. ఆ సమయంలో కూడా ఆమె ముఖ

ముసుగుతో వచ్చారు. ప్రవక్త అనుచరులలో కొందరు ఆమెను చూసి "ఇలాంటి సమయంలో కూడా నీవు ముఖముసుగు ధరించి వచ్చావా! (కొడుకు వీరమరణం విషాదవార్త విన్న తరువాత తల్లికి స్పృహే ఉండదు. అలాంటిది నీవు తాపీగా బురఖా ధరించి వచ్చావా!!)" అని అన్నారు. హజ్రత్ ఉమ్మె ఖలాద్ (రజి) ఈమాటలు విని "నేను కొడుకుని పోగొట్టుకున్నాను గాని, సిగ్గుబిడియాలు పోగొట్టుకో లేదు" అన్నారు. (అబూదావూద్)

హజ్రత్ ఆయిషా (రజి) కథనం: "మేము వీడ్కోలు హజ్‌యాత్ర కోసం దీక్ష బూని మక్కా వెళ్తుంటే దారిలో బాటసారులు మా సమీపం నుండి పోయేవాళ్ళు. అప్పుడు మేము వెంటనే మా దుప్పెట్లు ముఖాల మీదికి లాక్కునేవాళ్ళం. వారు దూరం వెళ్ళిపోయాక మేము మా ముఖాల పైనుండి వస్త్రం తీసేసే వాళ్ళము." (అబూదావూద్)

హజ్జతుల్ విదా (వీడ్కోలు హజ్‌యాత్ర) సందర్భంలో దైవప్రవక్త (సల్లం) తమ పిన తండ్రి (యువ) కుమారుడు ఫజల్ బిన్ అబ్బాస్ (రజి)ని తన వెనుక ఒంటె మీద కూర్చోబెట్టుకొని 'మష్అరిల్ హరం' నుండి తిరిగొస్తున్నారు. దారిలో కొందరు స్త్రీలు ఎదురయి వెళ్ళిపోతుంటే ఫజల్ బిన్ అబ్బాస్ (రజి) వారి వైపే తదేకంగా చూడసాగారు. అప్పుడు దైవప్రవక్త (స) ఆయన ముఖం పట్టి వేరే వైపుకు తిప్పారు. (అబూదావూద్)

ఖషామ్ తెగకు చెందిన ఒక స్త్రీ దారిలో దైవప్రవక్త (స)ను ఆపి హజ్‌యాత్ర గురించి ఒక ప్రశ్న అడగడం ప్రారంభించింది. అప్పుడు ఫజల్ బిన్ అబ్బాస్ (రజి) ఆ స్త్రీని తదేకంగా చూడసాగారు. దైవప్రవక్త (స) అది గమనించి ఆ యువకుని ముఖం పట్టి వేరే వైపుకు తిప్పారు. (బుఖారి, అబూదావూద్, తిర్మిజి)

## దుష్ట వీక్షణలు షైతాన్ విషబాణాలు

దైవప్రవక్త (సల్లం) దేవుడు అన్న మాటలను ఇలా తెలిపారు: "షైతాన్ వదిలే విషబాణాలలో ఒకటి (మానవుని వాడి) చూపు. కనుక నాకు భయపడి అలాంటి చూపుల్ని మానుకునే మనిషికి నేను దృఢమైన విశ్వాసభాగ్యం ప్రసాదిస్తాను. దాని మాధుర్యం అతను తన మనసులో గ్రహిస్తాడు." (తబ్రాని)

దైవప్రవక్త (సల్లం) మరో సందర్భంలో ఇలా అన్నారు: "ఒక ముస్లిం దృష్టి ఏదైనా స్త్రీ అందచందాలపై పడినప్పుడు అతను వెంటనే తన దృష్టిని వేరే వైపుకు మరల్చుకుంటే దేవుడు అతనికి ఆరాధనలో అమిత మాధుర్యం ప్రసాదిస్తాడు." (ముస్నద్ అహ్మద్)

దైవప్రవక్త (స) ఈవిధంగా ప్రవచించారు: "మనిషి తన ఇంద్రియాలన్నిటితోనూ వ్యభిచరిస్తున్నాడు. చూడటం కళ్ళ వ్యభిచారం. ఆసక్తిగా మాట్లాడటం నోటి వ్యభిచారం. ధ్వని ద్వారా మాధుర్యం ఆస్వాదించడం చెవుల వ్యభిచారం. చేత్తోతాకడం, దురుద్దేశ్యంతో నడచివెళ్ళడం కాళ్ళుచేతుల వ్యభిచారం. వ్యభిచా రానికి సంబంధించిన ఈ ఉపోద్ఘాతాలన్నీ నెరవేరిన తరువాత మర్మాంగాలు ఆ పని పూర్తి చేస్తాయి లేదా పూర్తిచేయడానికి సిద్ధపడతాయి." (బుఖారి, ముస్లిం, అబూదావూద్)

పై సూక్తి (24:31)లోనే స్త్రీవాంఛలేని పురుషుల ముందు పరదా పాటించనవసరం లేదన్న భావం కూడా ఉంది. అయితే స్త్రీవాంఛలేని పురుషుల్లో కొందరు స్త్రీల అందచందాలను,



ఆంతరంగిక విషయాలను వేరే పురుషుల ముందు ప్రస్తావిస్తారు. అందువల్ల ఇలాంటి నపుంసకుల్ని స్త్రీలు తమ ఇండ్లలోనికి రానీయకూడదని దైవప్రవక్త (స) అన్నారు.

మదీనాలో ఇలాంటి ఖొజ్జా ఉండేవాడు. ప్రవక్తభార్యలతో సహా ఇతర స్త్రీలు కొందరు అతను స్త్రీవాంఛలేనివాడు గనక పరదా పాటించనవసరం లేదని భావించి అతడ్ని తమ ఇండ్లకు రానిస్తుండేవారు. ఓరోజు దైవప్రవక్త (స) తనఅర్ధాంగి ఉమ్మెసల్మా (రజి) ఇంటికి వెళ్ళారు. అప్పుడా ఖొజ్జా ఉమ్మెసల్మా (రజి) సోదరుడు అబ్దుల్లా బిన్ ఉమయ్యా (రజి)తో మాట్లాడుతూ "రేపు తాయెఫ్ పట్టణం మన స్వాధీనంలోకి వస్తే గైలాన్ సఖఫీ కూతురు మారియాను తప్పక చేపట్టాలి" అన్నాడు. అంతటితో ఆగకుండా అతనామె అందచందాలను, చివరికి ఆమె రహస్యావయవాలను గురించి కూడా వర్ణించడం మొదలెట్టాడు.

దైవప్రవక్త (స) ఈమాటలు విని "ఓరీ దైవవిరోధీ! నీ పాపిష్టి కళ్ళు ఆ స్త్రీపై అంతగా పడిపోయాయా!" అంటూ ఆగ్రహం వ్యక్తపరిచారు. తరువాత ఆయన హజ్రత్ ఉమ్మెసల్మా (రజి)తో "ఇతని ముందు పరదా పాటించు. ఇకముందు ఇతడ్ని మీ ఇండ్లలోకి రానీయకండి" అన్నారు. ఆ తర్వాత దైవప్రవక్త (స) ఆ ఖొజ్జాను మదీనా నుండి తీసేయించి వేరే చోటికి పంపివేశారు. ఈ ఉదంతంతో ఆయన ఇతర నపుంసకుల్ని కూడా స్త్రీలు తమ ఇండ్లలోనికి రానీయకూడదని తాకీదు చేశారు. దీన్నిబట్టి మనిషిలో లైంగికశక్తి లేకపోయినా అతనిలోని అణగారిన కోర్కెల వల్ల ప్రమాదం ఉంటుందని తెలుస్తోంది.

(బుఖారి, ముస్లిం, అబూదావూద్, నసాయి, అహ్మద్ వగైరా గ్రంథాలు)

అలాగే కొందరు సన్నిహిత బంధువులు తప్ప ఇతర పురుషులు అనుమతి లేకుండా స్త్రీలు ఉండే ఇండ్లలోకి ప్రవేశించకూడదు.

"ప్రవక్త భార్యల తండ్రులు, వారి కొడుకులు. అన్నదమ్ములు, అన్నదమ్ముల కొడుకులు, అక్కాచెల్లెళ్ళ కొడుకులు, వారితో కలసిమెలసి తిరిగే స్త్రీలు, వారి బానిసలు (పరదా నియమాలు పాటించకుండా) వారి ఇండ్లలోకి ప్రవేశిస్తే ఎలాంటి దోషం లేదు. (వనితల్లారా!) మీరు దేవునికి భయపడండి. దేవుడు ప్రతి దానికీ సాక్షిగా ఉన్నాడు." (ఖుర్ఆన్–33:54,55)

## భార్య సతర్ భర్తకే పరిమితం

పరదా విషయంలో మొట్టమొదటి ఆజ్ఞ 'సతర్'. ఇతరుల ముందు ప్రదర్శించకూడని కనీస దేహభాగాన్ని "సతర్" అంటారు. ఈ భాగంపై తప్పక ఆచ్ఛాదనం ఉండాలి. పురుషుడైతే కనీసం నాభినుంచి మోకాళ్ళ వరకుగల భాగం, స్త్రీఅయితే ముఖం, ముంజేతులు తప్ప మిగతా శరీర భాగమంతా ఆచ్ఛాదనం ఉండాలి.

దైవప్రవక్త (సల్లం) ప్రవచించిన ఒక హదీసులో ఇలా ఉంది: "స్త్రీ యుక్తవయసుకు చేరుకోగానే ఆమె ముఖం, మణికట్టు నుంచి ముంజేతుల వరకున్న భాగం తప్ప ఇతర ఏ దేహభాగం కూడా కన్పించకూడదు." (అబూదావూద్)

స్త్రీ తన 'సతర్'ని భర్త ఎదుట తప్ప మరెవరి ముందూ బహిరంగ పరచకూడదు. చివరికి తన తండ్రి, సోదరుడు, సోదరుని కొడుకు, సోదరి కొడుకు దగ్గర కూడా. అంతేకాదు, తోటిస్త్రీ ముందు కూడా 'సతర్' విభాగం బహిరంగ పరచడాన్ని ఇస్లాం అంగీకరించదు. ఏవిధంగా

ఒక పురుషుని సతర్ మరోపురుషుడు చూడటం ఎలా నిషిద్ధమో అలాగే ఒక స్త్రీ నాభి నుంచి మోకాళ్ళ వరకు గల శరీర భాగాన్ని తోటి స్త్రీ చూడటం కూడా నిషిద్ధమే. అది తప్ప మిగతా శరీర భాగాన్ని తోటి స్త్రీ చూడటం అంతగా నిషేధం లేదు. స్త్రీ మలమూత్రాల విసర్జన సందర్భంలో తప్ప ఇతర వేళల్లో ఒంటరిగా ఉన్నప్పుడు నగ్నంగా ఉండటం కూడా తప్పే.

భర్త, లైంగిక భావాలు జనించని బాలురు తప్ప (వివాహమాడటానికి ధర్మ సమ్మతమైన పురుషుల్లో) ఏ ఒక్క పురుషుడూ ఒంటరిగా ఉన్న స్త్రీ దగ్గర కూర్చోవటం లేదా ఆమె శరీరాన్ని తాకడాన్ని ఇస్లాం నిరసిస్తోంది. దైవప్రవక్త (స) ఈ విషయాన్ని గురించి ఇలా ప్రవచించారు:

"దేవుణ్ని, పరలోకాన్ని విశ్వసించిన మనిషి ఒంటరిగా ఉన్న (పర)స్త్రీ దగ్గరకు పోకూడదు. అలా పోయినప్పుడు (వారిద్దరితో పాటు) మూడోవాడు షైతాన్ అవుతాడు. కనుక ఆ స్త్రీకి తోడుగా ముహ్రిమ్ పురుషుడు లేనంతవరకు పరపురుషుడు ఆమె దగ్గరకు పోకూడదు." (అహ్మద్)

"ఏ స్త్రీ అయినా తన ముహ్రిమ్ పురుషుడెవరూ లేకుండా ఒంటరిగా ఉన్నప్పుడు పరపురుషులెవరూ ఆమె దగ్గరకు పోకూడదు. అలాగే ఏ స్త్రీ అయినా ముహ్రిమ్ పురుషుడు తోడు లేకుండా (ఒంటరిగా) ప్రయాణం చేయకూడదు." (బుఖారి, ముస్లిం)

"స్త్రీల దగ్గరికి వారి భర్తలు లేనప్పుడు వెళ్ళకండి. ఎందుకంటే మీలో ప్రతి ఒక్కరి అంతర్యంలో షైతాన్ రక్తంలా ప్రవహిస్తున్నాడు." (ముస్లిం)

ఒకసారి రాత్రివేళ దైవప్రవక్త (సల్లం) తనఅర్ధాంగి హజ్రత్ సఫియా (రజి)ను వెంట బెట్టుకొని ఆమె ఇంటికి వెళ్తున్నారు. దారిలో ఇద్దరు అన్సార్ పురుషులు ఎదురయ్యారు. దైవప్రవక్త (సల్లం) వారిని ఆపి "నావెంట ఉన్న ఈవిడ నా భార్య సఫియా" అని చెప్పారు. వారిద్దరు ఈమాట విని "దేవుడు పరిశుద్ధుడు! దైవప్రవక్తా! మీ విషయంలో కూడా ఎవరైనా అనుమానిస్తారా?" అని అన్నారు. అప్పుడు దైవప్రవక్త (స) "షైతాన్ మనిషి శరీరంలో రక్తంలా తిరుగుతుంటాడు. వాడు మీ హృదయాల్లో కూడా దురాలోచన రేకెత్తిస్తాడేమోనని నేను భయపడ్డాను" అని అన్నారు. (అబూదావూద్)

అయితే స్త్రీ శరీరాన్ని తాకే విషయంలో వివాహమాడటానికి ధర్మసమ్మతంకాని పురుషులు ధర్మసమ్మతమైన పురుషుల్లో తేడా ఉంది. ఉదాహరణకు- అన్న తన సోదరి చేయి పట్టుకొని వాహనం మీద ఎక్కించడం, దించడం చేయవచ్చు. కాని ఈ పని ఇతర పురుషులు చేయడానికి వీల్లేదు. దైవప్రవక్త (సల్లం) ఎప్పుడైనా ప్రయాణం నుంచి తిరిగిరాగానే కూతురు హజ్రత్ ఫాతిమా (రజి)ను కౌగలించుకొని ఆమె నుదుటిపై ముద్దు పెట్టుకునేవారు. దైవప్రవక్త (సల్లం) పురుషుల చేత ప్రమాణం చేయించవలసి వచ్చినప్పుడు వారి చేతులను తన చేతిలోకి తీసుకొని చేయించారు. కాని మహిళల చేత ప్రమాణం చేయించవలసి వచ్చినప్పుడు మాత్రం ఆయన ఏనాడూ వారి చేతులు పట్టుకోలేదు.

"దైవప్రవక్త (సల్లం) చేయి ఏనాడూ ఏ పరస్త్రీ శరీరాన్ని కూడా తాకలేదు. స్త్రీల చేత ప్రమాణం చేయించవలసివస్తే ఆయన వారి చేత నోటిమాటల ద్వారా మాత్రమే ప్రమాణం చేయించేవారు. వారలా ప్రమాణం చేసిన తరువాత 'ఇక వెళ్ళండి, మీచేత ప్రమాణం చేయించడం అయిపోయింది' అని చెప్పేవారు." (అబూదావూద్)



## మహిళలకు మేలుచేసే మేలి ముసుగు

పరదా విషయంలో రెండవ ఆజ్ఞను ఖుర్ఆన్ ఇలా పేర్కొంటున్నది: "ప్రవక్తా! నీ భార్యలకు, కుమార్తెలకు, (ఇతర) ముస్లిం మహిళలకు వారు తమ పైటలను తమ (ముఖాల)పై కప్పుకోవాలని చెప్పు. ఇదే సరైన పద్ధతి. దీనివల్ల వారిని ఎవరైనా గుర్తించి వేధిస్తారనే భయముండదు. దేవుడు క్షమాశీలి, దయామయుడు." (ఖుర్ఆన్-33:59)

అంటే ముస్లిం మహిళలు ఇంటి నుంచి ఎక్కడికైనా బయలుదేరవలసివస్తే వారు తల, ముఖంతో సహా మొత్తం దేహాన్ని వస్త్రంతో కప్పుకోవాలన్నమాట. కాకపోతే కళ్ళు కన్పించేలా ఏర్పాటు చేసుకోవచ్చు. ఇలాంటి వస్త్రధారణ వల్ల పోకిరీలతో సహా పరపురుషులంతా, వీరు గౌరవప్రదమైన కుటుంబాలకు చెందిన స్త్రీలని భావించి వారి వైపు దురుద్దేశంతో కన్నెత్తి చూడటానికి కూడా సాహసించలేరు.

ఈ సూక్తిలోని రెండవ విషయం పరదాహద్దుల్ని నిర్ణయించడం. స్త్రీలు ఏదైనా అవసరం రీత్యా ఎక్కడికయినా బయటికి వెళ్ళవలసి వచ్చినప్పుడు వారు తమ దుప్పటికి చెందిన ఒక భాగాన్ని ముఖం మీద కప్పుకోవాలి. మరో భాగాన్ని దేహానికి చుట్టుకోవాలి. ఒక్క కాబాయాత్ర దీక్ష(ఇహ్రామ్)లో ఉన్నప్పుడు మాత్రమే ముసుగు వేసుకోవడాన్ని దైవప్రవక్త (స) నిషేధించారు. అయితే పరపురుషులు ఎదురుపడినప్పుడు తిరిగి ముసుగు వేసుకోవాల్సిందే. అంటే ముఖ ముసుగుతో సహా పూర్తి పరదా పాటించాలి.

కొందరు ధర్మవేత్తలు ఈ సూక్తికి మరో విధంగా అర్థం తీసి స్త్రీకి ముఖముసుగు తప్పనిసరి కాదని, హదీసుల్లో కూడా ఆధారాలు లేవని అన్నారు. హదీసుల్లో ముఖముసుగు తప్పనిసరిగా ఉండాలన్న ఆజ్ఞ లేకపోవచ్చు. కాని పరపురుషులు అకస్మాత్తుగా ఎదురుపడినప్పుడు, లేదా దారిలో తారసపడినప్పుడు గౌరవప్రదమైన స్త్రీలు ముఖాన్ని కప్పుకునేవారని కొన్ని హదీసుల ద్వారా తెలుస్తోంది. ఉదాహరణకు ఈ క్రింది హదీసు చూడండి:

దైవప్రవక్త (స) సతీమణి హజ్రత్ ఆయిషా (రజి) ఇలా తెలియజేస్తున్నారు: "వాహనాలపై మనుషులు మా ముందు నుంచి పోతుండేవారు. మేము ఆడవాళ్ళం దైవప్రవక్త (సల్లం)తో పాటు హజ్‌దీక్ష (ఇహ్రాం)లో ఉన్నాం. అంచేత ఆ మనుషులు మాకు దగ్గరగా వచ్చినప్పుడల్లా మేము వెంటనే మా దుప్పట్లను (బురఖాలను) తల మీద నుంచి ముఖం మీదికి లాగి వేసుకునేవాళ్ళం. వారు వెళ్ళిపోగానే (ముసుగు తీసి) ముఖం బయట పెట్టుకునే వాళ్ళం." (అబూదావూద్)

ముఖముసుగు అసలు లక్ష్యం స్త్రీలు పురుషుల కామవీక్షణల నుండి కాపాడుకోవాలన్నదే. స్త్రీలో పురుషుణ్ని సహజంగా ఆకర్షించే మొట్టమొదటి శరీరభాగం ఆమె ముఖమే. మిగతా శరీరం ఎంత అందంగా ఉన్నప్పటికీ ముఖం వికృతంగా ఉంటే మాత్రం అలాంటి స్త్రీ పురుషుణ్ని ఆకట్టుకో లేదు. సినిమాలలో చూపే హాస్యదృశ్యాలలో అప్పుడప్పుడు ఈ దృశ్యం కూడా ఉంటుంది: ఓ స్త్రీ బజారున నడచిపోతుంటే ఒక పూలరంగడు ఆమె వెంట పడతాడు. ఆ స్త్రీ ఇది కనిపెట్టి కొద్ది దూరం పోయిన తరువాత వెనక్కి తిరిగి చూస్తుంది. అంతే, ఆ పూలరంగడు 'అయ్యబాబోయ్' అంటూ మడమ తిప్పి పరుగు లంకించుకుంటాడు. అందువల్ల మానసికంగా Face is index of the mind అని ప్రజలు ఎలా అంటారో శారీరకంగా Face is index of the body అంటాను నేను.

## పడకగదిలో నిషిద్ధ సమయాలు

ఒక ఇంట్లో ఉండే పిల్లలు, నౌకర్లు, వృద్ధ మహిళల విషయంలో కూడా ఖుర్‌ఆన్ కొన్ని ఆజ్ఞలు ఇచ్చింది. ముస్లింలు ఈ ఆజ్ఞల్ని కూడా పాటించవలసి ఉంటుంది.

"విశ్వాసులారా! మీ బానిసలు, ప్రాజ్ఞత వయస్సుకు చేరుకోని మీ బాలబాలికలు (పడకగదిలో) మీదగ్గరకు రావాలంటే వారు మూడు వేళల్లో మాత్రం మీ అనుమతి తీసుకోవలసి ఉంటుంది. అవి- ప్రాతఃకాల ప్రార్థనకు ముందు, మధ్యాహ్నం వేళ మీరు (విశ్రాంతి కోసం) మీ పైఉడుపులు తీసివేసినప్పుడు, రాత్రివేళ ప్రార్థన (ఇషానమాజ్) తరువాత."

"ఈ మూడువేళలు మీకోసం ఏకాంత సమయాలు. అవి గడచిపోయిన తరువాత వారు మీ అనుమతి లేకుండా వస్తే అందులో మీ తప్పులేదు, వారి తప్పులేదు. మీరు మాటిమాటికి ఒకరి దగ్గరకు మరొకరు రావలసిన అవసరముంటుంది. (అందువల్ల ఈ ఆజ్ఞ ఇవ్వబడింది.) ఈవిధంగా దేవుడు తన సూక్తులు విడమరచి తెలియజేస్తున్నాడు. ఆయన సర్వం ఎరిగినవాడు, మహా వివేకవంతుడు." (ఖుర్‌ఆన్-24:58)

"మీ పిల్లలు ప్రాజ్ఞత వయస్సుకు చేరుకున్న తరువాత వారు తమ పెద్దలలాగే (ఎప్పుడైనా సరే) అనుమతి తీసుకొని రావాలి. ఈవిధంగా దేవుడు తనసూక్తులు మీకు విశదీకరిస్తున్నాడు. ఆయన సర్వం ఎరిగినవాడు, మహా వివేకవంతుడు." (24:59)

"యౌవనదశ దాటిపోయి, పెళ్ళి ఆశలేని (వృద్ధ) మహిళలు తమ బురఖాలు తీసివేస్తే ఎలాంటి తప్పు లేదు. కాకపోతే వారు అలంకరణ ప్రదర్శనకు పాల్పడని వారయి ఉండాలి. ఆ చేష్టలు కూడా మానేసి లజ్జావతులుగా మసలుకుంటే అది వారికెంతో శ్రేయస్కరం. దేవుడు సమస్తం వింటున్నాడు, సర్వం తెలిసినవాడు." (ఖుర్‌ఆన్-24:60)

# 64. పరదా నుండి మినహాయింపులు

ఈ విషయంలో కొన్ని మినహాయింపులున్నాయి. పురుషుడు తాను పెళ్ళి చేసుకో దలచిన స్త్రీని ముందుగా చూసుకోవచ్చు.

హజ్రత్ ముగైరా (రజి) వివాహం చేసుకోవ డానికి నిర్ణయించుకున్నప్పుడు ఆయన్ని దైవప్రవక్త (సల్లం) "నీవు ఆ స్త్రీని చూశావా?" అనడిగారు. దానికాయన చూడలేదన్నారు. "అయితే ఆమెను (ఓసారి) చూసుకో. దీనివల్ల మీఇద్దరి మధ్య సానుకూలత ఏర్పడే అవకాశముంటుంది" అన్నారు దైవప్రవక్త (స). (తిర్మిజి, నసాయి, ఇబ్నెమాజ)

హజ్రత్ అబూహురైరా (రజి) ఉల్లేఖనం: "నేను దైవప్రవక్త (స) దగ్గర కూర్చొని ఉన్నప్పుడు ఒకతను వచ్చి 'దైవప్రవక్తా! నేను అన్సారుల్లో ఒక స్త్రీని వివాహమాడదలిచాను' అన్నాడు. దైవప్రవక్త (స) ఈమాట విని "మరి నువ్వామెను చూశావా?" అని అడిగారు. దానికతను చూడలేదన్నాడు. "అయితే ఓసారి ఆమెను చూసుకో. అన్సారుల కళ్ళలో సాధారణంగా ఏదో కొంచెం లోపం ఉంటుంది" అన్నారు దైవప్రవక్త (స) (ముస్లిం)

అలాగే ఒక ఇంటిలో నివసించే స్త్రీపురుషులు (బంధువులు) పరస్పరం చూసు కోవడంలోనూ తప్పులేదు. నేరపరిశోధన సమయంలో అనుమానాస్పద స్త్రీని చూడవచ్చు.



న్యాయస్థానంలో సాక్ష్యమిచ్చేటప్పుడు న్యాయమూర్తి, సాక్ష్యమిచ్చే స్త్రీని చూడవచ్చు. డాక్టర్ వ్యాధిగ్రస్త స్త్రీని చూడవచ్చు. ప్రమాదంలో ఉన్న స్త్రీని సంబంధిత బంధువులు, ఎవరూలేని అనివార్య పరిస్థితిలో ఇతర పురుషులు చూడటం, తాకడం మాత్రమేగాక ఆమెను వళ్ళోకి ఎత్తుకొని వాహనంలో ఎక్కించి ఆసుపత్రికి చేర్చవచ్చు కూడా. పోతే పాస్‌పోర్టులు, ఐడెంటిటీ (గుర్తింపు) కార్డులు వగైరా సందర్భాలలో సంబంధిత పురుషులు తత్సంబంధ స్త్రీలను చూడవచ్చు.

## సతర్ (కనీస ఆచ్ఛాదన) పరిమితులు

పురుషుడు పరస్త్రీని చూసే నిబంధనలకన్నా స్త్రీ పరపురుషుని చూసే నిబంధనలు కాస్త మృదువుగా ఉంటాయి. శరీరంలో బట్ట కప్పవలసిన కనీస ఆచ్ఛాదనాభాగాన్ని "సతర్" అంటారు. నాభి నుండి మోకాళ్ళ క్రింది వరకుగల భాగం పురుషుని సతర్‌గా నిర్ణయించబడింది. ఆ భాగాన్ని అతను తన భార్య ముందు తప్ప మరెవరి ముందూ బహిర్గతం చేయకూడదు.

పోతే స్త్రీ కోసం ఆమె ముఖం, ముంజేతులు, పాదాలు తప్ప ఇతర శరీరభాగమంతా సతర్‌గా నిర్ణయమయింది. ఆమె ఆ శరీరభాగాన్ని తనభర్త ముందు తప్ప ఇతర పురుషుల ముందు బహిర్గతం చేయకూడదు. కాకపోతే ఇంట్లో తండ్రి, బాబాయి, అన్నదమ్ములు తదితర బంధువుల ముందు, ఆమె ఇంటిపనులు చేస్తున్నప్పుడు అవసరమైతే ముంగాళ్ళ మీదుండే దుస్తులు పైకెత్తి కట్టుకోవచ్చు.

ఈ వివరణను బట్టి ఇస్లాం ఉద్దేశ్యం స్త్రీ పురుషులు ఒకరికొకరు చూసుకోవడాన్ని నిషేధించడమే గాక, అది అశ్లీలతను పూర్తిగా అరికట్టదలచిందని స్పష్టంగా తెలుస్తోంది. ఈ ఆజ్ఞ పురుషులకే కాదు, స్త్రీలకు కూడా వర్తిస్తుంది.

హజ్రత్ ఉమ్మెసల్మా (రజి) ఇలా తెలియజేస్తున్నారు: "నేను, మైమూనా దైవప్రవక్త (స) దగ్గర కూర్చొని ఉన్నాం. అంతలో ఇబ్నె ఉమ్మెమఖ్తూమ్ (రజి) వచ్చారు. ఆయన అంధులు. దైవప్రవక్త (స) మమ్మల్ని ఆయన ఎదుట పరదా పాటించమని అన్నారు. అప్పుడు నేను "దైవప్రవక్తా! ఆయన అంధులు కదా! మమ్మల్ని చూడలేరు, గుర్తించ లేరుగా?" అని అడిగాను. దానికి దైవప్రవక్త (సల్లం) మీరిద్దరు కూడా అంధులేనా? ఆయన్ని మీరు చూడటం లేదా?" అని ఎదురు ప్రశ్నవేశారు." (హదీసు)

అయితే స్త్రీ పురుషుని చూడటంలో, పురుషుడు స్త్రీని చూడటంలో మానసిక పరమైన ఓ సూక్ష్మభేదం ఉంది. పురుషుని స్వభావంలో పురోగమనం ఉంది. కాని స్త్రీ స్వభావంలో పారుబోతుతనం ఉంది. స్త్రీలో ఉన్న ఈ సహజ గుణం పూర్తిగా నిర్వీర్యం కానంతవరకు ఆమె తాను కోరిన వస్తువును హస్తగతం చేసుకునేంతటి ధైర్యం చేయజాలదు. ఈ భేదాన్ని దృష్టిలో పెట్టుకొని దైవప్రవక్త (స) పురుషుల విషయంలో చూపినంతటి కాఠిన్యం స్త్రీల విషయంలో చూపలేదు. హజ్రత్ ఆయిషా (రజి) ఉల్లేఖించిన ఒక హదీసులో ఒక పండుగ సందర్భంగా దైవప్రవక్త (స) ఆమెకు నీగ్రోల వేడుక చూపించారు అని ఉంది.

అంధ అనుచరుడయిన హజ్రత్ ఇబ్నె ఉమ్మెమఖ్తూమ్ (రజి) విషయంలోనే మరో సందర్భాన దైవప్రవక్త (సల్లం) ఆయన ఇంట్లో హజ్రత్ ఫాతిమా బిన్త్ ఖైస్ (రజి)ను (విడాకుల తరువాత పాటించే) రుతుగడువు గడపమని ఆదేశించారు. అసలామె మొదట తన రుతుగడువును హజ్రత్ ఉమ్మెషరీక్ (రజి) ఇంట్లో గడపదలచుకున్నారు.

కాని దైవప్రవక్త (సల్లం) ఆ ఇంట్లో గడపడం గురించి ఫాతిమా (రజి)ను వారిస్తూ "ఆ ఇంటికి తరచుగా జనం (ఉమ్మెషరీక్ బంధువులు) వస్తూపోతుంటారు. అంచేత నీవు ఇబ్నె ఉమ్మెమఖ్తూమ్ (రజి) ఇంట్లో ఉండు. ఆయన అంధుడు. ఆయన ఎదుట నీవు పరదా లేకుండా మసలుకోవచ్చు" అని చెప్పారు. (మిష్కాత్)

ఇస్లాం లైంగిక ప్రమాదం పొంచివుందని భావించిన చోట స్త్రీలు ఉండటాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తుంది. షరీఅత్‌పరమైన కారణం లేకుండా స్త్రీలు తమకు సంబంధంలేని పురుషులతో కలసి ఒకచోట కూర్చోవడాన్ని, చూడటాన్ని, వాళ్ళతో మాట్లాడటాన్ని ఇస్లాం నిరోధిస్తుంది.

## దగ్గరి బంధువుల ముందు పరదా పరిమితులు

ఒకే ఇంట్లో ఉండే బంధువులు, ఇతర సన్నిహిత బంధువుల ముందు స్త్రీలు పాటించ వలసిన పరదా నియమాలు కూడా ఎంతో గమనార్హమయినవి. ఈ క్రింది హదీసు గమనిస్తే ఇస్లాం 'ఉమ్మడి కుటుంబం'ను ప్రోత్సహించదని స్పష్టంగా తెలుస్తుంది.

దైవప్రవక్త (సల్లం) ఒకసారి అనుచరులతో మాట్లాడుతూ "మీరు ముహ్‌రిమ్ స్త్రీల (పరస్త్రీల) దగ్గరకు వెళ్ళకుండా మిమ్మల్ని మీరు కాపాడుకోండి" అని అన్నారు. ప్రవక్త అనుచరుల్లో ఒకాయన ఈమాట విని "దైవప్రవక్తా! భర్త సోదరుడు తమ వదిన దగ్గరకు నిరాఘాటంగా రావచ్చా?" అని అడిగారు. దానికి దైవప్రవక్త (సల్లం) "స్త్రీ విషయంలో అతను మృత్యువులాంటి వాడు" అని సమాధానమిచ్చారు. (బుఖారి, ముస్లిం)

దైవప్రవక్త (స) మరో సందర్భంలో ఇలా ప్రవచించారు: "స్త్రీలు తమ భర్తల తరపు బంధువుల ముందు పరదా నియమాలు కఠినంగా పాటించాలి. వారి పట్ల మృత్యువుని గురించి భయపడేటంతటగా భయపడాలి." (తిర్మిజి)

ప్రవక్త సతీమణి హజ్రత్ ఆయిషా (రజి) ఉల్లేఖనం: ఆమె సోదరి హజ్రత్ అస్మా (రజి) ఒకసారి పల్చటి బట్టలు ధరించి దైవప్రవక్త (సల్లం) ఎదుటికి వచ్చారు. దైవప్రవక్త (సల్లం) ఆమెను చూసిన వెంటనే ముఖం తిప్పుకుంటూ "అస్మా! స్త్రీ పుష్పవతి అయిన తరువాత ఆమె తన ముఖం, చేతులు తప్ప శరీరంలోని మరే భాగం కూడా కన్పించేలా ఉండటం ధర్మసమ్మతం కాదు" అని చెప్పారు. (అబూదావూద్)

పై హదీసుల్ని బట్టి స్త్రీలు తమ ముఖం, చేతులు తప్ప ఇతర శరీర భాగాలు కన్పించే వస్త్రధారణతో తండ్రి, సోదరుడు వగైరా అతి సన్నిహిత బంధువుల ముందుకు కూడా రాకూడదని తెలుస్తోంది. దైవప్రవక్త (స) మరదలు (భార్య సోదరి) హజ్రత్ అస్మా (రజి) దైవప్రవక్త (స) జీవించి ఉన్నంతకాలం ముఖం, చేతులపై ఎలాంటి ఆచ్ఛాదన లేకుండా ఆయన ఎదుటికి వస్తుండేవారు. అలాగే దైవప్రవక్త (స) పెదనాన్న కుమార్తె ఉమ్మెహానీ (రజి) కూడా ముఖం, చేతులపై ఆచ్ఛాదన లేకుండా దైవప్రవక్త (స) ఎదుటికి నిరాఘాటంగా వస్తుండేవారు.

# 65. వస్త్రధారణ, అలంకరణలు

స్త్రీల అలంకరణ విషయంలో ఇస్లాం కొన్ని ఆదేశాలు బోధించింది. ఆమె అలంకరణతో భర్త, తండ్రి, కొడుకు, సవతి కొడుకు, సోదరుడు, అన్నదమ్ముల కొడుకులు, అక్కాచెల్లెళ్ళ కొడుకులు, తన సేవకులు, తనకు విధేయులయివున్న నపుంసకులు, కామదృష్టితో చూడని



సత్పురుషులు, యుక్తవయసుకురాని బాలురు తప్ప ఇతర పురుషుల ఎదుటకు రాకూడదు. ఈ ఆజ్ఞలన్నీ యుక్త వయస్కులయిన మహిళల కోసం మాత్రమే. రుతుస్రావం ఆగిపోయి, లైంగికాసక్తి నశించిన వృద్ధ మహిళలు ఇంట్లో ఉన్నప్పుడు ఓణి తీసేసి తిరిగినా పరవాలేదు. అయితే బయటికి వెళ్తే మాత్రం వారికి కూడా సతర్ ఆచ్ఛాదన ఉండాలి.

'సతర్' శరీరం కప్పుకోవడానికి ధరించే ఉడుపులు లోపలి దేహం కన్పించేటంత పల్చగా ఉండకూడదు. బట్టలు ధరించి కూడా నగ్నంగా కన్పించే స్త్రీలను దైవప్రవక్త (స) శపించారు.

దైవప్రవక్త (సల్లం) ఒకసారి ఇలా అన్నారు: "దుస్తులు ధరించి కూడా దిగంబరంగా ఉండి ఇతరుల్ని ఆకట్టుకోవడం, ఇతరులచే ఆకర్షించబడటం చేస్తూ మదపు ఒంటెలా మెడ వంకరపెట్టి మిడిసిపడుతూ నడిచే స్త్రీలు ఎన్నటికీ స్వర్గంలో ప్రవేశించలేరు. అసలు దాని వాసన కూడా వారు ఆఘ్రాణించలేరు." (ముస్లిం)

స్త్రీల అలంకరణలను దైవప్రవక్త (స) నిషేధించలేదు. పైగా వాటిని ప్రోత్సహించారు. అయితే శృతిమించిన అలంకరణలు, ఫ్యాషన్లపై ఆంక్షలు విధించారు. ఆనాడు కృత్రిమ సౌందర్యం కోసం అరబ్బు స్త్రీలలో ఉండే ఈ క్రింది చేష్టలను ఆయన వ్యతిరేకించారు.

శిరోజాలలో ఇతరుల శిరోజాలు కలిపి తమకు పొడవైన, గుబురు శిరోజాలు ఉన్నాయని అన్పించుకోవడానికి ఆరాటపడటం, శరీరం మీద అనేక చోట్ల కృత్రిమ మచ్చలు (పచ్చబొట్లు) వేయించుకోవడం, వెంట్రుకలు పీకేసి కనుబొమలు సన్నగా చేయడం, ముఖాన్ని వత్తి వత్తి నున్నగా చేయడం, పళ్ళను అరగదీసి సన్నగా చేయడం, కృత్రిమ రంగులు పూసుకొని ముఖాన్ని అందంగా తీర్చిదిద్దుకోవడానికి ప్రయత్నించడం మొదలైనవి.

హజ్రత్ అస్మా బిన్త్‌అబూబకర్ (రజి) కథనం: ఒక స్త్రీ వచ్చి "దైవప్రవక్తా! నా కూతురికి స్ఫోటకం పోసి శిరోజాలు రాలిపోయాయి. నేనామెకు ఇప్పుడు పెళ్ళి చేశాను. మరి ఆమె తలలో సవరం పెట్టవచ్చా?" అని అడిగింది. దానికి దైవప్రవక్త (స) "సవరం పెట్టుకునే స్త్రీకి, పెట్టుకోమని ప్రేరేపించే స్త్రీకి దైవశాపం కలుగుతుంది" అని చెప్పారు. (బుఖారి)

దైవప్రవక్త (స) ప్రవచనం: అందం కోసం పచ్చబొట్లు పొడిపించుకునే, పొడిపించు కోమని ప్రోత్సహించే స్త్రీలు, (ముఖం మీది) వెంట్రుకలు పీకేసే, పీకెయ్యమని ప్రోత్సహించే స్త్రీలు; పళ్ళ మధ్య సందులు చేసే స్త్రీలు శపించబడ్డారు. వారీ విధంగా దేవుని సృష్టిని మార్చివేస్తున్నారు. (బుఖారి, ముస్లిం)

బయటికెళ్ళేటప్పుడు సువాసన పూసుకోవడం, సువాసన పూలు పెట్టుకోవడం కూడా నిషిద్ధమే. అలాగే పురుష దుస్తులు స్త్రీలు, స్త్రీదుస్తులు పురుషులు ధరించడం కూడా నిషిద్ధమే.

దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "ఏ స్త్రీ అత్తరు పూసుకొని మనుషుల మధ్య గుండా నడచిపోతుందో ఆమె తిరుగుబోతు స్త్రీ వంటిది." (తిర్మిజి)

స్త్రీలు పరపురుషులతో మాట్లాడవలసి వచ్చినప్పుడు నవ్వుతూ, తుళ్ళుతూ ఎన్నడూ మాట్లాడకూడదు. అలాగే వారితో మెతకగా కూడా మాట్లాడకూడదు.

"మీరు దేవునికి భయపడే వారైతే (పరపురుషులతో) మెతకదనం వ్యక్తమయ్యేలా మెల్లిగా మాట్లాడకండి. ఆంతర్యంలో 'చెడు' ఉన్నవాడ్ని ఈ మెతకదనం పేరాశకు పురిగొల్పే

ప్రమాదం ఉంటుంది. అందువల్ల మీరు పరపురుషులతో మాట్లాడ వలసివచ్చినప్పుడు స్పష్టంగా, కరాఖండిగా మాట్లాడండి. (ఖుర్‌ఆన్-33:32)

దైవప్రవక్త (స) ప్రవచనం: "స్త్రీలను అనుకరించే స్త్రీవేష పురుషులు, పురుషుల్ని అనుకరించే పురుషవేష స్త్రీలు మనలోనివారు కారు." (ముస్నద్ అహ్మద్)

## ఇంటినుండి బయటికి వెళ్ళేటప్పుడు

సాధారణంగా స్త్రీ కార్యాచరణ పరిధి ఆమె గృహమే. అందుకే ఆమెను "గృహిణి" అన్నారు పెద్దలు. "ఇంటికి దీపం ఇల్లాలే" అనే సామెత కూడా ఈ వాస్తవాన్నే ధృవీకరిస్తుంది. గృహనిర్వహణ బాధ్యతలను పురుషునికంటే స్త్రీయే చక్కగా నిర్వహిస్తుంది. ఇంట్లోని చిన్న చిన్న పనులు అనేకం చేయగల శక్తి, సామర్థ్యాలు ఆమెకే ఉంటాయి. ఇంటిని చక్కదిద్దుకోగల నేర్పు ఆమె సహజ లక్షణం. ఆ లక్షణాన్ని వదిలేస్తే ఆమె ఇల్లు కుక్కలు చింపిన విస్తరిలా తయారవుతుంది. అలాఅని ఆమె ఇంటి నాల్గుగోడల మధ్య బందీ అయిపోవాలని ఎవరూ చెప్పరు. గృహనిర్వహణ బాధ్యతల్ని విస్మరించకుండా వాటి కోసం అవసరమొచ్చినప్పుడు ఆమె బయటికి కూడా వెళ్ళవచ్చు. బయటికెళ్ళినప్పుడు స్త్రీ స్త్రీగానే మసలుకోవాలిగాని, మగరాయుడిగా ప్రవర్తించకూడదు. స్త్రీకి అన్ని రంగాల్లోనూ పూర్తి స్వేచ్ఛ ఉందని చెప్పడం ఎంత తప్పో, ఆమెకసలు స్వేచ్ఛే లేదని చెప్పడం కూడా అంతే తప్పు.

హజ్రత్ ఆయిషా (రజి) కథనం: హజ్రత్ ఉమర్ (రజి) ఒకరోజు ప్రవక్త సతీమణి సౌదా (రజి)ని బయట (వీధిలో) ఉండటం చూసి విమర్శించారు. అప్పుడామె (ఎలాంటి సమాధానం ఇవ్వకుండా) ఇంటికెళ్ళి ఆ సంగతి దైవప్రవక్త (స) ముందు ప్రస్తావించారు. ఈ ప్రస్తావన వచ్చిన వెంటనే ఆయనపై 'వహీ' పరిస్థితి ఆవహించింది. అది తొలగిపోయిన తరువాత ఆయన ఇలా అన్నారు: "నిస్సందేహంగా దేవుడు మీకు (స్త్రీలకు) మీ అవసరాల నిమిత్తం ఇంటి నుండి బయటికి వెళ్ళేందుకు అనుమతి ఇచ్చాడు." (బుఖారి)

కొందరు సంస్కరణవాదులు పాశ్చాత్యతరహా స్త్రీస్వేచ్ఛకోసం ప్రవక్తసతీమణి హజ్రత్ ఆయిషా (రజి) జమల్ యుద్ధంలో పాల్గొనడాన్ని ప్రమాణంగా చూపెడుతున్నారు. కాని ఆమె ఆ తర్వాత పశ్చాత్తాపం చెందిన సంగతి వీరు కావాలని విస్మరిస్తున్నారు. అబ్దుల్లా బిన్ హంబల్, ఇబ్నెమున్జిర్, ఇబ్నెఅబీ షైబా, ఇబ్నెసాద్ వంటి ప్రముఖులు తమ గ్రంథాల్లో మస్రూఖ్ కథనాన్ని ఉల్లేఖిస్తూ, హజ్రత్ ఆయిషా (రజి) ఖుర్‌ఆన్ పఠనం సందర్భంగా జమల్ యుద్ధంలో తన వల్ల జరిగిన పొరపాటు జ్ఞాపకం వచ్చి, ఈసూక్తి దగ్గరికి వచ్చేటప్పటికి అప్రయత్నంగా దుఃఖించేవారని, కన్నీటితో ఆమె ఓణి తడిసిపోయేదని వ్రాశారు. (తఫ్‌హీముల్ ఖుర్‌ఆన్)

# 66. తలాఖ్ (విడాకులు)

వివాహం విషయంలో వధూవరుల పరస్పర ఎంపిక ఎంత కచ్చితంగా జరిగిందనుకున్నా శారీరక, స్వాభావిక, భావపరమైన అసమానతలు, అపసవ్యతలు కాస్తయినా ఉండక పోవు. వీటి మూలంగా ఆలుమగల మధ్య అప్పుడప్పుడు ఏవో విభేదాలు, పొరపొచ్చాలు రావడం సహజం. అయితే ఈ కీచులాటలు హద్దుమీరి జీవితం దుర్భరమైపోయినప్పుడు దంపతులు విడిపోవడం తప్ప గత్యంతరం లేదు. భార్యాభర్తలు ఇలా అనివార్య స్థితిలో విడిపోవడాన్నే "తలాఖ్" (విడాకులు) అంటారు.



తలాఖ్ (విడాకులు) అంటే శాబ్దిక అర్థం బాధనుంచి విముక్తి గావించడం. షరీఅత్ పరిభాషలో తలాఖ్ అంటే "స్త్రీ నుండి విడిపోవడానికి ఇవ్వబడిన అధికారాన్ని పురుషుడు వదలుకోవడం." అనిఅర్థం. దాంపత్య స్పర్థలను నివారించడానికి ఉపయోగపడే చివరి ఆయుధమే తలాఖ్ (విడాకులు). విడాకుల విషయంలో స్త్రీ పురుషులకు విస్తృతాధికారాలు ఇచ్చినప్పటికీ ప్రతి చిన్న విషయానికీ విడాకులు ఇవ్వడాన్ని ఇస్లాం అంగీకరించదు. ఇస్లాం ఎల్లప్పుడూ సఖ్యత, సమైక్యతలనే కోరుతుంది కాని, వేర్పాటును కాదు. దైవప్రవక్త (స) తలాఖ్‌ను గురించి ఇలా ప్రవచించారు:

"దంపతుల మధ్య వేర్పాటు కలగజేయడం షైతాన్‌కు ఎంతో ఆనందదాయకమైన విషయం." (ముస్లిం)

"దేవుని దగ్గర ధర్మసమ్మతమైన విషయాలలో అన్నిటికన్నా అప్రియమైన విషయం విడాకులే." (అబూదావూద్)

హజ్రత్ ముఆజ్ బిన్ జబల్ (రజి) కథనం: దైవప్రవక్త (సల్లం) నాతో ఇలా అన్నారు- "ముఆజ్! యావత్తు భూగోళంపై బానిసను బానిసత్వం నుండి విముక్తి కలిగించడం కంటే దేవునికి ప్రియమైన విషయం మరేదీ లేదు. అలాగే దేవుని దృష్టిలో యావత్తు భూగోళంపై తలాఖ్ కంటే పరమ అసహ్యాకరమైన విషయం మరేదీ లేదు." (మిష్కాత్)

దైవప్రవక్త (స) ప్రవచనం: "వివాహమాడండి. కాని (చీటికి మాటికి) విడాకులు ఇవ్వకండి. రుచులు కోరే వారిని దేవుడు ప్రేమించడు." (హదీస్)

"వారిపట్ల మంచితనం కలిగివుంటూ సంసారంచేయండి. ఒకవేళ వారు మీకు (ఒక విషయంలో) నచ్చకపోతే, నచ్చని విషయంలోనే దేవుడు మీకు ఎంతో శ్రేయస్సు, మేలు పెట్టి ఉండవచ్చు." (ఖుర్‌ఆన్-4:19)

## "ఈలా" (ఒట్లు, పాపపరిహారం)

కొందరు పురుషులు తమ భార్యల మీద అలిగి, లేదా భార్యలను వేధించడానికి వారిని కలుసుకోమని ఒట్లు వేసుకుంటారు. ఇది హద్దు మీరితే వివాహవిచ్ఛేదానికి దారి తీస్తుంది. అందువల్ల ఈ విషయంలో పురుషులు జాగ్రత్త వహించవలసి ఉంటుంది. దీన్ని షరీఅత్ పరిభాషలో "ఈలా" అంటారు.

"తమ భార్యలను కలుసుకోమని ప్రమాణం చేసేవారికి నాలుగు నెలల గడువు ఉంటుంది. ఒకవేళ వారు (ఈ గడువులోగా) దాన్ని ఉపసంహరించుకుంటే దేవుడు క్షమించేవాడు, కరుణించేవాడు (అని తెలుసుకోండి). దానికి బదులు వారు విడాకులు ఇవ్వడానికే నిర్ణయించుకుంటే గుర్తుంచుకోండి; దేవుడు అన్నీ వింటున్నాడు, ఆయనకు సమస్త విషయాలు తెలుసు." (ఖుర్‌ఆన్-2:226-227)

భార్యాభర్తల మధ్య పొరపొచ్చాలు రావడం, దానివల్ల తాత్కాలికంగా దాంపత్య ప్రక్రియకు దూరంగా ఉండటం సహజం. అయితే ఈ అలుగుడు, కోపతాపాలతో దాంపత్య ప్రక్రియకు దూరంగా ఉండవలసిన గడువు నాలుగు నెలలు మాత్రమే. ఈలోగా వారుభయులు పొరపొచ్చాలు దూరం చేసుకొని ఏకమవ్వాలి. అప్పుడు కొందరు ఫిఖ్హా వేత్తలు ప్రమాణభంగం చేసినందుకు భర్త పాపపరిహారం చెల్లించవలసి ఉంటుందని అభిప్రాయపడ్డారు. మరికొందరు ఫిఖావేత్తలు

పాపపరిహారం చెల్లించనవసరం లేదని అభిప్రాయం వెలిబుచ్చారు. ఈ గడువు దాటిపోతే భర్త ఒక తలాఖ్ (తలాఖె బాయిన్) ఇచ్చినట్లయి వివాహబంధం తెగిపోతుంది. అయితే భార్యాభర్తలు రాజీపడితే తిరిగి వివాహం చేసుకోవచ్చు. ఇదీ 'ఈలా' విధానం.

'ఈలా' ఆజ్ఞను వర్తింపజేయడంలో ఫిఖావేత్తల మధ్య కొన్ని భేదాభిప్రాయాలు ఉన్నాయి. కొందరు ఫిఖావేత్తలు భర్త ఒట్టేసుకొని మరీ భార్యను కలుసుకోకుండా ఉన్నప్పుడు మాత్రమే సదరు భర్తకు ఈలా ఆజ్ఞ వర్తిస్తుందని అభిప్రాయపడ్డారు. ఒట్టేసు కోకుండా భార్య మీద అలిగి ఆమెను కలుసుకోకుండా పదేళ్ళు వేరుగా ఉన్నా ఈలా వర్తించదని వారి అభిప్రాయం.

దీనికి భిన్నంగా మాలికియా ఫిఖ్హావేత్తలు భర్త ఒట్టేసుకోకపోయినా, అంటే ప్రమాణం చేయకపోయినా సరే భార్యను వేధించే ఉద్దేశ్యంతో ఆమెను నాలుగు నెలలదాకా కలుసు కోకుండా ఉంటే అతనికి ఈలా వర్తింపజేయాలని అన్నారు. హజ్రత్ అబ్దుల్లా బిన్ మస్ఊద్ (రజి), అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి)లు కూడా ఇలాంటి అభిప్రాయాన్నే వ్యక్తపరుస్తూ "నాలుగు నెలలు గడచి పోవడం అంటేనే భర్త విడాకులకులు ఇవ్వడానికి నిర్ణయించుకున్నాడని అర్థం. కనుక ఆ గడువు ముగిశాక అతనికిక తన భార్యను పరిగ్రహించడానికి అధికారం లేదు" అని అన్నారు. ఈ అభిప్రాయాన్ని ప్రముఖ తత్వవేత్త మౌలానా మౌదూదీ కూడా సమర్థించారు.

## జిహార్ (తల్లికాని తల్లి)

అజ్ఞానకాలంలో అరబ్బులు తమ భార్యలతో పోట్లాడి వారిని వదిలించుకోవడానికి "నువ్వు నాకు తల్లివంటి దానవు" అని చెప్పేవారు. ఇది ఆనాడు విడాకులకు దారితీసే చర్య అవుతుంది. ఈ దురాచారం ప్రకారం పురుషుడు ఇక ఆమెను తిరిగి దాంపత్యంలోకి తీసుకోవడా నికి వీల్లేదు. దీన్ని షరీఅత్‌పరిభాషలో "జిహార్" అంటారు. ఆనాడు హజ్రత్ ఖౌలా బిన్త్ సాలబా (రజి) కూడా ఇలాంటి పరిస్థితే ఎదురయింది. ఆమె దైవప్రవక్త (స)తో, 'భర్త దూరమైతే తాను చిక్కుల్లో పడవలసివస్తుందని, తన పిల్లలు నాశనమవుతారని' విన్నవించుకున్నారు. అప్పుడు దేవుడు ఆమెభర్త వైఖరిని తీవ్రంగా గర్హిస్తూ ఈ క్రింది సూక్తులు అవతరింపజేశాడు.

"మీలో ఎవరు తమభార్యల్ని తల్లుల వంటివారని చెప్పి, వారిపట్ల దాంపత్య విచ్ఛిన్న వైఖరి అవలంబిస్తారో వారి భార్యలు నిజానికి వారికి తల్లులు కాలేరు. వారి తల్లులు వారిని కన్నవారే అవుతారు. వీరు అనుచితమైన అబద్ధం పలుకుతున్నారు." (ఖుర్ఆన్-58:2)

"ఎవరు తమ భార్యల్ని తల్లుల వంటివారని చెప్పి వారిపట్ల దాంపత్య విచ్ఛిన్న వైఖరి అవలంబిస్తారో వారు (తప్పు తెలుసుకున్న తరువాత) దాంపత్య సంబంధాన్ని పునరుద్ధరించు కోవడానికి సిద్ధమైనప్పుడు, దంపతులు పరస్పరం కలుసుకోక ముందే (భర్త) ఒక బానిసకు బానిసత్వం నుండి విముక్తి కలిగించాలి...."

"ఒకవేళ బానిస లేకపోతే, ఇద్దరు కలుసుకోక ముందే అతను రెణ్ణెల్లు నిరంత రాయంగా ఉపవాసం పాటించాలి. అదీ చేయలేకపోతే అరవై మంది పేదలకు అన్నదానం చేయాలి. మీరు దేవుణ్ణి, ఆయన ప్రవక్తను (మనస్ఫూర్తిగా) విశ్వసించడానికే ఈ ఆజ్ఞ ఇస్తున్నాం. ఇవి దేవుడు నిర్ణయించిన పరిధులు. (వాటిని అతిక్రమించకూడదు.) సత్యాన్ని తిరస్కరించినవారికి దుర్భరశిక్ష పడుతుంది." (ఖుర్ఆన్-58:3,4)

"విడాకులు పొందిన స్త్రీలు తమంతటతాము మూడు రుతువుల దాకా వేచివుండాలి. దేవుడు వారి గర్భాలలో సృజించినదాన్ని (పైకి చెప్పకుండా) దాచడం వారికి భావ్యం కాదు.



అల్లాహ్‌ను, అంతిమదినాన్ని విశ్వసించేవారైతే వారీ విషయాన్ని బహిర్గతం చేయాలి. వారి భర్తలు పూర్వసంబంధాలను పునరుద్ధరించుకోదలిస్తే ఈ గడువులోగా తమ భార్యలను తిరిగి దాంపత్యంలోకి తీసుకునేందుకు వారికి పూర్తి హక్కుంది." (ఖుర్ఆన్-2:228)

భర్త భార్య నుండి శాశ్వతంగా వేరవడానికి విడాకులిస్తున్నానని ఆమె జీవితకాలంలో మూడు సార్లు మాత్రమే ప్రకటించవలసి ఉంటుంది. ఒకవేళ అతను రెండుసార్లు మాత్రమే తలాఖ్ ప్రకటించి, భార్యతో రాజీపడి సంసారంసాగిస్తూ, ఆతర్వాత మరెప్పుడైనా ఇద్దరి మధ్య మళ్ళీ పొరపొచ్చాలు వస్తే అప్పుడతను భార్య నుండి శాశ్వతంగా విడిపోవడానికి తలాఖ్ ప్రకటన ఒక్కసారి మాత్రమే చేయవలసి ఉంటుంది.

## ఒకేసారి మూడు తలాఖులు శాస్త్రవ్యతిరేకం

విడాకులంటే ఆషామాషీ విషయం కాదు. పెద్దల సమక్షంలో ఒక స్త్రీ, ఒక పురుషుడి మధ్య వివాహరూపంలో ఏర్పడిన పవిత్రబంధాన్ని విడాకులిస్తున్నానని ఏకకాలంలో మూడు సార్లు పలికితే ఆ బంధం తెగిపోవచ్చుగాని, ఆ చర్య ఘోరమైన తప్పుగా మిగిలిపోతుంది.

మహ్మూద్ బిన్ లబీద్ (రజి) ఉల్లేఖనం: ఒకతను తన భార్యకు ఒకేసారి మూడు తలాఖులు ఇచ్చిన సంగతి దైవప్రవక్త (స) దృష్టికి తెచ్చినప్పుడు ఆయన ఆగ్రహంతో దిగ్గున లేచి "ఏమిటీ, నేను మీ మధ్య జీవించి ఉండగానే దైవగ్రంథంతో ఆడుకోవడం జరుగుతోందా?" అని అన్నారు. అప్పుడు ఒకతను లేచి "దైవప్రవక్తా! మరి నేనా వ్యక్తిని హతమార్చనా?" అని అన్నాడు. (నసాయి-మిష్కాత్)

హజ్రత్ మాలిక్ (రజి) ఉల్లేఖనం: ఒకతను హజ్రత్ అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి) దగ్గరికి వచ్చి "నేను నా భార్యకు వంద తలాఖులు ఇచ్చాను. మరి నా సంగతేమిటీ?" అని అడిగాడు. దానికి హజ్రత్ అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి) సమాధానమిస్తూ "నీ భార్య మూడు తలాఖులకే నీ నుండి వేరయిపోయింది. మిగిలిన తలాఖులన్నిటితో నీవు దైవ సూక్తుల్ని పరిహసించావు" అని అన్నారు. (ముఅత్తా)

హజ్రత్ రుకానా బిన్ అబ్దెయజీద్ (రజి) తన భార్య సుహైమాకు 'బిత్తా తలాఖ్' (వివాహవిచ్ఛేద విడాకులు) ఇచ్చారు. ఆ సంగతి ఆయన దైవప్రవక్త (స) దృష్టికి తెస్తూ "దైవసాక్షి! నేను ఒక్క తలాఖ్ ఉద్దేశ్యంతోనే తలాఖ్ ఇచ్చాను" అన్నారు. దైవప్రవక్త (స) "నువ్వు దేవుని మీద ప్రమాణం చేసి నిజంగా ఒక తలాఖ్ ఉద్దేశ్యంతోనే ఇచ్చానని చెబు తున్నావా?" అని అడిగారు. దానికి హజ్రత్ రుకానా(రజి) "ఔను దైవప్రవక్తా! దేవుని మీద ప్రమాణం చేసిమరీ చెబుతున్నాను. నేను నిజంగా ఒక తలాఖ్ ఉద్దేశ్యంతోనే విడాకులి చ్చాను" అని అన్నారు. అప్పుడు దైవప్రవక్త (స) ఆయనకు భార్యను తిరిగి దాంపత్యం లోకి తీసుకునే అనుమతిచ్చారు. (అబూదావూద్, తిర్మిజి, ఇబ్నెమాజ, దార్మి)

భార్యాభర్తల తలాఖ్‌కు నిర్ణీత గడువుంది. ఆ గడువులోపు విభేదాలు దూరం చేసుకొని, రాజీపడటానికి యత్నించాలి. ఇక పొసగదని తేలినప్పుడే గడువు ముగిసిన తర్వాత మూడవ సారి విడాకులిచ్చి భర్త తనభార్య నుండి విడిపోవాలి. భార్య రుతుస్రావం ఆగిపోయి స్నానం చేసిన తర్వాత ఒకసారి తలాఖ్ ఇస్తున్నట్లు చెప్పాలి. రెండవసారి స్నానంచేశాక రెండవసారి తలాఖ్ ఇవ్వాలి. ఆ తర్వాత మూడవసారి స్నానం చేసేవరకు వేచివుండాలి.

ఈ మూడు రుతుక్రమాల కాలాన్ని ఇద్దత్ (గడువు) అంటారు. ఈ గడువు దాటక ముందే (అంటే మొదటిసారి తలాఖ్ తర్వాతగాని, లేదా రెండవసారి తలాఖ్ తర్వాతగాని) భర్త విడాకుల ఉద్దేశ్యం మానుకుంటే యధాప్రకారం భార్యతో తిరిగి కాపురం చేయవచ్చు. ఒకవేళ గడువు దాటిపోతే (అంటే మూడవసారి రుతుస్రావం కల్గిన తర్వాత) వారిద్దరి వివాహం విచ్ఛేదం అవుతుంది. అతను తన భార్యతో మళ్ళీ కాపురం చేయాలంటే ఆమెను కొత్తగా మరోసారి వివాహం (నికాహ్) చేసుకోవలసి ఉంటుంది. అయితే ఆమె మూడవసారి రుతుస్రావం ఆగి పోయి స్నానం చేశాక అతను మూడవసారి కూడా తలాఖ్ ఇస్తున్నానని ప్రకటిస్తే మాత్రం ఇక ఆమె అతనికి శాశ్వతంగా దూరమయిపోతుంది. పునర్వివాహానికి అవకాశం లేదు.

భార్యాభర్తల మధ్య విభేదాలు తీవ్రస్థాయికి చేరి ఉద్రిక్త వాతావరణం ఏర్పడినప్పుడు పెద్దలు వాటిని నివారించి వారి సంసారాన్ని చక్కబెట్టేందుకు శతవిధాల కృషి చేయాలి. ఖుర్ఆన్‌లోని ఈ క్రింది సూక్తులు చూడండి:

“మీ మాటలకు ఎదురు చెప్పి తిరగబడతారని భయమున్న స్త్రీలకు (నయాన భయాన) నచ్చజెప్పండి. (అలా దారికిరాకపోతే) వారిని మీ పడకల నుండి వేరుచేయండి. (అప్పటికీ మీ మాట వినకపోతే) కొట్టండి. ఆ తరువాత వారు మీకు విధేయులయిపోతే ఇక వారిని అనవసరంగా వేధించడానికి సాకులు వెతకకండి. పైన అందరికంటే అధికుడు, అత్యున్నతుడైన దేవుడు ఉన్నాడని గుర్తుంచుకోండి.” (ఖుర్ఆన్–4:34)

“భార్యాభర్తల మధ్య సంబంధాలు చెడిపోతాయని భయముంటే భర్త బంధువుల నుండి ఒక మధ్యవర్తిని, భార్య బంధువుల నుండి ఒక మధ్యవర్తిని పెట్టుకోండి. వారిద్దరు కలసి పరిస్థితిని చక్కదిద్దదలచుకుంటే దేవుడు దంపతుల మధ్య సానుకూలత కలిగిస్తాడు. దేవుడు సర్వజ్ఞాని, సమస్తం ఎరిగినవాడు.” (ఖుర్ఆన్–4:35)

## రుతుకాలంలో విడాకులివ్వరాదు

స్త్రీకి విడాకులు ఎప్పుడుపడితే అప్పుడు ఇవ్వడానికి వీల్లేదు. స్త్రీ బహిష్టయి ఉన్నప్పుడు తలాఖ్ ఇవ్వకూడదు. రుతుస్రావం ఆగిపోయి ఆమె స్నానం చేసిన తర్వాతే ఒకసారి తలాఖ్ ఇచ్చానని చెప్పాలి. అయితే ఆతర్వాత ఆమెతో లైంగికసంబంధం పెట్టుకోకూడదు. ఈవిధంగా రెండవసారి కూడా రుతుస్రావం ఆగిపోయి స్నానంచేసిన తర్వాతే తలాఖ్ ఇవ్వాలి. ఈలోగా భార్యాభర్తలు రాజీపడటానికి ప్రయత్నించాలి. చివరి ప్రయత్నం కూడా ఫలించకపోతే మూడవ సారి రుతుస్రావం ఆగిపోయి స్నానం చేసిన తర్వాత విడాకులిచ్చానని చెప్పి ఆమె నుండి శాశ్వతంగా వేరైపోవాలి. రుతుకాలంలో సాధారణంగా స్త్రీలు చిరచిరలాడుతూ ఉద్దేశ్యరహితంగా విడాకులకు దారితీసే మాటలు పలకడానికి ఆస్కారం ఉంది. ఇదొక వైద్య సంబంధమైన యదార్థం. అందువల్ల రుతుకాలంలో తలాఖ్ ఇవ్వడాన్ని ఇస్లాం వారించింది.

హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి) రుతుకాలంలో తన భార్యకు విడాకులిచ్చారు. దీన్ని గురించి ఆయన తండ్రి దైవప్రవక్త (సల్లం) దగ్గర ప్రస్తావిస్తే, ఆయన ఆగ్రహిస్తూ వెంటనే అతడ్ని ఉపసంహరించుకోమని ఆదేశించారు.

రుతుకాలంలో విడాకులిచ్చిన హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి)కు దైవప్రవక్త (సల్లం) ఇస్లాం ధర్మాన్ని ఎలా వివరించారో చూడండి:



“ఇబ్నె ఉమర్! నీవు సరైన పద్ధతి అవలంబించలేదు. సరైన పద్ధతి అంటే రుతుస్రావం ఆగిపోయి స్త్రీ స్నానం చేసేవరకు నీవు వేచివుండాలి. తర్వాత ప్రతి రుతుకాలం అనంతరం ఒక్కొక్క విడాకులివ్వాలి. మూడవసారి స్త్రీ పరిశుద్ధురాలైన తరువాత (చివరి సారిగా) విడాకులు ఇవ్వవచ్చు లేదా విడాకులివ్వకుండా (ఆ స్త్రీతోనే) సంసారం చేయవచ్చు.”

హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి) ఈ మాట విని “నేనామెకు మూడు (సార్లు) విడాకులిచ్చిన తరువాత ఉపసంహరించుకునే హక్కున్నదా నాకు?” అని అడిగారు. దానికి దైవప్రవక్త (సల్లం) “లేదు. ఆమె వేరైపోతుంది; ఇది పాపమవుతుంది” అన్నారు. (బైహఖీ, తబ్రాని)

ఈ విషయాన్ని గురించి హజ్రత్ ఇబ్నెఉమర్ (రజి)ని కొందరు అడిగినప్పుడు ఆయన ఇలా చెప్పేవారు: “నీవు నీ భార్యకు ఒకటి లేదా రెండుసార్లు విడాకులివ్వడం జరిగితే, అలాంటి పరిస్థితిలో దైవప్రవక్త (స) నన్ను నా భార్యను తిరిగి దాంపత్యంలోకి తీసుకోవాలని ఆదేశించారు. ఒకవేళ నీవు మూడు తలాఖులు ఇస్తే ఇక నీ భార్య మరో పురుషుడ్ని పెళ్ళాడనంతవరకు ఆమె నీకు నిషిద్ధమవుతుంది. (అంటే నీ వివాహబంధం నుండి వేరైపోతుంది.) పైగా నీవు పాపం చేసినవాడవు కూడా అవుతావు.” (ముస్లిం)

“విడకులు ఇస్తున్నానని రెండుసార్లు మాత్రమే చెప్పాలి. ఆ తరువాత (నిర్ణయం మార్చుకుంటే) సముచిత రీతిలో (భార్యను) వివాహబంధంలో కొనసాగించాలి; లేదా (అంటే నిర్ణయం మార్చుకోకపోతే విడాకులిస్తున్నానని మూడవసారి కూడా చెప్పేసి ఆమెను) ఉత్తమ రీతిలో వదిలేయాలి. అప్పుడు మీరామెకు ఇచ్చిన వస్తువులలో కొంతైనాసరే, వాపసు తీసుకోవడం మీకు ధర్మసమ్మతంకాదు. ఒకవేళ దంపతులు దైవనిర్ణీత పరిమితులకు కట్టుబడి ఉండలేమని అనుకుంటే, అది వేరే విషయం.”

“దంపతులిద్దరు దైవనిర్ణీత పరిమితులకు కట్టుబడి ఉండలేమని భయపడినప్పుడు స్త్రీ తన భర్తకు ఏమైనా ఇచ్చి అతని నుండి వేరుపడదలచుకుంటే వారిద్దరి మధ్య ఏదైనా ఒప్పందం కుదరడంలో తప్పు లేదు. ఇవి దేవుడు నిర్ణయించిన పరిమితులు. వాటిని అతిక్రమించకండి. దైవపరిమితుల్ని అతిక్రమించేవారే దుర్మార్గులు.” ( ఖుర్ఆన్–2:229)

“(మూడవసారి) విడాకులిస్తే, ఇక ఆ స్త్రీని దాంపత్యబంధంలోకి తీసుకోడం అతనికి ధర్మం కాదు, ఆమె మరోవ్యక్తిని వివాహమాడి అతనామెకు విడాకులిస్తే తప్ప. ఒకవేళ మొదటిభర్త, ఈ స్త్రీ, ఇద్దరూ తాము దైవనిర్ణీత పరిమితులకు కట్టుబడి ఉండగలమనుకుంటే (ఇలా) వారు పరస్పరం తిరిగి ఏకమవడంలో తప్పు లేదు. ఇవి దేవుడు నిర్ణయించిన పరిమితులు. వీటిని ఆయన విజ్ఞుల కోసం వివరిస్తున్నాడు.” (ఖుర్ఆన్–2:230)

“మీరు స్త్రీలకు (రెండుసార్లు) విడాకులిచ్చిన సందర్భంలో వారి గడువు పూర్తికా వస్తున్నప్పుడు వారిని సక్రమంగా (మీ ఇంట) ఉండనివ్వండి. లేదా (మూడవసారి కూడా విడాకులిస్తున్నట్లు ప్రకటించి) సహృదయంతో సాగనంపండి. అంతేగాని, చీటికి మాటికి వేధిస్తూ అన్యాయం తలపెట్టే ఉద్దేశ్యంతో వారిని ఆపి ఉంచకండి. ఇలా ప్రవర్తించేవాడు నిజానికి తనకుతానే అన్యాయం చేసుకుంటున్నాడు.” (ఖుర్ఆన్–2:230)

## తలాఖ్-విభిన్న విధానాలు

పురుషుడు తన భార్యకు విడాకులిస్తున్నానని ఒకసారి చెప్పినా, రెండుసార్లు చెప్పినా, మూడుసార్లు చెప్పినా అది ఇద్దత్ (మూడు రుతుకాలాల గడువు) దాటిన తర్వాతే అమల్లోకి వస్తుంది. ఈ గడువు కాలంలో అతనామెతో లైంగిక సంబంధం పెట్టుకోకూడదు.

భర్త ఒకటి లేక రెండుసార్లు తలాఖ్ ఇచ్చినట్లు స్పష్టంగా చెప్పిన తర్వాత గడువులోపే పశ్చాత్తాపంచెంది భార్యతో దాంపత్యజీవితం కొనసాగదలచుకుంటే అలా చేయవచ్చు. అలాంటి పరిస్థితిలో భర్త తన భార్యను మళ్ళీ దాంపత్యంలోకి తీసుకోవడానికి ఆమె అనుమతి అవసరం లేదు. ఆమెను మళ్ళీ వివాహం కూడా చేసుకోనవసరం లేదు. అంటే ఆమెను నికాహ్ చేసుకోకుండానే పరిగ్రహించవచ్చు. ఇలాంటి తలాఖ్‌ను **‘రజయీ తలాఖ్’** అంటారు.

“వారి భర్తలు పూర్వసంబంధాలను పునరుద్ధరించుకోదలిస్తే ఈ గడువులోగా తమ భార్యల్ని తిరిగి దాంపత్యంలోకి తీసుకునేందుకు వారికి హక్కుంది.” (ఖుర్ఆన్-2:228)

పురుషుడు స్పష్టమైన పదాలలో ఒకటి లేక రెండు సార్లు తలాఖ్ ఇచ్చినట్లు చెప్పిన తరువాత మూడు రుతుకాలాల గడువు గడచిపోయినా అతను తన భార్యను పరిగ్రహించక పోతే దాన్ని **‘బాయిన్ తలాఖ్’** అంటారు. బాయిన్ తలాఖ్‌లో వివాహబంధం పూర్తిగా తెగిపోతుంది. ఇలా వివాహబంధాన్ని తెంచివేసే విడాకుల్ని **‘బిత్తా తలాఖ్’** అని కూడా అంటారు. బిత్తా అంటే అరబీలో అనేక అర్థాలున్నాయి. వాటిలో ఒకటి “త్రెంచివేయడం” అనే అర్థం కూడా ఉంది. ఇలాంటి తలాఖ్ ఇచ్చిన పక్షంలో కొన్నాళ్ళకు అతను తన భార్యను తిరిగి దాంపత్యంలోకి తీసుకోదలచుకుంటే కొత్తగా ఆమెను మళ్ళీ నికాహ్ (వివాహం) చేసుకోవలసి ఉంటుంది. అదైనా భార్య ఇష్టపడితేనే చేసుకోగల్గుతాడు.

అందువల్ల పురుషుడు ఒకటికి నాలుగు సార్లు బాగా ఆలోచించి విడాకులివ్వాలి. దాని కోసం పురుషుడు తన భార్యకు మూడు రుతుకాలాలలో మూడుసార్లు విడాకులిస్తున్నానని చెప్పాలి. అంతేగాని ఒకేసారి మూడుసార్లు విడాకులిస్తున్నానని కూడా చెప్పకూడదు.

గడువులోపు పురుషుడు భార్యకు విడాకులిస్తున్నానని చెప్పినంత మాత్రాన భార్యాభర్తలు శాశ్వతంగా విడిపోలేరు. అయితే మూడు రుతుకాలాల గడువు గడవక ముందే అతను తిరిగి తన భార్యతో సంసారం కొనసాగించవచ్చు. మూడు రుతుకాలాల గడువు (ఇద్దత్) గడచిపోయిన తరువాత విడాకులిస్తున్నానని మొదట చెప్పిన ఒకసారికే అది విడాకులకు దారితీస్తుంది.

తలాఖ్ (విడాకులు) సూరాలోని “మీరు మీ స్త్రీలకు విడాకులివ్వదలిస్తే వారి గడువు (ఆరంభం)లో విడాకులివ్వండి” (65:1) అనే సూక్తిపై హజ్రత్ అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి) వ్యాఖ్యానిస్తూ ఇలా అన్నారు: “విడాకులు బహిష్టు కాలంలో ఇవ్వకూడదు. అలాగే రుతుస్రావం ఆగిపోయి స్నానం చేసిన తరువాత ఆమెతో భర్త సంభోగించిన పక్షంలో కూడా విడాకులు ఇవ్వకూడదు. ఈ రెండు పరిస్థితులు తప్పించి ఆమె రుతుస్రావం అగి స్నానం చేసిన తరువాత ఒక సారి తలాఖ్ ఇవ్వాలి. ఆ విధంగా ఒకసారి తలాఖ్ ఇచ్చిన తరువాత “ఇద్దత్” గడువు ముగిసేదాకా అతనామెను తిరిగి దాంపత్యంలోకి తీసుకోక పోతే ఆ ఒక్కసారి ఇచ్చిన తలాఖ్‌కే ఆమె వేరయిపోతుంది.” (ఇబ్నె జరీర్)

ఒకేసారి మూడు తలాఖులిస్తే మూడురుతుకాలాల గడువు దాటిన తర్వాత దాంపత్య బంధం తెగిపోతుంది. కాని ఇది షరీఅత్ ఆశయాన్నే కాలరాసే దుష్టచర్య అవుతుంది. అంతేకాదు,



దైవాగ్రహానికి గురయ్యే పాపకార్యం కూడా అవుతుంది. ఇలాంటి అజ్ఞాన వైఖరి వల్లనే ఇస్లామీయ విడాకుల పద్ధతిని ప్రత్యర్థులు ఎద్దేవా చేయగల్గుతున్నారు. నిజానికి ఇది వ్యక్తుల అజ్ఞానం, బలహీనతలేగాని, ఇస్లాం లోపం ఎంతమాత్రం కాదు.

ఒకతను తన భార్యకు ఏక కాలంలో మూడుసార్లు విడాకులిచ్చాడు. కొందరు అతని విషయం ఏమిటని హజ్రత్ ఉమర్ (రజి)ని అడిగితే, ఆయన జవాబిస్తూ “అతను తన ప్రభువాజ్ఞను ధిక్కరించాడు” అని అన్నారు.

విడాకులు ఇవ్వదలచిన వ్యక్తి మొదటి రుతుకాలం గడచిన తరువాత ఒకసారి విడాకులు ఇవ్వాలి. మళ్ళీ రుతుకాలం తరువాతనే రెండవసారి విడాకులు ఇవ్వాలి. ఆ తరువాత మూడవ రుతుకాలం దాకా వేచివుండాలి. ఈలోగా భార్య తన సత్ప్రవర్తనతో భర్తను మెప్పించి విడాకులు ఉపసంహరింప జేయించుకునేందుకు వీలుంటుంది. లేదా భర్తే ఒకటికి నాల్గుసార్లు ఆలోచించి, తానే ఏదైనా పొరపాటు చేసివుంటే దాన్ని సరిదిద్దుకొని మూడవసారి విడాకులివ్వకుండా యధా ప్రకారం భార్యతో కాపురం చేయవచ్చు. మూడవ రుతుకాలం వరకూడా భార్యాభర్తల మధ్య పొంతన కుదరకపోతే మూడవ రుతుకాలం ముగిసిన తరువాత మూడవసారి విడాకులిచ్చి శాశ్వతంగా భార్యను వేరుచేయాలి. ఇలాంటి తలాఖ్‌ను **‘ముగల్లా తలాఖ్’** అంటారు.

మూడుసార్లు విడాకులిచ్చిన తరువాత ఆ స్త్రీని తిరిగి చేపట్టడానికి పురుషునికి అవకాశం లేదు. ఒకవేళ తన భార్య ఎలాంటి పాపం ఎరగదని బాధపడుతూ ఆమెనే తిరిగి వివాహమాడ దలిస్తే, వివాహవిచ్ఛేదం గావించబడిన ఆ స్త్రీని మరొక పురుషుడు వివాహమాడి అతనామెతో సంభోగించి విడాకులిస్తే ఇతను (తొలి భర్త) ఆమెను మళ్ళీ వివాహం చేసుకోవచ్చు.

ఒకతను తన భార్యకు విడాకులిస్తే ఆమె మరొక వ్యక్తిని వివాహమాడింది. కాని అతను కూడా విడాకులివ్వడంతో ఈ విషయాన్ని కొందరు దైవప్రవక్త (స) దృష్టికి తెచ్చి “ఆ స్త్రీ తన మొదటి భర్తను తిరిగి వివాహమాడటం ధర్మసమ్మతమేనా?” అని అడిగారు. దానికి ఆయన “కాదు. ఆమె మొదటి భర్తలా ఈ భర్త కూడా ఆమెను అనుభవించనంత వరకు ఆమె తిరిగి అతడ్ని వివాహమాడటం ధర్మసమ్మతం కాద”ని అన్నారు. (బుఖారి)

హజ్రత్ ఆయిషా (రజి) కథనం: హజ్రత్ రిఫా ఖుర్జీ (రజి) గారి మాజీభార్య ఓరోజు దైవప్రవక్త (స) సన్నిధికి వచ్చి “దైవప్రవక్తా! నేను రిఫా (రజి)గారి మాజీభార్యను. ఆయన నాకు మూడు విడాకులు ఇచ్చి వేశారు. ఆ తరువాత నేను అబ్దుర్రహ్మాన్ బిన్ జబీర్ (రజి)ని వివాహమాడాను. కాని ఏం లాభం? ఆయనగారి దగ్గర గుడ్డకుచ్చు లాంటి వస్తువు తప్ప మరెలాంటి విలువైన వస్తువు లేదు” అని అన్నది. దైవప్రవక్త (స) ఈ మాటలు విని చిరునవ్వు నవ్వుతూ “అయితే నువ్వు మళ్ళీ రిఫా దగ్గరికి పోవాలను కుంటున్నావా? కాని నువ్వు అబ్దుర్రహ్మాన్‌ని, అబ్దుర్రహ్మాన్ నిన్ను ఆస్వాదించనంతవరకు ఇది సాధ్యం కాదు” అని చెప్పారు. (ముత్తఫఖున్ అలై)

## విడాకుల తరువాత మహర్ సమస్య

“మీరు మీభార్యలను కలుసుకోవడానికి ముందు వారి మహర్ నిర్ణయంకాని పక్షంలో వారికి విడాకులిస్తే తప్పులేదు. అలాంటి స్థితిలో వారికి ఎంతో కొంత (సొమ్ము) తప్పనిసరిగా ముట్టజెప్పాలి. ధనికుడైనా, పేదవాడైనా తన శక్తిమేరకు తగిన రీతిలో దీన్ని అందజేయాలి.

ఇది సత్పురుషులు నెరవేర్చవలసిన విధి." (ఖుర్ఆన్-2:236)

"మీరు మీభార్యలను కలుసుకోడానికి ముందే వారికి విడాకులు ఇవ్వవలసివస్తే, నిర్ణీతమహర్‌లో సగం సొమ్ము చెల్లించవలసి ఉంటుంది. అయితే స్త్రీ మృదువైఖరి అవలంబించి (మహర్ తీసుకోకపోయి)తే, లేదా వివాహబంధం తన అధీనంలో వున్న పురుషుడు మృదువైఖరి అవలంబించి (మహర్ పూర్తిగా ఇచ్చివేసి)తే అది వేరేవిషయం. మీరే (అంటే పురుషులే) సహృదయంతో మీ హక్కును వదలుకుంటే మరీ మంచిది. ఇది దైవభీతికి చాలా దగ్గరిమార్గం. పరస్పరం ఉదారస్వభావంతో మసలుకోవడం మరచి పోకండి. మీరు చేసే పనులన్నీ దేవునికి బాగా తెలుసు." (ఖుర్ఆన్-2:237)

## తలాఖ్ ఇవ్వడానికి నాలుగు పద్ధతులు

మహర్‌ని బట్టి, దాంపత్య సుఖాన్ని బట్టి తలాఖ్ నాలుగు విధాలుగా ఉంది:

1-నికాహ్ (వివాహం) సందర్భంలో మహర్ ధనం నిర్ణయించబడకుండా ఉండి, భార్యతో కలవక ముందే ఆమెకు తలాఖ్ ఇవ్వడం. (ఖుర్ఆన్-2:236)

2-నికాహ్ సందర్భంలో మహర్ ధనం నిర్ణయించబడి ఉండి, భార్యతో కలవక ముందే ఆమెకు తలాఖ్ ఇవ్వడం. (ఖుర్ఆన్-2:237)

3-మహర్‌ధనం నిర్ణయించబడి ఉండి, భార్యతో కలవడం కూడా జరిగిపోయిన తరువాత తలాఖ్ ఇవ్వడం. (ఖుర్ఆన్-2:229)

4-మహర్ ధనం నిర్ణయించబడకుండా ఉండి, భార్యతో కలవడం జరిగిపోయిన తరువాత తలాఖ్ ఇవ్వడం.

తలాఖ్ ఇవ్వడానికి ఈ క్రింది నిబంధనలు కూడా పాటించాలి:

❁ తలాఖ్ ఇచ్చే వ్యక్తి చైతన్యవంతుడై ఉండాలి. "అపస్మారక స్థితిలో ఉన్నవాడు, బుద్ధిజ్ఞానాలు సవ్యంగా లేనివాడు ఇచ్చే తలాఖ్ తప్ప ప్రతి (మనిషి ఇచ్చే) తలాఖ్ ధర్మ సమ్మతమే" అని దైవప్రవక్త (స) అన్నారు. (తిర్మిజి)

❁ తలాఖ్ ఇచ్చే వ్యక్తి తన ఇష్ట ప్రకారమే తలాఖ్ ఇవ్వాలి. ఇతరుల బలవంతంతో తలాఖ్ ఇస్తే అది నెరవేరదు. (అంటే చట్టం ప్రకారం భార్య వేరుకాదు.)

❁ తలాఖ్ ఇచ్చే వ్యక్తి వయోజనుడయి ఉండాలి.

"ముగ్గురు వ్యక్తులను (పరలోకంలో) విచారించడం జరగదని దైవప్రవక్త (సల్లం) తెలిపారు. ఒకడు, నిద్రపోయేవాడు మేల్కొనంతవరకు. రెండోవాడు, బాలుడు యుక్త వయస్సుకు రానంతవరకు. మూడోవాడు, బుద్ధిజ్ఞానాలు మందగించినవాడు స్పృహలోకి రానంతవరకు." (ఇబ్నెమాజ)

❁ రుతుస్రావం ఆగిపోయి స్నానం చేసిన తరువాతనే స్త్రీకి తలాఖ్ ఇవ్వాలి.

❁ తలాఖ్ ఇవ్వడానికి కనీసం ఇద్దరు ముస్లిం పురుషులు సాక్షులుగా ఉండాలి. ఇద్దరి సాక్ష్యం లేకుండా తలాఖ్ సరికాదు. ("మీలో న్యాయం పాటించే ఇద్దర్ని సాక్షులుగా పెట్టుకోండి. (వారు) దేవుని కోసం ఉన్నదిఉన్నట్లు సరిగ్గా సాక్ష్యమివ్వాలి."-ఖుర్ఆన్.65:2)



సాధారణంగా దంపతుల మధ్య పరస్పర అవగాహన, ప్రేమానురాగాలలో ఏదైనా లోపం కలిగినప్పుడు లేదా పరస్పర విరుద్ధస్వభావాలు ఉన్నప్పుడు తలాఖ్ సమస్య వస్తుంది. అయితే భార్యభర్తలిద్దరూ కీచులాటలు లేకుండా అన్యోన్యంగా సంసారం సాగిస్తున్నప్పటికీ వారిలో ఎవరైనా ధార్మిక, నైతిక విలువల్ని కాలరాస్తుంటే వారి తల్లిదండ్రులకు వారిని విడదీసే హక్కుంది.

హజ్రత్ ఉమర్ (రజి) కుమారుడు అబ్దుల్లా (రజి)కు ఒక భార్య ఉండేది. ఆమెను ఆయన ఎంతో ప్రేమిస్తుండేవారు. కాని హజ్రత్ ఉమర్ (ర)కు ఆమె చేసే కొన్ని చేష్టలు నచ్చేవికావు. అందువల్ల ఆమెకు విడాకులివ్వమని కొడుకును ఆదేశించారు ఆయన. కాని కొడుకు అబ్దుల్లా (రజి) అందుకు నిరాకరించారు. హజ్రత్ ఉమర్ (రజి) ఈ విషయాన్ని దైవప్రవక్త (సల్లం) దృష్టికి తీసికెళ్ళారు. అప్పుడు దైవప్రవక్త (సల్లం) "అబ్దుల్లా! నీ భార్యకు విడాకులిచ్చేయి" అని ఆజ్ఞాపించారు. (తిర్మిజి)

హజ్రత్ అబూదర్దా (రజి) దగ్గరకు ఒకతను వచ్చి "నా తల్లి నా భార్యకు విడాకు లిచ్చేయమని నన్ను వత్తిడి చేస్తోంది. దీనికి మీ సలహా ఏమిటో చెప్పండి" అని అన్నాడు. దానికి హజ్రత్ అబూదర్దా (రజి) సమాధానమిస్తూ "నేను దైవప్రవక్త (సల్లం) నోట విన్న మాటనే నీకు చెబుతాను. 'తల్లిదండ్రులు స్వర్గద్వారాలలో మధ్య ఉండే ద్వారాలు వంటి వారు' అని ప్రవచించారాయన. ఇప్పుడు నీ ఇష్టం, ఆ ద్వారాలను కాపాడుకుంటావో లేక నాశనం చేసుకుంటావో నీవే నిర్ణయించుకో" అని అన్నారు. ఆ వ్యక్తి దైవప్రవక్త (సల్లం) ప్రవచనం విని తన భార్యకు విడాకులిచ్చేశాడు. (తిర్మిజి)

దైవప్రవక్త (సల్లం) బోధించిన మరో హితోక్తి కూడా ఇక్కడ ఎంతో గమనార్హమైనది. ఆయన ఇలా అన్నారు: "భార్య దుర్నడతగల స్త్రీ అని తెలిసి కూడా విడాకులు ఇవ్వకుండా ఆమెను అలాగే దగ్గర పెట్టుకునేవాడు స్వర్గంలో ప్రవేశించడు." (అహ్మద్)

# 67. "ఖులా" (స్త్రీలిచ్చే విడాకులు)

ఇస్లాం పరిభాషలో పురుషుడు స్త్రీకి ఇచ్చే విడాకుల్ని "తలాఖ్" అని, స్త్రీ పురుషుని కిచ్చే విడాకుల్ని 'ఖులా' అంటారు. అంటే వదిలేయడం, విడిపోవడం, వేరుపడటం అనే అర్థాలు ఉన్నాయి. షరీఅత్‌పరిభాషలో ఖులా అంటే స్త్రీ తన భర్తను వదిలేయడం లేక భర్తనుండి వేరు పడటం అని అర్థం. విడాకుల విషయంలో పురుషునికి ఎంత అధికారముందో స్త్రీకి కూడా అంతే అధికారముంది. అయితే భార్య ఇచ్చేసిన విడాకుల్ని భర్త ఆమోదించవలసి ఉంటుంది.

"సాధారణంగా స్త్రీలపై పురుషులకు ఎలాంటి హక్కులున్నాయో న్యాయపరంగా పురుషులపై స్త్రీలక్కూడా అలాంటి హక్కులే ఉన్నాయి. కాకపోతే పురుషులకు స్త్రీలపై ఒక మెట్టు ఆధిక్యత ఉంది. దేవుడు శక్తిమంతుడు, వివేచనాపరుడు." (ఖుర్ఆన్-2:228)

❁ భార్యను వదిలేయడానికి భర్త ఆమెకిచ్చే విడాకుల్ని తలాఖ్ అంటారు. భర్త నుండి విడిపోవడానికి భార్య అతనికిచ్చే విడాకుల్ని ఖులా అంటారు.

❁ స్త్రీ బహిష్టు, ప్రసూతి మైల, వీర్యస్ఖలనం లాంటి అపరిశుద్ధావస్థలో ఉన్నప్పుడు భర్త ఆమెకు తలాఖ్ ఇవ్వకూడదు. కాని స్త్రీ అలాంటి అపరిశుద్ధావస్థలో ఉన్నప్పటికీ ఆమె తన భర్తకు ఖులా ఇవ్వచ్చు.

❁ భర్త తలాఖ్ ఇచ్చినప్పుడు దానికి ఇతరులెవరి ఆమోదం అవసరం లేదు. భార్య ఖులా ఇచ్చినప్పుడు దానికి ఆమె భర్త ఆమోదం ఉండాలి.

❁ భర్త తలాఖ్ ఇస్తే లోగడ తానిచ్చివున్న మహర్ ధనం భార్య నుండి వాపసు తీసుకోకూడదు. భార్య ఖులా ఇస్తే భర్త నుండి తీసుకున్న మహర్ ధనం అతనికి వాపసు చేయవలసి ఉంటుంది. (ఖుర్ఆన్-2:229)

అయితే ఇమామ్ అబూహనీఫా (రహ్మలై) అభిప్రాయం ప్రకారం భర్త ఖులా విషయంలో భార్యను వేధిస్తూ వత్తిడి చేసి ఆమె నుండి నష్టపరిహారం వసూలు చేయడం అధర్మం (హరాం) అవుతుంది. దానికి ఈ క్రింది ఖుర్ఆన్ సూక్తులే ఆధారం:

" "మీరామెకు (మహర్ లేదా ఇతర కానుకల రూపంలో) ఇచ్చిన వస్తువులలో కొంతైనాసరే, వాపసు తీసుకోవడం మీకు ధర్మసమ్మతంకాదు." (2:229)

" "విశ్వాసులారా! బలవంతంగా స్త్రీల (ఆస్తి)కి వారసులై పోవడం మీకు ధర్మ సమ్మతంకాదు. అలాగే మీరు మీ భార్యలకిచ్చిన మహర్‌లో కొంతభాగం కాజేసే ఉద్దేశ్యంతో వారిని వేధించడం కూడా మీకు భావ్యంకాదు." (4:19)

" "మీరామెపై నీలాపనిందలు వేసి, మరీఅంత అన్యాయంగా దాన్ని తిరిగి తీసుకుంటారా? (ఎంత సిగ్గుచేటు!) మీరిద్దరు ఒకరి ద్వారా మరొకరు సుఖం అనుభవించారు. ఆమె మీదగ్గర (వివాహం ద్వారా) గట్టి వాగ్దానం తీసుకుంది. అలాంటప్పుడు మీరామె ధనాన్ని బలవంతంగా ఎలా తీసుకుంటారు?" (4:21)

## భార్య విడాకుల్ని భర్త ఆమోదించాలా?

భార్య ఇచ్చే (ఖులా) విడాకులకు భర్త ఆమోదం ఉండాలనడానికి ముఖ్యంగా మూడు కారణాలు ఉన్నాయి:

1-ఇస్లాం విడాకుల్ని ధర్మసమ్మతించింది కాని, దాన్ని ప్రోత్సహించలేదు. ఈ హక్కును మార్గాంతరం లేని పరిస్థితిలో మాత్రమే వినియోగించుకోవాలి. సమాజంలో విడాకులు ఎక్కువై పోవడాన్ని, తరచుగా సంసారాలు కూలిపోవడాన్ని ఇస్లాం ఎన్నటికీ కోరుకోదు. వీటికి అడ్డుకట్ట వేయడానికే ఇస్లాం విడాకుల హక్కును మౌలికంగా పురుషునికి ఇచ్చింది. ఈ హక్కును వినియోగించే ముందు అతను అన్ని విధాలా క్షుణ్ణంగా ఆలోచించుకోవలసి ఉంటుంది.

ఉదాహరణకు- పెళ్లిపెటాకుల కోసం పురుషుడు చాలా డబ్బు భరించవలసి వస్తుంది. మహర్ పైకం చెల్లించవలసి ఉంటుంది. గడువు (ఇద్దత్) కాలంలో విడాకులు తీసుకున్న భార్య పోషణ, వసతి ఖర్చులు భరించవలసి ఉంటుంది. రెండోపెళ్ళి చేసుకోవాలంటే ఆర్థికంగా అనేక ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుంది. ఇన్ని ఖర్చులుండగా అతను విడాకుల హక్కును అంత సులువుగా ఎలా వినియోగించగల్గుతాడు? స్త్రీ మీద ఇన్ని బాధ్యతలు ఉండవు గనక ఆమె విడాకుల హక్కును పురుషునికంటే సులభంగా వినియోగించుకో గలుగుతుంది. అందుకే ఇస్లాం తలాఖ్ హక్కును స్త్రీకి ఇవ్వకుండా పురుషునికి ఇచ్చింది.

2-విశ్వపాలకుడు పిల్లలపెంపకం లాంటి అతిముఖ్యమైన, సున్నితమైన బాధ్యతను స్త్రీ మీద మోపాడు. ఇలాంటి బాధ్యత నెరవేర్చాలంటే సున్నితమైన మనస్తత్వం, తీవ్రమైన భావోద్రేకాలు, సత్వర చర్యలకై వేగిరపాటు మొదలైన లక్షణాలు ఎంతో అవసరం. ఈ లక్షణాలు



పురుషునికన్నా స్త్రీలోనే ఎక్కువ ఉన్నాయి. పిల్లవాడికి ఎప్పుడు ఏమవసరం వస్తుందోనని ఆమె కనిపెట్టుకొని ఉంటూ ఏదైనా అవసరం రాగానే తక్షణమే దాన్ని తీర్చడానికి ఆమె ఎంతో ఆరాటపడుతుంది. ఒకవేళ విడాకులహక్కు స్త్రీకి ఇస్తే పిల్లల పెంపకానికి, వారి సుశిక్షణకు ఎంతో ప్రయోజనకరమైన ఈ లక్షణాలు విడాకులహక్కు వినియోగంలో నష్టపోతాయి.

3-పురుషుడు స్త్రీకి మహర్ చెల్లించడంతో పాటు ఆమె పోషణ, మానమర్యాదల పరిరక్షణ బాధ్యతలు స్వీకరించి ఆమెపై యాజమాన్య హక్కులు సంపాదించాడు. ఎంతో ఖర్చుపెట్టి, మరెంతో బాధ్యత తీసుకొని తన సొంతం చేసుకున్న ఒక విలువైన వస్తువు తన అనుమతి లేకుండా తనను వదిలేసి వేరేచోటికి పోవడాన్ని ఏ మనిషైనా సహించగలడా? సహించలేడు. కాబట్టి ఆ వస్తువు తన నుండి విడిపోవడానికి అతని అనుమతి తప్పక కావలసిఉంటుంది.

## వేధించే భర్త నుండి విముక్తి మార్గమే "ఖులా"

భర్త తన భార్యకు విడాకులు ఇవ్వకుండా వేధిస్తుంటే, అతని కబంధహస్తాల నుంచి ఆమెను విముక్తి చేయడానికి ఇస్లామీయ న్యాయస్థానికి అధికారం ఉంది. భర్త విడాకులివ్వడానికి నిరాకరిస్తే న్యాయస్థానం వివాహవిచ్ఛేదం చేసి స్త్రీని అతని నుండి శాశ్వతంగా వేరుచేస్తుంది.

రెండవ ఖలీఫా హజ్రత్ ఉమర్ (ర) దగ్గరకు ఒక స్త్రీ తనభర్త వ్యవహారం తీసుకొచ్చి అతని నుండి తనకు విడాకులు ఇప్పించమని అడిగింది. హజ్రత్ ఉమర్ (రజి) ఆమెకు సహనం వహిస్తూ భర్తతో కలసి ఉండమని నచ్చజెప్పారు. కాని ఆమె అందుకు అంగీకరించ లేదు. అప్పుడు హజ్రత్ ఉమర్ (రజి) ఆమెను ఒక ఇంట్లో ఉంచి, ఆ ఇంట్లో కసువు నింపి తలుపులు మూయించారు. ఆ విధంగా మూడు రోజులు ఉంచిన తరువాత "ఇప్పుడు నీ పరిస్థితి ఎలా ఉంది?" అని ప్రశ్నించారు.

దానికా మహిళ "దైవసాక్షి! నాకు ఈ మూడు రాత్రుళ్ళలోనే కాస్తంత సుఖం లభించింది" అన్నది. హజ్రత్ ఉమర్ (రజి) ఈమాట విని ఆమె భర్తను "ఈమె చెవిపోగులైనా సరే తీసుకొని ఈమెకు విడాకులిచ్చేయి" అని ఆదేశించారు. (కష్ఫుల్ నామ)

ఖలీఫా హజ్రత్ ఉస్మాన్ (రజి) కాలంలో హజ్రత్ రబీ బిన్త్ మౌజ్ బిన్ ఇఫ్రా (రజి) తన దగ్గరున్న ధనమంతా తీసుకొని తనకు విడాకులివ్వమని భర్తను ఎంతగానో ప్రాధేయపడ్డారు. కాని ఆ భర్త ఆమెకు విడాకులివ్వడానికి నిరాకరించాడు. అప్పుడామె ఈ వ్యవహారం ఖలీఫా దృష్టికి తీసికెళ్ళారు. ఖలీఫా హజ్రత్ ఉస్మాన్ (రజి) ఆమె భర్తను పిలిపించి "ఈమె జడకుప్పె సైతం తీసుకొని విడాకులిచ్చేయి" అని ఆజ్ఞాపించారు. (ఫత్హుల్‌బారి)

దైవప్రవక్త (స) కాలంలో "ఖులా"ను గురించి హజ్రత్ సాబిత్ బిన్ ఖైస్ (రజి) ఉదంతం చాలా ప్రసిద్ధికెక్కింది. ఆయన భార్యలలో జమీలా (రజి) బిన్త్ అబీబిన్ సలూల్ అనే ఆమె తన భర్తను గురించి దైవప్రవక్త (స)కు ఇలా ఫిర్యాదు చేశారు:

"దైవప్రవక్తా! నన్ను ఆయనతో ఏ విషయమైనా సరే ఎన్నటికీ కలపజాలదు. నేను నా ముసుగు పైకెత్తి చూస్తే ఆయన కొందరు వ్యక్తులతో కలసి వస్తున్నారు. వారిలో అందరికన్నా ఆయన నల్లగా, పొట్టిగా, వికృతంగా కన్పించారు." (ఇబ్నెజరీర్). "దైవసాక్షి! మత విషయంలోగాని, శీలంలోగాని ఆయన్ని నేను శంకించడం లేదు. అయితే నాకు

ఆయన వికృతరూపం నచ్చలేదు." (ఇబ్నెజరీర్). "దైవసాక్షిగా చెబుతున్నాను. నాకు దేవుని పట్ల భయమే గనక లేకపోయివుంటే, నా దగ్గరకు వచ్చినప్పుడు నేనతని ముఖమ్మీద ఊసే దాన్ని." (ఇబ్నెజరీర్)

దైవప్రవక్త (స) ఈమాట విని "సరే, అతను నీకు (మహర్‌గా) ఇచ్చిన తోట తిరిగివ్వ గలవా?" అనడిగారు. దానికామె "ఆ, అతనింకా ఎక్కువఅడిగినా ఇవ్వగలను" అన్నారు. "ఎక్కువ అక్కరలేదు. అతను ఇచ్చిన తోట తిరిగిచ్చేయి చాలు" అని చెప్పారు దైవప్రవక్త (స). ఆ తర్వాత ఆయన దాన్ని ఒప్పుకోవలసిందిగా హజ్రత్ సాబిత్ (రజి)ని ఆదేశించారు.

అదేవిధంగా హజ్రత్ సాబిత్ బిన్ ఖైస్ (రజి) రెండవ భార్య హబీబా బిన్త్ సుహైల్ అన్సారియా (రజి) కూడా దైవప్రవక్త (స) దగ్గరికి వచ్చి భర్త రూపురేఖలు తనకు నచ్చ లేదని, తనకు దైవభీతి లేకపోయివుంటే అతని ముఖమ్మీద ఊసేదాన్నని ఫిర్యాదు చేశారు. దైవప్రవక్త (స) ఆమెకు కూడా విడాకులు ఇప్పించారు. (ఇబ్నెమాజ)

భర్త తనకు తాను విడాకులు (తలాఖ్) ఇస్తే తాను భార్యకు ఇచ్చిన మహర్‌ను వదులుకోవలసిందే. అంతేకాదు, భర్త పెట్టే బాధలు భరించలేక భార్య విడాకులు (ఖులా) కోరినప్పుడు కూడా అతను మహర్‌ను తిరిగి తీసుకోవడం అధర్మమే అవుతుంది.

"అప్పుడు మీరామెకు (మహర్ లేదా ఇతర కానుకల రూపేణ) ఇచ్చిన వస్తువులలో కొంతైనాసరే, వాపసు తీసుకోవడం ధర్మసమ్మతం కాదు. ఒకవేళ దంపతులు దైవనిర్ణీత పరిమితులకు కట్టుబడి ఉండలేమని అనుకుంటే, అది వేరే విషయం." (ఖుర్ఆన్-2:229)

వివాహబంధం త్రెంచి భార్యాభర్తల్ని వేరుచేసే మరో సాధనాన్ని **తఫ్రీఖ్** (వివాహవిచ్ఛేదం) అంటారు. వివాహవిచ్ఛేదం చేసే అధికారం ఖాజీకి లేదా ఇస్లామీయ న్యాయస్థానానికి మాత్రమే ఉంటుంది. ఇవి రెండూ లేనిచోట్ల ధర్మశాస్త్రం తెలిసిన ముస్లింపెద్దలు ఈపని చేయవచ్చు.

వివాహవిచ్ఛేదం నిర్ణయం తీసుకోవడానికి కొన్ని ప్రత్యేక కారణాలున్నాయి. ఉదాహరణకు: భర్త తన భార్య లైంగికేచ్ఛ తీర్చలేని అశక్తుడయి ఉండటం; ఒకవేళ శక్తి ఉన్నా ఏదైనా భయంకరమైన వ్యాధికి గురయి ఉండటం; పిచ్చివాడయి పోవడం; భార్య పోషణభారం వహించలేక పోవడం; భార్య బాగోగులను పట్టించుకోకుండా ఆమెను పూర్తిగా విస్మరించడం; ఎక్కడికైనా పత్తాలేకుండా పోవడం. ఈ కారణాలలో ఏదొక్కటి ఉన్నా సరే ఖాజీ (న్యాయాధికారి) వివాహవిచ్ఛేదం దరఖాస్తును ఆమోదించి భార్యాభర్తలను వేరు చేయగలడు.

అలాగే భార్య ఉన్మత్తురాలైపోతే లేదా సంభోగానికి యోగ్యంకాని వ్యాధికి గురయితే లేదా సంభోగిస్తే ఆ వ్యాధి భర్తకు సంక్రమించే ప్రమాదం ఉంటుందని డాక్టర్ సర్టిఫై చేస్తే భర్త కూడా వివాహవిచ్ఛేదం కోసం ఖాజీ ముందు దరఖాస్తు పెట్టుకోవచ్చు.

## అపనిందలు, ఆరోపణలను గురించి ప్రవక్త తీర్పులు

"శీలవతులైన స్త్రీలపై అపనింద మోపి, దానికి నలుగురు సాక్షులు తీసుకురాలేని వారిని ఎనభై కొరడాదెబ్బలు కొట్టండి. అటువంటి వ్యక్తులు చెప్పే సాక్ష్యాన్ని ఇక ఎన్నటికీ స్వీకరించకండి. వారసలు దుర్జనులు. అయితే ఈనిర్వాకం తర్వాత పశ్చాత్తాపంతో దైవాన్ని వేడుకొని తమ నడవడికను సరిదిద్దుకున్నవారు మాత్రం దుర్జనులుగా పరిగణించబడరు. (అలాంటివారి విషయంలో) దేవుడు క్షమాశీలి, దయామయుడు." (ఖుర్ఆన్-24:4,5)



"శీలవతులైన అమాయక ముస్లిం మహిళలపై లేనిపోని అపనిందలు మోపేవారు ఇటు ప్రపంచంలోనూ, అటు పరలోకంలోనూ శాపగ్రస్తులవుతారు. వారికోసం కఠినాతి కఠిన శిక్ష కాచుకొని ఉంది." (ఖుర్ఆన్-24:23)

"ఇలా అపనిందలు మోపేవారు తమ నోళ్ళు, కాళ్ళు, చేతులే తమ అకృత్యాల్ని గురించి సాక్ష్యమిచ్చే రోజొకటి వస్తుందన్న సంగతి మరచిపోకూడదు. ఆరోజు దేవుడు వారి అర్హతను బట్టి వారికి పూర్తిప్రతిఫలం ఇస్తాడు. అప్పుడు తెలుస్తుంది వారికి దేవుడే సత్యమని, దేవుడే నిజాన్ని నిజంచేసి చూపేవాడని." (ఖుర్ఆన్-24:24,25)

ఈ సూక్తి (24:23) గురించి మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) ఇలా వ్యాఖ్యా నించారు: "పవిత్రురాలైన స్త్రీపై (లేనిపోని) అపనింద వేయడం అంటే వందేళ్ళ సత్కర్మ లను చేజేతులా నాశనం చేసుకోవడమే." (తబ్రాని)

24:4,5 సూక్తులలో శీలవతులైన ముస్లిం మహిళలపై ఎవరైనా అపనింద వేస్తే దానికి వారు నలుగురు సాక్ష్యుల్ని తీసుకురావాలని దేవుడు ఆదేశించాడు. ఈ ఆదేశం ముస్లింలలో అనేక ప్రశ్నలను లేవదీసింది. ఒక స్త్రీ దుర్నడతను చూసి పరపురుషుడు సహనం వహించ గలుగుతాడు. సాక్షుల్ని తీసుకురాలేనివాడు ఆ ప్రస్తావననే ఎత్తడు. కాని స్వయంగా భార్యే ఆ పాడుపనికి పాల్పడటం కళ్ళారా చూసినప్పుడు భర్త ఏం చెయ్యాలి?

అతను నలుగురు సాక్ష్యులను తీసుకురాలేడు. ఒకవేళ ఆమెను హతమార్చితే హంతకుడిగా శిక్షకు గురికావలసి వస్తుంది. సహిస్తే ఆమె మరింత బరితెగించవచ్చు. లేదా ఆ పాడుపని ఒకర్నుండి మరొకరికి నిశ్శబ్దంగా ప్రాకి సంఘంలో అతను తలెత్తుకొని తిరగలేని పరిస్థితి వస్తుంది. పోని విడాకులిచ్చి వదలించుకుంటే ఆమె, ఆమె ప్రియుడు ఏశిక్షకు గురికాకుండా యదేచ్ఛంగా తిరుగుతూ సంఘంలో అశ్లీలతను వ్యాపింపజేస్తారు. పైగా ఆమె కనే అక్రమసంతానం భర్త పాలిట గుదిబండయి పోతుంది.

ఈ ప్రశ్నలు మొదట్లో హజ్రత్ సాద్ బిన్ ఉబాదా (రజి) ముందుకు వచ్చాయి. అప్పుడాయన వ్యాఖ్యానిస్తూ "ఒకవేళ ఇలాంటి వ్యవహారం దురదృష్టవశాత్తు నా ఇంట్లో నా కళ్ళ ముందు జరిగితే నేను సాక్ష్యుల కోసం వెతికే పని చేయకుండా అప్పటికప్పుడు ఖడ్గంతో ఈ సమస్యను పరిష్కరిస్తాను" అని అన్నారు. (బుఖారి, ముస్లిం)

ఆ తరువాత కొన్నాళ్ళకే కొందరు భర్తలు ఇలాంటి వ్యవహారాలు దైవప్రవక్త (స) సన్నిధికి తెచ్చారు. అలాంటి భర్తలలో ఒకతను దైవప్రవక్త (సల్లం) ఆస్థానానికి వచ్చి ఇలా విన్నవించుకున్నాడు: "దైవప్రవక్తా! ఒకవేళ ఎవరైనా తన భార్య పక్కలో పరపురుషుడు ఉండటం చూసినప్పుడు, ఆ సంగతి అతని నోట వెలువడితే మీరు అతనికి అపనింద శిక్ష విధిస్తారు. ఆమెను చంపేస్తే మీరతనిపై హత్యానేరం మోపి అతడ్ని హతమార్చుతారు. మిన్నకుండిపోతే లోలోన మండిపోతూ బాధపడతాడు. అలాంటి పరిస్థితిలో అతనేం చేయాలి?" దైవప్రవక్త (స) ఈమాట విని "దేవా! ఈ సమస్యను నీవే పరిష్కరించాలి" అని దైవాన్ని ప్రార్థించారు. (బుఖారి, ముస్లిం)

అయితే ఈ సమస్యకు సంబంధించిన దైవాజ్ఞ రాకపూర్వమే హజ్రత్ హిలాల్ బిన్ ఉమయ్య (రజి) వచ్చి తాను కళ్ళారా చూసిన తనభార్య నిర్వాకం గురించి దైవప్రవక్త

(స) ముందు ఏకరవుపెట్టుకున్నారు. దైవప్రవక్త (స) ఈమాట విని "సాక్ష్యం తీసుకురా. సాక్ష్యం తీసుకురాలేకపోతే నీకు అపనింద శిక్ష విధించడం జరుగుతుంది" అన్నారు. అక్కడే కూర్చున్న ఇతరముస్లింలు ఈమాట విని తీవ్రఆందోళన వ్యక్తపరిచారు. హజ్రత్ హిలాల్ (రజి) ఏమాత్రం కంగారుపడకుండా "మిమ్మల్ని ప్రవక్తగా నియమించి పంపిన దైవసాక్షిగా చెబుతున్నాను. నేను నాకళ్ళారా చూసి, చెవులారా విన్న సంఘటనను మీ దృష్టికి తెస్తున్నాను. నా విషయంలో దేవుడు నా వీపును కాపాడే ఆదేశం అవతరింపజేస్తా డని నాకు పూర్తి నమ్మకం ఉంది" అన్నారు. అప్పుడీ సూక్తులు అవతరించాయి:

"ఇక భార్యలపై అపనిందమోపిన భర్తలు, దానికి తాముతప్ప మరెవరూ సాక్షులు లేని పక్షంలో (ఇలా చేయవలసిఉంటుంది:) వారిలో ఒకరు నాలుగుసార్లు దేవుని మీద ప్రమాణంచేసి తన ఆరోపణ నిజమేనని సాక్ష్యం చెప్పాలి. అయిదోసారి తన ఆరోపణ అబద్ధమయితే తనపై దేవుని అభిశాపం పడుగాకని పలకాలి. అలాగే (నిందితురాలైన) స్త్రీ కూడా నాలుగు సార్లు దేవుని మీద ప్రమాణం చేసి అతని ఆరోపణ అబద్ధమని సాక్ష్యం ఇవ్వాలి. అయిదో సారి, అతని ఆరోపణ నిజమయితే తనపై దైవాగ్రహం విరుచుకుపడు గాకని పలకాలి. ఈవిధంగా ఆమెకు శిక్ష తప్పుతుంది." (ఖుర్ఆన్-24:6-9)

ఈ సూక్తులు అవతరించిన తరువాత దైవప్రవక్త (స) వాటి ప్రకారం తీర్పు చేయడానికి హజ్రత్ హిలాల్ బిన్ ఉమయ్య (రజి)ని, ఆయన భార్యను పిలిపించారు. వారిద్దరికి ఈ సూక్తుల్లోని దైవాజ్ఞ విన్పించి "బాగా ఆలోచించుకోండి. ఇహలోక యాతన కంటే పరలోక యాతన చాలా కఠినంగా ఉంటుంది" అని అన్నారు.

హజ్రత్ హిలాల్ ఈమాట విని "ఈమెపై నేను నిజమయిన నిందనే మోపాను" అన్నారు. ఆయన భార్య "ఇది పచ్చిఅబద్ధం" అన్నది. దైవప్రవక్త (స) వారిద్దరి మాటలు విన్నాక "ఇప్పుడు మీరిద్దరూ ప్రమాణం చేయాలి" అని ఆదేశించారు.

ఈ ఆదేశం వినగానే ముందుగా హజ్రత్ హిలాల్ (రజి) లేచి ఖుర్ఆన్ ఆజ్ఞ ప్రకారం ప్రమాణం చేయడం ప్రారంభించారు. ప్రమాణం సందర్భంలో దైవప్రవక్త (స) "మీరిద్దరిలో ఒకరు తప్పకుండా అబద్ధీకులని దేవునికి తెలుసు. మరి మీరిద్దరిలో ఎవరైనా చేసిన తప్పుకు పశ్చాత్తాపపడతారా?" అని మాటిమాటికి అడిగేవారు.

హజ్రత్ హిలాల్ (రజి) అయిదవ సారి ప్రమాణం చేయడానికి ముందు సభికుల్లో కొందరు ఆయనతో "హిలాల్! దైవానికి భయపడు. పరలోక యాతన కంటే ఇహలోక యాతన చాలా తేలిగ్గా ఉంటుంది. అయిదో సారి ప్రమాణం నీకు యాతన తెచ్చి పెడ్తుంది" అని అన్నారు. దానికాయన సమాధానమిస్తూ "ప్రపంచంలో నా వీపును కాపాడిన దేవుడు పరలోకంలో కూడా నన్ను (నరక)యాతన నుండి కాపాడుతాడు" అని అన్నారు. ఈమాట చెప్పి ఆయన అయిదో సారి కూడా ప్రమాణం చేశారు.

తరువాత ఆయన భార్య కూడా లేచి ప్రమాణం చేయడం ప్రారంభించింది. అయిదో సారి ప్రమాణం చేయడానికి ముందు సభికులు ఆమెతో కూడా "దైవానికి భయపడు. పరలోక యాతన కంటే ప్రపంచయాతన భరించడం చాలా తేలిక. ఈ



అయిదో సారి ప్రమాణం నీపై దైవశిక్ష పడటానికి కారణమవుతుంది" అని అన్నారు. ఈ మాట వినగానే ఆ స్త్రీ ఓ క్షణం ఆగి సందిగ్ధంలో పడిపోయింది. దాంతో జనం ఇక ఆమె చేసిన తప్పు ఒప్పుకుంటుందని తలచారు. కాని ఆమె సందిగ్ధం నుంచి తేరుకొని "నేను శాశ్వతంగా నా తెగవాళ్ళను అవమానపరచలేను" అని అన్నది. ఆ తరువాత ఆమె అయిదవ సారి కూడా ప్రమాణం చేసింది.

ఆ తర్వాత దైవప్రవక్త (స) వివాహవిచ్ఛేదం చేసి వారిద్దరిని వేరుచేయించారు. అప్పుడాయన ఇలా అన్నారు: "ఈమె(కడుపులోని) పిల్లవాడు తండ్రి కొడుకుగా కాకుండా తల్లి కొడుకుగా పరిగణించబడతాడు. ఇకనుండి ఈమెపై గాని, ఈమె పిల్లవాడిపై గాని నిందవేయడానికి ఎవరికీ అధికారం లేదు. ఈమెపై లేదా ఈమె కొడుకుపై నిందవేసే వారు ఖజఫ్ (అపనింద) శిక్షకు అర్హులవుతారు. ఈమె తలాఖ్ తీసుకోవడంగాని, వితం తువయి పోవడంగాని జరగక ముందే భర్త నుండి వేరుచేయబడుతోంది గనక ఇద్దత్ కాలంలో ఆశ్రయం, పోషణఖర్చులు పొందడానికి ఈమెకు ఎలాంటి హక్కులేదు."

తీర్పు ముగిసిన తరువాత దైవప్రవక్త (సల్లం) సభికులను ఉద్దేశించి మాట్లాడుతూ "ఈమె ప్రసవించిన తరువాత పిల్లవాడి రూపురేఖలు పరిశీలించండి. ఒకవేళ పిల్లవాడిలో హిలాల్ పోలికలుంటే హిలాల్ కొడుకు అవుతాడు; నిందితుడి (నిందితురాలి ప్రియుడి) పోలికలుంటే అతని కొడుకే అవుతాడు" అని అన్నారు. కొంతకాలానికి ఆ స్త్రీ ప్రసవిం చింది. చూస్తే పిల్లవాడిలో నిందితురాలి ప్రియుడి పోలికలే కన్పించాయి. దైవప్రవక్త (సల్లం) ఈ సంగతి విని "ప్రమాణాల పద్ధతి లేకపోయి ఉంటే (లేక ముందే దైవగ్రంథం తీర్పు చేసివుండకపోతే నేనీ స్త్రీ పట్ల చాలా కఠినంగా వ్యవహరించేవాడ్ని" అని అన్నారు.

(ఈ సంఘటన సుప్రసిద్ధ హదీసు గ్రంథాలన్నిటిలోనూ పేర్కొనబడింది.)

బుఖారి, ముస్లిం, అబూదావూద్, నసాయి వగైరా హదీసు గ్రంథాలలో సహెల్ బిన్ సాద్ సాదీ, ఇబ్నెఉమర్ (రజి)లు ఉల్లేఖించిన కథనాల ప్రకారం ఉవైమర్ (రజి)ని, ఆయన భార్యను ప్రమాణం చేయించడానికి మసీదుకు పిలిపించడం జరిగింది. ప్రమాణం చేయించే ముందు దైవప్రవక్త (సల్లం) వాళ్ళిద్దర్నీ హెచ్చరిస్తూ "మీరిద్దరిలో ఒకరు అబద్ధీకులని దేవునికి బాగా తెలుసు. మరి మీలో ఎవరైనా పశ్చాత్తాపపడుతూ తప్పు ఒప్పుకుంటారా?" అని అడిగారు. కాని వారిద్దరిలో ఎవరూ తప్పు ఒప్పుకోలేదు. అంచేత దైవప్రవక్త (సల్లం) ఇద్దరి చేతా ప్రమాణం చేయించారు.

ప్రమాణం చేసిన తరువాత ఉవైమర్ (రజి) మాట్లాడుతూ "దైవప్రవక్తా! ఇప్పుడు నేనీ స్త్రీని నా దాంపత్యంలో కొనసాగనిస్తే నేను అబద్ధీకుణ్ణవుతాను" అని అన్నారు. ఈ మాట చెప్పి వెంటనే ఆయన దైవప్రవక్త (సల్లం) అనుమతి తీసుకోకుండానే తనభార్యకు ఒకేసారి మూడు తలాఖులు ఇచ్చివేశారు.

దైవప్రవక్త (సల్లం) ఆయనిచ్చిన విడాకుల్ని ఆమోదించి భార్యాభర్తల మధ్య తఫ్రీఖ్ (వివాహవిచ్ఛేదం) చేయించారు. ఆ సందర్భంలో ఆయన మాట్లాడుతూ "ఇది పరస్పరం ప్రమాణం చేసే దంపతుల మధ్య చేయించే వివాహవిచ్ఛేదం" అని అన్నారు.

ఈ హదీసును ఉల్లేఖించిన సహెల్ బిన్ సాద్ (రజి) దీనిపై వ్యాఖ్యానిస్తూ "ఇలా ప్రమాణం చేసే దంపతుల మధ్య వివాహవిచ్ఛేదం చేయించడం ప్రవక్త సంప్రదాయమై పోయింది. వివాహవిచ్ఛేదం తరువాత ఇక ఎన్నటికీ వారిద్దరు ఏకం కావడానికి వీల్లేదు" అని అన్నారు. ఇంకా ఆయన "అప్పుడా స్త్రీ గర్భవతిగా ఉండింది. ఆ గర్భం తాను చేసింది కాదని ఉవైమర్ అన్నాడు. అందువల్ల పిల్లవాడు తల్లికొడుకుగా పరిగణించడం జరిగింది. ఈవిధంగా ఆ పిల్లవాడు తల్లి ఆస్తికి, తల్లి అతని ఆస్తికి వారసులయ్యేలా సంప్రదాయం ఏర్పడింది" అని కూడా అన్నారు.

మరో ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (స) దంపతుల చేత ప్రమాణం చేయించిన తర్వాత "ఇప్పుడు మీ విచారణబాధ్యత దేవునిపై ఉంది. మీ ఇద్దరిలో ఒకరు తప్పక అబద్ధీకులని దేవునికి తెలుసు" అన్నారు. ఆ తరువాత ఆయన భర్తతో "ఇకనుంచి ఈమె నీకు భార్యగా ఉండదు. కనుక ఈమెపై పెత్తనం చేయడానికి నీకెలాంటి అధికారం లేదు. ఈమెపై ఎలాంటి దుశ్చర్యకైనా పాల్పడేందుకు నీకు హక్కు లేదు"అని అన్నారు.

అప్పుడతను "మరి నా (మహర్) ధనం సంగతేమిటీ?" అని అడిగాడు. దానికి దైవప్రవక్త (సల్లం) "ఆ ధనం తిరిగి తీసుకోడానికి నీకు అధికారం లేదు. ఒకవేళ నీవు చేసిన ఆరోపణ నిజమైనప్పటికీ ఆమె ద్వారా నీవు ధర్మసమ్మతంగా అనుభవించిన దాంపత్యసుఖానికి ఈ ధనం బదులవుతుంది. నీ ఆరోపణ అబద్ధమయితే అది మరింత దూరమయి పోతుంది" అని అన్నారు. (బుఖారి, ముస్లిం)

వేరొక ఉల్లేఖనం ప్రకారం ఒక గ్రామీణీడు వచ్చి "నాభార్య నల్ల పిల్లవాడ్ని కన్నది. (నాకు ఆమెశీలం పట్ల అనుమానముంది. నన్నేం చేయమంటారు?) అని అన్నాడు.

దైవప్రవక్త (సల్లం) ఈమాట విని "నీ దగ్గర ఒంటెలు ఉన్నాయా?" అని అడిగారు. దానికా వ్యక్తి ఉన్నాయన్నాడు. "వాటి రంగు ఎలా ఉంది?" అని అడిగారు దైవప్రవక్త (సల్లం). ఎర్రగా ఉందన్నాడు అతను. "వాటిలో బూడిద రంగు ఒంటెలు కూడా ఉన్నాయా?" అని ప్రశ్నించారు దైవప్రవక్త (సల్లం). ఉన్నాయన్నాడా పల్లెవాసి. "మరి ఆ రంగు ఎక్కడ్నుంచి వచ్చింది?" అని అడిగారు దైవప్రవక్త (సల్లం). "బహుశా వాటి తాత ముత్తాలలో ఎవరి రంగయినా వచ్చి ఉంటుంది" అన్నాడా వ్యక్తి.

"అదే విధంగా నీఈ పిల్లవాడికి కూడా తాతముత్తాలలో ఎవరి రంగయినా వచ్చి ఉంటుంది" అని చెప్పారు దైవప్రవక్త (స). ఇలా ఆ పల్లెవాసికి దైవప్రవక్త (స) పిల్లవాడి సంబంధాన్ని తిరస్కరించడానికి అనుమతి ఇవ్వలేదు. (బుఖారి, ముస్లిం)

స్త్రీ పెళ్ళయిన ఆర్నెల్లకే ప్రసవిస్తే ఎవరికైనా అనుమానం వస్తుంది. కాని గర్భం ధరించి, బిడ్డను కని, పాలుపట్టడానికి ముప్ఫయి నెలలు పడ్తుందని 46:15 సూక్తిలో ఉంది. 2:233 సూక్తిలో తల్లులు తమబిడ్డలకు పూర్తిగా రెండేళ్ళు పాలుపట్టాలని ఉంది. 31:14 సూక్తిలో బిడ్డ పాలువదలడానికి రెండేళ్ళు (24 నెలలు) పట్టిందని ఉంది. దీన్ని బట్టి స్త్రీ కనీసం 6 నెలల్లో గర్భం ధరించి, పూర్తిస్థాయి బిడ్డను కనడం సాధ్యమేనని తెలుస్తోంది. అంచేత షరీఅత్‌వేత్తలు ఏ స్త్రీ అయినా పెళ్ళయిన ఆర్నెల్లకు బిడ్డను కంటే, దాని కారణంగా ఆమె మీద వ్యభిచార నింద మోపడానికి వీల్లేదని నిర్ణయించారు.



ఒక్కోసారి స్త్రీ గర్భధారణ ఆమె భర్త వల్ల ఏర్పడిందో, ప్రియుడి వల్ల ఏర్పడిందో తెలుసుకోవడం సాధ్యం కాదు. భర్త తన భార్య వ్యభిచరిస్తుండగా చూడకపోయినా ఆమె చేష్టలు, ఆమె ప్రియుడి రాకపోకలను బట్టి అతనికి తప్పకుండా అనుమానం వస్తుంది. అలాంటి పరిస్థితిలో అతను **లిఆన్** (ప్రమాణం) చేయలేడు. పుట్టిన బిడ్డను అతను మనస్ఫూర్తిగా స్వీకరించనూ లేడు. మహాఅయితే అతను అనుమానం బలపడిన తర్వాత ఆమెకు విడాకులిచ్చి వదిలించుకోవడానికి మాత్రమే ప్రయత్నిస్తాడు.

అయినా కాన్పు తర్వాత బిడ్డసమస్య అలాగే ఉండిపోతుంది. ఈ రోజుల్లో డి.యన్.ఎ. పరీక్షలొచ్చాయి. వీటి ద్వారా ఈ సమస్య చాలావరకు పరిష్కారం కావచ్చు. అయితే ఒక్కోసారి డి.యన్.ఎ. పరీక్షలు కూడా విజయవంతం కాకపోవచ్చు. అప్పుడు పరిస్థితి ఏమిటి? ఈ సమస్యను దైవప్రవక్త (సల్లం) ఇలా పరిష్కరించారు:

"ఎవరి పడక మీద పుట్టిన శిశువు వారిదే అవుతుంది. వ్యభిచారికి మాత్రం రాళ్ళు (కాచుకొని) ఉంటాయి. (అంటే శిలాశిక్ష పడుతుంది.)" అన్నారు ఆయన. (బుఖారి)

దైవప్రవక్త (స) 'లిఆన్' (ప్రమాణం) గురించి మాట్లాడుతూ ఇలా అన్నారు: "ఎవరైనా స్త్రీ తన భర్త కుటుంబానికి చెందని పిల్లవాడ్ని (అక్రమ సంతానాన్ని) ఆ కుటుంబంలోకి తెచ్చి దూర్చితే ఆమెతో దేవునికి ఎలాంటి సంబంధం ఉండదు. దేవుడు ఆమెను ఎన్నటికీ స్వర్గానికి పంపడు. అలాగే ఎవరైనా పురుషుడు తనవైపు పిల్లవాడు (ప్రేమగా) చూస్తున్నా ఆ పిల్లవాడితో ఉన్న జన్మసంబంధాన్ని నిరాకరిస్తే ప్రళయదినాన దేవుడు అతని వైపు కన్నెత్తి కూడా చూడడు; యావత్తు మానవుల ముందు అతడ్ని అవమానం పాలుజేస్తాడు." (అబూదావూద్, నసాయి. దార్మి)

## అక్రమ పద్ధతులతో ఆలుమగలను విడదీయడం నేరం

దాంపత్యజీవితం మానవసంస్కృతికి మూలాధారం. భార్యాభర్తల మధ్య దాంపత్య జీవితం సవ్యంగా సాగితే సమాజంలో కూడా మంచి సభ్యతా సంస్కృతులు ఏర్పడతాయి. అందులో అపసవ్యత, అపశృతులు చోటుచేసుకుంటే సభ్యతా సంస్కృతులు కూడా వికటిస్తాయి. అందువల్ల అపోహలు, అపార్థాలు, మాయమాటలు, మంత్రతంత్రాలు లేదా మరే అక్రమపద్ధతుల ద్వారానయినా సరే భార్యాభర్తల్ని విడదీయడాన్ని దివ్య ఖుర్‌ఆన్ అవిశ్వాసం (కుఫ్ర్)తో పోల్చింది. యూదుల చరిత్రను ప్రస్తావిస్తూ ఖుర్‌ఆన్‌లో ఈ విధంగా పేర్కొనడం జరిగింది :

"గ్రంథప్రజలలో చాలామంది చిత్తశుద్ధితో సత్యాన్ని విశ్వసించేవారే కాదు. వారి వద్దకు దేవుని వైపు నుంచి ఏ ప్రవక్తయినా వారి గ్రంథాన్ని ధృవీకరిస్తూ వచ్చినప్పుడు వారిలో ఒక వర్గం తనకసలు ఏమీ తెలియనట్లు దైవగ్రంథాన్ని అటకమీద ఎత్తిపెట్టింది. పైగా వారు, సులైమాన్ పాలనాకాలం పేరుతో దయ్యాలు చెప్పే విషయాల్ని పాటించ నారంభించారు. కాని సులైమాన్ ఎన్నడూ సత్యతిరస్కారం జోలికే పోలేదు. జనానికి భూతవిద్య నేర్పుతుండిన ఆ దయ్యాలే సత్యతిరస్కారానికి పాల్పడ్డాయి."

"అంతేకాదు, బాబిల్‌లో హారూత్, మారూత్ అనే ఇద్దరు (మానవాకారంలో వచ్చిన) దైవదూతలపై అవతరించిన విషయాల్ని కూడా వారు పట్టుకువ్రేలాడారు. కాని ఆ దైవ

దూతలు జనానికి ఆ విషయాలు నేర్పేముందు "మేము ప్రజల్ని పరీక్షించడానికి పంప బడినవాళ్ళం మాత్రమే. అంచేత మీరు అవిశ్వాసానికి (అంటే సత్యతిరస్కారానికి) పాల్పడ కండి" అని వారికి స్పష్టంగా చెప్పేవారు. అయినా వారు భార్యాభర్తల్ని విడదీసే ఆ క్షుద్ర విద్యనే నేర్చుకోవడానికి ఉబలాటపడేవారు." (ఖుర్ఆన్-2:100-102)

యూదులు తౌరాత్‌విద్య వదిలేసి భార్యాభర్తలను విడదీసే చేతబడి నేర్చుకోవడానికి ఒడిగట్టారు. ఈ విద్యద్వారా తాము కోరుకున్న స్త్రీని ఆమె భర్త నుండి విడదీసి తమ వైపు తిప్పుకునేవారు. ఇది సత్యతిరస్కారానికి దారితీసే ఘోరపాపమని తెలిసికూడా దాన్ని నేర్చుకోవ డానికే ఉబలాటపడేవారంటే వారు నైతికంగా ఎంత దిగజారిపోయారో ఊహించవచ్చు. వారి నైతికపతనాన్ని బట్టబయలుచేయడానికే దేవుడు యూదులకు ఈ పరీక్ష పెట్టాడు.

ఈ పరీక్ష విభిన్నరూపాలలో మానవుల మధ్య ఇప్పటికీ సాగుతోంది. మానవ షైతాన్ తన అనుచరమూక ద్వారా ఇలాంటి ఉపద్రవాలను, దుష్టకార్యాలను సృష్టిస్తూ ఉంటాడు.

ఒక హదీస్ ప్రకారం ఇబ్లీస్ తన కేంద్రకార్యాలయం నుండి నేల నాలుగుచెరగులా తన అనుచరమూకను పంపిస్తాడు. వారు తిరిగొచ్చి తమతమ నివేదికలు అతనికి సమర్పిస్తారు. తాను ఫలానా ఉపద్రవాన్ని సృష్టించానని ఒకడంటే, తాను ఫలానా ఘన కార్యం చేసివచ్చానని మరొకడు చెబుతాడు. కాని ఇబ్లీస్ ప్రతివాడితో "నువ్వు చేసిందేమీ లేదు" అంటాడు. చివరికి ఒకడు వచ్చి తాను ఒకచోట భార్యాభర్తలను విడదీయించా నని అంటాడు. ఇబ్లీస్ ఈమాట విని సంతోషంతో అతడ్ని గుండెలకు హత్తుకుంటూ "శభాష్, నువ్వు నిజంగా ఘనకార్యమే చేసివచ్చావు" అని అంటాడు. (ఇబ్నెకసీర్)

## 68. జీవనభృతి, మనోవర్తి

"ప్రవక్తా! "మీరు మీ స్త్రీలకు విడాకులివ్వదలిస్తే వారి గడువు (ఆరంభం)లో వారికి విడాకులివ్వండి. గడువుకాలం సరిగ్గా లెక్కపెట్టండి. మీ ప్రభువయిన దేవునికి భయ పడుతూ వ్యవహరించండి. (గడువు కాలంలో) వారు స్పష్టంగా ఏదైనా చెడ్డపని చేస్తే తప్ప వారిని (మీ) ఇండ్ల నుంచి పంపి వేయకండి. వారు కూడా ఇల్లు వదలి వెళ్ళి పోకూడదు. ఇవి దేవుడు నిర్ణయించిన హద్దులు..." (ఖుర్ఆన్.65:1)

"మీ స్త్రీలలో ఎవరైనా రుతుస్రావం పట్ల నిరాశచెందిఉంటే, వారి (గడువు నిర్ణయం గురించి) మీకేదైనా అనుమానం కల్గినప్పుడు వారి గడువు మూడు నెలలు. ఈఆజ్ఞ రుతుస్రావం ఆరంభంకానివారికి కూడా వర్తిస్తుంది. గర్భవతుల విషయానికివస్తే, వారి గడువుకాలం వారు ప్రసవించే వరకు ఉంటుంది." (ఖుర్ఆన్-65:1-4)

ఒకవేళ ఎవరైనా తన భార్యకు బహిష్టురోజుల్లో విడాకులిస్తే అలాంటిస్త్రీ ఇద్దత్ ఆ తర్వాత మూడు రుతుకాలాలు ఉంటుంది. అంటే విడాకులిచ్చిన రుతుకాలం వదలి మరో మూడు రుతుకాలాలు గడచిన తరువాతనే ఆమె ఇద్దత్ గడువు ముగుస్తుంది. గర్భవతి విడాకులుపొందినా, వితంతువయినా ఆమె గడువుకాలం ప్రసవించే వరకే ఉంటుంది. ఆ తరువాత ఆమె మెట్టిల్లు వదలి రెండో పెళ్ళి చేసుకోవచ్చు.

ముస్లిం, బుఖారి హదీసుల ప్రకారం హజ్రత్ సాద్ బిన్ ఖౌలా (రజి) చనిపోయిన



కొన్నాళ్ళ తరువాత (విభిన్న ఉల్లేఖనాలలో పేర్కొన్నదానిని బట్టి నలభై రోజుల లోపు) ఆయన భార్య అస్లమియ్య (రజి) ప్రసవించారు. అప్పుడు ఒకాయన, "(2:234 సూక్తి ప్రకారం) నీవు నాలుగునెలల పదిరోజుల (గడువు)కు ముందు రెండవ వివాహం చేసు కోలే"వని అన్నాడు. హజ్రత్ అస్లమియ్య (రజి) ఈమాట విని దైవప్రవక్త (సల్లం) సన్నిధికి పోయి విచారించారు. దైవప్రవక్త (సల్లం) ఆమెకు జవాబిస్తూ "నీవు ప్రసవించగానే రెండోపెళ్ళికి ధర్మసమ్మతమయి పోతావ"ని చెప్పారు.

"(గడువుకాలంలో) వారిని మీరు నివసించే చోటనే ఉంచండి. ఆచోటు ఎలాంటి దైనా పరవాలేదు. వారిపై వత్తిడి తేవడానికి వారిని వేధించకండి. వారు గర్భవతులైతే ప్రసవించే వరకు వారికోసం ఖర్చుపెట్టండి." (ఖుర్ఆన్-65:6)

"మీలో ఎవరికైనా మరణకాలం ఆసన్నమైనప్పుడు వారిభార్యలు జీవించివుంటే, ఒక ఏడాదిపాటు వారి (పోషణ)ఖర్చులు భరించాలని, ఇంటినుండి వెడలగొట్టరాదని వారు విల్లు రాసిపోవాలి. ఆ స్త్రీలు తమంతటతాము ఇంటి నుండి వెళ్ళిపోయి తమకు నచ్చినపని (పునర్వివాహం) ధర్మసమ్మతంగా చేసుకోదలిస్తే దానికి మీపై ఎలాంటి బాధ్యత ఉండదు. దేవుడు సర్వశక్తిమంతుడు, ఎంతో వివేచనాపరుడు. విడాకులు పొందిన మహిళలక్కూడా సముచిత రీతిలోఎంతో కొంత జీవనభృతి ఇచ్చిపంపాలి. ఇది దైవభీతిపరులు నెరవేర్చవలసిన విధ్యుక్తధర్మం. మీరు విషయం అర్థం చేసుకుంటారని దేవుడు ఈవిధంగా తన ఆజ్ఞల్ని మీకు విడమరచి బోధిస్తున్నాడు." (ఖుర్ఆన్-2:240-242)

ఇది "ఆస్తిపంపకం జరుగుతున్నప్పుడు వారసులుకాని (నిరుపేద) బంధువులు, అనాథలు, అగత్యపరులు వస్తే వారిక్కూడా ఎంతోకొంత ఇచ్చి పంపండి. వారితో మృదువుగా మాట్లాడండి." (4:8) అనే సూక్తిలా అనుమతి మాత్రమేగాని, ఆజ్ఞ కాదు.

మహిళాభ్యుదయానికి అంతరాయం కలగజేస్తున్నవారిని ఖుర్ఆన్ తీవ్రంగా నిరసిస్తోంది. విడాకులు పొందిన స్త్రీ చంటిబిడ్డకు పాలివ్వాలని బిడ్డ తండ్రి అడిగితే బిడ్డ పాలు తాగడం మానేవరకు కనీసం రెండేండ్లయినా తల్లీబిడ్డలు ఇద్దర్నీ పోషించాలని ఖుర్ఆన్ ఆదేశిస్తోంది.

"ఆ తరువాత వారు మీ కోసం (బిడ్డకు) పాలు పట్టవలసివస్తే, వారికి ప్రతిఫలం ముట్టజెప్పండి. మీరు పరస్పరం సంప్రదించుకొని ఇద్దరికీ ఆమోదయోగ్యమైన రీతిగా నిర్ణయం తీసుకోండి. ఒకవేళ (ప్రతిఫలం నిర్ణయంలో) మీరు ఒకరికొకరు ఇబ్బందులు కలిగించుకునే పరిస్థితి ఏర్పడితే మరెవరైనా స్త్రీ చేత బిడ్డకు పాలు పట్టించాలి."

"ధనికుడు తన స్తోమతను బట్టి ఈ పోషణ ఖర్చులు భరించాలి. తక్కువ ఉపాధి ఇవ్వబడిన (పేద)వాడు దేవుడు తనకిచ్చిన దాన్నుంచే ఎంతోకొంత ఖర్చుపెట్టాలి. దేవుడు ఎవరికెంత ఇచ్చాడో అంతకు మించి వారిపై భారం మోపడు. దేవుడు మనిషికి లేమి తరువాత కలిమి కూడా ప్రసాదించవచ్చు." (65:6,7)

"తల్లులు తమ బిడ్డలకు గడువుకాలం పూర్తయ్యేవరకు పాలు పట్టదలచుకుంటే పూర్తిగా రెండు సంవత్సరాలు పాలుపట్టాలి. అప్పుడు బిడ్డతండ్రి ఆమెకు తగిన రీతిలో తిండి, బట్ట సమకూర్చవలసి ఉంటుంది. అయితే వారుభయుల్లో ఏ ఒక్కరిపైనా శక్తికి మించిన భారం

మోపకూడదు. బిడ్డను కన్నందుకు ఇటు తల్లినీ కష్టపెట్టకూడదు; బిడ్డజన్మకు కారకుడయి నందుకు అటు తండ్రినీ వేధించకూడదు."

"బిడ్డకు పాలుపట్టే తల్లిపట్ల బిడ్డతండ్రికి ఎంత బాధ్యత ఉందో అతని వారసుల క్కూడా అంతే బాధ్యత ఉంది. ఒకవేళ తల్లిదండ్రులు ఒకర్నొకరు సంప్రదించుకొని పరస్పరామోదంతో బిడ్డకు పాలు మాన్పించదలచుకుంటే ఎలాంటి తప్పులేదు. అలాగే మీరు మీ పిల్లలకు వేరే స్త్రీల చేత పాలు పట్టించాలనుకున్నా తప్పు లేదు. కాకపోతే పాలుపట్టే వారికి తగిన ప్రతిఫలం ముట్టజెప్పాలి. మీరు దేవునిపట్ల భయభక్తులతో వ్యవహరించాలి." (ఖుర్ఆన్-2:233)

విడాకుల తర్వాత పిల్లలు ఎవరికి చెందుతారు? పిల్లలు ఎక్కువగా తల్లి వైపు మొగ్గుతారా లేక తండ్రి వైపు మొగ్గుతారా? ఇది ఈనాడు కూడా ఒక జటిల సమస్యగా ఉంది. ఈ రోజుల్లో భర్త, భర్త తరపు బంధువులు విడాకులు పొందిన మహిళ నుండి పిల్లల్ని బలవతంగా విడిపించి తీసుకోవడం లాంటి సంఘటనలు మనం చూస్తున్నాము. కాని ఈ సమస్యకు ఇస్లాం సరయిన పరిష్కారం చూపింది. స్త్రీ రెండవ పెళ్ళి చేసుకోనంత వరకు పిల్లలు తల్లి దగ్గర ఉంటారని, రెండవ పెళ్ళి చేసుకున్న తరువాత తండ్రి పంచన చేరుతారని ఒక హదీసు ఉంది.

ఒకతను ఒక పిల్లవాడు కూడా కలిగిన తన భార్యకు విడాకులిచ్చాడు. అప్పుడతను పిల్లవాడ్ని తల్లి నుంచి తీసుకోదలిచాడు. ఇది ఆ స్త్రీకి ఏమాత్రం నచ్చలేదు. ఆమె దైవ ప్రవక్త (సల్లం) సన్నిధికి పోయి "దైవప్రవక్తా! నాగర్భం ఈ పిల్లవాడి పాత్ర; నావక్షం ఇతని నీటితిత్తి; నా ఒడి ఇతని ఊయల. కాని ఇప్పుడితని తండ్రి నాకు విడాకులిచ్చాడు. ఇతడ్ని నా దగ్గర్నుండి లాక్కోవాలని చూస్తున్నాడు" అని ఫిర్యాదు చేసింది. దైవప్రవక్త (సల్లం) ఈమాట విని "నువ్వు రెండవ పెళ్ళి చేసుకోనంతవరకు పిల్లవాడ్ని తీసుకోవడానికి నువ్వే అందరికన్నా ఎక్కువ అర్హురాలవుతావు" అని చెప్పారు. (అబూదావూద్)

వేరొక ఉల్లేఖనంలో దైవప్రవక్త (స) ఒక పిల్లవాడికి తండ్రి దగ్గర ఉండదలచుకుంటే తండ్రి దగ్గర, తల్లి దగ్గర ఉండదలచుకుంటే తల్లి దగ్గర ఉండవచ్చని చెప్పి పిల్లవాడి ఇష్టాయిష్టాలపై వదలిపెట్టారు. అప్పుడా పిల్లవాడు తల్లి దగ్గర ఉంటానని తల్లి చేయి పట్టుకున్నాడు. తల్లి తన కొడుకుని తీసుకొని వెళ్ళిపోయింది. (అబూదావూద్)

## 69. సాధారణ మానవసంబంధాలు

మానవులు ఒకే దేవుని దాసులు కావడంతో పాటు, ఒకే ఆదిమానవుడైన ఆదం (అలై) సంతానం అయిన దృష్ట్యా వారంతా సాధారణ పరిస్థితుల్లో సమానులు. ఇస్లాం దృష్టిలో మానవుల మధ్య ఏదైనా వ్యత్యాసం ఉందంటే అది రెండు విధాలుగా మాత్రమే ఉంది. ఒకటి, లైంగిక పరంగా పురుషులు-స్త్రీలు అనే వ్యత్యాసం. రెండు, విశ్వాసులు-అవి శ్వాసులు అనే వ్యత్యాసం. లైంగికపరంగా స్త్రీలు-పురుషులు అనే తేడా తప్ప పుణ్యార్జనలో మానవులంతా సమానమే.

"మానవులారా! మీ ప్రభువుకు భయపడండి. ఆయన మిమ్మల్ని ఒకే ప్రాణి ద్వారా సృష్టించాడు. అదేప్రాణి నుండి దాని జతను కూడా సృష్టించాడు. తిరిగి వారిరువురి నుండి కోటానుకోట్ల మంది స్త్రీపురుషుల్ని ప్రపంచంలో విస్తరింపజేశాడు. మీరు ఒకరిద్వారా మరొకరు తమ అవసరాలు గడుపుకోవడానికి దేవుని పేరును సాధనంగా చేసుకుంటారు. అలాంటి



దేవునికి భయపడండి. రక్త సంబంధీకులతో మీకేర్పడివున్న సహజ బాంధవ్యాన్ని తెంచకండి. దేవుడు మీ చర్యల్ని ఓకంట గమనిస్తున్నాడన్న సంగతి మరచిపోకండి." (ఖుర్ఆన్-4:1)

"నేను మీలో ఎవరి కర్మలనూ వృధాచేయను. పురుషులయినా, స్త్రీలయినా మీరంతా పరస్పరం ఒకే సృష్టిరాసికి చెందినవారు. నా(ప్రసన్నత) కోసం ఎవరెవరు తమ స్వస్థలాలు వదలివచ్చారో, ఎవరెవరు తమ ఇండ్ల నుండి వెడలగొట్టబడ్డారో, ఎవరెవరు వేధించబడ్డారో, ఎవరెవరు పోరాడారో, (ఆ పోరాటంలో ఎవరెవరు) హతమార్చబడ్డారో వారందరి పొరపాట్లు మన్నించి వారిని సెలయేరులు ప్రవహించే స్వర్గవనాలలో ప్రవేశింపజేస్తాను." ఇదీ దేవుని దగ్గర (వారికి) లభించే ప్రతిఫలం. దేవుని దగ్గరే శ్రేష్ఠమైన ప్రతిఫలం ఉంది. (ఖుర్ఆన్-3:195)

నేరం ఎవరు చేసినా చట్టప్రకారం శిక్ష అందరికీ సమానంగా వర్తిస్తుంది. ఇక్కడ విశ్వాసులు-అవిశ్వాసులు, సజ్జనులు-దుర్జనులు, తమవారు-పరాయివారు అన్న వివక్ష ఉండదు.

"ఎవరైనా ప్రతీకార హత్య(శిక్ష)గా లేక ధరణిపై కల్లోలం రేకెత్తించినందుకు శిక్షగా తప్ప ఏ మనిషినైనా చంపితే అతను యావత్తు మానవాళిని చంపినట్లే. అలాగే ఎవరైనా ఒక మనిషి ప్రాణం కాపాడితే అతను యావత్తు మానవాళిని కాపాడినట్లే." (ఖుర్ఆన్-5:32)

దైవప్రవక్త (స) కాలంలో ఒక ముస్లిం ఓ జిమ్మీని (ముస్లిమేతరుడ్ని) చంపాడు. అందువల్ల దైవప్రవక్త (స) ఆ ముస్లింని వధించమని ఉత్తర్వు జారీచేశారు. ఆ సందర్భంలో ఆయన "ఆ బాధ్యత వహించడానికి అందరికంటే నేనే ఎక్కువ హక్కుదారుడ్ని" అని అన్నారు. (ఇనాయా షరై హదాయా)

హజ్రత్ ఉమర్ (రజి) పాలనాకాలంలో బకర్ బిన్‌వాయిల్ తెగకు చెందిన ఒక ముస్లిం హైరా (ప్రాంతాని)కి చెందిన ఒక జిమ్మీని చంపాడు. అప్పుడు హజ్రత్ ఉమర్ (రజి) హంతకుడ్ని హతుని వారసులకు అప్పగించమని ఆదేశించారు. దాని ప్రకారం హంతకుడ్ని హతుని వారసులకు అప్పగిస్తే వారతడ్ని హతమార్చారు. (బుర్హాన్)

దైవప్రవక్త (స) హితోక్తి: "ఈ మూడు లక్షణాలున్న వ్యక్తి విశ్వాస మాధుర్యం ఆస్వా దిస్తాడు. 1-దేవుడు, దైవప్రవక్త (స) తనకు అందరికన్నా ప్రియతములైఉండాలి. 2-కేవలం దైవప్రసన్నత కోసమే తోటి మనిషిని ప్రేమించాలి. 3-దేవుడు తనను అవిశ్వాస స్థితి నుండి రక్షించిన తర్వాత తిరిగి దాని వైపుకు మరలిపోవడాన్ని తను అగ్నిలో పడటాన్ని ఎంతగా అసహ్యించుకుంటాడో అంతగా అసహ్యించుకోవాలి." (బుఖారీ, ముస్లిం)

హజ్రత్ అబూహురైరా (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ఇలా అన్నారు: ప్రళయదినాన దేవుడు, "నా ఔన్నత్యం ప్రాతిపదికపై పరస్పరం అభిమానించుకున్నవారు ఎక్కడున్నారు? నా (కారుణ్య)ఛాయ తప్ప మరేఛాయా లభించని ఈరోజు నేను వారికి నా నీడపట్టున ఆశ్రయం కల్పిస్తాను" అని అంటాడు. (ముస్లిం)

హజ్రత్ ముఆజ్ (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ఇలా తెలిపారు: దేవుడు ప్రళయ దినాన "నా ఔన్నత్యం ప్రాతిపదికపై పరస్పరం అభిమానించుకున్నవారు ఎక్కడున్నారు? వారికోసం దైవప్రవక్తలు, అమరవీరులు సైతం అసూయ చెందేటటువంటి జ్యోతిర్మయ వేదికలు (సిద్ధంగా) ఉన్నాయి" అని అంటాడు. (తిర్మిజీ)

హజ్రత్ అబూ కరీమా మిఖ్‌దాద్ బిన్ మాదీకరిబ్ (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ఇలా అన్నారు: "మనిషికి తన (తోటి)సోదరుని పట్ల అభిమానముంటే, తాను అతన్ని అభిమానిస్తున్నట్లు అతనికి తెలియజెయ్యాలి." (అబూదావూద్, తిర్మిజీ)

హజ్రత్ అనస్ (రజి) కథనం: ఒక వ్యక్తి దైవప్రవక్త (స) దగ్గర కూర్చొని ఉండగా మరొక వ్యక్తి అతని సమీపం నుండి వెళ్ళాడు. అప్పుడు దైవప్రవక్త దగ్గర కూర్చున్న వ్యక్తి, వెళుతున్న వ్యక్తి వైపు చూపిస్తూ) "దైవప్రవక్తా! నేను ఇతడ్ని ప్రేమిస్తున్నాను" అనిఅన్నాడు. "మరి ఈ విషయం అతనితో చెప్పావా?" అనడిగారు దైవప్రవక్త (స). ఆవ్యక్తి 'చెప్పలేద' న్నాడు. అప్పుడాయన "నువ్వీ సంగతి అతనికి తెలియజెయ్యి" అని ఆదేశించారు. దైవప్రవక్త (స) ఆదేశం విని (తక్షణమే) ఆ వ్యక్తి అతడ్ని కలుసుకొని "దైవం కోసం నేను నిన్ను ప్రేమిస్తున్నాను" అని చెప్పాడు. అందుకతను "ఎవరికోసం నువ్వు నన్ను ప్రేమిస్తున్నావో ఆయన కూడా నిన్ను ప్రేమించుగాక!" అని దీవించాడు. (అబూదావూద్)

ఇస్లాం నైతిక-ఆధ్యాత్మికతల పరంగా యావత్తు మానవుల్ని విశ్వాసులు-అవిశ్వాసులు అని రెండు ప్రధాన వర్గాలుగా విభజించింది. విశ్వాసులు అంటే సృష్టికర్త, విశ్వపాలకుడయిన దేవుడ్ని, ఆయన ప్రవక్తలను విశ్వసించి, వారుభయుల హితోక్తుల్ని, ఆజ్ఞల్ని పాటించేవారని అర్థం. ప్రతి విషయంలోనూ దేవునికి భయపడుతూ తదనుగుణంగా సాత్విక జీవితం గడిపేవారే దేవునికి ప్రియమైనవారు. వారే దేవుని దృష్టిలో గౌరవనీయులు.

విశ్వాసులలో మళ్ళీ పుణ్యాత్ములతో పాటు పాపాత్ములు కూడా ఉంటారు. అలాగే అవిశ్వాసులలో దుర్జనులతో పాటు సజ్జనులు కూడా ఉంటారు. ప్రతి ఒక్కడికీ అతని కర్మల్ని బట్టి పరలోకంలో ప్రతిఫలం లభిస్తుంది. మానవుల పరస్పర సంబంధాలను గురించి మహాప్రవక్త ముహమ్మద్ (స) తన వీడ్కోలుహజ్ ప్రసంగంలో స్పష్టంగా ఇలా తెలియజేశారు:

## హజ్జతుల్‌విదా (వీడ్కోలుహజ్) ప్రసంగం

"నా ప్రియమైన సోదరులారా! 'ఒక్క అల్లాహ్ తప్ప మరో ఆరాధ్యుడు లేడు. ఆయనకు సాటి ఎవరూలేరు. దేవుడు తన (ఈ) దాసునికి సహాయం చేసి, వాగ్దానం నిలబెట్టుకున్నాడు. ఆయన ఒక్కడే యావత్తు దుష్టశక్తుల్ని లొంగదీసుకున్నాడు. ప్రజలారా! వచ్చేయేడు నేనిక్కడ మిమ్మల్ని మళ్ళీ కలుసుకుంటానో లేదో తెలియదు. కాబట్టి నేను చెప్పేదంతా శ్రద్ధగా ఆలకించండి."

"దేవుడు తన గ్రంథంలో 'మానవులారా! మేము మిమ్మల్ని ఒకే స్త్రీ పురుష జంట నుండి పుట్టించాము. తర్వాత మీ పరస్పర పరిచయం కోసం మిమ్మల్ని విభిన్న జాతులుగా, తెగలుగా చేశాము. అయితే మీలో అందరికంటే ఎక్కువ భయభక్తులు కలవాడే దేవుని దృష్టిలో ఎక్కువ గౌరవనీయుడు.(49:13)' అని అన్నాడు. కనుక అరబ్బీయుడిపై అరబ్బేతరునికి, అరబ్బేతరునిపై అరబ్బీయుడికి; తెల్లవాడిపై నల్లవాడికి, నల్లవాడిపై తెల్లవాడికి ఎలాంటి ఆధిక్యత లేదు. ఆధిక్యతకు గీటురాయి దేవునిపట్ల భయభక్తులు ఉండటమే."

"ప్రజలారా! మీ ప్రభువు ఒక్కడే. తండ్రి కూడా ఒక్కడే. మీరంతా ఆదం (అలై) సంతానం. ఆదం మట్టితో సృజించబడ్డాడు. మీలో అందరికంటే ఎక్కువ భయభక్తులు కలవాడే దేవుని దృష్టిలో అందరికంటే ఉత్తముడు. కనుక ఆధిక్యతా ఔన్నత్యాలకు



సంబంధించిన యావత్తు ప్రగల్భాలు, ధనప్రాణాల ప్రతీకారాలకు సంబంధించిన మొత్తం డిమాండ్లు ఇప్పుడు నా కాళ్ళ కింద తొక్కివేయబడ్డాయి. (అంటే నిషేధించబడ్డాయి.) కాబా సంరక్షణ బాధ్యత, హజ్‌యాత్రికులకు నీటి సరఫరా సేవలు మాత్రం యథాతథంగా కొనసాగుతాయి."

"ఖురైష్ ప్రజలారా! దేవుని సన్నిధికి ఇతర ప్రజలంతా పరలోకసామగ్రి (పుణ్యభాగ్యం) తో వస్తే, మీరు మీ మెడలపై ప్రాపంచిక (వ్యామోహ పాప) భారంతో రావడం జరగకూడదు. సుమా! దురదృష్టవశాత్తు అలా జరిగితే దేవుని దగ్గర మీకోసం నేను ఏవిధంగానూ ఉపయోగపడలేను. ఖురైషీయులారా! దేవుడు మీ గర్వాంధకారాన్ని అంతమొందించాడు. అంచేత మీ తాతముత్తాల ఘనకార్యాలను గురించి గర్వంతో గొప్పలు చెప్పుకోవడానికి ఇప్పుడు ఎలాంటి అవకాశం లేదు."

"ప్రజలారా! మీరు పరస్పరం మీ ధన ప్రాణాలను, మానమర్యాదలను నష్టపరచుకోవడం శాశ్వతంగా నిషేధించబడింది. ఈ (హజ్) దినాన్ని ఈ (జిల్‌హజ్జ) శుభమాసాన్ని, ఈ (మక్కా) నగరాన్ని మనం ఎలా గౌరవిస్తున్నామో వాటిని కూడా అలా గౌరవించవలసి ఉంటుంది. మీరందరూ ఒకరోజు దేవుని సన్నిధికి చేరుకోవలసి ఉంటుంది. అప్పుడు దేవుడు మీ కర్మలను గురించి లెక్క తీసుకుంటాడు. జాగ్రత్త! నా తదనంతరం మీలో మీరే పోట్లాడుకొని మెడలు నరుక్కునే భ్రష్టులయి పోకూడదు."

"ప్రతి ముస్లిం తోటిముస్లింకు సోదరుడి లాంటివాడు. ముస్లింలంతా పరస్పరం అన్నదమ్ములు. మీరు సేవకుల పట్ల మంచిగా మసలుకోండి; సేవకుల పట్ల మంచిగా మసలుకోండి. వారికి మీరు తినేతిండే పెట్టండి; మీరు కట్టుకునే దుస్తులే కట్టబెట్టండి."

"అజ్ఞాన కాలంనాటి వడ్డీకి ఇప్పుడు ఎలాంటి విలువ లేదు. (నా పినతండ్రి) అబ్బాస్ బిన్ అబ్దుల్ ముత్తలిబ్ వంశానికి చెందిన మొదటి వడ్డీని నేను వదిలేస్తున్నాను. ఇప్పుడీ వడ్డీ చెల్లింపులు అంతమైపోయాయి. ప్రజలారా! ప్రతి హక్కుదారునికి అతని హక్కును దేవుడు స్వయంగా ఇచ్చేశాడు. కనుక ఇప్పుడు ఏ వారసుడి హక్కు కోసం కూడా వీలునామా వ్రాయకూడదు."

"పిల్లవాడు ఎవరి పడక మీద పుట్టాడో ఆ పిల్లవాడు అతనికే చెందినవాడుగా పరిగణించబడతాడు. వ్యభిచార నింద నిరూపించబడిన వాడికి శిక్ష రాళ్ళశిక్షే. కర్మవిచారణ దేవుని దగ్గర జరుగుతుంది."

"అప్పును ఎట్టి పరిస్థితిలోనూ తిరిగి చెల్లించాలి. చేబదులుగా తీసుకున్న వస్తువును తిరిగిచ్చేయాలి. ఎవరైనా పారితోషికం ఇస్తే దానికి బదులు తీర్చాలి. ఎవరైనా ఎవరికైనా హామీ (జామీను) ఇస్తే అతను జరిమానా చెల్లించాలి. ఏఒక్కడూ తన సోదరుడి నుండి అతని ఇష్టానికి వ్యతిరేకంగా ఏ వస్తువునీ తీసుకోకూడదు, అతను సంతోషంగా ఇస్తే తప్ప. ఏఒక్కడూ తనపై తానుగాని, ఇతరులపై గాని దౌర్జన్యం చేయకూడదు."

"స్త్రీ తన భర్త సంపద నుండి ఎలాంటి వస్తువుని కూడా అతని అనుమతి లేకుండా ఇతరులకు ఇవ్వడం ధర్మసమ్మతం కాదు."

"వినండి! మీమీద మీ భార్యల హక్కులున్నాయి. అలాగే మీ భార్యల మీద మీ హక్కులు కూడా ఉన్నాయి. మీ భార్యలు మీరు ఇష్టపడని ఏ వ్యక్తినీ మీఇంట్లోకి రానీయకూడదు. ఇది భార్యలపై మీకున్న హక్కు. వారు నమ్మకద్రోహానికి పాల్పడరాదు; ఎలాంటి సిగ్గుమాలిన పనికి ఒడిగట్టకూడదు. ఒకవేళ అలా చేస్తే వారికి తేలికపాటి శారీరక శిక్ష విధించడానికి దేవుని తరపున మీకు అనుమతి ఉంది. వారా చేష్టల్ని మానుకుంటే, ఇక వారిని (వేధించకుండా) బాగా చూసుకోండి. స్త్రీలు మీ అధీనంలోని వారు కనుక వారిపట్ల సత్ప్రవర్తన కలిగివుండండి. వారు తమకోసం ఏదీ చేసుకోలేరు. వారిని మీరు దేవుని పేరు మీద చేపట్టారు. దేవుని పేరు మీదే వారు మీకు (భార్యలుగా) ధర్మసమ్మతం అయ్యారు. కాబట్టి వారి విషయంలో మీరు దేవునికి భయపడండి." (పాక్షికం-బుఖారి, ముస్లిం)

## వృద్ధులు, మహనీయులు, స్నేహితులు

హజ్రత్ అనస్ (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "ఏ యువకుడైనా ఒక వృద్ధుడ్ని అతని వృద్ధాప్యం చూసి గౌరవిస్తే దేవుడు అతని వృద్ధాప్యంలో అతడ్ని గౌరవించేవారిని పుట్టిస్తాడు." (తిర్మిజీ)

హజ్రత్ ఉమర్ బిన్ ఖత్తాబ్ (రజి) కథనం: నేను ఉమ్రాకు వెళ్ళటానికి దైవప్రవక్త (సల్లం) అనుమతి కోరాను. ఆయన అనుమతి ఇస్తూ, "సోదరా! (ఉమ్రాలో) నువ్వు దేవుణ్ణి ప్రార్థించేటప్పుడు మమ్మల్ని మరచిపోకు సుమా!" అని అన్నారు. ఆయన అన్న ఆ మాటకు నేనెంతగా పొంగిపోయానంటే, మొత్తం ప్రపంచం నా సొంతమయినా నాకు అంత ఆనందం కలిగేది కాదు. (అబూదావూద్, తిర్మిజీ)

హజ్రత్ ఉసైర్ బిన్ జాబిర్ కథనం: "యమన్ నుండి ముస్లిం యోధులకు సహాయ పడేవారెవరైనా వస్తే హజ్రత్ ఉమర్ (రజి) వారిని "మీలో ఉవైస్ బిన్ ఆమిర్ ఉన్నారా?" అని అడుగుతుండేవారు. ఒకరోజు ఓ బృందంతోపాటు నిజంగానే ఉవైస్ బిన్ ఆమిర్ వచ్చారు. మీరు 'ఉవైస్ బిన్ ఆమిర్ గారేనా?' అని హజ్రత్ ఉమర్ (రజి) అడిగారు. ఆయన అవునన్నారు. "మీకు మురాద్ కుటుంబంతోనూ, ఖర్న్ తెగతోనూ సంబంధం ఉందా?" అని అడిగారు. ఆయన ఉందని చెప్పారు. ఆ తరువాత హజ్రత్ ఉమర్ (రజి) "మీ శరీరంపై తెల్లమచ్చలుండేవి. ఇప్పుడు అవన్నీ నయమై దిర్హం నాణెమంత మచ్చ మాత్రమే మిగిలిఉంది కదూ!?" అనడిగారు. ఆయన అవునన్నారు. ఆ తరువాత "మీ తల్లి బ్రతికిఉందా?" అనడిగారు. "అవును, బ్రతికే ఉంది" అన్నారు ఆయన. (ఆయన ఉవైసే అని నమ్మకం కుదిరాక) హజ్రత్ ఉమర్ దైవప్రవక్త (స) ఇలా చెబుతుండగా తాను విన్నానని తెలియజేశారు:

యమన్ నుండి ముస్లిం సేనలకు జిహాద్‌లో సహకరించేవారితో పాటు మురాద్ కుటుంబానికి, ఖర్న్ తెగకు చెందిన ఉవైస్ బిన్ ఆమిర్ అనే మనిషి మీ దగ్గరికి వస్తాడు. ఒకప్పుడు అతని శరీరంపై ఉన్న తెల్లమచ్చలన్నీ నయమైపోయి ఒక దిర్హం నాణెమంత మచ్చ మాత్రమే మిగిలిఉంటుంది. అతను తన తల్లి పట్ల చాలా మంచిగా ప్రవర్తిస్తాడు. అతను దేవుని పేరుతో ఏదైనా ప్రమాణం చేస్తే దేవుడు తప్పకుండా అతని ప్రమాణాన్ని



నెరవేరుస్తాడు. కాబట్టి (ఉమర్!) నీకు నీ పాపమన్నింపు కోసం అతని చేత ప్రార్థన చేయించుకునే అవకాశం లభిస్తే తప్పకుండా చేయించుకో."

తరువాత హజ్రత్ ఉమర్ (రజి) "అందుకే అడుగుతున్నాను. మీరు నా పాపాల మన్నింపు కోసం దేవుణ్ణి ప్రార్థించండి" అని అన్నారు. ఉమర్ (రజి) కోరినట్లుగానే ఉవైస్ ఖర్నీ ఆయన మన్నింపు కోసం దేవుణ్ణి ప్రార్థించారు. ఆ తరువాత హజ్రత్ ఉమర్ (రజి) "ఇప్పుడు మీరెక్కడికి వెళ్ళాలనుకుంటున్నారు?" అని అడిగారు. కూఫాకు వెళ్ళాలను కుంటున్నానని చెప్పారాయాన. "అలాగయితే నేను కూఫా గవర్నర్‌కు మీ గురించి లేఖ రాసివ్వమంటారా?" అని అడిగారు. దానికాయన, "(అవసరం లేదు). నేను ఎవరికీ తెలియకుండా ఎవరూ పట్టించుకోకుండా ఉండే నిరుపేదలు, అభాగ్యులతో పాటు ఉండాలనుకుంటున్నాను" అని అన్నారు. (ముస్లిం)

దైవప్రవక్త (స) ప్రవచనం: "దేవుడు ఏ దాసుణ్ణయినా అభిమానిస్తే జిబ్రీల్ (అలై)ని పిలిచి "దేవుడు ఫలానా మనిషిని అభిమానిస్తున్నాడు. కనుక నీవు కూడా అతడ్ని అభి మానించు" అని అంటాడు. అప్పుడు జిబ్రీల్ (అలై) అతడ్ని అభిమానించడం ప్రారం భిస్తారు. తరువాత ఆయన ఆకాశంలో ఒక ప్రకటన చేస్తూ "దేవుడు ఫలానా మనిషిని అభిమానిస్తున్నాడు. కనుక మీరంతా అతడ్ని అభిమానించండి" అని అంటారు. దాంతో ఆకాశవాసులంతా (అంటే దైవదూతలంతా) అతడ్ని అభిమానించడం మొదలెడతారు. చివరికి భూమిపై కూడా అతనికి ప్రజాదరణ లభిస్తుంది. (బుఖారి, ముస్లిం)

ఒకతను "దైవప్రవక్తా! ప్రళయం ఎప్పుడొస్తుంది?" అని అడిగాడు. "దాని కోసం నువ్వేం ఏర్పాట్లు చేసుకున్నావు?" అని ప్రశ్నించారు దైవప్రవక్త (స). "దాని కోసం నేను ఎక్కువగా నమాజులు చేయలేదు. ఎక్కువగా ఉపవాసాలు కూడా పాటించలేదు. ఎక్కువగా దానధర్మాలు కూడా చేయలేదు. కాకపోతే నేను దేవుడ్ని, ఆయన ప్రవక్త (స)ను అభిమానిస్తున్నాను" అన్నాడా వ్యక్తి. దానికి దైవప్రవక్త (స) "నీవు ఎవరిని అభి మానిస్తున్నావో (ప్రళయదినాన) అతనితో పాటే ఉంటావు" అని చెప్పారు. (బుఖారి)

హజ్రత్ అబూమూసా (రజి) కథనం: "ఒకతను కొందరిని అభిమానిస్తున్నాడు. కాని సత్కార్యాలు చేయడంలో అతను వారి స్థాయికి చేరుకోలేకపోతున్నాడు. (దీనిపై మీ అభిప్రాయం)?" అని దైవప్రవక్త (స)ను ఎవరో అడిగాడు. దానికి దైవప్రవక్త (స) ఇలా అన్నారు: "మనిషి తాను అభిమానించిన వారితోపాటే ఉంటాడు." (బుఖారీ, ముస్లిం)

హజ్రత్ అబూహురైరా (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ఇలా అన్నారు: "ఎవరైనా రోగిని పరామర్శించడానికి లేదా దేవుని కోసం తన సోదరుణ్ణి కలుసుకోవడానికి వెళ్ళి నప్పుడు (దేవుని తరఫున) ఒక ప్రకటనకర్త "నీకు అభినందనలు. నీ నడక సార్థకమవు గాక! నీకు స్వర్గంలో స్థానం లభించుగాక!" అని ఎలుగెత్తి ప్రార్థిస్తాడు. (తిర్మిజీ)

హజ్రత్ అబూమూసా అష్అరీ (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ఇలా చెప్పారు: "మంచిస్నేహితుడు కస్తూరి అమ్మేవాడితో సమానం. చెడ్డస్నేహితుడు కొలిమి ఊదేవాడితో సమానం. కస్తూరి అమ్మేవాడి దగ్గర కూర్చుంటే అతను నీకు కానుకగా కస్తూరి ఇస్తాడు

లేదా దాన్ని నువ్వు కొననయినా కొంటావు. ఈ రెండూ కాకపోయినా కనీసం నీకు అతని దగ్గర్నుంచి సువాసనయినా వస్తుంది. అదే నువ్వు కొలిమి ఊదేవాడి దగ్గర కూర్చుంటే (అతను నీ మీదకు నిప్పురవ్వలు ఎగరేసి) నీ బట్టల్ని కాలుస్తాడు లేదా అతని దగ్గర్నుంచి నీకు దుర్వాసనయినా అంటుతుంది.'' (బుఖారీ, ముస్లిం)

## పేదలు, అనాథలు

దైవప్రవక్త (స) హితోక్తి : ''(ఇంటింటా తిరిగి) ఒకటి రెండు ఖర్జూర పండ్లు లేదా ఒకటి రెండు ముద్దలు అడుక్కునేవాడు పేదవాడు కాదు. (పేదరికంతో బాధపడున్నా) ముష్టెత్తకుండా (ఆత్మాభిమానంతో) బ్రతికేవాడే నిజమైన పేదవాడు.'' (బుఖారీ, ముస్లిం)

హజ్రత్ సాద్ బిన్ అబూవఖ్ఖాస్ కథనం: మేము ఆరుగురం దైవప్రవక్త (స) వెంట ఉండేవాళ్ళం. బహుదైవారాధకులు (మమ్మల్ని అల్పులుగా భావించి) దైవప్రవక్తతో ''(ముహమ్మద్!) వీళ్ళను దూరంగా తొలగిపొమ్మను. వీళ్ళు మా మీదికి వస్తే మేము సహించం'' అన్నారు. (వారిలో) నేను, ఇబ్నెమసూద్, హుజైల్ తెగకు చెందిన ఒకతను, బిలాల్, ఇంకా ఇద్దరున్నారు. వారి పేర్లు నాకు తెలియవు. (బహుదైవారాధకుల ప్రతిపాదన పై) దైవప్రవక్త (స)కు దైవం తలచిన ఆలోచన వచ్చింది. ఆయన (ఆ ప్రతిపాదనకు అనుకూలంగా) మనసులో (మాగురించి) ఏదో అనుకున్నారు. అప్పుడు అల్లాహ్ (ఆయన్ని మందలిస్తూ) ఈ సూక్తులు అవతరింపజేశాడు. ''(ప్రవక్తా!) కొందరు రేయింబవళ్ళు తమ ప్రభువునే వేడుకుంటూ ఆయన ప్రసన్నత అర్థిస్తూ ఉంటారు. అలాంటివారిని నీ నుండి దూరంచేయకు. వారి (కర్మల) లెక్క విషయమై నీపై ఎలాంటి బాధ్యతలేదు. అలాగే నీ (కర్మల)లెక్క విషయమై వారిపై ఎలాంటి బాధ్యత లేదు.'' (6:52)- (ముస్లిం)

హజ్రత్ ముస్అబ్ బిన్ సాద్ బిన్ అబూవఖ్ఖాస్ (రజి) ప్రకారం (ఆయన తండ్రి) అయిన సాద్‌కు తాను తన క్రిందివారికన్నా గొప్పవాణ్ణనిపించింది. (ఈ విషయం తెలుసు కొని) దైవప్రవక్త ''ఈ బలహీనుల చలువతోనే నీకు (దైవం నుంచి) సహాయం లభిస్తోందని, ఉపాధి దొరుకుతోందని తెలుసుకో'' అన్నారు. (బుఖారీ)

హజ్రత్ అబూదర్దా ఉవైమిర్(రజి) ప్రకారం దైవప్రవక్త (స) ప్రవచనం: ''మీరు నన్ను (పేదలు,) బలహీనుల్లో అన్వేషించండి. నిస్సందేహంగా (పేదలు,) బలహీనుల వల్లనే మీకు సహాయం అందుతోంది; ఉపాధి లభిస్తోంది.'' (అబూదావూద్)

దైవప్రవక్త (స) ప్రవచనం: ''పేదవారిని పిలవకుండా ధనికులు మాత్రమే ఆహ్వా నించబడే వలీమా విందు అత్యంత నీచమైనది.'' (బుఖారీ, ముస్లిం)

దైవప్రవక్త (స) ప్రవచనం: ''పేదలు, వితంతువుల బాగోగుల కోసం కృషిచేసేవాడు దైవమార్గంలో పోరాడే యోధుడితో సమానం.'' (హదీసు ఉల్లేఖకులు ఇలాఅంటున్నారు:) ''అతడు అలుపెరగకుండా దైవారాధన చేసేవాడితో, నిరంతరం ఉపవాసాలు పాటించే వాడితో సమానమని కూడా దైవప్రవక్త (స) అన్నారని నా అనుమానం.'' (బుఖారీ)

దైవప్రవక్త (స) ప్రవచనం: ''నేను, అనాథ పోషకుడు స్వర్గంలో ఇలా ఉంటాం. అప్పుడాయన తన చూపుడువ్రేలితో మధ్యవ్రేలిని కలపకుండా కొంత సందు ఉంచి



చూపించారు. (అంటే స్వర్గంలో ఇద్దరూ దాదాపు ఒకేచోట ఉంటారు)- (బుఖారీ)

''దైవప్రసన్నత కోసం అనాథబాలుడి తల నిమిరే వ్యక్తి కర్మల చిట్టాలో ఆ బాలుడి తలలోని ప్రతివెండ్రుకకు బదులుగా ఒక్కో పుణ్యం రాయబడుతుంది.'' (తిర్మిజి)

## పొరుగువారి హక్కులు

దైవప్రవక్త (సల్లం) ఒకసారి మాట్లాడుతూ ''దైవసాక్షి! అతను విశ్వాసి కాడు, దైవసాక్షి! అతను విశ్వాసి కాడు, దైవసాక్షి! అతను విశ్వాసి కాడు'' అని అన్నారు (మూడుసార్లు). ''ఎవరు దైవప్రవక్తా!'' అని అడిగితే, ''తన కుచేష్టలతో ఇరుగుపొరుగు వారికి మనశ్శాంతి లేకుండా చేస్తున్నవాడు'' అని చెప్పారు ఆయన. (బుఖారి, ముస్లిం)

వేరొక ఉల్లేఖనంలో ''తన తుంటరి చేష్టలతో ఇరుగుపొరుగు వారికి మనశ్శాంతి లేకుండా చేసేవాడు స్వర్గంలో ప్రవేశించలేడు'' అని ఉంది. (ముస్లిం)

హజ్రత్ ఉఖ్బా బిన్ ఆమిర్ (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ప్రవచనం: ''(ప్రళయ దినాన) దేవుని న్యాయస్థానంలో అన్నిటికంటే ముందు ప్రవేశపెట్టబడే ఇద్దరు వ్యక్తుల వ్యాజ్యం- ఇద్దరు పొరుగువాళ్ళకు సంబంధించిన వ్యాజ్యం అవుతుంది.'' (బుఖారి)

పై హదీసు బట్టి ఇరుగుపొరుగు వారిని బాధించడం, వారి హక్కులు నెరవేర్చక పోవడం ఎంత ఘోరమైన పాపమో తెలుస్తోంది.

దైవప్రవక్త (స) ప్రవచనం: ''తన పొరుగువాడు పస్తుండగా తాను కడుపు నిండా తినేవాడు (నిజమైన) విశ్వాసి కాడు.'' (మిష్కాత్)

దైవప్రవక్త (స) స్త్రీలతో ఇలా అన్నారు: ''ముస్లిం మహిళల్లారా! ఏ పొరుగింటి స్త్రీ అయినా తన పొరుగింటావిడ (ఇచ్చిన కానుక)ను అల్పమైనదిగా భావించకూడదు, అది ఓ మేక కాలిగిట్ట అయినసరే.'' (బుఖారి, ముస్లిం)

దైవప్రవక్త (స) ఇలా అన్నారు: ''తన సహచరులపట్ల మంచిగా మెలిగేవాడే దేవుని దృష్టిలో మంచి సహచరుడు. అలాగే తన ఇరుగుపొరుగువారి పట్ల మంచిగా మసులుకునే వాడే దేవుని దృష్టిలో మంచి పొరుగువాడు. (జామె తిర్మిజి)

హజ్రత్ అబూజర్ (రజి) కథనం: నా మిత్రులు (దైవప్రవక్త-స) నన్ను ఉద్దేశించి ''అబూజర్! నీవు చారు వండితే అందులో నీళ్ళు ఎక్కువ పోయి. తరువాత ఇరుగుపొరుగు వారి ఇండ్లలో ఎంతమంది సభ్యులున్నారో అంచనా వేసుకొని, వారిక్కూడా అందులో నుంచి కొంత ఇవ్వు'' అని తాకీదు చేశారు. (ముస్లిం)

దైవప్రవక్త (స) ప్రవచనం: ''తన గోడకు పొరుగువాడు గూటం (లేక మేకు) కొట్టుకుంటానంటే దానికి ఎవరూ అభ్యంతరం పెట్టకూడదు.'' (బుఖారి, ముస్లిం)

హజ్రత్ ఆయిషా (రజి) కథనం: నేను ఓసారి దైవప్రవక్త (సల్లం)తో మాట్లాడుతూ ''దైవప్రవక్తా! నాకు ఇద్దరు పొరుగువాళ్ళు ఉన్నారు. వారిలో నేను ఎవరికి కానుక ఇవ్వాలి?'' అని అడిగాను. దానికి ఆయన ''వారిలో ఎవరి గడప నీకు దగ్గరగా ఉంటే వారికివ్వు'' అని చెప్పారు. (బుఖారి)

హజ్రత్ ఇబ్నెఉమర్ (రజి), హజ్రత్ ఆయిషా (రజి)ల కథనాల ప్రకారం దైవప్రవక్త (స) ఇలా తెలిపారు: (దైవదూత) జిబ్రయీల్ పొరుగువాని (హక్కుల్ని) గురించి నాకు మాటిమాటికి ఎంతగా తాకీదు చేశారంటే, ఆమాట విని ఆయన నా ఆస్తిలో (కూడా) పొరుగువాడ్ని వాటాదారుడిగా నిర్ణయిస్తారేమోననిపించింది నాకు." (బుఖారి, ముస్లిం)

# 70. సమైక్యతా సోదరభావాలు

"విశ్వాసులు పరస్పరం అన్నదమ్ములు." (ఖుర్ఆన్-49:10); "వారు విశ్వాసుల పట్ల మృదువుగా, అవిశ్వాసుల పట్ల కఠినంగా ప్రవర్తిస్తారు." (ఖుర్ఆన్-5:54)

"ముహమ్మద్ దేవుని ప్రవక్త. ఆయన వెంట ఉన్నవారు (ముస్లింలు) పరస్పరం దయామయులుగా, అవిశ్వాసులు పట్ల కఠినులుగా ఉంటారు." (ఖుర్ఆన్-48:29)

ఒకప్పుడు విభిన్నవర్గాలుగా, తెగలుగా, చీలిపోయి అనైక్యత, అంతఃకలహాలతో సతమత మవుతుండిన అరబ్బుల్ని ఇస్లాం సమైక్యపరచింది. జాతి, ప్రాంతం, వర్ణం, వర్గం లాంటి కృత్రిమ విచక్షణ గోడలను కూలగొట్టి దేవుని ఏకత్వం, దైవప్రవక్త విధేయతల పునాదులపై వారందర్నీ ఒకగొడుగు క్రిందికి చేర్చింది. ఖుర్ఆన్ కేవలం 23 ఏండ్లలో వారి జీవితాలను సమూలంగా సంస్కరించి ప్రగతిశిఖరాలకు చేర్చింది. కాబట్టి ముస్లింలు ఇస్లాం సేవలో, దాని సంస్థాపనా కృషిలో నిరంతరం నిమగ్నులయిఉండాలి. అదే వారి జీవనధ్యేయం. ఈ ధ్యేయాన్ని విస్మరించి ధర్మంలో అంతగా ప్రాముఖ్యంలేని అత్యల్ప విషయాలపై వాదించుకోవడంలో కాలం గడిపితే వారిలో సమైక్యత సన్నగిల్లి తిరిగి విభేదాలు పొడసూపుతాయి.

"మీరంతా కలసి దైవత్రాటిని (అంటే దైవధర్మాన్ని) దృఢంగా పట్టుకోండి. విభేదాలలో పడిచీలిపోకండి. దేవుడు చేసిన మేళ్ళను జ్ఞాపకం చేసుకోండి. మీరు పరస్పరం శత్రువులుగా ఉన్నప్పుడు దేవుడు మీ హృదయాలను కలిపాడు. ఆయన అనుగ్రహం వల్లనే మీరు పరస్పరం అన్నదమ్ములై పోయారు. మీరు అగ్నిగుండం అంచుకు చేరినప్పుడు ఆయన మిమ్మల్ని కాపాడాడు." (ఖుర్ఆన్-3:103)

"మీరు పరస్పరం కలహించుకోకండి. అలా చేస్తే మీలో అధైర్యం, బలహీనతలు చోటుచేసుకుంటాయి; మీ ప్రాబల్యం (క్షీణించి) పోతుంది." (ఖుర్ఆన్-8:46)

"స్పష్టమైన సూచనలు, ప్రమాణాలు వచ్చినప్పటికీ పరస్పరం విభేదించుకొని విభిన్న వర్గాలుగా చీలిపోయినవారిలా మీరూ కాకండి. అలాంటివారికి ఘోరమైన (నరక) యాతనలు కాచుకొని ఉన్నాయి." (ఖుర్ఆన్-3:105)

"ఎవరైనా ఒక ముస్లిం తోటిముస్లింని హతమారిస్తే దాని పర్యవసానం నరకమవు తుంది. అతను (హంతకుడు) అందులోనే పడిఉంటాడు. దేవుడు అతడ్ని ఆగ్రహిస్తాడు, శపిస్తాడు. అతని కోసం దుర్భరశిక్ష సిద్ధం చేయబడిఉంటుంది." (ఖుర్ఆన్-4:98)

ముస్లింల పరస్పర సంబంధాలను గురించి దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు:

హజ్రత్ అనస్ (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ప్రవచనం: "పరస్పరం పగబట్టకండి. అసూయ చెందకండి. ఎడమొహం పెడమొహంతో ఉండకండి. సంబంధాలు త్రెంచుకో



కండి. దైవదాసులారా! పరస్పరం అన్నదమ్ములుగా ఉండండి. ఒకముస్లిం తోటి(ముస్లిం) సోదరునితో మూడు రోజులకు మించి మాట్లాడకుండా ఉండరాదు. (బుఖారీ, ముస్లిం)

హజ్రత్ వాసిలా (రజి) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "నీవు నీ (ముస్లిం) సోదరుని కష్టాల పట్ల సంతోషించకు. అలా చేశావంటే దేవుడు అతడ్ని కనికరించి నిన్ను కష్టాలపాలు చేస్తాడు." (మిష్కాత్)

హజ్రత్ అబూరుఖయ్యా తమీమ్ బిన్ ఔస్ దారీ (రజి) కథనం: దైవప్రవక్త (స) "ధర్మమంటే మంచిని అభిలషించటం" అన్నారు. అప్పుడు మేము "(దైవప్రవక్తా!) ఎవరి మంచిని అభిలషించాలి?" అని అడిగాం. దానికి దైవప్రవక్త (స) "దేవుడు, ఆయన గ్రంథం, ఆయన ప్రవక్త, ముస్లిం నేతలు, సామాన్య ముస్లింలందరి విషయంలోనూ మంచిని అభిలషించటమే ధర్మం" అని చెప్పారు. (ముస్లిం)

దైవప్రవక్త (స) వీడ్కోలుహజ్‌లో ఉపన్యాసమిస్తూ ఇలా అన్నారు: "వినండి! దేవుడు ఏవిధంగా మీయీ రోజును, నెలను, ఈ పట్టణాన్ని పవిత్రమైనవిగా నిర్ణయించాడో అదే విధంగా మీ రక్తాన్ని, మీ ధనమానాలను పవిత్రమైనవిగా నిర్ణయించాడు. వింటున్నారా! నేను మీకు (దైవసందేశాన్ని) అందజేశానా?" దానికి ప్రజలు "అందజేశారు" అన్నారు. దైవప్రవక్త (స) ఈమాట విని "దేవా! నేను నీ సందేశాన్ని ప్రజలకు అందజేశాను. దీనికి నీవే సాక్షి" అన్నారు. ఈమాట ఆయన మూడుసార్లు చెప్పారు. ఆతర్వాత ఇలా అన్నారు: "వింటున్నారా! మీరు ముస్లిములై ఉండి కూడా నా తదనంతరం మెడలు నరుక్కునే అవిశ్వాసులుగా మారకండి." (బుఖారి)

## ముస్లింల పరస్పర సంబంధాలు

దైవప్రవక్త (స) ప్రవచనం: "మీరు చెడ్డ అనుమానాలకు దూరంగా ఉండండి. సమస్త విషయాల్లో పచ్చి అబద్ధం చెడ్డ అనుమానమే. ఇతరుల తప్పుల్ని ఎన్నకండి. కూపీలు తీయకండి. ఇతరుల హక్కుల్ని కబళించే ప్రయత్నంలో ఒండొకరిని మించి పోవటానికి ప్రయత్నించకండి. పరస్పరం అసూయ చెందకండి. ద్వేషించుకోకండి. ఎడమొహం పెడమొహంతో ఉండకండి. దైవదాసులారా! దేవుడు ఆదేశించినట్లు మీరు పరస్పరం అన్నదమ్ముల్లా ఉండండి. ముస్లిం ముస్లింకు సోదరుడు. తను అతని మీద దౌర్జన్యం చేయరాదు. అతడ్ని నిస్సహాయునిగా వదలిపెట్టరాదు. అతడ్ని అల్పునిగా భావించరాదు. తఖ్వా (దైవభీతి) అనేది ఇక్కడుంటుంది. తఖ్వా అనేది ఇక్కడుంటుంది." ఈ మాట ఆయన తన ఛాతీ వైపు సైగ చేస్తూ చెప్పారు.

దైవప్రవక్త (స) ప్రవచనం: "ఒక మనిషి తన తోటిముస్లిం సోదరుణ్ణి చులకనగా చూడటం చాలు అతను చెడ్డవాడని చెప్పటానికి. ఒక ముస్లిం కొరకు తోటి ముస్లిం ధనమానప్రాణాలు నిషిద్ధం. దేవుడు మీ శరీరాలను, మీ ముఖాలను చూడడు. ఆయన మీ అంతరాత్మల్ని, మీ ఆచరణల్ని మాత్రమే చూస్తాడు." (బుఖారి, ముస్లిం)

దైవప్రవక్త (స) ఈవిధంగా తెలియజేశారు: "ఒకరి మీద ఒకరు అసూయ చెంద కండి. పగ పెంచుకోకండి. కూపీలు తీయకండి. ఇతరుల తప్పులు ఎత్తిచూపకండి.

ఇతరుల్ని మోసగించే ఉద్దేశ్యంతో బేరం మీద బేరం చేయకండి. దైవదాసులారా! పరస్పరం అన్నదమ్ముల్లా జీవించండి. (బుఖారి, ముస్లిం)

దైవప్రవక్త (స) ప్రవచనం: "ఒక ముస్లిం మరొక ముస్లింకు అద్దం లాంటివాడు. ఒక ముస్లిం మరొకముస్లింకు సోదరుడు. అతను తన ముస్లింసోదరుడ్ని వినాశం నుండి రక్షిస్తాడు. అతనికి (సదా) మద్దతునిస్తూ కాపాడుతుంటాడు." (బుఖారీ, ముస్లిం)

దైవప్రవక్త (స) హితోక్తి: "మీరు ముగ్గురు ఉన్నప్పుడు మూడోవాడ్ని వదలి మిగతా ఇద్దరు రహస్యాలు మాట్లాడుకోకండి. ఈ వైఖరివల్ల ఆ మూడో వ్యక్తికి బాధ కలగవచ్చు. అయితే మీరు మరికొందరితో కలిసిపోతే అప్పుడు ఫర్వాలేదు." (బుఖారీ, ముస్లిం)

హజ్రత్ జాబిర్ (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ఇలాఅన్నారు: "అరబ్ ద్వీపంలోని నమాజీలు ఇక తనను ఆరాధించరని షైతాన్ నిరాశచెందాడు. అయితే వారిమధ్య గొడవలు సృష్టించటంలో మాత్రం అతను (విజయం సాధిస్తాడు)." (ముస్లిం)

హజ్రత్ అబూహురైరా (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ప్రవచనం: "మీలో ఎవరైనా ఎవరితోనైనా జగడానికి దిగితే అతను (ప్రత్యర్థి) ముఖం మీద కొట్టకూడదు." (బుఖారి)

హజ్రత్ అబూహురైరా (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ప్రవచనం: "మీలో ఎవరూ తన సోదరునివైపు ఆయుధంతో సైగ చేయరాదు. బహుశా షైతాన్ దాన్ని ప్రయోగింపజేస్తే అతను అగ్నిగుండంలో పడిపోయే ప్రమాదం ఉంది." (బుఖారీ, ముస్లిం)

హజ్రత్ అబూహురైరా (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ఇలా అన్నారు: "సోమ, గురు వారాల్లో స్వర్గద్వారాలు తెరువబడతాయి. ఆరోజు అల్లాహ్ దైవత్వంలో ఇతరులకు సాటి కల్పించని ప్రతిఒక్కరి పాపాలు మన్నించబడతాయి. కాని తనకూ తన (ముస్లిం)సోదరునికి మధ్య శత్రుత్వం ఉన్నవాడి పాపాలు మన్నించబడవు. వారి గురించి "వీరిద్దరూ తమ సంబంధాలు మెరుగుపరచుకునేదాకా గడువు ఇవ్వండి! వీరిద్దరూ తమ సంబంధాలు మెరుగుపరచుకునేదాకా గడువు ఇవ్వండి" అని అనటం జరుగుతుంది. (ముస్లిం)

## అంతర్గతకలహాలు అంతంచేయండి

"అవిశ్వాసులు ఒకరికొకరు సమర్థించుకొని సహకరించుకుంటున్నారు. మీరు (విశ్వాసులై ఉండి కూడా) పరస్పరం సహకరించుకోకపోతే లోకంలో అరాచకం ఏర్పడి పెద్ద అల్లకల్లోలం చెలరేగుతుంది." (ఖుర్ఆన్-8:73)

ఒక పార్టీకి లేదా సంస్థకు బయటి దాడులకన్నా అంతర్గత కలహాలే చాలా ప్రమాదకరమైనవి. బయటి నుంచి ఎన్ని సవాళ్ళు ఎదురైనా, అంతర్గతంగా పటిష్ఠంగా ఉన్నప్పుడే ఆ పార్టీ లేదా సంస్థ విజయపథంలో పురోగమిస్తుంది. దీనికోసం పార్టీ కార్యకర్తలకు తమ పార్టీ నిబంధనావళిపై దృఢమైన విశ్వాసం, దాని లక్ష్యం పట్ల అమిత శ్రద్ధాసక్తులు ఉండటంతో పాటు, కార్యకర్తల మధ్య పరస్పరం ప్రేమాభిమానాలు కూడా ఉండటం ఎంతో అవసరం.

దేవుడ్ని, ఆయన అంతిమప్రవక్త (స)ను విశ్వసించినవారి పార్టీ 'ఇస్లాం.' వారి పార్టీ నిబంధనావళి 'ఖుర్ఆన్.' దాని కార్యాచరణవిధానం 'హదీస్.' పార్టీ లక్ష్యం 'ధర్మ సంస్థాపనం', తద్వారా దైవప్రసన్నత, పరలోకసాఫల్యం పొందడం. ఈ ఉన్నత లక్ష్యం కోసం పనిచేసేవారి



భావాలు కూడా ఎంతో ఉన్నతంగా ఉండాలని, పార్టీలో అంతగా ప్రాముఖ్యంలేని అత్యల్ప విషయాలపై రేకెత్తే విభేదాలకు అతీతంగా వారు విశాల దృక్పథం అలవరచుకోవాలని ఇస్లాం బోధిస్తోంది. పార్టీ నిబంధనావళిని, దాని కార్యాచరణవిధానాన్ని, దాని ఆశయాల్ని ఎంత గట్టిగా ప్రేమిస్తే అంతగా వారి మధ్య ప్రేమాభిమానాలు జనిస్తాయని చెబుతోంది.

కాని ఈనాడు ముస్లిం సమాజం ఖుర్ఆన్ మౌలిక బోధనలు విస్మరించి అనైక్యతా, అంతర్విభేదాలతో సతమతమవుతోంది. ప్రతివర్గం ఎదుటి వర్గంపై విద్వేషం కక్కుతూ దుష్ప్రచారం సాగిస్తోంది. ముస్లింలు పైకి ఎంతో సమైక్యంగా ఉన్నట్లు కన్పిస్తున్నా అత్యల్పవిషయాల్లో అత్యధిక విభేదాలు కల్పించుకొని ఒకరిపైనొకరు బురద చల్లుకుంటున్నారు.

అత్యల్ప విషయాల్లో విభేదాలను గురించి హజ్రత్ అబ్దుల్లా బిన్ మస్వూద్ (ర) ఉల్లేఖనం వినండి: "నేనొక రోజు ఒకతను ఖుర్ఆన్ పఠిస్తున్న తీరును గమనించాను. దైవప్రవక్త (స) ఇలాంటి తీరుతో పఠించడం నేనిదివరకు ఎన్నడూ వినలేదు. అంచేత నేనా వ్యక్తిని దైవప్రవక్త (స) దగ్గరకు పిలుచుకెళ్ళి విషయం చెప్పాను. కాని ఈమాట విని దైవప్రవక్తకు కోపం వచ్చినట్లు అన్పించింది నాకు. ఆయన మా ఇద్దర్ని ఉద్దేశించి "మీరిద్దరూ బాగానే పఠిస్తున్నారు. పరస్పరం విభేదించుకోకండి. (ఇలాంటి) విభేదాల వల్లనే మీకు పూర్వం గతజాతులు నాశనమయ్యాయి" అని అన్నారు." (బుఖారి)

హజ్రత్ అబూఉమారా బరా బిన్ ఆజిబ్ (రజి) కథనం: దైవప్రవక్త (స) మమ్మల్ని ఏడు పనులు చేయమని ఆదేశించారు. ఏడుపనులు చేయవద్దని వారించారు. 1-రోగిని పరామర్శించాలని, 2-శవం వెంటవెళ్ళాలని, 3-తుమ్మినవాడికి జవాబు చెప్పాలని, 4-ప్రమాణంచేసేవాడి ప్రమాణాన్ని నెరవేర్చాలని, 5-బాధితుడికి సహాయం చేయాలని, 6-ఆహ్వానించేవాడి ఆహ్వానం అంగీకరించాలని, 7-సలాంను వ్యాప్తిచేయాలని ఆదేశించారు. 1-బంగారపు ఉంగరాలు తొడగరాదని, 2-వెండిపాత్రల్లో తినడం, త్రాగడం చేయరాదని, 3-ఎర్ర పట్టుజీను ఉపయోగించరాదని, 4-'ఖస్' (ప్రాంతంలో తయారైన పట్టు) వస్త్రాలు తొడగరాదని, 5-పట్టువస్త్రాలు, 6-ఇస్తబ్రఖ్ పట్టువస్త్రాలు, 7-దీబాజ్ పట్టు వస్త్రాలు ధరించరాదని మమ్మల్ని వారించారు. (బుఖారీ, ముస్లిం)

## అన్నదమ్ముల మధ్య ఈ ఎడబాటేమిటి?

దైవప్రవక్త (స) ముస్లింలలో సమైక్యత, సోదరభావాలను పెంపొందింపజేయడానికి ఎన్నో సూచనలు ఇచ్చారు. కొన్ని సూచనలు ఇక్కడ ఉదాహరిస్తున్నాం:

"మీరు ఒకరిపై నొకరు అసూయా ద్వేషాలు పెంచుకోకండి. ఒకరికొకరు పరోక్ష నిందకు కూడా పాల్పడకండి. దైవదాసులారా! మీరంతా పరస్పరం అన్నదమ్ములుగా (సోదర భావంతో) జీవించండి. తోటి ముస్లిం సోదరునితో మూడు రోజులకన్నా మించి మాట్లాడకుండా ఉండటం ఏ వ్యక్తికీ ధర్మసమ్మతం కాదు." (బుఖారి)

"ముస్లింలు పరస్పరం ఒకరితో నొకరు కలిసి పటిష్ఠమైన కట్టడంలా రూపొందుతారు. అందులోని ఒక భాగం మరొక భాగానికి బలం చేకూర్చుతుంది." (బుఖారి)

"ఒక కట్టడంలోని ఇటుకలు ఒకదానికొకటి ఊతమిస్తూ ఆ కట్టడం పటిష్ఠతకు కారణభూతమైనట్లే విశ్వాసులు (ముస్లింలు) కూడా (ఒకరికొకరు సహకరించుకుంటూ

సమాజ సమైక్యతకు దోహదపడతారు).'' దైవప్రవక్త (స) ఈ విషయం చెబుతూ తమ చేతుల వ్రేళ్ళను ఒక దానిలో మరొకటి జొప్పించి (ముస్లింలు కూడా ఇలా కలసిమెలసి ఐకమత్యంతో ఉంటారని) చూపించారు. (బుఖారి, ముస్లిం)

''నీవు నీ ముస్లిం సోదరుడ్ని కలుసుకుంటే అతనికి సలాం చెయ్యి. అతను విందుకు ఆహ్వానిస్తే ఆ ఆహ్వానాన్ని స్వీకరించు. అతను నీద్వారా ఏదైనా సహాయం కోరితే అతనికి సహాయం చెయ్యి. అతను తుమ్మి 'అల్ హమ్దులిల్లాహ్' (సకల ప్రశంస లకు దేవుడే అర్హుడు) అనంటే, నీవు 'యర్‌రహ్మకుల్లాహ్' (దేవుడు నిన్ను కరుణించు గాక) అని బదులు పలుకు. అతడు వ్యాధిగ్రస్తుడయితే వెళ్ళి పరామర్శించు. చనిపోతే అతని జనాజా (శవాని)కి తోడుగా వెళ్ళు.'' (ముస్లిం)

''నాప్రాణం ఎవరి అధీనంలో ఉందో ఆ శక్తిస్వరూపుడి సాక్షి! తనకోసం ఇష్టపడిన దాన్నే తన (ముస్లిం)సోదరుని కోసం కూడా ఇష్టపడనంత వరకూ ఏవ్యక్తీ నిజమైన విశ్వాసి కాలేడు.'' (బుఖారి, ముస్లిం)

''ఒక ముస్లిం తోటి ముస్లింకు సోదరుడు (లాంటివాడు). ఒక సోదరుడు తన సోదరునిపై (ఎన్నటికీ) దౌర్జన్యం చేయడు; అతడ్ని దౌర్జన్యపరునికి అప్పగించడు కూడా. ఎవరు తన సోదరుని అవసరాలు తీర్చే పనుల్లో నిమగ్నుడయి ఉంటాడో, దేవుడు అతని అవసరాలు తీర్చే బాధ్యత తీసుకుంటాడు. ఎవరు (తోటి)ముస్లింకు వచ్చిన కష్టాల్లో ఒక కష్టాన్ని దూరంచేస్తాడో ప్రళయదినాన దేవుడు అతని కష్టాలలో ఒక కష్టాన్ని దూరంచేస్తాడు. మరెవరు (తోటి) ముస్లిం పొరపాట్లను కప్పిపుచ్చుతాడో, ప్రళయదినాన దేవుడు అతని పొరపాట్లను (పాపాలను) కప్పిపుచ్చుతాడు.'' (బుఖారి, ముస్లిం)

''ప్రళయదినాన దౌర్జన్యం (దౌర్జన్యపరుడికి) అంధకారంగా మారుతుంది.''(బుఖారి)

''ఏ మనిషికీ తన (ముస్లిం)సోదరునితో మూడు రోజులకన్నా మించి మాట్లాడ కుండా ఉండటం, దారిలో తారసపడినప్పుడు ఇద్దరు ఎడముఖం పెడముఖంగా ఉండి పోవడం ఏమాత్రం ధర్మసమ్మతం కాదు. వారిద్దరిలో సలాం చేయడంలో ముందంజ వేసేవాడే మంచివాడు.'' (ముస్లిం)

''ఏ ముస్లిం కూడా తోటి (ముస్లిం)సోదరుని మీద కోపంతో మూడు రోజులకు మించి అతనితో మాట్లాడకుండా ఉండరాదు. మూడురోజులకు మించి మాట్లాడకుండా ఉన్న స్థితిలో చనిపోతే అతను నరకానికి వెళ్తాడు.'' (అబూదావూద్)

''తన సోదరునితో ఒక ఏడాది పాటు తెగత్రెంపులు చేసుకొని ఉంటే తను అతడ్ని ఖూనీ చేసినట్లే లెక్క. (అబూదావూద్)

''ఒక విశ్వాసి తోటివిశ్వాసితో మూడురోజులకు మించి సంబంధం లేకుండా ఉండ రాదు. ఒకవేళ అదే స్థితిలో మూడురోజులు గడిచిపోతే ఆ తర్వాత అతడ్ని కలుసుకొని అతనికి సలాం చేయాలి. అతనా సలాంకు ప్రతిసలాం చేస్తే ఇద్దరికీ పుణ్యం లభిస్తుంది. ఒకవేళ అతను ప్రతిసలాం చేయకపోతే అతను పాపాత్ముడవుతాడు. సలాం చేసినవాడు మాత్రం తెగత్రెంపుల పాపం నుండి బయటపడతాడు.'' (అబూదావూద్)



హజ్రత్ అనస్ (రజి) కథనం: దైవప్రవక్త (స) మాతో ''మీ సోదరుడు దౌర్జన్యపరు డైనా, పీడితుడైనా అతనికి సహాయం చేయండి'' అన్నారు. ఒకతను ఈమాట విని ''దైవ ప్రవక్తా! పీడితునికి మాత్రం నేను సహాయం చేస్తాను. కాని దౌర్జన్యపరుడికి నేనెలా సహాయం చేయాలి?'' అనడిగాడు. దానికి దైవప్రవక్త (స) ''అతడ్ని దౌర్జన్యం నుండి నిరోధించు. ఇదే అతనికి నీవు చేసే సహాయం'' అని చెప్పారు. (బుఖారి, ముస్లిం)

దైవప్రవక్త (స) ఓసారి తన అనుచరులతో మాట్లాడుతూ ''దైవదాసులలో కొందరు ప్రవక్తలు, అమరగతులు కానప్పటికీ దేవుడు వారికి ప్రసాదించిన హోదాఅంతస్తులు చూసి దైవప్రవక్తలు, అమరగతులు కూడా (పరమ సంతోషంతో) అసూయపడతారు'' అని అన్నారు. అనుచరులు ఈమాట విని ''దైవప్రవక్తా! వారు ఎవరై ఉంటారు?'' అని అడిగారు. అప్పుడు దైవప్రవక్త (స) ఇలా చెప్పారు: ''వారు పరస్పరం బంధువులు కానప్పటికీ, ధనం ఇచ్చిపుచ్చుకోవడాలు చేయనప్పటికీ కేవలం దైవధర్మం ప్రాతిపదికపై ఒకర్నొకరు ప్రేమించుకునేవారు. వారి ముఖాలు దేదీప్యమానంగా వెలిగిపోతుంటాయి. వారి నలువైపులా జ్యోతిర్మయంగా ఉంటుంది. (ప్రళయదినాన) ప్రజలు భయాందోళన లకు గురయి ఉన్నప్పుడు వారు నిర్భయంగా ఉంటారు. ప్రజలు విచార సముద్రంలో మునిగి ఉన్నప్పుడు వారికి ఎలాంటి విచారం ఉండదు.'' (మిష్కాత్)

## మీరు సైద్ధాంతిక సమాజం సభ్యులా?

"విశ్వాసులు పరస్పరం అన్నదమ్ముల్లాంటివారు. కనుక మీ అన్నదమ్ముల మధ్య సత్సం బంధాలు నెలకొల్పండి. దేవునికి భయపడండి, మీరు కరుణించబడతారు."(ఖురాన్-49:10)

ముస్లింలు ఓ సైద్ధాంతిక సమాజానికిచెందిన సభ్యులు. కనుక ప్రపంచంలో ఎక్కడున్నా పరస్పరం సత్సంబంధాలు కలిగి ఉండాలని, వారి మధ్య అంతర్జాతీయ సౌభ్రాతృత్వం నెలకొని ఉండాలని పై సూక్తి చెబుతోంది. మహాప్రవక్త (స) మహితోక్తులు మరికొన్ని చూడండి:

''ఒక ముస్లిం మరొక ముస్లింకు సోదరుని వంటివాడు. అతను తోటిముస్లిం మీద దౌర్జన్యానికి, అన్యాయానికి పాల్పడడు. అతని సహచర్యాన్ని విడనాడడు. అతడ్ని కించ పరచడు. తోటిముస్లిం సోదరుడ్ని కించపరచడం వంటి చెడుకు మించిన ఘోరమైన చెడు లేదు.'' (ముస్నద్‌అహ్మద్)

''ముస్లిం తోటిముస్లింని దూషించడం దుర్మార్గం. అతనితో యుద్ధం చేయడం అవిశ్వాసం (కుఫ్ర్)తో సమానం.'' (బుఖారి)

''ఒక ముస్లిం తన సాటి ముస్లిం సోదరుడ్ని అవిశ్వాసి (కాఫిర్) అని పిలిస్తే వారి ద్దరిలో ఒకడు తప్పకుండా అవిశ్వాసి అయిపోతాడు.'' (బుఖారి)

''ఒక ముస్లిం మరొక ముస్లింకు అద్దం లాంటివాడు. అలాగే ఒక ముస్లిం మరొక ముస్లింకు సోదరుడు లాంటివాడు. అతను తన సోదర ముస్లింను వినాశం నుండి కాపాడుతాడు; వెనుక నుండి అతడ్ని రక్షిస్తాడు.'' (మిష్కాత్)

''ఒక ముస్లిం తోటిముస్లింకు సోదరుడు. ఒక సోదరుడు తన సోదరుడిపై దౌర్జన్యం చేయడు, అతడ్ని (శత్రువుకి) అప్పగించడు. తన సోదరుని అవసరాలు తీర్చే పనుల్లో

(నిమగ్నుడై) ఉండే మనిషి అవసరాలను దేవుడు తీరుస్తాడు. ముస్లింపై వచ్చిపడిన ఒక కష్టాన్ని తొలగిస్తే దేవుడు కూడా ప్రళయదినాన అతనికి ఎదురయ్యే కష్టాలలో ఒక కష్టాన్ని అతన్నుండి తొలగిస్తాడు. తోటి ముస్లిం (పాపాల)ను మరుగుపరిస్తే దేవుడు కూడా ప్రళయదినాన అతని పాపాలను మరుగుపరుస్తాడు." (బుఖారీ, ముస్లిం)

"ఒక ముస్లిం తోటిముస్లింకు సోదరుడు. ఒక ముస్లిం తోటిముస్లింకు ద్రోహం చేయడు, అతనితో అబద్ధం చెప్పడు. అతణ్ణి నిస్సహాయుడిగా వదలిపెట్టడు. ఒక ముస్లిం ధన మాన ప్రాణాలు తోటిముస్లింకు నిషేధించబడ్డాయి. దైవభీతి ఇక్కడ (మనసులో) ఉంటుంది. ఒకడు తన తోటిముస్లిం సోదరుణ్ణి అల్పుడిగా భావిస్తున్నా డంటే, ఆ భావన ఒక్కటే చాలు అతడు చెడ్డవాడని చెప్పడానికి." (తిర్మిజీ)

"మీరు పరస్పరం అసూయ చెందకండి. క్రయవిక్రయాలలో (కొనే ఉద్దేశ్యం లేకుండా) బేరంమీద బేరంచేస్తూ (వస్తువు)ధర పెంచి మోసానికి పాల్పడకండి. ఒండొకరి పట్ల అక్కసు పెంచుకోకండి. పరస్పరం విముఖులైపోకండి. ఒకరి బేరం మీద ఇంకొకరు బేరమాడకండి. దైవదాసులారా! పరస్పరం అన్నదమ్ములై మెలగండి. ముస్లిం తోటి ముస్లింకు సోదరుడు. అతను తన సోదరుడిపై దౌర్జన్యం చేయడు, అతణ్ణి అల్పుడిగా భావించడు, అతడ్ని నిస్సహాయుడిగా వదిలేయడు. దైవభీతి ఇక్కడ ఉంటుంది (ఆయన తన ఛాతీవైపు చూపిస్తూ మూడుసార్లు అన్నారు). ఒకడు తన తోటిముస్లిం సోదరుణ్ణి అల్పుడిగా భావిస్తున్నాడంటే, ఆ ఒక్క భావనే చాలు, అతను చెడ్డవాడని చెప్పడానికి. ఒక ముస్లిం ధన మాన ప్రాణాలు తోటి ముస్లింకు నిషేధించబడ్డాయి." (ముస్లిం)

## శిరస్సుకు, శరీరానికున్న సంబంధం

హజ్రత్ నోమాన్ బిన్ బషీర్ (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "విశ్వాసులు పరస్పరం అభిమానించుకోవడంలో, కనికరించుకోవడంలో, ప్రేమావాత్సల్యా లతో మెలగడంలో ఒక దేహం లాంటివారు. దేహంలో ఒక అవయవానికి బాధకలిగి నప్పుడు దేహమంతా బాధతో మూలుగుతుంది. (బుఖారీ, ముస్లిం)

దైవప్రవక్త (స) ప్రవచనం: "శిరస్సుకు, శరీరానికి ఎలాంటి సంబంధం ఉందో ఒక విశ్వాసి తోటివిశ్వాసులతో అలాంటి సంబంధమే కలిగిఉంటాడు. శరీరంలోని ప్రతి అవయవం అనుభవించే బాధను శిరస్సు ఎలా పాలుపంచుకుంటుందో తోటి విశ్వాసులు అనుభవించే బాధను కూడా ఆ విశ్వాసి అలాగే పాలుపంచుకుంటాడు." (అహ్మద్)

"(ముస్లింలారా!) మీరు లేనిపోని అనుమానాలకు పోకండి. లేనిపోని అనుమానం తో ఏదైనా మాటంటే అది అన్నిటికంటే అబద్ధం అవుతుంది. ఇతరుల్ని గురించి కూపీ లాగుతో తిరగకండి. వారి తప్పులు బయటపెట్టేందుకు కాచుకొని ఉండకండి. ఒకరి కొకరు పోట్లాడుకోకండి. ఒకర్నొకరు ద్వేషించుకోకండి. ఒకరి మాటను మరొకరు ఖండిం చుకోకండి. పరస్పరం అన్నదమ్ముల్లా మనుగడ సాగించండి." (బుఖారీ, ముస్లిం)

దైవప్రవక్త (స) వేదిక పైకి వచ్చి బిగ్గరగా ఇలా అన్నారు: "కేవలం నోటితో ఇస్లాం స్వీకరించిన ప్రజలారా! మీ హృదయాల్లో విశ్వాసం ఇంకా చోటుచేసుకో లేదు. మీరు



(తోటి) ముస్లింలను బాధించకండి. వారిని కించపరచకండి. వారి తప్పుల వెంట పడకండి. ఎవరు తమ తోటిముస్లింల తప్పుల వెంటపడతారో దేవుడు వారి తప్పుల వెంటపడతాడు. దేవుడు ఏ మనిషి తప్పుల వెంటపడతాడో ఇంట్లో కూర్చున్నా సరే అతడ్ని పరాభవం పాల్జేసిగాని వదలిపెట్టడు." (తిర్మిజి)

హజ్రత్ అబూమూసా (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ఇలా అన్నారు: "ఎవరైనా మా మస్జిదుల గుండాగాని, మా బజారుల గుండాగాని వెళ్తున్నప్పుడు, తమ వెంట బాణం ఉంటే దాన్ని ఆపి ఉంచాలి లేదా దాని మొనను చేత్తో గట్టిగా పట్టుకొని నడవాలి. లేకపోతే అది ఏ ముస్లింకైనా తగిలి బాధ కలిగించవచ్చు. (బుఖారీ, ముస్లిం)

ఒకసారి సల్మాన్ (రజి), సుహైబ్ (రజి), బిలాల్ (రజి)ల దగ్గరికి అబూసుఫ్యాన్ వచ్చారు. అక్కడే ఇంకొంతమంది ముస్లింలు కూడా ఉన్నారు. (అబూసుఫ్యాన్ అప్పటి కింకా ఇస్లాం స్వీకరించలేదు.) అక్కడున్న ముస్లింలు (అబూసుఫ్యాన్‌ను చూసి) "దైవ విరోధిపై దేవుని ఖడ్గవేటు సరిగ్గా పడలేదు" అన్నారు. హజ్రత్ అబూబకర్ (రజి) ఈమాట విని "మీరు ఖురైష్ తెగ అగ్రనాయకుడ్ని పట్టుకొని అంతేసి మాటంటారా?" అన్నారు. తరువాత ఆయన దైవప్రవక్త (స) దగ్గరకు వెళ్ళి వాళ్ళు అబూసుఫ్యాన్‌కు ఇంతేసి మాటన్నారని చెప్పారు. అది విని దైవప్రవక్త (స), "అబూబకర్! మీరు వారి భావాలను గాయపరచారేమో అనిపిస్తోంది నాకు. ఒకవేళ (మీ మాటవల్ల) నిజంగానే ఆ ముస్లింల మనసు నొచ్చుకొనివుంటే మీరు మీ ప్రభువును అప్రసన్నుణ్ణి చేశారు!" అని అన్నారు. దైవప్రవక్త (స) మాటలు విని హజ్రత్ అబూబకర్ (రజి) వెంటనే (పశ్చాత్తాపపడుతూ) ఆ (పేద) ముస్లింల వద్దకు వెళ్ళి "సోదరులారా! నేను మిమ్మల్ని కష్టపెట్టానా?" (మీ మనసు నొచ్చుకుందా?)" అని అడిగారు. దానికి వారు, "లేదు సోదరా! దేవుడు మిమ్మల్ని క్షమిస్తాడు (జరిగిన దానికి బాధపడకండి)" అని అన్నారు. (ముస్లిం)

హజ్రత్ ఆయిషా (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ప్రవచనం: "మంచి నీతినడవడి కలుగల ముస్లిం వల్ల (వ్యభిచారం, దొంగతనం వగైరా) శిక్షార్హమైన నేరాలు తప్ప ఏదైనా పొరపాటు జరిగితే అతడ్ని క్షమించండి." (అబూదావూద్)

# V. రాజకీయ వ్యవస్థ

ఇస్లాం సంపూర్ణ జీవన వ్యవస్థ అయినందున ఇందులో ఆధ్యాత్మిక, సామాజిక, ఆర్థిక విషయాలతో పాటు రాజకీయ విషయాలు కూడా ఉన్నాయి. ఇస్లాం నెలకొల్పదలచిన ఆరోగ్య వంతమైన శ్రేష్ఠసమాజంలో రాజకీయాలు కూడా ఆరోగ్యవంతంగా, నీతిమంతంగా ఉండాలి కదా! అందుకే ఇస్లాం రాజకీయ విషయాలను కూడా నేరస్థులు, అవినీతిపరులు, స్వార్థపరులకు వదిలే యకుండా ఈ రంగంలో కూడా మానవాళికి సరైన మార్గదర్శనం చేయగోరుతోంది.

## 71. సంఘువ్యవస్థీకరణ

"విశ్వాసులారా! దేవుని పట్ల, ఆయనప్రవక్త పట్ల విధేయత కలిగిఉండండి. మీలో వ్యవహారకర్తలైన అధికారుల పట్ల కూడా. అయితే ఏదైనా వ్యవహారంలో మీలో వివాదం తలెత్తితే దాన్ని తిరిగి దేవుని వైపునకు, ఆయనప్రవక్త వైపునకు మరల్చండి. మీరు నిజంగా

దేవుణ్ని, అంతిమదినాన్ని విశ్వసిస్తున్నట్లయితే ఇదే మీకోసం సరైన పద్ధతి. పర్యవసానం రీత్యా కూడా ఇదే ఉత్తమ విధానం." (ఖుర్‌ఆన్-4:59)

ముస్లింలు ఐకమత్యంతో సామూహిక జీవితం గడపాలని, జీవితంలోని ప్రతి రంగంలో ఖుర్‌ఆన్, హదీసుల ఆజ్ఞల్ని పాటించాలని; దాంతోపాటు ఖుర్‌ఆన్, హదీసుల వెలుగులో వారి నాయకులిచ్చే ఆజ్ఞల్ని కూడా పాటించాలని పైసూక్తి తెలియజేస్తోంది. "దేవుని పట్ల విధేయత కలిగివుండండి" అంటే ఖుర్‌ఆన్ ఆజ్ఞల్ని పాటించాలని; "ప్రవక్త పట్ల విధేయత కలిగి వుండండి" అంటే హదీసు బోధనలు అనుసరించాలని అర్థం. నాయకులిచ్చే ఆజ్ఞలు మాత్రం ఈ రెండిటి వెలుగులోనే ఉండాలి. ఖుర్‌ఆన్, హదీసులే ఇస్లాం బోధనలకు మూలాధారాలు. దైవప్రవక్త (స) బోధించిన ఈ క్రింది హితోక్తులు చూడండి:

"నేను మీదగ్గర రెండు వస్తువులు వదలి వెళ్తున్నాను. వాటిని గట్టిగా పట్టుకొని (ఆచరిస్తూ) ఉన్నంత కాలం మీరెన్నటికీ దారితప్పరు. వాటిలో ఒకటి, దైవగ్రంథం (ఖుర్‌ఆన్). రెండు, నా సంప్రదాయాలు." (ఇమామ్ మాలిక్-ముఅత్తా)

"సంఘం(తో కలసివుండటం) దైవకారుణ్యం, చెల్లాచెదురు(గా ఉండటం) (యమ)యాతన" (హదీస్)

"ఒంటరి మనిషికి షైతాన్ చేరువవుతాడు. మనుషులు ఒకరికి ఇద్దరైనప్పుడు వాడు దూరమైపోతాడు. కనుక తమ గృహాన్ని స్వర్గం మధ్య నిర్మించుకోదలచుకునే వారు ఇస్లామీయ సాంఘికవ్యవస్థను అంటిపెట్టుకొని ఉండాలి." (మిష్కాత్)

"కేవలం ముగ్గురు వ్యక్తులు ప్రయాణమయినా సరే, వారు తమలో ఒకణ్ణి నాయకుడిగా నియమించుకోవాలి." (అబూదావూద్)

"దేవుడు నాకు ఆదేశించిన అయిదు విషయాలను గురించి నేను మీకు ఆజ్ఞాపిస్తున్నాను. 1-సంఘం (జమాఅత్), 2-వినడం, 3-విధేయత, 4-వలస (హిజ్రత్), 5-దైవ మార్గంలో పోరాటం (జిహాద్). వినండి! (ముస్లింల)సంఘం నుండి ఒక జానెడు దూరం కూడా బయటుండేవాడు ఇస్లాం హారాన్ని తన మెడలో నుంచి తీసేసిన వాడవుతాడు. ఇస్లామీయ సంఘ జీవితవిధానం వదిలేసి అజ్ఞానం-అనాగరిక జీవితవిధానం వైపు పిలిచే వాడికి నరకమే నివాసస్థలం అవుతుంది" అన్నారు దైవప్రవక్త (స).

ప్రజలు ఈమాట విని "ఏమిటీ! నమాజ్ చేస్తుండేవాడయినా, ఉపవాసం పాటించే వాడయినా నరకనివాసి అవుతాడా?" అని అడిగారు. దానికి దైవప్రవక్త (స) "ఆ...నమాజ్ చేస్తుండేవాడైనా, ఉపవాసం పాటించేవాడైనా, తనను తాను ముస్లిం అని భావిస్తుండే వాడైనా సరే (నరకనివాసి అవుతాడు)" అని అన్నారు. (మిష్కాత్)

హజ్రత్ అబూనజీ ఇర్బాజ్ బిన్ సారియా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (స) ఇలా చెప్పారు: "మీరు దేవునికి భయపడుతుండాలని, మీకు నాయకుడిగా నియమించ బడేవాడు నీగ్రోజాతికి చెందిన బానిసయినా సరే, (అతను చెప్పినట్లు) విని విధేయత చూపాలని నేను మీకు ఉపదేశిస్తున్నాను. (జాగ్రత్త!) మీలో ఎవరైనా (నా తదనంతరం) బ్రతికివుంటే త్వరలోనే అతను ఎన్నోవిభేదాలు చూస్తాడు. (అలాంటి సంక్షోభ పరిస్థితుల్లో) మీరు నా సంప్రదాయాన్ని, సన్మార్గగాములయిన ఖలీఫాల విధానాన్ని అనుసరించాలి.



వాటిని మీరు పళ్ళతోనైనాసరే గట్టిగా పట్టుకోండి. ధర్మంలో కొత్తపోకడ (బిద్‌అత్)లకు దూరంగా ఉండండి. ప్రతి కొత్తపోకడ మార్గభ్రష్టతే. (అబూదావూద్, తిర్మిజీ)

హజ్రత్ అబుల్‌వలీద్ ఉబాదా బిన్ సామిత్ (రజి) కథనం: "కలిమిలోనూ లేమిలోనూ, ఇష్టమున్నా లేకపోయినా, ఇతరులకు మాపై ప్రాధాన్యతనిచ్చి, ఎట్టిపరిస్థితుల్లోనైనా (పాలకుల) ఆజ్ఞలను శిరసావహిస్తామని, వారికి విధేయత చూపుతామనీ, (పాలకులు) బహిరంగంగా దైవధిక్కారానికి పాల్పడినప్పుడు మా దగ్గర దేవుని తరఫున దానికి సంబంధించిన స్పష్టమైన నిదర్శనమేదైనా ఉంటే తప్ప పరిపాలనా వ్యవహారాల్లో పాలకులతో తగవులాడబోమనీ, మేమెక్కడున్నా సత్యమే పలుకుతామని, దేవుని (ధర్మం) విషయంలో ఎత్తిపొడిచేవాడి ఎత్తిపొడుపును లెక్కచేయబోమని మేము దైవప్రవక్త (స) చేతిమీద ప్రమాణం చేశాము." (బుఖారీ, ముస్లిం)

## నాయకానుచరుల సంబంధాలు

దైవప్రవక్త (స) ప్రవచనం: "ముస్లింలు తమకిష్టమున్నా, లేకపోయినా సరే తమ పైఅధికారి (లేదా నాయకుడు) చెప్పే మంచిమాటను విధిగా వినాలి. ఒకవేళ అతను చెడుమాట చెబితే అప్పుడతనికి విధేయత చూపకూడదు." (బుఖారి, ముస్లిం)

దైవప్రవక్త (స) ప్రవచనం: "ఎల్లప్పుడూ (జన) సముదాయానికి సేవ చేయడంలో నిమగ్నుడై ఉంటూ జాతికి సేవ చేసేవాడే జాతి నాయకుడవుతాడు. ఇంతకంటే గొప్ప సదాచరణ మరెవరిదీ కాజాలదు, ఒక్క అమరగతుడి ఆచరణ తప్ప." (మిష్కాత్)

దైవప్రవక్త (స) ఓ సైనికదళానికి ఒక అన్సారీ ముస్లింని సేనాపతిగా నియమించి పంపారు. అప్పుడాయన సేనాపతికి విధేయులై మసలుకోవాలని సైనికుల్ని ఆజ్ఞాపించారు. అయితే ఆ సేనాపతి (ఒక సందర్భంలో) వారి మీద ఆగ్రహం వెలిబుచ్చుతూ "మీరంతా నాకు విధేయులై ఉండాలని దైవప్రవక్త మిమ్మల్ని ఆదేశించలేదా?" అని అడిగాడు. దానికి వారంతా "నిజమే, ఆదేశించారు" అన్నారు. "అయితే నేనొక నిర్ణయం తీసుకున్నాను. దాని ప్రకారం మీరు కట్టెలు తెచ్చి ఒకచోట పేర్చండి. తరువాత దానికి నిప్పు పెట్టి అందులోకి దూకండి" అన్నాడు సేనాపతి.

సైనికులు అతని ఆజ్ఞను పాటిస్తూ కట్టెలు తెచ్చి పేర్చారు. దానికి నిప్పు కూడా పెట్టారు. కాని అందులోకి దూకాలనుకున్నప్పుడు వారు (అయోమయంగా) ఒకరి ముఖాలు మరొకరు చూసుకోసాగారు. వారిలో కొందరు మాట్లాడుతూ "మనం (నరకా) అగ్ని నుండి తప్పించుకోవడానికే కదా దైవప్రవక్త (స)కు విధేయులయ్యాం! అలాంటిది ఇప్పుడు మనం అగ్నిలో దూకడం ఏమిటీ?" అన్నారు. ఇలా ఆలోచిస్తూ మాట్లాడుకుంటుండగా ఆ నిప్పు కాస్తా ఆరిపోయింది. అటు సేనాపతి కోపం కూడా చల్లారిపోయింది.

ఆ తర్వాత దైవప్రవక్త (స) ముందు ఈ సంఘటన ప్రస్తావన వచ్చింది. అది విని ఆయన "వారు గనక అప్పుడు అగ్నిలో దూకివుంటే ఇకఎన్నటికీ అగ్నినుంచి బయటపడే వారు కాదు. శాశ్వతంగా నరకాగ్నిలోనే కాలిపోతుండేవారు. ధర్మసమ్మతమైన వ్యవహారాల్లో మాత్రమే అధికారులకు విధేయత చూపాలి" అని అన్నారు. (బుఖారి, ముస్లిం)

ధర్మసమ్మతమైన వ్యవహారాల్లోనూ ఒక్కోసారి విషయావగాహనా విభేదం వల్లగాని, మరే దైనా కారణంవల్లగాని అనుచరులు నాయకుని ఆదేశానికి భిన్నంగా ప్రవర్తించే అవకాశం ఉండ చ్చు. అప్పుడు నాయకుడు అనుచరుల చిత్తశుద్ధిని, కార్యదీక్షను లెక్కలోకి తీసుకోవాలి.

(1) దైవప్రవక్త (స) కందకం యుద్ధం ముగిసిన తరువాత అక్కడ్నుంచి తిరిగొచ్చి "బనీఖురైజా (యూదుల)వాడకు చేరుకోనంత వరకు ఎవరూ అసర్ నమాజ్ చేయ కూడదు"ని ఆదేశిస్తూ ఒక ప్రకటన చేయించారు. ఈ ప్రకటన వినగానే ప్రవక్త అనుచరు లంతా (జట్లు జట్లుగా) బయలుదేరారు. కొందరు కొంతదూరం నడిచిన తర్వాత దారి లోనే అసర్ వేళయింది. అప్పుడు వారిలో కొందరు "మనం బనూఖురైజా వాడకు చేరు కోనంతవరకు అసర్ నమాజ్ చేయకూడదు" అన్నారు. మరికొందరు దీన్ని వ్యతిరేకిస్తూ "కాదు, మనం ఇక్కడే నమాజ్ చేయాలి. దైవప్రవక్త (స) ఆదేశానికి అర్థం అసర్ నమాజ్ 'ఖజా' చేయాలని కాదుకదా?" అన్నారు.

(కొన్ని ఉల్లేఖనాల ప్రకారం మొదటి అభిప్రాయంతో ఏకీభవించినవారిలో కొందరు సూర్యాస్తమైన తర్వాత, మరికొందరు ఇషా వేళకు బనీఖురైజా వాడకు చేరుకొని అసర్ నమాజ్ చేశారు.) చివరికి ఈ వ్యవహారం దైవప్రవక్త (స) దృష్టికి తీసికెళ్ళారు. ఆయన అంతా విని ఆ ఉభయవర్గాల్లో ఎవరినీ కోపగించుకోలేదు. (బుఖారి, ముస్లిం)

(2) దైవప్రవక్త (సల్లం) ఓసారి కొందరు అనుచరుల్ని వెంటబెట్టుకొని బనీఉమర్ బిన్ ఔఫ్ తెగప్రజల మధ్య రాజీ కుదర్చడానికి వారి దగ్గరకు వెళ్ళారు. ఆ సందర్భంలో నమాజ్ వేళయింది. అప్పుడు ముఅజ్జిన్, హజ్రత్ అబూబకర్ (రజి)తో "నేను తక్బీర్ (ఇఖామత్) చెబుతాను, మీరు నమాజ్ చేయిస్తారా?" అని అడిగాడు. దానికి అబూబకర్ (రజి) "సరే, చేయిస్తాను" అన్నారు. ఆ తర్వాత ఆయన నమాజ్ చేయించడం ప్రారం భించారు. నమాజ్ ఇంకా పూర్తికాలేదు. అంతలో దైవప్రవక్త (స) వచ్చి జనాన్ని దాటు కుంటూ వెళ్ళి మొదటి వరుసలో నిలబడ్డారు. ఆయన్ని చూసి ప్రజలు (ముఖ్తదీలు) చప్పట్లు చరస్తూ, అబూబకర్ (రజి)ని సైగ చేయడానికి ప్రయత్నించారు.

హజ్రత్ అబూబకర్ (రజి) నమాజ్ చేస్తున్నప్పుడు ఇతర విషయాలపై మనస్సు పోనివ్వరు. అందువల్ల ఆయన ఆ విషయాన్ని పట్టించుకోలేదు. చివరికి ప్రజలు మరింత గట్టిగా చప్పట్లు చరచడంతో ఆయన విషయం గమనించారు. దైవప్రవక్త (స)ను చూడగానే ఆయన (ఇమామత్ స్థానం నుంచి) వెనక్కి జరగడానికి ప్రయత్నించారు. అయితే దైవప్రవక్త (స) ఆయన్ని (కదలకుండా) తన స్థానంలోనే నిలబడి ఉండమని ఆదేశించారు. కాని అబూబకర్ (రజి) దైవప్రవక్త (స) ఆజ్ఞ విని (ఆయన తనను అంతటి యోగ్యుడిగా గుర్తించినందుకు) రెండు చేతులెత్తి కృతజ్ఞతగా దేవుడ్ని స్తుతించారు. తరువాత వెనక్కి జరిగి అందరితోపాటు సమానంగా పంక్తిలో నిల్చున్నారు.

అప్పుడు దైవప్రవక్త (స) ముందుకెళ్ళి నమాజ్ చేయించారు. నమాజ్ ముగిసిన తర్వాత "అబూబకర్! నీ స్థానంలోనే నిలబడమని నేను ఆజ్ఞాపించినా నీవలా ఎందుకు చేయలేదు?" అని ప్రశ్నించారు. దానికి అబూబకర్ (రజి) "అబూఖహాఫా కొడుక్కి దైవప్రవక్త ముందు నిలబడేటంత శక్తి, సాహసం ఎక్కడున్నాయి?" అన్నారు. ఆ తర్వాత



దైవప్రవక్త (స) ప్రజల వైపుతిరిగి "మీరు (అనవసరంగా) చాలాసార్లు చప్పట్లు కొట్టారు. అసలీ (చప్పట్లు) చేత్తో శబ్దం చేయడమనేది స్త్రీల పని. నమాజ్‌లో ఏదైనా ఊహించని విషయం జరిగితే మీరు 'సుబ్‌హానల్లాహ్' అంటే చాలు. సుబ్‌హానల్లాహ్ అనగానే ఇమామ్ మీ ఉద్దేశ్యం గ్రహిస్తాడు" అని అన్నారు. (బుఖారి, ముస్లిం)

పాలకుల ఆజ్ఞల్ని ఏమేరకు పాటించాలి, వారు ధర్మవ్యతిరేక ఆజ్ఞలు జారీ చేసినప్పుడు ఎలా వ్యవహరించాలి అనే ప్రశ్నకు కూడా దైవప్రవక్త (స) ఇలా సమాధానమిచ్చారు:

"భవిష్యత్తులో మీపై కొందరు వ్యక్తులు పాలకులవుతారు. వారి పాలనలో మీకు కొన్ని మంచివిషయాలు, మరికొన్ని చెడువిషయాలు గోచరిస్తాయి. అప్పుడు చెడు విష యాలపట్ల నిరసన వెలిబుచ్చేవాడిపై ఎలాంటి బాధ్యత ఉండదు. అలాగే ఆ చెడువిష యాల్ని ఇష్టపడనివాడు కూడా (ప్రచారబాధ్యత నుండి) తప్పించుకుంటాడు. అయితే చెడువిషయాల్ని అంగీకరించి వాటిని అనుసరించేవాడ్ని మాత్రం (దైవన్యాయస్థానంలో) ప్రశ్నించడం జరుగుతుంది" అన్నారు దైవప్రవక్త (స). అప్పుడు అనుచరులు "అలాంటి ఆజ్ఞలు జారీఅయ్యే కాలం వస్తే మేము వారితో (పాలకులతో) యుద్ధం చేయవచ్చా?" అని అడిగారు. దానికి దైవప్రవక్త (స) "చేయకూడదు. వారు నమాజు చేస్తున్నంత కాలం (వారికి వ్యతిరేకంగా తిరుగుబాటు) చేయకూడదు" అని చెప్పారు. (ముస్లిం)

## అనుచరుల పట్ల దైవప్రవక్త (స) ప్రవర్తన

హజ్రత్ అనస్ (రజి) కథనం: నేను దైవప్రవక్త (స) దగ్గర పదేండ్లు పని చేశాను. కాని ఆయన నన్ను ఏనాడూ కోపగించుకోలేదు; పరుషంగా మాట్లాడలేదు. కనీసం "నువ్విలా ఎందుకు చేశావని కూడా నన్నడగ లేదు. (బుఖారి, ముస్లిం)

హజ్రత్ బిన్ అబ్దుల్లా (రజి) కథనం: దైవప్రవక్త (స)ను ఏదైనా వస్తువు అడిగిన ప్పుడు ఆయన ఏనాడూ లేదని అనలేదు. (బుఖారి, ముస్లిం)

హజ్రత్ ఆయిషా (రజి) కథనం: రెండు విషయాల్లో ఒకదాన్ని అవలంబించే స్వేచ్ఛ ఇవ్వబడినప్పుడు దైవప్రవక్త (స) ఆ రెండిటిలో సులభమైన విషయాన్నే ఎంచుకునేవారు. అయితే ఆ విషయం పాపకార్యమై ఉండకూడదు. ఒకవేళ ఆ సులభ విషయం పాప కార్యమైతే అందరికంటే ఆయనే దానికి దూరంగా ఉంటారు. దైవప్రవక్త (స) ఏనాడూ తన స్వవిషయంలో ఎవరిపైనా ప్రతీకారం తీర్చుకోలేదు. కాని దైవాజ్ఞల పట్ల అపచారం జరిగితే మాత్రం ఆయన తప్పకుండా ప్రతీకారం తీర్చుకునేవారు. (బుఖారి)

ఇత్‌బాన్ బిన్ మాలిక్ (రజి) కథనం: (ఒకసారి) దైవప్రవక్త (స) నమాజ్ చేయిం చటానికి నిలబడి "మాలిక్ బిన్ దుఖ్‌షుమ్ ఏడి?" అని అడిగారు. దానికి అక్కడున్న వారిలో ఒకతను "అతను కపటి, దేవునిపట్ల, దైవప్రవక్త పట్ల అతనికి అభిమానమే లేదు" అన్నాడు. ఆ మాట విని దైవప్రవక్త (సల్లం) అతడ్ని (మందలిస్తూ) "అంత మాటనకు. అతను దైవప్రసన్నత కోసం "లా ఇలాహ ఇల్లల్లాహ్" అనటం నీవు చూడ లేదా? దైవప్రసన్నత కోసం లా ఇలాహ ఇల్లల్లాహ్ అనేవారిపై దేవుడు నరకాగ్ని నిషిద్ధం చేస్తాడు" అని అన్నారు. (బుఖారీ, ముస్లిం)

హజ్రత్ ఆయిషా (రజి) కథనం: దైవప్రవక్త (స) ఒక పని చేసి (తమ అనుచరులకు) ఆ పని చేయమనో లేక చేయరాదనో సెలవిచ్చారు. అప్పుడు కొందరు ఆ విషయానికి సంబంధించి ఇవ్వబడిన సౌకర్యాన్ని ఉపయోగించుకోలేదు. ఈ సంగతి తెలిసి దైవప్రవక్త (స) ఒక ఉపన్యాసం ఇచ్చారు. అందులో మొదట దేవుని ఔన్నత్యం స్తుతించి తర్వాత ఇలా అన్నారు: "జనానికి ఏమైంది, నేను స్వయంగా చేస్తున్న పనులను మానేస్తున్నారు? దైవసాక్షిగా చెబుతున్నాను. దేవుడ్ని గురించి నాకు మీ అందరికంటే బాగా తెలుసు. మీ అందరిలోకి దేవునికి ఎక్కువగా భయపడేది కూడా నేనే." (బుఖారి)

హజ్రత్ అబూహురైరా (రజి) కథనం: దైవప్రవక్త (స) ఓరోజు ఫజర్ నమాజ్ చేయించిన తరువాత ప్రజల వైపు తిరిగి ఇలా అన్నారు- "ఒకతను ఒక ఎద్దును తోలుకెళ్తున్నాడు. కాస్సేపటి తరువాత అతనా ఎద్దు పైకెక్కి దాన్ని కొట్టసాగాడు. అప్పుడా ఎద్దు 'మేము స్వారీ కోసం సృష్టించబడలేదు, మేమసలు వ్యవసాయ పనుల కోసం సృష్టించబడ్డాము' అని అన్నది." ప్రజలు ఈమాట విని 'సుబ్‌హానల్లాహ్' (ఆశ్చర్యంగా ఉందే)! ఎద్దు కూడా మాట్లాడుతుందా?" అని అన్నారు. దానికి దైవప్రవక్త (స) "నేనీ విషయాన్ని నమ్ముతున్నాను. నేనేకాదు అబూబకర్ (రజి), ఉమర్ (రజి)లు కూడా నమ్ముతున్నారు" అని చెప్పారు. (దైవప్రవక్త ఈమాట చెబుతున్నప్పుడు వారిద్దరు అక్కడలేరు)- (బుఖారి)

దైవప్రవక్త (స) మరో విషయం గురించి ఇలా చెప్పారు- "మరొకతను మేకలు కాస్తుంటే ఒక తోడేలు లంఘించి ఆ మేకలలో ఒకదాన్ని ఎత్తుకెళ్ళింది. మేకల కాపరి ఆ తోడేలును వెంబడించి తన మేకను దాన్నుంచి విడిపించుకున్నాడు. అప్పుడా తోడేలు అతనితో 'ఓ మనిషీ! నువ్వీ మేకను నానుండి లాక్కున్నావు. కాని అడవి మృగాలు నిన్ను తరిమేసే రోజు ఈ మేకలను ఎవరు కాపాడుతారు? అప్పుడు నేనే కదా వాటికి కాపలా ఉండేదాన్ని' అని అన్నది." ప్రజలీ మాట విని 'సుబ్‌హానల్లాహ్' (ఆశ్చర్యంగా ఉందే)! తోడేలు కూడా మాట్లాడుతుందా?" అనిఅన్నారు. దానికి దైవప్రవక్త (స) "నేనీ విషయాన్ని నమ్ముతున్నాను. నేనేకాదు అబూబకర్ (రజి), ఉమర్ (రజి)లు కూడా నమ్ముతున్నారు" అని చెప్పారు. (దైవప్రవక్త ఈమాట చెబుతున్నప్పుడు వారిద్దరు అక్కడలేరు)- (బుఖారి)

హజ్రత్ అనస్ (రజి) కథనం: ఓసారి దైవప్రవక్త (స)కు కానుకగా ఒక పట్టు చొక్కా వచ్చింది. ఆయన పట్టువస్త్రాలు ధరించకూడదని వారించేవారు. ప్రజలు ఆ పట్టు చొక్కాని (తాకి) చూస్తూ ఆశ్చర్యపోయారు. అప్పుడు దైవప్రవక్త (స) వారిని చూసి "ఎవరి అధీనంలో ముహమ్మద్ ప్రాణముందో ఆ దేవుని సాక్షి! (స్వర్గంలో) సాద్ బిన్ ముఆజ్‌కు లభించే రుమాళ్ళు ఇంతకంటే ఎంతోనాణ్యంగా ఉంటాయి" అని అన్నారు. (బుఖారి)

హజ్రత్ అలి (రజి) కథనం: దైవప్రవక్త (స) నన్ను, జుబైర్ (రజి)ని, మిఖ్దాద్ బిన్ అస్వద్ (రజి)ని ఇలా ఆదేశించారు- "మీరు వెంటనే బయలుదేరి 'రోజాఖాఖ్' ప్రాంతానికి చేరుకోండి. అక్కడ ఓ స్త్రీ ఒంటె మీద పోతూ కన్పిస్తుంది. ఆమె దగ్గర ఒక ఉత్తరం ఉంది. దాన్ని తీసుకొని రావాలి." ఈఆజ్ఞ వినగానే మేము గుర్రాలను పరుగెత్తించి రోజాఖాఖ్‌కు చేరుకున్నాం. అక్కడ మాకు ఒంటె మీద వెళ్తున్న స్త్రీ కన్పించింది. మేమామెను



సమీపించి "ఉత్తరం తీసివ్వు మాకు" అని అన్నాము. దానికామె "నా దగ్గర ఉత్తరం గిత్తరం ఏమీ లేదు" అన్నది. మేము (గట్టిగా మాట్లాడుతూ) "మర్యాదగా ఉత్తరం తీసి ఇచ్చెయ్యి. లేదంటావా మేము నిన్ను వివస్త్ర చేసయినా సరే తీసుకోవలసి వస్తుంది" అని అన్నాం. దాంతో ఆమె (భయపడి) తన కొప్పులో నుంచి ఆ ఉత్తరం తీసి మాకు అప్పగించింది. మేము దాన్ని తీసుకొని దైవప్రవక్త (స) సన్నిధికి వెళ్ళాము.

ఆ ఉత్తరంలో "హాతిబ్ బిన్ బల్తా (రజి) తరఫున మక్కా బహుదైవారాధకుల పేర వ్రాయునది" అని ఉంది. అందులో దైవప్రవక్త (స) వ్యవహారాలకు సంబంధించిన (ప్రభుత్వ రహస్య) సమాచారం వారికి తెలియజేయబడింది. దైవప్రవక్త (స) ఆ ఉత్తరం చూసి "హాతిబ్! ఏమిటీ వ్యవహారం?" అని నిలదీశారు. దానికి హజ్రత్ హాతిబ్ (రజి) ఇలా మనవి చేసుకున్నారు- "దైవప్రవక్తా! నా విషయంలో తొందరపడి నిర్ణయం తీసుకోకండి. నేను ఖురైష్ తెగకు చెందినవాడ్ని కాను. వారి అండదండలతో బ్రతుకుతున్నవాడ్ని. మీతో పాటున్న ముహాజిర్‌లకు మక్కాలో ఖురైషీయులతో బంధుత్వం ఉంది. అంచేత వారి ఆస్తిపాస్తులు, భార్యాపిల్లలు అక్కడ క్షేమంగా, సురక్షితంగా ఉన్నారు. నా బంధువులకు అక్కడ భద్రత లేదు. అంచేత నేను మక్కా ఖురైషీయులకు ఏదైనా మేలు చేస్తే దానికి ప్రత్యుపకారంగా వారు నా బంధువులకు ఎలాంటి హాని కలిగించకుండా ఉంటారన్న ఉద్దేశ్యంతోనే నేనిలా చేయవలసి వచ్చింది. అంతేగాని నేనెలాంటి అవిశ్వాస వైఖరికి పాల్పడలేదు. ఇస్లాం ధర్మం వదలి మతభ్రష్టుణ్ణయి పోలేదు. ఇస్లాం స్వీకరించాక తిరిగి అవిశ్వాసకూపంలో పడిపోవాలని కూడా నేను అనుకోవడం లేదు."

దైవప్రవక్త (స) ఈ వివరణ విన్న తరువాత "ఇతను చెప్పింది నిజమే (ఇతని చిత్త శుద్ధిని శంకించడానికి ఆస్కారమేదీ లేదు)." అని అన్నారు. కాని ఉమర్ (రజి) మాట్లాడుతూ "దైవప్రవక్తా! నాకు అనుమతి ఇవ్వండి, ఈ కపటవిశ్వాసిని (ఒక్క దెబ్బతో) కడ తేరుస్తాను" అని అన్నారు. అయితే దైవప్రవక్త (స) (ఆయన్ని వారిస్తూ) "ఇతను బదర్ యుద్ధంలో పాల్గొనివున్నాడు. బదర్ యోధుల్ని దేవుడు (కటాక్ష వీక్షణలతో) చూశాడేమో నీకేం తెలుసు? అందువల్లనే ఆయన వారితో 'నేను మిమ్మల్ని క్షమించివేశాను. ఇక మీరు ఏది చేసినా సరే' అన్నాడు" అని అన్నారు. (బుఖారి)

# 72. ధర్మప్రచారం, సమాజసంస్కరణ

"మీలో ఒక వర్గం (ప్రజల్ని) మంచి వైపునకు పిలిచేవారు, సత్కార్యాలు చేయమని ఆజ్ఞాపించేవారు, చెడుపనుల నుండి వారించేవారు తప్పకుండా ఉండాలి. అలాంటివారే (ఇహపరలోకాల్లో) సాఫల్యం చెందేవారు." (ఖుర్‌ఆన్-3:104)

పై సూక్తిలో ముస్లిం జీవిత లక్ష్యం ఏమిటో చెప్పబడింది. దీన్నిబట్టి ప్రతి ముస్లిం తన శక్తిసామర్థ్యాల మేరకు సమాజంలో చెడుగుల్ని అరికడ్తూ మంచిని వ్యాపింపజేస్తూ ప్రజలను సంస్కరించడానికి కృషిచేయాలని అర్థమవుతోంది. దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు:

"దైవాజ్ఞలను ఉల్లంఘిస్తున్నవారిని, ఆ ఉల్లంఘనపై వారిని విమర్శించనివారిని ఇలా రెండస్థుల ఓడలోని ప్రయాణీకులతో పోల్చవచ్చు- చీటి వేయడం ద్వారా కొందరు

పైఅంతస్థులో, కొందరు క్రిందిఅంతస్థులో కూర్చున్నారు. క్రింది అంతస్థువాళ్ళు బకెట్‌తో సముద్రంలోని నీళ్ళు తోడుకోవడానికి పైఅంతస్థుకు వెళ్తున్నప్పుడల్లా పైఅంతస్థువాళ్ళకు ఇబ్బంది కలిగేది. దాంతో వాళ్ళు క్రిందిఅంతస్థువాళ్ళను విసుక్కునే వాళ్ళు.

అప్పుడు క్రిందిఅంతస్థువాళ్ళు గొడ్డలి తీసుకొని ఓడ అడుగున ఉన్న పలకలను ఊడబెరకడం ప్రారంభించారు. పై అంతస్థువాళ్ళు (విస్తుబోయి) 'ఇదేమిటీ ఇలా చేస్తున్నార?'ని అడిగారు. దానికి క్రింది అంతస్థువాళ్ళు 'మాకు నీళ్ళు కావాలి. నీళ్ళ కోసం మేము మాటిమాటికి పైకి వస్తుంటే మీకు బాధ కలుగుతోంది కదా! అందుకని మేము ఓడ పలకలను ఊడబెరికి నీళ్ళు తీసుకోదలిచాము' అని చెప్పారు.

పైఅంతస్థు వాళ్ళు గనక క్రింది అంతస్థువాళ్ళను ఆ పని నుండి అడ్డుకుంటే వారిని కూడా కాపాడగలరు, తమను కూడా కాపాడుకుంటారు. అలా అడ్డుకోకపోతే వారిని కూడా ముంచివేస్తారు, తాము కూడా మునిగిపోతారు." (బుఖారి)

విశ్వాసుల మాతృమూర్తి ఉమ్ముల్ హకమ్ జైనబ్ బిన్తె జహష్ (రజి) కథనం: (ఒకరోజు) దైవప్రవక్త (స) కంగారుపడుతూ నా ఇంటికి వచ్చారు. ఆ సమయంలో ఆయన నోట ఈ పలుకులు వెలువడ్డాయి- "అల్లాహ్ తప్ప వేరే ఆరాధ్యదైవం లేడు. అరబ్బులు నాశనమయిపోయే విపత్తు దగ్గరకొచ్చింది. ఈరోజు యాజూజ్, మాజూజ్‌ల గోడ ఇంత తెరువబడింది." అంటూ ఆయన తన రెండు వ్రేళ్ళను బొటన వ్రేలిని, దాని ప్రక్కనున్న వ్రేలితో కలుపుతూ వలయంలా చేసి చూపించారు. దానికి నేను "ఏమిటి దైవప్రవక్తా! మనమంతా నాశనమయిపోతామా? (అప్పుడు) మనలో మంచివారు కూడా ఉంటారుగా!" అన్నాను. "అవును, చెడు సర్వసామాన్యమై పోయినప్పుడు (మంచివాళ్ళు కూడా దైవశిక్షకు గురౌతారు)" అన్నారు దైవప్రవక్త (స). (బుఖారీ, ముస్లిం)

హజ్రత్ అబూసయీద్ ఖుద్రీ (రజి) కథనం: ఓసారి దైవప్రవక్త (స) "మీరు (ప్రజలు నడిచే) దారుల్లో కూర్చోకండి" అని ఆదేశించారు. అప్పుడు అనుచరులు, "దైవ ప్రవక్తా! దారుల్లో కూర్చోవటం తప్ప మాకు వేరేదారి లేదు. మేము అక్కడ కూర్చొని (ముఖ్యమైన) మాటలు మాట్లాడుకుంటాము" అని అన్నారు. "సరే (దారుల్లో) కూర్చోవ టం తప్పదనుకుంటే మీరు దారిహక్కు నెరవేర్చాలి" అన్నారు దైవప్రవక్త (స). అది విని అనుచరులు "దారిహక్కు అంటే ఏమిటి దైవప్రవక్తా?" అని అడిగారు మళ్ళీ. "చూపులు క్రిందికి దించుకోవడం, బాధాకరమైన వస్తువులను దారి నుండి తొలగించడం, సలాంకు జవాబు చెప్పడం, మంచిని గురించి బోధించడం, చెడు నుంచి వారించడం (ఇదే దారిహక్కు)" అన్నారు దైవప్రవక్త. (బుఖారీ, ముస్లిం)

దైవప్రవక్త (స) హజ్రత్ అలీ (రజి)తో ఇలా అన్నారు: "(అలీ!) దైవసాక్షి! దేవుడు నీద్వారా ఏ ఒక్కడికి సన్మార్గం చూపినా అది నీ పాలిట ఎరుపుఒంటెల కన్నా కూడా ఎంతో విలువైనది." (బుఖారీ)

దైవప్రవక్త (స) ప్రవచనం: "మీలో అందరికన్నా అల్పునిపై నాకెంత విశిష్ఠత ఉందో ఒక జ్ఞానికి ఒక ఆరాధకుడిపై అంత విశిష్ఠత ఉంటుంది. ప్రజలకు మంచిని



బోధించేవారిపై దేవుడు కారుణ్యం కురిపిస్తాడు. అంతేకాదు దైవదూతలు, భూమ్యా కాశాల్లో ఉన్నవారు, చివరికి చీమలు సైతం తాముండే రంధ్రాల్లో నుంచి, చేపలు (నీటిలో నుంచి) వారిమీద దైవకారుణ్యం వర్షించాలని ప్రార్థిస్తుంటారు." (తిర్మిజీ)

## బంధువుల్లో ధర్మప్రచారం

"నీ దగ్గరి బంధువులను (దైవశిక్షను గురించి) భయపెట్టు." (ఖుర్‌ఆన్-26:214)

సత్యధర్మ ధ్వజవాహకులు ముందుగా తమ కుటుంబం నుంచే ధర్మప్రచారం ప్రారంభించాలని ఈసూక్తి తెలుపుతోంది. అందువల్ల దైవప్రవక్త (సల్లం) మొట్టమొదట తన దగ్గరి బంధువుల్ని ఓరోజు సమావేశపరచి ఇలా బోధించారు: "అబ్దుల్ ముత్తలిబ్ సంతతి ప్రజలారా! (చిన్నాన్న) అబ్బాస్! ప్రవక్తమేనత్త సఫియా! ముహమ్మద్ కూతురు ఫాతిమా! మిమ్మల్ని మీరు నరకాగ్ని నుండి కాపాడుకునే విషయం గురించి ఆలోచిం చండి. కావాలంటే మీకు నాఆస్తి నుండి మీరు కోరినంత ధనం ఇవ్వగలను. అంతేగాని, నేను మిమ్మల్ని దేవుని పట్టు నుండి మాత్రం ఏవిధంగానూ కాపాడలేను."

ఆ తర్వాత ఓరోజు ఉదాయాన్నే ఆయన సఫా కొండ ఎక్కి "ఖురైషీయులారా! కాబ్ బిన్ లుఅయ్యి సంతతివారలారా! ముర్రతెగ జనులారా! ఖుసయ్యి సంతానమా! అబ్దెమునాఫ్ సంతతి ప్రజలారా! హాషిం వంశస్థులారా! అబ్దుల్‌ముత్తలిబ్ వంశస్థులారా!" అని ఎలుగెత్తి పిలిచారు. ఎవరికైనా తెల్లవారుజామున శత్రువర్గం అకస్మాత్తుగా దాడిచేసే ప్రమాదం కన్పిస్తే అతను వెంటనే కొండెక్కి ఈవిధంగా జనాన్ని ఎలుగెత్తి పిలుస్తాడు. అతని పిలుపు విని జనం నలువైపుల నుండి పరుగెత్తుకు వస్తారు. ఇది ప్రాచీన అరబ్ సంప్రదాయం. ఈ సంప్రదాయం ప్రకారం దైవప్రవక్త (స) ఇచ్చిన పిలుపు విని ప్రజలు సఫాకొండ దగ్గరికి పరుగెత్తుకొచ్చారు. అప్పుడు దైవప్రవక్త (స) ఇలా అన్నారు: "ఈకొండ వెనుక నుంచి ఓ పెద్ద సైన్యం మీపై దాడిచేయడానికి పొంచిఉందని చెబితే నా మాటలు మీరు నమ్ముతారా?" అనడిగారు. దానికి జనం "ఎందుకు నమ్మం? మాకు తెలిసినంతవరకు నీవు ఎప్పుడూ అబద్ధమాడ లేదు" అన్నారు.

"అయితే నేనిప్పుడు తీవ్రమైన దైవశిక్ష విరుచుకు పడకముందే మిమ్మల్ని హెచ్చ రిస్తున్నాను. మిమ్మల్ని మీరు దేవుని పట్టునుండి కాపాడుకోవడానికి ప్రయత్నించండి. దేవుని అభిమతానికి వ్యతిరేకంగా నేను మీకు ఎలాంటి సహాయం చేయలేను. ప్రళయ దినాన దైవభీతిపరులు మాత్రమే నాకు బంధువులవుతారు. ఇతరులు సత్కర్మలతో వస్తే, మీరు ప్రాపంచిక వ్యామోహం అనే పాపభారంతో రావడం జరగకూడదు సుమా! ఆరోజు మీరు ఓ ముహమ్మద్! అని (సహాయం కొరకు) పిలుస్తారు. కాని నేను విధిలేక మీ నుండి ముఖం తిప్పుకుంటాను. ఇహలోకంలో మీరు నా రక్తసంబంధీకులైనందున నేనిక్కడ మీకు అన్నివిధాలా సహాయం చేయగలను. కాని పరలోకంలో నేను మీకోసం ఏమీ చేయలేను" అని బోధించారు దైవప్రవక్త (స). (బుఖారి, ముస్లిం)

దైవప్రవక్త (స) ఇలా అన్నారు: "మంచి వైపుకు దారి చూపించినవానికి, దాన్ని ఆచరించినవానికి సమానంగా పుణ్యం లభిస్తుంది." (ముస్లిం)

దైవప్రవక్త (స) ప్రవచనం: “(ప్రజలను) సన్మార్గం వైపుకు పిలిచినవానికి, అతడ్ని అనుసరించినవారికి లభించినంత పుణ్యం లభిస్తుంది. అయితే ఇది వారి పుణ్యంలో ఎలాంటి లోటు రానివ్వదు. (ప్రజలను) మార్గభ్రష్టత వైపుకు పిలిచినవానిపై, అతడ్ని అనుసరించినవారి పాపం మోపబడుతుంది. దీనివల్ల అతడ్ని అనుసరించినవారి పాపాల్లో ఎలాంటి తగ్గింపు ఉండదు.” (ముస్లిం)

దైవప్రవక్త (స) ప్రవచనం: “మీలో ఎవరైనా సమాజంలో ఏదైనా చెడ్డ పని చూసినప్పుడు దాన్ని అతను చేత్తో నిరోధిస్తే, దేవుని దగ్గర జవాబుదారీబాధ్యత నుండి తప్పించుకుంటాడు. అంతటి శక్తి లేనివాడు ఆ చెడుకు వ్యతిరేకంగా గళంవిప్పి అరికట్టేందుకు ప్రయత్నిస్తే అతను కూడా ఆ బాధ్యత నుండి తప్పించుకుంటాడు. గళంవిప్పి నిరోధించే శక్తి కూడా లేనివాడు కనీసం మనసులోనైనా ఆ చెడు విషయాన్ని అసహ్యించుకుంటే అతను కూడా జవాబుదారీబాధ్యత నుండి తప్పించుకుంటాడు. ఈ(చివరి) వైఖరి అన్నిటి కంటే అత్యల్పస్థాయి విశ్వాసం (ఈమాన్) క్రిందికి వస్తుంది.” (నిసాయి)

## సమాజ సంస్కరణ

“విశ్వాసులారా! ఇకనుండి ప్రపంచ మానవులకు మార్గదర్శనం చేస్తూ వారిని సంస్క రించడానికి రంగంలోకి తీసుకురాబడిన శ్రేష్ఠసమాజం మీరే. మీరు మంచిపనులు చేయమని ప్రజలను ఆదేశిస్తారు. చెడుల నుండి వారిస్తారు.” (ఖుర్ఆన్–3:110)

ఖుర్ఆన్ ప్రజలలో దైవభీతి, పరలోకచింతనలు కలిగించి తద్వారా వారిని నీతి మంతులుగా, సత్పౌరులుగా తీర్చిదిద్దగోరుతోంది. వివిధ చెడుల్ని నిర్మూలించి ఆరోగ్యవంతమైన సమాజాన్ని నెలకొల్ప దలచింది. ఈలక్ష్యం కోసం ఖుర్ఆన్ ముస్లింలపై మంచినిపెంచే, చెడును త్రుంచే పని నిర్భంధం చేసింది. దీనికోసం ముస్లింలలో ఒక వర్గం వ్యవస్థీకృత సంఘంగా ఏర్పడాల్సిన ఆవశ్యకత ఉందని చెబుతోంది. ముఖ్యంగా ధార్మిక, సామాజిక స్పృహ కలిగిన ముస్లింలపై చెడును త్రుంచే, మంచిని పెంచే బాధ్యత మరింత అధికమవుతుంది. ఈ పని నిర్వహించకపోతే సమాజ పతానానికి దేవుని సమక్షంలో ప్రధానబాధ్యులు వారే అవుతారు.

దైవప్రవక్త (స) ఈ విషయాన్ని ఓ తార్కాణంతో ఇలా వివరించారు: “దేవుడు, ఒక ఊరిని ఆ ఊరిప్రజలతో సహా తల్లక్రిందులు చేయమని జిబ్రీల్ (అలై)ని ఆజ్ఞాపించాడు. జిబ్రీల్ (అలై) ఆ ఊరిని చూసివచ్చి ‘ప్రభూ! అక్కడ ఒక్క క్షణం కూడా నీకు అవిధేయత చూపని నీదాసుడు కూడా ఒకడున్నాడు కదా (నేనెలా ఆ ఊరిని శిక్షించను)?’ అని అన్నారు. ‘కాని నాధర్మం అగౌరవం, అపచారాలకు గురవుతుంటే అతని ముఖం ఏనాడూ (ఆగ్రహంతో) జేవురించ లేదు. కనుక ఇతరులతో పాటు అతడ్ని కూడా కలిపి మొత్తం ఊరిని తల్లక్రిందులు చేసెయ్యి’ అని దేవుడు మళ్ళీ ఆదేశించాడు.” (మిష్కాత్)

సమాజమంతా భ్రష్టుపట్టి పోయినప్పుడు, దాన్ని సంస్కరించడానికి కృషి చేయకుండా వ్యక్తిగత సత్కార్యాల వల్ల ఎలాంటి ప్రయోజనం లేదని ఈ హదీసు వివరిస్తోంది. అంతేకాదు, అలాంటి భ్రష్టసమాజంపై విరుచుకుపడే దైవశిక్ష నుండి వ్యక్తిగత సత్కార్యాలతో తృప్తిపడే ముస్లింలు కూడా తప్పించుకోలేరని ఇది ప్రస్ఫుటం చేస్తోంది. దైవప్రవక్త (స) సంఘసంస్కరణ ప్రాముఖ్యం తెలుపుతూ పలికిన పలుకులు చూడండి:



“నాప్రాణం ఏ శక్తిస్వరూపుని అధీనంలో ఉందో ఆ దేవుని సాక్షి! మీరు (ప్రజలను) సత్కార్యాలు చేయమని అదేశించే, దుష్కార్యాల నుంచి వారించే పనయినా చేయాలి. లేదా దేవుడు మీపై శిక్షనయినా దించుతాడు. అప్పుడు మీరు ఎంత మొరపెట్టుకున్నా ఆయన మీ మొరలు  ఆలకించడు.” (మిష్కాత్)

“ఏ జాతిలో చెడులు ప్రబలుతాయో ఆ జాతిలో ఉండే సంస్కరణాసామర్థ్యం కలవారు దాన్ని సంస్కరించకపోతే దేవుడు ఆ జాతి ప్రజలందరిపై ఏదయినా శిక్ష దించే సమయం ఆసన్నమయిందని వారు తెలుసుకోవాలి.” (మిష్కాత్)

ఈ రెండు హదీసులు సమాజసంస్కరణ ఆవశ్యకతను నొక్కి చెబుతున్నాయి. కాబట్టి ముస్లింలు సమాజంలోని చెడుల్ని చూస్తూ చేతులు ముడుచుకొని కూర్చోవడానికి వీల్లేదు. దైవప్రవక్తలు ఏకదైవారాధన నినాదమిస్తూ మొట్టమొదట ప్రారంభించిన కార్యం ఇదే. సమాజాన్ని పట్టిపీడించే ముఖ్యమైన చెడులకు వ్యతిరేకంగా వారు ఉద్యమం లేవదీసి ఆ చెడుల్ని అవలంబించే, వ్యాపింపజేసే వారిని తీవ్రంగా విమర్శించేవారు:

“మీరెంత సిగ్గుమాలిన పనికి పాల్పడుతున్నారు! మీకు పూర్వం లోకంలో ఎవరూ ఇలాంటి పని చేయలేదే!! మీరు (స్త్రీలను వదలి) పురుషుల వెంటపడ్డారా? దారి దోపిడీలు కూడా చేస్తున్నారు.” (ఖుర్ఆన్–29:28,29)

“తూనికల్లో, కొలతల్లో న్యాయం పాటించండి. ఎవరికీ నష్టం కలగజేయకండి. సరైన త్రాసుతో తూచివ్వండి. ప్రజలకు రావలసిన సరుకులు తగ్గించి ఇవ్వకండి. ధరణిలో అల్లర్లు, అలజడులు రేపుతూ తిరగకండి.” (ఖుర్ఆన్–26:181–183)

“మీరు కొండలు తొలచి బడాయి కోసం పెద్దపెద్ద కట్టడాలు నిర్మిస్తున్నారా! దేవునికి భయపడండి, నాకు విధేయత చూపండి. హద్దుమీరి ధరణిలో ఎలాంటి సంస్కరణలు చేయ కుండా, అల్లర్లు రేకెత్తిస్తూ తిరిగేవారికి విధేయత చూపకండి.” (ఖురాన్:26:149–152)

దైవప్రవక్త (స) ఇలా తెలియజేశారు: “ఇస్రాయీల్ జాతి (ధర్మం)లో అన్నిటికన్నా ముందు ఏర్పడిన లోపం ఏమిటంటే, వారిలో ఒకడు మరొకనితో ‘అయ్యా! దేవునికి భయపడు. నీవు చేస్తున్న (చెడు)పని వదలిపెట్టు. నీకిది ధర్మసమ్మతం కాదు’ అని అంటాడు. కాని మరుసటి రోజు ఆవ్యక్తి (తన పద్ధతి మార్చుకోకుండా) అదే స్థితిలో ఉన్నప్పటికీ అతను నిస్సంకోచంగా ఆ వ్యక్తితోపాటు తింటాడు, తాగుతాడు, అతనితో కలసి కూర్చుంటాడు. అలా చేసినందుకు దేవుడు వారందరి హృదయాలను ఒకేలా మార్చివేశాడు.” తరువాత దైవప్రవక్త (స) ఖుర్ఆన్‌లోని ఈసూక్తి పఠించారు:

“ఇస్రాయీల్ సంతతిలో సత్యాన్ని తిరస్కరించినవారు దావూద్ నోట, మర్యం కుమారుడు ఈసా నోట శపించబడ్డారు. దానిక్కారణం వారు అవిధేయులయి హద్దుమీరి ప్రవర్తించడమే. అదీగాక వారు ఒకర్నొకరు చెడుల నుండి వారించుకునేవారు కాదు. నిజంగా వారు చాలా చెడ్డపని చేశారు. ఈనాడు కూడా అలాంటివారు నీకు చాలామంది కనిపిస్తారు. వారు (విశ్వాసులకంటే) అవిశ్వాసులతోనే ఎక్కువ స్నేహసంబంధాలు పెట్టు కుంటారు. వారు ముందుగా పంపుకున్నది చాలా చెడ్డ విషయం (అంటే దుష్కర్మలు).

వారిపై దైవాగ్రహం విరుచుకుపడింది. వారిక శాశ్వతంగా (నరక) యాతనల్లో చిక్కుకొని ఉంటారు. వారు గనక దేవుణ్ణి, దైవప్రవక్తను, వారి దగ్గరకు పంపబడిన గ్రంథాన్ని విశ్వసించి వుంటే (ఇలా) వారు అవిశ్వాసుల్ని స్నేహితులుగా చేసుకునేవారు కాదు. కాని వారిలో చాలామంది దుర్జనులే ఉన్నారు." (5:78-81)

ఈసూక్తి పఠించిన తర్వాత ఆయనిలా అన్నారు: "లేదు లేదు, మీరు తప్పకుండా మంచిని గురించి ఆదేశించాల్సిందే; చెడు నుంచి వారించాల్సిందే. మీరు తప్పకుండా అన్యాయం చేసేవాడిని చెయ్యిపట్టి అడ్డుకోవాలి. బలవంతంగానైనా అతణ్ణి న్యాయం వైపుకు మరల్చండి. సత్యాన్ని (అంగీకరించమని) ఒత్తిడి తీసుకురండి. ఇలా చేయకపోతే దేవుడు మీఅందరి హృదయాలను ఒకేలా మార్చివేస్తాడు. వారిని శపించినట్లుగానే మిమ్మల్నీ శపిస్తాడు." (అబూదావూద్, తిర్మిజీ)

హజ్రత్ అబూబక్ర్ సిద్దీఖ్ (రజి) ఇలా అన్నారు: "ప్రజలారా! మీరు ఈ సూక్తిని పఠిస్తూనేఉంటారు. "విశ్వాసులారా! మిమ్మల్ని గురించి మీరు ఆలోచించుకోండి. మీరు సన్మార్గంలో ఉంటే, ఇతరులు మార్గభ్రష్టులైనా మీకేమాత్రం హాని కలగదు." (5:105). కాని దైవప్రవక్త (స) "ప్రజలు ఒక దౌర్జన్యపరుణ్ణి (దౌర్జన్యం చేస్తుండగా) చూసి కూడా అతణ్ణి చెయ్యిపట్టి ఆపకపోతే త్వరలోనే దైవశిక్ష వారందరినీ చుట్టుముడుతుంది" అని చెబుతుండగా నేను విన్నాను. (అబూదావూద్, తిర్మిజీ, నసాయీ)

# 73. జిహాద్ (పోరాటం)

"పరలోకజీవితం కోసం ప్రాపంచికజీవితం అమ్మదలచుకున్నవారు దైవమార్గంలో పోరాడాలి. దైవమార్గంలో పోరాడి అమరగతినొందినా లేక విజయం సాధించినా అలాంటి వ్యక్తికి మేము గొప్ప ప్రతిఫలం ప్రసాదిస్తాము. దిక్కులేక పోవడం చూసి అణచివేయబడ్డ స్త్రీలు, పురుషులు, పిల్లలను రక్షించడానికి మీరు దైవమార్గంలో ఎందుకు పోరాడరు? వారు (బాధలు భరించలేక) "దేవా! దుర్మార్గులు నివసిస్తున్న ఈ నగరం నుండి మమ్మల్ని బయటికి తీసి కాపాడు. మాకు రక్షణ కల్పించి అండగా నిలిచే వారినెవరినైనా నీవైపు నుండి మాదగ్గరికి పంపు" అని మొరపెట్టుకుంటున్నారే! అలాంటి పీడితప్రజల రక్షణ కోసం ఎందుకు పోరాడరు మీరు?" (ఖుర్ఆన్-4:74,75)

తగినశక్తి, అధికారాలతోపాటు, ప్రజలకు నేతృత్వం వహించగల నాయకుడు ఉన్నప్పుడు అధర్మం, అన్యాయాలను అంతమొందించడానికి అంతిమసాధనం యుద్ధమేనని 4వ అధ్యాయంలోని 74-100 సూక్తులు తెలియజేస్తున్నాయి.

"వారు (ప్రపంచంలో) యుద్ధజ్వాలలు రగిల్చినప్పుడల్లా దేవుడు వాటిని చల్లార్చవలసి వస్తున్నది. వారు ఎల్లప్పుడూ ధరణిపై ఏదోఒక ఉపద్రవం సృష్టించడానికే ప్రయత్నిస్తుంటారు. దేవుడు ఇలాంటి కలహకారుల్ని ఎన్నటికీ ప్రేమించడు." (ఖుర్ఆన్-5:64)

"దేవుడు కొందరి ద్వారా కొందరిని నిర్మూలించకపోతే ప్రపంచం అరాచకం, అల్లకల్లోలాలతో నిండిపోతుంది. దేవుడు ప్రపంచ మానవుల పట్ల ఎంతో దయామయుడు. (అందుకే ఆయన అశాంతి, అరాచకాలు నిర్మూలించే ఏర్పాట్లు చేస్తుంటాడు.)" (ఖుర్ఆన్-2:251)



"విశ్వాసులారా! మిమ్మల్ని దుర్భరమయిన (నరక) యాతనల నుండి కాపాడగలిగే వ్యాపార పద్ధతిని గురించి మీకు తెలుపమంటారా? మీరు మనస్ఫూర్తిగా దేవుణ్ణి, ఆయన ప్రవక్తను విశ్వసించి ధనప్రాణాలు ఒడ్డి దైవమార్గంలో పోరాడండి. " (ఖుర్ఆన్-61:10,11)

"దేవుడు విశ్వాసుల నుండి వారి ధనప్రాణాలు కొనుగోలుచేశాడు. వాటికి బదులుగా వారికోసం స్వర్గం సిద్ధపరచిఉంచాడు. వారు దైవమార్గంలో పోరాడుతూ హతమార్చుతారు లేదా హతమార్చబడతారు. (వారికి స్వర్గం లభిస్తుందని) తౌరాత్‌లో, ఇన్జీల్‌లో, ఖుర్ఆన్‌లో వాగ్దానంఉంది. దాన్ని నెరవేర్చేబాధ్యత దేవునిపై ఉంది. వాగ్దానం నెరవేర్చడంలో దేవుణ్ణి మించిన వారెవరుంటారు? కనుక దేవునితో మీరు చేసుకున్న ఈ వ్యాపార ఒప్పందం పట్ల ఆనందోత్సవాలు జరుపుకోండి. ఇదే ఘనవిజయం." (ఖుర్ఆన్-9:111)

"విశ్వాసులు దైవమార్గంలో పోరాడుతారు. అవిశ్వాసులు షైతాన్ మార్గంలో పోరాడుతారు. కనుక మీరు (దైవమార్గంలో) షైతాన్ అనుచరమూకతో పోరాడండి. షైతాన్ పన్నే కుటిల పన్నాగాలన్నీ చాలా బలహీనమైనవని తెలుసుకోండి." (ఖుర్ఆన్-4:76)

ముస్లింలు యుద్ధం చేసే పరిస్థితి రావాలని ఎన్నడూ కోరుకోకూడదని, యుద్ధం అనివార్యమైతే మాత్రం స్థిరంగా నిలబడి ధైర్యంగా పోరాడాలని ఇస్లాం చెబుతోంది.

హజ్రత్ అబూఇబ్రాహీం అబ్దుల్లా బిన్ అబూఔఫా (రజి) కథనం: శత్రువులతో తలపడాల్సి వచ్చిన రోజుల్లో దైవప్రవక్త (స) యుద్ధం కోసం నిరీక్షించారు. సూర్యుడు నడినెత్తి నుండి క్రిందికి వాలిన తర్వాత జనం మధ్య నిలబడి ఇలా ప్రసంగించారు: "ప్రజలారా! మీరు ఎన్నడూ శత్రువుతో తలపడాల్సిన పరిస్థితి రావాలని కోరుకోకండి. నిత్యం శాంతినే కోరుకుంటూ దైవాన్ని ప్రార్థించండి. అయితే శత్రువులతో యుద్ధం చేయవలసిన పరిస్థితి వస్తే మాత్రం సహన స్థయిర్యాలతో పోరాడండి. స్వర్గం ఖడ్గచ్ఛాయల క్రింద ఉందన్న సంగతి తెలుసుకోండి." తరువాత దైవప్రవక్త (స) ఇలా ప్రార్థించారు: "దేవా! దివ్యగ్రంథాన్ని అవతరింపజేసినవాడా! మేఘాలను నడిపించేవాడా! శత్రుసేనలను ఓడించినవాడా! ఈ శత్రువుల్ని కూడా ఓడించి వీరికి వ్యతిరేకంగా మాకు సహాయపడు." (బుఖారీ, ముస్లిం)

శత్రువు ఇస్లామీయ రాజ్యంపై (ముస్లిం దేశంపై కాదు) దాడి చేసినప్పుడు ఇస్లామీయ రాజ్యంలోని ప్రతిముస్లింకు శత్రుదాడిని ఎదుర్కోవడం విధి అవుతుందని ధర్మావగాహన (ఫిఖా) గ్రంథాలన్నిటిలో పేర్కొనడం జరిగింది. దీన్ని "జిహాద్ ఫీసబీలిల్లాహ్" (దైవమార్గంలో పోరాటం) అంటారు. మరో మాటలో చెప్పాలంటే దేవుని ప్రసన్నత కోసం, పరలోక ప్రతిఫలాపేక్షతో చేసే పోరాటం అన్న మాట. ఈ మార్గంలో వేసే ప్రతి అడుగూ పాపశమనానికి కారణభూతమవుతుంది.

"అలాగే (దైవమార్గంలో) కొద్దో గొప్పో ఏదయినా ఖర్చుచేస్తే లేదా ధర్మసంస్థాపనా కృషిలో ఏవైనా గుట్టలుమిట్టలు దాటి పురోగమిస్తే ఆ సత్కార్యాలు కూడా (వారి కర్మపత్రంలో) వ్రాయకుండా ఉండటమనేది జరగదు." (ఖుర్ఆన్-9:121)

హజ్రత్ సాబ్ బిన్ జష్షామా కథనం: దైవప్రవక్త (స) అబ్వా లేక వద్దాన్ మీదుగా ప్రయాణిస్తున్నప్పుడు నేను ఆయన వెంటఉన్నాను. అప్పుడొకతను మాట్లాడుతూ "దారుల్ హరబ్ (శత్రుదేశం)లోని బహుదైవారాధకులపై మెరుపుదాడి చేసినప్పుడు వారి స్త్రీలు,

పిల్లలు కూడా చంపబడటం జరిగితే (అది ధర్మసమ్మతమేనా)?" అనిఅడిగాడు. దానికి దైవప్రవక్త (స) "వారు వాళ్ళలోనే ఉన్నారు కదా" అని అన్నారు. (బుఖారి, ముస్లిం)

జిహాద్ ప్రాముఖ్యం గురించి దైవప్రవక్త (స) బోధించిన ఈ హితోక్తులు చూడండి:

"దేవుడు తన మార్గంలో (ధర్మసంస్థాపన కోసం) పోరాటం సలిపే వ్యక్తికి స్వర్గప్రవేశ భాగ్యమైనా ప్రసాదిస్తాను లేదా పుణ్యం, సమరసొత్తులు అనుగ్రహించి అతడ్ని ఇంటికైనా మరలింపజేస్తాను అని హామీనిస్తున్నాడు. అయితే అతను కేవలం దైవప్రసన్నత కోసమే పోరాటం జరపాలి, ఆయన (ఖుర్ఆన్) సూక్తుల్ని సమర్థించాలి." (బుఖారి)

"దైవమార్గంలో ఒక ఉదయమో లేదా ఒక సాయంత్రమో గడపడం (పుణ్యఫలం రీత్యా) యావత్ప్రపంచం, ప్రపంచసంపదలన్నిటి కంటే ఎంతో శ్రేష్ఠమైనది."(బుఖారి)

"దైవమార్గంలో ఒక రోజు సరిహద్దు చౌకీల దగ్గర కాపలా కాయడం ఇతర ప్రదేశాలలో వేయి రోజుల పాటు ఆరాధన చేయడం కంటే ఎంతో శ్రేష్ఠమైనది." (తిర్మిజి, నసాయి)

"మరణించిన ప్రతి మనిషి కర్మల పరంపర అతని మరణంతోనే ముగిసిపోతుంది. కాని దైవమార్గంలో (ఇస్లామీయ రాజ్య)సరిహద్దు మీద కాపలాకాసే యోధుని కర్మలు ప్రళయందాకా కొనసాగుతాయి (అప్పటిదాకా వాటి పుణ్యం అతనికి లభిస్తునే ఉంటుంది). అతను సమాధి పరీక్షల నుండి కూడా సురక్షితంగా ఉంటాడు. (అబూదావూద్, తిర్మిజీ)

"ప్రతి ముస్లింకు దైవమార్గంలో (ధర్మరక్షణ పోరాటంలో) అయ్యే గాయం, దెబ్బ తగిలినప్పుడు రక్తం కారిపోతూ ఎర్రగా ఎలా ఉండేదో ప్రళయదినాన (తిరిగి బ్రతికించబడే రోజు) కూడా అదేవిధంగా (రక్తం కారుతూ) ఉంటుంది. అయితే ఆ గాయం నుండి కస్తూరి సువాసన వెలువడుతూ ఉంటుంది." (బుఖారి, ముస్లిం)

"అమరగతుడు హతమార్చబడినప్పుడు అతనికి చీమ కుట్టినంత నొప్పి మాత్రమే కలుగుతుంది." (తిర్మిజీ)

"అమరగతుడయిన ఒక్క వీరయోధుడు (షహీద్) తప్ప స్వర్గంలో ప్రవేశించిన ఏవ్యక్తి కూడా ప్రపంచంలోని సంపదలన్నీ ఇవ్వబడతాయన్నా సరే, మళ్ళీ ఇహలోకానికి పోవడానికి ససేమిరా ఇష్టపడడు. అమరగతుడయిన వీరయోధుడు అమరగతి (షహాదత్)కి సంబంధించిన గౌరవోన్నతులు చూసివుంటాడు గనక, అతను తిరిగి ఇహలోకానికి వెళ్ళి (దైవమార్గంలో) పది సార్లు అయినా వీరమరణం పొందాలని కోరుకుంటాడు." (బుఖారి)

"మనస్ఫూర్తిగా అమరగతినొందే భాగ్యం ప్రసాదించమని వేడుకునేవారు పడకల మీద మరణించినా సరే దేవుడు వారిని అమరగతుల స్థాయికి చేరుస్తాడు." (ముస్లిం)

ఉహుద్ యుద్ధం జరిగిన రోజు ఒకతను దైవప్రవక్త (స)ను "ఒకవేళ నేను (అవిశ్వాసుల చేతుల్లో) హతమైతే, ఆ తర్వాత నేను ఎక్కడికి వెళతానో చెబుతారా?" అని అడిగాడు. దానికి దైవప్రవక్త (స) 'స్వర్గానికి వెళ్తావు' అని సమాధానమిచ్చారు. ఈమాట వినగానే ఆ వ్యక్తి తన చేతిలోని ఖర్జూరపండ్లను పారేసి (కదనరంగంలోకి దూకాడు.) అక్కడ (శత్రువులతో వీరోచితంగా) పోరాడుతూ చివరికి అమరగతినొందాడు. (బుఖారీ)



దైవప్రవక్త (స) మహితోక్తి: "దైవమార్గంలో పోరాడే యోధుడికి యుద్ధసామగ్రి సమకూర్చినవాడు, దైవమార్గంలో పోరాడటానికి వెళ్ళిన యోధుని ఇంటిబాగోగులు చూసిన వాడు కూడా దైవమార్గంలో పోరాడినవారవుతారు." (బుఖారీ, ముస్లిం)

దైవప్రవక్త (స) "ప్రతి ఇద్దరిలో ఒకరు యుద్ధానికి వెళ్ళాలి" అని ఆదేశించారు. ఆ తర్వాత ఇండ్లల్లో ఉండిపోయే వారిని ఉద్దేశించి "మీలో ఎవరైనా జిహాద్‌కు వెళ్ళినవారి ఇండ్ల విషయంలో, వారి సంపద విషయంలో ఉత్తమ రీతిలో ప్రాతినిధ్య బాధ్యతలు వహిస్తే వారికి జిహాద్‌కు వెళ్ళినవారి పుణ్యంలో సగం లభిస్తుంది" అని చెప్పారు. (ముస్లిం)

దైవప్రవక్త (స) ప్రవచనం: "దైవమార్గంలో యుద్ధం చేయకుండా లేదా యుద్ధం చేసేవారికి యుద్ధసామగ్రి అందించి వారిని ప్రోత్సహించకుండా లేదా కనీసం యోధుడు యుద్ధానికి వెళ్ళిన తర్వాత అతని కుటుంబం బాగోగుల్ని పట్టించుకోకుండా ఉండేవారిని దేవుడు ప్రళయానికి ముందు ఏదో ఒక పెద్ద ఆపదకు గురిచేస్తాడు." (అబూదావూద్)

ఒకతను దైవప్రవక్త (స) సన్నిధికి వచ్చి "జిహాద్‌కు) ప్రత్యామ్నాయం కాగల సత్కార్యం ఏదైనా ఉంటే చెప్పండి" అన్నాడు. దానికి దైవప్రవక్త (స) "జిహాద్‌కు సమానమైన సత్కార్యం ఉన్నట్లు నాకు కన్పించడం లేదు" అన్నారు. ఆతర్వాత కాస్సేపటికి ఇలా అన్నారు: "అయితే నువ్వొక పనిచెయ్యి. యోధులు వెళ్ళిపోయాక నీవు మసీదుకు వెళ్ళి ఎడతెగకుండా నమాజులు చేస్తుండు. అలాగే మధ్యలో ఒక్కసారి కూడా విరమించకుండా నిరంతరాయంగా ఉపవాసాలు కూడా పాటిస్తూఉండు. మరి నువ్విలా చేయగలవా?" దానికా వ్యక్తి "ఇలా ఎవరు చేయగలరండీ?" అన్నాడు. (బుఖారి, ముస్లిం)

హజ్రత్ ఉఖబా బిన్ ఆమిర్ (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ఇలా చెప్పారు: "దేవుడు ఒక బాణం మూలంగా ముగ్గుర్ని స్వర్గానికి పంపుతాడు. (1) పుణ్యఫలాపేక్షతో బాణం తయారుచేసినవాడిని. (2) ఆ బాణాన్ని (దైవవిరోధుల మీదకు) వదిలేవాడిని. (3) అంబులపొది నుంచి దాన్ని తీసి అతనికి అందించేవాడిని." (అబూదావూద్)

హజ్రత్ అబూహురైరా (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ఇలా అన్నారు: "జిహాద్ చేయకుండా, కనీసం జిహాద్ చేయాలన్న ఆలోచన కూడా లేకుండా మరణించిన వ్యక్తి ఒక కపట లక్షణంతో మరణించిన వాడవుతాడు." (ముస్లిం)

హజ్రత్ ఉబాదా బిన్ సామిత్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (స) ప్రవచనం: "పరమ శుభదాయకుడైన దేవుని మార్గంలో మీకు దగ్గరలో ఉన్న, దూరంగా ఉన్న ప్రతి శత్రువుతో పోరాడండి. దైవధర్మం విషయంలో ఎవరి విమర్శలనూ ఖాతరు చేయకండి. మీరు స్వస్థలంలో ఉన్నా, ప్రయాణావస్థలో ఉన్నాసరే దైవశిక్షలను అమలుపరచండి. జిహాద్ (పోరాటం) స్వర్గద్వారాలలో ఓ మహోన్నతమైన ద్వారం. కనుక మీరు దైవమార్గంలో పోరాటం జరుపుతూ ఉండండి. దైవమార్గంలో చేసే పోరాటం ద్వారానే దేవుడు మానవుల్ని విచారం, ఆందోళనల నుండి విముక్తి కలిగిస్తాడు." (ముస్నద్ అహ్మద్)

హజ్రత్ అబూహురైరా (రజి) కథనం: హజ్రత్ సూబాన్ (రజి)తో దైవప్రవక్త (స) ఇలా అన్నారు- "సూబాన్! నువ్వు అన్నం ముద్దల కోసం కంచంమీద విరుచుకు పడి

నట్లు మీపై ఇతర జాతులు విరుచుకుపడినప్పుడు మీ పరిస్థితి ఎలా ఉంటుంది?'' సూబాన్ (రజి) ఈమాట విని "నా తల్లిదండ్రులు మీకోసం అర్పితమవుగాక! దైవప్రవక్తా! (ఆనాడు) మా జనాభా తగ్గిపోయినందువల్ల మా పరిస్థితి ఇలా అవుతుందా?'' అని అడిగారు. "కాదు. పైగా మీ జనాభా మరింత పెరుగుతుంది. మీ హృదయాల్లో బల హీనత, పిరికితనాలు గూడుకట్టుకుంటాయి'' అన్నారు దైవప్రవక్త(స). "బలహీనత అంటే ఏమిటీ దైవప్రవక్తా?'' అనడిగారు సూబాన్ (రజి). దానికి దైవప్రవక్త (స) "బలహీనత అంటే మీరు ప్రాపంచిక వ్యామోహంలో కూరుకుపోయి దైవమార్గంలో పోరాటం జరపడానికి వెనుకంజ వేస్తారు'' అన్నారు. (ముస్నద్ అహ్మద్, అబూదావూద్)

దైవప్రవక్త (స) హితోక్తి: "మీరు వడ్డీముసుగుతో కూడిన వ్యాపారం చేయనారంభిం చినప్పుడు, ఎద్దుతోక పట్టుకొని సేద్యంలో మునిగి ఉన్నప్పుడు, ధర్మసంస్థాపనా పని కోసం కష్టనష్టాలు సహిస్తూ ధన ప్రాణాలు త్యాగం చేయడానికి భయపడినప్పుడు దేవుడు మీపై అవమానం, బానిసత్వాలు రుద్దుతాడు. మీరు మీ ధర్మం వైపుకు మరలే దాకా అవి మీ నుండి ఎన్నటికీ తొలగిపోవు.'' (ఇబ్నెఉమర్-అబూదావూద్)

## ప్రదర్శనాబుద్ధి పనికి రాదు

పేరుప్రతిష్ఠలు స్వార్థప్రయోజనాల కోసం చేసే పోరాటం జిహాద్ ఫీ సబీలిల్లాహ్ అన్పించు కోదు. అలాంటి ఉద్దేశ్యంతో జరిపే పోరాటంవల్ల మనిషికి పుణ్యఫలం దక్కకపోగా పాపఫలితం మటుకు తప్పకుండా అనుభవిస్తాడు.

హజ్రత్ అబూబకర్ నుఫై బిన్ హారిస్ (రజి) ఉల్లేఖనం: దైవప్రవక్త (స) "ఇద్దరు ముస్లింలు తమ తమ ఖడ్గాలతో పరస్పరం దాడికి దిగితే హంతకుడు, హతుడు ఇద్దరూ నరకానికి పోతారు'' అని అన్నారు నేనీ మాట విని (ఆశ్చర్యపోతూ) "దైవప్రవక్తా! హంతకుని మాట సరే గాని హతుడేం పాపం చేశాడని నరకానికి పోతాడు?'' అని అడిగాను. దానికి దైవప్రవక్త (స) "అతనూ తన ప్రత్యర్థిని చంపాలన్న కసితోనే ఉన్నాడు కదా!'' అని చెప్పారు. (బుఖారీ, ముస్లిం)

ఒకసారి దైవప్రవక్త (స) ప్రజల మధ్య నిలబడి, దైవమార్గంలో పోరాడటం, దైవాన్ని విశ్వసించటం సత్కార్యాలన్నింటిలోకెల్లా శ్రేష్ఠమైన పని అన్నారు. దానికి ఒక వ్యక్తి లేచి, "దైవప్రవక్తా! నేను దైవమార్గంలో (పోరాడుతూ) చంపబడితే నా పాపాలన్నీ మన్నించబడతా యంటారా?'' అని అడిగాడు. అందుకాయన "ఆ, నువ్వు సహనాన్ని ప్రదర్శిస్తూ, పుణ్య ఫలాపేక్షతో, వెన్నుజూపి పారిపోకుండా, శత్రువులతో ఎదురొడ్డి పోరాడుతూ హతమార్చబడితే (నీ పాపాలన్నీ మన్నించబడతాయి)'' అని అన్నారు. ఆ తరువాత ఆయన "నువ్వడిగింది ఏమిటి? (ఇంకోసారి అడుగు)'' అని అన్నారు. దానికతను "నేను దైవమార్గంలో పోరాడుతూ చంపబడితే నా పాపాలన్నీ మన్నించబడతాయంటారా?'' అని అన్నాడు. అప్పుడతనికి "ఆ, నువ్వు సహనాన్ని ప్రదర్శిస్తూ, పుణ్యాన్ని ఆశిస్తూ, వెన్నుజూపి పారిపోకుండా శత్రువులతో ఎదురొడ్డి పోరాడుతూ చంపబడితే ఒక్క అప్పు తప్ప (మిగతా పాపాలన్నీ క్షమించబడతాయి). అప్పు మాత్రం క్షమించబడదని జిబ్రయీల్ (అలై) నాతో చెప్పారు'' అని సమాధానమిచ్చారు దైవప్రవక్త (స)- (ముస్లిం)



## దైవమార్గంలో ఎదురైన కష్టాలు

దైవప్రవక్త (స)-ఆయన అనుచరులు సాగించిన ధర్మప్రచార కార్యకలాపాలు, ఆ మార్గంలో ఎదురైన కష్టాలు, శత్రువుల దాడులు-కుట్రల నుండి ధర్మాన్ని కాపాడుకోవడానికి ముస్లింలు మార్గాంతరంలేని పరిస్థితులో కత్తి పట్టిన వైనం, అంతర్గత శత్రువులైన కపట విశ్వాసుల ఆగడాలు, ఇస్లామీయ రాజ్యంలోని యూదుల విశ్వాసఘాతుక చర్యలు, ఇస్లామీయ రాజ్య సరిహద్దుల రక్షణ కోసం అనివార్య పరిస్థితుల్లో ముస్లింలు చేసిన యుద్ధాలు వగైరా సంఘటనలకు సంబంధించిన హదీసులు ఈ గ్రంథంలో స్థలాభావం వల్ల పేర్కొనకుండా వదిలేస్తున్నాము. అవన్నీ 'ఇస్లామిక్ రిసోర్స్ సెంటర్, హైదరాబాద్-2' నుండి వెలువడిన **"మహనీయ ముహమ్మద్ ఆదర్శజీవితం"** అనే గ్రంథంలో కళ్ళకు కట్టినట్లు వివరంగా, స్పష్టంగా ఉన్నాయి. ఆసక్తి కలవారు ఆ పుస్తకంలో చూసుకోవచ్చు.

మక్కా పట్టణంలో ఇస్లాంధర్మప్రచారం సాగిన 13 ఏండ్ల కాలంలో దైవప్రవక్త (స)పై, ఆయన అనుచరులపై మక్కా బహుదైవారాధకులు దుర్భర దౌర్జన్యకాండలు జరిపారు. చివరికి వారిని కట్టుబట్టలతో మదీనా పట్టణం పారిపోయేలా చేశారు. అయినప్పటికీ వారు అంతటితో ఊరుకోకుండా అరేబియాలోని వివిధ తెగలను ఉసిగొలిపి ముస్లింలపై అనేక యుద్ధాలు చేశారు. అయినా వారి ధర్మవ్యతిరేక ఆకాంక్షలు నెరవేరలేదు. చివరికి సత్యమే విజయం సాధించింది. అసత్యం పరాజయం పాలయింది.

"సత్యం వచ్చేసింది. అసత్యం తుడిచి పెట్టుకుపోయింది. అసత్యం (ఏనాటికైనా) తుడిచి పెట్టుకుపోయేదే" (ఖుర్ఆన్-17:81)

బలమైన రాజ్యం ఉనికిలోకి వచ్చినప్పుడే రాజ్యాధినేత చెప్పే మాటను ప్రపంచం శ్రద్ధంగా విని ఆలోచిస్తుంది. ఆనాడు అరబ్బులు కూడా దైవప్రవక్త (స) మక్కాను జయిం చిన తరువాతే తండోపతండలుగా ఇస్లాం స్వీకరించారు.

"(ప్రవక్తా!) దేవుని సహాయం వచ్చి, విజయం లభించిన తరువాత ప్రజలు తండోప తండలుగా దైవధర్మంలో చేరుతూ ఉండటం నీవు గమనిస్తూనే ఉన్నావు. కనుక నీ ప్రభువు ఔన్నత్యం స్తుతిస్తూ, ఆయన పవిత్రతను ప్రశంసిస్తూ ఉండు." (ఖుర్ఆన్-110:1-3)

**మొత్తం దండయాత్రలు-** హజ్రత్ సలమా బిన్ అక్వాయి (రజి) కథనం: "నేను దైవప్రవక్త (స)తో కలసి ఏడు యుద్ధాలలో పాల్గొన్నాను. ఆయన పంపిన సైనిక దళాలలో తొమ్మిది దళాలలో పాల్గొన్నాను. ఒకసారి అబూబకర్ (రజి) సేనాపతిగా, మరొకసారి ఉసామా బిన్ జైద్ (రజి) సేనాపతిగా నియమించబడ్డారు.'' (బుఖారి)

హజ్రత్ ఇబ్నెసాద్ (రహ్మాలై) 'తబఖాత్' గ్రంథంలో ఇచ్చిన వివరాల ప్రకారం దైవప్రవక్త (స) ఇరవై ఏడు దండయాత్రలలో పాల్గొన్నారు. ఆయన స్వయంగా పాల్గొనకుండా తన అనుచరుల నేతృత్వంలో సైనికుల్ని పంపి చేయించిన దండయాత్రల సంఖ్య యాభై ఆరుకు చేరాయి. అయితే మొత్తం దండయాత్రలలో తొమ్మిది మాత్రమే క్రియాత్మకంగా యుద్ధాలు జరిగాయి. వాటి పేర్లు ఇలా ఉన్నాయి: 1-బదర్, 2-ఉహుద్, 3-బనీముస్తలిఖ్, 4-ఖన్దఖ్ లేక అహ్జాబ్, 5-బనీఖురైజా, 6-ఖైబర్, 7-మక్కా విజయం, 8-హునైన్, 9-తాయఫ్.

## పోరాటం అంటే సంఘర్షణ

అనేకమంది ప్రజలు ఖడ్గం లేక తుపాకితో జరిపే పోరాటాన్నే జిహాద్ అనుకుంటారు. ఇది చాలా పొరపాటు. ఈనాడు హక్కుల కోసం ప్రసంగాలు, ప్రదర్శనలు, కరపత్రాలపంపిణి, మొదలైన శాంతియుత సాధనాలతో కృషిచేసే సంఘాలను 'పోరాట సమితి, పోరాట సంఘాల పేర్లతో పిలుస్తున్నారు. అదేవిధంగా ఇస్లాంలో కూడా మంచిని వ్యాపింపజేసే, చెడును అరికట్టే లక్ష్యసాధన కోసం చేసే ఇలాంటి పనులు కూడా జిహాద్‌గానే పరిగణించబడతాయి.

దైవప్రవక్త (స) ఇలా చెప్పారు: "(మీపై కత్తికట్టిన) బహుదైవారాధకులతో మీరు పోరాడండి- మీ సిరిసంపదలతో, మీచేతులతో, మీనోళ్ళతో." (అహ్మద్, అబూదావూద్)

దైవప్రవక్త (స) జీనుపై కాలుపెడ్తున్నపుడు ఒకతను వచ్చి "అన్నింటికంటే శ్రేష్ఠమైన జిహాద్ ఏది"ని అడిగాడు. దానికి దైవప్రవక్త (స) "నిరంకుశుడైన రాజు ముందు సత్యాన్ని చాటి చెప్పటమే శ్రేష్ఠమైన జిహాద్)" అని సమాధానమిచ్చారు. (నసాయి)

దైవప్రవక్త (స) ఒక యుద్ధం నుండి తిరిగొచ్చిన యోధులతో "మీరు చిన్న జిహాద్ నుండి పెద్ద జిహాద్ వైపుకు తిరిగొచ్చారు" అని అన్నారు. అనుచరులు ఈమాట విని 'ఆ పెద్దజిహాద్ ఏమిట'ని అడిగారు. దానికి దైవప్రవక్త (స) "మనిషి తన మనోవాంఛలకు వ్యతిరేకంగా పోరాడటమే పెద్ద జిహాద్" అన్నారు. (కన్జుల్‌అమ్మాల్, దుర్రెమన్సూర్)

దైవప్రవక్త (స) హితోక్తి: "పేదలు, వితంతువుల బాగోగుల కోసం కృషిచేసేవాడు దైవమార్గంలో జిహాద్ చేసే యోధుడితో సమానం." (అబూహురైరా-బుఖారీ, ముస్లిం)

**సమర సొత్తు:** యుద్ధంలో శత్రువర్గం పారిపోతూ వదలిన వస్తుసంపదను 'సమరసొత్తు' అంటారు. వివరాలకు "ఆర్థికవ్యవస్థ" అధ్యాయంలోని "సమరసొత్తు" అంశం చూడండి.

# 74. జిజ్యా (రక్షణ రుసుం)

ఇస్లాంకు సంబంధించిన అనేక విషయాలతో పాటు జిజ్యా (రక్షణ రుసుం) వ్యవహారం కూడా అప్రాచ్యుల దుష్ప్రచార జాలంలో పడిపోయింది. విజేత పాలకులు పరాజిత పాలకుల నుండి పన్ను లేక మరేదైనా రూపంలో ధనం వసూలుచేసే సంప్రదాయం అనేకదేశాల్లో పూర్వం నుండి వస్తోంది. ఇది లొంగిపోయి రక్షణ పొందినందుకు చెల్లించే మూల్యం తప్ప మరేమీ కాదు. 'జిజ్యా'ను గురించి ఖుర్ఆన్ ఇలా పేర్కొంటున్నది:

"గ్రంథప్రజల్లో దేవుడ్ని, అంతిమదినాన్ని విశ్వసించనివారితో యుద్ధం చేయండి. దేవుడు, ఆయనప్రవక్త నిషేధించినవాటిని వారు నిషేధితాలుగా పరిగణించడంలేదు. సత్యధర్మాన్ని తమ జీవనధర్మంగా చేసుకోవడంలేదు. కనుక వారు మీకు పూర్తిగా లొంగిపోయి తమ చేతులారా జిజ్యా చెల్లించనంతవరకూ వారితో పోరాడండి." (9:29)

ఈ సూక్తిలో గ్రంథప్రజలంటే యూదులు. యూదులు తమ గ్రంథంలోని విషయాలనూ సరిగా పాటించరు, ముహమ్మద్ (స) ప్రస్తావన వారి మతగ్రంథంలో ఉన్నప్పటికీ ఆయన తెచ్చిన ధర్మాన్ని కూడా విశ్వసించడానికి సిద్ధంగా లేరు. పైపెచ్చు దైవప్రవక్త (స)ను, ఆయన ధర్మాన్ని అంతం చేయడానికి పూనుకున్నారు. కాబట్టి ఇలాంటి కుట్రదారులు పూర్తిగా లొంగిపోయి జిజ్యా చెల్లించనంతవరకూ వారితో పోరాడాలని ముస్లింలను దేవుడు ఆదేశిస్తున్నాడు.



జిజ్యా అంటే, ఇస్లామీయ రాజ్యంలోని ముస్లిమేతరులు తమ మతాచారాలు పాటించడానికి పొందే స్వేచ్ఛాస్వాతంత్ర్యాలకు, విదేశీశక్తుల దాడుల నుంచి ప్రభుత్వం కల్పించే రక్షణకు ప్రతిఫలంగా ఇస్లామీయ ప్రభుత్వానికి ప్రతియేటా చెల్లించవలసిన "రక్షణ రుసుం" అన్నమాట. ఇమాం అబూయూసుఫ్ (రహ్మాలై) ప్రకారం ముస్లిమేతరుల్లో స్తోమత కలిగిన పురుషులు మాత్రమే జిజ్యా చెల్లించవలసి ఉంటుంది. స్త్రీలు, పిల్లలు, వృద్ధులు, వికలాంగులు, శాశ్వత వ్యాధిగ్రస్తులు, సన్యాసులు, దేవాలయాల్లో పనిచేసే ఉద్యోగులు జిజ్యా చెల్లింపు నుండి మినహాయించబడ్డారు.

పరాజితులైన ముస్లిమేతరులు విజేతలైన ముస్లింలతో రాజీఒప్పందం చేసుకున్నప్పుడే వారికిలా ముస్లింలు రక్షణ కల్పించరు. ఒప్పందం చేసుకోకపోయినా వారికి రక్షణ కల్పించవలసిఉంటుంది. ఫిఖావేత్తలు ఈవిషయాన్ని ఇలా వివరించారు: "ముస్లింలు ఏదైనా రాజ్యాన్ని జయించినప్పుడు పరాజితరాజ్య పౌరులతో ఒప్పందం జరగకపోయినా వారా ముస్లిమేతరుల్ని జిమ్మీలుగానే పరిగణించి, వారిపై జిజ్యా విధించి, వారి ధనప్రాణాల రక్షణబాధ్యత తీసుకోవలసిఉంటుంది." (అల్‌జిహాద్ ఫిల్‌ఇస్లాం)

జిజ్యా ప్రతి ముస్లిమేతరపౌరుడు సులభంగా చెల్లించగలిగేలా నామమాత్రంగా నిర్ణయించబడుతుంది. హజ్రత్ అబూబకర్ (రజి) పాలనాకాలంలో సేనాపతి ఖాలిద్ బిన్ వలీద్ (రజి) హైరాప్రాంతం ప్రజలకు రాసిచ్చిన సంధిపత్రంలో "నిరుపేదలు, నిరాధారులను మినహాయించి మిగిలినజనాభా అంతటికీ 60 వేల దిర్హమ్‌లు, అంటే ఒక మనిషి యేడాదికి 10 దిర్హమ్‌లు (ఈనాటి మన లెక్క ప్రకారం 120 రూపాయలు)" మాత్రమే విధిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇతర విషయాలను గురించి ఇలా పేర్కొనడం జరిగింది:

"వారి ఆరాధనాలయాలను, వారి దేవతావిగ్రహాలను ధ్వంసం చేయడంగాని, వారు తమ శత్రువుల నుండి కాపాడుకోవడానికి నిర్మించుకున్న కోటలను పడగొట్టడంగాని జరగదు. వారిని శంఖారావం గావించకుండా, సిలువ ఊరేగింపులు జరుపుకోనీయకుండా నిరోధించడం కూడా జరగదు." (కితాబుల్‌ఖిరాజ్)

రెండవ ఖలీఫా ఉమర్ (రజి) పాలనాకాలంలో ముస్లింలు అనేక ప్రాంతాలను జయించారు. కాని ఏ పరాజిత ప్రాంతంలోనూ ముస్లిమేతరుల ఆరాధనాలయాలను పడగొట్టడం జరగలేదని, వాటిని యథాతథంగా ఉంచడం జరిగిందని ఇమామ్ అబూయూసుఫ్ (రహ్మాలై) తన గ్రంథం 'కితాబుల్‌ఖిరాజ్'లో పేర్కొన్నారు.

జిజ్యా లక్ష్యం ముస్లిమేతరులపై జరిమానా విధించడంగాని, ప్రభుత్వధనాగారాన్ని నింపడంగాని కాదు. వారు దేశంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించకుండా తమ మతాచారాల ప్రకారం ప్రశాంతంగా జీవితం గడిపేలా చేయడమే జిజ్యా లక్ష్యం. అందుకే బలవంతంగా జిజ్యా వసూలు చేయడం ఇస్లాంలో నిషిద్ధంగా పరిగణించబడింది. దీన్ని గురించి హదీస్, ఫిఖాగ్రంథాల్లో అనేక ఆజ్ఞలు, ఉల్లేఖనాలు ఉన్నాయి.

హజ్రత్ ఉమర్ (రజి) పాలనాకాలంలో ఒకసారి ఓ పెద్ద మొత్తం జిజ్యా తీసుకురావడం జరిగింది. ఖలీఫా అంత పెద్ద ధనరాసి చూసి వసూలు చేసితెచ్చిన వారితో "మీరు ప్రజలను నాశనం చేశారు" అన్నారు. దానికి జిజ్యా వసూలు చేసినవారు "దైవసాక్షి! మేము చాలా మృదువుగా వ్యవహరించి వసూలుచేశాం" అన్నారు. హజ్రత్

ఉమర్ (రజి) "వారిని కొట్టకుండా, నిర్బంధించకుండా వసూలుచేశారా?" అని అడిగారు. వారు "కొట్టకుండా, నిర్బంధించకుండానే వసూలు చేశాం" అన్నారు. అప్పుడు హజ్రత్ ఉమర్ (రజి) దాన్ని ప్రభుత్వ ధనాగారంలో జమచేయడానికి అనుమతించారు.

హజ్రత్ ఉమర్ (రజి) దగ్గరికి ఇరాఖ్ నుండి రెవెన్యూపైకం వచ్చినప్పుడు కూఫా నుండి పదిమంది, బస్రా నుండి పదిమంది ఉన్నతాధికారులు రాజధానికి వచ్చేవారు. వారు ఖలీఫా ముందు నాలుగు సార్లు దేవుని పేరుతో ప్రమాణం చేస్తూ "మేము ఏ ముస్లింపై, ఏ జిమ్మీ (ముస్లిమేతరుని)పై దౌర్జన్యం చేసి ఈధనం వసూలు చేయలేదు" అని చెప్పేవారు. (ఖిలాఫత్ ఓములూకియత్-కితాబుల్‌ఖిరాజ్)

ఖలీఫా అలి (రజి) ఒక వ్యక్తిని ఉక్బురా ప్రాంతానికి పాలకుడిగా నియమిస్తూ అతనికిలా ఉపదేశించారు: "రెవెన్యూ(జిజ్యా) వసూలు చేయడంలో కఠినంగా వ్యవహరించకూడదు. వారు తమ ఆవులు, గాడిదలు, బట్టలు లేదా ఇతర వస్తువులు గత్యంతరంలేక అమ్ముకునేలా వారిపై వత్తిడి చేయకూడదు. వారిపట్ల మృదువుగా ప్రవర్తించాలి."

హజ్రత్ హకీం బిన్ హిజాం (రజి) ఒకసారి పాలస్తీనా రెవెన్యూఅధికారులు కొందరు జిజ్యా వసూలుచేయడంలో కఠినంగా ప్రవర్తించడం చూశారు. అప్పుడాయన వారిని వారిస్తూ "ప్రపంచంలో ప్రజలను బాధపెట్టేవారిని ప్రళయదినాన దేవుడు బాధపెడ్తాడని దైవప్రవక్త (స) చెబుతుంటే నేను విన్నాను" అని అన్నారు. (అల్‌జిహాద్ ఫిల్‌ఇస్లాం)

ప్రఖ్యాత యూదపండితుడు జర్జి జైదాన్ "ఇస్లామీయ సంస్కృతీ చరిత్ర" అనే తన గ్రంథంలో 'జిజ్యా'ను గురించి ఇలా పేర్కొన్నాడు: "ముస్లింలు యర్మూక్ యుద్ధంలో శత్రువులతో తలపడవలసిన పరిస్థితి రాకముందు వరకూ హమాస్ పట్టణం ముస్లింల అధీనంలోనే ఉండేది. అయితే వారు పరిస్థితి గమనించి హమాస్‌వాసుల నుండి లోగడ వసూలుచేసిన జిజ్యా హమాస్ వాసులకు తిరిగిచ్చివేస్తూ- 'మేమిప్పుడు ఓ పెద్ద సమస్య (యుద్ధం)లో చిక్కుకున్నాము. ఈ పరిస్థితిలో మేము మీకు రక్షణ కల్పించలేం. అంచేత మీకిష్టమైన రీతిలో మీరంతట మీరే స్వీయరక్షణ ఏర్పాట్లు చేసుకోండి' అన్నారు. హమాస్‌వాసులు ఈమాటలు విని 'మేమింతకు ముందు అనుభవించిన దౌర్జన్యాలకన్నా మీరాజ్యం, మీ న్యాయదృష్టే మాకెంతో ప్రియమైనవి. మేము మీ యోధులతో కలసి హమాస్ పట్టణాన్ని హెర్క్యులస్ సేనల నుండి కాపాడుతాం' అని చెప్పారు."

## 75. ముస్లిమేతరులతో శాంతి ఒప్పందం

ముస్లిమేతరులతో చేసుకున్న ఒడంబడికను ఉల్లంఘించడానికి ఏ ముస్లింకూ అధికారం లేదు. మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) ఒడంబడికదారుల ప్రాణ రక్షణ గురించి ముస్లింలకు గట్టిగా తాకీదు చేస్తూ ఇలా ప్రవచించారు:

"ఏ ముస్లిం అయినా ఒడంబడికదారునిపై దౌర్జన్యం చేస్తే లేదా అతని హక్కుల్ని తగ్గిస్తే లేదా అతనిపై అతని శక్తికి మించిన బరువు మోపితే లేదా అతని వస్తువేదైనా అతని అభీష్టానికి వ్యతిరేకంగా తీసుకుంటే ప్రళయదినాన నేనా ముస్లింకు వ్యతిరేకంగా వకీలునై (దేవుని ముందు) వాదిస్తాను." (అబూదావూద్)



"ఏ ముస్లిం అయినా ఒడంబడికదారుణ్ణి చంపడం జరిగితే అతను స్వర్గసువాసన ఆఘ్రాణించే అదృష్టానికి కూడా నోచుకో లేడు. స్వర్గసువాసన నలభై సంవత్సరాల పాటు ప్రయాణం చేసినంత దూరం దాకా వ్యాపిస్తుంది." (అల్‌జిహాద్ ఫిల్‌ఇస్లాం)

ప్రవక్త కాలంలో ఒక ముస్లిం ఓ జిమ్మీని చంపాడు. అందువల్ల దైవప్రవక్త (స) ఆ ముస్లింని వధించమని ఆజ్ఞాపించారు. ఆ సందర్భంలో ఆయన "ఆ బాధ్యత వహించడానికి అందరికంటే నేనే ఎక్కువ హక్కుదారుణ్ణి" అన్నారు. (ఇనాయా షరై హదాయా)

హజ్రత్ ఉమర్ (రజి) పాలనాకాలంలో బకర్ బిన్ వాయిల్ తెగకు చెందిన ఒక ముస్లిం హైరా (ప్రాంతాని)కి చెందిన ఒక ముస్లిమేతరుణ్ణి (జిమ్మీని) చంపాడు. అప్పుడు హజ్రత్ ఉమర్ (రజి) ఆ హంతకుణ్ణి హతుని వారసులకు అప్పగించమని అధికారులను ఆదేశించారు. దాని ప్రకారం హంతకుణ్ణి హతుని వారసులకు అప్పగిస్తే వారతణ్ణి (ప్రతీకారంగా) హతమార్చారు. (బుర్హాన్)

ఖలీఫా హజ్రత్ ఉమర్ (రజి) ఇలా అన్నారు: "నేను మీకు ఉపదేశిస్తున్నాను. జిమ్మీల (ఇస్లామీయ రాజ్యంలో నివసించే ముస్లిమేతరుల)తో చేసుకున్న ఒప్పందం నెరవేర్చండి. వారి రక్షణ కోసం (అవసరమైతే విదేశీశత్రులతో) యుద్ధం చేయండి. వారిపై వారి శక్తికి మించిన శిస్తుభారం వేయకండి." (అల్‌జిహాద్ ఫిల్‌ఇస్లాం)

నాల్గవ శ్రేష్ఠ ఖలీఫా హజ్రత్ అలి (రజి) పాలనాకాలంలో ఒక ముస్లిం ఒక జిమ్మీని చంపాడన్న అభియోగం వచ్చింది. నేరం రుజువైన తరువాత హజ్రత్ అలి (రజి) ఖిసాస్ (ప్రతీకారం) ఉత్తర్వు జారీచేశారు. అయితే హతుని సోదరుడు వచ్చి "నేను హంతకుణ్ణి క్షమించాను" అన్నాడు. హజ్రత్ అలి (రజి) దాంతో తృప్తిచెందక "నిన్ను (ముస్లిం)జనం బెదిరించి ఉంటారనుకుంటాను" అన్నారు. దానికి హతుని సోదరుడు "అదేమీ లేదు. నాకు రక్తపరిహారం లభించింది. హంతకుణ్ణి చంపడం వల్ల నా సోదరుడు మళ్ళీ బ్రతికి రాలేడని నాకు తెలుసు" అని అన్నాడు. హజ్రత్ అలి (రజి) ఈమాట విని హంతకుణ్ణి విడుదల చేశారు. ఆ సందర్భంలో ఆయన ఇలా అన్నారు:

"వారు తమ ఆస్తులు మన ఆస్తుల్లా, తమ రక్తం మన రక్తంలా గౌరవప్రదమైనవిగా ఉండేందుకే మనతో ఈ బాధ్యతాఒప్పందం చేసుకున్నారు." (దుర్రెముఖ్తార్)

దైవనిర్ణీత శిక్షాస్మృతి విషయంలో ముస్లిం, ముస్లిమేతరుడు ఇద్దరూ సమానమే. నేర వ్యవహారాల్లో ముస్లింలకు ఏశిక్షలు విధిస్తారో జిమ్మీలకూ అవే శిక్షలు విధిస్తారు. జిమ్మీసొత్తు ముస్లిం దొంగిలించినా, ముస్లింసొత్తు జిమ్మీ దొంగిలించినా ఇద్దరికీ హస్త ఖండన శిక్ష ఉంటుంది. అలాగే జిమ్మీ ముస్లింస్త్రీతో వ్యభిచరించినా, ముస్లిం జిమ్మీస్త్రీతో వ్యభిచరించినా ఉభయులకూ ఒకే విధమైన శిక్ష పడుతుంది. (కితాబుల్‌ఖిరాజ్)

"ముస్లిం ఎవరైనా జిమ్మీకు చెందిన సారాయిని, పందిని సైతం నష్టపరచినా దానికీ ఆ ముస్లిం నష్టపరిహారం ఇచ్చుకోవాల్సిందే."- "నోటితో లేక కాలితో బాధించడం, కొట్టడం, తిట్టడం, పరోక్షనిందకు పాల్పడటం ముస్లిం విషయంలో ఎలా నిషిద్ధమో ముస్లిమేతరుని విషయంలోనూ నిషిద్ధమే." (దుర్రెముఖ్తార్)

ఇస్లామీయ రాజ్యంలోని జిమ్మీలు ఎంత పెద్ద నేరం చేసినా వారితో చేసుకున్న ఒప్పందం ముస్లింలు తెంచకూడదు. చివరికి వారు జిజ్యా ఎగవేసినా, ముస్లింని చంపినా, ముస్లింస్త్రీని చెరచినా, దైవప్రవక్త (స) విషయంలో అపచారం తలపెట్టినా ఒప్పందం భంగం కాదు. అయితే జిమ్మీలు ఇస్లామీయరాజ్యం వదలి శత్రువులతో చేతులు కలిపితే లేదా ఇస్లామీయ రాజ్యంపై బహిరంగ తిరుగుబాటు చేస్తూ అరాచకం, అల్లర్లు సృష్టిస్తే మాత్రం ఒప్పందం దానంతటదే భంగమైపోతుంది. (ఫతహుల్‌ఖదీర్)

జిమ్మీలకు వారి వ్యక్తిగత సమస్యలు వారిధర్మశాస్త్రం ప్రకారం పరిష్కరించుకునే హక్కు ఉంది. అయితే ఇస్లాంకు వ్యతిరేకంగా వారి మతాచారాల్లో ఉండే కొన్ని పనులు తాము అధిక సంఖ్యాకులుగా ఉండే ప్రాంతాల్లో నిర్వహించుకోవచ్చు. ముస్లింలు అధికసంఖ్యాకులుగా ఉండే ప్రాంతాలలో నిర్వహించుకోవడానికి ప్రభుత్వ అనుమతి తీసుకోవలసిఉంటుంది. ప్రభుత్వం అలాంటి అనుమతి ఇవ్వచ్చు లేదా నిరాకరించవచ్చు. ఉదా:- మద్యం, పందుల అమ్మకం; సిలువ, విగ్రహాల ఊరేగింపు, శంఖారావం మొదలైన పనులు. (అల్‌జిహాద్‌ఫిల్‌ఇస్లాం)

నజ్రాన్ వాసులకు, దైవప్రవక్త (స)కు (అంటే ముస్లింలకు) మధ్య జరిగిన ఒక శాంతి ఒడంబడికలో దైవప్రవక్త (స) వారికి ఈవిధంగా హామీ ఇచ్చారు:

"నజ్రాన్ క్రైస్తవులకు, వారి పొరుగు ప్రజలకు దేవుని రక్షణ ఉంది. దాని బాధ్యత దైవప్రవక్త ముహమ్మద్ (స)పై ఉంది. వారి మతానికి, ప్రాణాలకు, వారి భూములకు, ఆస్తులకు, వారి ప్రజలకు, ఒంటెలకు, ప్రతినిధులకు, మతచిహ్నాలకు అన్నిటికీ రక్షణ ఉంది. ఇప్పటిదాకా వారు ఏ స్థితిలో ఉన్నారో అదే స్థితిలో వారిని యథాతథంగా ఉంచడం జరుగుతుంది. వారి హక్కుల్లో, మతచిహ్నాలలో దేనినీ మార్చివేయడం జరగదు. వారి ధర్మకర్త (బిషప్)ల నుండీ ధర్మకర్తుత్వాన్ని, వారి సన్యాసుల నుండీ సన్యాసత్వాన్ని, వారి చర్చిసేవకుల్ని చర్చిసేవల నుండి తొలగించడం జరగదు. వారి ధర్మాదాయ ఆస్తులు ఎంత ఉన్నా వాటి జోలికి పోవడం జరగదు. యుద్ధసేవ లేక యుద్ధ ఖర్చుల కోసం వారిని బలవంతం చేయడం జరగదు. వారి (పంట) భూములు సైన్యం చేత నాశనం చేయబడవు. వారిపై ఎవరైనా ఏదైనా అభియోగం మోపితే ఉభయ పక్షాల మధ్య న్యాయంగా తీర్పివ్వబడుతుంది. నజ్రాన్ వాసులు ఇటు దౌర్జన్యపరులూ కాలేరు, అటు పీడితులూ కాలేరు. అయితే గతంలో ఎవరైనా వడ్డీ తినివుంటే దానికి నేను బాధ్యుడ్ని కాను. వారిలో ఒకరు చేసిన నేరానికి మరొకరిని పట్టుకోవడం జరగదు. ఈ (ఒప్పందం) పత్రంలో రాయబడిన విషయాలకు దేవునిరక్షణ, దైవప్రవక్త ముహమ్మద్ (స) బాధ్యత ఉంటాయి. దేవుని ఆజ్ఞ వచ్చేవరకూ, వారు శ్రేయోభిలాషులుగా ఉంటూ ఒప్పందం ప్రకారం తమపై మోపబడిన హక్కులు నిర్వర్తిస్తున్నంతకాలం శాశ్వతంగా దేవుని రక్షణ, దైవప్రవక్త ముహమ్మద్ (స) బాధ్యత ఉంటాయి.

(కితాబుల్ ఖిరాజ్-అల్‌జిహాద్ ఫిల్‌ఇస్లాం)

హజ్రత్ అబూబకర్ (రజి) పాలనాకాలంలో హైరా ప్రాంతం వాసులకు రాసిచ్చిన ఒడంబడికలో ఈ విషయాలు ఉన్నాయి: "వారి ఏ చర్చినీ, ఏ దేవతావిగ్రహాన్ని ధ్వంసం చేయడం జరగదు. వారు తమశత్రువుల నుండి కాపాడుకోవడానికి కట్టుకున్న కోటలలో



ఏ ఒక్కదాన్నీ పడగొట్టడం జరగదు. వారిని శంఖారావం గావించడాన్ని, పండుగరోజుల్లో సిలువ ఊరేగింపులు జరుపుకోవడాన్ని నిరోధించడం జరగదు."

హజ్రత్ ఉమర్ (రజి) జెరూసలేం వాసులకు రాసిచ్చిన ఒడంబడికలో ఈ విషయా లున్నాయి: "వారికి, వారి ధనప్రాణాలకు, చర్చీలకు-సిలువలకు, వారి ఆరోగ్యవంతు లకు-వ్యాధిగ్రస్తులకు రక్షణహామీ ఉంది. ఈ రక్షణహామీ ఏలియా సముదాయాని కంతటికీ ఉంది. వారి చర్చీలను ముస్లింల ఇండ్లుగా మార్చేయడం లేదా ధ్వంసం చేయడం, వారి ఆవరణలను-భవనాలను తగ్గించడం, వారి సిలువలకు, ఆస్తులకు నష్టం కలగజేయడం, మతవ్యవహారంలో వారిని బలవంతం చేయడం, వారికి ఏవిధ మైన బాధ పెట్టడం జరగదని హామీ ఇస్తున్నాం." (కితాబుల్ ఖిరాజ్)

# 76. ఇస్లామీయపాలనా విధానం

ఇస్లామేతర వ్యవస్థలలో రాజ్యాంగం, చట్టాలు ఎంత అందంగా రూపొందించుకున్నా ఆచరణలో మాత్రం విజేతవర్గం పరాజితవర్గాన్ని ఎల్లప్పుడూ బానిసలుగా, ద్వితీయ శ్రేణి పౌరులుగానే పరిగణిస్తుంది. ఆ భావనతోనే దాని ప్రవర్తన ఉంటుంది. దానికి భిన్నంగా ఇస్లామీయ రాజ్యంలో ముస్లిములైనా, ముస్లిమేతరులైనా ఏవిధమైన పక్షపాతం, మతదురభి మానం లేకుండా అందరికీ సమానహక్కులుంటాయి. ప్రగతివికాసాలకు అందరికీ సమాన అవకాశాలుంటాయి. అందరికీ ఒకేవిధమైన న్యాయం లభిస్తుంది. దీనికి దాని గతచరిత్రే సాక్ష్యం. ఇక్కడ ముందుగా శ్రేయోరాజ్యాన్ని నడిపే పాలకుల హోదా, స్థానాలు ఏమిటో తెలుసుకుందాం. దివ్యఖుర్‌ఆన్‌లోని ఈ క్రింది సూక్తులు గమనించండి:

## దైవప్రాతినిధ్య విధానం

"నీ ప్రభువు దైవదూతలతో 'భూలోకంలో నేనొక ఖలీఫాని నియమించబోతున్నా' నని అన్నప్పుడు దైవదూతలు ఏమన్నారో తెలుసా? "ఏమిటీ! మీరు ప్రపంచ వ్యవస్థను ఛిన్నా భిన్నం చేసి, రక్తపాతానికి వడిగట్టేవాడ్ని భూలోకంలో నియమించబోతున్నారా? మేము మిమ్మల్ని అనుక్షణం స్తుతిస్తూ, మీ పవిత్రతను స్తుతిస్తూనే వున్నాంకదా?" అని అన్నారు. దానికి దేవుడు "మీకు తెలియని విషయాలెన్నో నాకు తెలుసు" అన్నాడు." (2:30)

"జబ్బూర్‌లో మేము హితోపదేశం చేసిన తర్వాత, మాపుణ్యదాసులు భూమికి వారసు లవుతారని వ్రాశాం. భక్తిపరులకు ఇందులో గొప్ప సందేశం ఉంది." (21:104,106)

దేవుడు ఏజాతికి రాజ్యాధికారం ప్రసాదిస్తాడో ఆ జాతి అసలుస్థానం దైవప్రాతినిధ్యమై ఉండాలి, మన దేశంలో బ్రిటిష్ పాలనలోని వైస్రాయ్ స్థానంలా. అయితే ఆ జాతి తన అసలు యజమాని, విశ్వపాలకుడైన దేవునికి పూర్తిగా విధేయురాలై ఆయన ఆజ్ఞల్ని పాటిస్తున్నప్పుడే అది చేసే పరిపాలన నిజమైన దైవప్రాతినిధ్య పాలనవుతుంది.

"ప్రపంచంలో అధికులు కావాలనుకొని అరాచకం సృష్టించగోరని వారికి మాత్రమే మేము పరలోక (స్వర్గ)ధామం కేటాయిస్తాం." (ఖుర్‌ఆన్-28:83)

"మీ పూర్వీకులను దేవుడు ఏవిధంగా లోకంలో ఖలీఫా (దైవప్రతినిధి)గా చేశాడో అదేవిధంగా మీలో విశ్వసించి సత్కార్యాలు చేసేవారిని కూడా ఖలీఫాగా చేస్తానని ఆయన

వాగ్దానం చేస్తున్నాడు.... అయితే వారు నన్ను మాత్రమే ఆరాధించాలి. నాకు మరెవరినీ సాటి కల్పించకూడదు." (ఖుర్‌ఆన్–24:55)

"వీరు (ఎంతో నీతిమంతులు), వీరికి మేము ధరణిలో రాజ్యాధికారమిస్తే ప్రార్థనా (నమాజ్) వ్యవస్థ నెలకొల్పుతారు. (పేదల ఆర్థిక హక్కయిన) జకాత్ చెల్లిస్తుంటారు. (ప్రజలను) మంచిని గురించి ఆదేశిస్తారు. చెడుల్ని అరికడ్తారు." (ఖుర్‌ఆన్–22:41)

దైవప్రవక్త (సల్లం) మహితోక్తులు వినండి. ఆయన ఇలా ప్రవచించారు:

"మీరు తప్పనిసరిగా దైవగ్రంథాన్ని అనుసరించాలి. దైవగ్రంథాన్ని అనుసరించడం మీ విధి. అందులో దేవుడు ధర్మసమ్మతం చేసిన విషయాలను మీరు ధర్మసమ్మతం చేసుకోవాలి; దేవుడు నిషేధించినవాటిని మీరు నిషేధించుకోవాలి." (ముస్నద్‌అహ్మద్)

"నేను మీ దగ్గర రెండు వస్తువులు వదలిపోతున్నాను. దైవగ్రంథం (దివ్యఖుర్‌ఆన్), దైవప్రవక్త సంప్రదాయం (హదీసు). ఈ రెండిటిని దృఢంగా పట్టుకొనివుంటే మీరు ఎన్నటికీ మార్గభ్రష్టులు కాలేరు." (మువత్తా, కన్జుల్‌అమ్మాల్)

"మీలో ప్రతివ్యక్తీ బాధ్యతాయుతుడైన సంరక్షకుడే. కనుక అతను తన సంరక్షణలో ఉండేవారిని గురించి ప్రశ్నించబడతాడు. పాలకుడు తన ప్రజలకు సంరక్షకుడు. అతను తన ప్రజల (బాగోగుల) విషయంలో బాధ్యుడవుతాడు. పురుషుడు తన భార్యాపిల్లలకు సంరక్షకుడు. అతను వారి విషయంలో బాధ్యుడవుతాడు. స్త్రీ తన భర్త ఇంటికి, అతని పిల్లలకు సంరక్షకురాలు. ఆమె వారి విషయంలో బాధ్యురాలవుతుంది." (బుఖారి)

"ముస్లింల ప్రభుత్వంలో పదవి చేపట్టిన అధికారి తన బాధ్యతలను సక్రమంగా నిర్వహించడానికి తన ప్రాణాన్ని సైతం ఖాతరుచేయకుండా చిత్తశుద్ధితో పనిచేయకపోతే, అతను (తోటి)ముస్లింలతో పాటు స్వర్గంలో ఎన్నటికీ ప్రవేశించలేడు." (ముస్లిం)

యజీద్ బిన్ అబూసుఫ్యాన్ (రజి) కథనం: (ఖలీఫా) అబూబకర్ (రజి) నన్ను సేనా పతిగా నియమించి యమన్‌కు పంపుతూ నాకిలా ఉపదేశించారు- "యజీద్! నీ బంధువులు కొందరున్నారు. బాధ్యతల (పదవుల) అప్పగింతలో నీవు ఇతరులపై వారికి ప్రాధాన్యం ఇస్తావేమోనని నాకు భయంగా ఉంది. గుర్తుంచుకో, దైవప్రవక్త (స) ఈ విష యాన్ని గురించి హెచ్చరిస్తూ 'ముస్లింల సామూహిక వ్యవహారాలకు సంబంధించిన బాధ్యతల్ని ఎవరికైనా అప్పగించినపుడు అతను కేవలం మైత్రీ బంధుత్వాల ప్రాతిపదికపై ముస్లింలపై ఎవరినైనా అధికారిగా నియమించడం జరిగితే అలాంటి మనిషిపై దేవుని అభిశాపం పడుతుంది. దేవుడు అతని తరఫున ఎలాంటి  పరిహారం స్వీకరించడు. చివరికతను నరకంలో పడవేయబడతాడు' అని అన్నారు." (కితాబుల్ ఖరాజ్)

హ్రజత్ ఇబ్నెఉమర్ (రజి) కథనం: ఉమర్ (రజి)ని "మీరు ఖలీఫా వారసుడిగా ఎవరి పేరైనా ఎందుకు ప్రతిపాదించరు?" అని అడిగినప్పుడు ఆయనిలా అన్నారు- "తదుపరి ఖలీఫాగా నేను ఎవరి పేరయినా ప్రతిపాదిస్తే అది సమంజసమే. ఎందుకంటే నాకంటే శ్రేష్ఠుడైన వ్యక్తి అబూబకర్ (రజి) తన వారసుడి పేరు ప్రతిపాదించారు. ఒకవేళ నేను ఎవరి పేరునూ ప్రతిపాదించకపోతే (అదీ సరైన పద్ధతే). నాకంటే అత్యంత శ్రేష్ఠులైన



దైవప్రవక్త (స) ఖలీఫాగా ఎవరి పేరూ ప్రతిపాదించలేదు. ప్రజలు ఈమాట విని ఆయన్ని ప్రశంసించారు. ఆతర్వాత ఆయనిలా అన్నారు- "ప్రజలలో రెండు రకాలవారున్నారు. కొందరు ఖలీఫా పదవి పట్ల మక్కువ గలవారు, మరికొందరు అదంటే భయపడేవారు ఉన్నారు. నేనీ బాధ్యత నుండి (దేవుని దగ్గర) పూర్తిగా విముక్తి పొందాలనుకుంటున్నాను. దీనివల్ల నాకు పుణ్యఫలం లభించకపోయినా నష్టం మాత్రం కలగకూడదని నేను కోరు కుంటున్నాను. నేను జీవించి ఉన్నంతకాలం ఖిలాఫత్ భారం మోస్తూవచ్చాను. ఇప్పుడు నేను చనిపోయాక కూడా ఆ భారం నామీద ఉండకూడదని భావిస్తున్నాను. అందువల్ల ఖలీఫా వారసుడి కోసం నేనెవరి పేరునూ ప్రతిపాదించదలచుకోలేదు." (బుఖారి)

ఖిలాఫత్ వ్యవహారంలో ఈరెండు పద్ధతులు సరైనవేనని ధర్మవేత్తల ఏకాభిప్రాయం. అంటే ప్రస్తుత ఖలీఫా తన వారసుడి పేరు ప్రతిపాదించినా, ప్రతిపాదించకకుండా కొత్త ఖలీఫా ఎన్నిక బాధ్యతను ప్రజలకు వదలిపెట్టినా రెండు విధానాలూ సరైనవే. అందుకే హ్రజత్ ఉమర్ (రజి) తన వారసుడి పేరు ప్రతిపాదించకుండా కొత్త ఖలీఫా ఎంపిక కోసం ఆర్గురు సభ్యులతో కూడిన ఒక ఎన్నిక సంఘం నియమించారు.

అబ్దుర్రహ్మాన్ బిన్ సమూరా (రజి) కథనం: దైవప్రవక్త (స) నాతో ఇలా అన్నారు- "అబ్దుర్రహ్మాన్! నువ్వు ఎన్నడూ పదవిని, నాయకత్వాన్ని కోరకు. నీ కోరిక ప్రకారం పదవీ పాలనాధికారాలు నీకివ్వడం జరిగితే ఆ బాధ్యత పూర్తిగా నీ మీదనే పడుతుంది. (దైవ సహాయం పొందే అర్హత కోల్పోతావు.) ఒకవేళ నీవు కోరకుండానే ఆ బాధ్యత నీపై మోప బడితే మాత్రం దాని నిర్వహణలో నీకు దైవసహాయం లభిస్తుంది." (బుఖారి, ముస్లిం)

హ్రజత్ సఫీనా (రజి) కథనం: "(ప్రపంచంలో) ఖిలాఫత్ (దైవప్రాతినిధ్య పాలనా వ్యవస్థ) 30 ఏండ్ల పాటు ఉంటుంది. ఆతర్వాత అది రాజరికవ్యవస్థగా మారిపోతుంది" అని దైవప్రవక్త (స) తెలిపారు. దాని ప్రకారం అబూబకర్ (రజి) ఖిలాఫత్ 2 ఏండ్లు, ఉమర్ (రజి) ఖిలాఫత్ 10 ఏండ్లు, ఉస్మాన్ (రజి) ఖిలాఫత్ 12 ఏండ్లు, అలి (రజి) ఖిలాఫత్ 6 ఏండ్లు చొప్పున మొత్తం 30 ఏండ్లు అయింది. (తిర్మిజి)

## తొలి ఖలీఫాతో ప్రవక్తవారసుల విభేదం?

హ్రజత్ ఆయిషా (రజి) కథనం: దైవప్రవక్త (స) తదనంతరం ఆయన భార్యలలో ఒకరు తమ వారసత్వపు ఆస్తులు తమకప్పగించమని అడిగేందుకు అబూబకర్ (రజి) దగ్గరకు ఉస్మాన్ (రజి)ని పంపడానికి నిశ్చయించుకున్నారు. నేనప్పుడు జోక్యం చేసు కుంటూ "మా (ప్రవక్తల) ఆస్తికి వారసులుండరు. మేము వదలిన ఆస్తి దానం (సదఖా) గా పరిగణించబడుతుంది" అన్న ప్రవక్తప్రవచనం మీకు తెలియదా? అన్నాను. (బుఖారి)

హ్రజత్ ఆయిషా (రజి) కథనం: దైవప్రవక్త (స) కుమార్తె ఫాతిమా (రజి) ఖలీఫా అబూబకర్ (రజి) దగ్గరకు ఒక వ్యక్తిని పంపించారు. మదీనా, ఫదక్‌లలో దేవుడు తన ప్రవక్త (స)కు ప్రత్యేకంగా ప్రసాదించిన ఆస్తుల్ని గురించి, ఖైబర్‌కు చెందిన ఖుమ్స్ ఆస్తులలో మిగిలిన ఆస్తుల్ని గురించి అబూబకర్ (రజి)ని అడిగి రమ్మని అతడ్ని పంపారు. అబూబకర్ (రజి) ఈమాట విని ఇలా అన్నారు- "దైవప్రవక్త (స) తమకు వారసులెవరూ ఉండరని, తాము వదలివెళ్ళిన ఆస్తి దానం (సదఖా)గా పరిగణించబడు

తుందని అన్నారు. అయితే దైవప్రవక్త (స) కుటుంబీకులు ఈ సంపదలో నుంచి తమ కనీసావసరాలు పొందవచ్చు. దైవప్రవక్త (స) నిర్ణయించిన దానాలు (సదఖాత్) ఆయన కాలంలో ఏ స్థితిలో ఉండేవో నేనా స్థితికి భిన్నంగా వాటిని మార్చలేను. వాటి విషయం లో దైవప్రవక్త (స) ఎలా ఆచరించేవారో నేనూ అదేవిధంగా ఆచరిస్తాను.''

అబూబకర్ (రజి) ఈమాట చెప్పి ఫాతిమా (రజి)కు ఆ ఆస్తులనుంచి వాటా ఇవ్వ లేదు. అంచేత ఫాతిమా (రజి) అబూబకర్ (రజి)పై కోపం వచ్చి ఆయనతో మాట్లాడటం మానేశారు. ఇలా ఆమె చనిపోయేదాకా మాట్లాడలేదు. దైవప్రవక్త (స) నిర్యాణం తర్వాత ఫాతిమా (రజి) ఆర్నెల్లు మాత్రమే జీవించారు. ఆమె చనిపోయిన తరువాత ఆమె భర్త అలి (రజి) అదే రాత్రి ఆమెను ఖననం చేశారు. ఆమె చనిపోయిన సంగతి అబూబకర్ (రజి)కు తెలియజేయలేదు. ఆయన స్వయంగా ఆమె జనాజానమాజ్ చేశారు.

ఫాతిమా (రజి) జీవించి ఉన్నంత కాలం అలి (రజి)కి జనంలో ఓ ప్రత్యేక హోదా, స్థానం ఉండేవి. ఫాతిమా (రజి) చనిపోయిన తరువాత ప్రజల దృష్టి అలి (రజి)పై నుండి తొలగిపోయింది. అందువల్ల ఆయన అబూబకర్ (రజి)తో రాజీపడదామని ఆయన్ని ఖలీఫాగా అంగీకరించి ప్రమాణం (బైత్) చేద్దామని నిర్ణయించుకున్నారు. ఇలా నిర్ణయించుకొని అబూబకర్ (రజి) దగ్గరకు ఒక సందేశం పంపారు. అందులో ''మీరు ఓసారి మా ఇంటికి రండి. మీరు ఒక్కరే రావాలి. మీవెంట మరెవరూ ఉండకూడదు'' అని ఉంది. ఉమర్ (రజి) ఈ సందేశం విని అబూబకర్ (రజి)తో ''మీరాయన దగ్గరకు ఒంటరిగా వెళ్ళకండి'' అన్నారు. ''ఎందుకు, ఆయన నాకేదైనా కీడు తలపెడతాడని భావిస్తున్నావా నీవు? దైవసాక్షి! నేను తప్పకుండా ఆయన దగ్గరకు ఒంటరిగానే వెళ్తాను'' అన్నారు అబూబకర్ (రజి). అలా చెప్పి ఆయన అలి (రజి) ఇంటికి వెళ్ళారు.

అలి (రజి) దైవస్తోత్రం చేసిన తర్వాత ఇలాఅన్నారు- ''మాకు మీ విశిష్ఠత, ఔన్నత్యా లను గురించి, దేవుడు మీకు ప్రసాదించినదాన్ని గురించి మాకు తెలుసు. దేవుడు మీకు చేసిన మేలుపట్ల మాకెలాంటి అసూయలేదు. కాని మీరు ఖిలఫత్ విషయంలో సర్వాధి కారిగా వ్యవహరిస్తున్నారు. మేము దైవప్రవక్త (స) దగ్గరి బంధువులైనందున అందులో (సలహా సంప్రదింపుల్లో) మాక్కూడా భాగం ఉందని మేము భావిస్తున్నాము.''

ఈమాటలు విన్న అబూబకర్ (రజి)కు కళ్ళు చెమర్చాయి. మనస్సు కాస్త కుదుట పడిన తరువాత ఇలా అన్నారు- ''ఎవరి అధీనంలో నా ప్రాణముందో ఆ శక్తిస్వరూపుని సాక్షి! నా బంధువుల కంటే దైవప్రవక్త (స) బంధువులే నాకు ఎక్కువ ప్రియమైనవారు. ఈ ఆస్తుల వ్యవహారంలో మీకు-నాకు మధ్య విభేదాలు వచ్చాయి. నేను మాత్రం పుణ్యం, శ్రేయస్సులను కోరే విధానం పట్ల అణుమాత్రం కూడా వైముఖ్యం కనబరచ లేదు. ఈ ఆస్తుల విషయంలో దైవప్రవక్త (స) కాలంలో నేను ఏఏ పద్ధతుల్ని చూశానో అవన్నీ అవలంబించాను. వాటిలో నేను ఏ ఒక్కదాన్నీ వదలిపెట్ట లేదు.''

ఆ తరువాత అలి (రజి) ఆయనతో ''మేము మీ బైత్ కోసం సాయంత్రం వేళను నిర్ణయిస్తున్నాము'' అని అన్నారు. అబూబకర్ (రజి) ఈమాట విని వెళ్ళిపోయి జుహర్ నమాజ్ తరువాత (మస్జిద్‌లో) వేదిక ఎక్కి దైవస్తోత్రం తరువాత తాను అలి (రజి)ని



కలుసుకున్న సంగతి ప్రస్తావించారు. ఆయన తన ఖిలాఫత్ గుర్తింపు ప్రమాణం (బైత్) చేయడంలో ఎందుకు వెనుకంజ వేశారో, అందుకు ఆయన చెప్పిన కారణాలేమిటో అన్నీ వివరించారు. తరువాత అలి (రజి) లేచి ఇస్తిగ్ఫార్ (పాపమన్నింపు వేడుకోలు) చేశారు. అబూబకర్ (రజి) విశిష్ఠత, ఔన్నత్యాలను అంగీకరించారు. ఆ తరువాత ఇలా అన్నారు- ''నేనీ (బైత్) విషయంలో ఏదైనా చేస్తే దానిక్కారణం అబూబకర్ (రజి) పట్ల అసూయ కాదు. నాకాయన పట్ల ఎలాంటి అసూయ లేదు. ఆయనకు దేవుడు ప్రసా దించిన హోదా, ఔన్నత్యం, విశిష్ఠతలను కూడా నేను నిరాకరించలేను. కాకపోతే ఖిలాఫత్ వ్యవహారంలో మాక్కూడా భాగం ఉందని, అబూబకర్ (రజి) మమ్మల్ని సంప్రదించ కుండా మా సలహాలు అడక్కుండా ఆయన ఒక్కరే ఈ బాధ్యతను నిర్వహిస్తున్నారని మాత్రమే మేము భావించాము. దీనివల్ల మాకు బాధ కలిగింది.''

ఈ మాటలు విని ప్రజలంతా సంతోషం వ్యక్తపరిచారు. (ఎట్టకేలకు) మీరు సరైన నిర్ణయం తీసుకున్నారని అన్నారు వారు. ఆ తర్వాత ప్రజలు అలి (రజి)కి దగ్గరయ్యారు. అలి (రజి) మంచి విషయం అవలంబించగానే వారు మళ్ళీ ఆయనకు చేరువయి ఆయన్ని అభిమానించసాగారు. (బుఖారి, ముస్లిం)

## ప్రభుత్వ సలహామండలి

''వారు పరస్పరం సలహా సంప్రదింపులతో తమ వ్యవహారాలు నడుపుకుంటారు.'' (దివ్యఖుర్ఆన్-42:38)

ఈసూక్తి సామూహిక వ్యవహారాల్లో నియంతృత్వ పోకడల్ని, ఏకసత్తాక ధోరణుల్ని అరి కడ్తూ, ధర్మశాస్త్రం పరిధిలో ప్రజాస్వామ్యాన్ని ప్రోత్సహిస్తోంది. దైవప్రవక్త (స), ఆ తర్వాత వచ్చిన తొలినలుగురు ఖలీఫాలు ధర్మశాస్త్రం పరిధిలోకిరాని సామూహిక వ్యవహారాల్లో తోటి ముస్లిం లతో సలహాసంప్రదింపులు జరిపి సమిష్టినిర్ణయాలు తీసుకునేవారు. ఖురాన్‌లో దేవుడిలా ఆదేశిస్తున్నాడు: ''నీవు తలపెట్టే పనుల విషయంలో వారిని సంప్రదిస్తూఉండు.'' (3:159)

ఖుర్ఆన్, హదీసులతో కూడిన ధర్మశాస్త్రం ఇస్లామీయరాజ్యానికి శాశ్వత రాజ్యాంగ మవుతుంది. అందులో మార్పులు, చేర్పులకు ఎలాంటి అవకాశం లేదు. ధర్మశాస్త్రం పరిధిలోకి రాని వ్యవహారాల్లో మాత్రమే ఖలీఫా ప్రజాప్రతినిధుల్ని సంప్రదించి నిర్ణయం తీసుకుంటాడు. ఖలీఫా తప్పుడు నిర్ణయం తీసుకుంటే ప్రజలకు అతడ్ని విమర్శించే, అతని నిర్ణయాన్ని ఉపసం హరింపజేసే హక్కుంటుంది. సన్మార్గగాములైన తొలి నల్గురు ఖలీఫాలు ప్రజలకు నిర్భయంగా తమఅభిప్రాయాల్ని వెలిబుచ్చడానికి, తప్పు చేసినప్పుడు విమర్శించడానికి పూర్తి స్వేచ్ఛనిచ్చారు.

ఓసారి ఖలీఫా హజ్రత్ ఉమర్ (రజి) జుమాప్రసంగం చేస్తూ, వివాహంలో నాల్గొం దల దిర్హంలకు మించి మహర్ చెల్లించడానికి అనుమతివ్వకూడదని ప్రతిపాదన చేశారు. అప్పుడో స్త్రీ లేచి ''అలా ఆదేశించే అధికారం మీకు లేదు. ఖుర్ఆన్ మహర్‌గా ఎంతపెద్ద ధనరాసి ఇవ్వడానికైనా అనుమతిస్తుంటే దానికి హద్దులేర్పరచేందుకు మధ్యలో మీరెవరు?'' అని విమర్శించింది. దాంతో ఆయన తన ప్రతిపాదన వెనక్కితీసుకున్నారు.

మరొకసారి ఆయన్ని సల్మాన్‌ఫార్సి (రజి) నిండుసభలో పట్టుకొని ''అందరికీ లెక్క ప్రకారం ఒక్కొక్క దుప్పటే వచ్చింది కదా, మరి మీరు ఇంతపెద్ద చొక్కా ఎలా కుట్టించు

కున్నారు? దానికి రెండు దుప్పట్లయితేగాని సరిపోదు" అని అడిగారు. ఉమర్ (రజి) భారీ కాయంగల ఎత్తయిన మనిషి. అంచేత ఆయన చొక్కా కుట్టించుకోవడానికి తన భాగం దుప్పటి సరిపడనందున కొడుకు వాటాకు వచ్చిన దుప్పటి అడిగితీసుకొని చొక్కా కుట్టించుకున్నారు. ఆ విషయమే ఆయన తన కుమారుని చేత చెప్పించారు. (హదీస్)

## అవినీతికి ఆమడ దూరంలో

హజ్రత్ ముఆజ్ (రజి) కథనం: దైవప్రవక్త (స) నన్ను (యమన్‌కు) పంపినప్పుడు ఇలా హితబోధ చేశారు: "నువ్వు గ్రంథవహులైన ప్రజల దగ్గరికి వెళ్తున్నావు. (కనుక ముందుగా) నువ్వు వారిని అల్లాహ్ తప్ప వేరొక ఆరాధ్యుడు లేడని, ముహమ్మద్ దైవప్రవక్త అని సాక్ష్యం పలకమని చెప్పు. వారు నీమాట వింటే అప్పుడు, దేవుడు రేయింబవళ్ళలో వారిపై ఐదు(పూటల) నమాజులు విధిగా చేశాడని చెప్పు. దానికీ వారు ఒప్పుకుంటే, దేవుడు వారిపై జకాత్ దానాన్ని విధిగా చేశాడని, అది వారి ధనవంతుల నుండి వసూలుచేసి వారి బీదవారికి పంచబడుతుందని తెలియజెయ్యి. దానిక్కూడా అంగీకరిస్తే (జకాత్ వసూలుచేసినప్పుడు) నీవు వారి సంపదలోని నాణ్యమైన వస్తువుల్ని తీసుకోకుండా జాగ్రత్తపడు. (అలాచేస్తే వారిని పీడించినట్లవుతుంది.) పీడితుని ఆర్తనాదం నుండి నిన్ను నీవు రక్షించుకో. పీడితుని ఆర్తనాదానికి, దేవునికి మధ్య ఎలాంటి అడ్డుతెర లేదు (అతని శాపాన్ని దేవుడు తప్పకుండా ఆమోదిస్తాడు)." (బుఖారీ, ముస్లిం)

దైవప్రవక్త (స) అజ్ద్ తెగకు చెందిన ఇబ్నె లుత్‌బియ్యా అనే వ్యక్తిని జకాత్ వసూళ్ళ కోసం ఉద్యోగిగా నియమించారు. అతను (జకాత్ వసూళ్ళు అయిపోయిన తరువాత) తిరిగివచ్చి, "ఈ సొమ్ము మీది. ఇది నాకు కానుకగా ఇవ్వబడింది" అన్నాడు. దైవప్రవక్త (స) ఈమాట విని వేదిక ఎక్కి దైవస్తోత్రం తరువాత ఇలా అన్నారు:

"దేవుడు నాకప్పగించిన అధికారిక విషయాల్లోని (జకాత్ వసూళ్ళ) పనిపై ఒకర్ని నేను ఉద్యోగిగా నియమిస్తే, అతను (వసూళ్ళతర్వాత) 'ఇది మీది. ఇది నాకు కానుకగా ఇవ్వబడింది' అంటున్నాడు. అలాగైతే అతను (జకాత్ పనిమీద వెళ్ళకుండా) తన తండ్రి ఇంట్లోనో, తల్లి ఇంట్లోనో ఎందుకు కూర్చొనిఉండలేదు? అతను చెబుతున్న సంగతి నిజమే అయితే (ఇంట్లో కూర్చొనిఉన్నా) ఈ కానుకలు అతనికి చేరాల్సిందేగా. దైవసాక్షి! మీలో ఎవరైనా తన హక్కు (జీతం)కు మించి ఏమైనా తీసుకుంటే ప్రళయదినాన అతనా వస్తువుని ఎత్తుకున్న స్థితిలోనే దైవాన్ని కలుసుకుంటాడు. (ఒంటెను తీసుకుంటే) ఒంటెనెత్తుకొని ఉన్న స్థితిలోనే కలుస్తాడు. ఆ ఒంటె (అతని వీపుపై) విలవిల్లాడుతూ ఉంటుంది. (ఆవుని తీసుకుంటే) అరుస్తూ ఉండే ఆవునే ఎత్తుకొని కలుస్తాడు. (మేకను తీసుకుంటే) మేకనే ఎత్తుకొని కలుస్తాడు. అది (అతని వీపుపై) 'మేమే' అని అరుస్తూ ఉంటుంది. నేను మీలో ఎవరినీ ఆ స్థితిలో చూడకూడదు సుమా!" (బుఖారీ, ముస్లిం)

హజ్రత్ అబూహురైరా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఇలా బోధించారు: "మీలో ఎవరైనా సాటిసోదరుని మానమర్యాదలకు సంబంధించిన విషయంలో, లేదా మరే విషయంలోనైనా దౌర్జన్యానికి పాల్పడితే, (ఆ పాపాన్ని దూరం చేసుకోవడానికి) దీనార్లు, దిర్హములు లభించని రోజు దాపురించక ముందు- ఈ రోజే అతను తన



పాపాన్ని ప్రక్షాళనం చేసుకోవాలి. (లేకుంటే ఆ రోజు) దౌర్జన్యానికి పాల్పడిన వ్యక్తి దగ్గర సత్కార్యాలు ఉంటే, అతన్నుండి అతని దౌర్జన్యానికి సమానంగా సత్కార్యాలు తీసుకొని (పీడితులకు పంచడం జరుగుతుంది). ఒకవేళ అతని దగ్గర సత్కార్యాలు అయిపోతే అతని ప్రత్యర్థి పాపాలను కూడా అతనిపైనే మోపటం జరుగుతుంది." (బుఖారీ)

హజ్రత్ అబూహురైరా (రజి) కథనం: ప్రవక్త సామాను కాపలా కోసం ఒకతను ఉండేవాడు. అతణ్ణి 'కిర్‌కిరా' అని పిలిచేవారు. ఆ వ్యక్తి చనిపోయినప్పుడు దైవప్రవక్త (స) అతను నరకంలో ఉన్నాడని అన్నారు. (అది విని) ప్రజలు అతణ్ణి (పరిశీలనగా) చూడసాగారు. అప్పుడు ప్రవక్త అనుచరులకు ఆ వ్యక్తి దగ్గర అతను (యుద్ధప్రాప్తి నుండి) దొంగిలించిన నల్లచారల దుప్పటి ఒకటి దొరికింది. (బుఖారీ)

హజ్రత్ అబూఉమామా ఇయాస్ బిన్ సాలబా హారిసీ (రజి) కథనం: (ఒకసారి) దైవప్రవక్త (స) "ప్రమాణం చేసి (తోటి)ముస్లిం హక్కుని లాక్కున్నవాడికి దేవుడు నరకాగ్నిని తప్పనిసరి చేశాడు; స్వర్గాన్ని నిషేధించాడు" అని అన్నారు. అది విని ఒకతను "ఆ హక్కు ఎంత చిన్నదైనా (దేవుడు అలాగే చేస్తాడా)?" అని అడిగాడు. దానికి ఆయన "అది పీలూ చెట్టుకొమ్మ అయినా సరే!" అని అన్నారు. (ముస్లిం)

హజ్రత్ అదీ బిన్ ఉమైరా (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ఇలా అన్నారు: "మేము మీలో ఎవరినైనా ఏదైనా పనికి ఉద్యోగిగా నియమించినప్పుడు అతను సూదిగాని లేదా అంతకన్నా పెద్ద వస్తువుగాని దాచిపెట్టుకుంటే అది ద్రోహం అవుతుంది. ప్రళయదినాన అతను దాన్ని తన వెంట తీసుకొనే (దైవసన్నిధికి) వస్తాడు."

ఈమాట విని అన్సార్లకు చెందిన ఒకతను లేచి నిలబడ్డాడు. ఇప్పటికీ ఆ దృశ్యం నా కళ్ళముందు మెదలుతోంది. అతను దైవప్రవక్తతో "దైవప్రవక్తా! మీరు నాకు అప్ప గించిన బాధ్యతను తిరిగి తీసేసుకోండి" అన్నాడు. దానికి ఆయన "ఏమయింది నీకు?" అనడిగారు. దానికతను "మీరు ఇలా అన్నారుగా! (దాంతో నాకు భయం పట్టుకుంది)" అని విన్నవించుకున్నాడు. దైవప్రవక్త (స) ఈమాట విని "ఇప్పుడు కూడా అదే మాట అంటున్నాం. మేము ఎవరినైనా ఏదైనా పనికి నియమించినప్పుడు అతను తనకు లభించిన దానిని- అది తక్కువైనా, ఎక్కువైనా- (మా దగ్గరికి) తీసుకురావాలి. అందులో అతనికిచ్చింది మాత్రమే తీసుకోవాలి. ఇవ్వనిది తీసుకోరాదు" అని అన్నారు. (ముస్లిం)

## మానవ సమానత్వం

"మానవులారా! మేము మిమ్మల్ని ఒకే స్త్రీపురుష జంట నుండి పుట్టించాం. తర్వాత మీ పరస్పర పరిచయం కోసం మిమ్మల్ని విభిన్న జాతులుగా, తెగలుగా చేశాం. అయితే మీలో అందరికంటే ఎక్కువ భయభక్తులు కలవాడే దేవుని దృష్టిలో ఎక్కువ గౌరవనీయుడు" (ఖుర్‌ఆన్-46:13)

ఈ వాస్తవాన్ని గురించి దైవప్రవక్త (స) ఇలా తెలియజేశారు:

"ప్రళయదినాన దేవుడు మీ కులగోత్రాలను గురించి అడగడు. మీలో అందరి కంటే ఎక్కువ దైవభీతి కలవాడే దేవుని దృష్టిలో ఎక్కువ గౌరవనీయుడు." (ఇబ్నెమాజ).

“ప్రజలారా! జాగ్రత్తగా వినండి, మీకందరికీ దేవుడు ఒక్కడే. అరబ్బులకు అరబ్బే తరులపై, అరబ్బేతరులకు అరబ్బులపై, తెల్లవాళ్ళకు నల్లవాళ్ళపై, నల్లవాళ్ళకు తెల్లవాళ్ళ పై దైవభీతి ప్రాతిపదికపై తప్ప ఎలాంటి ఔన్నత్యం లేదు. మీలో అందరికంటే ఎక్కువ దైవభీతిపరుడే దేవుని దృష్టిలో ఎక్కువ గౌరవనీయుడు......” (బైహఖి)

“మీలోని అజ్ఞాన కాలంనాటి చెడుల్ని, అహంకారాన్ని దూరంచేసిన దేవుడు ఎంతో ప్రశంసనీయుడు. ప్రజలారా! మానవులంతా రెండేరెండు వర్గాల్లో విభజించబడ్డారు. (1) సజ్జనులు, దైవభీతిపరులు. వీరు దేవుని దృష్టిలో గౌరవనీయులు. (2) దుర్మార్గులు, దౌర్భాగ్యులు. వీరు దేవుని దృష్టిలో తుచ్ఛులు. (ఈభేదం) లేకపోతే మానవులంతా ఆదం సంతానం (అంతా సమానులే). ఆదంని దేవుడు మట్టితో సృజించాడు.” (తిర్మిజి)

“మీమీద పాలకుడిగా బట్టతల నీగ్రో బానిసయినా సరే నియమించడం జరిగితే అతని మాట వినండి, అతనికి విధేయత చూపండి.” (అల్‌జిహాద్ ఫిల్‌ఇస్లాం)

ఈరాన్‌లోని ఒక పట్టణాన్ని ముస్లింలు దిగ్బంధించి యుద్ధం చేస్తారు. దిగ్బంధా నికి గురయిన పార్శీలు తమ శక్తినంతా ధారపోసినా ముస్లింలను ఎదిరించలేక దాదాపు ఓడిపోయే దశకు చేరుకున్నారు. సరిగ్గా అలాంటి పరిస్థితిలోనే ఇస్లామీయ సైన్యంలోని ఒక బానిస సైనికుడు తాము పట్టణవాసులకు రక్షణ హామీ ఇస్తున్నట్లు ఒక కాగితంలో రాసి దాన్ని బాణం ద్వారా పట్నంలోకి విసురుతాడు. ఈ విషయం తెలియని ముస్లిం యోధులు మరుసటి రోజు పట్టణంపై దాడిచేయడానికి సిద్ధమవుతారు. అప్పుడు పార్శీలు రక్షణ హామీ పత్రం తీసుకొని పట్టణ ప్రధానద్వారం తెరచి బయటికి వస్తారు. బయటికి వచ్చి “ఒక ముస్లిం సైనికుడు మాకు రక్షణ హామీ పత్రం రాసిచ్చాడు కదా, ఇక మీరెందుకు మాపై దాడిచేయడానికి వచ్చారు?” అని అడుగుతారు.

ముస్లిం సేనాపతి రక్షణహామీ పత్రం చూసి, ఒక బానిస రాసిచ్చిన హామీపత్రానికి ఎంత విలువ ఉంటుందో, అతని రక్షణహామీని అమలుపరచవచ్చా లేదా అని ఆలోచనలో పడిపోయాడు. ఆ విషయం గురించే ఖలీఫాకు ఉత్తరం రాశారు ఆయన. దానికి ఖలీఫా ఉమర్ (రజి) సమాధానమిస్తూ “బానిస ముస్లిం కూడా ఇతర ముస్లింల వంటివాడే. ఇతర ముస్లింల బాధ్యతలకు ఎంత విలువ ఉంటుందో బానిస ముస్లిం బాధ్యతకు కూడా అంతే విలువ ఉంటుంది. కనుక ఆ బానిస సైనికుడు ఇచ్చిన రక్షణహామీని అమలుపరచాలి” అని ఆజ్ఞాపించారు.

## అత్యంత బాధ్యతాభావం, నిరాడంబరతలు

దైవప్రవక్త (స) ప్రవచించిన ఈ క్రింది హితోక్తులు గమనించండి:

“మన ప్రభుత్వంలో ఏదైనా హోదా చేపట్టిన ఏమనిషి అయినా భార్యావిహీనుడై ఉంటే పెళ్ళి చేసుకోవచ్చు; సేవకుడు లేకపోతే ఒక సేవకుడ్ని పెట్టుకోవచ్చు; నివసించ డానికి ఇల్లు లేకపోతే ఒక ఇంటిని తీసుకోవచ్చు; వాహనం లేకపోతే ఒక వాహనం కూడా తీసుకోవచ్చు. అంతకుమించి మరే వస్తువునైనా సంపాదించడానికి పాల్పడితే అలాంటి మనిషి దొంగగా, నమ్మకద్రోహిగా పరిగణించబడతాడు.” (కన్జుల్ అమ్మాల్)



“అబూజర్! నీవు చాలా బలహీనుడివి. ప్రభుత్వ హోదా అనేది ఎంతో నిజాయితీతో కూడిన వ్యవహారం (అమానత్). ఆ హోదాకు సంబంధించిన హక్కు పూర్తిగా నిర్వహించ లేని, తనపై మోపబడిన బాధ్యతలను సక్రమంగా నెరవేర్చలేని వ్యక్తికి ప్రళయదినాన అది (తీవ్రమైన) పశ్చాత్తాపానికి కారణభూతమవుతుంది.” (కన్జుల్ అమ్మాల్)

“దేవుడు ఒక మనిషిని ప్రజలకు పాలకుడిగా, సంరక్షకుడిగా చేసినప్పుడు అతను గనక తన ప్రజల పట్ల శ్రేయోభిలాషతో వారి భద్రత సంరక్షణల బాధ్యతను నెరవేర్చక పోతే అతను స్వర్గ సువాసన సైతం ఆస్వాదించలేడు.” (బుఖారి)

ఈహదీసుల్ని బట్టి దేశపాలన ఎంత నిజాయితీ, బాధ్యతలతో కూడిన వ్యవహారమో స్పష్టమవుతోంది. ఖలీఫా హజ్రత్ ఉమర్ (రజి) తనబాధ్యతల్ని గుర్తుచేసుకుంటూ ఓసారి ఇలా అన్నారు: “ఫిరాత్ నదీతీరాన ఒక మేకపిల్ల చచ్చిపడివున్నా దాన్ని గురించి కూడా దేవుడు నన్ను నిలదీస్తాడేమోనని నాకు భయంగా ఉంది.” (కన్జుల్ అమ్మాల్)

హజ్రత్ అబూబకర్ (రజి) మొదటి ఖలీఫాగా ఎన్నుకోబడినప్పుడు ఆయన ఇలా ప్రసంగించారు: “ప్రజలారా! నేను మీకంటే ఎక్కువ శ్రేష్ఠుడ్ని కాకపోయినా మీరు ప్రభుత్వ నిర్వహణబాధ్యత నాకప్పగించారు. మీలో అందరికంటే ఎక్కువ బలవంతుడు నేనతనికి అతని హక్కు ఇప్పించనంత వరకు నాదృష్టిలో బలహీనుడే. మీలో అందరికంటే ఎక్కువ బలహీనుడు నేనతనికి అతనిహక్కు ఇప్పించనంత వరకు నాదృష్టిలో బలవంతుడే. ప్రజలారా! నాస్థాయి మీలో ఒక సాధారణ మనిషి స్థాయికంటే ఎక్కువ కాదు. కాబట్టి నేను సన్మార్గంలో నడచినంత కాలం మీరు నాకు విధేయులై ఉండండి. ఒకవేళ నేను సన్మార్గం తప్పి నడవడం చూస్తే మీరు నన్ను సరిచేయండి.” (అల్‌జిహాద్ ఫిల్‌ఇస్లాం)

హజ్రత్ అబూబకర్ (రజి) గతంలో వస్త్రవ్యాపారం చేస్తుండేవారు. అందువల్ల ఆయన ఖలీఫాగా ఎన్నికయిన మరుసటి రోజు నుంచే యథాప్రకారం బట్టలమూట భుజాన వేసుకొని బయలుదేరారు. దారిలో హజ్రత్ ఉమర్ (రజి) తారసపడి “మీరిప్పుడు ముస్లింలకు (దేశానికి) నాయకుడయ్యారు. మీకీ పని శోభించదు” అన్నారు. దానికి అబూబకర్ (రజి) “మరి నేను నా భార్యాపిల్లల్ని ఎలా పోషించుకోవాలి?” అన్నారు. “ఆ ఏర్పాటు (మన కోశాధికారి) అబూఉబైదా చేస్తారు, పదండి ఆయన దగ్గరకు” అన్నారు ఉమర్ (ర). చివరికి ముహాజిర్ ముస్లింలలో మధ్యతరగతి వ్యక్తి సంపాదనను దృష్టిలో పెట్టుకొని ఖలీఫాకు సంవత్సరానికి దాదాపు నాలుగువేల దిర్హమ్‌లు (ఈనాటి మన లెక్క ప్రకారం నెలకు సుమారు నాలుగు వేల రూపాయలు) జీతం నిర్ణయించబడింది.

అయితే హజ్రత్ అబూబకర్ (రజి) రెండేళ్ళపాలన తరువాత తనకు మరణ కాలం సమీపించినప్పుడు, తన ఆస్తి నుంచి ఎనిమిది వేల దిర్హమ్‌లు తీసి ప్రభుత్వ ధనాగారం లో జమ చేయాలని వీలునామా రాశారు. (ఖిలాఫత్ ఓ ములూకియత్)

హజ్రత్ ఉమర్ (రజి) ఓ ప్రసంగంలో తనహోదాను గురించి వ్యాఖ్యానిస్తూ ఇలా అన్నారు: “మీ (ప్రజా)ధనంతో నాసంబంధం ఒక అనాథధనంతో అతని సంరక్షకునికున్న సంబంధం వంటిదే. నేను స్థితిపరుడినైతే ఇందులో నుంచి చిల్లిగవ్వ కూడా తీసుకోను;

పేదవాడినైతే నాసేవకు లభించేటంత ప్రతిఫలమే తీసుకుంటాను. మీహక్కులు కొన్ని నాపై ఉన్నాయి. వాటిని గురించి మీరు నన్ను డిమాండ్ చేయవచ్చు. మీ ఆదాయం నుండి, 'ఫై'(సమరసొత్తు) రూపంలో దైవం మీకిచ్చిన సంపద నుండి (ప్రభుత్వ) రెవెన్యూ ఖాతాకు రావలసిన దానికంటే ఎక్కువ పన్నులు నేను వసూలు చేయను. ధర్మసమ్మత మైనంత పన్ను మాత్రమే వసూలు చేయడం నా బాధ్యత. నాచేతికి వచ్చే ధనాన్ని నేను ధర్మసమ్మతంగా తప్ప మరేవిధంగాను ఖర్చుచేయకుండా ఉండేలా మీరు నన్ను అదుపులో ఉంచవచ్చు. ఇది నామీద మీకున్న హక్కు." (అల్‌జిహాద్ ఫిల్‌ఇస్లాం)

ఇస్లాం తన న్యాయాన్ని మాటలకు, రాతలకు మాత్రమే పరిమితం చేయలేదు. మహాప్రవక్త ముహమ్మద్ (స), ఆయన నలుగురు శ్రేష్ఠఖలీఫాలు దీన్ని ఆచరణ ద్వారా లోకానికి చూపించారు. ఇలాంటి సంఘటనలతో ఇస్లాం చరిత్ర నిండిపోయివుంది.

హజ్రత్ ఉమర్ (రజి) పాలనాకాలంలో ఈరాన్ నుండి ఉత్తరాఫ్రికా వరకూ ఇస్లాం విజయపతాకాలు రెపరెపలాడాయి. సమరసొత్తు, జకాత్, జిజ్యా రూపాల్లో ప్రతి ఏడూ కోట్లాది దిర్హమ్‌లు ప్రభుత్వ ధనాగారంలోకి వచ్చి చేరుతుండేవి. అయినప్పటికీ ఆ మహాసామ్రాజ్యాన్ని ఏలే ఖలీఫా పరిస్థితి ఎంత దయనీయంగా ఉండేదో చూడండి-

ఆయన ఒంటిపై పదేసి అతుకులతో కూడిన ముతకబట్టలు, కాళ్ళకు చిరిగిన చెప్పులు, తలమీద చింపిరితలపాగ మాత్రమే ఉండేవి. సామాన్య ముస్లింలలో ఖలీఫా ఎవరో అరబ్బేతరులకు, విదేశీ దౌత్యవేత్తలకు ఎవరైనా చెప్పేవరకు తెలిసేది కాదు. ఆ రాజాధిరాజు సిరియా పర్యటనకు వెళ్ళి జెరూసలేం (బైతుల్‌మఖ్దిస్)లో ప్రవేశించినప్పుడు అక్కడి క్రైస్తవులు ఖలీఫా ఎవరో, ఆయన సేవకుడెవరో గుర్తించలేకపోయారు.

ఖలీఫా హజ్రత్ ఉమర్ (రజి), ఆయన సేవకుడు ఒంటెపై వంతులవారిగా కూర్చొని ప్రయాణం చేస్తూ నగరంలో ప్రవేశించే సమయానికి ఒంటెపై కూర్చునే వంతు సేవకునికి వచ్చింది. సేవకుడు ఎంత బ్రతిమాలినా హజ్రత్ ఉమర్ (ర) వినకుండా అతడ్ని ఒంటెపై ఎక్కించి తాను ఒంటె ముకుతాడు పట్టుకొని కాలినడకనే నగరంలో ప్రవేశించారు. స్థానిక ముస్లింలు ఆయన దగ్గరకు వచ్చి సలాం చేస్తూ స్వాగతిస్తుంటే, "ఏమిటీ ఇతనా ముస్లింల చక్రవర్తి!" అంటూ క్రైస్తవులు ఆశ్చర్యచకితులైపోయారు.

ఇక్కడ ఒక విషయం ప్రస్తావిస్తే సందర్భోచితంగా ఉంటుంది. కాస్త చరిత్ర పుటలు తిప్పి వెనక్కి వెళ్ళండి.... దైవప్రవక్త (సల్లం) అనేక రాజులతో పాటు రోమ్ చక్రవర్తికి కూడా శాంతిసందేశం లేఖ రాయించి పంపిన సందర్భం.

అప్పుడు రోమ్ చక్రవర్తి పాలస్తీనా పర్యటనకు వచ్చి జెరూసలేంలో ఆగివున్నాడు. అతను వ్యాపారం కోసం అక్కడకు వచ్చిన కొందరు అరబ్ బహుదైవారాధకుల్ని పిలిపించి ముహమ్మద్ (స) గుణగణాలు, ఆయన వంశం వగైరా విషయాల్ని గురించి అడిగాడు. వారు చెప్పినదాన్ని బట్టి రోమ్ చక్రవర్తికి మహనీయ ముహమ్మద్ (స) తప్పకుండా దైవప్రవక్తే అని నమ్మకం కలిగింది. అప్పుడతను తన సింహాసనం క్రింది నేల వైపు చూపిస్తూ "అయితే అతని సామ్రాజ్యం ఇక్కడ దాకా విస్తరిస్తుంది" అన్నాడు.



మహాప్రవక్త ముహమ్మద్ (స) గురించిన బైబిల్ భవిష్యవాణి వెలుగులో ఆనాడు రోమ్ చక్రవర్తి చెప్పిన మాట హజ్రత్ ఉమర్ (రజి) పాలనలో నిజమయింది. ఆయన బైతుల్‌మఖ్దిస్‌లో ప్రవేశించేటప్పటికి ఆ నగరం ముస్లింల అధీనంలోకి వచ్చింది. అయిన ప్పటికీ అక్కడ ఇస్లాం వ్యాప్తి కోసం రక్తపాతం జరగలేదు. కారణం కాలినడకన నగరంలో ప్రవేశించిన ఆ ఖలీఫా అత్యంత బాధ్యతాభావం గల శ్రేయోరాజ్య పాలకుడు కావడమే.

## పాలకుల పట్ల ప్రజల వైఖరి

"విశ్వాసులారా! దేవునిపట్ల, ఆయన ప్రవక్తపట్ల విధేయత కలిగిఉండండి. మీలో వ్యవహారకర్తలైన అధికారుల పట్ల కూడా. అయితే ఏదైనా వ్యవహారంలో మీమధ్య వివాదం తలెత్తితే దాన్ని తిరిగి దేవుని వైపుకు, ఆయనప్రవక్త వైపుకు మరల్చండి." (ఖుర్‌ఆన్–4:59)

ముస్లింలు ఐకమత్యంతో ఉండాలని, జీవితంలోని ప్రతి రంగంలో ఖుర్‌ఆన్, హదీసుల ఆజ్ఞలతో పాటు వారి పైఅధికారులు ఇచ్చే ఆజ్ఞల్ని కూడా పాటించాలని ఈసూక్తి తెలియ జేస్తోంది. ఈసూక్తిలో "దేవునిపట్ల విధేయత కలిగిఉండండి" అంటే ఖుర్‌ఆన్ ఆజ్ఞలు పాటిం చాలని; "ప్రవక్త(స) పట్ల విధేయత కలిగిఉండండి" అంటే హదీసు బోధనలు అనుసరించా లని అర్థం. అధికారులిచ్చే ఆజ్ఞలు మాత్రం ఈ రెండిటి వెలుగులోనే ఉండాలి.

హజ్రత్ అబ్దుల్లా బిన్‌అబ్బాస్ (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ప్రవచనం: "ఎవరికైనా ధర్మాధర్మాల దృష్ట్యా తమ పాలకునిలో ఏదైనా విషయం నచ్చకపోతే అతను సహనం వహించాలి. నాయకుని విధేయతా పరిధి నుండి ఎవరైనా జానెడు దూరం బయటికి పోయినా అతను అజ్ఞానపు చావును కొనితెచ్చుకున్నట్లే." (బుఖారి, ముస్లిం)

హజ్రత్ అబ్దుల్లా బిన్ మస్‌వూద్ (రజి) కథనం: దైవప్రవక్త (స) ఓసారి "మీ హక్కులు కాలరాయబడే కాలం సమీపంలోనేఉంది. అప్పుడు మీకు నచ్చని విషయాలు కూడా ఉంటాయి" అని అన్నారు. అనుచరులు ఈమాట విని "దైవప్రవక్తా! అలాంటి పరిస్థితుల్లో మాకు మీ ఆజ్ఞ ఏమిటీ?" అని అడిగారు. దానికి దైవప్రవక్త (స) ఇలా సమా ధానమిచ్చారు- "మీపై ఇతరులకున్న హక్కులు మీరు నెరవేర్చండి. మీ హక్కులను (ఆనాటి పాలకులు నెరవేర్చకపోతే వాటిని) గురించి దైవాన్ని ప్రార్థించండి. (అప్పుడు దేవుడు ఆ పాలకునికి సద్బుద్ధినైనా ప్రసాదించవచ్చు లేదా అతడ్ని పదవీచ్యుతుడ్ని చేసి మీ హక్కులు నెరవేర్చే మరో పాలకుడ్నయినా తీసుకురావచ్చు.)" (బుఖారి)

హజ్రత్ ఉబాదా బిన్ సామిత్ (రజి) కథనం: "దైవప్రవక్త (స) మమ్మల్ని ప్రమాణం చేయడానికి పిలిచినప్పుడు మేము ఆయన చేతిలో ప్రమాణం చేశాము. ఈ ప్రమాణం లో ఆయన మాచేత వాగ్దానం చేయించుకున్న విషయాలలో ఆజ్ఞలు విని వాటిని పాటిస్తామని, అవి మాకు నచ్చినా నచ్చకపోయినా, కలిమిలోనూ, లేమిలోనూ, మా హక్కులు కాలరాయబడినా, ఎట్టి పరిస్థితులోనైనా సరే మేము వాటిని శిరసావహిస్తా మన్న వాగ్దానం కూడా ఉంది. ప్రభుత్వ వ్యవహారాలను గురించి ప్రభుత్వాధికారులతో తగవుపడరాదన్న వాగ్దానం కూడా ఉంది. అయితే (పాలకులు) సత్యవ్యతిరేక కార్యకలా పాలకు పాల్పడినప్పుడు మీ దగ్గర దేవునికి సంబంధించిన విస్పష్ట ప్రమాణం, తగిన నిదర్శనాలు ఉంటే మటుకు (మీరు వారికి తలఒగ్గరాదు)." (బుఖారి)

పై ఉల్లేఖనం గురించి ఇమామ్ నవవీ (రహ్మ) వ్యాఖ్యానిస్తూ ఇలా అన్నారు: "అధికారి (పాలకుడు) బహిరంగంగా షరీఅత్ ఆజ్ఞలను ఉల్లంఘిస్తుంటే మీరు చూస్తూ మౌనంగా ఉండ కూడదు. అతని ముందు యదార్థం మాట్లాడాలి. అయితే ముస్లిం పాలకుడు దుర్మార్గుడైనా, దౌర్జన్యపరుడైనా అతనిపై తిరుగుబాటు చేయకూడదు. ఇది యావత్తు ధర్మవేత్తల ఏకాభి ప్రాయం. దీనికి ప్రమాణంగా అనేక హదీసులు ఉన్నాయి. అదీగాక కేవలం దుర్మార్గుడన్న కారణంతో నాయకుడ్ని పదవి నుండి తొలగించకూడదని, పదవి నుండి తొలగిస్తే కల్లోలం, రక్తపాతం జరిగే ప్రమాదం ఉంటుందని కూడా ధర్మవేత్తలు అభిప్రాయపడ్డారు."

ఖాజీ అయాజ్ (రహ్మ) ఈవిధంగా వ్యాఖ్యానించారు: "నాయకుడు నమాజ్ చేయడం మానేస్తే లేదా ధర్మంలో కొత్త పోకడలు (బిద్అత్‌లు) ప్రవేశపెడితే అతడ్ని పదవి నుండి తొలగించవచ్చు. అవిశ్వాస వైఖరి అవలంబిస్తే అతనికి విధేయత చూపకూడదు. అంతేగాక అలాంటి నాయకుడ్ని తక్షణమే పదవి నుండి తొలగించి అతని స్థానంలో న్యాయశీలుడైన నాయకుడ్ని నియమించుకోవాలి. ఇది వారి విధ్యుక్తధర్మం. అతడ్ని తొలగించే శక్తి లేనప్పుడు అతని రాజ్యం నుండి వేరే ప్రాంతానికి వలస పోవాలి. దేవుడే సర్వజ్ఞుడు."

హజ్రత్ ముఆజ్ (రజి) కథనం: దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు- "కానుకలు, పారితోషికాలు వాటి అసలు స్థాయిలో ఉంటే వాటిని మీరు స్వీకరించవచ్చు. అయితే అవి లంచంగా మారి మీచేత ధర్మవ్యతిరేక పనులు చేయించడానికి ఇవ్వబడితే మాత్రం వాటిని మీరు తీసుకోకండి. పేదరికం మిమ్మల్ని వాటిని తీసుకునేలా చేస్తుంది. జాగ్రత్త! ఇప్పుడు ఇస్లామీయవ్యవస్థ నెలకొనిఉంది. మీరు దైవగ్రంథం(ఖుర్ఆన్) ప్రకారం నడచు కోండి. వినండి! దైవగ్రంథం, రాజ్యాధికారం పరస్పరం విడిపోతాయి. (అంటే క్రూర పాల కులు ఇస్లాం ధర్మపరిధి నుండి రాజ్యాధికారాన్ని వేరుచేస్తారన్న మాట.) అప్పుడు మీరు దైవగ్రంథాన్నే అంటిపెట్టుకొని ఉండాలి. వినండి! మీ కోసం (ప్రత్యేక) చట్టాలు నిర్మించే పాలకులు మీపై పెత్తనం వహిస్తారు. మీరు గనక వారి చట్టాలు, నిర్ణయాలు ఒప్పుకుంటే వారు మిమ్మల్ని అపమార్గం వైపుకు తీసికెళ్తారు. ఒప్పుకోకపోతే హతమార్చుతారు."

అనుచరులు ఈ మాట విని 'అలాంటి పరిస్థితి వస్తే మేము ఏం చెయ్యాల'ని అడిగారు. దానికి దైవప్రవక్త (స) "అలాంటి పరిస్థితిలో మీరు ఈసా ప్రవక్త (అలైహి) అనుచరులు చేసినట్లే చేయాలి. వారు రంపాలతో కోయబడ్డారు, ఉరి తీయబడ్డారు. (అయినా వారు అధర్మానికి తల వంచలేదు.) దేవునికి అవిధేయులయి జీవించడం కంటే దేవునికి విధేయులయి జీవించడమే మంచిది" అని అన్నారు. (తబ్రాని)

## 77. ఇస్లాంలో న్యాయవ్యవస్థ

"విశ్వాసులారా! న్యాయానికి కట్టుబడి ఉండండి. స్వయంగా మీకుగాని, మీ తల్లి దండ్రులకుగాని లేదా మీ బంధువులకుగాని నష్టం వాటిల్లినా సరే దేవుని కోసం నిజమైన సాక్ష్యం ఇవ్వండి. కక్షిదారుడు ధనికుడైనా, పేదవాడైనా వారి విషయంలో మీకంటే దేవుడే ఎక్కువ శ్రేయోభిలాషి. కనుక మీరు మీ మనోవాంఛల్ని అనుసరిస్తూ న్యాయానికి తిలోదకాలు ఇవ్వకండి. ఒకవేళ మీరు విషయాన్ని వక్రీకరిస్తే లేదా నిజాన్ని దాటవేస్తే మీరు చేసేదంతా దేవుడు గమనిస్తుంటాడని తెలుసుకోండి." (ఖుర్ఆన్-4:135)



"విశ్వాసులారా! దేవునికోసం నీతీనిజాయితీలకు కట్టుబడిఉంటూ, న్యాయమైన సాక్ష్యం ఇవ్వండి. ఇతరులపట్ల విరోధం ఉన్నాసరే మీరు న్యాయానికి తిలోదకాలు ఇవ్వకూడదు. ఎల్లప్పుడూ న్యాయంగానే వ్యవహరించాలి. దైవభీతిపరాయణత అంటే అదే. (ఖుర్ఆన్. 5:8)

దైవప్రవక్త (స) హితోక్తి: "నేను మీమధ్య న్యాయం చేకూర్చడానికి పంపబడ్డాను." "ఎవరైనా ఓ జానెడు భూమి అయినా బలవంతంగా స్వాధీనం చేసుకుంటే దేవుడు అతని మెడలో ఏడు భూమండలాల కంఠపాశం వేస్తాడు." (ముస్లిం)

హజ్రత్ ఉమ్మెసల్మా (రజి) కథనం: ఓరోజు దైవప్రవక్త (స) తమఇంటి సమీపంలో ఎవరో పోట్లాడుకోవడం విని బయటికొచ్చారు. ఆయన (వారినుద్దేశించి) ఇలా అన్నారు- "గుర్తుంచుకోండి! నేనూ మానవమాత్రుడ్నే. నా దగ్గరకు ఏదైనా వ్యవహారం తీర్పు కోసం వస్తే, ఒకవర్గం తన ప్రత్యర్థి వర్గంకన్నా ఎక్కువ వాక్చాతుర్యం కలవాడైవుంటే అతను నిజమే చెబుతున్నాడని భావించి నేతనికి అనుకూలంగా తీర్పిచ్చే అవకాశముంది. ఒకవేళ ఎప్పుడైనా ఇలా జరిగితే, ఉభయవర్గాల్లో ఒకతని వైపు ధర్మం ఉన్నప్పటికీ నేను రెండవ వ్యక్తికి అనుకూలంగా తీర్పివ్వడం జరిగితే గుర్తుంచుకోండి! నాతీర్పు వల్ల లభించిన (ఐహిక) ప్రయోజనం (పరలోకంలో) నరకాగ్నిగా మారుతుంది. ఇక ఇష్టమైనవారు ఆ నరకాగ్నిని తీసుకోవచ్చు లేదా దానికి దూరంగా ఉండవచ్చు." (బుఖారి, ముస్లిం)

మక్కాలో దైవప్రవక్త (స) దగ్గరికి తీర్పుకోసం ఒక వ్యవహారం వచ్చింది. మఖ్జూమ్ తెగకు చెందిన ఫాతిమా బిన్త్ అసద్ అనే స్త్రీ దొంగతనం చేసి పట్టుబడింది. ధర్మశాస్త్రం ప్రకారం ఆమెకు హస్తఖండనశిక్ష పడుతుంది. కాని ఆమె బంధువులు దైవప్రవక్త (స)కు ప్రియ అనుచరుడైన హజ్రత్ ఉసామా బిన్ జైద్ (రజి) ద్వారా సిఫారసు చేయించుకోవ డానికి వచ్చారు. ఉసామా (రజి) హస్తఖండన శిక్ష నుండి ఆమెను తప్పించమని మనవి చేశారు. ఈ మాట వినగానే దైవప్రవక్త (స) ముఖం జేవురించింది.

"ఏమిటీ? నువ్వు నా దగ్గర దేవుడు నిర్ణయించిన శిక్షాస్మృతి విషయంలో సిఫారసు చేయడానికి వచ్చావా!" అన్నారు ఆయన ఉరిమిచూస్తూ. "దైవప్రవక్తా! (తప్పయి పోయింది.) నా పాపక్షమాపణ కోసం దైవాన్ని ప్రార్థించండి" అన్నారు హజ్రత్ ఉసామా (రజి).

ఆ తర్వాత దైవప్రవక్త (స) ప్రజలను సమావేశపరచి ఇలా అన్నారు: "మీకు పూర్వం ఉండిన జాతులు పేరుపలుకుబడులు గల ఉన్నత వంశస్థుడెవరైనా దొంగతనం చేస్తే అతనికి శిక్ష విధించకుండా వదలిపెట్టేవారు; అదే బలహీన వర్గం లేదా పేరుపలుకుబడులు లేని మనిషి దొంగతనంచేస్తే మాత్రం శిక్ష విధించేవారు. ఈ కారణంగానే ఆనాటి జాతులు నాశనమయ్యాయి. నాప్రాణం ఎవరి అధీనంలో ఉందో ఆ శక్తిస్వరూపుని సాక్షి! ముహమ్మద్ కూతురు ఫాతిమా దొంగతనంచేసినా నేను ఆమె చేతిని కూడా నరికేస్తాను."

తరువాత ఆయన దొంగతనం చేసిన ఆ స్త్రీకి హస్తఖండన శిక్ష విధించారు. వెంటనే దాన్ని అమలుపరచడం కూడా జరిగింది. ఈ సంఘటనతో నేరప్రవృత్తికల ఇతరులు కూడా అనేకమంది తమ నడవడికను సరిదిద్దుకొని ఇస్లాంకు చేరువయిపోయారు.

(బుఖారి, ముస్లిం తదితర హదీసుగ్రంథాల ఆధారంగా)

హజ్రత్ ఉమర్ (రజి) పాలనాలోని కొన్ని సంఘటనల్ని గురించి తెలుసుకుందాం-

ఈజిప్టు గవర్నర్ అయిన హజ్రత్ అమ్ర్ బిన్ ఆస్ (రజి) కుమారుడు అబ్దుల్లా బిన్ అమ్ర్ (రజి) ఒక వ్యక్తిని కొట్టారు. ఆ వ్యక్తి ఖలీఫా దర్బారులో ఫిర్యాదు చేస్తే హజ్రత్ ఉమర్ (రజి) అతని చేతనే అబ్దుల్లా (రజి)ను కొరడా దెబ్బలు కొట్టించారు.

ఈజిప్టు గవర్నర్ హజ్రత్ అమ్ర్ బిన్ ఆస్ (రజి) దగ్గర చాల ధనం పోగయిఉందని ఆరోపణ రావడంతో హజ్రత్ ఉమర్ (రజి) "గవర్నర్ పదవికి పూర్వం మీ దగ్గర ఇంత ధనం ఉండేది కాదు, ఇప్పుడీ ధనం మీకు ఎక్కడ్నుంచి వచ్చింద"ని వివరణ కోరుతూ ఆయనకు లేఖ రాశారు. దానికి హజ్రత్ అమ్ర్ బిన్ ఆస్ (రజి) సమాధానమిస్తూ "నా రాష్ట్రం సారవంతమైన ప్రాంతం. అంచేత నా దగ్గర నా ఖర్చులు పోను చాలా డబ్బు మిగులుతుంది" అని అన్నారు. హజ్రత్ ఉమర్ (రజి) ఈ సమాధానంతో సంతృప్తి చెందక విచారణ కోసం ముహమ్మద్ బిన్ మస్లిమాకు సర్వాధికారలిచ్చి ఈజిప్టు పంపారు. ముహమ్మద్ (రజి) ఈజిప్టు వెళ్ళి అమ్ర్ బిన్ ఆస్ (రజి) గత ఆస్తి విలువెంతో, దానిపై ఎంత ఆదాయం వస్తుందో లెక్కకట్టి అదంతా పోగా మిగిలిన ధనాన్ని జప్తు చేసుకొని ప్రభుత్వ ధనాగారంలో జమచేస్తారు. ఎంతో విశాలమైన రాష్ట్రానికి గవర్నర్ అయిన అమ్ర్ బిన్ ఆస్ (రజి) ఇదంతా చూసి కూడా నోరు మెదపలేక పోయారు.

హజ్రత్ ఉమర్ (ర) కుమారుడు అబూసెహ్మా ఒకసారి మద్యం సేవించి సాధారణ నేరస్థుడిలా పట్టుబడి తీసుకురాబడతారు. అప్పుడు హజ్రత్ ఉమర్ (రజి) అతనికి ఎనభై కొరడా దెబ్బలు తగిలిస్తారు. కన్నకొడుకని కూడా కనికరించకుండా ఇతర నేరస్థులకు కొట్టినట్లే గట్టిగానే కొట్టారు. ఆ దెబ్బలకు తాళలేక ఆ యువకుడు ప్రాణం వదులుతాడు.

బస్రా గవర్నర్ హజ్రత్ ముగీరా బిన్ షాబా (రజి)కు ఒక స్త్రీతో అక్రమ సంబంధం ఏర్పడిందని ఖలీఫా దర్బారులో ఆరోపణ వచ్చింది. హజ్రత్ ఉమర్ (రజి) వెంటనే అబూమూసా అష్అరి (రజి)ని పిలిపించి "బస్రాలో షైతాన్ నివాసం ఏర్పరచుకున్నాడు. మీరక్కడికి పోయి పరిస్థితి పరిశీలించి సాక్షులతోసహా ముగీరాను మదీనా పంపండి"అని ఆదేశించారు. ఈ ఆజ్ఞ ప్రకారం ముగీరా (రజి) మదీనా పంపబడతారు. న్యాయస్థానంలో విచారణ ప్రారంభమవుతుంది. కాని నలుగురు సాక్షుల్లో ఒక సాక్షి తానా స్త్రీని సరిగ్గా చూడలేదని చెప్పడంతో నేరం రుజువు కాలేదు. దాంతో హజ్రత్ ఉమర్ (రజి) హజ్రత్ ముగీరా (రజి)ను విడుదల చేస్తారు. విడుదల చేస్తూ "సాక్ష్యం పూర్తయితే (నేరారోపణ నిజమని తేలితే) నేను మీకు శిలాశిక్ష విధించి హతమార్చేవాడ్ని" అని అన్నారు.

హజ్రత్ ముగీరా (రజి) ప్రవక్త ముఖ్యఅనుచరుల్లో ఒకరు. రాజకీయంగా, యుద్ధ పరంగా ఇస్లాంకు గొప్ప సేవలు అందజేశారు. ఆనాటి అరేబియాలో నలుగురు ప్రముఖ యుద్ధవ్యూహకర్తలో ఈయన ఒకరు. ఈవిధంగా హజ్రత్ ముగీరా గొప్ప ప్రజానాయకునిగా, యుద్ధ తాంత్రికునిగా, బస్రారాష్ట్ర గవర్నర్‌గా పేరుగాంచారు. కాని అవేవీ ఇస్లామీయ న్యాయస్థానంలో ఆయనకు ఏమాత్రం ఉపయోగపడలేదు.

ఖలీఫా హజ్రత్ అలి (రజి) రాజధాని నుండి సిఫ్ఫీన్ యుద్ధానికి బయలు దేరుతూ యుద్ధకవచం కోసం వెతికితే కన్పించలేదు. యుద్ధం నుంచి తిరిగొచ్చినప్పుడు చూస్తే



అని ఒక యూదుడి దగ్గర కన్పించింది. హజ్రత్ అలి (రజి) ఆ యూదుడ్ని తన కవచం గురించి అడిగితే అది తనదేనని, తనదగ్గర ఎప్పట్నుంచో ఉందని అతను బుకాయించడానికి ప్రయత్నించాడు. యూదుడు అబద్ధమాడుతున్నట్లు అలి (రజి) గ్రహించారు. అయినా ఆయన తన ఖలీఫా పదవితో అధికార దుర్వినియోగానికి పాల్పడకుండా ఒక సాధారణ ముద్దాయి మాదిరిగా న్యాయస్థానానికి వెళ్ళి అతనిపై ఫిర్యాదు చేశారు.

న్యాయమూర్తి రాజ్యాధినేతను చూసి గౌరవిస్తూ లేచి నిల్చోలేదు, తిరుగులేని ఆయన అధికారానికి భయపడి కూడా ఆయనకు అనుకూలంగా తీర్పివ్వలేదు. సాధారణ ప్రజలను విచారించినట్లే ఖలీఫాను కూడా విచారిస్తూ "ఈ కవచం మీదేనని రుజువేమిటీ?" అని ప్రశ్నించాడు. అప్పుడు హజ్రత్ అలి (రజి) తన సేవకుడు ఖంబర్‌ని, తన కుమారుడు దైవప్రవక్త (స) మనవడైన ఇమామ్ హుసైన్ (రజి)ని సాక్షులుగా ప్రవేశపెట్టారు.

న్యాయమూర్తి ఆ సాక్షుల్ని చూసి "హుసైన్ (రజి) మీ కుమారుడే గనక ఆయన సాక్ష్యం నమ్మదగినది కాదు. తండ్రి అభియోగానికి కొడుకు సాక్ష్యాన్ని అంగీకరించ లేము" అంటూ ఖలీఫా సాక్ష్యాలను త్రోసిపుచ్చాడు. పాపం! ఖలీఫాగారి కేసు వీగిపోయింది. అయితే ఈ వ్యవహారం, న్యాయవైఖరి చూసిన ఆ యూదుడు ముందుకు వచ్చి బిగ్గరగా ఇలా అన్నాడు: "నేను అల్లాహ్ తప్ప మరే ఆరాధ్యుడు లేడని, ముహమ్మద్ (స) ఆ దేవుని ప్రవక్త అని సాక్ష్యమిస్తున్నాను. ఏ ధర్మంలో ఇలాంటి న్యాయం ఉందో అదే సత్యధర్మం."

(సైయూతి-ఖిలాఫత్ ఓములూకియత్)

"ముహమ్మద్! దేవుడు నీకు చూపినమార్గం అనుసరించి నీవు ప్రజల వ్యవహారాలు పరిష్కరించడానికి మేము సత్యపూరితమైన గ్రంథం నీపై అవతరింపజేశాం. కనుక నీవు నీతిలేని వారివైపు నిలబడి వాదించకు." (ఖుర్‌ఆన్.4:105)

"ఎవరైనా ఏదైనా నేరం చేసి దాన్ని ఏపాపం ఎరగని అమాయకునిపై మోపితే, ఇక అతను ఘోరమైన అపనిందను, స్పష్టమైన పాపాన్ని మూటకట్టుకున్నట్లే." ((4:112)

"నీ ప్రభువు సాక్షి! వారు తమ వివాదాల పరిష్కారం కోసం నిన్ను న్యాయనిర్ణేతగా అంగీకరించి, వాటిపై నీవిచ్చే తీర్పుపట్ల ఏమాత్రం తటపటాయించకుండా ఆసాంతం స్వీకరించనంత వరకూ వారు నిజమైన విశ్వాసులు కాలేరు." (ఖుర్‌ఆన్–4:65)

మదీనాలో బషీర్ అనే ముస్లిం మరోముస్లింకు చెందిన యుద్ధకవచం దొంగిలించాడు. అధికారులు దాన్ని ఆరాతీయడానికి ప్రయత్నించినప్పుడు బషీర్ దాన్ని వెంటనే ఒక యూదుని ఇంట్లో దాచిపెట్టాడు. కవచం యజమాని బషీర్ మీద అనుమానం వెలిబుచ్చాడు. అప్పుడు దైవప్రవక్త (స) కవచం సంగతి అడిగితే బషీర్, అతని బంధువులు కూడబలుక్కొని దొంగతనాన్ని ఆ యూదునిపైకి నెట్టివేశారు. యూదుడ్ని విచారిస్తే తానేపాపం ఎరగనన్నాడు.

అయితే బషీర్ బంధువులంతా బషీర్ వైపున వకాల్తా పుచ్చుకొని ఆ యూదుడు దైవప్రవక్తను నిరాకరించిన అవిశ్వాసి అయినందున అతని మాటలు నమ్మకూడదని, తాము చెబుతున్నదే నిజమని వాదించారు. ఈవాదన విన్న దైవప్రవక్త (స) బషీర్‌కు అనుకూలంగా తీర్పివ్వడానికి సిద్ధమయ్యారు. ఆసందర్భంలో 4:105-113 సూక్తులు అవతరించాయి. అప్పుడు దైవప్రవక్త (స) ఆ ముస్లింకు వ్యతిరేకంగా, యూదునికి అనుకూలంగా తీర్పిచ్చారు.

కోర్టుకు కళ్ళుండవన్న సంగతి అందరికీ తెలిసిందే. న్యాయాధికారి కేసు పరిష్కారంలో ఎంత సమర్థుడైనా ముందుకు వచ్చిన సాక్ష్యాలు, వాదనలను బట్టే తీర్పివ్వగలడు. మతం ముసుగు కప్పుకున్న దుర్మార్గులను గుర్తించడం చాలా కష్టం. అంచేత ఇస్లామీయ పాలనలో ఒక్కోసారి అమాయకులైన ముస్లిమేతరులు సైతం శిక్షకు గురయ్యే ప్రమాదం ఉంటుంది. అలాంటి స్థితిలో దైవప్రవక్త (స) అన్యాయానికి పాల్పడే ముస్లింలను హెచ్చరిస్తూ ఇలాఅన్నారు:

"ఎవరైనా ఒక ముస్లిం ఒడంబడికదారుడైన ముస్లిమేతర పౌరునిపై దౌర్జన్యం చేసినా, అతనిహక్కు కాజేసినా, అతని శక్తికిమించిన భారం వేసినా, లేదా అతని వస్తువే దైనా బలవంతంగా తీసుకున్నా ప్రళయదినాన దైవన్యాయస్థానంలో జరిగే విచారణలో నేనా ముస్లిమేతరుని తరపున న్యాయవాదిగా నిలబడతాను." (అబూదావూద్)

దైవప్రవక్త (స) ప్రవచనం: "(న్యాయా)అధికారి తన (జ్ఞాన)పరిధి మేరకు శక్తివంచన లేకుండా కృషి చేసినప్పుడు సరైన తీర్పు వెలువడితే అతనికి రెట్టింపు పుణ్యం లభిస్తుంది. ఒకవేళ తప్పుడు తీర్పు వెలువడితే అప్పుడతనికి ఏకపుణ్యం లభిస్తుంది." (బుఖారి)

(తొలి శ్రేష్ఠ ఖలీఫా) హజ్రత్ అబూబకర్ (ర) సజస్తాన్‌లో (న్యాయమూర్తి హోదాలో) ఉన్న తన కుమారునికి ఇలా ఉత్తరం రాశారు: "న్యాయాధికారి కోపంగా ఉన్నప్పుడు ఇద్దరు వ్యక్తుల మధ్య ఉన్న వివాదం గురించి తీర్పివ్వడం అతనికి తగదని దైవప్రవక్త (స) ప్రవచిస్తుండగా నేను విన్నాను. కాబట్టి నీవు కోపంగా ఉన్నప్పుడు ఇద్దరు వ్యక్తుల మధ్య వివాదం గురించి ఎన్నటికీ తీర్పివ్వకు." (బుఖారి, ముస్లిం)

న్యాయాధికారి నేరస్థుడి పట్ల దయతో లేక మెతక వైఖరితో దేవుడు నిర్ణయించిన శిక్షను ఏమాత్రం తగ్గించకూడదు. అలాగే నేరస్థుడి పట్ల కఠిన వైఖరితో దైవనిర్ణీత శిక్షను ఏమాత్రం హెచ్చించడానిక్కూడా వీల్లేదు. దీన్ని గురించి దైవప్రవక్త (స) ఇలా చెప్పారు:

"ప్రళయదినాన నిర్ణీతశిక్షలో ఒక కొరడాదెబ్బ తగ్గించి శిక్షవిధించిన న్యాయాధికారిని ప్రవేశపెడ్తారు. "ఇలా ఎందుకు చేశావ"ని అడుగుతాడు (దేవుడు). దానికతను "మీ దాసులపై కనికరంతో ఇలా చేశాన"ంటాడు. "నీవు వారి విషయంలో నాకంటే ఎక్కువ దయామయుడవైపోయావా?" అంటాడు దేవుడు. తరువాత "ఇతడ్ని తీసికెళ్ళి నరకంలో పడేయండ"ని ఆజ్ఞపుతుంది. నిర్ణీతశిక్ష కంటే ఒక కొరడాదెబ్బ ఎక్కువ శిక్ష విధించిన మరో న్యాయాధికారిని ప్రవేశపెడ్తారు. "నీవిలా ఎందుకు చేశావ?"ని అడుగుతాడు దేవుడు. దానికతను "ప్రజలు నీ అవిధేయతను మానుకుంటారని ఇలా చేశాన"ంటాడు. "వారి విషయంలో నీవు నాకంటే ఎక్కువ తెలివిగలవాడవా?" అంటాడు దేవుడు. తర్వాత "ఇతడ్ని తీసికెళ్ళి నరకంలో పడేయండ"ని ఆజ్ఞపుతుంది. (తఫ్సీరే కబీర్)

## సాక్ష్యం

"విశ్వాసులారా! న్యాయానికి కట్టుబడి ఉండండి. స్వయంగా మీకుగాని, మీ తల్లి దండ్రులకుగాని లేదా మీ బంధువులకుగాని నష్టం వాటిల్లినా సరే దేవుని కోసం నిజమైన సాక్ష్యం ఇవ్వండి. కక్షిదారుడు ధనికుడైనా, పేదవాడైనా వారి విషయంలో మీకంటే దేవుడే ఎక్కువ శ్రేయోభిలాషి. కనుక మీరు మీ మనోవాంఛల్ని అనుసరిస్తూ న్యాయానికి తిలోదకాలు



ఇవ్వకండి. ఒకవేళ మీరు విషయాన్ని వక్రీకరిస్తే లేదా నిజాన్ని దాటవేస్తే మీరు చేసేదంతా దేవుడు గమనిస్తుంటాడని తెలుసుకోండి." (ఖుర్ఆన్-4:135)

"విశ్వాసులారా! దేవుని కోసం నీతి నిజాయితీలకు కట్టుబడిఉంటూ, న్యాయమైన సాక్ష్యం ఇవ్వండి. ఇతరుల పట్ల విరోధం ఉన్నాసరే మీరు న్యాయానికి తిలోదకాలు ఇవ్వకూడదు. ఎల్లప్పుడూ న్యాయంగానే వ్యవహరించాలి." (ఖుర్ఆన్-5:8)

"శీలవతులైన స్త్రీలపై అపనింద మోపి, దానికి నల్గురు సాక్షులు తీసుకురాలేనివారిని ఎనభై కొరడాదెబ్బలు కొట్టండి. అలాంటివారి సాక్ష్యాన్ని ఇకఎన్నటికీ స్వీకరించకండి...." ఇక భార్యలపై అపనింద మోపిన భర్తలు, దానికి తాము తప్ప మరెవరూ సాక్షులు లేనప్పుడు వారిలో ఒకరు నాలుగు సార్లు దేవుని మీద ప్రమాణంచేసి తన ఆరోపణ నిజమే నని సాక్ష్యం చెప్పాలి. అయిదోసారి తన ఆరోపణ అబద్ధమైతే తనపై దేవుని అభిశాపం పడుగాకని పలకాలి. అలాగే స్త్రీ కూడా నాలుగు సార్లు దేవుని మీద ప్రమాణం చేసి అతని ఆరోపణ అబద్ధమని సాక్ష్యమివ్వాలి. ఐదోసారి, అతని ఆరోపణ నిజమైతే తనపై దైవాగ్రహం విరుచుకుపడుగాకని పలకాలి. ఇలా ఆమెకు శిక్ష తప్పుతుంది." (ఖుర్ఆన్-24:4-9)

ఇమాములు అబూయూసుఫ్ , ముహమ్మద్ (రహ్మ)లు అబద్ధపు సాక్ష్యం గురించి ఒక ధార్మికతీర్పు ఇస్తూ "న్యాయస్థానంలో అబద్ధపు సాక్ష్యమని రుజువయితే సంబంధిత వ్యక్తికి సుదీర్ఘ జైలుశిక్ష విధించాలి; అతను అబద్ధీకుడని ప్రచారం చేయాలి" అన్నారు.

ఖలీఫా ఉమర్ (రజి) కాలంలో ఒకతను ఇచ్చిన సాక్ష్యం అబద్ధమని న్యాయ స్థానంలో రుజువయింది. అప్పుడు ఉమర్ (రజి) ఆ వ్యక్తిని ఒక రోజల్లా బహిరంగ ప్రదేశంలో నిలబెట్టి, ఫలానామనిషి కొడుకు ఫలానావ్యక్తి అసత్యసాక్షి. ఇతడ్ని గుర్తుపెట్టు కోండి అని చాటింపు వేయించారు. ఆ తర్వాత అతడ్ని జైల్లో పెట్టారు.

హజ్రత్ అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "ప్రతివాది తప్పనిసరిగా ప్రమాణం చేయవలసి ఉంటుంది." (బుఖారి, ముస్లిం)

మరొక ఉల్లేఖనంలో రుజువుచేసే, సాక్ష్యంచూపే బాధ్యత వాదిపై ఉంటుందని ఉంది. ఒకవేళ వాది (తనకు జరిగిన అన్యాయానికి) రుజువు లేక సాక్ష్యం తీసుకురాలేకపోతే ప్రతివాది చేత (అన్యాయం చేయలేదని) ప్రమాణం చేయించవలసిఉంటుంది. అతను ప్రమాణం చేస్తే తీర్పు అతనికి అనుకూలంగా ఇవ్వబడుతుంది. ఒకవేళ అతను ప్రమాణం చేయడానికి నిరాక రిస్తే వ్యాజ్యం రుజువైనట్టే (అంటే అతనే నేరస్థుడిగా రుజువవుతాడన్న మాట.)

## ఇస్లాం దృష్టిలో స్త్రీ సాక్ష్యం

"(అప్పు దస్తావేజులో) మీలో ఇద్దరు పురుషుల్ని సాక్షులుగా పెట్టుకోండి. పురుషులు ఇద్దరు లభించకపోతే ఒక పురుషుడు, ఇద్దరు స్త్రీలయినా చాలు. వారిలో ఒకస్త్రీ మరచి పోతే రెండోస్త్రీ అయినా గుర్తుచేస్తుంది. సాక్షులు మీకు ఆమోదయోగ్యమైనవారుగా ఉండాలి. సాక్ష్యం కోసం పిలిచినప్పుడు సాక్షులు నిరాకరించకూడదు..... మీరు వ్యాపార ఒప్పందాలు చేసుకునేటప్పుడు (కూడా) సాక్ష్యం పెట్టుకోండి. దస్తావేజు వ్రాసే వ్యక్తికి గాని, సాక్షులుగా ఉండేవారికిగాని నష్టం వాటిల్లరాదు." (ఖుర్ఆన్-2:282)

"స్త్రీ సాక్ష్యం పురుషుని సాక్ష్యంలో అర్ధ సాక్ష్యంతో సమానం" (బుఖారి)

హజ్రత్ ఉమర్ (రజి) నికాహ్ (వివాహం) విషయంలో ఒక పురుషుడు, ఇద్దరు స్త్రీల సాక్ష్యాన్ని ధర్మసమ్మతంగా పరిగణించారని హజ్రత్ అతా బిన్ అబూరబాహ్ (రహ్మాలై) తెలియజేస్తున్నారు. హజ్రత్ ఉమర్ (రజి) విడాకుల విషయంలో స్త్రీల సాక్ష్యాన్ని నమ్మదగిన సాక్ష్యంగా పరిగణించారని హజ్రత్ అబూలబైద్ (రజి) అన్నారు.

ఇమామ్ షాఫై (రహ్మాలై) అభిప్రాయం ప్రకారం పురుషుని సాక్ష్యం లేకుండా ఎంత మంది స్త్రీలు సాక్ష్యమిచ్చినా అది ధర్మసమ్మతమైన సాక్ష్యం కాజాలదు.

అయితే ఆయన ప్రసవం, స్త్రీల ఆంతరంగిక రహస్యాలను గురించి పురుషసాక్ష్యం లేకుండానే స్త్రీల సాక్ష్యం ధర్మసమ్మతమేనన్న విషయంతో తాను కలుసుకున్న పండితులెవరూ విభేదించలేదని అన్నారు. ఈ అభిప్రాయానికి రావడానికి ఈ క్రింది ఆధారాలు కూడా కావచ్చు:

హజ్రత్ ఉమర్ (రజి) దగ్గరికి నలుగులు స్త్రీలు వచ్చి ఫలానా మనిషి తాగుడు మైకంలో ఉండి తన భార్యకు విడాకులిచ్చాడని సాక్ష్యమిచ్చారు. అప్పుడు ఖలీఫా ఉమర్ (రజి) ఆ తాగుబోతు భర్త (దాంపత్యం) నుండి అతని భార్యకు విముక్తి కలిగించారు.

'కేవలం స్త్రీ సాక్ష్యం స్త్రీలకు తప్ప మరెవరికీ తెలియని వ్యవహారాలలో మాత్రమే ధర్మసమ్మతమ"ని హజ్రత్ ఉమర్ (రజి) అన్నారు. అంటే రుతుస్రావం, గర్భధారణ, ప్రసవం లాంటి విషయాలలో నిర్ణయం తీసుకోవడానికి స్త్రీల సాక్ష్యమే సరిపోతుంది.

దైవప్రవక్త (సల్లం), ఆ తరువాత శ్రేష్ఠ ఖలీఫాలయిన హజ్రత్ అబూబకర్ (రజి), హజ్రత్ ఉమర్ (రజి)లు శిక్షాస్మృతి (హుదూద్), ప్రతీకార శిక్ష (ఖిసాస్)ల వ్యవహారాల్లో స్త్రీ సాక్ష్యాన్ని ధర్మసమ్మతంగా భావించేవారు కాదు.

(స్త్రీసాక్ష్యానికి సంబంధించిన ఈ సమాచారమంతా ముహమ్మద్ కలీం ఆరాయీన్, యం.ఎ. గారి గ్రంథం "ఔరత్ ఔర్ ఇజ్దివాజి జిందగి" నుండి గ్రహించబడింది.)

## విచిత్రమైన తీర్పులు

దైవప్రవక్త (స) ప్రవచనం : ఇద్దరు స్త్రీలు తమతమ బిడ్డలను ఎత్తుకొని ఎక్కడికో వెళ్తున్నారు. దారిలో ఒక తోడేలు వచ్చి ఆ ఇద్దరిలో ఒకామె పిల్లవాడ్ని ఎత్తుకెళ్ళింది. అప్పుడు వారిద్దరిలో ఒక స్త్రీ "తోడేలు నీ బిడ్డను ఎత్తు కెళ్ళింద"ని అన్నది. రెండవ స్త్రీ "నా బిడ్డను కాదు, నీ బిడ్డనే ఎత్తు కెళ్ళింద"ని అన్నది. చివరికి వీళ్ళిద్దరు దావూద్ ప్రవక్త (అలైహి) న్యాయస్థానానికి వెళ్ళి తమ జగడం నివేదించుకున్నారు. దావూద్ (అలైలై) అంతా విని వాళ్ళిద్దరిలో పెద్దామెకు అనుకూలంగా తీర్పిచ్చారు.

ఆ తరువాత ఆ స్త్రీలిద్దరు దావూద్ (అలైహి) కుమారుడు సులైమాన్ (అలైహి) దగ్గరికెళ్ళి జరిగిన సంగతి చెప్పి తమకు న్యాయం చేకూర్చమని విన్నవించుకున్నారు. అప్పుడు హజ్రత్ సులైమాన్ (అలైహి) వారితో "ఓ ఖడ్గం తీసుకురండి, నేనీ పిల్లవాడ్ని రెండు ముక్కలుగా నరికి మీరిద్దరికి చెరో ముక్క ఇచ్చేస్తాను" అని అన్నారు. చిన్నామె ఈమాట వినగానే (కంగారుపడుతూ) "వద్దు వద్దు, అలా చేయకండి. దైవం మిమ్మల్ని కరుణించుగాక! ఈ పిల్లవాడు ఆమె బిడ్డేనని నేను ఒప్పుకుంటున్నాను" అని అన్నది.



అప్పుడు సులైమాన్ (అలైహి) పిల్లవాడు చిన్నామె కొడుకని తీర్పిచ్చారు. (బుఖారి)

హజ్రత్ అబూహురైరా (రజి) ప్రకారం దైవప్రవక్త (స) కథనం: (పూర్వకాలంలో) ఒకతను మరొకతని దగ్గర కొంత భూమి కొన్నాడు. ఆ భూమిలో బంగారం ఉన్న ఒక లంకెబిందె దొరికింది. దాంతో భూమి కొన్నవాడు అమ్మినవాడితో "ఇదిగో ఈ బంగారం నీదే తీసుకో. నేను నీ దగ్గర భూమి మాత్రమే కొన్నానుగాని, బంగారం కొనలేదుగా" అని అన్నాడు. అయితే భూమి అమ్మినవాడు (దాన్ని నిరాకరిస్తూ) "నేను నీకు భూమిని, అందులో ఉన్న సమస్తాన్నీ అమ్మేశాను. (కనుక ఈ బంగారంతో నాకెలాంటి సంబంధం లేదు)" అని అన్నాడు. చివరికి వీళ్ళిద్దరు తన తగాదా పరిష్కరించుకోవడానికి ఒకతని దగ్గరకు వెళ్ళారు. అతను వారి వాదనలు విని "మీ ఇద్దరికి పిల్లలున్నారా?" అని అడిగాడు. వారిలో ఒకతను "నాకొక కొడుకు ఉన్నాడ"ని చెప్పాడు. రెండవతను "నాకొక కూతురు ఉంద"ని అన్నాడు. అప్పుడు తీర్పరి ఇలా తీర్పిచ్చాడు- "అయితే మీరిద్దరు మీ మీ పిల్లలకు పరస్పరం పెళ్ళిచేసి ఈ బంగారాన్ని వాళ్ళిద్దరి కోసం ఖర్చుపెట్టండి. అందులో కొంత దైవమార్గంలో కూడా ఖర్చు చేయండి." (బుఖారి)

హజ్రత్ ఇబ్నెఅబ్బాస్ (రజి) కథనం: ఒక ఇంట్లో లేక గదిలో ఇద్దరు స్త్రీలు మేజోళ్ళు తయారుచేసే పనిచేస్తున్నారు. ఓరోజు వారిద్దరిలో ఒక స్త్రీ చేతిలో మేజోళ్ళు కుట్టే సువ్వ దిగబడింది. ఆ స్థితిలో ఆమె బయటికి వచ్చి, తన చేతిలో దిగబడిన ఈ సువ్వను ఆ రెండవ స్త్రీ గుచ్చిందని చెప్పింది. ఈ వ్యవహారం అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి) దగ్గరకు వచ్చింది. ఆయన దైవప్రవక్త (స) ప్రవచనాన్ని తెలియజేస్తూ "కేవలం ప్రజల ఫిర్యాదుల్ని ఆధారంగా తీసుకొని వారికి అనుకూలంగా తీర్పిస్తే అనేకమంది ప్రజల ధన ప్రాణాలకు నష్టం వాటిల్లుతుంది" అని అన్నారు. ఆ తరువాత ఆయన ప్రజలను సంబోధిస్తూ "ఆ స్త్రీకి దేవుడ్ని గుర్తుచేయండి. ఆమెకు ఈ (ఖుర్‌ఆన్) సూక్తి విన్పించండి- 'ఎవరు దేవునితో చేసిన ప్రమాణాలను అతిస్వల్ప మూల్యానికి అమ్ముకుంటారో వారికి పరలోకంలో ఎలాంటి (పుణ్యఫలం) భాగం లభించదు. ప్రళయదినాన అలాంటివారితో దేవుడు మాట్లాడడు. వారివైపు కన్నెత్తి కూడా చూడడు. వారిని పరిశుద్ధపరచడు. అంతేకాదు, వారి కోసం ఘోరమైన శిక్ష కాచుకొని ఉంటుంది. (3:77)" అని అన్నారు.

ఆయన చెప్పినట్లే ప్రజలు ఆ స్త్రీకి హితోపదేశం చేశారు. దాంతో ఆమె (భయపడి తానే తన చేతిలో సువ్వ గుచ్చుకున్నానని చెప్పి) నేరం ఒప్పుకుంది. (బుఖారి)

# 78. ఇస్లామీయ శిక్షాస్మృతి

"ఎవరైనా ప్రతీకారం చేయకుండా ప్రత్యర్థిని క్షమించి పరిస్థితి చక్కబరిస్తే అతనికి (దాని) ప్రతిఫలమిచ్చే బాధ్యత దేవునిపై ఉంది. దేవుడు దౌర్జన్యపరుల్ని ప్రేమించడు. దౌర్జన్యం జరిగిన తర్వాత బదులు తీర్చుకుంటే తప్పులేదు. ఇతరులపై దౌర్జన్యంచేస్తూ దేశంలో అన్యాయంగా కల్లోలం రేపేవారినే మాత్రమే తప్పు పట్టాలి. అలాంటివారికి దుర్భరశిక్ష ఉంది. కాకపోతే సహనంతో వ్యవహరిస్తూ (ప్రత్యర్థిని) క్షమించగలిగితే (ఎంతో మంచిది). ఇది ఎంతో ధైర్యసాహసాలతో కూడిన పని." (ఖుర్‌ఆన్. 42:40-43)

హజ్రత్ ఉబాదా బిన్ సాబిత్ కథనం: దైవప్రవక్త (స) తన అనుచరుల మధ్య నిలబడి ఇలా అన్నారు:- "మీరీ విషయాల్ని గురించి నాముందు ప్రమాణం చేయండి- "మేము ఏవిధంగానూ దేవునికి ఆయన దైవత్వంలో ఎవరినీ సాటి కల్పించము. దొంగతనం చేయము. వ్యభిచారానికి పాల్పడము. మా సంతానాన్ని హతమార్చము. ఎవరి మీదా అపనిందలను మోపము. ధర్మసమ్మతమైన ఏ ఆదేశాన్నీ శిరసావహించ డానికి నిరాకరించము. ఇక మీలో ఎవరైనా ఏదైనా నేరంచేసి దానికి ఇహలోకంలో శిక్ష అనుభవిస్తే, ఆ శిక్ష అతని పాపానికి పరిహారమౌతుంది. ఒకవేళ అతను నేరం చేసినప్ప టికీ (ఇహలోకంలో శిక్షకు గురికాకుండా) దేవుడు అతని నేరం కప్పిపుచ్చడం జరిగితే అతని వ్యవహారం దేవుని చేతిలో ఉంటుంది. దేవుడు తలచుకుంటే అతడ్ని క్షమించ వచ్చు లేదా శిక్షించవచ్చు." ఈ విషయాలను అంగీకరిస్తూ మేమంతా దైవప్రవక్త (స) చేతిలో చేయివేసి ప్రమాణం చేశాం. (బుఖారి)

దైవప్రవక్త (స) ప్రవచనం: "దేవుడు నిర్ణయించిన శిక్షలు తప్ప మరేశిక్ష విషయం లోనూ (నేరస్థుడికి) పది(10)కంటే ఎక్కువ కొరడా దెబ్బలు కొట్టకూడదు." (బుఖారి)

## హత్యానేరం-రక్తపరిహారం

ఈనాటి నాగరిక ప్రపంచం హత్యానేరాన్ని కూడా పెద్ద సీరియస్‌గా తీసుకోవడం లేదు. మరణశిక్ష విధించి మనిషికి జీవించేహక్కు లేకుండాచేయడం మానవత్వం కాదట! అంచేత ఇప్పుడు యావజ్జీవ జైలుశిక్ష అని చెప్పి 14 ఏళ్ళశిక్ష మాత్రమే విధిస్తున్నాయి మన కోర్టులు. 14 ఏళ్ళ తర్వాత ఆ నేరస్థుడు విడుదలైవచ్చి ప్రతీకారంతో ఉడికిపోతూ మరో అయిదారు గురిని హత్యచేసినా చేయవచ్చు. ఒక నేరస్థుడి జీవించే హక్కు కోసం అయిదారుగురు అమాయకుల ప్రాణాలు బలికావడమే సరైన న్యాయమా?

"ఈ (హత్య) కారణంగానే మేము ఇస్రాయీల్ సంతతివారికి ఇలా ఒక ఉత్తర్వు జారీ చేశాం: 'ఎవరైనా ప్రతీకార హత్య(శిక్ష)గా లేక ధరణిపై కల్లోలం రేకెత్తించినందుకు శిక్షగా తప్ప ఏ మనిషినైనా చంపితే అతను యావత్ మానవాళిని చంపినట్లే. అలాగే ఎవరైనా ఒక మనిషి ప్రాణం కాపాడితే అతను యావత్ మానవాళిని కాపాడినట్లే." (ఖుర్ఆన్-5:32)

హజ్రత్ ఇబ్నెమస్‌వూద్ ప్రకారం దైవప్రవక్త (స) ఇలా అన్నారు: "(ప్రపంచంలో) అన్యాయంగా ఏ ప్రాణి అయినా హత్యచేయబడితే, దాని రక్తం చిందించిన నేరం కొంత హజ్రత్ ఆదం (అలైహి) పెద్ద కుమారుడిపై కూడా పడుతుంది. (లోకంలో) అందరికన్నా ముందు అక్రమహత్యకు శ్రీకారం చుట్టింది అతనే." (బుఖారీ, ముస్లిం)

"న్యాయసమ్మతంగా తప్ప దేవుడు నిషేధించిన ఏ ప్రాణినీ చంపకండి. ఎవరైనా అన్యాయంగా చంపబడితే అతని వారసులకు మేము బదులుతీర్చుకునే అధికారమిచ్చాం. అయితే వారసుడు (హంతకుడ్ని) వధించడంలో హద్దుమీరకూడదు." (ఖుర్ఆన్-17:33)

"విశ్వాసులారా! మీకోసం హత్య వ్యవహారంలో రక్తపరిహారానికి సంబంధించిన ఆజ్ఞ జారీచేశాం. స్వేచ్ఛాపరునికి బదులు స్వేచ్ఛాపరుడ్ని, బానిసకు బదులు బానిసను, స్త్రీకి బదులు స్త్రీని హతమార్చాలి. ఒకవేళ హంతకుని పట్ల అతని సోదరుడు (హతుని బంధువు) మృదువైఖరి అవలంబించడానికి సిద్ధపడితే, రక్తపరిహార సమస్య సామరస్యంగా పరిష్కార



మవ్వాలి. దానిప్రకారం హంతకుడు నిర్ణీత రక్తపరిహారాన్ని సంతోషంగా ఇచ్చేయాలి. ఇది మీప్రభువు నుండి లభిస్తున్న సౌలభ్యం, దైవానుగ్రహం. ఆపై కూడా ఎవరైనా హద్దుమీరితే అతనికి దుర్భరశిక్ష పడుతుంది. కనుక బుద్ధిమంతులారా! (ఇలాంటి) ప్రతిక్రియలోనే మానవజీవితానికి భద్రత ఉందని తెలుసుకోండి. తద్వారా మాత్రమే మీరు హత్యారక్తపాతా లకు దూరంగా ఉండగలుగుతారు." (ఖుర్ఆన్-2:178,179)

"పొరపాటున తప్ప తోటి విశ్వాసిని హతమార్చడం ఏ విశ్వాసికీ శోభించదు. ఒకవేళ పొరపాటున హతమార్చడం జరిగితే అందుకు ఒక బానిసముస్లింకు స్వేచ్ఛనివ్వాలి. మరోవైపు హతుని వారసులకు రక్తపరిహారం కూడా చెల్లించాలి. ఒకవేళ వారు క్షమిస్తే అది వేరేవిషయం. అయితే హతుడు మీ శత్రువర్గానికి చెందినవాడయి, అతను విశ్వాసి కూడా అయివుంటే, ఒక ముస్లిం బానిసకు స్వేచ్ఛనిస్తే చాలు. హతుడు మీరు శాంతి ఒడంబడిక చేసుకున్న జాతికి చెందినవాడైవుంటే, మీరు హతుని వారసులకు రక్తపరి హారంతోపాటు ఒక బానిసముస్లింకు సేచ్ఛ కూడా ఇవ్వాలి. స్వేచ్ఛ నివ్వడానికి బానిస లేకపోతే హంతకుడు వరుసగా రెండు నెలలు ఉపవాసం పాటించాలి...." (ఖుర్ఆన్-4:92,93)

దైవప్రవక్త (స) ముస్లిం హత్య గురించి ఇలా అన్నారు: "అల్లాహ్ తప్ప మరే ఆరా ధ్యుడు లేడని, ముహమ్మద్ దేవుని సందేశహరుడని సాక్ష్యమిచ్చిన ఏముస్లింనీ చంపడం ధర్మసమ్మతంకాదు. అయితే మూడు కారణాలలో ఏదైనా ఒక కారణంపై చంపవచ్చు. ఒకటి, (అతను ఎవరినైనా హత్య చేస్తే) ప్రాణానికి బదులు ప్రాణం తీసే చట్టాన్ని అతని విషయంలో అమలుపరచబడుతుంది. రెండు, లేదా వివాహితుడైవుండి కూడా వ్యభిచా రానికి పాల్పడినప్పుడు. మూడు, లేదా (ఇస్లాం)ధర్మాన్ని వదలి (మతభ్రష్టుడై) ముస్లిం సమాజం నుండి వేరైపోయినప్పుడు." (బుఖారి, ముస్లిం)

హుజైల్‌తెగకు చెందిన ఇద్దరు మహిళలు ఓరోజు పోట్లాడుకున్నారు. వారిలో ఒక మహిళ రెండో మహిళ పైకి రాయి విసిరి కొట్టింది. అది కాస్తా ఆమె కడుపుకు తగిలి కడుపులోని పిల్లవాడు చనిపోయాడు. ఈ వ్యవహారం గురించి దైవప్రవక్త (స) తీర్పిస్తూ "మగపిల్లవాడయినా, ఆడపిల్లయినా ఈ శిశువుకు సంబంధించి రక్తపరిహారంగా ఒక బానిసను లేదా బానిసరాలిని (హంతకురాలి తరపున) ఇచ్చుకోవాలి" అని అన్నారు. (బుఖారి, ముస్లిం)

## తిరుగుబాటు-అరాచకాలు

"దేవునికి ఆయనప్రవక్తకు వ్యతిరేకంగా పోరాడేవారికి, ధరణిలో కలహాలు రేకెత్తిస్తూ తిరిగేవారికి శిక్షగా వారిని హతమార్చాలి; లేదా ఉరికంబం ఎక్కించాలి; లేదా ఒక చేయి, దానికి అభిముఖంగా వున్న ఒక కాలు నరికివేయాలి; లేదా దేశబహిష్కరణ చేయాలి. ఇవి ఇహలోకంలో వారికిలభించే అవమానం, అప్రతిష్ఠలు. పరలోకంలో ఇంత కంటే ఘోరమైన శిక్ష ఉంటుంది. అయితే మీస్వాధీనంలోకి రాకముందే వారు తాము చేసిన నిర్వాకానికి పశ్చాత్తాపంచెంది తమ నడవడికను సరిదిద్దుకుంటే (ఇకవారి జోలికి పోకూడదు.) దేవుడు క్షమించేవాడని, కరుణించేవాడని తెలుసుకోండి." (ఖుర్ఆన్-5:33,34)

"ప్రజలు నిన్ను పవిత్ర మాసాలలో యుద్ధం చేయడం గురించి అడుగుతున్నారు. వారికిలా చెప్పు: "ఆ మాసాలలో యుద్ధం చేయడం ఘోరమైన విషయం. అయితే దైవ మార్గంలో అవరోధాలు సృష్టించడం, దేవుడు పంపినసందేశాన్ని నిరాకరించడం, దైవభక్తుల్ని ప్రతిష్ఠాలయంలో ప్రవేశించనీయకుండా నిరోధించడం, అక్కడ ఉండే వారిని బయటికి గెంటివేయడం- ఇవి దేవునిదృష్టిలో అంతకన్నా ఘోరమైన చర్యలు. హింసా పీడనలు హత్యా రక్తపాతాల కన్నా చాలా ఘోరమైనవి." (ఖుర్ఆన్-2:217)

"విశ్వాసులారా! అరాచకం పూర్తిగా సమసిపోయి సర్వత్రా దైవధర్మం నెలకొనేదాకా అవిశ్వాసులతో పోరాడండి. వారు తమవైఖరి మార్చుకుంటే (ఇక వారి జోలికి పోకండి.) వారి వ్యవహారం దేవుడే చూసుకుంటాడు." (8:39)

"వారు తమ నోటితో దేవునిజ్యోతి (సత్యధర్మం) ఆర్పి వేయగోరుతున్నారు. కాని సత్య తిరస్కారులకు ఎంత వెగటు కలిగినా దేవుడు తన జ్యోతిని నేల నాలుగుచెరగులా ప్రసరింప జేయనిదే వదలిపెట్టడు. సత్యధర్మం బహుదైవారాధకులకు ఏమాత్రం నచ్చకపోయినా సరే ఇది యావత్తు జీవనవ్యవస్థలపై ఆధిక్యత పొందడానికి ఆ దేవుడే తన (అంతిమ) ప్రవక్తకు సత్యాన్ని, హితబోధను ఇచ్చి పంపాడు." (ఖుర్ఆన్-9:32,33)

## మద్యసేవన శిక్ష

హజ్రత్ అనస్ (రజి) కథనం: "సారాయి తాగిన నేరస్థులకు దైవప్రవక్త (స) చెప్పులతో, బెత్తాలతో కొట్టించి శిక్షంచేవారు. మొదటి ఖలీఫా హజ్రత్ అబూబకర్ (రజి) ఇలాంటి నేరస్థులకు నలభై కొరడా దెబ్బల శిక్ష విధించేవారు." (బుఖారి, ముస్లిం)

హజ్రత్ అబూహురైరా (రజి) కథనం: మద్యం తాగిన ఒకతణ్ణి తన దగ్గరికి తీసుకొచ్చినప్పుడు దైవప్రవక్త (స) "ఇతణ్ణి వాయించండి" అన్నారు. ఆయన అలా అనగానే మాలో కొందరు చేతులతో, కొందరు చెప్పులతో, కొందరైతే బట్టలతో అతణ్ణి (ఎడాపెడా) కొట్టారు. అతను వెళ్ళిపోయాక కొందరు, "దేవుడు నిన్ను అవమానించుగాక!" అని అతనికి శాపనార్థాలు పెట్టసాగారు. దైవప్రవక్త (స) ఆ మాట విని "అలా అనకండి. అతనికి వ్యతిరేకంగా షైతానుకు సహాయపడకండి" అని అన్నారు. (బుఖారీ)

రెండవ ఖలీఫా హజ్రత్ ఉమర్ (రజి) పరిపాలనా ప్రారంభకాలంలో కూడా నలభై కొరడా దెబ్బల శిక్షే ఉండేది. ఆ తరువాత దాన్ని ఎనభైకు పెంచడం జరిగింది.

హజ్రత్ అలి బిన్ అబూతాలిబ్ (రజి) ఇలా అన్నారు: "నేనొకవేళ ఎవరికైనా శిక్ష అమలుపరచినప్పుడు అతను చనిపోతే ఒక్క తాగుబోతు విషయంలో తప్ప నాకెలాంటి విచారంలేదు. శిక్షవల్ల తాగుబోతు చనిపోతే నేనందుకు రక్తపరిహారం ఇప్పిస్తాను. ఎందుకంటే ఈ నేరానికి దైవప్రవక్త (స) ఎలాంటి నిర్ణీత శిక్ష నిర్ధారించలేదు." (బుఖారి)

## దొంగతనం-హస్తఖండన శిక్ష

ఇక దొంగతనం నేరానికి ఈనాడు కొన్నాళ్ళు సాధారణ జైలుశిక్ష మాత్రమే విధిస్తున్నారు. ఫలితంగా నేడు దొంగలు బరితెగించి కోట్లాది ఆస్తులు దొంగిలించడానికి పాల్పడుతున్నారు. అడ్డుకున్నవారిని చంపడానికి సైతం వెనుకాడటం లేదు. ఖుర్ఆన్ విధించే శిక్ష చూడండి:



"స్త్రీ ఐనా, పురుషుడైనా దొంగతనంచేస్తే ఇద్దరికీ చెయ్యి నరికివేయండి. ఇది వారు సంపాదించుకున్నదానికి ప్రతిఫలం. దేవుని తరఫున కనువిప్పు కల్గించే శిక్ష." (5:38)

బుఖారి, ముస్లిం గ్రంథాల ప్రకారం దొంగతనం నేరం శిక్ష గురించి మహాప్రవక్త ముహమ్మద్ (స) ఇలా చెప్పారు:

"కనీసం పావు (1/4) దీనార్ (దొంగిలించినందు)కు దొంగ చేతిని నరికివేయాలి."

"దొంగపై దైవశాపం పడుగాక! కోడిగుడ్డు దొంగిలిస్తే అతని చేయి నరకబడుతుంది. తాడు దొంగిలించినా అతని చేయి నరకబడుతుంది."

"మూడు దిర్హంల విలువగల డాలును దొంగిలించే దొంగలకు దైవప్రవక్త (స) హస్తఖండన శిక్ష విధించారని హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి) తెలియజేశారు."

హస్తఖండన శిక్ష విధించేందుకు యుద్ధంలో వాడే డాలు విలువను కనీస ప్రమాణంగా తీసుకోవడం జరిగింది. ఇమామ్ అబూహనీఫా, ఇమామ్ షాఫయి (రహ్మలై)లు బహుశా వారి కాలం డాలు విలువను బట్టి హస్తఖండన శిక్ష కోసం కనీసం పది దిర్హంలు ఉండాలన్నారు.

దొంగకు శిక్షగా ఒకచేయి మాత్రమే నరకాలి ఇస్లామీయ రాజ్యంలో సర్వత్రా "ఆర్థిక న్యాయం" నెలకొన్న తరువాతనే హస్తఖండన శిక్షలు అమలుజరపాలి. అయితే ఒక డాలు విలువకులోపు వస్తువుని దొంగిలిస్తే చేతిని నరకరాదని దైవప్రవక్త (స) అన్నారు. అలాగే పండ్లు, కూరగాయలు, ఇతర ఆహారవస్తువుల్ని (పరిమిత స్థాయిలో) దొంగిలించినా హస్తఖండన శిక్ష ఉండదని చెప్పారు. అబూహనీఫా (రహ్మలై) అభిప్రాయం ప్రకారం పండ్లు, కూరగాయలు, మాంసం, వండిన ఆహారం, నూర్పిడికాని ధాన్యం, ఆటవస్తువులు, వాయిద్య పరికరాలు వగైరా విషయంలో హస్తఖండన శిక్ష లేదు. అయితే వీటికి తేలికపాటి శిక్షలు ఉంటాయి.

## వ్యభిచార శిక్షలు

వ్యభిచారం దాదాపు అన్ని మతాల్లోనూ పాపకార్యమే. సభ్యతా నాగరికతల దృష్ట్యా కూడా ప్రతి యుగంలోనూ మానవసమాజాలు దీన్ని చెడ్డవిషయంగానే పరిగణించాయి. మానోవాంఛలకు బానిసలై స్త్రీని సెక్స్‌సింబల్‌గా భావించే కొందరు తప్ప ఎవరూ ఎన్నడూ వ్యభిచారం దుష్కార్యమనే విషయంలో విభేదించలేదు.

"వ్యభిచారం దరి దాపులకుపోకండి. అది చాలా హేయమైనది, పరమ చెడ్డదారి. (అంటే నరకానికి గొనిపోయే దారి.)"- (ఖుర్ఆన్-17:32)

"వ్యభిచారి, వ్యభిచారిణి- వీరిద్దరిలో ప్రతిఒక్కరికీ వందేసి కొరడాదెబ్బలు కొట్టండి. మీరు దేవుడ్ని, అంతిమదినాన్ని విశ్వసించినవారయితే దైవధర్మం విషయంలో వారి (శిక్ష) పట్ల మీరు ఏమాత్రం సానుభూతి వెలిబుచ్చకూడదు." (ఖుర్ఆన్-24:2)

దైవప్రవక్త (స) "వారి కోసం దేవుడు ఏదైనా మార్గం చూపించేవరకు" అనే 4:15 సూక్తిపై వ్యాఖ్యానిస్తూ "దేవుడు వారి కోసం మార్గం చూపించాడు. వివాహితకు శిలాశిక్ష, అవివాహితకు కొరడాశిక్ష విధించాలి" అని అన్నారు.

హజ్రత్ ఉబాదా బిన్ సామిత్ (రజి) కథనం: ఒకరోజు మహాప్రవక్త ముహమ్మద్ (స)పై దివ్యావిష్కృతి (వహీ) అవతరించింది. దివ్యావిష్కృతి అవతరణ సమయంలో

ఆవహించే ప్రత్యేక పరిస్థితి తొలగిపోయిన తరువాత ఆయన మాట్లాడుతూ "ఇదిగో భద్ర పరచుకోండి, దేవుడు ఈ మహిళల కోసం సరళ మార్గం సృజించాడు. వివాహితుడు వివాహితతో, అవివాహితుడు అవివాహితతో వ్యభిచారానికి పాల్పడితే వివాహితులకు వంద కొరడా దెబ్బలతో పాటు శిలాశిక్ష విధించబడుతుంది. అవివాహితులకు మాత్రం వంద కొరడా దెబ్బల తరువాత ఒక సంవత్సరం పాటు దేశబహిష్కరణ శిక్ష విధించబడు తుంది" అని అన్నారు. (ముస్నద్ అహ్మద్)

ద్వితీయ శ్రేష్ఠఖలీఫా హజ్రత్ ఉమర్ ఫారూఖ్ (రజి) కథనం: "దేవుడు ముహమ్మద్ మహనీయుడ్ని (స) సత్య ప్రాతిపదికపై ప్రభవింపజేశాడు. ఆయన (హృదయఫలకం)పై దివ్యఖుర్ఆన్ అవతరింపజేశాడు. దేవుడు అవతరింపజేసిన దానిలో శిలాశిక్షకు సంబం ధించిన సూక్తి కూడా ఉంది. మేము దీన్ని చదివాము, అర్థం చేసుకున్నాం, గుర్తుంచు కున్నాం. దైవప్రవక్త (స) కూడా శిలాశిక్షను అమలుపరచారు. ఆయన తరువాత మేము కూడా శిలాశిక్షను అమలుపరచాము. అయితే ఓ సుదీర్ఘకాలం గడచిన తరువాత ఈ విషయంలో ఎవరైనా 'దైవగ్రంథంలో శిలాశిక్షకు సంబంధించిన సూక్తి ఏదీ మాకు కన్పిం చడంలేదే' అని అంటారేమోనని నేను భయపడుతున్నాను. ఒకవేళ అలా అంటే ముస్లింలు దేవుడు అవతరింపజేసిన ఒక విధిని వదిలేసినవారయి మార్గభ్రష్టులైపోతారు. దైవగ్రంథం ప్రకారం వ్యభిచారానికి పాల్పడిన వివాహిత వ్యక్తికి శిలాశిక్ష నిర్దేశించబడింది. ఇది ముమ్మాటికీ నిజం. కాకపోతే సాక్ష్యాల ద్వారా నేరం రుజువుకావాలి లేదా గర్భధారణ జరిగివుండాలి లేదా నేరస్థుడు నేరాన్ని ఒప్పుకోవాలి." (బుఖారి, ముస్లిం)

కొరడా దెబ్బల శిక్ష కోసం నేరస్థుడు (1)వయోజనుడై (అంటే యుక్తవయస్కుడై) ఉండటంతో పాటు (2) చైతన్యవంతుడయి ఉండాలి. బాలలకు, ఉన్మాదులకు శిక్ష ఉండదు. బానిసలకు స్వతంత్రునికి విధించే శిక్షలో సగం శిక్ష మాత్రమే ఉంటుంది. (ఒకవేళ బానిస స్త్రీలు వివాహ బంధంలోకి వచ్చి భద్రతపొందిన తరువాత దుర్నడతకు పాల్పడితే అలాంటివారికి స్వతంత్ర స్త్రీలకు విధించే శిక్షలో సగం శిక్ష విధించాలి–4:25). శిలాశిక్ష కోసం నేరస్థుడు పైరెండు అర్హతలతో పాటు ఈ క్రింద పేర్కొన్నట్లు మరో మూడు అర్హతలు కూడా కలిగివుండాలి:

(1) నేరస్థుడు స్వేచ్ఛాపరుడై ఉండాలి. బానిసకు శిలాశిక్ష ఉండదు.

(2) నేరస్థుడు వివాహితుడై ఉండాలి. శోభనం కూడా జరిగి ఉండాలి.

(3) నేరస్థుడు ముస్లిమైవుండాలి. ఇక్కడ ఇమాముల్లో భేదాభిప్రాయాలున్నాయి.

పృష్ఠసంపర్కం లేక ఇతర అసహజ మైథునం (Sodomy, Paederastry) కూడా ఘోరపాపం క్రిందికి వస్తుంది. ఇది కూడా వ్యభిచార పరిధిలోకే వస్తుంది. దీనికి శిక్షగా "చేసినవాడ్ని చేయించుకున్నవాడ్ని హతమార్చండి; పైవాడ్ని, క్రిందివాడ్ని ఇద్దర్నీ రాళ్లతో కొట్టి చంపండి" అని హదీసుల్లో వచ్చింది. హజ్రత్ అలి (రజి) ప్రకారం ఇలాంటి నేరస్థుడ్ని చంపి అతని శవాన్ని కాల్చివేయాలి. ఈ అభిప్రాయంతో హజ్రత్ అబూబకర్ (రజి) కూడా ఏకీభవించారు. ఇమాం అబూహనీఫా (రహ్మాలై) ప్రకారం దేశ, కాల పరిస్థితుల్ని బట్టి ఏదైనా కఠినశిక్ష విధించాలి.



## మానభంగం శిక్షలు

"మీ బానిసమహిళలు శీలవతులుగా ఉండదలచుకున్నప్పుడు, ప్రాపంచిక ప్రయోజ నాల కోసం వారిని మీరు బలవంతంగా పడుపువృత్తిలోకి దించకండి. వారిని ఎవరైనా బలవంతంగా అలా మార్చితే ఆ బలాత్కారం తరువాత వారి విషయంలో దేవుడు ఎంతో క్షమించేవాడు, కరుణించేవాడు (అవుతాడు)." (ఖుర్ఆన్–24:33)

మానభంగం కేసుల్ని గురించి అనేక హదీసులున్నాయి. తిర్మిజి, అబూదావూద్‌ల లోని ఒక ఉల్లేఖనం ప్రకారం "ఒక స్త్రీ నమాజ్ చేయడానికి చీకటిలో (మసీదుకు) బయలుదేరింది. దారిలో ఒకతను ఆమెను పడదోసి మానభంగానికి పాల్పడ్డాడు. అప్పుడామె కేకలుపెట్టింది. ఆ కేకలు విని జనం అతడ్ని పట్టుకొని దైవప్రవక్త (స) ముందు ప్రవేశపెట్టారు. దైవప్రవక్త అతనికి శిలాశిక్ష విధించి స్త్రీని వదలిపెట్టారు."

బుఖారీ గ్రంథంలోని ఒక ఉల్లేఖనం ప్రకారం హజ్రత్ ఉమర్ (రజి) పరిపాలనా కాలంలో ఒక వ్యక్తి ఒక బాలికను మానభంగం చేశాడు. హజ్రత్ ఉమర్ (రజి) ఆ వ్యక్తికి కొరడా దెబ్బలు కొట్టించి, బాలికను వదలిపెట్టారు.

పైన పేర్కొన్న వివరాల్ని బట్టి మానభంగానికి గురయ్యే స్త్రీ వ్యవహారంలో మాత్రం ఇమాములందరి ఏకాభిప్రాయం ఉంది. పురుషుడి వ్యవహారంలోనే భేదాభిప్రాయాలు వచ్చాయి. ఇమామ్ అబూయూసుఫ్, ఇమామ్ ముహమ్మద్, ఇమామ్ షాఫయి, ఇమామ్ హసన్ బిన్ సాలిహ్ (రహ్మాలై)ల అభిప్రాయం ప్రకారం పురుషుడు కూడా బలవంతం, వత్తిళ్ళ వల్ల రమించవలసి వచ్చినప్పుడు అతనూ క్షమాపణకు అర్హుడవుతాడు.

ఇమామ్ జుఫర్ (రహ్మాలై) దీన్ని అంగీకరించకుండా రతిక్రీడ పట్ల ఆసక్తి, ఉద్దేశ్యం లేకుండా అంగస్తంభన జరగదు గనక ఎలాంటి పరిస్థితిలోనైనా వ్యభిచారానికి పాల్పడిన పురుషుడు నేరస్థుడిగా, శిక్షార్హుడిగానే పరిగణించబడతాడని అభిప్రాయపడ్డారు.

ఇమామ్ అబూహనీఫా (రహ్మాలై) తన అభిప్రాయం ఇలా వ్యక్తపరిచారు: "ఒకవేళ ప్రభుత్వంగాని, ప్రభుత్వాధికారిగాని రతిక్రీడ కోసం పురుషుడ్ని బలవంతం చేస్తే అలాంటి ప్రభుత్వానికి అతడ్ని శిక్షించే అధికారంలేదు. కాని పురుషునికి బలవంతంగా అంగస్తంభన జరగదు గనక ఇతరులు బలవంతం చేస్తే మాత్రం అతనికి శిక్ష పడుతుంది."

పై మూడు అభిప్రాయాల్లో మొదటి అభిప్రాయమే సరైనదని చెప్పాలి. ఎవరైనా దుర్మార్గుడు ఓ సచ్ఛీలుడ్ని బలవంతంగా పట్టుకొని జైల్లోగాని, ఏదైనా గదిలోగాని త్రోసి, అందులోకి ఓ అందమైన యువతిని నగ్నంచేసి పంపి అనేక రోజులదాకా గది మూసిఉంచడం జరిగితే ఆ పురుషుడు సహనం కోల్పోయి రతిక్రీడ జరపకుండా ఉండలేడు. అప్పుడా దుర్మా ర్గుడు నలుగురిని దొంగసాక్షులుగా చేసితెచ్చి వ్యవహారం న్యాయస్థానం ముందు పెడితే, న్యాయస్థానం వాస్తవ పరిస్థితుల్ని విస్మరించి ఆ స్త్రీపురులిద్దరికీ కొరడాశిక్షగాని, శిలాశిక్షగాని విధించడం న్యాయమేనా?

అలాగే ఎవరినైనా జైల్లో వేసి తాగేందుకు మద్యం తప్ప మరే పానీయం ఇవ్వనప్పుడు అతను తీవ్రమైన దప్పికతో మార్గాంతరంలేక మద్యం తాగితే ఆ మాత్రానికే అతనికి శిక్ష

విధించడం న్యాయమవుతుందా? నేరపరిశోధనకు కేవలం సంకల్పం లేక ఉద్దేశ్యం సరిపోదు. దానికి స్వేచ్ఛాయుతమైన సంకల్పం లేక ఉద్దేశ్యం కావాలి. ఎవరినైనా ఉద్దేశపూర్వకంగానే నేరం చేసేలా బలవంతంగా ఇలాంటి పరిస్థితులు కల్పిస్తే కొన్ని సందర్భాలలో అతనసలు నేరస్థుడే కాలేడు; కొన్ని సందర్భాలలో అతని నేరం చాలా తేలికగా ఉంటుంది.

ఇస్లాం వ్యభిచారికి వ్యతిరేకంగా చర్యతీసుకునే అధికారం ప్రభుత్వానికి తప్ప మరెవరికీ ఇవ్వదు. అలాగే నేరం రుజువైన తర్వాత శిక్షవిధించే అధికారం న్యాయస్థానానికి తప్ప ఎవరికీ లేదు. వ్యభిచార నేరశిక్ష రాజ్యానికి సంబంధించిన చట్టం. వ్యక్తులకుగాని, ప్రభుత్వేతర సంస్థలకుగాని ఈ చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకునే అధికారం ఏమాత్రం లేదు.

ఇస్లామీయ చట్టం నేరాంగీకారానికి నిందితుడిపై ఎలాంటి వత్తిడి చేయదు. ఇందులో నిందితుడు తన నేరాన్ని తప్పక అంగీకరించాలన్న రూల్ ఏదీలేదు. నిందితుడి నేరం గురించి ప్రజలకు తెలిస్తే వారా విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తప్పక తీసుకురావాలన్న రూల్ కూడా లేదు. ఒకవేళ విషయం ప్రభుత్వం దృష్టికి వస్తే మాత్రం నిందితుడికి శిక్ష తప్పదు.

"మీలో ఎవరైనా ఇలాంటి అశ్లీల చేష్టలో కాలుజారడం జరిగితే ఆ పాపాన్ని దేవుడు కప్పిపుచ్చిన తెరలో అలాగే దాగి ఉండనివ్వండి. ఒకవేళ నిందితుడు మా ముందు తన తెరను పైకెత్తితే మాత్రం మేమతనిపై దైవగ్రంథంలోని చట్టాన్ని అమలుజరిపి తీరుతాం" అన్నారు దైవప్రవక్త (స).

అబూదావూద్, నసాయి గ్రంథాల్లోని ఒక హదీసు ప్రకారం దైవప్రవక్త (స) ఇలా అన్నారు: "నేరాలు-శిక్షల విషయంలో మీరు పరస్పరం క్షమించుకోండి. ఒకవేళ ఏదైనా నేరం గురించిన నివేదిక నా దగ్గరకు వస్తే మాత్రం దానికి శిక్ష తప్పనిసరి అవుతుంది."

ఇస్లామీయచట్టం ప్రకారం నేరానికి తగిన శిక్షే విధించబడాలిగాని, నిందితుడు శిక్ష నుండి తప్పించుకోవడానికి ఏదైనా మూల్యం చెల్లిస్తే అది చెల్లదు. అనేక హదీసుగ్రంథాలలో వచ్చిన ఒక ఉల్లేఖనం ప్రకారం ఒక యువకుడు ఒకతని దగ్గర జీతానికి పనిచేస్తూ ఓసారి ఆ యజమాని భార్యతో రమించాడు. యువకుని తండ్రి అతని యజమానికి వంద మేకలు, ఒక బానిస స్త్రీని ఇచ్చి సమస్యను పరిష్కరింపజేసుకున్నాడు. అయితే ఈ వ్యవహారం దైవప్రవక్త (సల్లం) దృష్టికి వచ్చినప్పుడు ఆయన యువకుని తండ్రిని పిలిపించి "నీ మేకలు, నీ బానిసరాలు వాపసు తీసుకో. (నీ కొడుక్కు శిక్ష పడుతుంది)" అన్నారు. తరువాత ఆయన వ్యభిచారికి, వ్యభిచారిణికి శిక్ష విధించారు.

దీన్నిబట్టి ఇస్లాంలో పరిహారం, ప్రతిఫలాల ఇచ్చిపుచ్చుకోవడాల ద్వారా సమస్యను తొక్కిపట్టడం నిషిద్ధమని తెలుస్తోంది. అంతేకాదు, స్త్రీ మానానికి ధన కనక వస్తు రూపేణ విలువ కట్టడం కూడా నిషిద్ధమని తెలుస్తోంది.

## నేరనిరూపణ సాక్ష్యం

వ్యభిచారానికి సంబంధించి సరైన సాక్ష్యాధారాలు లేకుండా కేవలం వినికిడి సమాచారంతో ప్రభుత్వం వ్యభిచారికి శిక్ష విధించలేదు. దైవప్రవక్త (స) కాలంలో మదీనాలో ఓ వ్యభిచారిణి ఉండేది. ఆమె బాహాటంగా వ్యభిచరిస్తుండేది. ఆమె అశ్లీలతను గురించి ప్రజలందరికీ తెలుసు. కాని సరైన సాక్ష్యాధారాలు లేనందున ఆమెకు దైవప్రవక్త (స) శిలాశిక్ష విధించ



లేకపోయారు. ఈమె ప్రస్తావన అనేక ఉల్లేఖనాలలో ఉంది. ఒక ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (స) ఆ వ్యభిచారిణి గురించి ప్రస్తావిస్తూ "నేను సాక్ష్యాధారాలు లేకుండా శిలాశిక్ష విధించేవాణ్ణయితే ఆ స్త్రీకి తప్పకుండా శిలాశిక్ష విధించేవాడ్ని" అని అన్నారు. (హదీస్)

ఇస్లాం నేరనిరూపణ సాక్ష్యాల విషయంలోనూ తగిన జాగ్రత్తలు తీసుకుంటుంది. వ్యభిచార నిరూపణకు ముఖ్యంగా నాలుగు జాగ్రత్తలు తీసుకోవలసి ఉంటుంది.

(1) ఖుర్‌ఆన్‌లోని 4:15, 24:4 సూక్తుల ప్రకారం వ్యభిచార నిరూపణకు కనీసం నలుగురు ప్రత్యక్ష సాక్షులు ఉండాలి.

(2) సాక్షులు నమ్మదగినవారై ఉండాలి. అంటే వారు ఇదివరకటి ఏదైనా వ్యవహారంలో అబద్ధపు సాక్ష్యం చెప్పనివారై ఉండాలి. నమ్మకద్రోహులయి ఉండకూడదు. గతంలో శిక్ష అనుభవించనివారై ఉండాలి. నిందితుని పట్ల శత్రుభావం లేనివారై ఉండాలి.

(3) సాక్షులు నిందితుడ్ని, నిందితురాలిని వ్యభిచారం చేస్తుండగా బావిలో చాంతాడును చూసినట్లు కళ్ళారా చూశామని సాక్ష్యం ఇవ్వాలి.

(4) ఎప్పుడు, ఎక్కడ, ఎవరు ఎవరితో వ్యభిచరించారన్న విషయంపై సాక్షుల్లో ఏకాభిప్రాయం ఉండాలి. ఆ నల్గురిలో ఏఒక్కడు విభేదించినా మొత్తంసాక్ష్యం నీరుగారిపోతుంది.

వ్యభిచారానికి ఇలాంటి సాక్ష్యం లభించడం సాధ్యమేనా? నూటికో కోటికో ఒకటి లభించడం కూడా కష్టమేనని పై షరతులు చూస్తే ఎవరికైనా ఇట్టే అర్థమవుతుంది.

పోతే భర్తవిహీనురాలికి జరిగే గర్భధారణ విషయంలో భేదాభి ప్రాయాలున్నాయి. లక్షలో ఒక్క కేసయినా సరే పురుషవీర్యకణం ఏవిధంగానైనా స్త్రీ గర్భంలో ప్రవేశించే అవకాశం ఉండవచ్చు గనక, కేవలం గర్భధారణ నేరనిరూపణకు దృఢమైన సాక్ష్యం కాజాలదని అధికసంఖ్యాక ధర్మవేత్తల అభిప్రాయం. శిలాశిక్ష లేక కొరడాశిక్ష లాంటి భయంకరమైన శిక్ష విధించడానికి నలుగురి సాక్ష్యమైనా కావాలి లేదా స్వయంగా నిందితురాలైనా తన నేరాన్ని ఒప్పుకోవాలి. శిక్ష విధించడానికి ఇస్లామీయ చట్టంలో కొన్ని మౌలిక సూత్రాలున్నాయి.

ఈ మౌలికసూత్రాల్లో ఒకటి- అనుమానం అనేది నేరస్థుడికి శిక్ష విధించడానికి బదులు అతడ్ని క్షమించడానికి మాత్రమే ప్రేరణగా ఉండాలి. దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రవచించారు: "శిక్షలను వీలైనంతవరకు నిరోధించండి." (ఇబ్నెమాజ)

మరొక హదీసులో ఆయన ఇలా అన్నారు: "శిక్షలను వీలైనంతవరకు ముస్లింలకు దూరంగా ఉంచండి. నిందితుడ్ని శిక్ష నుండి తప్పించడానికి ఏవిధమైన మార్గం దొరికినా అతడ్ని వదలిపెట్టండి. న్యాయాధికారి నిందితుడికి శిక్ష విధించడంలో చేసే పొరపాటు కన్నా అతడ్ని క్షమించడంలో చేసే పొరపాటే శ్రేష్ఠమైనది." (తిర్మిజి)

దీన్నిబట్టి నేరస్థుల్ని వెతికివెతికి పట్టుకొని తీవ్రమైన శిక్షలు విధించడం ఇస్లాం లక్ష్యం కాదని, సమాజసంస్కరణే దాని అసలులక్ష్యమని తెలుస్తోంది. దైవప్రవక్త (సల్లం) కాలంలో ఇలాంటి సాక్ష్యాలతో ఒక్క వ్యభిచార వ్యవహారం కూడా విచారణకు రాలేదు. రెండవ ఖలీఫా హజ్రత్ ఉమర్ (రజి) పాలనలోని పన్నెండేండ్ల కాలంలో ఒకేఒక కేసు విచారణకు వచ్చింది. చివరికి అదికూడా ఒక సాక్షి పలికిన అనుమానాస్పదమైన మాటల కారణంగా వీగిపోయింది. ఆ కేసు వివరాలు ఇలా ఉన్నాయి:

బస్రా గవర్నర్ ముగీరా బిన్ షాబా (రజి)తో మరొక వ్యక్తి అబూబక్రాకు చాలా కాలంనుంచి సత్సంబంధాలు లేవు. వారిద్దరి ఇండ్లు ఎదురెదురుగా ఉన్నాయి. అలాంటి పరిస్థితిలో ఓరోజు రాత్రి హఠాత్తుగా తీవ్రమైన గాలి వీచడంతో ఇద్దరి ఇండ్ల కిటికీలు తెరచుకున్నాయి. అబూబక్రా కిటికీ రెక్కలు మూసేద్దామని లేచి కిటికీ దగ్గరకు వెళ్తే అతనికి ఎదురింటి కిటికీ లోపల గవర్నర్ ముగీరా రతిక్రీడలో లీనమైవున్న దృశ్యం కన్పించింది. వెంటనే అతను తన ఇంట్లోనే వున్న మరోముగ్గురు మిత్రుల్ని పిలిచి ఆ దృశ్యం చూడమని పురమాయిస్తూ ఈ అశ్లీలచేష్టకు మీరూ సాక్షులుగా ఉండండని అన్నాడు. నాఫె బిన్ కలదా, జియాద్, షిబల్ అనే ఆ ముగ్గురు మిత్రులు ఆ దృశ్యం చూసి 'ఈ స్త్రీ ఎవర'ని అడిగారు. 'ఈమె ఉమ్మెజమీల్' అన్నాడు అబూబక్రా.

మరునాడు ఈ వ్యవహారం హజ్రత్ ఉమర్ (రజి) దగ్గరకు వచ్చింది. వెంటనే ఆయన హజ్రత్ ముగీరా (రజి)ను గవర్నర్ పదవి నుంచి సస్పెండ్ చేసి ఆయన స్థానంలో హజ్రత్ అబూమూసా అష్అరీ (రజి)ని గవర్నర్‌గా నియమించి పంపారు. తరువాత బస్రా నుంచి నిందితుడ్ని సాక్షులతో సహా రాజధాని మదీనాకు పిలిపించారు. విచారణ చేస్తున్నప్పుడు అబూబక్రా, మరోఇద్దరు (షిబల్, నాఫె) తాము ముగీరాను ఉమ్మెజమీల్‌తో రమిస్తుండగా చూశామని సాక్ష్యం చెప్పారు. అయితే నాల్గవ సాక్షి జియాద్ మాత్రం తనకా స్త్రీ స్పష్టంగా కన్పించలేదని, అంచేత ఆమె ఉమ్మెజమీలేనని గట్టిగా చెప్పలేనని అన్నాడు. హజ్రత్ ముగీరా (ర) సాక్షులు తనను చూస్తుండిన వైపు నుండి స్త్రీని స్పష్టంగా చూడలేరని విచారణలో రుజువు చేశారు. అంతేకాదు, తన భార్య, ఉమ్మెజమీల్ రూపురేఖల్లో దాదాపు ఒకేలా ఉంటారని కూడా ఆయన రుజువు చేశారు. వేరొక వైపు ఉమర్ (రజి) పాలనలో అధికార గృహంలో భార్యాసమేతంగా నివసిస్తుండిన ఒక రాష్ట్ర గవర్నర్ పరస్త్రీని పిలిపించుకొని వ్యభిచరించలేడని పరిస్థితులు సూచిస్తున్నాయి.

పై కారణాలుగా సాక్షులు లేనిపోని అనుమానాలకు పోయి హజ్రత్ ముగీరాపై నిందవేశారు గనక ఆయన్ని వదిలేయడం జరిగింది. అయితే హజ్రత్ ఉమర్ (ర) సాక్షులలో అబూబక్రా, నాఫె, షిబల్‌లకు నిందితుడిపై అపనింద మోపిన నేరానికి "శీలవతులైన స్త్రీలపై అపనింద మోపి, దానికి నలుగురు సాక్షులు తీసుకురాలేనివారిని ఎనభై కొరడా దెబ్బలు కొట్టండి" (24:24) అనే ఖుర్‌ఆన్‌సూక్తి ప్రకారం కొరడా శిక్ష విధించారు.

(ఇబ్నుల్‌అరబి-అహ్కాముల్ ఖుర్‌ఆన్, రెండవభాగం)

ఈ కేసులో సాక్షులకు విధించిన శిక్ష ప్రత్యేక పరిస్థితుల్లో తీసుకున్న నిర్ణయం మాత్రమే. సాధారణ పరిస్థితుల్లో సాక్షుల పొరపాట్లకు వారిని శిక్షించడం జరగదు.

వ్యభిచార నేరనిరూపణ కోసం సాక్ష్యాధారాలు లేకుండా నిందితుడు తన నేరాన్ని ఒప్పుకున్నా సరిపోతుంది. అయితే నిందితుడు తాను పరస్త్రీతో వ్యభిచరించినట్లు స్పష్టమైన పదజాలంతో చెప్పాలి. న్యాయస్థానం కూడా నిందితుడు ఎలాంటి బలవంతం వత్తిళ్ళు లేకుండా, పూర్తి స్వేచ్ఛతో, స్పృహతోనే వ్యభిచారం చేశాడని నిర్ధారించుకోవాలి. ఇక శిక్ష అమలుపరుస్తున్నప్పుడు నిందితుడు తాను వ్యభిచారం చేయలేదని మాట మార్చడం జరిగితే అతడ్ని శిక్షించకుండా వదిలేయాలి.



ఈ విషయంలో 'మాయిజ్ బిన్‌మాలిక్ అస్లమీ' వృత్తాంతం చాలా ప్రసిద్ధిచెందింది. ముఖ్యమైన హదీసుగ్రంథాలన్నిటిలోనూ ఈసంఘటన పేర్కొనబడింది. ఈ యువకుడు అస్లం తెగకు చెందిన అనాథబాలుడు, హజ్రత్ హజ్జాల్ బిన్ నుఐమ్ (రజి) సంరక్షణలో పెరిగాడు. అతను బానిసత్వం నుంచి స్వేచ్ఛపొందిన ఒక యువతితో వ్యభిచరించాడు. హజ్రత్ హజ్జాల్ (రజి) ఈ సంగతి తెలుసుకొని "దైవప్రవక్త (స) దగ్గరికెళ్ళి చెప్పెయ్యి, బహుశా ఆయన నీపాపక్షమాపణ కోసం దైవాన్ని ప్రార్థిస్తారు"అనిచెప్పారు. ఆ యువకుడు దైవప్రవక్త (స) దగ్గరకు వెళ్ళి విషయం చెప్పాడు. వివరాలు చూడండి:

## నేరవిచారణ విధానం

"దైవప్రవక్తా! నేను వ్యభిచారం చేశాను, నన్ను పరిశుద్ధ పరచండి."

దైవప్రవక్త (సల్లం) ఈమాట విని ముఖం పక్కకు తిప్పుకున్నారు.

యువకుడు దైవప్రవక్త (స) ముందుకు వచ్చి మళ్ళీ అదే మాటన్నాడు. దైవప్రవక్త (స) మళ్ళీ ముఖం పక్కకు తిప్పుకున్నారు. అతను మూడోసారి కూడా దైవప్రవక్త (స) ముందుకొచ్చి అదే మాటన్నాడు. దైవప్రవక్త (స) మూడోసారి కూడా ముఖం పక్కకు తిప్పుకున్నారు. హజ్రత్ అబూబకర్ (రజి) జోక్యం చేసుకుంటూ "జాగ్రత్త! నువ్వు నాల్గవసారి కూడా వ్యభిచారం చేసినట్లు ఒప్పుకున్నావంటే దైవప్రవక్త నీకు శిలాశిక్ష విధిస్తారు" అని హెచ్చరించారు. కాని ఆ యువకుడు నాల్గవసారి కూడా అదే మాటన్నాడు.

అప్పుడు దైవప్రవక్త (సల్లం) ఆ యువకుని వైపు తిరిగి "అబ్బాయ్! నువ్వు బహుశా దురుద్దేశ్యంతో చూశావేమో లేదా చెయ్యిపట్టి లాగావేమో లేదా కౌగిలించుకొని ముద్దాడావేమో! (ఈ చేష్టల్నే నువ్వు వ్యభిచారమని భావించి ఉంటావు)" అని అన్నారు.

దానికా యువకుడు "లేదండీ, నేను వ్యభిచారమే చేశాను" అన్నాడు.

"ఆ స్త్రీ, నువ్వు ఒకే పడక మీద (కలసి) పడుకున్నారా?"

"ఔనండీ, నేను, ఆమె అలాగే పడుకున్నాం."

"ఏమిటి, నువ్వు నిజంగా సంభోగించావా?"

"ఔనండీ, నేను నిజంగానే సంభోగించాను."

"నీ అవయవం ఆమె అవయవంలోకి మాయమైనంత వరకు పోయిందా?"

దానికీ ఆ యువకుడు ఔనన్నాడు.

"అంటే బావిలోకి చాంతాడులా, సుర్మాసీసాలోకి పుడకలా మాయమైపోయిందా?"

దానికీ ఆ యువకుడు ఔనన్నాడు.

"అసలు నీకు వ్యభిచారం అంటే ఏమిటో తెలుసా?" అడిగారు దైవప్రవక్త (స).

"తెలుసండీ. ఒక భర్త తన భార్యతో ధర్మసమ్మతమైన రీతిగా చేసే పనిని నేను ఆ స్త్రీతో అధర్మ రీతిగా చేశాను" అన్నాడా యువకుడు.

"సరే, నీకు పెళ్ళయిందా?" అడిగారు దైవప్రవక్త (సల్లం).

"అయిందండీ!" చెప్పాడా యువకుడు.

"నువ్వు సారాయి ఏమైనా తాగలేదు కదా?"

"సారాయి ఏమీ తాగలేదండీ!"

అప్పుడొకతను లేచి అతని నోటి వాసనచూసి సారాయి తాగలేదని నిర్ధారించాడు.

దైవప్రవక్త (స) వ్యవహారాన్ని మరింత క్షుణ్ణంగా పరిశోధించడానికి యువకుడుండే వీధిలోని కొందరు ప్రజల్ని పిలిపించి "ఇతనికి పిచ్చేమైనా పట్టలేదు కదా?" అనడిగారు. దానికి వారు "ఇతనిలో పిచ్చేమీ ఉన్నట్లు మేమింతవరకు చూడలేదు" అన్నారు.

దైవప్రవక్త (స) యువకుని సంరక్షకుడితో "నువ్వితని చేష్టని కప్పిపుచ్చిఉంటే నీ కోసం ఎంతో బాగుండేది" అన్నారు. ఆ తర్వాత ఆ యువకుడికి శిలాశిక్ష విధించారు.

అప్పుడు కొందరు ఆ యువకుడ్ని పట్నం బయటికి తీసికెళ్ళి ఓచోట నిలబెట్టి అతనిపై రాళ్లురువ్వారు. పాపం, యువకుడు రాళ్ళదెబ్బలకు తాళలేక "ప్రజలారా! నన్ను దైవప్రవక్త దగ్గరకు తీసికెళ్ళండి. దైవప్రవక్త నన్ను చంపించరని చెప్పి నా తెగవాళ్ళు నన్ను మోసగించారు" అంటూ గగ్గోలు పెట్టాడు. కాని రాళ్ళు రువ్వేవారు అదేమీ పట్టించుకోకుండా ఆ యువకుడ్ని హతమార్చివేశారు. దైవప్రవక్త (స) విషయం తెలిసిన తర్వాత విచారం వెలిబుచ్చుతూ "జనం అతడ్ని ఎందుకు వదిలెయ్యలేదు. నా దగ్గరకు తీసుకొస్తే బహుశా పశ్చాత్తాపం చెందేవాడు, దేవుడు అతడ్ని క్షమించేవాడు కదా!" అని అన్నారు.

ఇంతకంటే ఆసక్తికరమైన మరో సంఘటన వినండి. గామిద్ తెగకు చెందిన ఓస్త్రీ వచ్చి తాను వ్యభిచారం చేసినట్లు నాలుగుసార్లు అంగీకరించింది. ఆమెకు అక్రమ గర్భ ధారణ కూడా జరిగింది. ఆమె తన నేరాన్ని మొదటిసారి అంగీకరించినప్పుడే దైవప్రవక్త (స) "సరేలే, వెళ్ళిపో. పశ్చాత్తాపం చెంది దైవాన్ని క్షమించమని ప్రార్థించు" అన్నారు.

కాని ఆ స్త్రీ "దైవప్రవక్తా! మీరు నావ్యవహారం మాయిజ్ వ్యవహారంలా దాటవేయ జూస్తున్నారా? నేను వ్యభిచారం వల్లనే గర్భం దాల్చాను" అని అన్నది. "అయితే నువ్వు ప్రసవించిన తరువాత రా, చెబుతాను" అన్నారు దైవప్రవక్త (స).

కొంతకాలానికి ఆమె ప్రసవించింది. ప్రసవించిన తర్వాత చంటిపిల్లవాడ్ని తీసుకొని మళ్ళీ దైవప్రవక్త (స) సన్నిధికి వచ్చి "ఇప్పుడు నన్ను పరిశుద్ధపరచండి" అన్నది.

దైవప్రవక్త (స) ఆ పిల్లవాడి వైపు చూస్తూ "పిల్లవాడికి పాలుపట్టు. పాలు తాగడం మానేసిన తరువాత రా" అని ఆదేశించారు ఆమెను.

దాంతో ఆ స్త్రీ వెళ్ళిపోయి పిల్లవాడికి పాలు పట్టనారంభించింది. కొంతకాలనికి పాలుమాన్పించి చేతిలో ఓ రొట్టెముక్క తీసుకొని దైవప్రవక్త (స) సన్నిధికి వచ్చింది. పిల్లవాడికి రొట్టెముక్క తినిపించిచూపుతూ "దైవప్రవక్తా! చూడండి, ఇప్పుడీ పిల్లవాడు పాలు తాగడం మానేసి రొట్టె తినడం మొదలెట్టాడు" అని అన్నది. అప్పుడు దైవప్రవక్త (స) పిల్లవాడ్ని సంరక్షణ కోసం ఒక వ్యక్తికి అప్పగించి ఆ స్త్రీకి శిలాశిక్ష విధించారు.

ఇలాంటి కఠినమైన షరతులతో కూడిన సాక్ష్యాలతో నిందితుడి నేరాన్ని రుజువు చేసి



శిక్షించడం ఇస్లామీయ రాజ్యంలో చాలా కష్టం. ఒకవేళ నేరం రుజువయితే మాత్రం నేర ప్రవృత్తి కలవారికి గుణపాఠం కలిగేలా సదరు నేరస్థుడ్ని బహిరంగ ప్రదేశంలో తీవ్రంగా శిక్షించడం జరుగుతుంది. ఇలాంటి నేరవిచారణ విధానంలో సమాజసంస్కరణ గోచరిస్తుందో, ప్రజావేధింపు ద్యోతకమవుతుందో సంఘశ్రేయోభిలాషులు ఆలోచించాలి.

పైన పేర్కొనబడిన మూడు అభియోగాల ద్వారా వ్యభిచారం చేశానని అంగీకరించిన నేరస్థుడ్ని న్యాయాధికారి, నీవు ఎవరితో వ్యభిచరించావని అడగడనే విషయం రుజువవుతోంది. ఒకవేళ అలా అడిగితే ఒకరికి బదులు ఇద్దరికి శిక్ష విధించవలసి వస్తుంది. కాని ఇస్లాం ధర్మశాస్త్రం జనానికి శిక్షలు విధించడమే పనిగా పెట్టుకొని వాటి కోసం కాచుకొని ఉండదు. ఒకవేళ నేరస్థుడు ఈ నిర్వాకంలో పాల్గొన్నవాడు ఎవరో చెబితే న్యాయస్థానం ఆ వ్యక్తిని విచారిస్తుంది. ఆ వ్యక్తి నేరం ఒప్పుకుంటే అతనిక్కూడా శిక్ష పడుతుంది; ఒప్పుకోకపోతే అతడ్ని వదలి నేరం అంగీకరించిన నిందితుడికి మాత్రమే శిక్ష పడుతుంది.

దైవప్రవక్త (సల్లం) కాలంలో ఇలాంటి అభియోగం ఒకటి ఆయన దగ్గరికొచ్చింది. ముస్నద్ అహ్మద్, అబూదావూద్ గ్రంథాలలో వచ్చిన ఉల్లేఖనాల ప్రకారం ఒకతను వచ్చి తాను ఫలానా స్త్రీతో వ్యభిచరించినట్లు దైవప్రవక్త (స) ముందు అంగీకరించాడు. దైవ ప్రవక్త (స) ఆ స్త్రీని పిలిపించి అడిగితే, ఆమె లేదని చెప్పింది. అప్పుడు దైవప్రవక్త (స) ఆమెను వదలి ఆ పురుషునికి మాత్రమే శిక్ష విధించారు. (హదీస్)

## శిక్ష అమలుపరచే పద్ధతులు

కొన్నిరకాల నేరాలకు ఫలానా శిక్షలు మాత్రమే విధించాలని దేవుడు నిర్ణయించాడు. ఇలాంటి శిక్షల్ని 'హుదూద్' అంటారు. దేవుడు శిక్షలు నిర్ణయించని నేరాలకు న్యాయస్థానం పరిస్థితుల్ని బట్టి శిక్షలు విధిస్తుంది. ఈ శిక్షల్ని 'తాజిరాత్' అంటారు.

**హుదూద్ :** హత్యానేరానికి మరణశిక్ష విధించాలి (2:178,17:33). పొరపాటున జరిగిన హత్యానేరానికి ఒక బానిసకు స్వేచ్ఛనివ్వడంతో పాటు హతుని వారసులకు రక్త పరిహారం చెల్లించాలి (4:92). ప్రభుత్వంపై తిరుగుబాటు చేస్తూ దేశంలో అరాచకం సృష్టించినవారికి మరణశిక్షగాని, ఒకకాలు-ఒకచేయి నరికే శిక్షగాని లేదా దేశబహిష్కరణ శిక్షగాని విధించాలి (5:33). దొంగతనం నేరానికి హస్తఖండన శిక్ష విధించాలి (5:38). శీలవతులపై అపనింద మోపి దానికి నలుగురు సాక్షులు తీసుకురాలేనివారికి ఎనభై కొరడాదెబ్బల శిక్ష విధించాలి (24:4). అవివాహితుల వ్యభిచార నేరానికి వంద కొరడా దెబ్బల శిక్ష విధించాలి (24:2). వివాహితుల వ్యభిచారానికి శిలాశిక్ష విధించాలి.

**తాజిరాత్:** మద్యపానం, జూదం, మోసం, అక్రమార్జన వంటి నేరాలకు న్యాయ స్థానాలు పరిస్థితుల్ని పరిశీలించి జరిమానా, జైలునిర్బంధం, కొద్దిపాటి కొరడా దెబ్బలు, సంఘబహిష్కరణ, దేశబహిష్కరణ వగైరా శిక్షలు విధిస్తాయి.

నేరనిరూపణ అయిన తరువాత వ్యభిచారికి, వ్యభిచారిణికి విధించవలసిన శిక్షల విషయంలో ఇమాముల మధ్య కాస్తంత భేదాభిప్రాయాలు ఉన్నాయి.

వివాహిత స్త్రీపురుషులు చేసే వ్యభిచార నేరానికి వంద కొరడాదెబ్బలతో పాటు శిలాశిక్ష కూడా విధించాలని ఇమామ్ అహ్మద్, దావూద్ జాహిరి, ఇస్‌హాఖ్ ప్రముఖులు

అభిప్రాయపడ్డారు. వారు తప్ప ఇతర ఇమాములు, ధర్మశాస్త్రవేత్తలంతా ఈ నేరానికి శిలాశిక్ష మాత్రమే విధించాలని అన్నారు.

అవివాహిత స్త్రీపురుషులు చేసే వ్యభిచార నేరానికి వంద కొరడాదెబ్బలతో పాటు సుదూర ప్రాంతానికి బహిష్కరణ లేక జైలునిర్బంధం వంటి శిక్షలు కూడా విధించాలని కొందరు ఇమాములు అభిప్రాయపడ్డారు. ఇమాం అబూహనీఫా, ఆయన అనుచరులైన ఇమామ్ అబూయూసుఫ్, ఇమామ్ జాఫర్, ఇమామ్ ముహమ్మద్‌లు వంద కొరడా దెబ్బల శిక్ష మాత్రమే విధించాలని అన్నారు.

"వివాహిత స్త్రీపురుషుల వ్యభిచార నేరాలకు దైవప్రవక్త (స) శిలాశిక్షతో పాటు, సుదూరప్రాంత బహిష్కరణ, జైలు నిర్బంధం వంటి తాజీరీ శిక్షలు కూడా విధించినట్లు ఏ హదీసులో కూడా లేదు." (మౌలానా మౌదూది-తఫ్‌హీముల్ ఖుర్‌ఆన్)

వ్యభిచార శిక్ష అమలుజరిపే తీరును గురించి అనేక హదీసులు, ఫిఖావేత్తల అభిప్రాయాలు ఉన్నాయి. వాటన్నిటిని పరిశీలిస్తే ఈక్రింది విషయాలు తెలుస్తాయి:

★ కొరడా లేక బెత్తం మరీఅంత గట్టిగాగాని, మరీఅంత నాసిరకంగాని కాకుండా మధ్యరకంగా ఉండాలి.

★ అలాగే దెబ్బలు చరిచేవాడు మరీఅంత కఠినంగాగాని, మరీఅంత మృదువుగాగాని ప్రవర్తించకూడదు.

★ కొట్టిన చోటే మళ్ళీ మళ్ళీ కొట్టకూడదు.

★ ముఖం, మర్మాంగం, శిరస్సులపై కొట్టకూడదు.

★ నేరస్థుడ్ని కట్టివేసి కొట్టకూడదు. పురుషుడైతే నిలబెట్టి కొట్టాలి; స్త్రీ అయితే కూర్చోబెట్టి కొట్టాలి.

★ శిక్ష అమలు చేస్తున్నప్పుడు నేరస్థుడు ధరించివున్న బట్టలు తీసెయ్యకూడదు. లావుపాటి బట్టలుంటే తీసేసి సాధారణ దుస్తులు ధరింపజేయవచ్చు.

★ వాతావరణంలో తీవ్రమైన ఉష్ణోగ్రతగాని, తీవ్రమైన చలిగాని ఉన్న సమయాల్లో కొట్టకూడదు. వేసవికాలంలో చల్లని సమయంలో, శీతాకాలంలో వేడి సమయంలో మాత్రమే కొట్టాలి.

★ నేరస్థుడు వ్యాధిగ్రస్తుడైవుంటే వ్యాధి నుండి కోలుకొని పూర్తిగా ఆరోగ్యవంతుడయిన తరువాతే శిక్షించాలి.

★ వ్యాధి నుండి ఇక ఎన్నటికీ కోలుకునే ఆశలేకపోతే లేదా వృద్ధాప్యంతో చాలా బలహీనమైపోయివుంటే వంద ఈనెలు ఉండే ఈనెలకట్టతో ఒకసారి మాత్రమే కొట్టాలి.

★ గర్భిణికి కొరడాదెబ్బలు కొట్ట వలసివచ్చినప్పుడు ప్రసవించిన తరువాత ప్రసవమైల దినాలు గడచిపోయే వరకు వేచివుండాలి.

★ గర్భిణికి శిలాశిక్ష అమలు జరపవలసివస్తే పుట్టే బిడ్డకు పాలుమాన్పించే



కాలం దాకా వేచివుండాలి.

★ దెబ్బలు తలారుల చేత కొట్టించకూడదు. శిక్షల్ని గురించి షరీఅత్ ఉద్దేశ్యం బాగా తెలిసిన ముస్లింల చేతనే కొట్టించాలి.

★ నేరం సాక్షుల ద్వారా రుజువయితే సాక్షుల చేతనే దెబ్బల ప్రారంభం కావాలి. నేరస్థుడు స్వయంగా నేరం ఒప్పుకుంటే దెబ్బల ప్రారంభం న్యాయాధికారి చేయాలి.

ఇవీ ఇస్లామీయ న్యాయవ్యవస్థ రూపురేఖలు. పైన పేర్కొనబడిన సాక్ష్య పద్ధతిని, విచారణ విధానాన్ని, శిక్షలు అమలుజరిపే తీరును పరిశీలించే న్యాయప్రియులకు, సంఘశ్రేయోభిలాషులకు ఇస్లాం వ్యక్తిసంస్కరణను, సమాజశ్రేయస్సును మాత్రమే కోరుకుంటుందని సులభంగా గ్రహించగలుగుతారు.

ఇస్లామీయ న్యాయవ్యవస్థ రూపురేఖలతో ఈనాటి పాశ్చాత్య న్యాయవ్యవస్థలు, వాటి అడుగుజాడల్లో నడచుకునే ఇతర న్యాయవ్యవస్థల తీరుతెన్నుల్ని పోల్చిచూడండి. నిజమైన న్యాయం ఏవ్యవస్థలో ఉందో, అన్యాయం-అక్రమాలకు ఏవ్యవస్థ చోటిస్తుందో ప్రశాంత మనస్సుతో ఆలోచించేవారే అర్థం చేసుకోగలుగుతారు.

## నష్ట పరిహారం

ఇస్లాంలో హంతకునికి మరణశిక్ష తప్పనిసరిగా విధించాలన్న రూల్ లేదు. హతుని బంధువులు హంతకుడ్ని క్షమించడం జరిగితే లేదా వారు రాజీపడి హంతకుడి బంధువుల నుండి రక్తపరిహారం స్వీకరించడం జరిగితే హంతకుడికి మరణశిక్ష తప్పుతుంది.

"ఒకవేళ హంతకుని పట్ల అతని సోదరుడు (హతుని బంధువు) మృదువైఖరి అవలంబించడానికి సిద్ధపడితే, రక్తపరిహార సమస్య సామరస్యంగా పరిష్కారమవ్వాలి. దానిప్రకారం హంతకుడు నిర్ణీత రక్తపరిహారాన్ని సంతోషంగా ఇచ్చేయాలి. ఇది మీప్రభువు నుండి లభిస్తున్న సౌలభ్యం, దైవానుగ్రహం." (ఖుర్‌ఆన్-2:178)

"పొరపాటున తప్ప తోటి విశ్వాసిని హతమార్చడం ఏ విశ్వాసికీ శోభించదు. ఒకవేళ పొరపాటున హతమార్చడం జరిగితే అందుకు ఒక బానిసముస్లింకు స్వేచ్ఛనివ్వాలి. మరోవైపు హతుని వారసులకు రక్తపరిహారం కూడా చెల్లించాలి. ఒకవేళ వారు క్షమిస్తే అది వేరేవిషయం. అయితే హతుడు మీ శత్రువర్గానికి చెందినవాడయి, అతను విశ్వాసి కూడా అయివుంటే, ఒక ముస్లిం బానిసకు స్వేచ్ఛనిస్తే చాలు. హతుడు మీరు శాంతి ఒడంబడిక చేసుకున్న జాతికి చెందినవాడైవుంటే, మీరు హతుని వారసులకు రక్తపరి హారంతోపాటు ఒక బానిసముస్లింకు సేచ్ఛ కూడా ఇవ్వాలి. స్వేచ్ఛ నివ్వడానికి బానిస లేకపోతే హంతకుడు వరుసగా రెండు నెలలు ఉపవాసం పాటించాలి." (ఖుర్‌ఆన్-4:92)

హజ్రత్ అబూహురైరా (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ప్రవచనం: "నోరులేని జీవి ఎవరినైనా గాయపరిస్తే లేదా చంపితే దానికి ఎలాంటి నష్టపరిహారం లేదు. అలాగే ఎవరైనా నూతిలో లేదా గనిలో పడి చనిపోతే లేక గాయపడితే దానిక్కూడా నష్టపరిహారం లేదు. భూమి నుండి ఏవైనా నిధినిక్షేపాలు బయల్పడితే అందులో అయిదో భాగం బైతుల్‌మాల్ (ప్రభుత్వ ధనాగారం)కు ఇచ్చివేయాలి." (బుఖారి, ముస్లిం)

ఇమామ్ నవవీ (రహ్మలై) ప్రకారం జంతువు పగలుగాని, రాత్రిగాని నష్టపరిస్తే అందులో దాని యజమాని తప్పేమీ లేకపోతే లేదా దానివెంట దాని యజమాని లేకపోతే ఎలాంటి నష్ట పరిహారం లేదు. ఒకవేళ జంతువుని తోలేవాడు లేక దానిపై స్వారీ చేసేవాడు గనక ఉండి ఆ జంతువు ఏదైనా హాని కలిగించిన పక్షంలో యజమాని నష్టపరిహారం (Copensation) చెల్లించాలి. ఇమామ్ దావూద్ (అలై), అహ్లెజాహిర్ ధర్మవేత్తల ప్రకారం యజమాని జంతువుని ఉసిగొల్పితే తప్ప మరేవిధంగా అది హాని కలిగించినా నష్టపరిహారం చెల్లించనవసరం లేదు. ఇమామ్ మాలిక్ (రహ్మ) ప్రకారం యజమాని నష్టపరిహారం చెల్లించాలి. ఇమామ్ షాఫయి (రహ్మ) ప్రకారం హాని కలిగించే అలవాటున్న జంతువుని కట్టివేయకుండా విచ్చలవిడిగా వదలి పెడితే యజమాని నష్టపరిహారం చెల్లించవలసి ఉంటుంది.

ఎవరైనా తన సొంత భూమిలో లేదా బంజరు భూమిలో బావిగాని, గనిగాని తవ్వి ఉన్నప్పుడు అందులో ఎవరైనా పడి గాయపడితే లేదా చనిపోతే తవ్విన లేక తవ్వించిన వ్యక్తి ఎలాంటి నష్టపరిహారం చెల్లించనవసరం లేదు. అయితే రహదారిలో లేదా ఇతరుల భూమిలో బావిగాని, గనిగాని తవ్వితే నష్టపరిహారం చెల్లించవలసి ఉంటుంది.

దొంగతనం, వ్యభిచారం, మానభంగం వ్యవహారాల్లో నష్టపరిహారం ప్రసక్తే లేదు. వాటికి చట్టం ప్రకారం శిక్షలు అనుభవించవలసిందే.

# VI. నైతిక వ్యవస్థ

మనిషి అన్నాక నీతి ఎంతో అవసరం. ఆ నీతే లేకపోతే మనిషి పశువుకన్నా నికృష్టుడవు తాడు. అందుకే మన తెలుగునాట "నీతి లేనివాడు కోతికంటే పాడు" అన్న సామెత పుట్టింది. ఈ సామెత ప్రాతిపదికపైనే నీతిశతకాలు కూడా వెలువడ్డాయి. ఇక ఇస్లాంలోని ప్రతి ఆదేశం లోనూ నీతి సౌరభమే మనం ఆఘ్రాణిస్తాం. ఇస్లాంలోని విశ్వాసాలు, ఆరాధనలు, ఆదేశాలన్నీ మనిషిని నైతికంగా తీర్చిదిద్దడానికే నిర్దేశించబడ్డాయి. మనిషి మసీదులోనే కాదు, మార్కెట్లో, కార్యాలయంలో, కర్మాగారంలో, చట్టసభలో సైతం నీతిని వదలిపెట్టరాదని ఇస్లాం చెబుతోంది. ముఖ్యంగా మానవహక్కుల విషయంలో మనిషి చాలాజాగ్రత్తగా ఉండాలి. అసలు మహాప్రవక్త ముహమ్మద్ (స) వచ్చింది లోకంలో నీతిని నెలకొల్పడానికే. ఈక్రింది హదీసులు చూడండి:

ఇమామ్ మాలిక్ (రహ్మ) ప్రకారం దైవప్రవక్త (స) ప్రవచనం: "అత్యున్నత నైతిక ప్రమాణాల పరిపూర్తి కోసమే నన్ను పంపడం జరిగింది." (ఇమామ్‌మాలిక్-మువత్తా)

హజ్రత్ అబూహురైరా (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ఇలా అన్నారు: "విశ్వాసులలో అందరికంటే గొప్ప సద్గుణసంపన్నుడే విశ్వాసంలోనూ పరిపూర్ణుడు." (అబూదావూద్)

హజ్రత్ అబూదర్దా (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ప్రవచనం: "దేవుని త్రాసులో మంచి నడవడిక కంటే బరువైన వస్తువు మరేదీ లేదు." (అబూదావూద్, తిర్మిజి)

హజ్రత్ ఇబ్నెఉమర్ (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ప్రవచనం: "దైవభీతి, సద్గుణం స్వర్గ ప్రవేశానికి ఎక్కువ దోహదకారి అవుతాయి." (తిర్మిజి)

దైవప్రవక్త (స) హితోక్తి: "ఏ విషయాలు ప్రజలను ఎక్కువగా స్వర్గంలో ప్రవేశింప జేస్తాయో మీకు తెలుసా? అవి దైవభీతి, సత్ప్రవర్తన. ఏ విషయాలు ప్రజలను ఎక్కువగా నరకాగ్ని వైపు తీసికెళ్తాయో మీకు తెలుసా? అవి నోరు, మర్మావయవం." (మిష్కాత్)



# 79. సత్యం-అసత్యం

"విశ్వాసులారా! మీరు చేయనిదాన్ని గురించి మాట్లాడుతారెందుకు? చేయనిదాన్ని గురించి చెప్పుకోవడం దేవునికి చాలా అప్రియమైన విషయం." (ఖుర్ఆన్-61:2,3)

హజ్రత్ ఇబ్నె మస్ఊద్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (స) ఇలా బోధించారు: "నిస్సందేహంగా సత్యం సత్కార్యాల వైపుకు నడిపిస్తుంది. సత్కార్యాలు స్వర్గం వైపుకు దారి తీస్తాయి. ఎవడైనా (నిత్యం) సత్యం పలుకుతుంటే, చివరికతను సత్యసంధుడని దేవుని వద్ద వ్రాయబడతాడు. నిస్సందేహంగా అబద్ధం పాపకార్యాల వైపుకు గొనిపోతుంది. పాపకార్యాలు నరకానికి చేర్చుతాయి. ఎవడైనా (ఎల్లప్పుడూ) అబద్ధమే పలుకుతుంటే, అతను దేవుని వద్ద అబద్ధాలరాయుడిగా వ్రాయబడతాడు." (బుఖారీ, ముస్లిం)

హజ్రత్ అబూముహమ్మద్ హసన్ బిన్ అలి (రజి) కథనం: నాకు దైవప్రవక్త (స) చెప్పిన ఈ వాక్యాలు గుర్తున్నాయి: "నిన్ను సంశయంలో పడవేసే ఏ పనైనాసరే. నిన్ను సందిగ్ధానికి లోనుచెయ్యని పని మాత్రమే నెరవేర్చు. నిస్సందేహంగా నిజం చెప్పటం మనసుకు నెమ్మదినిస్తుంది. అబద్ధం మనసులో అలజడి రేపుతుంది." (తిర్మిజీ)

హజ్రత్ ఉమ్మెకుల్సూమ్ (రజి) కథనం: దైవప్రవక్త (స) ఇలా అన్నారు- "ప్రజల మధ్య సంబంధాలను చక్కదిద్దే (ఉద్దేశ్యంతో వాస్తవానికి విరుద్ధంగా మాట్లాడే) వాడు అబద్ధాలకోరు కాజాలడు. అతను మంచిమాటలే చేరవేస్తాడు. ఏది చెప్పినా సదుద్దేశం తోనే చెబుతాడు." దైవప్రవక్త (స) ప్రజలకు మూడు విషయాల్లో తప్ప మరే విషయం లోనూ వాస్తవానికి విరుద్ధంగా మాట్లాడేందుకు అనుమతి ఇచ్చినట్లు నేను వినలేదు. ఆ మూడు విషయాలు ఇవి- 1-యుద్ధంలో, 2-ప్రజల మధ్య సంబంధాలు చక్కదిద్దే విషయంలో, 3-మనిషి తన భార్యతోగాని, భార్య తన భర్తతోగాని (పరస్పరం సంతోషపెట్టే ఉద్దేశ్యంతో) సంభాషించుకున్నప్పుడు. (ముస్లిం)

## అబద్ధం అనర్థాల నిలయం

"దేవుని సూక్తులు విశ్వసించనివారే అబద్ధాలు పలుకుతారు." (16:105); "అబద్ధాల కోరు, దుష్కర్ముడయిన ప్రతివాడికీ వినాశం (రాసిపెట్టి) ఉంది." (ఖుర్ఆన్-45:7)

ఈనాటి ముస్లింలలో అనేకమంది అబద్ధాన్ని అలవోకగా చెప్పగలుగుతున్నారంటే, నేరం చేసి నరకశిక్ష సంపాదించుకోవడానికి కూడా ఎంతో సాహసం కావాలి మరి! కొందరు చిన్నచిన్న స్వార్థప్రయోజనాల కోసం సైతం చీటికిమాటికి అబద్ధాలాడుతారు.

"కనుక విగ్రహాల మాలిన్యానికి దూరంగా ఉండండి, అసత్యం పలకడాన్ని విడనాడండి." (ఖుర్ఆన్-22:30)

అబద్ధం అనేక అనర్థాలకు, నీతిమాలిన పనులకు దారితీస్తుంది. అబద్ధమాడనని, ఎల్లప్పుడు సత్యమే పలుకుతానని గట్టిగా నిర్ణయించుకున్న వ్యక్తి దౌర్జన్యం, దొంగతనం, వ్యభిచారం, మద్య సేవనం చేయలేడు. కారణం విచారణ జరిగితే అతను నిజం చెబుతాడు. తత్ఫలితంగా దేహశుద్ధి జరుగుతుంది. అందువల్ల నిజం చెప్పే మనిషి ఈ చెడులే గాక, ఇతర చెడులు కూడా మానుకుంటాడు. అబద్ధం గురించి దైవప్రవక్త (స) ఇలా చెప్పారు:

"అబద్ధమాడటం ఎట్టి పరిస్థితిలోనూ ధర్మసమ్మతం కాదు. సీరియస్‌గా నైనా, పరిహాసంగానైనా అబద్ధమాడరాదు. మీ పిల్లలకు ఏదైనా ఇస్తామని చెప్పి, ఇవ్వకపోతే అది కూడా ధర్మసమ్మతం కాదు." (అల్ అదబుల్ మఫ్రద్)

హజ్రత్ అబ్దుల్లా బిన్ ఆమిర్ (రజి) కథనం: ఒకరోజు దైవప్రవక్త (స) మా ఇంట్లో ఉన్నప్పుడు మా అమ్మ నన్ను పిలుస్తూ "బాబూ! ఇటురా. నీకో వస్తువు ఇస్తాను" అని అన్నది. దైవప్రవక్త (స) ఈమాట విని "నువ్వీ అబ్బాయికి ఏమివ్వదలిచావు?" అని అడిగారు. దానికి మా అమ్మ "నేను వీడికి ఖర్జూరం ఇవ్వదలిచాను" అన్నది. అప్పుడు దైవప్రవక్త (స) "నువ్వు గనక ఇతనికి ఖర్జూరం ఇవ్వకపోతే నీ కర్మల చిట్టాలో ఒక అబద్ధం వ్రాయబడుతుంది" అని అన్నారు. (అబూదావూద్)

దైవప్రవక్త (స) ప్రవచనం: "నీవు అసత్యమైన ఒక విషయాన్ని నీ సోదరునికి నిజమని నమ్మేటట్లు చెప్పడం మహా విశ్వాసఘాతుకం." (అబూదావూద్)

దైవప్రవక్త (స) ప్రవచనం: "ప్రజలను నవ్వించడానికి అబద్ధాలు చెప్పేవాడికి వినాశం తప్పదు, వినాశం తప్పదు, వినాశం తప్పదు." (తిర్మిజి)

అబ్దుర్రహ్మాన్ బిన్ అబూబకర్ (రజి) కథనం: దైవప్రవక్త (సల్లం) ఓరోజు మమ్మల్ని ఉద్దేశించి "నేను మీకు అన్నిటికంటే ఘోరమైన పాపాలను గురించి తెలియజేయనా?" అని అడిగారు. ఈమాట ఆయన మూడుసార్లు అన్నారు. దానికి మేము "తప్పకుండా తెలియజేయండి దైవప్రవక్తా!" అన్నాం. అప్పుడాయన "దేవునికి ఇతరుల్ని సాటి కల్పించడం, తల్లిదండ్రుల మాట వినకపోవడం" అని చెప్పారు. ఆ తరువాత ఆయన (గోడకు) ఆనుకొని కూర్చున్నవారల్లా ఒక్కసారిగా లేచి నిటారుగా కూర్చొని "జాగ్రత్త! అబద్ధమాడటం (అన్నిటికంటే ఘోరపాపం)" అన్నారు. ఇలా ఆయన మాటిమాటికి చెబుతూపోయారు. చివరికి మేము మనసులో "అయ్యో! ఈయనీ మాటలు ఇకచాలిస్తే బాగుండు" అనుకున్నాం. (బుఖారి, ముస్లిం)

హజ్రత్ సమురా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (స) ఇలా అన్నారు: "తాను అబద్ధం చెబుతున్నానని తెలిసి కూడా ఎవరైనా ఒక విషయం గురించి అది నేను అన్న మాట అని చెబితే అతనూ అబద్ధాలకోరుగానే పరిగణించబడతాడు." (ముస్లిం)

హజ్రత్ అబూహురైరా (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ఇలా అన్నారు: "విన్న ప్రతి మాటను (నిజానిజాలు తెలుసుకోకుండా) వ్యాపింపజేయడం చాలు, ఒక మనిషి అబద్ధాలకోరు అని చెప్పటానికి" (ముస్లిం)

## వాగ్దానం, ప్రమాణం, మోసం, నిజాయితి

"(వాగ్దానం)ఒప్పందం నెరవేర్చండి. (వాగ్దానం)ఒప్పందం గురించి మీరు తప్పనిసరిగా (దేవుని ముందు) సమాధానం చెప్పుకోవలసి ఉంటుంది." (ఖుర్ఆన్-17:34)

"దేవుని విషయంలో మీరు చేసిన ప్రమాణాన్ని నిలబెట్టుకోండి. మీరు విషయాన్ని గుర్తుంచుకుంటారని దేవుడు మీకిలా హితోపదేశం చేస్తున్నాడు." (ఖుర్ఆన్-6:152)



"దేవునిపేరుతో మీరు చేసిన ప్రమాణం, ఒప్పందాలను స్వల్పమూల్యానికి అమ్మకండి. మీరు గ్రహించగలిగితే దేవుని దగ్గరున్నదే మీకోసం ఎంతో శ్రేష్ఠమైనది." (16:95); "దేవునిపేరుపై మీరేదైనా వాగ్దానంచేస్తే దాన్నినెరవేర్చండి. అలాగే దేవునిసాక్షిగా ప్రమాణం చేస్తే దాన్ని భంగపరచకండి." (16:91); "వారు తమ అప్పగింతలు, ప్రమాణాలు, ఒప్పం దాల విషయంలో నిజాయితీగా వ్యవహరిస్తారు." (ఖుర్ఆన్-23:8)

"కష్టపడి నూలువడికి దాన్ని చేజేతులా ముక్కలుముక్కలుగా త్రెంచివేసిన స్త్రీలా మీ పరిస్థితి మారకూడదు. ఒకజాతి మరొకజాతి కంటే ఎక్కువ ప్రయోజనాలుపొందే ఉద్దేశంతో మీరు పరస్పరం మోసగించుకోవడానికి మీ ప్రమాణాలను పనిముట్లుగా వాడుతున్నారు. కాని దేవుడు వీటిద్వారా మిమ్మల్ని పరీక్షకు గురిచేస్తున్నాడు." (ఖుర్ఆన్-16:92)

దైవప్రవక్త (స) హితోక్తి :"విశ్వాసి ఒక రంధ్రం గుండా రెండుసార్లు నెట్టబడలేడు."(ముస్లిం)

అంటే విశ్వాసి ఒకసారి మోసానికి గురయినప్పటికీ ఆ తరుతైనా అప్రమత్తంగా ఉంటూ మోసానికి గురికాలేడని, గురికాకూడదని అర్థం.

దైవప్రవక్త (స) హితోక్తి: "బూటకాలు, కల్లబొల్లి మాటలు చెప్పి ప్రజలను నవ్వించే వాడికి వినాశం ఉంది, వినాశం ఉంది, వినాశం ఉంది." (బులూగుల్‌మరాం)

హజ్రత్ ఉమ్మె కుల్సూమ్ (రజి) ప్రకారం దైవప్రవక్త ఇలా చెప్పారు: "ప్రజల మధ్య సత్సంబంధాలు ఏర్పరచే ఉద్దేశ్యంతో ఇతరులకు మంచిమాటలు చేరవేసేవాడు, మంచి మాటలు పలికేవాడు అబద్ధాలకోరు కాడు. (బుఖారీ, ముస్లిం)

హజ్రత్ అబూఉమామా ఇయాస్ బిన్ సాలబా హారిసీ (రజి) కథనం: దైవప్రవక్త (స) "(అసత్య) ప్రమాణం ద్వారా ఒక ముస్లిం హక్కు కాజేసేవాడికి దేవుడు స్వర్గాన్ని నిషేధించి, నరకాన్ని తప్పనిసరి చేస్తాడు" అని చెప్పారు. అది విని ఒకతను "అది మామూలు వస్తువైనా (అంతటి శిక్ష పడుతుందా) దైవప్రవక్తా?" అనడిగాడు. అందు కాయన, "అది 'పీలూ' చెట్టు కొమ్మయినా సరే" అన్నారు. (ముస్లిం)

హజ్రత్ అనస్(రజి) కథనం: దైవప్రవక్త (స) ఎప్పుడు ఉపన్యాసమిచ్చినా అందులో "ఎవరిలో నిజాయితీ లేదో అతనిలో విశ్వాసం లేదు; ఎవరికి ప్రతిజ్ఞ, ప్రమాణాల పట్ల గౌరవం లేదో అతనిలో ధర్మం లేదు" అని తప్పక చెబుతుండేవారు. (మిష్కాత్)

# 80. దౌర్జన్యం, దురభిమానాలు

మనిషి హృదయంలో ద్వేషం, దురభిమానాలు గనక గూడు కట్టుకోవడం ప్రారంభిస్తే అవి ఓ పట్టాన అతడ్ని వదలవు. క్రమక్రమంగా అవి తీవ్రమైన ప్రతీకారం రూపుదాల్చి చివరికి హింసా, హత్యాకాండలకు దారితీస్తాయి. ద్వేషం, దురభిమానాలు మనిషికి పరలోకంలోనే కాదు, ఇహలోకంలో కూడా వినాశం తెచ్చిపెడ్తాయి. కనుక విశ్వాసి (మోమిన్) వీటి పట్ల ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలి.

దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "ప్రళయదినాన దౌర్జన్యం (దౌర్జన్యపరుడికి) అంధకారంగా మారుతుంది."(బుఖారి)

మహాప్రవక్త (స) మహితోక్తి :- "పీడితుడు తన హక్కు ఇప్పించమని మాత్రమే దేవుడ్ని మొరపెట్టుకుంటాడు; దేవుడు ఏ హక్కుదారునికీ అతని హక్కు ఇప్పించకుండా ఉండడు. కాబట్టి పీడితుని శాపానికి, ఆర్తనాదాలకు భయపడండి." (మిష్కాత్)

దైవప్రవక్త (స) మాట్లాడుతూ "దేవుడు దౌర్జన్యపరుడికి (హద్దు మీరేదాకా) విడుపు ఇస్తాడు. చివరికి దేవుడు అతడ్ని పట్టుకుంటే ఇక అతడ్ని (శిక్షించకుండా) వదలిపెట్టడు" అని అన్నారు. ఆ తర్వాత ఆయన ఖుర్‌ఆన్‌లోని ఈ సూక్తి పఠించారు- 'నీ ప్రభువు ఏదైనా పట్టణాన్ని పట్టుకోవడంజరిగితే (ఇక దానికి వినాశనం మూడినట్లే.) ఆయన పట్టు చాలా కఠినంగా, ఎంతో బాధాకరంగా ఉంటుంది." (11:102)- (బుఖారి)

దైవప్రవక్త (స) హితోక్తి: "నేను మీమధ్య న్యాయం చేకూర్చడానికి పంపబడ్డాను." "ఎవరైనా ఓ జానెడు భూమి అయినా బలవంతంగా స్వాధీనం చేసుకుంటే దేవుడు అతని మెడలో ఏడు భూమండలాల కంఠపాశం వేస్తాడు." (ముస్లిం)

ఔస్ బిన్ షుర్జీల్ (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ప్రవచనం: "ఒకవ్యక్తి దుర్మార్గు డని తెలిసి కూడా ఎవరైనా అతడ్ని సమర్థిస్తే అలాంటివాడు ఇస్లాం నుండి బయటికి వెళ్ళిపోయినట్టే." (మిష్కాత్)

హజ్రత్ అబూఫసీలా (రజి) కథనం: "మేము మా (జాతి)వారిని అభిమానించడం దురభిమానం అవుతుందా?" అని నేను దైవప్రవక్త (స)ను అడిగాను. దానికి ఆయన "కాదు, ఇది దురభిమానం కాదు. దౌర్జన్య కార్యకలాపాలలో మనిషి తన (కులం, తెగ, జాతి) వారికి సహాయపడటమే దురభిమానం కిందికి వస్తుంది" అనిఅన్నారు. (మిష్కాత్)

దైవప్రవక్త (స) ప్రవచనం: "అధర్మం, అక్రమ పనులలో తన తెగ (కులం, జాతి, వర్గం)వారికి సహకరించేవాడు బావిలో పడిపోతున్న ఒంటె తోక పట్టుకొని ఆ ఒంటెతో పాటు తానూ బావిలో పడిపోయే వ్యక్తి లాంటివాడు." (అబూదావూద్)

దైవప్రవక్త (స) హితోక్తి: "దురభిమానం వైపు పిలిచేవాడు మనలోనివాడు కాడు. దురభిమానంతో యుద్ధం చేసేవాడు కూడా మనలోనివాడు కాడు. దురభిమానంతో రగిలిపోయే స్థితిలో చనిపోయేవాడు కూడా మనలోనివాడు కాడు." (అబూదావూద్)

## 81. సహనం, సాహసం

సహనం సాహసానికి ప్రతిరూపం. స్థిరత్వం సహనానికి దర్పణం. సహనం, సాహసం, స్థిరత్వాలు ఒకదానికొకటి అవినాభావ సంబంధాలు కలిగిన సుగుణాలు, విశ్వాసికి తప్పక ఉండవలసిన లక్షణాలు. వాటిని గురించి ఈక్రింది ఖుర్‌ఆన్ సూక్తులు గమనించండి:

"దేవుడే తమ ప్రభువని పలికి, ఆమాట పైన్నే స్థిరంగా ఉండేవారికి ఎలాంటి భయం గాని దుఃఖంగాని ఉండదు. అలాంటివారికే స్వర్గప్రవేశం లభిస్తుంది." (46:13,14)

"విశ్వాసులారా! సహనం వహించి, ప్రార్థన చేస్తూ (మా) సహాయం అర్థిస్తూ ఉండండి. దేవుడు సహనం వహించేవారికే తోడుగా ఉంటాడు." (2:153); "సహనం వహించేవారికి మేము వారి సత్కర్మలకు తప్పక శ్రేష్ఠమైన ప్రతిఫలం ప్రసాదిస్తాం." (16:96)



"ముస్లిములారా! (భవిష్యత్తులో) మీరు ధనప్రాణాల విషయంలో అనేక కఠిన పరీక్ష లకు గురికావలసి వస్తుంది. అదీగాక మీరు గ్రంథప్రజల నుండి, బహుదైవారాధకుల నుండి కూడా మనస్సు నొప్పించే మాటలు అనేకం వినవలసి వస్తుంది. కనుక అలాంటి స్థితిలో మీరు సహనం వహించి, భయభక్తులతో కూడిన జీవితం గడుపుతూ ధర్మమార్గంలో స్థిరంగా ఉండాలి. నిజంగా ఇది ఎంతో సాహసోపేతమైన కార్యం." (3:186)

"మీరు ప్రతీకారం తీర్చుకోదలచుకుంటే మీపై ఏమేరకు దౌర్జన్యం జరిగిందో ఆమేరకే ప్రతీకారం తీర్చుకోండి. కాని మీరు సహనం వహిస్తే (మంచిది)." (ఖుర్‌ఆన్-16:126)

విశ్వాసులారా! సహనం పాటించండి. మిథ్యావాదుల ముందు ధైర్యసాహసాలు ప్రదర్శించండి. ధర్మసేవ కోసం నడుం బిగించండి. దేవుని పట్ల భయభక్తులు కలిగిఉండండి. అప్పుడే మీరు (ఇహపరాల్లో) కృతార్థులవుతారని ఆశించగలరు. (ఖుర్‌ఆన్-3:200)

హజ్రత్ అబూసయీద్ సాద్ బిన్ సినాన్ ఖుద్రీ (రజి) కథనం: కొందరు అన్సారులు దైవప్రవక్త (స)ను యాచించారు. దైవప్రవక్త (స) వారడిగింది ఇచ్చారు. వాళ్ళు మళ్ళీ యాచించారు. అప్పుడు కూడా ఆయన వారికి ఇచ్చారు. చివరికి దైవప్రవక్త (స) దగ్గర ఉన్నదంతా అయిపోయింది. చేతిలో ఉన్నదంతా అయిపోయిన తరువాత ఆయన వారితో ఇలాఅన్నారు: "నా దగ్గరకు ధనం ఎంత వచ్చినా నేను దాన్ని నిల్వచేసి ఉంచు కోను. దేవుడు యాచించకుండా ఉండటానికి ప్రయత్నించేవాడ్ని కాపాడుతాడు; నిరపేక్షా భావం అలవరచుకోవాలనుకున్న మనిషిని నిరపేక్షాపరునిగా చేస్తాడు; సహనం కోరే వ్యక్తికి సహనం వహించే సద్బుద్ధి ప్రసాదిస్తాడు. మనిషికి ఇవ్వబడిన కానుకల్లో సహనం కంటే శ్రేష్ఠమైన గొప్ప కానుక మరేదీ లేదు." (బుఖారీ, ముస్లిం)

దైవప్రవక్త (స) హితోక్తి : "విశ్వాసి వ్యవహారం చాలా వింతగా ఉంది. అతను చేసే ప్రతిపనిలో అతనికి మేలుంటుంది. విశ్వాసికి తప్ప మరెవరికీ ఈభాగ్యం ప్రాప్తించలేదు. అతనికి ఆనంద ఘడియల్లో అతను దైవానికి కృతజ్ఞతలు సమర్పించుకుంటాడు. ఈ కృతజ్ఞత వల్ల అతనికే మేలు కలుగుతుంది. (పుణ్యం లభిస్తుంది). ఒకవేళ కష్టాలు వస్తే సహనం వహిస్తాడు. ఈ సహనం కూడా అతనికి మేలే కలగజేస్తుంది." (ముస్లిం)

హజ్రత్ ఆయిషా (రజి) ప్లేగువ్యాధి గురించి అడిగినప్పుడు దైవప్రవక్త (స) ఇలా తెలియజేశారు: "ఒకప్పుడు ఇదొక శిక్షగా ఉండేది. దేవుడు తాను తలచినవారిని దానికి గురిచేసేవాడు. ఇప్పుడు దాన్ని విశ్వాసులపాలిట కారుణ్యంగా మార్చివేశాడు. ఇక ఏ మనిషైనా ప్లేగు వ్యాధికి గురైనప్పటికీ సహనంతో పరలోక పుణ్యఫలాపేక్షతో తనకు వ్యాధిసోకిన ఊళ్లోనే ఉంటూ, దైవం తన కోసం రాసిపెట్టినదే జరుగుతుందన్న గట్టి నమ్మకం కలిగివుంటే అలాంటి వ్యక్తికి దైవమార్గంలో ప్రాణాలర్పించిన అమరవీరుడికి లభించినంత పుణ్యం లభిస్తుంది." (బుఖారీ)

దైవప్రవక్త (స) ప్రవచనం: దేవుడిలా చెబుతున్నాడు- "నేను నా దాసునికి ప్రియ మైన రెండు వస్తువులను (కళ్ళను) తీసుకొని పరీక్షించినప్పుడు అతను గనక సహనం వహిస్తే వాటికి బదులుగా నేనతనికి స్వర్గం ప్రసాదిస్తాను." (బుఖారీ)

దైవప్రవక్త (స) హితోక్తి: "ముగ్గురు కొడుకులు కోల్పోయిన (చనిపోయినపుడు సహనం వహించే) ముస్లిం నరకానికి పోడు, ప్రమాణం నెరవేర్చడానికి తప్ప." (బుఖారి)

ఖుర్ఆన్‌లో "మీలో నరకం మీదుగా పోనివారంటూ ఉండరు. ఇదొక నిర్ణయం. దాన్ని నెరవేర్చవలసిన బాధ్యత నీ ప్రభువుపై ఉంది" (19:71) అని ఉంది. పై హదీస్‌లో ప్రమాణం నెరవేర్చడానికి అంటే ఈ నిర్ణయం నెరవేర్చడమే కావచ్చు.

హజ్రత్ ఇబ్నెఅబ్బాస్ (రజి) కథనం: ఒకసారి ఓ స్త్రీ దైవప్రవక్త (స) సన్నిధికి వచ్చి 'నాకు మూర్ఛ రోగముంది. దానివల్ల నా ఒంటిపై ఆచ్ఛాదనం తొలగిపోతోంది. (ఈవ్యాధి నయంకావాలని) నా కోసం దుఆ చేయండి" అని విన్నవించుకుంది. దైవప్రవక్త ఈమాట విని "నువ్వు గనక ఈ బాధలో సహనం వహిస్తే నీకు స్వర్గం లభిస్తుంది లేదా నువ్వు కోరితే దేవుడు నీకు ఈవ్యాధి నుండి ఉపశమనం కలిగించాలని నేను దుఆ చేస్తాను" అన్నారు. అందుకామె "సరే అలాగైతే ఓర్పు వహిస్తాను. కాని (మూర్ఛ వచ్చినప్పుడు) నా ఒంటిపై ఆచ్ఛాదనం తొలగిపోతోంది. నేను నగ్నం కాకుండా ఉండాలని మాత్రం మీరు దైవాన్ని ప్రార్థించండి" అని అన్నది. ఆ స్త్రీ కోరిక మేరకు దైవప్రవక్త (స) ఆమె కోసం దుఆ చేశారు. (బుఖారీ, ముస్లిం)

హజ్రత్ అనస్ (రజి) కథనం: ఉమ్మెసులైమ్ (రజి) ద్వారా అబూతల్హా (రజి)కు పుట్టిన పిల్లవాడొకడు చనిపోయాడు. అప్పుడు ఉమ్మెసులైమ్ ఇంట్లో వాళ్ళని బాబు చనిపోయాడన్న సంగతి అబూతల్హాకు చెప్పవద్దని, నేనే ఆయనకు తెలియజేస్తానని చెప్పారు. (కొంత సేపటికి) అబూతల్హా (రజి) ఇంటికి వచ్చారు. ఉమ్మెసులైమ్ (రజి) ఆ రాత్రి ఆయనకు అన్నం వడ్డించారు. తర్వాత ఆమె మునుపటికన్నా బాగా అలంకరించుకొని అందంగా ముస్తాబయి భర్త దగ్గరికి వచ్చారు. ఆయన ఆమెతో సంయోగం జరిపారు. ఆయన రతిలో పూర్తిగా తృప్తిచెందారని నిర్ధారించుకున్న తర్వాత-

ఆమె తన భర్తను "అబూతల్హా! కొందరు ఓ కుటుంబానికి ఏదైనా వస్తువు తాత్కాలికంగా వాడుకోవటానికి ఇచ్చారనుకోండి. ఆ తరువాత వారు తమ వస్తువుని తిరిగిచ్చేయమని అడిగితే ఆ కుటుంబం ఇవ్వకుండా ఉండటం భావ్యమేనా?" అని ప్రశ్నించారు. దానికి అబూతల్హా (రజి) "కాదు, అది సరైన పద్ధతి కాద"ని అన్నారు. వెంటనే ఆమె "అయితే మీరు మన బాబు విషయంలో దైవం నుండి పుణ్యం ఆశించండి" అన్నారు. అబూతల్హా ఈమాట "నాకీ సంగతి ముందుగా ఎందుకు చెప్పలేదు? నేను నీతో కలిసి మలినమైన తరువాత బాబు చనిపోయాడన్న సంగతి చెబుతావా?" అని రుసరుస లాడారు. (ఆ తరువాత) ఆయన దైవప్రవక్త (స) సన్నిధికి వెళ్ళి జరిగినదంతా వివరించారు. అది విని దైవప్రవక్త (స) "మీరిద్దరు కలిసిన రాత్రిలో దేవుడు మీకు శుభం కలగజేయుగాక!" అని ప్రార్థించారు. ఆ తరువాత (కొంత కాలానికి) ఉమ్మెసులైమ్ (రజి) మళ్ళీ గర్భవతి అయ్యారు.

అనస్ (రజి) ఇలా అన్నారు: దైవప్రవక్త (స) ఓసారి (అనుచరులతో కలసి) ప్రయాణం చేస్తున్నప్పుడు, ఉమ్మెసులైమ్ కూడా (భర్తతోపాటు)ఆ ప్రయాణబృందంలో ఉన్నారు. దైవప్రవక్త (స) సాధారణంగా ప్రయాణం నుండి మదీనాకు తిరిగొచ్చినప్పుడు



రాత్రిపూట వచ్చేవారు కాదు. ప్రయాణీకుల బృందం మదీనా సమీపానికి చేరుకుంటుండగా ఉమ్మెసులైమ్‌కు పురిటినొప్పులు మొదలయ్యాయి. అబూతల్హా (రజి) ఆమె కోసం ఆగాల్సి వచ్చింది. దైవప్రవక్త (స) మాత్రం (ఆగకుండా) ప్రయాణం కొనసాగించారు.

అప్పుడు అబూతల్హా (రజి) ఇలా ప్రార్థించారు- "ప్రభూ! దైవప్రవక్త మదీనా నుండి బయటికి వెళ్ళినప్పుడు నేను కూడా ఆయనతో పాటు వెళ్ళాలనీ, ఆయన మదీనాలో ప్రవేశించేటప్పుడు ఆయనతో పాటే ప్రవేశించాలని నేను కోరుకుంటానని నీకు తెలుసు. కాని ఇప్పుడు నేను (ఇక్కడ ఆగిపోవలసి వచ్చింది)." ఉమ్మెసులైమ్ (ఆయన మాటలు విని) "అబూతల్హా! ఇంతకు ముందు నాకు కలిగిన నొప్పి ఇప్పుడు లేదు. పదండి, (మనం కూడా వెళ్ళిపోదాం)" అని అన్నారు.

తరువాత మేమందరం బయలుదేరాము. ఆ దంపతులు మదీనాకు చేరుకోగానే ఆమెకు మళ్ళీ ప్రసవవేదన మొదలయింది. (కాస్సేపటికి) ఆమెకు ఒక బాబు పుట్టాడు. అప్పుడు మాఅమ్మ (ఉమ్మెసులైమ్) నాతో "రేపు ఉదయం నువ్వు వీణ్ణి దైవప్రవక్త (స) సన్నిధికి తీసుకువెళ్ళేవరకూ వీడికి ఏ పాలూ త్రాగించకూడద"ని చెప్పింది. తెల్లవారగానే నేను ఆ పసికందును దైవప్రవక్త (స) దగ్గరికి తీసికెళ్ళాను. దైవప్రవక్త (స) నన్నుద్దేశించి "బాబుతో పాటు మరేమైనా తెచ్చావా?" అనడిగారు. దానికి నేను "కొన్ని ఖర్జూరపండ్లు తెచ్చానండీ" అన్నాను. దైవప్రవక్త (స) వాటిలో ఒక ఖర్జూరం నోట్లో వేసుకొని నమిలి తీసి ఆ పసివాడి నోట్లో పెట్టారు. ఈవిధంగా ఆయన ఆ పిల్లవాడికి ఉగ్గుపోసి 'అబ్దుల్లాహ్' అని నామకరణం చేశారు. (ముస్లిం)

# 82. తన కోపమే తన శత్రువు

కోపోద్రేకాలను గురించి దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రవచించారు:

"కోపం షైతాన్‌ప్రేరణతో వస్తుంది. షైతాన్ నిప్పుతో సృజించబడ్డాడు. నిప్పు నీటితో చల్లారుతుంది. కనుక మీరు కోపం వచ్చినప్పుడు ఉజూ చేయండి." (అబూదావూద్)

"మీలో ఎవరికైనా నిలబడి ఉన్నప్పుడు కోపం వస్తే అతను వెంటనే కూర్చోవాలి. దానివల్ల కోపం చల్లారితే సరి; లేకుంటే పడుకోవాలి." (మిష్కాత్)

"కుస్తీపట్టి ఇతరులను చిత్తుచేసేవాడు పరాక్రమశాలి కాదు. ఆగ్రహం వచ్చినప్పుడు నిగ్రహించుకునేవాడే నిజమైన పరాక్రమశాలి. (బుఖారీ, ముస్లిం)

"ఎవరు తన కోపాన్ని అణచుకుంటాడో దేవుడు అతనికి విధించే తన శిక్షను నిలిపి వేస్తాడు." (తబ్రాని)

"కోపం ప్రదర్శించే శక్తి ఉండికూడా కోపాన్ని దిగమింగేవాడ్ని దేవుడు ప్రళయదినాన సృష్టిరాసులందరి ముందుకు పిలిచి (స్వర్గంలోని) విశాలాక్షులైన సుందరాంగుల్లో నీకు నచ్చిన సుందరాంగిని ఎంపిక చేసుకోవచ్చ"ని అంటాడు. (తిర్మిజీ)

సులైమాన్ బిన్ సుర్ద్ (రజి) కథనం: నేనొకసారి దైవప్రవక్త (స) దగ్గర కూర్చొని ఉన్నప్పుడు ఇద్దరు వ్యక్తులు పరస్పరం దూషించుకుంటున్నారు. వారిద్దరిలో ఒకతని

ముఖం (కోపంతో) కందిపోయింది. నరాలు ఉబ్బిపోయాయి. అది చూసి దైవప్రవక్త (స) ఇలా అన్నారు: "నాకు ఒక సూక్తి తెలుసు. ఇతను గనక ఆ సూక్తిని పఠిస్తే ఇతని కోపం తగ్గిపోతుంది. అతను "అవూజుబిల్లాహి మినష్షయితానిర్రజీం" (శాపగ్రస్తుడైన షైతాన్ బారి నుండి దేవుని శరణుగోరుతున్నాను) అనంటే అతని కోపం చల్లారుతుంది." (ఆ తర్వాత) అక్కడివారు ఆ వ్యక్తిని ఉద్దేశించి "దైవప్రవక్త (స) నిన్ను శాపగ్రస్తుడైన షైతాన్ బారి నుండి దేవుని శరణు వేడుకోమంటున్నార"ని చెప్పారు. (బుఖారీ, ముస్లిం)

ఒకతను దైవప్రవక్త (స) దగ్గరికి వచ్చి "నాకేమైనా ఉపదేశించండి" అని అడిగాడు. దానికి ఆయన "కోపగించుకోకు" అన్నారు. అతను అనేకసార్లు అదే ప్రశ్న అడిగాడు. ప్రతిసారీ ఆయన "కోపగించుకోకు" అనే తాకీదు చేశారు. (బుఖారీ)

హజ్రత్ అనస్ (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ప్రవచనం: "విశ్వాసి నైజానికి సంబంధించిన మూడు సుగుణాలు ఉన్నాయి. 1-విశ్వాసికి కోపం వచ్చినప్పుడు అతని కోపం అతడ్ని అధర్మం, అక్రమాల వైపుకు గొనిపోదు. 2-విశ్వాసికి సంతోషం కలిగినప్పుడు ఆ సంతోషం అతడ్ని సత్యం నుండి బయటికి తీసుకుపోదు. 3-విశ్వాసి శక్తిమంతుడు అయినప్పుడు అతను ఇతరులను (అంటే బలహీనులను) దోచుకోడు." (మిష్కాత్)

## 83. దయాదాక్షిణ్యాలు

"మీరు క్షమాపణ కోరుకొని దేవుని వైపు మరలండి. నాప్రభువు ఎంతో దయామయుడు. ఆయనకు తనదాసుల పట్ల అపార ప్రేమాభిమానాలున్నాయి" (ఖుర్ఆన్–11:90)

దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "దేవుడు తన దాసుల్లో జాలిగుండెలుగల వారిపైనే జాలిచూపుతాడు." (బుఖారీ, ముస్లిం); "ప్రజలపై దయజూపని మనిషిపై దేవుడు కూడా దయజూపడు." (బుఖారీ)

దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "భూవాసులపై దయజూపండి, ఆకాశంలో ఉన్నవాడు మీపై దయజూపుతాడు." (బుఖారీ, ముస్లిం); "మీరు ఇతరులపై దయజూపండి; దేవుడు మీపై దయజూపుతాడు. మీరు ఇతరుల తప్పులు క్షమించండి; దేవుడు మీ తప్పులు క్షమిస్తాడు." (ముస్నద్ అహ్మద్)

దైవప్రవక్త (స) ప్రవచనం: "మన పిల్లలను కరుణించని, మన పెద్దలను గౌరవించనివాడు మనవాడు కాడు" (తిర్మిజి)

హజ్రత్ ఉమర్ (రజి) కథనం ప్రకారం ఒకసారి దైవప్రవక్త (స) సన్నిధికి కొందరు యుద్ధఖైదీలు తేబడ్డారు. వారిలో ఓ స్త్రీ కూడా ఉంది. ఆస్త్రీ తన పసిబిడ్డ తప్పిపోవడంతో తీవ్ర ఆందోళనపడుతూ ఎనలేని మాతృమమకారంతో, కన్పించిన ప్రతి చంటిపిల్లవాడ్ని గుండెలకు హత్తుకొని పాలు త్రాగిస్తుండేది. దైవప్రవక్త (స) ఆమెను అనుచరులకు చూపిస్తూ "ఈతల్లి తన బిడ్డను తన స్వహస్తాలతో నిప్పులోకి విసరేయగలదా?" అని అడిగారు. దానికి వారు "అలా ఎన్నటికీ చేయదు. పైగా నిప్పులో పడిపోతుంటే చూసి ఆమె పిల్లవాడ్ని కాపాడేందుకే ప్రయత్నిస్తుంది" అన్నారు. అప్పుడు దైవప్రవక్త (స) "దేవుడు తన దాసులపై కనబరిచే దయ, జాలి ఈ స్త్రీ తన బిడ్డపై కరబరిచే దయ,



జాలి కన్నా ఎంతో ఎక్కువగా ఉంటాయి" అని తెలిపారు. (బుఖారి, ముస్లిం)

దైవప్రవక్త (స) ప్రవచనం: "దేవుడు విశ్వాన్ని సృష్టించినప్పుడు తన సింహాసనం మీదున్న ప్రత్యేకగ్రంథంలో "నా ఆగ్రహం కన్నా నా అనుగ్రహమే ఎక్కువగా ఉంటుంది" అని రాశాడు. (బుఖారీ, ముస్లిం)

దైవప్రవక్త (స) హితోక్తి: "దేవుడు తన కారుణ్యాన్ని వంద భాగాలుగా చేసి తొంభై తొమ్మిది భాగాలు తన దగ్గర ఉంచుకొని ఒకభాగం మాత్రమే భూమిపై దించాడు. ఆ ఒక్కభాగం వల్లనే దేవుని సృష్టిరాసులు పరస్పరం దయదాక్షిణ్యాలతో మసలుకుంటున్నాయి. ఈ కారుణ్యం మూలంగానే జంతువు తన పిల్లకు ఎక్కడ బాధ కలుగుతుందో నన్న భయంతో తన కాలిగిట్టను జాగ్రత్తగా పైకి ఎత్తుకుంటుంది." వేరొక ఉల్లేఖనంలో అదనంగా ఇలాఉంది: "తొంభైతొమ్మిది కారుణ్య(భాగా)లను దేవుడు ప్రళయదినాన తన దాసుల కోసం ఉపయోగించడానికి తన దగ్గర ఉంచుకున్నాడు. (బుఖారీ, ముస్లిం)

### కీడు చేసినవానికి మేలు

"ఆ విజ్ఞుల జీవనసరళి ఇలా ఉంటుంది: వారు దేవునితో చేసిన ప్రమాణాన్ని నెరవేరుస్తారు....చెడుని మంచి ద్వారా నిర్మూలిస్తారు." (ఖుర్ఆన్–13:20,22)

ఎవరైనా మనకు కీడు తలపెడితే తిరిగి మనం వారికి కీడు చేయకూడదని, వారి పట్ల సత్ప్రవర్తనతో మెలగాలని ఈ సూక్తి తెలియజేస్తోంది. దైవప్రవక్త (స) ఇలా వివరించారు:

"మీరు మీ ప్రవర్తనావైఖరిని లోకుల ప్రవర్తనావైఖరికి అనుగుణంగా మార్చుకోకండి. ఇతరులు మంచిచేస్తే తామూ మంచి చేస్తామని, ఇతరులు దౌర్జన్యం చేస్తే తామూ దౌర్జన్యం చేస్తామని చెప్పడం సరికాదు. మిమ్మల్ని మీరుఒక నియమావళికి కట్టుబడి ఉండేలా రూపొందించుకోండి. ఇతరులు మేలుచేస్తే మీరూ మేలుచేయండి. కాని ఇతరులు మీకు అపకారం తలపెడ్తే మీరు మాత్రం వారికి అపకారం తలపెట్టకండి." (హదీస్)

మరోసందర్భంలో "నిన్నెవరైనా మోసగిస్తే నీవు తిరిగి వారిని మోసగించకు" అన్నారాయన. ఆయన "నా ప్రభువు నన్ను తొమ్మిది విషయాల్ని గురించి ఆజ్ఞాపించాడ"ని తెలియ జేసిన తొమ్మిది విషయాలలో నాలుగు విషయాలు ఇలా ఉన్నాయి: "(1) నేను ఎవరి పట్లయినా సంతోషంగావున్నా, అయిష్టంగావున్నా ఎట్టి పరిస్థితిలోనైనా సరే న్యాయంగా మాట్లాడాలి (2) ఎవరైనా నాపట్ల నెరవేర్చవలసిన బాధ్యత నెరవేర్చకపోయినా, నేను మాత్రం వారిపట్ల నెరవేర్చవలసిన నా బాధ్యతను నెరవేర్చాలి. (3) ఎవరైనా నాకు (సహాయ సహకారాలు) ఇవ్వకపోయినా నేను మటుకు వారికివ్వాలి. (4) ఎవరైనా నామీద దౌర్జన్యం చేస్తే నేను వారిని క్షమించాలి."

హజ్రత్ ఉమర్ (రజి) అన్నారు: "ఎవరైనా నీపట్ల ప్రవర్తించడంలో దేవునికి భయపడకపోతే, నీవు దేవునికి భయపడుతూ అతనిపట్ల ప్రవర్తించు. ఇదే అతనికి తగినశిక్ష."

"మీరు బహిరంగంగానూ, రహస్యంగానూ మంచినే చేస్తుండండి. లేదా కనీసం చెడుని (అంటే దుర్భాషను) క్షమాభావంతో ఉపేక్షించండి. అప్పుడు దేవుడు కూడా (మిమ్మల్ని) క్షమిస్తాడు. ఆయన ఎంతో శక్తిమంతుడు." (ఖుర్ఆన్–4:149)

## భూతదయ

హజ్రత్ ఇబ్నెఉమర్ (రజి) ప్రకారం దైవప్రవక్త (స) హితోక్తి: "ఒక స్త్రీ ఓ పిల్లి మూలంగా శిక్షకు గురైంది. ఆమె ఆ పిల్లిని చనిపోయేదాకా కట్టిపడేసింది. దాని మూలంగానే ఆమె నరకానికి వెళ్ళింది. ఆ పిల్లిని కట్టేసి దానికి తిండిపెట్టలేదు. నేలమీది క్రిమి కీటకాలు తినేందుకు దాన్ని స్వేచ్ఛగా వదిలేయనూ లేదు." (బుఖారీ, ముస్లిం)

"ఓ గాడిద మొహం మీద (గుర్తుకోసం) వాత ఉండటం చూసి దైవప్రవక్త (స) మొహం మీద (కొట్టడాన్ని,) వాతపెట్టడాన్ని చాలా అసహ్యించుకున్నారు." (ముస్లిం)

హజ్రత్ ఇబ్నెమస్వూద్ (రజి) కథనం: ఒకానొక ప్రయాణంలో మేము దైవప్రవక్త (స) వెంట ఉన్నప్పుడు జరిగిన సంఘటన. దైవప్రవక్త (స) కాలకృత్యాలు తీర్చుకోవడానికి వెళ్ళారు. ఆ సమయంలో మాకు (పిచ్చుక లాంటి) ఒక ఎరుపురంగు పక్షి కనిపించింది. దానివెంట రెండు కూనలున్నాయి. మేము ఆ కూనల్ని పట్టుకున్నాం. అప్పుడు ఆ పక్షి వెంటపడి మాచుట్టూ తిరగసాగింది. అంతలో దైవప్రవక్త (స) వచ్చారు. ఆయన ఆ దృశ్యం చూసి "ఈ పక్షిని దాని పిల్లల మూలంగా బాధపెట్టిందెవరు? దాని పిల్లల్ని దానికి తిరిగిచ్చేయండి" అని అన్నారు. (అబూదావూద్)

దైవప్రవక్త (స) ఇలా చెప్పారు: "ఒకప్పుడు ఒకతను దారిన నడచిపోతుంటే అతనికి దాహం వేసింది. ఒకచోట ఓబావి కనబడితే అందులోకి దిగి నీళ్ళుత్రాగి బయటికొచ్చాడు. అంతలో అక్కడ అతనికి ఓ కుక్క కన్పించింది. అది దప్పికతో నాలుక వెళ్ళబెట్టి బురద మట్టి నాకసాగింది. అది చూసి ఆ మనిషి 'నేను దప్పికతో అల్లాడిపోయినట్లే ఈ కుక్క కూడా బాధపడుతుందేమో!' అనుకొని మళ్ళీ బావిలోకి దిగాడు. తన కాలిజోడును నీటితో నింపి, దాన్ని నోటితో పట్టుకొని పైకి తెచ్చాడు. ఆ నీరు కుక్కకు త్రాపించాడు. అప్పుడు దేవుడు అతను చేసిన పనిని మెచ్చుకొని అతణ్ని క్షమించాడు."

అనుచరులు ఈమాట విని "దైవప్రవక్తా! భూతదయపై కూడా పుణ్యం లభిస్తుందా!" అని అడిగారు. దానికి దైవప్రవక్త (స) "ఆ...(ప్రాణం) గల ఏ జీవికి సహాయం చేసినా మీకు పుణ్యం లభిస్తుంది" అన్నారు. (బుఖారీ, ముస్లిం); వేరొక హదీసులో ఇలా ఉంది: "ఒక కుక్క ఓబావి చుట్టూ తారట్లాడుతుంది. దాహంతో దాని ప్రాణం పోయేలా ఉంది. అంతలో ఇస్రాయీల్‌జాతికి చెందిన ఓ వ్యభిచారిణి ఆ కుక్కను చూసి తన కాలిజోడు తీసి దాంతో బావి నుండి నీరు చేది, ఆ కుక్కకు తాగించింది. ఆమె చేసిన ఈ సత్కార్యం వల్ల ఆమెను క్షమించి వేయడం జరిగింది." (బుఖారి, ముస్లిం)

హజ్రత్ ఇబ్నెఅబ్బాస్ (రజి) కథనం: "దైవప్రవక్త (స) పశువులను పరస్పరం పోట్లాడుకునేలా చేయడాన్ని వారించారు." (తిర్మిజి). ఈ హదీసు ప్రకారం కోడిపందేలు, పొటేలు పందేలు వగైరా నిషిద్ధం.

దైవప్రవక్త (స) ప్రవచనం: "ఒక చీమ (పూర్వం) ఓ దైవప్రవక్తను కుట్టింది. అంచేత దైవప్రవక్త ఆజ్ఞతో మొత్తం చీమలపుట్టను కాల్చివేయడం జరిగింది. అప్పుడు దేవుడు దివ్యావిష్కృతి ద్వారా ఆ ప్రవక్తతో ఇలాఅన్నాడు- "నిన్ను ఒక చీమ మాత్రమే కుట్టింది.



కాని నీవు దైవాన్ని స్మరించే మొత్తం చీమలసమాజాన్నే కాల్చేశావు." (బుఖారి, ముస్లిం)

దైవప్రవక్త (స) మేము కాల్చివేసిన ఒక చీమలపుట్టను చూసి "ఈ పుట్టను ఎవరు కాల్చారు?" అని అడిగారు. 'మేమే'నని చెప్పాం. అందుకాయన (మమ్మల్ని మందలిస్తూ) "అగ్నితో శిక్షించటం అగ్నిప్రభువుకే శోభిస్తుంది" అని అన్నారు. (అబూదావూద్)

హజ్రత్ అబ్దుల్లా బిన్ జాఫర్ (రజి) ఉల్లేఖనం: దైవప్రవక్త (స) ఓసారి ఒక అన్సార్ ముస్లింకు చెందిన తోటలో ప్రవేశించారు. ఆ తోటలో ఒక ఒంటె కూర్చొని ఉంది. అది దైవప్రవక్త (స)ను చూడగానే హృదయవిదారకంగా అరుస్తూ కంట తడి పెట్టింది. దైవప్రవక్త (స) దాని దగ్గరకు వెళ్ళి దాని మూపురాన్ని, కణతలను చేత్తో మృదువుగా నిమిరారు. దాంతో దానికి కాస్తంత సుఖం లభించింది. దైవప్రవక్త (స) అక్కడున్నవారిని "ఈ ఒంటె యజమాని ఎవర"ని అడిగారు. అన్సార్ ముస్లింలలో ఒక యువకుడు ముందుకొచ్చి "దైవప్రవక్తా! ఈ ఒంటె నాది" అన్నాడు. అప్పుడు దైవప్రవక్త (స) అతనితో ఇలా అన్నారు: "ఈ పేద ఒంటె విషయంలో దీన్ని వాడుకోవడానికి నీ అధీనంలో ఇచ్చిన దేవునికి నీవు భయపడవా? నీవు దీంతో నిర్విరామంగా పని చేయిస్తున్నావని, (సరిగా మేపకుండా) కడుపు మాడ్చుతున్నావని ఇది నాకు ఫిర్యాదు చేస్తోంది." (రియాజ్జుస్సాలిహీన్)

దైవప్రవక్త (స) ప్రవచనం: "దేవుడు ప్రతి పనీ సవ్యంగా, సముచిత రీతిలో చేయాలని (మనిషికి) విధిగా చేశాడు. ఎవరినైనా (చట్టబద్ధంగా) హతమార్చవలసివస్తే సముచిత రీతిలోనే హతమార్చాలి (గాని ఒక్కొక్క అవయం ఖండిస్తూ చిత్రవధ చేయకూడదు). అలాగే ఏదైనా పశువుని చంపాలనుకున్నప్పుడు కూడా సముచిత రీతిలో చంపాలి. దాని కోసం కత్తికి బాగా పదును పెట్టాలి. కోసేయడంలో పశువు తల్లడిల్లి పోయేలా ఆలస్యం చేయకుండా తొందరగా ప్రాణం పోయేలా వెంటనే కోసేయండి." (ముస్లిం)

హజ్రత్ ఇబ్నెఅబ్బాస్(రజి) కథనం: దైవప్రవక్త (స) నడచిపోతుంటే ఓచోట ఒకతను మేకను కిందపడేసి దాని ముఖాన్ని కాలితో అదిమిపట్టి కత్తికి పదును పెట్టసాగాడు. మేక ఆ దృశ్యం చూస్తోంది. అప్పుడు దైవప్రవక్త (స) అతనితో ఇలా అన్నారు: "ఈ మేక జిబా చేయకముందే చచ్చేలా ఉంది. నువ్వు దీన్ని రెండుసార్లు చంపదలిచావా? దీన్ని కింద పడేయకముందే నువ్వు కత్తికి పదును ఎందుకు పెట్టుకోలేదు?" (తర్గీబ్)

హజ్రత్ ఇబ్నెఉమర్ (రజి) కథనం: దైవప్రవక్త (స) పశువును పదునైన కత్తితో జిబా చేయాలని (కోయాలని) ఆదేశించారు. పశువును ఇతర పశువుల ముందు జిబా చేయకూడదని కూడా ఆయన ఆదేశించారు. (అల్‌మంజరి)

**కుక్కల పెంపకం:-** దైవప్రవక్త (స) ఇలా అన్నారు: "ఎవరయితే వేట లేక పశువుల రక్షణ కోసం తప్ప (మరో ఉద్దేశ్యంతో) కుక్కని పెంచుతారో వారి పుణ్యం ప్రతిరోజూ రెండు యూనిట్లు తగ్గుతూఉంటుంది." (బుఖారీ,ముస్లిం)

హజ్రత్ అబూహురైరా (రజి) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (స) ఈవిధంగా తెలియజేశారు: "కుక్కలు లేక గంటలతో ఉన్న ప్రయాణ బృందాల వెంట దైవదూతలు ఉండరు." (ముస్లిం)

హజ్రత్ ఇబ్నెఉమర్ (రజి) కథనం: "అశుద్ధం (మలినం) తినే ఒంటెల మీద స్వారీ చేయడాన్ని దైవప్రవక్త (స) వారించారు" (అబూదావూద్)

## 84. అనుమానాలు, అపనిందలు

"విశ్వాసులారా! మితిమీరిన అనుమానాలకు పోకండి. కొన్ని అనుమానాలు పాపాలుగా పరిణమించవచ్చు. (అలాగే ప్రజల) రహస్యవిషయాల వెనుక పడకండి. మీలో ఎవరూ ఇతరుల్ని పరోక్షంగా నిందించకూడదు. మీలో ఎవరైనా మీ మృతసోదరుని మాంసం తినడానికి ఇష్టపడతారా? (ఏమాత్రం ఇష్టపడరు.) చూశారా, మీరే దాన్ని అసహ్యించుకుంటారు. దేవునికి భయపడండి. దేవుడు ఎంతో క్షమాశీలి, దయామయుడు." (ఖుర్ఆన్-49:12)

ఒక వ్యక్తిలో ఏదైనా చెడు ఉన్నట్లు అనుమానం వస్తే దాన్ని గురించి ఆరా తీయడానికి ప్రయత్నించకూడదని ఈ సూక్తి తెలియజేస్తోంది. హజ్రత్ ఉమర్ (రజి) పాలనాకాలంలో ఓసారి అర్థ రాత్రివేళ ఒక వ్యక్తి తన ఇంట్లో ఏదో పాట పాడుతున్నాడు. ఆ పాట వినగానే గస్తీ తిరుగుతున్న హజ్రత్ ఉమర్ (రజి)కు అనుమానం వచ్చింది. ఆయన వెంటనే అతని ఇంటి గోడెక్కి తొంగిచూస్తే మందూ, మగువా కన్పించాయి. ఆయన కోపంతో "ఓరి దైవవిరోధీ! నీవు దేవుని ఆజ్ఞలను ఉల్లంఘిస్తుంటే ఆయన నీ గుట్టు రట్టు చేయడని భావించావా?" అని అరిచారు.

దానికా వ్యక్తి ఇలా అన్నాడు: "విశ్వాసుల నాయకా! తొందరపడకండి. నేను ఒక పాపం చేస్తే మీరు మూడుపాపాలు చేశారు. దేవుడు ఇతరుల రహస్యాలు కూపీ తీయడాన్ని నిషేధించాడు. కాని మీరా పని చేశారు. దేవుడు ఇండ్లలోకి ముఖద్వారం గుండా ప్రవేశించమని ఆదేశిస్తే మీరు ప్రహరీ గోడెక్కి వచ్చారు. దేవుడు ఇతరుల ఇండ్లలోకి వారి అనుమతి లేకుండా ప్రవేశించకూడదంటే, మీరు నా అనుమతి లేకుండానే నా ఇంట్లో ప్రవేశించారు." ఉమర్ (రజి) ఈమాట విని తప్పు ఒప్పుకున్నారు. అతనిపై ఎలాంటిచర్య తీసుకోలేదు. కాకపోతే అతనిచేత దుష్కార్యాలు మానేసి నీతి మార్గం అవలంబిస్తానన్న వాగ్దానం చేయించుకున్నారు.

పైసూక్తిలో పరోక్షంగా నిందించకూడదంటే ప్రత్యక్షంగా నిందించవచ్చని అర్థం కాదు. ప్రత్యక్షనింద కంటే పరోక్షనింద తీవ్రమైన విషయమని తెలుసుకోవాలి.

దైవప్రవక్త (స) ఓసారి "పరోక్షనింద వ్యభిచారం కన్నా నీచమైన పాపం" అన్నారు. అనుచరులు ఈమాట విని "దైవప్రవక్తా! పరోక్షనింద వ్యభిచారంకన్నా నీచమైన పాపం ఎలా అవుతుంది?" అనడిగారు. దానికి ఆయన సమాధానమిస్తూ "మనిషి వ్యభిచారం చేసిన తరువాత పశ్చాత్తాపంతో క్షమాపణ కోరుకుంటే దేవుడు అతడ్ని క్షమిస్తాడు. కాని పరోక్షనిందకు పాల్పడినవాడ్ని నిందితుడు క్షమించనంత వరకు దేవుడు అతడ్ని క్షమించడు" అని వివరించారు (మిష్కాత్)

దైవప్రవక్త (స) ప్రవచనం: "పరోక్షనిందకు పరిహారంగా నీవు నిందించిన మనిషి (చనిపోయినప్పుడు లేక సుదూరప్రాంతానికి వెళ్ళి అతడ్ని క్షమాపణ కోరడం సాధ్యంకానప్పుడు అతని) కోసం దైవసన్నిధిలో మన్నింపు ప్రార్థన చేయాలి." (మిష్కాత్)



పరోక్ష నింద విషయంలో కొన్ని మినహాయింపులున్నాయి. ఉదాహరణకు- పీడితుడు దౌర్జన్యపరుడికి వ్యతిరేకంగా ఆ దౌర్జన్యం నుండి కాపాడగల వ్యక్తి ముందు నిందారోపణ చేయవచ్చు. సంస్కరణాభిలాషతో ఒకవ్యక్తి లేక ఒక వర్గంలోని చెడుల్ని గురించి వాటిని దూరంచేయగలవారి ముందు ప్రస్తావించవచ్చు. దుర్మార్గుడి దుర్మార్గపు పనులను గురించి ప్రజలను హెచ్చరించవచ్చు. సాక్షుల లోపాలను ఎత్తి చూపవచ్చు. పెళ్ళి చేసుకోదలచిన వారికి తత్సంబంధిత వరుడు లేక వధువులోని లోపాలను తెలియజేయవచ్చు.

దైవప్రవక్త (స) (తన అనుచరుల్ని) "మీకు పరోక్షనింద అంటే ఏమిటో తెలుసా?" అని అడిగారు. అందుకు వారు "దేవునికి, దైవప్రవక్తకే బాగా తెలుసు" అని విన్నవించుకున్నారు. అప్పుడు దైవప్రపక్త (స) ఆ విషయాన్ని వివరిస్తూ, "మీ సోదరుని గురించి అతను వింటే అసహ్యించుకునే విధంగా మాట్లాడుకోవటం" అని చెప్పారు. అది విని ఒకతను "నేను చెప్పే బలహీనతలు అతనిలో నిజంగా ఉంటేనో" అనడిగాడు. దానికి సమాధానమిస్తూ, దైవప్రవక్త (స) "ఒకవేళ నువ్వు చెప్పేవి అతనిలో ఉంటే నువ్వతడ్ని పరోక్షంగా నిందించిన వాడివవుతావు. నువ్వు చెప్పే విషయాలు అతనిలో లేకపోతే నువ్వతని మీద అభాండాలు వేస్తున్నావన్న మాట" అని అన్నారు. (ముస్లిం)

హజ్రత్ ఆయిషా (రజి) కథనం: (ఒకరోజు) నేను దైవప్రవక్త (స) ముందు 'సఫియ్యా 'ఇలా' ఉన్నా మీకు ఆవిడే నచ్చుతుంది లెండి' అన్నాను. (సఫియా పొట్టిగా ఉంటుందని చెప్పటం ఆమె ఉద్దేశమని కొందరు ఉల్లేఖకులు పేర్కొన్నారు)

ఆ మాట విని దైవప్రవక్త (స) (ఆమెను మందలిస్తూ) ("ఆయిషా!) నువ్వు ఎంత (దిగజారిన) మాట అన్నావంటే ఆ మాటను గనక సముద్రంలో కలిపిస్తే అది సముద్రపు నీటి రుచినే మార్చేస్తుంది" అని అన్నారు. (బుఖారి, ముస్లిం)

దైవప్రవక్త (స) హితోక్తి: "ఎవరైనా తన సోదరుని మానమర్యాదలపై జరిగే దాడుల్ని ఖండిస్తే ప్రళయదినాన దేవుడు అతని ముఖాన్ని అగ్ని నుండి రక్షిస్తాడు." (తిర్మిజీ)

హజ్రత్ అబూజర్ (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ప్రవచనం: "ఎవరూ ఎవరినీ పాపాత్ముడనీ లేక సత్యతిరస్కారి (కాఫిర్) అని నిందించరాదు. ఎందుకంటే ఎదుటి వ్యక్తి అలాంటివాడు కాకుంటే ఆ నింద తన వైపుకే తిరిగి వస్తుంది." (బుఖారీ)

హజ్రత్ ఆయిషా (రజి) కథనం: ఒక వ్యక్తి దైవప్రవక్త (స) దగ్గరికి రావటానికి అనుమతి కోరాడు. అందుకాయన, "అతడ్ని అనుమతించండి. అతను తన వంశంలో పరమ చెడ్డమనిషి" అని అన్నారు. (బుఖారీ, ముస్లిం)

హజ్రత్ ఫాతిమా బిన్త్ ఖైస్ (రజి) కథనం: నేనొకసారి దైవప్రవక్త (సల్లం) దగ్గరికి వెళ్ళి, "(దైవప్రవక్తా!) అబూజహమ్, ముఆవియా ఇద్దరూ నాకు వివాహ సందేశం పంపారు. (నేనేం చేయను?)" అని అడిగాను. అందుకాయన, 'ముఆవియా కటిక దరిద్రుడు. అతని దగ్గర ధనం లేదు. పోతే అబూజహమ్- అతను భుజంపైకి ఎత్తిన కర్ర కిందికి దించనేదించడు." (బుఖారీ, ముస్లిం)

హజ్రత్ ఆయిషా (రజి) కథనం: అబూసుఫ్యాన్ గారి భార్య హింద్ దైవప్రవక్త (స)

ముందు ఇలా విన్నవించుకుంది: “దైవప్రవక్తా! అబూసుఫ్యాన్ చాలా పిసినారి మనిషి. ఆయన నాకూ, నాపిల్లల ఖర్చులకు సరిపోయేంత డబ్బివ్వరు. ఆయనకు తెలియకుండా ఆయన ధనంలో నుంచి కొంత తీసుకోవడం తప్ప నాకు గత్యంతరం లేదు మరి.” దానికి దైవప్రవక్త (స) సమాధానమిస్తూ “నువ్వు చట్టం ప్రకారం నీకూ, నీపిల్లలకు సరిపోయేటంత ధనం తీసుకో” అని చెప్పారు. (బుఖారీ, ముస్లిం)

దైవప్రవక్త (స) ప్రవచనం: “మృతులను గురించి చెడుగా మాట్లాడకండి. వారు తమ కర్మలతోపాటు తమప్రభువు దగ్గరకు చేరుకున్నారు.” (అల్అదబుల్ ముఫ్రద్)

## చాడీలు, రంధ్రాన్వేషణ

“నిందించే, హేళన చేసే, చాడీలు చెప్పే ప్రతివాడికీ వినాశం (రాసిపెట్టి) ఉంది.” (104:1); “చీటికిమాటికి ఒట్లు వేసుకునే తుచ్ఛుడు, ఎత్తిపొడిచేవాడు, చాడీలు చెబుతూ తిరిగేవాడు, సత్కార్యాల నుండి నిరోధించేవాడు, మితిమీరిన దౌర్జన్యాలకు పాల్పడేవాడు, ఘోరపాపి, పరమ దుర్మార్గుడు, వీటన్నిటికి తోడు ఏమాత్రం నీతిలేని నికృష్టుడు... (ఇలాంటివాడికి లొంగకు).” (ఖుర్ఆన్–68:11–14)

“మనిషి నోటి నుండి వెడలే ప్రతి మాటనూ వ్రాయటానికి అనుక్షణం (అతని ముందు) ఒక పరిశీలకుడు సిద్ధంగా ఉంటాడు.” (ఖుర్ఆన్–50:18)

దైవప్రవక్త (స) ప్రవచనం: “చాడీలు చెప్పేవాడు స్వర్గానికి పోలేడు.” (బుఖారీ)

హజ్రత్ ఇబ్నెఅబ్బాస్ (రజి) కథనం: దైవప్రవక్త (సల్లం) రెండు సమాధుల దగ్గర్నుంచి వెళ్తూ ఇలా అన్నారు: “ఈ రెండు సమాధుల్లో ఉన్నవారికి యాతన ఇవ్వబడు తోంది. వీరికి ఈ యాతన ఏదో పెద్ద కారణంతో ఇవ్వబడటం లేదు! (ఆ తర్వాత ఆయనే అన్నారు) “కాదు కాదు, అది పెద్ద విషయమే. వీరిలో ఒకడు చాడీలు చెబుతూ తిరుగుతుండేవాడు. మరొకడు మూత్రం పోసినప్పుడు ఒంటిమీద దాని తుంపరలు పడకుండా జాగ్రత్తపడేవాడు కాదు.” (బుఖారీ, ముస్లిం)

హజ్రత్ ముఆవియా (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ఇలా అన్నారు: “నువ్వు గనక ముస్లింల లోపాలను ఎన్నటానికి ప్రయత్నిస్తే నువ్వే వారిని పాడుచేస్తావు. లేదా త్వరలోనే నువ్వు వారిని పాడుచేస్తావు.” (అబూదావూద్)

# 85. నోటిదురుసు, దుర్భాష

నోరు మంచిదయితే ఊరు మంచిదవుతుందంటారు. నోరు ఎన్నెన్నో మంచి పనులు చేస్తుంది. మనిషి గౌరవమర్యాదల్ని పెంచి, సంఘంలో అతనికి మంచి స్థానం సమకూర్చి పెడ్తుంది. అయితే అదుపుతప్పితే ఈనోరే మనిషికి ఇహపరాల్లో ఎన్నో ఆపదలు తెచ్చిపెడ్తుంది. దేవుని దృష్టిలో నోటిదురుసు, దుర్భాష, అశ్లీలం ఘోరమైన నేరాలు. వీటికి పరలోకంలో మనిషి నరకశిక్ష అనుభవించవలసి వస్తుంది. వీటిని గురించి దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు:

“ప్రళయదినాన విశ్వాసి త్రాసులో ఉంచబడే బరువైన వస్తువు అతని సత్ప్రవర్తనే. అశ్లీలమాటలు పలికేవాడ్ని, దుర్భాషలాడేవాడ్ని దేవుడు అసహ్యించుకుంటాడు.” (తిర్మిజి)



“మృదుస్వభావం లేనివాడిలో మంచితనం ఉండదు.” (జరీర్-ముస్లిం)

కొందరు పైకిఎంతో భక్తిపరాయణులుగా కన్పించినా, వారు తమ నోటితో ఇతరుల్ని తరచుగా బాధిస్తుంటారు. అలాంటివారికి ఈ క్రింది హదీసు చక్కని గుణపాఠం.

ఒకతను దైవప్రవక్త (స) దగ్గరకు వచ్చి “ఫలానా స్త్రీ ఎన్నో నఫిల్ నమాజులు చేస్తుంది. మరెన్నో నఫిల్ ఉపవాసాలు పాటిస్తుంది. (పెద్దఎత్తున) దానధర్మాలు కూడా చేస్తుంది. ఈ సత్కార్యాలలో ఆమె పేరుపొందింది. కానిఆమె తరచుగా నోటితో ఇరుగు పొరుగువారిని బాధిస్తుంది” అన్నాడు. దానికి దైవప్రవక్త (స) “అయితే ఆమె నరకానికి పోతుంది” అన్నారు. తిరిగి ఆ వ్యక్తి ఇలా అన్నాడు: “దైవప్రవక్తా! ఫలానా స్త్రీ నఫిల్ ఉపవాసాలు చాలా అరుదుగా పాటిస్తుంది. నఫిల్ నమాజులు కూడా చాలా తక్కువ గానే ఆచరిస్తుంది. అప్పుడప్పుడు కొన్ని జున్ను గడ్డల్ని దానం చేస్తుందని ప్రతీతి. అయితే ఆమె తన నోటితో ఇరుగుపొరుగువారిని బాధించదని జనం చెప్పుకుంటారు.” దైవప్రవక్త ఈమాట విని “ఆమె స్వర్గవాసి అవుతుంద”ని చెప్పారు. (మిష్కాత్)

హజ్రత్ అబ్దుల్లా బిన్ అమ్రబిన్ఆస్ (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ఇలా అన్నారు: “ఎవరి నోటి మూలంగా, చేతుల మూలంగా తోటిముస్లింలు బాధపడకుండా ఉంటారో అతనే (నిజమైన) ముస్లిం. అలాగే దేవుడు మానేయమన్న వాటిని మానేసేవాడే ముహాజిర్ (దైవమార్గంలో వలసపోయినవాడు).” (బుఖారీ, ముస్లిం)

హజ్రత్ ఆయిషా (రజి) కథనం: ఒక వ్యక్తి లోపలికి రావడానికి దైవప్రవక్త (స)ను అనుమతి అడిగాడు. దైవప్రవక్త (స) “అతడ్ని లోపలికి రావడానికి అనుమతించు. అతను తన వంశంలోని అతి చెడ్డవాడు” అని అన్నారు. ఆ వ్యక్తి లోపలికి వచ్చిన తరువాత దైవప్రవక్త (స) అతనితో ఎంతో సౌమ్యంగా మాట్లాడారు. (అతను వెళ్ళిపోయిన) తర్వాత నేను దైవప్రవక్త (స)తో మాట్లాడుతూ “దైవప్రవక్తా! మీరా మనిషి గురించి మొదట అలా అన్నారు. కాని ఆ తరువాత అతనితో చాలా సౌమ్యంగా మాట్లాడారేమిటీ?” అని అడిగాను. దానికి దైవప్రవక్త (స) సమాధానమిస్తూ “ఆయిషా! ఎవరి నోటిదురుసు వల్ల ప్రజలు తనకు దూరమైపోతారో అతను పరమ దుర్మార్గుడు” అని అన్నారు. (బుఖారి)

## నోటిని అదుపులో ఉంచుకో

దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: “దేవుణ్ణి, అంతిమదినాన్ని విశ్వసించే వ్యక్తి పలికితే మంచిమాటే పలకాలి లేదా మౌనంగా ఉండాలి.” (బుఖారీ, ముస్లిం)

సహల్ బిన్ సాద్ (రజి) ప్రకారం దైవప్రవక్త (స) హితోక్తి: “తన రెండు దవడల మధ్య ఉన్నదాన్ని గురించి, రెండు కాళ్ళ మధ్య ఉన్నదాన్ని గురించి నాకు హామీ ఇచ్చే మనిషికి నేను స్వర్గం గురించి హామీ ఇస్తాను.” (బుఖారీ, ముస్లిం)

హజ్రత్ అబూహురైరా (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ఇలా అన్నారు: “దాసుడు అనాలోచితంగా ఒక మాట అంటాడు. అది మంచా లేక చెడా అని ఆలోచించడు. కాని దాని మూలంగానే అతను తూర్పు పడమరల మధ్య ఉండే దూరం కన్నా ఎక్కువ దూరం నరకం వైపు పడిపోతాడు.” (బుఖారీ, ముస్లిం)

హజ్రత్ అబూహురైరా (రజి) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (స) ఇలా బోధించారు: "దాసుడు పరధ్యానంలో ఉండి దేవునికి నచ్చే మాట మాట్లాడేస్తాడు. దానివల్ల దేవుడు అతని అంతస్తులెన్నో పెంచుతాడు. అయితే దాసుడు ఒక్కోసారి పరధ్యానంలో ఉండి దేవునికి ఆగ్రహం తెప్పించే మాట మాట్లాడేస్తాడు. దానివల్ల అతను నరకంలో పడి పోతాడు." (బుఖారీ)

హజ్రత్ సుఫ్యాన్ బిన్ అబ్దుల్లా (రజి) కథనం: నేనొక సారి దైవప్రవక్త (స)ను ఇలా అడిగాను: "దైవప్రవక్తా! నాకేదయినా విషయం నేర్పించండి, నేను దాని మీద స్థిరంగా ఉంటాను." అందుకాయన "నా ప్రభువు అల్లాహ్ అని చెప్పి ఆ మాట మీదే స్థిరంగా ఉండు" అని ఉపదేశించారు. నేను మళ్ళీ అడిగాను, "దైవప్రవక్తా! నా గురించి మీరు ఏ విషయంలో భయపడుతున్నారు" అని. అందుకాయన తన నాలుక పట్టుకొని, "దీని విషయంలో" అని అన్నారు. (తిర్మిజీ)

హజ్రత్ ఇబ్నెఉమర్ (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ఇలా చెప్పారు: "దైవస్మరణ లేకుండా ఇతర మాటలు ఎక్కువగా మాట్లాడకండి. దైవస్మరణ లేకుండా ఇతర మాటలు ఎక్కువగా మాట్లాడితే హృదయాలు మొద్దుబారిపోతాయి. దేవునికి ప్రజలందరి లోకెల్లా దూరంగా ఉండేవాడు హృదయం మొద్దుబారి పోయినవాడే." (తిర్మిజీ)

దైవప్రవక్త (స) ప్రవచనం: "(నిజమైన) విశ్వాసి ఎత్తిపొడిచేవాడు, శాపనార్థాలు పెట్టేవాడు, బూతు మాట్లాడేవాడు, దురుసుగా మాట్లాడేవాడు కాలేడు." (తిర్మిజీ)

**బిడియం:-** హజ్రత్ అనస్ (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ఇలా అన్నారు: "ఏ వస్తువులోనైనా అశ్లీలం ఉంటే అది దాన్ని లోపభూయిష్టంగా మారుస్తుంది. మరే వస్తువు లోనైనా బిడియం ఉంటే అది ఆ వస్తువుని అందంగా మలుస్తుంది." (తిర్మిజీ)

హజ్రత్ ఉఖ్బా బిన్ ఆమిర్ (రజి) కథనం: నేను దైవప్రవక్త (స)ను అడిగాను, "దైవప్రవక్తా! ముక్తికి మార్గం ఏది"ని. అందుకాయన "నీ నోటిని అదుపులో పెట్టుకో. నీ ఇల్లు నిన్ను తనలో ఇమిడ్చుకోవాలి (అంటే నీ తీరిక సమయం నీ ఇంట్లో గడవాలి.) నీ పొరపాట్లను తలచుకొని రోదించు" అని ఉపదేశించారు. (తిర్మిజీ)

హజ్రత్ అబూసయీద్ ఖుద్రీ (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ఇలా అన్నారు: "తెల్లవారుజామున మనిషి శరీరంలోని అవయవాలన్నీ నాలుకను అత్యంత దీనంగా బతిమాలుతాయి. "నువ్వు మా విషయంలో దేవునికి భయపడి మసలుకో. మా వ్యవహారం నీతో ముడిపడిఉంది. నువ్వు సవ్యంగాఉంటే మేమూ సవ్యంగా ఉండ గలుగుతాం. నువ్వు వక్రతకు లోనైతే మేమూ వక్రతకు లోనైపోతాము." (తిర్మిజీ)

## రెండు నాల్కల ధోరణి

"వీరు తమ చేష్టల్ని ప్రజల కంటబడకుండా దాచగలరుగాని దేవుని కంటబడ కుండా దాచలేరు. వారు రాత్రివేళల్లో దేవుని అభీష్టానికి వ్యతిరేకంగా రహస్యమంతనాలు జరుపుతారు. కాని అప్పుడు కూడా దేవుడు తమను వెన్నంటి ఉంటాడన్న సంగతి మరచి పోతున్నారు. దేవుడు వారి చర్యలన్నిటినీ పరివేష్టించి ఉన్నాడు." (ఖుర్ఆన్-4:108)



హజ్రత్ అబూహురైరా (రజి) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (స) ఈవిధంగా తెలియజేశారు:"ప్రజలు మీకు ఖనిజ నిక్షేపాల్లా కనిపిస్తారు. అజ్ఞానకాలంలో మంచి వారుగా ఉన్నవారు (ధర్మాన్ని) అర్థంచేసుకుంటే ఇస్లాం స్వీకరించిన తరువాత కూడా మంచివారుగానే ఉంటారు. ప్రభుత్వ వ్యవహారాన్ని అందరికన్నా ఎక్కువ అసహ్యించు కునేవారే (దాన్ని నిర్వహించటంలో) అత్యంత సమర్థవంతులయి ఉండటం మీరు గమనిస్తారు. అలాగే ప్రజల్లో రెండు ముఖాలవారు అత్యంత నీచులయినట్లు మీరు గమనిస్తారు. వారు కొందరి దగ్గరికి ఒక ముఖంతో, మరికొందరి దగ్గరికి మరో ముఖంతో వెళ్తారు. (బుఖారీ, ముస్లిం)

హజ్రత్ ముహమ్మద్ బిన్ జైద్ (రజి) ప్రకారం కొంతమంది ఆయన తాతగారిని అడిగారు, "మేము అధికారుల దగ్గరికి వెళ్ళినప్పుడు మేము బయట మాట్లాడుకునే మాటలకు వ్యతిరేకమైన మాటలు వారితో మాట్లాడుతాము. ఇది ధర్మసమ్మతమేనా?" అని. దానికాయన సమాధానమిస్తూ "దైవప్రవక్త (స) కాలంలో మేము దీన్ని కాపట్యంగా పరిగణించేవాళ్ళం" అని చెప్పారు. (బుఖారీ)

## దూషణలు, శాపనార్థాలు

హజ్రత్ ఇబ్నెమస్ఊద్ (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ఇలా అన్నారు: "ముస్లింని దూషించటం పాపం (దైవాజ్ఞను ఉల్లంఘించటం). అతడ్ని హత్య చేయటం అవిశ్వాసం (కుఫ్ర్)తో సమానం." (ముస్లిం)

హజ్రత్ అబూహురైరా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "పరస్పరం దూషించుకునే ఇద్దరు వ్యక్తులు ఒకరినొకరు ఏమేమి అనుకుంటారో దాని పాపమంతా మొదట తిట్లు ప్రారంభించినవాని మీదే పడుతుంది- పీడితుడు హద్దు మీరి ప్రవర్తించనంతవరకు." (ముస్లిం)

హజ్రత్ ఆయిషా (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ప్రవచనం : "మరణించినవారు తాము చేసుకున్న కర్మలకు చేరుకున్నారు. కాబట్టి వారిని దూషించకండి." (బుఖారీ)

హజ్రత్ అబూహురైరా (రజి) ప్రకారం దైవప్రవక్త (స) హితోక్తి : "సత్యం చెప్పేవాడు శాపనార్థాలు పెట్టేవాడుకారాదు. అది సత్యవంతుడికీ శోభించదు." (ముస్లిం)

హజ్రత్ అబూదర్దా (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ప్రవచనం: "(చీటికి మాటికీ) శాపనార్థాలు పెట్టేవారు ప్రళయదినాన సాక్షులు, సిఫారసుకర్తలు కాలేరు." (ముస్లిం)

హజ్రత్ సమురా బిన్ జుందుబ్ (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ఇలా అన్నారు: "దేవుని శాపం తగలాలని, ఆయన ఆగ్రహం విరుచుకుపడాలని, అగ్నితో శిక్షించబడా లని ఎవరినీ శాపనార్థాలు పెట్టకండి." (అబూదావూద్, తిర్మిజీ)

హజ్రత్ అబూదర్దా (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ఇలాఅన్నారు: "దాసుడు ఎవరి నైనా శపించినపుడు ఆ శాపం ఆకాశానికి ఎక్కుతుంది. కాని దాన్ని రానీయకుండా ఆకాశ ద్వారాలు మూయబడతాయి. దాంతో అది తిరిగి భూమి మీదకు వస్తుంది. కాని భూమి ద్వారాలు కూడా మూయబడతాయి. తర్వాత అది కుడి ఎడమల వైపు పోవడానికి

ప్రయత్నిస్తుంది. చివరికి ఎటూ పోలేక శపించబడినవాని దగ్గరికి పోతుంది. అతను గనక ఆ శాపానికి అర్హుడైతే (అతనికి తగులుతుంది) లేదా తిరిగి శపించినవాని దగ్గరికే వెళ్లి పోతుంది.'' (అబూదావూద్)

హజ్రత్ ఇమ్రాన్ బిన్ హుసైన్ (రజి) ఇలా తెలియజేశారు: దైవప్రవక్త (స) చేసిన ఒక ప్రయాణంలో జరిగిన సంఘటన ఈవిధంగా ఉంది- ఒక అన్సార్ మహిళ ఒంటెపై ప్రయాణిస్తూ విసుగెత్తిపోయి దానికి శాపనార్థాలు పెట్టింది. దైవప్రవక్త (స) అది విని, ''దాని మీదున్న సామానంతా కిందికి దించేసి దాన్ని వదిలేయండి, అది శాపానికి గురయింది'' అని అన్నారు. (ముస్లిం)

దైవప్రవక్త (సల్లం) ఇలా అన్నారని సహీహ్ హదీసుల్లో ఉంది: 'సవరం పెట్టే స్త్రీని, పెట్టించుకునే స్త్రీని దేవుడు శపించుగాక!'; 'వడ్డీ తినేవాణ్ణి దేవుడు శపించుగాక!'; దైవప్రవక్త (స) చిత్రాలను రూపొందించేవారిని కూడా శపించారు. ఆయనిలా శపించే వారు: 'భూమి సరిహద్దుల్ని మార్చివేసేవాణ్ణి దేవుడు శపించుగాక!'; 'కోడిగ్రుడ్డు దొంగని దేవుడు శపించుగాక!'; ' తల్లిదండ్రులకు శాపనార్థాలు పెట్టేవాణ్ణి దేవుడు శపించుగాక'; 'దైవేతరుల కోసం జంతువుల్ని జిబహ్ చేసేవాణ్ణి దేవుడు శపించుగాక!'; 'మదీనా నగరంలో బిద్అత్‌ను సృష్టించే లేక బిద్అత్‌లను సృష్టించేవారికి ఆశ్రయమిచ్చే వాడి మీద దేవుని, దైవదూతల, ప్రజలందరి శాపం పడుగాక!'; 'దేవా! రీల్, జక్వాన్, ఉసయ్యా తెగలను శపించు. వీరు దేవునికీ, ఆయన ప్రవక్తకు అవిధేయత చూపారు'; ''దేవుడు యూదుల్ని శపించుగాక! వారు తమ ప్రవక్తల సమాధుల్ని ఆరాధనాలయాలుగా మార్చుకున్నారు.'' దైవప్రవక్త (స) స్త్రీలను అనుకరించే పురుషుల్ని, పురుషుల్ని అనుకరించే స్త్రీలను కూడా శపించారు. (బుఖారి, ముస్లిం)

## 86. గర్వం, హేళన, చులకన భావం

''దేవుడు అహంకారం, తలబిరుసుతనాలుగల ప్రతి దుర్మార్గుడి హృదయకవాటాలు మూసివేస్తాడు.'' (ఖుర్ఆన్–40:35)

''జనమ్ముందు గర్వంతో మాట్లాడకు. భూమిపై నిక్కుతూ నీల్గుతూ నడవకు. తనను తాను పొగడుకునే, మిడిసి పడేవాడ్ని దేవుడు ఏమాత్రం మెచ్చుకోడు.'' (ఖుర్ఆన్–31:18)

''కనుక మీరు ఆత్మశుద్ధిని గురించి గొప్పలు చెప్పుకోకండి. మీలో నిజమైన దైవభీతి పరుడెవరో దేవునికి బాగాతెలుసు.'' (ఖుర్ఆన్–53:32)

''భూమిపై నిక్కుతూ నీల్గుతూ నడవకండి. (ఈ అహంకారంతో) మీరు భూమిని చీల్చి వేయలేరు. పర్వతాల ఎత్తుకు ఎదగనూ లేరు.'' (ఖుర్ఆన్–17:37)

''భూమిపై (మిడిసిపాటుతో) నిక్కుతూ నీల్గుతూ నడవకు. తననుతాను పొగడుకునే, మిడిసిపడేవాడ్ని దేవుడు ఏమాత్రం మెచ్చుకోడు. నీ నడవడిలో మధ్యేమార్గాన్ని అవలంబించు.'' (ఖుర్ఆన్–31:18)

''నీ కంఠస్వరం కాస్త తగ్గించుకో. అన్ని స్వరాల కంటే గాడిద స్వరం అత్యంత కఠోరమైనది''. (ఖుర్ఆన్–31:19)



''విశ్వాసులారా! పురుషులు తోటిపురుషుల్ని హేళన చేయకూడదు. వీరికంటే వారే మంచివారై ఉండవచ్చు. స్త్రీలు తోటిస్త్రీలను గేలి చేయకూడదు. వీరికంటే వారే మంచివారై ఉండవచ్చు. మీరు ఒకరి తప్పులు మరొకరు ఎత్తిచూపుకుంటూ పరస్పరం బురద చల్లుకోకండి. తప్పుడు పేర్లతో పిలుచుకోకండి. విశ్వాసభాగ్యం పొందిన తర్వాత చెడ్డపేరు తెచ్చుకోవడం చాలా తప్పు. ఈ వైఖరి మానుకోనివారే దుర్మార్గులు.'' (ఖుర్ఆన్–49:11)

''నిందించే, హేళన చేసే, చాడీలు చెప్పే ప్రతివాడికీ (పరలోకంలో) వినాశం ఉంది.'' (ఖుర్ఆన్–104:1)

''...అతను తన సంతానం, సిరిసంపదలు చూసుకొని మిడిసిపడుతున్నాడు. అతని ముందు మా సూక్తులు చదువుతున్నప్పుడు ''ఇవి పూర్వీకుల పుక్కిటి పురాణాలు మాత్రమే'' అంటాడు. త్వరలోనే మేమతని ముక్కుమీద వాతపెట్టి అతని పీచం అణచివేస్తాం.'' (ఖుర్ఆన్–68:15,16)

దైవప్రవక్త (స) ప్రవచనం: ''ఒక ముస్లిం తన తోటిముస్లిం సోదరుణ్ణి చులకనగా చూడటం చాలు అతను చెడ్డవాడని చెప్పటానికి. (ముస్లిం)

హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ మస్వూద్ (రజి) కథనం: దైవప్రవక్త (స) మాట్లాడుతూ ''మనిషి మనసులో లేశమాత్రం గర్వమున్నా అతను స్వర్గంలోకి ప్రవేశించలేడు'' అని అన్నారు. అది విని ఒకతను ''మనిషి తన బట్టలు, చెప్పులు బాగా ఉండాలని కోరుకుంటాడు (ఇది కూడా గర్వమేనా?)'' అనడిగాడు. అందుకాయన ''దేవుడు సుందర స్వరూపుడు. సౌందర్యాన్ని ఇష్టపడతాడు. (గర్వమంటే అది కాదు). గర్వమంటే సత్యాన్ని నిరాకరించటం, ప్రజల్ని నీచులుగా భావించటం'' అని చెప్పారు. (ముస్లిం)

### అసూయ, ఆత్మసంతృప్తి

''పోనీ, రాజ్యాధికారంలో వారికేమైనా వాటాఉందా? ఉంటే వారు ప్రజలకు చిల్లి గవ్వ కూడా ఇవ్వరు. లేక, దేవుడు దయతో వారికి (దైవదౌత్య) భాగ్యం ప్రసాదించాడని అసూయ పడుతున్నారా?'' (ఖుర్ఆన్–4:53)

దైవప్రవక్త (స) ప్రవచనం: ''అసూయకు దూరంగా ఉండండి. అగ్ని కట్టెల్ని కాల్చినట్లు. అసూయ సత్కర్మల్ని భస్మీపటలం చేస్తుంది.'' (అబూదావూద్)

''మీరు ఒకరిపై నొకరు అసూయా ద్వేషాలు పెంచుకోకండి. ఒకరికొకరు పరోక్ష నిందకు కూడా పాల్పడకండి. దైవదాసులారా! మీరంతా పరస్పరం అన్నదమ్ములుగా (సోదర భావంతో) జీవించండి. తోటి ముస్లిం సోదరునితో మూడు రోజులకన్నా మించి మాట్లాడకుండా ఉండటం ఏ వ్యక్తికీ ధర్మసమ్మతం కాదు.'' (బుఖారి)

హజ్రత్ అబూహురైరా (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ప్రవచనం: ''దీనార్, దిర్హం, పట్టువస్త్రాల దాసుడు నాశనమైపోవుగాక! అవి లభించినంత కాలం అతను సంతృప్తి చెందుతాడు, లభించకపోతే అసంతృప్తికి గురవుతాడు.'' (బుఖారి)

హజ్రత్ అబ్దుల్లా బిన్ అమ్ర్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (స) ప్రవచనం:

"ఎవరైతే ఇస్లాం స్వీకరించి, జీవన మనుగడకు కావలసిన ఉపాధి పొందాడో, ఎవరికైతే తనకు లభించిన ఉపాధి పట్ల దేవుడు ఆత్మసంతృప్తి భాగ్యం ప్రసాదించాడో అతను కృతార్థుడయినట్లే." (ముస్లిం-మిష్కాత్)

# 87. మద్యం, జూదం

"వారు నిన్ను మద్యం, జూదాలను గురించి అడుగుతున్నారు. ఈ రెండిటిలోనూ ఎంతో నష్టముందని చెప్పు. వీటిలో ప్రజలకు కొన్ని ప్రయోజనాలున్నా, ఆ ప్రయోజనాల కన్నా నష్టాలే ఎక్కువగా ఉన్నాయి." (ఖుర్ఆన్-2:219)

"విశ్వాసులారా! మీరు మైకంలో ఉన్నప్పుడు ప్రార్థన దరిదాపులకు పోకండి. ప్రార్థనలో మీరు పఠిస్తున్నదేమిటో మీకు తెలుస్తున్నప్పుడే ప్రార్థన చేయాలి." (ఖుర్ఆన్-4:43)

"విశ్వాసులారా! మద్యం, జూదం, దైవేతరాలయాలు, పాచికల జోస్యం- ఇవన్నీ అసహ్యకరమైన పైశాచిక విషయాలు. వాటికి దూరంగా ఉండండి, మీ జీవితం సార్థక మవుతుంది. మద్యం, జూదాల ద్వారా షైతాన్ మీమధ్య విరోధం, విద్వేషబీజాలు నాటి మిమ్మల్ని దైవధ్యానం, ప్రార్థనల నుండి నిరోధించగోరుతున్నాడు. కనుక ఇకనైనా మీరు వాటిని మానుకోండి. దైవాజ్ఞలను, ఆయన ప్రవక్త హితవుల్ని పాటించండి. వాటిని పాటించకుండా ముఖం తిప్పుకుంటే మాత్రం (మీకే నష్టం), ఆదేశాన్ని యథాతథంగా అందజేయడమే మా ప్రవక్త బాధ్యత." (ఖుర్ఆన్-5:90-92)

ఈ ఆదేశంతో దైవప్రవక్త (స) ఇకనుండి ఎవరూ మద్యం ముట్టడంగాని, అమ్మడంగాని చేయకూడద ప్రకటన చేయించారు. ఈ ప్రకటన వినగానే ముస్లింలంతా తమ తమ ఇండ్లలో ఉన్న మద్యాన్నంతటినీ వీధుల్లోకి తెచ్చి పారబోశారు.

కొందరు మద్యం గురించి దైవప్రవక్త (స) ముందు ప్రస్తావిస్తూ "దీన్ని యూదులకు కానుకగా ఇవ్వచ్చా?" అని అడిగారు. దానికి దైవప్రవక్త (స) "మద్యాన్ని నిషేధించిన వాడు (దేవుడు) దాన్ని ఇతరులకు కానుకగా ఇవ్వడాన్ని కూడా నిషేధించాడు" అన్నారు. మరొకతను దీన్ని మందుగా వాడుకోవడానికి అనుమతివ్వమని అడిగాడు. దైవప్రవక్త (స) అనుమతి నిరాకరిస్తూ "అది మందు కాదు, వ్యాధి" అన్నారు.

వేరొకతను వచ్చి "దైవప్రవక్తా! మేము తీవ్రమయిన చలి ఉండే ప్రాంతంలో ఉంటున్నాం. కాయకష్టం కూడా ఎక్కువగా చేయవలసి వస్తుంది. మద్యం వల్ల మాకు కాస్త సేద తీరుతుంది. చలికి తట్టుకునే శక్తి కూడా వస్తుంది" అన్నాడు. దైవప్రవక్త (స) ఈమాట విని "మీరు తాగే ఆ పానీయం వల్ల మత్తు కలుగుతుందా?" అని అడిగారు. దానికావ్యక్తి "కలుగుతుంది" అన్నాడు. "అయితే దాన్ని మానుకోవాల్సిందే" అన్నారు దైవప్రవక్త (స). "కాని మాప్రాంతం జనం ఒప్పుకోరే ఎలా?"అన్నాడా వ్యక్తి. "ఒప్పుకోకపోతే వారితో యుద్ధం చేయండి" అన్నారు దైవప్రవక్త (స). (మిష్కాత్)

జూదం కూడా ఘోర పాపకార్యమే. ఇందులో అనేకమంది వ్యక్తుల డబ్బు ఎలాంటి శ్రమ లేకుండానే ఒక వ్యక్తికి లభిస్తుంది. ఈనాటి మట్కా, లాటరీలు ఈ కోవకు చెందినవే. వ్యాపారస్థులు నడిపే కొన్నిరకాల స్కీములు కూడా జూదం క్రిందికే వస్తాయి. పాచికలద్వారా



జోస్యం చెప్పడమనేది అజ్ఞానకాలం అరబ్బుల్లో ఉండే మూఢనమ్మకం. జాతకం, జోతిష్యం, వారఫలాల పేరుతో ఈనాడు కూడా అనేకమంది ఈజాడ్యానికి గురవుతున్నారు.

చెప్పు: "అత్యధికసంఖ్యలో ఉండే అపరిశుద్ధవస్తువులు మిమ్మల్ని ఎంతగా ఆకట్టు కున్నా (అవి పరిశుద్ధవస్తువులు కాజాలవు) పరిశుద్ధం, అపరిశుద్ధం ఎన్నటికీ ఒకటి కాజాలవు. కనుక బుద్ధిమంతులారా! (ప్రతి వ్యవహారంలోనూ) దేవునికి భయపడుతూ మసలుకోండి, మీ జీవితం సార్థకమవుతుంది." (ఖుర్ఆన్-5:100)

# 88. అశ్లీలం, వ్యభిచారం

హజ్రత్ అబూహురైరా (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ప్రవచనం: "దేవుడు ఆదం కుమారుడి అదృష్టంలో వ్యభిచార భాగం (కొద్దో గొప్పో) లిఖించాడు. అది అతనికి ఎలాగూ లభిస్తుంది. కనుక (పరస్త్రీని కామదృష్టితో చూడటం) కళ్ళ వ్యభిచారం. (అశ్లీల మాటలు పలకడం) నోటి వ్యభిచారం. మానవుని మనస్సు (అశ్లీల చేష్టలు) కోరుతుంది. (ఇది భావపరమైన వ్యభిచారం). అయితే అతని మర్మాంగం ఆ కోరికకు కార్యరూపం ఇవ్వటమో లేక నిరాకరించడమో చేస్తుంది." (బుఖారి, ముస్లిం)

అశ్లీలం, వ్యభిచారం గురించి ఖుర్ఆన్‌లోని ఈ సూక్తులు గమనించండి:

"వ్యభిచారం దరిదాపులకు పోకండి. అది చాలా హేయమైనది, పరమచెడ్డదారి." (ఖుర్ఆన్-17:32)

"ప్రవక్తా! విశ్వసించిన పురుషులు తమ చూపులు (పరస్త్రీలపై పడకుండా వేరే వైపు) మరల్చుకోవాలని, తమ మర్మావయవాలను కాపాడుకోవాలని వారికి చెప్పు. వారికి ఇది చాలా శ్రేష్ఠమయిన పద్ధతి. వారు చేసే పనులన్నీ దేవుడు గమనిస్తూనే ఉంటాడు." (ఖుర్ఆన్-24:30)

"(ముహమ్మద్-స)! విశ్వసించిన స్త్రీలు తమ చూపులు (పరపురుషులపై పడకుండా వేరే వైపు) మరల్చుకోవాలని, తమ మర్మావయవాలు కాపాడుకోవాలని వారికి చెప్పు." (ఖుర్ఆన్-24:31)

"ఒక వ్యభిచారి వ్యభిచారిణిని లేదా బహుదైవారాధకురాలిని తప్ప మరెవరినీ వివాహమాడరాదు. అలాగే ఒక వ్యభిచారిణి వ్యభిచారిని లేదా బహుదైవారాధకుడ్ని తప్ప మరెవరినీ వివాహమాడరాదు. విశ్వాసులకు ఇలాంటి వివాహం నిషేధించబడింది." (ఖుర్ఆన్-24:3)

"వారు తమ భార్యలు, బానిసస్త్రీల విషయంలో తప్ప (ఇతరస్త్రీల విషయంలో) తమ మర్మావయవాలు కాపాడుకుంటారు. (అంటే వ్యభిచారం తదితర అశ్లీలచేష్టలకు పాల్పడరు.) బానిసస్త్రీల విషయంలో వారిపై ఎలాంటి నింద లేదు. అది తప్ప మరేదైనా కోరేవారే హద్దుమీరిన వారవుతారు." (ఖుర్ఆన్-23:5-7)

ఈ సూక్తిలో వ్యభిచారం, స్వలింగసంపర్కం, ముష్టిమైథునం (హస్తప్రయోగం) మొదలైన అక్రమ లైంగికచేష్టలన్నీ నిషేధించబడ్డాయి. దైవప్రవక్త (సల్లం) ఓసారి యువకుల్ని ఉద్దేశించి ఇలా హితోపదేశం చేశారు:

"యువకుల్లారా! మీలో వివాహబాధ్యతలు నెరవేర్చే శక్తి గలవారు తప్పక వివాహం చేసుకోవాలి. వివాహం దృష్టిని క్రిందికి వాలేలాచేస్తుంది. మర్మాంగాన్ని కాపాడుతుంది. వివాహబాధ్యతలు నెరవేర్చలేని (పెళ్ళి చేసుకోలేని)వారు అప్పుడప్పుడు ఉపవాసం పాటించాలి. ఉపవాసం కామోద్రేకాల్ని నిగ్రహింపజేస్తుంది." (బుఖారి, ముస్లిం)

అయితే హస్తప్రయోగం విషయంలో షరీఅత్ వేత్తల (ఫిఖహ్‌వేత్తల) మధ్య భేదాభిప్రా యాలున్నాయి. ఇమామ్ అహ్మద్ బిన్ హంబల్ (రహ్మ) దీన్ని ధర్మసమ్మతంగా పరిగణించారు. ఇమామ్ మాలిక్ (రహ్మ), ఇమామ్ షాఫయి (రహ్మలై)లు దీన్ని నిషిద్ధం (హరాం)గా పరిగణిం చారు. హనఫీల దగ్గర ఇది నిషిద్ధం అయినప్పటికీ, తీవ్రమైన కామోద్రేకం కలిగినప్పుడు యాదృ చ్ఛికంగా ఈ పని జరిగిపోతే దేవుడు క్షమిస్తాడని ఆశించవచ్చని అంటారు వారు.

## 89. సభ్యతా సంస్కారాలు

సభ్యత, సంస్కారం, నాగరికతలు జీవితంలోని వివిధ రంగాల్లో ఉండే విషయాలు. ఇస్లాంకు సంబంధించిన సభ్యత, సంస్కారం, నాగరికతలు కూడా ముస్లిం జీవితంలో ఉండ వలసిన విషయాలే. అయితే వివరాలకు ఈ పుస్తకంలోనే వివిధ అధ్యాయాలలో విస్తరించబడి ఉన్నందున ఇక్కడ కొన్ని ప్రత్యేక హదీసులు మాత్రమే పేర్కొనబడుతున్నాయి.

"విశ్వాసులారా! మీరు గనక భయభక్తుల వైఖరి అవలంబిస్తే దేవుడు మీకు మంచీ చెడుల విచక్షణాజ్ఞానం ప్రసాదిస్తాడు; మీలో ఉన్న చెడుగులు తొలగిస్తాడు." (దివ్య ఖుర్ఆన్-8:29)

### వస్త్రధారణ, అలంకరణలు

"ఆదం సంతానమా! మీరు మీ మర్మావయవాలను కప్పుకోవడానికి, మీ దేహానికి రక్షణగా, అలంకరణగా ఉపయోగపడటానికి మేము మీకు దుస్తులు ప్రసాదించాం. అయితే అన్నిటికంటే భయభక్తుల దుస్తులే ఎంతోశ్రేష్ఠమైనవి." (ఖుర్ఆన్-7:26)

దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "స్త్రీదుస్తులు ధరించే పురుషుల్ని, పురుష దుస్తులు ధరించే స్త్రీలను దైవప్రవక్త (స) శపించారు." (అబూదావూద్)

పురుషులకు కనీసం నాభి నుండి మోకాళ్ళ కింది వరకు ఆచ్ఛాదన ఉండాలి. దీన్నే షరీఅత్ పరిభాషలో 'సతర్' అంటారు. అయితే లుంగీగాని, పైజామాగాని ధరిస్తే అది చీలమండలకు కిందికి ఉండకూడదని కొన్ని హదీసుల ద్వారా తెలుస్తోంది.

హజ్రత్ అబూహురైరా (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "మడమల కిందికి వ్రేలాడే ధోవతి భాగం నరకాగ్నికి ఆహుతి అవుతుంది." (బుఖారి)

హజ్రత్ ఇబ్నెఉమర్ (రజి) ఉల్లేఖనం: దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "గర్వంతో తన నడుం వస్త్రాన్ని (అంటే లుంగీ లేక పైజామాను) నేల మీద ఈడుస్తూ నడిచేవాడ్ని దేవుడు ప్రళయదినాన కన్నెత్తి కూడా చూడడు." హజ్రత్ అబూబకర్ (రజి) ఈమాట విని ఆందోళనపడుతూ "దైవప్రవక్తా! నేను ఎంత జాగ్రత్త వహిస్తున్నా నా నడుం వస్త్రం కిందికి జారిపోతుంది" అన్నారు. దానికి దైవప్రవక్త (స) "నీవు గర్వంతో వస్త్రాన్ని ఈడుస్తూ నడిచే మనిషివి కావు. (అంచేత నీకీ మాట వర్తించదు)" అని చెప్పారు. (బుఖారి)



హజ్రత్ అబూహురైరా (రజి) కథనం: ఒకతను తన నడుం వస్త్రాన్ని (మడమల) కిందికి వ్రేలాడదీసి నమాజ్ చేయసాగాడు. దైవప్రవక్త (స) అతడ్ని పిలిచి "వెళ్ళి ఉజూ చేసుకొని రా" అని ఆదేశించారు. ఆ మనిషి వెళ్ళి ఉజూ చేసి వచ్చాడు. కాని దైవప్రవక్త (స) మళ్ళీ అతడ్ని "వెళ్ళి ఉజూ చేసుకొని రా" అని ఆదేశించారు. ఇది గమనించిన మరొకతను "దైవప్రవక్తా! మీరతడ్ని ఉజూ చేయమని ఆజ్ఞాపించి (కారణం చెప్పకుండా) మౌనంగా ఉంటున్నారేమిటీ?" అని అడిగాడు. దానికి దైవప్రవక్త (స) "అతను ఇంతకు ముందు నడుం వస్త్రాన్ని వ్రేలాడదీసి నమాజ్ చేశాడు. అలా నడుం వస్త్రాన్ని వ్రేలాడదీసే వాని నమాజ్‌ను దేవుడు స్వీకరించడు" అని అన్నారు. (అబూదావూద్)

పురుషులకు పైజామా ప్యాంటు చీలమండలు వరకైతే పరవాలేదుగాని, అంతకుమించి కిందికి ఉండకూడదు. ఈఆజ్ఞ పడకగది, మరుగుదొడ్లలో ఉన్నప్పుడు తప్ప ఎల్లవేళలా వర్తిస్తుంది. స్త్రీలకు ముఖం, ముంజేతులు, పాదాలు తప్ప మిగతా శరీరమంతా బట్ట ఉండాలి. ఏదైనా పనిమీద ఇంటినుంచి ఎక్కడికైనా బయలుదేరవలసివస్తే తల, ముఖంతో సహా మొత్తం దేహాన్ని వస్త్రంతో కప్పుకోవాలి. కాకపోతే కళ్ళు కన్పించేలా ఏర్పాటు చేసుకోవచ్చు. ఇలాంటి వస్త్రధారణ వల్ల పోకిరీలతో సహా పరపురుషులంతా, వీరు గౌరవప్రదమైన కుటుంబాలకు చెందిన స్త్రీలని భావించి వారివైపు దురుద్దేశంతో కన్నెత్తి చూడటానికి కూడా సాహసించలేరు.

"ప్రవక్తా! నీ భార్యలకు, కుమార్తెలకు, (ఇతర) ముస్లిం మహిళలకు వారు తమ పైటలను తమ (ముఖాల)పై కప్పుకోవాలని చెప్పు. ఇదే సరైన పద్ధతి. దీనివల్ల వారిని ఎవరైనా గుర్తించి వేధిస్తారనే భయముండదు." (ఖుర్ఆన్-33:59)

ఇస్లాం అశ్లీలం, అత్యాచారాల్ని పూర్తిగా తుడిచిపెట్టి ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించగోరుతోంది. అత్యాచారాలు, అక్రమసంబంధాల వల్ల సమాజానికి మూలస్తంభమైన కుటుంబవ్యవస్థ కుంటుపడుతుంది. ప్రజలకు మనశ్శాంతి కరువైపోతుంది. హత్యలు, ఆత్మ హత్యలు పెరిగిపోతాయి. అందువల్ల ఇస్లాం ఇలాంటి చెడులకు కారణమయ్యే అశ్లీల విషయాలపై కూడా ఆంక్షలు విధించి, వాటిని మొగ్గలోనే త్రుంచివేయదలచింది.

హజ్రత్ అనస్ (రజి) కథనం: పురుషులు కాషాయ రంగు బట్టలు ధరించకూడదని దైవప్రవక్త (స) మాకు తాకీదు చేశారు. (బుఖారి)

దైవప్రవక్త (స) ఓరోజు మసీదులో కూర్చొనివున్నప్పుడు చెదరిన శిరోజాలు, గడ్డంతో ఒకతను వచ్చాడు. దైవప్రవక్త (స) అతడ్ని చూసి "వెళ్ళి నీ తల, గడ్డం వెండ్రుకలు (దువ్వి) సరిచేసుకో" అనే అర్థంలో చేత్తో సైగ చేశారు. ఆ వ్యక్తి వెళ్ళి తల, గడ్డం వెండ్రు కలు సరిచేసుకొని వచ్చాడు. అప్పుడు దైవప్రవక్త (స) అతడ్ని చూసి "మనిషి చింపిరి జుట్టు, చెదరిన వెండ్రుకలతో దయ్యంలా ఉండటం కంటే ఇది మంచిది కాదా?" అని అన్నారు. (అతాబిన్ యసార్- మిష్కాత్)

అబుల్‌అహ్‌వస్ తండ్రి (రజి) కథనం: నేనొక రోజు నాసిరకం బట్టలు ధరించివున్న స్థితిలో దైవప్రవక్త (స) దగ్గరకు వెళ్ళాను. ఆయన నన్ను చూసి "నీ దగ్గర సంపద ఏమైనా ఉందా?" అని అడిగారు. నేను ఉందని చెప్పాను. ఆయన "ఎలాంటి సంపద ఉంద"ని అడిగారు. నేను "దేవుడు నాకు అన్నిరకాల సంపదలు ఇచ్చాడు. నా దగ్గర ఒంటెలూ

ఉన్నాయి, ఆవులూ ఉన్నాయి, గుర్రాలూ ఉన్నాయి, బానిసలూ ఉన్నారు" అన్నాను. అప్పుడు దైవప్రవక్త (స) "దేవుడు నీకు ఇన్ని సంపదలు ఇచ్చివున్నపుడు నీ(ఒంటి) మీద ఆయన అనుగ్రహఛాయలు కన్పించాలి మరి" అని అన్నారు. (మిష్కాత్)

దైవప్రవక్త (స) హితోక్తి: "యూదులు, క్రైస్తవులు జుట్టుకు రంగు వేసుకోరు. మీరు (రంగువేసుకొని) వారికి వ్యతిరేకంగా చేయండి. (అబూహురైరా-బుఖారి, ముస్లిం)

ప్రతి జాతికీ తన అస్తిత్వాన్ని, సంస్కృతిని కాపాడుకోవడానికి ఇతర జాతులను అనుక రించకుండా ఉండటం చాలా అవసరం. ఇలా చేయడం ఆ జాతి ఆత్మగౌరవానికి కూడా ఎంతో అవసరం. అందువల్ల ముస్లింలు తమ దైనందిన అలవాట్లు, వేషధారణ విషయంలో వీలైనంతవరకు అవిశ్వాసుల్ని వ్యతిరేకించాలని పైహదీస్ మనకు తెలియజేస్తోంది. అహ్లెహదీస్ దృక్పథం ప్రకారం స్త్రీపురుషులు ఇరువురూ వెండ్రుకలకు ఎర్రరంగు వేసుకోవచ్చు, నల్లరంగు నిషిద్ధం. కొందరు ధర్మవేత్తలు నల్లరంగు వేసుకోవడం 'మక్రూహెతన్జీహి' (దాదాపు నిషిద్ధం) అన్నారు. అసలు జుట్టురంగు వాడవచ్చా లేదా అనే విషయంలో కూడా సనాతనవాదుల్లో భేదాభిప్రాయాలున్నాయి. కొందరి దృష్టిలో రంగు వేసుకోవడం మంచిది. మరికొందరి దృష్టిలో వేసుకోకపోవడమే మంచిది. హజ్రత్ అబ్దుల్లా బిన్ఉమర్ (రజి), హజ్రత్ అబూహురైరా (రజి)లు కడిమి, నీలి ఆకులతో తయారయ్యే ఎర్రరంగు వేసుకునేవారు. కొందరు సహాబీలు నల్లరంగు కూడా వాడారు. ఉదాహరణకు- హజ్రత్ ఉస్మాన్, హసన్, హుసైన్, ఉఖ్బా బిన్ ఆమిర్, ఇబ్నెసీరీస్, అబూబర్దా (రజి). పోతే సమరయోధుల విషయంలో అందరూ ఏకీభ వించారు. సమరయోధులు శత్రువులపై తమ గాంభీర్యత ప్రదర్శించడానికి నల్లరంగు వేసు కోవడం ధర్మసమ్మతమే కాదు, చాలా మంచిది కూడా. (ఇమామ్ నవవీ-రహ్మలై)

## విలాస వస్తువులు వాడకూడదు

విశ్వాసులు విలాస(Luxurious) వస్తువులు వాడటాన్ని ఇస్లాం అసహ్యించుకుంటుంది. వెండి, బంగారు ఆభరణాలను స్త్రీలకు పరిమితం చేసి, పురుషులకు నిషేధించింది.

హజ్రత్ హుజైఫా బిన్ యమాన్ (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ప్రవచనం: "సాధారణ పట్టువస్త్రాలు, ముతక పట్టువస్త్రాలు ధరించకండి. వెండి, బంగారు పాత్రలలో నీళ్ళు తాగకండి, వాటిలో ఆహార పదార్థాలు తినకండి. ఈ వస్తువులు ఇహలోకంలో అవిశ్వాసుల కోసం కేటాయించబడ్డాయి, మన కోసం కాదు." (బుఖారి, ముస్లిం)

దైవప్రవక్త (స) ప్రవచనం: "వెండి చెంబుతో నీళ్ళు తాగేవాడు వాస్తవానికి ఒక్కో నీటి గుక్కతో పాటు తన పొట్టలో అగ్ని పోసుకున్నట్లే." (బుఖారి, ముస్లిం)

హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి) కథనం: ఉమర్ బిన్ ఖత్తాబ్ (రజి) మస్జిద్ ద్వారం దగ్గర స్వచ్ఛమైన ఓ పట్టువస్త్రాల జత చూసి "దైవప్రవక్తా! ఈ జత బట్టలు మీరు కొని, శుక్రవారం రోజు బయట నుండి మిమ్మల్ని కలుసుకోవడానికి ప్రతినిధి వర్గాలు వచ్చినప్పుడు వాటిని ధరిస్తే ఎంత బాగుండు!" అని అన్నారు. దానికి దైవప్రవక్త (స) సమాధానమిస్తూ "పరలోకం (స్వర్గం)లో ఎలాంటి (ప్రతిఫలం) వాటాకు నోచుకోనివాడే దీన్ని ధరిస్తాడు" అని అన్నారు. (బుఖారి, ముస్లిం)

హజ్రత్ అబూబుర్దా (రజి) కథనం: హజ్రత్ ఆయిషా (రజి) ఒక కంబళీ, ఒక



ముతక లుంగీ తీసిచూపిస్తూ "దైవప్రవక్త (స) ఇహలోకం వీడిపోయేటప్పుడు ఈ రెండు బట్టలు ధరించారు" అని అన్నారు. (బుఖారి)

హజ్రత్ జాబిర్ (రజి) కథనం: దైవప్రవక్త (స) నన్ను "నీ దగ్గర ఏదైనా తివాచీగాని, దుప్పటిగాని ఉందా?" అని అడిగారు. దానికి నేను "మా దగ్గర తివాచీలు ఎక్కడ్నుంచి వస్తాయి?" అన్నాను. "అయితే అనతికాలంలోనే మీకు తివాచీలు లభిస్తాయి" అన్నారు దైవప్రవక్త (స). ఆ తర్వాత నేను (ఎప్పుడైనా) నా భార్యతో "నీ తివాచీ నువ్వే తీసేసుకో" అనంటే, "అనతి కాలంలోనే మీకు తివాచీలు లభిస్తాయని దైవప్రవక్త (స) చెప్పలేదా?" అని అనేది మాఆవిడ. దాంతో నేను మౌనంగా ఉండిపోతాను. (బుఖారి)

హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి) ఇలా తెలియజేశారు: దైవప్రవక్త (స) బంగారపు ఉంగరం చేయించుకొని దాని రాయి చేతి లోపలికి ఉండేలా ధరించ సాగారు. అది చూసి ఆయన అనుచరులు కూడా అలాగే ధరించడం మొదలుపెట్టారు. ఆ తరువాత ఓరోజు దైవప్రవక్త (స) మస్జిద్ వేదిక ఎక్కి ఉంగరం తీసేసి ఇలా అన్నారు- "నేనీ ఉంగరం ధరించేవాడ్ని. దీని రాయి చేతికి కింది వైపుండేలా పెట్టుకునేవాడ్ని" అన్నారు. ఆ తరువాత ఆయన దాన్ని పారేసి "దైవసాక్షి! నేనిక నుంచి ఈ ఉంగరాన్ని ఎన్నటికీ పెట్టుకోను" అన్నారు. ఈమాట వినగానే అనుచరులు కూడా తమతమ ఉంగరాలు తీసిపారేశారు. (బుఖారి, ముస్లిం)

హజ్రత్ అనస్ బిన్ మాలిక్ (రజి) కథనం: నేను దైవప్రవక్త (స) వ్రేలికి ఒక వెండి ఉంగరం చూశాను. అది చూసి అనుచరులు కూడా వెండి ఉంగరాలు చేయించుకొని పెట్టుకున్నారు. (దానికి పూర్వం) దైవప్రవక్త (స) బంగారపు ఉంగరం తీసిపారేస్తే అనుచ రులు కూడా తమతమ (బంగారపు) ఉంగరాలు తీసిపారేశారు. (బుఖారి)

హజ్రత్ అనస్ (రజి) కథనం: దైవప్రవక్త (స) అరబ్బేతర రాజు పేర ఒక లేఖ వ్రాయించారు లేక వ్రాయించడానికి నిర్ణయించుకున్నారు. అప్పుడు అనుచరులు "వారీ లేఖ మీద (రాజ)ముద్ర లేకపోతే చదవరు" అన్నారు. అంచేత దైవప్రవక్త (స) ఒక వెండి ఉంగరం చేయించి దానిపై 'ముహమ్మదుర్రసూలుల్లాహ్' అని వ్రాయించారు. ఆయన వ్రేలికున్న ఆ ఉంగరం మెరుపు ఇప్పటికీ నా మనోవీథిలో మెదలుతోంది. (బుఖారి)

హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి) కథనం: దైవప్రవక్త (స) ఒక వెండి ఉంగరం తయారుచేయించారు. అది ఎల్లప్పుడూ ఆయన వ్రేలికి ఉండేది. ఆయన ఇహలోక నిష్క్రమణ తరువాత ఆ ఉంగరం అబూబకర్ (రజి) చేతికి వచ్చింది. ఆయన తరువాత అది ఉమర్ (రజి) చేతిలోకి, ఆ తరువాత ఉస్మాన్ (రజి) చేతిలోకి పోయింది. అరీస్ బావిలో పడిపోయే వరకూ అది ఉస్మాన్ (రజి) వ్రేలికి ఉండేది. దానిపై "ముహమ్మదు ర్రసూలుల్లాహ్" అని వ్రాయబడి ఉంది. (బుఖారి, ముస్లిం)

## ఆహార పానీయాలు

హజ్రత్ ఉమర్ బిన్ సలమా (రజి) కథనం: నా బాల్యంలో నేను దైవప్రవక్త (స) సంరక్షణలో పెరిగాను. నేను అన్నం తినేటప్పుడు నాచేయి కంచంలో అటూఇటూ

తిరుగుతుండేది. ఓరోజు దైవప్రవక్త (స) నన్ను చూసి "అబ్బాయ్! (అన్నం తినే ముందు) బిస్మిల్లా అని పఠించాలి. కుడిచేత్తో తినాలి. కంచం ముందుభాగం నుండి తినాలి" అని ఉపదేశించారు. ఆరోజు నుండి నేను తినేపద్ధతి ఆ ప్రకారమే ఉంటూవస్తోంది. (బుఖారి)

దైవప్రవక్త (స) ప్రవచనం: "మీలో ఎవరి (చేతి) నుండైనా అన్నంముద్ద క్రింద పడి పోతే అతనా ముద్ద ఎత్తి దానికి తగిలిన మట్టి శుభ్రంచేసుకొని తినాలిగాని, దాన్ని షైతాన్ కోసం వదలి పెట్టకూడదు. వ్రేళ్ళను నాక్కోనంత వరకు తిన్న చేతిని గుడ్డతో తుడుచుకో రాదు. ఏ అన్నం (మెతుకు)లో శుభం ఉందో అతనికి తెలియదు." (ముస్లిం)

దైవప్రవక్త (స) ప్రవచనం: "(కలసి తింటే) ఇద్దరు మనుషుల భోజనం ముగ్గురికి సరిపోతుంది; ముగ్గురు మనుషుల భోజనం నలుగురికి సరిపోతుంది." (బుఖారి)

"దైవప్రవక్త (స) కాలంలో (ఆయన అనుచరులు) నడుస్తూ, తిరుగుతూ కూడా (ఆహారం) తినేవారు, (నీళ్ళు) తాగేవారు." (తిర్మిజి)

హజ్రత్ అబూహురైరా (రజి) కథనం: దైవప్రవక్త (స) ఎన్నడూ ఆహారంలో లోపం ఎత్తి చూపలేదు. ఆయన తనకు ఇష్టమైతే తినేవారు, ఇష్టం లేకపోతే మానేసేవారు. (అంతేగాని అది బాగాలేదు, ఇది బాగా లేదని లోపాలు ఎంచేవారుకాదు.)- (బుఖారి)

హజ్రత్ అబూహురైరా (రజి) కథనం: ఒకతను అన్నం చాలా ఎక్కువగా తినేవాడు. అయితే అతను ముస్లిం అయిన దగ్గర్నుంచి చాలా తక్కువగా తినసాగాడు. ఈ సంగతి దైవప్రవక్త (స) దృష్టికి వచ్చినపుడు ఆయన ఇలా అన్నారు: "విశ్వాసి ఒక పేగు నిండా మాత్రమే తింటాడు, అవిశ్వాసి ఏడు పేగుల నిండా తింటాడు." (బుఖారి)

హజ్రత్ అబూసయీద్ ఖుద్రీ (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ఇలాఅన్నారు: "నీటి తిత్తి తలకిందులుగా వంచి దాని మూతికి నోరు ఆనిచ్చి నీళ్ళు తాగడాన్ని దైవప్రవక్త (స) మమ్మల్ని వారించారు." (బుఖారి, ముస్లిం); దైవప్రవక్త (స) హితోక్తి: "నీళ్ళు తాగేటప్పుడు చెంబులో శ్వాస వదలకూడదు." (బుఖారి, ముస్లిం)

హజ్రత్ అనస్ (రజి) చెంబుతో నీళ్ళు తాగేటప్పుడు మూడుసార్లు గాలి పీల్చుకునే వారు. దైవప్రవక్త (స) కూడా నీళ్ళు తాగేటప్పుడు మూడుసార్లు గాలి పీల్చుకునేవారని ఆయన అన్నారు. (అంటే మూడు గుక్కల్లో తాగేవారన్నమాట.) (బుఖారి)

హజ్రత్ అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి) కథనం: ఓసారి నేను దైవప్రవక్త (స)కు జమ్‌జమ్ నీళ్ళు అందించాను. దాన్ని ఆయన నిలబడి తాగారు. (బుఖారి)

హజ్రత్ జాబిర్ బిన్ అబ్దుల్లా (రజి) కథనం: అబూహమీద్ (రజి) అనే ఓ అన్సారీ ముస్లిం నఖీ చోటు నుండి దైవప్రవక్త (స) కోసం ఒక గిన్నెడు పాలు తెచ్చాడు. దైవ ప్రవక్త (స) దాన్ని చూసి "నీవు దీన్ని మూతపెట్టి ఎందుకు తీసుకురాలేదు? ఒక చెక్క ముక్కయినా దానిపై మూతపెట్టి తీసుకురావలసింది కదా?" అని అన్నారు. (బుఖారి)

హజ్రత్ అనస్ బిన్ మాలిక్ (రజి) కథనం: దైవప్రవక్త (స) ఓసారి మా ఇంటికి వచ్చారు. అప్పుడాయన మంచినీళ్ళు అడిగితే మేము మేక పాలు పితికి అందులో



కొంచెం బావినీళ్ళు కలిపి ఇచ్చాము. ఆ సమయంలో అబూబకర్ (స) ఆయనకు ఎడమ వైపున, ఉమర్ (రజి) ముందు వైపున, ఒక పల్లెవాసి కుడి వైపున కూర్చొని ఉన్నారు. దైవప్రవక్త (స) ఆ పాలలో కొంత తాగి వదలిపెట్టిన తరువాత ఉమర్ (రజి) "దాన్ని అబూబకర్ (రజి)కు ఇచ్చేయండి" అన్నారు. కాని దైవప్రవక్త (స) ఆ పాలగిన్నెను (తన కుడివైపు కూర్చున్న) పల్లెవాసికి ఇచ్చారు. తరువాత ఆయన ఇలా అన్నారు: "మొదట కుడివైపున్న వాడికి, మొదట కుడివైపున్న వాడికి ఇవ్వాలి. గుర్తుంచుకోండి, ఎల్లప్పుడూ కుడివైపు నుంచి ప్రారంభించాలి." (బుఖారి, ముస్లిం)

దైవప్రవక్త (స) హితోక్తి: "మత్తు కలిగించే ప్రతి పానీయమూ నిషిద్ధమే." (బుఖారి)

హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి) కథనం: దైవప్రవక్త (స) మధు పాత్రలను (ఇతర ఆహారపానీయాల కోసం) ఉపయోగించకూడదని మమ్మల్ని వారించారు. అప్పుడు ఒకతను లేచి "అందరి దగ్గర పాత్రలుండవు కదా (మరెలా)?" అని అన్నాడు. అలాంటి వారికి ఆయన మెరుగుపట్టని పాత్రలు వాడుకోవడానికి అనుమతి ఇచ్చారు. (బుఖారి)

## మాంసాహారం

హజ్రత్ అబూసాలబా ఖుషనీ (రజి) ఉల్లేఖనం: నేను దైవప్రవక్త (స)ను ఇలా అడిగాను- "దైవప్రవక్తా! మేము గ్రంథప్రజలు ఉండే ప్రాంతంలో నివసిస్తున్నాము. మరి మేము వారి కంచాలలో భోజనం చేయవచ్చా? మా ప్రాంతంలో వేట జంతువులు చాలా ఉన్నాయి. నేను ధనుర్బాణాలతో కూడా వేటాడుతాను, కుక్కల ద్వారా కూడా వేటాడుతాను. కుక్కలు శిక్షణ ఇవ్వబడినవి, ఇవ్వబడనవి కూడా ఉంటాయి. వీటిలో ఏ వేట మంచిది (ధర్మసమ్మతమైనది)?"

దానికి దైవప్రవక్త (స) ఇలా సమాధానమిచ్చారు- "నీవు గ్రంథప్రజల కంచాలను గురించి అడిగావు. మీకు వేరే కంచాలు లభిస్తే గ్రంథప్రజల కంచాలలో భోజనం చేయకండి. ఒకవేళ వేరే కంచాలు దొరక్కపోతే గ్రంథప్రజల కంచాలు (గిన్నెలు) శుభ్రంగా కడిగి వాటిలో మీరు భోజనం చేయవచ్చు. పోతే ధనుర్బాణాలతో వేటాడేటప్పుడు, బాణం వదిలేముందు 'బిస్మిల్లా' అని పఠించి బాణం వదలాలి. అప్పుడా వేటజంతువుని మీరు తినవచ్చు. శిక్షణ ఇవ్వబడిన కుక్కను వేటకు వదిలేటప్పుడు 'బిస్మిల్లా' పఠించి వదలిపెడ్తే అలాంటి వేటజంతువు కూడా మీరు తినవచ్చు. ఒకవేళ శిక్షణ ఇవ్వబడని కుక్క ద్వారా వేటాడవలసి వచ్చినప్పుడు, వేటజంతువు సజీవంగా దొరికితే దాన్ని (బిస్మిల్లా పఠించి) జిబహ్ చేసి తినండి." (బుఖారి, ముస్లిం)

ఇమామ్ నవవీ (రహ్మ) ప్రకారం గ్రంథప్రజలు తమ కుండలలో పందిమాంసం వండు తారని, తమ పాత్రలలో సారాయి తాగుతారని అబూదావూద్ ఉల్లేఖించిన హదీసులో ఉంది. అంచేత ఇతర పాత్రలు లభిస్తే వారి పాత్రలు వాడకూడదని దైవప్రవక్త (స) అన్నారు. అయితే ఇతర పాత్రలు ఉన్నప్పటికీ బహుదైవారాధకుల పాత్రలు కడిగి వాడుకోవచ్చని ఫిఖ్హావేత్తల అభిప్రాయం. అంటే ఇక్కడ అశుద్ధతలేని పాత్రలు వాడుకోవచ్చని వీరి అభిప్రాయం.

హజ్రత్ అనస్ బిన్ మాలిక్ (రజి) కథనం: దైవప్రవక్త (స) రెండు తెలుపు-నలుపు గొర్రెలు ఖుర్బానీ (బలి) ఇచ్చారు. వాటికి కొమ్ములు కూడా ఉన్నాయి. దైవప్రవక్త (స)

వాటిని తమ స్వహస్తాలతో జిబహ్ చేశారు. జిబహ్ చేసేటప్పుడు "బిస్మిల్లాహి అల్లాహు అక్బర్" అని పఠించి గొర్రె మెడ మిద తన కాలు పెట్టారు. (బుఖారి)

హజ్రత్ అబూసాలబా (రజి) కథనం: దైవప్రవక్త (స) కోరలు గల జంతువుల్ని తిన కూడదని (మమ్మల్ని) వారించారు. (బుఖారి, ముస్లిం)

హదీసు మూలభాషలో వచ్చిన 'జినాబ్, జీముఖ్లద్' అనే పదాల అర్థాలను బట్టి కోరపళ్ళు, వాడిగోళ్ళు గల జంతువులు, పక్షులు నిషిద్ధమని తెలుస్తోంది.

హజ్రత్ జాబిర్ బిన్ అబ్దుల్లా (రజి) ఉల్లేఖనం: "ఖైబర్ యుద్ధం జరిగిన రోజుల్లో దైవప్రవక్త (స) మమ్మల్ని గాడిద మాంసం తినకూడదని వారించారు. అయితే గుర్రం మాంసం తినడానికి అనుమతించారు." (బుఖారి, ముస్లిం)

హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ఇలా అన్నారు: "నేను ఉడుం మాంసం తినను. అయితే దాన్ని నిషిద్ధంగా కూడా పరిగణించను." (బుఖారి)

హజ్రత్ అబ్దుల్లా బిన్ అబీఔఫా (రజి) ఉల్లేఖనం: "మేము దైవప్రవక్త (స)తో కలసి ఆరేడు యుద్ధాలలో పాల్గొన్నాం. అప్పుడు మేము మిడతలను కూడా తిన్నాం." (బుఖారి)

హజ్రత్ అనస్ (రజి) కథనం: "మేము ముర్రజ్జహ్రాన్ ప్రాంతం సమీపంలో ఒక కుందేలును వెంటాడాము. జనం (దాన్ని పట్టుకోవడానికి) పరుగెత్తారు. అయితే నేను (ఒక్కడ్నే మాత్రమే) ఆ కుందేలు దగ్గరకు చేరుకొని దాన్ని పట్టుకొని అబూతల్హా (రజి) దగ్గరకు తీసుకొచ్చాను. ఆయన దాన్ని జిబహ్ చేసి దాని నడుం లేక తొడల మాంసాన్ని దైవప్రవక్త (స)కు పంపించారు. ఆయన దాన్ని స్వీకరించి తిన్నారు." (బుఖారి)

హజ్రత్ జాబిర్ బిన్ అబ్దుల్లా (రజి) కథనం: "దైవప్రవక్త మమ్మల్ని ఖురైషీయుల వర్తక బిడారాలను అడ్డుకోవడానికి పంపించారు. మేము మూడొందల మంది రౌతులం. మా నాయకుడు అబూఉబైదా బిన్ జర్రా (రజి). సముద్రతీరంలో మేము అర్ధ నెలదాకా ఉండిపోవాల్సి వచ్చింది. దానివల్ల మేము కూటి కోసం బాధపడవలసి వచ్చింది. చివరికి మేము ఆకులు సైతం తిన్నాం. ఈ కారణంగా ఆ సైన్యానికి ఆకులసైన్యం అని పేరొచ్చింది. తరువాత మాకోసం సముద్రం 'అంబర్' అనే ఓ పెద్ద చేపను తీరం మీదికి విసిరింది. దాన్ని మేము పదిహేను రోజులదాకా తిన్నాం. దాని కొవ్వు మా శరీరాలకు రుద్దుకున్నాం. దాంతో మా శరీరాలు మునుపటిలా ఆరోగ్యవంతమై పోయాయి. తరువాత అందరికంటే పొడవైన వ్యక్తిని ఒంటె మీద కూర్చోబెట్టి ఆ చేప ఎముక కింది నుంచి పోనిస్తే అతను దానికి తగలకుండా సులభంగా పోగలిగాడు. (బుఖారి)

## అనుమతి లేనిదే లోనికి రాకూడదు

"విశ్వాసులారా! మీరు మీ ఇండ్లలోకి తప్ప ఇతరుల ఇండ్లలోకి వారి అనుమతి లేకుండా, వారికి సలాం చేయకుండా ప్రవేశించకండి. ఇది మీకెంతో మంచి పద్ధతి. దీన్ని మీరు దృష్టిలో పెట్టుకుంటారని మేమిలా బోధిస్తున్నాము. ఆ సమయంలో అక్కడ ఎవరూ కన్పించకపోతే, అనుమతి లభించనంతవరకు మీరు లోపలికి ప్రవేశించకండి. ఒకవేళ మీకు



(లోపల నుంచి) తిరిగి వెళ్ళిపోండని సమాధానం వస్తే మీరు వెళ్ళిపోండి. ఇది మీకెంతో శ్రేష్ఠమైన పద్ధతి. మీరు చేసే పనులన్నీ దేవునికి బాగా తెలుసు. అయితే ఎవరూ నివసించని ఇండ్లలో మీకు ప్రయోజనం చేకూర్చే వస్తువు ఏదైనా ఉంటే అలాంటి ఇండ్లలో (స్వేచ్ఛగా) ప్రవేశించవచ్చు. అందులో తప్పులేదు." (ఖుర్ఆన్-24:27-29)

ఈ సూక్తి ప్రకారం ఇతరుల ఇండ్లలోకి దొంగచాటుగా తొంగిచూడటం, ఇతరుల ఉత్తరాలు వారి అనుమతి లేకుండా చదవడం కూడా తప్పే.

ఈ విషయాన్ని గురించే దైవప్రవక్త (స) ఇలా చెప్పారు: "నీ అనుమతి లేకుండా ఎవరైనా నీ ఇంట్లోకి తొంగిచూస్తే నీవతడ్ని కంకర్రాయి విసరికొట్టు. దానివల్ల అతని కన్ను పోయినా నీమీద ఎలాంటి నిందరాదు." (బుఖారి)

దైవప్రవక్త (స) ప్రవచనం: "మనిషి తన సోదరుని ఉత్తరం అతని అనుమతి లేకుండా చదవడం అంటే అగ్నిలోకి తొంగిచూడటమే." (అబూదావూద్)

"విశ్వాసులారా! మీ బానిసలు, ప్రాజ్ఞత వయస్సుకు చేరుకోని మీ బాలబాలికలు (పడక గదిలో) మీ దగ్గరకు రావాలంటే వారు మూడు వేళల్లో మాత్రం మీ అనుమతి తీసుకో వలసి ఉంటుంది. అవి- ప్రాతఃకాల ప్రార్థనకు ముందు, మధ్యాహ్నంవేళ మీరు (విశ్రాంతి కోసం) మీ పైఉడుపులు తీసివేసినప్పుడు, రాత్రివేళ ఇషా నమాజ్ తరువాత. ఈ మూడు వేళలు మీకోసం ఏకాంత సమయాలు. అవి గడచిపోయిన తరువాత వారు మీ అనుమతి లేకుండా వస్తే అందులో మీ తప్పూ లేదు, వారి తప్పూ లేదు. మీరు మాటిమాటికి ఒకరి దగ్గరకు మరొకరు రావలసిన అవసరముంటుంది. (అందువల్ల ఈ ఆజ్ఞ ఇవ్వబడింది.) ఈవిధంగా దేవుడు తన సూక్తులు విడమరచి తెలియజేస్తున్నాడు." (ఖుర్ఆన్-24:58)

"మీ పిల్లలు ప్రాజ్ఞత వయస్సుకు చేరుకున్న తర్వాత వారు తమ పెద్దల లాగే (ఏ వేళయినా) అనుమతి తీసుకొనిరావాలి." (ఖుర్ఆన్-24:59)

## నామకరణం

హజ్రత్ అస్మా (రజి) కథనం: అబ్దుల్లా బిన్ జుబైర్ (రజి) నా కడుపులో ఉన్నప్పటి సంఘటన. నేను (మక్కా నుండి మదీనాకు) బయలుదేరినప్పుడు నిండు గర్భిణిగా ఉన్నాను. మదీనా వెళ్తూ 'ఖుబా'లో ఆగినప్పుడు అబ్దుల్లా పుట్టాడు. నేను పిల్లవాడ్ని తీసుకొని దైవప్రవక్త (స) సన్నిధికి వెళ్ళాను. పిల్లవాడ్ని ఆయన వడిలో పెట్టాను. అప్పుడు దైవప్రవక్త (స) ఓ ఖర్జూరపండు తెప్పించి నమిలి అబ్దుల్లా నోట్లో ఉంచారు. ఈవిధంగా అబ్దుల్లా కడుపులో అన్నిటికంటే ముందు పోయిన వస్తువు దైవప్రవక్త (స) లాలాజలమే. దైవప్రవక్త (స) మా బాబుకు ఖర్జూరంతో ఉగ్గుపోసి "దేవా! ఈ పిల్లవాడిపై శ్రేయోశుభాలు కురిపించు" అని దైవాన్ని ప్రార్థించారు. హిజ్రత్ (వలస) తరువాత మదీనాలో ముస్లింల ఇంట పుట్టిన పిల్లల్లో ఈ అబ్బాయే మొట్టమొదటి అబ్బాయి. (బుఖారి)

హజ్రత్ అబూమూసా అష్అరీ (రజి) కథనం: నాకొక పిల్లవాడు పుడితే నేనతడ్ని తీసుకొని దైవప్రవక్త (స) సన్నిధికి వెళ్ళాను. ఆ పిల్లవాడికి ఆయన ఇబ్రాహీం అని పేరు పెట్టారు. ఖర్జూర పండు నమిలి అతని నోట్లో పెట్టారు. పిల్లవాడికి శ్రేయోశుభాలు

కలగాలని ప్రార్థించి అతడ్ని తిరిగి నాకిచ్చివేశారు. (బుఖారి, ముస్లిం)

హజ్రత్ అబూహురైరా (రజి) కథనం: విశ్వాసుల మాతృమూర్తి హజ్రత్ జైనబ్ బిన్త్ జహష్ (రజి) గారి పేరు మొదట్లో బర్రా అని ఉండేది. దానిపై ప్రజలు "ఈమె తనను తాను పవిత్రురాలని, పుణ్యవతి అని భావిస్తోంది" అని చెప్పుకునేవారు. అంచేత దైవ ప్రవక్త (స) ఆమెకు జైనబ్ అని పేరు పెట్టారు. (బుఖారి, ముస్లిం)

హజ్రత్ అబూహురైరా (రజి) ప్రకారం దైవపవక్త (స) ప్రవచనం: "మీరు నా పేరు పెట్టుకోవచ్చు. కాని నా మారుపేరు (అబుల్‌ఖాసిం అ)ని పెట్టుకోకండి." (బుఖారి)

దైవపవక్త (స) హితోక్తి: "ఎవరైనా రాజాధిరాజు అని పేరుపెట్టుకుంటే అది దేవుని దృష్టిలో అతి నీచమైన పేరుగా పరిగణించబడుతుంది." (బుఖారి, ముస్లిం)

## సభామర్యాదలు

"విశ్వాసులారా! మీ సమావేశాల్లో సర్దుకొని (వచ్చేవారికి) చోటు కల్పించమని చెప్పి నప్పుడు మీరు చోటు కల్పించండి, దేవుడు మీకు (స్వర్గంలో) చోటుకల్పిస్తాడు. అలాగే లేచి వెళ్ళిపోండని చెబితే వెళ్ళిపోండి." (ఖుర్ఆన్-58:11)

దైవప్రవక్త (సల్లం) అమృతవాక్కులు వినడానికి జనం ఆయన దగ్గర చాలాసేపు కూర్చుండే వారు. దానివల్ల ఒక్కోసారి దైవప్రవక్త (సల్లం) దైనందిన పనులకు, విశ్రాంతి సమయానికి ఆటంకం కలిగేది. అప్పుడు పై ఆదేశం వచ్చింది. (ఇబ్నెకసీర్)

హజ్రత్ అనస్ (కథనం): ప్రవక్త అనుచరులకు దైవప్రవక్త (స) కంటే ప్రియమైన వారెవరూ లేరు. అయినా వారు దైవప్రవక్త (స) వచ్చినపుడు లేచి నిలబడరు. కారణం అలా చేయడాన్ని దైవప్రవక్త(స) మక్రూహ్ (అవాంఛనీయం)గా భావించేవారు. (తిర్మిజి)

దైవప్రవక్త (స) ప్రవచనం: "మీలో ఎవరూ ఇతరుల్ని లేపి వారిస్థానంలో కూర్చో రాదు. మీరు ఇతరుల కోసం చోటుకల్పించాలి." (బుఖారి, ముస్లిం); "ఇద్దరు వ్యక్తుల మధ్య వారి అనుమతి లేకుండా దూరడం ధర్మసమ్మతంకాదు." (తిర్మిజి)

దైవప్రవక్త (స) ప్రవచనం: "మీరు ముగ్గురున్నప్పుడు మూడోవాడ్ని వదలి మిగతా ఇద్దరు రహస్యాలు మాట్లాడుకోకండి. ఈ వైఖరివల్ల ఆ మూడో వ్యక్తికి బాధ కలగవచ్చు. అయితే మీరు మరికొందరితో కలిసిపోతే అప్పుడు ఫర్వాలేదు." (బుఖారీ, ముస్లిం)

## అస్సలాము అలైకుం

"మిమ్మల్ని ఎవరైనా గౌరవసూచకంగా సలాం చేస్తే, మీరు అంతకంటే శ్రేష్ఠంగా వారికి ప్రతిసలాం చేయండి. లేదా అదేవిధంగానైనా చేయండి." (ఖుర్ఆన్-4:86)

"మీరు మీఇండ్లలో ప్రవేశించే ముందు ఇంట్లో ఉన్నవారికి సలాం చేయండి. ఇది దేవుడు నిర్ణయించిన ఆశీర్వాదం. ఎంతో శుభప్రదమైనది, పరిశుద్ధమైనది." (ఖుర్-24:61)

దైవప్రవక్త (స) హితోక్తి: "ఒక ముస్లింకు మరొక ముస్లింపై 5 హక్కులు ఉన్నాయి. 1-సలాంకు ప్రతిసలాం చెప్పడం, 2-జబ్బుపడితే పరామర్శించడం, 3-శవాన్ని సాగనం పడం, 4-విందుఆహ్వానాన్ని అంగీకరించడం, 5-తుమ్ముకు జవాబివ్వడం." (బుఖారి)



హజ్రత్ అబూహురైరా (రజి) ప్రకారం దైవప్రవక్త (స) హితోక్తి: "మీరు (నిజమైన) విశ్వాసులు కానంతవరకూ స్వర్గానికి పోలేరు. మీరు ఒకర్నొకరు అభిమానించుకోనంత వరకూ విశ్వాసులు కాలేరు. మీరు పరస్పరం అభిమానించుకునేలా చేసే ఉపాయం ఏమిటో చెప్పనా, 'పరస్పర సలాం'ను ఆనవాయితీగా చేసుకోండి." (ముస్లిం)

దైవప్రవక్త (స) మహితోక్తి: "తన కోసం దైవాన్ని ప్రార్థించనివాడు అందరికంటే పెద్ద మూర్ఖుడు, పనికిమాలినవాడు. అలాగే సలాం చేయడంలో పిసినారితనం వహించేవాడు అందరికంటే పెద్ద పిసినిగొట్టు." (తబ్రాని)

దైవప్రవక్త (స) ప్రవచనం: "యూదులు మీకెప్పుడైనా సలాం చేస్తే వారిలో ఎవరో ఒకడు 'అస్సాము అలైక్' (నీకు చావు మూడుగాక) అని తప్పకుండా అంటాడు. అప్పుడు మీరు 'వఅలైక్' (నీకు కూడా) అని సమాధానమివ్వండి." (బుఖారి, ముస్లిం)

హజ్రత్ సాబిత్ బనాని (రహ్మలై) కథనం: హజ్రత్ అనస్ (రజి) ఓసారి పిల్లల దగ్గర నుంచి పోవడం జరిగింది. అప్పుడాయన ఆ పిల్లలకు సలాం చేశారు. తరువాత వారితో "దైవప్రవక్త (స) ఈవిధంగా చేసేవారు" అని అన్నారు. (బుఖారి)

## మాటల గారడీ నరకానికి దారి

ఇబ్నెమస్‌వూద్ (రజి) కథనం: దైవప్రవక్త (స) "అతిశయోక్తులతో మరీ ఇబ్బంది పడ్తూ మాట్లాడేవారు నాశనమవుతారు"అన్నారు. ఇలా మూడుసార్లు అన్నారు. (ముస్లిం)

హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అమ్రిబిన్‌ఆస్ (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ప్రవచనం: "ఆవు నెమరు వేసినట్టు నాలుకను మాటిమాటికీ తిప్పుతూ వాక్చాతుర్యం ప్రదర్శించే వారిని దేవుడు చాలా అసహ్యించుకుంటాడు." (అబూదావూద్, తిర్మిజీ)

హజ్రత్ జాబిర్ (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "మీలో నీతి నడవడికల్లో అందరికంటే మంచివారే ప్రళయదినాన నాకు అత్యంత ప్రియతములుగా, నాకు అత్యంత సమీపంలో ఉంటారు. దీనికి భిన్నంగా వదరుబోతులు, పగలబడి మాట్లాడేవారు, లొడలొడా మాట్లాడేవారు ప్రళయదినాన నాకు అత్యంత అయిష్టులుగా, నాకు అందరికంటే దూరంగా ఉంటారు." (తిర్మిజీ)

## ముఖస్తుతి

హజ్రత్ అబూమూసా అష్అరీ (రజి) కథనం: ఒకతను ఒక వ్యక్తిని మితిమీరిన పొగడ్తలలో ముంచెత్తాడు. దైవప్రవక్త (స) అది విని "నువ్వతడ్ని నాశనం చేశావుకదా!" అన్నారు. లేక "నువ్వతని నడుం విరగ్గొట్టావు కదా!" అని అన్నారు. (బుఖారి)

దైవప్రవక్త (స) ప్రవచనం: "మీరు ముఖస్తుతి చేసేవారిని చూస్తే వారి ముఖం మీద మట్టి విసరండి." (ముస్లిం)

హజ్రత్ హమ్మామ్ బిన్‌హారిస్ మిఖ్‌దాద్ (రజి) కథనం: ఒకతను ఉస్మాన్ (రజి) ముందు ముఖస్తుతి చేయసాగాడు. అది చూసి మిఖ్‌దాద్ (రజి) ఉద్దేశ్యపూర్వకంగా మోకాళ్ళ మీద కూర్చొని ముఖస్తుతి చేస్తున్నవాడి నోట్లో కంకర్రాళ్ళు వేయడం ప్రారంభిం

చారు. అది చూసి ఉస్మాన్ (రజి) (ఆశ్చర్యపోయి) "ఏమిటీ మీరు చేస్తుంది?" అని అడిగారు. అందుకాయన సమాధానమిస్తూ 'మీరు ముఖస్తుతి చేసేవారిని చూస్తే వారి ముఖమ్మీద మన్నుపోయండ'ని దైవప్రవక్త (స) బోధించారు" అని చెప్పారు (ముస్లిం).

హజ్రత్ అబూబక్రా (రజి) కథనం: ఒకతను దైవప్రవక్త (స) ముందు ఒక వ్యక్తిని పొగిడాడు. అప్పుడు దైవప్రవక్త (స) "నువ్వు చెడ్డపని చేశావు. పొగడ్తలతో నీ మిత్రుని గొంతుకోశావు"అన్నారు. ఈమాట అనేకసార్లు అన్నారు. తరువాత ఇలా అన్నారు:

"మీలో ఎవరైనా మీ సోదరుడ్ని పొగడటం చాలా అవసరమని భావించినప్పుడు ఈవిధంగా అనాలి- 'ఇది నా అభిప్రాయం మాత్రమే. వాస్తవ పరిస్థితి దేవునికే తెలుసు. నేను దేవునికి వ్యతిరేకంగా ఎవరి పవిత్రతను నిరూపించడం లేదు. ఆ వ్యక్తి ఇలాంటి వాడు, అలాంటివాడని అన్నానంటే ఇది నా వ్యక్తిగత అభిప్రాయం మాత్రమే.' ఈమాట లయినా ఆ మనిషి గురించి మీకు వ్యక్తిగతంగా తెలిసివున్నప్పుడే అనాలి. (అంతేగాని ఎవరో చెప్పిన మాటలు విని పొగడకూడదు.)- (బుఖారి, ముస్లిం)

## చేతబడి, దిష్టి

"సులైమాను ఎన్నడూ అవిశ్వాసానికి ఒడిగట్ట లేదు. అసలు అవిశ్వాసానికి పాల్పడింది ప్రజలకు చేతబడిని బోధించే షైతానులే." (ఖుర్ఆన్-2:102)

హజ్రత్ ఆయిషా (రజి) కథనం: దైవప్రవక్త (స)కు చేతబడి చేయబడింది. దాని ప్రభావంవల్ల ఆయన తన భార్యలను కలుసుకోకపోయినా కలుసుకున్నానేమోనని అను మానించేవారు. తరువాత దైవప్రవక్త (స) ఇలా అన్నారు: ఆయిషా! నీకు తెలుసా? నేను దేవుడ్ని ఈబాధ నుండి విముక్తి కల్గించమని వేడుకుంటే ఆయన దీనికి పరిష్కారమార్గం చూపించాడు. (కలలో) నాదగ్గరకు ఇద్దరు వ్యక్తులు వచ్చారు. వారిలో ఒకడు నా తల వైపు, మరొకడు నా కాళ్ళవైపు కూర్చున్నారు. తలవైపు కూర్చున్నవాడు "ఇతనికి ఏమైంది" అని అడిగాడు. దానికి రెండవ వ్యక్తి "ఇతనికి చేతబడి చేశారు" అన్నాడు. "ఎవరు చేశార"ని అడిగాడు మొదటి వ్యక్తి. "లుబైద్ బిన్ ఆసిమ్ చేశాడు" అన్నాడు రెండవ వ్యక్తి. (లుబైద్ కపటవిశ్వాసి, యూదుల పక్షపాతి.) "ఈ చేతబడి ఎందులో చేశాడు?" మొదటి వ్యక్తి ప్రశ్నించాడు. "దువ్వెన, దువ్వెనతో రాలిన వెంట్రుకలలో" చెప్పాడు రెండవవ్యక్తి. "ఎక్కడ చేశాడ?" అడిగాడు మొదటి వ్యక్తి. "పోతు ఖర్జూరపుగుత్తి పొరలో పెట్టి జర్వాన్ బావిలో ఒక రాతి కింద అదిమిపెట్టాడు" అన్నాడు రెండవ వ్యక్తి.

ఆ తరువాత దైవప్రవక్త (స) చేతబడిని తీసివేయించడానికి (అనుచరుల్ని వెంట బెట్టుకొని) ఆ బావి దగ్గరకు వెళ్ళారు. "నాకు (కలలో) చూపబడిన బావి ఇదే" అన్నారు. ఆయన. ఆ బావిలోని నీరు గోరింటాకు రంగులా (ఎర్రగా) మారిపోయింది. అక్కడి ఖర్జూర చెట్లు కూడా పిశాచపు తలలు మాదిరిగా తయారైపోయాయి. దైవప్రవక్త (స) ఆజ్ఞతో ఆ బావిలోని చేతబడి (వస్తువుల)ని తీసేయడం జరిగింది. ఆ తరువాత నేను దైవప్రవక్త (స)తో మాట్లాడుతూ "మీరు చేతబడికి విరుగుడు ఎందుకు చేయలేదు?" అని అడిగాను. దానికి ఆయన "దైవసాక్షి! దేవుడు నాకు స్వస్థత చేకూర్చినప్పుడు నేను



అనవసరంగా ఇతరుల మీద లంఘించి జనంలో అలజడి సృష్టించడం బాగుండదు. అలా చేయడం నాకిష్టం లేదు" అని అన్నారు. (బుఖారి, ముస్లిం)

దైవప్రవక్త (స) ప్రవచనం: "దిష్టి తగలడం వాస్తవమే." (బుఖారి, ముస్లిం)

దైవప్రవక్త (స) హితోక్తి: "దిష్టి తగిలితే దానికి మంత్రించి ఊదాలి." (బుఖారి)

హజ్రత్ ఉమ్మెసల్మా (రజి) కథనం: దైవప్రవక్త (స) నా ఇంట్లో ఒక అమ్మాయిని చూశారు. ఆమె ముఖంపై నల్లని మచ్చలు ఏర్పడిఉన్నాయి. దైవప్రవక్త (స) అది చూసి "ఈ పాపకు దిష్టి తగిలింది, మంత్రించి ఊదండి" అన్నారు. (బుఖారి)

అస్వద్ బిన్ యజీద్ (రహ్మలై) కథనం: విశ్వాసుల మాతృమూర్తి ఆయిషా (రజి)ను ఒకతను విషపురుగులు కుట్టినపుడు మంత్రించడం గురించి అడిగితే "విషపురుగుల కాటుకు మంత్రించవచ్చని దైవప్రవక్త (స) అనుమతిచ్చారు" అని చెప్పారామె. (బుఖారి)

హజ్రత్ ఆయిషా (రజి) కథనం: దైవప్రవక్త (స) ఏ రోగి దగ్గరకైనా వెళ్తే లేదా రోగే తన దగ్గరకు వస్తే (ఆ రోగి స్వస్థత కోసం) ఆయన దేవుడ్ని ఇలా ప్రార్థిస్తారు- "మానవుల ప్రభూ! (ఇతని) బాధను దూరంచెయ్యి. (ఇతనికి) స్వస్థత చేకూర్చు. స్వస్థత చేకూర్చే వాడవు నీవే. నీవు తప్ప మరెవరూ స్వస్థత చేకూర్చేవారు లేరు. వ్యాధి ఏమాత్రం మిగల కుండా పూర్తిగా స్వస్థత చేకూర్చు." (ముస్లిం)

హజ్రత్ ఆయిషా(రజి) కథనం: దైవప్రవక్త (స) ఎప్పుడైనా జబ్బుపడితే ముఅవ్విజాత్ (ఖుర్ఆన్‌లోని చివరి మూడు) సూరాలు పఠించి తమపై ఊదుకునేవారు. (కొన్నాళ్ళకు) ఆయన (ప్రాణసంకట వ్యాధికి గురయ్యారు) వ్యాధి తీవ్రరూపం దాల్చినప్పుడు, నేనే ముఅవ్విజాత్ సూరాలు పఠించి ఆయన చేతిలో ఊది ఆ చేత్తోనే శ్రేయోశుభాల కోసం ఆయన శరీరాన్ని స్పృశింప జేస్తుండేదాన్ని. (బుఖారి)

## ప్రతి వ్యాధికీ మందుంది

దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "ప్రతి వ్యాధికీ చికిత్స ఉంది వృద్ధాప్యానికి తప్ప." (మరొక ఉల్లేఖనంలో 'మరణానికి తప్ప' అని ఉంది.)- మిష్కాత్

దైవప్రవక్త (స) ఇలా తెలియజేశారు: "మీ మందులలో, రోగచికిత్స ప్రయత్నాలలో ఏదైనా ప్రయోజనం ఉందంటే అది ఈ మందుల్లో, ప్రయత్నాల్లో ఉంది- 1-శస్త్ర చికిత్స ద్వారా చెడు రక్తం తొలగించడం, 2-తేనెను సేవించడం, 3-వాతలు పెట్టడం. కాని వాతలు పెట్టే ప్రక్రియ అంటే నాకిష్టం లేదు." (బుఖారి, ముస్లిం)

హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ప్రవచనం: "జ్వరం నరకాగ్ని ప్రజ్వలన ప్రభావం. కనుక దాన్ని నీటితో చల్లార్చండి. (బుఖారి)

హజ్రత్ ఫాతిమా బిన్త్ ముంజిర్ (రజి) కథనం: హజ్రత్ అస్మా (రజి) దగ్గరకు వైద్యం కోసం జ్వరంతో ఉన్న స్త్రీ నెవరినైనా తీసుకురావడం జరిగితే, ఆమె నీళ్ళు తీసుకొని ఆ స్త్రీ ఎదబట్ట మీద చిలికించేవారు. ఆ తరువాత "జ్వరాన్ని నీళ్ళతో చల్లార్చా లని దైవప్రవక్త (స) మమ్మల్ని ఆదేశించేవారు" అని చెప్పేవారు. (బుఖారి)

హజ్రత్ అబూహురైరా (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ప్రవచనం: "నల్లజీలకర్రలో మరణానికి తప్ప ప్రతి వ్యాధికీ చికిత్స ఉంది." (బుఖారి, ముస్లిం)

ఉమ్మెఖైస్ బిన్త్ ముహ్సిన్ (రజి) ప్రకారం దైవప్రవక్త (స) హితోక్తి: "మీరు తప్పక ముసాంబరం వాడండి. అందులో ఏడు రోగాలకు చికిత్స ఉంది. గొంతువాపు వ్యాధికి దాన్ని ముక్కులోకి పీల్చాలి, న్యుమోనియాకు దాన్ని తాగించాలి." (బుఖారి, ముస్లిం)

హజ్రత్ అబ్దుల్లా బిన్ జాఫర్ బిన్ అబూతాలిబ్ (రజి) కథనం: దైవప్రవక్త (సల్లం) దోసకాయ, ఖర్జూరపండ్లు కలిపి తింటుంటే చూశాను. (బుఖారి, ముస్లిం)

ఖర్జూరపళ్ళు, దోసకాయలు కలిపి తినడంలోని ఆంతర్యం ఇవి రెండూ పరస్పరం సంస్కరించుకునే పదార్థాలు కావడమే. ఇవి రెండూ కలసి సంతులనాహారంగా మారుతాయి. అప్పుడు రెండిటి దుర్లక్షణాలు దూరమవుతాయి. ఉదాహరణకు- దోసకాయ దప్పిక తీర్చి బలాన్నిస్తుంది. ఉదరంలోని వేడి తగ్గిస్తుంది. చర్మం పాడవదు. ఖర్జూరం ఉదరంలోని శీతలం తగ్గిస్తుంది. అయితే దప్పిక కలిగిస్తుంది; త్వరగా పులుస్తుంది; రక్తంలో వేగం కలిగిస్తుంది. తలనొప్పికి కారణమవుతుంది. ఈవిధంగా పరస్పర విరుద్ధ గుణాలుగల ఈరెండు పదార్థాలు కలసి శరీరానికి ఆరోగ్యం చేకూర్చుతాయి.

దైవప్రవక్త (స) హితోక్తి: "ఎవరైనా ఉదయంపూట ఏడు అజ్వా ఖర్జూరపండ్లు తింటే అతనికిక ఆరోజు ఎలాంటి చేతబడి, విషపదార్థాలు హాని కలిగించలేవు." (బుఖారి)

దైవప్రవక్త (స) ప్రవచనం: "పుట్టగొడుగు 'మన్న' లాంటిదే. దాని నీరు నేత్ర వ్యాధులకు మంచి చికిత్స." (బుఖారి)

దైవప్రవక్త (స) హితోక్తి: "రోగగ్రస్త ఒంటెలను ఆరోగ్యవంతమైన ఒంటెల దగ్గరకు తెచ్చిపెట్టకండి." (బుఖారి)

హజ్రత్ ఉర్వా బిన్ జుబైర్ (రజి) కథనం: ఆయిషా (రజి) బంధువుల్లో ఎవరైనా చనిపోయినప్పుడు స్త్రీలు గుమిగూడుతారు. తరువాత వారంతా వెళ్ళిపోయి ముఖ్యమైన స్త్రీలు, కుటుంబసభ్యులు మాత్రమే ఉండిపోయినప్పుడు ఆయిషా (రజి) ఒక కుండలో 'తల్బీనా' తయారుచేయమని చెప్పేవారు. దానిప్రకారం తల్బీనావంట తయారవుతుంది. ఆ తర్వాత 'సరీద్' తయారుచేసి తల్బీనాలో కలుపుతారు. అప్పుడు ఆయిషా (రజి) అక్కడుండే స్త్రీలతో "ఇక తినండి, తల్బీనా రోగి మనస్సుకు సుఖాన్నిచ్చి అతని బాధ, విచారం దూరం చేస్తుందని దైవప్రవక్త (స) చెప్పగా నేను విన్నాను" అని చెప్పేవారు. (బుఖారి)

తల్బీనా అంటే ఒక విధమైన అంబలి అని అర్థం. ఇది గోధుమపిండి లేక గోధుమ పొట్టుకు మైదాపిండి కలిపి చేస్తారు. ఒక్కోసారి అందులో తేనె కూడా కలుపుతారు. ఇలా తయారైన వంటకం పాలవలె ఉంటుంది గనుక దీన్ని తల్బీనా అంటారు. సరీద్ అంటే షేర్వాలో రొట్టెముక్కలు కలపగా తయారయ్యే ఖాద్య పదార్థం. ఇందులో మాంసం, పప్పు కూరగాయలు కూడా కలుపుతారు.

దైవప్రవక్త (స) హితోక్తి: "ప్రతినెలా మూడు రోజులపాటు ఉదయాన్నే (పరగడుపున) తేనె సేవించే మనిషిపై పెద్ద ఆపదలు ఏవీ వచ్చిపడవు." (అబూహురారా-మిష్కాత్)



హజ్రత్ అబూసయీద్ ఖుద్రీ (రజి) తేనె చికిత్స గురించిన ఓ సంఘటన ఇలా పేర్కొన్నారు: ఒకతను దైవప్రవక్త (స) దగ్గరకు వచ్చి "నా సోదరుడు కడుపునొప్పితో బాధపడుతున్నాడు" అని అన్నాడు. దానికి దైవప్రవక్త (స) "అయితే అతనికి తేనె తాగించు" అని చెప్పారు. ఆ వ్యక్తి మళ్ళీ వచ్చాడు (కడుపునొప్పి తగ్గలేదంటూ). దైవప్రవక్త (స) తిరిగి "అతనికి తేనె తాగించు" అని చెప్పారు. ఆ వ్యక్తి మూడోసారి వచ్చాడు (నొప్పి తగ్గలేదంటూ). దైవప్రవక్త (స) మళ్ళీ అతనికి తేనె తాగించు అనే చెప్పారు. అతను నాల్గవసారి వచ్చి "నేనతనికి తేనె తాగించాను (కాని నొప్పి తగ్గ లేదు)" అని అన్నాడు. అప్పుడు దైవప్రవక్త (స) "దేవుడు నిజమే చెప్పాడు. నీ సోదరుని కడుపే అబద్ధమాడుతోంది. అతనికి తేనె తాగించు" అని చెప్పారు. ఆ వ్యక్తి (తన సోదరునికి) మళ్ళీ తేనె తాగించాడు. దాంతో అతని సోదరునికి స్వస్థత చేకూరింది. (బుఖారి)

ఖుర్ఆన్ తేనెచికిత్స గురించి ఇలా పేర్కొన్నది: "ఈ తేనెటీగ నుంచి ఒక విధమైన రంగురంగుల పానకం వెలువడుతుంది. అందులో ప్రజలకు స్వస్థత కూడా ఉంది. యోచించేవారికి ఈవిషయంలో గొప్ప సూచన ఉంది." (16:69)

వైద్యపరంగా తేనెలో అనేక ప్రయోజనాలున్నాయని చాలామందికి తెలుసు. యునాని వైద్యవిధానంలో తేనెను ప్రధాన వస్తువుగా వాడటానికి కారణం ఇదే. ఇది మందులు నిల్వ చేయడానికి, కొన్నిరకాల వ్యాధులకు యాంటిబయాటిక్‌గా కూడా ఉపయోగపడుతుంది. ఇమామ్ నవవీ (రహ్మలై) ఇలా అన్నారు: "తేనె విరేచనకారి అయినప్పటికీ విరేచనం విరేచన కారి ద్వారానే అరికట్టబడుతుంది. ఈపని తేనె బాగా చేస్తుంది. అందువల్ల తేనె తినడం వల్ల మొదట విరేచనాలు ఎక్కువై చివరికి మలమంతా పోయి విరేచనాలు పూర్తిగా తగ్గిపోతాయి. ఈ చికిత్స వైద్య విధానానికి అనుగుణమైనది. ఈ పద్ధతి గురించి కువిమర్శ చేసేవాడు అజ్ఞాని మాత్రమేగాక నాస్తికుడు కూడా అనబడతాడు."

హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ప్రవచనం: "పాములను చంపివేయండి. ముఖ్యంగా రెండు చారలుండి తోకతెగిన పాములను చంపండి. ఇవి (మన) కళ్ళను పోగొడ్తాయి. వాటి (భయం)వల్ల స్త్రీలకు గర్భం పోవచ్చు." (బుఖారి)

హజ్రత్ ఉమ్మెషరీక్(రజి) కథనం: దైవప్రవక్త (స) నన్ను తొండను చంపమని ఆదేశించారు. (బుఖారి); హజ్రత్ ఆయిషా (రజి) కథనం: దైవప్రవక్త తొండను దుష్ట పురుగని అన్నమాట నిజమేకాని, ఆయన దాన్ని చంపమని చెప్పినట్లు నేను వినలేదు. (బుఖారి)

## స్వప్నలోకం

"జైల్లో అతనితో పాటు మరో ఇద్దరు బానిసలు కూడా చేరారు. ఓరోజు వారిద్దరిలో ఒకడు"నేను రాత్రి సారాయి పిండుతున్నట్లు కలగన్నాను" అన్నాడు. రెండోవాడు "నేనూ కల గన్నాను. ఆకలలో నా తలపై కొన్ని రొట్టెలున్నాయి. వాటిని పక్షులు తినసాగాయి" అన్నాడు. ఆ తర్వాత వారిద్దరు (యూసుఫ్ ప్రవక్తను) "చూస్తే మీరు ధర్మాత్ములుగా కన్పిస్తున్నారు. కాస్త మా కలల గూఢార్థం ఏమిటో చెప్పండి" అని అడిగారు... (ఖుర్ఆన్-12:36)

"నా సోదర ఖైదీలారా! ఇప్పుడు మీకలల గూఢార్థం చెబుతా వినండి. మీలో ఒకడు తన ప్రభువుకు (అంటే ఈజిప్టు చక్రవర్తికి) సారాయి తాగిస్తాడు. రెండోవాడ్ని ఉరికంబం

ఎక్కిస్తారు. పక్షులు అతని తలను పొడిచిపొడిచి తింటాయి. (అంతే) మీరడిగిన ప్రశ్నలకు సమాధానాలు లభించాయి." (12:41) అతను వెళ్ళి "యూసుఫ్! సత్యం మూర్తీ భవించిన మహానుభావా!! నాకీ కల గూఢార్థం ఏమిటో చెప్పు. ఏడు బలిసిన ఆవులను ఏడు బక్కచిక్కిన ఆవులు తినేస్తున్నాయి. ఏడు పచ్చటి వెన్నులు, ఏడు ఎండిన వెన్నులు ఉన్నాయి. దీనర్థం ఏమిటో చెబితే నేను వెళ్ళి వారికి తెలియజేస్తాను. దానివల్ల వారు నిన్ను (నీ విలువను) గుర్తించవచ్చు" అని అన్నాడు. (ఖుర్ఆన్-12:46)

అప్పుడు యూసుఫ్ ఇలా అన్నాడు: "మీరు ఏడేండ్లపాటు నిరంతరాయంగా వ్యవ సాయం చేస్తారు. ఆ కాలంలో పండేపంటలో కొంతపంటను మీరు తిండికోసం వాడుకొని మిగతా పంటను వాటి వెన్నులలోనే ఉంచండి. ఆ తర్వాత మరో ఏడేండ్లపాటు (కరువుకాట కాలతో) పరిస్థితి చాలా దారుణంగా ఉంటుంది. ఆ స్థితిలో మీరు కూడబెట్టుకున్న ధాన్యం (హాయిగా) తినవచ్చు. ఒకవేళ ఏదైనా మిగిలితే మీరు భద్రపరుచుకున్నదే మిగులుతుంది. ఆ తర్వాత పుష్కలంగా వర్షాలు కురిసే సంవత్సరం వస్తుంది. ఆ ఏడు ప్రజలు (పాలు, పండ్లరసం) బాగా పిండుతారు." (ఖుర్ఆన్-12:47,48,49)

హజ్రత్ అబూఖతాదా (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ప్రవచనం: "మంచి కలలు దేవుని తరపున వస్తాయి. చెడ్డ కలలు షైతాన్ తరపున వస్తాయి. కనుక ఎవరికైనా కలలో ఏదైనా చెడు విషయం కన్పిస్తే మేల్కొన్న వెంటనే అతను థూథూ అని చెప్పి షైతాన్ బారినుండి దేవుడ్ని శరణు వేడుకోవాలి. ఆవిధంగా చేస్తే ఆ కల వల్ల అతనికి ఎలాంటి నష్టం వాటిల్లదు." (బుఖారి, ముస్లిం)

హజ్రత్ అబూహురైరా (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ప్రవచనం: "కాలం మధ్యస్థం అయినప్పుడు (అంటే రాత్రి, పగలు సరిసమానమైనప్పుడు) విశ్వాసికి వచ్చే కలలు సాధారణంగా అసత్యకలలు కాజాలవు. ప్రవక్తృత్వం (నబువ్వత్)లోని నలభైఆరు భాగాల్లో విశ్వాసికి వచ్చే కల కూడా ఒక భాగమే." (బుఖారి, ముస్లిం)

హజ్రత్ అబూహురైరా (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ప్రవచనం: "నన్ను కలలో చూసినవాడు త్వరలోనే (ప్రళయదినాన) జాగృతావస్థలో కూడా నన్ను చూస్తాడు. (అంటే నన్ను గుర్తుపడతాడు) షైతాన్ నా రూపంలో (కలలోకి) రాలేడు." (బుఖారి)

హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ప్రవచనం: "నేను మిస్వాక్ (బ్రష్) చేస్తున్నట్లు కలగన్నాను. అప్పుడు నా దగ్గరకు ఇద్దరు వ్యక్తులు వచ్చారు. వారిలో ఒకడు పెద్దవాడు. నేనా మిస్వాక్‌ని చిన్నవాడికి ఇచ్చాను. అయితే పెద్దవాడికి ఇవ్వమని నాకు చెప్పబడింది. అంచేత నేను మిస్వాక్‌ని పెద్దవాడికిచ్చాను." (బుఖారి)

దైవప్రవక్త (స) ప్రవచనం: "నేనొక కలగన్నాను. అందులో నేను మక్కా నుండి ఖర్జూర తోటలున్న ప్రాంతానికి వలసపోతున్నాను. నేనది యమామా లేక హజర్ అయి వుంటుందని భావించాను. కాని అది మదీనా అయ్యింది. ఆ కలలోనే నేనొక ఖడ్గం తిప్పాను. అది మధ్యగా విరిగిపోయింది. ఇది ఉహుద్‌యుద్ధంలో ముస్లింలపై వచ్చి పడిన ఆపద. ఆతర్వాత నేను ఆ ఖడ్గాన్నే మళ్ళీతిప్పితే అది పూర్వంకంటే ఎంతో మెరుగై



పోయింది. ఇది దేవుడు మనకు ప్రసాదించిన (అంతిమ) విజయం. అప్పుడు ముస్లింలు సమైక్యమై సంఘటితమయ్యారు. నేను కలలో ఆవుల్ని కూడా చూశాను. దేవుడు చేసే ప్రతి పనీ మంచిదే. ఈ ఆవులు ఉహుద్‌యుద్ధంలో అమరవీరులైపోయిన ముస్లింలు అన్నమాట. దేవుడు చేసే ప్రతిపనీ మంచిదే. ఇది బదర్‌యుద్ధం తర్వాత ఇప్పటివరకు దేవుడు మనకు ప్రసాదించిన సత్యతా ప్రతిఫలం." (బుఖారి, ముస్లిం)

హజ్రత్ అబూహురైరా (రజి) తాను కన్న ఓ కల గురించి ఇలా తెలియజేశారు: "నేను కలలో నా రెండు చేతులకు రెండు బంగారు మురుగులు ధరించిఉన్నట్లు చూశాను. వాటిని చూసి నాకెంతో బాధ కలిగింది. తర్వాత వాటిపై ఊదేయమని దేవుడు నాకు సంకేతం ద్వారా తెలియజేశాడు. నేనలాగే ఊదాను. దాంతో ఆ మురుగులు ఎగిరిపోయాయి. ఈ కల ద్వారా నేను గ్రహించిందేమిటంటే నా తర్వాత ఇద్దరు అసత్య వాదులు (అసత్య ప్రవక్తలు) తిరుగుబాటు చేస్తారు. వారిలో ఒకడు అబుల్అస్వద్ అనసి; రెండోవాడు ముసైలిమా కజ్జాబ్." (బుఖారి)

వీరిద్దరు అసత్యప్రవక్తలు దైవప్రవక్త (స) కాలంలోనే తమను తాము దైవప్రవక్తలని ప్రకటించుకున్నారు. అబుల్అస్వద్ ఆకాలంలోనే హతమార్చబడ్డాడు. ముసైలిమా తననుతాను ముహమ్మద్ మహనీయుని దైవదౌత్యంలో భాగస్థుణ్ణని చెప్పుకునేవాడు. ఈవిధంగా అతను పైకి ముహమ్మద్ (స) సందేశాన్ని వ్యతిరేకించేవాడు కాదు. చివరికి అతను హజ్రత్ అబూ బకర్ (రజి) ఖిలాఫత్ పాలనాకాలంలో ముస్లింల చేత హతమార్చబడ్డాడు.

దైవప్రవక్త (స) కన్న కలల్లోని ఒక కలలో దేవుడు ఆయనకు ఇద్దరు దైవదూతల ద్వారా స్వర్గ నరకాల విశేషాలు చూపించాడు. దీనికి సంబంధించిన హదీసు ఈ పుస్తకం లోనే "పరలోక వ్యవస్థ" ప్రకరణలో పేర్కొనబడింది.

## ప్రమాణం ఎలా చేయాలి?

"మీరు చేసే అర్థంలేని ప్రమాణాలను గురించి అల్లాహ్ మమ్మల్ని పట్టుకోడు. కానీ మీరు బుద్ధిపూర్వకంగా చేసే ప్రమాణాలను గురించి ఆయన మిమ్మల్ని తప్పకుండా ప్రశ్నిస్తాడు. (అటువంటి ప్రమాణభంగానికి) పరిహారం ఏమిటంటే మీరు మీ ఆలుబిడ్డలకు తినిపించే మామూలు భోజనం..... (ఖుర్ఆన్-5:89)

హజ్రత్ ఇబ్నెఉమర్ (రజి) కథనం: "మీరు మీ తాతముత్తాతల మీద ప్రమాణం చేయవద్దని దైవప్రవక్త (స) వారించారు. కనుక మీలో ఎవరైనా ప్రమాణం చేయదలచు కుంటే దేవుని మీద ప్రమాణం చేయాలి. లేదా ఊరుకోవాలి." (బుఖారీ, ముస్లిం)

హజ్రత్ ఇబ్నెఉమర్ (రజి) ప్రకారం ఒకతను 'కాబాలయం సాక్షి!' అని ప్రమాణం చేస్తుండగా ఆయన విని, "దైవేతరుల మీద ప్రమాణం చేయకు. దైవేతరులమీద ప్రమాణం చేసేవాడు అవిశ్వాసానికి లేదా బహుదైవారాధనకు పాల్పడినట్లేనని దైవప్రవక్త (స) చెప్పగా నేను విన్నాను" అని ఉపదేశించారు అతనికి. (మిష్కాత్)

హజ్రత్ అబ్దుర్రహ్మాన్ బిన్ సమురా (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ఆయనతో ఇలా అన్నారు: "నువ్వు ఒక పని గురించి ప్రమాణం చేసిన తర్వాత ఆ ప్రమాణం పూర్తి

చేయకుండా ఉండటమే మంచిదని భావించినట్లయితే నీకు మంచిదిగా తోచిన పనే చెయ్యి. ప్రమాణభంగానికి పరిహారం చెల్లించు.'' (బుఖారీ, ముస్లిం)

హజ్రత్ అబూమూసా (రజి) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (స) ఈవిధంగా తెలియజేశారు: ''దైవసాక్షి! దైవం తలిస్తే నేను ఒక విషయం గురించి ప్రమాణం చేసిన తరువాత అంతకంటే మంచి విషయం మరొకటి ఉందని తెలుసుకుంటే నేను తప్పకుండా ప్రమాణభంగానికి పరిహారం చెల్లించి ఆ మంచి విషయమే అవలంబిస్తాను.'' (బుఖారీ, ముస్లిం)

హజ్రత్ ఇబ్నెఉమర్ (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ఇలా అన్నారు: ''దేవుని పేరుతో ఎవరైనా మిమ్మల్ని శరణు కోరితే వారికి శరణు ఇవ్వండి. దేవుని పేరు మీద ఏదైనా అడిగితే వారికి ఇచ్చేయండి. ఎవరైనా మిమ్మల్ని ఆహ్వానిస్తే దాన్ని అంగీకరించండి. ఎవరైనా మీకు ఉపకారం చేస్తే మీరు దానికి ప్రత్యుపకారం చేయండి. ప్రత్యుపకారం చేసే స్తోమత మీలో లేకపోతే వారి రుణం తీర్చుకున్నామని నమ్మకం కలిగేదాకా వారి శ్రేయస్సు కోసం ప్రార్థించండి.'' (అబూదావూద్)

## సృష్టితాలను, ప్రకృతి శక్తులను దూషించరాదు

ఓసారి దైవప్రవక్త (స) ఉమ్మె సాయిబ్ లేక ఉమ్మె ముసయ్యబ్ (రజి) ఇంటికి వెళ్ళి, ''ఉమ్మెసాయిబ్ (ఉమ్మెముసయ్యబ్)! ఏమయింది నీకు? వణుకుతున్నావేమిటి?'' అని అడిగారు. అందుకామె, ''నాకు జ్వరం వచ్చింది. దేవుడు దీన్ని అధికం చేయకుండా ఉండుగాక!'' అని అన్నారు. ఆమె సమాధానం విని ఆయన ''జ్వరాన్ని దూషించకు. ఇది మనిషి వల్ల జరిగే (చిన్నచిన్న) పాపాలను కొలిమి ఇనుము నుండి తుప్పును దూరం చేసినట్లు దూరం చేస్తుంది'' అని చెప్పారు. (ముస్లిం)

దైవప్రవక్త (స) ఇలా బోధించారు: ''గాలిని దూషించకండి. మీకు భరింపశక్యం కానిది (తుఫాను) గనక కనిపిస్తే ఈ విధంగా ప్రార్థించండి: ''దేవా! మేము నీ నుండి ఈ పెనుగాలుల ప్రయోజనాన్ని, వీటిలో ఉన్న ప్రయోజనాన్ని, ఏ ఉద్దేశ్యంతో ఈ గాలుల్ని పంపటం జరిగిందో దాని ప్రయోజనాన్ని కోరుకుంటున్నాము. పెనుగాలుల వల్ల నష్టం జరగడం నుండి, వాటిలో ఉన్న కీడు నుండి, ఏ ఉద్దేశ్యంతో ఆ గాలుల్ని పంపటం జరిగిందో దాని కీడు నుండి నీ శరణు కోరుతున్నాము.'' (తిర్మిజీ)

దైవప్రవక్త (స) హితోక్తి: ''గాలి దైవకారుణ్యం. అది కారుణ్యం, శిక్ష రెంటినీ తీసుకొని వస్తుంది. కనుక మీరు దాన్ని చూసినప్పుడు దాన్ని దూషించకండి. అందులోని మేలు ప్రసాదించమని, దాని కీడునుండి కాపాడమని దైవాన్ని ప్రార్థించండి. (అబూదావూద్)

హజ్రత్ జైద్ బిన్ ఖాలిద్ జుహనీ (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ఇలా అన్నారు: ''కోడి పుంజుని దూషించకండి. అది నమాజీని మేల్కొలుపుతుంది''. (అబూదావూద్)

హజ్రత్ ఇబ్నెఉమర్ (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ప్రవచనం: ''మనిషి తన సోదరుణ్ణి, అవిశ్వాసీ! అనంటే, రెండు విషయాల్లో ఏదోఒకటి అవుతుంది. ఆ వ్యక్తి నిజంగానే అవిశ్వాసి అయితే సరే; లేదా ఆమాట తన వైపుకే తిరిగొస్తుంది. (బుఖారీ, ముస్లిం)



## అతిథి సత్కారం

''వారు నిరుపేదలైనప్పటికీ ఇతరుల అవసరాలకే ప్రాధాన్యం ఇస్తారు. పేరాశ, పిసినారితనాల నుండి రక్షించబడినవారే ధన్యులు.'' (ఖుర్ఆన్-59:9)

హజ్రత్ అబూషురైహ్ కాబి (రజి) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (స) ప్రవచనం: ''దేవుణ్ణి, అంతిమదినాన్ని విశ్వసించేవాడు తన అతిథికి మర్యాద చేయాలి. ఒక పగలు, ఒక రాత్రి ఆతిథ్యమివ్వడం అతని విధి. మూడు రోజులు ఆతిథ్యమిస్తే చాలామంచిది. అంతకంటే ఎక్కువ రోజులు ఆతిథ్యమిస్తే అది దానం అవుతుంది. అయితే ఆతిథ్యం ఇచ్చేవాని ఇంట అతనికి కష్టం కలిగేటంత కాలందాకా తిష్ఠవేసి కూర్చోవడం ధర్మ సమ్మతం కాదు.'' (బుఖారి)

హజ్రత్ ఉఖ్బా బిన్ ఆమిర్ (రజి) కథనం: మేమొక రోజు దైవప్రవక్త (స)తో మాట్లాడుతూ ''మీరు మమ్మల్ని (ఎక్కడికైనా) పంపినపుడు ఒక్కోసారి మేము మాకు ఆతిథ్యం ఇవ్వనివారి దగ్గరికెళ్ళి బస చేయవలసి వస్తుంది. అలాంటి పరిస్థితిలో మేము ఏం చేయాలి?'' అని అడిగాము. దానికి దైవప్రవక్త (స) ఇలా చెప్పారు- ''మీరేదైనా తెగవారి ప్రాంతానికి వెళ్ళి విడిది చేసినప్పుడు ఆ తెగవాళ్ళు మీకు సంప్రదాయం ప్రకారం తగిన ఆతిథ్యం ఇవ్వడానికి ముందుకు వస్తే సరే, లేకపోతే మీరు మీ (అతిథ్య)హక్కును వారి నుండి రాబట్టుకోండి.'' (బుఖారి, ముస్లిం)

ఓసారి దైవప్రవక్త (స) వద్దకు ఒక అతిథి వచ్చాడు. దైవప్రవక్త అతనికి భోజనం ఏర్పాటు చేయమని తన భార్యలతో అన్నారు. దానికి వారు ''మాదగ్గర మంచినీరు తప్ప మరేమీలేద''ని చెప్పారు. అప్పుడు ఆయన తన అనుచరుల్ని ''ఇతనికి ఆతిథ్యమిచ్చే వారెవరైనా ఉన్నారా?'' అనడిగారు. ఒక అన్సారీ లేచి ''నేనాతిథ్యమిస్తాను'' అన్నాడు.

తరువాత అతనా వ్యక్తిని ఇంటికి పిలుచుకెళ్ళి ''ఇతను ప్రవక్తగారి అతిథి. ఇతనికి మనం భోజనం పెట్టాలి'' అన్నాడు భార్యతో. దానికామె ''పిల్లల కోసమే కాస్తుంది'' అన్నది. ''ముందు భోజనం తయారుచెయ్యి. పిల్లలు అన్నం అడిగితే ఏదోచెప్పి వాళ్ళను నిద్రపుచ్చు''అన్నాడతను. కాస్సేపటికి ఆయన భార్య భోజనం తయారుచేసి దీపం వెలిగించింది. పిల్లల్ని (ఏదోచెప్పి) పడుకోబెట్టింది. తర్వాత ఆమె లేచి దీపం (వత్తిని) సరిచేస్తున్నట్లు నటిస్తూ ఆర్పింది. ఆ చీకటిలోనే వారిద్దరు తాము కూడా అన్నం తింటున్నట్లు అతిథికి అన్పించేలా నోళ్ళు కదపసాగారు.

ఇలా వారిద్దరు ఆరాత్రి అతిథికి అన్నంపెట్టి తాము పస్తుండిపోయారు. మర్నాడు ఉదయం ఆ అన్సారీ దైవప్రవక్త (సల్లం) సన్నిధికి వెళ్ళగానే ''ఈరోజు మీరు చేసిన పనిని దేవుడు చూసి సంతసించాడు. సంతసించి ఈసూక్తి అవతరింపజేశాడు''అంటూ ఆయన ఈ (59:9)సూక్తినే పఠించారు. (బుఖారి, ముస్లిం)

## దొరికిన వస్తువులు ఏం చేయాలి?

హజ్రత్ జైద్ బిన్ ఖాలిద్ (రజి) కథనం: ఒకతను దైవపవక్త (స) సన్నిధికి వచ్చి దొరికిన వస్తువు గురించి విచారించగా దైవప్రవక్త (స) ఇలా చెప్పారు- ''అతని డబ్బు

సంచిని, దాని మూతి కట్టుడును గుర్తుంచుకొని ఒక ఏడాదిపాటు ప్రజలలో దాన్ని గురించి ప్రకటిస్తూవుండు. సంచి యజమాని వస్తే దాన్ని అతనికి ఇచ్చేసేయి. రాకపోతే నువ్వే దాన్ని కోరిన విధంగా ఖర్చుపెట్టుకో." ఆ వ్యక్తి (మరో విషయం ప్రస్తావిస్తూ) "మరి ఎవరికైనా తప్పిపోయిన మేక దొరికితే దాన్నేం చేయాలి?" అని అడిగాడు. దానికి దైవప్రవక్త (స) సమాధానమిస్తూ "దాని సంగతి నీకెందుకు? దాంతో పాటు అతని నీటి తిత్తి, చెప్పులు ఉంటాయి. దాని యజమాని వచ్చి తోలుకెళ్ళే వరకు అది ఆకులు అలములు మేస్తూ, నీళ్ళు తాగుతూ తిరుగుతుంది" అని అన్నారు. (బుఖారి)

బుఖారిలోని మరో ఉల్లేఖనంలో దైవప్రవక్త (స) డబ్బుసంచి పోగొట్టుకున్న మనిషి కోసం మూడేండ్ల కొన్నాళ్ళు వేచిచూడాలని అన్నారని ఉంది.

దైవప్రవక్త (స) ప్రవచనం: "మీలో ఎవరూ అనుమతి లేకుండా ఇతరుల పశువుల పాలను పితకకూడదు. ఎవరైనా మీ ధాన్యాగారంలోకి జొరబడి గాదులు, పెట్టెలు విరగ్గొట్టి ధాన్యాన్ని దోచుకెళ్తే మీకెలా ఉంటుంది? మీలో ఎవరైనా ఈ విషయాన్ని ఇష్ట పడతారా? అలాగే పశువుల పొదుగులు కూడా వారికి ఆహారగిడ్డంగులే. కనుక మీరు ఇతరుల పశువుల పాలను వారి అనుమతి లేకుండా పితకకండి." (బుఖారి, ముస్లిం)

## ఇంటి భద్రత

ఇస్లాం మనకు జీవితంలోని ప్రతి రంగంలోనూ మార్గదర్శనం చేస్తోంది. చివరికి మన ఇండ్ల భద్రత విషయంలో కూడా మనం తీసుకోవలసిన జాగ్రత్తలు తెలియజేసింది.

దైవప్రవక్త (స) ప్రవచనం: "రాత్రిచీకటి పడనారంభించగానే లేక సాయంత్రమవ గానే పిల్లలను (బయటికి పంపకుండా) ఇండ్లలోనే ఆపి ఉంచండి. ఆ సమయంలో షైతానులు నలువైపులా వ్యాపిస్తారు. రాత్రి ఒకజాము పొద్దుపోయిన తరువాత పిల్లలను విడిచిపెట్టండి. దేవునిపేరు పఠించి (అంటే బిస్మిల్లా అనిపఠించి) తలుపులు మూసేసు కోండి. మూసిన తలుపుల్ని షైతాన్ తెరవలేడు." (బుఖారి, ముస్లిం)

హజ్రత్ ఇబ్నెఉమర్ (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ఇలా అన్నారు: "(రాత్రి) పడుకో బోయేముందు మీఇండ్లలో అగ్నిని (ఆర్పండి.) అలాగే వదలేయకండి." (బుఖారి)

హజ్రత్ అబూమూసా అష్అరీ (రజి) కథనం : ఒకసారి మదీనాలో ఒక ఇల్లు, ఆ ఇంటి సభ్యుల సమేతంగా కాలిపోయింది. జనం దాని గురించి దైవప్రవక్త (సల్లం)కు చెప్పారు. అది విని ఆయన "ఈ అగ్ని మీ శత్రువు. కనుక మీరు నిద్రపోయేటప్పుడు దాన్ని ఆర్పి నిద్రపోండి." (బుఖారీ, ముస్లిం)

హజ్రత్ జాబిర్ (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ఇలా అన్నారు: "పాత్రలు మూసి వుంచండి. కూజల మూతలు బిగించండి. తలుపులు మూసివుంచండి. దీపాలు ఆర్పే యండి. షైతాను బిగించబడిన కూజల్ని, మూయబడివున్న తలుపుల్ని, పాత్రల్ని తెరవ లేడు. మీలో ఎవరికైనా మూయటానికి ఏమీ లభించకపోతే దేవుని పేరు స్మరించి దానికి అడ్డంగా ఒక చెక్కముక్కయినా ఉంచండి. (కొన్ని సందర్భాల్లో) చిట్టెలుక కూడా ఇంటిని, ఇంటివారి సమేతంగా కాల్చేయగలదు." (ముస్లిం)



## అనుమానాలు, వదంతుల్లో నిజమెంత?

"విశ్వాసులారా! మీ దగ్గరకు ఎవరైనా దుర్జనుడు ఏదైనా (ముఖ్య) సమాచారం తీసు కొస్తే దాన్ని ఓసారి క్షుణ్ణంగా పరిశీలించండి. అలా చేయకుంటే మీరు ఏదైనా వర్గానికి పొరపాటున నష్టం కల్గించవచ్చు. ఆ తరువాత మీరు జరిగిన దానికి విచారిస్తారు. అలాంటి పరిస్థితి రాకూడదు సుమా!" (ఖుర్ఆన్-49:6)

ఈసూక్తి వలీద్‌బిన్ఉఖ్బా (రజి) గురించి అవతరించిందని వ్యాఖ్యానకర్తల అభిప్రాయం. బనీముస్తలిఖ్ తెగవాళ్ళు ఇస్లాం స్వీకరించిన తర్వాత దైవప్రవక్త (స) వారినుండి జకాత్ తీసుకురావడానికి వలీద్ (రజి)ని పంపారు. కాని వలీద్ అక్కడికి చేరుకొని, ఏదో కారణంతో భయపడి వారిని కలుసుకోకుండానే మదీనా తిరిగొచ్చారు. వచ్చి, వారు జకాత్ చెల్లించడానికి నిరాకరించారని, తనను హతమార్చ జూస్తున్నారని దైవప్రవక్త (స)కు ఫిర్యాదు చేశారు.

దైవప్రవక్త (సల్లం) ఈ సంగతి వినగానే ఆగ్రహోదగ్రులయి ఆ తెగ పీచం అణచేందుకు ఓ సైనికదళం పంపడానికి సన్నాహాలు ప్రారంభించారు. ఈలోగా బనీ ముస్తలిఖ్ తెగ నాయకుడు (విశ్వాసుల మాతృమూర్తి హజ్రత్ జువైరియా గారి తండ్రి హారిస్ బిన్ జిరార్) తన అనుచరులు కొందరిని వెంటబెట్టుకొని మదీనా వచ్చారు. ఆయన దైవప్రవక్త (సల్లం)ను కలుసుకొని "దైవసాక్షి! మేము వలీద్‌ని కనీసం చూడనైనా చూడలేదు. అంచేత మేము జకాత్ చెల్లించడానికి నిరాకరించా మన్న, ఆయన్ని చంపదలిచామన్న ప్రశ్నే తలెత్తదు. మేము ఇప్పటికీ ఇస్లాం ధర్మంలో స్థిరంగా ఉన్నాం. జకాత్ చెల్లింపును మేము నిరాకరించడం లేదు" అని అన్నారు. అప్పుడీ సూక్తి అవతరిం చింది. ముఖ్యమైన వ్యవహారం గురించి ఏదైనా సమాచారం అందినప్పుడు ఆ సమాచారం అంద జేసిన వ్యక్తి మంచివాడా, చెడ్డవాడా, సత్యవంతుడా, అబద్ధాలమారియా, నమ్మకస్తుడా, మోసగాడా అనే విషయాల్ని గురించి పరిశోధించి తెలుసుకున్న తరువాతే ఆ సమాచారానికి సంబంధించి తగిన చర్య తీసుకోవాలని, దారినపోయే ప్రతి దానయ్య మోసుకొచ్చే గాలికబుర్లు నమ్మి వెంటనే ప్రతి స్పందించకూడదని ధర్మవేత్తలు ఈ సూక్తిని గురించి వ్యాఖ్యానించారు. అయితే ప్రాధాన్యంలేని సాధారణ వ్యవహారాలలో అంతగా ఆరా తీసి అడుగెయ్య నవసరంలేదు.

"వారేదైనా సంతోషకరమైన వార్తగాని లేక భయాందోళనలు కల్గించే వార్తగాని వింటే దాన్ని నలువైపులా వ్యాపింపజేస్తారు. అలా చేయకుండా వారా వార్తను దైవప్రవక్తకుగాని లేదా తమ నాయకులకుగాని చేరవేస్తే దాన్ని గురించి వారు నిజానిజాలు తెలుసుకొని సరైన నిర్ణయం తీసుకోగలుతారు." (ఖుర్ఆన్-4:83)

దైవప్రవక్త (స) హితోక్తి :"తొందరపాటు, దుడుకుతనాలు షైతాన్‌చర్యలు." (తిర్మిజి)

"మీకు తెలియనిదాని వెంటపడకండి. కళ్ళు, చెవులు, హృదయం వగైరా సమస్త అవయవాల్ని గురించి (దేవునికి) జవాబు చెప్పుకోవలసిఉంటుంది." (ఖుర్ఆన్-17:36)

దైవప్రవక్త (స) ప్రవచనం: "షైతాన్ మనిషి రూపంలో వచ్చి ప్రజలతో అబద్ధాలు పలుకుతాడు. సభికులు వెళ్ళిపోయిన తరువాత వారిలో ఒకడు "ఒకతడ్ని చూస్తే నేను గుర్తుపట్టగలను కాని, అతని పేరేమిటో తెలియదు. అతనీ మాట అంటున్నాడు" అని చెబుతాడు (కన్పించిన ప్రతి మనిషితో). (ముస్లిం)

## బిడియం

బిడియం స్త్రీలకే కాదు, పురుషులకు కూడా ఉండాలి. "బిడియం అర్ధ విశ్వాసంతో సమానం" అన్నారు దైవప్రవక్త (స). కనుక పురుషులు కూడా తమ కనీస ఆచ్ఛాదన (సతర్) దేహాన్ని పురుషుల ముందు కూడా కన్పించనీయకూడదు.

హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ప్రవచనం: "మీరు మలమూత్ర విసర్జన, లైంగిక క్రీడ సమయాల్లో తప్ప ఇతర సమయాల్లో దిగంబరంగా ఉండకుండా జాగ్రత్త వహించండి. మీతో పాటు మీనుండి ఎన్నటికీ వేరుకాని వారు (దైవదూతలు) కూడా ఉన్నారు. వారి పట్ల సిగ్గుపడుతూ వారిని గౌరవించండి." (తిర్మిజి)

# VII. పరలోక వ్యవస్థ

పరలోకం- అదో విచిత్ర లోకం, అగోచర లోకం. ఇది సైన్స్ పరిశోధనా పరిధిలోకి రాలేని అదృశ్య ప్రపంచం. అయితే అది మానవుని ఆలోచనకు అతీతమైన లోకం కాదు. మానవుడు నివసిస్తూ అనుక్షణం కళ్ళారా చూస్తున్న ఈ లోకంలోనే ఆ లోకం ఉనికికి సంబంధించిన అనేక చిహ్నాలు ఉన్నాయి. అయితే ఆ చిహ్నాలు వీక్షించడానికి చర్మ చక్షువులతో పాటు హృదయచక్షువులు కూడా కావలసి ఉంటుంది.

## స్వర్గ, నరకాల మార్గాలు

స్వర్గ, నరకాలకు చేర్చే దారులు ఇహలోకంలో ఉన్నాయి. ఈ దారులు గురించి వింటే ఆశ్చర్యం వేస్తుంది. స్వర్గం ఎంత మనోహరంగా ఉంటుందో అక్కడకు గొనిపోయే దారి అంత భయంకరంగా ఉంటుంది. అందుకే "ఉట్టికెక్క లేనమ్మ స్వర్గానికెక్కునా" అన్నారు మన పెద్దలు. అలాగే నరకం ఎంత భయంకరంగా ఉంటుందో అక్కడకు లాకెళ్ళే దారి అంత మనోహరంగా ఉంటుంది.

అబూహురైరా (రజి) ప్రకారం దైవప్రవక్త (స) హితోక్తి : దేవుడు స్వర్గనరకాలను సృష్టించిన తర్వాత జిబ్రీల్ దూత (అలైహి)ను స్వర్గం వైపు పంపిస్తూ "వెళ్ళు స్వర్గాన్ని, స్వర్గవాసుల కోసం నేను సృష్టించిన అనుగ్రహాలను చూసిరా" అని ఆదేశించాడు. దాని ప్రకారం జిబ్రీల్ (అలై) వెళ్ళి స్వర్గాన్ని, స్వర్గవాసుల కోసం దేవుడు సృష్టించిన అనుగ్రహాలను చూసివచ్చారు. అప్పుడాయన దేవునితో "నీ గౌరవం సాక్షి! స్వర్గం గురించి వినిన ప్రతివాడూ అందులో ప్రవేశిస్తాడు" అని అన్నారు. తరువాత దేవుడు స్వర్గాన్ని కష్టాలు, కడగండ్లతో కూడిన కంచె వేయమని దూతలను ఆదేశించాడు. ఆ తరువాత ఆయన జిబ్రీల్ (అలై)ని పిలిచి "ఈసారి వెళ్ళి స్వర్గాన్ని, స్వర్గవాసుల కోసం తయారుచేసిన అనుగ్రహాలను చూసిరా" అని ఆదేశించాడు. జిబ్రీల్ (అలై) వెళ్ళిచూస్తే అక్కడ స్వర్గం చుట్టు కష్టాలు, కడగండ్లతో కూడిన కంచె వేయబడి ఉంది. ఆయన తిరిగొచ్చి "దేవా! నీ గౌరవం సాక్షి! ఇక స్వర్గంలో ఎవరూ ప్రవేశించలేరు' అని అన్నారు. దేవుడీ మాట విని "సరే ఈసారి నరకం వైపు వెళ్ళి నరకాన్ని, నరకంలోని శిక్షలను చూసిరా" అని ఆదేశించాడు. దైవాజ్ఞ ప్రకారం జిబ్రీల్ (అలై) నరకం చూసివచ్చి "దేవా! నీ గౌరవం సాక్షి! నరకం గురించి వినిన ఏ మనిషీ అందులో ససేమిరా ప్రవేశించడు" అని అన్నారు. ఆ తరువాత దేవుడు అల్లాహ్ "నరకాన్ని సుఖాలు, మనోవాంఛలతో కూడిన కంచె కట్ట



మని దూతలను ఆదేశించాడు. ఆ తరువాత ఆయన జిబ్రీల్ (అలై)ని పిలిచి "ఈసారి వెళ్ళి నరకాన్ని చూసిరా" అని ఆజ్ఞాపించాడు. స్వర్గవాసుల కోసం తయారుచేసిన అనుగ్రహాలను చూసిరా" అని ఆదేశించాడు. జిబ్రీల్ (అలై) వెళ్ళి నరకం చూశారు. తిరిగొచ్చి "దేవా! నీ గౌరవం సాక్షి! ఇప్పుడిక నరకం నుండి ఎవరూ కాపాడుకోలేరు. ప్రతి మనిషీ అందులోకి పోయిపడతాడు" అని అన్నారు. (ముస్లిం)

# 90. ఆత్మ అంటే ఏమిటీ?

ఆత్మ అంటే ఏమిటి, ఎలా ఉంటుంది, అది దేహంలోకి ఎలా వస్తుంది, ఎలా మళ్ళీ బయటికి పోతుంది? అనే ప్రశ్నలకు ఈనాటికీ తృప్తికరమైన సమాధానాలు లభించలేదు. లభించే అవకాశాలు కూడా కన్పించడం లేదు. కారణం ఆత్మను గురించి అర్థం చేసుకోవడం మానవ మేధకు అతీతమైన విషయం.

హజ్రత్ అబ్దుల్లా బిన్ మస్ఊద్ (రజి) కథనం: నేను దైవప్రవక్త (సల్లం) వెంట మదీనా పొలాల గుండా నడచి వెళ్తున్నాను. దైవప్రవక్త (సల్లం) ఖర్జూరపు కఱ్ఱ పట్టుకొని దాని ఊతంతో నడవసాగారు. మేమలా వెళ్తుంటే దారిలో కొందరు యూదులు తారస పడ్డారు. అప్పుడు వారిలో కొందరు "ఆత్మను గురించి ఆయన్ని అడుగుదాం" అన్నారు. మరికొందరు "వద్దు, మనకు నచ్చని విషయం ఏదైనా ఆయన మనకు విన్పించవచ్చు" అన్నారు. అయితే కొందరు ఆత్మను గురించి అడగవలసిందేనని అన్నారు.

దాని ప్రకారం వారిలో ఒక వక్తి వచ్చి "అబుల్ ఖాసిం! ఆత్మ అంటే ఏమిటసలు?" అని అడిగాడు. దానికి దైవప్రవక్త (సల్లం) తక్షణమే సమాధానం ఇవ్వకుండా క్షణంపాటు మౌనంగా ఉండిపోయారు. దాంతో నేను ఆయనపై దివ్యావిష్కృతి అవతరిస్తోందని భావించి నిలబడ్డాను. దివ్యావిష్కృతి (వహీ) అవతరణ సమయంలో ఆవహించే పరిస్థితి దూరమయిన తరువాత ఆయన ఈసూక్తి పఠించారు: (బుఖారి, ముస్లిం)

"వారు ఆత్మను గురించి ప్రశ్నిస్తున్నారు. 'ఈఆత్మ నా ప్రభువు ఆజ్ఞతో వస్తుంది. (దీన్ని మీరు గ్రహించలేరని,) మీకు పరిమితజ్ఞానం ఇవ్వబడింద'ని చెప్పు." (ఖుర్ఆన్-17:85)

మానవుడు ఆత్మ గురించి అర్థం చేసుకోవడం సాధ్యం కాదని ఈ సూక్తిని బట్టి స్పష్టంగా తెలుస్తోంది. అయితే మానవుడు తనకున్న పరిమిత జ్ఞానంతో బుద్ధిని ఉపయోగించి అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తే ఈ సమస్యకు కొంతవరకైనా పరిష్కారం లభించవచ్చునేమో!

ఉదాహరణకు, మానవుని ఆత్మను మూడు భాగాలుగా విభజించవచ్చు. (1) ప్రాణం, (2) మనసు, (3) వ్యక్తిత్వం. మన భాషలో ఈ మూడింటి కలియకనే ఆత్మ అని చెప్పవచ్చు. ప్రాణం+మనస్సు+వ్యక్తిత్వం=ఆత్మ. శరీరం నుండి ప్రాణం బయటికి పోగానే మనిషి చనిపోతాడు. ప్రాణంతో పాటు మన మనస్సు, వ్యక్తిత్వాలు కూడా శరీరాన్ని వీడిపోతాయి. అయితే ఈ మూడింటి కలియకే ఆత్మ కాబట్టి ఈ మూడు ఎన్నటికీ విడిపోవు. ఎల్లప్పుడూ కలిసే ఉంటాయి.

హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి) కథనం: హజ్రత్ ఉమర్ (రజి) హజ్రత్ అలి (రజి)తో మాట్లాడుతూ "అబుల్ హసన్! మనిషి కలలు కంటున్నప్పుడు వాటిలో కొన్ని కలలు నిజమవుతాయి; కొన్ని అబద్ధమవుతాయి. వీటిని గురించి మీ అభిప్రాయం

ఏమిటీ?'' అని అడిగారు. దానికి హజ్రత్ అలి (రజి) ఇలా సమాధానమిచ్చారు: "దైవప్రవక్త (స) అన్నారు... 'స్త్రీగాని పురుషుడుగాని నిద్రపోతున్నప్పుడు అతని ఆత్మ దైవసింహాసనం వైపు అధిరోహిస్తుంది. ఏఆత్మ దైవసింహాసనం దగ్గరకుపోయి కల (నిద్ర) నుండి మేల్కొంటుందో ఆ కల నిజమవుతుంది. దైవసింహాసనం దగ్గరకు పోకుండా మధ్యలోనే మేల్కొంటే ఆ కల అబద్ధమవుతుంది.'' (తబ్రాని, ముస్తద్రక్, హాకిమ్)

ప్రముఖ ధర్మవేత్తల అభిప్రాయం ప్రకారం మరణం అంటే మనిషి వ్యక్తిత్వం శాశ్వతంగా అంతమైపోవడం కాదు. మరణంవల్ల ఆత్మకు దేహానికి ఉండే సంబంధం మాత్రమే తెగిపోతుంది. ఉమర్ బిన్ అబ్దుల్ అజీజ్ (రహ్మ) ఇలా అన్నారు: "మరణం కారణంగా మీరు నాశనమైపోరు. మరణం ద్వారా మీరు ఒకఇల్లు వదలి మరోఇంటికి వెళ్తున్నారు, అంతే.'' (అబూనయీమ్)

దైవప్రవక్త (స) ఇలా అన్నారు: "ఈ ప్రపంచం విశ్వాసి పాలిట కారాగారం, కరువు ప్రాంతం. విశ్వాసి ప్రపంచం నుండి వేరయిపోతున్నప్పుడు అతను కారాగారం నుండి, కరువు ప్రాంతం నుండి విముక్తి పొందుతున్నాడన్నమాట.'' (తబ్రాని ఫిల్ కబీర్)

హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి) కథనం: ఈ ప్రపంచం అవిశ్వాసి పాలిట స్వర్గం, విశ్వాసి పాలిట కారాగారం. విశ్వాసి చనిపోయినప్పుడు, జైలు నుండి విడుదలై స్వేచ్ఛగా తిరిగే ఖైదీలా అవుతాడు. (ఇబ్నె ముబారక్)

ఇక్రమా ముజాహిద్ (రజి) కథనం: సూర్యకిరణాలు భూమిపై వ్యాపిస్తాయి. వాటి వేరులు సూర్యుడితో కలసివుంటాయి. అలాగే మనిషి నిద్రపోయినప్పుడు అతని ఆత్మ త్రాడులా పొడుగైపోతుంది. అది తిరిగి కురచయిపోగానే మనిషి మేల్కొంటాడు.''

ఒకతను హజ్రత్ ఇక్రమా (రజి) దగ్గరకు వచ్చి "మనిషి కలలో ఎక్కడెక్కడో తిరుగుతూ తనను తాను చూసుకుంటాడు. ఏమిటా పరిస్థితి?'' అని అడిగాడు. దానికి ఆయన ఇలా సమాధానమిచ్చారు: "ఇలా తిరిగేది అతని ఆత్మ. ఆత్మ హృదయంతో పెనవేసుకొని ఉంటుంది. దేహంలో ఉండే హృదయం ఎక్కడెక్కడో తిరిగే ఆత్మను వెనక్కి లాగినప్పుడు కల చెదరిపోయి మనిషి మేల్కొంటాడు.'' (మౌత్కార్ఝుట్కా)

"మరణ సమయంలో (మానవుల) ఆత్మలు స్వాధీనం చేసుకునేవాడు దేవుడే. ఆయన మరణించనివారి ఆత్మలను నిద్రావస్థలో స్వాధీనం చేసుకుంటాడు. ఆ తరువాత ఆయన ఎవరి విషయంలో మృత్యునిర్ణయం తీసుకుంటాడో వారి ఆత్మలను తీసుకొని, మిగిలినవారి ఆత్మల్ని ఒక నిర్ణీతకాలం కోసం వెనక్కి పంపుతాడు. ప్రశాంత హృదయం తో యోచించేవారి కోసం ఇందులో గొప్ప సూచనలున్నాయి.'' (ఖుర్ఆన్–39:42)

నిద్రావస్థలో ఆత్మ దేహం నుండి వెలువడి ఎక్కడెక్కడో తిరుగుతుంది. అప్పుడు ఆత్మకు, దేహానికి మధ్య స్థితిస్థాపక వస్తువేదో ఉంటుంది. ఈవస్తువే ఆ రెండిటిని పూర్తిగా విడిపోనివ్వకుండా పట్టిఉంచుతుంది. ఆ వస్తువు తెగిపోతే ఆత్మ దేహం నుండి పూర్తిగా వేరయిపోతుంది. అంటే మరణం సంభవిస్తుంది. దేవుడు నిద్రిస్తున్న ఓ మనిషి విషయంలో మృత్యునిర్ణయం తీసుకున్నప్పుడు ఈ స్థితిస్థాపకవస్తువుని త్రెంచివేసి అతని దేహంనుండి ఆత్మను పూర్తిగా స్వాధీనం చేసుకుంటాడు. మృత్యునిర్ణయం తీసుకోకపోతే ఈ స్థితిస్థాపక వస్తువుని త్రెంచివేయకుండా తాత్కాలికంగా స్వాధీనం చేసుకున్న అతని ఆత్మను తిరిగి అతని దేహంలోకి వదిలేస్తాడు.



ఒక పేదవాడు కలలో అందమైన బంగళాలో ఉన్నట్లు, కారులో షికారు కొడ్తున్నట్లు, స్టార్‌హోటల్లో భోగభాగ్యాలు అనుభవిస్తున్నట్లు చూస్తాడు. అప్పుడు తాను ఓ చిన్న పూరిపాకలో నివసిస్తున్న నిష్టదరిద్రుణ్ణని, పీకలదాకా అప్పుల్లో మునిగివున్న దౌర్భాగ్యుణ్ణని, భార్యాపిల్లల కనీసావసరాలు కూడా తీర్చలేని దురదృష్టవంతుణ్ణని ఏమాత్రం భావించడు. కాని కల కాస్తా చెదరిపోగానే వాస్తవం వికృతనాట్యం చేస్తూ కళ్ళముందు కన్పిస్తుంది. అదేవిధంగా ఐహిక జీవితంకూడా అందమైన కలలాంటిదే. అసలుజీవితం మరణానంతరం వచ్చే పరలోకజీవితమే. పరలోక జీవితంలో కష్టాలులేకుండా సుఖాలు మాత్రమే అనుభవించడానికి ఇహలోకంలోనే సత్యధర్మం స్వీకరించి జీవితాంతం సత్కర్మలు ఆచరిస్తూ ఉండాలని ఈసూక్తి చెబుతోంది.

దైవప్రవక్త (స) హితోక్తి: "మీలో ప్రతిఒక్కడూ మాతృగర్భంలో (మొదట) నలభై రోజులదాకా వీర్యబిందువు రూపంలో ఉంటాడు. తరువాత మరో నలభై రోజులపాటు నెత్తుటిముద్ద ఆకారంలో ఉంటాడు. ఆతర్వాత ఇంకో నలభై రోజులు మాంసపుముద్దలా ఉంటాడు. ఆ తర్వాత దాని దగ్గరికి ఒక దైవదూత వచ్చి ఆ పిండంలో ప్రాణం పోస్తాడు. అప్పుడు దాని ఉపాధిని, మరణాన్ని, అతని ఆచరణను, అతను అదృష్టవంతుడవుతాడా లేక దురదృష్టవంతుడవుతాడా అనే విషయాలను వ్రాయమని ఆజ్ఞ అవుతుంది.

ఏకేశ్వర సాక్షిగా చెబుతున్నాను. మీలో ఒకడు స్వర్గానికి దారితీసే మంచిపనులు చేస్తుంటాడు. అతను స్వర్గానికి పోవటానికి ఇంకా ఒక అడుగు దూరమే మిగిలి ఉంటుంది. అంతలో విధివ్రాత అతడ్ని మించిపోతుంది. దాంతో అతను నరకానికి దారితీసే చెడ్డపనులు చేసి నరకానికి పోతాడు. దీనికి భిన్నంగా మీలో ఒకడు నరకానికి దారితీసే పనులు చేస్తుంటాడు. చివరికి అతనికి, నరకానికి మధ్య ఒక అడుగు దూరం మాత్రమే మిగిలిఉంటుంది. అంతలో విధి అతడ్ని మించిపోతుంది. ఫలితంగా అతను స్వర్గానికి దారితీసే మంచిపనులు చేసి స్వర్గానికి పోతాడు. (బుఖారీ, ముస్లిం)

"ఆయనకు తన దాసులపై పూర్తి అదుపు, అధికారాలున్నాయి. ఆయన మిమ్మల్ని పర్యవేక్షించేవారిని నియమించి పంపుతున్నాడు. మీలో ఎవరికైనా మరణ సమయం ఆసన్నమైనప్పుడు ఆయన పంపే దూతలే అతనిప్రాణం తీసికెళ్తారు.'' (ఖుర్ఆన్–6:61)

## 91. ప్రాణాంతక పరిస్థితి

పుట్టిన ప్రతి మానవుడు ఎప్పుడో ఒకప్పుడు గిట్టక తప్పదు. దైవాజ్ఞ కాగానే మరణ దూత మనిషి ఆత్మను స్వాధీనం చేసుకుంటాడు. మరణం దాని నిర్ణీత సమయానికి వస్తుంది. నిర్ణీత సమయానికి ముందు ఎన్ని వ్యాధులు వచ్చినా, ఎలాంటి ప్రమాదాలు సంభవించినా మృత్యువు రాదు. వ్యాధులు, వృద్ధాప్యం, ప్రమాదాలు, హత్యలు మృత్యువుకు సాకులు మాత్రమే. అవి మృత్యవుకు కారణభూతాలు కాలేవు. కాకపోతే అవి మృత్యువుకు సూచనలని మాత్రం చెప్పవచ్చు. మనిషి వ్యాధిగ్రస్తుడయి లేదా ప్రమాదానికి గురయి లేదా మరే కారణంతో తీవ్రంగా గాయపడి మంచాన పడితే అతడ్ని పరామర్శించడం మానవధర్మం.

దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "ముస్లింకు ఏఆపద వచ్చినా, ఏకష్టం వచ్చినా, ఏవ్యాధికి లోనయినా, మరే బాధకు గురయినా, చివరికి అతనికి ఒక ముల్లు గుచ్చుకున్నా సరే, తద్వారా దేవుడు అతని పాపాలను ప్రక్షాళనం చేయకుండా ఉండడు.'' (ముస్లిం)

“ముస్లింలలో ఎవరికైనా ఏదైనా వ్యాధిగాని, ఆపదగాని వచ్చిపడితే చెట్ల నుండి ఆకులు రాలిపోయినట్లు అతని పాపాలను దేవుడు కడిగివేస్తాడు.” (బుఖారి)

“దైవప్రవక్త (సల్లం) ముందు (ఓసారి) జ్వరం గురించిన ప్రస్తావన వచ్చింది. (అది విని) ఒకతను జ్వరాన్ని దూషించాడు. అప్పుడు దైవప్రవక్త (సల్లం) ‘జ్వరాన్ని దూషించకు. అగ్ని లోహంలోని మలినాన్ని శుద్ధి చేసినట్లు ఇది వ్యాధిగ్రస్తుని పాపాలను కడిగివేస్తుంది’ అని ఉపదేశించారు. (ఇబ్నెమాజ)

దైవప్రవక్త (స) ఇలా తెలిపారు: “మనిషి జబ్బు పడినప్పుడు దేవుడు అతనికి స్వస్థత కూడా చేకూర్చుతాడు. అదీగాక ఈ వ్యాధి అతని గత పాపాలకు పరిహారంగాను, భావి జీవితానికి గుణపాఠంగాను అవుతుంది. కాని కపటి విశ్వాసి జబ్బుపడినప్పుడు స్వస్థత చేకూరగానే ఒంటెలా వ్యవహరిస్తాడు. ఒంటెను మనుషులు కట్టివేస్తారు, వదిలివేస్తారు. కాని ఆ ఒంటె తనను మనుషులు ఎందుకు కట్టివేస్తారో, ఎందుకు వదిలివేస్తారో (దున్నపోతు మీద వర్షం పడినట్లు వాస్తవం) గ్రహించదు. (కపటి విశ్వాసి కూడా అంతే).”

అప్పుడు ఒకతను “దైవప్రవక్తా! అసలు రోగం అంటే ఏమిటీ? దైవసాక్షి! నేను ఎప్పుడూ రోగాన పడలేదు” అన్నాడు. దైవప్రవక్త (సల్లం) ఈమాట విని “మా దగ్గర్నుంచి లేచి వెళ్ళిపో. నీవు మాలోని వాడివి కావు” అని చెప్పారు. (అబూదావూద్)

ఆయన మరో సందర్భంలో దేవుడు స్వయంగా ఇలా చెప్పినట్లు తెలిపారు: “నేను నా (విశ్వాసి అయిన) దాసుడ్ని (వ్యాధి రూపంలో) బంధించి పరీక్షించాను. (కనుక దైవదూతలారా!) లోగడ ఆరోగ్య స్థితిలో అతనికి మీరు ఇస్తూ ఉండిన పుణ్య ఫలాన్ని (ఇప్పుడు కూడా) ఇవ్వడం కొనసాగించండి.” (అహ్మద్)

“అన్నార్తులకు అన్నం పెట్టండి, రోగుల్ని పరామర్శించండి, ఖైదీలకు విముక్తి కలిగించండి” అని దైవప్రవక్త (సల్లం) ముస్లింలకు నొక్కి చెప్పారు. (బుఖారి)

## రోగుల పరామర్శ

ఒక ముస్లింపై మరొక ముస్లింకు ఏడు విధాల హక్కులున్నాయి. వాటిలో రోగిని పరామర్శించడం ఒకటి. సమీపంలో ఉన్న రోగిని వీలున్నా పరామర్శించడానికి వెళ్ళకపోతే మరణానంతరం తీర్పుదినాన దేవుని ముందు జవాబిచ్చుకోవలసి వస్తుంది. అలాంటి మనిషితో దేవుడు తీర్పుదినాన ఈ విధంగా అంటాడని దైవప్రవక్త (స) తెలియజేశారు:

“ఆదం పుత్రుడా! నేను జబ్బుపడినప్పుడు నీవు నన్ను పరామర్శించడానికి రాలేదు’ అంటాడు దేవుడు. దానికి దాసుడు ‘ప్రభూ! నేను మిమ్మల్ని ఎలా పరామర్శించగలను? మీరు యావత్తు లోకాలకే ప్రభువు కదా!’ అంటాడు. అప్పుడు విశ్వప్రభువు ఇలా అంటాడు: ‘ఫలానా దాసుడు జబ్బుపడ్డాడు. కాని నీవు అతడ్ని పరామర్శించ లేదు. (ఆరోజు) నీవు అతడ్ని పరామర్శించి ఉంటే అతని దగ్గర నన్ను దర్శించి ఉండేవాడివి.” (ముస్లిం)

దైవప్రవక్త (స) రోగిని పరామర్శించడానికి వెళ్ళినప్పుడు అతడ్ని ఊరడిస్తూ ఆందోళన పడకు. దేవుడు తలిస్తే నీపాపాలు క్షమించబడతాయి. నువ్వు పరిశుద్ధుడవుతావు... అంటూ స్వాంతన పలుకులు పలికేవారు. ఆయన ఓసారి ముస్లింలకు హితోపదేశం చేస్తూ “మీరు



రోగిని చూడటానికి వెళ్తే అతని బాధలో పాలుపంచుకోండి. ఈవిషయం పరిస్థితిని మార్చ లేకపోయినా దానివల్ల రోగి మాత్రం సంతోషిస్తాడు” అని చెప్పారు. (అబూదావూద్)

దైవప్రవక్త (సల్లం) ప్రవచనం: “ఒక ముస్లిం (జబ్బు పడిఉన్న తన తోటి ముస్లిం సోదరుడ్ని) పరామర్శించడానికి వెళ్తే (అక్కడ్నుంచి) తిరిగి వచ్చేవరకూ అతను స్వర్గ పలహారాలు ఆరగించడంలో నిమగ్నుడైఉంటాడు.” (ముస్లిం)

దైవప్రవక్త (సల్లం) హితోక్తి: “ఎవరైనా ముస్లింరోగిని పరామర్శించడానికి వెళ్తున్నప్పుడు ఆకాశం నుండి ఒక ప్రకటనకర్త అతడ్ని కేకవేసి ‘నీకు స్వాగతం! నీవు (ఇలా) నడచి పోవడం శుభప్రదమైనది. నీకు స్వర్గంలో ఉన్నత స్థానం లభిస్తుంది’ అంటాడు.” (ఇబ్నెమాజ)

“ఉజూ చేసి పూర్ణవిశ్వాసంతో తోటిముస్లిం సోదరుడ్ని పరామర్శించడానికి వెళ్ళే వాడు అరవై యేళ్ళ దీర్ఘకాలిక నరకశిక్షకు దూరంగా ఉంచబడతాడు.” (అబూదావూద్)

“ఏ ముస్లిం ఉదయం తన తోటి ముస్లింని పరామర్శించడానికి బయలుదేరుతాడో, అతని పాపమన్నింపు కోసం డెబ్భయివేల మంది దైవదూతలు సాయంత్రం దాకా దైవాన్ని ప్రార్థిస్తుంటారు. అలాగే ఏ ముస్లిం సాయంత్రం తోటిముస్లిం సోదరుడ్ని పరామర్శించడానికి బయలుదేరుతాడో, అతని పాపమన్నింపు కోసం డెబ్భయి వేలమంది దైవదూతలు తెల్లవారేదాకా దైవాన్ని ప్రారిస్థుంటారు. (చివరికి) అతను స్వర్గంలో ప్రవేశిస్తాడు.” (తిర్మిజి)

## మృత్యుముఖంలో మనిషి

ఈ ప్రపంచంలో సృష్టికర్త పెట్టిన విశ్వాసపరీక్ష ముగిసిన తర్వాత మరణం ఏ క్షణంలోనైనా విజృంభించి మనిషి ప్రాణం తీస్తుంది. ఖుర్ఆన్‌లోని ఈ సూక్తులు గమనించండి:

“ప్రతిపాణీ చావును చవిచూడవలసిందే. మేము మిమ్మల్ని మంచీ-చెడు స్థితులు కలిగించి పరీక్షిస్తున్నాం. చివరికి మీరంతా మాదగ్గరికే తిరిగిరావలసి ఉంది.” (21:34,35)

“మానవుడా! నీవు (జీవితసత్యం గురించి ఆలోచించకుండా ఐహిక కార్యకలాపాల్లో) ఎంత నిమగ్నుడవైఉన్నా, నీ పయనం మాత్రం నీ ప్రభువు వైపుకే నిరాఘాటంగా సాగిపోతోంది. చివరికి ఆయన సన్నిధికే నీవు చేరుకోవలసి ఉంటుంది.” (84:6)

“దేవుని అనుజ్ఞ లేనిదే నిర్ణీత సమయానికి ముందు ఏ ప్రాణికీ చావు రాదు. ప్రతి ప్రాణికీ మరణకాలం వ్రాయబడి ఉంది.” (3:145)

మానవుల ఆత్మలు స్వాధీనం చేసుకునే ప్రధాన దైవదూత పేరు హజ్రత్ ఇజ్రాయిల్ (అలై). ఆయన అధీనంలో లక్షలాదిమంది మరణదూతలు ఉంటారు. దైవాజ్ఞ కాగానే వారు మనుషుల ప్రాణాలు తీస్తారు. పుణ్యాత్ముల ప్రాణం తీసే మృత్యుదూతలు సాధుస్వభావం కలిగిన ముఖవర్చస్సుతో, కాంతిమంతమైన స్వేతవస్త్రాలు ధరించి వస్తారు. పాపాత్ముల ప్రాణాలు తీసే మృత్యుదూతలు భయంకరమైన వికృతరూపాలతో వస్తారు.

“దైవదూతలు అవిశ్వాసుల ప్రాణాలు తీస్తున్నప్పటి స్థితి నీవు చూస్తే బాగుండు! వారప్పుడు అవిశ్వాసుల ముఖాలపై, పిరుదులపై కొడుతూ ‘ఇక దహనయాతన చవి చూడండి. ఇది మీరు చేజేతులా కొని తెచ్చుకున్నదాని పర్యవసానమే. అంతేగాని దేవుడు తన దాసులకు ఎలాంటి అన్యాయం చేసేవాడు కాదు’ అనంటారు.” (ఖుర్ఆన్-8:50,51)

దేవుణ్ని, దైవప్రవక్త (స)ను విశ్వసించి వారి ఆజ్ఞల్ని పూర్తిగా పాటించని ముస్లింలు సైతం పితృలోక (బర్జఖ్) శిక్ష అనుభవించ వలసివస్తుంది. దైవప్రవక్త (సల్లం) మదీనాను దారుల్ఇస్లాంగా ప్రకటించి ముస్లింలంతా మదీనాకు వలసపోవాలని ఆదేశించారు. కాని మక్కాలో కొందరు ముస్లింలు కేవలం ఐహిక కష్టనష్టాలకు భయపడి, అవిశ్వాసుల మధ్య సహజీవనం గడుపుతూ స్వస్థలంలోనే ఉండిపోయారు. అలాంటివారిని ప్రస్తావిస్తూ ఖుర్ఆన్ ఇలా పేర్కొన్నది:

"దైవదూతలు తమకుతాము అన్యాయం చేసుకున్నవారి ప్రాణాలుతీస్తూ, మీరిప్పుడు ఏస్థితిలో ఉన్నారని ప్రశ్నిస్తారు. దానికి వారు 'మేము దేశంలో చాలా బలహీనులుగా, పీడితులుగా ఉండేవాళ్ళం' అనంటారు. అప్పుడు దైవదూతలు 'దేవుని భూమి విశాలంగా లేదా, మీరున్నచోటు నుంచి మరోచోటికి వలసపోవడానికి?' అంటారు." (4:97)

"దైవభీతిపరుల పవిత్రాత్మలను దైవదూతలు స్వాధీనం చేసుకుంటూ 'మీకు శాంతి కలుగు గాక! మీరు చేసుకున్న (సత్) కర్మలకు ప్రతిఫలంగా స్వర్గంలో ప్రవేశించండి' అని అంటారు." (ఖుర్ఆన్-16:32)

"మృత్యువుని గుర్తించిన మనిషికి ప్రపంచంలో ఎదురయ్యే ఆపదలన్నీ తేలికయి పోతాయి" అన్నారు హజ్రత్ కాబ్ (రజి).

దైవప్రవక్త (స)తో ఒకతను మాట్లాడుతూ "దైవప్రవక్తా! ప్రళయదినాన హతసాక్షులతో పాటు లేపబడేవారు ఎవరైనా ఉంటారా?" అని అడిగాడు. దానికి దైవప్రవక్త (స) సమాధానమిస్తూ "ఉంటారు. రోజుకు (రాత్రి, పగలు) కనీసం ఇరవై సార్లు మృత్యువుని తలచుకునేవారు హతసాక్షులతో పాటు లేపబడతారు" అని చెప్పారు. (తబ్రాని)

ఒకసారి దైవప్రవక్త (సల్లం) ముందు ఒక వ్యక్తిని పొగడటం జరిగింది. దైవప్రవక్త (స) ఆ పొగడ్తలు విని "అయితే మృత్యువుని తలచుకునే విషయంలో అతని పరిస్థితి ఏమిట"ని అడిగారు. దానికి అనుచరులు మారుమాట్లాడలేదు. అప్పుడు దైవప్రవక్త (స) "మీరు పొగిడిన మనిషి ఆ పొగడ్తలకు అర్హుడు కాడు" అన్నారు. (అహ్మద్)

ఒక హదీసులో దైవప్రవక్త (సల్లం) "మీరు సమాధుల్ని సందర్శిస్తూ ఉండండి. సమాధి సందర్శన మృత్యువుని గుర్తుకు తెస్తుంది" అని అన్నారు. (ముస్లిం)

దైవప్రవక్త (స) హితోక్తి : "నేను ఇదివరకు మిమ్మల్ని సమాధుల్ని సందర్శించవద్దని వారించాను. ఇప్పుడు మీరు సమాధుల్ని దర్శిస్తూ ఉండండి. సమాధిసందర్శన మనసును మెత్త పరుస్తుంది; కంటతడి పెట్టిస్తుంది; పరలోకాన్ని గుర్తుచేస్తుంది." (బుఖారి, ముస్లిం)

ఓసారి దైవప్రవక్త (స) తన అనుచరులకు హితోపదేశం చేస్తూ ఇలా అన్నారు: "మీరు ఎవరినైనా మరణానికి సమీపంలో ఉండటం చూస్తే అతనికి (పరలోక) శుభవార్త విన్పించండి. దానివల్ల అతను (దైవకారుణ్యాన్ని) ఆశిస్తూ దేవుణ్ని కలుసుకునే అవకాశం ఉంటుంది. (అంటే దైవకారుణ్యంపట్ల నిరాశచెందకుండా దేవుడు తన పాపాలను క్షమిస్తాడన్న ఆశతో తనువు చాలించాలన్నమాట.) అలాగే మీరు ఎవరినైనా భోగభాగ్యాల జీవితం గడుపుతుండగా చూస్తే అతణ్ని (పరలోక శిక్షలను గురించి) భయపెట్టండి. దాని వల్ల అతను పశ్చాత్తాపం చెంది తన నడవడికను సరిదిద్దుకోవచ్చు." (ఇబ్నె ముబారక్)



ఇబ్నె మస్వూద్, ఇబ్నె అబ్బాస్ (రజి)ల కథనం: దేవుడు దైవప్రవక్త హజ్రత్ ఇబ్రాహీం (అలైహి)ను తన మిత్రుడిగా చేసుకున్నట్లు ప్రకటించాడు. అప్పుడు మరణ దైవదూత మల్కల్మౌత్ దేవునితో "నేను మీ మిత్రుడి దగ్గరకు వెళ్ళి 'దేవుడు మిమ్మల్ని తన మిత్రుడిగా చేసుకున్నాడని శుభవార్త అందజేస్తాను, నాకు అనుమతి ఇవ్వండి" అని విన్నవించుకున్నాడు. దానికి దేవుడు అనుమతి ఇచ్చాడు. (హదీస్)

## మలకుల్మౌత్ నిజరూపం

మరణదూత హజ్రత్ ఇబ్రాహీం (అలై) వద్దకు వచ్చి ఆయనకీ శుభవార్త అందజేశాడు. అందుకు హజ్రత్ ఇబ్రాహీం (అలై) దేవుణ్ని స్తుతిస్తూ ఆయనకు కృతజ్ఞతలు సమర్పించుకున్నారు. తర్వాత ఆయన "మలకుల్మౌత్! నీవు ఏరూపంలో అవిశ్వాసుల ఆత్మలను స్వాధీనంచేసుకుంటావో నేను చూడాలనుకుంటున్నాను" అన్నారు. దానికి మరణదూత "మీరు నా స్వరూపాన్ని భరించలేరు, మీకా శక్తి లేదు" అన్నాడు. కాని హజ్రత్ ఇబ్రాహీం (అలై) చూస్తానని పట్టుబట్టారు. "అయితే మీరు కాస్త వెనక్కి తిరిగి ముఖం తిప్పుకోండి" అన్నాడు మరణదూత. హజ్రత్ ఇబ్రాహీం (అలై) అలాగే వెనక్కి తిరిగి చూశారు.

అలా వెనక్కి తిరిగి చూడగానే ఆయన ముందు అత్యంత భయంకరమైన ఆకారం ప్రత్యక్షమయింది. ఎంతో పొడవైన నల్లటి మనిషి నిల్చున్నాడు. అతని తల నింగిని తాకుతోంది. అతని నోటి నుండి అగ్నిజ్వాలలు వెలువడుతున్నాయి. అతని దేహంపై ఉన్న ప్రతి వెంట్రుక మనిషి ఆకారంలో ఉంది. ఆ మనుషుల నోళ్ళ నుంచి, చెవుల నుంచి కూడా అగ్నిజ్వాలలు వెలువడుతున్నాయి.

హజ్రత్ ఇబ్రాహీం (అలైహి) ఎంతో భీతావహాన్ని గొలిపే ఈ అసాధారణ దృశ్యానికి తట్టుకోలేక స్పృహ తప్పారు. కాస్సేపటికి స్పృహ వచ్చి చూస్తే ఆయన ఎదురుగా మరణ దూత తన పూర్వరూపంలో కన్పించాడు. "మలకుల్మౌత్! అవిశ్వాసికి నీ ఈవికృత రూపమే కాకుండా మరేదైనా ఆపద, బాధ లేకపోయినా కేవలం నీ భయంకరాకారమే అతనికి కఠిన యాతన అవుతుంది" అన్నారు హజ్రత్ ఇబ్రాహీం (అలైహి). ఆ తరువాత ఆయన "సరే, ఇప్పుడు నీవు విశ్వాసి ప్రాణం తీసేటప్పుడు ఏ రూపంలో తీస్తావో చూపించు" అని అడిగారు. "అయితే మీరు కాస్త వెనక్కి తిరగండి" అన్నాడు మరణ దైవదూత మలకుల్మౌత్. హజ్రత్ ఇబ్రాహీం (అలైహి) వెనక్కి తిరిగారు.

అలా ఆయన వెనక్కి తిరిగిచూడగానే ఆయన ముందు జ్యోతిర్మయ ముఖ వర్చస్సుతో, శ్వేత వస్త్రధారణలో ఒక అందమైన యువకుడు ప్రత్యక్షమయి ఉన్నాడు. హజ్రత్ ఇబ్రాహీం (అలైహి) ఆ దృశ్యం చూసి "మలకుల్మౌత్! విశ్వాసి నీ ఈ ముఖము, శరీరాకృతులే కాకుండా మరే సుందర దృశ్యం చూడకపోయినా కేవలం అందమైన నీ మోము చూస్తేనే అతనికి కడుపు నిండిపోతుంది" అని అన్నారు. (మౌత్కాయిఖుట్కా)

## మరణం ఎవరికి మంచిది?

మరణం అంటే సహజంగా ఎవరికైనా భయమే. ఇస్లాంలో దృఢమైన విశ్వాసం కలిగివుండే విశ్వాసి మృత్యువుకు భయపడడు. పైగా అతను సంతోషంగా మృత్యువును స్వాగతిస్తాడు. దైవప్రవక్త (స) ప్రవచించిన కొన్ని హదీసులు చూడండి:

"మానవుడు (ఇహలోక) జీవితాన్ని ప్రేమిస్తాడు. కాని (సత్యాన్ని విశ్వసించి సదాచార సంపన్నుడయి ఉంటే) అతనికి మృత్యువు ఎంతో శ్రేష్ఠమైనది." (బైహఖి)

"హఠాన్మరణం దైవాగ్రహానికి సూచన." (అబూదావూద్); "హఠాన్మరణం అవిశ్వాసి పాలిటే దైవాగ్రహానికి సూచన; విశ్వాసిపాలిట అది దైవకారుణ్యానికి సూచన." (బైహఖి)

"మనిషి మరణాన్ని అసహ్యించుకుంటాడు. కాని (ఇహలోక) పరీక్షలు, ఉపద్రవాల కంటే మరణం ఎంతో మంచిది. ఎందుకంటే మరణం ఎంత తొందరగా వస్తే అంత తొందరగా అతను ఈ పరీక్షలు, ఉపద్రవాల నుండి బయటపడతాడు." (అహ్మద్)

ఓసారి హజ్రత్ అబూహురైరా (రజి) ఒకతడ్ని "ఎక్కడికి పోతున్నావు?" అనడిగారు. దానికా వ్యక్తి "బజారుకు వెళ్తున్నాను" అని చెప్పాడు. అప్పుడు హజ్రత్ అబూహురైరా (రజి) "వీలైతే నా కోసం మరణం కొని తీసుకురా" అన్నారు. (షరుస్సుదూర్)

దైవపవక్త (స) తుదిఘడియలు లెక్క పెట్టుకుంటున్న ఒక యువకుని దగ్గరకు వెళ్ళి "ఇప్పుడు నీ పరిస్థితి ఏమిటీ?" అని అడిగారు. దానికా యువకుడు "దైవప్రవక్తా! నేను దేవుని కారుణ్యం ఆశిస్తున్నాను. నా పాపాల పట్ల భయపడుతున్నాను" అని చెప్పాడు. దానిపై దైవప్రవక్త (సల్లం) ఇలా అన్నారు: "ఇప్పుడున్నట్లు ఈ రెండు విషయాలు ఏ దాసుని హృదయంలో కూడా కలసి ఉండవు. అయితే మరణావస్థలో ఉన్న విశ్వాసికి దేవుడు అతను ఆశించినదాన్ని ప్రసాదిస్తాడు; అలాగే అతను భయపడుతున్న దాన్ని దూరంచేసి శాంతియుతంగా ఉంచుతాడు." (తిర్మిజి, ఇబ్నెమాజ, మిష్కాత్)

దైవప్రవక్త (స) ఇలా అన్నారు: "ఎవరు (మరణం ద్వారా) దేవుడ్ని కలుసుకోవడానికి ఇష్టపడతాడో దేవుడు కూడా అతడ్ని కలుసుకోవడానికి ఇష్టపడతాడు. మరెవరు దేవుడ్ని కలుసుకోవడానికి ఇష్టపడడో దేవుడు కూడా అతడ్ని కలుసుకోవడానికి ఇష్టపడడు."

ప్రవక్త సతీమణి ఒకరు "దైవప్రవక్తా! మా అందరికీ మరణమంటే ఇష్టంలేదు" అన్నారు. అప్పుడు దైవప్రవక్త (స) ఇలా అన్నారు: "అలాకాదు, విశ్వాసికి మరణం సమీపించి నప్పుడు (మరణదూతలు) అతనికి దైవప్రసన్నత, గౌరవోన్నతల్ని గురించిన శుభవార్త అందజేస్తారు. అతనికి తన ముందున్న ఈ విషయాలకంటే మరేమీ ప్రియమైనవి కాలేవు. అతనికి దేవుడ్ని కలుసుకోవడమంటే ఎంతో ఇష్టం. దేవుడు కూడా అతడ్ని కలుసుకోవడానికి ఇష్టపడతాడు. అవిశ్వాసికి మరణం సమీపించినప్పుడు అతనికి దేవుని యాతనలను గురించిన దుర్వార్త అందజేయబడుతుంది. అతనికి తన ముందున్న ఈ విషయం కంటే మరేదీ అప్రియమైనది కాజాలదు. అంచేత అవిశ్వాసి దేవుడ్ని కలుసుకోవడానికి ఏమాత్రం ఇష్టపడడు. దేవుడు కూడా అతడ్ని కలుసుకోవడానికి ఇష్టపడడు." (బుఖారి, ముస్లిం)

హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి) కథనం: దైవప్రవక్త (స) నా భుజమ్మీద చెయ్యివేసి ఇలా అన్నారు: "నువ్వీ లోకంలో ఒక బాటసారిలా జీవితం గడుపు. నువ్వు సాయంత్రం గడిపిన తరువాత ఉదయం కోసం ఎదురుచూడకు. ఉదయం గడిపిన తరువాత సాయంత్రం కోసం ఎదురుచూడకు. వ్యాధికి పూర్వం ఆరోగ్యాన్ని, మరణానికి పూర్వం జీవితాన్ని మహాభాగ్యాలుగా భావించు." (బుఖారి)



**"మరణం విశ్వాసి పాలిట కానుక."**

(మిష్కాత్)దైవప్రవక్త (స) ప్రవచనం: "తల్లి తన బిడ్డపట్ల ఎంత వాత్సల్యం కనబరుస్తుందో అంతకంటే ఎక్కువ వాత్సల్యం మరణదూత విశ్వాసి పట్ల కనబరుస్తాడు. ఆ శుభాత్మ దేవునికి ఎంతో ప్రియమైనదని, దేవుని దగ్గర దానికి ఎంతగానో గౌరవాదరణలు ఉన్నాయని మరణదూతకు తెలుసు. అందువల్ల అతను విశ్వాసి పట్ల మృదువుగా ప్రవర్తించి దైవ ప్రసన్నత పొందగోరుతాడు. ఆ పుణ్యదాసుని ప్రాణాన్ని పిండి నుండి వెంట్రుకను తీసినట్లు చాలా తేలికగా తీస్తాడు. ఆ దాసుని ఆత్మ దేహం నుండి వెడలగానే ఇతర మరణదూతలు దాన్ని ఆశీర్వదిస్తూ "నీపై శాంతీ శ్రేయాలు వర్షించుగాక! నీవు చేసుకున్న సత్కర్మలకు ప్రతిఫలంగా ఇప్పుడు స్వర్గంలో ప్రవేశించు" అంటారు. (కష్ఫుర్రహ్మాన్)

సత్యం కోసం పోరాడి చంపబడిన విశ్వాసిని హతసాక్షి (షహీద్) అంటారు. హతసాక్షి గురించి దైవప్రవక్త (స) ఇలా అన్నారు: "మీకు చీమ కుట్టినప్పుడు ఎంత బాధ కలుగుతుందో హతసాక్షి చంపబడినప్పుడు కూడా అతనికి అంతే బాధ కలుగుతుంది." (మిష్కాత్)

## ఆత్మహత్య మహాపాతకం

"మీలో ఎవరూ ఆపదలకు భయపడి చావును కోరుకోకండి. గత్యంతరం లేని పరిస్థితిలో 'దేవా! నా కోసం జీవితం ప్రయోజనకరంగా ఉన్నంతవరకు నన్ను జీవించి ఉండేలా చెయ్యి. నా కోసం మరణమే ప్రయోజనకరమైన విషయమయితే నాకు మరణం కలిగించు' అని వేడుకోవాలి" (బుఖారి, ముస్లిం)

"మీలో ఎవరూ మరణాన్ని కోరుకోకూడదు. ఒకవేళ అతను సజ్జనుడయితే మరిన్ని సత్కార్యాలు చేయవచ్చు. దుర్జనుడయితే అతను (పాపాలు మానేసి) దైవప్రసన్నతను కోరుకునే అవకాశం ఉంటుంది." (మిష్కాత్)

ఆపదలకు తట్టుకోలేక కొందరు ఆత్మహత్య చేసుకుంటారు. కాని ఆత్మహత్య వల్ల కష్టాలు తీరకపోగా, అసలైన కష్టాలపర్వం అక్కడ్నుంచే ప్రారంభమవుతుంది. ఆత్మ దేవుడు మానవునికి ప్రసాదించిన అమానత్. దాన్ని దుర్వినియోగం చేసే అధికారం మానవునికి లేదు.

ఆత్మహత్య పర్యవసానం గురించి దైవప్రవక్త (స) ఇలా తెలియజేశారు: "కొండ మీద నుంచి పడి ఆత్మహత్య చేసుకున్నవాడు నరకానికి పోయి, మాటిమాటికి కొండ మీద నుంచి త్రోయబడే ఘోరమైన శిక్షను శాశ్వతంగా చవిచూస్తూ ఉంటాడు. విషం తిని ఆత్మహత్య చేసుకున్నవాడు నరకంలో విషం చేతిలో పట్టుకొని తింటూ ఎల్లప్పుడూ తననుతాను హతమార్చుకుంటూ ఉంటాడు. ఏదైనా ఆయుధంతో ఆత్మహత్య చేసుకున్నవాడు నరకంలో కూడా అలాంటి ఆయుధమే తీసుకొని కడుపులో పొడుచు కుంటూ ఎల్లప్పుడూ తీవ్రయాతనలు అనుభవిస్తూ ఉంటాడు." (బుఖారి, ముస్లిం)

హజ్రత్ అబూ ఉమామా కథనం: మేము దైవప్రవక్త (సల్లం) దగ్గర కూర్చున్నాం. దైవప్రవక్త (సల్లం) మాకు హితోపదేశం చేసి మా హృదయాలను మృదువు చేశారు. సాద్ బిన్ అబీవఖ్ఖాస్ (రజి) అయితే (ప్రవక్త హితవులు విని) ఎంతగానో దుఃఖించారు. అలా దుఃఖిస్తూ "అయ్యో! నేను చనిపోతే ఎంత బాగుండు!!" అన్నారు.

దైవప్రవక్త (సల్లం) ఈమాట విని "సాద్! ఏమిటీ! నీవు నాముందే కూర్చొని చావును కోరుకుంటున్నావా?" అన్నారు. ఈమాట ఆయన మూడుసార్లు అన్నారు. తరువాత "సాద్! నీవు స్వర్గం కోసం పుట్టించబడిఉంటే, నీ ఆయుష్షువు ఎంత దీర్ఘంగా ఉంటుందో, నీ కర్మలు ఎంత బాగుంటాయో అవి నీకెంతో మంచి విషయాలు" అన్నారు. (అహ్మద్)

## చరమఘడియల్లో చేయవలసిన పనులు

మరణావస్థలో ఉండేవారి ముందు మంచి విషయాలే మాట్లాడాలి. ముఖ్యంగా కలిమాయె తయ్యిబా, యాసీన్ సూరాలు పఠించాలి. దైవప్రవక్త (స) బోధించిన కొన్ని హితోక్తులు వినండి:

"మీరు ఎవరైనా రోగి దగ్గరికిగాని, శవం దగ్గరకుగాని వెళ్తే అక్కడ మంచి మాటలే పలకాలి. ఆ సమయంలో మీరు పలికే పలుకుల పట్ల దైవదూతలు ఆమీన్ (తథాస్తు) అంటారు" (ముస్లిం); "మీ మృతుల దగ్గర యాసీన్ సూరా చదవండి" (అహ్మద్)

"మీలో మరణావస్థలో ఉన్నవారి చేత లాఇలాహ ఇల్లల్లాహ్ సద్వచనం పఠింప జేయండి" (ముస్లిం); "ఎవరి నోట (మరణ సమయంలో) తుది పలుకులుగా లాఇలాహ ఇల్లల్లాహ్ సద్వచనం వెలువడుతుందో అతను స్వర్గంలో ప్రవేశిస్తాడు." (అబూదావూద్)

హ్జ్రత్ అబూమూసా అష్అరీ (రజి) కథనం: నేను దైవప్రవక్త (స)ను "వ్యాధిగ్రస్తుడికి తన (బంధుమిత్రులు) అందరూ ఎప్పుడు అపరిచితులై పోతారని అడిగాను. దానికి ఆయన "అతను ఎప్పుడయితే మరణదూతను చూస్తాడో అప్పుడే అందరి నుండి అతని దృష్టి మరలిపోతుంది. ఇక అతను ఎవరినీ గుర్తించలేడు" అని చెప్పారు. (ఇబ్నెమాజ)

మనిషి చనిపోయినప్పుడు ప్రజలు "ఈ మనిషి తన వెనుక (వారసుల కోసం ఏం వదలిపెట్టి పోతున్నాడు?" అని అడుగుతారు. కాని దైవదూతలు "ఈ మనిషి తనకోసం ఇక్కడ్నుంచి పరలోకానికి ఏం తీసికెళ్తున్నాడు?" అని ప్రశ్నిస్తారు. (బైహఖి, మౌత్కారుఖ్యా)

"ప్రతి మానవుని కోసం ఆకాశంలో రెండు ద్వారాలు ఉంటాయి. ఒక ద్వారం గుండా అతని ఆహారం క్రిందికి దిగుతుంది. రెండవ ద్వారం గుండా అతని కర్మలు పైకెక్కి పోతాయి. సత్యాన్ని విశ్వసించిన దాసుడు చనిపోయినప్పుడు అతని మృతి పట్ల ఈ రెండు ద్వారాలు ఏడుస్తాయి". (తిర్మిజి)

"హ్జ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) కథనం ప్రకారం, విశ్వాసి మృతి పట్ల భూమి నలభై రోజుల దాకా దుఃఖిస్తుంది". (హాకిమ్)

"విశ్వాసి అయిన దైవదాసుడు (నమాజు సందర్భంలో) ఏ భూభాగంపై సాష్టాంగ ప్రణామం చేస్తాడో ఆ భూభాగం ప్రళయదినాన అతనికి అనుకూలంగా సాక్ష్యం చెబుతుంది; అతని మృతి పట్ల రోదిస్తుంది." (మిష్కాత్)

## 92. సదనం నుండి శ్మశానం వరకు

హ్జ్రత్ ఉమర్(రజి) కథనం ప్రకారం విశ్వాసి చనిపోయినప్పుడు శ్మశానం తనను తాను అలంకరించుకుంటుంది. ఆ శ్మశానానికి చెందిన ప్రతి భూభాగం చనిపోయిన ఆ విశ్వాసిని తనలో ఖననం చేస్తే బాగుండు! అని కోరుకుంటుంది. (ఇబ్నెఅసాకిర్)



మనిషి చనిపోయినప్పుడు అతని బంధుమిత్రులు సహనం వహించాలిగాని, ఏడ్పులు పెడబొబ్బలు పెట్టడం, బట్టలు చించుకోవడం చేయకూడదు.

ఓరోజు ఒక స్త్రీ సమాధి మీద కూర్చొని తన కొడుకు మృతి పట్ల ఏడుస్తుంటే దైవ ప్రవక్త (స) అటుగా వచ్చారు. అప్పుడాయన ఆమెను చూసి "దేవునికి భయపడి కాస్త సహనం వహించు" అన్నారు. దానికా స్త్రీ (ముఖం చిట్లించుకుంటూ) "మీ దారి మీరు వెళ్ళండి. నన్ను నామానాన వదిలెయ్యండి. నా మీద వచ్చిపడిన ఆపద మీమీద రాలేదు. అందుకని మీరు నా బాధను అర్థం చేసుకోలేరు" అని అన్నది. తరువాత (కొందరు) ఆ స్త్రీకి 'ఆయనగారు దైవప్రవక్త (స)' అని తెలియజేశారు. ఈ మాట విని ఆమె (పరుగు పరుగున) దైవప్రవక్త (స) ఇంటికి వెళ్ళింది. చూస్తే ఆయన ఇంటి ముందు ఒక ద్వార పాలకుడు కూడా లేడు. సరే, (ఆ స్త్రీ దైవప్రవక్తను కలుసుకొని) "నేను మిమ్మల్ని గుర్తుపట్ట లేకపోయాను. (నన్ను క్షమించండి)" అన్నది. అప్పుడు దైవప్రవక్త (స) "ఆపద ప్రారంభంలో పాటించే సహనమే (అసలు) సహనం" అన్నారు. (బుఖారి, ముస్లిం)

హ్జ్రత్ ఆయిషా (రజి) ఇలా అన్నారు: "....దైవసాక్షి! విశ్వాసిని అతని కుటుంబ సభ్యులు ఏడ్వడం వల్ల దేవుడు శిక్షిస్తాడని దైవప్రవక్త (సల్లం) ఎన్నడూ చెప్పలేదు. అవిశ్వాసికి అతని కుటుంబసభ్యులు ఏడ్వడం వల్ల మరింత యాతనకు గురిచేస్తాడని మాత్రమే ఆయన తెలిపారు." ఆ తర్వాత ఆమె "కావాలంటే 'బరువు మోసేవాడెవడూ ఇతరుల బరువు మోయడు' అన్న ఖుర్ఆన్ సూక్తి చూడు" అని చెప్పారు. (బుఖారి)

మరో సందర్భంలో హ్జ్రత్ ఆయిషా (రజి) ఇలా తెలిపారు: "ఇది అబ్దుల్లా బిన్ ఉమర్ భ్రమ మాత్రమే. ఎలాంటి భ్రమంటే, బదర్ (మైదానం)లోని పాడుబడ్డ గుంటలో హతులు వేయబడిన తరువాత దైవప్రవక్త (స) దాని ఒడ్డు మీద నిలబడి చెప్పవలసిన విషయాలు చెప్పిన తరువాత, 'వీరు నా మాటలు వింటున్నారని అన్నారని ఆయన అన్నారు. నిజానికి దైవప్రవక్త (అలా అనలేదు.) 'వీరిప్పుడు లోగడ నేను చెబుతూ వచ్చిన విషయాలు నిజమని తప్పకుండా తెలుసుకున్నార'ని మాత్రమే అన్నారు. ఆ తరువాత ఆయన 'నీవు మృతులకు విన్పించలేవు; నీవు సమాధుల్లో పూడ్చబడినవారికి ఏదీ విన్పించ లేవు' అన్న ఖుర్ఆన్ సూక్తులు (27:80, 35:22) విన్పించారు." (బుఖారి, ముస్లిం)

విశ్వాసుల మాతృమూర్తి హ్జ్రత్ ఆయిషా (రజి) కథనం: (యుద్ధంలో) జైద్ బిన్ హారిస్ (రజి), జాఫర్ బిన్ అబూతాలిబ్ (రజి), అబ్దుల్లా బిన్ రవాహా (రజి)లు అమర గతులయ్యారని విన్న తరువాత దైవప్రవక్త (స) మసీదుకు వెళ్ళారు. ఆయన ముఖార విందంపై విషాదఛాయలు స్పష్టంగా కన్పించసాగాయి. నేనా సమయంలో తలుపు సందు నుంచి చూస్తుంటే ఒకతను వచ్చి "జాఫర్ కుటుంబ స్త్రీలు ఆయన మృతి పట్ల శోకతాపాలు తీస్తున్నార'ని తెలియజేశాడు. దైవప్రవక్త (స) ఈమాట విని "వెళ్ళి వాళ్ళను (ఏడ్పులు, పెడబొబ్బలు) మానెయ్యమని చెప్పు" అని ఆదేశించారు. అతను వెళ్ళివచ్చి ఆ స్త్రీలు తనమాట వినడం లేదని చెప్పాడు. దైవప్రవక్త (స) తిరిగి "వెళ్ళి వారిని వారించు" అని చెప్పారు. ఆ వ్యక్తి మూడో సారి వెళ్ళొచ్చి "దైవప్రవక్తా! దైవసాక్షి!! ఆ స్త్రీలు ఎంత చెప్పినా వినే స్థితిలో లేరు" అన్నాడు. అప్పుడు దైవప్రవక్త (స) "వారి నోట మన్నుకొట్టు"

అని అన్నారనుకుంటా. నేనా పరిస్థితి చూసి ఆ వ్యక్తితో "దేవుడు నీ ముక్కుకు మట్టి తగిలించ! నువ్వీటు దైవప్రవక్త (సల్లం) ఆజ్ఞాపించిన పనీ చేయవు; అటు ఆయన్ని ఊపిరీ సలుపుకోనియ్యవు" అని అన్నాను. (బుఖారి)

ఒకసారి హజ్రత్ సాద్ బిన్ ఉబాదా (రజి) వ్యాధిగ్రస్తులయితే దైవప్రవక్త (సల్లం) ఆయన్ని పరామర్శించడానికి వెళ్ళారు. అప్పుడు దైవప్రవక్త (సల్లం) వెంట హజ్రత్ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (రజి), సాద్ బిన్ అబీ వఖ్ఖాస్ (రజి), అబ్దుల్లా బిన్ మస్ఊద్ (రజి)లు కూడా ఉన్నారు. దైవప్రవక్త (సల్లం) అక్కడకు చేరుకోగానే ఆ ఇంటివాళ్ళు ఆయన చుట్టూ మూగారు. అది చూసి దైవప్రవక్త-సల్లం (సందేహిస్తూ) "ఏమిటీ ఈయన చనిపోయాడా?" అనడిగారు. దానికి వారు చనిపోలేదు దైవప్రవక్తా!" అన్నారు.

ఆ తరువాత దైవప్రవక్త-సల్లం (రోగి పరిస్థితి చూసి) కంట తడిపెట్టారు. ఆయన్ని చూసి అందరూ దుఃఖించడం మొదలెట్టారు. తరువాత దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రవచించారు: "వినండి, హృదయావేదన కన్నీళ్ళ వల్లగాని లేదా నోట దయార్ద్ర పలుకులు వెలువడటం వల్లగాని దేవుడు మనిషిని శిక్షించడు. అయితే (దైవప్రవక్త తన నోటి వైపు చూపిస్తూ) దీని విషయంలో మాత్రం (పెడబొబ్బలు పెడ్తూ ఏడిస్తే) దేవుడు తప్పకుండా శిక్షిస్తాడు. కుటుంబసభ్యులు ఏడ్చినా సరే మృతునికి శిక్ష ఉంటుంది." (బుఖారి)

దైవప్రవక్త (స) హజ్రత్ అబూసల్మా (రజి) చనిపోయినప్పుడు ఆయన్ని చూడటానికి వచ్చారు. అప్పుడు అబూసల్మా (రజి)కు నిలువుగుడ్లు పడిఉన్నాయి. దైవప్రవక్త (స) ఆయన కళ్ళు మూసేశారు. తరువాత ఇలా అన్నారు:

"ప్రాణం తీయబడగానే మృతుని చూపులు మరలిపోతాయి. అతని గృహస్థులు ఏడ్పులు, పెడబొబ్బలు పెట్టారు. మీరు మంచి విషయం గురించి తప్ప మరే విషయం గురించి దైవాన్ని వేడుకోకండి. మీరు పలికే పలుకులకు దైవదూతలు తథాస్తు అంటారు." ఆ తరువాత దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రార్థించారు: "దేవా! అబూసల్మాను క్షమించు. ఇతని హోదాలను జనంలో ఉన్నతం చెయ్యి. జీవించి ఉన్నవారిలో ఇతనికి వారసుడ్ని చెయ్యి. సకలలోకాల ప్రభువా! ఇతడ్ని, మమ్మల్ని మన్నించు. ఇతని సమాధిని విశాలం చెయ్యి. ఇతని కోసం దాన్ని కాంతిమంతం చెయ్యి." (ముస్లిం)

మనిషి చనిపోయిన తరువాత అతని భౌతిక కాయాన్ని కర్పూరం, రేగాకులు కలిపిన నీటితో స్నానం చేయించాలి. తరువాత దాన్ని మూడు తెల్ల వస్త్రాలలో చుట్టాలి. ఆ తరువాత జనాజా నమాజ్ చేసి శవాన్ని శ్మశానికి తీసికెళ్ళాలి.

దైవప్రవక్త (స) ప్రవచనం: "మరణించిన ఒక ముస్లిం జనాజా నమాజ్‌లో దేవునికి మిథ్యా దైవాలను సాటికల్పించకుండా ఉండే నలభైమంది జనం గనక పాల్గొంటే దేవుడు అతని విషయంలో వారు చేసే సిఫారసును తప్పకుండా ఆమోదిస్తాడు. (ముస్లిం)

దైవప్రవక్త (స) ఇలా ఉపదేశించారు: "మృతదేహాన్ని (శ్మశానికి) తీసికెళ్ళడంలో తొందరచేయండి. ఎందుకంటే మృతుడు పుణ్యాత్ముడైఉంటే అతడ్ని మీరు సత్పర్యవసానం వైపుకు తీసికెళ్తున్నారన్నమాట. ఒకవేళ అతను పాపాత్ముడైఉంటే అతనొక చెడుమయం.



దాన్ని మీరు మీ భుజాల నుండి దించివేయడానికి తీసికెళ్తున్నారన్నమాట. (అందువల్ల మృతదేహాన్ని ఎంత త్వరగా శ్మశానికి చేర్చితే అంత మంచిది.) (బుఖారి)

దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "ప్రజలు మృతుడి భౌతికకాయం ఎత్తుకొని (శ్మశానికి) తీసికెళ్తున్నప్పుడు, అతను పుణ్యాత్ముడయివుంటే 'నన్ను తొందరగా తీసికెళ్ళండి' అంటాడు. ఒకవేళ అతను పాపాత్ముడయివుంటే 'అయ్యయ్యో, నాపాడు గాను! మీరు నన్ను ఎక్కడికి తీసికెళ్తున్నారు' అనంటాడు. అతని పలుకులు మానవులు, జిన్నులు తప్ప యావత్తు సృష్టిరాసులు వింటాయి. మానవులు, జిన్నులు గనక అతని కంఠస్వరం వింటే స్పృహతప్పిపోతారు." (బుఖారి, ముస్లిం)

ఓ సారి దైవప్రవక్త (స) తన ముందు నుంచి ఒక శవం పోతుంటే చూసి "సౌఖ్యాన్ని పొందేవాడు లేదా సౌఖ్యాన్ని ఇచ్చేవాడు" అన్నారు. అనుచరులు విషయం అర్థంగాక "సౌఖ్యాన్ని పొందేవాడు లేదా సౌఖ్యాన్నిచ్చేవాడు అంటే ఏమిటి దైవప్రవక్తా?" అని అడిగారు. దానికి దైవప్రవక్త (స) సమాధానమిస్తూ "విశ్వాసి (చనిపోయాక) ఇహలోక కష్టాల నుండి విముక్తిపొంది దేవుని కారుణ్యఛాయ (స్వర్గం)లో సౌఖ్యం పొందుతాడు. పాపాత్ముడు చనిపోతే ప్రజలు, పట్నం, దేశం, చెట్లు, చతుష్పాదాలు, సర్వానికి అతని కీడు నుండి విముక్తి కలుగుతుంది" అన్నారు. (బుఖారి)

హజ్రత్ అబూహురైరా (రజి) ఇలా తెలియజేశారు: ఒక నల్ల స్త్రీయో లేక యువకుడో మస్జిద్ ఊడ్చేవారు. ఒకసారి ఆమె కనిపించకపోవటంతో దైవప్రవక్త (స) ఆమె గురించి అడిగారు. ఆమె చనిపోయిందని అనుచరులు చెప్పారు. దానికాయన "మరి ఆ సంగతి నాకెందుకు చెప్పలేదు?" అనడిగారు. అనుచరులు ఆ మనిషి విషయాన్ని తేలికగా తీసుకున్నారు. అందుకే దైవప్రవక్త (స)కు తెలియపరచలేదు. అసలు సంగతి తెలుసుకొన్న తరువాత ఆయన "సరే, నాకు ఆమె సమాధి ఎక్కడుందో చూపించండి" అన్నారు. అనుచరులు సమాధి చూపించగా ఆయన ఆమె సమాధివద్ద (జనాజా)నమాజు చేశారు. తరువాత ప్రజలతో ఇలాఅన్నారు- "సమాధులు వాటిలో వున్న వారికొరకు చీకటితో నిండిఉన్నాయి. నేను వాటి దగ్గర నమాజు చేసినప్పుడు దేవుడు వారికి వెల్తురు ప్రసాదిస్తాడు." (బుఖారీ, ముస్లిం)

శవం ఏ మతస్థునిదయినా సరే మన సమీపం నుంచి పోతుంటే దానికి గౌరవ సూచకంగా నిలబడిపోవాలి. "మీరు శవం వస్తుండగా చూస్తే నిలబడండి. అది ముందుకు సాగిపోయే వరకు లేదా నేల మీద దించబడే వరకు అలాగే నిలబడండి" అన్నారు దైవప్రవక్త (సల్లం) ఓసారి. (ముస్లిం)

హజ్రత్ జాబిర్ బిన్ అబ్దుల్లా (రజి) ఇల్లా ఉల్లేఖిస్తున్నారు: మా ముందు నుంచి ఒక శవం వెళ్తుంటే దైవప్రవక్త (సల్లం) దానికి గౌరవసూచకంగా నిలబడి పోయారు. ఆయనతో పాటు మేమూ నిలబడిపోయాం. తర్వాత మేము "దైవప్రవక్తా! ఇది యూదుని శవం కదా?" అన్నాం. దానికి ఆయన "శవం (ఎవరిదైనా) వస్తుండగా చూస్తే నిలబడి పోవాలి" అన్నారు. వేరొక ఉల్లేఖనంలో "ఇది యూదుని శవం కదా అనంటే, యూదుని లో ఉండేది ఆత్మ కాదా? అని ఆయన ఎదురు ప్రశ్న వేశారు" అని ఉంది. (బుఖారి)

## చచ్చి బ్రతికినవారు

హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి) కథనం: నేనొక రోజు బదర్‌ప్రాంతం గుండా వెళ్తుంటే హఠాత్తుగా ఒకతను ఓ గుంటలో నుంచి బయటికి రావడం కన్పించింది. అతని మెడలో ఒక ఇనుప గొలుసు ఉంది. అతను నన్ను కేకవేసి పిలుస్తూ "అబ్దుల్లా! నాక్కొంచెం తాగడానికి నీళ్ళివ్వు" అన్నాడు. అతను నన్ను గుర్తుపట్టి నా పేరుపెట్టి పిలిచాడో, లేక అరబ్బులు ప్రతి అపరిచిత వ్యక్తిని పిలిచినట్లు అబ్దుల్లా (దైవదాసుడా) అని పిలిచాడో నాకు అర్థంకాలేదు. అంతలో ఆగుంటలో నుంచే మరొకతను ప్రత్యక్షమయి వచ్చాడు. అతని చేతిలో ఓ కొరడా ఉంది. అతను నన్ను పిలుస్తూ "అబ్దుల్లా! ఇతను సత్యతిరస్కారి. ఇతనికి నీళ్ళివ్వకు" అన్నాడు. ఆ తర్వాత అతను మొదటి వ్యక్తిని కొరడాతో కొడుతూ తిరిగి ఆ గుంటలోకి తీసికెళ్ళాడు.

ఈ భయానక దృశ్యం చూసిన తరువాత నేను దైవప్రవక్త (సల్లం) సన్నిధికి వచ్చి విషయం తెలియజేశాను. దైవప్రవక్త (స) ఈమాట విని "నీవు నిజంగా అలా చూశావా?" అని అడిగారు. నేను నిజంగానే చూశానని చెప్పాను. "అయితే నీవా గుంటలో నుంచి బయటికి వస్తుండగా చూసిన మొదటి వ్యక్తి దైవవిరోధి అబూజహల్. అతనికి అదేవిధంగా ప్రళయదినం దాకా యాతన జరుగుతుంది" అన్నారు దైవప్రవక్త (స) (తబ్రాని)

హజ్రత్ ఉస్మాన్ (రజి) పరిపాలనా కాలంలో జరిగిన ఒక సంఘటన ఇలా ఉంది: ఒక రౌతు రాత్రివేళ మక్కా, మదీనాల మధ్య ప్రయాణం చేస్తూ ఒక సమాధి పక్కగా పోతుంటే, అకస్మాత్తుగా ఆ సమాధిలో నుంచి ఒక వ్యక్తి బయటికి వచ్చాడు. అతను ఇనుప సంకెళ్ళతో బంధించబడి అగ్నిజ్వాలల మధ్య మాడిపోతున్నాడు. అతను ఆ బాటసారిని పిలుస్తూ "నా మీద కొంచెం నీళ్ళు కుమ్మరించు" అన్నాడు. అంతలో అదే సమాధి నుంచి మరొకతను బయటికొచ్చి ఎలుగెత్తి పిలుస్తూ "ఓ పుణ్యాత్ముడా! అతని మీద నీళ్ళు పొయ్యకు" అన్నాడు. ఈ అసాధారణ దృశ్యం చూసి రౌతు భయంతో వణికిపోతూ స్పృహతప్పి పడిపోయాడు. మరునాడు తెల్లవారేటప్పటికి అతని తల వెంట్రుకలన్నీ తెల్లబడి పోయాయి. హజ్రత్ ఉస్మాన్ (రజి) ఈ సంఘటన గురించి విని "ఇక నుంచి ఎవరూ ఒంటరిగా ప్రయాణం చేయకూడదు" అన్నారు.

హజ్రత్ ఉమర్ (రజి) పరిపాలనా కాలంలో ఒకతను దేవునికి ఎక్కువగా భయపడు తుండేవాడు. ఒకరోజు రాత్రివేళ అతను ఎంతో భయభక్తులతో ప్రార్థన చేస్తూ "విశ్వప్రభువు ముందు నిలబడి తన కర్మలకు సమాధానం ఇచ్చుకోవలసిఉంటుందని భావించి భయ భక్తులతో జీవితం గడిపిన ప్రతి వ్యక్తికీ రెండు (స్వర్గ)వనాలు లభిస్తాయి" (ఖుర్‌ఆన్-55:46) అనే సూక్తి మాటిమాటికి పఠించసాగాడు. ఈవిధంగా అమితమైన దైవభీతితో అనేకసార్లు పఠించడంతో అతను స్పృహతప్పి పడిపోయి ప్రాణం కోల్పోయాడు.

హజ్రత్ ఉమర్ (రజి) ఈ సంగతి తెలియగానే వచ్చి అతని జనాజానమాజ్ చేయించారు. ప్రజలు అతని శవాన్ని సమాధి చేశారు. తర్వాత హజ్రత్ ఉమర్ (రజి) ఆ సమాధి పైన ముఖంఆనిచ్చి పై సూక్తినే పఠించారు. అప్పుడు సమాధినుండి "ఉమర్! ఈ రెండు వనాలు నాకు లభించాయి" అనే నాదం విన్పించింది. (బైహఖీ, ఇబ్నె అసాకిర్)



హజ్రత్ అనస్ (రజి) కథనం: ఉమర్ బిన్ ఖత్తాబ్ (రజి) ఒక సైనికదళం తయారుచేసి దానికి ఇలావుల్ హజ్రమీ (రజి)ని సేనాపతిగా నియమించారు. నేను కూడా ఆ సైన్యంలో చేరి యుద్ధం చేశాను. మేమా యుద్ధం నుండి తిరిగొస్తుంటే దారిలో మా సేనాపతి (రజి) చనిపోయారు. అప్పుడు మేమా ప్రాంతంలోనే ఒక చోట సమాధి తవ్వి ఆయన భౌతిక కాయాన్ని పూడ్చిపెట్టాము.

అంతలో ఒకతను వచ్చి 'ఇది ఎవరి సమాధ'ని అడిగాడు. "ఇలావుల్ హజ్రమీ అనే ఓ సత్పురుషుడి సమాధి" అని చెప్పాం. అతనీ మాట విని "ఇది వరదలొచ్చే నేల. వరద వచ్చినప్పుడు నేలలోని వస్తువులు బయటికొస్తాయి. శవం బయటికి వచ్చేస్తుంది. అంచేత ఈ భౌతికకాయం ఇక్కడ్నుంచి వేరేచోటికి తరలించి పూడ్చిపెట్టండి" అని చెప్పాడు.

మేము అతని సలహా పాటిస్తూ సమాధి తవ్వాము. చాలా లోతుగా తవ్వి చూశాం. కాని మా సేనాపతి శవం కన్పించలేదు. దానికి బదులు ఎంతో విశాలమైన సొరంగం కన్పించింది. అందులో ఒక జ్యోతి దేదీప్యమానంగా వెలిగిపోతోంది. ఈ దృశ్యం చూసి మేము వెంటనే సమాధిని యథాప్రకారం మూసేశాము. (బైహఖీ)

హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి) కథనం: ఒక పల్లెవాసి దైవప్రవక్త (స)తో పాటు ఒక యుద్ధంలో పాల్గొన్నాడు. అతనా యుద్ధంలో అమరగతి పొందాడు. అప్పుడు దైవప్రవక్త (స) అతని భౌతికకాయం దగ్గర తలవైపు కూర్చొని సంతోషంతో చిరునవ్వు నవ్వసాగారు. అయితే కాస్సేపటికి అకస్మాత్తుగా అతని వైపు నుండి వేరే వైపుకు తిరిగి ముఖం చాటుచేసు కున్నారు. అనుచరులు ఆశ్చర్యపోతూ విషయం ఏమిటని అడిగారు. దానికి దైవప్రవక్త (స) ఇలా సమాధానమిచ్చారు: "దేవుని దగ్గర అతనికి లభించిన గౌరవౌన్నత్యాలు చూసినేను సంతోషంతో చిరునవ్వు నవ్వాను. కాని ఆ తర్వాత స్వర్గంలోని సుందరాంగుల్లో నుంచి అతని భార్య వచ్చి అతని తలాపున కూర్చున్నది. అంచేత నేను (పరదా నియమాన్ని దృష్టిలో పెట్టుకొని) వెంటనే ముఖం తిప్పుకున్నాను." (బైహఖి)

హజ్రత్ ఖాసిం బిన్ ఉస్మాన్ (రజి) కథనం: నేను ఓసారి కాబా ప్రదక్షిణ చేస్తుంటే అక్కడ ఓ చిత్రమైన మనిషిని చూశాను. అతను "దేవా! నీవు నిరాధారుల అవసరాలను నెరవేర్చావు. కాని నా అవసరం ఇంకా నెరవేరలేదు" అని ప్రార్థిస్తున్నాడు. నేను ఆశ్చర్యపోతూ "ఏమిటీ! నీ దగ్గర ఈ విషయం తప్ప మరొకటి లేదా అర్థించడానికి?" అని అడిగాను. అప్పుడతను "నేనీ విషయంలో ఒక సంఘటన గురించి చెబుతా వినండి" అంటూ ఇలా చెప్పడం మొదలెట్టాడు:

మేము విభిన్న పట్టణాలకు చెందిన ఏడుగురు మిత్రులం. మేము ఏడుగురం దైవమార్గంలో శత్రువులతో యుద్ధంచేసి యుద్ధఖైదీలుగా పట్టుబడ్డాము. శత్రువులు మమ్మల్ని విడివిడిగా బంధించి పెట్టారు. తరువాత మమ్మల్నందరినీ హతమార్చాలని నిర్ణయించారు. శత్రువులు మమ్మల్ని వధ్యస్థలానికి తీసికెళ్ళారు. అప్పుడు నేను తల పైకెత్తి ఆకాశం వైపు చూశాను. అక్కడ ఏడు ద్వారాలు తెరచుకున్నాయి. ప్రతి ద్వారం దగ్గర ఒక్కో స్వర్గకన్య నిలబడి ఉంది. ఇటు ఏడుగురు ఖైదీలలో ఒకతడ్ని బయటికి

తీసి హతమార్చారు. నేను ఆకాశం వైపు చూస్తే ఒక ద్వారం దగ్గరున్న ఒక స్వర్గకన్య చేతిలో తువాలు తీసుకొని కిందికి దిగింది. అలాగే రెండవ స్వర్గకన్య కూడా. ఇలా ఆర్గురు ఖైదీలు హతమార్చబడినప్పుడు ఆర్గురు స్వర్గకన్యలు కిందికి దిగారు.

ఇక ఒక ద్వారం దగ్గర ఒకే స్వర్గకన్య మిగిలిఉంది. శత్రువులు నన్ను చంపడానికి సిద్ధమైనప్పుడు కొందరు వచ్చి వారినుండి నన్ను ఖైదీగా అడిగి తీసుకున్నారు. ఈ విధంగా నా ప్రాణం దక్కింది. కాని అమరగతి భాగ్యానికి మాత్రం నేను నోచుకోలేక పోయాను.

సరిగ్గా అదే సమయంలో ఆకాశ ద్వారం దగ్గర నిల్చున్న స్వర్గకన్య నోట "దౌర్భాగ్యుడా! నీలో ఏం లోపం ఉంది, నీవు స్వర్గ భాగ్యానికి దూరమయ్యావు?" అనే మాటలు వెలువడ్డాయి. నేనీ మాటలు నా చెవులారా విన్నాను. ఆ తర్వాత ఆ ఆకాశ ద్వారం మూసుకుపోయింది.

సోదరా! ఇదీ నా పరిస్థితి. నా దురదృష్టాన్ని తలచుకొని దుఃఖిస్తున్నాను. నా మిత్రులు ఆర్గురు తమ ఆశయాలు సాధించుకున్నారు. నేనొక్కణ్ణే అపజయం పాలయి ఈ భూమండలంపై మిగిలిపోయాను. అందుకే కాబాగృహం దగ్గర కూడా నా నోట మీరిప్పుడు విన్న ఈ ప్రార్థనా పలుకులే వెలువడుతున్నాయి. (బైహఖీ)

## 93. పితృలోకంలోకంలో ప్రారంభ స్థితి

మనిషి చనిపోయిన దగ్గర్నుంచి పునరుత్థాన దినం వరకు ఆత్మలు ఉండే విచిత్ర పరిస్థితి కలిగిన తాత్కాలిక లోకాన్ని పితృలోకం (ఆలమెబర్జఖ్) అంటారు.

"చివరికి వారిలో ఎవరికైనా చావు మూడినప్పుడు అతను (పశ్చాత్తాపంతో) 'ప్రభూ! నేను వదలివచ్చిన ప్రపంచంలోకి నన్ను మరోసారి పంపించు. నేనిప్పుడు (నా ప్రవర్తన మార్చుకొని) సత్కార్యాలు చేస్తాను' అంటాడు. అలా ఎన్నటికీ జరగదు. అతను పనికిమాలిన మాటలు వదరుతున్నాడు. (చనిపోయిన)వారందరి వెనుక ఇప్పుడొక అడ్డుతెర (బర్జఖ్) ఏర్పడింది. పునరుత్థాన దినంవరకు వారా స్థితిలోనే ఉంటారు." (ఖుర్‌ఆన్- 23:99,100)

దైవప్రవక్త (స) హితోక్తి: "మనిషిశవాన్ని సమాధిలో పూడ్చిపెట్టిన తర్వాత అతని (శవాన్ని మోసుకొచ్చిన) సహచరులు తిరిగివెళ్ళిపోతారు. వారలా వెళ్తుంటే ఆ మనిషి వారి చెప్పుల సవ్వడి వింటాడు. అదే సమయంలో ఇద్దరు దైవదూతలు అతని దగ్గరికి వస్తారు. అతడ్ని లేపి కూర్చోబెట్టి కొన్ని ప్రశ్నలు అడుగుతారు....." (బుఖారి, ముస్లిం)

దైవప్రవక్త (స) తన ప్రియసహచరుడు హజ్రత్ ఉమర్ (రజి)తో మాట్లాడుతూ "ఉమర్! ప్రజలు నిన్ను సమాధిలో పూడ్చిపెట్టి వెళ్ళిపోయాక నీదగ్గరకు పరీక్ష దూతలు వచ్చినప్పుడు నీ పరిస్థితి ఎలా ఉంటుందో!! (మున్కిర్, నకీర్ అనే) ఆ దూతల కంఠస్వరం గుండెలను అదరగొట్టే (మేఘ)గర్జనలా ఉంటుంది. వారి కళ్ళు మన చూపులను పోగొట్టే మేఘమెరుపుల్లా ఉంటాయి. వారు నిన్ను ఊపేస్తారు, అదరగొడ్తారు. (బెదరగొడ్తూ) అధికార స్థాయిలో మాట్లాడుతారు. అప్పుడు నీపరిస్థితి ఎలా ఉంటుందో ఆలోచించు" అని అన్నారు. హజ్రత్ ఉమర్ (రజి) ఈ మాటలు విని "దైవప్రవక్తా! ఆ సమయంలో



మా బుద్ధీ, వివేచనలు సరిగ్గా ఉంటాయా?" అని అడిగారు. దానికి దైవప్రవక్త(స) "ఉంటాయి. ఇప్పుడున్నట్లే అప్పుడు కూడా బుద్ధివివేచనలు సరిగ్గానే ఉంటాయి" అన్నారు. "అయితే నేను వారి సంగతి చూసుకుంటాను" అన్నారు హజ్రత్ ఉమర్ (రజి). (తబ్రాని)

దైవప్రవక్త (స) సమాధి విశేషాలను ప్రస్తావిస్తూ "ఉమర్! జనం నిన్ను మూడుబారలు, ఒక మూరెడు గుంట తవ్వి అందులో నిన్ను పూడ్చే సమయం కోసం సిద్ధంగా ఉండు. అప్పుడు నీదగ్గరికి (పరీక్షదూతలు) మున్కిర్, నకీర్‌లు వస్తారు. వారు నల్లగా (భయంకరంగా) ఉంటారు. తమ పొడవైన శిరోజాలను నేల మీద ఈడుస్తూ వస్తారు. వారి కంఠస్వరం మేఘగర్జనలా ఉంటుంది. వారి నీలిరంగు కళ్ళు ధగధగ మెరుస్తుంటాయి. వారు తమ పొడవైన దంతాలతో నేలను తవ్వుతూ నీ దగ్గరకు వస్తారు. వారు నిన్ను లేపి కూర్చో బెడ్తారు. నీవు భయభ్రాంతుడవుతావు. వారు నిన్ను ఊపేస్తారు. భయపెడ్తారు. చికాకు పరుస్తారు. (అప్పుడు నీ పరిస్థితి ఎలా ఉంటుందో!)" అని అన్నారు.

హజ్రత్ ఉమర్ (రజి) భయాందోళనలు కలిగించే ఈ మాటలు విని "దైవప్రవక్తా! ఆరోజు నా పరిస్థితి ఈరోజు ఉన్నట్లే ఉంటుందా? (అప్పుడు నాకు పూర్తి స్పృహ, బుద్ధి వివేచనలు ఉంటాయా?) దైవప్రవక్త (సల్లం) ఉంటాయన్నారు. "అయితే నాకు దేవుడే చాలు. ఆ భయానక క్షణం నుండి నన్ను దేవుడే కాపాడుతాడు" అన్నారు. (బైహఖీ)

హజ్రత్ ఆయిషా(రజి) దైవప్రవక్త (సల్లం)తో మాట్లాడుతూ "దైవప్రవక్తా! మీరు పరీక్ష దూతలు) మున్కిర్, నకీర్‌ల భయంకరమైన గర్జనలు, సమాధి (మృతుడ్ని) అదిమేయడం గురించి ప్రస్తావించారు. అప్పట్నుంచి నాకు ఏవిషయం వల్ల కూడా మనశ్శాంతి లేకుండాపోయింది" అన్నారు. దైవప్రవక్త (సల్లం) ఈమాట విని ఇలా అన్నారు:

"ఆయిషా! కళ్ళకు సుర్మా పెట్టుకుంటే ఎంత చల్లగా ఉంటుందో మున్కిర్, నకీర్‌ల కంఠస్వరం కూడా విశ్వాసి చెవులకు అంత హాయిగా ఉంటుంది. అలాగే ఎవరికైనా తలనొప్పి వస్తే అతని తల్లి ఎంతోప్రేమతో అతని తల వత్తినప్పుడు అతనికి ఎంతహాయిగా ఉంటుందో విశ్వాసిని సమాధి అదిమినప్పుడు కూడా అంతే హాయిగా ఉంటుంది. ఆయిషా! (గుర్తుంచుకో) దేవుని విషయంలో అనుమానించేవారికి నాశనం తప్పదు. కోడిగుడ్డు మీద రాయి పెట్టి అదిమినట్లు అలాంటివారిని సమాధి అదిమేస్తుంది." (తిర్మజి)

"మీరు సమాధులలో పరీక్షించబడతారు. విశ్వాసిని సమాధిలో ఉంచినప్పుడు అతని కర్మలు (భౌతికరూపంలో వచ్చి) అతని చుట్టూ చేరుతాయి. పరీక్ష (నరక)దూతలు ఎటు నుండి రావడానికి ప్రయత్నించినా ఆ కర్మలు వారిని నిరోధిస్తాయి.

తరువాత ఒక దైవదూత వచ్చి, 'ఆ వ్యక్తి గురించి నీ అభిప్రాయం ఏమిటీ?' అని అడుగుతాడు. విశ్వాసి 'ఎవర్ని గురించి?' అని అడుగుతాడు. 'ముహమ్మద్ (సల్లం)ని గురించి' అనంటాడు దైవదూత. అప్పుడు విశ్వాసి 'ఈయన నిస్సందేహంగా దేవుని ప్రవక్తని నేను సాక్ష్యమిస్తున్నాను' అంటాడు. 'అయితే ఈయన దేవుని ప్రవక్తని నీకెలా తెలుసు?' అని దైవదూత మళ్లీ ప్రశ్నిస్తాడు. విశ్వాసి 'ఈయన దైవప్రవక్తని నేను సాక్ష్య మిస్తున్నాను' అనంటాడు. అప్పుడతనికి స్వర్గశుభవార్త విన్పించడం జరుగుతుంది.

కాని సత్యతిరస్కారిని సమాధిలో ఉంచినప్పుడు అతడ్ని పరీక్ష దూతల నుండి కాపాడే ఏ సత్కర్మా అతని దగ్గర ఉండదు. దైవదూత అడిగిన ప్రశ్నలకు అతను సరైన సమాధానలు ఇవ్వలేడు. అప్పుడు తలపై అగ్నికణముండే ఒక చతుష్పాదం ప్రత్యక్షమై, అతడ్ని కొరడాతో కొట్టడం ప్రారంభిస్తుంది. అతను ఎంత అరిచి గీ పెట్టినా దానిపై ఎలాంటి ప్రభావం ఉండదు." (అహ్మద్)

హజ్రత్ బరా బిన్ అజిబ్ (రజి) కథనం: మేము దైవప్రవక్త (సల్లం) వెంట ఒక అన్సారీ ముస్లిం జనాజాలో పాల్గొనడానికి బయలుదేరి శ్మశానికి చేరుకున్నాము. శవాన్ని ఇంకా సమాధిలో పూడ్చిపెట్టలేదు. దైవప్రవక్త (సల్లం) శ్మశానంలో ఓచోట కూర్చున్నారు. మేము కూడా ఆయన చుట్టూ కూర్చున్నాము. మా తలలపై పక్షులు కూర్చున్నాయా అన్నంత సావధానంగా, నిశ్శబ్దంగా మేము కూర్చున్నాము. దైవప్రవక్త (సల్లం) చేతిలో ఒక కర్ర ఉంది. ఆయన ఆ కర్రతో నేల మీద గీస్తూ కాస్సేపటికి తల పైకెత్తి "మీరు సమాధి శిక్ష నుండి దేవుడ్ని శరణు వేడుకోండి" అన్నారు. ఈమాట ఆయన రెండు మూడు సార్లు అన్నారు. తరువాత ఇలా చెప్పారు:

"సత్యాన్ని విశ్వసించిన దాసుడు ప్రాపంచిక భవబంధాలు తెంచుకొని పరలోకం వైపు దృష్టి సారిస్తాడు. ఆకాశం నుండి కాంతిమంతమైన ముఖవర్చస్సు కలిగిన అనేకమంది దైవదూతలు అతని దగ్గరకు వస్తారు. వారి ముఖాలు సూర్యునిలా దేదీప్యమానంగా వెలిగిపోతుంటాయి. వారా విశ్వాసి కోసం స్వర్గ వస్త్రాలు, స్వర్గ సువాసనలు తీసుకొచ్చి అతని కనుచూపు మేర వరకు కూర్చుంటారు. తరువాత ప్రధాన మరణదూత (హజ్రత్ ఇజ్రాయీల్- అలైహిస్సలాం) వచ్చి అతని తలవైపు కూర్చొని "పవిత్రాత్మా! నీ ప్రభువు మన్నింపు, ప్రసన్నతా భాగ్యాల వైపుకు బయలుదేరు" అంటాడు. అప్పుడు విశ్వాసి ఆత్మ పరమసంతోషంతో మరుక్షణమే దేహంనుండి అత్యంత సులభంగా వెలువడుతుంది. దాన్ని ఆయన చేతిలో పట్టుకుంటారు.

ఇతర దైవదూతలు రెప్పపాటులో ఆ ఆత్మను ఆయన దగ్గర్నుంచి తీసుకుంటారు. వారు దాన్ని ప్రపంచంలోని అత్యంత సువాసన కస్తూరితో కూడిన వస్త్రంలో చుట్టుకొని తీసికెళ్తారు. దారిలో అనేకమంది దైవదూతలు తారసపడతారు. వారంతా "ఈ పవిత్రాత్మ ఎవరిద"ని అడుగుతారు. దానికి వారు "ఇది ఫలానావ్యక్తి కుమారుడు ఫలానామనిషి ఆత్మ" అని ఇహలోకంలో పిలవబడే అతి శ్రేష్ఠమైన పేరును ప్రస్తావిస్తూ చెబుతారు.

ఈవిధంగా ఆ దైవదూతలు ఇహలోకం సమీపంలోని ఆకాశానికి చేరుకుంటారు. వారు ఆకాశ ద్వారాలు తెరవమంటారు. ద్వారపాలకులు ఆకాశద్వారాలు తెరుస్తారు. విశ్వాసి ఆత్మను పట్టుకున్న దైవదూతలు లోపలికి ప్రవేశిస్తారు. వారిని మొదటి ఆకాశం లోని దైవదూతలు అనుసరిస్తూ ఆ విశ్వాసిఆత్మ వెంట రెండవఆకాశానికి చేరుకుంటారు. ఇలా ప్రతి ఆకాశంలోని దైవదూతలు ద్వారాలు తెరచి ఆ శుభాత్మను ఘనంగా స్వాగతించి ఆశీర్వదిస్తూ దాని వెంట ఏడవ ఆకాశానికి చేరుకుంటారు.

ఏడవ ఆకాశంలోకి వెళ్ళి ఆ ఆత్మను సృష్టికర్త సన్నిధిలో ప్రవేశపెడతారు. (అక్కడ ఆ ఆత్మ సృష్టికర్తకు సాష్టాంగప్రణామం చేస్తుంది.) సృష్టికర్త "నాఈ దాసుని పేరు ఇల్లీన్



(సత్కర్మల చిట్టా)లో రాసి అతడ్ని తిరిగి భూలోకానికి తీసికెళ్ళండి. నేనితడ్ని (భూలోకపు) మట్టితో సృష్టించాను. అందులోకే ఇతడ్ని పంపిపెడ్తాను. అందులో నుంచే ఇతడ్ని తిరిగి బ్రతికించి లేపుతాను" అని ఆజ్ఞాపిస్తాడు. అప్పుడు దైవదూతలు ఆ ఆత్మను సమాధిలోని ఆ విశ్వాసి దేహంలో తిరిగి ప్రవేశపెడతారు.

సమాధిలో నల్లని శరీరంతో, నీలి కళ్ళతో ఉండే (మున్కిర్, నకీర్ అనే) ఇద్దరు దైవదూతలు వచ్చి అతడ్ని లేపి కూర్చో బెడ్తారు. అతని సమాధి అతని కనుచూపు మేరకు విశాలం చేయబడుతుంది. ఆ సమయంలో అతనికి సూర్యుడు అస్తమిస్తున్నట్లు గోచరిస్తుంది. అప్పుడతను కళ్ళు నులుపుకుంటూ లేచి కూర్చుంటాడు. దైవదూతలను చూడగానే (తనను వారు ప్రశ్నించడానికి వచ్చారని భావించి) "ముందు నన్ను (అసర్) నమాజ్ చేయనివ్వండి." అంటాడు.

(అతని నమాజ్ ముగిసిన) తరువాత దైవదూతలు "నీ ప్రభువు ఎవరు?" అని అడుగుతారు. దానికా వ్యక్తి " నా ప్రభువు అల్లాహ్" అని సమాధానమిస్తాడు. తిరిగి దైవ దూతలు "నీ ధర్మం ఏమిటీ?" అని అడుగుతారు. "నా ధర్మం ఇస్లాం" అంటాడతను. "సరే, (రుజుమార్గం చూపడానికి) మీలో ప్రభవించిన మనిషి గురించి నీ అభిప్రాయం ఏమిటీ?" అంటూ దైవదూతలు మళ్ళీ ప్రశ్నిస్తారు. దానికి ఆ పుణ్యాత్ముడు "ఆయన దేవుని ప్రవక్త" అని చెబుతాడు. "ఆయన దైవప్రవక్తని నీకెలా తెలిసింది?" అని అడుగు తారు దైవదూతలు. "నేను దైవగ్రంథం (ఖుర్ఆన్) చదివాను, దాన్ని నమ్మి అది దైవగ్రంథమే నని ధృవపరిచాను" అంటాడా విశ్వాసి.

అప్పుడు ఆకాశంనుండి "నాదాసుడు నిజం చెప్పాడు. అతనికి స్వర్గవస్త్రాలు ధరింప జేసి, స్వర్గపరుపు పరచండి; (సమాధిలో) స్వర్గం వైపుండే కిటికీ తెరచిపెట్టండి" అని అశరీరవాణి విన్పిస్తుంది. దైవదూతలు మొదట సమాధిలో నరకం వైపుండే కిటికీ తెరుస్తారు. అటువైపు నరకంలోని అగ్నిజ్వాలలు ఒకదాన్నొకటి మింగేస్తూ ఎంతో భయంకరంగా కన్పిస్తాయి. (విశ్వాసి ఆ భీకరదృశ్యం చూసి భయపడతాడు.) అంతలోనే దైవదూతలు అతనితో "దేవుడు నిన్ను ఎలాంటి ఆపద నుండి రక్షించాడో చూడు" అంటారు.

ఆ తరువాత సమాధిలో నరకం వైపుండే కిటికీ మూసేసి, స్వర్గం వైపుండే కిటికీ తెరుస్తారు. దాంతో ఆ విశ్వాసి సమాధిలోకి స్వర్గ వాయువు, సువాసనలు వస్తాయి. అప్పుడు దైవదూతలు అతనితో "ఇదే నీ (శాశ్వత)నివాసం. నీవు (ప్రపంచంలో ఇస్లాం పట్ల) విశ్వాస స్థితిలో జీవించావు. విశ్వాస స్థితిలోనే నీకు మృత్యువు వచ్చింది. దైవచిత్త మయితే విశ్వాసస్థితిలోనే నీవు ప్రళయదినాన (సమాధి) నుండి లేస్తావు" అనంటారు.

ఆ తర్వాత ఘాటైన సుగంధ పరిమళంతో ఖరీదైన దుస్తులు ధరించిన సౌందర్య వంతుడైన ఒకతను ప్రత్యక్షమయి "నీకు పరమానందం కల్గించే శుభవార్త విను" అంటాడు. విశ్వాసి అతడ్ని చూసి "ఎవరు నీవు, నీ ముఖంలో మంచితనం చిహ్నాలు కన్పిస్తున్నాయి?" అని ప్రశ్నిస్తాడు. దానికా మనిషి "నేను నీ సత్కర్మల రాసిని" అంటాడు. విశ్వాసి (ఈమాట వినగానే సంతోషంతో పొంగిపోతూ) "అయితే ప్రభూ! (ఇప్పుడే) ప్రళయం తీసుకురా, నేను (స్వర్గంలోని) నా వాళ్ళు (సుందరాంగులు), భోగభాగ్యాల దగ్గరికి వెళ్తాను" అంటాడు.

ఇక అవిశ్వాసి విషయానికి వస్తే అతను కూడా ప్రాపంచిక భవబంధాలు తెంచుకొని పరలోకం వైపు దృష్టి సారిస్తాడు. అయితే అతని ప్రాణం తీయడానికి (భయంకరులైన) నల్లని దైవదూతలు ఓ గోనెపట్టా తీసుకొని వస్తారు. వారతని ముందు కనుచూపు మేరదాకా (అత్యధిక సంఖ్యలో కూర్చుంటారు. తర్వాత ప్రధాన మరణదూత మలకుల్‌మౌత్ వచ్చి అతని తల వైపు కూర్చొని "దురాత్మా! దైవాగ్రహం వైపుకు బయలుదేరు" అంటాడు.

కాని ఆ దురాత్మ తీవ్రమైన భయంతో శరీరం నుండి బయటికి రాకుండా లోపలే అటుఇటూ తిరుగుతుంది. అప్పుడు మలకుల్‌మౌత్ ముళ్ళ కంపపై నుంచి తడిసిన గుడ్డ లాగినట్లు అతని దేహం నుంచి ఆత్మను బలవంతంగా లాగి తీస్తాడు. ఆ తరువాత ఇతర దైవదూతలు రెప్పపాటులో అతని చేతి నుండి దాన్ని తీసుకొని గోనెపట్టాలో చుట్టి మొదటి ఆకాశం వైపు తీసికెళ్తారు.

ఆ దురాత్మ నుంచి కుళ్ళిపోయిన శవం నుంచి వెలువడేటటువంటి తీవ్రమైన దుర్గంధం వెలువడుతుంది. దారిలో తారసపడే ఇతర దైవదూతలంతా "ఈ దురాత్మ ఎవరిద"ని అడుగుతారు. దురాత్మను పట్టుకున్న దైవదూతలు "ఇది ఫలానా వ్యక్తి కుమారుడు ఫలానా మనిషి ఆత్మ" అని ఇహలోకంలో పిలువబడే అతి నికృష్టమైన పేరును ప్రస్తావిస్తూ చెబుతారు. ఈ విధంగా వారు ఇహలోక సమీపంలోని ఆకాశానికి చేరుకొని దాని ద్వారం తెరిపించడానికి ప్రయత్నిస్తారు. కాని అక్కడి ద్వారపాలకులు (దురాత్మను అసహ్యించుకుంటూ) ద్వారం తెరవరు.

దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రవచిస్తూ ఇక్కడ "మా సూక్తులు తిరస్కరించి వాటి పట్ల తలబిరుసుతో వ్యవహరించినవారి కోసం ఆకాశ ద్వారాలు ఎన్నటికీ తెరవబడవు. సూది బెజ్జం గుండా ఒంటె దూరడం ఎంత అసాధ్యమో వారు స్వర్గంలో ప్రవేశించడం కూడా అంతే అసాధ్యం" (7:40) అనే ఖుర్‌ఆన్ సూక్తి పఠించారు.

ఆ తరువాత సృష్టికర్త "ఈ దాసుని పేరు యావత్తు భూలోకాల కంటే అథః పాతాళంలో ఉండే 'సిజ్జీన్' (దుష్కర్మల చిట్టా)లో రాసి, అతని ఆత్మను భూలోకం వైపు తీసికెళ్ళండి" అని ఆజ్ఞాపిస్తాడు. మరణదూతలు ఆ దురాత్మను సమాధిలో పూడ్చబడిన దాని దేహంలోకి విసిరిపడ వేస్తారు. దైవప్రవక్త (స) ఈ సంగతి చెబుతూ "దేవునికి సాటి కల్పించినవాడు ఆకాశం నుండి అమాంతం అథఃపాతాళంలోకి పడిపోయినట్లే. ఇక అతడ్ని పక్షులైనా పొడుచుకు తింటాయి, లేదా గాలి అయినా ఎత్తి దూరంగా విసిరి పడవేస్తుంది" (22:31) అనే ఖుర్‌ఆన్ సూక్తి పఠించారు.

ఆ తరువాత ఆ అవిశ్వాసి దగ్గరకు ఇద్దరు దైవదూతలు వచ్చి విశ్వాసిని అడిగినట్లే కొన్ని ప్రశ్నలు అడుగుతారు. దానికతను సమాధానం చెప్పలేక "అయ్యయ్యో, నాకేమీ తెలియదే!" అంటాడు. అప్పుడు ఆకాశం నుండి "అతను అబద్ధమాడాడు. అతనికి అగ్ని వస్త్రాలు కట్టబెట్టి, అగ్నిపడక మీద పండబెట్టండి. అతని కోసం సమాధిలో నరకం వైపుండే కిటికీ తెరచి పెట్టండి" అని అశరీరవాణి విన్పిస్తుంది. దాని ప్రకారం ఆ సత్య తిరస్కారికి ప్రళయందాకా దుర్భరబాధలు కలిగేలా ఏర్పాటవుతుంది.



అయితే దైవదూతలు మొదట అతని సమాధిలో స్వర్గం వైపుండే కిటికీ తెరుస్తారు. అటువైపు స్వర్గంలోని సౌందర్యం, భోగభాగ్యాల దృశ్యం అతనికి కనులపండుగగా కన్పిస్తుంది. అప్పుడు దైవదూతలు అతనితో "(సత్యాన్ని తిరస్కరించడం వల్ల) దేవుడు నిన్ను ఎలాంటి మహాభాగ్యానికి దూరం చేశాడో చూడు" అనంటారు. ఆ తర్వాత వారు ఆ కిటికీని మూసేసి నరకం వైపుండే కిటికీ తెరచిపెడతారు. అటువైపు నరకంలోని అగ్నిజ్వాలలు ఒకదాన్నొకటి మింగేస్తూ భయంకరంగా కనిపిస్తాయి.

అప్పుడు దైవదూతలు "ఇక నీ (శాశ్వత)నివాసం ఇదే. నువ్వు (ప్రపంచంలో జీవితాంతం ఇస్లాం పట్ల) అపనమ్మకంతో జీవించావు. అపనమ్మకంలో ఉన్న స్థితిలోనే నీకు మృత్యువు కాటేసింది. దైవచిత్తమైతే నువ్వు అపనమ్మకంతోనే (ప్రళయదినాన) సమాధి నుండి లేస్తావు" అని అంటారు. తర్వాత అతని పక్కటెముకలు విరిగి ఒక వైపు నుంచి మరొక వైపుకు పొడుచుకు వచ్చేటంతగా సమాధి కుంచించుకుపోతుంది.

ఆ తరువాత అత్యంత దుర్వాసనతో కూడిన మురికి బట్టలు ధరించిన ఓ కురూపి అతని దగ్గరకు వస్తాడు. అవిశ్వాసి అతడ్ని చూసి "ఎవరు నీవు, నీ ముఖంలో కీడు చిహ్నాలు కన్పిస్తున్నాయి" అంటాడు. దానికి కురూపి "నేను నీ దుష్కర్మల రాసిని" అని చెబుతాడు. దాంతో అతను (తీవ్రంగా భయపడ్తూ) "అయితే ప్రభూ! ప్రళయం తీసుకు రాకు" అంటాడు. (అహ్మద్, అబూదావూద్, మిష్కాత్ హదీసుల ఆధారంగా)

సమాధిలో పరీక్షదూతలు ప్రశ్నించిన తర్వాత దాసుని ఆత్మను అతని దేహం నుండి వేరేచోటికి తరలిస్తారు. సజ్జనుల ఆత్మలను సప్తమాకాశంలోని "ఇల్లీన్" అనే చోటికి, దుర్జనుల ఆత్మలను ఏడవ పాతాళలోకంలోని "సిజ్జీన్" అనే చోటికి తరలిస్తారు. (షరెసున్న)

దైవప్రవక్త (స) హితోక్తి: "విశ్వాసి ఆత్మ (స్వర్గంలో) పక్షి రూపంలో ఉండి స్వర్గ ఫలాలు తింటూవుంటుంది. చివరికి ఆ ఆత్మను తీసికెళ్ళి (పునరుత్థాన దినాన) ఆ విశ్వాసి శరీరంలో ప్రవేశపెట్టడం జరుగుతుంది." (నసాయి, బైహఖీ)

## సమాధిలో ఖుర్‌ఆన్ పాత్ర

ఖుర్‌ఆన్ కేవలం పారాయణం చేయడానికి మాత్రమే అవతరించలేదు. ఖుర్‌ఆన్‌ని దైవప్రోక్త గ్రంథమని విశ్వసించిన ప్రతి ముస్లిం దాన్ని ఎల్లప్పుడూ అర్థం చేసుకుంటూ చదువుతూ, దానిప్రకారం ఆచరిస్తుండాలి. అప్పుడే అది మనకు ఇహలోకంలోనూ, పరలోకంలోనూ ప్రయోజనకారి అవుతుంది. సమాధిలో కూడా అది మనకు ప్రయోజనం చేకూర్చుతుంది.

దైవప్రవక్త (స) ప్రవచనం: రాత్రివేళ మీరు నమాజ్ చేయడానికి నిలబడినప్పుడు ఖుర్‌ఆన్ (బిగ్గరగా పఠించండి. ఆ శబ్దం విని షైతానులు, దుర్మార్గపు భూతాలు పారిపోతాయి. గాలిలో (తేలి యాడుతూ) వచ్చేపోయే దైవదూతలు కూడా ఆ శబ్దం వింటారు. ఇంట్లో ఉన్నవారు కూడా విని మీతోపాటు నమాజ్ చేస్తారు. ఈరాత్రి వచ్చేరాత్రికి హితోపదేశం చేస్తూ "ఇతని చివరిరాత్రీ! నీవితనికి సౌలభ్యం కలిగించు" అంటుంది.

విశ్వాసి చనిపోయినప్పుడు ఖుర్‌ఆన్ వచ్చి అతని తలవైపు నిలబడి (శవ) స్నానాన్ని పర్యవేక్షిస్తుంది. అతనికి వస్త్రసంస్కారం జరిగిన తరువాత అతని వస్త్రాలకు, వక్షస్థలానికి

మధ్య దూరుతుంది. ఆ దాసుడ్ని ఖననం చేసిన తరువాత సమాధిలో పరీక్షదూతలు (మున్కిర్, నకీర్) వచ్చినప్పుడు ఖుర్‌ఆన్ మృతుడికి, పరీక్ష దూతలకు మధ్య వచ్చి నిలబడుతుంది. పరీక్షదూతలు ఖుర్‌ఆన్‌తో “నీవు మా మధ్య నుండి తొలుగు. మేము ఇతడ్ని ప్రశ్నించాలి” అంటారు. దానికి ఖుర్‌ఆన్ “దైవసాక్షి! నేనితడ్ని స్వర్గంలో ప్రవేశింపజేయించే వరకూ వదలిపెట్టి పోలేను. మీరితని పట్ల ఏదైనా వ్యవహారం జరపాలని దైవాజ్ఞ లభిస్తే మీపని మీరు చేసుకోండి” అని అంటుంది.

ఆ తరువాత పరీక్షదూతలు ఆ దాసునికి కొన్ని ప్రశ్నలు అడుగుతారు. ఖుర్‌ఆన్ అతని వైపు చూస్తూ “నేనెవరో నీకు తెలుసా?” అని అడుగుతుంది. దానికతను తెలియదు అంటాడు. అప్పుడు ఖుర్‌ఆన్ తనను తాను పరిచయం చేసుకుంటూ “నేను ప్రపంచంలో నిన్ను రాత్రివేళల్లో మేల్కొని ఉండేలా, పగటి వేళల్లో ఆకలి దప్పులతో ఉండేలా చేసిన ఖుర్‌ఆన్‌ని. కళ్ళు, చెవులకు సంబంధించిన చెడులకు నిన్ను దూరంగా ఉంచిన ఖురాన్‌ని. ఇప్పుడు నేను నీ శ్రేయస్సు కోరే స్నేహితుడ్ని, ఉత్తమ సోదరుడ్ని. కనుక సంతోషించు. పరీక్షదూతల విచారణ తరువాత ఇక నీకెలాంటి దుఃఖం ఉండదు” అని చెబుతుంది. పరీక్షదూతలు విచారణ తరువాత వెళ్ళిపోతారు.

అప్పుడు ఖుర్‌ఆన్ కూడా తన ప్రభువు దగ్గరకు వెళ్ళిపోతుంది. వెళ్ళి సమాధిలోని ఆ దాసుని కోసం పడక ఇప్పించమని అభ్యర్థిస్తుంది. దానికి పడక, జ్యోతిర్మయ దీపం ఇవ్వమని దేవుడు ఆజ్ఞాపిస్తాడు. వాటిని డెబ్భయివేల మంది దైవసన్నిహిత దూతలు తీసుకొని వెళ్తారు. ఖుర్‌ఆన్ వారికి ముందుగానే ఆ దాసుని దగ్గరకు చేరుకొని “దైవదాసుడా! నేను వెళ్ళిపోయిన తరువాత నీకేమీ భయాందోళనలు కలగలేదు కదా? నేను నీ కోసం పడక ఏర్పాటు చేయించడానికి దేవుని దగ్గరకు వెళ్ళాను. అందుకే కాస్సేపు నీ నుండి నేను వేరుకావలసి వచ్చింది. నేనా వస్తువులు తీసుకొచ్చాను” అని అంటుంది.

అంతలో దైవదూతలు ఆ వస్తువులు తీసుకొచ్చి అతనికి పడక ఏర్పాటుచేస్తారు. తరువాత వారతడ్ని కుడి పక్కకు తిప్పి పడుకోబెట్టి ఆకాశంలోకి అధిరోహించడం ప్రారంభిస్తారు. దాసుడు వారిని చూస్తుంటాడు. ఖుర్‌ఆన్ ఖిబ్లా వైపున్న నేల మీద ఓ దెబ్బ వేస్తుంది. దాంతో సమాధి కనుచూపు మేరకు విశాలమవుతుంది. (ఇబ్నె అబిద్దున్యా)

హజ్రత్ అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి) కథనం: దైవప్రవక్త (స) అనుచరుడొకాయన ఓసమాధి దగ్గర గుడారం వేసుకొని కూర్చున్నారు. ఆయనకు అక్కడ సమాధి ఉన్న సంగతి తెలియదు. కాస్సేపటికి హఠాత్తుగా ఆ సమాధిలో ఒక మనిషి ఖుర్‌ఆన్‌లోని ముల్క్ సూరా పఠించడం ప్రారంభించాడు. అలా అతను సూరా మొత్తం పఠించాడు. ఆతర్వాత ఆ అనుచరుడు ఈ సంఘటన గురించి దైవప్రవక్త (స) ముందు ప్రస్తావించారు. దైవప్రవక్త (స) ఈమాట విని “ఇది (సమాధి)యాతనను నిరోధించే సూరా అతడ్ని ఆ యాతన నుండి కాపాడుతోంది” అని చెప్పారు. (మిష్కాత్)

హజ్రత్ ఖాలిద్ బిన్ మాదాన్ (తాబయి-రహ్మాలై) కథనం: తబారకల్లజి బియదిహిల్ ముల్క్ (67వ అధ్యాయం), అలిఫ్ లామ్ మీమ్ సజ్దా (32వ అధ్యాయం)- ఈ రెండు సూరాలు తమను పఠించినవారి కోసం సమాధిలో దేవునితో వాదిస్తాయి. వాటిలో ప్రతి



సూరా “నేను నీ (ఖుర్‌ఆన్) గ్రంథంలో ఉంటే నీవితనికి అనుకూలంగా నా సిఫారసును ఆమోదించు. ఒకవేళ నేను నీ గ్రంథంలో లేకపోతే అందులో నుంచి నన్ను తుడిచెయ్యి” అని అంటుంది. ఈ రెండు సూరాలు పక్షులు మాదిరిగా తమను పఠించేవానిపై రెక్కలు జాపి, అతడ్ని సమాధి యాతన నుండి కాపాడుతాయి. (మిష్కాత్)

# 94. పితృలోకంలో పాపపుణ్యాల పర్యవసానం

ఒకసారి హజ్రత్ ఆయిషా (రజి) దగ్గరికి ఒక యూదస్త్రీ వచ్చి సమాధిశిక్ష గురించి ప్రస్తావిస్తూ “దేవుడు నిన్ను సమాధిశిక్షకు దూరంగా ఉంచుగాక!” అన్నది. ఆ తరువాత హజ్రత్ ఆయిషా (రజి) దైవప్రవక్త (సల్లం) ముందు ఆ విషయాన్ని ప్రస్తావించి, ఇది నిజమేనా? అని అడిగారు. దానికి దైవప్రవక్త (సల్లం) సమాధానమిస్తూ “నిజమే. సమాధిశిక్ష యదార్థం” అన్నారు. ఆనాటి నుంచి దైవప్రవక్త (సల్లం) నమాజు చేసినప్పుడల్లా సమాధిశిక్ష నుండి దేవుడ్ని శరణు వేడుకునేవారని ఆమె అన్నారు. (బుఖారి, ముస్లిం)

దైవప్రవక్త (స) ప్రవచనం: ఒక వ్యక్తికి మరణ సమయం ఆసన్నమయింది. అతనికి ఇక జీవించే ఆశ కన్పించలేదు. అప్పుడతను తన కుటుంబసభ్యుల్ని పిలిచి ఇలా చెప్పాడు: “నేను చనిపోయాక కట్టెలుపేర్చి దానికి నిప్పుపెట్టండి. ఆ నిప్పులో నా శవాన్ని వేసి కాల్చివేయండి. నిప్పులో నా శరీరం, మాంసం, ఎముకలు బాగా కాలిపోయి బూడిదగా మారిపోయాక ఆ బూడిదను తుఫాను వచ్చేరోజు గాలిలో ఎగరవేయండి.” ఇలా చెప్పి అతను చనిపోయాడు. అప్పుడతని కుటుంబసభ్యులు అతను చెప్పినట్లే చేశారు. అయితే దేవుడు ఆ వ్యక్తికి చెందిన అణువణును కలిపేసి (ప్రాణం పోసి) “దాసుడా! నువ్విలా ఎందుకు చేశావు?” అని అడిగాడు. దానికి ఆ మనిషి “ప్రభూ! నీకు భయపడి ఇలా చేశాను” అన్నాడు. దేవుడు ఈ సమాధానం విని అతడ్ని క్షమించాడు. (బుఖారి)

**ప్రవేశ పరీక్ష :** హజ్రత్ ఉస్మాన్ (రజి) ఏదైనా సమాధిదగ్గర నిలబడినప్పుడు గడ్డం తడిసిపోయేంత విపరీతంగా దుఃఖించేవారు. ఒకతను ఈపరిస్థితి చూసి “మీరు స్వర్గ నరకాల ప్రస్తావన వచ్చినప్పుడు దుఃఖించరు. కాని సమాధిని చూడగానే (ఎంతో బాధపడుతూ) దుఃఖిస్తారేమిటీ?” అని ప్రశ్నించాడు. దానికి హజ్రత్ ఉస్మాన్ (రజి) ఇలా జవాబిచ్చారు: “దైవప్రవక్త (స) ఈవిధంగా తెలిపారు: ‘పరలోక గమ్యాలలో సమాధి మొదటి గమ్యం. ఈ గమ్యాన్ని గనక విజయవంతంగా దాటగలిగితే, ఆ తరువాతి గమ్యాలు అంతకంటే సులభంగా ఉంటాయి. ఒకవేళ ఈ గమ్యంలో విజయవంతం కాలేకపోతే ఆ తరువాతి గమ్యాలు అంతకంటే కఠినంగా ఉంటాయి.” (తిర్మజి)

దైవప్రవక్త (స) ప్రవచనం: “మీలో ఎవరైనా చనిపోయినప్పుడు (సమాధిలో) అతనికి ఉదయం, సాయంత్రం అతని నివాసస్థలం స్వర్గం లేక నరకం చూపబడుతుంది. చనిపోయినవాడు స్వర్గనివాసి అయివుంటే అతనికి ఉదయం, సాయంత్రం స్వర్గం చూపబడుతుంది. ఒకవేళ అతను నరకనివాసి అయివుంటే అతనికి ఉదయం, సాయంత్రం నరకం చూపబడు తుంది. మృతుడికి అతని నివాసస్థలం చూపుతూ ‘ఇదే నీ (శాశ్వత) నివాసస్థలం’ అని చెప్పబడుతుంది. ప్రళయదినాన దేవుడు అతడ్ని (సమాధి నుండి) లేపే వరకు ఉదయం, సాయంత్రం ఇలాగే జరుగుతుంది.” (బుఖారి, ముస్లిం)

దైవప్రవక్త (స) చెప్పిన ఒక హదీసు ప్రకారం సమాధిలో అవిశ్వాసిని శిక్షించడానికి తొంభైతొమ్మిది సర్పాలు ఉంటాయి. ఆ పాములు అతడ్ని ప్రళయదినందాకా కాటేస్తూ ఉంటాయి. వాటిలో ఒక్కటి కూడా మన భూమండలం వైపు బుసకొడ్తే భూమి మీద (సమస్తం కాలిపోయి ఇక ప్రళయందాకా) ఒక్క మొక్క కూడా మొలవదు. (దార్మి)

అవిశ్వాసి సమాధిలోకి నరకాగ్ని నుండి వెలువడే తీవ్రమైన వడగాల్పులు రావడంతో పాటు, అతడ్ని శిక్షించడానికి భయంకరమైన దైవదూత నియమించబడతాడు. ఆ దైవదూత అంధుడు, చెవిటివాడయి ఉంటాడు. అతని దగ్గర ఒక ఇనుప గద ఉంటుంది. ఆ గదతో అవిశ్వాసిని కొట్టినప్పుడు ఆ దెబ్బ ప్రభావం ఎంత తీవ్రంగా ఉంటుందంటే, దాంతో ఏదయినా పర్వతం మీద ఓ దెబ్బ వేస్తే ఆ దెబ్బకు పర్వతం తుత్తునియలయి పోతుంది. (అవిశ్వాసి ఆ గదదెబ్బకు ఒకే ఒక గావుకేక పెట్టి ఊపిరి విడుస్తాడు.) తర్వాత ఆ అవిశ్వాసికి మళ్ళీ ప్రాణం పోయడం జరుగుతుంది. (అహ్మద్, అబూదావూద్)

బుఖారి, ముస్లిం గ్రంథాలలోని ఒక ఉల్లేఖనం ప్రకారం గదతో కొట్టినప్పుడు ఆ సత్యతిరస్కారి పెట్టే గావుకేకను మానవులు, జిన్నులు (భూతాలు) తప్ప సమీపంలోని యావత్తు జీవరాసులు వింటాయి. ఒకవేళ మానవులు, జిన్నులు గనక సమాధి శిక్షను కళ్ళారా చూస్తే లేదా ఆ గావుకేకను వింటే వారు గుండెలు పగిలి చనిపోవచ్చు. అందుకే సమాధిశిక్షను దేవుడు రహస్యంగా ఉంచాడు.

హజ్రత్ అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి) కథనం: ఒకసారి దైవప్రవక్త (స) రెండు సమాధుల పక్కగా వెళ్తూ ఇలా అన్నారు: "ఈ సమాధుల్లోని మృతులు యాతనలు అనుభవిస్తున్నారు. ఈ యాతనలు ఏ పెద్ద విషయాలను గురించి అనుభవించడం లేదు. వారిలో ఒకడు మూత్రశుద్ధితో ఉండేవాడు కాదు. రెండోవాడు చాడీలు చెబుతుండేవాడు. కేవలం ఈ (చిన్న) కారణాల వల్లనే వారు సమాధియాతనలు అనుభవిస్తున్నారు."

ఇలా తెలిపిన తరువాత ఆయన ఓ పచ్చటి రెమ్మ తీసుకొని దాన్ని రెండుగా చీల్చి ఆ రెండు సమాధుల మీద పాతారు. అనుచరులు అలా ఎందుకు పాతారని అడిగారు. దానికి ఆయన "ఈ రెమ్మలు పచ్చగా ఉన్నంత వరకు మృతులకు యాతనలు తగ్గి ఉంటాయని ఆశిస్తున్నాను" అని చెప్పారు. (బుఖారి, ముస్లిం)

హజ్రత్ జైద్ బిన్ సాబిత్ (రజి) కథనం: ఓసారి దైవప్రవక్త (సల్లం) తన కంచర గాడిద ఎక్కి బనూనజ్జార్ తెగకు చెందిన ఒక తోటలోకి వెళ్ళారు. మేము కూడా ఆయన వెంట ఉన్నాం. అంతలో హఠాత్తుగా కంచర గాడిద బెదిరి పడబోయింది. ఇంకాస్తయితే దైవప్రవక్త (సల్లం) క్రింద పడిపోయేవారు. ఆ తోటలో అయిదారు సమాధులు ఉన్నాయి. వాటిని గురించి దైవప్రవక్త (సల్లం)"ఇవి ఎవరి సమాధులో మీలో ఎవరికైనా తెలుసా?" అని అడిగారు. దానికి ఒకతను "నాకు తెలుసు" అన్నాడు. దైవప్రవక్త (సల్లం) అతడ్ని "వీరు ఎప్పుడు చనిపోయారు?" అని ప్రశ్నించారు. "బహుదైవారాధన ప్రబలివున్న రోజుల్లో చనిపోయారు" అని చెప్పాడా వ్యక్తి. అప్పుడు దైవప్రవక్త (సల్లం) విషయం వివరిస్తూ "మనిషి సమాధిలో శిక్షించబడతాడు. నేనీ సమాధిలోని యాతన శబ్దాన్ని వింటున్నాను. మీరు పరస్పరం (మృతదేహాలను) ఖననం చేయడం వదిలేస్తారన్న భయం లేకపోతే



ఇప్పుడీ సమాధిలో (మనిషి అనుభవిస్తున్న) యాతనకు సంబంధించిన హృదయవిదారక రొదను నేను మీకు విన్పించేవాడ్ని" అని చెప్పారు. (ముస్లిం)

దైవప్రవక్త ఇలా తెలియజేశారు: "నాప్రాణం ఎవరి అధీనంలో ఉందో ఆ శక్తిస్వరూపుని సాక్షి! సమాధిలో శవాన్ని పూడ్చిపెట్టి జనం వెళ్ళిపోతున్నప్పుడు ఆ శవం తాలూకు మనిషి వారి చెప్పులశబ్దాన్ని (సైతం) వింటాడు. అతను గనక విశ్వాసి అయివుంటే అతని నమాజు (ప్రార్థన) అతని తల వైపుకు వచ్చి చేరుతుంది. అతని ఉపవాసాలు అతని కుడి వైపుకు వచ్చి చేరుతాయి. అతని జకాత్ (పేదల ఆర్థిక హక్కు) ఎడమ వైపుకు వచ్చి చేరుతుంది. అతని ఐచ్ఛిక నమాజులు, ఐచ్ఛిక దానధర్మాలు, అతను ప్రజలకు చేసిన మేళ్ళకు సంబంధించిన పుణ్యకార్యాలు అతని కాళ్ళ దగ్గరకు వచ్చి చేరుతాయి.

అతని తలాపుకు ఏదైనా యాతన (అజాబ్) వస్తే అతని నమాజ్ 'నా వైపుకు రావడానికి నీకెలాంటి చోటులేదు' అంటుంది. దాంతో యాతన అతని కుడి వైపుకు వస్తుంది. అప్పుడు అతని ఉపవాసాలు 'మా వైపున నీకెలాంటి చోటులేదు' అంటాయి. యాతన మళ్ళీ అతని ఎడమవైపుకు వస్తుంది. అప్పుడు అతని జకాత్ 'నా వైపున నీకెలాంటి చోటులేదు' అంటుంది. యాతన తిరిగి అతని కాళ్ళ వైపుకు వస్తుంది. అప్పుడు అతని ఐచ్ఛిక నమాజులు, దానధర్మాలు, ఇతర పుణ్యకార్యాలు యాతనకు అడ్డుతగులుతూ 'మా వైపున కూడా నీకెలాంటి చోటు లేదు' అంటాయి." (అత్తర్గీబ్)

హజ్రత్ మిఖ్దామ్ బిన్ మాద్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (స) ఇలా అన్నారు: "హతసాక్షి (షహీద్) కోసం దేవుని దగ్గర ఆరు బహుమానాలు ఉన్నాయి.

1-మొదటి రక్తబిందువు క్రిందపడగానే అతను మన్నించబడతాడు. స్వర్గంలో అతని నివాసం అతనికి చూపబడుతుంది. 2-సమాధియాతన నుండి రక్షణ లభిస్తుంది. 3-(ప్రళయ దినాన శంఖారావం గావించినప్పుడు కలిగే) తీవ్ర భయాందోళనల నుండి అతను సురక్షితంగా ఉంటాడు. 4-అతని తల మీద గౌరవప్రదమైన కిరీటం పెట్టబడుతుంది. ఆ కిరీటంలోని ఒక రత్నం ప్రపంచం, ప్రపంచంలోని యావత్తు వస్తువుల కంటే ఎంతో శ్రేష్ఠమైనదై ఉంటుంది. 5-అతనికి సౌఖ్యం కోసం డెబ్భయిరెండు మంది సుందరాంగుల్ని ఇవ్వడం జరుగుతుంది. 6-డెబ్భయిమంది బంధువులకు అనుకూలం గా సిఫారసుచేసే అధికారం కూడా అతనికివ్వబడుతుంది." (తిర్మజి, ఇబ్నెమాజ)

## ప్రవక్త స్వప్నంలో బర్జఖ్ యాతనలు

దైవప్రవక్త (స)కు దేవుడు ఓసారి కలలో పితృలోకంలో పాపులు అనుభవించే యాతనలను చూపించాడు. దీన్ని గురించి బుఖారీ గ్రంథంలో ఓ సుదీర్ఘమైన హదీసు ఉంది. దైవప్రవక్తలకు కలలద్వారా చేసే సూచనలు కూడా వహీ స్థాయికి సమానంగా ఉంటాయి. అందువల్ల దైవప్రవక్త (స)కు ఈ కలలో చూపిన "పితృలోక విశేషాలు" వాస్తవంగా సంభవిస్తున్నాయని ముస్లింల విశ్వాసం. ఆయన తన కలలో చూసిన విశేషాలు వివరిస్తూ ఈవిధంగా తెలియజేశారు:

నేను రాత్రి ఓ కల గన్నాను. ఆ కలలో ఇద్దరు వ్యక్తులు నా దగ్గరకు వచ్చారు. వారు నా చేయి పట్టుకొని ఒక పవిత్ర స్థలానికి తీసికెళ్ళారు. అక్కడ ఒక వ్యక్తి కూర్చొని ఉన్నాడు. మరొకతను అతని దగ్గర నిలబడ్డాడు. అతని చేతిలో కొడవలి లాంటి ఒక

ఇనుప ఆయుధం ఉంది. అతనా ఆయుధంతో కూర్చున్న వ్యక్తి చెంపను చీల్చుతున్నాడు. ఆవిధంగా అతని ముచ్చలిగుంట దాకా చీల్చివేశాడు. తరువాత రెండవ చెంపను కూడా ఇలాగే చీల్చివేశాడు. నేను "ఏమిటీ వ్యవహారం?" అని అడిగాను దానికి వారిద్దరు "ముందుగు నడవండి" అన్నారు.

మేము ముగ్గురం అక్కడ్నుంచి ముందుకు సాగాము. అలా వెళ్తుంటే మరో దృశ్యం కన్పించింది. ఒక మనిషి పడుకొని ఉన్నాడు. అతని తల వైపున ఒక వ్యక్తి ఓ పెద్ద బండరాయి తీసుకొని నిల్చున్నాడు. అతనా రాయి ఎత్తి పడుకున్న మనిషి తల మీద బలంగా విసిరి కొట్టాడు. దాంతో అతని తల పగిలిపోయి, రాయి దూరంగా పడిపోయింది. ఆ వ్యక్తి దూరంగా పడిపోయిన రాతిని తీసుకోవడానికి వెళ్ళాడు. అతనా రాయి తీసుకొని తిరిగొచ్చాడో లేదో ఆ మనిషి తల కలిసిపోయి యధాతథంగా మారిపోయింది. ఆ వ్యక్తి మళ్ళీ అదేవిధంగా అతని తల పగలగొట్టసాగాడు. నేను "ఏమిటీ పరిస్థితి?" అని అడిగాను. వారిద్దరు "ముందుకు పదండి." అన్నారు.

మేము ముందుకు నడిచాము. అలా మేము ఒక బిలం దగ్గరకు చేరుకున్నాం. ఆ బిలం నేలలో పాతిన మట్టిపొయ్యిలా ఉంది. దాని పైభాగం సన్నగా, క్రిందిభాగం వెడల్పుగా ఉంది. అందులో అగ్ని మండుతోంది. ఆ అగ్ని జ్వాలలో దిశమొలలతో ఉన్న కొందరు స్త్రీలు, పురుషులు కాలిపోతున్నారు. ఆ అగ్నిజ్వాలలు పెకి ఎగిసినప్పుడల్లా వాటితోపాటు వారు కూడా పైకి లేస్తున్నారు. మరికాస్తయితే వారా పొయ్యి నుండి బయట పడిపోయే వారు. కాని అంతలోనే అగ్ని జ్వాలలు క్రిందికి పోవడం, వాటితోపాటు వారు కూడా పొయ్యిలో క్రిందికి జారిపోవడం జరుగుతోంది. నేను "ఏమిటీ వ్యవహారం?" అనడిగాను. దానికి వారు "ముందుకు నడవండి (తరువాత చెబుతాం)" అన్నారు.

మేము ముగ్గురం ముందుకు నడిచాము. అలా నడిచి ఒక రక్తపుటేరు దగ్గరకు చేరుకున్నాము. ఆ ఏరు మధ్య ఒక మనిషి నిల్చున్నాడు. ఏటి ఒడ్డు మీద మరొకతను నిలబడ్డాడు. అతని ముందు ఓ రాళ్ళ గుట్ట ఉంది. ఏటి మధ్య నిల్చున్న మనిషి ఏటి నుంచి బయట పడేందుకు ఒడ్డు వైపుకు రావడానికి ప్రయత్నిస్తుంటే ఒడ్డు మీద నిల్చున్న వ్యక్తి ఓ రాయి తీసుకొని బలంగా అతని ముఖం మీదికి విసరికొట్టాడు. దాంతో ఆ మనిషి ఏటి మధ్యకు పోయిపడ్డాడు. మళ్ళీ అతను లేచి ఏటి ఒడ్డు వైపుకు రావడానికి ప్రయత్నించడం, ఒడ్డు మీద నిలబడ్డ వ్యక్తి రాయి తీసుకొని అతని ముఖం మీద విసిరి కొట్టడం జరిగింది. ఇలా మాటిమాటికి జరుగుతోంది. నేను "విషయం ఏమిట"ని అడిగా. దానికి నన్ను పిలుచుకొచ్చిన వారు "ముందుకు పదండి" అన్నారు.

మేము ముందుకు సాగాము. కాస్సేపటికి ఒక పచ్చటి తోటలోకి ప్రవేశించాము. అక్కడ ఓ పెద్ద చెట్టుంది. దాని క్రింద ఒక వృద్ధుడు, కొందరు పిల్లలు కూర్చున్నారు. ఆ చెట్టు సమీపంలో మరొక వ్యక్తి కూర్చున్నాడు. అతని ముందు అగ్ని మండుతోంది. దాన్ని అతను మండిస్తున్నాడు. వారిద్దరు నన్ను ఆ చెట్టు ఎక్కించి పైకి తీసికెళ్ళారు. అక్కడ చెట్టు మధ్య ఓ అందమైన ఇల్లుంది. అంతటి అందమైన ఇల్లు నేను ఇదివరకు ఎప్పుడూ చూడలేదు. ఆ ఇంట్లో వృద్ధులు, యువకులు, స్త్రీలు, పిల్లలు ఉన్నారు.



వారిద్దరు నన్ను అక్కడ్నుంచి మరికాస్త పైకి తీసికెళ్ళారు. అక్కడ అంతకంటే అందమైన ఇల్లుంది. లోపలికెళ్ళి చూస్తే అందులో వృద్ధులు, యువకులు ఉన్నారు.

నేనిక (ఉండబట్టలేక) "మీరు నన్ను ఈరోజు రాత్రంతా బాగా తిప్పారు. ఇప్పుడైనా చెప్పండి ఈ వ్యవహారాలేమిటో" అని అడిగాను. అప్పుడు వారిలా చెప్పారు:

"మీరు మొదట చెంపలు చీల్చబడుతున్న మనిషిని చూశారు. ఆ మనిషి పరమ అబద్ధీకుడు. అతను అబద్ధాలుచెబుతూ లోకంలో వాటిని ప్రచారం చేసేవాడు. ఆ అబద్ధాలు ఖ్యాతిచెందుతాయి. అందువల్ల అతనికీ శిక్ష పడింది. ఈ శిక్ష ఇలా ప్రళయం దాకా సాగుతుంది. మీరు ఒక మనిషి తల పగలగొడ్తుండటం చూశారు. ఆ మనిషికి దేవుడు ఖుర్ఆన్ జ్ఞానం ప్రసాదించాడు. కాని అతను దాన్ని రాత్రి పఠించేవాడు కాదు. పగలు అందులోని విషయాలను ఆచరించే వాడు కాదు. అంచేత అతనికీ శిక్ష పడింది. ఈ శిక్ష ఇలా ప్రళయందాకా కొనసాగుతుంది. మీరు అగ్నిబిలంలో కాలిపోతున్నవారిని చూశారు కదా, వారు వ్యభిచారులు. మీరు రక్తపుటేరులో చూసినవారు వడ్డీ తినేవారు.

మీరు చెట్టు క్రింద చూసిన వృద్ధుడు హజ్రత్ ఇబ్రాహీం (అలైహి). ఆయన చుట్టూ కూర్చున్న పిల్లలు ప్రజల పిల్లలు. ఆ చెట్టు సమీపంలో అగ్ని మండిస్తున్న వ్యక్తి నరక పాలకుడు 'మాలిక్'. మీరు మొదట ప్రవేశించిన ఇల్లు సామాన్య ముస్లింలకు చెందినది. రెండవ ఇల్లు హతసాక్షుల (షహీదుల)కు చెందినది. పోతే నేను జిబ్రీల్ (దైవదూత)ను. ఇతను మికాయీల్ (దైవదూత). సరే, కాస్త తల పైకెత్తి చూడండి."

నేను తల పైకెత్తి చూశాను. పైన ఒక తెల్ల మబ్బుతునక కన్పించింది. వారు నాతో "ఇది నీ ఇల్లు" అన్నారు. "అయితే నన్ను వదలిపెట్టండి. నేను నా ఇంట్లోకి వెళ్ళిపోతాను" అన్నాను నేను. దానికి వారు "మీ ఆయుష్షు ఇంకా తీరలేదు. తీరివుంటే మీరు ఇప్పుడే ఆ ఇంట్లోకి ప్రవేశిస్తారు" అని చెప్పారు. (మిష్కాత్)

## మేరాజ్ సందర్భంలో బర్జఖ్ విశేషాలు

దైవప్రవక్త (సల్లం) దైవదూతతో కలసి గగన పర్యటన (మేరాజ్) జరిపినప్పుడు కూడా పితృలోకానికి సంబంధించిన కొన్ని విశేషాలు చూశారు. అవి ఇలా ఉన్నాయి:

హజ్రత్ జిబ్రీల్ (అలై) దైవప్రవక్త (స)ను తీసుకొని అక్కడ్నుంచి ముందుకుసాగారు. కొంతదూరం పోయాక ఓ విచిత్రదృశ్యం కన్పించింది. ఒక మనిషి కూర్చొని తన కుడివైపు చూసుకొని సంతోషంతో గలగల నవ్వుతున్నాడు. అంతలోనే ఎడమవైపు చూసుకొని అమిత దుఃఖంతో రోదిస్తున్నాడు. అతడ్ని చూసి దైవప్రవక్త (స) ఆశ్చర్యపోయారు.

"ఎవరీ వ్యక్తి? ఈ విచిత్ర పరిస్థితికి కారణం ఏమిటీ?" అడిగారు ఆయన.

"ఈయన మీ పితామహుడు. ఆదం (అలైహి). తన సంతానమైన మానవులకు ఎదురయ్యే పరిణామాల గురించిన తలంపే ఈయనగారి ఈ పరిస్థితికి కారణం. కుడి వైపున పుణ్యాత్ముల సత్కర్మలు ఉండటంచేత ఈయన సంతోషిస్తున్నారు. ఎడమ వైపున పాపాత్ముల దుష్కర్మలు చూసి దుఃఖిస్తున్నారు" వివరించారు హజ్రత్ జిబ్రీల్ (అలైహి).

హజ్రత్ ఆదం (అలైహి) అంతిమ దైవప్రవక్త (సల్లం)ను చూసి "ప్రియకుమారా! స్వాగతం! సుస్వాగతం!!" అన్నారు అమిత వాత్సల్యంతో కౌగలించుకుంటూ.

**విభిన్న పాపాత్ములు :** హజ్రత్ జిబ్రీల్ (అ) దైవప్రవక్త (స)ను తీసుకొని ముందుకు సాగారు. ఒకచోట కొందరు పొలంలో పైరు కోస్తున్నారు. అయితే కోసిన వెంటనే పైరు మళ్లీ మొలుస్తోంది. దైవప్రవక్త (స) అది చూసి "ఎవరీ మనుషులు?"అనడిగారు. దానికి జిబ్రీల్ (అలై) "వీరు దైవమార్గంలో పోరాడేవారు" అని చెప్పారు.

మరోచోట దైవదూతలు కొందరి తలలు పగలగొడ్తున్నారు. జిబ్రీల్ (అలైహి) వాళ్ళను గురించి తెలుపుతూ "వీరు నమాజు చేయడానికి బద్ధకించేవారు" అన్నారు.

మరోచోట కొందరు అతుకుల బట్టలు తొడుక్కొని పశువుల్లా గడ్డి మేస్తున్నారు. వారు జకాత్, ఇతర దానధర్మాలు చేయనివారని చెప్పారు హజ్రత్ జిబ్రీల్ (అలైహి).

వేరొకచోట ఒకతను కట్టెలు పోగుచేసి ఎత్తుకోవడానికి ప్రయత్నిస్తున్నాడు. కాని పైకెత్తుకోలేక పోతాడు. అప్పుడతను మోపులో కట్టెలు తగ్గించడానికి బదులు, మరికొన్ని కట్టెలు చేర్చి ఎత్తుకోవడానికి ప్రయత్నిస్తున్నాడు. హజ్రత్ జిబ్రీల్ (అలైహి) ఆ మనిషిని గురించి తెలుపుతూ "ఇతను మోయలేనన్ని బరువుబాధ్యతలు ఉన్నా వాటిని తగ్గించు కోవడానికి బదులు మరిన్ని బాధ్యతలు మీదేసుకుంటాడు" అని చెప్పారు.

ఇంకో చోట దైవదూతలు కొందరు మనుషుల నాలుకలు, పెదవులను కత్తెరలతో కత్తిరిస్తున్నారు. హజ్రత్ జిబ్రీల్ (అలై) విషయం చెబుతూ "వీళ్ళు విశృంఖలంగా ప్రసంగిస్తూ అల్లర్లు, అలజడులు సృష్టించే బాధ్యతారహితులైన ఉపన్యాసకులు" అన్నారు.

ఒకచోట ఒక చట్టుబండలో కాస్త పగులు ఏర్పడి, అందులో నుంచి బాగాబలిసిన ఓ ఆంబోతుఎద్దు బయటికి వచ్చింది. తరువాత ఆ ఎద్దు మళ్ళీ ఆ నెర్రలోకి పోవడానికి ప్రయత్నించింది. కాని ఆ చిన్నరంధ్రంలో దూరలేకపోయింది. హజ్రత్ జిబ్రీల్ ఆ ఎద్దు గురించి చెబుతూ "ఒకతను బాధ్యతారహితంగా సమస్యలు, సంక్షోభాలకు కారణమయ్యే ఓమాట చెప్పి, తరువాత పశ్చాత్తాపంతో దాన్ని దూరం చేయడానికి ప్రయత్నిస్తాడు. కాని అతని ప్రయత్నాలేవీ ఫలించవు. ఈఎద్దు అలాంటి బాపతుకు చెందినదే" అన్నారు.

వేరొకచోట కొందరు తమకు కావాల్సిన మాంసాన్ని తమ దేహాల నుండే కోసుకొని తింటున్నారు. వారు ఇతరుల్ని ఎగతాళి, ఎకసక్కెం చేసేవారని జిబ్రీల్ (అలై) తెలిపారు.

వారికి కొంచెం దూరంలో మరికొందరున్నారు. వారు తమ వాడిఅయిన రాగి గోళ్ళతో తమ ముఖాలను, రొమ్ములను రక్కుకుంటున్నారు. దైవప్రవక్త (సల్లం) వీరెవరని అడిగారు. వీరు ప్రజలను పరోక్షంగా నిందిస్తూ, వాళ్ళలో చెడుల్ని తీసి చూపిస్తూ వారి గౌరవప్రతిష్ఠలను దిగజార్చేవారని తెలిపారు హజ్రత్ జిబ్రీల్ (అలైహి).

మరొకచోట బానకడుపులు కలిగినవారు కొందరున్నారు. వారి పొట్టలు పాములతో నిండిపోయి ఉన్నాయి. వారు వడ్డీ తినేవాళ్ళని చెప్పారు హజ్రత్ జిబ్రీల్ (అలైహి).

వేరొకచోట కొందరు స్త్రీపురుషులు ఉన్నారు. వారికి ఒక వైపు రుచికరమైన ఘుమ



ఘుమలాడే మంచి మాంసం ఉంది. మరోవైపు కుళ్ళి కంపుకొడ్తున్న మాంసం ఉంది. అయితే ఆ మనుషులు మంచి మాంసం వదిలేసి కంపుకొడ్తున్న మాంసం తింటున్నారు. వీళ్ళెవరని అడిగితే, "వీళ్ళు ధర్మసమ్మతమైన భార్యలను, భర్తలను వదలి నిషేధితాలతో తమ కోరికలు తీర్చుకునే స్త్రీ పురుషులు" అని చెప్పారు జిబ్రీల్ (అలైహి).

(ఈ విశేషాలు "మహనీయ ముహమ్మద్(స) ఆదర్శజీవితం" నుండి గ్రహించబడ్డాయి.)

మృతులకు ప్రయోజనంచేకూర్చే విషయాలు:- హజ్రత్ అబూహురైరా (రజి) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఈవిధంగా తెలియజేశారు: "మనిషి చనిపోగానే అతని కర్మలు అంతమైపోతాయి. కాని మూడు విధాల కర్మలు మిగిలి ఉంటాయి. వాటిలో (1) సదఖా-ఎ-జారియా (నిరంతర దానం), (2) ప్రజలకు ప్రయోజనం చేకూర్చే విద్యా జ్ఞానాలు, (3) చనిపోయిన తండ్రి కోసం ప్రార్థన(దుఆ) చేసే మంచి సంతానం." (బుఖారి, ముస్లిం, అబూదావూద్, తిర్మిజి, ఇబ్నెమాజ)

## 95. ప్రళయ సూచనలు

ప్రళయానికి ముందు ప్రళయ సూచనలుగా కొన్ని సంఘటనలు జరుగుతాయి. అవి సంభవించనంతవరకు ప్రళయం రాదని తెలుస్తోంది. చెడుల్ని అరికట్టడం, మంచిని పెంచడం, సంఘసంస్కరణ కార్యక్రమాలు చేపట్టడం ముస్లింల విధి. ముస్లింలు గనక ఈపనులు చేయకుండా పాపకార్యాల్లో కూరుకుపోతే వారు కూడా ప్రపంచంలో దైవశిక్ష చవిచూడవలసి వస్తుంది. దీన్ని గురించి దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు:

"నా అనుచర సముదాయంలో ఎప్పుడైతే పదిహేను (దుర్) లక్షణాలు చోటుచేసుకుంటాయో అప్పుడు దానిపై ఆపదలు రావడం మొదలవుతాయి. (కొందరు ఈ మాట విని) 'అయితే దైవప్రవక్తా! ఆ లక్షణాలు ఏమిటీ?' అని అడిగారు. దానికి దైవప్రవక్త (స) ఈవిధంగా సెలవిచ్చారు-

1-ప్రభుత్వ ఆస్తులను సొంతఆస్తులుగా పరిగణించడం. 2-అమానత్ (భద్రపరచడానికి అప్పగించబడిన సొత్తు)ను సమరసొత్తు (మాలెగనీమత్)గా తలచడం. 3-పేదల ఆర్థిక హక్కయిన) జకాత్ ధనాన్ని జరిమానాగా భావించడం. 4-భర్త తన భార్యకు విధేయుడై పోవడం. 5-కొడుకు తన తల్లి పట్ల అవిధేయుడయి ప్రవర్తించడం. 6-మనిషి తన స్నేహితులకు మాత్రమే మేలుచేసి, 7-తన తండ్రిపై దౌర్జన్యం చేయడం. 8-మసీదులో అల్లరి చేయడం. 9-ఒక జాతిలోని అత్యంత నీచుడు ఆజాతికి నాయకుడయి పోవడం. 10-వ్యక్తిలోని చెడుకు భయపడి జనం అతడ్ని గౌరవించడం. 11-మత్తు పదార్థాలను బహిరంగంగా వినియోగించడం. 12-పురుషులు పట్టువస్త్రాలు ధరించడం. 13-సంగీత వాయిద్యాలను అవలంబించడం. 14-గాయకురాళ్ళను సమావేశపరచడం. 15-అప్పటి ప్రజలు తమ పూర్వీకులను నిందించడం, దూషించడం.

ఈ లక్షణాలు చోటుచేసుకోవడం ప్రారంభించగానే ప్రజలు ఇక ఎల్లవేళలా దైవశిక్ష కోసం ఎదురుచూడాల్సి వస్తుంది. ఈశిక్ష ఎర్రటి గాలిదుమారం రూపంలోనైనా రావచ్చు, లేదా భూకంపం రూపంలోనైనా రావచ్చు, లేదా సబ్బత్ (శనివారం) వాళ్ళకు వచ్చినట్లు ముఖాలు వికృతంగా మార్చివేసే శిక్షయినా రావచ్చు." (తిర్మిజి)

"ప్రళయ సూచనల్లో ఒకటి, బానిసమహిళ తన యజమానురాలిని కంటుంది. (అంటే కుమార్తెలు తమతల్లుల మీద పెత్తనం చెలాయిస్తూ వారిచేత చాకిరి చేయించుకుంటారు.) రెండవ సూచన, కాళ్ళకు చెప్పులు, ఒంటికి సరిపడ దుస్తులు లేకుండా మేకలు కాసేవారు (కూడా) పెద్దపెద్ద భవంతులు కట్టడం మొదలెడతారు. ఆ విషయంలో వారు ఒకర్నొకరు మించిపోవడానికి ప్రయత్నిస్తారు." (బుఖారి, ముస్లిం)

"నా అనుచర సముదాయంలో 'ఖడ్గం' పెట్టబడినప్పుడు (అంటే అంతఃకలహాలు మొదలైతే) ఇక ప్రళయంవరకూ ఆ ఖడ్గం నడుస్తూనే ఉంటుంది. నా అనుచర సముదాయంలోని అనేకతెగలు బహుదైవారాధకులుగా మారనంతవరకు, అనేకతెగలు విగ్రహారాధన చేయనంతవరకు ప్రళయం రాదు.... నా అనుచర సముదాయంలో 30 మంది పరమ అబద్ధీకులు పుడ్తారు. వారిలో ప్రతి ఒక్కడూ తాను దైవప్రవక్తనని చెప్పుకుంటాడు. నిజానికి నేను అంతిమ దైవప్రవక్తను. నా తరువాత మరే దైవప్రవక్తా ఉండడు." (మిష్కాత్)

"(ముస్లింలకు చెందిన) రెండు పెద్ద వర్గాలు పోట్లాడుకొని వారి మధ్య తీవ్రంగా యుద్ధం జరగనంతవరకు ప్రళయం రాదు. ఆ రెండువర్గాల వాదన ఒక్కటే." (బుఖారి)

"సమీప కాలంలో మీ మధ్య కల్లోలాలు చెలరేగుతాయి. అప్పుడు నిలబడినవాని కంటే కూర్చున్నవాడు, నడుస్తున్న వానికంటే నిలబడి ఉన్నవాడు, పరుగెత్తుతున్న వాని కంటే నడుస్తున్నవాడు క్షేమంగా ఉంటారు. ఆ కల్లోలాల వైపు ఎవరైనా తొంగిచూసినా సరే అవి అతడ్ని తమ వైపుకు లాక్కుంటాయి. అలాంటి పరిస్థితిలో ఎవరికి ఏ ఆశ్రయం దొరికితే అతనా ఆశ్రయానికి వెళ్ళి దాక్కోవాలి." (బుఖారి)

ఈ అంతఃకలహాలు మూడవ ఖలీఫా హజ్రత్ ఉస్మాన్ (రజి) పాలనాకాలం నుంచి ప్రారంభమయి ఇమామ్ హుసైన్ (రజి) అమరగతితో తగ్గుముఖం పట్టాయి.

"అతి త్వరలో ఓ కాలం రానున్నది. ఆ కాలంలో ఇస్లాం నామమాత్రంగా ఉండిపోతుంది. ఖుర్ఆన్ (పఠనం) ఒక ఆచారంగా మిగిలిపోతుంది. వారి మసీదులు బాగానే (రకరకాల అలంకరణలతో) కళకళ లాడుతుంటాయి. కాని సన్మార్గం, హితబోధల రీత్యా నిర్మానుష్యంగా ఉంటాయి. వారి ధర్మవేత్తలు ఆకాశం క్రింద (లోకంలో) ఉండే వారందరిలో ఎక్కువ చెడ్డవాళ్ళు అవుతారు. వారి వల్ల ఉపద్రవాలు (సంక్షోభం, సమస్యలు) చెలరేగుతాయి. తరువాత వారందులోకి తిరిగి వస్తారు." (బైహఖి)

"ప్రళయ సూచనల్లో ఒకటి, ప్రజలు మసీదులు నిర్మించి వాటి పట్ల గర్విస్తారు."

"మీరు తప్పకుండా యూదులు, క్రైస్తవుల వలె మసీదులను (ఖరీదైన వస్తువులతో) అలంకరిస్తారు." (అబూదావూద్)

"మీరు మసీదుల్ని అలంకరించడం, ఖుర్ఆన్ గ్రంథాలను అందంగా తీర్చిదిద్దడం ప్రారంభించగానే మీ వినాశకాలం సమీపించిందని గ్రహించండి." (కన్జుల్ఆమాల్)

"మీరీనాడు ఆదేశించబడిన విషయాలలో పదోవంతు వదిలేసినా నాశనమవుతారు. ఆ తరువాత మరోకాలం వస్తుంది. అప్పుడు ఆదేశించబడిన విషయాలలో మీరు పదోవంతు ఆచరించినా మోక్షం పొందుతారు." (తిర్మిజి-మిష్కాత్)



"రాబోయే ఓ కాలంలో జనం ప్రాపంచిక విషయాల్ని మసీదుల్లో మాట్లాడుకుంటారు. మీరు వారి దగ్గర కూర్చోకండి. దేవునికి వారి అవసరం ఎంత మాత్రం లేదు." (బైహఖి)

"దేవుడు ఈ (ముస్లిం)సముదాయం కోసం ప్రతి వందేళ్ళ తరువాత ఈ (ఇస్లాం) ధర్మానికి కొత్తదనం చేకూర్చే మనిషిని పంపిస్తుంటాడు." (అబూదావూద్)

"వినండి! నాకు నిస్సందేహంగా ఖుర్ఆన్ ఇవ్వబడింది. ఖుర్ఆన్ ఆజ్ఞల్లాంటి ఇతర ఆజ్ఞలు (హదీసులు) కూడా ఇవ్వబడ్డాయి.... జాగ్రత్త! ఒక కాలం రానున్నది. ఆ కాలంలో కడుపునిండిన వాడొకడు హాయిగా కూర్చొని 'మీకు ఖుర్ఆన్ ఒక్కటే చాలు. అందులో ధర్మసమ్మతమైనవని తెలిపినవాటిని ధర్మసమ్మతమైనవిగా, నిషిద్ధమైనవని తెలిపినవాటిని నిషిద్ధమైనవిగా భావించండి. (హదీసులు అవసరం లేదు.)' అని అంటాడు." (మిష్కాత్)

'పఠించండి (ఖుర్ఆన్). మీరంతా సరిగానే పఠిస్తున్నారు. అయితే (నా తర్వాత) త్వరలో ఖుర్ఆన్ని బాణం మాదిరిగా సరిచేసేవారు ఉద్భవిస్తారు. (అంటే పఠనంలో అక్షరాల పట్ల, ఉచ్చారణ పట్ల ఎంతో శ్రద్ధవహిస్తారు. కాని) ఖుర్ఆన్ పఠనం ద్వారా ప్రాపంచిక ప్రయోజనాలు సాధించడమే వారి లక్ష్యమవుతుంది. దాని ద్వారా తమ పరలోక జీవితాన్ని సరిదిద్దుకోవాడం వారి లక్ష్యంకాదు." (మిష్కాత్)

ఖుర్ఆన్ పఠనం గురించే దైవప్రవక్త (సల్లం) వేరొక హదీసులో ప్రస్తావిస్తూ, వారు ఖుర్ఆన్ బాగానే పఠిస్తారు కాని, అది వారి కంఠం నుంచి క్రిందికి దిగదన్నారు.

దైవప్రవక్త (స) ప్రవచనం: "ప్రళయకాల సమీపంలో ప్రజలు జనసమూహంలో ప్రత్యేక వ్యక్తులకు మాత్రమే సలాం చేస్తారు. వ్యాపారాసక్తి సర్వసామాన్యమై, చివరికి స్త్రీ కూడా తన భర్తకు వ్యాపారంలో సహాయపడుతుంది. అలాగే ప్రళయకాల సమీపంలో ప్రజలు బంధుత్వాలను తెంచుకుంటారు. అసత్య సాక్ష్యం చెబుతారు. సత్యసాక్ష్యం దాచుతారు. జూదం సర్వసామాన్యం అవుతుంది." (ఇబ్నె మస్ఊద్-ముస్నద్అహ్మద్)

దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "మిమ్మల్ని అంతమొందించడానికి త్వరలోనే (సత్యవ్యతిరేక) జాతులన్నీ ఏకమయ్యే కాలం రానున్నది. ఆకలిగొన్నవారు ఒకర్నొకరు పిలుచుకుంటూ కంచాల మీద ఎగబడినట్లు వారు మీమీద విరుచుకుపడతారు." ఒకతను ఈమాట విని "ఆ కాలంలో మా జనాభా తక్కువగా ఉంటుందా?" అని ప్రశ్నించాడు.

దానికి దైవప్రవక్త (స) "లేదు. అధికంగానే ఉంటుంది. కాని (వరదనీటి నురుగులా లేక) వరదనీటిలో కొట్టుకు పోయే గడ్డిపోచల్లా ఉంటారు మీరు. దేవుడు మీ శత్రువుల హృదయాల నుండి మీపట్లవున్న భయాన్ని తీసివేస్తాడు. మీ హృదయాల్లో పిరికితనం చోటుచేసుకుంటుంది" అని చెప్పారు. అప్పుడు ఒకతను "ఈ పిరికితనం ఎందువల్ల వస్తుందీ?" అనడిగాడు. దానికి దైవప్రవక్త (స) "మీరు ప్రాపంచికవ్యామోహానికి గురవుతారు; మృత్యువుని అసహ్యించుకుంటారు" అని సమాధానమిచ్చారు. (అబూదావూద్)

దైవప్రవక్త ఇలా అన్నారు: "(ముస్లింలారా!) ఉదయం ఒక జతబట్టలు, సాయంత్రం ఒకజత బట్టలు ధరించి ఇళ్ళ నుండి బయలుదేరే కాలం వచ్చినప్పుడు మీ పరిస్థితి

ఎలా ఉంటుంది? ఆ కాలంలో మీ ముందు ఒకగిన్నె ఉంచబడుతుంది, మరోగిన్నె మీముందు నుంచి తీసేయబడుతుంది. కాబాకు వేలాడదీసినట్లు ఆ కాలంలో మీరు మీ ఇండ్లకు ఖరీదైన పరదాలు వేలాడదీస్తారు.''

అనుచరులు (రజి) ఈ మాటలు విని ''అయితే దైవప్రవక్తా! ఈనాటి కన్నా రాబోయే కాలంలో మా పరిస్థితి చాలా బాగుంటుందన్నమాట. సంపాదన కోసం ఎక్కువగా కష్టపడ వలసిన అవసరముండదు. ఆరాధన కోసం మాకు కావలసినంత సమయం దొరుకు తుంది కదా!'' అని అన్నారు. దైవప్రవక్త (స) వారి మాటలు ఖండిస్తూ ''కాదు. మీరు రాబోయే ఆరోజులకంటే ఈనాడే మంచివాళ్లు. (ఈనాడు మీరు ఐశ్వర్యం రీత్యా పేదలైనప్ప టికీ విశ్వాసంరీత్యా భాగ్యవంతులు. ఆ కాలంలో మీరు ఐశ్వర్యం రీత్యా భాగ్యవంతులై నప్పటికీ విశ్వాసంరీత్యా పేదవాళ్ళుగా ఉంటారు)'' అని చెప్పారు. (తిర్మిజి)

ఒకసారి దైవప్రవక్త (సల్లం) ఇలా సెలవిచ్చారు: ''నా సహాబీలను (అనుచరులను) గౌరవించండి. (నా అనుచర సముదాయంలో) వీరే అందరికంటే మంచివాళ్ళు. ఆ తరువాత వీరి తదనంతరం వచ్చేవారు (తాబయీన్) మంచివాళ్ళు. ఆ తరువాత అబద్ధం వ్యాపిస్తుంది. (అబద్ధం బాగా వ్యాపిస్తూ) చివరికి మనిషి అడగకుండానే ప్రమాణం చేస్తాడు; అలాగే సాక్ష్యం గురించి అడగకపోయినా సాక్ష్యం చెబుతాడు.'' (నిసాయి)

వేరొక ఉల్లేఖనంలో ''ఆ తర్వాత వచ్చే వారు (పూర్తిగా ప్రాపంచిక వ్యామోహంలో పడిపోయి అక్రమ సంపాదనలతో విలువైన ఆహారం తింటూ) బలిసి పోవడానికి ఇష్ట పడతారు'' అని ఉంది. (ముస్లిం)

కొన్ని హదీసులలో ''మనిషి అక్రమ సంపాదన-సక్రమ సంపాదన అనే విషయాన్ని పట్టించుకోకుండా ఎలాగైనా సంపాదించడమే ధ్యేయంగా పెట్టుకునే రోజులు వస్తాయి'' అని; మరికొన్ని హదీసులలో ''వడ్డీ తిననివారంటూ ఉండని రోజులు వస్తాయి. ఒకవేళ ఎవరైనా వడ్డీ తినకపోయినా వారిపై వడ్డీ ధూళి మాత్రం వచ్చి పడుతుంద''ని ఉంది.

దైవప్రవక్త (స) ప్రవచనం: ''ప్రళయ సూచనల్లో కొన్ని- స్త్రీలు తమపై పెత్తనం చెలాయించే బాలికలను కంటారు. కాళ్ళకు చెప్పుల్లేని, శరీరారాలకు తగిన బట్టలులేని పేదలు, మేకలకాపరులు ఎత్తయిన భవనాల పట్ల గర్విస్తారు.'' (మిష్కాత్)

## సత్యపథగాములు సదా ఉంటారు

“మేము సృష్టించినవారిలో ఒక వర్గం (ఎల్లప్పుడూ ప్రజలకు) సత్యం వైపుకే దారి చూపుతుంది; సత్యానికి అనుగుణంగానే నిర్ణయాలు చేస్తుంది.” (ఖుర్ఆన్-7:181)

''నా అనుచర సముదాయంలో ఒక సమూహం దైవాజ్ఞలు పాటించడంలో ఎల్లప్పుడూ స్థిరంగా ఉంటుంది. జీవితాంతం అదే విధంగా ఉంటుంది. వ్యతిరేకత, సహాయనిరాకరణలు దానికి ఏమాత్రం నష్టం కలిగించలేవు.'' (మిష్కాత్)

''రానున్న ఒక కాలంలో (దైవాజ్ఞలను పూర్తిగా పాటిస్తూ) ధర్మంలో స్థిరంగాఉండే వారి పరిస్థితి చేతిలో అగ్నికణం పట్టుకున్నవాడిలా ఉంటుంది.'' (మిష్కాత్)



''(నా)ఈ అనుచర సముదాయం చివరికాలంలో ఉండేవారికి వారికి పూర్వం ఉండినవారికి లభించిన పుణ్యఫలమే లభిస్తుంది. వారు సత్కార్యాలను గురించి ఆదేశి స్తారు; చెడుల నుండి వారిస్తారు; అలజడులు రేకెత్తించేవారితో పోరాడుతారు.'' (బైహఖి)

''గతంలో ఇస్రాయీల్‌సంతతి ప్రజలకు వచ్చినటువంటి కాలం నా అనుచర సము దాయానికి తప్పకుండా వస్తుంది, ఒక పాదరక్ష మరోక పాదరక్షను పోలినట్లు. ఇస్రాయీల్ సంతతిలో ఎవరైనా తన తల్లితో వ్యభిచరించి ఉంటే, నా అనుచర సముదాయంలో కూడా అలాంటివారు ఉంటారు. ఇస్రాయీల్ సంతతిలో 72 మత వర్గాలు ఏర్పాడ్డాయి. అలాగే నా అనుచర సముదాయంలో కూడా 72 మతవర్గాలు ఏర్పడుతాయి. వాటిలో ఒక్క వర్గం తప్ప మిగిలిన వర్గాలన్నీ నరకానికి పోతాయి'' అన్నారు దైవప్రవక్త (స).

అప్పుడు కొందరు అనుచరులు ''స్వర్గానికి పోయేవారు ఎవర''ని అడిగారు. దానికి ఆయన ''నేను, నా అనుచరులు నడిచినబాటలో నడిచేవారు'' అన్నారు. (మిష్కాత్)

''సిరిసంపదలు ఎక్కువై సర్వసామాన్యమయ్యే వరకూ ప్రళయం రాదు. ఆ కాలంలో ధనికుడు జకాత్ పైకం తీస్తాడుగాని దాన్ని స్వీకరించేవారు ఎవరూ ఉండరు. చివరికి అరేబియా నేల నదులు, పచ్చికబయళ్ళుగా మారిపోతుంది.'' (ముస్లిం)

''మీకొక కాలం రానున్నది. ఆ కాలంలో మనిషి దానం తీసుకొని బయలుదేరుతాడు. కాని దానం తీసుకునేవారెవరూ ఉండరు. ఎవరికైనా ఇద్దామని వెళ్తే ఆ వ్యక్తి 'నీవు నిన్న వచ్చివుంటే నేనీ దానం తీసుకునేవాడ్ని. ఈరోజు దీని అవసరంలేదు' అంటాడు.'' (మిష్కాత్)

''అంత్యకాలంలో మీ ఖలీఫాల్లో ఒకడు తన దోసిలినిండా ప్రజలకు సొమ్ము ఇస్తాడు. దాన్ని లెక్క కూడా పెట్టడు.'' (ముస్లిం)

''రాబోయే ఓ కాలంలో మనిషి బంగారం దానంచేసేందుకు (భిక్షగాళ్ళను) గాలిస్తాడు. కాని అతని దానం పుచ్చుకునేవాడు ఒక్కడూ దొరకడు. అంతేకాదు, ఆ కాలంలో ఒక్కో పురుషుని పర్యవేక్షణలో నలభై నలభై మంది స్త్రీలు ఉంటారు. పురుషులు తక్కువగా, స్త్రీలు ఎక్కువగా ఉండటం మూలంగా అలా జరుగుతుంది.'' (ముస్లిం)

''(యమన్‌లో నివశించే) ఖహ్తాన్ తెగకు చెందిన మహాబలాఢ్యుడు ఒకడు తన కర్రతో (అధికార బలంతో) ప్రజలపై (తన ఇష్టమొచ్చిన విధంగా) పెత్తనం చెలాయించ నంతవరకూ ప్రళయం సంభవించదు.'' (బుఖారి, ముస్లిం)

''వెంట్రుకలతో తయారైన పాదరక్షలు ధరించే జాతితో మీరు యుద్ధం చేయనంత వరకూ ప్రళయం రాదు. అలాగే సొట్టబోయిన డాలువంటి ముఖాలుగల జాతితో కూడా మీరు యుద్ధం చేయనంతవరకూ ప్రళయం రాదు.'' (బుఖారి, ముస్లిం)

**కాబా విధ్వంసం :** హజ్రత్ ఆయిషా (రజి) కథనం: దైవప్రవక్త (స) ఒక భవిష్యత్ ప్రకటన చేస్తూ ''ఒక సైన్యం కాబాలయం మీద దాడిచేసే ఉద్దేశ్యంతో వస్తుంది. అయితే ఆ సైన్యం 'బైదా' ప్రాంతంలో ఉండగానే అది మొదలు నుంచి చివరిదాకా భూమిలోకి కూరుకుపోతుంది'' అని చెప్పారు. నేనీ మాట విని ''దైవప్రవక్తా! ఆ సైన్యం మొదలు నుంచి చివరిదాకా ఎలా కూరుకుపోతుంది? వారిలో బజారున పోయేవారు, వారిలో

చేరనివారు కూడా ఉంటారుకదా!" అన్నాను. దానికి దైవప్రవక్త (స) "మొదటి నుంచి చివరిదాకా అందరూ కూరుకుపోతారు. అయితే ఆ తర్వాత (ప్రళయదినాన) బ్రతికించి లేపబడేటప్పుడు వారివారి సంకల్పాలను బట్టి లేపబడతారు. (అంటే అమాయకుల్ని వదలి పాపాత్ముల్ని మాత్రమే శిక్షించడం జరుగుతుంది)" అని అన్నారు. (బుఖారి, ముస్లిం)

"అబిసీనియాకు చెందిన చిన్నపాదాలు (పిక్కలు) గల ఒకతను కాబా గృహాన్ని ధ్వంసం చేస్తాడు." (బుఖారి, ముస్లిం)

"మదీనా మునుపటికన్నా మంచిస్థితిలో ఉన్నప్పటికీ ప్రజలు దాన్ని వదలిపెట్టి పోతారు. (అప్పుడు) అడవి మృగాలు, పక్షులు తప్ప ఎవరూ అటు వైపు వెళ్ళరు. చివరికి ముజైనా తెగకు చెందిన ఇద్దరు పశువులకాపరుల మీద ప్రళయం సంభవిస్తుంది. వారిద్దరు తమ మేకలమందలను తోలుకుంటూ మదీనా వెళ్తారు. అక్కడి కెళ్ళి చూస్తే వారికి మదీనా అడవిజంతువుల నివాసస్థలంగా మారివున్నట్లు కన్పిస్తుంది. చివరికి వారు 'సనియ్యతుల్‌వదా' చేరుకోగానే నేల మీద బోర్లాపడిపోతారు. (బుఖారీ, ముస్లిం)

"కాలం (త్వరత్వరగా గడచిపోతూ) దగ్గరవుతుంది. సంవత్సరాలు (వేగంగా ముగిసిపోతూ) తగ్గిపోతాయి. ఫలోత్పత్తి తగ్గిపోతుంది." (తబ్రాని)

"సజ్జనులు ఒక్కొక్కరి చొప్పున వెళ్ళిపోతారు. చివరికి బార్లి లేక ఖర్జూరపు చెత్తలాంటి వాళ్ళు మాత్రమే మిగిలిపోతారు. దేవునిదృష్టిలో వారికి ఎలాంటి విలువాఉండదు." (బుఖారీ)

**ఇస్లాం చిక్కిపోతుంది :** "పాము కన్నంలో దూరి చుట్ట చుట్టుకున్నట్లు ఇస్లాం కూడా కురచవుతూ హిజాజ్ (సౌదీఅరేబియా)కు పరిమితమయి పోతుంది. అడవిమేక కొండకోనలో ఉండిపోయినట్లు ఇస్లాం హిజాజ్‌లోనే ఉండిపోతుంది."

"ప్రారంభ కాలంలో ఇస్లాం ధర్మం ఒక వింతగా, అపరిచిత విషయంగా ఉండేది. ఒకరిద్దరు తప్ప ఎవరూ ఇస్లాం స్వీకరించేవారు కాదు. త్వరలోనే ఇస్లాం ప్రారంభంలో ఉన్నట్లు తిరిగి (ప్రజలకు) అపరిచితమై పోతుంది. దాన్ని ఆచరించేవారు కొందరు మాత్రమే ఉంటారు. నా తదనంతరం విచ్ఛిన్నం చేయబడిన నా సంప్రదాయాలను పునరుజ్జీవింప జేసే అపరిచితులకు శుభవార్త లభించుగాక!" (తిర్మిజి, ఇబ్నెమాజ)

"ప్రళయానికి ముందు ఓ కాలం వస్తుంది. అప్పుడు జ్ఞానం పైకిపోయి అజ్ఞానం కిందికి దిగుతుంది. హర్జ్ అధికమవుతుంది. హర్జ్ అంటే హత్యాకాండ." (బుఖారి)

"దేవుడు విద్యాజ్ఞానాలను తన దాసుల నుండి అకస్మాత్తుగా తీసేసుకోడు. ధర్మవేత్తలకు మృత్యువు కలిగించి విద్యాజ్ఞానాలను క్రమేణా అంతమొందిస్తాడు. ఏ ఒక్క ధర్మవేత్తను కూడా విడిచిపెట్టడు. అప్పుడు ప్రజలు అజ్ఞానులను తమ నాయకులుగా చేసుకుంటారు. ఆ నాయకులు సరైన జ్ఞానం లేకుండానే ధార్మిక తీర్పులు (ఫత్వాలు) జారీచేస్తారు. ఈ విధంగా వారూ భ్రష్టులయి ప్రజలను కూడా భ్రష్టు పట్టిస్తారు."

"విద్యాజ్ఞానాలు అంతరించిపోనంతవరకు, ఒకదాని తర్వాతఒకటి అనేక భూకంపాలు రానంతవరకు ప్రళయం రాదు." (బుఖారి, ముస్లిం)



**స్త్రీజనాభా పెరుగుతుంది :** "ప్రళయకాల చిహ్నాలలో ఇవి కూడా ఉన్నాయి: విద్యాజ్ఞానాలు అంతరించి పోతాయి. అజ్ఞానం పెరిగిపోతుంది. వ్యభిచారం ఎక్కువయి పోతుంది. మద్యపానం సర్వసామాన్యమయి పోతుంది. పురుషజనాభా తగ్గిపోయి స్త్రీ జనాభా పెరుగుతుంది. చివరికి యాభైమంది స్త్రీలను కనిపెట్టుకొని ఉండేందుకు ఒకే ఒక పురుషుడు ఉంటాడు." (బుఖారి, ముస్లిం)

"మనిషి ఏదైనా సమాధి సమీపంగా పోవడం జరిగినప్పుడు అతను 'ఈ సమాధిలో ఈ శవానికి బదులు నేనుంటే ఎంత బాగుండు' అని అనేటంతటి (కల్లోల) పరిస్థితి దాపురించనంతవరకూ ప్రళయం రాదు." (బుఖారి, ముస్లిం)

"ఎవరి చేతిలో నా ప్రాణముందో ఆ శక్తిస్వరూపుని సాక్షి! మనిషి ఏదైనా సమాధి దగ్గరి నుంచి వెళ్ళినప్పుడు, "అయ్యో! ఈ గోరీలోఉన్నవాడి స్థానంలో నేనుంటే ఎంత బాగుండేది" అని తల్లడిల్లి పోనంతవరకూ ఈ ప్రపంచం అంతమవదు. అతను తన ధర్మం కోసం కాదు, ప్రాపంచిక పరీక్షలకు భయపడి అలా అంటాడు." (బుఖారీ, ముస్లిం)

**బంగారుకొండ బయల్పడుతుంది :** "ప్రళయం రావడానికి ముందు ఫురాత్ నది నుండి ఒక బంగారుకొండ బయల్పడుతుంది. దాన్ని స్వాధీనం చేసుకోడానికి జనం యుద్ధం చేస్తారు. ఆ యుద్ధంలో 99 శాతం మంది చనిపోతారు. వారిలో ప్రతి ఒక్కడూ తాను బహూశా బ్రతికి బయటపడగలనని భావిస్తాడు." (బుఖారి, ముస్లిం)

"ఫురాత్ నది ఎండిపోయి అందులో బంగారు నిధులు బయపటడే కాలం దగ్గర్లోనే ఉంది. అప్పుడు బతికివున్నవారు అందులోనుంచి ఏమీ తీసుకోరాదు సుమా!" (బుఖారీ)

"దైవసాక్షి! మనిషితో జంతువులు మాట్లాడనంతవరకు; కొరడా ముందు భాగం, చెప్పువారు 'నీవు వెళ్ళిపోయిన తరువాత నీ ఇంటివాళ్ళు ఈ పని చేశారు' అని మనిషికి చెబుతూ మాట్లాడనంతవరకూ ప్రళయం సంభవించదు." (తిర్మిజి)

"మీరు ముందుగా కొన్ని సూచనలు చూడనంతవరకు ప్రళయం సంభవించదు. అవి- పొగ, దజ్జాల్, (విశేష) భూచరం, పడమర నుంచి సూర్యోదయం, మర్యం కుమారుడు ఈసా (అలైహి) అవతరణ, యాజూజ్-మాజూజ్‌ల దండయాత్రలు, నేల క్రుంగిపోయే మూడు పెద్ద సంఘటనలు- ఒకటి తూర్పున, రెండు పడమరన, మూడు అరేబియా ద్వీపంలో. ఆ తరువాత చివర్లో యమన్ నుండి భయంకరమైన అగ్ని(మంట) బయలుదేరి ప్రజలను హష్ర్ మైదానికి తోలుకెళ్తుంది." (ముస్లిం)

## 96. మహ్‌ది (అలైహిస్సలాం)

ప్రళయసమీపంలోని విశేషాలను గురించి మౌలానా అష్రఫ్ అలి థానవి (రహ్మలై) అనేక హదీసులను అధ్యయనం చేసి, విశ్లేషించి వాటిని 'ఖియామత్‌నామా' అనే పుస్తకంలో వివరంగా పేర్కొన్నారు. దాన్ని నేనిక్కడ యధాతథంగా అనువదించి పాఠకుల ముందు పెడ్తున్నాను.

అబూదావూద్ ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఇలా తెలిపారు: "మీరు క్రైస్తవులతో శాంతి ఒప్పందం చేసుకుంటారు. తరువాత వారు, మీరు కలసి మరో క్రైస్తవ

వర్గంతో యుద్ధం చేసి విజయం సాధిస్తారు. అందులో లభించిన సమరసొత్తు తీసుకొని పెద్దపెద్ద గుట్టలుండే ఒక మైదానంలోకి వచ్చి విడిదిచేస్తారు. అక్కడ అనేక చెట్లు కూడా ఉంటాయి. అప్పుడు ఒక క్రైస్తవ సైనికాధికారి చేతిలో శిలువ తీసుకొని "ఈ శిలువ శుభంతో మనకు విజయం లభించింది" అంటాడు. ఈ మాటకు కోపంతో ఒక ముస్లిం అతని దగ్గర్నుండి సిలువ లాక్కొని దాన్ని విరగ్గొడ్తాడు. దాంతో క్రైస్తవులు ఒప్పందాన్ని తెంచివేసి ముస్లింలకు వ్యతిరేకంగా యుద్ధసన్నాహాలు మొదలుపెడతారు...."

మరికొన్ని ఉల్లేఖనాల ప్రకారం వారు ఇంతకు ముందు ముస్లింలతో కలసి యుద్ధం చేసిన క్రైస్తవవర్గాన్ని ఒప్పందంతో తమలో కలుపుకుంటారు. తర్వాత వారు మీపై యుద్ధానికి దిగుతారు. వారి దగ్గర 80 యుద్ధపతాకాలుంటాయి. ప్రతి యుద్ధపతాకం క్రింద 12,000 మంది సైనికులుంటారు. (ఈవిధంగా మొత్తం 9,60,000 మంది సైనికులతో ముస్లింలపై విరుచుకుపడతారు..... ముస్లింలు కూడా ఆయుధాలు తీసుకొని రంగంలోకి దిగుతారు. ఈ యద్ధంలో పోరాడే ముస్లింలకు దేవుడు అమరగతి భాగ్యం ప్రసాదిస్తాడు. వారి రాజు కూడా వీరమరణం పొందుతాడు. మిగిలిన ముస్లింలు మదీనా వెళ్ళి తలదాచుకుంటారు. క్రైస్తవులకు సిరియా హస్తగత మవుతుంది. వారి రాజ్యం ఖైబర్ దాకా విస్తరిస్తుంది.

ముస్లింలు తమ రాజు యుద్ధంలో చనిపోయిన తరువాత ఆయన స్థానంలో ఎవరిని ఖలీఫాగా చేయాలా అని ఆలోచిస్తూ పరస్పరం సంప్రదించుకుంటారు. అప్పుడు వారి దృష్టి మదీనాలోనే నివసిస్తున్న ఒక పుణ్యపరుషుని మీదికి పోతుంది. ఆ పుణ్య పరుషుడే "మహ్‌దీ (అలైహి)." అయితే రాజు వారసుడి ఎన్నిక గురించి జరుగుతున్న ప్రయత్నాల సంగతి విని మహ్‌దీ (అలైహి) తనను ఎక్కడ ఖలీఫాగా చేస్తారోనని భయపడి మదీనా నుండి మక్కా వెళ్ళిపోతారు. కాని మక్కా ప్రజలు ఆయన్ని గుర్తుపట్టి ఇంట్లో నుంచి బయటికి రప్పించి, ఆయన చేత బలవంతంగా ఖలీఫా పదవికి సంబంధించిన ప్రమాణం (బయత్) చేయిస్తారు.

కొన్ని ఉల్లేఖనాల ప్రకారం మహ్‌దీ (అలైహి) అసలు పేరు ముహమ్మద్. ఆయన తండ్రి పేరు అబ్దుల్లా. ఆయన గుణగణాలు ఇమాం హసన్ (రజి) గుణగణాలను పోలి ఉంటాయి. ఆయన ముక్కు కోటేరులా ఉంటుంది. ముఖం కాంతిమంతంగా ఉంటుంది. (అబూదావూద్, మిష్కాత్)

మహ్‌దీ (అలైహి) ఖలీఫా అయిన వార్త దేశంలో నలుమూలలా వ్యాపించి సిరియా ప్రజలకు కూడా తెలిసిపోతుంది. అప్పుడు సిరియా నుంచి ఒక సైనికదళం ముస్లింలపై యుద్ధం చేయడానికి మదీనా దిశగా ప్రయాణ మవుతుంది. అయితే ఆ సైనికదళం ముస్లిం సైన్యాల దగ్గరికి చేరుకోకముందే దారిలో మక్కా, మదీనాల మధ్య ఉన్న బైదా అనే చోట భూమిలో దిగబడి అంతమైపోతుంది. ఈ సంగతి విన్న సిరియా దైవప్రియులు, ఇరాఖ్ పుణ్యాత్ములు మహ్‌దీ (అలైహి)ను కలుసుకోవడానికి వస్తారు. తరువాత ఖురైష్ సంతతికి చెందిన బనీకిలాబ్ తెగ నుండి ఒక సైనికదళం మహ్‌దీ (అలైహి)పై యుద్ధం చేయడానికి వస్తుంది. ఇరుపక్షాల మధ్య యుద్ధం జరుగుతుంది. ఈ యుద్ధంలో ముస్లింలకు విజయం లభిస్తుంది.



మహ్‌దీ (అలైహి)కు అవిశ్వాసులతో అనేక యుద్ధాలు చేయవలసి వస్తుంది. ముఖ్యంగా క్రైస్తవులతో అనేక యుద్ధాలు చేస్తారు. ఆయన మక్కా నుండి మదీనా చేరుకొని అక్కడ అంతిమ దైవప్రవక్త (స) సమాధిని దర్శించుకుంటారు. తరువాత సిరియా వైపు బయలు దేరుతారు. సిరియాలోని డెమాస్కస్‌కు చేరుకునేటప్పటికి అక్కడ క్రైస్తవ సైన్యాలతో తలపడవలసి వస్తుంది. దీన్ని గురించి దైవప్రవక్త (స) ఈవిధంగా తెలియజేశారు:

"సిరియా ముస్లింలను అణచడానికి బ్రహ్మాండమైన శత్రుసైన్యం వస్తుంది. అదే సమయంలో మహ్‌దీ (అలైహి) నాయకత్వాన మదీనా నుంచి వచ్చే ముస్లింసైన్యంతో సిరియా ముస్లింసైన్యం చేతులు కలుపుతుంది. ముస్లింలు శత్రువుని ఎదుర్కోవడానికి విజయమో వీరమరణమో తేల్చుకోవాలని చెప్పి ఓ ప్రత్యేక సైనికదళాన్ని పంపుతారు. ఈదళం పగలల్లా పోరాడినా శత్రువులను ఓడించలేరు. చీకటి పడగానే రెండుసైన్యాలు యుద్ధం విరమించి తమతమ స్థావరాలకు వెళ్ళిపోతాయి. మరునాడు ముస్లింలు విజయమో వీరమరణమో తేల్చుకోవాలని చెప్పి మరో ప్రత్యేక సైనికదళాన్ని పంపుతారు. ఆ దళం కూడా పగలంతా పోరాడుతుంది కాని, శత్రువుని ఓడించలేకపోతుంది. ఆరోజు కూడా చీకటి పడగానే ఉభయపక్షాలు తమతమ స్థావరాలకు వెళ్ళిపోతాయి. మూడవ రోజు కూడా ముస్లింలు విజయమో వీరమరణమే తేల్చుకోవడానికి వేరొక ప్రత్యేకదళం పంపిస్తారు. కాని ఆరోజు కూడా ముస్లింలు శత్రువులను ఓడించలేరు. చీకటి పడగానే అందరూ తమతమ స్థావరాలకు వెళ్ళిపోతారు.

"ఈ మూడు రోజుల యుద్ధంలో ఉభయపక్షాలకు చెందిన సైనికులు అత్యధిక సంఖ్యలో చనిపోతారు. నాల్గవ రోజు మిగిలిన ముస్లింలు యుద్ధానికి సమాయత్తమవు తారు. ఆ రోజు యుద్ధం హోరాహోరిగా జరుగుతుంది. ఇదివరకెన్నడూ జరగనంత భయం కరంగా జరుగుతుంది. ఈ యుద్ధంలో చివరికి దేవుడు అవిశ్వాసులకు మట్టి కరిపించి విశ్వాసులకు విజయం చేకూరుస్తాడు. యుద్ధమైదానంలో అనేక మైళ్ళ దూరం దాకా శవాలు గుట్టలు గుట్టలుగా పడివుంటాయి. శవాలను పీక్కుతినే దూడబోతులు ఎగురుతూ వచ్చి ఆ శవాల సమీపం నుంచి పోవడానికి ప్రయత్నిస్తాయి. కాని (ఆ శవాల నుంచి వెలువడే దుర్వాసనను భరించలేకనో, లేక శవాలు పడివున్న సుదీర్ఘ దూరాన్ని దాటలేకనో) అవి చచ్చి క్రిందపడి పోతాయి. ఈ యద్ధంలో పాల్గొని బ్రతికి బయటపడిన తమవారు ఎంతమంది ఉంటారో ఇరుపక్షాలు అంచనా వేస్తే 1% మాత్రమేనని తెలు స్తుంది. (అంటే 99% ఈ సమరాగ్నికి సమిధలవుతారన్న మాట!)"

"యుద్ధం ముగిసిన తరువాత ముస్లింలు బ్రతికి బయటపడినవారు ఎంతమందో లెక్కపెడ్తుంటే, హఠాత్తుగా అంతేకంటే ఘోరమైన మరోయుద్ధప్రమాదం గురించిన వార్త అందుతుంది. ముస్లింలు ఈ రెండోయుద్ధం గురించి తగిన వ్యూహరచన చేయకముందే వేరొక దుర్వార్త వస్తుంది. "మన భార్యాపిల్లలను సంక్షోభంలో పడవేయడానికి దజ్జాల్ బయల్పడ్డాడు" అనేదే ఆ వార్త. ఈ దుర్వార్త వినగానే ముస్లింయోధులు తమకు చేజిక్కిన సమరసొత్తును అక్కడే విసిరిపారేసి ఇండ్లకు బయలుదేరుతారు. వారు దజ్జాల్‌ని గురించి నిజానిజాలు తెలుసుకోవడానికి తమలోని పది మంది రౌతులను పంపిస్తారు..." (ముస్లిం)

ఈ యుద్ధంలో శత్రుసైనికులైన క్రైస్తవులు పెద్దఎత్తున చనిపోతారు. మిగిలినవారు రాజ్యాధికారం గురించి ఆలోచనను సైతం మనసులో నుంచి తీసివేసి బ్రతుకుజీవుడా అంటూ పారిపోతారు. చెట్టుకొకరు గుట్టకొకరయి పడుతూలేస్తూ పలాయనం చిత్తగిస్తారు. అయితే ముస్లింలు వారిని వెంటాడి వేల సంఖ్యలో హతమారుస్తారు.

ఆ తరువాత హజ్రత్ ఇమామ్ మహ్‌ది (అలైహి) తన రాజ్యంలోని పట్టణాల బాగోగులను గురించి శ్రద్ధ తీసుకుంటారు. సరిహద్దుల రక్షణ కోసం అనేక సైనికదళాలను తయారుచేసి పంపుతారు. ఈ పనులన్నీ ముగిశాక ఆయన స్వయంగా ఓ పెద్ద సైనిక వాహినిని తీసుకొని కాన్‌స్టాంటినోపిల్‌పై దాడిచేయడానికి బయలుదేరుతారు. ఆవిధంగా ఆయన బయలుదేరి రోమ్ సముద్ర తీరానికి చేరుకొని విడిదిచేస్తారు.

అటు రోమ్ క్రైస్తవులు ఆమాఖ్ లేక దాబఖ్ అనే చోట గుమిగూడి యుద్ధ సన్నాహాలలో నిమగ్నులయి ఉంటారు. వారిని ఎదుర్కోవడానికి మహ్‌ది (అలైహి) పెద్ద ఎత్తున సైన్యాలను పంపుతారు. వారు క్రైస్తవులతో భయంకరంగా పోరాడుతారు. కాని సైన్యంలో మూడోవంతు సైనికులు వీరమరణం పొందుతారు. దాంతో మరో మూడో వంతు సైనికులు భయపడి పారిపోతారు. దేవుడు వారిని ఎన్నటికీ క్షమించడు. మిగిలిన మూడోవంతు సైనికులు అంటే, బనూఇస్‌హాఖ్ తెగకు చెందిన డెబ్భయివేల మంది యోధులు శత్రువులతో వీరోచితంగా పోరాడి విజయం సాధిస్తారు.

ఆ తర్వాత మహ్‌ది (అలై) బనూఇస్‌హాఖ్ తెగకు చెందిన ఆ డెబ్భయి వేల మంది యోధులను నౌకలలో ఎక్కించి కాన్‌స్టాంటినోపిల్‌పై దాడిచేయడానికి పంపిస్తారు. వారు పట్టణం సమీపానికి చేరుకొని విడిదిచేస్తారు. అయితే వారు యుద్ధం చేయడానికి ఎలాంటి ఆయుధాలు చేపట్టరు. లాఇలాహఇల్లల్లాహు అల్లాహుఅక్బర్ ( అల్లా తప్ప వేరే ఆరాధ్యుడు లేడు. అల్లా అందరికంటే గొప్పవాడు) అంటూ బిగ్గరగా నినదిస్తారు. ఈ నినాదంతో నగర రక్షణకు కట్టిన ఒక గోడ విరిగిపోతుంది. ముస్లిం యోధులు మరొకసారి అదేవిధంగా నినదిస్తారు. ఆ నినాదానికి రెండో వైపుండే గోడ విరిగిపోతుంది. ముస్లింలు మూడోసారి లాఇలాహ ఇల్లల్లాహు అల్లాహుఅక్బర్ అని నినదించగానే పట్టణంలోకి ప్రవేశించడానికి దారి సుగమం అవుతుంది. అప్పుడు ముస్లింలు పట్టణంలోకి ప్రవేశించి దాన్ని సునాయాసంగా స్వాధీనం చేసుకుంటారు. అక్కడ పెద్దఎత్తున సమరసొత్తు లభిస్తుంది.

అయితే దాన్ని యోధులకు పంచుతుండగానే దజ్జాల్ బయల్పడ్డాడన్న దుర్వార్త విన్పిస్తుంది. ఆ వార్త వినగానే ముస్లింలు సమరసొత్తును అక్కడే పడవేసి వెళ్ళిపోతారు. కాని ఈవార్త నిజం కాదని తర్వాత తెలుస్తుంది. ముస్లింసైన్యాలు ఈసారి సిరియా వైపుకు బయలుదేరుతాయి. సిరియా చేరుకోగానే దజ్జాల్ నిజంగానే బయల్పడ్డాడని తెలుస్తుంది.

## 97. ఒంటికన్ను దజ్జాల్

జెరూసలేం (బైతుల్‌మఖ్దిస్)లోని అఖ్సా మసీదు నిర్మాత సులైమాన్ ప్రవక్త (అలైహి) మరణించిన తరువాత యూదుల వైభవం క్రమేణా పతనమవుతూ చివరికి బాబిల్, అసీరియా రాజుల చేతుల్లో ఘోర పరాజయం పాలయి చెట్టుకొకరు పుట్టకొకరు అయిపోతారు. అప్పుడు



ఆ జాతిలో ప్రభవించిన దైవప్రవక్తలు వారిని ఓదార్చుతూ "ఈ అవమానం నుంచి మిమ్మల్ని కాపాడటానికి దేవుని తరఫున ఒక మసీహ్ రానున్నాడ"ని శుభవార్త విన్పిస్తుండేవారు. ఆయనే దేవుడు వాగ్దానం చేసిన మసీహ్, మసీహ మౌవూద్.

ఈ భవిష్యత్ ప్రకటనల ఆధారంగా యూదులు "ఆయన చక్రవర్తి అయిఉంటాడని, యుద్ధంచేసి తమకోసం ప్రత్యేకరాజ్యం సాధిస్తాడని, దేశదేశాలనుంచి ఇస్రాయిలీలందర్నీ తెచ్చి పాలస్తీనాలో పునరావాసం కల్పిస్తాడని, అలా తమకోసం ఓగొప్ప సామ్రాజ్యం స్థాపిస్తాడని గంపెడు ఆశలు పెట్టుకున్నారు. ఆ ఆశలతోనే వారు మసీహ్‌మౌవూద్ కోసం ఎదురుచూస్తున్నారు.

అయితే వారి ఆశలకు భిన్నంగా హజ్రత్ ఈసా (అలైహి) దేవుని తరఫున మసీహ్‌గా ఎలాంటి మందీమార్బలం, రాచరికపు అట్టహాసాలు, సైనిక బలగాలు లేకుండా అతి నిరాడంబరంగా వచ్చేటప్పటికి వారు ఆయన్ని మసీహ్‌గా గుర్తించడానికి నిరాకరించారు. పైగా ఆయన్ని హతమార్చడానికి పాల్పడ్డారు. అప్పుడు దేవుడు వారి కుట్రల నుంచి కాపాడి ఈసా మసీహ్ (అలైహి)ని సశరీరంగా పైకెత్తుకున్నాడు. వాస్తవం గ్రహించని యూదులు ఈసా (అలైహి)ని తాము శిలువపై ఎక్కించి చంపామని భావించి, తాము కలలుగంటున్న "మసీహ మౌవూద్" కోసం ఇప్పటికీ ఎదురుచూస్తున్నారు. ఆవిధంగా వారు ఎదురుచూస్తున్న మసీహ మౌవూదే మసీహ దజ్జాల్. అతనే ఒంటికన్ను దజ్జాల్.

హజ్రత్ అనస్ (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ఇలా చెప్పారు: "ప్రతి దైవప్రవక్త తన అనుచరసమాజాన్ని ఒంటికన్నువాడు, అబద్ధాలరాయుడు గురించి హెచ్చరించారు. జాగ్రత్త! ఆ దజ్జాల్ ఒంటికన్నువాడై ఉంటాడు. మీ ప్రభువు ఒంటికన్నువాడు కాదు. దజ్జాల్ కళ్ళ మధ్య కాఫిర్ (సత్యతిరస్కారి) అని రాసిఉంటుంది." (బుఖారీ, ముస్లిం)

హజ్రత్ అబూహురైరా (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ప్రవచనం: "దజ్జాల్ గురించి ఏ దైవప్రవక్తా తమ అనుచర సమాజాలకు చెప్పని ఒక విషయం నేను మీకు చెప్పనా? వాడు ఒంటికన్నువాడు. తన వెంట స్వర్గం, నరకం లాంటి రెండు వస్తువులు తీసుకొని వస్తాడు. వాడు స్వర్గం అని చెప్పేది నరకమై ఉంటుంది. (బుఖారీ, ముస్లిం)

హజ్రత్ అనస్ (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ప్రవచనం: "దజ్జాల్ మక్కా, మదీనాలు తప్ప ఇతర నగరాలన్నిటినీ తొక్కుతాడు. అంటే వాటిలోకి ప్రవేశిస్తాడు. మక్కా మదీనాలకు వెళ్ళే కొండదారులన్నిటి మీద దేవుడు తన దూతల్ని నియమిస్తాడు. వారు ఒకరి రెక్క మరొకరు పట్టుకొని వాటికి రక్షణ కల్పిస్తుంటారు. దజ్జాల్ (మదీనా దగ్గర్లోని) ఉప్పునేల మీద దిగగానే మదీనా మూడుసార్లు కంపిస్తుంది. దేవుడు మదీనాలో ఉండే అవిశ్వాసులు, కపట ముస్లింలందరినీ బయటికి తీస్తాడు." (ముస్లిం)

హజ్రత్ అనస్ (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "అస్‌ఫహాన్‌కు చెందిన డెబ్భైవేల యూదులు దజ్జాల్ వెంటపడతారు. (అంటే అతడ్ని అనుసరిస్తారు). వారి ఒంటిమీద పచ్చ దుప్పట్లు ఉంటాయి." (ముస్లిం)

హజ్రత్ నవ్వాస్ బిన్ సమ్ఆన్ (రజి) కథనం: ఒక రోజు ఉదయం దైవప్రవక్త (స) దజ్జాల్ ఉపద్రవం ఎంత భయంకరంగా, ప్రమాదకరంగా ఉంటుందో వివరించారు. అది విని మేము ఆ దజ్జాల్ ఇక్కడే ఈ ఖర్జూర పొదల్లోనే ఉన్నాడేమో అనుకున్నాం.

ఆ తర్వాత మేము దైవప్రవక్త (స) దగ్గరికి వెళ్ళినప్పుడు ఆయన మా ఆందోళన గమనించి, “ఏమయింది మీకు?” అని అడిగారు. అందుకు మేము సమాధానమిస్తూ “దైవప్రవక్తా! మీరు ప్రొద్దున దజ్జాల్ ఉపద్రవం ఎంత నీచంగా, ప్రమాదకరంగా ఉంటుందో చెప్పారు. అది విన్న తర్వాత మాకు ఆ దజ్జాల్ ఇక్కడే, ఈ ఖర్జూరపొదల్లోనే ఉన్నాడేమో ననిపించింది” అని అన్నాం. అప్పుడు దైవప్రవక్త (స) ఇలా చెప్పారు:

మీ విషయంలో దజ్జాల్ కన్నా ఇతర విషయాల గురించి నాకు ఎక్కువ భయం వేస్తోంది. దజ్జాల్ గనక నా సమక్షంలో బయటికి వస్తే మీ అవసరం లేకుండా నేనొక్కణ్ణే అతన్ని ప్రతిఘటించగలను. ఒకవేళ అతను నా మరణానంతరం బయటికి వస్తే అప్పుడు ప్రతి ఒక్కడూ తననుతాను కాపాడుకోవాలి. అప్పుడు ప్రతి ముస్లిం కొరకు దేవుడు నా స్థానంలో ఉంటాడు (అంటే ఆయనే వారిని పర్యవేక్షిస్తాడు). ఆ దజ్జాల్ యువకుడై ఉంటాడు. అతనికి ఉంగరాల జుట్టు ఉంటుంది. అతని ఒక కన్ను (ద్రాక్ష పండులాగా) పైకి ఉబికి ఉంటుంది. నేనతడ్ని అబ్దుల్‌ఉజ్జా బిన్ ఖతన్‌తో పోలుస్తున్నాను. మీలో ఎవరికైనా అతను తారసపడితే మీరతని మీద కహఫ్ సూరా ప్రారంభ సూక్తులు పఠించండి. అతను సిరియా, ఇరాక్‌ల మధ్యనున్న మార్గంలో ప్రత్యక్షమవుతాడు. కుడివైపు, ఎడమవైపు కల్లోలం రేకెత్తిస్తాడు. దైవదాసులారా! (ఆ సమయంలో) మీరు (ధర్మంలో) స్థిరంగా ఉండండి.”

“అతను ఎంత కాలం ఈ భూమ్మీద ఉంటాడు?” అని మేము అడిగాము. అందుకాయన, “నలభై రోజులుంటాడు. వాటిలో ఒక రోజు ఒక సంవత్సరమంత ఉంటుంది. మరోరోజు ఒక నెలంత ఉంటుంది. ఇంకోరోజు వారమంత ఉంటుంది. మిగతా రోజులు మన వారాల్లాగానే ఉంటాయి” అని చెప్పారు. మళ్ళీ మేము “దైవ ప్రవక్తా! ఒకరోజే ఒక సంవత్సరమంత ఉంటుంది కదా! మరి ఆ రోజు మేము ఒక దినపు (ఐదు) నమాజులు చేసుకుంటే సరిపోతుందా?” అని అడిగాం. అందుకాయన “లేదు. మీరు అంచనా ద్వారా (సంవత్సరం పొడుగునా) నమాజులు చేయాలి” అని చెప్పారు. “దైవప్రవక్తా! భూమి మీద ఆ ఉపద్రవ వేగం ఎలా ఉంటుంది?’ అని మేము మళ్ళీ అడిగాం. అందుకాయన, “గాలి వానలా ఉంటుంది. అతను (దజ్జాల్) ప్రజల దగ్గరికెళ్ళి (తనను అనుసరించమని) పిలుపునిస్తాడు. ప్రజలు అతడ్ని నమ్మి అతను చేయమన్న పనులు చేస్తారు. తర్వాత అతను ఆకాశాన్ని ఆదేశిస్తే అది వర్షం కురిపిస్తుంది. భూమిని ఆదేశిస్తే అది చెట్లు మొలిపిస్తుంది. ప్రజల దగ్గరుండే మేతమేసే జంతువులు (ఆ పచ్చిక మేసి) సాయంత్రం ఇండ్లకు తిరిగి వచ్చేటప్పటికి వాటి మూపురాలు మునుపటి కంటే ఎత్తుగా ఉంటాయి. వాటి పొదుగులు నిండుగా ఉంటాయి. మరింత విశాల మవుతాయి. తరువాత అతను మరొకళ్ళ దగ్గరికి వెళ్లి తనను విశ్వసించమని పిలుస్తాడు. కాని వారు అతడ్ని విశ్వసించటానికి నిరాకరిస్తారు. అతను తిరిగి వెళ్లిపోగానే వారికి కరువు కాటకాలొస్తాయి. వారి సంపద మొత్తం అయిపోతుంది. అతను ఏదయినా పాడుబడిన చోటు గుండా వెళ్తూ, “నీలో ఉన్న నిధుల్ని బయటికి తీయి” అంటే, తేనెటీగలు తమ రాణి ఈగ వెంటబడినట్లు భూగర్భ నిధులన్నీ అతని వెంటపడతాయి.



తర్వాత అతను నిండు యవ్వనంలో ఉన్న ఒక యువకుడ్ని పిలిచి అతని మీద కత్తితో దాడిచేసి విలుకాడి గురిలాగా అతడ్ని రెండు ముక్కలుగా నరికేస్తాడు. తర్వాత అతడ్ని పిలవగానే అతను కాంతులీనుతున్న ముఖంతో నవ్వుతూ తిరిగొస్తాడు.

(దజ్జాల్ ఇలాంటి మాయలు చేస్తున్నప్పుడే) దేవుడు మర్యమ్ కుమారుడైన మసీహ్‌ను భూమి మీదకు పంపిస్తాడు. ఆయన ఆకాశం నుండి డెమాస్కస్ తూర్పు దిక్కున తెల్ల మినారు మీద దిగుతారు. పసుపురంగు బట్టలు ధరించి ఇద్దరు దైవ దూతల రెక్కల మీద (అంటే భుజాల మీద) అరచేతులు ఉంచి దిగుతారు. ఆయన తలవంచగానే నీటిబిందువులు రాలిపడతాయి. తల పైకెత్తినప్పుడు కూడా ముత్యాల్లాంటి వెండి బిందువులు రాలిపడతాయి. ఆయన శ్వాస సెగ తగిలిన ప్రతి కాఫిర్ చనిపోతాడు. ఆయన శ్వాస తన చూపుమేరకు చేరుకుంటుంది. ఈసా (అలైహి) దజ్జాల్ కోసం వెతుకుతారు. చివరికి లుద్దా ద్వారంవద్ద అతడ్ని పట్టుకొని చంపేస్తారు. ఆ తర్వాత ఈసా (అలైహి) దేవుడు దజ్జాల్ ఉపద్రవం నుంచి సురక్షితంగా ఉంచిన వారి దగ్గరికి వెళ్తారు. వారి ముఖాలను చేత్తో స్పృశిస్తారు. స్వర్గంలో వారికి లభించబోయే అంతస్తుల గురించి శుభవార్త అందజేస్తారు. ఆ కాలంలోనే దేవుడు ‘నేను పుట్టించిన కొందరు దాసులతో పోరాడే శక్తి ఎవరికీ లేదు, కనుక నువ్వు నా ఈ దాసులను తూర్ కొండపైకి తీసుకెళ్ళి వారిని రక్షించు” అని వహీ ద్వారా ఆదేశిస్తాడు. అప్పుడు దేవుడు యాజూజ్ మాజూజ్‌లను పంపిస్తాడు. వారు ప్రతి ఎత్తయిన ప్రదేశం నుంచి క్రిందికి వేగంగా పరుగెత్తుకుంటూ వస్తారు. వారి మొదటిగుంపు తబ్రియా నది గుండా పోతుంది. పోతూపోతూ చుక్క మిగల్చకుండా అక్కడి నీళ్ళన్నీ తాగి వెళ్ళిపోతుంది. ఆ దారి గుండా చివరిగుంపు పోతూ ఇక్కడ ఇంతకు ముందెన్నడయినా నీళ్లు ఉండేవా? అంటుంది.

(ఆ కాలంలో) దైవప్రవక్త ఈసా, ఆయన అనుచరులు ముట్టడించబడి ఉంటారు. వారి పరిస్థితి ఎంత దయనీయంగా తయారవుతుందంటే ఒక ఎద్దు తల, వారికి నేటి మన వంద దీనార్లకంటే విలువైనదిగా అనిపిస్తుంది. దైవప్రవక్త ఈసా (అలైహి), ఆయన అనుచరుల పట్ల దేవుడు ప్రసన్నుడవుగాక. దేవుని వైపు మరలగానే దేవుడు యాజూజ్ మాజూజ్‌ల మెడల్లో ఒక పురుగు పుట్టిస్తాడు. దాంతో వారు హఠాత్తుగా ఒకే ప్రాణంలా అందరూ మరణిస్తారు. ఆ తర్వాత దైవప్రవక్త ఈసా, ఆయన అనుచరులు నేలమీదికి దిగివస్తారు. నేల మొత్తం జానెడు స్థలం కూడా ఖాళీలేకుండా వారి (శవాల) మాలిన్యంతో దుర్గంధ భరితంగా ఉంటుంది. అప్పుడు దైవప్రవక్త ఈసా (అలై), ఆయన అనుచరులు మళ్ళీ (ప్రార్థన కోసం) మరలుతారు. దేవుడు (వారి ప్రార్థన విని) బఖ్తీ ఒంటె మెడల వంటి పెద్దపెద్ద పక్షుల్ని పంపిస్తాడు. ఆ పక్షులు వారి శవాలను ఎత్తుకెళ్ళి దైవం తలచిన చోట పారేస్తాయి. ఆ తర్వాత దేవుడు వర్షం కురిపిస్తాడు. ఆ వర్షం ప్రతి ఇల్లు, ప్రతి గుడారం మీద కురిసి నేల మొత్తాన్ని నున్నటి రాయిలాగా లేక అద్దంలాగా శుభ్రం చేసేస్తుంది. తర్వాత భూమిని ‘నీ పండ్లను మొలకెత్తించు. నీ శుభాలను వ్యాపింపజేయి” అని ఆదేశించడం జరుగుతుంది. అప్పుడు ఒక దానిమ్మ పండుని అనేకమంది తిని దాని తోలుతో నీడ పట్టుకోగల్గుతారు. పాలలో ఎంత శుభం అవతరిస్తుందంటే పాలిచ్చే ఒక ఒంటె ఒక సంఘానికి సరిపోతుంది. ఒక ఆవు ఒక తెగకు సరిపోతుంది.

ఒక మేక ఒక కుటుంబానికి సరిపోతుంది. అదే సమయంలో దేవుడు శుభవంతమైన గాలిని పంపిస్తాడు. అది ఆ ముస్లింలకు వారి చంకల క్రిందుగా తాకుతుంది. ఆ గాలే ప్రతి విశ్వాసి, ప్రతి ముస్లిం ప్రాణం తీస్తుంది. ఆ తర్వాత లోకంలో చెడ్డవాళ్ళు మాత్రమే మిగిలిపోతారు. వారు భూమ్మీద గాడిదల్లాగా జనం ముందే స్త్రీలతో సంభోగిస్తారు. వీరి మీదే ప్రళయం విరుచుకుపడుతుంది." (ముస్లిం)

దజ్జాల్ ఒంటికన్ను యువకుడయి ఉంటాడు. దృష్టిలోపించిన అతని కుడికన్ను ద్రాక్షపండులా ఉబికొచ్చి తెల్లగా వికృతంగా ఉంటుంది. అతని శిరోజాలు రాగి రంగుతో ఉంగరాలు తిరిగుంటాయి. పైగా అతను భారీకాయంతో ఎర్రగా, పొట్టిగా, దొడ్డికాళ్ళతో ఉంటాడు. అతని రెండుకళ్ళ మధ్య నుదుటిపై "కాఫిర్" (అవిశ్వాసి) అనే పదాలు ఉంటాయి. అక్షరాస్యులు, నిరక్షరాస్యులైన ముస్లింలందరూ దాన్ని చదవగల్గుతారు.

దజ్జాల్ అసాధారణ శక్తిసామర్థ్యాలు కలవాడైఉంటాడు. అతను తనను నమ్మే, నమ్మనివారి కోసం స్వర్గనరకాలు తయారుచేస్తాడు. అతని దగ్గర నీరు, అగ్ని ఉంటాయి. నీరని భావించేది నిజంగా నీరు కాదు, అది అగ్ని. అగ్ని అని భావించేది అగ్ని కాదు, అది నీరు. అతని దగ్గర మాంసం, రొట్టెలకొండలు, మంచినీటి సెలయేరులు ఉంటాయి. యూదులు అతని శక్తిసామర్థ్యాలు చూసి అతడ్ని నాయకుడిగా చేసుకుంటారు.

ముగీరా బిన్ షొబా (రజి) కథనం: దజ్జాల్ గురించి దైవప్రవక్త (స)ను నేను అడిగినన్ని ప్రశ్నలు మరెవరూ అడిగిఉండరు. ఆయన నాతో "వాడు నిన్నేమీ చేయలేడులే" అన్నారు. అందుకు నేను, "ప్రజలు చెబుతుంటే విన్నాను. వాడి దగ్గర పర్వతమంత ఎత్తు రొట్టెలు, ఒక నీటిసెలయేరు ఉంటుందట" అన్నాను. అందుకాయన "విశ్వాసుల్ని కాపాడుకోవటం దేవునికి అంతకంటే చాలా తేలిక" అని చెప్పారు. (బుఖారీ, ముస్లిం)

దజ్జాల్ ఒక పెద్ద సైన్యంతో సిరియా, ఇరాఖ్‌ల మధ్య ఉండే ఒక మార్గం గుండా దండయాత్రల కోసం బయలుదేరుతాడు. సర్వత్రా అల్లకల్లోలం సృష్టిస్తాడు. అనేక జాతులు అతనికి లొంగిపోయి విధేయత ప్రకటిస్తాయి. అస్ఫిహాన్‌కు చెందిన డెబ్బయి వేలమంది యూదులు అతడ్ని విశ్వసించి అనుచరులైపోతారు. అతను ఊళ్ళకు ఊళ్ళను సర్వనాశనం చేస్తూ అప్రతిహతంగా ముందుకు సాగుతాడు.

ఇలా దజ్జాల్ దండయాత్ర చేస్తూ ఒక జాతి దగ్గరకు చేరుతాడు. ఆ జాతి ప్రజలతో తానే దేవుణ్ణని చెప్పి తనను విశ్వసించమని అంటాడు. వారతడ్ని విశ్వసిస్తారు. దజ్జాల్ తన దైవత్వాన్ని నిరూపించుకోవడానికి ఆకాశాన్ని వర్షం కురిపించమని ఆదేశిస్తాడు. తక్షణమే ఆకాశం నుండి వర్షం కురుస్తుంది. అతను పచ్చికబీళ్ళు, పంటపొలాలను ఉత్పత్తి చేయమని భూమిని కూడా ఆదేశిస్తాడు. వర్షంతో తడిసిన నేల నుండి చూస్తుండగానే చెట్లు మొలకెత్తి ఎదిగిపోతాయి. పశువులు కూడా పచ్చిక మేసి బాగా బలిసిపోతాయి.

దజ్జాల్ అక్కడ్నుంచి మరో జాతి దగ్గరకు పోయి తనను విశ్వసించమని చెబుతాడు. ఆ జాతిప్రజలు అతడ్ని విశ్వసించడానికి నిరాకరిస్తారు. అయితే దజ్జాల్ వారిని వారి మానాన వదిలేసి వెళ్ళిపోతాడు. అతను వెళ్ళిపోగానే ఆ జాతిప్రజలపై కష్టాలు వచ్చి



పడతాయి. వారు తీవ్రమైన కరువుకాటకాలకు గురవుతారు. వర్షాలు ఆగిపోతాయి. వారి ధనంలో చిల్లిగవ్వ కూడా మిగలదు. దారిద్ర్యం తాండవిస్తుంది.

దజ్జాల్ ముందుకు సాగుతాడు. ఒక పాడుబడ్డ ప్రదేశం మీదుగా ప్రయాణం చేస్తూ ఆ ప్రదేశాన్ని ఉద్దేశించి "నీలోని నిక్షేపాలన్నిటినీ బయటికి తియ్యి" అంటాడు. అప్పుడు నేల క్రింద ఉన్న నిక్షేపాలన్నీ బయల్పడి తేనెటీగలు తమ నాయకుని వెనకాల నడిచి నట్లు దజ్జాల్ వెనకాల నడవడం ప్రారంభిస్తాయి. ఆ తరువాత దజ్జాల్ ఒక యువకుడ్ని పిలుస్తాడు. ఆ యువకుడు దగ్గరకు రాగానే అతడ్ని ఖడ్గంతో రెండు ఖండాలుగా నరికి వాటిని దూరంగా విసిరి పడవేస్తాడు. తరువాత అతడ్ని పేరుపెట్టి పిలుస్తాడు. వెంటనే ఆ రెండు ఖండాలు కలిసిపోయి ఆ యువకుడు నవ్వుతూ అతని దగ్గరకు వస్తాడు.

ఆ తర్వాత దజ్జాల్ మదీనా సమీపానికి చేరుకుంటాడు. అప్పుడు మదీనాకు ఏడు ద్వారాలు ఉంటాయి. ప్రతి ద్వారం దగ్గర ఇద్దరు దైవదూతలు చొప్పున మొత్తం పధ్నాలుగు మంది దైవదూతలు కాపలా కాస్తుంటారు. అందువల్ల దజ్జాల్ నగరంలోకి ప్రవేశించలేడు. అక్కడ్నుంచి ఉహద్ కొండ దగ్గరకు పోయి దాని వెనుక వైపున విడిది చేస్తాడు. అదే సమయంలో మదీనాలో మూడు భూప్రకంపనాలు వస్తాయి. దాంతో నగరంలోని దుర్జను లందరూ భయాందోళనలతో బయటికి పరుగెత్తి దజ్జాల్ దగ్గరికి చేరుకుంటారు.

**వీర విశ్వాసి :** దజ్జాల్ ఉహద్ కొండ దగ్గర విడిది చేసే రోజుల్లోనే ఒక ముస్లిం దజ్జాల్ దగ్గరికి పోవడానికి ప్రయత్నిస్తాడు. కాని దజ్జాల్ సైనికులు అతడ్ని అడ్డగిస్తూ "ఎక్కడికి పోవాలనుకుంటున్నావు?" అని అడుగుతారు. దానికా విశ్వాసి "ఇటీవల బయ లెడిన (అసత్యవాది) మనిషిని కలుసుకోవడానికి వెళ్తున్నాను" అంటాడు. దజ్జాల్ సైనికులు "ఏమిటి నీవు మాప్రభువుని దేవునిగా విశ్వసించడంలేదా?"అని అడుగుతారు. దానికా విశ్వాసి "మాకు మా ప్రభువుని గుర్తించడంలో సందేహమే లేదు. (అలాంటప్పుడు మేము మీ అసత్యప్రభువుని ఎందుకు నమ్ముతాం?) అనంటాడు. ఈమాట విని వారు మండిపడ్తూ ఆ విశ్వాసిని చంపడానికి సిద్ధపడతారు. అయితే వారిలో ఒకడు చంపడానికి సిద్ధపడిన వారిని వారిస్తూ "మన ప్రభువు తన అనుమతి లేకుండా ఎవర్నీ వధించరాదని ఆదేశించ లేదా?" అనంటాడు. అప్పుడు వారు ఆ విశ్వాసిని దజ్జాల్ దగ్గరికి తీసికెళ్తారు.

దజ్జాల్‌ని చూడగానే ఆ విశ్వాసి ఎలుగెత్తి "ప్రజలారా! (అంతిమ) దైవప్రవక్త (సల్లం) తెలిపిన దజ్జాల్ ఇతనే" అంటాడు. దజ్జాల్ ఈమాట వినగానే కస్సుమంటూ "ఇతడ్ని బోర్లా పడవేయండి" అని తన మనుషులను ఆజ్ఞాపిస్తాడు. వారు వెంటనే ఆ విశ్వాసిని పట్టుకొని బోర్లా పడవేస్తారు. తర్వాత దజ్జాల్ "ఇతడ్ని చితగ్గొట్టి గాయపర్చండి" అని ఆదేశిస్తాడు. వారతడ్ని బాగా కొట్టి అతని నడుము విరగ్గొడతారు. అప్పుడు దజ్జాల్ "ఇప్పటికైనా నన్ను విశ్వసిస్తావా?" అని అడుగుతాడు. దానికా విశ్వాసి "నువ్వు అసత్య మసీహ్‌వి" అంటాడు. దజ్జాల్ తన మనుషుల్ని మళ్ళీ ఆదేశిస్తూ "రంపంతో ఇతని తల నుంచి కాళ్ళ సందుదాకా కోసి రెండు ముక్కలు చేసేయండి" అంటాడు. వారు అలాగే చేస్తారు. అప్పుడు దజ్జాల్ ఆ రెండుఖండాల మధ్యకు వచ్చి "లే. లేచి నిలబడు" అంటాడు. దాంతో ఆ రెండుఖండాలు కలసిపోయి విశ్వాసి లేచి నిలబడతాడు.

దజ్జాల్ మళ్ళీ విశ్వాసిని ఉద్దేశించి "ఇప్పుడు కూడా నన్ను విశ్వసించవా?" అని అంటాడు. దానికి విశ్వాసి "నువ్వు అసత్య దజ్జాల్ కావడంలో నాకిప్పుడు ఏమాత్రం సందేహం లేదు. ప్రజలారా! వినండి, నా తరువాత ఇతను మరెవరినీ వేధించలేడు" అని అంటాడు. దజ్జాల్ ఈమాట విని విశ్వాసిని చంపడానికి ప్రయత్నిస్తాడు. కాని చంప లేడు. చివరికి అతను విశ్వాసి కాళ్ళుచేతులు పట్టుకొని తన నరకంలో పడవేసి అగ్నిలో పడిపోయాడనుకుంటాడు. నిజానికి ఆ విశ్వాసి స్వర్గంలో ప్రవేశించాడు.

ఆ రోజుల్లోనే మరొక ముస్లిం మదీనా నుండి బయలుదేరి దజ్జాల్ దగ్గరకు వస్తాడు. అతనా కాలంలోని భూవాసులందరిలో ఎంతో శ్రేష్ఠుడై ఉంటాడు. అతను దజ్జాల్ ముందు నిలబడి "మాకు దైవప్రవక్త (సల్లం) తెలిపిన దజ్జాల్ నువ్వేనని నేను సాక్ష్యమిస్తున్నాను" అంటాడు. దజ్జాల్ ఈమాట విని ఇతరుల్ని ఉద్దేశించి "నేనితణ్ణి చంపి మళ్ళీ బ్రతికిస్తే కూడా మీరు నా గురించి అనుమానిస్తారా?" అని అడుగుతాడు. దానికి వారు లేదంటారు. అప్పుడు దజ్జాల్ ఆ ముస్లింని హతమారుస్తాడు. తరువాత మళ్ళీ బ్రతికిస్తాడు. ఆ ముస్లిం తిరిగి బ్రతికిన తరువాత "దైవసాక్షి! నీవు ముమ్మాటికీ అసత్యవాదివని నాకిప్పుడు ఇంతకు ముందుకంటే ఎక్కువ నమ్మకం కలిగింది" అంటాడు. దజ్జాల్ ఆ విశ్వాసిని మళ్ళీ చంప డానికి ప్రయత్నిస్తాడు. కాని చంపలేడు. (బుఖారి, ముస్లిం)

హజ్రత్ అబూసయీద్ ఖుద్రీ (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "దజ్జాల్ వెడలినప్పుడు విశ్వాసుల్లో ఒకతను అతని దగ్గరికి వెళ్తాడు. అక్కడ అతనికి ఆయుధాలు ధరించివున్న దజ్జాల్ భటులు తారసపడతారు. "ఎక్కడికి?" అని అడుగుతారు వారు. "(కొత్తగా) వచ్చిన అతని దగ్గరికి" అని చెబుతాడు ఆ విశ్వాసి. అందుకు వారు "నీవు మా ప్రభువుని నమ్మవా?" అని అడుగుతారు. దానికతను "వేరొకర్ని ప్రభువుగా నమ్మటానికి నమ్మక పోవటానికి మా ప్రభువు విషయంలో దాపరికాలు ఉంటే కదా!" అని సమాధానం చెబుతాడు. ఆ సమాధానం విని వారు (ఆగ్రహంతో) "అతన్ని చంపండి" అంటారు. తర్వాత తమలో తాము మాట్లాడుకుంటూ, "నా అనుమతి లేకుండా ఎవరినీ చంపవద్దని మన ప్రభువు మనల్ని ఆదేశించలేదా?" అని అనుకొని ఆ విశ్వాసిని దజ్జాల్ దగ్గరికి తీసుకు వెళ్తారు. విశ్వాసి దజ్జాల్‌ని చూడగానే, "ప్రజలారా! దైవప్రవక్త (సల్లం) చెప్పింది ఈ దజ్జాల్ గురించే" అని (ఎలుగెత్తి) చెబుతాడు. దజ్జాల్ అతన్ని బోర్లా పడేయమని ఆదేశిస్తాడు. తర్వాత అతన్ని పట్టుకొని తలను మోహాన్ని బాదమని చెబుతాడు. అతని ఆజ్ఞమేరకు ఆ విశ్వాసిని పొట్ట, వీపు సాగిపోయేలా చితకబాదటం జరుగుతుంది.

తర్వాత దజ్జాల్ "నువ్వు నన్ను నమ్ముతావా?" అని అడుగుతాడు. అందుకతను "నువ్వు అబద్ధాగ్రేసరుడివయిన మసీహ్‌వి" అనంటాడు. ఆ తర్వాత అతని తలను రంపంతో కోసి రెండు కాళ్ళు వేరయ్యేలా అతణ్ణి రెండు ఖండాలుగా నరికేయమని ఆజ్ఞాపిస్తాడు. దజ్జాల్ ఆ రెండుఖండాల మధ్య తిరుగుతాడు. తర్వాత వాటిని ఉద్దేశించి, "లే, లేచి నిలబడు" అని అంటాడు. వెంటనే ఆ విశ్వాసి లేచి నిలబడతాడు. దజ్జాల్ మళ్ళీ అతణ్ణి "నన్ను నమ్ముతావా లేదా?" అనడుగుతాడు. అందుకతను "నీ గురించి నా నమ్మకం ఇప్పుడు మరింత బలపడింది. ప్రజలారా! వీడు నా తర్వాత ఎవరి పట్లనూ



ఇలా ప్రవర్తించలేడు" అనంటాడు. అప్పుడు దజ్జాల్ అతణ్ణి పట్టుకొని కోసేయాలను కుంటాడు. కాని దేవుడు అతని మెడను రక్తనాళం మధ్య భాగాన్ని ఇత్తడిగా మారుస్తాడు. తర్వాత దజ్జాల్‌కు అతన్ని చంపటానికి మార్గమేదీ కనిపించదు. దాంతో దజ్జాల్ అతని కాళ్ళు చేతులు పట్టుకొని విసిరేస్తాడు. చూసిన జనం వాడు అతణ్ణి అగ్నిలో విసిరేశాడని అనుకుంటారు. కాని వాస్తవానికి అతణ్ణి స్వర్గంలో విసరివేయటం జరిగిఉంటుంది." ఆ తర్వాత దైవప్రవక్త (స) ఇలా అన్నారు: "ఆ వ్యక్తి దేవుని దృష్టిలో అందరికంటే గొప్ప వీరమరణం పొందినవాడుగా పరిగణించబడతాడు." (ముస్లిం, బుఖారీ)

## 98. ఈసా (అలైహి) పునరాగమనం

దజ్జాల్ తన సైన్యాలతో ఉహద్ కొండ ప్రాంతం నుండి బయలుదేరి సిరియా చేరుకుంటాడు. దజ్జాల్ రాక సంగతి తెలుసుకున్న ముస్లింలు అతణ్ణి ఎదుర్కోవడానికి డెమాస్కస్‌లో సమాయత్తమవుతారు. సైనిక పునర్వ్యవస్థీకరణ జరుగుతుంది. అది ఫజర్ నమాజువేళ. అందరూ మసీదులో బారులుతీరి నమాజు కోసం నిలబడతారు. అంతలో ఆకాశంలో ఒక వింత కన్పిస్తుంది. కనీవినీ ఎరగని వింత అది! ఆకాశం నుంచి ఈసా ఇబ్నె మర్యం (అలై) అవతరిస్తారు. రెండు పచ్చవస్త్రాలు ధరించి, ఇద్దరు దైవదూతల రెక్కల మీద చేతులు ఉంచి మసీదులోని తెల్ల మీనారు వద్ద దిగుతారు. తల క్రిందికి వాల్చినప్పుడు తల నుంచి నీటిచుక్కలు రాలుతున్నట్లు, తల పైకెత్తినప్పుడు ముత్యాల్లా (జల)బిందువులు జాలువారుతున్నట్లు కన్పిస్తుంది. (ముస్లిం)

మసీదులో ఇమామ్ నమాజు చేయించడానికి సిద్ధమవుతాడు. ఇఖామత్ చెప్పడం కూడా అయిపోతుంది. అంతలో హజ్రత్ ఈసా (అలైహి) క్రిందికి దిగుతారు. ఇమామ్ ఆయన్ని చూడగానే కాస్త వెనక్కి తగ్గి "రండి నమాజు చేయించండి" అంటారు. దానికి హజ్రత్ ఈసా (అలైహి) "ఈ (ముహమ్మద్) అనుచర సముదాయం ప్రజలే ఒకరిపై ఒకరు ఇమాములు (నాయకులు). (కనుక మీరే నమాజు చేయించండి.)" అని అంటారు. అప్పుడు ఆ ఇమామ్ గారు ముందుకు వచ్చి నమాజ్ చేయిస్తారు. (ముస్లిం)

నమాజు ముగిశాక హజ్రత్ ఈసా (అలైహి) ఆయుధాలు తీసుకొని దజ్జాల్‌ని చంపడానికి బయలుదేరుతారు. ఆయన (నగర ప్రధాన) ద్వారం తెరవమని ఆదేశిస్తారు. ద్వారం తెరవబడుతుంది. బయట దజ్జాల్ డెబ్బయివేల మంది సాయుధులయిన యూదులతో విడిదిచేసి ఉంటాడు. వాడు హజ్రత్ ఈసా (అలైహి)ను చూడగానే నీళ్ళలో వేసిన ఉప్పుగల్లులా కరిగిపోతూ భీతావహుడయి పలాయనం చిత్తగిస్తాడు.

హజ్రత్ ఈసా (అలైహి) అతణ్ణి వెంబడిస్తారు. చివరికి ఆయన (ప్రస్తుత ఇస్రాయీల్ రాజధాని టెల్‌అవివ్‌కు కొన్ని మైళ్ళ దూరంలో ఉండే) 'లుద్దా'లో తూర్పు ముఖద్వారం దగ్గర ఆ దుర్మార్గుణ్ణి హతమారుస్తారు. దాంతో దజ్జాల్ అనుచరులు చెల్లాచెదరైపోయి దాక్కోవడానికి ప్రయత్నిస్తారు. కాని వారికి ఎక్కడా చోటు దొరకదు. ప్రతి రాయి, చెట్టు, గుట్ట సయితం ముస్లిం యోధులను కేకవేసి పిలుస్తూ "ఓ ముస్లిం! ఇటు వచ్చెయ్యి. ఇక్కడ నా వెనుక ఒక యూదుడు దాక్కున్నాడు, ఇతణ్ణి చంపెయ్యి" అని అంటాయి. ఈవిధంగా దేవుడు వారిని నాశనం చేస్తాడు. (అహ్మద్, ఇబ్నెమాజ, ముస్లిం)

వేరొక ఉల్లేఖనంలో ఇలా ఉంది: “(ఆ యుద్ధంలో) యూదులు రాళ్ళు లేక చెట్ల వెనుక కూడా దాక్కుంటారు. అప్పుడు ఆ రాళ్ళు, చెట్లు, “ఓ ముస్లిం! నా వెనక ఒక యూదుడు దాక్కున్నాడు. రా.....వచ్చి ఇతడ్ని చంపెయ్యి” అని చెబుతాయి. కాని గర్ఖద్ చెట్టు మాత్రం చెప్పదు. ఎందుకంటే అది యూదుల చెట్టు. (బుఖారీ, ముస్లిం)

ఆ తరువాత హజ్రత్ ఈసా ఇబ్నె మర్యం (అలైహి) అక్కడ్నుంచి (డెమాస్కస్‌కు) తిరిగొచ్చి ప్రజలను కలుసుకుంటారు. వారి యోగక్షేమాలు విచారిస్తారు. దజ్జాల్ ఉపద్రవాల నుండి క్షేమంగా బయటపడినవారి తలలు నిమురుతారు. వారికి లభించే స్వర్గ మహా భాగ్యాలను గురించి వారికి తెలియజేస్తారు.

ఈవిధంగా హజ్రత్ ఈసా (అలైహి) ప్రజల యోగక్షేమాలు విచారిస్తుండగానే విశ్వ ప్రభువు నుండి ఆయనకు మరో ఉపద్రవం గురించి దివ్యావిష్కృతి వస్తుంది. “నా ఈ దాసులలో వారితో పోరాడే అంతటి శక్తి లేదు. కనుక నేను వీరిని ఇక్కడ్నుంచి తీసేయ దలచుకున్నాను. కనుక నీవు నాఈ దాసులను తీసుకొని తూర్ పర్వతం పైకెళ్ళి రక్షణ కల్పించు.” ఈ దైవాజ్ఞ వెలువడగానే హజ్రత్ ఈసా (అలైహి) ముస్లింలందర్నీ వెంట బెట్టుకొని తూర్ పర్వతానికి చేరుకుంటారు.

## యాజూజ్, మాజూజ్‌ల దాడులు

ఆ రెండవ ఉపద్రవమే యాజూజ్, మాజూజ్‌ల ఉపద్రవం. (రష్యా, ఉత్తర చైనా ప్రాంతాల నుంచి) యాజూజ్, మాజూజ్ అనే కొన్ని ఆటవిక జాతులు కూడా బయలు దేరి ప్రపంచంలో పెద్ద ఎత్తున అల్లకల్లోలం సృష్టిస్తాయి. అవి ఎల్లడెల్లడలా వినాశం, విధ్వంహాలు సృష్టిస్తూ స్వైరవిహారం చేస్తాయి. వాటిని ఎవరూ అడ్డుకోలేరు.

“ఆ రోజు మేము జనాన్ని (స్వేచ్ఛగా) వదలిపెడ్తాము. వారు (సముద్ర కెరటాల్లా) ఒకరిమీద ఒకరు పడిపోతారు.” (ఖుర్ఆన్–18:99)

“మేము ఏఊరిని నాశనంచేసినా ఆ ఊరిప్రజలు తిరిగి కోలుకోవడం అనేదే జరగదు. చివరికి యాజూజ్, మాజూజ్ (జాతు)లను వదిలేయడం జరుగుతుంది. వారు ప్రతి గుట్టా, మిట్టా నుండి వెలువడి (ఇతరజాతులపై) విరుచుకుపడతారు.” (ఖుర్ఆన్–21:95,96)

పూర్వం యాజూజ్ (తాతారీ), మాజూజ్ (మంగోలీ) జాతుల్ని నిరోధించడానికి జుల్ఖర్‌నైన్ కట్టించిన గోడ నల్లసముద్రానికి, కాస్పియన్ సముద్రానికి మధ్య ఉన్న రష్యా భూభాగంలో ఉందని తెలుస్తోంది. ప్రళయానికి సమీపకాలంలో హజ్రత్ ఈసా(అలై) పునరాగమనం తర్వాత ఈ జాతులు దాన్ని ఛేదించి ప్రపంచంలో వినాశం, విధ్వంసాలు సృష్టిస్తాయి. వాటిని నిలువరించడం ఎవరికీ సాధ్యంకాదు. వారు లక్షలసంఖ్యలో ఉంటారు. వారిలో ఓ సైనికపటాలం ముందుకు సాగుతూ త్బ్రియా అనే చెరువు దగ్గర ఆగి దాని నీరంతా తాగేస్తుంది. దాని వెనుక వచ్చే మరో పటాలం సైనికులు నీరులేని ఆ చెరువును చూసి “ఇందులో లోగడ తప్పకుండా నీరు ఉండి ఉంటుంది” అని చెప్పుకుంటారు.

ఆ తర్వాత ఆ సైనికులు బైతుల్‌మఖ్దిస్‌లోని ఖమర్ కొండ దగ్గరకు చేరుకుంటారు. అక్కడ విడిదిచేసి “మనం భూవాసులను చంపేశాం. ఇప్పుడిక ఆకాశవాసుల్ని చంపేద్దాం” అని చెప్పుకుంటారు. ఈ నిర్ణయం తీసుకోగానే అందరూ ధనస్సులు ఎక్కుపెట్టి ఆకాశం వైపుకు బాణాలు వదులుతారు. అప్పుడు దేవుడు వారి బాణాలను రక్తంలో ముంచి వెనక్కి పంపుతాడు. రక్తసిక్తమయి తిరిగొచ్చిన తమ బాణాలు చూసి వారు మురిసిపోతూ, తాము భూమిపైనే గాకుండా ఆకాశంలో కూడా విజయం సాధించగలిగామని భావిస్తారు.



ఈవిధంగా వారు గుట్టలు, మిట్టలు దాటుతూ ఉరుకులు, పరుగులు పెడ్తూ, సర్వత్రా విధ్వంసం సృష్టిస్తూ ముందుకు సాగుతారు. ముస్లింలు వారి దౌర్జన్యధాటికి నిలువలేక గగ్గోలు పెడతారు. హజ్రత్ ఈసా (అలైహి) సైతం వారి ముందు నిలువలేక ముస్లింలను వెంట బెట్టుకొని ఇంతకు ముందే తూర్‌పర్వతం ఎక్కి రక్షణ పొందుతారు. అయితే వారిలా తూర్‌కొండ మీద ఎన్నాళ్ళు ఉండవలసి వస్తుందో కాని, తీవ్రమైన ఆకలి, ఆందోళనలతో సతమతమవుతుంటారు. అప్పుడు హజ్రత్ ఈసా (అలైహి) యాజూజ్, మాజూజ్‌ల వినాశం కోసం దైవాన్ని ప్రార్థిస్తారు. దాంతో ఆ ఆటవిక జాతులు దైవాగ్రహానికి గురయి, దేహాలలో పురుగులు పడి గుట్టలు గుట్టలుగా పడిచస్తారు.

వారి పీడా విరగడైపోయిన తర్వాత ఈసా (అలై), ఆయన అనుచరులు కొండ దిగి వస్తారు. అయితే నేలమీద యాజూజ్, మాజూజ్‌ల శవాలు కుళ్ళిపోయి దుర్వాసన నలు దిక్కులా వ్యాపిస్తుంది. అంచేత ఈసా (అలై), ఆయన అనుచరులు దైవాన్ని ప్రార్థిస్తూ “దేవా! ఈశవాల కొవ్వు, దుర్వాసనల నుండి మమ్మల్ని కాపాడు” అని మొరపెట్టుకుంటారు. దేవుడు వారి మొరాలకించి వాటి నిర్మూలనకోసం రాకాసిపక్షుల్ని పంపుతాడు. అవి ఈ శవాలను పంజాలతో పట్టుకెళ్ళి దేవుడు ఆదేశించిన చోట పారేస్తాయి. ఆతర్వాత దేవుడు భారీవర్షం కురిపిస్తాడు. దాంతో భూమి పరిశుభ్రమై పోతుంది. (సంక్షిప్తం- బుఖారి, ముస్లిం.)

యాజూజ్, మాజూజ్‌ల పీడా కూడా విరగడైపోయాక ప్రపంచమంతటా శాంతియుత వాతావరణం నెలకొంటుంది. హజ్రత్ ఈసా (అలైహి), ఆయన అనుచరులు సుఖసంతోషాలతో జీవితం గడుపుతారు. దేవుడు వారిని ఎంతగానో కరుణిస్తాడు. ఆయన అనుగ్రహంతో భూమి సస్యశామలమవుతుంది. ప్రతి చోటా విపరీత మైన పండ్లచెట్లు పుట్టుకొస్తాయి. అవి పరిమాణంలో ఎంతోపెద్దగా ఉంటాయి. ఒక్క దానిమ్మకాయనే అనేకమంది తింటారు. దాని తొక్కను పెద్ద గొడుగులా చేస్తారు. దేవుడు పాలలో కూడా ఎంతో శుభం కలిగిస్తాడు. ఒక ఒంటె నుండి తీసే పాలను అనేక మంది కడుపునిండా తాగుతారు. ఒక ఆవు నుండి పితికే పాలను ఓ పెద్ద తెగ తాగుతుంది. ఒక మేక నుండి తీసే పాలను ఒక చిన్న తెగ తాగుతుంది. ఈవిధంగా దేవుడు ఆహార పదార్థాలన్నిటిలోనూ శుభం కలిగిస్తాడు.

హజ్రత్ ఈసా (అలై) కాలంలో సర్వత్రా శాంతీ శుభాలు వెల్లివిరుస్తాయి. అందరూ సుఖసంతోషాలతో మనుగడ సాగిస్తారు. హజ్రత్ ఈసా (అలై) పునరాగమనం, ఆయన కార్య కలాపాలు చూసి లోకంలోని క్రైస్తవులంతా ఆయన్ని విశ్వసిస్తారు. ఆయన శిలువను విరగ్గొట్టి వారి అంధవిశ్వాసాలకు శాశ్వతంగా తెర దించుతారు. సూకరసంహారం కూడా చేస్తారు. తద్వారా ఆయన పంది మాంసం నిషిద్ధమని ప్రకటిస్తారు. ఈవిధంగా క్రైస్తవులంతా ఇస్లాం స్వీకరించి ముస్లింలైపోతారు. ఇతర మతస్థులు కూడా ఏదో విధంగా ముస్లింలై పోతారు. ప్రపంచమంతటా ఒక్క ఇస్లాం మాత్రమే రాజ్యమేలుతుంది.

ఈ విషయాలను గురించి అంతిమ దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రవచించారు: "హజ్రత్ ఈసా (అలైహి) పునరాగమనంతో క్రైస్తవుల అపోహలన్నీ దూరమయి పోతాయి. వారికి వాస్తవం తెలిసిపోతుంది. హజ్రత్ ఈసా (అలై) శిలువను విరగ్గొడతారు. పందిని చంపుతారు. (అంటే ఈసా శిలువపై చనిపోయారన్న వారి అంధవిశ్వాసాన్ని, త్రిత్వాన్ని అంతమొందించి ఇతర అనేక మూఢనమ్మకాలతో పాటు, తమంతటతాము ధర్మసమ్మతం చేసుకున్న పందిమాంసాన్ని సైతం నిషేధిస్తారు.) దుర్జనులు నాశనమైపోగా మిగిలిపోయే ముస్లింలతో భూమి నిండిపోతుంది. ప్రపంచంలోని ప్రజలందరి ధర్మం ఒకటే అవుతుంది. మానవులు అల్లాహ్‌ను తప్ప మరెవరినీ ఆరాధించడం జరగదు." (అహ్మద్, ఇబ్నెమాజ)

హజ్రత్ ఈసా (అలైహి) కాలంలో ప్రపంచమంతటా శాంతి, సౌభ్రాతృత్వం, నీతి, న్యాయాలు నెలకొంటాయి. ఏ ఇద్దరు వ్యక్తుల మధ్య కూడా శత్రుభావం ఉండదు. ధన సంపత్తి విపరీతంగా పెరిగిపోతుంది. చివరికి దానం స్వీకరించే ఒక్క మనిషీ కన్పించడు. శిస్తులు, పన్నులు రద్దయిపోతాయి. ఈవిధంగా హజ్రత్ ఈసా (అలైహి) ప్రపంచంలో ఏడేళ్ళు (ఒక ఉల్లేఖనం ప్రకారం నలభై ఏళ్ళు) జీవించి, ఆ తరువాత (సహజ మరణం ద్వారా) తన ప్రభువు సన్నిధికి చేరుకుంటారు. మరికొన్ని ఉల్లేఖనాల ప్రకారం ఆయన వివాహం చేసుకొని సంతానం కూడా కంటారు. ఆయన భౌతిక కాయాన్ని మహాప్రవక్త (స) సమాధి సమీపంలో ఖననం చేయడం జరుగుతుంది. (ముస్లిం, మిష్కాత్)

## 99. పతనపుటంచుల్లో ప్రపంచం

హజ్రత్ ఈసా (అలై) తదనంతరం ప్రపంచ పరిస్థితులు అతివేగంగా మారిపోతాయి. నీతి, నిజాయితీలకు కాలం చెల్లుతుంది. పాపాలు ఎక్కువైపోతాయి. దైవధర్మం క్రమంగా క్షీణించిపోతుంది. అప్పటి ముస్లింలకు నమాజ్, రోజా, అంటే కూడా ఏమిటో తెలియదు. కాకపోతే ఆనాటి వృద్ధులు గతాన్ని గుర్తుచేసుకుంటూ "మా తాతముత్తాతలు 'లాఇలాహ ఇల్లల్లాహ్' (అల్లాహ్ తప్ప మరే దేవుడు లేడు) అనే మంత్రం పఠిస్తుంటే విన్నాం. దాన్నే మేము పఠిస్తున్నాం. అంతకుమించి మరేమీ తెలియదు మాకు" అని అంటారు.

దైవప్రవక్త (స) తెలిపిన ప్రళయసూచనల్లో "పొగ" గురించిన విషయం కూడా ఉంది. దాన్ని గురించి ఖుర్ఆన్‌లో "సరే, ఆకాశం నిండా పొగ కమ్ముకునే రోజు కోసం ఎదురు చూడండి. అది ప్రజల మీద ఆవరించే దుర్భర యాతన" అని ఉంది. (44:11)

హజ్రత్ అబ్దుల్లా బిన్ మస్ఊద్ (రజి) ఖుర్ఆన్‌లో వచ్చిన పొగ గురించి "ఇది ప్రళయ సూచనగా చెప్పిన పొగ కాదని, మక్కాలో కరువు వచ్చినప్పుడు ప్రజలు ఆకాశం వైపు చూస్తే ఆకలితీవ్రత వల్ల వారికి పొగ కన్పించేద'ని అభిప్రాయపడ్డారు. కాని హజ్రత్ హుజైఫా (రజి) ఈ అభిప్రాయంతో ఏకీభవించలేదు. అది ప్రళయసూచనగా బహిర్గతమయ్యే పొగే అని చెబుతూ ఆయన దైవప్రవక్త (స) నోట విన్న ఈ ప్రవచనాన్ని పేర్కొన్నారు:

"అది తూర్పు నుండి పడమర వరకు వ్యాపించే సువిశాలమైన పొగ. అది నలభై రోజులదాకా ఉంటుంది. దాని వల్ల విశ్వాసులకు జలుబు చేసిన బాధ మాత్రమే కలుగుతుంది. అవిశ్వాసులు ఆ పొగ ప్రభావంతో స్పృహ తప్పుతారు." (మర్ఘాబ్)



"ఇక వారు దేనికోసం ఎదురు చూస్తున్నారు? వారి ముందు దైవదూత ప్రత్యక్షం కావాలని చూస్తున్నారా? లేక నీ ప్రభువు సూచనలు కొన్ని బహిర్గతమయ్యే సమయం కోసం నిరీక్షిస్తున్నారా? నీ ప్రభువు సూచనలు కొన్ని బహిర్గతమయ్యే రోజు, అసలు సత్యాన్నే విశ్వసించనివాడు దాన్ని విశ్వసించినా ఆ విశ్వాసం వల్ల అతనికి ఎలాంటి ప్రయోజనం ఉండదు. అలాగే సత్యాన్ని విశ్వసించి ఎలాంటి సత్కార్యం చేయనివాడికి సైతం అతని విశ్వాసం ఆరోజు ఎలాంటి ప్రయోజనం చేకూర్చదు." (ఖుర్ఆన్-6:158)

షాహ్ అబ్దుల్ ఖాదర్ (రహ్మ) వ్యాఖ్యానం ప్రకారం ఇక్కడ సూచనలంటే ప్రళయ సూచనలని అర్థం. ఆ సూచనల్లో ఒకటి- ఓరోజు ఉన్నట్లుండి సుదీర్ఘ (కాళ)రాత్రి గడచిన తరువాత సూర్యుడు పడమటిదిక్కు నుంచి ఉదయిస్తాడు. అప్పుడు అవిశ్వాసులు సత్యాన్ని విశ్వసించినా ప్రయోజనం ఉండదు. అదేవిధంగా సత్యాన్ని విశ్వసించి, తదనుగుణంగా సత్కర్మలు ఆచరించనివారు ఆరోజు ఎన్ని సత్కార్యాలు చేసినా లాభంలేదు. సమయం మించిపోయింది. క్షమాద్వారం మూయబడింది. పాపుల పశ్చాత్తాపం స్వీకరించబడదు.

మౌలానా అష్రఫ్ అలి థానవి (రహ్మాలై)గారి 'ఖియామత్ నామా' పుస్తకం ప్రకారం ఆ రాత్రి ఎంతో సుదీర్ఘంగా ఉంటుంది. బాటసారులు ఎంత నడిచినా సూర్యోదయం కాకపోవడంతో ఆందోళన చెందుతారు. పడుకున్న పిల్లలు సుదీర్ఘ రాత్రితో విసిగిపోతారు. పశువులు మేత కోసం అడవులకు పోవడానికి అరుస్తాయి. అయినా సూర్యుడు ఉదయించడు. ప్రజలు కంగారుపడుతూ లేచి సుదీర్ఘ ప్రార్థనలు చేస్తూ తమ పాపాలను క్షమించమని దైవాన్ని మొరపెట్టుకుంటారు. ఆ కాళరాత్రి మూడు నాలుగు రాత్రులంతా సుదీర్ఘంగా ఉంటుంది. చివరికి సూర్యుడు బలహీన కాంతితో మినుకు మినుకుమంటూ పడమర నుంచి ఉదయిస్తాడు. అప్పుడు సూర్యుని కాంతి గ్రహణం పట్టిన చంద్రుని కాంతిలా మసక మసకగా ఉంటుంది. (ముస్లిం)

హజ్రత్ సఫ్వాన్ బిన్‌ఉసాల్ (రజి) చెప్పిన ప్రవక్తప్రవచనం ప్రకారం దేవుడు పశ్చిమ దిక్కున తౌబా (పశ్చాత్తాపం)కు సంబంధించిన ఒక తలుపు నిర్మించాడు. అది డెబ్బయి ఏళ్ళు ప్రయాణం చేస్తే ఎంత దూరం అవుతుందో అంత విశాలంగా (పొడవుగా, వెడల్పుగా) ఉంటుంది. ఆ తలుపు సూర్యుడు పడమర నుంచి ఉదయించనంత వరకు మూసివేయ బడదు. (పడమర నుంచి ఉదయించగానే అది మూయబడుతుంది. అంటే ఆ తలుపు మూయబడగానే ఇక ఎవరి క్షమాపణ కూడా స్వీకరించడం జరగదన్నమాట.)

### మాట్లాడే జంతువు

"మావాగ్దానం నెరవేరే సమయం ఆసన్నమైనప్పుడు మేము వారి కోసం భూమి నుండి ఒక (వింత) జంతువుని బయటికి తీస్తాము. అది (దేవుని ప్రతినిధిగా) వారితో మాట్లాడుతూ "ప్రజలు మా సూక్తులు విశ్వ సించేవారు కాదు" అంటుంది." (ఖుర్ఆన్-27:82)

లోకంలో పాపాలు మితిమీరుతాయి. పుణ్యాత్ములు అంతరించిపోతారు. ప్రజల్లో మంచీచెడుల విచక్షణాజ్ఞానం నశిస్తుంది. అప్పుడు దేవుడు ఈ వింత జంతువుని పంపిస్తాడు. అది ప్రజలతో మాట్లాడుతూ "ప్రళయదినం గురించిన దేవుని సూక్తులు మీరు నమ్మేవారు

కాదుగా! ఇప్పుడు చూడండి, అది వేగంగా ముంచుకొస్తోంది'' అని అంటుంది.

షాహ్ అబ్దుల్ ఖాదర్ (రహ్మలై) గారి వ్యాఖ్యానం ప్రకారం ప్రళయానికి ముందు మక్కాలోని సఫాకొండ పగిలి అందులో నుంచి ఒక వింతజంతువు వెలువడుతుంది. అది ప్రజలతో మాట్లాడుతూ, ప్రళయం దగ్గరకు వచ్చిందని చెబుతుంది. అది ప్రజలలో నిజమైన విశ్వాసులెవరో, అవిశ్వాసాన్ని దాచిన పగటి వేషధారులెవరో సూచిస్తుంది.

మౌలానా అష్రఫ్ అలి థానవి (రహ్మలై)గారి 'ఖియామత్ నామా' పుస్తకంలో కూడా దీని ప్రస్తావన ఉంది. ఆ పుస్తకం ప్రకారం సూర్యుడు పశ్చిమ దిక్కున ఉదయించి, ఓ సుదీర్ఘ రాత్రి గడచిపోయి తిరిగి సూర్యుడు వెనక్కి వెళ్ళి అస్తమించి, యధాప్రకారం మళ్ళీ తూర్పు నుంచే ఉదయించడం ప్రారంభిస్తాడు.

ఆ తర్వాత మక్కాలోని సఫాకొండ భూకంపంవచ్చి పగిలిపోతుంది. వెంటనే అందులో నుంచి ఓ విచిత్ర జంతువు బయల్పడుతుంది. దాని ముఖం మనిషి ముఖం లాగానే ఉంటుంది. అయితే కాళ్ళు ఒంటెకాళ్ళులా, మెడ గుర్రపుమెడలా, తోక ఆవుతోకలా, గిట్టెలు జింకగిట్టెల్లా, కొమ్ములు పశువుకొమ్ముల్లా, చేతులు కోతిచేతుల్లా ఉంటాయి.

ఆ జంతువు ప్రజలతో బాగా మాట్లాడుతుంది. దాని చేతిలో మూసా ప్రవక్త (అలైహి) కర్ర ఉంటుంది. రెండవ చేతిలో సులైమాన్ ప్రవక్త (అలైహి) ఉంగరం ఉంటుంది. అది మెరుపు వేగంతో యావత్తు దేశాలు పర్యటిస్తుంది. వెతికేవారెవరూ దాన్ని వెతకలేరు; పారిపోయే వారెవరూ దాన్నుండి పారిపోలేరు.

ఆ వింతజంతువు మానవులందరి శరీరాలపై ఒక గుర్తు పెడ్తుంది. అది విశ్వాసుల నుదుళ్ళపై మూసా ప్రవక్త (అలైహి) కర్రతో ఓ గీత గీస్తుంది. ఆ గీత వల్ల వారి ముఖాలు తేజస్సుతో వెలిగిపోతూ హుందాతనాలు ఉట్టిపడతాయి. అలాగే ఆజంతువు అవిశ్వాసుల ముక్కులు లేదా మెడల మీద సులైమాన్ ప్రవక్త (అలైహి) ఉంగరంతో ముద్రలు వేస్తుంది. ఆ ముద్రలవల్ల వారిముఖాలు నల్లబడిపోతాయి. (ఈవిధంగా అది విశ్వాసుల్ని, అవిశ్వాసుల్ని వేరుచేస్తుంది.) ఈ పనులన్నీ ముగిశాక ఆ వింత జంతువు మాయమవుతుంది.

ఫత్హుల్‌బారీలో ఉల్లేఖించబడిన ఒక హదీసు ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఇలా తెలియజేశారు: ''సూర్యుడు పశ్చిమ దిక్కున ఉదయించిన తరువాత మానవులు ప్రపంచంలో మరో 120 సంవత్సరాలు జీవిస్తారు. ఆ తరువాత ప్రళయం వస్తుంది.''

## ప్రపంచం అంత్యదశ

ప్రపంచం అంత్యదశకు చేరుకుంటుంది. పాపాలు మరిన్ని ఎక్కువయి పోతాయి. నీతినియమాలు పూర్తిగా అడుగంటి పోతాయి. ధర్మం మంటకలసి పోతుంది. అనేక భూకంపాలు వస్తాయి. ఆకాశం నుండి రాళ్ళ వర్షం కురుస్తుంది. పూసలదండ తెగి పూసలు నిరంతరాయంగా క్రింద పడిపోయినట్లు ప్రకృతి వైపరీత్యాల రూపంలో అనేక విపత్తులు ఒకదాని తరువాత ఒకటి వరుసగా వచ్చిపడతాయి.

"మేము ప్రళయదినానికి పూర్వం ప్రతి పట్టణాన్ని, ప్రతి జనపదాన్ని సర్వనాశనం చేయడమో లేక కఠినంగా శిక్షించడమో చేస్తాము." (ఖుర్ఆన్–17:58)



ఒక హదీసులో మూడు ప్రాంతాలలో ప్రజలు భూమిలోకి దిగబడిపోతారని ఉంది. ఒకటి- తూర్పు ప్రాంతంలో, రెండు- పశ్చిమ ప్రాంతంలో, మూడు- అరేబియా ద్వీపంలో. వేరొక హదీసులో ముఖాలను వికృతపరచే ప్రమాదం కూడా వస్తుందని ఉంది.

ముస్లిం ప్రకారం ప్రళయం పరమదుర్మార్గుల మీద వచ్చి పడుతుంది. మరొక ఉల్లేఖనంలో ప్రపంచంలో దేవుని పేరు స్మరించబడుతున్నంత కాలం ప్రళయం రాదని ఉంది. చివరికి దేవుని పేరు స్మరించబడని దుర్దినాలు కూడా దాపురిస్తాయి.

మౌలానా అష్రఫ్‌అలి థానవీ గారి 'ఖియామత్‌నామా' ప్రకారం దేవుని పేరు స్మరించ బడని రోజుల్లోనే సిరియాలో శాంతియుత వాతావరణం ఉంటుంది. ఆ దేశంలో ధాన్యం చాలా చౌకగా ఉంటుంది. అందువల్ల వర్తకులు, ఇతర వృత్తులవారు, పెట్టుబడిదారులు- ఇలా అందరూ తమ ఇండ్లలోని వస్తువులన్నిటినీ తీసుకొని సిరియాకు వెళ్ళిపోతారు. ఇతర దేశాలకు పోయిఉన్నవారు కూడా సిరియా వెళ్ళి స్థిరపడిపోతారు. ఆ తరువాత కొన్నాళ్ళకే ఓ పెద్ద అగ్నిమంట బయల్పడి ఇతర ప్రాంతాలలోని ప్రజలను తోలుతూ వారిని సిరియా చేర్చుతుంది. ఈ పని ముగిసిన తరువాత అది అంతర్ధానమవుతుంది.

ముస్లిం గ్రంథంలోని ఒక ఉల్లేఖనం ప్రకారం ఒక భయంకరమైన సుడిగాలి వచ్చి ప్రజలను ఎత్తి సముద్రంలో విసిరేస్తుంది.

హాఫిజ్ ఇబ్నెహజర్ 'ఫత్‌హుల్‌బారీ'లో పేర్కొన్న ఒక ఉల్లేఖనం ప్రకారం ''ఒక స్త్రీ ఓ పురుషసమూహం దగ్గర్నుంచి పోతుంది. అప్పుడా గుంపులో నుంచి ఒకడు ఆ స్త్రీ దగ్గరికి వస్తాడు. వచ్చి పశువుతోక పైకెత్తి నట్లు అతనామె అంగవస్త్రం పైకెత్తి (అందరూ చూస్తుండగానే) వ్యభిచరిస్తాడు. ఆ గుంపులోనే మరొకతను (ఈ అశ్లీల చేష్ట చూడలేక) 'నువ్వీ పని ఆ గోడ వెనక్కి వెళ్ళి చేస్తే బాగుండేది' అంటాడు. అతనా గుంపులో మీలో అబూబకర్, ఉమర్ (రజి)లు ఎలాంటివారో అలాంటి (పుణ్యాత్ముడైన) మనిషి.''

దైవప్రవక్త (స) ప్రవచనం: ''లాత్, ఉజ్జాల పూజ జరగనంతవరకు రేయింబవళ్ళు అంతంకావు.'' (ఇలా అరేబియాలో విగ్రహారాధన ప్రబలిపోతుంది.)- (హదీస్)

మిష్కాత్ గ్రంథంలో హజ్రత్ అబ్దుల్లా బిన్ అమ్ర్ (రజి) ఉల్లేఖనం ప్రకారం సిరియా దేశంలో ఒక విధమైన చల్లటి గాలి వీస్తుంది. దాంతో విశ్వాసులందరూ చనిపోతారు. పుడమిపై హృదయంలో ఇస్లాం పట్ల అణుమాత్రం విశ్వాసం ఉన్న మనిషి కూడా ఆ చల్లటి గాలికి చనిపోకుండా ఉండలేడు. చివరికి మీలో ఎవరైనా కొండగుహలో దూరి కూర్చున్నా సరే, ఆ గాలి అక్కడికి కూడా చేరి అతని ప్రాణం తీసేస్తుంది.

ఆ తరువాత పరమ దుర్మార్గులు మాత్రమే ప్రపంచంలో మిగిలిపోతారు. వారు తేలికపాటి పక్షులు ఎగిరినట్లు వేగంగా చెడుల మీదికి ఎగిరిపడతారు. వారు రక్తపాతం జరపడంలో, ప్రాణాలు తీయడంలో క్రూరజంతువుల్లాంటి గుణం కలవారై ఉంటారు. వారు మంచిని మంచిగా, చెడును చెడుగా భావించరు. షైతాన్ వారి పరిస్థితి చూసి మానవరూపంలో వారి దగ్గరకొచ్చి ''మీకు సిగ్గులేదా (మీ తాతముత్తాతల మతం వదిలేశారు)?'' అనంటాడు. దానికి వారు ''ఇప్పుడు మేము ఏం చేయాలో నువ్వే చెప్పు''

అంటారు. అప్పుడు షైతాన్ వారికి విగ్రహపూజ గురించి నూరిపోస్తాడు. దాంతో వారు అదే పరిస్థితిలో ఉండిపోతారు. (అంటే విగ్రహాలను పూజిస్తూ, హింసాదౌర్జన్యాలు జరుపుతూ, అశ్లీలచేష్టల్లో మునిగితేలుతూ పశువుల్లా ఉంటారన్న మాట.) వారికి ఉపాధి మాత్రం పుష్కలంగా లభిస్తుంది; సుఖవంతమైన జీవితం గడుపుతారు. ఆ తరువాత కొన్నాళ్ళకు హఠాత్తుగా ప్రళయం విరుచుకు పడుతుంది. (హదీస్)

## 100. ప్రళయ బీభత్సం

"వారు నిన్ను ప్రళయం ఎప్పుడు సంభవిస్తుందని అడుగుతున్నారు. వారికిలా చెప్పు: "దాని సంగతి నా ప్రభువుకు మాత్రమే తెలుసు. దాన్ని దాని నిర్ణీత సమయానికి ఆయనే బహిర్గతం చేస్తాడు. అది యావత్తు భూమ్యాకాశాల్లో (గుండెలను అదరగొట్టే) భయంకర దినం. అది మీపై హఠాత్తుగా విరుచుకుపడుతుంది". (ఖుర్ఆన్-7:187)

"ఇది పూర్వం వచ్చిన హెచ్చరికల్లోని ఒక హెచ్చరిక. రానున్న ఘడియ అతి సమీపంలోనే ఉంది. దేవుడు తప్ప మరెవరూ దాన్ని ఆపలేరు. వీటిని గురించేనా మీరు ఆశ్చర్యపోతున్నారు! (పైగా) నవ్వుతున్నారా! (సత్యతిరస్కారంవల్ల సంభవించే దుష్పరిణామాలు తలచుకొని) మీరు ఏడ్వడం లేదే!! అదీగాక అల్లరిచేసి వీటిని దాటవేయజూస్తున్నారా? (ఇప్పటికైనా) దేవుని ముందు సాష్టాంగపడండి; ఆయన్నే ఆరాధించండి." (ఖుర్ఆన్-53:56-62)

దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "అన్ని రోజుల కంటే శుక్రవారం ఎంతో శ్రేష్ఠమైన రోజు. శుక్రవారంరోజు హజ్రత్ ఆదం (అలైహి) సృజించబడ్డారు. శుక్రవారంరోజే ఆయన్ని స్వర్గంలో ప్రవేశింపజేయడం జరిగింది. శుక్రవారంరోజే ఆయన స్వర్గం నుండి తీసివేయ బడ్డారు. శుక్రవారంనాడే ప్రళయం వస్తుంది." (ముస్లిం)

అందుకే దైవదూతలు, భూమ్యాకాశాలు, సముద్రాలు, పర్వతాలు సమస్తం శుక్రవారం వచ్చిదంటే చాలు, ప్రళయం ఎక్కడ వచ్చిపడుతుందోనని వణికిపోతాయి. (మిష్కాత్)

కొన్ని హదీసుల్ని బట్టి, దైవదూత ఇస్రాఫీల్ (అలైహి) శంఖం నోటి దగ్గర పెట్టుకొని, ఒక చేతిని చెవిమీద ఉంచి, కొంచెం ముందుకు వంగి, దైవసింహాసనం వైపు చూస్తూ శంఖం పూరించడానికి ఎప్పుడాజ్ఞవుతుందా అని తీవ్రంగా నిరీక్షిస్తున్నారని తెలుస్తోంది. దైవాజ్ఞ కాగానే ఆయన శంఖం పూరిస్తారు.

ప్రజలు ప్రాపంచిక వ్యామోహంలో పూర్తిగా మునిగిపోయి వివిధ చెడులలో కూరుకు పోయిఉన్నపుడు హఠాత్తుగా ప్రళయం వచ్చిపడుతుంది. ముస్లిం గ్రంథంలోని ఒక హదీసు ప్రకారం ఇద్దరి మధ్య వ్యాపారవ్యవహారం జరుగుతుంది. వ్యాపారి బట్ట తీసి కొనుగోలు దారునికి చూపి స్తుంటాడు. బేరం కుదిరి బట్ట మడతపెట్టక ముందే ప్రళయం వస్తుంది. ఒకతను ఒంటె నుండి పాలుపితికి తీసికెళ్తుంటాడు. ఆ పాలను ఇంకా తాగక ముందే ప్రళయం వస్తుంది. మరొకతను నీళ్ళతొట్టిని అలుకుతుంటాడు. అతను తన పశువులకు నీళ్ళు తాగించను కూడా లేడు, ప్రళయం వస్తుంది. వేరొకతను భోజనం చేయడానికి కూర్చుని అన్నంముద్ద నోటి దగ్గరికి తీసికెళ్తాడు. కాని నోట్లో పెట్టుకోకముందే ప్రళయం వచ్చి పడుతుంది.



**మొదటిసారి శంఖారావం** విన్పించగానే జనం తీవ్రమైన భయాందోళనలతో మెడలు ఒక వైపుకువంచి కళ్ళుతేలేసి చూస్తారు. చెవులు చిల్లులుపడతాయి. గుండెలు దడదడ లాడతాయి. ప్రతిమనిషీ భీతావహంతో తన ఆప్తుల్ని, రక్తసంబంధీకుల్ని సైతం వారి మానాన వదిలేసి పరుగు లంకించుకుంటాడు. ఏఒక్కడికీ తనను గురించి తప్ప ఇతరుల్ని గురించిన ఆలోచనే రాదు. చివరికి తల్లి తనవడిలో పెట్టుకొని పాలిస్తున్న పసిబిడ్డను కూడా వదలి పరుగెత్తుతుంది. గర్భిణీ స్త్రీలకు గర్భస్రావం అవుతుంది. ప్రజలు మైకంలో లేకపోయినా మైకంలో ఉన్నట్లు కన్పిస్తారు. పశువులు కూడా భయంతో అటూఇటూ పరుగెత్తుతాయి. క్రూరజంతువులు మాత్రం తీవ్ర భయాందోళనలతో ఒకచోట గుమిగూడుతాయి.

"ఆరోజు (ప్రళయ బీభత్సంతో) ప్రజలు కళ్ళు తేలేసి, తల పైకెత్తి పరుగిడు తుంటారు. పై చూపులు పైనే ఉండిపోతాయి. గుండెలు దడదడలాడి పోతుంటాయి." (ఖుర్ఆన్-14:43)

"ఆరోజు పరిస్థితి చూడు... పాలుపట్టే ప్రతి స్త్రీ తన చంటిబిడ్డను సైతం మరచి పోతుంది. అలాగే ప్రతి గర్భిణికీ గర్భస్రావం అవుతుంది. ప్రజలు మైకంలో లేకపోయినా మైకంలో ఉన్నట్లు కనపడతారు. నిస్సందేహంగా దైవశిక్ష చాలా కఠినంగా ఉంటుంది." (ఖుర్ఆన్-22:2)

"చివరికి గూబలు పగలుగొట్టే (ప్రళయ శంఖా)రావం ఉధృతమయినప్పుడు.... ఆరోజు మానవుడు (అదిరిపోయి) తన సోదరులు, తల్లిదండ్రులు, భార్యాపిల్లలను వదలి పరుగు లంకించుకుంటాడు. ప్రతి ఒక్కడిపై భయంకరమైన ఆపద వచ్చిపడుతుంది. అందువల్ల అప్పుడు ఏఒక్కడికీ తనగురించి తప్ప ఇతరుల్ని గురించి ఆలోచనేరాదు." (ఖురాన్:80:33-38)

"ప్రళయం ఎప్పుడొస్తుంది? అసలింతకూ అది వస్తుందా లేదా?" అనంటాడు మానవుడు. ఆరోజు మానవులు కళ్ళు తేలవేస్తారు. చంద్రుడు కాంతివిహీనుడై పోతాడు. సూర్యచంద్రుల్ని కలిపివేయడం జరుగుతుంది. అప్పుడు ఈ మానవుడే "నేనెక్కడికి పారి పోవాలి?" అనంటాడు. ఎక్కడికీ పారిపోలేవు. ఎక్కడా నీకు రక్షణ లేదు. ఆరోజు నీవు నీ ప్రభువు సన్నిధికే వెళ్ళి నిలబడవలసి ఉంటుంది." (ఖుర్ఆన్:75:6-11)

మొదటి శంఖారావానికి రెండవ శంఖారావానికి మధ్య ఎంతకాలం గడుస్తుందో హదీసుల్లో స్పష్టంగా చెప్పబడలేదు. నలభై అని మాత్రమే ఉంది. నలభై అంటే నలభై రోజులన్నా కావచ్చు లేదా నలభై యేండ్లన్నా కావచ్చు. వాస్తవం దేవునికే తెలుసు.

**రెండవసారి శంఖారావం** జరిగినప్పుడు దాని భీకరధ్వనికి మానవులతో పాటు యావత్తు జీవరాసులు చచ్చిపడిపోతాయి. భూమి తీవ్రమైన ప్రకంపనాలతో ఎక్కడి కక్కడ నెర్రెలు విచ్చుకుంటుంది. ఎంతో పటిష్ఠంగా నిర్మించిన పెద్దపెద్ద కట్టడాలు, ఆకాశ హర్మ్యాలు సైతం పేకమేడల్లా కుప్పకూలిపోతాయి. భూమండలం యావత్తు జీవరాసుల్ని తీవ్రంగా కుదిపేస్తుంది. ప్రచండవేగంతో గాలులు వీస్తాయి. సముద్రాలు ఉవ్వెత్తున ఎగిసిపడతాయి. కోట్లాది ఎకరాల నేల జలమయమవుతుంది. సముద్రంలో తీవ్రమైన వత్తిడితో భయంకరమైన అగ్నిమంటలు లేస్తాయి. బ్రహ్మాండమైన ప్రభంజనం వల్లనో, గురుత్వాకర్షణ శక్తి తగ్గిపోవడంవల్లనో భూమి మీదుండే ప్రతివస్తువూ గాలిలో తేలియాడు తుంది. యావత్తు భూగోళం అతలాకుతల మవుతుంది. సూర్యచంద్ర నక్షత్రాలు నిస్తేజమై

పోతాయి. గ్రహాలు, నక్షత్రాలు తమతమ నిర్ణీతకక్ష్యలు వదలి ఉదజని బంతుల్లా తిరుగుతూ చివరికి అణుబాంబుల్లా పేలిపోతాయి. విశ్వమంతా అస్తవ్యస్థం అవుతుంది.

“ఆకాశం దద్దరిల్లి బీటలువారినప్పుడు, తారలు చెదరి కాంతికోల్పోయినప్పుడు, సముద్రాలు పొంగి పొరలినప్పుడు, సమాధులు పూర్తిగా తెరవబడినప్పుడు– ఆ...అప్పుడు ప్రతి మనిషికీ తాను ముందు పంపుకున్నది, వెనుక వదలిపెట్టినది అంతా తెలిసి పోతుంది.” (ఖుర్ఆన్:82:1–5)

“సూర్యుడు నిస్తేజమై చుట్టివేయబడినప్పుడు, నక్షత్రాలు చెదరి కాంతి కోల్పోయినప్పుడు, పర్వతాలు కదలి నడచినప్పుడు, పదినెలల సూడిఒంటెలు వాటిమానాన వదలి వేయబడినప్పుడు, క్రూరమృగాలు (భీతావహంతో) ఓచోట గుమిగూడినప్పుడు, సముద్రం (ఉప్పొంగి) ప్రజ్వరిల్లినప్పుడు, ఆత్మలు (దేహాలతో) అనుసంధానం చేయబడినప్పుడు, సజీవసమాధి చేయబడిన పసిబాలికను నీవు ఏతప్పు వల్ల చంపబడ్డావని అడిగినప్పుడు, (మానవుల) కర్మల చిట్టా తెరవబడినప్పుడు, ఆకాశానికున్న తెర తొలగించబడినప్పుడు, నరకం దహించబడినప్పుడు, స్వర్గం దగ్గరకు తేబడినప్పుడు– ఆ.... అప్పుడు ప్రతి మనిషికీ తానేమి వెంట తెచ్చుకున్నాడో తెలుస్తుంది.” (ఖుర్ఆన్:81:1–14)

విశ్వవ్యవస్థ మారిపోయినప్పుడు మానవులతో పాటు యావత్తు జీవరాసులు తమ ఉనికిని కోల్పోతాయి. అప్పుడు సృష్టికర్త, సర్వేశ్వరుడయిన ఒక్క దేవుడు తప్ప మరెవరూ ఉండరు.

“వారు దేవునికి విలువ ఇవ్వవలసిన విధంగా విలువ ఇవ్వనే లేదు. పునరుత్థాన దినాన యావత్తు భూమండలం ఆయన పిడికిలిలో ఉంటుంది. యావత్తు నభోమండలం ఆయన కుడిచేతిలో (చాపలా) చుట్టబడి ఉంటుంది. వీరు చేస్తున్న బహుదైవారాధనకు ఆయన ఎంతో అతీతుడు, పరమ పవిత్రుడు.” (ఖుర్ఆన్–39:67)

ఒకసారి దైవప్రవక్త (సల్లం) మసీదులో వేదికపై నిలబడి ఈ సూక్తి పఠించిన తరువాత ఇలా తెలియజేశారు: “దేవుడు (ప్రళయదినాన) భూమ్యాకాశాలను (యావత్తు గ్రహాలను) తన చేతిలోకి తీసుకొని పిల్లవాడు బంతిని తిప్పినట్లు తిప్పుతూ ‘నేను ఏకైక దేవుణ్ణి, నేను (విశ్వ) చక్రవర్తిని. నేను సర్వ శక్తిమంతుణ్ణి. నేను సమస్త వైభవాలుగల మహోన్నతుణ్ణి. ఇక ప్రపంచవాసులైన ఆ చక్రవర్తులు ఎక్కడ ఉన్నారు? ఏరా నియంతలు? ఏమయ్యారు ఆ అహంకారులు?” అని అంటాడు. దైవప్రవక్త (సల్లం) ఇలా చెబుతూ ఆపాదమస్తకం ఊగిపోసాగారు. ఆ దృశ్యం చూస్తున్న ప్రవక్త అనుచరులు (రజి) ఆయన ప్రసంగవేదికపై నుండి పడిపోతారేమోనని భయపడిపోయారు. (బుఖారి, ముస్లిం)

దైవప్రవక్త (సల్లం) ఇలా తెలియజేశారు: “.... రెండవసారి శంఖారావం గావించబడిన తరువాత దేవుడు వర్షం కురిపిస్తాడు. దానివల్ల మానవులు (నేల నుండి మొక్కల మాదిరిగా) మొలకెత్తుతారు.” మరొక సందర్భంలో ఆయన ఇలా అన్నారు: “మానవ దేహానికి సంబంధించిన ప్రతీదీ చీకిపోతుంది (మట్టిగా మారుతుంది), ఒక్క ఎముక తప్ప. అదిమాత్రమే మిగిలి ఉంటుంది. ప్రళయదినాన ఆ ఎముకతోనే మొత్తం శరీరం సృజించబడుతుంది. అదే వెన్నెముక.” (బుఖారి, ముస్లిం); వేరొక హదీసులో “ఆ వెన్నెముక ఆవగింజంత చిన్నదయి మిగిలి ఉంటుంద”ని ఉంది. (తర్గీబ్)



# 101. పునరుత్థాన దినం

**మూడవసారి శంఖారావం** అవుతుంది. అప్పుడు ఆది నుండి ప్రళయం దాకా పుట్టిన మానవులంతా పునర్జీవులయి లేస్తారు. మృతదేహాలను సమాధిచేసినా, సముద్రంలో పారేసినా, అగ్నిలో కాల్చి బూడిదను నదులలో కలిపేసినా, క్రూరమృగాలు చీల్చిచెండాడినా సరే అందరినీ దేవుడు బ్రతికిస్తాడు. వారి శరీర చిహ్నాలు ఎక్కడుంటే అక్కడ్నుంచి వారు పునర్జీవులయి లేస్తారు. ఒకేఒక గర్జనతో ఒక్కొక్క సమాధి నుండి వేలాదిమంది మానవులు లేచి ఒకరి కొకరు పోటీపడి పరుగెత్తినట్లు ఒక దిశగా పరుగెత్తుతారు. అయితే వారంతా స్త్రీలయినా, పురుషులయినా నగ్నంగా ఉంటారు. తీవ్రమైన భయాందోళనల కారణంగా వారు ఒకరివైపు ఒకరు చూసుకునే పరిస్థితిలో ఉండరు. పురుషులు వడుగులు చేయబడనివారయి ఉంటారు. అందరూ కంగారుపడుతూ పరుగెత్తుతారు.

హజ్రత్ ఆయిషా (రజి) ఉల్లేఖనం: “ప్రళయదినాన మానవులు నగ్నపాదాలతో, నగ్నశరీరాలతో, ఖత్నా (వడుగు) చేయబడనివారిగా లేపబడతారు” అన్నారు దైవప్రవక్త (స). నేనీ మాట విని “దైవప్రవక్తా! (అప్పుడు) స్త్రీ పురుషులు ఒకర్నొకరు చూసుకుంటారా?” అని అడిగాను. దానికి ఆయన “ఆ సమయంలో వారంతా తీవ్రమైన ఆందోళనకు లోనైఉంటారు. పరస్పరం చూసుకునే ఆలోచనే తట్టదు వారికి” అని చెప్పారు. (బుఖారి)

హజ్రత్ అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి) కథనం: దైవప్రవక్త (సల్లం) మా ముందు ప్రసంగిస్తూ “మీరు ప్రళయదినాన లేపబడినప్పుడు నగ్నపాదాలతో, నగ్నశరీరాలతో, వడుగు చేయబడనివారయి ఉంటారు. ఖుర్ఆన్‌లో ‘మేము మానవుణ్ణి మొదట్లో ఏవిధంగా పుట్టించామో తిరిగి అదేవిధంగా చేస్తాము’ అని ఉంది. ప్రళయదినాన అందరికంటే ముందు హజ్రత్ ఇబ్రాహీం (అలైహి)కు బట్టలు ధరింపజేస్తారు” అని అన్నారు. (బుఖారి)

దైవప్రవక్త (స) ప్రవచనం: “ప్రళయదినాన మానవుల్ని మైదారొట్టెలా తెలుపు ఎరుపుల సమ్మిశ్రిత వర్ణంతో కూడిన భూమి మీద సమీకరించడం జరుగుతుంది. అప్పుడు భూమిపై ఎలాంటి ఇండ్లు, గోపురాలు, కట్టడాలు ఏమాత్రం ఉండవు.” (బుఖారి)

మానవులు సమాధుల నుంచి లేచిన తర్వాత వారివారి కర్మలను బట్టి మూడు వర్గాలుగా మారి హషర్ మైదానం వైపు వెళ్తారు. ఒకటి, కాలినడకన వెళ్ళే వర్గం. రెండు, వాహనాలపై వెళ్ళే వర్గం. మూడు, తలకిందులయి ముఖంతో నడిచే వర్గం. వీరు సత్యతిరస్కారులు. వీరు ప్రపంచంలో ఉండగా సత్యం కానలేని అంధులుగా, సత్యం వినలేని బధిరులుగా ప్రవర్తించినందుకు దేవుడు వీరిని ప్రళయదినాన అంధులుగా, బధిరులుగా చేసి లేపుతాడు.

“వారిని మేము ప్రళయదినాన బోర్లాపడేసి ఈడ్చుకొస్తాము. వారు అంధులు, బధిరులు, మూగలు. నరకమే వారి నివాసమవుతుంది.” (ఖుర్ఆన్–17:97)

దైవప్రవక్త (సల్లం) ప్రవచనం: “పునరుత్థాన దినాన మానవులు మూడు వర్గాలుగా చీలిపోతారు. ఒక వర్గం భయం, ఆశ కలిగినవారు. (రెండోవర్గంలో) ఒక ఒంటెపై ఇద్దరు, మరో ఒంటెపై ముగ్గురు, వేరొక ఒంటెపై నలుగురు చొప్పున ఉంటారు. మిగిలిన (మూడోవర్గం) వారిని అగ్ని ఒక చోటుకు చేర్చుతుంది. వారు మధ్యాహ్నం వేళ ఎక్కడైనా

కాస్త నడుంవాల్చితే ఈ అగ్ని కూడా వారితో పాటే ఉంటుంది. రాత్రివేళ ఎక్కడైనా గడిపితే అప్పుడు కూడా ఈ అగ్ని వారిని వెన్నంటే ఉంటుంది.'' (బుఖారి, ముస్లిం)

"అప్పుడు మీరు మూడు వర్గాలుగా చీలిపోతారు: కుడి పక్షంవారు, ఆహా కుడిపక్షం వారి (అదృష్టం) గురించి ఏమని వర్ణించాలి! ఎడమ పక్షంవారు, ఎడమ పక్షంవారి (దౌర్భాగ్యం) గురించి ఇక చెప్పేదేముంది! ముందుండేవారు, (ప్రతి సత్కార్యంలో) వారు ముందుండేవారే! వారే (దైవ)సన్నిహితులు. వారు అపార సౌఖ్యాలతో కూడిన స్వర్గవనాలలో ఉంటారు. ముందుతరాల వారిలో (దైవసన్నిహితులు) అత్యధికంగా ఉంటారు. తర్వాతి తరాలవారిలో తక్కువమంది ఉంటారు." (ఖుర్ఆన్-56:7-14)

దైవప్రవక్త (స) ప్రవచనం: "ప్రళయదినాన నా అనుచర సముదాయానికి చెందిన కొందరిని తీసుకొచ్చి ఎడమపక్షం వారిలో చేర్చడం జరుగుతుంది. నేనప్పుడు 'ప్రభూ! వీరు నా అనుచరులు' అంటాను. దానికి దేవుడు 'నీ తదనంతరం వీరు (ధర్మంలోలేని) ఎన్ని కొత్త కొత్త విషయాలు సృష్టించారో నీకు తెలియదు' అనంటాడు. నేనీ మాట విని దేవుని పుణ్యదాసుడు (హజ్రత్ ఈసా) పలికిన పలుకులే పలుకుతాను. ఆయన పలుకులు ఇలాఉన్నాయి- '(ప్రభూ!) నేను వారి మధ్య జీవించి ఉన్నంతవరకే నేను వారిని కనిపెట్టు కొని ఉన్నాను. మీరు నన్ను పైకెత్తుకున్న తరువాత వారిని మీరే కనిపెట్టుకొని ఉన్నారు. మీరు అందర్నీ, అన్నివిషయాల్నీ (అన్నివేళలా) కనిపెడ్తూఉంటారు. ఇప్పుడు మీరు వారిని శిక్షిస్తే వారు మీదాసులే. ఒకవేళ క్షమిస్తే మీరు ఎంతో శక్తిమంతులు, మహావివేకవంతులు.' (5:118). ఆ తర్వాత నాతో "(నీవు ప్రపంచం నుండి వెళ్ళిపోయాక) వీరు మతభ్రష్టులై జీవితాంతం అదే స్థితిలో ఉండిపోయారు'' అంటాడు.'' (బుఖారి, ముస్లిం)

దైవప్రవక్త (స) ప్రవచనం: "ప్రళయదినాన సూర్యుడు మానవులకు చాలా దగ్గరగా వస్తాడు. చేసుకున్న దుష్కర్మల్నిబట్టి కొందరికి తక్కువగా, మరికొందరికి ఎక్కువగా చెమట కారుతుంది. కొందరు చీలమండల దాకా చెమటలో తడిసిఉంటారు. మరికొందరు మోకాళ్ళదాకా, ఇంకొందరు నడుందాకా, కొందరయితే పాదాలనుంచి నోటిదాకా చెమటలో మునిగిఉంటారు. ఆ చెమట కళ్ళెంలా వారి నోళ్ళలోకి దూరివుంటుంది.'' (ముస్లిం)

దైవప్రవక్త (స) ఇలా అన్నారు: "ప్రళయదినాన మానవుల శరీరాల నుండి చెమట విపరీతంగా కారుతుంటుంది. ఆ చెమట నేలమీద డెబ్బయి గజాలదాకా పారుతుంటుంది. వారు తమ నోళ్ళు, చెవులదాకా చెమటలోనే మునిగిఉంటారు.'' (బుఖారి)

దైవప్రవక్త (స) ప్రవచనం: "హషర్ మైదానంలో మానవుని శరీరం నుండి చెమట విపరీతంగా, నిరంతరాయంగా కారుతుంది. దాంతో అతను బెంబేలెత్తిపోయి 'ప్రభూ! నాకీ చెమట యాతన కంటే మీరు నన్ను నరకానికి పంపివేయడమే మంచిది' అంటాడు. హషర్ యాతన కాఠిన్యతను చూసి మనిషి ఇలా అంటాడు. కాని నరకయాతన ఇంతకంటే కఠినంగా, ఘోరంగా ఉంటుందన్న సంగతి అతనికింకా తెలియదు.'' (తర్గీబ్)

ప్రవక్త అనుచరులు ప్రళయదినం గురించి "అంతటి సుదీర్ఘకాలంలో మానవుల పరిస్థితి ఏమిటి''ని అడిగారు. దానికి దైవప్రవక్త (స) ఇలా అన్నారు: "నా ప్రాణం ఎవరి



అధీనంలో ఉందో ఆ శక్తిస్వరూపుని సాక్ష్యం! ఆ దినం విశ్వాసికి ప్రపంచంలో ఫర్జ్‌నమాజ్ చేసేటంత సమయంకంటే కూడా తేలికగా ఉంటుంది.'' (అంటే పది పదిహేను నిమిషాల కంటే ఎక్కువసేపు ఉండదన్న మాట.) (మిష్కాత్)

దైవప్రవక్త (స) తన అనుచరులకు హితోపదేశం చేస్తూ "మరణించిన ప్రతి మనిషీ పశ్చాత్తాప పడతాడు'' అని చెప్పారు. ఈమాట విని ఆయన అనుచరులు "పశ్చాత్తాపపడటం అంటే ఏమిటి దైవప్రవక్తా?'' అని అడిగారు. దానికి ఆయన "చనిపోయిన మనిషి సజ్జను డయివుంటే, తాను మరిన్ని సత్కార్యాలు ఎందుకు చేసుకోలేకపోయానని పశ్చాత్తాప పడతాడు. ఒకవేళ అతను చెడ్డ వాడయివుంటే, తాను చెడ్డపనులు ఎందుకు మానుకోలేక పోయానని పశ్చాత్తాపపడతాడు'' అని సమాధానమిచ్చారు. (తిర్మిజి)

హజ్రత్ అనస్ (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "ప్రళయదినాన ప్రపంచంలో అందరికన్నా ఎక్కువ సౌఖ్యం అనుభవించి (నరకవాసి అయి)న ఒక మనిషి ప్రవేశపెట్టబడతాడు. అతడ్ని ఒకసారి నరకంలో ముంచి తీసిన పిదప "ఆదం కుమారా! గతంలో నీవెప్పుడయినా సుఖం అనుభవించావా? అలా సుఖం అనుభవించినట్లు గుర్తుందా?'' అని అడుగుతాడు (దేవుడు). దానికావ్యక్తి, "లేదు ప్రభూ! దైవసాక్షి! గతంలో నేనెప్పుడూ సుఖం అనుభవించలేదు'' అనంటాడు. ఆ తరువాత ప్రపంచంలో అందరికన్నా ఎక్కువగా కష్టాలు అనుభవించి (స్వర్గవాసి అయి)న మరొక మనిషి ప్రవేశపెట్టబడతాడు. అతడ్ని ఒకసారి స్వర్గంలో ఉంచి తీసిన తరువాత "ఆదం కుమారా! గతంలో నువ్వెప్పుడైనా కష్టాలు ఎదుర్కొన్నావా? అలాంటి కష్టాలు వచ్చినట్లు నీకు గుర్తుందా?'' అని అడుగుతాడు (దేవుడు). దానికి ఆ స్వర్గవాసి "దైవసాక్షి! నేనెన్నడూ కష్టాలు చూడలేదు. గతంలో నేను బాధలు అనుభవించినట్లు నాకు గుర్తే లేదు'' అని అంటాడు. (ముస్లిం)

## 102. మానవుల విభిన్న పరిస్థితులు

హషర్ మైదానంలో మానవులు తమ కర్మల్ని బట్టి విభిన్న పరిస్థితులకు లోనయి ఉంటారు. ఆ పరిస్థితిని గురించి దైవప్రవక్త (స) ఇలా తెలియజేశారు:

**యాచకులు :** మనిషి కష్టపడి సంపాదించే శక్తి ఉన్నప్పటికీ జీవితాంతం భిక్షాటన చేసి పొట్టబోసుకోవడాన్ని ఇస్లాం ఎంతమాత్రం హర్షించదు. పైగా అలాంటి మనిషి పరలోక శిక్షకు గురికావలసి వస్తుందని హెచ్చరిస్తోంది. "మనిషి (ఏమాత్రం ఆత్మగౌరవం లేకుండా) బిచ్చం అడుక్కుంటూ చివరికి ప్రళయదినాన ముఖంపై ఎలాంటి మాంసం లేనివాడుగా లేచివస్తాడు.'' (బుఖారి)

**ఒక భార్యకు అన్యాయం చేసినవాడు :** ఇద్దరు ముగ్గురు భార్యలున్నప్పుడు భర్త ఆముగ్గురినీ సమానదృష్టితో చూడాలి. దీన్ని గురించి దైవప్రవక్త (స) "ఇద్దరు భార్యలున్న పురుషుడు ఆ ఇద్దర్నీ సమానదృష్టితో చూడకుండా వారిలోఒకరికి అన్యాయంచేస్తే అలాంటి మనిషి ప్రళయదినాన సగం దేహంతో లేచివస్తాడు'' అని అన్నారు. (మిష్కాత్)

**ఖుర్ఆన్ సూక్తులు మరచినవాడు :** "ఖుర్ఆన్ పఠించిన తర్వాత దాన్ని మరచిన వాడు కుష్టురోగి అయి దేవుడ్ని కలుసుకుంటాడు'' అన్నారు దైవప్రవక్త (స). (మిష్కాత్)

**నమాజ్ చేయనివాడు :** నమాజ్ చేయనివాడికి నమాజ్ వెలుగు నివ్వడంగాని, ప్రమాణంగా నిలవడంగాని, మోక్షప్రదాయని కావడంగాని జరగదు.'' (అహ్మద్, దార్మి)

**ప్రమాణభంగం చేసినవాడు :** ''ప్రమాణభంగం చేసినవాడికి ప్రళయదిన శిక్షగా అతని గుదంలో ఒక జెండా పెట్టబడుతుంది'' అన్నారు దైవప్రవక్త (స). (ముస్లిం); మరో ఉల్లేఖనం ప్రకారం ''ఆ ప్రమాణం ఎంత పెద్దదయి ఉంటుందో అతని గుదంలో అంతే పెద్ద జెండా పెట్టబడుతుంది'' అని చెప్పారు ఆయన. (మిష్కాత్)

**నాయకులు, పాలకులు :** న్యాయం చేయని నాయకులు, పాలకులను గురించి దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రవచించారు: ''పది మందికి నాయకుడైనవాడు ప్రళయదినాన చేతులు కట్టివేయబడినవాడయి వస్తాడు. (అనుచరుల పట్ల న్యాయంగా ప్రవర్తించిఉంటే) అతడ్ని న్యాయం బంధవిముక్తుణ్ణి చేస్తుంది. లేదా (అన్యాయం చేసి ఉంటే) అన్యాయం అతడ్ని అంతమొందిస్తుంది.'' (దార్మి)

''దైవప్రవక్త (స) హితోక్తి: ''ప్రజలపై పెత్తనం చెలాయించిన పాలకుడు ప్రళయదినాన లేచినప్పుడు ఒక దైవదూత అతడ్ని మెడపట్టి తీసుకొస్తాడు. తెచ్చి (దైవాజ్ఞ కోసం) తలపెకెత్తి ఆకాశం వైపు చూస్తాడు. అప్పుడు దేవుడు 'అతడ్ని పడదోయి' అని ఆజ్ఞాపిస్తే, దైవదూత అతడ్ని ఎంతో లోతైన ఓ పెద్ద గొయ్యిలోకి పడదోస్తాడు. దాంతో ఆ పాలకుడు లోతైన ఆ గొయ్యిలో పడిపోతూ నలభైయేళ్ళకు దాని అడుగుకు చేరుకుంటాడు.'' (మిష్కాత్)

**జకాత్ చెల్లించనివాడు :** దైవప్రవక్త (స) ఇలా సెలవిచ్చారు: ''ఎవరికైతే దేవుడు ఐశ్వర్యం ప్రసాదించాడో అతను జకాత్ చెల్లించకపోతే ప్రళయదినాన ఆ ధనం ఓపెద్ద కొండచిలువగా మారుతుంది. దాని నెత్తి మీద రెండు చుక్కలుంటాయి. ఆ పామును కంఠపాశంగా చేసి అతని మెడలో వేయడం జరుగుతుంది. అప్పుడా పాము నోటితో అతని దౌడలు పట్టుకొని 'నేను నీ ధనాన్ని, నీ నిధిని' అంటుంది.'' ఆ తరువాత దైవప్రవక్త (సల్లం) ఖుర్ఆన్‌లోని ఈసూక్తి పఠించారు:

"దేవుడు తన అనుగ్రహంతో ప్రసాదించిన సంపద విషయంలో పిసినారితనం వహించేవారు ఆ పిసినారితనం తమకు మేలు చేకూరుస్తుందని భావించకూడదు. అది వారికి హాని కలిగిస్తుంది. వారు ఏ ధనం విషయంలో పిసినారితనం వహిస్తున్నారో అది రేపు ప్రళయదినాన వారి మెడకు గుదిబండగా మారుతుంది." (ఖుర్ఆన్–3:180)

వెండి బంగారాలను కూడబెట్టే పిసినారులను గురించి దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రవచించారు: ''వెండి బంగారాలు కలిగి వున్నవాడు వాటి హక్కు (జకాత్) నెరవేర్చకపోతే ప్రళయదినాన ఆ వెండిబంగారాలను అగ్నిలో కాల్చి పలకలుగా చేసి మండుతున్న ఆ పలకలతో అతని వీపుపై, పక్కలపై, నుదుటిపై వాతలు పెట్టడం జరుగుతుంది. పలకలు చల్లారినప్పుడల్లా వాటిని మళ్ళీ కాల్చి అతని శరీరం మీద వాతలు పెడ్తారు. ఈ విధంగా యాభైవేల సంవత్సరాల సుదీర్ఘదినాన యావత్తు మానవాళి తీర్పు ముగిసేదాకా మాటి మాటికి వాతలు పెట్టడం జరుగుతుంది. చివరికి అతను (తన విశ్వాసం, కర్మలను బట్టి) స్వర్గానికి లేక నరకానికి పంపబడతాడు..... (ముస్లిం)



ఈ హదీసులోనే పశుసంపదపై జకాత్ చెల్లించనివాడ్ని గురించి కూడా తెలియ జేశారు దైవప్రవక్త (స). ప్రళయదినాన అతని పశువులు బాగా బలిసిపోయి అతడ్ని కొమ్ములతో కుమ్ముతూ, గిట్టలతో నలిపేస్తాయి. ఇలా ప్రళయదినం నాటి సుదీర్ఘమైన తీర్పు ముగిసే వరకూ అతడ్ని అతని పశువులు మాటిమాటికి కొమ్ములతో కుమ్ముతూ, గిట్టలతో తొక్కుతుంటాయి. ఆ తరువాత మానవుల్ని స్వర్గానికో లేక నరకానికో పంపడం జరుగుతుంది.

**తీవ్రమైన ఆకలితో ఉండేవాడు :** దైవప్రవక్త (స) ముందు ఒకతను తేన్చాడు. అప్పుడు దైవప్రవక్త (సల్లం) ''నీ తేన్పును కాస్త తగ్గించుకో. ప్రపంచంలో అందరికంటే చాలా సేపటిదాకా (గొంతు వరకు) తింటుండేవాడు ప్రళయదినాన అందరికంటే చాలా సేపటిదాకా ఆకలితో ఉంటాడు'' అని చెప్పారు. (మిష్కాత్)

**రెండు నాల్కల ధోరణి :** ''ప్రపంచంలో రెండుముఖాల (రెండునాల్గల) వాడు ప్రళయదినాన అగ్ని నాలుకతో ఉంటాడు'' అన్నారు దైవప్రవక్త (సల్లం). (అంటే అతను కొందరి ముందు వారిని పొగుడుతూ, ఇతరుల్ని తెగుడుతాడు. తరువాత ఇతరుల ముందు వారిని పొగుడుతూ మొదట పొగిడినవారిని తెగుడుతాడన్న మాట.) (అయిజా)

**కట్టు కలలు చెప్పేవాడు :** అబద్ధపు కలలు కల్పించుకొని వాటిని ఇతరుల ముందు చెప్పేవాడు, ఇతరుల రహస్యసంభాషణలు దొంగచాటుగా వినేవాడు కూడా ప్రళయదిన శిక్షలు అనుభవిస్తాడు. ఇతరుల రహస్య సంభాషణలు దొంగచాటుగా విన్న వాడి చెవులలో సీసం కరిగించి పోయడం జరుగుతుందని దైవప్రవక్త (సల్లం) తెలియ జేశారు. అలాగే జీవుల చిత్రాలు, బొమ్మలు తయారుచేసేవాడిపై వాటికి ప్రాణం పోయమని వత్తిడిచేయడం జరుగుతుందని అన్నారాయన. (మిష్కాత్)

**డాబుసరి దుస్తులు :** ''ప్రపంచంలో పేరుప్రతిష్ఠల కాంక్షతో (ప్రత్యేక)దుస్తులు ధరించినవాడికి ప్రళయదినాన దేవుడు అవమానకరమైన దుస్తులు ధరింపజేస్తాడ''ని దైవప్రవక్త (సల్లం) ప్రవచించారు. (అహ్మద్, అబూదావూద్)

**భూకబ్జా దారుడు :** ''ఇతరుల భూమిని ఏ కొంచెమైనా సరే అన్యాయంగా ఆక్ర మించుకున్నవాడ్ని పాతాళలోకంలోకి దిగబడే వరకు భూమిలోకి అణచివేయడం జరుగు తుంది'' అన్నారు దైవప్రవక్త (స). వేరొక ఉల్లేఖనంలో ''ఎవరైనా ఆన్యాయంగా జానెడు భూమిని ఆక్రమించుకున్నా ప్రళయదినాన అతని మెడలో ఏడు భూముల కంఠపాశాన్ని వేయడం జరుగుతుంద''ని అన్నారు ఆయన. (బుఖారి, ముస్లిం)

**ధర్మజ్ఞానం దాచేవాడు :** ''ధర్మజ్ఞానం ఉన్నవాడ్ని ఎవరైనా ఏదయినా ధర్మానికి సంబంధించిన విషయం అడిగినప్పుడు దాన్నతను చెప్పకుండా దాచేస్తే, ప్రళయదినాన అతని నోటికి నిప్పుకళ్ళెం వేయబడుతుంది'' అన్నారు దైవప్రవక్త (స). (తిర్మిజి)

**కోపాన్ని దిగమింగేవాడు :** ''కోపం వచ్చినప్పుడు ప్రతీకారం చేసే శక్తి ఉన్నప్పటికీ ఆ కోపాన్ని దిగమింగేవాడ్ని దేవుడు ప్రళయదినాన పిలిచి 'నీవు కోరుకున్న స్వర్గకన్యను తీసుకోవచ్చ'ని చెబుతాడు'' అన్నారు దైవప్రవక్త (స). (అబూదావూద్)

**కాబాయాత్రలో చనిపోయినవాడు :** “దైవప్రవక్త (సల్లం) హజ్‌యాత్రకు వచ్చి అర్ఫాత్‌లో ఆగినప్పుడు ఒక యాత్రికుడు హఠాత్తుగా ఒంటె మీద నుంచి జారిపడి చనిపోయాడు. అప్పుడు దైవప్రవక్త (స) అనుచరులతో ‘రేగాకులు వేసి వేడినీళ్ళతో ఇతనికి స్నానం చేయించండి. అతనిప్పుడు ధరించి ఉన్న దీక్షా దుస్తులలోనే ఇతనికి వస్త్రసంస్కారం చేయండి. ముఖాన్ని కప్పకుండా వదిలేయండి. ప్రళయదినాన ఇతను తల్బియా (హజ్ నినాదం) పఠిస్తూ లేస్తాడు’ అన్నారు. (బుఖారి)

**అమరవీరుడు :** బుఖారీలోని ఒక హదీసు ప్రకారం దైవమార్గంలో పోరాడుతూ గాయపడిన యోధుడు ప్రళయదినాన ఆ గాయం నుండి రక్తం కారుతున్న పరిస్థితిలో లేచివస్తాడు. అతని రక్తం నుండి కస్తూరి వాసన వస్తుంది.

**పరిపూర్ణ జ్యోతి :** “నమాజ్ కోసం చీకటిలో కూడా మసీదుకు వెళ్ళేవారికి శుభవార్త చెప్పండి. ప్రళయదినాన వారికి పరిపూర్ణ జ్యోతి ఇవ్వబడుతుంది” అన్నారు దైవప్రవక్త (సల్లం)- (తిర్మిజి)

**అజాన్ చెప్పేవారు :** “ఎవరు అజాన్ చెబుతుంటారో ప్రళయదినాన వారి మెడలు అందరి మెడలకన్నా పొడుగ్గా ఉంటాయి” అన్నారు దైవప్రవక్త (స). (ముస్లిం)

**దైవప్రసన్నత కోసం ప్రేమించుకునేవారు :** దేవుని వాక్కును దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: “నా ప్రాభవం, ఔన్నత్యాల కారణంగా పరస్పరం ప్రేమించుకునే వారి కోసం జ్యోతిర్మయ ఆసనాలు ఉంటాయి. ప్రవక్తలు, అమరగతులు వారిని చూసి అసూయపడతారు.” (మిష్కాత్)

**దైవసింహాసనం నీడన ఉండేవారు :** దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రవచించారు: “ప్రళయదినాన దేవుడు తన నీడ తప్ప ఎవరి నీడా ఉండని పరిస్థితిలో ఏడు విధాల వ్యక్తులకు తన సింహాసనం నీడ ప్రసాదిస్తాడు. ఆ ఏడుగురు-

❶ న్యాయశీలి అయిన ముస్లిం రాజు.

❷ యౌవనకాలమంతా దైవారాధనలో గడిపిన యువకుడు.

❸ మసీదు నుండి వెళ్ళిపోయినా తిరిగి మసీదుకు వచ్చేవరకు మసీదులోనే మనసు ఉంచే భక్తుడు.

❹ కేవలం దైవప్రసన్నత కోసం పరస్పరం ప్రేమించుకునే ఇద్దరు వ్యక్తులు. ప్రేమాభిమానాల వల్లనే వారిద్దరు కలుసుకుంటారు. మనసులో ప్రేమాభామానాలు ఉంచుకునే వారు విడిపోతారు.

❺ ఏకాంతంలో దైవాన్ని జ్ఞాపకం చేసుకొని కంట తడిపెట్టినవాడు.

❻ హోదాఅంతస్తులు గల సౌందర్యవతి అశ్లీల చేష్ట కోసం పిలిచినప్పుడు ‘నేను దేవునికి భయపడుతున్నాన’ని చెప్పి వెళ్ళిపోయే పురుషుడు.

❼ కుడిచేయి చేసిన సహాయం ఎడమ చేయికి సైతం తెలియనంత రహస్యంగా దానం చేసినవాడు. (బుఖారి, ముస్లిం)



**జ్యోతిర్మయ కిరీటాలు ధరించేవారు :** దైవప్రవక్త (స) ఇలా తెలిపారు: “ఖుర్‌ఆన్ పఠించి దానిప్రకారం ఆచరించినవాని తల్లిదండ్రులకు ప్రళయదినాన జ్యోతిర్మయ కిరీటాలు ధరింపజేయడం జరుగుతుంది. ఆ కిరీటం తేజస్సు ముందు ఇహలోకంలోని మీ ఇండ్లలో కన్పించే సూర్యతేజస్సు కూడా వెలవెలపోతుంది. తల్లిదండ్రుల పరిస్థితే ఇలా ఉంటే ఇక ఖుర్‌ఆన్ పఠించి ఆచరించిన మనిషికి ఎంతటి గౌరవాదరణలు లభిస్తాయో మీరే ఊహించండి.” (అహ్మద్, అబూదావూద్)

**ధర్మ సంపాదనాపరుడు :** “ఇతరుల ముందు చేయిజాపకుండా ఉండే, భార్యాపిల్లల్ని పోషించే, పొరుగువారిని కనికరించే ఉద్దేశ్యంతో ధర్మసమ్మతంగా ధనార్జన చేసిన వ్యక్తి ప్రళయదినాన దేవుడ్ని కలుసుకోవడానికి వెళ్ళేటప్పుడు అతని ముఖం పున్నమి చంద్రునిలా వెలిగిపోతుంటుంది. దీనికి భిన్నంగా ధర్మసమ్మతంగా ధనార్జన చేసినప్పటికీ ఇతరులకంటే ఎక్కువ కూడబెట్టే, ఇతరులకంటే తాను ధనికుడ్ననిపించుకునే, తనకంటే తక్కువ స్థితిపరుల్ని చూసి మిడిసిపడే ఉద్దేశ్యం కలవాడయితే ప్రళయదినాన అలాంటి వ్యక్తిని దేవుడు ఆగ్రహిస్తాడు” అన్నారు దైవప్రవక్త (సల్లం) (మిష్కాత్)

## 103. కర్మవిచారణ, ధర్మకాటా

దైవప్రవక్త (సల్లం) ఇలా చెప్పారు: “ప్రళయదినాన (కర్మల) త్రాసు పెట్టబడుతుంది. ఆ త్రాసులో యావత్తు భూమ్యా కాశాలు పెట్టి తూచినా అవన్నీ అందులో ఇమిడిపోతాయి. దైవదూతలు దాన్నిచూసి ‘ఈ త్రాసు ఎవరి కోసం వాడబడుతుంద’ని దేవుడ్ని అడుగుతారు. దానికి దేవుడు ‘నేను నా సృష్టితాలలో ఎవరి (కర్మలతూకం) కోసం ఈ త్రాసు ఏర్పాటు చేస్తానో వారి కోసం ఇది వాడబడుతుంది’ అని చెబుతాడు. దైవదూతలు ఈమాట విని ‘దేవా! మీరు పరమ పవిత్రులు. మేము మిమ్మల్ని ఏవిధంగా ఆరాధించాలో ఆవిధంగా ఆరాధించలేకపోయాము’ అని అంటారు.” (తర్గీబ్ వ తర్హీబ్)

దైవప్రవక్త (సల్లం) కర్మల తూకం గురించి ఇలా తెలిపారు: “(కర్మల తూకం కోసం) త్రాసు దగ్గర ఒక దైవదూత నియమించబడతాడు. మానవులు ఆ త్రాసు దగ్గరకు తీసుకురాబడుతారు. అలా వచ్చిన ప్రతి మనిషిని దైవదూత త్రాసుపళ్ళాల మధ్య నిలబెడ్తాడు. అతని కర్మలు (మోక్షార్హత పొందేటంత) బరువుగా ఉంటే ఆ దైవదూత సృష్టిరాసులంతా వినేలా బిగ్గరగా ఒక ప్రకటన చేస్తూ ‘ఫలానా మానవుడు శాశ్వతంగా సౌభాగ్యుడయ్యాడు. ఇక ఎన్నటికీ అతను దౌర్భాగ్యుడు కాలేడు’ అంటాడు. ఒకవేళ అతని కర్మలు (మోక్షార్హత పొందలేనంత) తేలికగా ఉంటే ఆ దైవదూత సృష్టిరాసులంతా వినేలా బిగ్గరగా ప్రకటన చేస్తూ ‘ఫలానా మానవుడు శాశ్వతంగా దౌర్భాగ్యుడయ్యాడు. ఇకఎన్నటికీ అతను సౌభాగ్యుడు కాలేడు’ అంటాడు.” (తర్గీబ్ వ తర్హీబ్)

**ఒక దాసుని కర్మల బరువు :** అంతిమ దైవప్రవక్త (సల్లం) అనేక పాపాలు చేసిన ఒక దాసుని కర్మల తూకం గురించి ఈవిధంగా ప్రవచించారు:

“ప్రళయదినాన దేవుడు నా అనుచర సముదాయం నుంచి ఒక వ్యక్తిని వేరుచేసి యావత్తు సృష్టిరాసుల ఎదుటకు తెస్తాడు. తరువాత అతని ముందు తొంభై తొమ్మిది

రిజిష్టర్‌లు తెరచి పెట్టబడతాయి. వాటిలో ప్రతి రిజిష్టర్ కనుచూపు మేరంత పెద్దగా ఉంటుంది. (అందులో పాపాలు మాత్రమే ఉంటాయి.)

అప్పుడు దేవుడు అతడ్ని 'ఈ కర్మలలో దేన్నయినా నీవు నిరాకరిస్తావా? కర్మలు నమోదుచేసేవారు నీకేమయినా అన్యాయం చేశారా?' అని అడుగుతాడు. దానికి దాసుడు లేదని అంటాడు. ఆ తర్వాత దేవుడు 'ఈ దుష్కర్మలకు నీ దగ్గర సమంజసమైన కారణం ఏదైనా ఉందా?' అని మళ్ళీ అడుగుతాడు. దానికి దాసుడు 'ప్రభూ! నా దగ్గర ఎలాంటి కారణం లేదు' అంటాడు.

ఆ తరువాత సృష్టికర్త మాట్లాడుతూ 'మా దగ్గర నీవు చేసుకున్న ఒక సత్కర్మ భద్రంగా ఉంది' అని చెబుతాడు. తరువాత ఒక పత్రం తీసి ముందుంచబడుతుంది. అందులో 'అష్‌హదు అన్‌ల్లాయిలాహ ఇల్లల్లాహు వఅష్‌హదు అన్న ముహమ్మదన్ అబ్దుహూ వరసూలుహూ' (అల్లా తప్ప వేరే ఆరాధ్యుడు లేడని, ముహమ్మద్ ఆయన దాసుడు, సందేశహరుడని నేను సాక్ష్యమిస్తున్నాను.) అని ఉంటుంది. దేవుడు అతనితో 'వెళ్ళు, నీయీ కర్మ ఎంత బరువుంటుందో చూసుకో' అంటాడు.

దాసుడు ఈమాట విని '(ఈ కర్మను తూచినా తూయకపోయినా ఒకటే. నాకు వినాశం తప్పదు.) ఇన్ని (పాపాల) రిజిష్టర్ల ముందు దీనికి ఏం విలువ ఉంటుంది?' అని అంటాడు. అయితే సృష్టికర్త (అతనికి ధైర్యం చెబుతూ) 'మామాట నమ్ము. ఈరోజు నీకు ఎలాంటి అన్యాయం జరగదు' అంటాడు. ఆ తరువాత పాపాల రిజిష్టర్లన్నీ త్రాసుకున్న ఒక పళ్ళెంలో, సత్కర్మపత్రం మరొక పళ్ళెంలో పెట్టి తూకం వేయబడతాయి. ఆ తూకంలో పాపాల రిజిష్టర్లు ఉన్న పళ్ళెం తేలికయి పైకి లేస్తుంది. సత్కర్మపత్రం ఉన్న పళ్ళెం బరువయి క్రిందికి వంగుతుంది."

దైవప్రవక్త (సల్లం) ఇక్కడదాకా చెప్పిన తరువాత "(అసలు) విషయం ఏమిటంటే దేవుని పేరు సమక్షంలో మరే వస్తువుకూ ఎలాంటి బరువు (విలువ) ఉండదు" అన్నారు. (తిర్మిజి, ఇబ్నెమాజ)

**అన్నిటికంటే బరువైన కర్మలు :** "ప్రళయదినాన విశ్వాసి త్రాసులో ఉంచబడే కర్మలలో అన్నటికన్నా అతని సద్గుణ సంపత్తే ఎక్కువ బరువుగా ఉంటుంది. దేవుడు అశ్లీల చేష్టలకు పాల్పడేవాళ్ళను అసహ్యించుకుంటాడు." (మిష్కాత్ షరీఫ్)

నీతిమంతుని హృదయంలోనే దైవనామం శుభ్రంగా, సురక్షితంగా ఉంటుంది. దుర్గుణుడు, దుష్టస్వభావి అయిన మనిషి "అల్లాహ్ తప్ప వేరే ఆరాధ్యదైవం లేడని, ముహమ్మద్ ఆయన ప్రవక్తని నేను సాక్ష్యమిస్తున్నాన"ని ఎన్నిసార్లు పలికినా ప్రయోజనం లేదు. దాని కతను కట్టుబడి ఉండలేడు. ఈ సద్వచనాన్ని సద్గుణుడు, సాధుస్వభావి చిత్తశుద్ధితో ఒకసారి పలికితే చాలు, ఇక ఎల్లప్పుడూ దానికి కట్టుబడిఉంటూ సాత్వికజీవితం గడుపుతాడు.

"దేవుని పట్ల తిరస్కారవైఖరి అవలంబించినవారి ఆచరణ, పెనుతుఫానుకు త్రుటిలో ఎగిరిపోయే బూడిదకుప్ప లాంటిది. వారు తమ కర్మలకు ఎలాంటి ప్రతిఫలం పొందలేరు. అదే అన్నిటికంటే ఘోరమైన వైఫల్యం." (ఖుర్ఆన్-14:18)



దైవప్రవక్త (స) ఒకసారి "దేవుని అనుగ్రహం లేనిదే ఏ ఒక్కడూ స్వర్గానికి పోలేడు" అన్నారు. అనుచరులు ఈమాట విని "దైవప్రవక్తా! మీరు కూడానా?" అని అడిగారు. దానికి దైవప్రవక్త (స) సమాధానమిస్తూ "దేవుడు నన్ను తన అనుగ్రహఛాయలో చోటిస్తే తప్ప నేను కూడా స్వర్గానికి పోలేను" అన్నారు. (బుఖారి, ముస్లిం)

## ముస్లిమేతరుల విచారణ

"(ఆరోజు) దారితప్పినవారి ముందు నరకం ఉంచబడుతుంది. అప్పుడా మార్గభ్రష్టుల్ని (దైవదూతలు) ఇలా అడుగుతారు: 'మీరు నిజదేవుడ్ని వదలి ఆరాధించిన ఆ మిథ్యాదైవాలు ఇప్పుడు ఏమైపోయాయి? అవి మీకేమైనా సహాయం చేస్తున్నాయా? పోని, తమనుతామైనా కాపాడుకో గలుగుతున్నాయా?' ఆ తర్వాత ఆ మిథ్యాదైవాలను, ఈభ్రష్టుల్ని, షైతాన్ అనుచర మూకను అందర్నీ ఒకరిమీద ఒకర్నిపడవేసి నరకంలోకి త్రోసివేస్తారు." (ఖురాన్-26:92-95)

"సత్యాన్ని నిరాకరించినవారు దైవమార్గం నుండి (ప్రజలను) నిరోధించే కార్యకలాపాల కోసం తమ ధనాన్ని వెచ్చిస్తున్నారు. ఇకముందు కూడా మరింత వెచ్చిస్తారు. అయితే చివరికి ఈ (పైశాచిక) కార్యకలాపాలే వారి పశ్చాత్తాపానికి కారణమవుతాయి. ఆ తరువాత వారు (మాకు) లొంగిపోతారు. ఆపై ఈ తిరస్కారులు నరకంవైపు తోలబడతారు. పరిశుభ్రత నుండి మాలిన్యాన్ని వేరుచేసి, ఆ మాలిన్యాలన్నిటిని ఒకదానిపె ఒకటి కుప్పగా పోసి, ఆ కుప్పను నరకంలో పడవేయడానికే దేవుడు ఇలా చేస్తున్నాడు." (ఖుర్ఆన్-8:36,37)

**ప్రవక్త తండ్రి పర్యవసానం :** దైవప్రవక్త ఇబ్రాహీం (అలై) తండ్రి ఆజర్ దైవధర్మాన్ని నిరాకరించి అవిశ్వాసి అయిపోయాడు. పరోకంలో హజ్రత్ ఇబ్రాహీం (అలై) హషర్ మైదానంలో ఆజర్‌ని కలుసుకుంటారు. అప్పుడు ఆజర్ తీవ్ర పశ్చాత్తాపంతో ఆందోళన పడుతుంటాడు. అతని ముఖం దుమ్ము కొట్టుకొని నల్లగా ఉంటుంది. హజ్రత్ ఇబ్రాహీం (అలై) అతనితో "నాకు అవిధేయత చూపవద్దని నేను ముందే చెప్పలేదూ?" అని అంటారు. దానికి ఆజర్ "ఇప్పుడు నేను మీకు అవిధేయత చూపను" అంటాడు.

అప్పుడు హజ్రత్ ఇబ్రాహీం (అలైహి) విశ్వప్రభుని ప్రార్థిస్తూ "ప్రభూ! ప్రళయదినాన నన్ను అవమానానికి గురిచేయరని మీరు నాకు వాగ్దానం చేసివున్నారు. నా తండ్రి హతమయిపోతున్నాడు. ఇంతకంటే అవమానం నాకింకేముంది?" అని అంటారు. దానికి విశ్వప్రభువు సమాధానమిస్తూ "నేను అవిశ్వాసులకు స్వర్గం నిషేధించాను. (ఇక నీ తండ్రి నరక శిక్ష నుండి తప్పించుకో లేడు" అని చెబుతాడు. ఆ తరువాత ఆయన "నీ కాళ్ళ మధ్య ఏముందో కాస్త చూడు" అంటాడు. హజ్రత్ ఇబ్రాహీం (అలైహి) తన కాళ్ళ వైపు చూస్తారు. కాళ్ళ మధ్య ఆయనకు ఓ పెద్ద తేలు కన్పిస్తుంది. తరువాత దాన్ని ఎత్తి నరకంలో పడవేయడం జరుగుతుంది. (బుఖారి)

**యూదులు, క్రైస్తవుల పరిస్థితి :** ప్రళయదినాన యూదులు, క్రైస్తవుల్ని గురించి కూడా తీర్పు జరుగుతుంది. దేవుడు హజ్రత్ ఈసా (అలై)ను ఈవిధంగా ప్రశ్నిస్తాడు:

"ఆ తరువాత దేవుడు (ప్రళయ దినాన) ఈసాను నిలబెట్టి 'మర్యం కుమారుడ వయిన ఈసా! నన్ను కాదని నిన్ను, నీ తల్లిని దేవుళ్ళుగా చేసుకొని ఆరాధించాలని నీవు ప్రజలకు

బోధించావా?' అని అడుగుతాడు. దానికి ఈసా ఇలా అంటాడు: 'మీరెంతో పవిత్రులు, పరిశుద్ధులు. నాకు అధికారంలేని విషయం గురించి నేనెలా అనగలను? నేనలాంటి మాటేదైనా అని ఉంటే అది తప్పకుండా మీ దృష్టికి వచ్చేది. నా అంతరంగంలో ఏముందో మీకు బాగా తెలుసు. కాని మీ అంతరంగంలో ఏముందో నాకే మాత్రం తెలియదు. మీరు సమస్త అగోచర విషయాలు ఎరిగినవారు." (ఖుర్ఆన్-5:116-117)

"మీరు ఆదేశించిన విషయాలే నేను వారికి బోధించాను. నా ప్రభువు, మీ ప్రభువు కూడా అయిన దేవుడ్ని మాత్రమే ఆరాధించండని నేను వారికి చెప్పాను. వారి మధ్య జీవించి ఉన్నంతవరకే నేను వారిని కనిపెట్టుకొని ఉన్నాను. మీరు నన్ను పైకెత్తుకున్న తరువాత వారిని మీరే కనిపెట్టుకొని ఉన్నారు. మీరు అందర్నీ, అన్ని విషయాల్ని (అన్ని వేళలా) కనిపెడ్తూ ఉంటారు. ఇప్పుడు మీరు వారిని శిక్షిస్తే వారు మీ దాసులే. ఒకవేళ క్షమిస్తే మీరు ఎంతో శక్తిమంతులు, మహా వివేకవంతులు." (ఖుర్ఆన్-5:118)

## 104. సాధారణ సిఫారసు

అబూసయీద్ (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "ప్రళయదినాన నేను యావత్తు ఆదంసంతానానికి నాయకుడ్ని అవుతాను. దీన్ని గురించి నేను గర్వంగా చెప్పడం లేదు. నా చేతిలో స్తుతిపతాకం ఉంటుంది. నేను గర్వంగా చెప్పడం లేదు. ఆరోజు మానవులే కాకుండా యావన్మంది దైవప్రవక్తలు నా పతాకం క్రింద ఉంటారు. నేల(సమాధి) నుండి నేను అందరికంటే ముందు బయల్పడతాను." (తిర్మిజి)

ప్రళయదినాన పరిస్థితి చాలా దుర్భరంగా ఉంటుంది. సూర్యుడు వారికి చాలా దగ్గరగా తీసుకురాబడతాడు. దాంతో ఒకవైపు తీక్షణమైన ఎండ, ఉక్కపోతలు, మరోవైపు ఇసుకపోస్తే రాలనంత అత్యధిక జనసంఖ్యతో సముద్రకెరటాల్లా పరస్పరం కలసిపోతూ మానవులు తీవ్రంగా ఆందోళన చెందుతుంటారు.

మానవులు ఈ పరిస్థితి భరించలేక ఈ ఆపద నుండి విముక్తి కోసం సిఫారసు చేయించుకోవడానికి వివిధ దైవప్రవక్తల దగ్గరకు వెళ్తారు. కాని ఎవరూ దేవుని దగ్గర సిఫారసు చేయడానికి సాహసించలేరు. చివరికి అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (సల్లం) దగ్గరకు వెళ్తే ఆయన సిఫారసు చేయడానికి అంగీకరిస్తారు. ఈ విషయాన్ని స్వయంగా మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) ఈ విధంగా తెలియజేస్తున్నారు:

"ప్రళయదినాన నేను మానవులందరికీ నాయకత్వం వహిస్తాను. ఆరోజు పరిస్థితి ఎలా ఉంటుందో తెలుసా? దేవుడు ఆది నుండి అంతం వరకుండిన మానవులనందర్నీ ఒక మైదానంలో సమీకరిస్తాడు. చూసేవాడు అందర్నీ చూస్తాడు. పిలిచేవాడు అందరికీ తన పిలుపు విన్పిస్తాడు. సూర్యుడు మానవులకు చాలా దగ్గరగా వస్తాడు. దానివల్ల మానవులు ఎంతో ఆందోళన పడుతుంటారు. వారి పరిస్థితి చాలా దుర్భరంగా ఉంటుంది.

మానవులు ఈ విపత్కర పరిస్థితి భరించలేక పరస్పరం మాట్లాడుకుంటూ "మనం ఈ ఆపద నుండి బయటపడాలంటే మన ప్రభువు సన్నిధిలో సిఫారసు చేసే వ్యక్తిని



వెతకాలి" అంటారు. వారిలో కొందరు "ఈ పనికి మన పితామహుడు హజ్రత్ ఆదం (అలైహి) తగిన వ్యక్తి. ఆయన దగ్గరికెళ్ళి మనవి చేద్దాం" అంటారు.

**హజ్రత్ ఆదం (అలైహి) పొరపాటు :** ఆ తరువాత మానవులు హజ్రత్ ఆదం (అలైహి) దగ్గరకు వెళ్ళి "ఆదం మహాశయా! మీరు మానవుల పితామహులు. దేవుడు మిమ్మల్ని తన స్వహస్తాలతో సృజించాడు. మీ దేహంలోకి తన ఆత్మను ఊదాడు. దైవదూతల్ని ఆదేశించగానే వారంతా మీకు సాష్టాంగప్రణామం చేశారు. దేవుడు మిమ్మల్ని స్వర్గంలో వసింపజేశాడు. మరి మీరు మీ ప్రభువు దగ్గర మాకోసం సిఫారసు చేయరూ? మేమెలాంటి ఆపదలో ఉన్నామో చూస్తున్నారు కదా!" అని అభ్యర్థిస్తారు.

దానికి హజ్రత్ ఆదం (అలై) ఇలా చెబుతారు: "ఈరోజు నాప్రభువు ఇంతకుపూర్వం ఎన్నడూ లేనంత ఆగ్రహోదగ్రుడై ఉన్నాడు. ఇకముందు కూడా ఇంత రౌద్రంగా ఉండడు. (నావల్ల ఒక పొరపాటు జరిగిపోయింది. షైతాన్ నన్ను మభ్యపెట్టాడు.) నా ప్రభువు నన్ను ఒక చెట్టు దగ్గరకు పోవద్దని వారిస్తే నేను ఆయన ఆజ్ఞను పాటించలేకపోయాను. (దాన్ని గురించే నేను చాలా విచారిస్తున్నాను.) ఇప్పుడు ప్రతిమనిషీ తనను గురించి తప్ప ఇతరుల్ని గురించి ఆలోచించే పరిస్థితిలో లేడు. మీరు మరొకరి దగ్గరకు వెళ్ళండి. నూహ్ (అలైహి) దగ్గరకు వెళ్ళండి. ఆయన మీ కోసం సిఫారసు చేయవచ్చు."

**హజ్రత్ నూహ్ (అలైహి) పొరపాటు :** మానవులు ఆదం (అలైహి) దగ్గర్నుంచి బయలుదేరి హజ్రత్ నూహ్ (అలై) దగ్గరకి వెళ్తారు. ఆయనతో ఇలా మనివి చేసుకుంటారు: "(నూహ్ మహాశయా!) మీరు (అవిశ్వాసులకు దైవసందేశం అందజేయడానికి) భూవాసుల దగ్గరకు పంపబడిన మొట్ట మొదటి దైవప్రవక్త. దేవుడు మిమ్మల్ని కృతజ్ఞుడైన దాసుడిగా అభివర్ణించాడు. మేమిక్కడ ఎలాంటి ఆపదలో చిక్కుకున్నామో మీరు చూస్తూనే ఉన్నారు కదా! మా పరిస్థితి చాలా దుర్భరంగా ఉంది. కనుక మీరు మా కోసం మీ ప్రభువు సన్నిధిలో సిఫారసు చేయరూ?"

హజ్రత్ నూహ్ (అలైహి) వారి సంగతి విని ఇలా అంటారు: "ఈరోజు నా ప్రభువు ఇంతకు పూర్వం ఎన్నడూ లేనంత ఆగ్రహోదగ్రుడయి ఉన్నాడు. ఇకముందు కూడా ఇంత రౌద్రంగా ఉండడు. (నా వల్ల ఒక పొరపాటు జరిగిపోయింది.) నేను నా జాతి ప్రజలను శపించాను. (దాన్ని గురించి దేవుడు నన్ను నిలదీస్తాడేమోనని భయపడు తున్నాను.) ఇప్పుడు ప్రతి మనిషీ తనను గురించి తప్ప ఇతరుల్ని గురించి ఆలోచించే పరిస్థితిలో లేడు. మీరు మరొకరి దగ్గరకు వెళ్ళండి. ఇబ్రాహీం (అలైహి) దగ్గరకు వెళ్ళండి. (ఆయన మీ కోసం సిఫారసు చేయవచ్చు)."

**హజ్రత్ ఇబ్రాహీం (అలైహి) పొరపాటు :** మానవులు అక్కడ్నుంచి కదలి హజ్రత్ ఇబ్రాహీం (అలైహి) దగ్గరకెళ్ళి ఇలా మనవి చేసుకుంటారు- "(మహాశయా!) మీరు దేవుని సందేశహరులు. భూవాసులందరిలో కెల్లా మీరు దేవునికి ప్రియమైనవారు, దేవుని మిత్రులు. అంచేత మీరు మాకోసం మీప్రభువు సన్నిధిలో సిఫారసు చేయండి. మేమిక్కడ ఎలాంటి ఆపదలో చిక్కుబడి ఉన్నామో మీరు చూస్తూనే ఉన్నారు."

హజ్రత్ ఇబ్రాహీం (అలై) వారి మాటలు విని ఇలా అంటారు: "ఈరోజు నా ప్రభువు ఇంతకు పూర్వం ఎన్నడూ లేనంత ఆగ్రహోదగ్రుడై ఉన్నాడు. ఇకముందు కూడా ఇంత రౌద్రంగా ఉండడు. (నా వల్ల ఒక పొరపాటు జరిగింది.) నేను మూడుసార్లు నిజం చెప్ప లేకపోయాను. (దాన్ని గురించి దేవుడు నన్ను నిలదీస్తాడేమోనని భయపడుతున్నాను.) ఇప్పుడు ప్రతి మనిషీ తనను గురించి తప్ప ఇతరుల్ని గురించి ఆలోచించే పరిస్థితిలో లేడు. మీరు మరొకరి దగ్గరకు వెళ్ళండి. మూసా (అలైహి) దగ్గరకు వెళ్ళండి."

**హజ్రత్ మూసా (అలైహి) పొరపాటు :** మానవులు అక్కడ్నుంచి కదలి హజ్రత్ మూసా (అలైహి) దగ్గరకు వెళ్ళి ఇలా మనవి చేసుకుంటారు- "(మహాశయా!) మీరు దేవుని సందేశహరులు. దేవుడు మీకు తన సందేశాల్ని పంపాడు. ఆయన మీతో ముఖాముఖి సంభాషించాడు. ఈవిధంగా దేవుడు మీకు మానవులందరి కంటే ఎక్కువ ఔన్నత్యం ప్రసాదించాడు. మీరు మాకోసం మీ ప్రభువు సన్నిధిలో సిఫారసు చేయండి. మేమిక్కడ ఎలాంటి ఆపదలో పడి ఉన్నామో మీరు చూస్తున్నారు కదా!"

హజ్రత్ మూసా (అలైహి) వారి మాటలు విని ఇలా అంటారు: "ఈరోజు నా ప్రభువు ఇంతకు పూర్వం ఎన్నడూ లేనంత ఆగ్రహోదగ్రుడయి ఉన్నాడు. ఇకముందు కూడా ఇంత రౌద్రంగా ఉండడు. (నా వల్ల ఒక పొరపాటు జరిగిపోయింది.) నాకు ఎలాంటి ఆజ్ఞ లభించక పోయినా నేనొక వ్యక్తిని హతమార్చాను. (దాన్ని గురించి దేవుడు నన్ను నిలదీస్తాడేమోనని భయపడుతున్నాను.) ఇప్పుడు ప్రతి మనిషీ తనను గురించి తప్ప ఇతరుల్ని గురించి ఆలోచించే పరిస్థితిలో లేడు. మీరు మరొకరి దగ్గరకు వెళ్ళండి. ఈసా (అలైహి) దగ్గరకు వెళ్ళండి. (ఆయన మీ కోసం సిఫారసు చేయవచ్చు)."

**హజ్రత్ ఈసా (అలైహి) పొరపాటు :** మానవులు అక్కడ్నుంచి కదలి హజ్రత్ ఈసా (అలైహి) దగ్గరకెళ్ళి ఇలా మనవి చేసుకుంటారు- "ఈసా మహాశయా! మీరు దేవుని సందేశహరులు. ఆయన దివ్యవచనం. ఆయన దాన్ని మర్యం (అలైహి) దగ్గరకు పంపాడు. మీరు దేవుడు పంపిన విశిష్ఠ ఆత్మ. అదీగాక మీరు ఊయలలో ఉన్నప్పుడే ప్రజలతో మాట్లాడారు. మరి మీరు మాకోసం మీప్రభువు సన్నిధిలో సిఫారసు చేయరూ? మేమిక్కడ ఎలాంటి దుస్థితిలో చిక్కుకున్నామో మీరు చూస్తున్నారు కదా!

"హజ్రత్ ఈసా (అలైహి) వారి మాటలు విని ఇలా అంటారు: "ఈరోజు నా ప్రభువు ఇంతకు పూర్వం ఎన్నడూ లేనంత ఆగ్రహోదగ్రుడయి ఉన్నాడు. ఇకముందు కూడా ఇంత రౌద్రంగా ఉండడు. ఇప్పుడు ప్రతి మనిషీ తనను గురించి తప్ప ఇతరుల్ని గురించి ఆలోచించే పరిస్థితిలో లేడు. మీరు మరొకరి దగ్గరకు వెళ్ళండి. ముహమ్మద్ (సల్లం) దగ్గరకు వెళ్ళండి. (ఆయన మీ కోసం సిఫారసు చేయవచ్చు)."

అప్పుడు మానవులంతా నా దగ్గరకు వచ్చి ఇలా అంటారు: "ముహమ్మద్ మహనీయా (సల్లం)! మీరు అంతిమ దైవసందేశహరులు. దేవుడు మీ పొరపాట్లన్నీ మన్నించాడు. కనుక మీరు మాకోసం మీ ప్రభువు సన్నిధిలో సిఫారసు చేయండి. మేమిక్కడ ఎలాంటి ఆపదలో పడి కొట్టుమిట్టాడుతున్నామో మీరు చూస్తూనే ఉన్నారు."



**స్తుతి స్థానం :** అప్పుడు నేను దేవుని సన్నిధికి వెళ్తాను. ఆయన సింహాసనం క్రిందికి చేరుకొని సాష్టాంగపడతాను. (మరొక ఉల్లేఖనంలో "నీప్రభువు నిన్ను స్తుతిస్థానం (మఖామె మహ్మూద్)లో నిలబెడ్తాడు" అనే ఖుర్‌ఆన్ సూక్తి పఠించి, దేవుడు నాకు వాగ్దానం చేసిన స్తుతిస్థానం ఇదే అంటారు.) ఆ సమయంలో దేవుడు నా హృదయంలో తనను ప్రశంసించేందుకు ఓ ప్రత్యేక స్తోత్రం ఆవిష్కరిస్తాడు. అంతటి శ్రేష్ఠమైన స్తోత్రం ఇంతకు పూర్వం ఎవరి హృదయంలోనూ ఆవిష్కరించలేదు. (నేను సాష్టాంగప్రణామం స్థితిలో ఉండి ఈ స్తోత్రగానం చేస్తాను.)

ఆ తరువాత సృష్టికర్త "ముహమ్మద్! తల పైకెత్తు. నీకేం కావాలో కోరుకో, నీ కోరిక తీరుస్తాను. ఏదైనా సిఫారసు చేయదలచుకుంటే సిఫారసు చెయ్యి. నీ సిఫారసు ఆమోదిస్తా" అనంటాడు. అప్పుడు నేను తలపైకెత్తి "ప్రభూ! నా అనుచర సముదాయం, ప్రభూ! నా అనుచర సముదాయంపై దయజూపు. ప్రభూ! నా అనుచర సముదాయాన్ని కనికరించు" అని ప్రాధేయపడ్తాను.దానికి విశ్వప్రభువు ఇలా అంటాడు: "సరే, నీ అనుచర సముదాయంలో కర్మ విచారణ లేనివారిని స్వర్గద్వారాలలోని కుడివైపు ద్వారాల గుండా లోపలికి ప్రవేశింపజేయి. ఆ ద్వారాల గుండానే కాకుండా వేరే ద్వారాల గుండా కూడా స్వర్గంలో ప్రవేశింప జేయవచ్చు."

మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) ఈ విషయం చెబుతూ "నా ప్రాణం ఎవరి అధీనంలో ఉందో ఆ శక్తిస్వరూపుని సాక్షి! ఆ స్వర్గద్వారాలు మక్కా, హజర్‌ల మధ్య ఎంత దూరం ఉందో అంత వెడల్పుగా ఉంటాయి." (బుఖారి, ముస్లిం)

## కౌసర్ సరోవరం

హషర్ మైదానంలో అనేక సరోవరాలు ఉంటాయి. ఒక్కొక్క సరోవరం ఒక్కొక్క దైవప్రవక్తకు కేటాయించబడుతుంది. ఆయా దైవప్రవక్తలు తమతమ అనుచర సము దాయం ప్రజలకు వాటి నీటిని తాగిస్తారు. అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (సల్లం)కు కౌసర్ అనే ఓ ప్రత్యేక సరోవరం కేటాయించబడుతుంది. దాన్ని గురించి ఖుర్‌ఆన్‌లో దేవుడు ఈవిధంగా ప్రస్తావించాడు:

"(ముహమ్మద్!) మేము నీకు కౌసర్ (సరోవరం) ప్రసాదించాము. కనుక నీవు నీ ప్రభువు (ప్రసన్నత) కోసమే ప్రార్థన చెయ్యి; ఆయన కోసమే త్యాగం చెయ్యి. నీ శత్రువే భవిష్యత్తులేని దౌర్భాగ్యుడు." (107:1-3)

అంతిమ దైవప్రవక్త (స) ఈ సరోవరాలను గురించి ప్రస్తావిస్తూ "ప్రతి దైవప్రవక్తకూ ఒక సరోవరం ఉంటుంది. ఎవరి సరోవరం దగ్గరికి తాగేవాళ్ళు ఎక్కువ మంది వస్తారోనని దైవప్రవక్తలందరూ అనుకుంటారు. అందరి సరోవరాల కంటే నా సరోవరం దగ్గరికి అత్యధిక మంది జనం వస్తారని నేను ఆశిస్తున్నాను" అని అన్నారు.

(దానిక్కారణం ఇతర దైవప్రవక్తల అనుచరులకంటే అంతిమ దైవప్రవక్త (సల్లం) అనుచరులే అత్యధిక సంఖ్యలో ఉంటారు.) (తిర్మిజి)

హజ్రత్ అనస్ (రజి) దైవప్రవక్త (సల్లం)తో మాట్లాడుతూ "మీరు ప్రళయదినాన నా కోసం సిఫారసు చేయండి" అన్నారు. దానికి దైవప్రవక్త (సల్లం) "ఆ... నేను నీకోసం

సిఫారసు చేస్తాను" అని చెప్పారు. అప్పుడు హజ్రత్ అనస్ (రజి) "అయితే నేనారోజు మిమ్మల్ని ఎక్కడ వెతకనూ?" అని అడిగారు. "నీవు నన్ను పుల్‌సిరాత్ (వంతెనమార్గం) దగ్గర వెతుకు" అన్నారు దైవప్రవక్త (సల్లం).

"ఒకవేళ అక్కడ మీరు కన్పించకపోతే?" అని మళ్ళీ ప్రశ్నించారు హజ్రత్ అనస్ (రజి). "కర్మలత్రాసు దగ్గర వెతుకు" అన్నారు దైవప్రవక్త (సల్లం). "అక్కడా కన్పించకపోతే మరెక్కడ వెతకను మిమ్మల్ని?" అని అడిగారు హజ్రత్ అనస్ (రజి). "అక్కడ కన్పించకపోతే (కౌసర్) సరోవరం దగ్గర వెతుకు. ఈ మూడిటిలో ఏదో ఒక చోట నేను నీకు తప్పకుండా కన్పిస్తాను" అని చెప్పారు దైవప్రవక్త (సల్లం) (అయిజా)

**కౌసర్ సరోవరం :** అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (సల్లం) కౌసర్ సరోవరాన్ని గురించి తమ అనుచరులకు ఇలా తెలియజేశారు- "నా సరోవరం ఎంతో పొడవుగా, వెడల్పుగా ఉంటుంది. ఒక చివరి నుంచి రెండవ చివరికి పోవాలంటే ఒక నెల పడుతుంది. పొడువు, వెడల్పు సమానంగా ఉంటాయి. అందులోని నీరు పాలకన్నా తెల్లగా ఉంటుంది. దాని పరిమళం కస్తూరీ కన్నా బాగుంటుంది. అక్కడి చెంబులు ఆకాశంలోని నక్షత్రాల్లా అసంఖ్యాకంగా ఉంటాయి. ఎవరైనా అందులోని నీరు ఒక్క సారి తాగితే చాలు, ఇక అతనికి దాహమే ఉండదు." (బుఖారి)

వేరొక హదీసులో దైవప్రవక్త (సల్లం) కౌసర్ సరోవరాన్ని గురించి ఈవిధంగా వర్ణించారు: "నా సరోవరం ఎంతో విశాలంగా ఉంటుంది. దాని రెండు చివరల మధ్య దూరం అయిలా, అదన్‌ల మధ్య ఉన్న దూరంకంటే ఎక్కువగా ఉంటుంది. దాని నీరు మంచుకన్నా తెల్లగా, పాలలో కలిపిన తేనెకంటే తియ్యగా ఉంటుంది. అక్కడుండే చెంబులు నక్షత్రాలకన్నా ఎక్కువ సంఖ్యలో ఉంటాయి. అవి వెండి, బంగారు చెంబులు. ఒంటెల యజమాని తన నీటి తొట్టి దగ్గరకు ఇతరుల ఒంటెలు రాకుండా అడ్డుకునేలా నేను నా సరోవరం దగ్గరకు ఇతరులు రాకుండా అడ్డుకుంటాను."

**ఉజూ ప్రభావం :** ప్రవక్త అనుచరులు ఈ మాట విని "దైవప్రవక్తా! ఆరోజు మీరు మమ్మల్ని గుర్తుపడ్తారా?" అని అడిగారు. దానికి దైవప్రవక్త (సల్లం) "తప్పకుండా గుర్తుపడ్తాను. ఎవరికీ లేనటువంటి ఒక గుర్తు మీకుంటుంది. మీరు ఆరోజు నా సరోవరం దగ్గరకు వచ్చినప్పుడు ఉజూ ప్రభావంతో మీ ముఖాలు తేజోవంతంగా, మీ కాళ్ళుచేతులు తెల్లగా ఉంటాయి." అని అన్నారు. (బుఖారి, ముస్లిం)

దైవప్రవక్త (స) కౌసర్ సరోవరం దగ్గరికి వచ్చేవారిని గురించి చెబుతూ "నా సరోవరం దగ్గరకు నీళ్ళు తాగడానికి అందరికన్నా ముందు ముహాజిర్ పేదలు (దైవధర్మం పరిరక్షణ కోసం వలసపోయిన పేదవాళ్ళు) వస్తారు" అన్నారు. ప్రవక్త అనుచరులు ఈమాట విని "వారి పరిస్థితి ఏమిటో కాస్త వివరించండి" అన్నారు. దానికి ఆయన ఇలా వివరించారు:

"వారి శిరోజాలు చెదరిపోయి ఉంటాయి. ముఖాలు వాడిపోయి ఉంటాయి. (ధనికుల) ఇండ్లద్వారాలు వారికోసం తెరవబడవు. మంచి (గోత్రం, అందచందాలుండే) స్త్రీలు వారి వివాహబంధంలో ఇవ్వబడరు. ఎవరి హక్కయినా నెరవేర్చవలసివుంటే దాన్ని



వారు పూర్తిగా నెరవేరుస్తారు. ఎవరి మీదైనా తమ హక్కుంటే దాన్ని పూర్తిగా తీసుకోరు. తమకు రావలసిన హక్కులో కొంత వదలుకుంటారు." (తర్గీబ్ వ తర్హీబ్)

**నీటి నుండి నిరోధించబడేవారు :** మహాప్రవక్త (స) కౌసర్ సరోవరం దగ్గరకు రాకుండా నిరోధించబడేవారిని గురించి తెలియజేస్తూ ఇలా చెప్పారు:

"ప్రళయదినాన కౌసర్ సరస్సు దగ్గర మీరు నన్ను కలుసుకుంటారు. నా దగ్గరకు వచ్చి (ఈ సరస్సు నీరు) తాగి వెళ్ళే ప్రతి మనిషీ ఇక ఎన్నటికీ దప్పిక గొనడు. అయితే ఆరోజు కొందరు నీరు తాగడానికి నా దగ్గరకు రావడానికి ప్రయత్నిస్తారు. నేను వాళ్ళను గుర్తిస్తాను, వారు నన్ను గుర్తుపడ్తారు. కాని (వాళ్ళను నా దగ్గరకు రాకుండా నిరోధించడం జరుగుతుంది.) వారికి, నాకు మధ్య ఒక అడ్డు ఏర్పడుతుంది. (బుఖారి)

(బుఖారిలోని మరో ఉల్లేఖనంలో దైవదూతలు వారిని కొట్టి గెంటివేస్తారని ఉంది.) దాంతో వారు ఈ నీరు తాగడానికి నోచుకోలేరు. నేను "వీళ్ళు నావాళ్ళు కదా (ఎందుకు వీళ్ళను నిరోధిస్తున్నారు)?" అని అడుగుతాను. దానికి (దైవదూతల నుండి) "మీ తద నంతరం వీళ్ళు (ధర్మంలో) ఎలాంటి కొత్త కొత్త విషయాలు తీశారో మీకు తెలియదు" అని సమాధానం వస్తుంది. నేనీ మాట విని "దూరంగా ఉండండి. నా తదనంతరం ధర్మం రూపురేఖల్ని మార్చివేసినవారు దూరంగా ఉండండి" అనంటాను.

## 105. సాక్ష్యాధారాలు

ప్రళయదినాన కర్మవిచారణకై సాక్షులు, ఇతర ఆధారాలన్నీ ముందుకు తీసుకు రాబడతాయి. అక్కడ అబద్ధాలు, అసత్యసాక్ష్యాలకు ఎలాంటి ఆస్కారం ఉండదు. నేరస్థులు ఏవిధంగానూ తప్పించుకోలేరు. ఖుర్‌ఆన్‌లోని ఈ సూక్తులు చూడండి.

"ఆరోజు మానవునికి అతను ముందుకు పంపుకున్నవీ, వెనుక వదలి వచ్చినవీ అన్నీ తెలియజేయబడతాయి. అతను ఎన్ని సాకులు చూపినా, తనను గురించి స్వయంగా తానే బాగా ఎరగ్గలడు." (75:13-15)

"మేము (తీర్పుదినాన) ప్రతి అనుచర సముదాయం నుండి ఒక సాక్షి (ప్రవక్త)ని తెచ్చి నిలబెట్టినప్పుడు అవిశ్వాసులకు (తమ గోడు వెళ్ళబోసుకోవడానికి) ఏమాత్రం అనుమతి లభించదు. క్షమాపణ వేడుకోండని కూడా చెప్పడం జరగదు." (16:84)

"మేము ప్రతి అనుచర సముదాయంలో ఆ సముదాయానికే చెందిన ఒక సాక్షి (ప్రవక్త)ని తెచ్చి నిలబెడ్తాము. అతనా సముదాయానికి ప్రతికూలంగా సాక్ష్య మిస్తాడు. అప్పుడు వీరికి ప్రతికూలంగా సాక్ష్యమివ్వడానికి మేము నిన్ను తీసుకొచ్చి నిలబెడ్తాము." (16:89)

"(ముహమ్మద్!) మేము (పరలోకంలో) ప్రతి సమాజం నుండి ఒక సాక్షిని తెచ్చి, ఆ సాక్షులపై నిన్ను సాక్షిగా నిలబెట్టే రోజున వీరి పరిస్థితి ఏమవుతుంది? అప్పుడు దైవ ప్రవక్తను నిరాకరించి, అతనికి అవిధేయులయిన అవిశ్వాసులు (పశ్చాత్తాపంతో కుమిలి పోతూ) "అయ్యయ్యో! భూమి బ్రద్దలయి తామందులో కూరుకుపోతే బాగుండ"ని వాపోతారు. కాని వారు దేవుని దగ్గర ఏ విషయాన్నీ దాచలేరు." (4:41-42)

**శరీరావయవాల సాక్ష్యం :** "దైవవిరోధుల్ని నరకానికి తీసికెళ్లేందుకు వారిని చుట్టుముట్టి తీసుకొచ్చే రోజు గురించి ఊహించు. అప్పుడు ముందొచ్చినవారిని వెనుక వచ్చినవారు దగ్గరికొచ్చేదాకా ఆపివేయడం జరుగుతుంది. అలా అందరూ అక్కడికి చేరుకున్న తరువాత వారి కళ్ళు, చెవులు, చర్మాలు వారు ప్రపంచంలో ఉన్నప్పుడు ఏమేమి చేసేవారో సాక్ష్యమిస్తాయి. అప్పుడు వారు తమ చర్మాలను ఉద్దేశించి "మీరు మాకు వ్యతిరేకంగా ఎందుకు సాక్ష్యమిస్తున్నారు?" అని అడుగుతారు. దానికవి ఇలా సమాధానమిస్తాయి:

"ప్రతి వస్తువుకు మాట్లాడే శక్తినిచ్చిన దేవుడే మాకూ మాట్లాడే శక్తినిచ్చాడు. ఆయనే మిమ్మల్ని మొదటిసారి పుట్టించాడు. ఇప్పుడు ఆయన దగ్గరికే మీరు తీసుకురాబడ్డారు. మీరు రహస్యంగా నేరాలు చేస్తున్నప్పుడు, ఎప్పుడో ఓసారి మీ కళ్ళు, చెవులు, చర్మాలు కూడా మీకు వ్యతిరేకంగా సాక్ష్యమిస్తాయన్న ఆలోచనే మీకు కలగలేదు. పైపెచ్చు మీరు చేసే దుష్కార్యాలు అనేకం దేవునికి కూడా తెలియదని మీరు భావిస్తుండేవారు. దేవుడ్ని గురించి మీలో ఏర్పడిన ఈ దుష్టభావనే మిమ్మల్ని (నట్టేట) ముంచింది." (41:19-23)

"ఈరోజు మేము వీరి నోళ్ళను కట్టివేస్తున్నాం. వీరు ప్రపంచంలో ఏమేమి చేస్తుండేవారో వీరి చేతులు మాకు చెబుతాయి, వీరి కాళ్ళు సాక్ష్యమిస్తాయి". (36:65)

హజ్రత్ అనస్ (రజి) ఉల్లేఖనం: ఒకసారి మేము దైవప్రవక్త (సల్లం) దగ్గర కూర్చొని ఉన్నప్పుడు దైవప్రవక్త (సల్లం) హఠాత్తుగా నవ్వారు. తరువాత "నేనెందుకు నవ్వానో మీకు తెలుసా?" అని ప్రశ్నించారు ఆయన. దానికి మేము "దేవునికి, ఆయన ప్రవక్తకు మాత్రమే తెలుసు" అన్నాం. అప్పుడాయన ఇలా చెప్పారు:

"దేవునికి దాసునికి మధ్య జరిగే ప్రశ్నోత్తరాల విషయం గుర్తుకొచ్చి నేను నవ్వాను. దాసుడు దేవునితో 'మీరు నన్ను అన్యాయం నుండి (కాపాడుతామని వాగ్దానం చేసి) నన్ను తృప్తిపరచలేదా?' అంటాడు. దానికి దేవుడు 'నేనిలా వాగ్దానం చేశాను' అంటాడు. దాసుడు 'నేను నావ్యవహారంలో ఎవరి సాక్ష్యాన్నీ ఒప్పుకోను. నాలోనే ఏదైనా సాక్ష్యమిస్తే నమ్ముతాను' అనంటాడు. దానికి దేవుడు 'ఈరోజు నీ వ్యవహారంలో నీలోని సాక్ష్యమే చాలు. కర్మలు నమోదు చేసేవారి సాక్ష్యం కూడా సరిపోతుంది' అంటాడు.

ఆతర్వాత అతని నోటికి సీలు వేయబడుతుంది. అతని అవయవాలకు మాట్లాడమని ఆజ్ఞవుతుంది. దాంతో ఆ అవయవాలు అతను చేసిన కర్మల్ని బయటపెడ్తాయి. అప్పుడా ఆ దాసుడు 'పోండి నా దగ్గర్నుంచి. నేను మిమ్మల్ని నరకయాతనల నుంచి కాపాడటానికి వాదిస్తుంటే (మీరు నాకే వ్యతిరేకంగా సాక్ష్యమిస్తున్నారా?)' అనంటాడు." (ముస్లిం)

**పుడమి సాక్ష్యం :** మానవులు భూమండలంపై ఉన్నపుడు ఏమేమి కర్మలు ఆచరించారో ఆ విషయాలన్నీ భూమి ప్రళయదినాన దేవుని న్యాయస్థానంలో బట్టబయలు చేస్తుంది.

దైవప్రవక్త (స) ముందుగా ఈసూక్తి పఠించారు: "ఆరోజు భూమి తన (మీద జరిగిన) పరిస్థితులు వివరిస్తుంది." (ఖుర్ఆన్-99:4) ఆతరువాత "భూమి తన పరిస్థితులు వివరించడం అంటే ఏమిటో మీకు తెలుసా?" అని అడిగారు ఆయన తన అనుచరుల్ని. దానికి వారు దేవునికి, ఆయనప్రవక్త (స)కు మాత్రమే బాగా తెలుసు" అన్నారు. అప్పుడు దైవప్రవక్త



(స) ఇలా చెప్పారు- "భూమి తన పరిస్థితులు వివరించడమంటే, భూమి తన ఉపరితలంపై స్త్రీలు, పురుషులు చేసిన కర్మలకు వ్యతిరేకంగా సాక్ష్యం ఇస్తుందన్న మాట. 'నామీద ఇతను ఫలానా రోజు ఫలానా పని చేశాడ'ని చెబుతుంది." (అహ్మద్, తిర్మిజి)

"ఆరోజు దేవుడు వారిని, నిజదేవుడ్ని వదలి వారు పూజించిన మిథ్యాదైవాలను ఒక చోట చేర్చుతాడు. అప్పుడాయన మిథ్యాదైవాలను ఉద్దేశించి "నా యీ దాసులను మీరు అపమార్గం పట్టించారా లేక వారంతటవారే దారితప్పారా?" అని అడుగుతాడు.

వారిలా అంటారు: '(దేవదేవ! ఎంతమాట!!) మీరు ఎంతో పరిశుద్ధులు. మిమ్మల్ని గాకుండా మరొకర్ని రక్షకుడిగా, పోషకుడిగా చేసుకోమని చెప్పేంతటి వాళ్ళమా మేము? అసలు మీరే వారికి, వారి తాతముత్తాతలకు పుష్కలంగా జీవనసామగ్రి ప్రసాదించారు. చివరికి వారు (మేలుచేసిన) మిమ్మల్నే మరచి నాశనమయ్యారు". (ఖురాన్-25:17,18)

**ఈసాప్రవక్త (అలైహి) సాక్ష్యం :** "ఆ తర్వాత దేవుడు ఈసాను నిలబెట్టి 'మర్యం కుమారుడవయిన ఈసా! నన్ను కాదని నిన్ను, నీతల్లిని దేవుళ్ళుగా చేసుకొని ఆరాధించాలని నీవు ప్రజలకు బోధించావా?' అని అడుగుతాడు. దానికి ఈసా ఇలా అంటాడు: 'మీరెంతో పవిత్రులు, పరిశుద్ధులు. నాకు అధికారంలేని విషయం గురించి నేనెలా అనగలను? నేనలాంటి మాటేదైనా అని వుంటే అది తప్పకుండా మీదృష్టికి వచ్చేది. నా అంతరంగంలో ఏముందో మీకు బాగా తెలుసు. కాని మీ అంతరంగంలో ఏముందో నాకేమాత్రం తెలియదు. మీరు సమస్త అగోచరవిషయాలు ఎరిగినవారు." (ఖుర్ఆన్- 5:116-117)

"ఆరోజు ప్రతివర్గం (నీల్గుడంతా పోయి నేలచూపులు చూస్తూ) మోకాళ్ళ మీద చతికిలబడి ఉండటం నీకు కన్పిస్తుంది. అప్పుడు ప్రతివర్గాన్నీ తన కర్మలచిట్టా వైపు రమ్మని పిలవడం జరుగుతుంది. తరువాత (దేవుడు) ఇలా అంటాడు: "ఈరోజు మీకు మీరు చేసుకున్న కర్మలకు ప్రతిఫలం లభిస్తుంది. ఇది మేము తయారు చేయించిన కర్మపత్రాలు. మీ గురించి ఇవి ఉన్నవి ఉన్నట్లు సాక్ష్యమిస్తాయి." (45:28,29)

**ముహమ్మద్ అనుచరుల సాక్ష్యం-** హజ్రత్ అబూసయీద్ (రజి) ఉల్లేఖనం:

దైవప్రవక్త (స) ఇలా తెలిపారు: "ప్రళయదినాన నూహ్ ప్రవక్త (అలై)ను ప్రవేశపెడ్తారు. దేవుడు ఆయన్ని 'నీవు ధర్మప్రచారం చేశావా?' అని అడుగుతాడు. దానికాయన 'ప్రభూ! నేను ధర్మప్రచారం చేశాన'ని చెబుతారు. ఆ తర్వాత దేవుడు ఆయన అనుచర సముదాయాన్ని సంబోధిస్తూ 'ఈయన మీ దగ్గరకు (నా)ఆజ్ఞలు చేరవేశాడా?' అని ప్రశ్నిస్తాడు. దానికి వారు 'మా దగ్గరకు హెచ్చరించేవాడు (దైవప్రవక్త) ఎవరూ రాలేద'ని అంటారు. తరువాత దేవుడు నూహ్ప్రవక్త (అలై)ను సంబోధిస్తూ 'నీవాదనను సమర్థిస్తూ సాక్ష్యం చెప్పేవారున్నారా?' అని అడుగుతాడు. దానికి నూహ్ ప్రవక్త (అలై) 'ముహమ్మద్ ప్రవక్త (స), ఆయన అనుచరసముదాయం ఉన్నార'ని సమాధానమిస్తారు. (అప్పుడు మహాప్రవక్త ముహమ్మద్-స తన అనుచరసముదాయాన్ని సంబోధిస్తూ) 'ఆ తర్వాత మిమ్మల్ని ప్రవేశపెట్టడం జరుగుతుంది. మీరు నూహ్ ప్రవక్తను సమర్థిస్తూ, నూహ్ తన జాతి ప్రజలకు ధర్మబోధ చేశారని సాక్ష్యం చెబుతారు' అని అన్నారు. ఆ తర్వాత ఆయన ఖుర్ఆన్లోని

ఈ సూక్తి పఠించారు: "మీరు ప్రపంచ ప్రజలకు సాక్షులుగా ఉండాలని, ప్రవక్త మీకు సాక్షిగా ఉండాలని మేము మిమ్మల్ని మధ్యస్థ సమాజంగా చేశాము." (2:143)

ఇది బుఖారీ షరీఫ్‌లోని ఉల్లేఖనం. ముస్నద్ అహ్మద్‌లోని ఒక ఉల్లేఖనం ప్రకారం "నూహ్ ప్రవక్త (అలై) అనుచర సముదాయమే కాకుండా ఇతర ప్రవక్తల అనుచర సముదాయాలు కూడా తమకు ధర్మబోధ చేయడానికి ఎవరూ రాలేదని అబద్ధమాడుతారు. 'మీరు మీజాతి ప్రజలకు ధర్మబోధ చేశారా?' అని ఆ ప్రవక్తలను ప్రశ్నిస్తే వారు చేశామని చెబుతారు. 'మరి మీ వాదనకు సాక్ష్యం ఉంటే తీసుకురండి' అని అడిగినప్పుడు అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (స) అనుచరసముదాయాన్ని ప్రవేశపెట్టడం జరుగుతుంది. 'ఈ విషయంలో మీరేం అంటార'ని అడిగితే, 'మేమీ ప్రవక్తల వాదనను సమర్థిస్తున్నాము' అంటారు వారు. 'మీకీ సంగతి ఎలా తెలుసని మళ్ళీ అడిగినప్పుడు, 'మా దగ్గరికి మా ప్రవక్త (స) వచ్చి దైవప్రవక్తలంతా తమతమ అనుచర సముదాయాలకు ధర్మబోధ చేశారని తెలియజేశార'ని ముహమ్మద్ (స) అనుచరసముదాయం చెబుతుంది."

ముహమ్మద్ (సల్లం) అనుచర సముదాయం ఇచ్చిన ఈ సాక్ష్యంతో ఇతర దైవ ప్రవక్తల అనుచర సముదాయాలలో సత్యాన్ని తిరస్కరించిన ప్రజలు నేరస్థులని తేలిపోతుంది. అప్పుడు వారికి నరకశిక్ష విధించబడుతుంది.

## 106. ముస్లింల విచారణ

ప్రళయదినాన ప్రతి మనిషీ తన కర్మలకు తానే బాధ్యుడవుతాడు. ఒకరి కర్మలకు మరొకరు బాధ్యులు కాలేరు. అలాగే మనిషి దేవుడ్ని, ఆయన అంతిమ ప్రవక్త (స)ను విశ్వసించిన తరువాత అంతిమ దైవవాణి దివ్యఖుర్ఆన్, దైవప్రవక్త (స) సంప్రదాయాల (హదీసుల) ప్రకారం పూర్తిగా జీవితాంతం నడచుకున్నవారే మోక్షానికి అర్హులవుతారు.

దైవప్రవక్త (స) ప్రవచనం: "మీలో ఎవరూ (కర్మవిచారణ విషయమై) దేవునితో ప్రత్యక్షంగా మాట్లాడని వారుండరు. దాసునికి, అతని ప్రభువుకు మధ్య ఎలాంటి మాధ్యమంగాని, తెరగాని ఉండదు. అప్పుడు దాసుడు తన కుడివైపు చూస్తాడు. అక్కడ అతనికి తన కర్మలు తప్ప మరేమీ కన్పించదు. ఎడమవైపు చూస్తాడు. అక్కడ ఇంతకు ముందు చేసుకొని పంపుకున్న కర్మలు కన్పిస్తాయి. దాసుడు తన ముందు చూసుకుంటాడు. ఎదురుగా నరకం కన్పిస్తుంది. కనుక మీ దగ్గర ఒక ఖర్జూరపు ముక్క ఉన్నా సరే, దాన్ని దానం చేసి నరకం నుండి మిమ్మల్ని మీరు కాపాడుకోండి." (బుఖారి, ముస్లిం)

హజ్రత్ ఆయిషా (రజి) కథనం: ఒక నమాజులో దైవప్రవక్త (స) "దేవా! నానుండి తేలికగా లెక్క తీసుకో" అని ప్రార్థిస్తుంటే విన్నాను. తరువాత నేను 'దైవప్రవక్తా! తేలికగా లెక్కతీసుకోవడమంటే ఏమిట'ని అడిగాను. దానికి ఆయన ఇలా చెప్పారు- "తేలికగా లెక్కతీసుకోవడమంటే, కర్మపత్రాన్ని చూసీచూడనట్లు వదిలేయడం అన్నమాట. ఆయిషా! ఎవరి కర్మపత్రాన్ని క్షుణ్ణంగా పరిశీలించి లెక్క తీసుకోవబడుతుందో అతనిక సర్వనాశనమై నట్లేనని తెలుసుకో." ("కుడిచేతికి కర్మపత్రం ఇవ్వబడిన వ్యక్తి నుండి తేలికగా లెక్క తీసుకోబడుతుంది"- ఖుర్ఆన్: 84:7-9)- (బుఖారి, ముస్లిం)



**విశ్వాసిపై దేవుని విశేషానుగ్రహం :** దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "ప్రళయదినాన దేవుడు విశ్వాసిని తన దగ్గరకు పిలిపించుకొని 'నీవు చేసిన ఫలానా పాపం నీకు గుర్తుందా? ఫలానా పాపం నీకు గుర్తుందా?' అని అడుగుతాడు. దానికా విశ్వాసి 'గుర్తుంది ప్రభూ!' అంటాడు. ఆవిధంగా దేవుడు ఆ విశ్వాసి చేసిన పాపాలను అతని చేత ఒప్పిస్తాడు. అప్పుడా విశ్వాసి తానిక సర్వనాశనమయినట్లు భావిస్తాడు. చివరికి దేవుడు అతనితో 'నేను ప్రపంచంలో నీ పాపాలు బహిర్గతం కాకుండా మరుగు పరిచాను. ఇప్పుడు నేను వాటిని క్షమిస్తున్నాను' అని అంటాడు. ఆ తరువాత అతని సత్కర్మల పత్రం అతనికి ప్రసాదిస్తాడు. అయితే అవిశ్వాసుల, కపటవిశ్వాసుల పాపాలను మాత్రం యావత్తు సృష్టిరాసుల ముందు బహిర్గతం చేస్తూ 'వీరే తమ ప్రభువు విషయంలో అసత్యాలు కల్పించినవారు. తస్మాత్ జాగ్రత్త! దుర్మార్గులపై దేవుని అభిశాపం విరుచుకుపడుతుంది' అని ఎలుగెత్తి చెప్పబడుతుంది." (బుఖారి, ముస్లిం)

వేరొక హదీసులో దైవప్రవక్త (స) ఇలా తెలిపారు: "అందరికంటే చివర్లో నరకం నుండి బయటపడి, అందరికంటే చివర్లో స్వర్గ ప్రవేశం చేసే మనిషి నాకు తెలుసు. ప్రళయదినాన అతని పెద్ద పాపాలు వేరేచోట ఉంచి, చిరుపాపాలు అతని ముందు బహిర్గతం చేస్తారు. అప్పుడతనితో 'నువ్వు ఫలానా రోజు ఫలానా పాపకార్యం చేయలేదా?' అని ప్రశ్నిస్తారు. దానికతను ఔనంటాడు, నిరాక రించలేడు. అయితే తాను చేసిన ఘోరపాపాలు ఎక్కడ బహిర్గతం చేస్తారోనని లోలోన భయపడతాడు. అంతలో 'నీవు చేసిన ఈ పాపాలలో ప్రతిదానికీ బదులుగా ఒక్కోపుణ్యం లభిస్తుంది వెళ్ళు' అని చెబుతారు. అప్పుడతను దేవుడు చూపిన ఈ దయాదాక్షిణ్యాలు చూసి, 'నేనింకా పెద్దపాపాలు కూడా చేశాను. అవి నాకిక్కడ కన్పించడం లేదే?' అంటాడు." దైవప్రవక్త (స) ఈమాట చెప్పి ఫక్కున నవ్వుతారు. (ముస్లిం)

### దైవన్యాయస్థానంలో మొట్టమొదటి తీర్పు

ప్రళయదినాన దైవన్యాయస్థానంలో మొట్టమొదట ప్రదర్శనాబుద్ధితో కర్మలు ఆచరించిన ముగ్గురు ముస్లింలను గురించి తీర్పు జరుగుతుంది. వారు (1) అమరగతుడు (షహీద్), (2) పండితుడు, (3) ధనికుడు. ముస్లిం షరీఫ్‌లో హజ్రత్ అబూహురైరా (రజి) ఉల్లేఖించిన ఒక హదీసు ప్రకారం ఈ ముగ్గురి గురించి దైవప్రవక్త (స) ఇలా చెప్పారు:

'ప్రళయదినాన మొట్టమొదట విచారణ కోసం ప్రవేశపెట్టబడేవారిలో ఒకతను అమరగతుడని చెప్పబడేవాడు ఉంటాడు. ఆరోజు దేవుడు అతనికి తాను చేసిన మేళ్ళను గుర్తుచేస్తాడు. ప్రపంచంలో దేవుడు తనకు చేసిన ఆ భాగ్యాలను అతను జ్ఞాపకం చేసుకొని ఒప్పుకుంటాడు. తరువాత దేవుడు అతడ్ని 'నువ్వీ భాగ్యాలను ఏ విధంగా వినియోగించావు?' అని ప్రశ్నిస్తాడు. దానికా వ్యక్తి 'నేను మీ ప్రసన్నత కోసం యుద్ధం చేశాను. చివరికి ఆ మార్గంలో అమరగతుణ్ణయ్యాను' అంటాడు.

దేవుడు ఈమాట విని 'నువ్వు అబద్ధమాడుతున్నావు. నువ్వు (నాకోసం కాదు.) లోకులమెప్పు కోసం పోరాడావు. జనం నిన్ను వీరుడు ధీరుడని చెప్పుకుంటారని యుద్ధం

చేశావు. నీకా పేరుప్రతిష్ఠలు ప్రపంచంలో లభించాయి' అని అంటాడు. తరువాత 'ఇతడ్ని బోర్లాపడేసి ఈడ్చుకెళ్ళి నరకంలో పడేయండి' అని ఆజ్ఞాపిస్తాడు. అలాగే జరుగుతుంది.

మొట్టమొదట విచారణ కోసం ప్రవేశపెట్టబడేవారిలో మరొకతను పండితుడనబడే వాడు ఉంటాడు. అతను ధర్మజ్ఞానం స్వయంగా నేర్చుకోవడమే గాకుండా ఇతరులకు కూడా నేర్పాడు. ఖుర్‌ఆన్ కూడా అధ్యయనం చేశాడు. అతడ్ని దైవన్యాయస్థానంలో ప్రవేశపెడ్తారు. దేవుడు అతనికి తాను చేసిన మేళ్ళను గుర్తుచేస్తాడు. ప్రపంచంలో దేవుడు తనకు చేసిన ఆ భాగ్యాలను అతను జ్ఞాపకం చేసుకొని ఒప్పుకుంటాడు.

తర్వాత దేవుడు అతడ్ని 'నువ్వీ భాగ్యాలను ఏవిధంగా వినియోగించావ'ని ప్రశ్నిస్తాడు. దానికతను 'నేను మీ ప్రసన్నత కోసం ధర్మజ్ఞానం ఆర్జించాను. దాన్ని ఇతరుల క్కూడా నేర్పాను. మీ ప్రసన్నత కోసం ఖుర్‌ఆన్ చదివాను' అని సమాధానం ఇస్తాడు.

విశ్వప్రభువు ఈమాట విని 'నువ్వు అబద్ధమాడుతున్నావు. నువ్వు (నాప్రసన్నత కోసం కాదు,) లోకులమెప్పు కోసం ధర్మజ్ఞానం ఆర్జించావు. జనం నిన్ను గొప్ప పండితుడని పొగడాలని విద్య నేర్చుకున్నావు. నువ్వు కోరుకున్న ఆ కీర్తి ప్రపంచంలో నీకు లభించింది. (ఇక ఇక్కడేమీ లేదు నీకు.)' అని అంటాడు. తరువాత 'వీడ్ని బోర్లా పడేసి ఈడ్చుకెళ్ళి నరకంలో పడేయండి' అని ఆజ్ఞాపిస్తాడు. అలాగే జరుగుతుంది.

మొట్టమొదట విచారించబడేవారిలో వేరొకడు ధనికుడు. దేవుడు అతనికి అపార సిరిసంపదలు ప్రసాదించాడు. అనేక సంపదలు అనుగ్రహించాడు. ప్రళయ దినాన అతడ్ని ప్రవేశపెట్టడం జరుగుతుంది. దేవుడు అతనికి తాను చేసిన మేళ్ళను గుర్తుచేస్తాడు. ప్రపంచంలో దేవుడు చేసిన భాగ్యాల్ని జ్ఞాపకంచేసుకొని అతను ఒప్పుకుంటాడు.

తరువాత దేవుడు అతడ్ని 'నువ్వీ భాగ్యాలను ఏ విధంగా వినియోగించావు?' అని ప్రశ్నిస్తాడు. దానికా ధనికుడు 'నేను మీ ప్రసన్నత కోసం ప్రతి సత్కార్యంలోనూ నా ధనం వెచ్చించాను. మీకిష్టమైన ఏ సత్కార్యాన్నీ డబ్బు ఖర్చుపెట్టకుండా వదల్లేదు.

విశ్వప్రభువు ఈమాట విని 'నువ్వు అబద్ధమాడుతున్నావు. నువ్వు (నా ప్రసన్నత కోసం కాదు,) లోకుల మెప్పు కోసం డబ్బు ఖర్చుపెట్టావు. జనం నిన్ను గొప్ప దానశీలుడని పొగడాలని ఖర్చుపెట్టావు. నువ్వు కోరుకున్న ఆ పేరు ప్రపంచంలో నీకు లభించింది. (ఇక ఇక్కడేమీ లేదు నీకు.)' అని అంటాడు. ఆ తరువాత 'వీడ్ని బోర్లా పడేసి ఈడ్చుకెళ్ళి నరకంలో పడేయండి' అని ఆజ్ఞాపిస్తాడు. అలాగే జరుగుతుంది.

తిర్మిజి ప్రకారం అబూహురైరా (రజి) ఈ హదీసు చెప్పడానికి ప్రయత్నించినప్పుడు స్పృహతప్పారు. స్పృహ వచ్చిన తర్వాత చెప్పడానికి ప్రయత్నిస్తే మళ్ళీ స్పృహతప్పారు. తిరిగి స్పృహ వచ్చిన తర్వాత మళ్ళీ చెప్పడానికి ప్రయత్నిస్తే మూడవసారి కూడా స్పృహ తప్పారు. స్పృహ వచ్చాక చెప్పారు. హజ్రత్ ముఆవియా (రజి) ఈ హదీసు విని "ఈ ముగ్గురి సంగతే ఇలా ఉంటే ఇక చిత్తశుద్ధిలేని ఇతరులకు మంచి జరుగుతుందని ఆశించగలమా!" అన్నారు. ఆ తర్వాత ఆయన అప్రయత్నంగా రోదించడం మొదలెట్టారు. ఆయన ఏడ్పు చూసేవారు ఇక ఈయన ప్రాణం పోతుందేమోనని భావించారు.



హజ్రత్ ఉఖ్బా బిన్ ఆమిర్ (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ప్రవచనం: "(ప్రళయ దినాన) దేవుని న్యాయస్థానంలో అన్నిటికంటే ముందు ప్రవేశపెట్టబడే ఇద్దరు వ్యక్తుల వ్యాజ్యం- ఇద్దరు పొరుగువాళ్ళకు సంబంధించిన వ్యాజ్యం అవుతుంది." (బుఖారి)

**నమాజు గురించిన విచారణ :** దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "ప్రళయ దినాన దాసుని కర్మలలో మొట్టమొదట అతని నమాజు గురించి లెక్క జరుగుతుంది. నమాజు గురించిన లెక్క సరిగా ఉందని తేలితే అతను సాఫల్యం చెందుతాడు. నమాజు సరిగా లేదని తేలితే అతను నష్టపోతాడు. అతని ఫరజ్ (విధిగా చేయవలసిన) నమాజు లలో ఏదైనా వెలితి ఉంటే 'నాయీ దాసుని చిట్టాలో నఫిల్ (ఐచ్ఛిక) నమాజులు కూడా ఉన్నాయేమో చూడండి' అంటాడు దేవుడు. ఉంటే ఫరజ్ నమాజుల్లోని వెలితిని ఈ నఫిల్ నమాజులు భర్తీచేస్తాయి. నమాజ్ విషయం తరువాత ఇతర కర్మల విషయంలో కూడా ఇదేవిధంగా లెక్క తీసుకోవడం జరుగుతుంది." (బైహఖి)

**అసంఖ్యాకంగా స్వర్గానికి పోయేవారు-** దైవప్రవక్త (స) హితోక్తి : "ప్రళయదినాన మానవులందరూ ఒకే మైదానంలో సమీకరించబడతారు. అప్పుడు పిలిచేవాడు బిగ్గరగా కేకవేస్తూ 'రాత్రివేళల్లో (నమాజులు చేస్తూ) మేల్కొని ఉండేవారు ఎక్కడున్నారు?' అని అంటాడు. ఈమాట విని వారందరి నుండి కొంతమంది ముందుకు వస్తారు. వారు ఎలాంటి కర్మవిచారణకు గురికాకుండా స్వర్గంలో ప్రవేశిస్తారు. ఆ తరువాత మిగిలినవారి విషయంలో కర్మవిచారణ ప్రారంభించాలని ఆజ్ఞ అవుతుంది." (మిష్కాత్)

దైవప్రవక్త (స) ప్రవచనం: "నా అనుచర సముదాయంలో డెబ్భయివేల మంది కర్మవిచారణ లేకుండా స్వర్గంలో ప్రవేశిస్తారని నాప్రభువు నాకు వాగ్దానం చేశాడు. వారిలో ప్రతి వేయిమందితో పాటు మరో డెబ్భయివేల మంది ఉంటారు. అంతేకాదు, నా ప్రభువు దోసిలితో మూడు దోసిళ్ళ మంది జనం కూడా స్వర్గంలో ప్రవేశిస్తారు." (మిష్కాత్)

**అన్యాయం చేసినవారి పర్యవసానం :** ఏ ముస్లిం అయినా తోటి మానవులపై దౌర్జన్యం చేస్తే, వారికి అన్యాయం తలపెడ్తే, వారి హక్కులు కాజేస్తే అలాంటి ముస్లింకు శిక్షగా అతని పుణ్యాలను పీడితులకు ఇప్పించడం జరుగుతుంది.

దైవప్రవక్త (స) హితోక్తి: "ప్రళయదినాన దేవుడు తన దాసులను (హషర్ మైదానంలో) సమీకరిస్తాడు. వారప్పుడు నగ్నంగా, వడుగు చేయబడనివారయి, ఉత్త చేతులతో ఉంటారు. ఆ తరువాత సమీపంలో ఉండేవారు ఎలా స్పష్టంగా వింటారో దూరంలో ఉండేవారు కూడా అలాగే స్పష్టంగా వినేలా ఈవిధంగా ఒక వాణి విన్పిస్తుంది-

'నేను విశ్వసార్వభౌముడ్ని. నేను బదులు ఇచ్చేవాడ్ని. ఈరోజు నరకవాసికి చెందిన హక్కు ఏదైనా స్వర్గవాసిపై ఉంటే, స్వర్గవాసి నుండి నరకవాసికి రావలసిన హక్కు ఇప్పించనంత వరకు నరకవాసిని నరకంలో పడవేయడం జరగదు. అలాగే స్వర్గవాసికి చెందిన హక్కేదైనా నరకవాసిపై ఉంటే, నరకవాసి నుండి స్వర్గవాసికి రావలసిన హక్కు ఇప్పించనంత వరకు స్వర్గవాసిని స్వర్గానికి పంపడం జరగదు. చివరికి ఎవరికైనా రవ్వంత అన్యాయం జరిగినా సరే, నేనతనికి కూడా బదులిప్పిస్తాను.'

ప్రవక్త అనుచరులు ఈమాట విని 'దైవప్రవక్తా! మేమా రోజు నగ్నంగా, వడుగు చేయబడనివారిగా, ఉత్తచేతులతో ఉంటాం కదా! (బదులివ్వడానికి మా దగ్గర ఏముంటుంది?)' అని అన్నారు. దానికి దైవప్రవక్త (స) సమాధానమిస్తూ 'పాపపుణ్యాల మార్పిడి ద్వారా బదులు ఇప్పించడం జరుగుతుంది' అని చెప్పారు." (అహ్మద్)

దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "ఎవరయినా తన సోదరుడెవరిపై నయినా దౌర్జన్యం చేస్తే, అతడ్ని అవమానం పాలుజేస్తే, అతని హక్కేమయినా కొల్లగొడితే అలాంటి మనిషి ఏవిధమైన సిరిసంపదలు పనికిరాని రోజు రాక ముందే బాధితునికి క్షమాపణ చెప్పుకొని, అతని హక్కేమైనా ఉంటే దాన్ని తిరిగిచ్చి వేయాలి. అతను ఏవైనా సత్కర్మలు చేసిఉంటే, వాటిలో నుంచి అతని దౌర్జన్యానికి సమానమైన సత్కర్మలు తీసి బాధితునికి ఇప్పించడం జరుగుతుంది. ఒకవేళ ఆ దౌర్జన్యానికి సరిపడ సత్కర్మలు లేకపోతే బాధితుడు చేసిన దుష్కర్మలు దౌర్జన్యపరుడి ఖాతాలో వేయబడతాయి." (బుఖారి)

దైవప్రవక్త (స) హితోక్తి: "నా అనుచర సముదాయానికి చెందిన ఇద్దరు మనుషులు దేవుని దగ్గరకు వెళ్తారు. వారిలో ఒకడు 'ప్రభూ! ఇతని దగ్గర్నుండి నా హక్కు ఇప్పించు" అంటాడు. దానికి దేవుడు 'ఇతని కర్మపత్రంలో అసలు పుణ్యాలే లేవు కదా, నువ్వెలా నీ హక్కు తీసుకుంటావు?' అని అడుగుతాడు. ఆ వ్యక్తి ఈమాట విని 'అయితే ప్రభూ! నాకు జరిగిన అన్యాయానికి కాస్తయినా బదులు లభిస్తుందేమో, నా పాపాలు తీసి అతని ఖాతాలో వేసెయ్యి' అని అంటాడు." దైవప్రవక్త (స) ఈమాట చెప్పి అప్రయత్నంగా రోదిస్తారు..... (హాకిమ్)

**అందరికన్నా నిష్ట దరిద్రుడు:** ఓసారి దైవప్రవక్త (స) తన అనుచరుల్ని "దరిద్రుడంటే ఎవరో మీకు తెలుసా?" అనడిగారు. దానికి వారు "డబ్బు, ఇతర ఆస్తులు లేనివాడ్ని మేము దరిద్రుడని భావిస్తున్నాం" అన్నారు. అప్పుడు దైవప్రవక్త (స) ఇలా చెప్పారు:

"నా అనుచర సముదాయంలో ప్రళయదినాన ఒకడు నమాజ్, జకాత్, రోజాలు వగైరా సత్కార్యాలు తీసుకొని వస్తాడు. అయితే అతను ఎవరినైనా దూషించి ఉంటాడు. ఎవరిపైనయినా అపవాదు లేపి ఉంటాడు. ఎవరి ధనాన్నయినా అన్యాయంగా కాజేసి ఉంటాడు. ఎవరినైనా హత్యచేసి ఉంటాడు. ఎవరినైనా అన్యాయంగా కొట్టి ఉంటాడు. అంచేత అతను ఎవరెవరిని వేధించాడో, ఎవరెవరి హక్కులు కొల్లగొట్టాడో వారం దరికీ అతని పుణ్యకర్మలు పంచిస్తారు. అప్పటికీ వారందరి హక్కులు పూర్తిగా నెరవేరక ముందే అతని పుణ్యకర్మలు అంతమయిపోతే, ఆ హక్కుదారులు చేసిన పాపాలు అతని ఖాతాలో వేసి అతడ్ని నరకంలో పడవేయడం జరుగుతుంది." (ముస్లిం)

**పేదలు, ధనికులు:** ప్రళయదినాన దేవుడు మానవులందర్నీ సమావేశపరచిన తరువాత "ఈ అనుచర సముదాయానికి చెందిన పేదవాళ్ళు ఎక్కడున్నారు?" అని అడుగుతాడు. ఆ తర్వాత "మీరు ఏం చేశారు?"ని అడుగుతాడు వారిని. దానికి వారిలా అంటారు: "మీరు అధికారం, సిరిసంపదలు మాకు కాకుండా వేరేవాళ్ళకు ఇచ్చారు. మమ్మల్ని పేదవాళ్ళుగా చేసి పరీక్షించారు. మేము (మీ ప్రసన్నతాభాగ్యం ఆశిస్తూ) సహనం



వహించాము." దైవప్రవక్త (స) పైన పేర్కొన్న మాటలు చెప్పి "ఆ తర్వాత ఆ పేదలు స్వర్గానికి పంపబడతారు. ధనికుల్ని, అధికారుల్ని మాత్రమే నిలదీసి కఠినంగా లెక్క తీసుకోవడం జరుగుతుంది" అని అన్నారు. (తర్గీబ్, తబ్రానీ)

# 107. మానవేతరుల విచారణ

**జిన్నుల విచారణ:** ఈప్రపంచంలో మానవులకు మాదిరిగానే బుద్ధికౌశల్యం, విజ్ఞతా వివేచనలుకల మానవేతర బుద్ధిజీవులు కూడా ఉన్నారు. వారినే మనం జిన్నులు (భూతాలు) అనంటాం. అగ్నితో సృజించబడిన ఈ జిన్నులు మానవులకు కన్పించరు. అయితే వీరిలోకూడా సజ్జనులు-దుర్జనులు, విశ్వాసులు-అవిశ్వాసులు ఉంటారు. వీరు కూడా పరలోక న్యాయస్థానంలో తమ కర్మలకు లెక్క చెప్పుకోవలసి ఉంటుంది. వీరికీ స్వర్గనరకాలు ఉంటాయి.

"దేవుడు వారందరినీ చుట్టుముట్టి సమీకరించే రోజు జిన్నులను ఉద్దేశించి "జిన్నులారా! మీరు మానవజాతి నుండి ఎన్నో లాభాలు పొందారు (కదూ?)" అని అడుగు తాడు. దానికి వారి మానవమిత్రులు "ప్రభూ! మాలో ప్రతి ఒక్కడూ ఇతరుల్ని బాగా వాడుకున్నాడు. చివరికి మేము మాకోసం నీవు నిర్ణయించిన సమయానికి చేరుకున్నాం" అని అంటారు. "అప్పుడు దేవుడు "అయితే మీ నివాసం ఇక నరకమే. అందులోనే మీరు శాశ్వతంగా పడిఉంటారు." అని అంటాడు. అయితే దేవుడు కాపాడ దలచినవారు మాత్రం దాన్నుండి తప్పించుకుంటారు. నిస్సందేహంగా నీప్రభువు ఎంతో వివేకవంతుడు, సర్వజ్ఞాని. దుర్మార్గులు (ప్రపంచంలో ఉండగా పరస్పరం కలసి) చేసిన దుష్కర్మల ఫలితంగా ఇలా మేము వారిని (నరకంలో) ఒకరికొకరు స్నేహితులుగా చేస్తాము." (ఖుర్ఆన్-6:128-129)

**పశుపక్షాదుల విచారణ:** ప్రళయదినాన పశువులు, పక్షులు, క్రిమికీటకాదుల్ని గురించి కూడా విచారణ జరుగుతుంది. వాటిపై ఏదైనా దౌర్జన్యం జరిగివుంటే దేవుడు వాటికి ప్రతీకారం తీర్చుకునే అధికారం ఇస్తాడు. ఆ తర్వాత వాటి ఉనికిని శాశ్వతంగా అంతమొందిస్తాడు.

దైవప్రవక్త (స) జంతువులపై జంతువులు చేసే దౌర్జన్యం గురించి చెబుతూ ఇలా తెలియజేశారు: "మీరు ప్రళయదినాన హక్కుదారులకు వారి హక్కులు తప్పకుండా నెరవేరుస్తారు. చివరికి కొమ్ములు లేని మేకకు (కొమ్ములున్న మేక ఏదైనా అన్యాయం చేసివుంటే) కొమ్ములున్న మేక నుండి బదులిప్పించడం జరుగుతుంది." (ముస్లిం)

దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "ప్రళయదినాన యావత్తు జీవరాసుల్ని సమీకరించడం జరుగుతుంది. వాటిలో చతుష్పాదాలు, భూచరాలు, పక్షులు కూడా ఉంటాయి. అవేకాకుండా ఇంకా అనేక రకాల జీవరాసులు ఉంటాయి. వాటన్నిటిని గురించి దైవన్యాయస్థానంలో తీర్పులు జరుగుతాయి. ఆ తీర్పుల్లో కొమ్ములున్న జంతువు నుండి కొమ్ముల్లేని జంతువుకు బదులిప్పించే తీర్పు కూడా ఉంటుంది.

పశుపక్షాదులకు సంబంధించిన తీర్పులు ముగిసిన తరువాత 'మీరంతా మట్టయి పొండి' అని ఆజ్ఞ అవుతుంది. దాంతో అవన్నీ మట్టయి పోతాయి. (అంటే వాటి ఉనికే అంతమైపోతుంది.) అప్పుడు అవిశ్వాసి నోట 'అయ్యో! నేను కూడా మట్టయిపోతే బాగుండు!!' అనే మాట (అప్రయత్నంగా) వెలువడుతుంది." (దుర్రెమన్సూర్)

పై ఉల్లేఖనం దుర్రెమన్సూర్‌లో ఈక్రింది సూక్తికి వ్యాఖ్యానంగా పేర్కొనబడింది:

“మేము అతి సమీపంలోనే ఉన్న శిక్ష గురించి మిమ్మల్ని హెచ్చరించాం. మానవుడు తన చేజేతులా చేసుకొని ముందుగా పంపుకున్నదంతా ఆరోజు ప్రత్యక్షంగా చూసుకుంటాడు. అప్పుడు సత్యతిరస్కారి (పశ్చాత్తాపంతో) “అయ్యో! నేను మట్టిలో మట్టయి పోయిఉంటే ఎంత బాగుండేది!!” అని వాపోతాడు.” (ఖుర్ఆన్–78:40)

వేరొక ఉల్లేఖనంలో ఇలా ఉంది: “కొమ్ములచే పొడవబడిన జంతువుకు కొమ్ములతో పొడిచిన జంతువు నుండి, కాళ్ళతో తన్నబడిన జంతువుకు కాళ్ళతో తన్నిన జంతువు నుండి బదులిప్పించడం జరుగుతుంది. ఇదంతా మానవుల కళ్ళముందు జరుగుతుంది. ఆ తరువాత (దైవదూతలు) జంతువులతో ‘మీరంతా మట్టయిపోండి. మీకు ఎలాంటి స్వర్గ నరకాలు లేవు’ అని చెబుతారు. అప్పుడు అవిశ్వాసి ‘అయ్యయ్యో! నేను (కూడా) మట్టయి పోయివుంటే ఎంత బాగుండు!!’ అని వాపోతాడు.” (దుర్రెమన్సూర్)

## 108. ఐహిక భాగ్యాలను గురించి విచారణ

ఆరోజు కర్మలను బట్టి మానవుల హోదాఅంతస్తులలో తేడాలు ఉంటాయి. అంటే మానవుల విలువ వారి పాపపుణ్యాల ఆధారంగా నిర్ణయించబడుతుంది. ప్రపంచంలో ఎంతో గొప్పవాళ్ళుగా భావించబడినవారు, అహంకారులు ఆరోజు అందరికంటే అధములుగా, నీచులుగా మారి నరకంలో విసిరేయబడతారు. వారి పెద్దరికం, హోదాఅంతస్తులు మట్టిలో కలసిపోతాయి.

“నా సిరిసంపదలు నాకేమాత్రం పనిరాకుండా పోయాయే! నా అధికారం మట్టి కొట్టుకొని పోయిందే!!’ అంటూ వాపోతాడు అవిశ్వాసి. (ఖుర్ఆన్–)

దైవప్రవక్త (స) ప్రవచనం: “వినండి! ఇహలోకంలో మస్తుగా తింటూ, త్రాగుతూ, భోగభాగ్యాలు అనుభవించినవారు పరలోకంలో ఆకలితో నకనక లాడుతారు. నగ్నంగా ఉంటారు. వినండి. ఇహలోకంలో తమను ఎంతో గౌరవనీయులుగా చేసుకుంటున్నవారు నిజానికి తమను తాము అవమానపరచుకుంటున్నారు. అలాగే ఇహలోకంలో (వినయం, అణుకువ, ధర్మపరాయణతల కారణంగా) తమను అవమానపరచుకుంటున్నవారు వాస్తవానికి తమనుతాము గౌరవనీయులుగా చేసుకుంటున్నారు. (దేవుని పట్ల ఈ వినయ విధేయతలే చివరికి వారిని స్వర్గానికి చేర్చుతాయి.)” (తర్గీబ్ వ తర్హీబ్)

దైవప్రవక్త (స) ప్రవచనం: “ప్రళయం రోజు బాగా బలిసిన ఓ లావుపాటి పెద్దమనిషిని తీసుకురావడం జరుగుతుంది. కాని దేవుని వద్ద అతనికి దోమరెక్కంత విలువ కూడా ఉండదు. కావాలనుకుంటే మీరీ సూక్తి చదువుకోండి...‘ప్రళయదినాన మేము వారికి ఎలాంటి బరువు(విలువ) ఇవ్వము (18:105)”- (బుఖారి)

దైవప్రవక్త (స) హితోక్తి: “ప్రళయదినాన అయిదు ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వనంత వరకు మానవుడు నిల్చున్నచోటు నుంచి ఒక్క అంగుళం కూడా కదలలేడు. ఆ అయిదు విషయాలివి: (1) నీ వయస్సును ఏకార్యకలాపాలలో అంతమొందించావు? (2) నీ యౌవ నాన్ని ఎక్కడ వ్యర్థపరిచావు? (3) ధనాన్ని ఎలా సంపాదించావు? (4) దాన్ని ఎలా ఖర్చు పెట్టావు? (5) నీకు ప్రసాదించిన (ధర్మ)జ్ఞానాన్ని ఏమేరకు ఆచరించావు?” (తిర్మిజి)



“ప్రళయదినాన మానవుడు ఎలాంటి విలువ, బలం లేని మేకపిల్లలా తీసుకురా బడతాడు. తరువాత దేవుని ముందు ప్రవేశపెట్టబడతాడు. దేవుడు అతడ్ని ‘నేను నీకు ఎన్నో మహాభాగ్యాలు ప్రసాదించాను. వాటిని ఏం చేశావు?’ అని అడుగుతాడు.

దానికి మానవుడిలా అంటాడు: ‘ప్రభూ! నేను ధనాన్ని కూడబెట్టాను. ఎన్నో లాభాలతో దాన్ని అభివృద్ధి పరిచాను. ప్రారంభంలో ఉన్న ఆస్తికి ఎన్నో రెట్లు పెంచి వదిలేసి వచ్చాను. మీరు అనుమతిస్తే నేనా సంపదంతా తీసుకొచ్చి మీముందు పెడ్తాను’ అని అంటాడు.

‘(నీవు ముందుగా ఇక్కడకు పంపుకున్న దేమిటో చూపించు’ అంటాడు దేవుడు. మానవుడు మళ్ళీ అదే సమాధానమిస్తాడు. తనను వెనక్కి తిప్పిపంపితే ఆ సంపదంతా తెచ్చి మీ ముందు పెడ్తానంటాడు. కాని ఆ మానవుడు ముందుగా ఎలాంటి సత్కర్మలు పంపుకోలేనందున అతడ్ని నరకానికి పంపడం జరుగుతుంది.” (తిర్మిజి)

దైవప్రవక్త (స) ఈవిధంగా తెలియజేశారు: “ప్రళయదినాన మానవునికి చెందిన మూడు రిజిష్టర్లు ఉంటాయి. ఒక రిజిష్టర్‌లో అతని సత్కర్మలు నమోదయి ఉంటాయి. రెండవ రిజిష్టర్‌లో అతని దుష్కర్మలు నమోదైఉంటాయి. మూడవ రిజిష్టర్‌లో దేవుడు ప్రపంచంలో అతనికి ప్రసాదించిన భాగ్యాలన్నీ నమోదైఉంటాయి. దేవుడు ఆ భాగ్యాలలో అన్నిటికంటే అతిచిన్న భాగ్యాన్ని సంబోధిస్తూ ‘నీవు నీమూల్యాన్ని ఇతని సత్కర్మల నుండి తీసేసుకో’ అంటాడు. అప్పుడా చిరుభాగ్యం తన విలువను లెక్కగట్టి ఆ మనిషి సత్కర్మలన్నిటినీ స్వాధీనం చేసుకుంటుంది. తరువాత దేవునితో ‘ప్రభూ! నీ గౌరవప్రతిష్ఠల సాక్ష్యం! నేను నా మూల్యమంతటినీ వసూలు చేయలేదు’ అంటుంది.

ఒక్క చిరుభాగ్యానికి చెల్లించిన మూల్యానికే అతని సత్కర్మలచిట్టా ఖాళీ అయి పోయింది. దుష్కర్మలచిట్టా పాపాలతో నిండి అలాగే ఉంది. వాటి మూల్యం చెల్లించడానికి దేవుడు ప్రసాదించిన భాగ్యాలు ఇంకాచాలా ఉన్నాయి. దేవుడు ఏ దాసుణ్ణయినా కరుణిం చదలచుకుంటే (అంటే అతడ్ని క్షమించి స్వర్గానికి పంపదలచు కుంటే) ‘నా దాసుడా! నేను నీ పాపాలు క్షమించాను. నీ సత్కర్మలు అధికం చేశాను’ అనంటాడు.” (తర్గీబ్)

## 109. విశ్వాసులు, సిఫారసు

దేవుడ్ని, ఆయన ప్రవక్తలను నమ్మినవారి ముక్తికోసం దైవప్రవక్తలుగాని దైవదూతలు గాని, లేదా దేవుని అనుమతి లభించిన మరెవరైనా భక్తులుగాని సిఫారసుచేస్తే దాన్ని దేవుడు ఆమోదించే అవకాశముంది.

దైవప్రవక్త (స) తాను చేసే సిఫారసు గురించి ఇలా తెలియజేశారు: “అల్లాహ్‌తప్ప వేరే ఆరాధ్యుడు లేడని, ముహమ్మద్ (స) దేవునిప్రవక్త అని సాక్ష్యం పలికినవారి గురించి నేను (దేవునికి) సిఫారసు చేస్తాను. అయితే వారు తమ నోటిని హృదయం, హృదయాన్ని నోరు ధృవపరిచేలా (మనస్ఫూర్తిగా)సాక్ష్యం పలికివుండాలి.” (ముస్నద్అహ్మద్)

ప్రళయదినాన మూడువిధాల వ్యక్తులు విశ్వప్రభువుకు సిఫారసు చేస్తారని దైవప్రవక్త (స) తెలియజేశారు. 1-దైవప్రవక్తలు, 2-ధర్మవేత్తలు, 3-అమరగతులు. (ఇబ్నెమాజ)-

అదేవిధంగా ఈ సిఫారసు అయిదు రకాలుగా ఉంటుందని మరో ఉల్లేఖనంలో తెలియజేయబడింది. అవి ఈ విధంగా ఉంటాయి:

❶ మొదటి సిఫారసు సాధారణ సిఫారసు. మానవులంతా హషర్ మైదానంలో గుమిగూడిన తరువాత కర్మవిచారణ ప్రారంభించడానికి చేసే సిఫారసు. హ్రజత్ ఆదం (అలైహి) నుండి హ్రజత్ ఈసా (అలైహి) వరకు అనేక మంది దైవప్రవక్తలు తాము ఏదో ఒక పొరపాటు చేసినందువల్ల దేవుని దగ్గర సిఫారసు చేయలేమని చెబుతారు. చివరికి అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (సల్లం) సిఫారసు చేయడానికి అంగీకరిస్తారు. ఈ సిఫారసు గురించి వెనుకటి పేజీలలో పేర్కొన్నాం.

❷ రెండో సిఫారసు అనేకమంది విశ్వాసుల్ని కర్మవిచారణ లేకుండానే స్వర్గానికి పంపే విషయంలో ఉంటుంది. ఈ సిఫారసు కూడా అంతిమదైవప్రవక్తే (స) చేస్తారు.

❸ మూడో సిఫారసు కొన్ని పాపాల కారణంగా నరక శిక్షకు అర్హులయిన విశ్వాసుల్ని నరకశిక్ష నుండి తప్పించే విషయంలో ఉంటుంది. ఈ సిఫారసు కూడా ఆయనే చేస్తారు.

❹ నాల్గవ సిఫారసు నరకంలో పడిన పాపులను స్వర్గానికి పంపించే విషయంలో ఉంటుంది. ఈ సిఫారసు వివిధ దైవప్రవక్తలు, దైవదూతలు చేస్తారు.

❺ అయిదో సిఫారసు విశ్వాసుల హోదాఅంతస్తుల్ని పెంచే విషయంలో ఉంటుంది.

హ్రజత్ ఔఫ్ బిన్ మాలిక్ (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ప్రవచనం: "నా ప్రభువు దగ్గర్నుండి ఓదూత వచ్చి, నేను నా అనుచరసముదాయంలో సగంమందిని (కర్మవిచారణ లేకుండానే) స్వర్గప్రవేశం చేయించవచ్చని, లేదా (నా అనుచరసముదాయంలో నేను తలచిన మనిషి కోసం) సిఫారసు చేయవచ్చని నాకు అధికారం ఇచ్చినట్లు తెలియజేశాడు. అప్పుడు నేను సిఫారసు చేసే అధికారం అడిగి తీసుకున్నాను. అయితే అల్లాహ్ దైవత్వంలో ఆయనకు మరెవర్నీ సాటికల్పించనివారి కోసమే నా సిఫారసు వర్తిస్తుంది." (మిష్కాత్)

**ముస్లింలకు దైవప్రవక్త (స) సిఫారసు:** మహనీయ ముహమ్మద్ (స) ఇలా అన్నారు: "దైవప్రవక్తల కోసం (ప్రళయదినాన) జ్యోతిర్మయ ఆసనాలు వేయబడతాయి. వాటి మీద ప్రవక్తలు కూర్చుంటారు. నా ఆసనం ఖాళీగా ఉంటుంది. నేను దాని మీద కూర్చుంటే (ఇతర ప్రవక్తలతో పాటు) నన్ను కూడా స్వర్గానికి పంపడం జరుగుతుందేమో, తరువాత నా అనుచర సముదాయం (నా సిఫారసుకు నోచుకోకుండా) ఉండిపోతుందేమో అన్న భయంతో నేను దాని మీద కూర్చోలేకపోతాను. అప్పుడు నేను 'ప్రభూ! నా అనుచర సముదాయం! నా అనుచర సముదాయం!!' అంటాను. దానికి విశ్వప్రభువు 'ముహమ్మద్! నీవు నీ అనుచరసముదాయం విషయంలో ఏం కోరుతున్నావు?' అని అడుగుతాడు. నేను 'వీళ్ళ కర్మవిచారణ తొందరగా ముగిస్తే బాగుంటుంది' అంటాను.

ఆ తర్వాత నా అనుచరసముదాయాన్ని సమావేశపరచి విచారణ ప్రారంభించడం జరుగుతుంది. తత్ఫలితంగా వారిలో కొందరు దేవుని కారుణ్యానుగ్రహాలతో, మరికొందరు నా సిఫారసుతో స్వర్గానికి వెళ్తారు. నేను సిఫారసు చేస్తూ ఉంటాను. చివరికి నరకంలో వేయబడినవారి పేర్ల జాబితా రిజిష్టర్ కూడా నాకివ్వబడుతుంది. (ఈవిధంగా నరకంలో



వేయబడినవారిని కూడా స్వర్గానికి పంపడం జరుగుతుంది.) నరకపాలకుడు ఇదంతా చూస్తూ 'మీరు మీ అనుచర సముదాయంలో దైవాగ్రహంలో చిక్కుకొని నరకంలోనే పడివుండేందుకు ఒక్కడ్ని కూడా వదలిపెట్టలేదు' అనంటాడు." (తర్గీబ్ వ తర్హీబ్)

**హెచ్చరిక :** అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (సల్లం) ప్రళయదినాన తన అనుచర సముదాయం కోసం సిఫారసు చేస్తారనడంలో సందేహం లేదు. కాని ఆయన చేసే సిఫారసును మాత్రమే నమ్ముకొని సత్కర్మలు ఆచరించకుండా పాపకూపంలోనే పడివుంటే మటుకు ముస్లింలకు నరకయాతనలు తప్పవు. కొన్ని హదీసులలో ముహమ్మద్ అనుచర సముదాయానికి చెందినవారు అత్యధిక సంఖ్యలో నరకంలో వేయబడతారని కూడా ఉంది. ఇలా నరకంలో వేయబడిన ముస్లింలు ఆ నరకయాతనలు ఎంతకాలం అనుభవించవలసి ఉంటుందో కూడా ఊహించలేం. ఇది వందల సంవత్సరాలైన కావచ్చు, వేల సంవత్సరాలైనా కావచ్చు.

**విశ్వాసులకు విశ్వాసుల సిఫారసు :** దీన్ని గురించి దైవప్రవక్త (స) ఇలా తెలియజేశారు: "నా అనుచర వముదాయానికి చెందిన కొందరు యావత్తు సంఘం కోసం సిఫారసు చేస్తారు. కొందరు ఒక తెగ కోసం, మరికొందరు పది నుంచి నలభై మంది కోసం, ఇంకొందరు ఒకని కోసం సిఫారసు చేస్తారు. ఈవిధంగా చివరికి మొత్తం ముస్లిం సముదాయం స్వర్గానికి పోతుంది." మరొక హదీసు ప్రకారం "నా అనుచర సముదాయంలోని ఒక వ్యక్తి చేసే సిఫారసుతో బనూతమీమ్ తెగ ప్రజలకంటే కూడా ఎక్కువమంది విశ్వాసులు స్వర్గంలో ప్రవేశిస్తార"ని దైవప్రవక్త (సల్లం) తెలియజేశారు. (మిష్కాత్)

దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రవచించారు: "నరకానికి పోయేవారు వరుసలుగా నిలబడి ఉంటారు. అప్పుడు ఒక స్వర్గవాసి వారి ముందునుంచి పోవడం జరుగుతుంది. నరకానికి పోయేవారిలో ఒకతను ఆస్వర్గవాసిని ఉద్దేశించి 'అయ్యా! మీరు నన్ను గుర్తుపట్టలేదా? నేను ఒకసారి తాగడానికి మంచినీళ్ళు ఇచ్చాను. (మరి మీరు నా విముక్తి కోసం సిఫారసు చేయరూ?' అంటాడు. అలాగే మరొకతను తన ముందునుంచి పోయే స్వర్గవాసిని సంబోధిస్తూ 'నేను ఒకసారి మీకు ఉజూ చేసుకోవడానికి నీళ్ళు సరాఫరా చేశాను. (దయచేసి నా విముక్తి కోసం సిఫారసు చేయండి.)' అనంటాడు. కనుక స్వర్గవాసి సిఫారసు చేసి ఆ నరకవాసిని స్వర్గానికి పంపుతాడు." (ఇబ్నెమాజ)

**సమరయోధుడి సిఫారసు :** తిర్మిజిలో హ్రజత్ మిఖ్దామ్ (రజి) ఉల్లేఖించిన ఓ సుదీర్ఘ హదీసులో దైవప్రవక్త (స) సమరయోధుల (ముజాహిద్‌ల) ఔన్నత్యాన్ని గురించి తెలియజేస్తూ, డెబ్బయి మంది బంధువుల విషయంలో ఒక సమరయోధుని సిఫారసు అంగీకరించబడుతుందని చెప్పారు. (మిష్కాత్)

**తల్లిదండ్రుల్ని గురించి చిన్నపిల్లల సిఫారసు:** హ్రజత్ అబ్దుల్లా బిన్ మస్‌వూద్ (రజి) ఉల్లేఖనం: దైవప్రవక్త (స) "తనకు ముందుగా ముగ్గురు చిన్నపిల్లల్ని (పరలోకానికి) పంపుకున్న తల్లితండ్రుల పాలిట ఆ పిల్లలు నరకం నుంచి కాపాడే కంచుకోట అవుతారు" అని అన్నారు. హ్రజత్ అబూజర్ (రజి) ఈమాట విని "నేను ఇద్దరు పిల్లల్ని మాత్రమే పంపుకున్నాను. (మరి నా సంగతేమిటీ?) అనడిగారు. దానికి దైవప్రవక్త (స) "ఇద్దరు పిల్లల్ని పంపుకున్నా ఈమాటే వర్తిస్తుంది" అన్నారు. హ్రజత్ ఉబయి బిన్ కాబ్ (రజి)

మాట్లాడుతూ "నేనయితే ఒకేఒక పిల్లవాడ్ని పంపుకున్నాను" అన్నారు. దానికీ దైవప్రవక్త (స) "ఒక పిల్లవాడైనా సరే ఈమాటే వర్తిస్తుంది" అని చెప్పారు. (మిష్కాత్)

**హాఫిజె ఖుర్ఆన్ సిఫారసు-** దైవప్రవక్త(స) హితోక్తి : "ఖుర్ఆన్ పఠించి, కంఠస్థం చేసి, అది నిషేధించిన విషయాల్ని మానేసి, ధర్మసమ్మతం చేసిన విషయాల్ని ఆచరించిన మనిషిని దేవుడు స్వర్గానికి పంపిస్తాడు. అదీగాక ఆ మనిషి కుటుంబంలో (పాపాల కారణంగా) నరకానికి పంపేందుకు నిర్ణయం జరిగిపోయిన పది మంది వ్యక్తుల విషయంలో అతని సిఫారసును కూడా దేవుడు అంగీకరిస్తాడు." (తిర్మిజి)

హాఫిజె ఖుర్ఆన్ అంటే ఖుర్ఆన్‌ని అధ్యయనం చేసి, కంఠస్థం చేసి, అందులోని ప్రతి విషయాన్నీ గుర్తుంచకునేవాడని అర్థం. ఖుర్ఆన్‌ని అధ్యయనం చేసి, కంఠస్థం చేసి, అందులోని ప్రతి విషయాన్నీ గుర్తుంచుకునేవాడు సహజంగానే ఖుర్ఆన్ వారించిన దుష్కార్యాలకు దూరంగా మసలుకుంటూ, అది ఆదేశించిన సత్కార్యాలు జీవితాంతం చేస్తూఉంటాడు.

దీన్ని బట్టి అరబీభాష హాఫిజె ఖుర్ఆన్‌కు బాగా తెలిసిఉండాలి. అదీగాక ఖుర్ఆన్ ప్రకారం జీవితాంతం ఆచరించే వ్యక్తి మాత్రమే దేవుని దృష్టిలో నిజమైన హాఫిజెఖుర్ఆన్. అలాంటి హాఫిజ్ చేసే సిఫారసునే ఆయన అంగీకరిస్తాడు. అరబీ భాషరాని ఈనాటి హాఫిజ్‌లు చేసే సిఫారసుని దేవుడు స్వీకరిస్తాడని ఆశించలేము. కనీసం తమకు తెలిసిన భాషలోనైనా వారు ఖుర్ఆన్‌ని నిత్యం పఠిస్తూ దాని ఆజ్ఞలను పూర్తిగా పాటించడానికి ప్రయత్నించాలి.

**ఖుర్ఆన్, ఉపవాసాల సిఫారసు :** హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ఇలా అన్నారు: "దాసుని విముక్తి కోసం ఖుర్ఆన్, ఉపవాసాలు (కూడా) సిఫారసు చేస్తాయి. ఉపవాసం దైవాన్ని ప్రార్థిస్తూ 'ప్రభూ! నేనితడ్ని పగటి వేళ ఆహారానికి (ఇతర వాంఛలకు) దూరంగా ఉంచాను. కనుక ఇతని (విముక్తి)విషయంలో నా సిఫారసు అంగీకరించు' అని అంటుంది. అలాగే ఖుర్ఆన్ కూడా దైవాన్ని వేడుతూ 'ప్రభూ! నేనితడ్ని రాత్రివేళ నిద్రపోకుండా చేశాను. (ఇతడు నన్ను చదువుతూ లేదా వింటూ జాగారం చేశాడు.) కనుక ఇతని విషయంలో నా సిఫారసు అంగీకరించు' అని అంటుంది. ఈ విధంగా చివరికి వారిద్దరి సిఫారసు ఆమోదించబడుతుంది." (మిష్కాత్ షరీఫ్)

దైవప్రవక్త (సల్లం) వేరొక హదీసులో ఇలా ప్రవచించారు: "ఖుర్ఆన్ పఠించండి. ఇది ప్రళయదినాన తనను పఠించినవారి విముక్తి కోసం సిఫారసు చేస్తుంది." మరో సందర్భంలో "(ముఖ్యంగా) బఖరా, అలిఇమ్రాన్ సూరాలు పఠిస్తూ ఉండండి. ఇవి ఎంతో ప్రకాశవంతమైన సూరాలు. ప్రళయదినాన ఇవి రెండు మేఘాలుగా లేదా రెండు పందిళ్ళుగా లేదా రెండు పక్షుల గుంపులుగా వచ్చి తమను పఠించినవారి కోసం ఎంతగానో సిఫారసు చేస్తాయి" అని చెప్పారు ఆయన. (ముస్లిం)

# 110. దైవజ్యోతి-దివ్యదర్శనం

మానవుడు తనను సృష్టించిన దేవుడ్ని చూడగల్గుతాడా? అది ఇహలోకంలో మాత్రం ఎన్నటికీ సాధ్యంకాదు. ఎవరైనా దేవుడ్ని చూశానని చెబితే అతను పచ్చి అబద్ధమాడుతున్నాడన్న మాట. దైవదర్శనం మరణానంతరం పరలోకంలోనే సాధ్యం. అదైనా విశ్వాసులకు మాత్రమే.



"ముహమ్మద్ (స) మరోసారి కూడా అతడ్ని (సప్తమాకాశంలో) 'సిద్రతుల్‌ముస్తహా' అనే దివ్యవృక్షరాజం దగ్గర చూశాడు." (ఖుర్ఆన్-53:13,14)

మహనీయ ముహమ్మద్ (స) జిబ్రీల్‌దూత (అలై)ను రెండవసారి ఆయన అసలు రూపంలో మేరాజ్ సంఘటన సందర్భంగా చూశారు. దేవుడు దైవప్రవక్త (స)ను సప్తాకాశాల పర్యటన చేయించి అక్కడి అద్భుతాలను చూపించాడు. దీన్నే "మేరాజ్" సంఘటన అంటారు.

## దైవప్రవక్త (స) దేవుడ్ని చూశారా?

కొందరు ఈ సూక్తులు విని దైవప్రవక్త (స) దేవుడ్ని ప్రత్యక్షంగా చూశారని అపార్థం చేసుకున్నారు. ప్రవక్త సతీమణి హజ్రత్ ఆయిషా (రజి) దీన్ని ఖండిస్తూ "మీలో ఎవరైనా ముహమ్మద్ (స) తమ ప్రభువుని చూశారని అంటే అతను అబద్ధమాడుతున్నాడన్న మాట" అన్నారు. మరొక సందర్భంలో "ముహమ్మద్ (స) తమ ప్రభువుని చూశారని ఎవరైనా అన్నాడంటే అతను దేవునిపై ఘోరమైన నింద మోపుతున్నాడన్నమాట" అన్నారు. హజ్రత్ ఆయిషా (రజి) దీన్ని గురించి దైవప్రవక్త (స)ను అడిగినప్పుడు, తాను దేవుడ్ని చూడలేదని, జిబ్రీల్‌ను మాత్రమే ఆకాశం నుండి దిగుతున్నప్పుడు చూశానని అన్నారు ఆయన. (వివరాలకు సహీ బుఖారి చూడండి.)

ముస్లిం, నసాయి, ముస్నద్ అహ్మద్, తబ్రానీ గ్రంథాలలో హజ్రత్ అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి) నుండి గ్రహించి పేర్కొనబడిన ఉల్లేఖనాలు ఈవిధంగా ఉన్నాయి:

(1)"దైవప్రవక్త (సల్లం) తమ ప్రభువును హృదయంతో రెండుసార్లు చూశారు." (2)"దైవప్రవక్త (స) తమ ప్రభువును కళ్ళతో కాకుండా హృదయంతో చూశారు." (3)"దేవుడు ఇబ్రాహీం (అలై)ని తన మిత్రుడిగా చేసుకున్నాడు; మూసా (అలై)తో ప్రత్యక్షంగా సంభాషించాడు; ముహమ్మద్ (స)కు తన దర్శనభాగ్యం కల్గించాడు; ఈ విషయం విని మీరు ఆశ్చర్యపోతున్నారా?" (4)" నేను నా ప్రభువుని చూశాను" అని దైవప్రవక్తే (స) చెప్పారు. (5) "ఈరోజు రాత్రి నాప్రభువు అత్యంత శ్రేష్ఠమైన రూపంతో నాదగ్గరకు వచ్చాడ"ని దైవప్రవక్త (స) చెప్పారు. దైవప్రవక్త దేవుడ్ని స్వప్నంలో చూశారని ఆయన మాటలకు అర్థం కావచ్చని నేను భావిస్తున్నాను." (6)"దైవప్రవక్త (స) తమ ప్రభువుని రెండుసార్లు చూశారు. ఒకసారి కళ్ళతో, మరొకసారి హృదయంతో చూశారు."

హజ్రత్ అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి) నుండి గ్రహించిన పై ఉల్లేఖనాలన్నీ ఒక దాంతో మరొకటి పొంతనలేకుండా ఉన్నాయని కొందరు భాష్యకారులు అభిప్రాయపడ్డారు. అదీగాక ఇవిక్కడ పేర్కొనబడిన ఖుర్ఆన్ సూక్తికి అనుగుణంగా లేకపోవడం కూడా గమనార్హం.

తిర్మిజి ప్రకారం హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) ఒక సమావేశంలో మాట్లాడుతూ "దేవుడు తన దర్శనభాగ్యాన్ని, ప్రత్యక్షసంభాషణను ముహమ్మద్ (స), మూసా (అలై)ల మధ్య విభజించాడు. ఆయన మూసా (అలై)తో రెండుసార్లు ప్రత్యక్షంగా మాట్లాడాడు. ముహమ్మద్ (స)కు ఆయన రెండుసార్లు తన దర్శనభాగ్యం కలిగించాడు" అని అన్నారు. హజ్రత్ మస్రూఖ్ ఈమాట విని హజ్రత్ ఆయిషా (రజి) దగ్గరికెళ్ళి "అమ్మా! ముహమ్మద్ (స) తమ ప్రభువుని చూశారా?" అనడిగారు. దానికి హజ్రత్ ఆయిషా

"నీమాటలు విని నా రోమాలు నిక్కబొడుచుకున్నాయి" అన్నారు. ఆ తరువాత ఆమె రెండవ పేరాలో పేర్కొన్నట్లు అలా అనడం అబద్ధమాడటంతో సమానమని, దైవప్రవక్త (స) దేవుడ్ని కాదు, దైవదూత జిబ్రీల్ (అలై)ని మాత్రమే చూశారని తెలియజేశారు.

మరొక ఉల్లేఖనం ప్రకారం, హజ్రత్ ఆయిషా (రజి) ఇలా అన్నారు: "ఈ విషయంలో అందరికంటే ముందు నేనే దైవప్రవక్త (స)ను, మీరు మీ ప్రభువును చూశారా అని అడిగాను. దానికాయన "లేదు, నేను జిబ్రీల్‌ని మాత్రమే ఆకాశం నుండి దిగుతుంటే చూశాను" అన్నారు.

హజ్రత్ అబూజర్ గిఫ్ఫారి (రజి) ఇలా అన్నారు: నేను దైవప్రవక్త (స)ను "మీరు మీప్రభువును చూశారా?" అనడిగాను. దానికాయన "నాకు, దైవదర్శనానికి మధ్య జ్యోతి అడ్డుతెరగా నిలిచింది" అన్నారు. మరోఉల్లేఖనం ప్రకారం "నేను నా ప్రభువును చూడ లేదు, జ్యోతిని చూశాను" అన్నారు. వేరొక ఉల్లేఖనం ప్రకారం "దేవుని సృష్టితాలలో ఏ ఒక్కరి దృష్టీ ఆయన్ని చేరుకోజాలదు" అన్నారు దైవప్రవక్త (సల్లం)- (ముస్లిం)

దీన్నిబట్టి ఇహలోకంలో దేవుడ్ని ప్రత్యక్షంగా ఇంతవరకు ఎవరూ చూడలేదని, చివరికి దైవప్రవక్తలు సైతం చూడలేకపోయారని తెలుస్తోంది. దైవదర్శనం లభించడమంటే మోక్షం సిద్ధించడమే. ఈ మోక్షం మరణానంతర జీవితంలోనే పుణ్యాత్ములకు ప్రాప్తమవుతుంది. అప్పుడు స్వర్గసౌఖ్యాలతో పాటు దైవదర్శనభాగ్యం కూడా లభిస్తుంది.

## పరలోకంలో పరాత్పరుని దర్శనం

హజ్రత్ అబూహురైరా, అబూసయీద్‌ల (రజి) కథనం: మేము దైవప్రవక్త (స)తో మాట్లాడుతూ "దైవప్రవక్తా! మేము ప్రళయదినాన మా ప్రభువును చూడగల్గుతామా?" అని అడిగాము. ఆయన "తప్పకుండా చూడగల్గుతారు. ఆకాశం మేఘావృతం కాకుండా నిర్మలంగా ఉన్నప్పుడు సూర్యచంద్రుల్ని చూడటంలో మీకేమైనా ఇబ్బంది కల్గుతుందా?" అన్నారు. దానికి మేము "ఎలాంటి ఇబ్బంది కలగదు" అన్నాం.

"అదేవిధంగా ప్రళయదినాన మీరు మీ ప్రభువును దర్శించుకోవడంలో కూడా ఎలాంటి ఇబ్బంది ఉండదు. ఇబ్బంది ఏదైనా ఉంటే ఈనాడు సూర్యచంద్రుల్ని చూడటంలో ఎంత ఇబ్బంది ఉంటుందో ఆరోజు అంతే ఇబ్బంది ఉంటుంది" అన్నారు దైవప్రవక్త (సల్లం). ఆ తరువాత ఆయన ఇలా తెలియజేశారు:

"ప్రళయదినాన ఒక ప్రకటనకర్త వచ్చి "ఏ వర్గంవారు ఏ శక్తిని ఆరాధిస్తుండేవారో వారంతా తమతమ ఆరాధ్యదైవాల వెనుక వెళ్ళి నిలబడాలి" అని ప్రకటిస్తాడు. అప్పుడు కొందరు సూర్యుని వెనుక, కొందరు చంద్రుని వెనుక, మరికొందరు విగ్రహాల వెనుక, ఇంకొందరు శిలువ వెనుక వెళ్ళి నిలబడతారు. ఇలా మిథ్యాదైవాల్ని పూజించినవారంతా మిథ్యాదైవాల దగ్గరికి వెళ్ళి నిల్చుంటారు. (విగ్రహారాధకులంతా విగ్రహాలతో పాటు నరకంలో పడిపోతారు.) చివర్లో ఏకదైవారాధకులైన ముస్లింలు ఉండిపోతారు. వారిలో పుణ్యాత్ములు, పాపాత్ములు, కపటులు ఉంటారు. అలాగే గ్రంథప్రజల (యూదులు, క్రైస్తవుల)లో (ఏకదైవారాధకులైనవారు) కూడా కొందరు ఉండిపోతారు.



**యూదులు, క్రైస్తవుల పరిస్థితి :** ఆ తర్వాత మానవుల ముందుకు నరకం తీసుకురాబడుతుంది. అది వారికి ఎండమావిలా కన్పిస్తుంది. అప్పుడు (దైవదూతలు) యూదుల్ని పిలిచి "మీరు ఎవరిని ఆరాధించేవారు"అని అడుగుతారు. దానికి వారు "మేము దేవుని కుమారుడైన ఉజైర్‌ని పూజించేవాళ్ళం" అని చెబుతారు.

"మీరు అబద్ధమాడుతున్నారు. దేవుడు ఎవరినీ భార్యగాగాని, సంతానంగాగాని చేసుకోలేదు... సరే, ఇప్పుడు మీకేం కావాలి?" (అని అంటారు దైవదూతలు). "మాకు దాహమేస్తోంది. మంచినీళ్ళు ఇప్పించండి" అంటారు యూదులు. అప్పుడు (దైవదూతలు) వారికి నరకం వైపు చూపిస్తూ 'అక్కడకెళ్ళి తాగండ'ని చెబుతారు. ఆ వెనువెంటనే వారు నరకం వైపుకెళ్ళి అందులో పడిపోతారు.

ఆ తరువాత క్రైస్తవుల్ని నిలదీసి "మీరెవరిని ఆరాధించేవారు?" అని ప్రశ్నిస్తారు. వారు "మేము దేవుని కుమారుడు మసీహ్ (ఈసా)ని ఆరాధించేవాళ్ళం" అనంటారు.

"మీరు అబద్ధమాడుతున్నారు. దేవుడు ఎవరినీ భార్యగాగాని, సంతానంగాగాని చేసుకోలేదు... సరే, ఇప్పుడు మీకేం కావాలి?" (అని అంటారు దైవదూతలు). "మాకు దాహమేస్తోంది. మంచినీళ్ళు ఇప్పించండి" అంటారు క్రైస్తవులు.

అప్పుడు వారికి నరకం వైపు చూపిస్తూ 'అక్కడకెళ్ళి తాగండ'ని చెబుతారు (దైవదూతలు). ఆ వెనువెంటనే వారు నరకం వైపుకెళ్ళి అందులో పడిపోతారు.

యూదులు, క్రైస్తవులు కూడా నరకంలో పడిపోయిన తర్వాత హషర్ మైదానంలో ఏకేశ్వరోపాసకులు మాత్రమే ఉండిపోతారు. వారిలో పుణ్యాత్ములు, పాపాత్ములు, కపటులు ఉంటారు. వారి ముందు దైవజ్యోతి ప్రదర్శించబడుతుంది.

**ముస్లింల పరిస్థితి :** అప్పుడు (జ్యోతి నుండి దైవవాణి) ఇలా విన్పిస్తుంది: "అందరూ వెళ్ళిపోయారు కదా! ఇక మిమ్మల్ని ఏ విషయం ఇక్కడ నిలిపి ఉంచింది?"

దానికి వారిలా అంటారు: "మాకు వారి అవసరం ఎంతో ఉన్నప్పటికీ మేము (సత్యం కోసం) వారి నుండి ఆనాడే వేరయిపోయాము. అదీగాక ప్రతి వర్గమూ తాను ఆరాధించిన దైవం దగ్గరికి వెళ్ళి నిలబడాలని ప్రకటకర్త చేసిన ప్రకటన విన్నాము. అందువల్ల మేము ఇక్కడే ఉండిపోయి మా ప్రభువు రాక కోసం ఎదురు చూస్తున్నాం."

"సరే వినండి. నేనే మీ ప్రభువును" జ్యోతి నుండి దైవవాణి ధ్వనిస్తుంది. ముస్లింలు ఆ జ్యోతిని చూసి అదేదో దైవేతరశక్తి అని భావించి "మేము దేవుని శరణుగోరుతున్నాం. మేము దేవుని దైవత్వంలో మరెవరినీ చేర్చి ఆయనకు సాటికల్పించలేము" అంటారు.

"మీరు మీ ప్రభువుని గుర్తించడానికి ఆయన తరఫున మీ దగ్గర ఏదైనా ఆధారం ఉందా?" అని అడుగుతాడు దేవుడు. దానికి ముస్లింలు ఉందని చెబుతారు. ఆ తరువాత తెర తొలగించబడిన ఓ విశిష్ఠ జ్యోతి వారి ముందు ప్రత్యక్షమవుతుంది. ఇహలోకంలో ఉన్నప్పుడు మనస్ఫూర్తిగా దేవుని సన్నిధిలో సాష్టాంగప్రణామం చేస్తుండే ముస్లింలు ఆ విశిష్ఠ జ్యోతిని చూడగానే అప్రయత్నంగా సాష్టాంగపడతారు.

ఆ తరువాత వారు సాష్టాంగప్రణామం నుండి లేచి తలలు పైకెత్తి చూస్తారు. అప్పుడు వారికి మొదట చూపబడిన సాధారణ జ్యోతి మాత్రమే కన్పిస్తుంది. అందులో నుంచి దైవవాణి తిరిగి ధ్వనిస్తుంది: "నేను మీ ప్రభువును."

ఈమాట వినగానే ముస్లింలు "ఔను, మీరే మా ప్రభువు" అంటారు. అయితే పేరుప్రతిష్ఠల కోసం దేవుడ్ని ప్రార్థిస్తూ సాష్టాంగ ప్రణామం చేస్తుండే కపటముస్లింలు మాత్రం ఆరోజు సాష్టాంగపడలేరు. దేవుడు వారి నడుముల్ని బల్ల పరుపుగా చేసేస్తాడు. దాంతో వారు సాష్టాంగపడటానికి ప్రయత్నించగానే వంగలేక బొక్కబోర్లా పడిపోతారు.

## 111. నరకం మీదుగానే స్వర్గానికి దారి

ఆ తరువాత నరకం మీద వారధి (పుల్‌సిరాత్) యేర్పాటు జరుగుతుంది. ఆ వారధి పైనుంచి అందరూ నడవాల్సిందిగా (దైవదూతలు) చెబుతారు. దైవప్రవక్తలందరిలో కెల్లా నేనే మొట్టమొదట నా అనుచరసముదాయాన్ని వెంటబెట్టుకొని ఆ వారధి దాటుతాను. ఆరోజు దైవప్రవక్తలు తప్ప మరెవరూ మాట్లాడలేరు. వారయినా "దేవా! రక్షించు. (మమ్మల్ని నరకాగ్ని నుండి) రక్షించు" అని మాత్రమే అంటారు.

ప్రవక్త అనుచరులు వారధి ప్రస్తావన వినగానే "దైవప్రవక్తా! ఈ వారధి సంగతి ఏమిటి?" అని అడిగారు. దైవప్రవక్త (సల్లం) తిరిగి ఇలా చెప్పడం ప్రారంభించారు:

"అదొక (భయంకరమైన) జారుడు చోటు. దాని మీద నుంచి దాటిపోయేవారు (కొందరు) జారిపడతారు. (మరికొందరు) నిలదొక్కుకుంటారు. వారధి దాటేవారిని లాగి (నరకంలో) పడేయడానికి మొనదేలిన కొండీలు వంటి పెద్ద పెద్ద ముళ్ళు దాని పైకొచ్చి ఉంటాయి. ఇవి నజద్‌లో ఉండే సాదాన్ చెట్ల ముళ్ళులా చాలా పొడవుగా, లావుగా ఉంటాయి. విశ్వాసులలో ఆ వారధిని కొందరు రెప్పపాటులో, కొందరు మెరుపు వేగంతో, కొందరు వాయువేగంతో, మరికొందరు అశ్వవేగంతో, ఇంకొందరు (ఇతర) వాహనాల వేగంతో దాటిపోతారు. అలా దాటేవారిలో కొందరు ఎలాంటి ప్రమాదానికి గురికాకుండా క్షేమంగా బయటపడతారు. మరికొందరు గాయపడి నరకాగ్నిలో పడిపోతారు."

దేవుడు పరలోకంలో మానవుని సృజించడానికి ముందే స్వర్గనరకాలు తయారు చేశాడు. ప్రళయదినాన కర్మవిచారణ ముగిసిన తరువాత సత్యతిరస్కారులు, కపట విశ్వాసులు నరకం లోకి త్రోయబడతారు. పాపాలు చేసిన విశ్వాసులు కొంతకాలం నరకంలో శిక్ష అనుభవించిన తరువాత దైవానుగ్రహంతో, దైవప్రవక్తలు, ఇతర పుణ్యాత్ముల సిఫారసుతో వారికి నరకం నుండి విముక్తి లభిస్తుంది.

"(వినండి!) మీలో ఎవరూ నరకం మీదుగా పోనివారంటూ ఉండరు. ఇదొక నిర్ణీత విషయం. ఈ పని నెరవేర్చవలసిన బాధ్యత నీ ప్రభువు మీద ఉంది. ఆ సందర్భంలో మేము దైవభీతిపరాయణులను (నరకంలో పడకుండా) రక్షిస్తాము. దుర్మార్గుల్ని మాత్రం అందులో పడిపోవడానికి వదిలేస్తాము." (ఖుర్‌ఆన్–19:71,72)

"నరకం మీద (పుల్‌సిరాత్) వంతెన ఏర్పాటు చేయబడుతుంది. దైవప్రవక్తలలో అందరికన్నా ముందు నేను నా అనుచర సమాజాన్ని తీసుకొని దానిని దాటుతాను. ఆ



రోజు దైవప్రవక్తలు మాత్రమే మాట్లాడుతారు. వారయినా 'దేవా! (మమ్మల్ని) క్షేమంగా ఉంచు' అని మాత్రమే అంటారు. నరకంలో సాదాన్ (అనే ఒక విధమైన ముండ్ల చెట్టు) ముండ్లులా వంకర్లు తిరిగిన పొడవాటి మేకులుంటాయి. వాటి పొడవు దేవునికి మాత్రమే తెలుసు. ఆ మేకులు వంతెన మీద నడిచే వారిలో కొందర్ని (అవిశ్వాసుల్ని) వారి దుష్కర్మల కారణంగా పట్టి నరకంలోకి లాగి పడవేసేందుకు ప్రయత్నిస్తాయి. దాంతో కొందరు హతమయి నరకంలో పడిపోతారు. (ఇక ఎన్నటికీ అందులో నుంచి బయటపడలేరు.) మరికొందరు (విశ్వాసులు) తెగి నరకంలో పడిపోతారు. తరువాత కొంతకాలానికి అందులో నుంచి విముక్తి పొందుతారు." (బుఖారి, ముస్లిం)

ఏమైనప్పటికీ సత్యాన్ని విశ్వసించి సత్కర్మలు ఆచరించిన పుణ్యాత్ములు సైతం స్వర్గానికి పోవాలంటే నరకం మీదుగానే పోవలసి ఉంటుంది. దాని కోసం దేవుడు నరకం మీద ఒక వారధి (వంతెన) నిర్మించాడు. ఈ వారధినే "పుల్‌సిరాత్" అనంటారు. హదీసులో దీన్ని సిరాత్ అని మాత్రమే చెప్పబడింది.

ఈ వారధి దాటాలంటే దైవభీతిపరాయణులకు సులభమే. వారి పాలిట ఇది పాలరాయి రోడ్డుకంటే ఎన్నోరెట్లు మెరుగైన రోడ్డు. కాని పాపాత్ములైన విశ్వాసులకు ఈ వారధి దాటడం చాలా కష్టం. ఇది వారి పాలిట భయంకరమైన కొండచిలువలు, విష పురుగులు, క్రూరజంతువులతో, అడుగడుగునా ముండ్లచెట్లతో కటికచీకటిగా ఉండే ఎంతో ప్రమాదభరితమైన దారి.

ఆ వారధి కాలుతీసి పెట్టలేనంత జారుడుగా ఉంటుంది. నరకంలోని పెద్దపెద్ద పటకార్లు, పొడవైన ముళ్ళుండే రాకాసి చెట్లు ఆ వారధి అంచుల పైదాకా వచ్చి ఉంటాయి. అంతేగాకుండా నరకంలోని మరికొన్ని భయానక వస్తువులు కూడా వారధి అంచులకు పైదాకా వచ్చి వారధి మీద నడిచేవారిని నరకంలోకి లాగేయడానికి కాచుకొని ఉంటాయి.

పాపాత్ములైన విశ్వాసులలో కొందరు అడుగడుగునా ఉండే ఈ ప్రమాదాలను ఎదుర్కొంటూ, గాయాలతో పడుతూ లేస్తూ చివరికి ఎలాగో ఆ వారధి దాటి స్వర్గానికి చేరుకుంటారు. నరకం నొసట రాయబడిన మరికొందరు ఆ ప్రమాదాలను ఎదుర్కోలేక నరకంలో పడిపోతారు. అలా నరకంలో పడిపోయినవారు కొంత కాలానికి తమతమ కర్మలను బట్టి దైవప్రవక్తలు, దైవదూతలు, దైవభీతిపరాయణులైన విశ్వాసుల సిఫారసుతో, దైవానుగ్రహంతో నరకం నుంచి బయటపడి స్వర్గానికి చేరుకుంటారు.

పోతే దుష్కర్మలకు దూరంగా ఉంటూ సదా సత్కర్మలు ఆచరించిన దైవభీతి పరాయణులు ఆ వారధి మీద ఎలాంటి ప్రమాదానికి గురికాకుండా క్షేమంగా స్వర్గానికి చేరుకుంటారు. అయితే సుగుణసంపత్తి, పుణ్యకర్మల రీత్యా వారు వివిధ రకాలవారుగా ఉంటారు కాబట్టి నరకం మీదుండే ఈ వారధి దాటే పరిస్థితులు కూడా విభిన్నంగా ఉంటాయి. వారిలో కొందరు రెప్పపాటులో, కొందరు మెరుపు వేగంతో, కొందరు వాయు వేగంతో, కొందరు పక్షి వేగంతో, మరికొందరు అశ్వ వేగంతో, ఇంకొందరు ఒంటె వేగంతో ఆ వారధి దాటి స్వర్గానికి చేరుకుంటారు.

**జ్యోతి పంపిణీ :** విశ్వాసులు పుల్‌సిరాత్ (వారధి) దాటడానికి ముందు వారికి జ్యోతులు ఇవ్వబడతాయి. ఈ జ్యోతుల వెలుగు వారివారి కర్మలను బట్టి రకరకాలుగా

ఉంటుంది. ఇది వారధి మీదుండే చీకటిని పారదోలుతూ స్వర్గానికి దారిచూపే కరదీపిక వంటిది. విశ్వాసులలో కొందరి జ్యోతి కొండంత వెలుగు నిస్తుంది. మరి కొందరి జ్యోతి ఖర్జూరపు చెట్టంత వెలుగు నిస్తుంది. అన్నిటికంటే తక్కువ వెలుగునిచ్చే జ్యోతి బలహీన విశ్వాసికి ఇవ్వబడుతుంది. దాని వెలుగు మిణుకు మిణుకుమంటూ బొటన వ్రేలంత ఉంటుందని, అది ఒక్కోసారి ఆరిపోతూ వెలుగుతూ ఉంటుందని హజ్రత్ అబ్దుల్లా బిన్ మస్ఊద్ (రజి) అన్నారు. (దుర్రెమన్సూర్)

"ఆరోజు విశ్వసించిన స్త్రీపురుషుల ముందు, వారి కుడివైపు వారి జ్యోతి పరుగిడుతూఉండటం నీకు కన్పిస్తుంది. 'ఈరోజు మీకో గొప్పశుభవార్త!' అని వారికి చెప్పబడుతుంది. (అదే) సెలయేరులు ప్రవహించే స్వర్గవనాలు. ఆ స్వర్గవనాలలో వారు శాశ్వతంగా ఉంటారు. ఇదే గొప్పవిజయం, అపూర్వ సాఫల్యం." (ఖుర్ఆన్-57:12)

**కారుచీకటిలో కపట ముస్లింలు :** "ఆరోజు కపట స్త్రీపురుషుల పరిస్థితి (చూడండి). వారు (చీకటిలో తచ్చాడుతూ) "కాస్త మావైపు చూడండి. మీజ్యోతి వల్ల మాకూ కొంచెం ప్రయోజనం కలుగుతుంది" అంటారు విశ్వాసులతో. కాని "వెనక్కి వెళ్ళి మీజ్యోతి ఎక్కడుందో వెతుక్కోండి" అని సమాధానం లభిస్తుంది వారికి. తర్వాత వారుభయుల మధ్య ఒక అడ్డుగోడ ఏర్పడుతుంది. దానికి ఒక తలుపు ఉంటుంది. ఆ తలుపు వెనుక లోపలి వైపున (దైవ)కారుణ్యం ఉంటుంది. దాని వెలుపల (నరక) యాతనలు ఉంటాయి." (ఖుర్ఆన్-57:13)

"వారు విశ్వాసుల్ని కేకలుపెట్టి పిలుస్తూ "మేము (ప్రపంచంలో) మీతోపాటు లేమా?" అంటారు. దానికి విశ్వాసులు ఇలా అంటారు: "ఉన్నారు, కాని మిమ్మల్నిమీరు పరీక్షకు గురిచేసుకొని ప్రమాదం కొనితెచ్చుకున్నారు. గోడమీది పిల్లివాటంగా వ్యవహరించారు. అనుమానంలో పడిపోయారు. లేనిపోని ఆశలు పెంచుకొని ఆత్మవంచనకు పాల్పడ్డారు. దేవుని ఆజ్ఞ వచ్చేదాకా మీరు అదే స్థితిలో ఉన్నారు. పరమ మోసగాడు (షైతాన్) మిమ్మల్ని దేవుని విషయంలో చివరి క్షణం వరకూ మోసగిస్తూనే ఉన్నాడు. (వాడి వల్లో నుంచి బయట పడలేక పోయారు.) అందువల్లనే ఈరోజు (మీకీ దుర్గతి పట్టింది. ఇక) మీనుండి ఎలాంటి పరిహారం స్వీకరించబడదు. బహిరంగంగా (సత్య)తిరస్కారానికి పాల్పడినవారి నుండి కూడా (పరిహారం స్వీకరించబడదు). కనుక మీకిక నరకమే నివాసస్థలం. అక్కడే మీకు తగిన శాస్తి జరుగుతుంది. అది చాలా ఘోరమైన దుష్పర్యవసానం." (ఖుర్ఆన్-57:14,15)

**నరకంలో పడిపోయే ముస్లింలు :** (కర్మవిచారణ, వారధి దాటివేత ముగిసిన) తరువాత దేవుడు తన దూతలను పిలిచి, (ఏక)దేవుడ్ని ఆరాధించిన వారందర్నీ నరకం నుండి బయటికి తీయండని ఆదేశిస్తాడు. అప్పుడు దైవదూతలు నరకంలో పడ్డవారిలో సజ్దా (సాష్టాంగప్రణామం) చిహ్నాలు ఉన్నవారిని గుర్తిస్తారు. సజ్దా చిహ్నం ఉండే శరీర భాగాల్ని కాల్చకూడదని దేవుడు నరకాగ్నిని వారిస్తాడు. అది తప్ప మానవుని మిగిలిన దేహమంతటినీ నరకాగ్ని దహించి వేస్తుంది. ఈ కారణంగానే దైవదూతలు ఏకదైవారాధకులైనవారిని ఆ చిహ్నాలను బట్టి గుర్తించి నరకాగ్ని నుండి బయటికి తీస్తారు.

ఆరోజు (దైవభీతిపరాయణులైన) విశ్వాసులు తాము వారధి దాటగలిగినప్పటికీ తమ సోదర విశ్వాసుల్ని కాపాడేందుకు దేవుడ్ని పరిపరి విధాలా ప్రార్థిస్తారు. ఈరోజు



మీరు స్పష్టమైన ఒక హక్కు గురించి నన్ను ఎంత గట్టిగా అడుగుతారో, ఆరోజు వారు తమ సోదరుల్ని కాపాడుకోవడానికి అంతకంటే గట్టిగా దేవుడ్ని అడుగుతారు.

వారు దైవసన్నిధిలో తమ కోరికను వెలిబుచ్చుతూ "ప్రభూ! మా ఈ సోదరులు మాతో పాటు నమాజు చేస్తుండేవారు. ఉపవాసాలు పాటిస్తుండేవారు. ఇతర సత్కార్యాలు కూడా చేస్తుండేవారు. అలాంటి వీరు నరకంలో ఎలా పడ్డారో మాకు అర్థం కావడంలేదు. (ప్రభూ!) వీరిని క్షమించు" అని ప్రార్థిస్తారు. దేవుడు వారి మొరాలకించి "సరే వెళ్ళండి. హృదయంలో ఒక్కదీనారు విలువంత విశ్వాసం ఉన్నవారిని సైతం నరకం నుండి బయటికి తీసుకోండి" అని అంటాడు.

అప్పుడు వారు తమ సోదర విశ్వాసుల దగ్గరకు వెళ్తారు. (వారిపై నరక ప్రభావం ఉండదు.) నరకంలోని విశ్వాసులలో కొందరు పాదాల వరకు, మరికొందరు మోకాళ్ళ వరకు అగ్నిలో చిక్కుకొని ఉంటారు. అయితే అగ్ని వారి ముఖాలను మాడ్చి వికృతంగా చేయకుండా దేవుడు దాన్ని నిషేధిస్తాడు. దాంతో ఈ విశ్వాసులు తాము గుర్తించిన వారందర్నీ నరకం నుండి బయటికి తీస్తారు.

ఆ తరువాత వారు దేవుని సన్నిధికి వచ్చి మళ్ళీ విన్నవించుకుంటారు. అప్పుడు దేవుడు "సరే వెళ్ళండి. హృదయంలో అర్ధ దీనారంత విలువగల విశ్వాసమున్న వారిని కూడా నరకం నుండి తీసేసుకోండి" అని అంటాడు.

ఈ అనుమతితో వారు నరకానికి వెళ్ళి తాము గుర్తించగలిగిన వారందర్నీ నరకం నుండి బయటికి తీస్తారు. అలా తీసిన తరువాత దేవుని సన్నిధికి వచ్చి మళ్ళీ విన్నవించుకుంటారు. దానికి దేవుడు "సరే వెళ్ళండి హృదయంలో అణుమాత్రం విశ్వాసం (ఈమాన్) ఉన్నవారిని కూడా నరకం నుండి తీసేసుకోండి" అనంటాడు. వారు మూడవ సారి వెళ్ళి తాము గుర్తించగలిగిన వారందర్నీ నరకం నుండి తీసి రక్షిస్తారు.

హజ్రత్ అబూ సయీద్ ఖుద్రీ (రజి) ఈ సందర్భంగా మాట్లాడుతూ "మీకు నా మాటల మీద నమ్మకం లేకపోతే 'దేవుడు ఎవరికీ అణుమాత్రం అన్యాయం కూడా చేయడు. ఎవరైనా ఒక సత్కార్యం చేస్తే దేవుడు దానికి రెట్టింపు పుణ్యఫలం ప్రసాదిస్తాడు' అనే ఖుర్ఆన్ సూక్తి చదువుకోండి" అని అన్నారు.

ఈవిధంగా (నరకంలోని ముస్లింలను రక్షించడానికి) దైవప్రవక్తలు, దైవదూతలు, విశ్వాసులు అంతా సిఫారసు చేసిన తరువాత చివర్లో దేవుడు "ఇక నా సిఫారసు మిగిలి ఉంది" అంటాడు. ఆతర్వాత ఆయన నరకం నుండి కొంతమందిని బయటికి తీస్తాడు. వారు అప్పటికే బాగా కాలిపోయి బొగ్గుగా మారివుంటారు.

(దైవదూతలు) వారిని తీసి స్వర్గం సరిహద్దులో ఉండే ఒక సెలయేరులో పడవేస్తారు. లేక ఆందులోని అమృతాన్ని వారిపై చిలికిస్తారు. ఆ సెలయేరునీటి ప్రభావంతో నదిఒడ్డు మీది విత్తనాలు మొలకెత్తి సస్యశ్యామలమైనట్లు వారు నూతన శక్తిసౌందర్యాలతో నవనవలాడుతూ లేస్తారు. మీరు అనేకసార్లు చెట్ల పక్కనో, రాళ్ళ పక్కనో విత్తనాలు మొలకెత్తడాన్ని చూసే ఉంటారు. అలా మొలకెత్తే మొక్కల్లో ఎండ తగిలే మొక్కలు

పచ్చగా ఉంటాయి. ఎండ తగలకుండా నీడ పడే మొక్కలు పాలిపోతాయి. అదేవిధంగా వారు సెలయేరు నుండి ముత్యాల్లా మెరిసిపోతూ బయటికి వస్తారు. కాకపోతే వారి మెడల మీద ఒక మచ్చ ఉండిపోతుంది. ఆ తరువాత వారు స్వర్గంలో ప్రవేశిస్తారు.

అప్పుడు స్వర్గవాసులు వారిని చూసి "వీరు ఎలాంటి పుణ్యకార్యాలు చేయక పోయినా దేవుడు వీరికి (నరకం నుండి) విముక్తి కలిగించాడు" అని అంటారు. దేవుడు అలా స్వర్గంలో ప్రవేశించినవారితో "మీరిక్కడ చూస్తున్న (స్వర్గసంప)దంతా మీదే. అంతేకాదు, ఇంకా అంత (సంపద) అదనంగా మీకు లభిస్తుంది" అని అంటాడు.

(సహీబుఖారి: 10-(అజాన్), 97-(తౌహీద్) ప్రకరణల ఆధారంగా)

దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రవచించారు: "చేసుకున్న పాపాలకు శిక్షగా అనేకమందిని నరకాగ్ని దహిస్తుంది. తరువాత దేవుడు తన కారుణ్యానుగ్రహాలతో వారిని స్వర్గానికి పంపుతాడు. వారు నరకవాసులని పిలువబడతారు." (బుఖారి షరీఫ్)

**శిక్షకు ముందే గగ్గోలు పెట్టేవారు:** దైవప్రవక్త (స) ప్రవచనం: "నరకానికి పోయే వారిలో ఇద్దరు (ముస్లింలు) పెద్దగా అరుస్తూ గగ్గోలుపెడ్తారు. వారిద్దరిని తీసుకురండని (దైవదూతల్ని) ఆదేశిస్తాడు దేవుడు. వారొచ్చిన తరువాత 'మీరిద్దరు అంత పెద్దగా అరుస్తా రెందుకు?' అని ప్రశ్నిస్తాడు. దానికి వారిద్దరు 'మీరు మమ్మల్ని కరుణిస్తారని ఇలా అరుస్తున్నాం' అంటారు. దేవుడు ఈమాటలు విని 'నిస్సందేహంగా నా కారుణ్యం మీ ఇద్దరిపై ఉంది. సరే, మీరిద్దరు మళ్ళీ అక్కడికే వెళ్ళి (నరకంలో) పడండి' అని అంటాడు.

వెంటనే వారిద్దరిలో ఒకడు వెళ్ళి తననుతాను నరకంలో పడవేసుకుంటాడు. కాని దేవుని ఆదేశంతో నరకం అతని కోసం చల్లబడుతుంది. రెండోవాడు అక్కడే నిలబడి ఉంటాడు. తననుతాను నరకంలో పడవేసుకోడు. దేవుడు అతడ్ని ఉద్దేశించి 'నువ్వెందుకు నరకంలోకి పోయిపడలేదు? ఏవిషయం నిన్ను నిరోధించింది?' అని అడుగుతాడు. దానికతను సమాధానమిస్తూ 'ప్రభూ! మీరు నన్ను నరకం నుండి తప్పించిన తరువాత ఇక అందులోకి పంపరని ఆశిస్తున్నాను. (అందుకే నేనిక్కడే నిలబడిపోయాను.)' అని అంటాడు. దేవుడు ఈమాట విని 'సరే, నీవు ఆశిస్తున్నట్లే జరుగుతుంది, వెళ్ళు' అనంటాడు. తర్వాత దేవుని అనుగ్రహంతో వారిద్దరిని స్వర్గానికి పంపడం జరుగుతుంది." (తిర్మిజి)

## 112. మరణానికి మరణం

మరణానికి మరణం వస్తుంది. అంటే కర్మవిచారణ ముగిసిన తరువాత మరణం చచ్చిపోయి శాశ్వతంగా తెరమరుగయి పోతుందన్న మాట. దాంతో స్వర్గవాసులు, నరకవాసులు స్వర్గనరకాలలో శాశ్వతంగా ఉండిపోతారు. వారికిక మరణం అన్నదే రాదు. ఈ విషయాన్ని గురించి ఖుర్ఆన్ ఇలా పేర్కొంటున్నది:

"మా సూక్తులు తిరస్కరించి అవిశ్వాసులయినవారు నరకవాసులవుతారు. నరకంలోనే వారు (నానాయాతనలు అనుభవిస్తూ) ఎల్లకాలం పడివుంటారు." (64:10) "(సత్యాన్ని విశ్వసించి, సత్కర్మలు ఆచరించిన)వారు ఆ స్వర్గవనాలలో శాశ్వతంగా ఉంటారు." (2:25)



అవిశ్వాసులు ఓసారి నరకంలో పడిపోతే ఇక అందులో నుంచి బయటపడే ప్రసక్తే లేదు. విశ్వాసుల్లో మాత్రం పాపాత్ములైనవారు కొంతకాలం నరకంలో శిక్షలు అనుభవించిన తరువాత స్వర్గానికి పంపబడతారు. మొత్తంమీద ఎవరికీ మరణం ఉండదు.

దైవప్రవక్త (స) (మర్యంసూరాలోని) "తుదితీర్పు జరిగి పశ్చాత్తాపం తప్ప మరేమీ మిగలని రోజు గురించి వారిని భయపెట్టు" అనే సూక్తి పఠించిన తరువాత ఇలా ప్రవచించారు:

"(స్వర్గానికి పోవలసినవారు స్వర్గానికి, నరకానికి పోవలసినవారు నరకానికి చేరు కున్న తర్వాత దైవదూతలు) నల్లమచ్చలు ఉండే తెల్లపొటేలు రూపంలో మృత్యువుని తీసుకొచ్చి స్వర్గ నరకాల మధ్య ఉండే గోడ మీద నిలబెడ్తారు. అప్పుడు ఒక ప్రకటనకర్త ముందుకొచ్చి 'స్వర్గవాసులారా!' అని కేకవేస్తాడు. ఈ కేక విని వారు తలెత్తి చూస్తారు. అలాగే అతను 'నరకవాసులారా!' అని కేక పెడ్తాడు. ఈ కేక విని నరకవాసులు కూడా తలపైకెత్తి చూస్తారు. అప్పుడు దైవదూతలు స్వర్గ నరకవాసుల్ని ఎలుగెత్తి పిలుస్తూ "దీన్ని మీరు గుర్తించారా?" అనడుగుతారు. దానికి వారు "ఆ... ఇది మృత్యువు" అంటారు.

అప్పుడు దైవదూతలు ఆ పొటేలును పండబెట్టి నరికి చంపుతారు. ఆ తర్వాత వారు స్వర్గవాసులతో "స్వర్గవాసులారా! మీరిక స్వర్గంలోనే శాశ్వత జీవితం గడుపుతారు. మీకు మరణం అనేదే రాదు" అంటారు. అలాగే వారు నరకవాసుల వైపు తిరిగి "నరక వాసులారా! మీరిక నుంచి నరకంలోనే ఎల్లకాలం పడివుండి దుర్భర యాతనలు అను భవిస్తూఉంటారు. మీకిక చావు అనేదే రాదు" అంటారు. ఈ ప్రకటన వినగానే స్వర్గవాసులు ఎంతో సంతోషిస్తారు; నరకవాసులు మరింత రోదిస్తారు." (బుఖారి, ముస్లిం, తిర్మిజి)

స్వర్గజీవితం శాశ్వతమని, మరణం ఇకఎన్నటికీ రాదని తెలిసిన తర్వాత స్వర్గవాసి మనసు కుదుటపడుతుంది. అతని ఆనందం వర్ణనాతీతం.

"ఇప్పుడు మనం ఎన్నటికీ చనిపోము కదూ! మనకు రావలసిన మృత్యువేదో ఇదివరకే వచ్చింది. ఇక మనకు ఎలాంటి శిక్షా ఉండదు కదూ!' అనంటాడు." (ఖుర్ఆన్–37:59)

అలాగే నరకజీవితం శాశ్వతమని, మరణం ఇక ఉండదని తెలిసిన తర్వాత నరకవాసి తీవ్రఆందోళన చెందుతాడు. ఎంత కఠినమైన యాతనకు గురైనా అతనికి చావు రాదు.

"నలువైపుల నుంచి మృత్యువు అతడ్ని చుట్టుముడ్తుంది. కాని అతను చావడు. దానికి ముందు అతడ్ని చంపుకుతినే మరో యాతన పొంచి ఉంటుంది." (ఖుర్ఆన్–14:17)

## 113. నరక కూపం

నరకం అవిశ్వాసుల్ని, అహంకారుల్ని శిక్షించడానికి పొంచివున్న ఓ భయంకరమైన యాతనా స్థలం. చీకటిమయంగా ఉండే పెద్దగొయ్యి. అక్కడ అగ్నియాతనలతో పాటు నానారకాలకు చెందిన ఒళ్ళు గగుర్పొడిచే యాతనలు ఉంటాయి.

హజ్రత్ ఇబ్నెమస్వూద్ (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ఇలా చెప్పారు: "ప్రళయదినాన నరకాన్ని తీసుకురావడం జరుగుతుంది. దానికి డెబ్భయి వేల పగ్గాలు ఉంటాయి. ప్రతి పగ్గాను డెబ్భయి వేల మంది దైవదూతలు పట్టుకొని లాగుతుంటారు." (ముస్లిం)

**స్వర్గనరకాల వాదనలు:** హజ్రత్ అబూహురైరా (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ఇలా తెలిపారు: స్వర్గనరకాల మధ్య వాదోపవాదాలు జరిగాయి- నరకం మాట్లాడుతూ "నాలో గర్విష్ఠులు, బలవంతులు ప్రవేశిస్తారు. కనుక నీకంటే నేనే గొప్పదాన్ని" అని అన్నది. దానికి స్వర్గం "(పోనీలే.) నాలో బలహీనులు, నిస్సహాయులు, ప్రజల దృష్టిలో విలువలేనివాళ్ళు మాత్రమే ప్రవేశిస్తారు" అని అన్నది. అప్పుడు దేవుడు జోక్యంచేసుకుంటూ స్వర్గంతో "నీవు నాకారుణ్యానివి. నీద్వారా నాదాసులలో నేను తలచుకున్నవారిని కరుణిస్తాను" అన్నాడు. ఆ తర్వాత నరకంతో "నీవు నా'యాతన'వు మాత్రమే. నీ ద్వారా నా దాసులలో నేను తలచుకున్న వారిని శిక్షిస్తాను" అన్నాడు. (బుఖారి, ముస్లిం)

హజ్రత్ హారిసా బిన్ వహబ్ (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ఇలా చెప్పారు: "నేను మీకు స్వర్గవాసుల గురించి చెప్పనా? (సాధారణంగా లోకులు) అల్పుడిగా జమకట్టే ప్రతి బలహీనుడు (స్వర్గవాసి అయివుంటాడు). అతను గనక దేవుని మీద ప్రమాణంచేస్తే దేవుడు అతని ప్రమాణాన్ని నిజం చేస్తాడు. నరకవాసుల గురించి చెప్పనా? పొగరుబోతు, పిసినిగొట్టు, గర్విష్ఠి అయిన ప్రతివాడూ (నరకవాసియే). (బుఖారీ, ముస్లిం)

**నరకం లోతు-** దైవప్రవక్త (స) హితోక్తి : "నరకంలోకి ఒక రాయి విసిరితే అది దొర్లుకుంటూ నరకం అడుగుకు చేరుకోవడానికి డెబ్బయి యేళ్ళు పడుతుంది." (తర్గీబ్)

హజ్రత్ అబూహురైరా (రజి) ఉల్లేఖనం: మేము దైవప్రవక్త (స) సన్నిధిలో కూర్చొని ఉన్నప్పుడు ఓసారి ధబేలున ఏదో వస్తువు పడిపోయినట్లు శబ్దం విన్పించింది. దైవప్రవక్త (స) "ఈశబ్దం ఏమిటో మీకు తెలుసా?" అనడిగారు. "దేవునికి, ఆయన ప్రవక్తకు మాత్రమే తెలుసు" అన్నాము మేము. అప్పుడాయన "ఇది రాయి పడిన శబ్దం. దేవుడు దీన్ని పడి పోవడానికి నరకంలో వదిలేశాడు. అది డెబ్బయి యేళ్ళ దాకా దొర్లుతూ ఇప్పుడు నరకం అడుగుకు చేరుకున్నది. ఇది ఆ రాయి పడిపోయిన శబ్దమే" అని అన్నారు. (ముస్లిం)

దైవప్రవక్త (స) ఇలా అన్నారు: "నరకం చుట్టూ నాలుగు ప్రహరీ గోడలు ఉన్నాయి. ఆ గోడలు నలభై యేళ్ళ ప్రయాణం చేసేటంత మందంగా ఉంటాయి." (తిర్మిజి)

**నరకాగ్ని, కటికచీకటి-** దైవప్రవక్త (సల్లం) ఈవిధంగా ప్రవచించారు:

"నరకాన్ని వేయి సంవత్సరాలు మండిస్తే దాని అగ్ని ఎర్రగా మారింది. తరువాత మరో వేయి సంవత్సరాలు మండించడం జరిగింది. అప్పుడది తెల్లగా మారింది. ఆ తరువాత మరో వేయి సంవత్సరాలు మండించగా ఆ అగ్ని నల్లగా మారిపోయింది. కనుక నరకం ఇప్పుడు చీకటిగా ఉంది." (తిర్మిజి); వేరొక ఉల్లేఖనం ప్రకారం నరకంలో అగ్నిజ్వాలలు ఉన్నా వెలుగు ఉండదు. ఎల్లప్పుడూ చీకటిగానే ఉంటుంది. (తర్గీబ్)

**నరకాగ్ని తీవ్రత-** దైవప్రవక్త (స) "మీరు (ప్రపంచంలో) వాడే అగ్ని నరకాగ్ని (తీవ్రత)లో డెబ్బయ్యో వంతు మాత్రమే ఉంటుంది" అని అన్నారు. ప్రవక్త అనుచరులు ఈమాట విని "(కాల్చి మసి చేయడానికి) ఈ నిప్పే ఎంతో ఎక్కువ కదా?" అన్నారు. దానికి దైవప్రవక్త (స) "నిజమే. అయినప్పటికీ ఇహలోకంలోని నిప్పుకంటే నరకాగ్ని 69 రెట్లు ఎక్కువ వేడిగా ఉంటుంది" అన్నారు. (బుఖారి, ముస్లిం)



ఒక ఉల్లేఖనంలో "నరకవాసి గనక ఇహలోకంలోని నిప్పులోకి వస్తే అతనికి నిద్ర వస్తుంది" అని ఉంది. అంటే నరకవాసికి ఇహలోకపు నిప్పు చల్లగా, హాయిగా అన్పిస్తుం దన్న మాట. దాంతో సహజంగానే నిద్ర వస్తుంది.

**నరక శ్వాస-** దైవప్రవక్త(స) ఇలా ప్రవచించారు: "మధ్యాహ్నం వేళ ఎండ తీవ్రంగా ఉంటే జుహర్ నమాజ్ కాస్త ఆలస్యంగా చేసుకోండి. నరకాగ్ని తీవ్రత వల్లనే ఈ ఎండ తీవ్రంగా ఉంటుంది..." నరకం తన ప్రభువును వేడుకుంటూ '(నా ఉష్ణతీవ్రత ఎక్కువై పోయి) నా భాగం ఒకటి మరోభాగాన్ని తినేస్తోంది.' అన్నది. అప్పుడు దేవుడు నరకానికి రెండు సార్లు ఊపిరి పీల్చి వదిలే అనుమతి ఇచ్చాడు. ఒకసారి శీతాకాలంలో, మరొకసారి ఎండాకాలంలో. ఎండాకాలంలో అది వదిలే శ్వాసవల్లనే మీకు తీవ్రఉష్ణోగ్రత కలుగుతుంది. అలాగే చలికాలంలో అది పీల్చే శ్వాస వల్ల మీకు తీవ్రమైన చలి కలుగుతుంది." (బుఖారి)

**నరకాగ్ని సమిధలు-** నరకాగ్ని ఎల్లప్పుడూ మండాలంటే ఇంధనం కావాలికదా! దేవుడు ఆ యేర్పాటు కూడా చేశాడు. దాన్నిగురించి ఖుర్ఆన్‌లో సూచనప్రాయంగా ఇలా ఉంది:

"మనుషులు, రాళ్ళు ఇంధనం కాగల నరకాగ్నికి భయపడండి. సత్యతిరస్కారుల కోసం అది సిద్ధపరచబడి ఉంది." (ఖుర్ఆన్-2:24)

పైసూక్తి గురించి హజ్రత్ అబ్దుల్లా బిన్ మస్‌వూద్ (రజి) వ్యాఖ్యానిస్తూ "నరక సమిధలని దేవుడు చెప్పిన ఈ రాళ్ళు గంధకపు రాళ్ళు. భూమ్యాకాశాలు సృష్టించినప్పుడే దేవుడు సమీపాకాశాంలో ఈ గంధకపు రాళ్ళను సృష్టించి సిద్ధంగా ఉంచాడు... ఈ రాళ్ళు సత్యతిరస్కారు కోసం తయారు చేయబడ్డాయి." (హాకిమ్)

అదీగాక అవిశ్వాసులు దైవాలుగా కొలిచిన విగ్రహాలు కూడా నరకాగ్నికి సమిధలవుతాయి.

"మీరు, మీ మిథ్యాదైవాలు నరకానికి పోవడం ఖాయం. నరకానికే మీరంతా పోవలసి ఉంటుంది. అవి నిజంగా దైవాలయితే నరకానికిపోవు." (ఖుర్ఆన్-21:98,99)

**నరక ద్వారాలు-** దైవప్రవక్త (స) నరకద్వారాలను గురించి చెబుతూ ఇలా అన్నారు: "నరకానికి ఏడు ద్వారాలు ఉన్నాయి. అందులో ఒక ద్వారం నా అనుచర సముదాయంపై ఖడ్గం ఎత్తేవారి కోసం కేటాయించబడింది." (మిష్కాత్)

**విభిన్న వర్గాలకు విభిన్న అంతస్తులు :** నరకానికి ఉండే ఏడు ద్వారాలు ఏడు భాగాలు లేక ఏడు అంతస్తులకు సంబంధించినవని ధర్మవేత్తలు వ్యాఖ్యానించారు.

ఇబ్నెకసీర్ (రహ్మాలై) హజ్రత్ అలి (రజి) మాటల్ని ఉల్లేఖిస్తూ, నరకంలో ఏడు అంతస్తులు ఉంటాయని, ప్రతి అంతస్తుకు ఒక ద్వారం ఉంటుందని అన్నారు.

నరకంలో అన్నిటికంటే అట్టడుగున ఉండే **1**-మొదటి అంతస్తులో ఫిరౌన్ చక్రవర్తి, అతని అనుచరులు, కపటవిశ్వాసులు ఉంటారు. ఈ నరకాన్ని "హావియా" అంటారు. దానిపై ఉండే **2**-రెండవ అంతస్తులో బహుదైవారాధకులు ఉంటారు. ఈ నరకాన్ని "జహీమ్" అంటారు. దానిపై ఉండే **3**-మూడవ అంతస్తులో నాస్తికులు, చార్వాకులు ఉంటారు. ఈ నరకాన్ని "సఖర్" అంటారు. దానిపై ఉండే **4**-నాల్గవ అంతస్తులో ఇబ్లీస్ (షైతాన్), అతని అనుచరులుంటారు. ఈ నరకాన్ని "లజా" అంటారు. దానిపై ఉండే

5-అయిదవ అంతస్తులో యూదులుంటారు. ఈ నరకాన్ని "హుతమా" అంటారు. దానిపై ఉండే 6-ఆరవ అంతస్తులో క్రైస్తవులు ఉంటారు. ఈ నరకాన్ని "సయీర్" అంటారు. దానిపై ఉండే 7-ఏడవ అంతస్తులో పాపాత్ములైన ముస్లింలు ఉంటారు.

దీని మీదనే వారధి (పుల్‌సిరాత్) ఉంటుంది. ముస్లిములైనా, ముస్లిమేతరులైనా ఈ వారధి మీదనే నడచి ముందుకు పోవలసి ఉంటుంది.

**రాకాసి మెడ (మాట్లాడే క్రేన్):** నరకంలో పొడవైన మెడ కలిగిన ఓ రాకాసి జంతువు పుట్టుకొస్తుంది. ఇది మూడు విధాల మనుషుల్ని పట్టుకొని బాధిస్తుంది.

దీన్ని గురించి దైవప్రవక్త (సల్లం) ఇలా చెప్పారు: "ప్రళయదినాన నరకంలో ఒక మెడ బయల్పడుతుంది. దానికి చూడటానికి రెండు కళ్ళు, వినడానికి రెండు చెవులు, మాట్లాడటానికి ఒక నోరు ఉంటాయి. అది నరకవాసులతో మాట్లాడుతూ 'నేను మూడు రకాల మనుషుల కోసం నియమించబడ్డాను. (1) తలబిరుసు ధిక్కారి, (2) అల్లాహ్‌తో పాటు మరో దైవాన్ని కొలిచేవాడు, (3) బొమ్మలు తయారుచేసేవాడు. (తిర్మిజి)

**నరకంలో పాములు, తేళ్ళు :** నరకశిక్ష అంటే దహనయాతనలు మాత్రమే కాదు, ఇతర రకాల శిక్షలు కూడా ఉంటాయి. అక్కడ పాములు, తేళ్ళు కూడా ఉంటాయి.

దైవప్రవక్త (స) ఇలా తెలిపారు: "నరకంలో పొడవైన మెడలు ఉండే ఒంటెలు అంతటి పెద్ద పెద్ద పాములు ఉంటాయి. వాటిలో ఒక పాము గనక నరకవాసికి కాటేస్తే అతను నలభై యేళ్ళదాకా దాని విష బాధను అనుభవిస్తుంటాడు."

"అలాగే నరకంలో బురద పూసుకున్న కంచరగాడిదల్లాంటి పెద్దపెద్ద తేళ్ళు కూడా ఉంటాయి. వాటిలో ఒక తేలు గనక నరకవాసికి కాటేస్తే అతను నలభై యేళ్ళదాకా దాని విష బాధను అనుభవిస్తుంటాడు." (అహ్మద్)

**నరకపాలకుల సంభాషణ:** "(తీర్పు ముగిశాక) దైవదూతలు అవిశ్వాసుల్ని గుంపులు గుంపులుగా నరకం వైపు తోలుకెళ్తారు. నరకం దగ్గరికి చేరుకున్న తరువాత నరకద్వారాలు తెరుస్తారు. అప్పుడు ద్వారపాలకులు వారిని ఇలా అడుగుతారు:

'మీ దగ్గరికి మీ (జాతి) ప్రజల నుండి దైవప్రవక్తలు రాలేదా? వారు మీకు మీ ప్రభువు సూక్తులు విన్పించలేదా? ఈనాడు (ఎదురయ్యే పరిణామాల్ని) గురించి (ఆనాడే) వారు మిమ్మల్ని హెచ్చరించలేదా?' దానికి వారు 'వచ్చారు. (హెచ్చరించారుకూడా.) కాని సత్యతిరస్కారులకు నరకశిక్ష (ఎప్పుడో) నిర్ణయమైపోయింది' అని సమాధానమిస్తారు.

"అయితే నరకంలోకి పోయిపడండి. ఇక మీరిక్కడే ఎల్లకాలం పడిఉంటారు. గర్విష్ఠులకు నిర్ణయించిన ఈ నరకం పరమ చెడ్డస్థలం' అంటారు ద్వారపాలకులు" (ఖుర్ఆన్:39:71,72)

"నరకంలో (దుష్ట)మూకల్ని విసరివేసినప్పుడల్లా దాని నిర్వాహకులు "మీ దగ్గరకు హెచ్చరించేవారు రాలేదా?" అని అడుగుతారు. దానికి వారు "ఎందుకు రాలేదు, వచ్చాడొకతను. కాని మేమతడ్ని తిరస్కరించాం. పైగా అతనితో 'దేవుడు ఏదీ పంపలేదు. నీవు చాలా అపమార్గంలో పడిపోయావు అన్నాం" అనంటారు. (ఖుర్ఆన్-11:106)



**నరకం మాట్లాడుతుంది:** "ఆరోజు మేము నరకాన్ని 'నీవు నిండిపోయావా?' అని అడుగుతాం. దానికి నరకం 'ఇంకేమైనా ఉందా?' అంటుంది." (ఖుర్ఆన్-50:30)

దేవుడు ఖుర్ఆన్‌లో"'నేను మానవులు, జిన్నులతో నరకాన్ని నింపుతాను" (32:13) అన్నాడు. దానిప్రకారం కర్మవిచారణ ముగిసిన తర్వాత సత్యతిరస్కారులైన మానవుల్ని, జిన్నుల్ని నరకంలో పడవేసి "ఇక నీవు నిండిపోయావా?" అని అడుగుతాడు దేవుడు. నరకం "ఇంకా ఏమైనా ఉందా?" అంటుంది. అంటే 'ఇంకా నాదగ్గర చాలా చోటుంది, ఏదైనా ఉంటే తెచ్చిపడెయ్యి' అంటుంది. అప్పుడు దేవుడు నరకంలో తన పాదం ఉంచుతాడు. దాంతో నరకం "చాలుచాలు, ఇకచాలు" అంటుంది. (బుఖారి)

**పాపాత్ముల పశ్చాత్తాపం:** "ఆరోజు వారిముఖాలు వెనక్కితిప్పి అగ్నిలో వేయడం జరుగుతుంది. అప్పుడు వారు "అయ్యయ్యో! మనం దేవునికి, దైవప్రవక్తకు విధేయులైవుంటే ఎంత బాగుండేది!" ప్రభూ! మేము మా నాయకులు, పెద్దలు చెప్పిన మాటలు విని, వారిని అనుసరించాం. వారు మమ్మల్ని అపమార్గం పట్టించారు. ప్రభూ! వారికి రెట్టింపు శిక్ష విధించు. వారిని తీవ్రంగా శపించు" అనంటారు. (ఖుర్ఆన్-33:66-68)

"నా సూక్తులు విన్పించబడుతున్నప్పుడు వాటిని మీరు నిరాకరిస్తుండేవారు కదూ?" అప్పుడు వారు ఇలా అంటారు: "ప్రభూ! మా దౌర్భాగ్యమే మాకొంప ముంచింది. మేము నిజంగా మార్గభ్రష్టులై పోయాము. ప్రభూ! మమ్మల్ని ఇక్కడ్నుంచి తీసెయ్యి. ఆ తరువాత మేము మళ్ళీ తప్పుచేస్తే దుర్మార్గులై పోయినట్లే". (ఖుర్ఆన్-23:105-107)

ఆ తరువాత (దైవదూతలు) ఆ మిథ్యాదైవాలను, ఈ భ్రష్టుల్ని, షైతాన్ అనుచర మూకను అందర్నీ ఒకరిమీద ఒకర్ని పడవేసి నరకంలోకి త్రోసివేస్తారు. అక్కడ వారంతా పరస్పరం పోట్లాడుకుంటారు. వారు (తమ మిథ్యాదైవాలతో) ఇలా అంటారు:

"దైవసాక్షి! మేము మీకు సర్వలోకప్రభువంతటి స్థానమిచ్చి మార్గ భ్రష్టులైపోయాం. మమ్మల్నీ పాపాత్ములే పెడదారి పట్టించారు. ఇక మాకెవరు సిఫారసు చేసేవారు! ఏ ప్రాణ స్నేహితుడు కూడా అడ్డుపడలేదే!! అయ్యయ్యో! మాకోసారి ప్రపంచానికి తిరిగివెళ్ళే అవకాశం లభిస్తే మేము (తప్పకుండా) విశ్వాసులై పోతాము." (ఖుర్ఆన్-26:95-102)

"అయ్యో! మా పాడుగాను!! మేము (ప్రవక్తమాటలు) విని అర్థం చేసుకొని ఉంటే ఈరోజు మేము అగ్నిశిక్షకు గురైనవారిలో చేరి వుండేవారం కాము" అని కూడా అంటారు వారు. ఈవిధంగా వారు తమ తప్పు ఒప్పుకుంటారు. ఈ నరకవాసులు నాశనంగాను! (ఇప్పుడా వీరు తప్పు ఒప్పుకునేది?)" (ఖుర్ఆన్-67:5-11)

**నరక పాలకుల వివరాలు:** "నరకం (పాపాత్ములను) మిగల్చదూ, వదలిపెట్టదు. చర్మాన్ని నిలువుగా మాడ్చివేస్తుంది. దాని నిర్వహణకు పంథొమ్మిది మంది కార్యకర్తలు నియమించ బడ్డారు. మేము నరకపాలకులుగా దైవదూతల్ని నియమించాం. వారి సంఖ్యను సత్యతిరస్కారులకు పరీక్షగా చేశాం. గ్రంథప్రజలకు నమ్మకం కుదరడానికి, విశ్వాసుల విశ్వాసం మరింత దృఢం కావడానికి ఇలా చేశాం. కనుక గ్రంథప్రజలు, విశ్వాసులు ఎలాంటి అనుమానంలో పడిపోకూడదు. హృదయంలో (కాపట్య) రోగమున్నవారు, సత్యతిరస్కారులు

(నరకపాలకుల సంఖ్యను విమర్శిస్తూ) 'దేవుడు చెప్పిన ఈ వింతమాటలోని అంతరార్థం ఏమిటో!' అంటారు." (ఖుర్ఆన్–74:28–31)

"అక్కడ దృఢకాయులైన, కఠిన (హృదయులైన) దైవదూతలు నియమితులై ఉంటారు. వారు దేవుని ఆజ్ఞలను ఏమాత్రం జవదాటరు. ఏఆజ్ఞ వచ్చినా తక్షణమే శిరసావహిస్తారు. 'అవిశ్వాసులారా! ఈరోజు మీరు సాకులు చెప్పకండి. మీరెలాంటి కర్మలు చేసుకున్నారో అలాంటి ప్రతిఫలమే మీకివ్వబడుతోంది' అంటారు వారు." (ఖుర్ఆన్–66:6,7)

"ఆరోజు (దైవదూతలు) వీరిని కొడ్తూ, నెడుతూ నరకం వైపుకు తీసికెళుతూ ఇలా అంటారు: 'మీరు నిరాకరిస్తుండిన నరకాగ్ని ఇదే. ఇప్పుడు చెప్పండి, ఇది మంత్రజాలమా లేక మీకేమీ అర్థంకావడం లేదా? వెళ్ళండి. అందులో పడి మాడిపోండి. ఇక మీరు ఓర్పు వహించినా, వహించకపోయినా ఒక్కటే. (నరకయాతన తగ్గించబడదు.) మీరెలాంటి కర్మలు ఆచరించారో అలాంటి ప్రతిఫలమే మీకివ్వబడుతోంది". (ఖుర్ఆన్–52:14,15,16)

"ఆ తర్వాత నరకంలో పడినవారు నరకపాలకులతో "మా శిక్షను ఒక్క రోజైనా తగ్గించమని మీ ప్రభువును ప్రార్థించండి" అంటారు. దానికి నరకపాలకులు "మీ దగ్గరకు మీ ప్రవక్తలు నిదర్శనాలు తీసుకొని రాలేదా?" అని అడుగుతారు. వారు "వచ్చార"ంటారు. "అయితే మీరే మొరపెట్టుకోండి. అవిశ్వాసుల మొరలు నిరుపయోగమే అవుతాయి" అని చెబుతారు నరకపాలకులు. (ఖుర్ఆన్–40:49,50)

"వారు 'నరకపాలకుడా! నీ ప్రభువు మా కథను ముగించివేస్తే బాగుండు' అని అరుస్తారు. దానికి దైవదూత 'మీరు అలాగే పడివుండండి. మేము మీ దగ్గరకు సత్యాన్ని తెస్తే, మీలో చాలామందికి అసలు సత్యమే గిట్టలేదు' అని అంటాడు." (ఖుర్ఆన్–43:77,78)

## 114. నరకయాతనలు

"నరకం వారిని దూరం నుంచి చూడగానే, వారు దాని ఆగ్రహోద్రేకపూరితమైన భీకరగర్జనలు వింటారు. వారిని కాళ్ళు, చేతులు కట్టివేసి ఇరుకైన స్థలంలో కుక్కినప్పుడు వారు (విలవిల్లాడుతూ) మృత్యువుని పిలుస్తారు. 'ఈరోజు మీరు ఒక్కచావు కాదు, అనేక చావుల్ని పిలుచుకోండి' (అని సమాధానం ఇవ్వబడుతుంది)." (ఖుర్ఆన్–25:12–14)

**దహనయాతనలు:** "వారిని పైనుండీ, క్రిందినుండీ అగ్నిగొడుగులు (జ్వాలలు) ఆవరిస్తాయి. ఇలాంటి దుష్పర్యవసానం నుండి (కాపాడుకోమని) దేవుడు తన దాసుల్ని హెచ్చరిస్తున్నాడు. కనుక నా దాసులారా! నా ఆగ్రహం నుండి తప్పించుకోండి." (39:16)

"దుష్కార్యాలలో కూరుకుపోయినవారికి నరక నివాసమే గతవుతుంది. ఆ నరకం నుండి బయట పడేందుకు ప్రయత్నించినప్పుడల్లా వారిని మళ్ళీ అందులోకే నెట్టి వేయడం జరుగుతుంది. అప్పుడు (దైవదూతలు) వారితో 'మీరు నరకాన్ని తిరస్కరిస్తుండే వారుకదూ! ఆ నరక శిక్షనే ఇప్పుడు చవిచూడండి' అంటారు." (ఖుర్ఆన్–32:20)

"పోతే ఎడమపక్షంవారు– ఎడమపక్షంవారి దౌర్భాగ్యం గురించి ఏమని చెప్పాలి? వారు (నరకంలో శరీరాన్ని మలమల మాడ్చివేసే వడగాల్పుల మధ్య సలసల మరిగే నీటిని



తాగుతూ, ఎలాంటి సుఖాన్నిగాని, చల్లదనాన్నిగాని ఇవ్వని నల్లటి కారుపొగల్లో (నానా యాతనలు అనుభవిస్తూ) ఉంటారు." (ఖుర్ఆన్–41–44)

"అతను కసకస నలిపి తొక్కివేసే చోట విసిరి వేయబడతాడు. కసకస నలిపి తొక్కివేసే చోటంటే ఏమిటో నీకు తెలుసా? దేవుని (నరకా) అగ్ని. అది భగభగ మండుతూ గుండెలదాకా చేరుతుంది. వారిని ఆ అగ్నిగుండాలలో పడవేసి మూసివేయడం జరుగుతుంది. ఈ విధంగా వారు పొడవయిన (అగ్ని)కీలల మధ్య చిక్కుకొని ఉంటారు." (ఖుర్ఆన్–104:6–9)

"వారి పడక కూడా నరకాగ్ని పడకే, దుప్పటికూడా నరకాగ్ని దుప్పటే అవుతాయి. ఇదే దుర్మార్గులకు మేమిచ్చే ప్రతిఫలం." (7:41) "నరకాగ్ని వారి ముఖచర్మాన్ని మాడ్చి వేస్తుంది. దాంతో వారి పళ్ళు, దవడలు బయటికి వస్తాయి." (ఖుర్ఆన్–23:104)

"అక్కడ వారి చర్మాలు కాలిపోయినప్పుడల్లా (నిరంతరం) నరకయాతనల్ని చవి చూసేందుకు మళ్ళీ మళ్ళీ కొత్త చర్మాలు సృజిస్తాము." (ఖుర్ఆన్–4:56)

ప్రఖ్యాత తత్వవేత్త హజ్రత్ హసన్ బస్రి (రహ్మ) పై సూక్తిని గురించి తన అభిప్రాయం ఇలా వెలిబుచ్చారు: "నరకవాసుల్ని నరకాగ్ని రోజుకు డెబ్బయి సార్లు కాల్చుతుంది. కాల్చిన ప్రతిసారీ వారితో 'పూర్వం ఎలా ఉండేవారో అలామారండి' అని చెప్పబడుతుంది. దాంతో వారు కాలిన ప్రతిసారీ తిరిగి పూర్వస్థితికి మారుతారు." (తర్గీబ్ వ తర్హీబ్)

"వారిలో సత్యాన్ని తిరస్కరించినవారి కోసం అగ్నివస్త్రాలు తయారుచేయబడ్డాయి. వారి తలలపై సలసలకాగే నీటిని కుమ్మరిస్తారు. దానివల్ల వారి చర్మాలేకాదు, వారి పొట్టలోని పేగులు సైతం కాలి కరిగిపోతాయి." (ఖుర్ఆన్–22:19,20)

దైవప్రవక్త (సల్లం) ఇలా తెలిపారు: "నరకంలో అందరికంటే తేలికపాటి శిక్ష అనుభవించేవాడి పరిస్థితి ఎలా ఉంటుందంటే, అతని కాళ్ళకు రెండు అగ్ని చెప్పులుంటాయి. వాటి వేడికి అతని మెదడు కుండలోని పదార్థం ఉడుకుతున్నట్లు కుతకుత ఉడికిపోతుంటుంది. ఇది అందరికంటే తేలిక యాతన అయినప్పటికీ ఆ నరకవాసి ఇంతకంటే కఠినమైన యాతన మరెవరికీ లేదనుకుంటాడు." (బుఖారి)

**శీతల యాతనలు :** నరకంలో శీతల యాతనలు కూడా ఉంటాయి. అతి తీవ్రమైన చలితో రక్తం గడ్డకట్టుకోవడమే గాక చలితీవ్రత వల్ల శరీరం అణువణువూ విడిపోతుంది.

"స్వర్గవాసులు అక్కడ అద్భుతమైన ఆసనాలపై మెత్తటి దిండ్లకానుకొని కూర్చొని ఉంటారు. వారికి ఎండబాధ గాని, చలిబెడద గాని ఉండదు." (ఖుర్ఆన్–76:13)

దైవప్రవక్త (స) ఇలా తెలిపారు: "ఎండ తీవ్రంగా ఉండే రోజు దేవుడు తన దృష్టి, వినికిళ్ళను భూమ్యాకాశాల వైపు సారిస్తాడు. అప్పుడు ఎవరైనా 'అల్లాహ్ తప్ప మరో ఆరాధ్యుడు లేడు. ఈరోజు ఎండ తీవ్రంగా ఉంది. దేవా! నన్ను నరకాగ్ని నుండి కాపాడు' అని ప్రార్థిస్తే దేవుడు నరకంతో 'నా దాసుల్లో ఒకతను నీబారి నుండి నా రక్షణ కోరాడు. నేను నిన్ను సాక్షిగా చేసి అతనికి రక్షణ ప్రసాదించాను.' అని అంటాడు. అలాగే చలి తీవ్రంగా ఉండే రోజు దేవుడు తన దృష్టి, వినికిళ్ళను భూమ్యాకాశాల వైపు సారిస్తాడు.

అప్పుడెవరైనా 'దేవుడు తప్ప మరో ఆరాధ్యుడు లేడు. ఈరోజు చలి తీవ్రంగా ఉంది. దేవా! నన్ను నరకంలోని జమ్‌హరీర్ చలి బారి నుండి కాపాడు' అని ప్రార్థిస్తే దేవుడు నరకంతో 'నా దాసుడొకతను నన్ను నీ జమ్‌హరీర్ బారి నుండి రక్షణ కోరుతున్నాడు. నేను నిన్ను సాక్షిగా చేస్తూ అతనికి రక్షణ ప్రసాదిస్తున్నాను' అని అంటాడు."

అనుచరులు ఈ మాట విని "దైవప్రవక్తా! జమ్‌హరీర్ అంటే ఏమిట"ని అడిగారు. దానికి ఆయన "దేవుడు అవిశ్వాసిని అందులో విసిరినప్పుడు దాని చలి తీవ్రతను అతను తెలుసుకుంటాడు. చలి, వేడి రెండూ నరక శిక్షలే" అని చెబుతారు. (బైహఖీ)

**సంకెళ్ళు, గదలు, గుదిబండలు:** "సత్యతిరస్కారుల కోసం మేము సంకెళ్ళు, గుదిబండలు, భగభగమండే అగ్ని సిద్ధపరచి ఉంచాము." (ఖుర్ఆన్-76:4)

ఇబ్నెఅబ్బాస్ (రజి) కథనం: "ఈ సంకెళ్ళు నరకవాసి గుదంలో దోపి, శరీరంలో గుచ్చి కట్టివేస్తారు. ఆ తర్వాత పెనం మీద మాంసం ముక్కలు వేయించినట్లు, నూనెలో మిడతలను వేయించినట్లు అతడ్ని అగ్నిలో పడేసి కాల్చడం జరుగుతుంది." (ఇబ్నెకసీర్)

"వారిని చితకబాదడానికి ఇనుపగదలు కూడా ఉంటాయి. వారా బాధ భరించలేక నరకం నుండి పారిపోవడానికి ప్రయత్నించినప్పుడల్లా 'దహనయాతనలు చవిచూడండి' అంటూ దైవదూతలు వారిని తిరిగి నరకంలోకి త్రోసివేస్తారు." (ఖుర్ఆన్-22:21,22)

"త్వరలోనే వారికి (నిజం) తెలిసొస్తుంది. అప్పుడు వారి మెడలకు గుదిబండలు కట్టి, సంకెళ్ళతో బంధించి సలసల మరిగే నీటి దగ్గరకు ఈడ్చుకెళ్ళడం జరుగుతుంది. ఆ తరువాత నరకాగ్నిలో విసరివేయబడతారు." (ఖుర్ఆన్-40:70-72)

**తీవ్రమైన ఆకలిదప్పులు :** "అతనికి అక్కడ త్రాగడానికి చీము, నెత్తురు కలిసిన నీరు ఇవ్వబడుతుంది. దాన్ని అతడు బలవంతంగా గొంతులోకి దించడానికి ప్రయత్నిస్తాడు. (అది ఓపట్టాన గొంతులోకి దిగదు.) చివరికి ఎలాగో అతికష్టం మీద దించుతాడు. నలువైపుల నుండి మృత్యువు అతడ్ని చుట్టుముడ్తుంది. కాని అతను చావడు. దానికి ముందు అతడ్ని చంపుకుతినే మరో ఘోరయాతన పొంచివుంటుంది." (ఖుర్ఆన్-14:16,17)

దైవప్రవక్త (స) హితోక్తి : "నరకవాసులకు తీవ్రమైన ఆకలి ఔతుంది. ఈ ఆకలియాతన కూడా ఇతర యాతనలంత తీవ్రంగా ఉంటుంది. దాంతో వారు తినడానికేదైనా ఇవ్వమని అడుగుతారు. అప్పుడు వారికి ముళ్ళతోకూడిన ఎండు గడ్డిపరకల ఆహారం ఇస్తారు. అది వారికి బలమివ్వదు, ఆకలి తీర్చదు. వారు ఆకలి తీరక మళ్ళీ అడుగుతారు. అప్పుడు వారికి గొంతులో ఇరుక్కుపోయే ఆహారం ఇస్తారు. అది వారి గొంతులో ఇరుక్కోపోతుంది.

ఈ బాధ దూరమయ్యే మార్గం ఏమిటని వారు ఆలోచిస్తారు. ప్రపంచంలో నీళ్ళు తాగడం వల్ల గొంతులో ఇరుక్కుపోయిన పదార్థం లోపలికి పోతుందన్న విషయం గుర్తు కొచ్చి వారు నీళ్ళు అడుగుతారు. అప్పుడు సలసల మరిగే నీటి పాత్రను పటకారుతో పట్టి వారి ముందుంచబడుతుంది. పటకారుతో సహా మరుగుతున్న నీటి పాత్ర దగ్గరకు రాగానే వారి ముఖాలు మాడిపోతాయి. తరువాత ఆ నీళ్ళు తాగగానే వారి కడుపులోని పేగులు వగైరా కాలి ముక్కలు ముక్కలు అవుతాయి." (మిష్కాత్)



దైవప్రవక్త (స) మరోసందర్భంలో ఇలా తెలిపారు: "నరకవాసుల నోటిదగ్గరికి 'చీము' తీసుకురాబడుతుంది. నరకవాసులు దాని (వేడి, దుర్వాసన భరించలేక) అసహ్యించు కుంటారు. ఆ పదార్థం వారికి మరింత దగ్గరకు తీసుకురాబడుతుంది. దాంతో వారి ముఖాలు మాడిపోతాయి. తలమీది చర్మం కాలి పడిపోతుంది. చివరికి వారు ఆ చీమును బలవంతంగా తాగుతారు. అది వారి కడుపులోకి పోయి పేగుల్ని కాల్చి ముక్కలు ముక్కలు చేస్తుంది. కాలిన ఆ పేగుముక్కలు వారి గుదం నుంచి బయటికి వచ్చేస్తాయి."

"ఈ నరకం వారు (తీవ్రమైన దప్పికతో) యాతన స్థలానికి, సలసల కాగుతున్న నీటి చలమలకూ మధ్య తిరుగుతూ ఉంటారు." (ఖుర్ఆన్-55:44,45)

**ఆహారపానీయాలు :** నరకంలోని ప్రతిఆహారవస్తువు ఎంతో చేదుగా, వగరుగా, వేడిగా, కంపుకొడ్తూ ఉంటుంది. నరకవాసులు తీవ్రమైన ఆకలిదప్పులు భరించలేక పరమ జుగుప్సా కరమైన ఆ వస్తువులు తింటారు, తాగుతారు.

"పాపాత్ములు జఖ్ఖూమ్ (అనే నాగజెముడు) చెట్టు తప్పక తినవలసి ఉంటుంది. చమురు తెట్టులాంటి ఆ పదార్థం వారి పొట్టలోకి పోయి మరగకాచిన నీటిలా కుతకుత ఉడికిపోతుంది. 'పట్టుకోండి వాడ్ని. బరబర ఈడుస్తూ తీసికెళ్ళి నరకం మధ్యలో విసరి పడేయండి. సలసలకాగే నీటిని వాడి నెత్తిమీద కుమ్మరించండి'... 'ఇక చూడు దీనిరుచి. నువ్వు మహా గౌరవనీయుడవైన పెద్దమనిషివి కదూ!'..." (ఖుర్ఆన్-44:43-49)

జఖ్ఖూమ్ చెట్టులోని ప్రతీదీ తీవ్రమైనదే. దాని రసం ఓ బొట్టు గనక ఈ భూమండలంపై కార్చితే ఇక్కడి ఆహారపానీయాలన్నీ చెడిపోతాయని తిర్మిజిలోని ఒక హదీసులో పేర్కొనబడింది. అంటే ఆ ఆహారపానీయాలేవీ తినడానికి, తాగడానికి ఏమాత్రం పనికిరావన్నమాట!

"మేమీ (జఖ్ఖూం) వృక్షాన్ని దుర్మార్గులకు పరీక్షగా చేశాం. అది నరకంలో అట్టడుగున మొలుస్తుంది. దాని పండ్లగుత్తులు రాకాసి తలల్లా (భయంకరంగా) ఉంటాయి. నరక వాసులు వాటిని తిని కడుపు నింపుకుంటారు. త్రాగడానికి వారికి సలసల కాగే నీళ్ళు లభిస్తాయి. ఆ తర్వాత వారిని మళ్ళీ నరకాగ్ని వైపు తోలుకెళ్ళడం జరుగుతుంది." (ఖురాన్:37:64-68)

"కనుక (అక్కడ) సలసల కాగే నీరు, చీము, నెత్తురు, వగైరా అనేక జుగుప్సాకరమైన పదార్థాలను రుచిచూడమను వారిని." (ఖుర్ఆన్-38:57-58)

చీము, నెత్తురులతో కూడిన ఈ పదార్థాన్ని 'గస్సాన్' అంటారు. దైవప్రవక్త (స) దీని తీవ్రతను గురించి చెబుతూ "ఒక బకెట్ గస్సాఖ్ గనక ఇహలోకంలో వదలితే ఇహలోకంలోని జీవరాసులన్నీ చచ్చి కుళ్ళిపోతాయి" అని అన్నారు. (తిర్మిజి, హాకిమ్)

## 115. నరకవాసుల రూపురేఖలు

"దుష్కార్యాలుచేసేవారికి వారి దుష్కార్యాలకు తగినట్లే దుష్ఫలం ఉంది. వారిని అవమానం, అప్రతిష్ఠలు చుట్టుముడ్తాయి. దేవుని పట్టు నుండి వారిని కాపాడే నాథుడే ఉండదు. వారి ముఖాలు (నిరాశా నిస్పృహలతో) కారు చీకటిలా నల్లగా మాడిపోయి ఉంటాయి. వారే నరకానికిపోయేవారు. నరకంలోనే ఎల్లకాలం పడిఉంటారు." (ఖుర్ఆన్-10:27)

"నరకాగ్ని వారి ముఖచర్మాన్ని మాడ్చివేస్తుంది. దాంతో వారి పళ్ళు, దవడలు బయటికి వస్తాయి." (ఖుర్ఆన్-23:104)

హదీసుల్లో కూడా నరకవాసుల వికృత రూపాలను గురించి ప్రస్తావన ఉంది. దైవ ప్రవక్త (సల్లం) ఈ విషయాన్ని గురించి ఇలా తెలియజేశారు:

"నరకవాసి నిప్పులో కాలడంవల్ల అతని పైపెదవి కురుచైపోయి తలలో అర్ధ భాగం దాకా పోతుంది. క్రిందిపెదవి బొడ్డుదాకా జారి వ్రేలాడుతూ ఉంటుంది." (తిర్మిజి)

హ్జరత్ అబ్దుల్లా బిన్ అమ్ (రజి) కథనం: "నరకవాసుల్లో ఎవరినైనా ఒకడ్ని భూలోకంలోకి పంపిస్తే ఎంతో వికృతమైన అతని భయంకర స్వరూపం, అతని శరీరం నుండి వెలువడే దుర్వాసనల కారణంగా భూలోకవాసులు తప్పకుండా చచ్చిపోతారు." హ్జరత్ అబ్దుల్లా (రజి) ఈమాట చెప్పి ఎంతగానో దుఃఖించారు. (తర్గీబ్)

**రక్త కన్నీరు-** హ్జరత్ అనస్ (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ఓసారి అనుచరులతో ఇలా అన్నారు: "సోదరులారా! (నరకయాతనలను తలచుకొని) ఏడ్వండి. ఏడ్వడం చాతకాకపోతే కనీసం ఏడ్పుముఖమైనా పెట్టుకోండి. నరకంలో నరకవాసి అతి ఘోరంగా ఏడుస్తాడు. అతని కళ్ళలో నుంచి నీటిధారలు వరదలయి పారుతాయి. అలా ఏడుస్తూ నీటిధారలు ఆగిపోయి రక్తకన్నీరు పారుతుంది. (రక్తకన్నీరు కూడా వరదలయి పారుతుంది.) దాంతో అతని కళ్ళు పచ్చి పుండ్లయి పోతాయి. నరకవాసి కళ్ళలో నుంచి పారే ఈ నీటి, రక్తపు కాలువల్లో గనక పడవలు వదిలితే అవి నిక్షేపంగా నడుస్తాయి." (షరాసున్న)

**నరకవాసుల శరీరాలు-** దైవప్రవక్త (స) ఈవిధంగా ప్రవచించారు:

"సత్యతిరస్కారి (నరకంలో) తన నాలుకను మూడు మైళ్ళ నుంచి ఆరు మైళ్ళ పొడవుదాకా బయటికి తీస్తాడు. దాని మీద జనం నడచి వెళ్తారు." (తర్గీబ్)

"నరకంలో అవిశ్వాసి రెండు భుజాల మధ్య దూరం వేగవంతమైన వాహనం మూడురోజులు ప్రయాణం చేసినంత దూరం ఉంటుంది..." (ముస్లిం)

"ప్రళయదినాన సత్యతిరస్కారి దవడ ఉహద్ పర్వతమంత ఉంటుంది. అతని తొడ బైజా పర్వతమంత ఉంటుంది. నరకంలో కూర్చోడానికి అతనికి మక్కా, మదీనాల ఉండే దూరమంత పొడవు వెడల్పు గల చోటు కావలసి ఉంటుంది." (మిష్కాత్)

## 116. నరకశిక్షలకు కారణాలు

"(మానవ జీవితానికి) మార్గం నిర్దేశించవలసిన బాధ్యత మాపైనే ఉంది. ఇహలోకం మాదే; పరలోకమూ మాదే. కనుక నేను మిమ్మల్ని ప్రజ్వరిల్లే అగ్ని గురించి హెచ్చరిస్తున్నాను. సత్యాన్ని నిరాకరించి ముఖం తిప్పుకునే దౌర్భాగ్యుడు తప్ప మరెవరూ అందులో పడరు." (ఖుర్ఆన్-92:17-19)

**సత్యనిరాకరణ :** "(గ్రంథప్రజలలో, బహుదైవారాధకుల్లో సత్యాన్ని తిరస్కరించిన వారు తప్పకుండా నరకాగ్నిలో పడి, అందులోనే ఎల్లాకాలం (నానాయాతనలు అనుభవిస్తూ) ఉంటారు. వారు యావత్తుసృష్టిలో అత్యంత నికృష్టజీవులు." (ఖుర్ఆన్-98:6)



"(అప్పుడు వారికి) "మీకు మేము దీర్ఘాయుష్షు ఇవ్వలేదా? అంత దీర్ఘాయుష్షులో మీరు తలచుకుంటే గుణపాఠం నేర్చుకుని ఉండేవారు. మీ దగ్గరికి హెచ్చరించేవాడు కూడా వచ్చాడు కదా! ఇప్పుడిక (నరక యాతనలు) చవి చూడండి." (ఖుర్ఆన్-35:36,37)

"వారసలు (నిన్ను కాదు,) ప్రళయాన్ని తిరస్కరిస్తున్నారు. ప్రళయాన్ని తిరస్కరించే వారికోసం మేము తీవ్రంగా ప్రజ్వరిల్లే నరకాగ్ని సిద్ధపరచి ఉంచాము." (ఖుర్ఆన్-25:11)

"పరలోక తీర్పును ధిక్కరించే వాడ్ని నీవు గమనించావా? అతనే అనాథలను కసరి కొట్టేవాడు. పేదల అన్నదానం కోసం (ఇతరుల్ని) ప్రోత్సహించనివాడు. ప్రార్థన పట్ల అశ్రద్ధ, ఏమరుపాటులు వహించేవారికి వినాశం ఉంది. వారు ప్రతిపనీ లోకులమెప్పు కోసం చేస్తుంటారు. (మితిమీరిన పిసినారితనంతో) వాడుకునే సాధారణవస్తువుల్ని సైతం ఇతరులకు ఇవ్వడానికి నిరాకరిస్తారు." (ఖుర్ఆన్-107:1-7)

**ధనవ్యామోహం, అక్రమాలు:** "సత్యానికి విముఖుడయి పోవడమేగాక ధనాన్ని కూడబెట్టి దాన్ని మాటి మాటికి సర్దిపెట్టుకుంటూ భద్రపరచుకున్న ప్రతివాడ్నీ అది ఎలుగెత్తి పిలుస్తుంది." (ఖుర్ఆన్-70:18)

**నమాజ్ చేయకపోవడం:** "వారు (నరకంలోని) పాపాత్ముల్ని చూసి 'మిమ్మల్ని ఏ విషయం నరకంలో పడవేసింది?' అని అడుగుతారు. దానికి పాపాత్ములు ఇలా సమాధానమిస్తారు: 'మేము ప్రార్థన (నమాజు) చేసేవారిలో చేరలేదు. పేదలకు అన్న దానం చేసేవారంకాము. సత్యతిరస్కారులతో కలసి మేమూ (సత్యాన్ని) తిరస్కరిస్తుండే వాళ్ళము. తీర్పుదినాన్ని అసత్య విషయమని ఖండిస్తూ ఉండేవాళ్ళము. ఈ స్థితిలోనే చివరికి అనివార్య విషయం (మృత్యువు) మా ముందుకు వచ్చింది." (ఖుర్ఆన్-74:40-47)

**ధర్మజ్ఞానం దాచడం-** దైవప్రవక్త (స) ధర్మవేత్తలను ఇలా హెచ్చరించారు: "ఎవరినైనా ధర్మజ్ఞానానికి సంబంధించిన ఏదైనా విషయం అడిగినప్పుడు అతను తెలిసి కూడా దాన్ని బహిర్గతం చేయకుండా దాచేస్తే (నరకంలో) అతని నోటికి అగ్నికళ్ళెం తగిలించబడుతుంది." (మిష్కాత్)

**మద్యం, మత్తుపదార్థాల సేవనం-** దైవప్రవక్త (స) ఇలా అన్నారు: "నా ప్రభువు ప్రమాణం చేసి ఇలా అన్నాడు- 'నా దాసులలో ఎవరైనా సారా తాగితే, ఎంత సారా తాగి వుంటే అంత చీము (నరకంలో) నేనతనికి తాగిస్తాను. అలాగే నా దాసులలో ఎవరైనా నాకు భయపడి మద్యపానం మానుకుంటే, నేతనికిరీ (స్వర్గంలో) పరిశుద్ధ కోనేరులలోని (మద్యం, మకరందం, పాలు వగైరా) పానీయాలు తాగిస్తాను." (అహ్మద్)

హ్జరత్ అబూమూసా అష్అరీ (రజి) ఉల్లేఖనం: దైవప్రవక్త (సల్లం) మద్యం గురించి ప్రస్తావిస్తూ "మద్యసేవనానికి అలవాటు పడి అదే స్థితిలో చనిపోయిన మనిషికి దేవుడు (నరకంలో) గౌతా సెలయేటి పానీయం తాగిస్తాడు" అని అన్నారు. అనుచరులు ఈమాట విని "గౌతా సెలయేరు అంటే ఏమిటీ దైవప్రవక్తా?" అని అడిగారు. దానికి దైవప్రవక్త (సల్లం) గౌతా సెలయేరు అంటే వ్యభిచార స్త్రీపురుషుల మర్మావయవాల నుండి వెలువడే ద్రవాలు కలిగిన సెలయేరు అన్నమాట" అని చెప్పారు. (అహ్మద్)

**సదాచరణలేని ఉపన్యాసకులు :** దైవప్రవక్త (స) ప్రవచనం: "నన్ను ఆకాశపర్యటన (మేరాజ్) చేయించిన రాత్రి నేనొక చోట కొందరు మనుషుల పెదవుల్ని అగ్నికత్తెరలతో కోస్తుండటం చూశాను. నేను వీరెవరని అడిగాను. దానికి హజ్రత్ జిబ్రీల్ (రహ్మాలై) సమాధానమిస్తూ 'వీరు ఇహలోకంలో నీతి విషయాలు స్వయంగా ఆచరించకుండా వాటిని ప్రజలకు బోధిస్తూ ఉండే ఉపన్యాసకులు. వారు దైవగ్రంథం పఠిస్తున్నప్పటికీ దాని ప్రకారం ఆచరించేవారు కాదు" అని తెలియజేశారు." (మిష్కాత్)

దైవప్రవక్త (స) ప్రవచనం: "ప్రళయదినాన ఒక మనిషిని తెచ్చి నరకంలో విసిరేయడం జరుగుతుంది. అప్పుడతని పొట్టలోని పేగులు కాలి బయటికి వస్తాయి. ఆ స్థితిలో ఆ వ్యక్తి తిరగలి తీసుకొనితిరిగే గాడిదలా అటూఇటూ తిరుగుతుంటాడు. అది చూసి ఇతర నరకవాసులు అతని చుట్టూ గుమికూడి 'ఏమైంది నీకు? నీవు మాకు నీతి విషయాలు బోధిస్తూ చెడు విషయాలు చేయవద్దని వారిస్తుండేవాడివి కదూ?' అని అడుగుతారు. అతను 'ఔను. నేను మీకు నీతివిషయలు బోధిస్తుండేవాడ్ని. కాని నేను స్వయంగా వాటిని ఆచరించేవాడ్ని కాను. మీకు చెడు విషయాలను నుండి వారిస్తుండేవాడ్ని. కాని నేను స్వయంగా వాటిని చేస్తుండేవాడ్ని' అని అంటాడు." (బుఖారి, ముస్లిం)

**అహంకారం :** గర్వం మనిషిని పరలోకంలోనే కాదు, ఇహలోకంలోనూ నష్ట పరుస్తుంది. ఈ గర్వం అనేక రకాలు ఉండవచ్చు. ధనగర్వం, బలగర్వం, సౌందర్య గర్వం, కులగర్వం, వర్ణగర్వం, జాతి గర్వం, జ్ఞానగర్వం వగైరా. మానవుల బద్ధశత్రువు ఇబ్లీస్ జాత్యహంకారం వల్లనే శాపగ్రస్తుడయ్యాడు.

తొలిమానవుడు హజ్రత్ ఆదం (అలైహి) ముందు మోకరిల్లమని దేవుడు ఆదేశించినప్పుడు అగ్నితో సృజించబడిన ఇబ్లీస్ జాత్యహంకారంతో "నీవు మట్టితో సృజించిన వాడి ముందు నేను మోకరిల్లనా?" అంటూ దైవాజ్ఞను పాటించడానికి తిరస్కరించాడు. అంచేత దేవునికి, ఆయన ప్రవక్త (సల్లం)కు విధేయులయి వారి ఆజ్ఞల్ని పాటిస్తున్న విశ్వాసులు ఎలాంటి అహంకారానికి లోనుకాకుండా జాగ్రత్తగా ఉండాలి.

దైవప్రవక్త (స) గర్విష్ఠులను గురించి ప్రస్తావిస్తూ: "గర్వపోతులు (ప్రళయదినాన) చీమల్లాంటి చిన్న దేహాలతో లేపబడతారు. వారి ముఖాలు మానవుల ముఖాల మాదిరిగానే ఉంటాయి. వారిని నలువైపుల నుంచి నైచ్యం, అవమానాలు చుట్టుముడ్తాయి. అదే పరిస్థితిలో వారిని నరక కారాగారంలోకి తోలేయడం జరుగుతుంది. ఆ కారాగారం పేరు బూలస్. దాన్ని భగభగ మండే అగ్నిజ్వాలలు ఆవరించి ఉంటాయి. అక్కడ ఆ గర్విష్ఠికి నరకవాసులు శరీరాల నుండి వెలువడే (కంపుకొట్టే) ద్రవాలను తాగించడం జరుగుతుంది." (మిష్కాత్)

దైవప్రవక్త (సల్లం) వేరొక సందర్భంలో ఇలా చెప్పారు: "నరకంలో 'హబ్‌హబ్' అనే లోయ ఉంటుంది. ఆ లోయలో అన్ని విధాల అహంకారులు ఉంటారు." (తిర్మిజి)

**పేరుప్రతిష్ఠల కోసం ప్రాకులాడటం :** ముస్లింలు ఏ సత్కార్యం చేసినా దైవప్రసన్నత ఆశిస్తూ చిత్తశుద్ధితో చేయాలి. లోకులుమెప్పు కోసం చేయకూడదు. లోకులమెప్పు కోసం చేసే సత్కార్యాలన్నీ పరలోకంలో నిష్ప్రయోజనం అవుతాయి.



దైవప్రవక్త (స) ఓసారి "దుఃఖపు నుయ్యి కీడు నుండి దేవుని శరణు వేడుకోండి" అన్నారు. అనుచరులు ఈమాట విని "దుఃఖపు నుయ్యి అంటే ఏమిటీ దైవప్రవక్తా!" అనడిగారు. దానికి ఆయన "నరకంలో అదొక పెద్ద గొయ్యి. దాని కీడు నుండి స్వయంగా నరకం రోజుకు నాలుగొందల సార్లు దేవుని శరణుకోరుతుంది" అని చెప్పారు. అనుచరులు "ఆ గొయ్యిలోకి ఎవరు పోతార"ని అడిగారు. దానికి దైవప్రవక్త (స) "లోకులమెప్పు కోసం సత్కర్మలు ఆచరించే దైవభక్తులు పోతారు" అని చెప్పారు. (తిర్మిజి)

# 117. నూటికి 99.9 మంది నరకవాసులే

మానవుల్లో దుర్జనులే అత్యధికమంది ఉంటారు. సజ్జనులు బహు తక్కువమంది ఉంటారు. అందుకే నరకానికి అత్యధికమంది, స్వర్గానికి బహు తక్కువమంది పోతారు.

దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "దేవుడు (ఆదిమానవుడు) హజ్రత్ ఆదం (అలైహి)ని ఉద్దేశించి "ఓ ఆదం! అని పిలుస్తాడు. దానికి హజ్రత్ ఆదం (అలైహి) "ప్రభూ! నేను మీ సన్నిధిలోనే ఉన్నాను. ఆజ్ఞాపించండి, మీ ఆజ్ఞలకు బద్ధుణ్ణయి ఉన్నాను. మేలు, శ్రేష్ఠతలన్నీ మీ చేతిలోనే ఉన్నాయి" అని అంటారు. అప్పుడు విశ్వప్రభువైన దేవుడు "(నీ సంతానం నుంచి) నరకవాసుల్ని తీసెయ్యి" అని ఆజ్ఞాపిస్తాడు. హజ్రత్ ఆదం (అలైహి) "నరకవాసులు ఎంతమంది ఉన్నారు?" అని అడుగుతారు. దేవుడు "1000 మందికి 999 మంది నరకవాసులు ఉన్నారు" అంటాడు.

ఆదంసంతానం (మానవులు) ఈమాట వినగానే తీవ్రంగా ఆందోళన చెందుతారు. (అమితమైన దిగులు, భయాందోళనలతో) పిల్లలు సైతం వృద్ధులైపోతారు. గర్భిణీ స్త్రీలకు గర్భస్రావం అవుతుంది. జనం స్పృహలో ఉన్నప్పటికీ తీవ్రమైన నిస్పృహకు గురవుతారు. ఏమైనప్పటికీ దైవశిక్ష కఠినంగా ఉంటుంది."

ప్రవక్త అనుచరులు దైవప్రవక్త (స) నోట ఈ మాటలు విని "అయితే దైవప్రవక్తా! ఆ ఒక్క స్వర్గవాసి మాలో ఎవరెవరయి ఉంటారు?" అని ప్రశ్నించారు. దైవప్రవక్త (స) జవాబిస్తూ "(కంగారు పడకండి.) సంతోషించండి. ఒక్కరు మీలోని వారుంటారు. వేయిమంది యాజూజ్, మాజూజ్‌లలోని వారుంటారు" అని చెప్పారు. (మిష్కాత్)

అంటే మానవులందరిలో 0.1 శాతం మంది ముస్లింలు స్వర్గానికి పోతే, 99.9 శాతం మంది ఇతరులు నరకానికి పోతారన్నమాట. మరోమాటలో చెప్పాలంటే మొత్తం వేయిమందిలో ఒకరు మాత్రమే స్వర్గానికి పోతారు. మిగిలిన 999 మంది మానవులు నరకానికి పోతారు. దీనికి కారణం ఏమిటో దివ్యఖుర్‌ఆన్ ఇలా చెబుతోంది:

"మేము అనేకమంది మానవుల్ని, జిన్నుల్ని నరకం కోసమే పుట్టించాము. వారికి హృదయాలున్నాయిగాని, వాటితో అర్థం చేసుకోరు; కళ్ళున్నాయిగాని, వాటితో చూడరు; చెవులున్నాయిగాని, వాటితో వినరు. వారు పశువుల్లాంటివారు. వారసలు అంతకంటే కూడా దిగజారిపోయారు. వారు పూర్తిగా ఏమరుపాటుకు లోనయ్యారు." (7:179)

దైవప్రవక్త (స) ఇలా తెలియజేశారు: "ప్రతిమనిషికీ స్వర్గంలో ఒకస్థానం, నరకంలో ఒకస్థానం ఉంటుంది. ఒక విశ్వాసి స్వర్గానికి పోయినప్పుడు నరకంలో అతని స్థానాన్ని

ఎవడో ఒక అవిశ్వాసి భర్తీ చేస్తాడు. అతని అవిశ్వాసం మూలంగానే అతనికా గతి పడుతుంది." (ముస్లిం)

**నరకంలో ధనికులు, స్త్రీలే అధికం-** దైవప్రవక్త (స) ఇలా తెలిపారు: "నేను స్వర్గంలో చూస్తే ఎక్కువమంది పేదవాళ్ళే కన్పించారు; నరకంలో చూస్తే ఎక్కువ మంది స్త్రీలే కన్పించారు." (మిష్కాత్)

హజ్రత్ అబూసయీద్ ఖుద్రీ (రజి) కథనం: దైవప్రవక్త (స) ఒకసారి పండుగ లేక బక్రీద్ పండుగ నమాజు కోసం ఈద్గాహ్ వెళ్తున్నారు. దారిలో కొందరు స్త్రీలు తటస్థపడ్డారు. అప్పుడాయన వారితో "మహిళల్లారా! దానధర్మాలు చేస్తుండండి. నేను నరకంలో అత్యధిక మంది స్త్రీలనే చూశాను" అన్నారు. స్త్రీలు ఈమాట విని "ఎందువల్ల?" అని అడిగారు. దానికి దైవప్రవక్త (స) సమాధానమిస్తూ "స్త్రీలు ఎక్కువగా (ఇతరులకు) శాపనార్థాలు పెడ్తుంటారు; భర్తల పట్ల కృతఘ్నులవుతారు" అని చెప్పారు. (బుఖారి, ముస్లిం)

హజ్రత్ ఇబ్నెఉమర్ (రజి) కథనం: దైవప్రవక్త(స) స్త్రీలను సంబోధిస్తూ "మహిళల్లారా! మీరు దానధర్మాలు ఎక్కువగా చేయండి. మన్నింపు ప్రార్థన కూడా ఎక్కువగా చేస్తుండండి. నేను నరకవాసుల్లో మీరే ఎక్కువగా ఉండటం చూశాను" అన్నారు.

అప్పుడొక స్త్రీ "నరకవాసుల్లో ఎక్కువగా మేమే ఎందుకుంటాం?"అని అడిగింది. "మీరు ఎక్కువగా శాపనార్థాలు పెడుతుంటారు. భర్తల పట్ల కృతఘ్నుత వహిస్తారు. మేధపరంగా, ధర్మపరంగా లోపం గలవారైనప్పటికీ తెలివిగలవారి మీద మీ స్త్రీలకంటే ఎక్కువగా ఆధిపత్యం సాధించేవారిని నేనెవర్నీ చూడలేదు" అన్నారు దైవప్రవక్త (స).

"మేధపరంగా, ధర్మపరంగా మాలో ఉన్నలోపం ఏమిటీ?" (మళ్ళీ)అడిగిందా స్త్రీ.

దానికి దైవప్రవక్త (స) ఇలా చెప్పారు: "మేధపరమైన లోపం ఏమిటంటే ఇద్దరు స్త్రీల సాక్ష్యం, ఒక పురుషుని సాక్ష్యానికి సమానం. తరువాత (బహిష్టు, పురిటి రక్తస్రావం జరిగే) కాలంలో స్త్రీ నమాజ్ చేయలేదు. (రమజాన్ నెలలో ఉపవాసం ఉండలేదు. ఇది ఆమె ధర్మపరమైన వెలితికి తార్కాణం)" (ముస్లిం)

## 118. ఆరాఫ్ వాసులకు అటూ ఇటూ

నరకం మీదుండే వారధి (పుల్‌సిరాత్) దాటగానే స్వర్గనరకాల మధ్య ఒక అడ్డుగోడ ఉంటుంది. దాన్ని ఆరాఫ్ అంటారు. ముస్లింలలో కొందరు వారధి దాటి స్వర్గానికి పోలేక ఇక్కడికి వచ్చి ఆగిపోతారు. ధర్మకాటాలో వారి పాపపుణ్యాల బరువు సమానంగా ఉంటుంది. అందువల్ల వారు నరకగండం నుంచి తప్పించుకోగలిగినా స్వర్గాన్ని అందుకోలేక ఆరాఫ్ మీద కొంతకాలం పడివుంటారు. తరువాత దైవానుగ్రహంతో స్వర్గానికి చేరుకుంటారు.

"ఆ రెండు వర్గాల మధ్య ఒక అడ్డుగోడ ఉంటుంది. దాని శిఖరాలపై మరికొందరు ఉంటారు. వారు అందర్నీ వారి ముఖచిహ్నాలను బట్టి గుర్తిస్తారు. అప్పుడు వారు స్వర్గవాసుల్ని ఉద్దేశించి 'మీకు శాంతి కలుగుగాక!' అంటారు. వారింకా స్వర్గంలో ప్రవేశించలేదు. కాని ప్రవేశించగలమని ఆశిస్తున్నారు." తరువాత వారి దృష్టి నరకవాసులపై పడగానే "ప్రభూ! మమ్మల్ని ఈ దుర్మార్గుల్లో చేర్చకు" అని ప్రార్థిస్తారు." (ఖుర్‌ఆన్-7:46,47)



"ఆ తరువాత శిఖరాలపై ఉన్నవారు నరకంలోని కొందరు వ్యక్తుల్ని వారి ముఖ చిహ్నాల్ని బట్టి గుర్తించి పిలిచి ఇలా అంటారు: 'చూసుకున్నారుగా, ఈరోజు మీ ముఠాలు గాని, మీరు ఘనమైనవని భావించిన మీ వస్తుసామగ్రిగాని మీకు ఏమాత్రం ఉపయోగ పడలేదు. స్వర్గంలో ఉన్న వీరిని చూడండి. మీరు ఎన్నో ప్రమాణాలుచేసి, వీరిపై దేవుడు దయచూపడని అన్నారే!' అని అంటారు. అప్పుడు వారికి 'స్వర్గంలో ప్రవేశించండి. మీకిక ఎలాంటి భయంగాని, దుఃఖం గాని ఉండదు' అని చెప్పబడుతుంది." (ఖుర్‌ఆన్-7:48,49)

ఇలా ఆరాఫ్‌వాసులు చివరికి స్వర్గంలో ప్రవేశిస్తారు. కర్మఫలాల స్థానాలు రెండే ఉన్నాయి. అవే స్వర్గ నరకాలు. స్వర్గనరకాలే సాఫల్య వైఫల్యాలకు ప్రతిరూపాలు. స్వర్గ ప్రవేశమే అసలైన సాఫల్యం. నరకం వైఫల్యానికి, దౌర్భాగ్యానికి పరాకాష్ఠ. పరలోక సాఫల్య వైఫల్యాలే అసలైన సాఫల్యవైఫల్యాలు. ఇహలోక సాఫల్యవైఫల్యాలు క్షణికమైనవి.

హజ్రత్ అబూహురైరా (రజి) ప్రకారం దైవప్రవక్త (స) హితోక్తి : "పేదలు ధనవంతుల కన్నా అయిదొందల సంవత్సరాల ముందే స్వర్గంలో ప్రవేశిస్తారు." (తిర్మిజీ)

హజ్రత్ ఇబ్నెఅబ్బాస్ (రజి), ఇమ్రాన్ బిన్ హుసైన్ (రజి)ల కథనం ప్రకారం దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "నేను స్వర్గంలోకి తొంగిచూస్తే స్వర్గవాసుల్లో నాకు పేదలే ఎక్కువగా కనిపించారు. ఆ తర్వాత నేను నరకంలోకి తొంగిచూస్తే నరకవాసుల్లో నాకు ఎక్కువగా స్త్రీలు కనిపించారు." (బుఖారీ, ముస్లింలు)

దైవప్రవక్త (స) ఈవిధంగా ప్రవచించారు: "నేను స్వర్గద్వారం వద్ద నిలబడి చూస్తే స్వర్గప్రవేశం చేసేవారిలో చాలామంది పేదలే కనిపించారు. ధనవంతులు (స్వర్గంలో ప్రవేశించలేక) ఆగిపోతున్నారు. (అంతలో) నరకవాసుల్ని నరకానికి తీసుకెళ్ళమని ఆజ్ఞయింది." (బుఖారీ)

## 119. స్వర్గ సీమ

స్వర్గం అంటే సుఖసంతోషాలకు, భోగభాగ్యాలకు శాశ్వతస్థావరం. శ్రమ, అలసట, బాధ, దుఃఖం, ఆందోళనలు మచ్చుకైనా లేని శాంతినిలయం. అసూయ, అసంతృప్తి, విరోధం, విద్వేషాలకు ఏమాత్రం తావివ్వని ఏకహృదయకోశం. కోరిన వరం తక్షణం లభించే ఆనంద నిలయం. అనుక్షణం ఆనంద డోలికల్లో ఉర్రూతలూగించే నిత్య హరితవనం. ఆత్మ, అంతరంగం, దేహాలలోని అణువణువును పులకింపజేస్తూ దైవదర్శనం కలిగించే ముక్తిప్రదాయని.

"సత్యాన్ని విశ్వసించి సదాచార సంపన్నులైనవారికి ఆతిథ్యంగా అత్యున్నత స్వర్గ వనాలున్నాయి. వారక్కడ కలకాలం (హాయిగా) ఉంటారు. ఇక ఎన్నటికీ అక్కడ్నుంచి వేరే చోటికి పోవడానికి వారికి మనస్కరించదు." (ఖుర్‌ఆన్-18:107,108)

హజ్రత్ ఇబ్నెమస్వూద్ (రజి) కథనం: ఒకసారి మేము దాదాపు నలభైమంది దైవప్రవక్త (స) కలసి ఓ గుడారంలో ఉన్నాము. ఆ సందర్భంలో దైవప్రవక్త (స) మాతో మాట్లాడుతూ "మొత్తం స్వర్గవాసుల్లో మీరు నాల్గోవంతు ఉంటారంటే మీకు సంతోషమేనా?" అని అడిగారు. దానికి మేము 'మాకు సంతోషమే' అన్నాం. తిరిగి ఆయన "మరి మీరు స్వర్గవాసుల్లో మూడోవంతు ఉంటారంటే మీకు సంతోషమేనా?" అని అడిగారు. దానికి

‘సంతోషమే’ అన్నాం మేము. ఆ తర్వాత ఆయన “మరి స్వర్గంలో సగం మంది మీరే ఉంటారంటే మీకు సంతోషమేనా” అని అడిగారు. మేము ‘సంతోషమే!’ అన్నాం.

అప్పుడాయన ఇలా చెప్పారు: “ఎవరి గుప్పెట్లో ముహమ్మద్ ప్రాణముందో ఆయన సాక్షిగా చెబుతున్నాను. మొత్తం స్వర్గవాసుల్లో సగం మంది మీరే ఉంటారని నేను ఆశిస్తున్నాను. (దైవాజ్ఞల్ని) శిరసావహించినవాడే స్వర్గంలో ప్రవేశిస్తాడు. బహు దైవారాధకులతో పోల్చుకుంటే మీసంఖ్య నల్లెద్దు చర్మంపై తెల్లవెంట్రుకలా లేదా ఎర్రెద్దు చర్మంపై నల్లవెంట్రుకలా ఉంటుంది.” (బుఖారీ, ముస్లిం)

**స్వర్గం విలువ :** ఇహలోకంలోని యావత్తు సంపదతో పోల్చితే స్వర్గంలోని ఏ ఒక్క వస్తువుకు కూడా మనం విలువ కట్టలేము. ఖుర్‌ఆన్, హదీసుల్లో వచ్చిన పోలికలు మానవుల మేధాశక్తికి తగినవిధంగా నచ్చజెప్పడానికి మాత్రమే పేర్కొనబడ్డాయి.

దైవప్రవక్త (సల్లం) ప్రవచనం: “స్వర్గంలో ఒక చంద్రకోల ఆక్రమించు కునేటంతటి స్థలం యావత్తు ప్రపంచం, ప్రపంచంలోని సమస్త వస్తువుల కంటే శ్రేష్ఠమైనది.” (ముస్లిం)

వేరొక హదీసులో ఆయన ఇలా తెలిపారు: “ప్రపంచంలో సూర్యోదయం, సూర్యాస్త మయాలు ఆవరించే యావత్తు వస్తువుల కంటే స్వర్గంలో ఒక ధనస్సులో అర్ధభాగం ఆక్రమించే స్థలమే ఎంతో శ్రేష్ఠమయినది.” (బుఖారి)

అశ్వరూఢుడు గుర్రం దిగిన తరువాత స్థలం ఆక్రమించుకోవడానికి ముందుగా తన చంద్రకోలను నేల మీద పడవేస్తాడు. నడిచేవాడు కూర్చునేటప్పుడు మొదట తన ధనస్సును కిందపెడ్తాడు. దైవప్రవక్త (సల్లం) స్వర్గం విలువను వివరించడానికి చంద్రకోలను, ధనస్సును ఉదాహరణలుగా చూపుతూ స్వర్గంలో ఒక చంద్రకోల, సగం ధనస్సు ఆక్రమించేటంతటి స్థలం యావత్తు ప్రపంచంలోని సువిశాలమయిన స్థలం కంటే ఎంతో శ్రేష్ఠమయినదని చెప్పారు.

స్వర్గం ఇంతకంటే కూడా ఎంతో విలువైనది, శ్రేష్ఠమైనది. దాని విలువ, శ్రేష్ఠతలు మానవుని ఊహకే అతీతమైనవి. ఖుర్‌ఆన్, హదీసుల్లో పేర్కొనబడిన వస్తువులే గాకుండా ఇంకా ఎన్నో అసంఖ్యాకమైన వస్తువులు స్వర్గంలో ఉన్నాయి.

“వారు చేసుకున్న సత్కర్మలకు ప్రతిఫలంగా వారి కళ్లను చల్లబరిచే అపూర్వ సామగ్రి వారికోసం దాచబడిఉంది. దాన్ని గురించి ఏ మనిషికీ తెలియదు. (అది ఊహాతీతమైన అద్భుత మహాభాగ్యం.)” (దివ్యఖుర్‌ఆన్–32:17)

దైవప్రవక్త (స) దేవుని మాటలను ఇలా తెలిపారు: “నేను నా భక్తుల కోసం స్వర్గంలో ఎంతో అపురూపమైన వస్తుసంపద దాచిపెట్టాను. వాటిని ఇంతవరకు ఎవరి కళ్ళూ చూడలేదు; ఎవరి చెవులూ వినలేదు. చివరికి మానవుని మనస్సు సైతం వాటిని గురించి ఊహించలేదు”. (బుఖారి, ముస్లిం)

**స్వర్గ నిర్మాణం-** హజ్రత్ అబూహురైరా (రజి) ఉల్లేఖనం: “దైవప్రవక్తా! స్వర్గం దేనితో నిర్మించబడింది?“ అని అడిగాను నేను. దానికాయాన ఇలా సమాధానమిచ్చారు:



“స్వర్గం ఒక వెండిఇటుక, ఒక బంగారుఇటుక చొప్పున వెండిబంగారాల ఇటుకలతో, ఘాటైన సువాసనగల కస్తూరి గచ్చుతో, మణిమాణిక్యాల కంకరతో, మందారపువ్వు వాసనగల మట్టితో నిర్మించబడింది. ఒకసారి స్వర్గంలో ప్రవేశించిన మనిషి ఇక ఎల్లప్పుడూ భోగభాగ్యాలు అనుభవిస్తూ ఉంటాడు. అతనికి ఎలాంటి కొరత ఉండదు. శాశ్వతంగా జీవించివుంటాడు. మరణం దరిదాపులక్కూడా రాదు. అతని బట్టలు మాసిపోవడంగాని, చీకిపోవడంగాని జరగదు. అతని యౌవనం కూడా ఏమాత్రం తగ్గదు.” (అహ్మద్, తిర్మిజి)

**విస్తీర్ణం :** ఎంత పెద్ద ధనికుడికయినా తానుండే ఇండ్లు, తిరిగే పరిసరాలు ఎక్కడో ఓ చోట కొద్దోగొప్పో ఇరుకుగా ఉంటాయి. ఇక ఇతరుల సంగతయితే చెప్పనవసరం లేదు. ప్రతిచోటా ఇరుకే. స్వర్గంలో మాత్రం ఎక్కడా ఎలాంటి ఇరుకుండదు. స్వర్గం ఎంతో విశాలంగా ఉంటుంది. కోరుకున్న చోట స్వేచ్ఛగా, సులభంగా విహరించవచ్చు.

“భూమ్యాకాశాలంత విశాలమైన స్వర్గసీమ వైపుకు పరుగెత్తండి. అది భయభక్తులు కలవారి కోసం సిద్ధం చేయబడి ఉంది.” (ఖుర్‌ఆన్–3:133)

“ప్రపంచజీవితం మాయ, భ్రాంతి తప్ప మరేమీ లేదు. దేవుడ్ని, ఆయన ప్రవక్తల్ని విశ్వసించినవారి కోసం స్వర్గసీమ ఉంది. (కనుక) దేవుని మన్నింపు వైపు, భూమ్యాకాశాలంత విశాలమైన ఆ స్వర్గసీమ వైపు పోటీపడి పరుగెత్తండి.” (ఖుర్‌ఆన్– 57:20,21)

హజ్రత్ అబూసయీద్ ఖుద్రీ (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ప్రవచనం: “స్వర్గంలో ఒక మహావృక్షం ఉంది. దాని నీడలో ఒక రౌతు వేగంగా పరుగెత్తే గుర్రం ఎక్కి వందేండ్లు పయనించినా అతనా నీడ అంచుకు చేరుకోలేడు.” (బుఖారి)

**అంతస్తులు :** స్వర్గంలో ఒక దాని మీద ఒకటి చొప్పున తరగతులవారిగా వందకు పైగా అంతస్తులుంటాయి. పుణ్యకర్మల స్థాయిని బట్టి ఈ అంతస్తులు కేటాయించబడతాయి.

హజ్రత్ అబూహురైరా (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ప్రవచనం: “ఎవరు సత్యాన్ని విశ్వసించి, నమాజ్ ఆచరించి, ఉపవాసాలు పాటిస్తాడో అతడ్ని దేవుడు స్వర్గంలో ప్రవేశింపజేస్తాడు. అతను దైవమార్గంలో ఉన్నచోటు నుండి వేరే చోటికి వలసపోయినా, లేక జన్మస్థానంలోనే ఉండిపోయినా సరే.” అనుచరులు ఈమాట విని “దైవప్రవక్తా! మరి ఈ శుభవార్త ప్రజలకు చెప్పమంటారా?” అన్నారు. అప్పుడు దైవప్రవక్త (స) ఇలా అన్నారు:

“తప్పకుండా. స్వర్గంలో వంద అంతస్తులు ఉన్నాయి. దేవుడు వీటిని దైవమార్గంలో పోరాటం జరిపేవారి కోసం తయారుచేశాడు. ఒక అంతస్తుకు మరొక అంతస్తుకు మధ్య దూరం భూమ్యాకాశాల మధ్య ఉన్నంత దూరం ఉంటుంది. కనుక మీరు దేవుడ్ని వేడుకునేటప్పుడు ఫిర్దౌస్ స్వర్గం ప్రసాదించమని వేడుకోండి. ఇది అన్నిటికంటే ఎంతో శ్రేష్ఠమైన, అత్యున్నతమైన అంతస్తు. దాని మీదే కరుణామయుని సింహాసనం ఉంది. ఇక్కడ్నుంచే స్వర్గ నదులు (నాలుగు) బయలుదేరుతాయి.” (బుఖారి)

దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రవచించారు: “స్వర్గంలో వంద అంతస్తులు ఉంటాయి. అందులోని ఒక అంతస్తులో గనక (ఇప్పుడున్న) యావత్తు విశ్వవ్యవస్థను తెచ్చిపెడ్తే అదంతా అందులో సులభంగా ఇమిడిపోతుంది.” (తిర్మిజి)

ఫతహుల్‌బారి వ్యాఖ్యానకర్త దీనిపై వ్యాఖ్యానిస్తూ, వంద అంతస్తులంటే వంద అంతస్తులు మాత్రమే కాదని, వందకంటే ఎక్కువ అంతస్తులు కూడా ఉంటాయని అభిప్రాయపడ్డారు.

**ఆకాశహర్మ్యాలు :** "వీరే తమ సహనానికి ప్రతిఫలంగా అత్యున్నత స్థానాలు పొందేవారు. వారిని (దైవదూతలు) ఎంతో గౌరవిస్తూ శాంతివచనాలతో స్వాగతమిస్తారు. వారక్కడ కలకాలం ఉంటారు. ఎంతమంచి నివాసస్థలం అది!" (ఖుర్‌ఆన్-25:75,76)

"విశ్వప్రభువుకు భయపడి తదనుగుణంగా జీవితం మలచుకునేవారి కోసం (స్వర్గంలో) అంతస్తులవారిగా నిర్మించబడిన ఆకాశహర్మ్యాలు ఉన్నాయి. వాటి క్రింద (చల్లటి) సెలయేరులు ప్రవహిస్తూ ఉంటాయి. ఇది దేవుని వాగ్దానం." (ఖుర్‌ఆన్-39:19,20)

దైవప్రవక్త (సల్లం) ఇలా అన్నారు: "మీరు సంధ్యాసమయంలో తూర్పు లేక పడమటి దిక్కున ఆకాశంలోని తేజోవంతమైన తారను చూసినట్లు స్వర్గవాసులు తమ పైనున్న ఆకాశహర్మ్యాల వారిని చూస్తారు." అనుచరులు ఈమాట విని "ఈ ఆకాశహర్మ్యాలు దైవప్రవక్తలకు చెందినవయి ఉంటాయి కాబోలు" అన్నారు. దానికి దైవప్రవక్త (సల్లం) జవాబిస్తూ "ఔను. నాప్రాణం ఎవరి అధీనంలో ఉందో ఆ శక్తిస్వరూపుని సాక్షి! దైవప్రవక్తలే గాకుండా ఆ ఆకాశహర్మ్యాలలో దేవుణ్ణి విశ్వసించి ఆయన ప్రవక్తలకు మద్దతిచ్చిన ఇతరులు కూడా అనేకమంది ఉంటారు" అని అన్నారు. (బుఖారి, ముస్లిం)

దైవప్రవక్త (స) ప్రవచనం: "స్వర్గంలో ఆకాశహర్మ్యాలు ఉన్నాయి. వాటి బయటి భాగం లోపలికి, లోపలిభాగం బయటికి కన్పిస్తుంది. దేవుడు వీటిని మృదువుగా మాట్లాడే, అతిథులకు ఆతిథ్యమిచ్చే, ఎక్కువగా ఉపవాసాలు పాటించే, రాత్రివేళ జనం నిద్రిస్తున్నప్పుడు లేచి తహజ్జుద్ నమాజ్ చేసేవారి కోసం నిర్మించాడు." (బైహఖి)

**స్వర్గవాసుల కుటీరాలు :** స్వర్గంలో స్వర్గవాసుల హోదాఅంతస్తుల్ని బట్టి అనేకరకాల ఇండ్లుంటాయి. ఆ ఇండ్లలో అధమశ్రేణి స్వర్గవాసికి లభించే గృహమే భూలోకంలో ఏ చక్రవర్తికీ లభించనంతటి ఎంతో విశాలమైన, అందమైన, విలువైన గృహమయి ఉంటుంది.

దైవప్రవక్త (స) స్వర్గవాసుల కుటీరాలను గురించి ఇలాఅన్నారు: "స్వర్గవాసి కుటీరం మొత్తం ఒక ముత్యమయి ఉంటుంది. (అంటే ఒకే ముత్యంతో నిర్మించబడిన ఏకముత్య కుటీరం అన్నమాట.) దాని లోపలి భాగం మెరుగు దిద్దబడి ఉంటుంది. దాని ఎత్తు ముప్ఫయి మైళ్ళు (నలభై ఎనిమిది కిలోమీటర్లు) ఉంటుంది. అందులోని ప్రతి గదిలో విశ్వాసి కోసం భార్యలు ఉంటారు. వారిని ఇతరులెవరూ చూడలేరు." (బుఖారి)

**స్వర్గద్వారాలు :** స్వర్గంలో అనేక ముఖద్వారాలు ఉంటాయి. విశ్వాసులు తమతమ పుణ్యకర్మలను బట్టి ఈ ద్వారాల గుండా స్వర్గంలో ప్రవేశిస్తారు.

హజ్రత్ ఉమర్ బిన్ ఖత్తాబ్ (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ఇలా అన్నారు: "మీలో ఏ ముస్లిమయినా ఉజూచేసి, అవయవాలన్నీ నీటితో శుభ్రంగా కడిగి (చివర్లో) 'అష్‌హదు అల్లాయిలాహ ఇల్లల్లాహు వహ్‌దహూలాషరీక లహూ వ అష్‌హదుఅన్న ముహమ్మదన్ అబ్దుహూ వరసూలుహూ' (సాటిలేని ఏకేశ్వరుడయిన అల్లాహ్ తప్ప మరో ఆరాధ్యుడు లేడని, ముహమ్మద్ ఆయన దాసుడు, సందేశహరుడని నేను సాక్ష్యమిస్తున్నాను.) అని



పఠిస్తాడో అతని కోసం స్వర్గంలోని ఎనిమిది ముఖద్వారాలు కూడా తెరవబడతాయి. అతను తాను కోరుకున్న ద్వారంగుండా స్వర్గంలో స్వేచ్ఛగా ప్రవేశించవచ్చు." (ముస్లిం)

ఈ ముఖద్వారాలు కూడా ఎంతో పెద్దగా, వెడల్పుగా ఉంటాయి. ఈ ద్వారాల గుండా ఒకే సారి లక్షలమంది విశ్వాసులు స్వర్గంలో ప్రవేశిస్తారు. హదీసుల ప్రకారం స్వర్గంలోని ఒక ద్వారం వెడల్పు నలభై సంవత్సరాలు ప్రయాణం చేసిన దూరమంత ఉంటుందని తెలుస్తోంది.

దైవప్రవక్త (స) ప్రవచనం: "నా అనుచర సముదాయంలోని డెబ్భయివేల మంది లేక ఏడులక్షల మంది (ఉల్లేఖకుడికి సంఖ్య గుర్తులేదు.) ప్రజలు పరస్పరం చేతులు పట్టుకొని స్వర్గద్వారం గుండా లోపలికి తప్పకుండా ప్రవేశిస్తారు. వారిలో చివరి మనిషి ప్రవేశించ నంతవరకు మొదటి వ్యక్తి ప్రవేశించడు. (అంటే అందరూ ఒకేసారి ప్రవేశిస్తారన్న మాట.) వారి ముఖాలు పూర్ణచంద్రునిలా ప్రకాశిస్తాయి." (బుఖారి, ముస్లిం)

**వాతావరణం :** స్వర్గంలో మన ఆలోచనక్కూడా అందని ఎంతో మంచి వాతావరణం ఉంటుంది. అక్కడ ఏవిధమైన బాధగాని, విసుగు కలిగించే చలిగాని, వేడిగాని ఏమాత్రం ఉండదు. రకరకాల సువాసనలతో, హృదయాలను ఉల్లాసపరిచే పిల్లతెమ్మెరలతో అత్యంత ఆహ్లాదకరంగా ఉంటుంది.

"(ఆపదలో) సహనం వహించినందుకు ప్రతిఫలంగా వారికి స్వర్గ వనాలు, పట్టువస్త్రాలు ప్రసాదిస్తాడు. వారక్కడ అద్భుతమైన ఆసనాలపై మెత్తటి దిండ్లకు ఆనుకొని కూర్చొనిఉంటారు. వారికి ఎండబాధ గాని, చలిబెడద గాని ఏమాత్రం ఉండదు." (ఖుర్‌ఆన్-76:12,13)

ముజ్జారీ వ్యాఖ్యానం ప్రకారం స్వర్గంలో చలి, వేడిమిలేని మధ్యరకం వాతావరణం ఉంటుంది. అది తన ప్రభువు జ్యోతితో కాంతిమంతంగా ఉంటుంది. అబుల్‌ఆలియా (రహ్మ) ప్రకారం అది ఇహలోకపు ఉషోదయకాంతుల కంటే ఎక్కువ కాంతిమంతంగా ఉంటుంది.

ఒక హదీసు ప్రకారం స్వర్గసువాసన వంద సంవత్సరాల ప్రయాణమంత దూరం నుంచి గుబాళిస్తుంది. వేరొక హదీసు ప్రకారం స్వర్గసువాసన ఐదొందల సంవత్సరాల ప్రయాణమంత దూరం నుంచి గుబాళిస్తుంది. (తర్గీబ్ వ తర్హీబ్)

**ఆనంద నిలయం :** "ఇక మానుండి ఎవరికి మేలు జరుగుతుందని ముందే నిర్ణయమైపోయిందో వారు తప్పక నరకానికి దూరంగా ఉంటారు. దాని (భీకర)ధ్వని కాస్తయినా వారికి విన్పించదు. వారు కలకాలం తమకిష్టమైన భాగ్యాలలో ఓలలాడుతుంటారు. తీవ్రమైన (ప్రళయ) బీభత్స సమయంలోనూ వారు ఆందోళనచెందరు. దైవదూతలు వారిని స్వాగతిస్తూ "మీకు వాగ్దానం చేయబడిన (శుభ)దినం ఇదే" అనంటారు." (ఖుర్‌ఆన్-21:101-103)

"వారిని ఆయన వారు పరమానంద భరితులయ్యే నిలయానికి చేరుస్తాడు." (22:59) "వారికక్కడ ఎలాంటి శ్రమ ఉండదు. అక్కడ్నుంచి వారిని తీసివేయడం కూడా జరగదు." (15:48); "అక్కడ వారు కోరే ప్రతి కోరికా నెరవేరుతుంది. వారక్కడ శాశ్వతంగా ఉంటారు. దాన్ని (భక్తిపరాయణులకు) ప్రసాదించే బాధ్యత నీ ప్రభువుపై ఉంది. ఇది ఆయన తప్పనిసరిగా నెరవేర్చవలసిన వాగ్దానం." (25:16); "వారు తమ ప్రభువు ప్రసాదించే మాధుర్యాలు ఆస్వాదిస్తూ సుఖసంతోషాలలో తేలియాడుతుంటారు." (ఖుర్‌ఆన్-52:18)

“నీ ప్రభువు మరేదైనా తలిస్తే తప్ప వారు స్వర్గంలోనే భూమ్యాకాశాలున్నంత వరకు ఉంటారు. వారికక్కడ ఎన్నటికీ ఎడతెగని బహుమానాలు లభిస్తాయి.” (11:108)

## 120. స్వర్గప్రవేశం

“మా సూక్తుల్ని విశ్వసించి మంచి పనులు చేసేవారు (ఎంతో అదృష్టవంతులు.)– మేము ఏ మనిషిపైనా అతని శక్తికి మించిన బాధ్యత మోపము– (వారు) స్వర్గవాసులవు తారు. అక్కడే వారిక శాశ్వతంగా ఉంటారు.” (దివ్యఖుర్‌ఆన్–7:42)

**హృదయ పరిశుద్ధత :** ప్రపంచంలో ఉన్నప్పుడు కొన్ని అపోహలు, అపార్థాల వల్ల దైవభీతిపరాయణులైన విశ్వాసుల మధ్య కూడా పరస్పరం రాగద్వేషాలు చోటుచేసుకుంటాయి. అయితే స్వర్గానికి వెళ్ళిన తరువాత దేవుడు వీటిని వారి హృదయాల నుండి తీసివేస్తాడు.

హ్జ్రత్ అబూఉమామా (రజి) ఈ విషయాన్ని ప్రస్తావిస్తూ “దాడిచేసే క్రూరజంతువుని పారదోలినట్లు దేవుడు హృదయాల నుండి అసూయాద్వేషాలు తీసివేయనంతవరకు ఏ విశ్వాసి కూడా స్వర్గంలో ప్రవేశించడు“ అని అన్నారు. (ఇబ్నెకసీర్)

దైవప్రవక్త (స) ఇలా తెలిపారు: “స్వర్గవాసుల హృదయాలు ఒకే మనిషి హృదయంలా ఉంటాయి. వారిలో ఎలాంటి భేదాభిప్రాయాలు, అసూయాద్వేషాలు ఉండవు.” (బుఖారి)

దివ్యఖుర్‌ఆన్‌లోని ఈక్రింది సూక్తులు కూడా చూడండి:

“వారి హృదయాల్లో రాగద్వేషాలు ఏవైనా వుంటే వాటిని మేము తీసేస్తాం. వారు పరస్పరం అన్నదమ్ముల్లా మారి ఆసనాల మీద ఎదురెదురుగా కూర్చుంటారు.” (15:47) “వారి హృదయాల్లో ఒకరికి వ్యతిరేకంగా మరొకరి విషయంలో ఏదైనా ద్వేషభావం ఉంటే దాన్ని మేము తీసేస్తాం. వారి (మేడల) మధ్య సెలయేరులు ప్రవహిస్తుంటాయి.” (7:43)

**ప్రతీకారం-** దైవప్రవక్త (స) స్వర్గప్రవేశం గురించి ప్రస్తావిస్తూ ఇలా తెలియజేశారు: “విశ్వాసులు నరకప్రమాదం నుండి బయటపడిన తరువాత స్వర్గనరకాల మధ్య ఉండే ఒక వంతెన మీద వారిని ఆపివేయడం జరుగుతుంది. వారు లోగడ ఏదైనా అన్యాయానికి, దౌర్జన్యానికి పాల్పడిఉంటే దాని బదులు తీర్చుకునే అవకాశం ఇవ్వబడుతుంది. ఈవిధంగా అన్యాయం, దౌర్జన్యాల మచ్చ తొలగిపోయి పరి శుద్ధులయిన తరువాత వారికి స్వర్గంలో ప్రవేశించేందుకు అనుమతి లభిస్తుంది. ఎవరి అధీనంలో ముహమ్మద్ ప్రాణముందో ఆ శక్తిస్వరూపుని సాక్ష్యం! వారిలో ప్రతి మనిషీ ఇహలోకంలోని తన ఇంటికి పోయే దారిని ఎలా గుర్తుపట్టి వెళ్తాడో, స్వర్గంలో తన ఇంటికి పోయే దారిని అంతకంటే బాగా గుర్తుపట్టి వెళ్తాడు.” (బుఖారి)

దైవప్రవక్త (స) స్వర్గప్రవేశం గురించి ఇలా తెలియజేశారు: “ప్రళయదినాన యావత్తు దైవప్రవక్తలకంటే నావిధానం ప్రకారం నడుచుకున్నవారు ఎక్కువమంది ఉంటారు. అందరి కన్నా ముందు నేను స్వర్గద్వారం (తెరిపించడానికి) తట్టుతాను.” (ముస్లిం)

“ప్రళయదినాన నేను స్వర్గం దగ్గరికెళ్ళి తలుపు తట్టుతాను. లోపల నుంచి ద్వార పాలకుడు “ఎవరు మీరు?” అంటాడు. నేను “ముహమ్మద్‌ని” అంటాను. ద్వారపాలకుడు



ఈమాట విని ‘మొట్టమొదట మీ కోసం మాత్రమే తలుపు తెరవమని, మీకు ముందు మరెవరు వచ్చినా తెరవకూడదని నాకు ఉత్తర్వు లభించింది’ అని అంటాడు.” (ముస్లిం)

“నేను అందరికంటే ముందు స్వర్గద్వారం తట్టుతాను. దేవుడు నా కోసం ద్వారం తెరిపించి నన్ను స్వర్గంలోకి ప్రవేశింపజేస్తాడు. నాతో పాటు నిరుపేదలైన విశ్వాసులు ఉంటారు. నేనీ మాటలు గర్వంగా చెప్పడం లేదు. నేను దేవుని దృష్టిలో యావత్తు మానవులలో ఎక్కువ గౌరవనీయుడ్ని.” (తిర్మిజి)

### స్వాగతోత్సవం

“విశ్వప్రభువుకు భయపడుతూ తదనుగుణంగా జీవితం గడిపిన వారిని తండోప తండలుగా స్వర్గం వైపు తీసుకుపోవడం జరుగుతుంది. అలా వారు స్వర్గం దగ్గరకు చేరుకుంటారు. అక్కడ స్వర్గద్వారాలు ముందే తెరవబడి ఉంటాయి. అప్పుడు స్వర్గపాలకులు వారిని సాదరంగా ఆహ్వానిస్తూ “మీకు శాంతీసౌభాగ్యాలు కలుగుగాక! మీరు ఎంతో మంచివారు. ఇక శాశ్వతంగా ఇందులో ప్రవేశించి ఉండండి” అనంటారు. (ఖుర్‌ఆన్–39:73)

దానికి వారు సమాధానమిస్తూ “సకల ప్రశంసలు దేవునికే శోభిస్తాయి. ఆయన మాకు చేసిన వాగ్దానం నెరవేర్చిచూపాడు. మమ్మల్ని ధరణికి వారసులుగా చేశాడు. ఇప్పుడు మేము కోరిన చోట నివాసం ఏర్పరచుకోగలం” అనంటారు. (ఖుర్‌ఆన్–39:74)

“వారి తాతముత్తాతలు, తల్లిదండ్రులు, భార్యాపిల్లల్లో సజ్జనులైనవారు కూడా స్వర్గప్రవేశం చేస్తారు. అప్పుడు నలువైపుల నుండి దైవదూతలు వారికి స్వాగతించడానికి వస్తారు. ఆ దూతలు వారికి స్వాగతం చెబుతూ “మీకు శాంతి కలుగుగాక! మీరు ఇహలోకంలో సహనంతో వ్యవహరిస్తూ (సాత్విక)జీవితం గడిపినందుకు ఈరోజు దీనికి అర్హులయ్యారు” అనంటారు. ఆహా! ఎంత శ్రేష్ఠమైనది ఆ పరలోకసీమ!! (ఖుర్‌ఆన్–13:20–24)

**కృతజ్ఞతలు :** “వారు దేవునికి కృతజ్ఞతలు తెలుపుతూ ‘మా దుఃఖం దూరంచేసిన దేవుడు ఎంతో ప్రశంసనీయుడు. నిస్సందేహంగా మా ప్రభువు క్షమించేవాడు, ఆదరించే వాడు. ఆయన తన అనుగ్రహంతో మనకు శాశ్వతనివాసం కల్పించాడు. ఇప్పుడిక్కడ మనకు ఎలాంటి బాధ, అలుపు ఉండవు’ అని అంటారు.” (ఖుర్‌ఆన్–35:34,35)

“అక్కడ నీవు (మహా అద్భుతం) చూస్తావు. దైవదూతలు దివ్యసింహాసనం చుట్టూ వలయంగా ఏర్పడి తమ ప్రభువు ఔన్నత్యం ప్రశంసిస్తూ, ఆయన పవిత్రతను కొనియాడు తుంటారు. మానవులకు పూర్తిన్యాయం చేకూర్చబడుతుంది. (ఆ సందర్భంలో) ‘సర్వలోక ప్రభువుకే సకలస్తోత్రాలు!’ అనే పలుకులు మార్మోగుతాయి.” (ఖుర్‌ఆన్–39:75)

దైవప్రవక్త (సల్లం) ఈవిధంగా తెలిపారు: “స్వర్గంలో నిరుపేదలు ధనికుల కంటే అయిదువందల సంవత్సరాలు ముందుగా ప్రవేశిస్తారు.” (మిష్కాత్)

**అందరికన్నా మనమే ఫస్ట్-** దైవప్రవక్త (స) ముస్లిం అనుచర సముదాయం గురించి ప్రస్తావిస్తూ ఇలా ప్రవచించారు: “మనం ప్రపంచంలోకి అందరికంటే చివర్లో వచ్చాం. ప్రళయదినాన ఇతరుల తీర్పుకుముందే మనల్ని గురించి తీర్పు జరుగుతుంది”... అందరికంటే ముందు మనమే స్వర్గంలో ప్రవేశిస్తాం.” (మిష్కాత్)

దైవప్రవక్త (స) ఇలా తెలియజేశారు: "స్వర్గానికి పోయేవారంతా 120 పంక్తులలో ఉంటారు. వాటిలో 80 పంక్తులు ఈ అనుచర సముదాయానికి చెందినవైఉంటాయి. మిగిలిన 40 పంక్తులు ఇతర (ప్రవక్తల అనుచర) సముదాయాలకు చెందినవై ఉంటాయి." (మిష్కాత్)

## దైవదర్శనం-దైవప్రసన్నత

దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "స్వర్గవాసులు స్వర్గంలో ప్రవేశించిన తరువాత విశ్వప్రభువు వారిని ఉద్దేశించి 'మీకు ఇంకేమైనా కావాలా? అడగండి, ఇస్తాను' అంటాడు. దానికి వారు '(మాకన్నీ ఇచ్చేశారుకదా!) మీరు మా ముఖాలను తేజోవంతం చేయలేదా? మమ్మల్ని నరకం నుండి తప్పించి స్వర్గప్రవేశం కూడా చేయించారు కదా!' అని అంటారు. ఆ తర్వాత దైవదర్శనం కోసం తెర ఎత్తేయబడుతుంది. అప్పుడు స్వర్గవాసులంతా (సృష్టికర్త, విశ్వప్రభువైన) దేవుడ్ని కళ్ళారా చూసుకుంటారు. స్వర్గంలో ప్రసాదించబడిన భాగ్యాలన్నిటి కంటే వారికి దైవదర్శనమే ఎంతో ప్రియమైన భాగ్యం అన్పిస్తుంది." (ముస్లిం)

దైవప్రవక్త (స) దైవదర్శనం గురించి ప్రస్తావిస్తూ ఇలా ప్రవచించారు: "స్వర్గవాసులు తమతమ మహాభాగ్యాలు అనుభవించడంలో నిమగ్నులై ఉన్నప్పుడు హఠాత్తుగా వారి మీద దివ్యతేజస్సు ప్రసరిస్తుంది. దాంతో అందరూ తలలు పెకెత్తి చూస్తారు. ఆశ్చర్యం! వారి ముందు పరాత్పరుడు ప్రత్యక్షమై ఉంటాడు. (ఈ దివ్యదర్శనంతో స్వర్గవాసుల శరీరాలు అణువణువూ పులకరిస్తాయి.) ఆ సందర్భంలో దేవుడు వారిని సంబోధిస్తూ 'స్వర్గవాసులారా! మీకు సలాం (శాంతీశ్రేయాలు కలుగుగాక!)' అని ఆశీర్వదిస్తాడు. ఈ వాక్యంలో ఆయన పేరొకటి (సలాం) ఉంది.

ఆ తర్వాత సృష్టికర్త స్వర్గవాసుల్ని, స్వర్గవాసులు సృష్టికర్తను చూస్తూవుంటారు. చివరికి సృష్టికర్త అంతర్ధానమవుతాడు. తెర పడిపోతుంది. ఆయన నుండి వెలువడిన జ్యోతి మిగిలివుంటుంది... స్వర్గవాసులు తమ ప్రభువును చూస్తున్నంత సేపూ మరే భాగ్యం వైపు దృష్టిసారించరు." (ఇబ్నెమాజ); ఆతర్వాత దైవప్రవక్త (స) ఖుర్‌ఆన్‌లోని ఈ(75:22) సూక్తి పఠించారు: "ఆరోజు కొందరి ముఖాలు కళకళలాడుతూ దేదీప్యమానంగా వెలిగిపోతుంటాయి. వారు తమ ప్రభువుని ప్రత్యక్షంగా చూస్తుంటారు." (తిర్మిజి)

దైవప్రవక్త (స) ఈవిధంగా తెలియజేశారు: దేవుడు స్వర్గవాసుల్ని ఉద్దేశించి "స్వర్గవాసులారా! అని పిలుస్తాడు. దానికి స్వర్గవాసులు "మేము మీసన్నిధిలోనే ఉన్నాం ప్రభూ! మీ ఆదేశం శిరసావహించడానికి సిద్ధంగాఉన్నాం, సెలవియ్యండి" అంటారు. అప్పుడు దేవుడు "మీరు సంతుష్టులయ్యారా?" అని అడుగుతాడు. "ప్రభూ! మీరు మాకు మీ దాసులలో ఎవరికీ ఇవ్వని మహాభాగ్యాలు ప్రసాదించారు. అలాంటప్పుడు మేము ఎందుకు సంతుష్టులం కాము?" అంటారు వారు. "సరే, ఇప్పుడు నేను మీకు ఇంతకంటే శ్రేష్ఠమైన మహాభాగ్యం ప్రసాదిం చనా?" అంటాడు విశ్వప్రభువు. "ఇంతకంటే శ్రేష్ఠమైన మహాభాగ్యం ఇంకేముంటుంది!" అంటారు స్వర్గవాసులు. "వినండి. బాగా వినండి. నేను మీకు శాశ్వతంగా నా ప్రసన్నతాభాగ్యం ప్రసాదిస్తున్నాను. ఇక ఎప్పుడూ నేను మిమ్మల్ని ఆగ్రహించను." (బుఖారి, ముస్లిం)



# 121. అధమశ్రేణి స్వర్గనివాసి

క్షణభంగురం లాంటి ఈ ప్రాపంచిక జీవితంలోని కష్టసుఖాలు పరలోకంలోని శిక్ష సౌఖ్యాల ముందు ఏపాటివీ కావు. ఈ వాస్తవాన్ని దైవప్రవక్త (సల్లం) ఇలా తెలిపారు:

**స్వర్గనరకాల తీవ్రతా పరీక్ష :** "ఇహలోకంలో అత్యధిక సుఖభోగాలు అనుభవించిన నరకార్హుడయిన ఒక మనిషిని ప్రళయదినాన తెచ్చి నరకంలో పడవేయడం జరుగుతుంది. నరకజ్వాల్లో అతని దేహం దహించుకుపోయి ఆ రంగును పరిగ్రహించినప్పుడు దేవుడు అతనితో "ఆదం పుత్రుడా! నీవు ఎప్పుడైనా మంచిరోజులు చూశావా? సుఖాన్ని, భోగభాగ్యాలను ఒక్క సారయినా అనుభవించావా?" అని అడుగుతాడు. దానికి ఆ నరకవాసి "లేదు ప్రభో! నీ సాక్షిగా, ఎన్నడూ లేదు" అనంటాడు.

అలాగే ఇహలోకంలో దుర్భర దారిద్ర్యాన్ని అనుభవించిన స్వర్గార్హుడయిన ఒక మనిషిని తెచ్చి స్వర్గంలో ప్రవేశంపజేస్తారు. అతనికి స్వర్గసుఖాల రంగు బాగాఎక్కి అతను వాటిలో తేలియాడుతున్నప్పుడు దేవుడు అతనితో "ఆదం పుత్రుడా! నీవు ఎప్పుడైనా పేదరికాన్ని చవిచూశావా? కష్టాలను, ఇబ్బందుల్ని ఎప్పుడైనా ఎదుర్కొన్నావా?" అని అడుగుతాడు. దానికి ఆ స్వర్గవాసి "లేదు ప్రభూ! నేను ఏనాడూ లేమిని ఎరగను. ఏ కష్టాన్నీ అనుభవించలేదు" అనంటాడు. (ముస్లిం)

దైవప్రవక్త (స) ప్రవచనం: "స్వర్గంలో కమ్చీ పెట్టుకునేంత చోటయినాసరే, అది ఇహలోకంకంటే, అందులోని సమస్త వస్తుసామగ్రికంటే అనేక రెట్లు శ్రేష్ఠమైనది" (బుఖారి)

దైవప్రవక్త ఇలా (స) తెలియజేశారు: "అందరికంటే చివర్లో నరకం నుండి బయట పడి, అందరికంటే చివర్లో స్వర్గంలో ప్రవేశించే మనిషి నాకు బాగా తెలుసు. ఆ మనిషిని ప్రళయదినాన దేవుని ముందు ప్రవేశపెడ్తారు. అతను చేసిన ఘోరపాపాలను కప్పిపుచ్చి చిన్న పాపాలను మాత్రమే అతని ముందుంచండి అని చెప్పడం జరుగుతుంది.

**ప్రతిపాపానికి ఒకపుణ్యం :** అలా అతనిముందు చిన్నపాపాలు వెలిబుచ్చుతూ "నీవు ఫలానారోజు ఫలానా (దుష్)కర్మ చేశావు, ఫలానారోజు ఫలానా (దుష్)కర్మ చేశావు, ఔనా?" అని ప్రశ్నిస్తారు. అతను ఔనని ఒప్పుకుంటాడు. తిరస్కరించలేడు. అయితే తాను చేసిన పెద్ద పాపాలను కూడా బయటపెడ్తారేమోనని భయపడతాడు.

ఆ తరువాత అతనితో "నీవు చేసిన ఈ పాపాలలోని ప్రతి పాపానికి బదులు ఒక పుణ్యం ప్రసాదిస్తున్నాము, వెళ్ళు" అని చెప్పబడుతుంది. (ఈ దయాదాక్షిణ్యాలు చూసిన) ఆ మనిషి "అయితే నేనింకా చాలా పాపాలు చేశాను ప్రభూ! అవి ఇక్కడ (నాపాపాల జాబితాలో) కన్పించడం లేదే! (వాటికి కూడా నాకు పుణ్యం లభించాలి)" అని అంటాడు.

దైవప్రవక్త (స) ఈ విషయం చెబుతూ పకాలున నవ్వుతారు... (ముస్లిం)

అందరికంటే చివర్లో నరకం నుండి బయటపడి, చివర్లో స్వర్గానికి పోయే ఈ వ్యక్తిని మరికొన్ని హదీసుల్లో "అధమశ్రేణి స్వర్గవాసి" అని పేర్కొన్నారు. కాని అతనికి లభించే స్వర్గసౌఖ్యాల్ని గురించి వింటే మనం ఆశ్చర్యపడక తప్పదు. బుఖారి, ముస్లిం, తిర్మిజ గ్రంథాలలోని వివిధ హదీసుల్ని బట్టి ఆ స్వర్గవాసి వివరాలు ఇలా ఉన్నాయి:

**స్వర్గానికి సాహసయాత్ర :** అందరికంటే చివర్లో స్వర్గంలో ప్రవేశించే మనిషి నరకం నుండి బయటపడేందుకు సాహసిస్తాడు. (అలా కొంతదూరం నడిచిన తరువాత శక్తి ఉడిగిపోయి) క్రింద పడిపోతాడు. మరొక్కసారి అతను (పైకి లేవలేక) పొట్టతో ప్రాకులాడుతాడు. ఒక్కొక్క సారి నరకాగ్నిజ్వాల (ఎగిసిపడి) అతడ్ని దహించి వేస్తుంది. ఈవిధంగా అతను పడుతూ లేస్తూ ప్రాకులాడుతూ చివరికి ఎలాగో నరకం నుండి బ్రతుకుజీవుడా అంటూ బయటపడతాడు. నరకం నుండి బయటపడిన తర్వాత (అతనికి ఎంతో హాయి అన్పిస్తుంది.) అతను ఓసారి వెనక్కి తిరిగి నరకం వైపు చూస్తూ "నీ బారి నుండి నన్ను విముక్తి కలిగించిన దేవుడు ఎంతో శుభకరుడు. ఆయన నాకు ప్రథముల్లో, అంతిముల్లో ఎవరికీ లభించని మహాభాగ్యం ప్రసాదించాడు" అని అంటాడు.

ఆ తరువాత కొద్ది దూరంలో అతని కళ్ళ ముందు (మనోహరమైన) ఒక వృక్షం ప్రత్యక్షమవుతుంది. దాన్ని చూసి అతను "ప్రభూ! నన్నా చెట్టు దగ్గరకు చేర్చు. అక్కడ (ప్రవహిస్తున్న సెలయేటిలోని) నీళ్ళు తాగుతాను" అనంటాడు. దేవుడు ఈమాట విని "నేను నీకీ వరం ప్రసాదిస్తే ఆ తరువాత నీవు మరో కోరిక కోరవచ్చు. అందులో వింతేమీ లేదు" అంటాడు. "లేదు ప్రభూ! అలా చేయను. ఈ వరం పొందిన తరువాత నేను మరొక కోరిక కోరను" అంటూ వాగ్దానం చేస్తాడు ఆ మనిషి.

(ఆ సమయంలో అతని ఉద్దేశ్యం అదే. కాని ఆ మాటపై స్థిరంగా ఉండలేక పోతాడు. కారణం) అతనికి ఎదురుగా కొంచెం దూరంలో ఎంతో మనోహరమైన మరో వస్తువు కన్పిస్తుంది. అంచేత దాన్ని పొందకుండా అతను సహనం వహించలేడు.

కనుక అతడ్ని ఆ దివ్యవృక్షం దగ్గరికి చేర్చడం జరుగుతుంది. అతను ఆహ్లాదకర మైన ఆ చెట్టు నీడలో కూర్చుంటాడు. (దాని పక్కన పారే సెలయేటి) నీటిని హాయిగా తాగుతాడు. ఆ తరువాత కొద్ది దూరంలో అతనికి మరో దివ్యవృక్షం కన్పిస్తుంది. ఇది మొదటి వృక్షం కంటే ఎంతో శ్రేష్ఠమయినది. దాన్ని చూడగానే అతను ఉండబట్టలేక "ప్రభూ! నన్నా చెట్టు దగ్గరికి చేర్చు. నేనా చెట్టునీడలో హాయిగా కూర్చొని (అక్కడి సెలయేటి) నీళ్ళు తాగుతాను" అనంటాడు.

దేవుడు ఈమాట విని "ఆదం కుమారా! ఇక ఏమీ అడగనని నీవు నాకు మాటివ్వ లేదా? నేను నీకీ వరాన్ని కూడా ప్రసాదిస్తే ఆ తరువాత నీవు మరొక కోరిక కోరవచ్చు. అందులో వింతేమీ లేదు" అనంటాడు. "లేదు ప్రభూ! ఈ వరం పొందిన తరువాత నేనిక మరే వరం కోరను" అంటూ ఆ మనిషి మళ్ళీ వాగ్దానం చేస్తాడు. అతనికి ఎదురుగా అతి మనోహరమైన మరో వస్తువు కన్పిస్తుంది. దాన్ని పొందకుండా అతను సహనం వహించలేడు. అంచేత దేవుడు అతడ్ని బలహీనుడిగా పరిగణిస్తాడు.

కనుక దేవుడు అతడ్ని ఆ (రెండవ)వృక్షం దగ్గరకు చేర్చుతాడు. అతనా చెట్టునీడలో కూర్చుంటాడు. (దాని సౌఖ్యాన్ని ఆస్వాదిస్తాడు.) అక్కడున్న సెలయేటి నీటిని (తనివితీరా) తాగుతాడు. ఆ తరువాత మరికొద్ది దూరంలో స్వర్గద్వారం దగ్గర్లో మరో (మనోహరమైన) వృక్షం ప్రత్యక్షమవుతుంది. ఇది మొదటి రెండువృక్షాల కంటే ఎంతో అందమైనది, అద్భుత మైనది. ఆ మనిషి దృష్టి దాని మీద పడుతుంది. ఇంకేముంది, అతను వెంటనే లేచి



"ప్రభూ! నన్నా చెట్టు దగ్గరికి చేర్చు. నేనా చెట్టునీడ పొంది, (అక్కడి సెలయేటి) నీటిని తాగుతాను. ఇదొక్కటి తప్ప ఇక ఏదీ నిన్నడగను" అని వేడుకుంటాడు.

సృష్టికర్త అతని మాటలు విని "ఆదంకుమారా! ఇక ఏమీ అడగనని నీవు నాకు గట్టి మాటివ్వలేదా?" అని ప్రశ్నిస్తాడు. "నిజమే ప్రభూ! నేను మరేమీ కోరనని మాటిచ్చాను. కాని (ఈసారికి మన్నించి నాయీ కోరిక కూడా తీర్చు)"అని ఆ మనిషి మళ్ళీ వేడుకుంటాడు. అతనికి ఎదురుగా అతి మనోహరమైన వేరొక వస్తువు కన్పిస్తుంది. దాన్ని పొందకుండా పాపం అతను సహనం వహించలేడు. అందువల్ల దేవుడు అతడ్ని బలహీనుడిగా పరిగణించి ఆ వృక్షం దగ్గరికి చేర్చుతాడు.

అయితే అతనా వృక్షం దగ్గరకు చేరుకోగానే అతనికి (స్వర్గం నుండి) స్వర్గవాసుల మాటలు విన్పిస్తాయి. (స్వర్గ సువాసనలు గుబాళిస్తాయి. మనసును గిలిగింతలు పెట్టే ఆహ్లాదకరమైన వాతావరణం ఆస్వాదిస్తాడు.) దాంతో అతను ఉండబట్టలేక "ప్రభూ! నన్నందులోకి చేర్చు. (ఇక ఏ కోరికా కోరను.)" అని అంటాడు.

"ఆదంకుమారా! ఇలా ఎన్ని కోరికలు కోరుతావు? నీ కోరికలకు హద్దులేదా? సరే, నీకిప్పుడు ఇహలోకమంత (స్వర్గభాగ్యం) ప్రసాదిస్తున్నాను. దాంతోపాటు దానికి పదింతలు ఇంకా ప్రసాదిస్తున్నాను. ఇప్పుడైనా తృప్తి పడతావా?" అంటాడు సృష్టికర్త. (ఈ మాట విని ఆ మనిషి ఓ పట్టాన నమ్మలేక) "ఏమిటీ, మీరు సకల లోకాల ప్రభువయిఉండి (అత్యల్ప జీవిఅయిన) నాతో పరిహాసమాడుతున్నారా?" అనంటాడు. సృష్టికర్త అతని మాటలు విని నవ్వుతూ "నేను ఏది తలచుకుంటే అది చేయగల్గుతాను. (నేను నిజంగానే నీకంత మహాభాగ్యం ప్రసాదిస్తున్నాను.) వెళ్ళు, స్వర్గంలో ప్రవేశించు" అంటాడు.

ఈమాట విని ఆ మనిషి పరమ సంతోషంతో ఉక్కిరిబిక్కిరవుతో స్వర్గంలో ప్రవేశించ డానికి ముందుకు సాగుతాడు. కాని స్వర్గం దగ్గరికెళ్ళి చూస్తే అది పూర్తిగా నిండిపోయి ఉన్నట్లు కన్పిస్తుంది. పాపం అతను ముఖం చిట్లించుకొని "స్వర్గం నిండిపోయి కిటకిట లాడుతుంటే అందులో నేనెలా ప్రవేశించాలి. అసలు నా కోసం తమరు ఏదయినా మిగిల్చితేగా!" అని అంటాడు.

దానికి విశ్వప్రభువు "నేను నీ కోసం (ఎంతో చోటు కేటాయించాను.) సూర్యుడు ఉదయించే చోటు నుండి అస్తమించే చోటు వరకు ఎంత స్థలం ఉంటుందో అంత విశాలమైన స్థలం కేటాయించాను, వెళ్ళు" అనంటాడు. అప్పుడా మనిషి తృప్తిగా స్వర్గంలో ప్రవేశిస్తాడు. స్వర్గంలో ప్రవేశించిన తరువాత దేవుడు అతనితో "ఇంకా నీ కోరికలేమిటో చెప్పు, వాటన్నిటినీ తీర్చుతాను" అంటాడు.

ఆ మనిషి తన కోరికలన్నీ వ్యక్తపరుస్తాడు. "ఇంకా కోరుకో. ఫలానా ఫలానా విషయాలు ఉండిపోయాయి. వాటిని కూడా కోరుకో" అంటూ దేవుడు గుర్తుచేస్తాడు. ఆవిధంగా దేవుడు ఎన్నో విషయాలు గుర్తుచేస్తుంటే వాటన్నిటిని అతను కోరుకుంటాడు. అతను కోరిన కోరికలన్నీ నెరవేరిన తరువాత "నీవు కోరినవన్నీ నీకు ప్రసాదించా. ఇంకా అన్ని వస్తువులు కూడా నీకు ప్రసాదించాను" అంటాడు విశ్వప్రభువు.

**అధమశ్రేణి సామ్రాజ్యం :** అధమశ్రేణి స్వర్గవాసికి లభించే ఈ స్వర్గ సామ్రాజ్యం రెండువేల సంవత్సరాలు ప్రయాణం సాగించినా తరగనంత విశాలంగా ఉంటుంది. అతనికి 80,000 మంది సేవకులు, 72 మంది భార్యలు లభిస్తారు. అతని కోసం మణి మాణిక్యాలతో నిర్మించబడిన ఎంతోఅందమైన రాజసౌధం ఉంటుంది. అది వేలాది మైళ్ళ విస్తీర్ణం ఉంటుంది. భార్యలుగా ఇవ్వబడే సుందరాంగుల్లో ఇద్దరు అతని దగ్గరికొచ్చి "సకల స్తోత్రాలు అల్లాహ్‌కే శోభిస్తాయి. ఆయన మాకోసం నీకు శాశ్వత స్వర్గజీవితం ప్రసాదించాడు. నీకోసం మాకు (సుఖమయ) జీవితం అనుగ్రహించాడు" అనంటారు.

## 122. స్వర్గవాసుల రూపురేఖలు

దైవప్రవక్త (స) ఇలా అన్నారు: "స్వర్గంలో ప్రవేశించే మొదటి సమూహంవారి ముఖాలు పున్నమిచంద్రునిలా ప్రకాశిస్తుంటాయి. వారి తర్వాత ప్రవేశించేవారి ముఖాలు ధగధగ మెరిసే నక్షత్రంలా ప్రకాశిస్తుంటాయి. వారందరి హృదయాలు ఒకే విధంగా ఉంటాయి. వారిలో పరస్పరం ఏ విధమైన ద్వేషం, దురభిమానం, భేదాభిప్రాయాలు ఉండవు. ప్రతి ఒక్కరికి (స్వర్గ కన్యలలో కనీసం) ఇద్దరు భార్యలు ఉంటారు. వారిద్దరు అపురూప సుందరాంగులు. స్వర్గవాసులు ఉదయం, సాయంత్రం దైవనామ స్మరణ చేస్తుంటారు. వారెప్పుడూ జబ్బు పడరు. ముక్కు చీదడంగాని, ఉమ్మడంగాని చేయరు. వారు వాడే పాత్రలు వెండిబంగారాలతో చేసినవయి ఉంటాయి. వారి దువ్వెనలు కూడా బంగారంతో చేసినవై ఉంటాయి. వారి ఉంగరాల నుండి సాంబ్రాణి సువాసన వెలువడు తుంది. వారి చెమట కస్తూరీవాసన గుబాళిస్తుంది." (బుఖారి)

పై హదీసులో స్వర్గవాసుల శరీరం నుండి వెలువడే చెమట తిన్న తిండి జీర్ణం అయిన కారణంగా వెలువడే తేలికపాటి చెమట. పైగా ఈ చెమట నుంచి సువాసన కూడా వస్తుంది.

**ఎత్తు (పొడవు) :** దైవప్రవక్త (సల్లం) ఈవిధంగా ప్రవచించారు: "దేవుడు ఆదం (అలై)ను సృష్టించినపుడు ఆదం ఎత్తు అరవై బారలు (180 అడుగులు) ఉండింది. దేవుడు ఆయనతో 'దైవదూతల దగ్గరకెళ్ళి వారికి సలాం చెయ్యి. దానికి వారేమి చెబుతారో విను. వారు పలికిన సలామే నీ, నీ సంతానం సలాం, ప్రతిసలాం అవుతుంది' అని అన్నాడు. అప్పుడు ఆదం (అలైహి) వెళ్ళి 'అస్సలాము అలైకుం' అని సలాం చేశారు. దానికి వారు 'అస్సలాము అలైకుం వరహ్మతుల్లాహ్' అని ప్రతిసలాం చేశారు. వారు రహ్మతుల్లాహ్ అనే పదాన్ని అదనంగా పలికారు. స్వర్గంలో ప్రవేశించే ప్రతి మానవుని రూపం ఆదం (అలైహి) రూపంలా ఉంటుంది. ఆ తరువాత ఈనాటి వరకూ మానవుల ఎత్తు నిరంతరాయంగా తగ్గుతూ వస్తోంది." (బుఖారి)

దీన్నిబట్టి స్వర్గవాసులు 180 అడుగుల ఎత్తుంటారని తెలుస్తోంది. ఎత్తుకు తగ్గ లావు, శరీరసౌష్ఠవాలు ఉంటాయి. వాటి ప్రకారమే స్వర్గంలోని ఇతర వస్తువులు కూడా ఉంటాయి.

**గడ్డం, మీసాలులేని ముఖాలే అందం-** దైవప్రవక్త (స) ప్రవచనం: "స్వర్గవాసుల దేహాలపై వెంట్రుకలుండవు. వారి కళ్ళు సుర్మా పెట్టుకోకపోయినా పెట్టుకున్నట్లు అందంగా ఉంటాయి. వారి యౌవనం ఎన్నటికీ తరగదు. వారి దుస్తులు మాసిపోవు." (తిర్మిజి)



దేహం మీద వెంట్రుకలు ఉండవంటే తల, కనుబొమలు, కనురెప్పలపై తప్ప శరీరం మీది ఇతర భాగాలపై వెంట్రుకలుండవని అర్థం కావచ్చు. తల మీది వెంట్రుకల్ని గురించి ఏ హదీసులో ప్రస్తావించకపోయినా "స్వర్గవాసుల దువ్వెనలు బంగారపు దువ్వెనలై ఉంటాయి" అనే హదీసును బట్టి తల మీద వెంట్రుకలు తప్పక ఉంటాయని తెలుస్తోంది. అలాగే మనం ఇక్కడ గొరిగే అనవసరమైన వెంట్రుకలు స్వర్గవాసులకు ఉండవని కూడా ఊహించవచ్చు.

**స్వర్గవాసుల ఆరోగ్యం, వయస్సు :** "స్వర్గంలో ఒక ప్రకటనకర్త స్వర్గవాసుల్ని పిలుస్తూ ఇలా ప్రకటిస్తాడు: 'స్వర్గవాసులారా! మీరు ఎల్లప్పుడూ ఆరోగ్యంగా ఉంటారు, ఎన్నటికీ జబ్బుపడరు. మీరు శాశ్వతంగా జీవించి ఉంటారు. ఎన్నటికీ మీకు మరణం రాదు. మీరు ఎల్లప్పుడూ యౌవనులుగా ఉంటారు. ఎన్నటికీ ముసలివారు కారు. మీరు ఎల్లప్పుడూ భోగభాగ్యాలు అనుభవిస్తూఉంటారు. ఏనాడూ లేమికి గురికారు. ఇవన్నీ మీ కోసం నిర్ణీత విషయాలు." (ముస్లిం)

స్వర్గవాసి వయస్సు గురించి దైవప్రవక్త (స) ఇలా చెప్పారు: "ఇహలోకం నుండి వెళ్ళిపోయే మనిషి చిన్నవాడైనా, పెద్దవాడైనా (స్వర్గంలో ప్రవేశించే సమయానికి) అతని వయస్సు ముప్ఫయి సంవత్సరాలు ఉంటుంది. అంతకుమించి ఉండదు." (తిర్మిజి)

హజ్రత్ జాబిర్ (రజి) ప్రకారం ఒకతను "దైవప్రవక్తా! స్వర్గవాసులు నిద్రపోతారా?" అనడిగాడు. దానికి దైవప్రవక్త (స) "నిద్ర మరణానికి సోదరి. స్వర్గవాసులకు మరణం రాదు. (కనుక వారికి నిద్ర కూడా రాదు.)" అని చెప్పారు. (మిష్కాత్ షరీఫ్)

## 123. స్వర్గ భాగ్యాలు

స్వర్గాన్ని ఖుర్‌ఆన్ పరిభాషలో "జన్నత్" అంటారు. జన్నత్ అంటే వనం (తోట). అంచేత వివిధరకాల వృక్షాలతో కనులపండుగగా శోభిస్తూ అన్నివిధాల వసతులు, సౌకర్యాలు ఉండే స్వర్గానికి జన్నత్ అని పేరివ్వడం జరిగింది. ఇలా స్వర్గానికి వనం, వనానికి స్వర్గం పర్యాయపదాలై పోయాయి.

"దైవభీతిపరులకు వారి కోర్కెలునెరవేరే అద్భుతస్థానం ఉంది. మనోహరమైన ఉద్యానవనాలు, సుమధుర ద్రాక్షఫలాలు ఉన్నాయి. సమవయస్కులయిన సుకన్యలు ఉన్నారు. మద్యంతో నిండిన, మెరిసిపోయే మధుపాత్రలున్నాయి." (ఖుర్‌ఆన్-78:31-34)

"ఆరోజు దైవభీతిపరులు స్వర్గవనాలలో చెలమల మధ్య (హాయిగా) ఉంటారు. వారు తమ ప్రభువు ప్రసాదించినదాన్ని అమిత సంతోషంతో స్వీకరిస్తూ ఉంటారు. వారు ఈరోజు రాకపూర్వం నీతిమంతులుగా ఉండేవారు." (ఖుర్‌ఆన్-51:15,16)

దైవప్రవక్త (స) హితోక్తి: "స్వర్గంలో హోదాఅంతస్తుల రీత్యా అధమశ్రేణి స్వర్గవాసికి లభించే సామ్రాజ్యంలోని తోటలు, ఆసనాలు, భార్యలు, సేవకులు, ఇతర భాగ్యాలు రెండువేల సంవత్సరాల ప్రయాణమంత పరిధిలో విస్తరించి ఉంటాయి. (అంటే భూలోక వాసి ఈ వస్తువులన్నిటినీ చూస్తూ ఒక చివరి నుండి మరొక చివరికి నడవడానికి రెండువేల సంవత్సరాలు పడ్తుందన్న మాట.) పోతే అందరికంటే అత్యున్నత శ్రేణికి చెందిన స్వర్గవాసికి ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం దైవదర్శనభాగ్యం లభిస్తుంది." (మిష్కాత్)

దైవప్రవక్త (స) ప్రవచనం: "స్వర్గంలో ఒక మహావృక్షం ఉంది. దాని నీడలో ఒక రౌతు వందేళ్ళ ప్రయాణం చేసినా ఆ నీడ చివరిదాకా చేరుకోలేడు." (బుఖారి, ముస్లిం)

"స్వర్గంలోని చెట్ల బోదెలన్నీ బంగారు బోదెలయి ఉంటాయి." (తిర్మిజి)

హజ్రత్ జరీర్ బిన్ అబ్దుల్లా (రజి) ఉల్లేఖనం: నేను హజ్రత్ సల్మాన్ ఫార్సి (రజి) దగ్గరకు పోయాను. ఆయన నాతో మాట్లాడుతూ చేతిలోకి ఒక చిన్న కర్రముక్క తీసుకున్నారు. అది ఆయన చేతిలో సరిగా కన్పించడం కూడా లేదు. ఆయన దాన్ని చూపిస్తూ "జరీర్! స్వర్గంలో నీవు ఈమాత్రం కర్రముక్క వెతికినా నీకు కన్పించదు" అన్నారు. నేనీ మాట విని "మరి ఖర్జూరపు చెట్లు, ఇతర చెట్లు ఏమైపోతాయి?" అని ప్రశ్నించాను. దానికాయన "అవన్నీ ఉంటాయి. అయితే వాటి బోదెలన్నీ బంగారం, ముత్యాలతో సృజించబడినవై ఉంటాయి. వాటికి ఖర్జూరపండ్లు కాసిఉంటాయి" అని చెప్పారు. (బైహఖి)

ఖుర్ఆన్‌లో దైవసన్నిహితులైన భక్తుల కోసం రెండువనాల ప్రస్తావన ఉంది. ఆ తర్వాత సాధారణ భక్తుల కోసం మరో రెండు వనాల ప్రస్తావన ఉంది. (55:46-77)

## ఆహార పానీయాలు

స్వర్గంలో ప్రవేశించిన తరువాత స్వర్గవాసులకు మొట్టమొదట ఒక వింతయిన ప్రత్యేక ఆహారం లభిస్తుంది. ఆ పదార్థం ఆ తరువాత మరెప్పుడూ లభించదు.

**విచిత్రాహారం-** దైవప్రవక్త (స) ఈ విచిత్రాహారం గురించి ఇలా తెలియజేశారు: "ప్రళయదినాన భూమి రొట్టెగా చేయబడుతుంది. మీరు ప్రయాణంలో ఉన్నప్పుడు చేతులతో అటూఇటూ తిప్పి వత్తుతూ చేసినట్లు దాన్ని ప్రళయ రౌద్రుడు తన చేతులతో అటూఇటూ తిప్పి వత్తుతూ తయారుచేస్తాడు. (ఈవిధంగా తయారయిన) ఆ రొట్టెను దేవుడు స్వర్గవాసులకు లభించే మొట్టమొదటి ఆతిథ్యంగా పరిగణిస్తాడు."

దైవప్రవక్త (స) దగ్గరకు ఒక యూదుడు వచ్చి "అబుల్‌ఖాసిం! ప్రళయదినాన స్వర్గవాసులకు లభించే మొట్టమొదటి ఆతిథ్యం దేనితో చేయబడుతుందో నేను చెప్పనా?" అన్నాడు. దానికి దైవప్రవక్త (స) "ఆ...చెప్పండి" అన్నారు. అప్పుడు యూదుడు 'భూమిని రొట్టెగా చేయడం జరుగుతుంద'ని (పై హదీసులో) దైవప్రవక్త (స) చెప్పినట్లు చెప్పాడు.

ఆ తర్వాత ఆ యూదుడు "స్వర్గవాసులకు లభించే మొట్టమొదటి కూర ఏమిటో కూడా చెప్పనా?" అన్నాడు. దైవప్రవక్త (స) "సరే చెప్పండి" అన్నారు. దానికా యూదుడు ఇలా చెప్పాడు- "అది ఎద్దు మాంసం. చేపకూర కూడా. చేప గుండెకాయకు చెందిన అదనపు భాగాన్ని డెబ్భయివేల మంది స్వర్గవాసులు తింటారు." (బుఖారి, ముస్లిం)

ప్రపంచంలో అనేకరకాల ఆహారపదార్థాలు ఉంటాయి. కొన్ని రకాల ధాన్యాలు, అపరాలు, పండ్లు, కూరగాయలు మొదలైనవి ఒక ప్రాంతంలో లభిస్తే మరొక ప్రాంతంలో లభించవు. అదీగాక కొందరు కొన్ని రకాల ఆహారపదార్థాలకు అలవాటుపడి మరికొన్ని రకాల ఆహార పదార్థాలు రుచికరంగా ఉన్నప్పటికీ తినడానికి ఇష్టపడరు. ఈవిధంగా ప్రపంచంలోని ప్రజలందరూ ధరణిపై లభించే అన్నిరకాల ఆహారపదార్థాలు తినిఉండరు. అందువల్ల సృష్టికర్త



స్వర్గవాసికి ప్రపంచంలోని అన్నిరకాల ఆహారపదార్థాలు ఒకేసారి రుచిచూపడానికి బహుశా ఈ "నేలరొట్టె"ను తయారు చేస్తాడని కొందరు ధర్మవేత్తలు అభిప్రాయపడ్డారు.

"వారికోసం తెలియజేయబడిన మంచిఆహారం సిద్ధంగా ఉంటుంది. సకలవిధాల రుచికరమైన పదార్థాలుంటాయి."(37:40,41); "వారిముందు బంగారంతో చేసిన కంచాలు, గిన్నెలు కదులాడుతుంటాయి. వారి హృదయాలకు, కళ్ళకు ఆనందాన్నిచ్చే ప్రతి వస్తువూ అక్కడ లభిస్తుంది. 'ఇప్పుడు మీరిక్కడ కలకాలం ఉంటారు. మీరు ప్రపంచంలో చేసుకున్న సత్కార్యాల కారణంగానే ఈ స్వర్గసీమకు వారసులయ్యారు. ఇక్కడ మీరు తినడానికి కావలసినన్ని పండ్లు ఫలాలు ఉన్నాయి" అని వారికి చెబుతారు (దైవదూతలు). (ఖుర్ఆన్-43:71-73)

"మేము వారికి రకరకాల పండ్లు, ఫలాలు, మాంసాహారాలు ప్రసాదిస్తాము. వారికి ఇష్టమైన ప్రతి వస్తువూ ఇస్తుంటాము." (52:22); "ముళ్ళులేని రేగుచెట్ల పండ్లు, అరటిగెలలు, సుదూరంగా విస్తరించిన చల్లటినీడలు, ఎడతెగకుండా ప్రవహించే మంచినీరు, ఎన్నటికీ అంతంకాని సులభంగా అందుబాటులో ఉండే అసంఖ్యాకమైన సుమధుర ఫలాలు." (56:28-32); "స్వర్గవృక్షాలు వారికి నీడనిస్తాయి. వాటి పండ్లు వారికి అనుక్షణం అందుబాటులో ఉంటాయి." (ఖుర్ఆన్-76:14)

ఈ సూక్తిపై "ఇబ్నెకసీర్ (రహ్మలై) ఇలా రాశారు: "స్వర్గవాసి ఏదైనా పండు తీసుకో దలచినప్పుడు ఆ పండ్లరెమ్మ పరమ విధేయురాలిగా అతని దగ్గరికి వస్తుంది. స్వర్గవాసి నిలబడిఉంటే పండ్లరెమ్మ పైకిలేచి అతనికి దగ్గరగా వస్తుంది. ఒకవేళ స్వర్గవాసి కూర్చొని వుంటే లేదా పడుకొనివుంటే అది అతని దగ్గరకు వంగి వస్తుంది." (తఫ్సీర్ ఇబ్నెకసీర్)

"ఒకసారి దైవప్రవక్త (స) సూర్యగ్రహణం పడ్తే గ్రహణ ప్రార్థన చేయించారు. అది చాలా సుదీర్ఘ ప్రార్థన. ప్రార్థన ముగిసేటప్పటికి గ్రహణం కూడా వదిలింది. ప్రార్థన అయిపోగానే ఆయన అనుచరులతో మాట్లాడుతూ ఇలా అన్నారు: 'సూర్యచంద్రులు దేవుని సూచనలు. ఎవరైనా చనిపోవడం వల్లగాని, పుట్టడం వల్లగాని వాటికి గ్రహణాలు పట్టవు. కనుక మీరు సూర్యగ్రహణంగాని, చంద్రగ్రహణం గాని పట్టినప్పుడు దేవుడ్ని స్మరించండి.' అనుచరులు ఈ మాట విన్న తరువాత 'దైవప్రవక్తా! ప్రార్థన చేస్తున్నప్పుడు మీరు నిల్చున్న చోటులోనే ఉండి ఏదో వస్తువు (ముందుకువంగి) తీసుకోబోయారు. కాని ఆ తరువాత ఎందుకో వెనక్కి జరిగారు. (ఏమిటీ విశేషం)?' అని అడిగారు.

దానికి దైవప్రవక్త (స) ఇలా చెప్పారు: 'నేనప్పుడు స్వర్గం చూశాను. స్వర్గంలోని ఓ పండ్లగుత్తి తీసుకుందామనుకున్నాను. (కాని హఠాత్తుగా నాముందు ఓ అడ్డుగోడ ఏర్పడటం వల్ల దాన్ని తీసుకోలేక పోయాను.) ఒకవేళ నేనా పండ్లగుత్తి తీసుకొనివుంటే, దాన్ని మీరు ప్రపంచం ఉన్నంతవరకూ తింటుండేవారు." (మిష్కాత్)

హజ్రత్ అబ్దుల్లా బిన్ అబ్బాస్(రజి) ఉల్లేఖనం: "స్వర్గంలో ఖర్జూరపండ్లు పన్నెండు బారల (ముప్ఫయి అడుగుల) పొడవు ఉంటాయి." (తర్గీబ్-ఇబ్నె అబిదున్యా)

ఒకసారి ఓ పల్లెవాసి వచ్చి "దైవప్రవక్తా! దేవుడు స్వర్గంలో మాకు బాధ కలిగించే పండుంటుందని తెలియజేశాడేమిటీ?" అన్నాడు. దైవప్రవక్త (స) "అదేం పండు?" అని

అడిగారు. దానికా పల్లెవాసి "రేగుపండు" అని చెప్పాడు. దైవప్రవక్త (స) ఈమాట విని ఇలా అన్నారు: "దేవుడు ముళ్ళులేని రేగుపండ్లు అని చెప్పలేదా? ఆ రేగుపండ్లలో ఒక పండు వలచి చూస్తే అందులో నుంచి డెబ్భయి రెండు రంగుల (రకాల) తినుబండారాలు కన్పిస్తాయి. అందులో ఏఒక్క రంగు కూడా మరో రంగుతో పోలిఉండదు." (తర్గీబ్)

"వారు కోరిన పండ్లు తినడానికి ఆ బాలకులు వారి ముందు రకరకాల రుచికరమైన పండ్లుంచుతారు. అలాగే వారికిష్టమైన పక్షులమాంసం కూడా ఉంచుతారు." (56:20,21)

దైవప్రవక్త (సల్లం) ఓసారి అనుచరుల ముందు ఈ పక్షుల్ని గురించి ప్రస్తావిస్తూ "స్వర్గంలో పొడవైన మెడలతో ఒంటెల్లాంటి పెద్దపెద్ద పక్షులు ఉంటాయి. అవి స్వర్గ వృక్షాల మధ్య తిరుగుతూ, మేస్తుంటాయి" అని అన్నారు. అప్పుడు హజ్రత్ అబూబకర్ (రజి) "అయితే దైవప్రవక్తా! అవి ఎంతో మంచి జీవితం గడుపుతున్నాయన్న మాట" అన్నారు. దానికి దైవప్రవక్త (స) "వాటిని తినేవారు అంతకంటే మంచి జీవితం గడుపుతారు" అన్నారు. ఈమాట ఆయన మూడుసార్లు చెప్పారు. తరువాత "నీవా పక్షుల్ని తినేవారిలో ఒకడయి ఉంటావని నేను ఆశిస్తున్నాను" అన్నారు. (అహ్మద్)

హజ్రత్ అబూఉమామా (రజి) ఇలా అన్నారు: "స్వర్గవాసికి పక్షి మాంసం తినాలనుకుంటే పక్షి అతని దగ్గరికి వచ్చి పడుతుంది. వెంటనే అది వండి ముక్కలుచేసిన మాంసంలా మారుతుంది." ఒక హదీసులో "పక్షి దానంతటది స్వర్గవాసి దగ్గరకు వచ్చి పడుతుంది. అది నిప్పు, పొగ లేకుండా ఉడికిన మాంసంలా ఉంటుంది. స్వర్గవాసి దాన్ని కడుపునిండా తింటాడు. తరువాత ఆ పక్షి ఎగిరిపోతుంది" అని ఉంది. (తర్గీబ్- అనిబ్నె అబిద్దున్యా)

దైవప్రవక్త (స) ప్రవచనం: "స్వర్గంలో స్వర్గవాసులు తింటారు, తాగుతారు. కాని మలమూత్రాలు విసర్జించరు. అలాగే వారు ఉమ్మరు, ముక్కు చీదరు" అని అన్నారు. అనుచరులు ఈమాట విని "మరి తిన్న ఆహారం ఏమవుతుంది?" అనడిగారు. దానికి దైవప్రవక్త (స) ఇలా చెప్పారు- "త్రేన్పు వస్తుంది. కస్తూరి సువాసనతో కూడిన చెమట వెలువడుతుంది. (దాంతో కడుపు ఖాళీ అవుతుంది.) ఇక్కడ మీరు శ్వాస వదులుతున్నట్లు స్వర్గవాసి నోట అనుక్షణం అప్రయత్నంగా దైవస్తోత్రం వెలువడుతుంది." (ముస్లిం)

**స్వర్గంలో సేద్యం-** దైవప్రవక్త (స) అనుచరుల ముందు స్వర్గసౌఖ్యాల్ని గురించి వర్ణించారు. అప్పుడక్కడ ఓ పల్లెవాసి కూడా ఉన్నాడు. దైవప్రవక్త (స) ఇలా చెప్పసాగారు: "స్వర్గవాసులలో ఒకతను తన ప్రభువును వ్యవసాయం చేయడానికి అనుమతించమని అడుగుతాడు. దేవుడు ఈ కోరిక విని 'మానవుడా! ఇక్కడ నీవు కోరుకున్న స్వర్గభాగ్యాలన్నీ లేవా?' అనడుగుతాడు. దానికతను '(ఉన్నాయి) కాని నాకు సేద్యం చేయాలనిపిస్తోంది' అంటాడు. అప్పుడు దేవుడతనికి సేద్యం చేసుకునే అనుమతి ఇస్తాడు.

అప్పుడతను నేలలో విత్తనాలు నాటుతాడు. రెప్పపాటులో అవి మొలకెత్తుతాయి. పైరు పెరిగి పంట కోయబడి కొండల్లాంటి పెద్దపెద్ద మోపులు కూడా తయారవుతాయి. ఇలా పంట తయారయిన తరువాత దేవుడు అ స్వర్గవాసితో 'ఆదం కుమారా! ఇదిగో తీసుకో. నీ అత్యాస కడుపును ఏ వస్తువు కూడా నింపలేదు' అనంటాడు."



దైవప్రవక్త (స) చెప్పిన ఈ ప్రవచనం విని ఆ పల్లెవాసి "దైవసాక్షి! ఆ స్వర్గవాసి తప్పకుండా ఖురైషియో, అన్సారియో అయివుంటాడు. వారే వ్యవసాయం చేసేవారు. మా వృత్తి వ్యవసాయం కాదు. మేమిలాంటి కోరిక ఎందుకు కోరుకుంటాం?"అని అన్నాడు. దైవప్రవక్త (స) ఈమాట విని ఫక్కున నవ్వారు. (బుఖారి)

**పానీయాలు:** "(సత్యాన్ని విశ్వసించిన) సజ్జనులు (స్వర్గంలో) కర్పూరజలం కలిపిన మద్యం సేవిస్తారు. ఇదొక సెలయేరు. దైవభక్తులు దీని నీటితోపాటు మద్యపానం సేవిస్తారు. వారు తాము కోరినచోట సులభంగా దాని శాఖను తీసుకుంటారు." (ఖుర్ఆన్–76:5,6)

"నిస్సందేహంగా పుణ్యాత్ములు భోగభాగ్యాలలో ఓలలాడుతూ ఉంటారు. వారు ఉన్నతాసనాలపై (హాయిగా) కూర్చొని (స్వర్గవైభవాలు) తిలకిస్తుంటారు. వారి ముఖాలలో సుఖసంతోషాల కళాకాంతులు గోచరిస్తాయి. వారు స్వచ్ఛమైన విశేష మధుపానం సేవిస్తారు. ఆ మధుపాత్రలకు కస్తూరి సీళ్ళుంటాయి. సౌఖ్యాలకోసం పోటీపడేవారు దీన్ని సాధించడానికి పోటీపడాలి. ఆ మధువులో తస్నీం (అనే విశేషపానీయం) కలసి ఉంటుంది. ఇదొక సెలయేరు. సన్నిహితభక్తులు దీని పానీయంతోపాటు సారా సేవిస్తారు." (ఖుర్ఆన్–83:25–28)

## స్వర్గంలో సెలయేరులు

"భయభక్తులుకలవారికి వాగ్దానం చేయబడిన స్వర్గం మహావైభవంగా ఉంటుంది. అక్కడ అణుమాత్రం కూడా కలుషితంకాని పరిశుభ్రమైన నీరుగల (చల్లటి) సెలయేరులు, ఏమాత్రం రుచికోల్పోని స్వచ్ఛమైన పాలనదులు, పానప్రియులకు అమిత రుచికరంగా ఉండే వారుణీవాహినీలు, ఎంతో నిర్మలమైన తేనెఝురులు ప్రవహిస్తుంటాయి. అక్కడ అన్ని రకాల పండ్లుంటాయి. వారిప్రభువు వైపున వారికి మన్నింపుభాగ్యం ఉంటుంది." (ఖుర్ఆన్–47:15)

దైవప్రవక్త (స) ఇలా అన్నారు: "స్వర్గంలో వంద అంతస్తులున్నాయి. ప్రతి రెండు అంతస్తుల మధ్య భూమ్యాకాశాల మధ్య ఉన్నంత దూరం ఉంటుంది. అన్నిటికంటే అత్యున్నతమైన స్వర్గాన్ని 'ఫిర్దౌస్' అంటారు. ఫిర్దౌస్ నుండే ఈ నాలుగు సెలయేరులు పుట్టి ప్రవహిస్తాయి. ఫిర్దౌస్ పైన దైవసింహాసనం (అర్ష్) ఉంటుంది. కనుక మీరు దేవుడ్ని స్వర్గం గురించి వేడుకుంటే ఫిర్దౌస్ స్వర్గం ప్రసాదించమని వేడుకోండి." (తిర్మిజి)

దైవప్రవక్త (స) ప్రవచనం:"స్వర్గంలో మంచినీరు, తేనె, పాలు, మద్యంలకు చెందిన నాలుగు నదులున్నాయి. వాటికి ఉపనదులు కూడా ఉన్నాయి. (మిష్కాత్-తిర్మిజి)

**గురుశిష్యుల సంభాషణ:** "స్వర్గంలోని సెలయేరులు కస్తూరీ పర్వతాల నుండి వెలువడుతాయి" అని కూడా దైవప్రవక్త (సల్లం) తెలియజేశారు. (తర్గీబ్)

హజ్రత్ అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి)కు, ఆయన శిష్యుడు హజ్రత్ సమాక్ (రజి)కు మధ్య జరిగిన ఓ ఆసక్తికరమైన సంభాషణ ఈవిధంగా ఉంది:-

సమాక్ (రజి): స్వర్గంలో నేల ఎలా ఉంటుంది?

ఇబ్నెఅబ్బాస్ (రజి): అది అద్దంలా ఎంతో తెల్లగా ఉండే వెండి నేల.

సమాక్ (రజి): అక్కడ వెలుగు ఎలా ఉంటుంది?

ఇబ్నెఅబ్బాస్ (రజి): సూర్యోదయం వేళ వెలుగు ఎలా ఉంటుందో చూడలేదా? అదే విధంగా ఉంటుంది స్వర్గంలో వెలుగు. అందులో ఎండగాని, చలిగాని ఉండవు.

సమాక్ (రజ): స్వర్గంలో సెలయేరులు ఎలా ఉంటాయి? నీళ్ళు పల్లానికే పారుతాయా?

ఇబ్నెఅబ్బాస్ (రజి): అక్కడ మిట్టపల్లాలు ఉండవు. ఆ సెలయేరు చదునైన మైదానంలో పారుతుంది. పల్లం లేకపోయినా అటూఇటూ పోకుండా నిర్దేశిత మార్గంలోనే పారుతుంది. దేవుడు వాటిని, ఉనికిలోకి రండని ఆదేశించాడు. అవి ఉనికిలోకి వచ్చి పారుతున్నాయి.

సమాక్ (రజ): స్వర్గంలో దుస్తులు ఎలా ఉంటాయి?

ఇబ్నెఅబ్బాస్ (రజి): స్వర్గంలో ఓ ప్రత్యేక వృక్షం ఉంది. దానికి దానిమ్మలాంటి పండ్లు కాస్తాయి. స్వర్గవాసి ఏవైనా దుస్తులు ధరించ దలచుకుంటే, ఆ చెట్టు రెమ్మ అతనికి దగ్గరగా వస్తుంది. తర్వాత దానికి కాసిన పండ్లలో ఒకపండు విచ్చుకుంటుంది. అందులో డెబ్భయిరకాల దుస్తులుంటాయి. స్వర్గవాసి వాటిని తీసుకోగానే ఆ రెమ్మ యథాతథంగా మారి తిరిగి తన స్థానంలోకి వెళ్ళిపోతుంది. (తర్గీబ్-ఇబ్నె అబిద్దున్యా)

## అలంకరణలు

ఇహలోకంలో మానవులు అందం కోసం, విలువ కోసం ఖరీదైన దుస్తులు, ఆభరణాలు ధరిస్తారు. స్వర్గంలో అంతకన్నా ఎంతో అందమైన, ఖరీదైన బట్టలు, ఆభరణాలు ఉంటాయి.

**ఆభరణాలు:** "ఇక సత్యాన్ని విశ్వసించి సత్కార్యాలు చేసేవారి విషయానికి వస్తే, అలాంటి సదాచారసంపన్నులకు లభించవలసిన ప్రతిఫలాన్ని మేము ఎన్నటికీ వృధాచేయము. వారి కోసం సెలయేరులు ప్రవహించే నిత్యహరిత స్వర్గవనా లున్నాయి. వారికక్కడ బంగారపు మురుగులతో ముస్తాబు చేస్తారు. వారు బంగారుజరీతో కూడిన పచ్చటి పట్టువస్త్రాలు ధరిస్తారు. అద్భుతమైన ఉన్నతాసనాలపై మెత్తటి దిండ్లకానుకొని కూర్చుంటారు. ఎంత మంచి ప్రతిఫలం అది! అత్యున్నత శ్రేణికి చెందిన నివాసస్థలమది!!" (ఖురాన్-18:30,31)

దైవప్రవక్త (స) హితోక్తి: "స్వర్గంలోని వస్తువులలో ఏదైనా గోరంత వస్తువుని గనక ఇహలోకంలో ప్రదర్శిస్తే భూమ్యాకాశాల మధ్య ఉన్నదంతా ప్రకాశవంతం అవుతుంది. అలాగే స్వర్గవాసుల్లో ఒక పురుషుడు గనక ఇహలోకంలోకి తొంగిచూస్తే, అప్పుడతని చేతి కంకణం ఇహలోకం వైపుకు వచ్చివుంటే సూర్యుడు నక్షత్రాల కాంతిని మందగింప జేసినట్లు ఆ కంకణం సూర్యకాంతిని సైతం మందగింపజేస్తుంది." (తిర్మిజి)

దైవప్రవక్త (స) ప్రవచనం: "స్వర్గవాసులు కిరీటాలు ధరిస్తారు. అందులో పొదిగిన ఓ చిన్నరత్నం తూర్పు నుండి పడమరదాకుండే దూరాన్ని ప్రకాశవంతం చేస్తుంది." (తిర్మిజి)

**దుస్తులు:** అదేవిధంగా స్వర్గవాసుల దుస్తులు కూడా అసాధారణమైన అందం, విలువ కలిగి ఉంటాయి. దివ్యఖుర్ఆన్‌లోని ఈ సూక్తులు చూడండి:

"స్వర్గవాసులు బంగారు జలతారు అంచులుండే పట్టు పరుపులపై మెత్తటి దిండ్లకు ఆనుకొని కూర్చుంటారు. (వారి ముందు) పండ్లతో నిండిన చెట్లరెమ్మలు వంగి ఉంటాయి. కనుక మీరు మీప్రభువు ప్రసాదించే ఏమహాభాగ్యాలు నిరాకరిస్తారు?" (55:54,55); "అక్కడ



స్వర్గవాసులు అత్యంత విలువైన, ఎంతో అపురూపమైన పచ్చటి తివాచీల మీద మెత్తటి దిండ్లకు ఆనుకొని కూర్చుంటారు. కనుక మీరు మీ ప్రభువు అనుగ్రహించే ఏ మహాభాగ్యాలు నిరాకరించగలరు?" (ఖుర్ఆన్-55:76,77)

"ఆ స్వర్గంలో (చల్లటి) సెలయేరులు ఉంటాయి. ఎత్తయిన ఆసనాలుంటాయి. (త్రాగడానికి) మధుపాత్రలు కూడా పెట్టబడి ఉంటాయి. ఇంకా వరుసలు వరుసలుగా దిండ్లు పేర్చిఉంటాయి. పట్టుతివాచీలు పరచిఉంటాయి." (ఖుర్ఆన్-88:12-16)

**బాలసేవకులు :** నేటి వైజ్ఞానిక యుగంలో మనిషికి సేవచేయడానికి తోటి మనుషుల అవసరం క్రమంగా తగ్గిపోతోంది. మానవసేవకులకు బదులు యంత్రసేవకులు వచ్చారు. వీటికి తోడు ఇప్పుడు మనిషికి కట్టుబానిసలుగా సేవచేసే రోబోలు కూడా వస్తున్నాయి. ఈ లోకంలోనే మనిషికి దేవుడు సుఖవంతమైన జీవితం గడపడానికి ఇలాంటి మంచి సౌకర్యాలు ప్రసాదిస్తే ఇక పరలోకంలో తన పుణ్యదాసులకు మరెలాంటి సౌకర్యాలు కల్పించిఉంటాడో కాస్త ఊహించండి.

"వారి సమావేశాలలో నిత్య బాలకులు వారుణీవాహిని నుండి స్వచ్ఛమైన మధువుతో నిండిన గిన్నెలు, గ్లాసులు, కూజాలు తీసుకొని అటూఇటూ తిరుగుతుంటారు." (56:17,18) "వారిసేవ కోసం నిత్యబాలలు అటూఇటూ పరుగిడుతుంటారు. నీవా పిల్లల్ని చూస్తే చెదరిన ఆణిముత్యాల్లా కనిపిస్తారు. నీకక్కడ ఎటుచూసినా రంగ రంగ భోగ భాగ్యాలు, మహోన్నత సామ్రాజ్య వైభవాలు కన్పిస్తాయి." (ఖుర్ఆన్-76:19,20)

ఈ బాలసేవకుల అందం గురించి విన్న అనుచరులు "సేవకులే ఇంత అందంగా ఉంటే ఇక వారిచేత సేవ చేయించుకునేవారు ఇంకెంత అందంగా ఉంటారో!" అన్నారు. దానికి దైవప్రవక్త (స) "నక్షత్రాలపై పూర్ణచంద్రునికి ఎంత ఔన్నత్యం ఉందో ఈ బాలసేవకులపై వారిచేత సేవ చేయించుకునేవారికి అంత ఔన్నత్యం ఉంటుంది" అన్నారు. (మజ్మరీ)

## స్వర్గ మహిళలు

ప్రపంచంలో పురుషుడు సాధారణంగా మంచి తిండి, బట్టలు, ఇండ్ల తర్వాత అత్యున్నత సుఖభోగాల కోసం మద్యం, మగువలకే ప్రాధాన్యం ఇస్తాడు. కాని దేవుడు ఇక్కడ మద్య సేవనాన్ని నిషేధించాడు. అలాగే ఇక్కడ వ్యభిచారాన్ని కూడా నిషేధించి, భార్యలను నలుగురికి పరిమితం చేశాడు. అయితే పరలోకంలో మత్తు కలిగించని మద్యం ప్రసాదిస్తాడు. లైంగికానందం కోసం పుణ్యాత్ములైన భార్యలనే గాకుండా, ఓ ప్రత్యేక సృష్టి అయిన సుందరాంగుల్ని కూడా భార్యలుగా ప్రసాదిస్తాడు. వీరిని ఖుర్ఆన్ పరిభాషలో "హూర్" అంటారు.

"వారికి ఈడు-జోడు, తోడు-నీడగా అక్కడ పవిత్ర సహచరులు కూడా ఉంటారు. ఆ స్వర్గవనాలలో వారు శాశ్వతంగా ఉంటారు." (ఖుర్ఆన్-2:25)

**స్వర్గ పత్నులు:** ఇహలోకంలో ఇస్లాం స్వీకరించి సదాచార సంపన్నురాలయిన స్త్రీలను దేవుడు పరలోకంలో నూతనకన్యలుగా చేసి స్వర్గంలో ప్రవేశపెడ్తాడు. ప్రపంచంలో భార్యాభర్తలు ఇద్దరూ సత్యాన్ని విశ్వసించి సాత్వికజీవితం గడిపివుంటే స్వర్గంలో కూడా వారిద్దరు భార్యాభర్తలు గానే కొనసాగుతారు. ఒకవేళ వారిద్దరిలో ఒకరు మాత్రమే సన్మార్గగామి అయివుంటే, ఆ స్త్రీ లేక పురుషుని వివాహం ఇతర సన్మార్గగాములైన పురుషుడు లేక స్త్రీతో జరుగుతుంది.

"వారి భార్యలను మేము ప్రత్యేక పంథాలో సరికొత్తగా సృజిస్తాము. వారిని మేము నిత్యనూతన కన్యలుగా రూపొందిస్తాము. వారు తమ భర్తలను అమితంగా ప్రేమిస్తారు. సమవయస్కులైన సతులు వారు." (ఖుర్ఆన్-56:35-38) "వారి దగ్గర పరపురుషుడ్ని కన్నెత్తి కూడా చూడని, విశాలాక్షులుంటారు." (ఖుర్ఆన్-37:48)

ఒక వృద్ధురాలు వచ్చి "దైవప్రవక్తా! దేవుడు నాకు స్వర్గం ప్రసాదించమని ప్రార్థన చేయండి" అని విన్నవించుకుంది. అప్పుడు దైవప్రవక్త (స) "స్వర్గంలో వృద్ధులు ప్రవేశించ లేరు" అన్నారు. వృద్ధురాలు ఈమాట విని లబోదిబో అంటూ అక్కడ్నుంచి కదలి ఇంటిదారి పట్టింది. వెంటనే దైవప్రవక్త (స) అనుచరుల్ని ఉద్దేశించి "వెళ్ళి ఆ ముసలమ్మకు చెప్పండి నామాటకు అర్థం ఆమె స్వర్గానికి పోదని కాదు. వృద్ధులు కూడా యువతీయువకులుగా మారి స్వర్గానికి పోతారని చెప్పండి" అని అన్నారు. (తిర్మిజి)

దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "ఒక ఉదయం లేదా సాయంత్రం దైవమార్గంలో (అంటే ధర్మసంస్థాపన కోసం) బయలుదేరి వెళ్ళడం యావత్తు ప్రపంచం, ప్రపంచంలోని సమస్తం కంటే ఎంతో శ్రేష్ఠమయినది. స్వర్గంలోని స్త్రీలలో ఒక స్త్రీ గనక భూలోకంలోకి తొంగిచూస్తే భూమ్యాకాశాల మధ్య ఉన్నదంతా కాంతిమంతం అవుతుంది; సువాసనతో గుబాళిస్తుంది... ఆమె తల మీది వస్త్రం యావత్తు ప్రపంచం, ప్రపంచంలోని సమస్తం కంటే ఎంతో శ్రేష్ఠమయినది." (బుఖారి)

దైవప్రవక్త (స) ప్రవచనం: "స్వర్గ పురుషుడు (తన) స్వర్గస్త్రీ ముఖాన్ని చూస్తే ఆమె చెంపలు అతనికి అద్దంకంటె కూడా ఎంతోనున్నగా కన్పిస్తాయి. స్వర్గస్త్రీ ధరించిన ముత్యాలలో ఓ చిన్నముత్యమే తూర్పు, పడమరల మధ్య ఉండే యావత్తు ప్రాంతాన్ని కాంతి మంతం చేసేస్తుంది. ఆమె శరీరంపై డెబ్బయి జతల బట్టలు ఉంటాయి. అయినప్పటికీ (భర్త) దృష్టి (కాంతిమంతమైన) ఆమె దేహంలోకి చొచ్చుకుపోతుంది. స్వర్గంలోని ఆమెభర్త ఆమె దుస్తులలోని ఆమె పిక్కను సైతం చూడగలుగుతాడు." (అహ్మద్)

**స్వర్గకన్యల సౌందర్యం:** సత్యాన్ని విశ్వసించి సత్కర్మలు ఆచరిస్తూ చనిపోయిన స్త్రీలనే గాకుండా స్వర్గంలో కొత్తగా సృజించబడిన సుందరాంగుల్ని కూడా పురుషులకు భార్యలుగా ఇవ్వడం జరుగుతుంది. ఖుర్ఆన్‌లోని ఈ దిగువ సూక్తులు చూడండి:

"ఆ స్త్రీలు కోడిగుడ్డు పెంకు క్రింద ఉండే సున్నితమైన పొరలాంటి కోమలాంగులు." (ఖుర్ఆన్-37:49,50). "వారికి మేము ఎర్రటి దేహచ్ఛాయతో విశాలనేత్రాలుగల సుంద రాంగుల్ని ఇచ్చి వివాహం చేస్తాము." (ఖుర్ఆన్-44:54).

"వారికోసం అక్కడ అందమైన కళ్ళుగల సుందరాంగులు ఉంటారు. ప్రత్యేకంగా వారి కోసమే దాచిపెట్టిన ముత్యాల వంటి ముగ్ధమనోహర సౌందర్యరాసులు వారు." (ఖుర్ఆన్-56:22,23)

"ఆ మహాభాగ్యాల మధ్య (వారి కోసం) సిగ్గులొలికించే స్వర్గ కన్యలుంటారు. వారిని ఈ స్వర్గవాసులకు పూర్వం ఏ మానవుడుగాని, జిన్‌గాని తాకనైనా తాకిఉండడు. కనుక మీరు మీ ప్రభువు ప్రదానం చేసే ఏ బహుమానాలు తిరస్కరించగలరు? వారు మణి



మాణిక్యాల్లా అసామాన్య సౌందర్యరాసులు. మరి మీరు మీ ప్రభువు ప్రసాదించే ఈ బహుమానాలు కాదనగలరా?" (ఖుర్ఆన్-55:56-58)

**స్వర్గకన్యల ప్రార్థన, పాటలు-** దైవప్రవక్త (స) ప్రవచనం: "రమజాన్ కోసం సంవత్సరారంభం నుండి సంవత్సరాంతం వరకు స్వర్గం మరింత అందంగా అలంకరించ బడుతుంది. రమజాన్ నెల మొదటి తేదీ రాగానే స్వర్గవనాల నుండి దైవసింహాసనం క్రింద ఉండే సుందరాంగు (హూర్)ల వైపు (హృదయాల్ని గిలిగింతలుపెట్టే చల్లటి (పిల్ల) గాలులు వీస్తాయి. దాంతో ఆ సుందరాంగులు ప్రభావితులై ఇలా దేవుడ్ని ప్రార్థిస్తారు: 'మా ప్రభువా! నీ దాసులలో నుంచి మాకోసం మంచి భర్తలు నిర్ణయించు. వారి ద్వారా మా కళ్ళు చల్లబడేలా, మాద్వారా వారి కళ్ళు చల్లబడేలా చెయ్యి." (బైహఖీ)

దైవప్రవక్త (స) హితోక్తి : "భూలోకంలో ఏ భార్య అయినా తన భర్తను వేధిస్తుంటే, స్వర్గ కన్యలలోని ఆ పురుషుని భార్య ఇహలోక భార్యతో ఇలా అంటుంది- 'నీ పాడుగాను! ఎందుకు ఆయన్నలా వేధిస్తావు, వేధించకు. ఆయన నీదగ్గర కొన్నాళ్ళు మాత్రమే ఉండే అతిథి లాంటివాడు. ఆ తర్వాత ఆయన నిన్ను వదలి మా దగ్గరకు వచ్చేస్తాడు." (తిర్మిజి)

దైవప్రవక్త (స) ప్రవచనం: 'స్వర్గంలో సుందరాంగులు సమావేశమయ్యే ఓ చోటుంది. వారక్కడకు చేరుకొని ఇలా పాడుతారు- 'మేము శాశ్వతంగా జీవించే వాళ్ళం. మాకెన్నడూ మరణంరాదు. మేము సదా సుఖసంతోషాలలో తేలియాడుతుంటాం. లేమి మా దరిదాపు లకేరాదు. మేము మాభర్తలతో సంతోషంగా ఉంటాం. వాళ్ళను ఎన్నడూ విసిగించం. ఆయన మాకోసం, మేమాయన కోసం!' వారి పాట ఎంతో రాగయుక్తంగా, లయబద్ధంగా ఇంతవరకు ఎవరూ పాడనటువంటి మధుర కంఠంతో పాడుతారు." (తిర్మిజి)

**భూలోకస్త్రీలకు, స్వర్గకన్యలకు తేడా:** విశ్వాసుల మాతృమూర్తి హజ్రత్ ఉమ్మె సల్మా (రజి) తనకు, దైవప్రవక్త (స)కు మధ్య జరిగిన ఓ సంభాషణను ఇలా పేర్కొన్నారు:-

ఉమ్మెసల్మా (రజి): దైవప్రవక్తా! స్వర్గంలో భూలోక స్త్రీలు ఎక్కువ శ్రేష్ఠులా లేక స్వర్గ కన్యలు (హూర్) ఎక్కువ శ్రేష్ఠులా?

దైవప్రవక్త (స): (తలగడకు) పైనుండే వస్త్రంకంటే లోపలుండే వస్త్రం ఎక్కువ శ్రేష్ఠమైన దయినట్లు స్వర్గకన్యల కంటే భూలోక స్త్రీలే ఎక్కువ శ్రేష్ఠులవుతారు.

ఉమ్మెసల్మా (రజి): ఎందువల్ల దైవప్రవక్తా!

దైవప్రవక్త (స): ఎందువల్ల అంటే భూలోక స్త్రీలు నమాజ్ చేస్తారు; ఉపవాసాలు పాటిస్తారు; దైవారాధనలో జీవితం గడుపుతారు.

ఉమ్మెసల్మా (రజి): ఇహలోకంలో కొంతమంది స్త్రీలు ఒకరితర్వాత మరొకరు ఇద్దరు ముగ్గురు లేక నల్గురు పురుషుల్ని వివాహమాడుతారు కదా! అలాంటప్పుడు ఆ స్త్రీ, ఆమె భర్తలు చనిపోయి స్వర్గానికి వెళ్తే వారిలో ఆమెకు ఎవరు భర్త అవుతారు?

దైవప్రవక్త (సల్లం): అప్పుడు ఆమె కోరుకున్న పురుషుడ్ని చేసుకునే స్వేచ్ఛ లభిస్తుంది. అలాంటి స్థితిలో ఆస్త్రీ నైతికంగా వారిలో ఎవరెక్కువ శ్రేష్ఠులో అతడ్ని కోరుకుంటుంది.

ఆ సందర్భంలో ఆమె దేవునితో 'ప్రభూ! ఇహలోకంలో ఇతను నా పట్ల వీరందరికంటే ఎక్కువ సద్వర్తనంతో మెలిగాడు. అంచేత ఇతడ్నే నాకు భర్తగా చెయ్యి' అని మనవి చేసుకుంటుంది. ఉమ్మెసల్మా! సద్గుణసంపత్తి ఇహపరలోకాల మేళ్ళనిటినీ తీసుకొని (స్వర్గానికి) ఎగిరిపోతుంది. (తర్గీబ్ వ తర్హీబ్)

## బహుభార్యత్వం

స్వర్గంలో ఒక పురుషునికి ఎంతమంది భార్యలు లభిస్తారనే విషయంలో విభిన్న ఉల్లేఖనాలు ఉన్నాయి. దీన్నిగురించి హాఫిజ్ ఇబ్నెహజర్ (రహ్మాలై) ఫత్‌హుల్‌బారీ గ్రంథంలో అనేక హదీసుల్ని ఉదాహరిస్తూ విపులంగా చర్చించారు.

బుఖారీలోని ఒక ఉల్లేఖనంలో ఒక పురుషునికి (స్వర్గకన్యల నుంచి) ఇద్దరు భార్యలు ఉంటారని ఉంది. ముస్నద్ అహ్మద్‌లోని ఒక ఉల్లేఖనంలో తక్కువ హోదా కలిగిన స్వర్గవాసికి (ఇద్దరు) భూలోకభార్యలతో పాటు మరో డెబ్భయిఇద్దరు (స్వర్గకన్యలు) భార్యలు ఉంటారని ఉంది. అబూయాలా హదీసు ప్రకారం ఒక స్వర్గవాసికి మానవులలో ఇద్దరు భార్యలు, దేవుడు ప్రత్యేకంగా సృష్టించిన స్వర్గకన్యలలో డెబ్భయి ఇద్దరు భార్యలు ఉంటారని తెలుస్తోంది.

ఇబ్నెమాజాలో ఒక స్వర్గవాసికి స్వర్గకన్యల నుండి 72 మంది, భూలోకస్త్రీల నుండి 72 మంది లభిస్తారని ఉంది. ఫత్‌హుల్‌బారి వ్యాఖ్యానకర్త హాఫిజ్ ఇబ్నెహజర్ (రహ్మాలై) ఇవే కాకుండా ఇంకా అనేక ఉల్లేఖనాలు ఉదాహరించారు. మొత్తం మీద పై ఉల్లేఖనాలను బట్టి స్వర్గవాసికి స్వర్గంలోని ఇతర అనేక మహాభాగ్యాలతోపాటు బహుభార్యలను కూడా ప్రసాదించడం జరుగుతుందని, ప్రతి స్వర్గవాసికి కనీసం ఇద్దరు భార్యలైనా లభిస్తారని తెలుస్తోంది. కాకపోతే స్వర్గవాసుల పుణ్యకర్మలు, వారి హోదా అంతస్తుల్ని బట్టి వారి భార్యలసంఖ్య ఉంటుంది.

స్వర్గంలో ఏస్త్రీ కూడా బహుభర్తృత్వం సంగతి మనసులోనికే రానివ్వదు. ఖుర్ఆన్ స్వర్గ స్త్రీల లజ్జా స్వభావాన్ని ఎలా వర్ణించిందో చూడండి:

"వారు తమ భర్తలను అమితంగా ప్రేమిస్తారు." (56:38) "వారి దగ్గర పర పురుషుడ్ని కన్నెత్తి కూడా చూడని, విశాలాక్షులు ఉంటారు." (ఖుర్ఆన్–37:48)

**పురుషుని లైంగికశక్తి :** స్వర్గంలో పురుషులకు అనేకమంది భార్యలు ఉంటారు గనక, వారి లైంగికశక్తిని కూడా పెంచడం జరుగుతుంది.

హజ్రత్ జైద్ బిన్ అర్ఖం (రజి) కథనం: గ్రంథప్రజలలో (యూదులలో) ఒకతను దైవప్రవక్త (స) సన్నిధికి వచ్చి "అబుల్‌ఖాసిం! స్వర్గవాసులు తినడం, తాగడం చేస్తారని చెబుతున్నారా మీరు?" అని ప్రశ్నించాడు. దానికి దైవప్రవక్త (స) సమాధానమిస్తూ "నా ప్రాణం ఎవరి అధీనంలో ఉందో ఆ శక్తిస్వరూపుని సాక్షిగా చెబుతున్నాను. ఒక స్వర్గ వాసికి తినడం, తాగడం, సంభోగించే వ్యవహారాల్లో వందమంది (ఇహలోక) పురుషుల కుండే శక్తిసామర్థ్యాలు ప్రసాదించబడతాయి" అని అన్నారు.

ఆ యూదుడు ఈమాట విని "తినడం, తాగడం చేస్తే మలమూత్రాలు విసర్జించ వలసివస్తుంది కదా! కాని స్వర్గం ఎలాంటి బాధలుండే స్థలం కాదు మరి?" అని అన్నాడు. దానికి దైవప్రవక్త (స) ఇలా చెప్పారు: "(తిన్నా, తాగినా) వారికి మలమూత్ర విసర్జన



అవసరమే రాదు. (ఆహారపానీయాల వల్ల) నిండిపోయిన కడుపు ఖాళీ అవడానికి వారి దేహాల నుండి కస్తూరీ సువాసనతోకూడిన చెమట వెలువడుతుంది. దాంతో వారి కడుపులు తేలికవుతాయి." (అహ్మద్, నిసాయి)

మోజ్జముల్ కబీర్ ఉల్లేఖనం ప్రకారం "స్వర్గవాసి (తన భార్యతో) సంభోగిస్తాడు. అయితే అతని మర్మావయవం బలహీనమవడంగాని, లైంగికేచ్ఛ ఉద్రేకాలు తగ్గిపోవడం గాని జరగదు. అలాగే పురుషుడికి, స్త్రీకి వీర్యం వెలువడదు." (తబ్రాని)

**శిశుజన్మలు ఉండవు :** స్వర్గంలో సాధారణంగా ఎవరూ తమకు పిల్లలు పుట్టాలని కోరుకోరు. ఒకవేళ ఎవరైనా పిల్లలు పుట్టాలని కోరుకుంటే వెంటనే గర్భధారణ, శిశుజన్మ, శిశువు పెరిగి యుక్తవయస్సుకు చేరుకోవడం అన్నీ క్షణాల్లో జరిగిపోతాయని తిర్మిజీలోని ఒక హదీసు ద్వారా తెలుస్తోంది. అయితే తిర్మిజీ గ్రంథంలోనే మరొక హదీసులో "స్వర్గంలో స్వర్గవాసులకు పిల్లలు పుట్టర"ని దైవప్రవక్త (స) అన్నారు.

## సూపర్ మార్కెట్‌లో సూపర్ విజన్

భూలోకంలో ఉన్నట్లే స్వర్గలోకంలో కూడా షాపులుంటాయి. అయితే ఆ షాపుల్లో అమ్మకం కొనుగోళ్ళు ఉండవు. స్వర్గవాసి తనకిష్టమైన వస్తువుని నిస్సంకోచంగా తీసుకుంటాడు.

దైవప్రవక్త (స) ఇలా అన్నారు: "స్వర్గంలో ఒక మార్కెట్ ఉంది. అక్కడ అమ్మకం, కొనుగోళ్ళు ఉండవు. ఆ మార్కెట్‌లో స్త్రీ పురుషుల చిత్రాలు ఉంటాయి. ఎవరైనా స్వర్గవాసి వాటిని చూసి "ఫలానా చిత్రంలోని మనిషిముఖం మాదిరిగా నాముఖం ఉంటే బాగుంటుంది" అని మనసులో అనుకుంటాడు. అలా అనుకోవడమే తడవు, అతని ముఖం ఆ చిత్రంలోని ముఖంలా మారిపోతుంది." (తిర్మిజి)

**ద్విగుణీకృత సౌందర్యం-** దైవప్రవక్త (స) ప్రవచనం: "స్వర్గంలో ఒక బజారు ఉంది. స్వర్గవాసులు ప్రతి శుక్రవారం అక్కడికి వెళ్తారు. అక్కడ (ఒక విధమైన) ఉత్తరగాలి వీస్తూ స్వర్గవాసుల ముఖాలపై, దుస్తులపై సువాసన వెదజల్లుతుంది. దాంతో వారి అందం ద్విగుణీకృతమవుతుంది. ఇలా వారు ఎంతో అందంగా మారి తమతమ ఇండ్లకు వెళ్ళిపోతారు. వారి భార్యలు వాళ్ళను చూసి 'దైవసాక్షి! మీరు మానుండి వేరైపోయాక మీ అందం రెట్టింపయింది' అనంటారు. వారీ మాట విని 'దైవసాక్షి! మేము మీ దగ్గర్నుంచి వెళ్ళిపోయాక మీ అందం కూడా రెట్టింపయింది' అనంటారు." (ముస్లిం)

దైవప్రవక్త (స) ప్రవచనం: "స్వర్గవాసులు స్వర్గంలో ప్రవేశించిన తర్వాత తమతమ కర్మల్నిబట్టి హోదాఅంతస్తులు పొందుతారు. ఆ తర్వాత ఇహలోకపు రోజులలో శుక్రవారం రోజంతటి వ్యవధిలో వారికి తమ ప్రభువును దర్శించుకునే అనుమతి లభిస్తుంది. కనుక వారు తమ ప్రభువుని దర్శించుకుంటారు. అప్పుడు దేవుడు తన సింహాసనాన్ని బహిర్గతం చేస్తాడు. తన దర్శనభాగ్యం కల్గించడానికి ఆయన ఒక పెద్ద వనంలో ప్రత్యక్షమవుతాడు.

(అక్కడ) వారి కోసం జ్యోతిర్మయ కుర్చీలు, వజ్ర పీఠాలు, ముత్యపు ఆసనాలు, బంగారు కుర్చీలు, వెండి పీఠాలు వేయబడతాయి. (స్వర్గవాసులు తమతమ హోదాలను బట్టి ఆయా పీఠాలపై ఆసీనులవుతారు.) గౌరవప్రపత్తుల దృష్ట్యా (అందరూ సమానులే.)

వారిలో ఎవరూ అల్పులు కారు. హోదాల దృష్ట్యా అందరికంటే తక్కువ హోదా కలిగినవారు కస్తూరీ గుట్టలపై కూర్చుంటారు. గుట్టలపై కూర్చున్నవారు తమ కంటే కుర్చీలపై కూర్చున్నవారు శ్రేష్ఠులని ఎంతమాత్రం భావించరు.

హజ్రత్ అబూహురైరా (రజి) మాట్లాడుతూ "దైవప్రవక్తా! మేము మా ప్రభువును చూడగల్గుతామా?" అని అడిగారు. దానికి దైవప్రవక్త (స) "సూర్యుడ్ని, పూర్ణచంద్రుడ్ని చూడటంలో మీకేమైనా అనుమానం కల్గుతుందా?" అన్నారు. కల్గదన్నారు అనుచరులు. అప్పుడు దైవప్రవక్త (స) ఇలా చెప్పారు:

"అదేవిధంగా మీరు మీ ప్రభువును చూడటంలో కూడా ఎలాంటి అనుమానం ఉండదు. ఆ సమావేశంలో దేవుడు ప్రతిఒక్కరి ముందుండి సంభాషిస్తాడు. చివరికి వారిలో కొందరిని 'ఫలానామనిషి కొడుకు ఫలానామనిషీ! నీవు ఫలానారోజు ఇలా అన్నావు, గుర్తుందా?' అని ప్రశ్నిస్తాడు. అలా దేవుడు అతను ఇహలోకంలో చేసిన ప్రమాణభంగాలు కొన్నిటిని గుర్తుచేస్తాడు. ఆ మనిషి ఈమాట విని 'ప్రభూ! మీరు నన్ను క్షమించలేదా?' అంటాడు. దానిపై దేవుడు మాట్లాడుతూ 'ఆ... క్షమించాను. నేను విశాల హృదయంతో క్షమించడం వల్లనే నువ్వీనాడు ఈ స్థాయికి చేరుకున్నావు' అనంటాడు."

స్వర్గవాసులు ఇలా దేవుడ్ని దర్శిస్తుండగానే ఒక మేఘమాలిక వచ్చి ఘూటైన సువాసన వారిపై వదలుతుంది. అలాంటి సువాసన వారంతకు ముందెన్నడూ ఆఘ్రాణించిఉండరు. ఆ తరువాత దేవుడు వారితో 'ఇక లేవండి. నేను మీ గౌరవప్రతిష్ఠల కోసం తయారుచేసిన దాని దగ్గరకు పదండి. అందులో మీకు నచ్చింది తీసుకోండి' అని అంటాడు. ఆ తరువాత మనమంతా ఒక బజారులోకి అడుగుపెడ్తాము. దాన్ని దైవదూతలు పర్యవేక్షిస్తుంటారు. ఆ బజారులో ఎవరి కళ్ళూ చూడని, ఎవరి చెవులూ వినని, ఎవరి హృదయంలో జనించని అత్యంత మనోహరమైన వస్తువులు ఉంటాయి. మనం ఆ వస్తువులలో మనకు నచ్చిన వాటిని తీసుకుంటాము. అక్కడ ఏవిధమైన అమ్మకం, కొనుగోళ్ళు ఉండవు.

ఆ బజారులో స్వర్గవాసులు పరస్పరం కలుసుకుంటారు. ఒకరికంటే ఒకరు అధికులు, అల్పులనే భావన లేనప్పటికీ పెద్దహోదా కలిగిన ఒకతను చిన్నహోదా కలిగిన ఒకతడ్ని కలుసుకుంటాడు. అప్పుడు చిన్నహోదా స్వర్గవాసికి పెద్దహోదా స్వర్గవాసి ధరించిన దుస్తులు ఎంతగానో నచ్చుతాయి. చిన్నహోదా స్వర్గవాసిలో ఈ ఆలోచన కలగగానే పెద్దహోదా స్వర్గవాసి దుస్తుల కంటే తన దుస్తులే బాగున్నట్లు అన్పిస్తుంది. దానిక్కారణం స్వర్గంలో ఎవరికీ ఎలాంటి బాధ, వేదన కలిగే అవకాశమివ్వడం జరగదు.

ఆ తరువాత మనం ఎవరి ఇండ్లకు వారు వెళ్ళిపోతాము. ఇలా మనం ఇండ్లకు చేరుకోగానే మన భార్యలు మనకు స్వాగతం చెబుతారు. తరువాత వారు మనతో మాట్లాడుతూ 'మీరు మా దగ్గర్నుండి వెళ్ళిపోయిన తరువాత ఇప్పుడు ఎంత సౌందర్యంతో తిరిగొచ్చారు!' అని అంటారు (ఆశ్చర్యంతో). దానికి మనం 'మాకీ రోజు మా ప్రభువు దర్శనభాగ్యం లభించింది. అంతటి మహాభాగ్యం పొందిన మేము అదే ఠీవి, దర్పాలతో తిరిగొచ్చాం మరి" అని అంటాము." (తిర్మిజి)



## ఇష్టాగోష్ఠులు

స్వర్గవాసులు ఇష్టాగోష్ఠులు కూడా జరుపుకుంటారు. వారి సమావేశాల్లో ప్రాపంచిక విషయాలను గురించి ప్రస్తావనలు ఉంటాయి. వారి ఇష్టాగోష్ఠులను గురించి ఖుర్ఆన్ ఇలా పేర్కొంటున్నది:

**స్వర్గవాసుల మాటలు :** "వారు(ఈ వైభవాలు చూసి) 'సకల స్తోత్రాలు దేవునికే శోభిస్తాయి. ఆయనే మాకీ మార్గం చూపించాడు. ఆయన గనక మాకు సన్మార్గం చూపక పోయిఉంటే మాఅంతట మేమీ మార్గం పొందగలిగేవారం కాము. మా ప్రభువు పంపిన ప్రవక్తలు నిజంగా సత్యాన్నే తెచ్చారు' అనంటారు." ఆ సమయంలో 'మీరీ స్వర్గానికి వారసులయ్యారు. మీరు చేసుకున్న కర్మలకు ప్రతిఫలంగా ఈస్వర్గం మీకు లభించింది' అని అశరీరవాణి విన్పిస్తుంది." (ఖుర్ఆన్-7:43)

"ఆ దాసులు ఒకరివైపు మరొకరు తిరిగి కబుర్లు చెప్పుకుంటారు. వారిలో ఒకడు ఇలా అంటాడు: "ప్రపంచంలో నాకో స్నేహితుడుండేవాడు. అతను నాతో 'నువ్వు కూడా సమర్థించే వారిలో చేరిపోయావా? మనం చనిపోయి మట్టిలో కలిసి అస్తిపంజరాల్లా మారిన తరువాత నిజంగా మనకు (మన) కర్మలఫలం ఇవ్వడం జరుగుతుందంటావా?' అని అంటుండేవాడు. అతనిప్పుడు ఎలా ఉన్నాడో మీరు చూడాలనుకుంటున్నారా?"

ఈమాట చెప్పి అతను నరకంలోకి తొంగిచూస్తాడు. ఆ వ్యక్తి నరకంలో అట్టడుగు భాగాన కన్పిస్తాడు. అతడ్ని పిలిచి "దైవసాక్షి! నీవు నన్ను సర్వనాశనం చేసి ఉండేవాడివి. నా ప్రభువు నన్ను కటాక్షించి ఉండకపోతే, ఈరోజు నేను కూడా (నీలాగే) పట్టుబడి వచ్చినవారిలో ఒకణ్ణయి ఉండేవాడ్ని. సరే, (స్వగతంలో) ఇప్పుడు మనం ఎన్నటికీ చని పోముకదూ! మనకు రావలసిన మృత్యువేదో ఇదివరకే వచ్చింది. ఇక మనకు ఎలాంటి శిక్షా ఉండదుకదూ!" అని అంటాడు." (ఖుర్ఆన్-37:51-60)

హజ్రత్ అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి) ఉల్లేఖన ప్రకారం స్వర్గంలో నరకవాసుల్ని చూడటానికి కిటికిల్లాంటి కన్నాలుంటాయి. వాటిలో నుంచి స్వర్గవాసులు నరకవాసుల్ని నేరుగా చూస్తారు.

"వారు (ప్రపంచ విశేషాల్ని గురించి) పరస్పరం మాట్లాడుకుంటారు. 'మనం ఇంతకు పూర్వం మన ఇండ్లలో బిక్కుబిక్కుమంటూ జీవితం గడుపు తుండేవాళ్ళం. చివరికి దేవుడు మనల్ని కరుణించి (ముఖాలను) మాడ్చివేసే వడగాల్పుల యాతనల నుండి రక్షించాడు. మనం గత జీవితంలో (ఏ కష్టమొచ్చినా) ఆయన్నే వేడుకునేవాళ్ళము. నిజంగా ఆయన మహోపకారి, అపార దయామయుడు' అని చెప్పుకుంటారు." (ఖుర్ఆన్-52:25-28)

**స్వర్గ నరకవాసుల సంభాషణ :** "ఆ తర్వాత స్వర్గవాసులు నరకవాసుల్ని పిలిచి 'మా ప్రభువు మాకు చేసిన వాగ్దానాలన్నీ నెరవేరాయి. మరి మీరు కూడా మీ ప్రభువు చేసిన వాగ్దానాలు నెరవేరాయని తెలుసుకున్నారా?' అనడుగుతారు. దానికి వారు 'ఆ...తెలుసుకున్నాం' అంటారు. అప్పుడు ఓ ప్రకటనకర్త వారి మధ్యకు వచ్చి 'దేవుని మార్గంలోకి రాకుండా ప్రజల్ని నిరోధించిన దుర్మార్గులపై దైవశాపం విరుచుకుపడుగాక! వారు దైవమార్గాన్ని వక్రీకరించదలిచారు, పరలోకాన్ని తిరస్కరించారు' అని అంటాడు." (ఖుర్ఆన్-7:44,45)

“నరకవాసులు స్వర్గవాసుల్ని కేకవేసి పిలిచి ‘(మేమిక్కడ మాడి చస్తున్నాం) మా మీద కొంచెం నీళ్ళు చల్లండి. లేదా మీకు దేవుడు ప్రసాదించిన దాన్నయినా కాస్త మావైపు విసిరేయండి’ అనంటారు. దానికి స్వర్గవాసులు ‘దేవుడు ఈ రెండిటినీ సత్యతిరస్కారులకు నిషేధించాడు. వారు తమ ధర్మాన్ని ఆటగా, వినోదంగా చేసుకున్నారు. ప్రాపంచిక జీవితం వారిని మోసగించింది’ అని సమాధానమిస్తారు.” (ఖుర్ఆన్–7:50,51)

## 124. మనసును కరిగించే మాటలు

దైవప్రవక్త (స) (అనుచరులకు హితోపదేశం చేస్తూ ఇలా అన్నారు: “ఏడు రకాల అవస్థలు దాపురించకముందే మంచిపనులు చేయడానికి త్వరపడండి. మీరు (ధర్మాన్ని) మరచిపోయేలా చేసే పేదరికం కోసం ఎదురు చూస్తున్నారా? హద్దుమీరి ప్రవర్తించేలాచేసే కలిమి కోరుకుంటున్నారా? ఆరోగ్యం పాడుచేసే రోగం కోసం ఎదురుచూస్తున్నారా? లేక బుద్ధి-వివేకాల్ని పోగొట్టే వృద్ధాప్యం కోసం ఎదురు చూస్తున్నారా? లేక తృటిలో ప్రాణం తీసే చావు కోసం ఎదురుచూస్తున్నారా? లేక కనిపించని కీడుల్లో అత్యంత హానికరమైన దజ్జాల్ రాక కోసం ఎదురుచూస్తున్నారా? లేక ప్రళయం కోసం ఎదురుచూస్తున్నారా? ప్రళయమైతే ఎంతో భయంకరమైనది, చేదైనది.” (తిర్మిజీ)

దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: “పేదవాడై ఉండటమేగాకుండా అత్యధిక సంతానం కలవాడైనప్పటికీ క్రమం తప్పక బాగా నమాజ్ చేస్తూ ఎవరి గురించి కూడా చెడు మాట్లాడకుండా (సాత్విక) జీవితం గడిపేవాడు ప్రళయదినాన నాతో పాటు నాయీ రెండు వ్రేళ్ళు దగ్గర దగ్గరగా ఉన్నట్లు ఉంటాడు.” (తర్గీబ్ వ తర్హీబ్)

దైవప్రవక్త (స) దేవుని మాటలు ఇలా వ్యక్తపరిచారు: “నా మిత్రునితో విరోధం పెట్టుకునేవాడిపై నేను యుద్ధం ప్రకటిస్తున్నాను. నేను నా దాసుడిపై విధిగా చేసిన విషయాలను ఆచరించి అతను నాకు దగ్గరయితే అంతకన్నా నాకు ప్రీతికరమైన విషయం మరొకటి లేదు. నా దాసుడు ఐచ్ఛిక సత్కార్యాల ద్వారా కూడా నాకు దగ్గరవుతుంటాడు. క్రమంగా నేనతణ్ణి ప్రేమిస్తాను. నేనతణ్ణి ప్రేమించడం మొదలెడితే, (క్రమంగా) నేను అతను వినే చెవినై పోతాను, అతను చూసే కంటినై పోతాను, అతను పట్టుకునే చేయినై పోతాను, అతను నడిచే కాలునై పోతాను, అతను నన్నేదైనా అడిగితే నేనతనికి తప్పకుండా ఇస్తాను. దేన్నుండయినా శరణువేడితే నేనతనికి తప్పక శరణు ఇస్తాను. (బుఖారీ)

దైవప్రవక్త (స) దేవుని మాటలు ఇలా తెలిపారు: “దాసుడు నాకు జానెడు దూరం దగ్గరయితే నేనతనికి మూరెడు దగ్గరవుతాను. అతను మూరెడు దగ్గరైతే నేను బారెడు దగ్గరవుతాను. అతను నావైపు నడచివస్తే నేనతని వైపుకు పరుగెత్తుకువస్తాను.” (బుఖారీ)

దైవప్రవక్త (స) ప్రవచనం: “రెండు వరాలున్నాయి. వాటి దుర్వినియోగం వల్ల అనేకమంది నష్టపోతున్నారు. అవి- ఆరోగ్యం, తీరిక.” (బుఖారీ)

దైవప్రవక్త (స) ఇలా తెలియజేశారు: “నరకం మనోవాంఛలతో ఆవరించబడి ఉంది. స్వర్గం అవాంఛనీయమైన విషయాలతో కప్పబడిఉంది. (బుఖారీ, ముస్లిం)



దైవప్రవక్త (స) సూక్తి: దేవుడు మనిషిని అరవైయేండ్ల దాకా బ్రతికుండేటట్లు అతని మరణాన్ని వాయిదావేస్తే ఇక అతని కోసం ఎలాంటి సాకులు వదలనట్లే. (బుఖారీ)

దైవప్రవక్త(స) అన్నారు: “మీరు చూడలేని విషయాలు నేను చూస్తున్నాను. ఆకాశం కిక్కిరిసిపోతోంది. కిక్కిరిసిపోక తప్పదుకూడాను! అక్కడ నాలుగంగుళాల ఖాళీ స్థలమైనా లేకుండా ప్రతిచోటా దైవదూతలు తమ నుదుటితో దైవానికి సాష్టాంగ ప్రణామాలు చేస్తున్నారు. దైవసాక్షి! నాకు తెలిసిన విషయాలు మీకు తెలిస్తే మీరు తక్కువగా నవ్వుతారు, ఎక్కువగా ఏడుస్తారు. (అంతేకాదు) మీరు మీభార్యల దగ్గర పొందే పడకసుఖాన్ని కూడా వదలి దేవుణ్ణి వేడుకుంటూ (ఎడారి) దారులు పట్టిపోతారు.” (తిర్మిజీ)

దైవప్రవక్త (స) తన అనుచరులతో ఇలా అన్నారు: “ప్రళయశంఖం పూరించేవాడు శంఖం నోటి దగ్గర పెట్టుకొని (పూరించటానికి సిద్ధంగా) ఉన్నాడు. శంఖం పూరించటానికి దేవుని అనుమతి ఎప్పుడు లభిస్తుందా అని చెవులు రిక్కించి ఎదురుచూస్తున్నాడు. అలాంటప్పుడు నేను నవ్వుతూ, త్రుళ్ళుతూ ఎలా ఉండగలను!” ఈమాట వినగానే అనుచరులు భయంతో వణికిపోయారు. అది గమనించి దైవప్రవక్త “(భయపడకండి) హస్బునల్లాహు వనీమల్ వకీల్ (మాకు దేవుడున్నాడు. ఆయనే శ్రేష్ఠుడైన కార్యసాధకుడు) అని అనండి” అంటూ వారికి ధైర్యం చెప్పారు. (తిర్మిజీ)

దైవప్రవక్త (స) హితోక్తి: “భయపడినవాడు తెల్లవారకముందే బయలుదేరుతాడు. తెల్లవారకముందే బయలుదేరినవాడు గమ్యానికి చేరుకుంటాడు. వినండి! అల్లాహ్ బేరం ఎంతో విలువైనది. జాగ్రత్తగా వినండి! అల్లాహ్ బేరమంటే స్వర్గమే!” (తిర్మిజీ)

ఓసారి అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (రజి) ఉపవాసం ఉన్నప్పుడు (ఇఫ్తార్ వేళ) అన్నం వడ్డించబడింది. అప్పుడాయన ఇలా అన్నారు: “ముస్అబ్ బిన్ఉమైర్” అమరగతుడయ్యాడు. ఆయన నాకన్నా గొప్పవాడు. ఆయన అంత్యక్రియలు జరిపినప్పుడు ఒక (చిన్న)దుప్పటి మాత్రమే ఉంది. దాంతో ఆయన ముఖాన్ని కప్పితే ఆయన కాళ్ళు బయటికి కనిపించేవి. కాళ్లను కప్పితే ముఖంపై ఆచ్ఛాదనం ఉండేది కాదు. ఆ తర్వాత మనకు ఎంత సమృద్ధిగా ప్రాపంచిక సిరిసంపదలు ప్రసాదించబడ్డాయో మీరు చూస్తునే ఉన్నారు. కాని ఈ సిరిసంపదలు చూస్తుంటే మనం చేసుకున్న పుణ్యకార్యాలకు ప్రతిఫలం ప్రపంచంలోనే ఇవ్వబడుతుందేమోననిపిస్తోంది.” ఈమాట చెప్పి ఆయన అన్నం కూడా తినకుండా రోదించటం మొదలుపెట్టారు. (బుఖారీ)

దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: “దేవునికి రెండు బొట్లు, రెండు మచ్చల కన్నా ఎక్కువ ప్రియమైన వస్తువు మరేదీ లేదు. ఒకటి, దైవభీతి మూలంగా రాలిన కన్నీటి బొట్టు, రెండు, దైవమార్గంలో (పోరాడినప్పుడు) చిందే రక్తపుబొట్టు. పోతే రెండు మచ్చల్లో ఒకటి, దైవమార్గంలో పోరాడినప్పుడు (కలిగిన గాయం వల్ల) ఏర్పడిన మచ్చ. రెండు, ఏదయినా దైవవిధిని నిర్వర్తించినప్పుడు కలిగిన మచ్చ. (తిర్మిజీ)

దైవప్రవక్త (స) ప్రవచనం: “మీరు మీకన్నా తక్కువస్థితిలో ఉన్నవారివైపు చూడండి. మీకన్నా ఉచ్ఛస్థితిలో ఉన్నవారివైపు చూడకండి. దేవుడు మీకు ప్రసాదించిన అనుగ్రహాల

పట్ల మీరు కృతజ్ఞతాభావంతో ఉండటానికి ఇదెంతో మంచిపద్ధతి. (బుఖారీ, ముస్లిం)

హజ్రత్ ఇబ్నెఉమర్ (రజి) కథనం: దైవప్రవక్త (స) నా భుజాలు పట్టుకొని, "ప్రపంచంలో ఓ అపరిచిత వ్యక్తిలా, బాటసారిలా జీవితం గడుపు" అన్నారు.

హజ్రత్ ఇబ్నెఉమర్ (రజి) ఇలా అనేవారు: "మీరు సాయంత్రం పూట (ఏదైనా మంచిపని చేయదలచుకుంటే) ఉదయం కోసం ఎదురుచూడకండి. ఉదయమైతే సాయంత్రం కోసం ఎదురుచూడకండి. ఆరోగ్యంగా ఉన్నప్పుడు అనారోగ్యావస్థ కోసం, జీవించి ఉన్నప్పుడు చావుకోసం ఏమైనా (మంచిపనులు) చేసుకోండి." (బుఖారీ)

హజ్రత్ అబుల్అబ్బాస్ సహ్లా బిన్ సాద్ సాయిదీ (రజి) కథనం: ఒక వ్యక్తి దైవప్రవక్త (స) దగ్గరికొచ్చి "దైవప్రవక్తా! దేవుడు, ప్రజలు నన్ను అభిమానించాలంటే ఏం చెయ్యాలో చెప్పండి" అని అడిగాడు. "లోకం పట్ల అనాసక్తత చూపు. దేవుడు నిన్ను ప్రేమిస్తాడు. ఆ తర్వాత ప్రజల దగ్గర ఉన్నవాటి పట్ల అనాసక్తత కనబరచు. అప్పుడు ప్రజలు నిన్ను అభిమానిస్తారు" అని సమాధానమిచ్చారు దైవప్రవక్త (స). (ఇబ్నెమాజా)

హజ్రత్ అబూహురైరా (రజి) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఈవిధంగా ప్రవచించారు: "మనిషి చనిపోయిన తరువాత మూడు విధాల కర్మలు తప్ప మిగిలిన కర్మలన్నీ అంతమయిపోతాయి. ఆ మూడు కర్మలు ఇవి- 1-నిరంతర దానం (సదఖాయెజారియా), 2-ఎల్లప్పుడూ ప్రయోజనం చేకూర్చే విద్య, 3-మృతుని కోసం దైవాన్ని ప్రార్థించే మంచి సంతానం." (ముస్లిం)

ఒకసారి దైవప్రవక్త (స) చాపపై పడుకొని లేచారు. అప్పుడాయన ఒంటిపై చాప తాలూకు చారలు ఏర్పడ్డాయి. అది చూసి మేము "దైవప్రవక్తా! మీరు అనుమతిస్తే మేము మీకోసం ఓ పరుపు తయారుచేసిస్తాం" అని అన్నాం. దానికాయన "అలాంటివి ఎందుకు నాకు? నా ప్రాపంచిక జీవితం ఓ చెట్టు క్రింద కాసేపు సేదతీర్చుకొని తిరిగి చెట్టు వదలి వెళ్ళిపోయే బాటసారి లాంటిది" అని అన్నారు. (తిర్మిజీ)

హజ్రత్ ముఆజ్ (రజి) కథనం: నేనొకసారి "దైవప్రవక్తా! నన్ను నరకానికి దూరంగా స్వర్గానికి గొనిపోయే కర్మ గురించి బోధించండి" అన్నాను. అప్పుడాయన ఇలా చెప్పారు: "నీవు చాలా పెద్ద విషయమే అడిగావు. అయితే దేవుడు ఎవరి కోసం దాన్ని సులభంగా చేస్తాడో (అంటే దానిని ఆచరించే శక్తి, సద్బుద్ధి ప్రసాదిస్తాడో) అతనికిది ఎంతో సులభం. నువ్వు అల్లాహ్‌ను ఆరాధించు. ఆయనకు ఎవరినీ సాటికల్పించకు. నమాజ్ స్థాపించు. జకాత్ చెల్లించు. రమజాన్ ఉపవాసాలు పాటించు. హజ్‌యాత్ర చేయి."

ఆ తరువాత దైవప్రవక్త (స) ఇలా అన్నారు: "నేను నీకు మేలు ద్వారాల్ని గురించి తెలుపనా?' ఉపవాసం డాలు వంటిది. నీళ్లు మంటను ఆర్పినట్లు దానం పాపాన్ని ఆర్పేస్తుంది (దాని ప్రభావాన్ని తొలగిస్తుంది). మనిషి రాత్రి చివరిభాగంలో నమాజ్ చేయడం." ఆ తర్వాత ఆయన ఈ ఖుర్‌ఆన్ సూక్తులు 'వారి వీపులు పడకలకు ఎడంగా ఉంటాయి..... యామలూన్' వరకు (సజ్దా: 16-17) పఠించారు. ఆ తరువాత ఆయన "నీకు ధర్మంశిరస్సు, దాని స్తంభం, దాని మూపురం ఎత్తు గురించి తెలుపనా?"



అని అడిగారు. "తప్పక తెలుపండి దైవప్రవక్తా!" అన్నాను నేను. అప్పుడాయన "ధర్మం శిరస్సు ఇస్లాం, దాని స్తభం నమాజ్, దాని మూపురపు ఎత్తు జిహాద్" అని చెప్పారు. ఆ తరువాత ఆయన "ఇవన్నీ దేని మీద ఆధారపడి ఉన్నాయో దాన్ని గురించి నీకు తెలియజేయనా?" అని అడిగారు. "తప్పక తెలియజేయండి దైవప్రవక్తా!" అన్నాను నేను. అప్పుడాయన తన నాలుక పట్టుకొని "దీన్ని అదుపులో పెట్టుకో" అన్నారు. దానికి నేను "దైవప్రవక్తా! మనం నోటితో మాట్లాడేదాని గురించి కూడా నిలదీయ బడతామా?" అని అడిగాను. అందుకాయన "నీవు నీ తల్లికి దుర్లభం అవుగాక! (ఇదొక అరబీజాతీయం, తిట్టుకాదు.) నరకవాసులను వారి నాలుకలు కోత కోసిన పొలాల మాదిరిగా నరకంలో బోర్లాపడవేస్తాయి" అని అన్నారు. (తిర్మిజీ)

దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "ధర్మసమ్మతమైన విషయాలు స్పష్టంగా ఉన్నాయి. నిషిద్ధ విషయాలు కూడా స్పష్టంగా ఉన్నాయి. ఈ రెండిటి మధ్య కొన్ని అస్పష్టమైన విషయాలు ఉన్నాయి. ప్రజల్లో అత్యధిక మందికి వీటిని గురించి తెలియదు. ఈ అస్పష్ట విషయాలకు దూరంగా మసలుకునేవాడు తన ధర్మాన్ని, మాన మర్యాదలను కాపాడుకునే వాడవుతాడు. వాటి వెనుక పడేవాడు మాత్రం అధర్మంలో ఇరుక్కుపోతాడు. కావలివాడు పొలానికి దగ్గరలో పశువులకు కాపలాగా ఉంటాడు. పశువులు పొలం ఆవల మేతమేస్తూనే ఎప్పుడో ఒకప్పుడు హఠాత్తుగా గట్టు దాటి పొలం లోకి వచ్చిపడతాయి. జాగ్రత్త! ప్రతిరాజుకూ సరిహద్దులు ఉంటాయి. దేవుని సరిహద్దులు అధర్మవిషయాలే. జాగ్రత్త! మన శరీరంలో ఓ మాంసపు ముద్ద ఉంది. అది గనక బాగుంటే శరీరమంతా బాగుంటుంది. అది చెడిపోతే శరీరమంతా చెడిపోతుంది. ఆ మాంసపుముద్దే హృదయం!" (బుఖారి, ముస్లిం)

దైవప్రవక్త (స) హితోక్తి: "నా ప్రభువు నన్ను తొమ్మిది విషయాలను గురించి ఆదే శించాడు. 1-రహస్యంగానైనా, బహిరంగంగానైనా ఎట్టి పరిస్థితిలోనూ దేవునికి భయ పడాలి. 2-కోపంగాఉన్నా, సంతోషంగాఉన్నా సత్యమే మాట్లాడాలి. 3-పేదరికంలోనూ, ఐశ్వర్యంలోనూ మధ్యేమార్గం అవలంబించాలి. 4-నాపట్ల నిర్దాక్షిణ్యంగా ప్రవర్తించినవాని పట్ల నేను దయాదాక్షిణ్యాలతో ప్రవర్తించాలి. 5-నాకివ్వకుండా అడ్డుకున్నవానికి నేను ఇవ్వాలి. 6-నాపై దౌర్జన్యం చేసినవాడ్ని నేను క్షమించాలి. 7-నా మౌనం చింతనై, నా పలుకులు దైవధ్యానమై ఉండాలి. 8-నా దృష్టి గుణపాఠం గ్రహించేదిగా ఉండాలి. 9-నేను మంచిని గురించి ప్రజలను ఆదేశించాలి." (అబూహురైరా-తిర్మిజి)

హజ్రత్ అబూఖిలాబా (రజి) కథనం: ఓసారి కొందరు ప్రవక్త అనుచరులు దైవ ప్రవక్త (సల్లం) ముందు తమ మిత్రుడొకడ్ని పొగుడుతూ "మాయీ మిత్రుడు లాంటి మంచివాడ్ని మేమింతవరకూ ఎక్కడా చూడలేదు. ప్రయాణంలో కూడా అతను ఖుర్‌ఆన్ పఠిస్తుంటాడు. మేము ఎక్కడైనా బస చేసినప్పుడు అతను నమాజ్‌లో లీనమైపోతాడు" అని అన్నారు. దైవప్రవక్త (స) వారి మాటలు విని "సరే, అతని సామగ్రికి ఎవరు కాపలా ఉంటారు?" అంటూ అనేక విషయాలు అడిగారు. చివరికి "అతని ఒంటెకు ఎవరు మేత పెడతారు?" అని కూడా అడిగారు. వాటికి మేము "మేమే అతని సామగ్రికి

కాపలా ఉంటాము. మేమే అతని ఒంటెకు నీరు, మేత పెడుతుంటాము" అని చెప్పాం. అప్పుడు దైవప్రవక్త (స) "అయితే ఖుర్‌ఆన్ పారాయణం చేసే, ఆరాధనలో లీనమై పోయే ఆ మనిషి కంటే మీరే శ్రేష్ఠులు" అని అన్నారు. (అబూదావూద్)

## జాతీయ ఉపద్రవాలు

"ఏజాతి అయినా తనను తాను సంస్కరించుకోనంత వరకూ దేవుడు దాని పరిస్థితి మార్చడు. అలాగే ఏదైనా జాతికి దేవుడు కీడు చేయదలచుకుంటే ఇక దానికి తిరుగేఉండదు. దైవనిర్ణయానికి వ్యతిరేకంగా అలాంటి జాతిని ఏశక్తీ ఆదుకోజాలదు." (ఖుర్‌ఆన్-13:11)

దైవప్రవక్త (స) హితోక్తి: "వ్యభిచారం సర్వసామాన్యమైన ఏజాతీ కరువుకాటకాలకు గురవకుండా ఉండదు. అలాగే లంచం (తామరతంపరలా) విస్తరించిపోయిన ఏజాతీ భయాందోళనలకు గురవకుండా ఉండదు." (అమ్రబిన్‌ఆస్-ముస్నద్‌అహ్మద్)

దైవప్రవక్త (స) హితోక్తి: "మీ నాయకులు చెడ్డవాళ్ళయి, మీ ధనికులు పిసినారు లయి, మీ (ప్రాపంచిక) వ్యవహారాలు స్త్రీల చేతుల్లోకి పోయిఉన్నప్పుడు మీకు భూమి వీపు (జీవితం) కంటే భూమి కడుపు (మృత్యువు) మంచిది." (తిర్మిజి)

హజ్రత్ అబూబక్రా (రజి) ఉల్లేఖనం: ఈరాన్ ప్రజలు కిస్రా (చక్రవర్తి తదనంతరం అతని) కుమార్తెను తమ చక్రవర్తిగా చేసుకున్నారని తెలిసి దైవప్రవక్త (స) ఇలా అన్నారు: "ఏ జాతి తన (రాజకీయ) వ్యవహారాలను స్త్రీ చేతికి అప్పగిస్తుందో ఆ జాతి ఎన్నటికీ బాగుపడదు." (తిర్మిజి)

హజ్రత్ అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి) ప్రకారం దైవప్రవక్త (స) హితోక్తి: "నమ్మక ద్రోహం సర్వసామాన్యమైన జాతిలో దేవుడు శత్రుభయం, బీభత్సాలను వ్యాపింపజేస్తాడు. వ్యభిచారం అంటువ్యాధిలా వ్యాపించిన సమాజం సర్వనాశనం కాకతప్పదు. తూనికలు కొలతల మోసం సర్వవ్యాప్తమైపోయిన సమాజం ఆహారశుభాన్ని కోల్పోతుంది. అన్యాయ మైన తీర్పులు, నిర్ణయాలు జరిగే చోట రక్తపాతం జరిగితీరుతుంది. ఒప్పందం ఉల్లం ఘించిన జాతిని శత్రువు తప్పకుండా జయిస్తాడు." (మిష్కాత్)

(-సమాప్తం-)


### ఇస్లాం పాఠ్యప్రణాలిక

తేనెలొలికే 'తేటతెలుగు'లో ఇస్లాం సంపూర్ణ స్వరూపం చూడదలచినవారికి ఇస్లామీయ సాహిత్యాన్ని సమగ్రమైన సిలబస్‌గా అందజేస్తున్న ఏకైక సంస్థ "ఇస్లామిక్ రిసోర్స్ సెంటర్" (లక్కడ్‌కోట్, ఛత్తాబజార్, హైదరాబాద్-2) మాత్రమే. ఈ సిలబస్ ప్రకారం ప్రచురించవలసిన 12 పుస్తకాలలో 10 పుస్తకాలు ప్రచురితమయి మార్కెట్ లోకి వచ్చాయి. మిగిలిన 2 పుస్తకాలు కూడా దైవచిత్తమయితే త్వరలోనే వెలు వడతాయి. ఆసక్తి కలవారు ఫోన్ ద్వారా సంప్రదించి వివరాలు తెలుసుకోవచ్చు. ఫోన్: 040-66710795, +91-9441515414.


## మా ప్రచురణలు




**1. ఖుర్‌ఆన్ భావామృతం**..........(పే: 912, వెల: రూ.300/-)
(ప్రతి సూరాకు, సూక్తులకు పూర్వపరాలు, హదీసు-సైన్సుతో కూడిన వ్యాఖ్యానం, 36 పేజీల ప్రత్యేకసమాచారం, 20 పేజీల టాపికల్‌ఇండెక్స్)



**2. ముహమ్మద్(స) ఆదర్శజీవితం**...(పే: 528, వెల: రూ.240/-)
అడుగడుగునా ఆసక్తి రేకెత్తించే, కళ్ళను చెమర్చే, కనువిప్పు కలిగించే రాతిగుండెల్ని కరిగించే ఘట్టాలతో కూడిన ధారావాహిక నవలా స్రవంతి)




**3. పరలోక ప్రస్థానం**................(పే: 240, వెల: రూ.120/-)
**ఆత్మకు చావు ఉందో లేదో, దాని ప్రయాణ మజిలీలు ఏమిటో** తెలుసుకో వాలంటే ఈపుస్తకం చదవండి. ఇందులో మరణావస్థ, ప్రళయం, పితృలోకం, కర్మవిచారణ, స్వర్గనరకాలు, దైవదర్శనం వగైరా విశేషాలున్నాయి.





**4. ముస్లిం మహిళ**...................(పే: 256, వెల: రూ.120/-)
**కొడ్తే ఏడుస్తుంది! కొట్టకపోతే ఎగబడ్తుంది!!** మరేం చేయాలి? దీని పరి ష్కారానికి ఈపుస్తకం చదవండి. ఇందులో వివాహం, భార్యాభర్తల బాధ్యతలు, పరదా, విడాకులు, ఆర్థికహక్కులు, స్త్రీల ఆంతరంగిక విషయాలు వగైరా.




**5. ధన వికేంద్రీకరణ**.................(పే: 240, వెల: రూ.110/-)
**డబ్బంటే ఎవరికి చేదండీ?** కాని అక్రమంగా సంపాదిస్తూ విచ్చలవిడిగా ఖర్చుచేసేవారి పర్యవసానం? ఈ పుస్తకంలో ధనవ్యామోహం, గ్లోబలైజేషన్, వడ్డీ, దళారీవ్యవస్థ, షేర్‌మార్కెట్, జకాత్, ఆస్తిపంపిణీ వగైరా ఉన్నాయి.





**6. రమజాన్ ఆశయాలు**.............(పే: 224, వెల: రూ.100/-)
ఖుర్‌ఆన్ ఔన్నత్యం, ఐకమత్యం, నమాజ్, ఉజూ, గుసుల్, దుఆలు, దైవభీతి, రోజాలు, దానాలు, తరావీనమాజ్, లైలతుల్‌ఖద్ర్, ఫిత్రా వగైరా.





**7. కాబా సందేశం**..................(పే: 224, వెల: రూ.100/-)
ఏక దైవారాధన, అంధానుకరణ, ఇబ్రాహీం (అలై) మిషన్, త్యాగం, బలి దానం, జమ్‌జమ్ పుట్టుపూర్వోత్తరాలు, ధర్మప్రచారం, హజ్ సన్నాహాలు, శుభసమాధి దర్శనం, హజ్-ఉమ్రా విశేషాలు, హజ్ అనుభవాలు వగైరా.




**8. శాంతి-సమరం-న్యాయం**...(పే: 224, వెల: రూ.100/-)
ఇస్లాం అంటేనే శాంతి. నిజమైనశాంతి కోసం ఇస్లామీయ జీవితానుసరణే శరణ్యం. శాంతి+సమరం+న్యాయం=ఇస్లాం. శాంతీ-న్యాయాలకై పోరాడే ఇస్లాంను ఖడ్గం ద్వారా విస్తరించిందనే మాట పచ్చి దుష్ప్రచారం మాత్రమే.




**9. ఫుర్ఖాన్ భావామృతం**...(పే: 560, వెల: రూ.240/-)
ఖుర్‌ఆన్‌లో ఏ విషయం ఏఏ సూక్తుల్లో, ఏఏ సూరాలలో ఉందో వాటన్ని టిని పండువలచి చేతిలోపెట్టినట్లు సేకరించి రాయబడిన ఏకైకగ్రంథం.




**10. హదీస్ హితోక్తులు**.....(పే: 624, వెల: రూ.240/-)
ఇస్లాంలో రెండవ అత్యధిక ప్రాముఖ్యమున్న హదీస్ గ్రంథాల నుంచి దైనందిన జీవితానికి అవసరమైన హదీసుల్ని ఎంపికచేసి కూర్చబడిన గ్రంథం.

**ఇస్లామిక్ రిసోర్స్ సెంటర్, ఛత్తాబజార్, హైదరాబాద్-2, ఫోన్: 66710795**